# వాల్మీకి
# రామాయణము



- శ్రీ మైలవరపు శ్రీనివాసరావు


ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆరోగ్యాది అనేక విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్

Like us to follow

@mohanpublications



ఆధ్యాత్మిక గ్రంథ నిలయం

మోహన్ పబ్లికేషన్స్

కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,

రాజమహేంద్రవరం - 533101.



# శ్రీమద్

## వాల్మీకి రామాయణాయనమ్

# బాల కాండము

(వ్యావహారిక భాషలో కథ మఱియు అంతరార్థం)

: రచన :

'రామాయణ ప్రవచన సుధాకర'

'రామాయణ సుధానిధి'

'భాషా ప్రవీణ'

**డాక్టర్. మైలవరపు శ్రీనివాసరావు**

ఎం.ఏ., (తెలుగు) ఎం.ఏ., (సంస్కృతము) పిహెచ్.డి.,

'ముద్రింపించిన ఉదారులు'

**శ్రీయుతులు కాళ్లకూరి రామామణీదేవి ఫణిపద్మనాభము దంపతులు**

ప్లాట్ నం. 4౨౬. మణి నికేతన్, డిఫెన్స్ కాలనీ,

సైనిక్‌పురి, సికింద్రాబాద్ - 500 5౨4.

12-10-95



మైలవరపు శ్రీనివాసరావు

# బాల కాండ

# విషయసూచిక

క్రమ సంఖ్య | విషయము


1. ముందువెనుకలు
2. అభివాదనలూ - అభినందనలూ
3. ముద్రింపించిన వారి ఫొటో
4. గ్రంథకర్త్రు దంపతుల ఫొటో


## బాలకాండము


5. కథా ప్రారంభానికి ముందు కొంత పరిచయం
   వీరీవీరీ గుమ్మడిపండూ! వీని పేరేమి ?
   మహర్షుల శాపం, వరమే !
   వాల్మీకి బోయవాడా ?
   ఇంతకీ 'వాల్మీకి' అనే పేరు ఎలా వచ్చింది ?
   రామమంత్రం విలువ
   'శ్రీ' అంటే......
   గురూపదేశం కావాలి !
   రామాయణ రచనానికై శ్రీమహావిష్ణువు చేసిన ఏర్పాట్లు
6. బాలకాండ కథా ప్రారంభము
   వాల్మీకి ప్రశ్న - నారద సమాధానమూ
   నారదుని వెనుకంజ
   మహర్షిశాపం - కవిత్వావిర్భావం
   విచిత్రమైన వేటగాడు
   కవిత్వం ఎలా రావాలి ?
   'మానిషాద' శ్లోకానికి 5 అర్థాలు
   ఏమని పెరు పెట్టాలి ?
   రామాయణమ్ ! ఎన్ని అర్థాలు ఈ పదానికి ?

వాల్మీకి ఆత్మపరీక్షలు 20
విలువైన బహుమతి 21
అయోధ్య ఎలా ఉంది ? 24
సంతానం కోసం 'అశ్వమేధం' చేస్తాను 25
అశ్వమేధం వల్ల సంతానం కల్గుతుందా ? 26
దశరథుని చెవిలో, సుమంత్రుని రహస్యం 28
సుమంత్రుడు, ముందే ఎందుకు చెప్పలేదు ? 29
దశరథుని అశ్వమేధం 30
దశరథుని అశ్వమేధంలోని ఇతర రహస్యాలు 32
దేవలోక నిర్ణయాలు 33
దేవతలే వానరాలు 35
వానర రూపమే ఎందుకు ? 36
పాయసప్రదానం
అమృతాన్నిచ్చే దేవతలు పాయసం ఎందుకిచ్చారు? 37
పాయసవిభజన లోని రహస్యం 38
దశరథుడు లేక, పిల్లలా? 39
విష్ణువు చేసిన ఏర్పాట్లు 40
రావణుని ఏర్పాట్లు
నలుగురికీ సరిపోయిన పేర్లు 41
పుట్టిన నక్షత్రం బట్టి వ్యక్తి ప్రవర్తన 43
'18' అంకెలోని విశేషం 44
'రాముడు - కృష్ణుడు' - ఇద్దరిలో భేదం 45
వివాహానికి తగిన వయస్సు 46
వివాహ సమావేశం - పై కథ 47
లోకథ 48
దశరథుడు అడుగని రెండు ప్రశ్నలు 51
దశరథుని న్యాయబద్ధవాదం / విశ్వామిత్రుని లోకానుగ్రహవాదం 52

'నేను' అంటే ఎంత అర్థం ! 53
తల్లి దీవెన 55
బల-అతిబల అంటే ఏమిటి? 57
కౌసల్యా సుప్రజారామ ! 58
అంగదేశపు కథ (పై కథ) 60
లోకథ 61
మలద - కరూశ దేశాలకథ - లోకథ 62
తాటకాకథ - పై కథ 63
లోకథ
చిన్నవాణ్ణి ముందు శిక్షించాలి 64
రూపం బట్టి దోషం 65
'ఆతతాయి' అంటే.... 68
సిద్ధాశ్రమ వృత్తాంతం 69
'మేం' - నాన్న కూతుళ్లం ! 71
ఇదీ - నాకథ 72
ఈ కథవల్ల తెలిసిందేమిటి? 73
ఇద్దఱు తల్లుల ముద్దుల బిడ్డడు
కుమారస్వామికి ఇన్నిపేర్లా ? (లోకథ) 74
ఇంకా - లో - అర్థం 76
ఈయనే 'అయ్యప్ప' 78
మఱి ఇంకో విశేషం 78
భగీరథ ప్రయత్నం 80
ఈ కథవల్ల ఏం తెలిసింది ? 81
క్షీరసాగర మథనం 84
అహల్యా పతివ్రతకథ (పైకథ) 88
లోకథ 89
రామా! విశ్వామిత్రుణ్ణి గూర్చివిను ! 96

ఈ గోవుని ఇవ్వనే ఇవ్వను 96
ఈకథ వల్ల తెలిసిందేమిటి ? 98
గోమాహాత్మ్యం 99
నన్ను కొనుక్కో 101
గోబ్రాహ్మణేభ్య శ్శుభమస్తు నిత్యమ్ ! 102
గురుశాపం చాల తీవ్రమైనది 104
ఈ కథవల్ల తెలిసిందేమిటి ? 105
పెద్దా - చిన్నా కాని 'మధ్య పుత్రుడు' ఎవరికీ కానివాడు ? 106
విశేషం ఏమిటి ?
కూలిన తపస్సు 107
ఎందుకు శపించలేదు ?
మహర్షి వయ్యావు ! 108
శిలాశాపం తెలిపిందేమిటి ? 109
వియ్యానికి ముందు కయ్యం వస్తోంది 110
ధనుస్సు విఱవడంలోని రహస్యం 111
వివాహపు ఏర్పాట్లు 112
5 రోజుల పెళ్లి 113
వంశకథనం 114
ఈ శ్లోకానికి 6 అర్థాలు 116
ఈ వివాహం గూర్చి కొన్ని విశేషాలు 120
యుధాజిత్తు మంచితనం
పరశురామ వృత్తాంతం 121
దీనిలోని విశేషాలేమిటి ? 123
అయోధ్యకి నిండుదనం 124
రామాయణంలోని గాయత్రీ బీజాక్షరశ్లోకాలు 125
గ్రంథకర్త గుఱించి......... 127

ఓం

శ్రీ శివాయనమః

# శ్రీమద్ వాల్మీకి రామాయణాయనమ్

## బాలకాండము

### కథ ప్రారంభానికి ముందు కొంత పరిచయం

**రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే।**
**రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః॥**

అది అయోధ్యా నగరం. అక్కడ ఒకే శ్రీరాముణ్ణి, ఒక్కొక్కరు ఒక్కొక్క పేరుతో పిలుస్తూ ఆరాధిస్తున్నారు. **'రామా!'** అనే పిలుపు వినిపిస్తే - అది వయస్సుచేత పెద్దలైన దశరథ - కౌసల్య - సుమిత్ర - కైకమ్మలదే.

'లోకానికి క్షేమం కల్గించేవాడు' అనే అర్థంలో (*శుభమంగళయో ర్భద్రం స్యా ద్ద్రవ్యశ్రేష్ఠయో స్త్రిమ - భద్రశ్చాసౌ రామశ్చ*) **'రామభద్రా!'** అంటే, ఆ కంఠస్వరం దశరథ మంత్రులయిన ధృష్టి - జయంత - విజయ - సిద్ధార్థ - అశోక - అర్థపాల - అర్థసాధక మంత్రపాల - సుమంత్రులు 8మందిదీ అయి తీరాల్సిందే.

16 కళలతో వెలిగే చంద్రునిలా ఆకర్షణీయుడై, 16 ఉత్తమ గుణాలతో (ముందు చెప్పబడుతున్నాయి) ఉన్న రాముణ్ణి, **రామ 'చంద్రా'!** అని పిలుచుకొనే అదృష్టం అయోధ్యా ప్రజలదే.

రాముని నిజమైన దేవలోకపు రూపాన్ని ఎఱుగున్న మహర్షులు, వశిష్ఠ - వామదేవ - జాబాలి - కశ్యప -సుయజ్ఞులు, **హేవేధః!** (పరబ్రహ్మ స్వరూపా!) అని సంబోధిస్తారు.

పూర్వం నుండీ వీరి వంశ ప్రతిష్ఠని ఎఱుగున్న వృద్ధులంతా, రాముడే రఘువంశాన్ని ఉద్ధరించగలడని **'రఘునాథా!'** అని అతణ్ణి ఆశీర్వదిస్తారు.

ఎందఱో, ఎన్నోపేర్లతో రాముణ్ణి ఆరాధించవలసి వస్తే, ఒకే పేరుతో, ఒక్కణ్ణే, ఒకతె మాత్రమే సేవించుకోగలదు. ఆ తల్లి 'సీతమ్మ'. ఆపేరు **'నాథా!'** అని.

ఇంతటి గొప్పవాడైన రాముడు కూడా, మామగారైన జనకునింటికి వెడితే, ఆయన్ని **'సీతాపతీ!'** (సీతమ్మమొగుడు) అంటారట.

ఇలాటి రామునికి నమస్కారమని శ్లోకభావం.

**అలాటి రాముణ్ణి, నిరంతరమూ ధ్యానించేవాడు వాల్మీకి మహర్షి.**

**కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్।**
**ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలమ్॥**

'కవిత్వం' అనే చెట్టుకొమ్మని ఎక్కి 'రామ రామా!' అనే అక్షరాలని మధురమధురంగా పల్కుతూండే 'వాల్మీకి' అనే కోకిలకి నమస్కారం – అని శ్లోకభావం. వాల్మీకిని కోకిలతో ఈ శ్లోకం పోల్చింది. *(కోకతి శ్రోతృచిత్తం లాతీతి కోకిలః (వినేవారి చెవులనాకర్షించేది).*

చిగిర్చిన చెట్లూ, మొగ్గ తొడిగిన కొమ్మలూ, కాయలు కాసే పూలూతో నిండి రమణీయంగా ఉండే వసంత కాలంలో, పచ్చని ఆకుల మధ్య తన సొంత యింటిలో తానుండి సంతోషంతో కూస్తుంది కోయిల. అలాగే వాల్మీకి మహర్షి కూడ, మనసు నిండుగా రాముణ్ణి ఉంచుకొని, రామ మయమైన శరీరంతో, వేఱు చింత లేక రామాయణ గానం చేస్తాడు. కోయిల, ఒకే అక్షరం కూయగలిగితే – వాల్మీకి అనేకాక్షరాలని గానం చేస్తాడు.

కోకిలకి ఒకే ధ్వని వచ్చినట్లు, వాల్మీకికీ 'రామరామా' అనే ధ్వనే వచ్చు. వేసవిలో కూడ కోకిలకూత ఆనందాన్నిస్తుంది. అలాగే వాల్మీకి రామకథ, సాంసారిక బాధలలో మగ్గిపోయే వారికీ ఆనందాన్నిస్తుంది.

కూ,కూ, అని నిరంతరం కూస్తూ ఉన్నా, దానికి విసుగురానట్లు, రామనామం ఎంతసేపు జపించినా దుఃఖం, అలసటా, ఉండవు. పైగా, ఒక 'శక్తి', శరీరాని కొస్తుంది.

అనేక జంతువులూ, పక్షులూ తిండికోసం అఱచినట్లు కాక, నిస్స్వార్థంగా కోకిల కూసినట్లు, వాల్మీకికి కూడా శ్రీమద్రామాయణాన్ని వ్రాయడంలో స్వార్థ చింత లేదు.

గ్రుడ్డుగా ఉన్నప్పుడు, కోకిల కూడా, కాకి గూట్లోనే పెరుగుతుంది. గ్రుడ్డుపగిలాకా, వసంతకాలం వచ్చి గొంతు విప్పాకా, కాకీ – కోకిలా – వేఱైనట్లు, వాల్మీకి కూడా – కిరాతునిగానే (కాకి) చాలకాలం జీవించి, వసంతం రాగానే (మహావిష్ణువు అనుగ్రహంతో) శ్రీమద్రామాయణ కర్త అయ్యాడు.

**అయితే, కోకిల వసంతకాలంలోనే గానం చేసే లక్షణం కలదైతే, వాల్మీకికి అన్ని కాలాలూ వసంతకాలాలే. ఈవిషయంలో కోకిలని మించాడు వాల్మీకి.**

ఆ మహర్షి వ్రాసిన శ్రీమద్రామాయణాన్ని గూర్చి, తెలిసికోవడంలో(అయనమ్) నాబుద్ధికి తోచినంత అందీయడానికి చేసే ప్రయత్నమే 'శ్రీమద్రామాయణాయనమ్' అనే, ఈ గ్రంథం.

## వీరీ వీరీ గుమ్మడి పండూ! వీని పేరేమి?

శ్రీమద్రామాయణాన్ని వ్రాసింది ఎవరు? అని అడిగితే 'చక్రే ప్రచేతసః పుత్రః తం బ్రహ్మాప్యన్వమన్యత - వేదః ప్రాచేతసా దాసీత్' అనడం బట్టి ప్రచేతసుని పుత్రుడు ప్రాచేతసుడనే ఆయన వ్రాసాడు - అని తెలుస్తుంది.

శ్రీ మద్రామాయణాన్నే అడిగితే 'భార్గవేణ మహాత్మనా - భార్గవేణ తపస్వినా' అనడం బట్టి భార్గవుడు అనే పేరుగల తపోధనుడు వ్రాసాడని తెలుస్తుంది.

ఇదే ప్రశ్నని విష్ణు పురాణం వ్రాసిన వ్యాసుణ్ణి అడిగితే 'ఋక్షో౽ భూ ద్భార్గవ స్తస్మాద్వాల్మీకి ర్యో౽ భిధీయతే' అనడం బట్టి ఋక్షుడు అనే ఆయన వ్రాసాడు అని తెలుస్తుంది.

అసలు వాల్మీకినే నీ పేరేమిటని అడిగితే 'ప్రచేతసో౽ హం దశమః పుత్రో రాఘవనందన!' అనడం బట్టి ఆయన పేరు ప్రాచేతసుడు అని చెప్పాడు.

ఏ ఒక్క సాక్ష్యమూ సరిగాలేదు సరికదా - శ్రీమద్రామాయణాన్ని ఎందఱు వ్రాసారు? అనే అనుమానం కూడ కలుగుతుంది. ప్రాచీనుల విధానం ఇదే. లోభావాన్ని పరిశీలిస్తే తప్ప అర్థంకాని విధంగా వారు వ్రాస్తారు. ఒక పురాణంలోని చిక్కుముడి, వేఱొక పురాణం ద్వారా విడుతుంది. ఈ రహస్యం తెలియని అప్రాచ్యులు (ఆంగేయులు) భారతీయ గ్రంథాలని చాల వాటిని తగుల బెట్టారు. అంతటితో మనకి ఇక పురాణాలే లేవు అనుకొన్నారు.

కాని జీవించి ఉన్న గ్రంథాల ద్వారా, పోయిన వాటిని భారతీయులు పునరుద్ధరించుకోగలరు - అని వారికి తెలియదు. లోతుగా చూడని వాళ్లూ, ఇతరుల మాటలనే నమ్మే వాళ్లూ, మన పురాణాలని 'అబద్ధాలు' అని తడుముకోకుండా అనేసారు. **అసలు 'పురాణాలు అబద్ధాలు అనేవాళ్లు' పుడతారని పురాణాలలోనే ఉండడం బట్టి పురాణాలు నిజం.**

ఇంతకీ మహర్షి పేరులోని చిక్కుముడి, స్కాంద పురాణంలోని ఉమాసంహితలో రామాయణ మాహాత్మ్యంలో బ్రహ్మ స్వయంగా, వాల్మీకికి చెప్పిన దాన్ని బట్టివిడిపోతుంది.

వరుణుడు అనే మహర్షికి పుత్రుడు హరితుడు. నెమిలితో ఆడుకోవడం అతనికి చాల ఇష్టం. ఒకసారి సనత్కుమారుల వారిని శాస్త్ర చర్చకై వరుణుడు తన యింటికి పిలిచాడు. శాస్త్ర చర్చ సాగుతూంటే, హరితుడు పెంపుడు నెమిలితో అల్లరి ప్రారంభించాడు. తండ్రి ఒకసారీ, ఆమీదట సనత్కుమారులవారు ఒకసారీ "అలా నెమిలితో ఆడుతూ చర్చకి అభ్యంతరం కల్గించవద్దు" అని హరితుణ్ణి మందలించారు. అయినా హరితుడు బాల్యకారణంగా అల్లరి చేస్తూనే ఉన్నాడు.

రెండుమార్లు వారించినా ప్రయోజనం లేకపోవడంతో " కిరాతధర్మం తో ప్రవర్తిస్తున్నావు కాబట్టి, భృగువంశంలో ప్రచేతునియింట కిరాతధర్మంతో పుట్టు" అని సనత్కుమారులవారు శపించారు.

'కిరాతునిగా పుట్టు' అని మాత్రమే శపించకుండా 'ఫలాని వంశంలో ఫలాని వానిపుత్రునిగా పుట్టు' అనడంవలన, ఈ హరితునికి ముందు కాలంలో శ్రీమద్రామాయణ కర్తకాబోయే అదృష్టాన్ని సనత్కుమారులవారు కల్గిస్తున్నారని భావించాలి.

## మహర్షుల శాపం ,వరమే!

ప్రపంచాన్నే ఒక కలగా భావించే మహర్షులకి కోపమా!- వచ్చినా, ధర్మబద్ధంగా ఉంటుంది. శాపం ఇచ్చినా, అది రాబోయే కాలంలో శ్రీమహావిష్ణువు చేయబోయే పనికి అనుకూలమే అవుతుంది.

100 కోటి శ్లోకాలతో, దేవలోకంలో, బ్రహ్మవిద్య అంతా చెప్పబడింది. దాన్ని భూలోకంలో ప్రచారం చేయాలని పరమాత్మ సంకల్పం. అన్ని శ్లోకాలతో, అంతటి బ్రహ్మవిద్యని అల్పబుద్ధిమంతులయిన భూలోక ప్రజలు తెలిసికోలేరని ఆలోచించి, ఋక్షుని (ఇప్పటి వాల్మీకి) ద్వారా, రామకథని ప్రచారం చేయాలని సంకల్పించాడు పరమాత్మ.

'బ్రహ్మ' అనే అక్షరాలలోని క్రింది వత్తులు 'రామ' అవుతాయి. ఈ రెండూ, రెండు బీజాక్షరాలు కూడా ఔతాయి.

'ఓంనమో నారాయణాయ' అనే మంత్రంలోని 'రా' అనే బీజాక్షరం'

ఓన్నమశ్శివాయలోని 'మ' బీజాక్షరంతో కలిస్తే, ఏర్పడిన శివ విష్ణు సమాగమరూపమైన (శివ+శక్తి ఉభయమైన) అగ్నివాయు బీజాక్షర సంపుటి 'రామ' అనేది. అందుకే ఫలితాన్ని ఈయగలదు. రామకథని రచించబోయే అదృష్టానికి నోచుకొన్న వరాన్ని పొందడం బట్టి - ఋక్షుడు - 'వాల్మీకి' అయ్యాడు.

## వాల్మీకి బోయవాడా?

కానే కాడు. అతడు బ్రాహ్మణుడు. (లక్ష్మణుడు సీతతో - *నఖావరముకో విప్రో వాల్మీకి స్సుమహాయశః - మచ్ఛందాదేవ తే బ్రహ్మన్ ప్రవృత్తేయం సరస్వతీ!* అని, బ్రహ్మయే స్వయంగా వాల్మీకిని బ్రాహ్మణుడా! అని పిలిచాడు).

వాల్మీకికి ఋక్షుడనీ, (*ఋక్షోఽభూద్భార్గవ స్తస్మాత్ వాల్మీకిర్యోఽభి ధీయతే* (విష్ణుపురాణం) భార్గవుడనీ, (*భార్గవేణ మహాత్మనా! - తపస్వినా* (రామాయణ ఉత్తరకాండం)

ప్రాచేతసుడనీ, (ప్రచేతసోఽహం దశమః పుత్రో రాఘవ నందన (రామా. ఉ.కాం) వాల్మీకుడనీ (వల్మీక స్యాపత్యం పుమాన్) - కూడ పేర్లు కన్పిస్తాయి.

భృగువంశంలో పుట్టడం చేత భార్గవుడనీ,

ప్రచేతుని 10వ పుత్రుడు కాబట్టి, ప్రాచేతసుడనీ పేర్లు వచ్చాయి.

అసలు పేరు 'ఋక్షుడు'.

ప్రచేతునికి 'వాల్మీకి మహర్షి' అనే పేరు కూడా ఉంది.

దాన్ని బట్టి, వాల్మీక పుత్రుడు 'వాల్మీకుడు' కూడ అయ్యాడు. మహర్షి యింట, బ్రాహ్మణకులంలో పుట్టిన కారణంగా, వేద వేదాంగాలన్నింటినీ అభ్యసించినా, శాపవశాత్తూ ఆయన కిరాత ధర్మంతోనే ఉండిపోయాడు.

**అందుచేత 'బోయవాడు' అనే పేరు లోకంలో నిలిచిపోయింది.**

## ఇంతకీ 'వాల్మీకి' అనే పేరు ఎలా వచ్చింది?

కిరాత ధర్మంతో ఉన్న ఋక్షుణ్ణి అనుగ్రహించి, శ్రీమద్రామాయణ కర్తగా చేయవలసిన కాలం వస్తోందని గమనించి, సప్తమహర్షులూ ఆ త్రోవలో వెళ్లారు. సప్తమహర్షులనీ చెట్టుకుకట్టేస్తే, నారదుడు ఋక్షుణ్ణి అడిగాడు. 'నీ పాపంలో ఫలం, భార్యాపుత్రులకి ఉందా? లేదా?' తెలిసికొనిరా! అని.

జన్మ సంస్కారమూ, జీవితంలో రాబోయే కాలంలో మార్పూ ఉండడం బట్టి, వెళ్లి తెలిసికొని వచ్చి, కట్లువిప్పి, సాష్టాంగ పడ్డాడు ఋక్షుడు.

ఎక్కడైనా దోపలు కొట్టేవాణ్ణి ప్రశ్న వేయగలమా? వాడు తెలిసికొని వస్తాడా? ఇదంతా భగవన్నిర్ణయం. 'శాపమే వరం' - అంటే యిదే. తన పుణ్యంలో భాగం, భార్యా పుత్రులకుంది. పాపంలో మాత్రం కాదని తెలిసి, జీవితంలో తరించే విధం తెల్పమన్నాడు.

వాల్మీకి, జన్మతః బ్రాహ్మణుడే అయినా కిరాత ధర్మంలో ఉన్నవాడు కదా! అందుకని, నారదుడు రామనామాన్ని వ్యత్యస్తంగా 'మరా' అని ఉపదేశించాడు. దాన్నే 12 లక్షల మార్లు అక్కడే కూచుని ఋక్షుడుజపించాడు.

పుట్టలు పెరిగాయి. నారదుడు తిరిగి వచ్చాడు. పుట్టలు పెరిగిన ఋక్షుణ్ణి చూచి, **వల్మీకం నుండి వచ్చినవాడివి' కాబట్టి 'వాల్మీకి' వౌతావనీ, ఈ పేరు చిరస్థాయి వౌతుందనీ తెల్పాడు.**

12 లక్షలమార్లు రామనామాన్ని జపించిన ధన్యుడు వాల్మీకి అనీ, నారదుడంతటి వానిచే పెట్టబడిన పేరు కలవాడనీ, అది ఒక బిరుదనీ గ్రహించాలి. ఈ వాల్మీకి బ్రాహ్మణుడూ, రామ మంత్రసిద్ధి పొందినవాడూ కాబట్టే, వేదంలోని రహస్యాలని చెప్పగలిగాడు. రామునికే ప్రీతిపాత్రుడయ్యాడు. చిరస్థాయి కాగలిగాడు.

## రామమంత్రం విలువ

నారదుడు (నారదో నాశయన్నేతి నృణామజ్ఞానజం తమః - అజ్ఞానమనే నరులచీకటిని తొలగించేవాడు. నారదుడు; నార-నీటిని, ద-ఇచ్చేది మేఘం. భగవన్నిర్ణయం ప్రకారం ఎక్కడైనా కురుస్తుంది గాని, మనం అడిగిన చోటనే కురువదు. అలాగే నారదుడూను. - భారతం ప్రకారం - నరతీతినరః ప్రోక్తః పరమాత్మా సనాతనః) నారదుడు రామ మంత్రాన్ని శిప్పి ఉపదేశిస్తేనే, దాన్ని మననం చేసిన వాల్మీకి, ఇంతకాలం చిరస్థాయిగా ఉండగలిగాడంటే, ఇక సరిగా ఉపదేశం తీసికొని, సక్రమంగా మననం చేస్తే చెప్పాలా? మంత్రం అందరికీ ఇయ్యబడేదికాదు. కాని, రామనామానికి ఆనియమం లేదు *(పాత్రాపాత్ర విచారోన రామనామ్నాం ప్రకీర్తనే.)*

వేదంలో పశ్యక, క్షిప అనేపదాలు క్రమంగా కశ్యప, పక్షి అని అవుతాయి. అలాగే, 'రామ' కూడా వ్యత్యస్తంగా ఉండడానిక్కారణం, ఈ మంత్రం దేవలోక సంబంధం కలదని అర్థం చేసికొనడానికే. పశ్యకః - అన్నింటినీ పరిశీలనతో చూడగలిగే వాడు కశ్యపుడు. క్షిపతీతి అనే అర్థంలో 'పక్షి'(ఆకాశంలోని త్రోవని వెనుకకు చిమ్ముకుంటూ వెడుతూంటుంది కాబట్టి) ఔతుంది.

**'శ్రీరామరామరామేతి రమేరామే మనోరమే - సహస్రనామ తత్తుల్యం రామనామవరాననే! అని శంకరుడు పార్వతితో అన్నాడు. రామ రామ రామ అంటే వెయ్యిమార్లు రామనామ జపం చేసినట్లే అని. యరలవంలో 'ర' 2వ అక్షరం. పఫబభమలలో 'మ' 5వ అక్షరం. రామ = 2×5 = 10. రామ రామ రామ అంటే 10×10×10 = 1000. కాబట్టి సహస్రనామతుల్యమని శంకరవాక్కు'.**

మిగిలిన మంత్రాలకి ఓం కారం ముందుండాలి. లేకపోతే పట్టివ్వదు. కాని, రామ మంత్రానికి ఓం కారం లేకపోయినా పట్టిస్తుంది. రామ మంత్రం, వాల్మీకి జీవితాన్నే మార్చింది. వాల్మీకి మహర్షియే సాక్షిగా ఉన్నా నమ్మకపోవడం, దురదృష్టకరమే. ఈ రామశబ్దానికి 'శ్రీ' శబ్దం కలిపాం.

## 'శ్రీ' అంటే?

(1) శ్రీయతే = భగవంతుణ్ణి ఆశ్రయించి ఉండేది.

(2) శ్రయతే = భక్తులచే ఆశ్రయింపబడేది.

(3) శృణోతి = దీనుల ఆలాపాలని వినేది.

(4) శ్రావయతి = దీనుల బాధలని తానువిని, ఆయనకి విన్పించేది.

(5) శృణాతి = పాపాలన్నింటినీ నశింపచేసేది.

(6) శ్రీణాతి = ఆశ్రయించిన వారికి, కైంకర్యాన్ని కల్గించేది. అని శ్రీశబ్దానికి 6 అర్థాలు.

దీనితో కలిసినది రామపదం. అర్థం తెలిసినా, తెలియకున్నా 'శ్రీరామ రామ రామ' అనే మంత్రాన్ని అనేక పర్యాయాలు పఠిస్తే, చెప్పలేని ఆనందం మనకి కల్గుతుంది. భూదేవి మొర ఆలకించి పాపులని చంపుతానని మహావిష్ణువు వరమిచ్చినా, అమ్మవారు కొద్దిగా ఓర్పు వహించమని పల్కుతుంది. అలాంటి అమ్మవారే 'శ్రీ' అంటే. అలాటి శ్రీ తో కూడిన రాముడే, కార్యసాధకుడు.

ఆ 'శ్రీ' లేకపోవడం బట్టే, రాముడు అరణ్యంలో ఆమెకై దుఃఖిస్తూ, విలపించాడు కూడ. ఇంతటి విలువైన రామనామాన్ని జపించిన వాల్మీకికి, రామకథ స్పష్టంగా తెలుసు. కారణం, రాముడు అరణ్యానికి వెడుతూ, వాల్మీకి ఆశ్రమంలో కూడ ఉన్నాడు. పైగా, ఈయన తపస్సు చేస్తూన్న కాలంలోనే రామకథ జరిగింది కూడ. అయినా నారదుడు, రామకథని కథా ప్రారంభంలో వాల్మీకికి చెప్తాడు. అంత కథా తెలిసిన వాల్మీకికి మళ్లీ ఎందుకు చెప్పాలి ? ఈయన కూడా, తెలియని వానిలా ఎందుకు వినాలి?

## గురూపదేశం కావాలి

పంచాక్షరీమంత్రం, అని ఉంది. 'ఓం నమశ్శివాయ! అనేది ఎవరు విననిది? దీన్ని ఎవరికి వారు జపించు కోవచ్చుగా!. కాని అది ఫలించదు. గురూపదేశం కావాలి. దీన్ని అనేక పర్యాయాలు మననం చేసిన గురువు ఉపదేశిస్తే, ఆ గురుశక్తి మంత్రంలో ప్రవేశించి తద్వారా వ్యక్తికి ఫలిస్తుందని పెద్దలు చెప్పినమాట.

వాల్మీకి ఆ గురూపదేశం పొందాలనే, స్వయంగా తనకి రామకథ తెలిసినా, గురువుకోసం ఎదురుచూస్తూన్నాడు.

ఉత్తముడైన శిష్యునికి చెప్పాలనీ, అదికూడా రామభక్తి తత్పరుడైన వానికే చెప్పాలనీ నారదుడనుకొంటూ తిరుగుతున్నాడు.

ఈ ఇద్దరికీ ఇక్కడ సమావేశమైంది.

వాల్మీకి అడిగాడు భక్తితో. నారదుడు ఉపదేశం చేసాడు. ఇక వాల్మీకి, రామకథని ప్రపంచానికి చెప్పే అర్హతని పొందినట్లైంది. ఈ అర్హతని పొందే సమయానికి రాముడు రావణుని వధించడమూ, పట్టాభిషేకాన్ని చేసికోవడమూ అయిపోయింది. సుఖంగా రాజ్య పాలన చేస్తున్నాడు. ఒట్టిగా రాముడు వచ్చి వెళ్లాడంటే అర్థం ఏముంటుంది? ఆయన వచ్చిన వెళ్లినట్లుగా భూ ప్రజలకి గుర్తుండేందుకు శ్రీ మద్రామాయణ కథని రచింప చేసి, భూలోకంలో ప్రచారంలో ఉంచాలనీ, దాని ద్వారా ధర్మం ప్రచారం కావాలనీ శ్రీ మహావిష్ణువు భావించి ఆ గ్రంథ రచనకై కొన్ని ఏర్పాట్లని చేసాడు.

## రామాయణ రచనానికై శ్రీమహావిష్ణువు చేసిన ఏర్పాట్లు:

నిత్యమూ వేదాన్ని పఠించేవాడు బ్రహ్మ. వేదంలోని పరబ్రహ్మ స్వరూపమంతా బ్రహ్మకి బాగా తెలుసు. ఆయన తప్ప, అంత చక్కగా పరబ్రహ్మస్వరూపాన్ని, ఇంక ఎవరూ చెప్పలేరని ఆలోచించి,

చెప్పవలసిన వేదంలోని పరబ్రహ్మ స్వరూపాన్ని,

చెప్ప గల బ్రహ్మ చేత,

చెప్పించవలసిన భూలోకంలో చెప్పించడానికి,

సనత్కుమారులవారి శాపం ప్రకారం ప్రచేతునికి పుట్టబోయే బుక్షునిలో, శ్రీమహావిష్ణువు, బ్రహ్మ అంశని ప్రవేశపెట్టాడు. అందుచేత వాల్మీకి, బ్రహ్మాంశసంభూతుడు. ఆ వాల్మీకి వద్దకి వెళ్లి ఉపదేశం చేయవలసినదిగా, బ్రహ్మమానసపుత్రుడైన నారదుణ్ణి శ్రీ మహావిష్ణువు పంపాడు. తాను స్వయంగా చేసిన రావణవధవరకూ ఉన్న విషయమంతా, బ్రహ్మాంశ సంభూతుడైన వాల్మీకికి తపస్సు చేసికొనే కాలంలో అనుగ్రహించి, వాల్మీకి చూడని సంఘటనలని కూడ అర్థమయ్యేలా చేసాడు.

ఇక రామకథని విన్న వాల్మీకి, స్నానానికి బయలుదేరబోతాడని తెలిసి, అక్కడ కూడా రామాయణ గ్రంథారంభానిక్కావలసిన ఏర్పాట్లు చేసాడు. తానురావణవధనిచేయగా, రాక్షసులలో శంఖుకర్ణుడనే ఒక్క రాక్షసుడు పారిపోయి, రామబాణానికి తప్పించుకొని, క్రౌంచ పక్షిరూపంలో ఉండి, ఇంకా ఋషిబాధ చేస్తూనే ఉన్నాడు. వీణ్ణి కూడా వధించాలని ఆలోచించి ఆ పురుష పక్షికై, ఒక స్త్రీ క్రౌంచాన్ని ఒక చెట్టు మీద ఉంచాడు.

తానే బోయవానిగా నిలబడ్డాడు. తాను బాణం కొట్టిన మరుక్షణంలో, ద్రవింపబోయే వాల్మీకి హృదయం నిండుగా కరుణరసం రాగానే, వాల్మీకి నోట శ్లోకం రావడానికై, బ్రహ్మభార్య సరస్వతిని, సరిగా ఆసమయం చూచి, ప్రవేశించేలా చేయమని, బ్రహ్మనాదేశించాడు. *(అత స్సరస్వతీం త్వం తు ప్రేరయాస్యానసం ప్రతి.)*

గాయత్రీ మంత్రాన్నికున్న బీజాక్షరాలు 24టినీ, ప్రతివేయి శ్లోకాలకి ఒక్కో అక్షరం చొప్పున ఉంచుతూ వాల్మీకి 24వేల శ్లోకాలతో రామకథని వ్రాసేందుకు వీలుగా, గాయత్రీదేవిని పిలిచి, ప్రతి వేయిశ్లోకాల మొదటి అక్షరమూ 'నీబీజాక్షరం ఉండే ఏర్పాటు, నీవుచూచుకోవలసిందని', ఆమెనాదేశించాడు. ఆమెకూడా అంగీకరించింది. *(ప్రవిష్టాస్యాం చ తే కాలే ప్రతిశ్లోకసహస్రకమ్).*

నిర్విఘ్నంగా వ్రాయబడే రామకథని లోకంలో ప్రచారం చేయడానికి, తన పుత్రులు లవకుశుల్ని మనసులో భావించాడు.

ఇన్ని ఏర్పాట్లని కట్టుదిట్టంగా చేసికొన్న మీదట, కార్యనిర్వాహణలో మొదటి పనిగా నారదుణ్ణి, వాల్మీకి వద్దకు పంపాడు. నారదుడు కూడా విష్ణువు ఆజ్ఞ ఈయగా, ఆమీదట బ్రహ్మ తనను పంపగా వచ్చినవాడే కాబట్టి, మంత్రోపదేశానికి సహజంగా చూడవలసిన అర్హత పరీక్షని, వాల్మీకి విషయంలో, నారదుడు చేయలేదు. విష్ణుబ్రహ్మలచే, నిర్ణయింపబడ్డాక తానెంత? అలా ఆజ్ఞ నెరవేర్చడానికి నారదుడు వాల్మీకి వద్దకువచ్చాడు.

# బాలకాండము
## కథా ప్రారంభము

### వాల్మీకి ప్రశ్న - నారదసమాధానమూ

**తపస్స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరమ్ !**
**నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్ముని పుంగవమ్ ।(1)**

ఎప్పుడూ తపస్సూ, వేదపఠనమూ అనే రెంటినీ చేస్తూండేవాడూ - మహాపండితుడూ- అయిన నారద మహర్షికి, తపోధనుడూ-ఋషి అయిన వాల్మీకి నమస్కరించి, 'ఓ!మహర్షీ ! విష్ణులోకం నుండి సర్వలోకాలూ సంచరించే బ్రహ్మమానసపుత్రుడివి కదా నువ్వు ! సద్గుణాలూ పరాక్రమమూ, సత్యవ్రతమూ, సమర్థతా, ధైర్యమూ, సచ్చరిత్రమూ,పట్టుదలా, అన్నిభూతాల యందిష్టమూ, పాండిత్యమూ, కృతజ్ఞతాభావమూ, ధర్మబుద్ధీ, క్రోధాన్ని జయించిన తనమూ, కాంతీ, అసూయలేనితనం కలవాడూ, కోపం వస్తే దేవతలనైనా భయపెట్టగలవాడూ, అందరికీ ఇష్టుడూ ఎవరైనా ఉన్నారా? అని ప్రశ్నించాడు. (ఇవే 16 గుణాలు) ఈవిషయమే ఇలా శ్లోకంలో ఉంటుంది.

*కోన్వస్మిన్ సాంప్రతంలోకే గుణవాన్ కశ్చవీర్యవాన్ ?*
*ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః ।*
*చారిత్రేణ చ కోయుక్తస్సర్వభూతహితే రతః?*
*విద్వాన్ కస్సమర్థశ్చ సర్వైకప్రియ దర్శనః ?*
*ఆత్మవాన్ యో జితక్రోధో ద్యుతిమాననసూయకః ।*
*యస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే ?*

ఆ ప్రశ్నవిని నవ్వి, నారదుడు, 'ఓ మునీ !ఒక్క క్షణం ఆలోచించి చెప్తాను(మునే! వక్ష్యామ్యహం బుద్ధ్వా). - అని కాసేపు ఆగి- ఇన్ని గుణాలున్నవాడు భూలోకంలో ఉండడం అసంభవం. అయినా ఇక్ష్వాకు వంశంలో పుట్టి 'రాముడు' అని ప్రసిద్ధి కెక్కిన ఒకడున్నాడు - అని మొదలెట్టి, మొత్తం రామకథనంతా ఒక్కబిగిని చెప్పేసాడు.

లోకంలో ముందు పుట్టింది ప్రశ్న. ఎవరైనా, తనకంటె ఎక్కువవారిని, ప్రశ్న అడుగుతారు.

వాల్మీకి - ముని అయితే, నారదుడు - మునిపుంగవుడు.

వాల్మీకి - తపస్వి అయితే నారదుడు తపస్సూ, వేదాధ్యయనమూ చేసేవాడు.

వాల్మీకికి ఇంకా సరస్వతీ ప్రసన్నం కాలేదు (కవిత్వం రాబోతోంది). కాని, నారదుడు మహాపండితుడు.

అందుకని, వాల్మీకి, నారదుణ్ణి ప్రశ్న అడిగాడు.

నారదుడు - గురువు. వాల్మీకి - శిష్యుడు.

శ్రీమద్రామాయణంలో ఏశిష్యుడూ గురువు వద్దకు రాడు. గురువే శిష్యుని వద్దకు వస్తాడు. ఇది ఒక ఆశ్చర్యకరమైన అంశం.

కాబట్టి ఉత్తముడైన శిష్యుడనిపిస్తే, అడుగకుండానే, గురువే శిష్యునికి ఉపదేశం చేయవచ్చు-చేయాలి- అని రామాయణం చెప్తుంది.

## నారదుని వెనుకంజ

వాల్మీకి అడిగినా, తెలిసిన విషయాన్ని చెప్పడానికి నారదుడు సంశయిస్తున్నట్లుగా- అడిగితెలిసికొని చెప్తాను' అని ఎందుకన్నాడనిపిస్తుంది? 'మునే!' అని సంబోధించాడు నారదుడు వాల్మీకిని. 'ఉపదేశానికి అర్హుడివి' - అని సూచించడమన్నమాట.

వాల్మీకి మౌన పద్ధతి కలవాడు. ప్రశ్ననడిగే హక్కు పొందినవాడు. ఒకప్పుడు కిరాతుడని అనిపించు కొన్నవాడు. ఇప్పుడు తపస్సిద్ధినంది నారదుని చేతనే 'ముని' గా పిలువబడుతున్నవాడున్నూ.

ఇక నారదుడు నిత్యం నారాయణ స్మరణచేసేవాడూ, వాల్మీకికే రామకథని ఉపదేశించాలని వచ్చినవాడున్నూ.

దేవలోకంలో 100 కోట్ల శ్లోకాలతో ఉన్న బ్రహ్మవిద్యని, లోకంలో జరిగిన రామకథతో జోడిస్తూ, - ఎలా రామకథ చదువుతూంటే, లోకంలో అందరికీ పైకి రామకథా, లోపల వేదం యొక్క అర్థంతో బ్రహ్మవిద్యా గోచరిస్తుందో, అలా నారదుడు చెప్పవలసిఉంది.

ఇంత కష్టమైన కథని, అంత తేలికగా, అదీ లోకంలో అందరికీ అర్థమయ్యేలాగున ఎలా చెప్పాలా? అని ఆలోచిస్తూ, మునే వక్ష్యామ్యహం బుద్ధ్వా! మహర్షీ! ఎలా చెప్పాలో తెలిసికొని చెప్తానని విషయాన్ని చెప్పడానికి ముందు నారదుడు అన్నాడు.

అతి ముఖ్యమైన విషయాన్ని చెప్పవలసి వచ్చినప్పుడు, ఏది ముందు? ఏది వెనుక? అని ఆలోచించడం అందరికీ సామాన్యమే కదా! అలాటి సంశయమే ఈ వెనుకంజ!

రామునిలో 16గుణాలున్నాయని చెప్పడం వలన రామావతారం పూర్ణావతారమేకాని, అప్పటికప్పుడు ఆ అవసరం రాగా ఎత్తిన వామనావతారం లాటిది కాదు. (ఇలాటి అవతారాలు, ఆపని అయ్యాక మళ్ళీ కన్పించవు. వీనికి గుళ్లు- గోపురాలు- పూజా పురస్కారాలుండవు). పూర్ణావతారాన్ని ఎత్తిన రామునివంటి ఉత్తముడైన వాణ్ణి గూర్చి వాల్మీకి వంటి మునికి, ఉపదేశం చేయడమూ కంఠం పట్టుకొనే సమస్యే.

ఈ16 గుణాలూ పరశురామ- విశ్వామిత్ర- వశిష్ఠ- భరద్వాజాలలో ఉన్నాయి గదా! అని వాల్మీకి అడిగితే, అదో పెద్ద సమస్య. దానికి సమాధానం ఆలోచించుకుంటూ కూడా - బుద్వా - తెలిసికొని చెప్తానన్నాడు నారదుడు. ఇలా అనడం దోషంకాదు. చక్కగా ఆలోచించి చెప్పడానికి మేధావులు తీసికొనే సమయం 'వెనుకంజ' అవుతుందా?

పరశురాముడు - క్రోధాన్ని జయించలేక పోయాడు.

వశిష్ఠుడు - యుద్ధంలో పరాక్రమాన్ని చూపలేడు.

విశ్వామిత్రుడు - తపస్సులలో భ్రష్టుడై, ఆత్మవిమర్శ చేసికొని బ్రహ్మర్షి అయిన ఉత్తముడు.

భరద్వాజుడు - రామునిఅంతటి ప్రసిద్ధ చరిత్ర కలవాడూకాడు- దేవతలని విల్లుపట్టి భయపెట్టగలవాడూ కాడు.

అందుకని, సర్వవిధాలా 16గుణాలూ కలిగి,16కళలతో ఒప్పిన చంద్రునిలా రామచంద్రుడొక్కడే వాల్మీకి ప్రశ్నకి సమాధానమూ, నారదుని మనస్సులోని అభిప్రాయమూ, అయ్యాడు.

రామకథ వట్టి కథకాదు. అంతర్గతంగా బ్రహ్మవిద్య ఉన్నది కాబట్టే వాల్మీకి నారదుణ్ణి (పరివ్రచ్ఛ) ప్రశ్నించాడనకుండా పరిప్రశ్న చేసాడని శ్లోకం చెప్తోంది. వేదాంతవిషయాన్ని గూర్చి ప్రశ్నిస్తే అది 'పరిప్రశ్న' ఔతుంది. ఇలాటి రామకథని లోకంలో ప్రచారం చేయదలచి దేవతలు కొన్ని ఏర్పాట్లు చేసి నారదుణ్ణి వాల్మీకి వద్దకు పంపారు. (బోయవాని రూపంలో విష్ణువూ - వాల్మీకిలోనికి ప్రవేశించడానికి సరస్వతీ - శ్లోకాలలో ప్రవేశించడానికి గాయత్రీ - కరుణాన్ని వాల్మీకికి కల్పించడానికి స్త్రీ క్రౌంచ పక్షి - ఇవన్నీ తమసా నది ఒడ్డున సిద్ధంగా ఉన్నాయి).

## మహర్షిశాపం- కవిత్వావిర్భావం

అలా నారదుని ద్వారా రామకథని విని, మనస్సంతా సంతోషంతో నిండిపోయిన సాత్వికుడైన వాల్మీకి, నారదుణ్ణి పూజించి సాగనంపి, గంగానదికి సమీపంలో ఉన్న తమసా నదికి శిష్యుడైన భరద్వాజునితో మధ్యాహ్నకాలపు స్నానానికి వెళ్లాడు.

**అకర్దమ మిదం తీర్థం భరద్వాజ! నిశామయ!**
**రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్యమనో యథా I (2/5)**

శిష్యునితో 'భరద్వాజా! ఈతమసానది ఎంత ప్రసన్నంగా ఉంది! లోపల బురద లేదు. పైన స్వచ్ఛంగా ఉంది. సత్పురుషుని మనస్సులా ఉందికదూ! చూడు! ఈనీటిని చూడు! నాకు నారబట్ట నిచ్చి, ఆచెంబుని అక్కడపెట్టు. ఇక్కడే స్నానం చేస్తాను' అన్నాడు. అంటూనే ఆ నారబట్టని తీసికొని, ఆచుట్టూ ఉన్న వనంలోని అందాన్ని పరిశీలించడం ప్రారంభించాడు. (విచచార హి పశ్యంస్తత్సర్వం విపులం వనమ్.)

నదులలో పవిత్రమైన నది గంగ. (తోయేషు జాహ్నవీగంగా) అలాటి గంగకి వెళ్లే త్రోవలో తమసానది ఉంది. కాని, వాల్మీకి తమసానదిలోనే స్నానం చేద్దామన్నాడు. (ఇదమే వావగాహిష్యే తమసాతీర్థ ముత్తమమ్) నిత్యమూ 'సంకల్పం' అని పూజా సమయంలో చేస్తాం. గంగ,యమున, గోదావరి మొదలైన అన్ని నదులూ, ఈజలంలో సాక్షాత్కరించుగాక! అంటూ – ఆ కలశంలోని నీటిని సర్వనదీజలాలుగా భావన చేస్తాం. (గంగే!చ యమునే! చైవ గోదావరి! సరస్వతి! నర్మదే! సింధుకావేర్యౌ! జలేఽస్మిన్ సన్నిధిం కురు.)

గంగానదిలో మునుగుతూన్నా, భావన వేఱుగా ఉంటే ఫలితం శూన్యం. ఇంటి వద్ద చేస్తూన్నా, గంగాభావన ఉంటే ఫలితం ఉంటుంది. తమసానదిని గంగా నదీ భావనతో చూచాడు మహర్షి. అందుకే, ఇది ఉత్తమ తీర్థం (గంగానదీజలం) అన్నాడు.

రోజూ చూచే నదే అయినా, భరద్వాజుడెన్నో మాఱులు ఆ నదిని చూచినా, ఈరోజున నదిని, 'చూడు!-చూడు!' అని వాల్మీకి అంటున్నాడు. ఇంతకుముందు రామకథని వినని వాల్మీకి, తమసని చూచాడు. ఇప్పుడు రామకథని విన్నాక, శరీరంలో, ్యక్తిలో,హృదయంలో ఎంతో మార్పు కలిగి 'భరద్వాజా! ఈనీళ్లని చూడు!' అనేంత తికి ఆయన ఎదిగితే, రోజూచూచే నీరేకదా! అనే సామాన్యస్థితిలోనే భరద్వాజుడున్నాడు. ారణం,భరద్వాజునికి రామకథోపదేశం కాలేదు గనుక. సత్పురుషుణ్ణి గూర్చి నిత్యమూ భావన చేయడం చేత, ఆ నీళ్లు, సత్పురుషుని మనస్సులాగా, వాల్మీకికే గోచరించాయి.

మనస్సులోని కాలుష్యానికి సంకేతం బురద లోపల బురదలేనితనం, పైన ప్రసన్నతా – ఈ రెండూ సత్పురుష లక్షణాలు. అంతర్బహిశ్చ.....వ్యక్తి పైనా, లోపలా రెంటా పరిశుభ్రుడై ఉండాలి.

రామకథ వినేసరికి, ఆ పరిశీలన శక్తి వాల్మీకికి వచ్చి, సర్వత్ర సత్పురుషుణ్ణి దర్శించ గలుగుతున్నాడు. భరద్వాజునికి చూపించడంలోని విశేషం – సత్పురుషుణ్ణి ఒక్కరే దర్శింపరాదు– పదిమందికి చూపించాలి కూడ – అని.

ఒక గ్రంథం వ్రాసేవానికి సాత్త్వికత ప్రధానం. ప్రతివస్తువులోని స్వచ్ఛతనీ చూడగలిగిన తనం అవసరం. లోని హృదయం పరిశుభ్రంగా ఉంటే, వాళ్లని 'సహృదయులు' అంది అలంకారశాస్త్రం.

పోనీ! స్నానానికి దిగిన వాల్మీకి స్నానం మొదలెట్టాడా? అంటే అదీలేదు. ప్రకృతిలోని అందాన్ని పరిశీలించడానికి ఆ వనం తిరగసాగాడు. ఇంద్రియాలని జయించిన వాల్మీకిని వనరామణీయకం ఆకర్షించడమా? కర్మిష్ఠి అయిన వాల్మీకి మధ్యాహ్నస్నానంతరం చేయాల్సిన కర్మలు ఎన్నో ఉంటే, వాటిని విడిచి వనం చూస్తూండడమా? అని భరద్వాజానికి ఆశ్చర్యం వేస్తోంది. ఈతేడా, భరద్వాజ వాల్మీకుల మధ్య తెలియడానికే, పరమాత్మ శిష్యుణ్ణి కూడా వెంటపెట్టి, ఈరోజునకూడా, పంపించాడు. ఇలా తమసాస్నానం, వనరామణీయక దర్శనం – అన్నీకూడా భగవదిచ్ఛకు అనుగుణంగానే జరుగుతున్నాయి.

'బుద్ధింతు సారథింవిద్ధి' అంటే యిదే. మనకి సారథి (నడిపించేది) బుద్ధి (పరమాత్మ). అందుకే శరీరమనే రథంలో నరుడు లోపల కూర్చుంటే, నడిపించవలసిన పరమాత్మ, ఇంద్రియాలైన గుఱ్ఱాలని తోలుతూ, ముందుంటాడు. ఇదే భగవద్గీతా చిహ్నం కదా!.

ఇలా వనం తిరుగుతూన్న వాల్మీకి కళ్ళు,

ఒక చెట్టుపై నిలిచిపోయాయి.

ఆచెట్టు కొమ్మ మీదకి వెళ్ళాయి.

కొమ్మమీద క్రౌంచపక్షుల జంట మీద వ్రాలాయి.

జంటలోని పరస్పర ప్రేమానురాగాలని పరిశీలించసాగాయి వాల్మీకి నేత్రాలు.

ఆరెండూ రతిపారవశ్యంలో ఉన్నాయి. మగపిట్ట తన రెక్కలతో ఆడుపక్షిని కప్పివేసింది.

అంతలో ఒక పిట్టలనుకొట్టే పాపాత్ముడు, పోతుపిట్టనికొట్టాడు. అది నేలబడింది.

ఆడుపిట్ట విలపిస్తూ, నెత్తురుముద్దలా ఉన్న పక్షిచుట్టూ కరుణాతికరుణంగా తిరుగసాగింది. వాల్మీకి హృదయం ద్రవించింది. అంతే! శ్లోకం ఆతనినోట వెలువడింది. (సరస్వతి ప్రవేశించిందన్న మాట).

***మానిషాద ప్రతిష్ఠాం త్వమగమ శ్శాశ్వతీస్సమాః***

***యత్క్రౌంచమిథునాదేక మవధీః కామమోహితమ్ । (2/15)***

*'ఓరి నిషాదుడా! పరస్పరం కామమోహంలో ఉన్న పక్షులలో పోతుపిట్టని చంపిన కారణంగా ఎక్కువకాలం నువ్వుండరాదుసుమా!' అని ఒక 'తిట్టు' దీని భావం.(దీనికి కల అనేకార్థాలు ముందు చూద్దాం).*

ఛందోబద్ధమైన వాక్యం, వాల్మీకి నోట అప్రయత్నంగా వెలువడింది. వచ్చింది ఏమిటో తనకు తెలియదు. తన శరీరం తన వశంలో లేదు. కొంతసేపటికి బాహ్య

లోకానికి వచ్చాడు. తన నుండి వచ్చిన ఆ వాక్యాన్ని మళ్లీ మళ్లీ చదువుకున్నాడు. పక్షి శోకంతో, హృదయం నిండగా వచ్చినది కాబట్టీ, ఇది శోకం నిండినది కాబట్టీ,- శ్లోకం- అని పేరెట్టాలని భావించాడు. *(పాదబద్ధోఽక్షరసమః తంత్రీలయ సమన్వితః శోకార్తస్య ప్రవృత్తో మే శ్లోకో భవతు నాన్యథా)* **వాల్మీకి శోకం, లోకం కోసం కాబట్టి, శోకం + లోకం = శ్లోకం అయింది. ఇదే సంస్కృతంలోని మొదటి శ్లోకం.**

ఆ శ్లోకంలో 4 పాదాలుంటే, ప్రతి పాదానికీ అక్షరాలు సమంగా ఉన్నాయి. సంగీతానికి సరిపోతున్నాయి. వాల్మీకి వినిపించగా శ్లోకాన్ని మళ్లీ విన్నాడు భరద్వాజుడు. స్నానం పూర్తి చేసి వాల్మీకి ఆశ్రమానికి వచ్చినా, మనసు మాత్రం పక్షిమీదే ఉంది.

అంతలో బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయ్యాడు.వాల్మీకి మనసులోని ఆందోళనను గమనించి, 'మహర్షీ! నువ్వు చెప్పింది శ్లోకమే. నా ఆజ్ఞవల్లనే నీ నుండి ఆ సరస్వతి (వాక్కు) వచ్చింది. *(మచ్ఛందాదేవ తే బ్రహ్మన్! ప్రవృత్తేయం సరస్వతీ)* ఇలాటి వాక్యాలతోనే రామకథని నువ్వు వ్రాయాలి. నువ్వు చెప్పే కావ్యంలో అసత్యం ఉండదు. *(న తే వాగనృతా కావ్యే కాచిదత్ర భవిష్యతి.)* అది ఆదికావ్యమై, చదివిన- విన్న వారికి పుణ్యప్రదం అవుతుంది. ఎంతకాలం ఉంటుందో? ఏమో? అని భావించకు', ఈ ప్రపంచంలో మహా నదులూ, పర్వతాలూ ఉండేంతవరకూ, నీ రామాయణ కథ ప్రచారంలో ఉంటుంది. *(యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే- తావద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి.)* దీనితో నీవు శాశ్వత కాలం ఉంటావు, అని చెప్పి మాయమయ్యాడు.

శిష్యులు గానంచేయగానూ, తాను మళ్లీమళ్లీ అనుకోగానూ, ఆశ్లోకం చాల రసవత్తరంగానూ, చాల అర్థం కల్గిందిగానూ వాల్మీకికి అన్పించి, బ్రహ్మాజ్ఞపై రామకథని వ్రాయ సంకల్పించాడు మహర్షి. భరద్వాజునికి చెట్లూ, చెట్టుకొమ్మా, పక్షులూ అన్నీ కన్పిస్తూంటే, వాల్మీకికి క్రౌంచ పక్షులే గోచరించడం, నిశ్చల దృష్టికి తార్కాణం. (భారతంలో ద్రోణుడు, అర్జునునకు పెట్టిన పరీక్ష ఇదే కదా!)

పక్షి నేలకూలగానే, హృదయం ద్రవించి, వాల్మీకికి శ్లోకం వచ్చింది. వాల్మీకే బోయవాడైతే, నిత్యమూ పక్షులని కొట్టడమే (చూడడం కాదు) తన అలవాటు కాబట్టి, శోకమూ ఉండదు. శ్లోకమూ రాదు.

## విచిత్రమైన వేటగాడు

మగపక్షిని కొట్టిన వేటగాడు ఎక్కడికి వెళ్లిందీ, మహర్షికి భయపడినదీ లేనిదీ, ఏమీ తెలియదు మనకి. అసలా వేటగాడు ఆ ప్రాంతంలో మరుక్షణంలో కన్పించనేలేదు. కారణం - విష్ణువే వేటగాడు కాబట్టి. మళ్లీకడే అయ్యుంటే 'తప్పైందని' వేడు కొనేవాడే కదా!

అయినా, బోయవాని ధర్మం పక్షిని చంపడం. అది తప్పని వాల్మీకి శపించవచ్చా? ఇక్కడ రెండు హేతువులున్నాయి. (1) ఆ పక్షులు రెండూ రతి పారవశ్యంలో ఉండగా కొట్టడం తప్పు. *(కోహి విద్వాన్మృగం హన్యాత్ చరంతం మైథునే వనే?)* ద్వాపర యుగంలో పాండురాజు ఇలాటి తప్పే చేయబోతున్నాడు (2) ఆబోయవాడు అందఱు బోయవాళ్లలాకాక, ఏమైనా సరే , ఏ స్థితిలో ఉన్నాసరే చంపాలని అనుకొంటూ ఉన్నాట్ట. *(తస్మాత్తు మిథునాదేకం పుమాంసం పాపనిశ్చయః జఘాన వైరనిలయః నిషాద స్తస్య పశ్యతః)* (పాప నిశ్చయః). పైగా సాత్త్విక మూర్తి అయిన మహర్షి, అహింసా విధానమవలంబించే వాల్మీకి అక్కడ ఉన్నాడని చూచి కూడా, అతడు చూస్తూండగానే కొట్టాలని కూడా, భావించినట్లు శ్లోకం చెప్తోంది. ఇదంతా, శ్రీమహావిష్ణువు బోయవాడు కావడంవలన జరిగిందని స్పష్టంగా తెలుస్తోంది కదా!

దీన్ని బట్టి, ఇదంతా, బోయవాడైన శ్రీమహావిష్ణువు, శంఖుకర్ణుడనే రాక్షసుణ్ణి, రావణవధ సందర్భంలో మిగిలినవాణ్ణి, క్రౌంచపక్షి రూపంలో ఉన్నవాణ్ణి, వధించి, వాల్మీకికి కవితా ధార నిప్పించడంకోసం ఆడిన జగన్నాటకమని కదా తెలిసింది. కొట్టబడింది మగ క్రౌంచపక్షి. ఆడు పక్షి కాదు. 'న స్త్రీ వధ్యా'. స్త్రీ, ఏ జాతిదైనా, చంపబడరాదని ధర్మశాస్త్రం చెప్తోంది.

## కవిత్వం ఎలా రావాలి?

శ్లోకం నిండిన హృదయంనుండి అప్రయత్నంగా రావడం బట్టి అది 'శ్లోకం' అయింది. ఇలా అప్రయత్నంగా వచ్చేది 'కవిత్వం' కాని, ఈరోజు సభలో చదవాలి కదా! అని బలవంతానా ఏదో బరికి, దాన్ని' కవిత్వం' అంటే, దానివలన 'మెదడువాపువ్యాధి' వస్తుంది కాని, ఆనందం రాదు.

తననోట వెలువడిన దాన్ని, తిరిగి తిరిగి వాల్మీకే మననం చేసికొన్నాడు. అలాగే, ఏకవి తన కవిత్వాన్ని తాను అలా నెమరువేసి కొంటాడో,వేసికొనేలా కవిత్వం ఉంటుందో, అది చిరస్థాయిగా ఉంటుంది. దాన్నే, 'విమర్శ' అంటారు.

అసలు కవిత్వం రావడానికి, దైవానుగ్రహం ఉండాలి. బ్రహ్మసరస్వతుల అనుగ్రహంతో వాల్మీకికి కవిత్వం వచ్చింది. ఛందస్సు వచ్చినంత మాత్రాన కవిత్వం రాదు.

భగవంతుడు ఎలా చతుర్భుజుడో, (నాలుగు చేతులవాడో) అలాగే భగవంతుని స్తుతించే పద్యం చతుష్పదం (నాలుగు పాదాలు కలిగినది). భగవంతుణ్ణి స్తుతించే పద్య పాదాలతో భగవంతుని పాదాలని ఆరాధించాలి. అదీ కవిత్వమంటే. పైగా, తన కవిత్వం, తంత్రికీ లయకీ సరిపడి, సంగీతానికి అనువుగా ఉందిట. **కీర్తించేందుకు వీలుగా కవిత్వం ఉండాలి తప్ప, వచనాన్నే పద్యపాదాల రూపంలో 'అచ్చువేసి', 'కవిత్వం' అనరాదట.**

ఇక్కడి నుండి పుట్టిందే, 'సంగీత సాహిత్యాలు సరస్వతీమతల్లి రెండు పాలిండ్లు అనేమాట. సంగీతం సుదూరానికి తీసుకుపోయే మాధుర్యం కలదైతే, ఆలోచించే కొద్దీ అమృతత్వాన్నిచ్చేది కవిత్వం. సంగీతం వల్ల కలిగే మాధుర్యం కూడా, (లోపలి అక్షరాల వల్లనే) సాహిత్యం వల్లనే కాబట్టి, కవిత్వమే అన్నిటికంటే గొప్పది. అందుకనే బ్రహ్మవచ్చి చెప్పాడు- 'నీకు వచ్చింది ఉత్తమజాతి కవిత్వం కవిత్వం - నువ్వు రామకథని వ్రాయాలి సుమా!'- అంటూ. అది ఎంతకాలం జీవిస్తుందో కూడా ఆనాడే చెప్పి, అది నిజమని యీనాటి క్కూడా ఋజువు చేసాడు.

**పురాణేతిహాసాలు అబద్ధమనడానికి వీలులేని ఘట్టం ఇది.** బ్రహ్మ, ఇలా అన్నమీదట, ఆ శ్లోకాన్ని మరీమరీ ఆలోచించి వాల్మీకి విమర్శించాడు. దాని నుండి 5 అర్థాలు వచ్చాయి. సరస్వతిచే పల్కింపబడిన శ్లోకం కదా మరి!

## 'మానిషాద' శ్లోకానికి 5 అర్థాలు

లోకంలో ఎవరైనా వ్రాయాలంటే, కొంత అర్థాన్ని మనస్సులో ఊహించి, దానికి సరిపోయే పదాలు వాడి కవిత్వమంటారట. కాని, ఋషులు, వాళ్ల యిష్టం వచ్చిన మాటలని వాడి, 'కవిత్వం' అంటేచాలు, కావలసిన అర్థం వెతుక్కూంటూ వస్తుందిట. *(ఋషీణాం పున రాద్యానాం వాచ మర్థోऽనుధావతి)* ఇది వారి తపశ్శక్తికి నిదర్శనం. రామాయణకథని వినడం వల్లా, మనసులో భావించడం వల్లా, తన భావనకి తగినట్లుగా ఈ శ్లోకానికి 5 అర్థాలు వచ్చాయి.

(1) ఓ నిషాదుడా! క్రౌంచపక్షుల జంటనుండి మగపక్షిని చంపిన కారణంగా, నీవు ఎక్కువ కాలం జీవించకుందువుగాక!- ఇది **బోయవాని పరమైన అర్థం.**

(2) మా(లక్ష్మికి) నిషాదుడవైన(భర్త) ఓ రామా! సీతా విషయంలో కామమోహితుడైన రావణుణ్ణి, రావణమండోదరుల జంటనుండి చంపి, శాశ్వత ప్రతిష్ఠనీ, కీర్తినీ, పొందుదువుగాక! అని రామ పరంగా అర్థం. 'మానిషాద' అనడం వలన బోయవాణ్ణి శ్రీ మహావిష్ణువుగా వాల్మీకి గమనించడం, కేవలం ఆ స్థితిలోనే - అని - ఈ శ్లోకం చెప్తోంది.

(3) ముల్లోకాలనీ బాధపెట్టే ఓ రావణుడా! **(నితరాం సాదయతి పీడయతి ఇతి నిషాదః)** రాజ్యం పోయి, వనవాసం చేస్తూ క్షీణించిన 'సీత', అనే అల్పజీవిని, చావుతో సమానమైన భర్తృవియోగ దుఃఖాన్ని కల్గించిన కారణంగా, శాశ్వత కాల కీర్తిని నీవు పొందకుండుందువుగాక! బ్రహ్మ ఇచ్చిన వంశాభివృద్ధి వరము ఫలింపకుండుగాక! **అని రావణపరంగా అర్థం.**

(4) చాల కాలంగా జీవిస్తున్న వాడివి నువ్వు. జంట నుండి మగ క్రౌంచపక్షిని కొట్టడమనేది ఏది ఉందో, ఆ పని యిక మీద వద్దు సుమా! అని ఉపదేశరూపమైన అర్థం.

(5) ఈ శ్లోకంలో ఉన్న 7 పదాల ద్వారా, 7 కాండల అర్థాన్ని ఇవ్వాస్తూ, కథా ప్రణాళికని సరస్వతి వాల్మీకికి అందించింది. అంటే, ఏ కాండ, ఏకథావస్తువుతో ఉండాలనేది దీని ద్వారా సరస్వతీదేవి తెలిపింది. వాల్మీకికి తెలిసింది.

(1) మానిషాద! - 'సీతా భర్తా' అని సంబోధనం! - బాలకాండం సీతా వివాహంతో సరి. (పరశురామగర్వభంగమున్నా సీతావివాహమే ముఖ్యం.)

(2) ప్రతిష్ఠాం త్వ మగమః - పితృవాక్పాలన విధానం - అయోధ్యా కాండ కథ ఇది.

(3) శాశ్వతీస్సమాః - ప్రతిజ్ఞాపాలనం కోసం అనేక సంవత్సరాలు వనవాసం కదా! - ఆరణ్య కాండ కథ ఇదే.

(4) క్రౌంచమిధునాత్ (క్రుంచ గతి కౌటిల్యాల్పీ భావయోః) - వంకర చరిత్ర కల్గినవీ, అల్ప బుద్ధి ఉన్న తారావాలి జంటలో వాలిని చంపడం. - కిష్కింధాకాండ కథ.

(5) ఏకమ్ - కార్య సాధకుడు 'ఒక్కడు' - సుందర కాండ కథ.

(6) అవధీః - రావణ వధ - యుద్ధకాండ కథ.

(7) కామమోహితమ్ - ఋషిపత్నులని చూడాలనే సీత మోహతత్త్వం (సీతారాముల వైకుంఠ ప్రయాణం) - ఉత్తర కాండ కథ.

రామకథని వాల్మీకి రచించి, లోకానికి అందిచ్చేనాటికి, యుద్ధ కాండతో పరిసమాప్తమైంది. కాని, సీతమ్మ ముందుగానూ, పిమ్మట తానూ, వైకుఠం చేరాలి. అందుకే రాముడు, సీతని పంపినట్లుగా పంపి, ఋషులెక్కడున్నారో ఆ ప్రాంతంలో సీతని విడిచిరమ్మని ఆజ్ఞచేసాడు. వాల్మీకి రచనానికి పూర్వం జరిగిన యుద్ధం వఱకూ అయిన భాగం పూర్వకాండ. రామాయణ రచనానికి పిమ్మట జరిగింది ఉత్తరకాండం.

గాయత్రీ మంత్ర ప్రథమాక్షరం 'త'. ఈఅక్షరంతోనే కావ్యం ప్రారంభమైంది కదా! ఉత్తర కాండతో కలిపి లెక్కిస్తేనే 24 వేల శ్లోకాలూ పూర్తి అవుతున్న కారణంగా, ఉత్తరకాండని రచించినది కూడా 'వాల్మీకే ' అని గమనించాలి.

కావ్య ప్రారంభంలోనే 'తిట్టు' లేదా 'శాపమా?' - అంటే - దానికి 5 అర్థాలున్నాయి గదా. కేవలం ఒకే అర్థమై, అది కూడా శాపమైతే దోషమనే అనవచ్చు. కావ్యం మొదట్లో, మంగళ శ్లోకం వ్రాయడం ఆచారం. (మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని చ శాస్త్రాణి ప్రథన్తే) ఇక్కడ, మానిషాద - అని (సీతాభర్త) లక్ష్మినారాయణుల వివాహం చెప్పడం, వారిని స్మరించడం, శుభమే. 'మానిషాద' అనే ఒక పదం

అర్ధనారీశ్వరులవలె, వారిద్దఱూ (సీతారాములు) వేత్వేఱు కాదని చెప్తోంది. వేదంలో 'అనుష్టుప్' శ్లోకాలుండడంవలన, వాటిని ఎప్పుడూ పారాయణం చేస్తూన్నందువలన, వాల్మీకికి ఈ 'అనుష్టుప్' శ్లోకమే నోట వెలువడింది. *(ఇది ఉత్పలమాల చంపకమాలలు లా ఒక రకమైన ఛందస్సుకి సంబంధించినది. సహస్ర శీర్షాపురుషః సహస్రాక్షః సహస్రపాత్ స బ్రహ్మ సశివస్సేంద్రః... ఇలాటివే.)* ఇలా, అప్రయత్నంగా వచ్చిన శ్లోకం, ఇన్ని అర్థాలు కల్గింది కావడమేకాక, రామాయణరచనకి నాందిగా పనికి వచ్చిందనీ, ఇలాటి సరస్వతీ కటాక్షం, తనకి లభించిందనీ, వాల్మీకికి ఆశ్చర్యం అయింది.

## ఏమని పేరు పెట్టాలి?

బ్రహ్మ సరస్వతుల అనుగ్రహం వలన 24 వేల శ్లోకాలతో, *(చతుర్వింశత్సహస్రాణి శ్లోకానా ముక్తవా నృషిః తథా సర్గశతా న్పంచ షట్కాండాని తథోత్తరమ్.)* ప్రతి వేయింటికీ ఒక్కొక్క గాయత్రీ బీజాక్షరంతో, 500 సర్గలతో ( chapters/విభాగాలు), ఆఱు పూర్వకాండలతోనూ, ఒక ఉత్తరకాండతోనూ మొత్తం 7 కాండలతో, *(ఆఱున్నొక్కటి అనే మాట ఈ కాలం నుండి వచ్చినదే.)* చదివినా, పాడినా మనోహరంగా ఉండేలా *(పాఠ్యే గేయే చ మధురమ్.)* రామకథని సిద్ధం చేసాడు వాల్మీకి. అయితే, దీనికి పేరు ఏం పెట్టాలి? అనే సంశయం ఆయనకి కల్గింది.

ఆయన పెట్టాలనుకున్న మొదటి పేరు 'దశ శిరసశ్చవధః' - అనేది. *(దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్)* 'పది తలలున్న రావణుని వధ' అని దీని అర్థం. ఇదేదో, ఎవరినో, చంపే ఇతివృత్తమున్న గ్రంథం కాని, పుణ్యం - పురుషార్థం ఇచ్చేది కాదని అహింసాపరులందఱూ భావిస్తారనీ, తన కావ్యం, అందుకోసం (రావణవధని ప్రధానంగా చెప్పాలని) పుట్టింది కాదుగదా అనీన్నీ భావించి, **ఈపేరు సరికాదని నిశ్చయించాడు.**

ఆయన పెట్టాలనుకున్న రెండవపేరు 'సీతాయాశ్చరితమ్మహత్' అనేది. *(కృత్స్నం రామాయణం కావ్యం సీతాయా శ్చరిత మ్మహత్.)* 'గొప్పదైన సీతాదేవి చరిత్రం' అని దీని అర్థం. ఇదేదో, సీతాదేవి చరిత్రని మాత్రమే చెప్పేకావ్యమనీ, రాముని చరిత్రని అసలు చెప్పదనే అర్థాన్ని ఇస్తోందనీ భావించి, తన కావ్యం, ఇద్దఱి చరిత్రనీ చెప్పేందుకు పుట్టిందిగదా! - అనే కారణంతో - **ఈ పేరూ సరికాదని నిశ్చయించాడు.**

ఈ ఆలోచనలలో, బ్రహ్మ పెట్టినపేరు స్మరణకి వచ్చింది. - 'రామాయణ కథ' - అనేది. *(తావ ద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి.)* ఈ పేరు ఆలోచిస్తూన్నకొద్దీ, అనేకార్థాలని ఈయడం ప్రారంభించింది. అంతే! ఇదే పేరు పెట్టాలని నిర్ణయించాడు. సృష్టికర్త అయిన బ్రహ్మ - పేరు పెడితే, సృష్టికర్త భార్య అయిన సరస్వతి - కవిత్వాన్ని

పలికిస్తే, బ్రహ్మమానసపుత్రుడు నారదుడు - చెప్పిన కథని, గాయత్రీ మంత్ర బీజాక్షరాలతో వాల్మీకి మహర్షి పలికాడు. ఎందటి అనుగ్రహమో తన మీద ఉంది. ఎంతటి అదృష్టశీలి వాల్మీకి!

## రామాయణమ్! - ఎన్ని అర్థాలు ఈ పదానికి?

(i) రాముని యొక్క చరిత్రం రామాయణం (రామస్య అయనమ్.)

(ii) రాముడు దేనిచేత తెలియబడతాడో అది రామాయణం. (*రామః అయ్యతే జ్ఞాయతే అనేన ఇతి.*)

(iii) రామ+అయనం (చరిత్ర) లాగా, రామా+అయనం (రామునియొక్క భార్య - రామా - ఆమెయొక్క - 'అయనం' - చరిత్ర రామా+అయనం - రామాయణం (*రామాయాః అయనమ్.*)

(iv) రాముడే అయనంగా కలవారి చరిత్రం రామాయణం. (ఈ కావ్యంలోని అన్ని పాత్రలకి (కాకి నుండి సంపాతి దాకా, త్రిజటుడి నుండి అగస్త్యుని దాకా) రాముడే ఆధారంగా ఉంటాడు. అందుకని రామాయణం. (*రామ ఏవ అయనం యేషాం తత్.*)

(v) రామునికి అయన మయినవారి చరిత్రం రామాయణం.

(రాముడు అందటికీ ఆధారమైతే, అందఱూ కూడా రామునికి ఆధారమే. మారీచుడు లేకపోతే, శూర్పణఖ రాకపోతే, జటాయువు చెప్పకపోతే, ఇలా పోతే... రావణవధే లేదుగా! అందుకని, అందఱూ కూడా రామునికి ఆధారమే. అలాటివారి చరిత్రం).

(vi) 'రామా' (వేదమాత) దేనియందు కుదురుగా ఉందో, అది రామాయణం. (*రామా వేదమాతా అయనం స్థానం యస్య సః రామాయణః తమధికృత్య కృతమ్*) వేదంచేత చెప్పబడే పరమాత్మ, దశరథ పుత్రునిగా జన్మిస్తే, వేదమే, ప్రాచేతసుడైన వాల్మీకి ద్వారా రామాయణమయింది. (*వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే - వేదః ప్రాచేతసాదాసీత్సాక్షాద్రామాయణాత్మనా.*)

(vii) పైకి, రామాయణమంటే (1) రామకథ (2) సీతాకథ (3) రావణవధ అన్పించినా లో అర్థంలో (1) బ్రహ్మకథ (2) ఆత్మకథ (3) మనోవధ దీనిభావం. ఆత్మసీత. అనేక వాంఛలతో నిండిన మనస్సే రావణుడు. ఈ మనస్సు, ఆ సీతని (ఆత్మని) ఎత్తుకు పోయాడు. అని ఆత్మని మనస్సు బలవంతపెడుతూంటే, మనస్సు నిజస్వరూపాన్ని గ్రహించి, గురువైన హనుమంతుడు, మనస్సుకి బుద్ధిచెప్పి, ఆత్మని పరమాత్మతో చేర్చడమే రామాయణం. ఇది అంతరకథ.

(viii) రామా (గాయత్రీ) మంత్రం యొక్క అయనం (తెలిసికోవడం) రామాయణం. గాయత్రీ మంత్రాన్ని చెప్పినవాడు విశ్వామిత్రుడు అయితే - ఈ రామాయణ గ్రంథంలో దశరథుని పుత్ర వ్యామోహంనుండి రామలక్ష్మణులని తెచ్చినవాడు విశ్వామిత్రుడు.

గాయత్రీ మంత్రానికి అధిష్ఠానదేవత సూర్యమండలంలోని విష్ణువైతే, రామాయణ కథా నాయకుడు సూర్యవంశంలోని వాడైన రాముడు.

గాయత్రీ మంత్రాక్షరాలు 24 అయితే, రామాయణంలోని శ్లోకాలు 24,000.

గాయత్రీ మంత్రం త్రిపద (మూడు పాదాలు కలిగినది). అయితే, రామాయణం కూడ అయోధ్య - దండక - లంక అనే త్రి పదాలలోనే (ప్రదేశాలలోనే) జరిగింది.

గాయత్రీ మంత్రం షట్కుక్షి (ఆఱుగురు దేవతలని తనలో ఇముడ్చుకున్న మంత్రం) అయితే, రామాయణం కూడా సీతా - రామ - లక్ష్మణ - భరత - శత్రుఘ్న - ఆంజనేయ - అనే ఆఱుగురినీ తనలో ఇముడ్చు కుని, ఇదీ షట్కుక్షియే. (చాల చెప్పవలసి ఉన్నా, గ్రంథం పెరుగుతుందనే భయం వెన్నాడుతోంది).

(ix) రాముని యొక్క అయనం (దక్షిణదిక్ లంకకు ప్రయాణం) అలాగే రామా (సీతయొక్క ) అయనం (దక్షిణదిక్ (లంకకు) ప్రయాణం గూర్చి చెప్పేది రామాయణం. ముందు రామా+అయనం సాగితే (అంటే సీతమ్మ లంకకి వెడితే) ఆ మీదట రామ+అయనం (రావణవధ నిమిత్తం) సాగింది.

(x) రాముని పరంగా ఒకసారి, రామా (సీత) పరంగా ఒకసారి, రామయోః (సీతారాముల అన్యోన్యత) పరంగా ఒకసారి, చదవాలి కాబట్టి రామాయణం.

## వాల్మీకి ఆత్మ పరీక్షలు

ఇంతటి మహార్థం కల రామాయణాన్ని వ్రాసినా, లోకానికి ఎలా ప్రచారం చేయాలా? అనే సంశయం వాల్మీకికి కల్గింది. మేధావీ, వేదాలలో పరిపూర్ణ జ్ఞానం కలవాడూ, సంగీత సాహిత్య జ్ఞానం ఉన్న వాడూ మాత్రమే, దీన్ని అర్థం చేసికోగలడు. ప్రచారం చేయగలడు. అలాటి వారెవరున్నారా? అని, వాల్మీకి కన్నులు మూసికొని తపస్సమాధిలోనికి వెళ్లిపోయాడు.

తన పాదాలని ఎవరో స్పృశింపగా, కన్నులు తెఱచాడు మహర్షి. (సతు మేధావినౌ దృష్ట్వా వేదేషు పరినిష్ఠితౌ - వేదోప బృంహణార్థాయ తావగ్రాహయత ప్రభుః.) తాను

భావించిన సర్వలక్షణాలూ కల వాళ్లుగా కుశీలవులు,(లవకుశులు) తనకు నమస్కరిస్తున్నారు. రామకథని - రామపుత్రుల ద్వారా - రామభక్తుడు వాల్మీకి - రాముణ్ణి ఆదరించే ప్రజలకి విన్పించాలని భావించాడు. వాల్మీకి హృదయాన్ని గమనించిన పరమాత్మ, తన పిల్లలని అలా పంపాడు. అడుగకుండానే వాళ్లు, తామే ప్రచారం చేస్తామని చెప్పగా, అప్పటికే వారికి రామాయణం వాచోవిధేయం (నోటికి వచ్చింది) అయిందన్నారు.

**మొదటి సారి చదివి విన్పించారు. వాల్మీకి శరీరం గగుర్పొడిచింది.**

**తర్వాత పాడి చూపించారు. ఆనందబాష్పాలు కల్గాయి వాల్మీకికి.**

**ఆ మీదట పాడుతూ, ఆడి చూపించారు. మహర్షి తన శరీరాన్ని మఱచిపోయాడు.**

**పాడుతూ, ఆడుతూ, పరవశిస్తూ విన్పించారు. వాల్మీకికి భగవద్దర్శనమైంది.**

ఆశ్రమంలోని వారంతా నిశ్చేష్టులై విన్నారు. తన కావ్యం మీద తనకి నమ్మకం కల్గింది. అయినా, మన ఆశ్రమవాసులు కదా! - అనుకొని, ఇతర దేశ మహర్షులు వచ్చినపుడు విన్పించాడు. 'ఎప్పుడో జరిగిన రామకథని కన్నులారా, చెవులారా, కంటూ వింటున్నాం' అని ఎన్నోమార్లు ముక్త కంఠంతో అంతా అన్నారు. అంతేకాదు. బహుమతులని కుశీలవులకియడం ప్రారంభించారు.

**విలువైన బహుమతి**

**కశ్చి త్కమండలుం ప్రాదా ద్వల్కలమథాపరః—**

**ఔదుంబరీం బ్రుసీ మన్యో జపమాలా మథాపరః ।**

**బ్రుసీ మన్య స్తదా ప్రాదా త్కౌపీన మపరో మునిః ।** రామాయణగానానికి పరమసంతోషపడిన మహర్షులూ, సాధుపుంగవులూ -కమండలాలనీ, కొందఱు యజ్ఞోపవీతాలనీ, అలాగే పులి చర్మాలనీ, జపమాలలనీ, గోచీలనీ బహుమతులుగా ఇచ్చారు. (రామకథవిని ఊరికే పోరాదని వారి భావం). అయితే ఇలాంటి బహుమతులా? గోచీ కూడా ఒక బహుమతేనా? అన్పిస్తుంది ఈ కాలపు వారికి. దీన్ని వ్రాసిన వాల్మీకి, ఎందుకు వ్రాసి ఉంటాడని ఆలోచించాలి.

మహర్షులకి అతి ముఖ్యమైనవి కమండలువు - గోచి, పులిచర్మం - ఇలాటివే. కుశీలవులు మహర్షిపుత్రులే అని వారిభావం. మహర్షులైన తమకి ఏవి ముఖ్యమో, కుశీలవులకీ అవేగా కావలసినవి. అందుకని, అలాటి బహుమతుల నిచ్చారు. ఉన్నవే పులిచర్మం - కౌపీనమైతే, వాటినే యిచ్చారంటే, సర్వస్వదానం చేసినట్టన్నమాట.

ఇక -'**ఆయుష్య మపరే ప్రాహు ర్ముదా తత్ర మహర్షయః**' - ఇవ్వడానికి ఏమీ లేనివారు (అవధూతలు - దిగంబరులు) కొందఱున్నారు. సర్వ సంగపరిత్యాగం చేసారు వాళ్లు.

అందుకని, వాళ్ళు రెండు చేతులనూ ఎత్తి, తపశ్శక్తితో 'దీర్ఘాయుష్య మస్తు' అని దీవించారు. మహర్షులకి ధనం ప్రధానం కాదు. తపస్సే వారి ధనం. అందుకే తపోధనులు వాళ్లు. అలాటి తపశ్శక్తితో దీవన నిచ్చారు. ఈ దీవన, అన్నిటి కంటె విలువైన **బహుమతి.**

శాశ్వత కాలం ఈ రామాయణగానం సాగాలనీ, రాముడు ఈ చిన్నారుల హృదయంలోని 'గుడి'లో ఉండి, శ్రోతల మనస్సు ఆ గుడి చుట్టూ పరిభ్రమించి, దర్శించాలనీ వారి దీవన. లోకంలో ఎన్నో-ఎందఱో జీవిస్తున్నారు. దైవచింతనలో తాను సంతోషపడుతూ, పదిమందిని సంతోషపెడుతూ ఇతడు పదికాలాలు బ్రదికి ఇలా రామాయణ ప్రచారం చేయాలి' అని, అందఱి చేతా అన్పించుకోవడం కంటె, జీవితానికి నిజమైన అదృష్టం మఱేమిటి? అది కుశీలవుల్ని వరించింది. పుష్టినీ - తుష్టినీ - ఆయుష్యాన్నీ ఇచ్చే రామాయణగానాన్ని, చిరకాలం చేయవలసిందని మహర్షులు వారిని దీవించి వెళ్లి పోయారు.

'రామాయణ కథా నాయకుడైన రామునికే విన్పిస్తే, ఇందులోని సత్యాసత్యాలు బయట పడతాయి - రాముని మీది భక్తితో, ఎక్కువగాని, తెలియక తక్కువగాని, వ్రాసి ఉండవచ్చు - ముందు కాలం వారు చదివి, ఆచరించబోయే గ్రంథం కదా ఇది - అనే భయం కల్గింది వాల్మీకికి. ఏ విషయమైనా వ్రాయడం అంటే అంతగా ఆలోచించేవారు. మన వ్రాత, పదిమందిని చెడగొట్టేదీ, ఉద్రేక పఱచేదిగా ఉండరాదని నాటివారి భావం. (త్రోవలు కొట్టేవాణ్ణి కూడా రామాయణం రచించేంత ఎత్తుకి తీసుకు పోగల విధానాన్ని చెప్పేది అలనాటి రామాయణేతిహాసం. మర్యాదగా ఉండే వాణ్ణి కూడా, నేరం చేయించేంతగా దిగజార్చే విధానం, నేటి పిచ్చి పుస్తకాలదీ - కొన్ని పిచ్చి నవలలదీ, -చిత్రాలదీను. ఏది చదివితే, దాని ప్రభావం వ్యక్తి మీద ఉంటుంది. అందుకని, వ్రాస్తున్న వాల్మీకి ఇలా భయపడడం, లోకాన్ని సత్పురుషులతో నింపాలనే తాపత్రయం కోసమన్న మాట).

రాముడు అశ్వమేధ యాగం చేస్తూండగా, రామునికే విన్పించే అవకాశం వాల్మీకికి చిక్కింది. అప్పటికి సీత, వాల్మీకి ఆశ్రమంలో ఉంది. కుశీలవులచేత చేయబడిన రామాయణగానం విని, ఆనంద పరవశుడైన రాముడు (సత్యం సత్యం సత్యమితి) యథార్థంగా ఉందని పల్కి, అయోధ్యకి రమ్మని ఆహ్వానించాడు వారిని.

'ఇది తన కథే కాబట్టి నిజంగా ఉందని తాను (రాముడు) పలికాడని ఎవరైనా భావించ వచ్చు - లేదా - నిజమూ కావచ్చు. అందుచేత దీనిని అయోధ్యాజనం ఆదరిస్తే, అది సరియైనదని భావించవచ్చునని రాముడు భావించాడు'. రామాయణ

కథా నాయకుడైన రాముడే, వాల్మీకి రచనని ఆమోదించాడనగానే, వాల్మీకి, పరమానంద భరితుడై అయోధ్యకు వెళ్ల నిశ్చయించాడు.

వాల్మీకి కనుసన్నకాగానే, రాముడు లేచి, 'సభాసదులారా!' ఈబాలురు ముని లక్షణాలు కలవారైనా, రాజపుత్రుల్లా ఉన్నారు. గాయకులుగా కన్పిస్తూన్నా, తాపస శ్రేష్ఠులుగా ఉన్నారు. వీరు మనకి సీతా చరిత్రని చెప్పబోతున్నారు. శ్రద్ధతో వినండి' అని పలికాడు.

ఎదురుగా ఉన్న ఆసనాలలోంచి, అయోధ్యా జనం సముద్రంలా గోచరిస్తున్నారు. **రామాయణకథ జరిగి నప్పుడు ఉన్నవాడూ – నేడు లేని వాడూ – దశరథుడొక్కడే.**

వేదిక మీద కుశీలవులు నిలబడి ఉన్నారు. తలపై నారతో కట్టిన జడలు. విశాల మైన నుదురు. శ్రీకారాలవంటి చెవులు. పాండిత్యమూ, తపఃకాంతీ వెదజల్లుతూ, రాముని పోలిన ముఖాలు. కంఠంలో అక్షమాలలు. భుజాలకి మరో విధం అక్షమాలలు. భుజంపై నార ఉత్తరీయాలు. మెడలో వ్రేలాడుతున్న వీణలు. చేతులో శ్రుతికోసం చిడతలు కలిగి ఉన్నారు. చూడగానే అందరికీ ఆనందమైంది.

గురువు వాల్మీకికి నమస్కరించాక, కుశీలవుల పాదాలు, అభినయం చేయ ప్రారంభించాయి. ఒక చేయి, తాళాన్ని వేయసాగింది. మఱోచేయి వీణ మీట నారంభించింది. గొంతులు కలిపి రామాయణ కథాగానం ఆరంభమైంది. సభ అంతా నిశ్శబ్దమయమైంది.

రాముడు ఆ ఆసనం నుండి లేచి, సభా సదుల్లోకి వచ్చి కూర్చున్నాడు. కుశీలవులు ఇలా పాడసాగారు.



# శ్రీ మద్రామాయణ కథ

## అయోధ్య ఎలా ఉంది?

వాల్మీకి మహర్షులవారు వ్రాసిన ప్రకారం పాడుతున్నాం. శ్రద్ధగా వినండి. రాజులందరిలో ఇక్ష్వాకు రాజవంశం గట్టిది. ఎందరెందరో పరిపాలిస్తూ వచ్చిన ఆ వంశంలో, సగర పుత్రుల ద్వారానే సాగరం (సముద్రం) ఏర్పడింది. ఆ వంశంలోని వాడు **రాముడు.** ఆయన కథే **రామాయణం.**

సరయూ నదీతీరంలో ఉన్న కోసల దేశానికి రాజధాని అయోధ్య. 12 యోజనాల పొడుగు, 3 యోజనాల వెడల్పులతో, సమప్రదేశంలో వైవస్వతమనువు, ఆ నగరాన్ని కట్టాడు. దశరథ మందిరానికి 4 దిక్కులా నాల్గు వీథులూ, 4 అయి మూలలా (దిక్కు దిక్కు మధ్యా మరోవీథీ) నాల్గు వీథులూ ఉండి, ఏ వీథిన వెళ్లినా, మహారాజ మందిరం వస్తుంది.

అన్నిమార్గాల చివరా పెద్ద ప్రాకారం. ప్రాకారం వెనుక శత్రువులు దాటి రా వీలులేని లోతైన నీటితో అగడ్త దానిలో భయంకర జల చరాలు ఉంటాయి. ప్రాకారపు బురుజుల పై జయపతాకలు ఎప్పుడూ ఎగురుతూనే ఉంటాయి. దేవాలయ ఘంటలూ,వీణలూ, మృదంగాలూ, గజఘీంకారాలూ, వేద ధ్వానాలూ అక్కడ విన్పిస్తూనే ఉంటాయి.

ఏ దోషమూ ఉండరాని విధంగా, ఏ జాతికీ బాధ కల్గని విధంగా, ఏ ప్రజలకీ దుఃఖం లేని విధంగా, నగరం నిర్మింపబడింది.

సామాన్య వస్తువు నుండి, విలువైన వజ్రం వరకూ లభిస్తుంది. బాలుని నుండి వృద్ధుని వరకూ చక్కగా తగిన మర్యాదతో పల్కరించుకుంటారు.

తల్లీ, తండ్రీ, ఇద్దరు కోడళ్లూ, ఇద్దరు పుత్రులూ, కూతురూ, భార్య, తానూ, అతిథితో ఏ యింటనైనా పది మంది ఉంటారు. (మాతా పితా స్నుషే పుత్రౌ పుత్రీ పత్న్యతిథి స్స్వయం – దశసంఖ్య కుటుంబీతి విజ్ఞనోక్తం ద్విజోత్తమ). అతిథి లేక భోజనం చేయరు.

ఉమ్మడిగా సర్వ సమృద్ధంగా, సుభిక్షంగా, ఉన్న రాజ్యానికి ఎనమండుగురు. మంత్రులు సుమంత్రుడు అంతరంగికుడు. అంతఃపుర ప్రవేశాధికారమూ ఆయన కుంది. వశిష్ఠవామ దేవులిద్దరే పురోహితులు.

## "సంతానం కోసం 'అశ్వ మేధం' చేస్తాను"

ఎన్ని భోగాలో ఉన్న దశరథునికి, సంతానం లేదనే దుఃఖం తీవ్రం కాసాగింది. ఇక్ష్వాకు వంశం, దశరథుడనేవానితో ఆగిపోయిందనే అపకీర్తి, తనకు రారాదని భావించాడు. సజ్జనులతో నిండిన అయోధ్యకి, యోగ్యుడైన రాజునీయకుండానే, దశరథుడు కాలం చేసాడనే నింద, తనపై పడకూడదని కూడ ఆలోచించాడు. మంత్రుల్నీ, పురోహితులనీ పిలిచాడు.

**మమ లాలప్య మానస్య సుతార్థం నాస్తి వై సుఖమ్**
**తదర్థం హయమేధేన యక్ష్యామీతి మతిర్మమ॥ (8/8)**

అందఱూ నిండిన సభలో దశరథుడిలా అన్నాడు – 'ఓ! మంత్రి పురోహితులారా! సంతానం లేని దుఃఖం నన్ను బాగా పీడిస్తోంది. (అంటూ తన దుఃఖాన్ని వివరించి) దానికై అశ్వమేధయాగాన్ని చేయదలిచాను' – అని.

ఆనందపడి, అంగీకరించి, ఆమోదించిన మంత్రి పురోహితుల వాక్యాలనీ, ఆశీర్వచనాలనీ స్వీకరించి, 'తప్పక పుత్రుడు కల్గుతారనే మీ ఆశీర్వచనం , చెప్పలేని ఆనందాన్ని కల్గిస్తోంది. ముందుగా సరయూ నదికి ఉత్తరంగా యజ్ఞవేదికని ఏర్పాటు చేద్దాం. పిదట అశ్వాన్ని విడుద్దాం. మీరంతా ఉన్నారనీ, నన్ను రక్షిస్తారనీ, భారం మీ మీద ఉంచి, యాగానికి దిగుతున్నాను. అందుకై మిమ్మల్ని పిలిచాను. ఏయే ఏర్పాట్లు కావాలో అన్నీ సశాస్త్రీయంగా చేయండి' అని ముగించాడు దశరథుడు. అందఱూ కర్తవ్య పరాయణులై వెళ్ళిపోయారు.

అశ్వమేధం చాల కష్టమైనది. ప్రతి రాజూ చేయలేడు. ప్రారంభించి నడుమ ఆపినా, ఏ కారణం వల్ల ఆగినా, దేశానికి అరిష్టం కల్గిస్తుంది ఈ యాగం. మిగిలిన యాగాలకైతే, ఇంద్రుడు సహాయపడతాడు. అశ్వమేధానికి, బ్రహ్మ రాక్షసులు కావాలని అడ్డు తగులుతూంటారు. ఏ కొంచెం లోపం జరిగినా, ధ్వంసం చేయాలని వారిఆలోచనం.

అదీకాక, రాజులందఱి వద్దకూ అశ్వం వెడుతుంది. దానితో వారిలో భక్తికంటె, విరోధ బుద్ధి పెరుగుతుంది. ఆ అశ్వాన్ని కట్టివేయక పోతే, చిక్కులేదు. కట్టివేస్తే, యుద్ధానికే సిద్ధం కావాలి. అన్నిటికీ మించి, యాగం జరిగినంత కాలం నియమంతో ఉండాలి. యుద్ధానికి సిద్ధంగానూ ఉండాలి. ఒక ప్రక్క యుద్ధానికి ఇంద్రియ ప్రకోపం కావాలి. యాగం చేయడానికి ఇంద్రియ నిగ్రహమూ కావాలి. కత్తి అంచు మీద నడవడం వంటి పని యిది. దేశానికి రాజుని తేవాలని ప్రయత్నిస్తూన్న దశరథుని వల్ల, ఏదైనా దోషం, యాగకాలంలో జరిగితే, యజ్ఞకర్త అయిన తానే ఉండకపోయే (మరణించే) ప్రమాదం ఉంది. ఈ యాగం అంతటి శక్తి వంతమైనది.

## అశ్వమేధం వల్ల సంతానం కలుగుతుందా?

కలగనే కలగదు. అశ్వమేధం అనేది, కేవలం క్షత్రియుడు చేయదగిన యజ్ఞం. సార్వభౌముడూ - అనేక సామంతులు తన వశంలో ఉన్నవాడూ - మాత్రమే చేయదగినది. 'యాగం' అనగానే బ్రాహ్మణులు మాత్రమే చేయదగ్గదనే అపోహ, లోకంలో ఉంది. అది సరికాదు. ఈ యాగానికి 'రాజయజ్ఞం' అనే పేరు కూడ ఉంది. మఱి, అశ్వమేధం వల్ల పుత్రులు కలిగే అవకాశం లేకపోతే, ఆయన ఎలా చేస్తానన్నాడు? ఆమోదించిన పురోహితులు ఎందుకు చెప్పలేదు?

సంతానం దీనివల్ల కలుగదని రాజుకీ, పురోహితులకీ కూడా తెలుసు. ప్రాచీన ఇతిహాసాలలో ఉండే చిత్రం ఇదే. ఆలోచిస్తే కాని, ఏ విషయమూ అంతు బట్టకుండా ఉండేలా వ్రాస్తారు.

సంతానం లేకపోవడం, ఈ జన్మ - లేదా - పూర్వజన్మలో చేసిన ప్రబల పాపానికి సాక్ష్యం. ఆ విషయం దశరథుణ్ణి ఆలోచింపచేసింది.

అప్పుడు గుర్తుకి వచ్చింది.

దశరథుడు కుమారుడుగా ఉన్నప్పుడు 'శబ్దవేధి' విద్యని నేర్చుకుంటున్నాడు.

ఏ దిక్కున చప్పుడు వినిపిస్తే, ఆ దిక్కుకి బాణం వేసి కొట్టడం 'శబ్దవేధి' అంటే. ఒక ముని పుత్రుడు, ఒకనాటి అర్ధరాత్రి భాగంలో, సరయూనదిలో కుండతో నీటిని ముంచుతూంటే, దాన్ని విని, ఏనుగు నీరు తాగుతున్న చప్పుడుగా భావించి, దూరం నుండి బాణంతో దశరథుడు కొట్టాడు. మునిపుత్రుడు మరణించాడు. ఈ విషయాన్ని దశరథుడు చెప్పగా విన్న, అతని తండ్రియైన వృద్ధతాపసుడు ఆ రోజున దశరథునితో-

**'అజ్ఞానాత్తు హతో యస్మాత్ క్షత్రియేణ త్వయా మునిః**

**తస్మాత్త్వాం నావిశత్యాశు బ్రహ్మహత్యా నరాధిప' (అయోధ్య 64/56).**

'ఓ! రాజా! తెలియక నువ్వు చంపినప్పటికీ, బ్రహ్మహత్యా దోషం వచ్చినట్లే. దేశమేలే రాజువీ, చంపాలని చంపని వాడివీ కాబట్టి, 'ఈ దోషం' వెంటనే నీకు పట్టదు' అన్నాడు.

'చేసిన పాపం చెపితే పోతుంది' అనే మాట లోకంలో ఉంది. అంటే, 'నలుగురిలో చెప్పుకోగలిగేదిగా ఉండాలి చేసే పని' అని అర్థం. పిల్లవాణ్ణి సరైన త్రోవలో పెట్టేందుకూ, లేదా దొంగని పట్టుకొనేందుకూ, కొన్ని అబద్ధాలాడవలసి వస్తుంది. ఇవి ఎవరికీ హానిని కల్గించేవి కాదు సరికదా, 'ఇలా చేసాను' అని చెప్తే నలుగురూ హర్షించి, 'చక్కటి పనిచేసావని' ప్రశంసిస్తారు కూడ. ఇవీ 'చెప్పగలిగే - చేసిన పాపాలు' అంటే.

దశరథుడు చేసిన పాపం ఇలాటిది కాదు. తెలియక చేసిన పాపమే. అయినా, దోషం వెంటనే రాదని తాపసుడన్నాడు. 'ఫలానివాడు ఇన్ని పాపాలని చేసినా, వాడికేమీ కాలేదు' అని, లోకంలో చాల మంది భావిస్తూంటారు. అది వెంటనే ఫలించదు. అలాటిదే దశరథునితో పలికిన మాట కూడ. ఈ సంఘటన జరిగాక, దశరథునికి రాజ్యం వచ్చింది కూడ.

'ఏం చేస్తేనేం? రాజ్యం వచ్చిందిగా! పాపంలేదుగా!' అని తెలియని వాళ్లు అనుకుంటారు. కాని, శపించబడిన దశరథునికి మాత్రం తెలుసు - 'తాను తప్పు చేసాననీ - ఆ కారణం చేత శపింపబడ్డాననీ.'

చేసిన తప్పు, ఎప్పుడూ కష్టకాలంలోనే గుర్తుకు వస్తుంది. ముగ్గురు భార్యలున్నా సంతానం లేకపోవడం - అనే కష్టం - చేసిన దోషాన్ని గుర్తుకి తెచ్చింది. ఈ నేరం గుర్తుకు వచ్చి, ఇలాటి దోషం నాకు సంతానం కలగడానికి అడ్డుగా ఉంది కాబట్టి, దీన్ని ముందు తొలగించుకొని, ఆమీదట పుత్రులు పుట్టేందుకు యాగం చేయాలని సంకల్పించాడు దశరథుడు.

అశ్వమేధం వలన పుత్రులు కలగరని బాగా తెలుసు కాబట్టే,ఋశ్యశృంగునితో దశరథుడు 'కులం వృద్ధి పొందే యాగం చేయించు' ('కులస్య వర్ధనం త్వం తు కర్తు మర్హసి 'సువ్రత!') అని ప్రార్థించాడు. కులవృద్ధి అశ్వమేధం వల్ల కలక్కపోతే, మఱి అశ్వమేధం ఎందుకు? అంటే, ఆ సంతానం కలగడానికైన అడ్డు తొలగించు కొనేందుకు. ఈఅడ్డు తొలగకపోతే ప్రయోజనం లేదు కాబట్టే, పిల్లలు తప్పక కలిగే పుత్రకామేష్టిని, ముందే చేయలేదు.

దశరథుడెన్ని దానాలు చేయలేదు? ఎన్ని ప్రజోపయోగ కార్యాలు ధర్మబద్ధంగా చేయలేదు? - అయినా - ఈ మునికుమారుని చంపిన కారణంగా కలిగిన బ్రహ్మ హత్యా పాపం అడ్డుగా ఉండి, సంతానం లేనివాణ్ణిగా చేసి,'ఆ అడ్డు తీర్చుకో'మని సూచించింది. అశ్వమేధం అన్నిపాపాలనీ, బ్రహ్మహత్యా దోషాన్నీ, ప్రాయశ్చిత్తం లేని దోషాలనీ కూడ తొలగిస్తుంది. అంతేకాక, రాజులకి సర్వ లాభాలనీ కలుగచేసేదీ, కోర్కెలని తీర్చేదీను. *(సర్వం పాప్మానం తరతి, తరతి బ్రహ్మహత్యాం యోఽశ్వమేధేన యజతే - సర్వస్యా ప్త్యై, సర్వస్య జిత్యై, సర్వమేవ తేనాప్నోతి సర్వం జయతి (కృష్ణయజుర్వేదం).*

మఱి, ఈయుగంలో, ఆనాటి అశ్వమేధంలా, అడ్డు తొలగించేది ఏదీ లేదేమో అనిపిస్తుంది. కాని బీజాక్షరాలతోనూ, మంత్ర శక్తితోనూ,తపోదీక్షతోనూ వ్రాయబడిన శ్రీమద్రామాయణం (విశేషించి సుందర కాండం),లేదా మహాభారత భాగవతాలని, - 'అడ్డు తొలగిందని అనిపించేంత వఱకూ' - ప్రతిదినమూ కొంత సమయం చొప్పున, పారాయణం చేయడమే. ఆ మహర్షులు వ్రాసినది కూడా, ఇలా లోకోపద్రవాలని నివారించి ఉద్ధరించేందుకే.

## దశరథుని చెవిలో, సుమంత్రుని రహస్యం

అంతఃపురంలోకి కూడా ప్రవేశించగలిగే అధికారం ఉన్న అంతరంగికుడైన మంత్రి సుమంత్రుడు. మంత్రిపురోహితులంతా వెళ్లాక, ఏకాంతంగా ఉన్న దశరథుణ్ణి సమీపించి, నమస్కరించాడు.

'రాజా! జరిగేదీ - జరుగబోయేదీ - జరుగుతున్నదీ కూడా చెప్పగల సనత్కుమారులవారు, ఒకప్పుడు, మీకు సంతానం గూర్చి చెప్తూండగా, కొంత విన్నాను. చిత్తగించండి'.

కాశ్యపమహర్షికి విభండకుడూ, ఆయనకు ఋశ్యశృంగుడూ అనేవారు పుత్రులుగా జన్మిస్తారు. ఋశ్య శృంగునికి లోకంతో పరిచయం ఉండదు. అదేకాలంలో అంగ దేశరాజు రోమపాదుడు, సరియైన పరిపాలన చేయక, అధర్మపరుడు కాగా,వర్షాలు లేక కఱవు ఏర్పడుతుంది. ఋశ్యశృంగుడనే మహర్షిని తమ దేశానికి పిలిస్తే, ఆయన పాదం పెట్టిన మరుక్షణం,దేశం సస్యశ్యామలమౌతుందని మంత్రి పురోహితులంతా చెప్తారు. మంత్రి పురోహితులంతా పన్నిన ఉపాయం ప్రకారం - ఎవరు పిలిచినా తపస్సు వీడిరాని ఋశ్యశృంగుడు - వేశ్యా స్త్రీల వెంట అంగదేశానికి వస్తాడు. వేశ్యాంగనల మీద ప్రేమతో కాదు వచ్చేది. వీరెవరో చిత్రమైన జాతిలా ఉన్నారనుకుంటూ, స్త్రీ ముఖం ఎఱుగని ఋశ్యశృంగుడు రావడంతోనే, వర్షాలు కురుస్తాయి - అని చెప్పగా విన్నాను.

అదంతా నిజమైంది.

ఇప్పుడా ఋశ్యశృంగుడు రోమపాదుని కూతురు శాంతతో, సుఖంగా వివాహితుడై అంతఃపురంలో అంగదేశంలోనే ఉన్నాడు.

ఇక, మీ గుఱించి కూడా సనత్కుమారులవారు చెప్పారు. సావధానులై వినండి.

దశరథుడనే రాజు పుడతాడు. సంతాన దుఃఖంతో కుమిలి పోతాడు. అంగదేశపు రాజు రోమపాదుని వద్దకు వెళ్లి,శాంతా ఋశ్యశృంగులని ప్రార్థిస్తాడు. కారణం,ఋశ్యశృంగుడు తప్ప, సంతాన లాభం కోసం చేసే యాగాన్ని మఱొకరు చేయింపలేరని- శాంత లేక ఋశ్యశృంగుడు రాడనీను. దశరథ ప్రార్థనపై వారు వచ్చి, యాగం నిర్వహింపచేస్తారు. ఆ మీదట మఱొక్క యాగం 'పుత్రులకోసమే' చేస్తారు. దానితో దశరథునకు నల్గురు పిల్లలు కలుగుతారు. వారు అమిత పరాక్రమవంతులూ, కీర్తిమంతులూఔతారు - అని, 'కృతయుగంలో చెప్తూండగా విన్నాను. పుత్రులకోసం పరితపిస్తూన్న మీరు, వారిని పిలిచి యాగారంభం చేయడం మంచిది' - అని సుమంత్రుడు ముగించాడు. దశరథుని ప్రశ్నపై, వశిష్ఠుడు దీనినామోదించాడు కూడ.

సుమంత్రుడు చెప్పిన ప్రకారం, శాంతా ఋశ్యశృంగులని ఆహ్వానించి, ఆస్థానానికీ, పిమ్మట అంతఃపురానికీ తెచ్చి, యజ్ఞం చేయవలసిన వసంతకాలం కోసం, ఎదురుచూస్తూ దశరథుడు ఉండిపోయాడు.

## సుమంత్రుడు, ముందే ఎందుకు చెప్పలేదు?

తనకు తానుగా అశ్వమేధయాగం చేయదలిచానని దశరథుడనేంత వఱకూ కూడా మౌనంగా ఉన్న సుమంత్రుడు, ఇప్పుడే ఎందుకు చెప్పాడు? తెలిస్తే ముందే చెప్పాలిగా! అంతరంగికుడైతే ఇలాగేనా ఉండేది! అనిపిస్తుంది. లోకంలో అంతా అయ్యాక, 'మాకు ముందే తెలుసు' అంటుంటారు కొందఱు. అలాటివాడా సుమంత్రుడు!- కానేకాదు.

'నా పృష్టః కస్యచిద్ బ్రూయాత్' అని ఒక వాక్యం. అడక్కుండా ఎవరికీ సూచనలు (సలహాలు) ఇయ్యరాదని దీని భావం. సనత్కుమారులవారు చెప్పింది కృతయుగంలో. అంటే, ధర్మం 4 పాదాలా నడిచే కాలంలో. విన్నది సుమంత్రుడు మాత్రమే. తాను విన్నది తప్పక జరిగితీరుతుందనే అచంచల విశ్వాసం సుమంత్రునికి ఉంది. అంగదేశంలో కఱవు రావడమూ, ఋశ్యశృంగుడు రావడమూ, శాంతా ఋశ్యశృంగుల వివాహం కావడమూ, అంతా నిజమైనప్పుడు, దశరథునికి పిల్లలు లేక పోవడం కూడా ప్రత్యక్షంగా కన్పిస్తూన్నప్పుడు - ఇక మిగిలింది మాత్రం జరుగదా? - అనుకొన్నాడు.

అనుకున్నట్టుగానే 'అశ్వమేధయాగబుద్ధి' కల్గింది దశరథునికి. ఆయనకు ఆయనగా, ఒక సమావేశం చేసి సంతానంలేదని మరీ దుఃఖపడ్డాడు. ఆయన కాయన అడుగుతున్నాడు కాబట్టి, చెప్పక తప్పదనీ, చెప్పకపోవడం అధర్మమనీ భావించి, సనత్కుమారుడు చెప్పిందాన్ని సుమంత్రుడు ఇప్పుడు చెప్పాడు.

అంతరంగికుడూ, దశరథుని క్షేమాన్ని కోరేవాడూ కాబట్టే, ఈ ఆలోచన కల్గిన దశరథునికి ప్రోత్సాహకరంగా ఉండేలా, ('భవిష్యంతి సుతా రాజన్ చత్వార స్తే కులోద్వహాః') - వంశవృద్ధి కరులూ, కీర్తిమంతులూ నల్గురు పుడతారని, రాబోయే దాన్ని కూడా చెప్పాడు. ఎప్పుడైనా, ఎదుటివ్యక్తికి శ్రద్ధపుట్టినపుడూ, చెప్పమని అడిగినప్పుడూ, చెప్పే దానికీ-మనకు మనంగా వానికి విన్పించేదానికీ, చాల తేడా ఉంటుంది.

అంతదాకా ఎందుకు? పిల్లలున్న ఎవ్వరికైనా, దశరథుని దుఃఖం, చాలా విసుగుగా అన్పిస్తుంది. అంత దుఃఖించాలా? అన్పిస్తుంది. అయితే, ఆ దుఃఖం దశరథునికీ, అలాటి బాధ పడేవారికీ తెల్సు. ఆయనకు ఆప్తుడైన సుమంత్రునికి తెలుసు. ఆ సుమంత్రుని

క్కూడా, ఇదే సరైన సమయమనీ తెలుసు. అయినా, మనకి అర్థం కాలేదంటే, మనమా స్థాయిలో ఆలోచించడం లేదన్నమాటే.

## దశరథుని అశ్వమేధం

సరయూ నదికి ఉత్తరంగా యజ్ఞశాల కట్టాక, విడువబడిన అశ్వం, సంవత్సరకాలానికి, ఏ అభ్యంతరాలూ లేకుండా, పంపినది పంపినట్లుగానే వచ్చింది. యాగం ప్రారంభించ వచ్చునని వశిష్ఠాది మహర్షులు చెప్పారు.

దేశ విదేశ రాజులు అందరికీ ఆహ్వానాలు వెళ్లాయి. మిథిలాధిపతి జనకుణ్ణీ, దశరథుని మామ కేకయరాజు (కైక తండ్రి) నీ, అంగాధిపతి రోమపాదుణ్ణీ (దశరథునకు పెంపుడుగా వచ్చిన కూతురు శాంత. ఆమెని రోమపాదునకు ఇస్తే, ఆయన పెళ్లి చేసాడు. శాంతకు తండ్రి దశరథ రోమపాదు లిద్దఱూకాదు). కోసలాధిపతి భానుమంతుణ్ణీ (కౌసల్య తండ్రి), మగధాధీశ్వరుణ్ణీ (సుమిత్ర తండ్రి) మాత్రమే స్వయంగా తోడి తెమ్మని, సుమంత్రునికి ఆజ్ఞచేసాడు దశరథుడు.

వచ్చే వారందఱికీ, రోజులలోనే చక్కని భవనాలు సిద్ధమయ్యాయి. ఎవరెవరి స్థాయికి తగినట్లు, వారివారికి భవనాలూ, అందఱికీ సరిపోయేలా గజ-అశ్వ- ఆయుధ-శయ్యాశాలలూ ఏర్పాటయ్యాయి. సకల కులాలవారూ యజ్ఞానికి పిలువబడ్డారు. **ఆహ్వానం అందని వాళ్లు ఎలా లేరో, అలాగే పిలువబడి రానివారూ లేరు.**

దశరథుడు తన ముగ్గురు భార్యలతోనూ యజ్ఞశాలలో కన్పిస్తున్నాడు. చూడగానే శేషంగా ఆకర్షిస్తూన్నవి - ముందుగా నిలబెట్టబడిన యూపస్తంభాలు. 3 వరుసలలో ఒకదాని వెనుక ఒకటిగా, వరసకి 7 చొప్పున, ఒక్కొక్కటీ 21 మూరలకి 21 పిడులు తక్కువగా (మణికట్టు నుండి వ్రేళ్ల చివరి వఱకూ ఉండే దూరం పిడి) ఎత్తున్న వాటిని నిలబెట్టారు. అన్నిటికీ కొత్త గుడ్డలు కట్టారు. ముందువరసలో మూడూ చంద్ర కఱ్ఱవే. రెండవ వరుసలో మారేడు, మూడోవరుసలో మోదుగ, 4వ వరుసలో అటూ ఇటూ దేవదారు స్తంభాలు, మధ్యలో వేగిస స్తంభం. మళ్లీ 5, 6, 7 వరుసలలో క్రమంగా మోదుగ, మారేడు, చంద్ర స్తంభాలూ నిలబెట్టారు. మొత్తం 21 స్తంభాలు. ప్రతి స్తంభానికీ 8 కోణాలున్నాయి. అన్నీ నున్నగా చెక్కబడి, 7 వరసల్లో ఉండి సప్తర్షులా! అన్నట్లున్నాయి. ఎటునుండి చూసినా, మధ్యగా ఉండే, 4వ వరుసలోని మధ్యలో వేదిక. వేదికని గరుడపక్షి ఆకారంలో ఇటుకలతో కట్టారు . బంగారు ఱెక్కలు అమర్చారు దానికి. అన్ని యూపస్తంభాలకీ యజ్ఞంలో చెప్పబడిన విధంగా ఆయా పక్షులు కట్టబడ్డాయి. వేదికకీ, తూర్పు ముఖంగా ఉద్గాత, దక్షిణాన బ్రహ్మ, పశ్చిమాన అధ్వర్యుడు, ఉత్తరాన హోత అనేవారు నిలబడ్డారు. దేవతలకి ఇష్టమైన సోమరసాన్ని

దంచి తీసారు. ఆ స్తంభాలలో ముఖ్య స్తంభానికి, 'అశ్వం' సర్వాలంకారభూషితమై కట్టబడి ఉంది. (ఉద్గాత - బ్రహ్మ మొదలైన ఈ పేర్లు,యజ్ఞంలో పురోహితులకి వారు వారు చేసే కార్యక్రమానికి అనుగుణంగా పెట్టబడేవి).

వేద మంత్రాలు చదువబడుతూండగా, అగ్నిహోత్రంలో మంత్రపూర్వక హవిస్సు విడువబడుతూండగా, యాగం ఊహింపనంతటి గొప్పగా,కాసాగింది. పట్టమహిషి కౌసల్య యాగాశ్వాన్ని బంగారు సూదులతో గుచ్చింది. మంత్ర విధానం ప్రకారం, అశ్వం విశసింపబడ్డాక (మరణించాక) ఆ రాత్రి, ముప్పురు భార్యలూ, పట్టమహిషి, పరివృత్తి, వావాత (యజ్ఞం పూర్తి అయ్యేవఱకూ వీరి పేర్లు ఇవి)లు ఆ అశ్వం ఉన్న శాలలోనే ఉన్నారు. *(కృతాభిషేకా మహిషీ, పరివృత్తి రుపేక్షితా, వావాతా సా భోగినీ స్యాత్)* మఱు నాడు ఆ అశ్వపు 'మేదస్సు' ఉడుకబెట్టారు. ఆ ద్రవ్యాన్ని అగ్నిలో హోమం చేసేప్పుడు వచ్చేవాసనని, దశరథుని చేత పీల్చించారు. 8క్రతువులు మొత్తం చేయబడ్డాయి. (2 అతిరాత్రాలు, అభిజిత్ - విశ్వజిత్ - 2 అప్తోర్యామాలు) అశ్వమేధం మొదటి రోజున 'అగ్నిష్టోమం' - రెండో రోజున ఉక్థ్యం' మూడోరోజున 'అతిరాత్రం' అనే పేర్లున్న క్రతువులు జరిగాయి.

ఇక అశ్వమేధం జరిగిన అన్ని రోజులూ, కులవర్ణ భేదం లేకుండా మృష్టాన్నాలు పెట్టారు. పరిశుభ్ర వస్త్రాలతో వడ్డన సాగింది. రత్నకుండలాలని ధరించినవాళ్ళు సహాయ పడ్డారు. (బంధువులు వడ్డన చేయడం - మఱి కొందఱు బంధువులు సహాయంగా ఉండడమనేది, ఆనాటి సంప్రదాయమే నన్న మాట).

యాగం పూర్తికాగానే దశరథుడు తన రాజ్యాన్ని, యాగం చేయించిన నల్గుర పురోహితులకి (హోత - అధ్వర్యు - బ్రహ్మ - ఉద్గాతలకి) ఒక్కొక్క దిక్కు ఒకరికి చొప్పున, దానం చేసేసాడు. ఆ ఋత్విక్కులు(పురోహితులు) - *'రతాస్స్వాధ్యాయకరణే వయం నిత్యం హి భూమిప - నిష్క్రయం కించి దేవేహ ప్రయచ్ఛతు భవానితి (14/8)'* రాజా! వేదం వల్లె వేసికోవడంలో శ్రద్ధకల మాకు, రాజ్యంతో పనేమిటి? దానం ఇచ్చావు కాబట్టి, దీనికి బదులుగా ఏదైనా యిచ్చి, నీవే దీన్ని తీసికో' అన్నారు.

దశరథుడు పది కోట్ల గోవుల్నీ - బంగారు నాణాలనీ, 40 కోట్ల వెండి నాణాలనీ ఇచ్చి, భూమిని తిరిగి తీసికొన్నాడు. ఋత్విక్కులు ఆ ద్రవ్యాన్ని మొత్తాన్ని వశిష్ఠ - ఋశ్య శృంగుల కిచ్చేసారు. మొత్తానికి అశ్వమేధం సశాస్త్రీయంగా పూర్తి అయింది.

ఇంతలోఒక బ్రాహ్మణుడు చేయిచాచాడు. (నీకుతోచిన ఏ చిన్న వస్తువునైనా దానం చేయమంటూ) అన్నీ దానమిచ్చిన పిమ్మట యాచించిన వీనికి ఏమియ్యాలి? అనుకుంటూ - చేతి బంగారపు కడియాలని దానం చేసాడు దశరథుడు. ( *కస్మై చిద్యాచమానాయ దదౌ)* ('అన్నీ ఇచ్చేసాను' ఏమీలేవని చెప్తే ఇక్ష్వాకువంశం వాడెందు కౌతాడు?)

## దశరథుని అశ్వమేధంలోని ఇతర రహస్యాలు

1. శ్రీమద్రామాయణంలో అశ్వమేధం కూడా, అతిముఖ్యమైన సంఘటనం. మొత్తం సంపాదించిన ద్రవ్యాన్నంతనీ, ఋత్విక్కులకి దానంగా దశరథుడిచ్చేసాడు. 'సంపద ఉంటేనా? ఎంతైనా దానం చేస్తాం' అనేది అందఱూ అనే మాటే. ఇవ్వడానికి ఏమీ లేనప్పుడు ఎంతైనా ఇయ్యగలనని అనేవానికి, ఇయ్యగలిగిన స్థితి వచ్చాక, దానం చేయడమనేది, చెప్పుకో దగ్గ విషయం. నాల్గు దిక్కుల భూమినీ దానం చేసేసాడంటే, ఎంతటి త్యాగ బుద్ధి దశరథునిది! రాజులకి పూర్వపురోజుల్లో, దాన గుణాన్ని ముందు నేర్పేవారు. నాల్గు దిక్కుల భూమినీ ఇచ్చాక, సంన్యాసిగా వెళ్లిపొమ్మని అన్నాకూడా సంసిద్ధపడే బుద్ధి వారికుండే, దానం చేసేవారు. వీరి పూర్వుడు 'రఘుమహా రాజు' కూడా అంతే! అలా దానం చేసినవాడే. డబ్బున్న దానికి సరియైన వినియోగం 'పాత్రత' తెలిసీ, దానమీయడం. ఋత్విక్కులు కూడా తమకి అక్కఱలేని దాన్ని దశరథునకిచ్చి, వచ్చిన ద్రవ్యాన్ని వారుంచుకోక, వశిష్ఠ ఋశ్య శృంగులకీయడం చెప్పుకోదగ్గది. వశిష్ఠ - ఋశ్య శృంగులు - ఋత్విక్కులకి, అర్హతని బట్టి ఆ పిమ్మట ఇచ్చారు. దానం ఇలా సాగాలని యాగం వల్ల రాజు గ్రహించడం.

2. ఎందఱెందఱో, ఎక్కడెక్కడి నుండో వచ్చి తృప్తిగా భుజిస్తే, ఎలా ఉంటుందో, వారిలోని ఆనందాన్ని స్వయంగా రాజుచూచి, తన ప్రజలు ఇలాగే సుఖ కాంతులలోనే ఉండాలనే భావనని కల్గి ఉండడం, అలా పరిపాలనని నేర్పుగా చేయాలనే బుద్ధిని ఏర్పఱచుకోవడం.

3. అన్నిటికీ మించి దేవతలు, రావణుని అభిప్రాయ పరీక్ష కోసమూ - (దశరథునికి అశ్వమేధ బుద్ధి కల్గించారు), ఇక్కడ కొద్ది దూరంగా ఆలోచించాలి.

జయ విజయులనే పేరుగల వైకుంఠ ద్వారపాలకులే, రావణ కుంభకర్ణులు. మోక్షం పొందడానికి ఉపాయం, మహావిష్ణువు చేతిలో చావడమని గ్రహించి, సనత్కుమారుల వారినే అడ్డగించి, రాక్షస జన్మని శాపంగా పొందారు. శీఘ్రంగా విష్ణువుచేతిలో వధింప బడాలంటే, విష్ణువుకి ఆగ్రహం కలిగే పనులు - పతివ్రతలని బాధించడం - యజ్ఞధ్వంసం - మహర్షి బాధ - వంటివి చేయాలని నిశ్చయించుకొని, అలా ప్రవర్తించ సాగారు. (నిరసనని తెలపడానికి ప్రభుత్వపు ఆస్తులని పాడు చేయడం, రాక్షస కృత్యమే - ఈ కోవకి చెందినదే).

విష్ణువు భార్య శ్రీ లక్ష్మి. ఈమె కుశధ్వజునికి కూతురుగా వేదవతిగా పుట్టింది. తనని పెండ్లి చేసికొమ్మని బలవంత పెట్టడమే కాక - తన శిరోజాలు కూడా పట్టి లాగిన, రావణుణ్ణి చంపించేందుకే, అయోనిజగా, మళ్లీ జన్మిస్తానని శాపమిచ్చింది. ( తప్పు

*త్వయోనిజా సాధ్వీ భవేయం ధర్మిణ స్స్రితా - తస్మా త్తవ వధార్థాయ సముత్పత్స్యేఽ ప్యహం పును.)*
అహంకారి రావణుడు, అనరణ్యుడనే రాజుపైకి, ముందుమాట లేకుండా దాడిచేసి, సరికాదని అనరణ్యుడంటున్నా వినిపించుకోక, అతణ్ణి నేల పడవైచాడు. అవమాన, కోపాలు కల్గిన అనరణ్యుడు 'నా వంశంలో పుట్టే దశరథపుత్రుడు నిన్ను చంపుతాడు' అని శపించాడు. *(రామో దాశరథి ర్నామ య స్తే ప్రాణా న్హరిష్యతి).*

అప్పటి కర్థమైంది రావణునికి - చంపేది దశరథ పుత్రుడనీ, చంపించేది ఒక అయోనిజ అయిన పతివ్రత అనీను -

ఆ కాలానికి (అనరణ్యుడు పరిపాలిస్తూన్న కాలానికి) చాల కాలం పిమ్మట, దశరథుడు రాజ్యానికి వచ్చాడు. తన వధ కోసం (మోక్షం) ఎదురు చూస్తున్నాడు రావణుడు. కాని దశరథునకు సంతానం కల్గలేదు. అశ్వమేధం కోసం అశ్వాన్ని విడిచాడు. యుద్ధ ప్రియుడు అయ్యుండి కూడా, తాను (రావణుడు) అశ్వాన్ని పడితే యాగం ఆగిపోయి, తనని చంపి మోక్షమిచ్చే యోగ్యుడు పుట్టడని, కావాలనే యాగాశ్వం లంకకు వస్తోందని తెలిసి 'యజ్ఞదీక్ష' తీసికొన్నాడు రావణుడు. దీక్షలో ఉండబట్టే, యాగాశ్వాన్ని రావణుడు పట్టు కోలేదని, అంతా భావించారు. అశ్వాన్ని రావణుడు పట్టకపోవడం, దేవతలకి లాభసూచకమైంది. విష్ణువు భూలోకంలో జన్మించే వీలు ఏర్పడింది. ఈ విషయం తెలియడానికే, అశ్వమేధ బుద్ధి పుట్టించారు దేవతలు. రావణ వధ సులభమేనని విష్ణువు గుర్తించాడు.

## దేవలోక నిర్ణయాలు

అశ్వమేధం జరిగిన తీరుకి ఆనందపడిన ఋశ్య శృంగుడు, పుత్ర కామేష్టిని చేయిస్తానని దశరథునితో పలికాడు. హోమం ప్రారంభమైంది. ఎవరెవరి భాగాలని, వారు వారు పట్టుకుపోవాలని, దేవతలంతా ఒకచోటికి వస్తూనే, బ్రహ్మను చూచారు. 'స్వామీ! రావణుడు చేస్తున్న దుశ్చేష్టలు, నీకు తెలియనివి కావు. అవన్నీ, నీ 'వరం' అండగా ఉండడంచేత చేయగల్గుతున్నాడు' అని వాని దుర్మార్గాలని వివరించారు.

బ్రహ్మ - వారి మాటలు విని, 'దేవతలారా'! దేనిచేతనూ చావులేని వరమడిగిన రావణుడు, 'మనుష్యజాతి' అంటే ఉండే తక్కువ చూపుతో, మానవుల వలన చావు రారాదని అడుగలేదు. అందుకని 'మనుష్యుని చేతనేవాడు వధ్యుడు'. అన్నాడు. *(నా కీర్తయదవజ్ఞానాత్ తద్రక్షో మానుషాం స్తథా - తస్మాత్స మానుషా ద్వధ్యో మృత్యుర్నా న్యోఽస్య విద్యతే).*
ఈ విషయం దేవతలకీ, ఋషులకీ ఆనందదాయకమైంది.

ఇంతలో శంఖ చక్రగదాధారి, పీతాంబరుడూ అయిన శ్రీ మహావిష్ణువు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. దేవతలూ, మహర్షులూ అంతా, రావణుడు పెట్టే బాధలూ, పంచ

భూతాలనీ వాడు అదుపుచేసే పద్ధతినీ వివరించి, శరణు కోరారు. అన్నీ తెలిసినప్పటికీ విష్ణువు ఆనందపడి'ఏ ఉపాయంతో వాణ్ణి సంహరించాలో చెప్పండని (ఉపాయః కోవధే తస్య?) వారినే అడిగాడు.

మానవుని చేతనే రావణుడు వధింపబడాలని బ్రహ్మ చెప్పగానే, తాను (విష్ణువు) మనుష్యునిగా ఎవరి యింట పుట్టాలా? అని ఆలోచిస్తూంటే, దాన్ని గమనించిన దేవతలు 'పుత్ర కామేష్టి చేస్తున్న దశరథుడు నీ తండ్రిగా ఉండడానికి యోగ్యుడన్నారు. ఆయన కున్న ముగ్గురు భార్యలలోనూ నలుగురిగా పుట్టమని సూచించారు." (తస్య భార్యాను *తిసృషు హ్రీ శ్రీ కీర్త్యుపమాను చ విష్ణో! పుత్రత్వ మాగచ్ఛ చత్వార యివ బాహవః*)

విష్ణువు ఆనందపడి 'దేవతలారా!' రావణుణ్ణి చంపి, బహుకాలం మానవరూపంతో రాజ్యం ఏలుతాను' అని వారికి అభయమిచ్చి, తాను నలుగురుగా అయి, దశరథుని ఇంట జన్మించాలని నిశ్చయించుకొన్నాడు. వెంటనే అంతర్ధానమయ్యాడు.

దీనికి ' **లో అర్థం**' ఏమిటి? ఇక్కడ దశరథుడు యాగం చేస్తూంటే, అక్కడ దేవతలు ఆలోచిస్తున్నారు. మనం కూడా, ఇక్కడ ఏదైనా దైవకార్యం చేస్తూంటే, దేవతలూ ఆలోచిస్తారు - 'వీడికి ఏ శుభాన్ని కల్గించాలి?' - అని. దేవతలంతా రావణుని దుశ్చేష్టలని బ్రహ్మకి చెప్పడం, బ్రహ్మసమక్షంలోనే దేవతలు తిరిగి విష్ణువుకి చెప్పడం -అనేవి, రావణుని అహంకార విధానాన్ని వివరించడం తప్ప, వేఱు కాదు.

'వరం' ఎప్పుడూ శాపమే! రావణుడు తొందరగా వధింపబడాలనే ఊహలోనే, బ్రహ్మ, వానికి 'చావులేని వరం' ఇచ్చాడు. భగవంతుడు చాల తెలివైనవాడు. బుద్ధితో ఆలోచించగల మనకి, ఆ బుద్ధిని, ఎలాటిదాన్ని ఇవ్వాలా? అని, 'బుద్ధి' తో ఆలోచించి ఇచ్చేవాడు. రావణుడు అడుగుతున్నంత సేపూ, బ్రహ్మ 'వికల్పాల' గుఱించి ఆలోచించాడు. పగలు చావకూడదు - అని రావణుడడిగితే - 'రాత్రి చంపవచ్చు' - అని బ్రహ్మ ఆలోచన. 'రాత్రి చావరాదు' - అని రావణుడడిగితే 'సంధ్యా కాలంలో చంపచ్చు' - అని బ్రహ్మ భావన.

ఇలా ఆలోచించి చూస్తే, '**మనుష్యజాతి**' ని 'మాత్రం విడిచాడు రావణుడు. అదికూడా (అవజ్ఞానాత్) అవమానమనే భావనతో. (అహంకారంతో). బ్రహ్మ కోరు కునేదే అది. అహంకారి అయితే తప్ప, తొందరగా పతనం చెందడు గదా! మనుష్యులని గూర్చి అడుగదలచిన రావణునికి, అహంకారం అడ్డొచ్చేలా చేసినది విష్ణువే. కారణం - ' ఇక్ష్వాకు కులరాజులు తనని, ఎంతోకాలంగా ఆరాధిస్తూడడం వల్ల, తాను మనుష్యజాతిలోనే పుట్టవలసి ఉండడమే.'

అయినా దేవతలని అడిగాడు - *(ఉపాయః కో వధే తస్య?)* ఎలా చంపే ఉపాయం? - అని. అడగడానిక్కారణం, అంతకంటె మంచి ఆలోచన ఏమైనా వారికి తట్టవచ్చునేమో

అనీ, తనకి సహాయపడవలసిన దేవతలు చెప్పిన ప్రకారమే అవతార మెత్తుదామనినీ. తనకు తానుగా, ఈ అవకాశానికి ఎదురు చూస్తూన్నాడు కాబట్టే, తన దగ్గరకు దేవతలు రావలసి ఉన్నా, తానే, వారివద్దకు వచ్చాడు.

అప్పటికే వేదవతీరూపంలో లక్ష్మిదేవి, రావణునికి శాపం ఈయడంతో, రావణ వధకి కొంతపని చేసిన లక్ష్మి, ఆయన వెంట రాలేదు.

ముగ్గురు భార్యల గర్భాల నుండి, తాను నలుగురిగా జన్మించాలనుకోవడానికి , ఋశ్యశృంగుని దీవన కారణం. లయన పురః+హితః = పురోహితుడు. (రాబోయే శుభాన్ని తన తపశ్శక్తి ద్వారా తెలిసి, హితాన్ని చేప్పేవాడూ, చేయించేవాడున్నూ). పురోహితుడు యజమానితో, 'ఫలానిది మీరు చేస్తే బాగుంటుందనీ, ఈ రోజు మంచిదికాదనీ' ఇలాగ చెప్పడం యజమానికి కలగబోయే శుభాన్ని, తెలిసి చెప్పడమే. నల్గురు పుత్రులు పుట్టవలెనని దీవించడానిక్కారణం, ఆయన దైవజ్ఞుడు గనుక - దేవతా అభిప్రాయాన్ని తెలిసిన వాడు గనుకనూ. రావణ - ఇంద్రజిత్ - లవణాసుర -,గంధర్వులనే రాక్షసులు నల్గురిని చంపేవాళ్లు నల్గురు కావాలిగా. అందుకు నల్గురుగా పుట్టాడు. (ఇంక కొన్ని విశేషాలు రాబోతున్నాయి).

తండ్రి తాతల పాపపుణ్యాలు, వారు ఆర్జించిన ఆస్తులతోపాటు, తర్వాతి వారికి సంక్రమిస్తాయి. ఇక్ష్వాకుకులీనులెందఱో తన పూర్వులు నిత్యం శ్రీ మహావిష్ణువుని ఆరాధిస్తూ వస్తూ ఉంటే, శ్రీ మహావిష్ణువునే పుత్రునిగా పొందే అదృష్టం, దశరథునికే కల్గింది. విత్తనం వేసి, నీరు పోసి, పెంచినవాడు గతిస్తే, నీడని తర్వాతివారు పొందినట్లు, విష్ణువు, తమ యింట వెలసిన విషయం శాశ్వతంగా చరిత్రలో స్థిరం కావాలనే, ఆ కాలపు విష్ణువు పేరు 'దాశరథి' - దశరథపుత్రుడు' - అన్నారు.

నిత్యమూ చేయవలసిన కర్మానుష్ఠానం చేత, అత్యున్నత స్థితిని పొందిన జనకునికి అనుగ్రహాన్ని ఇవ్వడం ఉచితమని భావించి, తాను దశరథ పుత్రునిగానూ, తన లక్ష్మిని, జనకుని యింటనూ పుట్టించాడు. విష్ణువు వైకుంఠం కదిలి రావాలంటే, ఎన్ని ఏర్పాట్లు చేసికోవాలో ఇక్కడ బోధపడుతుంది.

## దేవతలే వానరాలు

తనకు సహాయపడవలసిన దేవతలనందఱినీ, అప్సరస - గంధర్వ - స్త్రీల గర్భాన కామరూపులు, (ఏ రూపం కావలిస్తే ఆ రూపాన్ని ధరించగల శక్తి ఉన్నవారు) బలవంతులూ ఐన వానరాలుగా సృష్టించవలసిందని, బ్రహ్మకి ఆజ్ఞ చేసాడు. (*అప్సరస్సు చ ముఖ్యాసు గంధర్వీణాం తనూసు చ వృబిధ్యం హరిరూపేణ పుత్రాం స్తుల్యపరాక్రమాన్. హరి అనే పదానికి 'కోతి' అని అర్థం కలగడానిక్కారణం, హరికి సహాయం చేయడానికి ఉద్భవించిన జాతి కాబట్టి (?)*) దేవతలకి ఉన్న బలం, పుత్రులుగా పుట్టిన వానరాలకి ఉంటుంది. ఈ వానరాలు దేవతలేకాని, మామూలు కోతులు కాదు.

## వానర రూపమే ఎందుకు?

(i) మనుష్యులంటేనే తక్కువ అభిప్రాయం కల రావణునికి, మనుష్యులు కూడా అపహాస్యం చేసే 'వానరజాతి' అనగానే, మరింత చులకన భావం ఉండి, వానరాలు ఏ ప్రయత్నం చేసినా, దాన్ని అతడు, లెక్క చేయకుండా ఉంటాడు. అందుకోసం.

(ii) అయోధ్యారాజ్యాన్ని విడువబోయే విష్ణువుకి, తిండిని కూడా యాచించని సైన్యం కావాలి. చెట్లుంటే చాలు, వానరాలకి తిండి బాధలేదు. దుస్తుల బాధ అసలే లేదు. రావణునిలా అహంకారమనేది అసలు లేదు సరికదా – అవమానాన్ని సహించగలవు.

(iii) విలువైన వస్తువుల విలువ, వాటికి తెలియదు కాబట్టి, బంగారపు ముద్దలుగా ఉన్న రావణ లంకని, ధ్వంసం చేయడానికి వెనుకాడలేదు. విలువతెలియని కారణంచేత, తమకై భద్రపఱచుకొందామనే సమస్య – ఈ 'జాతి' వల్ల ఉత్పన్నం కాదు గదా.

(iv) పక్షిజాతి కుండే, ఎగిరే శక్తి ఉంది. మృగజాతికుండే 'పరుగూ' వీటికుంది. ఈ రెంటికీలేని లక్షణం – ఎక్కువ దూరాన్ని ఒకే గెంతులో దుమకడం – అనేది వీటికే ఉంది).

(v) వీటితో యుద్ధం చేసాక, 'రాజనీతికాదు – యుద్ధ ధర్మం కాదు' – మొదలైన ప్రశ్నలు వేసి, ఈ యుద్ధం ద్వారా వచ్చిన రాజ్యం, ధర్మ బద్ధం కాదనే వీలులేదు. వీటితో, యుద్ధం చేయడమే ప్రాథమికంగా నేరం.

(vi) కోట్ల సంఖ్యలో వానరాలు వచ్చినా, గోళ్లూ, కోరలే వాటికి ఆయుధాలు కాబట్టి, ఆయుధాలని సిద్ధం చేయడం, పదును పెట్టడం, విఱిగితే బాగుచేయడం, వంటి సమస్యలు లేవు.

(vii) కోతి చస్తే, గోడ అవతల పారేయడంతో సరి. అంత్య క్రియల బాధే ఉండదు.

(viii) 'లంక', సముద్రం దాటితే వస్తుంది. అలా దూకగల జాతి, ఇదొక్కటే.

(ix) రావణునికి నందీశ్వరుడిచ్చిన శాపం ప్రకారమూ, 'వానరులే రావణుడి వధలో సహకరించాలి.

(x) గజ–భల్లూక – గవయ మృగాలతో యుద్ధం చేసే విధానాన్నీ, పులి – సింహం వంటి జంతువులని వేటాడే విధానాన్నీ రాజైనవాడు నేర్చుకుని ఉంటాడుగాని, వానరులతో యుద్ధాన్ని నేర్పేవాడు లేనూ లేడు, నేర్చుకున్నదీ ఉండదు.

పైకి తక్కువ జాతిగా కన్పించగలిగినదీ, లోపల దేవతాశక్తిని ఉంచి రావణుణ్ణి వధించడానికి వీలు కల్పించేదీ – 'వానరజాతి' – అని భావించి, ఇలా అనేక కారణాల చేత విష్ణువు ఈ రూపాన్ని ఎత్తింపచేసాడు.

## పాయస ప్రదానం

భూలోకంలో పుత్రకామేష్టి నిర్విఘ్నంగా సాగుతూంటే, ఎందరెందరో శ్రద్ధగా చూస్తూండగా, యజ్ఞ గుండం నుండి 'ప్రాజాపత్య పురుషుడు' మెల్లగా పెరుగుతూ రావడం కన్పించింది.(*కృష్ణరక్తాంబరధరం, రక్తాస్యం దుందుభిస్వనం - స్నిగ్ధహర్యక్షతను జశ్మశ్రుప్రవరమూర్ధజమ్.*)

ఎఱ్ఱని ముఖంతో, ఎరుపూ నలుపూ కలిసిన వస్త్రంతో, శరీరమంతా వెంట్రుకలు కలిగి, పెద్దపెద్ద మీసాలతో, సింహపు జూలు వెంట్రుకలతో, అగ్నిహోత్రునిలా ప్రకాశిస్తూ, దశరథుని ఎదుటికి పెద్దపులిలా అడుగులు వేస్తూ వచ్చి, 'రాజా! నేను ప్రాజాపత్య పురుషుణ్ణి. సంతానాన్ని కల్గించగలిగినదీ, ఆరోగ్యవృద్ధి నిచ్చేదీ, దేవలోకానికే చెందినదీ అయిన ఈ పాయసం, నీ భార్యల కియ్యి - పిల్లలు కల్గుతారు. - అని దుందుభి లాటి కంఠ స్వరంతో పలికి పాయసాన్ని ఇచ్చి, అంతర్ధాన మయ్యాడు."

దానిని దశరథుడు అంతఃపురానికి తీసికొని పోయి, భార్యలని పిలిచి, జరిగినదంతా చెప్పి, పాయసంలో సగం (1/2) కౌసల్యకి ఇచ్చాడు.

మిగిలిన సగంలో సగం (1/4) సుమిత్రకిచ్చాడు. ఇంకా మిగిలిన దానిలోసగం ( 1/8) కైకమ్మ కిచ్చాడు. ఆ మిగిలిన భాగాన్ని (1/8), క్షణం సేపు ఆలోచించి, సుమిత్రకే మళ్లీ ఇచ్చాడు.

## అమృతాన్నిచ్చే దేవతలు, పాయసం ఎందుకిచ్చారు?

(1) అమృతం, ఇంద్రుని అధీనంలో ఉంటుంది. దాన్ని ఇవ్వాలంటే దేవతలంతా సమావేశమై తీర్మానం చేయాలి.

(2) పైగా, అమృతాన్నిస్తే,ఈ ముగ్గురు భార్యలకీ మరణం రాదు. దశరథుడు, పుత్రులు కావాలని యాగం చేస్తున్నాడు గాని, తన భార్యలు ముగ్గురికీ చిరంజీవిత్వం కోసం కాదుగదా! అడిగిన దాన్ని ఇయ్యక, అడుగనిదాన్ని ఇయ్యడం సరికాదు.

(3) పయస్సుతో( పాలతో) ఉడికించిన అన్నం పాయసం.(పయసా పక్తం పాయసమ్.)

(4) మంత్ర శక్తిని ప్రవేశింప జేసి, అగ్ని హోత్రంలో వేసిన నేతిని, 'హవిస్సు' అంటారు. దేవతలు దానిని ఆరగించి, ప్రసాదంగా తిరిగి పంపినది పాయసం. మనం ఇచ్చిన దాన్నే, తిరిగి దేవుని దగ్గరనుండి గ్రహించడం ఎందుకంటే, ఆ దైవశక్తి, దానిలోనికి ప్రవేశించి, తద్వారా మనకి వస్తుందని.

(5) దశరథుడు పాయసాన్ని స్వీకరిస్తే, ముగ్గురే పుత్రులు పుట్టాలి. మనుష్యుడైన భర్తయొక్క సంబంధంతో పుట్టే పిల్లలు మహా ధర్మబద్ధంగా ఉండే అవకాశం

ఉండదు. మనుష్యుని ద్వారా కలుగబోయే సంతానం "మరణధర్మం" కలిగినది కావలసివస్తుంది.

(6) పైకి మనుష్యునిగా కనిపిస్తూఉండే రాముడు, పైకి కోతులుగా కనిపిస్తూ ఉన్న దేవతలయొక్క సహాయంతో, పైకి రాక్షసునిగా కనిపిస్తూఉన్న రావణుణ్ణి సంహరించాలంటే, పైకి ప్రాజాపత్య పురుషునిగా కనిపించే శ్రీ మహావిష్ణువు, పైకి పాయసంలా కనిపించే అమృతశక్తికల ద్రవ్యాన్ని ఇవ్వాలని నిశ్చయించి అలా ఇచ్చాడు.

(7) దశరథుడు మరణిస్తే తప్ప, మేనమామ యింట నున్న భరతుని రాకతో మొదలయ్యే, మీది కథ సాగదు. దశరథుడు అమృతమే స్వీకరిస్తే మరణించనే మరణించడుకదా!

(8) సంతానాన్ని కల్గించేందుకు ఇయ్యబడిన ఔషధమే పాయసం.(ధర్మబద్ధమైన ఫలితాన్ని యిచ్చే మందు. తండ్రి సంబంధం లేక పుత్రుంని కనే 'Test tube baby' విధానం నేటి శాస్త్రజ్ఞులు ఎంత ఎంత ఆలస్యంగా కనుక్కున్నారో, రామాయణాన్ని బట్టి గ్రహించవచ్చు) అయితే, లోకం లోని ఔషధం పిల్లలని కల్గించవచ్చుగాని, ధర్మబద్ధంగా ఉండే సంతానాన్ని కల్గించదు. అందుచేత ఇది దివ్యపాయసం. ఇదే 'దివ్యౌషదం' అంటే.

## పాయస విభజనలోని రహస్యం

ఋశ్యశృంగుని ఆశీర్వచనం ప్రకారం నల్గురు పుత్రులు పుట్టాలి. దాన్ని మనించిన దశరథుడు, కౌసల్యకి 1/2, సుమిత్రకి 1/4, కైకమ్మకు 1/8, సుమిత్రకు 1/8గా విభజించి యిచ్చాడు. దీనిలో, దశరథుని రాజనీతిజ్ఞత తెలుస్తుంది.

రాజులు, రెండు శాస్త్రాలని అనుసరించాలి. రాజనీతి శాస్త్రమూ - ధర్మ శాస్త్రమూను. పాయసాన్ని కూడా, ఇలా ఆలోచించే యిచ్చాడు దశరథుడు.

కౌసల్య, రాజనీతి శాస్త్రం ప్రకారం 'పట్టమహిషి' అయితే, ధర్మశాస్త్రం ప్రకారం 'కదళీవంధ్య' .రెంటినీ కలిపి ఆలోచించాలి. అరటి చెట్టు ఒకేగెల వేసేటట్లు, పట్ట మహిషికూడా, ఒకే పుత్రుణ్ణి కనాలి.

పట్టమహిషి అయిన పెద్ద భార్యకి ఒక్కడే కొడుకైన రోజున, రాజ్యం మొత్తం వానిదే అవుతుంది. ఒకరికి మించిన పుత్రులు ఉన్నట్లయితే, ఆ సోదరులే పెద్దవానికి శత్రువు లౌతారు.

సుమిత్ర, రాజనీతి ప్రకారం దాపకాంత. ధర్మశాస్త్రం ప్రకారం 'పరివృత్తి' .రెంటినీ కలిపి ఆలోచించాలి. పరివృత్తి అంటే, 'ఉపేక్షింపబడే భార్య' అని అర్థం. ఈమెకు

పుట్టేపిల్లలు, ఈమెకు ముందుదైన కౌసల్యకీ, తరువాతిదైన కైకమ్మకూ కలిగే సంతానానికి సేవచేస్తూ ఉండాలి.

కైకమ్మ, రాజనీతి ప్రకారం భోగకాంత. ధర్మశాస్త్రం ప్రకారం వావాత. రెంటినీ కలిపి ఆలోచించాలి. కేవలం రాజుకి వినోదం, భోగం కోసం ఈమె ఉండాలి. ఈమె పుత్రుణ్ణి కూడా 'భోగపరాయణుడు' గానే చూడాలి.

ఈ రాజనీతి - ధర్మశాస్త్రవిధానాలని దశరథుడాలోచించాడు. జ్యేష్ఠభార్య కౌసల్యకి, ఒక్కడే పుత్రుడు పుట్టాలి. పెద్ద భార్య కౌసల్యా పుత్రునికీ, చిన్న భార్య కైకాపుత్రునికీ దాస్యం చేసే ఇద్దఱు పుత్రులని రెండవ భార్య 'సుమిత్ర' , కనాలి. చిన్న భార్యకు ఒక్కడే కలగాలని భావించాడు.

జ్యేష్ఠ భార్య కౌసల్య పుత్రుడు రాజ్యమేలి తీరాలి. అందుచేత, మిగిలిన ముగ్గురు తమ్ములూ కలిస్తే ఎంత బలం కలవారౌతారో, అంతటి సర్వ బలిష్ఠుడు కావాలని ఆలోచించి (1/8+1/8+1/4 = 1/2) అర్ధభాగాన్ని కౌసల్యకి ఇచ్చాడు.

సుమిత్రకి ఇద్దఱు పుట్టవలసి ఉన్నా, కౌసల్యా పుత్రునికి దాస్యం చేసేవాడు- కైకాపుత్రుని కంటె బలిష్ఠుడుగా ఉండడం, దూరంగా ఆలోచిస్తే మంచిదిగా అన్పిస్తోందని నాలుగవ వంతుభాగాన్ని, సుమిత్ర కిచ్చాడు. ఈ భాగం వల్ల జన్మించిన వాడు, లక్ష్మణుడు. కైకమ్మకి 8వ వంతు భాగాన్నిఇస్తూ, అతనికి దాస్యం చేసే సుమిత్రా పుత్రుడు, అతనితో సమాన బలం కలవాడు కావాలని ఊహించి, సుమిత్రకి కూడా 8 వంతు భాగాన్ని ఇయ్యాలని, ఒక క్షణం ఆలోచించి ఇచ్చాడు దశరథుడు. దీని వలన శత్రుఘ్నుడు జన్మించాడు. భరత శత్రుఘ్నులు కలిసినా (1/8+1/8) లక్ష్మణునితో సమానబలం కలవాళ్లే తప్ప, రాముణ్ణి జయించగలిగే వారు కాబోరు. కానేకారు.

దశరథుడు, ఇలా పాయసాన్ని పంచడంలో, ధర్మానికి ఉన్నతస్థానం ఇచ్చినట్లు భోగానికి అత్యల్పస్థానం ఇచ్చినట్లూ, తెలుస్తుంది. భోగం ఎప్పుడూ, ధర్మాన్ని, అతిక్రమించేది కారాదు. ప్రతివ్యక్తీ, భోగంతో పాటు, ధర్మానికి దాసుడు కావాలిగాని, ధర్మానికి, భోగం కంటె ఎక్కువ స్థాయిలోదాసుడు కావాలి.

దశరథుని కులకాంతలు ముగ్గురూ గర్భం ధరించి, క్రొత్తగా వచ్చిన కాంతితో గొప్పవారిని కనబోతున్నట్లు, అందఱికీ అర్థమయ్యేలా చేసారు. ఈ కులకాంతల గర్భాలకి, భూలోక-దేవలోకాలు రెండూ సంతోషించాయి. ఇది అరుదైన విషయంకదామఱి!

## దశరథుడు లేక, పిల్లలా?

భార్యాభర్తల వలననే సంతానం కల్గుతుందని అంతాభావిస్తారు. కారణం, అలా భాషించేవారి అందఱి జన్మమూ అలాగే కావడం వలన. కాని వైశేషిక దర్శనం, దీన్ని కొంత వివరించి చెప్పింది.

" శరీరం ద్వివిధం యోనిజమయోనిజం చ"

| యోనిజాలు | | అయోనిజాలు | | | |
|---|---|---|---|---|---|
| <u>జరాయుజ</u><br>(మావినుండి పుట్టేవారు) నరులు,పశువ్వులు మొ॥ నవి. | <u>అండ -జ</u><br>(గ్రుడ్డు నుండి పుట్టేవి) కోడి, కాకి మొ॥నవి | <u>సాంకల్పిక</u><br>(సంకల్పం చేత పుట్టేవి) వేదవతి సీత<br>మొ॥ వారు విష్ణు సంకల్పంకారణం) | <u>సాంసిద్ధిక</u><br>(తమ కోరిక ప్రకారం పుట్టేవారు) మానస పుత్రులంటే, వీరే నారదుడు మొ॥వారు. | <u>స్వేదజ</u><br>(చెమట నుండి పుట్టేవి)<br>పేలు ఈపెలు | <u>ఉద్భిజ్జ</u><br>(భూమిని చీల్చుకుని పుట్టేవి)<br>చెట్లు లతలు |

'సంకల్పాత్ దర్శనాత్ స్పర్శాత్ పూర్వేషా మభవన్ ప్రజా' సంకల్పమూ - కేవలదర్శనమూ - స్పర్శ - వలన ఒకప్పుడు సంతానోత్పత్తి జరిగింది. తరువాతి కాలపు శాస్త్రజ్ఞులంతా మానవులయిన కారణంగా, అంతా తమలానే పుట్టి ఉంటారనే ఊహతో, అన్నిటిలోనూ స్త్రీ పురుష భేదం కోసం ఇబ్బంది పడసాగారు. పద్మం బురద నుండి, త్తగుల్లి, లోపలి బురదతో ఉన్న ఇసుక నుండి పుడుతున్నాయి. అన్నిటికీ, స్త్రీ పురుష ంబంధం చెప్పడం తగదు. కాబట్టి సంతానోత్పత్తికి అభ్యంతరకరంగా ఉన్న కౌసల్య ుమిత్ర కైకమ్మల శరీరంలో, ఈ పాయసం, సంతానోత్పత్తికి అవకాశాన్ని కల్గించడమే ాక, పాయసమే సంతానోత్పత్తి హేతువు కూడా అయింది. 'యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత - అభ్యుత్థాన మధర్మస్య తదాఽత్మానం సృజామ్యహం' ధర్మం నాశనమౌతూంటే, అధర్మం విజృంభిస్తూంటే, నేను నన్ను పుట్టించుకుంటానని, భగవద్గీతలో భగవంతుడన్నాడు. అందుకే రావణుని అధర్మం విజృంభిస్తూంటే, తావే ప్రాజాపత్య పురుషుడై పాయసమిచ్చి, సృష్టిని చేయించు కుంటున్నాడు. అలా నల్గురు పిల్లల సృష్టి అయిందని గ్రహించాలి.

## విష్ణువు చేసిన ఏర్పాట్లు

విష్ణువు ఆజ్ఞకి అనుగుణంగా, బ్రహ్మ చేసిన సృష్టి క్రమం ప్రకారం, ఇంద్రాంశలో వాలీ, సూర్యాంశలో సుగ్రీవుడూ, బృహస్పతికి తారుడూ, వాయువుకి ఆంజనేయుడూ,

విశ్వకర్మకి నలుడూ, అగ్నికి నీలుడూ, అశ్వినీ దేవతలకి మైందద్వివిదులూ, కుబేరునికి గంధమాదనుడూ, వరుణునికి సుషేణుడూ, పర్జన్యునికి శరభుడూ,.... ఇలా జన్మించారు.

వీరేకాక ఇంకా ఎందఱో దేవతా ఋషుల అంశలలో అనేక వానరాలు జన్మించాయి. అవి వానరాలు కాదు. ఆవుతోకల వంటి బారుతోకలున్నవీ, కారు రూపం కలవీ, భూమిని బ్రద్దలు చేసే శక్తికలవీ, సామాన్య వానరాలతో పోలిక ఏ మాత్రమూ లేనివీ, అయిన వానరాలు జన్మించాయి. ఇవన్నీ, రామ సహాయానికే పుట్టాయి.

విష్ణువు ఆజ్ఞ ప్రకారం, వాలి సుగ్రీవులు కిష్కింధలోనూ- బ్రహ్మ ఆవులింత నుండి పుట్టిన జాంబవంతుడు ఆ పరిసరారణ్యాలలోనూ- ఇతర వానరాలంతా, రాక్షససంచారం ఎక్కడెక్కడుంటుందో, అక్కడక్కడ వారి వారి దుశ్చేష్టలని గమనించి, ప్రభుత్వానికి చేరవేసే గూఢచారుల్లానూ పుట్టి- చెట్లమీద నివసించ సాగారు. ఏ ప్రాంతంలో, ఏ క్షణంలోనైనా సరే, రామునికి అండగా ఉండేందుకు, ఈ వానరాలు సృష్టింప బడ్డాయి.

## రావణుని ఏర్పాట్లు

దశరథుని పుత్రుడు,తనని చంపుతాడని తెలిసిన దగ్గఱ నుండీ రావణుడు-తన ఏర్పాట్లని తాను చేసికొన్నాడు. అశ్వమేధంలో యజ్ఞాశ్వం వచ్చినా బంధించలేదు. రావణుడు లంకవైపుకి వచ్చేందుకు ఉన్న అరణ్యాలలో, తన రాక్షసులని కాపలా పెట్టి, ఎప్పటికప్పుడు, తనకి ఆ సమాచారం చేరవేయమన్నాడు. ఆ ఏర్పాట్లలోని భాగమే తాటక-మారీచ- సుబాహులని దండకారణ్యంలో ఉంచడం,ఖర-దూషణ-త్రిశిరులని జనస్థానంలో ఉంచడం, లంకానగరం వైపు సముద్రంలో 'సింహిక' అనే 'నీడనిపట్టిలాగే'రాక్షసిని ఉంచడం, వంటివి. ఈ ఏర్పాట్లనన్నింటినీ గమనించిన వానరరూపులైన దేవతలు, శ్రీ మహావిష్ణువుకి ఎప్పటికప్పుడు తెలియచేస్తూంటే, విష్ణువు, రాక్షసుల ఎత్తుకి, పై యెత్తు వేయసాగాడు. శ్రీ మహావిష్ణువు రాముడుగా జన్మించాక, ఇక వైకుంఠం 'ఖాళీ' అనుకోరాదు. (అధికారి సెలవు పెడితే అతడి బాధ్యతలని నెరవేర్చే వారు వేఱొకరు ఉంటారు. అత్యవసరసందర్భాలలో తానేమీ నిర్ణయం తీసికోకుండా, అసలు అధికారిని సంప్రదిస్తూంటాడు గదా! అప్పటి ఏర్పాటు ప్రకారమే, ఈనాడూ ఆ విధానం కొనసాగుతూ వస్తోంది).

## నలుగురికీ సరిపోయిన పేర్లు

'పుత్రకామేష్టి' అయ్యాక, తగిన రీతిలో అందఱినీ సత్కరించి పంపించారు. సరయూ నది ఉత్తరాన ఉన్న యజ్ఞశాల నుండి, దశరథాదులు కూడా విచ్చేసి సంవత్సర

మైంది. కులకాంతలు గర్భం ధరించి కూడా, సరిగా 6వ ఋతువు -పన్నెండవనెల వచ్చింది. అంతే! (తత శ్చ ద్వాదశేమాసే చైత్రే నావమికే తిథౌ నక్షత్రేఽ దితిదైవత్యే స్వోచ్చ సంస్థేషు పంచసు.)విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, చైత్రమాసం, శుక్లపక్షం, పునర్వసూ నక్షత్రం, కర్కాటకలగ్నం, నవమీతిథి ,గురువారం, మధ్యాహ్నకాలంలో, సూర్యవంశంలో, రఘువంశ తిలకుడైన పుత్రుణ్ణి కౌసల్య కన్నది.5 గ్రహాలు తమ తమ స్వస్థానాలలో (సూర్యుడు మేషంలో, అంగారకుడు మకరంలో, శని తులలో, బృహస్పతి కర్కాటకంలో, శుక్రుడు మీనంలో) ఉండగా ఈ పుత్రుడు పుట్టాడు. ఇంద్రుణ్ణి కన్న అదితిలా ఉంది, కౌసల్య.

పునర్వసు గడిచి పుష్యమీ నక్షత్రం రాగానే, నవమీ తిథి దాటి దశమి కూడా వచ్చింది. కైక పుత్రుణ్ణి కన్నది.

ఆ మీదటి ఆశ్లేషా నక్షత్రంలో, తిథి ఇంకా మారక దశమిగానే ఉండగా, సుమిత్ర ఇద్దరు పిల్లలని కన్నది. అయోధ్యలోని జనుల ఆనందానికి, తమ తమ శరీరాలు పట్టలేదు. రాముడు జన్మించగానే, గంధర్వ గానమూ, అప్సరోనృత్యమూ, దేవదుందుభి ధ్వానమూ, పుష్పవృష్టి సాగింది. మిగిలిన పిల్లలు పుట్టినప్పుడు మధుర మధురంగా, ప్రశాంతంగా గాలి వీచింది. పేర్లు పేట్టే రోజు (11వ రోజు) వచ్చింది. ఎన్నెన్ని ఎందరెందరికు, దశరథుడు దానమిచ్చాడో చెప్పలేము. వశిష్ఠుడు క్రమంగా ఒక్కొక్క బిడ్డ దగ్గరకూ వచ్చి, పేర్లు పెట్టసాగాడు.(జ్యేష్ఠం రామమ్మహాత్మానం భరతం కేకయీసుతం, సౌమిత్రిం లక్ష్మణమితి శత్రుఘ్న మపరం తథా.)

పెద్దవాణ్ణి చూచి, భావి కథని మనసులో ఊహించి, దైవ నిర్ణయం ప్రకారం, దైవ బుద్ధి మనసులో కల్గగా - 'రామః' అని పేరు పెట్టాడు. (రమంతే సర్వేజనాః గుణైః -రమంతే యోగినోఽస్మిన్-రమయతీతి.) అందరు జనులనీ తన గుణాలతో ఆనందపెట్టేవాడూ, యోగులు కూడా ఎవనియందు ఆనందాన్ని పొందుతారో అలాటి వాడూ, అందరినీ ఆకర్షించి సంతోషపరచే వాడూ కాబట్టి (రమ్ అనే మాటకి పై అర్థాలన్నీను. ఆ మాటపై 'రామః' అయింది) రాముడు అందాం - అనుకొని, అలా పేరుపెట్టాడు.

జ్యోతిషం ప్రకారం, చైత్రంలో పుట్టినవాడు తీయగా మాట్లాడే లక్షణం కలవాడౌతాడు. నవమినాడు పుట్టినవాడికి, ఎవరన్నా భయం ఉండదు. ఉత్తరాయణంలో పుట్టేవానికి దానగుణం - జాలీ ఉంటుంది. గురువారం పుట్టేవాడికి, మాట నేర్పు ఉంటుంది. మధ్యాహ్నం పుట్టేవానికి కోపం రాదు. వస్తే సాధిస్తాడు. అయితే శత్రువు కూడా ఇతణ్ణి గౌరవిస్తాడు. 5 గ్రహాలు ఉన్నతంగా ఉన్నప్పుడు పుట్టినవాడు, లోకారాధ్యుడౌతాడు. (చైత్రే మధురలాపీస్యాత్ - నిర్భయస్సర్వథా లోకే నవమ్యా మువజాయతే.విక

గ్రహోచ్చజాతస్య సర్వార్థసిద్ధిమాహుస్ - ద్విగ్రహోచ్చే తు సామంతః త్రియుచ్చే తు మహీపతిః చతుర్గ్రహోచ్చే సమ్రాట్ పంచోచ్చే లోకనాయకః). అందుకని యీ పేరే పెట్టాడు.

రామునికి పిమ్మట పుట్టిన కైకాపుత్రునికి, 'భరతః' అని పేరు పెట్టాడు వశిష్ఠుడు. రాముడు, రాజ్యం అక్కఱలేదని వెడితే, తనకు ఏమాత్రం ఇష్టంలేని రాజ్యాన్ని నందిగ్రామంలో ఉండి 'భరించేవాడు' కాబట్టి, భరతుడని పేరెట్టాడు బిభర్తీతి భరతః. రామునికి వెంటనే పుట్టినవాడు కావడం వలన, రాముడు, రాజ్యం అక్కరలేదనగానే, ఆ హక్కు భరతునకు వస్తుంది. వచ్చిందీకూడా. భరతుడు ఊళ్లో లేకుండా, రామునికి దశరథుడు రాజ్యాన్ని ఈయదలచడం న్యాయమే! (ఈ విషయం నా అయోధ్యాకాండ వ్యాఖ్యలో వివరింప బడింది).

సుమిత్రా పుత్రు లిద్దఱిలో, ఒకరికి 'లక్ష్మణః' అనీ- రెండవవానికి శత్రుఘ్నః అనీన్నీ- పేర్లు పెట్టాడు. అన్నయైన రామచంద్రునికి సేవ చేయడమే లక్షణంగా కలవాడు కాబట్టి లక్ష్మణుడని పేరు. రాముడే లక్ష్మణుణ్ణి గూర్చి, వెలుపల తిరిగే ప్రాణంలాటి వాడనీ- రెండవ అంతరాత్మ అనీ- *(బహిః ప్రాణ ఇవా పరః- ద్వితీయం మే అంతరాత్మానమ్ - తం తు దేశం న పశ్యామి యత్ర భ్రాతా సహోదరః)* ఇలా చాలా మారులు పల్కాడంటే, లక్ష్మణ నామం సార్థకమే కదా!

రామునికి రాజ్యం అక్కఱ లేకపోతే, భరతుడు అనిష్టంగా రాజ్యాన్ని తన భుజాల మీద భరిస్తూ ఉంటే, లక్ష్మణునికి కేవలం రామసేవ తప్ప వేఱు ధ్యాస లేకపోతే, తానైనా రాజైతే బాగుండుననే ఆలోచన ఏ మాత్రమూ లేక, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే 6 లోపలి శత్రువులనీ, ఘ్న= చంపుకొన్నవాడు శత్రు-ఘ్ను-డు.

**పుట్టిన నక్షత్రం బట్టి, వ్యక్తి ప్రవర్తన**

తప్పక ఉంటూంటుంది. ఒక్కసారి ఆకాశాన్ని చూస్తే తెలిసేవే జ్యోతిషంలోని నక్షత్రాలన్నీ. ధనుస్సు ఆకారంలో ఉండే ఆ 5 నక్షత్రాలకి, 'పునర్వసు' అని పేరు. ధనుస్సు ఆకారంలో ఉంటుంది కాబట్టే, పునర్వసులో పుట్టిన రాముడు కోదండాన్ని ధరిస్తాడు. తన ధర్మాన్ని ఎప్పుడూ ఆయన 'ధర్మం' ద్వారా పరీక్షించుకుంటూంటాడు. 'ధర్మం' అంటే 'విల్లు' అని కూడా అర్థం. తాను వేసిన బాణం ఎదుటి వాణ్ణి వధిస్తే, అవతలివాడు అధర్మపరుడూ- తానింకా ధర్మాత్ముడూ అనీన్నీ భావం. తన ధర్మబలం తగ్గకుండా తపస్సు చేసే స్వభావమూ ఈయన కుంటుంది. అందఱూ 10వ నెలలో పుడితే, వీరంత 12వ నెలలో పుట్టడం వలన, వీళ్లు మానవులు కారని, గ్రహించాలని లోకానికి సూచన

రెండవ వాడు భరతుడు. పుష్యమీజాతకుడు. 4 నక్షత్రాల కూడిక 'పుష్పం ఆకారంలో ఉంటుంది. కాబట్టి భరతుడు మెత్తగా ఉండే లక్షణం కలవాడు. రాముడెంత

కాలానికి ఆర్జించిన కీర్తిని, రామపాదుకలకి రాజ్య పట్టాభిషేకం చేసి, క్షణ కాలంలో - రాముడు సంపాదించలేని కీర్తిని పొందేసాడు. పుష్యమి వారు మెత్తగా, కార్యసాధకులుగా, దైవ, గురు, భక్తిపరాయణులుగా ఉంటారు.

తరువాతి వాడైన లక్ష్మణుడు, 6 నక్షత్రాలు కలిసిన ఆశ్లేషలో పుట్టాడు. ఈ నక్షత్రం సర్పాకారంగా ఉంటుంది. పాము, తనకి ఏదైనా అపకారం ఎవరైనా చేస్తారేమోనని ఎలా తానే ముందు బుసకొడుతుందో, అలాగే రాముని యందలి ఇష్టంతో, ప్రతివ్యక్తినీ అనుమానిస్తాడు లక్ష్మణుడు. రామునికి వ్యతిరేకం చేస్తే, బుస కొట్టినట్లు కోపంతో ఊగిపోతాడు. తండ్రిని కూడా చంపుతాననడానిక్కారణం నక్షత్ర ప్రభావమే. అయితే, అంతటి పామునీ ప్రశాంతంగా బుట్టలో కుక్కే వాడొకడు ఉన్నట్లుగా, రాముడు మాట్లాడ్డం ప్రారంభిస్తే, ఈ కోపమంతా ఎటుపోతుందో తెలియదు. అలాటి వాడు లక్ష్మణుడు. లోకంలో కూడా ఆశ్లేషా నక్షత్ర జాతకులకి కోపం ఎక్కువే.

శత్రుఘ్నునికీ లక్ష్మణునికీ బలంలో కూడా భేదం ఉంది. లక్ష్మణ బలంలో సగం, శత్రుఘ్న బలం. రాముడు ఒకనికి యజమాని అయితే, భరతుడు మరొకనికి యజమాని. లక్ష్మణుడు ఊరిబయట- తాటక- శూర్పణఖ- అయోముఖి- ల ముక్కు చెవులు కోస్తే, శత్రుఘ్నుడు ఊరిలోపల మంథరని చావమోదాడు. ఎక్కడా కూడా, కవలలలో ఒకరికి, రెట్టింపు బలం ఉండడాన్ని చూడం. ఇది కూడా, వీళ్ల మానవులు కారని సూచించడానికేనని గ్రహించాలి.

## '18' అనే అంకెలోని విశేషం

శ్రీ మద్రామాయణంలో ప్రతికాండలోని 18వ సర్గకీ, ఓ విశేషం ఉందనిపిస్తుంది. బాలకాండ (18)లో రామాదులు పుట్టడం, అయోధ్యాకాండ (18)లో కైక, వరాలని అడగడం, అరణ్యకాండ(18)లో శూర్పణఖ రావడం, కిష్కింధాకాండ(18)లో వాలి సమాధానం, సుందరకాండ(18)లో, సీతమ్మని చూడ్డానికి రావణుడు రావడాన్ని, హనుమంతుడు స్వయంగా చూడడం, యుద్ధకాండ (18) లో విభీషణునికి శరణు నీయడం, ఉత్తరకాండ(18)లో వేదవతి రావణుణ్ణి శపించడం అనే అతిముఖ్య ఘట్టాలే ఉన్నాయి.

ప్రాచీనుల మతంలో '18' విశేషం కల సంఖ్య.

మహాభారత పర్వాల సంఖ్య 18.

భారతంలోని గీతకున్న అధ్యాయాలు 18.

గీతలోని స్థిత ప్రజ్ఞ శ్లోకాలు 18.

ఆత్మను గూర్చిన శ్లోకాలు 18.

వ్యాసుడు వ్రాసిన పురాణాలు 18.

యజ్ఞంలోని ఋత్విక్కుల సంఖ్య 18.

భారతంలోని సేనలు 18 అక్షౌహిణులు.

యుద్ధం జరిగిన రోజుల సంఖ్య 18.

అక్షౌహిణిలోని ఏనుగుల సంఖ్య 21870. (మొత్తం అంకెలను కూడితే 18).
రథాల సంఖ్య 21870. (మొత్తం అంకెలను కూడితే 18).

గుఱ్ఱాల సంఖ్య 65610. (మొత్తం అంకెలను కూడితే 18).

కాల్బలం 1,09,350. (మొత్తం అంకెలను కూడితే 18).

మొత్తం 2,18,700. (మొత్తం అంకెలను కూడితే 18).

మహాభారతానికున్న పేరు 'జయ' అనేది. (సంఖ్యాశాస్త్రం ప్రకారం 18).
('జ' నుండి 'య' వఱకూ ఉన్న అక్షరాల సంఖ్య కూడ 18).
ముక్తి అనే సౌధానికున్న మెట్లు 18. ఈ నడుమ సున్న ఉంచితే 108.

ఈ రెండు అంకెల లబ్ధం (1+8 = 9) 9. ఈ ఎక్కాన్ని చూడండి. 2×9 = 18 మొదలు కొని 99×9=891 వఱకు, ఏ అంకెల లబ్ధాన్ని చూసినా '9' అవుతుంది. అంత మార్పులేని సంఖ్య 18 (9). మిగిలిన ఏ సంఖ్యకూ ఈ పద్ధతి లేదు. కృతయుగ కాలం 17,28,000 సంవత్సరాలు. అలాగే త్రేతా, ద్వాపర, కలియుగాల కాలమైన 12,96,000 - 8,64,0000 - 4,32,000 అంకెలనూ కూడితే, ఈ 18 (9) రావడం దీని పవిత్రతని చెప్తుంది. రాముడుకూడ నవమి (9)నాడు పుట్టాడు.

## రాముడు – కృష్ణుడు – ఇద్దఱిలో భేదం

భగవంతుడెక్కడ అవతారమెత్తినా పేరు, ఊరు, కాలం, స్థలం, మార్పుఉంటూ ఉంటుంది. కాని విధానాలన్నీ ఒక్కటే అవుతుంటాయి.

| రాముడు | కృష్ణుడు |
|---|---|
| 1. సూర్య వంశం వాడు. | చంద్ర వంశం వాడు. |
| 2. రఘు వంశంలో పుట్టి రాఘవుడు. | యదువంశంలో పుట్టి యాదవుడు. |
| 3. విళంబి సంవత్సర ఉత్తరాయణంలో. | శ్రీముఖ సంవత్సర దక్షిణాయనంలో. |
| 4. చైత్రమాస శుక్ల పక్షంలో. | శ్రావణమాస కృష్ణ పక్షంలో. |
| 5. కర్కాటకలగ్న నవమీతిథిలో. | వృషభలగ్న అష్టమీ తిథిలో. |
| 6. గురువారం మధ్యాహ్నం పుట్టాడు. | అష్టమీ మధ్య రాత్రంలో పుట్టాడు. |

| | |
|---|---|
| 7. సరయూనది ఒడ్డు నుండి దండకకి ప్రయాణం. | యమున ఒడ్డునుండి బృందావనానికి ప్రయాణం. |
| 8. మొదట చంపినది స్త్రీని. (తాటక). | మొదట చంపినది స్త్రీని (పూతన). |
| 9. కోతుల సహవాసం. | గోవుల సహవాసం. |
| 10. దొరతనం చేసాడు. | దొంగతనంలో నిపుణుడు. |
| 11. రాజ్యం వదలి అరణ్యాలకి పోదామన్నాడు. | అరణ్యం వదిలి రాజ్యానికి పాండవులని రమ్మన్నాడు. |
| 12. శత్రువు వద్దకి హనుమని దూతగా పంపాడు. | తానే దూతగా వెళ్లాడు. |
| 13. తాను పుట్టక ముందు అతని తండ్రి యాగం చేసాడు. | పుట్టాక అతని తండ్రియాగం చేసాడు. |
| 14. వెదురు ధనుస్సుని ధరించాడు. | వెదురు పిల్లన గ్రోవిని ధరించాడు. |
| 15. సూర్యపుత్రుడైన సుగ్రీవునితో స్నేహం. | సూర్యపుత్రుడైన కర్ణునితో విరోధం |
| 16. ఇంద్ర పుత్రుడైన వాలితో విరోధం. | ఇంద్ర పుత్రుడైన అర్జునునితో స్నేహం |
| 17. సర్వభూతాలకి అభయం ఇయ్యడం నా వ్రతమన్నాడు. (అభయం సర్వ భూతేభ్యః....) | సర్వ పాపాలనుండి విముక్తుణ్ణి చేయడం నా వ్రతమన్నాడు. (అహం త్వా సర్వ పాపేభ్యః....) |
| 18. మనిషిగానే సాధించాడు. | దైవలక్షణాలతో సాధించాడు. |

(ఇలా మొత్తం 108 పోలికలు నేను లెక్కించాను. కాని 'అచ్చు సమస్య' ఉంది గదా!)

కాబట్టి, రాముడు ఎక్కడా తన దైవత్వాన్ని, శ్రీకృష్ణునిలా పైకి చూపించడని అర్థం చేసికోవాలి.

## వివాహానికి తగిన వయస్సు

అన్నదమ్ము లందరికీ రాముడంటే అమిత ప్రేమ. లక్ష్మణుడు రాముణ్ణి - శత్రుఘ్నుడు భరతుణ్ణి అనుసరించసాగారు. నిద్రించినా, భుజించినా, వేటకెళ్లినా, చదివినా, ఆడినా, ఆ రెండు జంటలూ అంతాకలిసే. అయోధ్యా జనమంతా ఆశ్చర్య పడేంతటి విషయం, రామునిది. రాజపుత్రుడనే అహంకారం లేదు. ఏ యింట ఏం జరిగినా, అక్కడ తానే ఉండేవాడు. ఎవడు రాముణ్ణి చూడలేదో, రాముడు ఎవరిని చూడ లేదో ఆ చూడబడని, చూడని వ్యక్తి, ఏదో పోగొట్టుకున్న వానిలా తనని తానే

నిందించుకొనేవాడు. (*యశ్చ రామం న పశ్యేత్తు యం చ రామో న పశ్యతి నిందితస్స జనో లోకే స్వాత్మాప్యేనం విగర్హతే ॥*) అంతటి ఆకర్షణ రామునిది. ముందుగా తానే నవ్వుతూ పలకరించే రాముడు, అందరి హృదయాలనీ చూరగొన్నాడు.

నల్గురూ వేదాధ్యయనాన్నీ (General Education), క్షత్రియ జాతికి నేర్చుకొనవలసిన – వృత్తికి సంబంధించిన ధనుర్విద్యనీ (Professional Education) సంపూర్ణంగా అభ్యసించి, అన్ని మెళుకువలనీ నేర్చారు. తల్లి దండ్రుల యెడల అపరిమితమైన భక్తి వినయాలు కలవాళ్లు నలుగురూను. యుక్తవయస్సు కూడా వచ్చింది. దశరథుడు తన బంధుపురోహితులను రప్పించి వివాహానికి యోగ్యులైన, వారి పెళ్లి విషయం ఆలోచిస్తూ ఉన్నాడు.

వివాహానికి తగిన వయస్సు, లోకంలో ప్రచారం చేసేటట్టుగా 21 – 18 ఇలాటి అంకెలు కాదు. తమకు సంబంధించిన సాధారణ విద్యనీ, వృత్తి విద్యనీ పూర్తిచేసి, తలిదండ్రులంటే గౌరవం ఉంటే, అదే వివాహ వయసంటే. **తాను జీవించగలిగి, మరొకరిని సుఖంగా జీవింపచేయగలననే ధైర్యం ఉన్న వయస్సు, వివాహ వయస్సుగాని, శరీరం మీది కొచ్చిన వయస్సు యొక్క అంకెల బట్టి, వివాహ వయస్సు కాదు.**

ఇలా సభ చేసి మాటాడుతుండగా, పరమకోపిష్ఠి అయిన విశ్వామిత్రుడు రావడమే కాకుండా, ద్వారపాలకుల వద్దకు వచ్చి, 'గాధిపుత్రుడైన విశ్వామిత్రుడు వచ్చాడని శీఘ్రంగా చెప్పండి' అని వారిని ఆజ్ఞాపిస్తూ కూడ పల్కాడు. సభ జరుగుతూ ఉన్నప్పటికీ భయంతో దశరథుడు, తనవారితో ఎదురువెళ్లి విశ్వామిత్రుణ్ణి యథాశాస్త్రంగా పూజించి, ఆ సభలోనికి తెచ్చి కూర్చుండ బెట్టాడు.

## వివాహసమావేశం – పై కథ

దశరథుడు శాస్త్రోక్తంగా విశ్వామిత్రుణ్ణి పూజించి 'మహర్షీ! మీ రాక, నీరులేని ప్రదేశంలో వాన కురిసినట్లూ, సంతానం లేనివారికి పుత్రుడు కల్గినట్లూ, పేదవానికి మహాభాగ్యం లభించినట్లూ అన్పిస్తోంది. నాబోటివాడు కూడా, తమ వంటి వారికి సహాయపడగలడని తాము భావిస్తే, అది నా అదృష్టం కాక మరేమిటి ? **చేయగలడా? లేడా ? అనే సంశయం మాని, తాము** నన్ను ఏ విషయంలో అనుగ్రహించ దలిచారో ఆజ్ఞాపించండి' అన్నాడు.

(కొందరికి మాట్లాడడం మొదలెడితే ఒళ్లు తెలియదు. సహాయపడాలనే తాపత్రయమే తప్ప తమస్థితిని ఎఱుగరు. మఱి కొందఱుంటారు. ఎదుటి వారిని మాట్లాడనిచ్చి, మాట్లాడనిచ్చి, తమకి సరిపోయే మాట రాగానే, కంఠం పట్టుకొంటారు. ఈ యిద్దఱు లాటివారే దశరథ విశ్వామిత్రులు. **'చేయగలడా ? లేడా ? అనే సంశయం**

మాచి' అనే మాట దశరథుడనడం, దానికోసమే ఎదురు చూస్తూన్న విశ్వామిత్రుడు, తన పనిని చెప్ప ప్రారంభించడం, ఇందుకు సరియైన సాక్ష్యాలు. కాబట్టి తూచితూచి మాట్లాడాలి).

విశ్వామిత్రుడు ఆనందపడి 'ఇక్ష్వాకు కులంలో పుట్టిన నువ్వు, ఆడితప్పు తావటయ్యా! 'చేస్తాను' అని నువ్వంటే 'పని అయినట్లే' నేను భావించేసాను .

మారీచ సుబాహువులనే యిద్దఱు రాక్షసులు, నే తలపెట్టిన యజ్ఞానికి విఘ్నం కల్గిస్తున్నారు. యజ్ఞ దీక్షలో ఉండడంవలన, నేను వారిని శపించరాదు. అలాగని, యజ్ఞాన్ని మాననూరాదు. 10 రాత్రులు పాటు సాగే ఈ యజ్ఞం, నిర్విఘ్నంగా సాగడానికి, నీ రాముణ్ణి పంపు. అతడు తప్ప మఱెవరూ వారిని సంహరించగల వారు లేరు". అన్నాడు. *(దశరాత్రం హి యజ్ఞస్య- న తు తౌ రామవా దన్యో హంతు ముత్సహేత పుమాన్ ।)*

దశరథుడు పుత్రప్రేమతో 'మహర్షీ !నేను పంపిచలేను. 16 ఏండ్లైనా నిండని వాణ్ణి ఎలా పంపించను ? ఒకప్పుడు సంతానం లేదని దుఃఖం . తర్వాత ప్రయోజకులౌతారా? లేదా? అని దుఃఖం. ఇప్పుడు -సమర్థుడు- అని మహర్షికి అనిపించి నందువల్ల దుఃఖం వచ్చిపడింది- వాడు రాక్షసులతో యుద్ధం ఏమి చేయగలడు? రాముడు రాజీవలోచనుడు. (ఊన షోడశవర్షో మే రామో రాజీవలోచనః - పద్మం లాటి కళ్లు కలవాడు. సూర్యబింబం అస్తమించగానే, పద్మం ఎలా ముకుళించుకు పోతుందో, అలాగే, పొద్దుక్రుంకగానే నిద్రకి ఉపక్రమించే బాల్యలక్షణం కలవాడు రాముడు). రాత్రిపూట బలం పెరిగే లక్షణం రాక్షసులది. నేను సైన్యంతో వస్తాను. వాణ్ణి పంపను' అన్నాడు దశరథుడు.

'రామునికి అనేక విద్యలని ఉపదేశిస్తాను. నీ పుత్రుణ్ణి నేనెఱుగుదును. అతడు మహాత్ముడు సత్యపరాక్రముడు. వశిష్ఠునికీ, ఇతర తాపసులకీ కూడా ఈ విషయం తెలుసు -పంపించు' అని విశ్వామిత్రుడన్నాడు. *(అహం వేద్మి మహాత్మానం రామం సత్య పరాక్రమం వశిష్ఠోఽపి మహాతేజా యేచేమే తపసి స్థితా ।).*

దశరథుడు పుత్రవాత్సల్యంతో పంపనని అనేసరికి, విశ్వామిత్రునికి కోపం వచ్చి 'అసత్య ప్రతిజ్ఞ చేసిన వాడా! ఇలా అబద్ధాలాడుకుంటూ సుఖంగా ఉండు' (మిథ్యాప్రతిజ్ఞ! కాకుత్స్థ! సుఖీభవ! సబాంధవః) అని కోపంతో లేచి పోబోతే , వశిష్ఠుడు ఆపి, దశరథునికి నచ్చచెప్పి, రాముణ్ణి విశ్వామిత్రుని వెంట పంపాడు. రాముడు వెడుతున్నాడని తెలియగానే, లక్ష్మణుడు కూడా సిద్ధ మయ్యాడు. ఇద్దఱూ విశ్వామిత్రుని వెంట వెళ్లారు. పెళ్లిసభ పర్యవసానం ఇది.

**లోకకథ**

విశ్వామిత్రుడు రావడం కూడా, శ్రీ మహావిష్ణువు చేసిన ఏర్పాట్లలో ఒకటే. రాముడు పెరిగి పెద్దవాడయ్యాక, అతణ్ణి అయోధ్య నుండి బయటికి తెచ్చి, సీతమ్మతో

పెళ్ళి చేయడం వఱకూ ఉన్న కథని నడిపించే బాధ్యతని, విష్ణువు విశ్వామిత్రుని మీద పెట్టాడు.

ఈ రోజు ఉండి, రేపటిరోజున ఉంటాడోఉండడోతెలియని మంత్రి పుంగవు డొస్తూంటేనే, అతడు చేయవలసిన కార్యక్రమాలన్నీ ముందుగా నిర్ణయించేస్తారు. ఆ రోజున, ఆ సమయానికి అక్కడ పాల్గొని, చివరికి ఫలాని రోజుకి రాజధానికి పోవాలని నిర్ణయం. మఱి సప్తలోకాలకి ప్రభువైన పరమేశ్వరుడు, వైకుంఠం కదిలివస్తే ఎన్ని పనులని భుజం మీద వేసికొనిరాడు ?.

అయోధ్య నుండి విశ్వామిత్ర సహాయంతో బయటికి రావడం, విశ్వామిత్రునివద్ద ఉన్న అస్త్రశస్త్రాలని మంత్ర పూర్వకంగా స్వీకరించడం, తాటకని వధించడం, అహల్యకు శాపమోక్షాన్ని అనుగ్రహించడం, రాజు కాబోయే రామునికి రాజ ధర్మాలని ఉపదేశించడం, తనకై ఎదురుచూస్తూ, ఎంతోకాలంగా తపస్సు చేస్తూ, సిద్ధాశ్రమంలో ఉన్న మహర్షులకి దర్శనాన్నీయడం, తానుగా ఎదురు చూస్తూన్న సీతమ్మని తానై వెళ్ళి పెళ్ళాడడం, తిరిగి అయోధ్యకి రావడం -అనేవి విష్ణు రూపుడైన రాముని కార్యక్రమాలు. ఈ కార్య క్రమాలన్నింటినీ నిర్వహింపచేస్తూ వెంట ఉండే బాధ్యత, విశ్వామిత్రునిది (అందుకే, సీతారాముల వివాహమయ్యాక ఇక విశ్వామిత్రుడు రామాయణంలో కన్పించడు).

అందుకని విశ్వామిత్రుడు వచ్చాడు. వచ్చినది కూడ, సరిగా దశరథుడు తన నల్గురు పిల్లలకి వివాహ విషయం గూర్చి మాట్లాడుతున్నప్పుడే. వచ్చినవాడు కూడా మర్యాద మీఱి 'గాధిపుత్రుడైన విశ్వామిత్రుడు వచ్చాడని శీఘ్రంగా చెప్పు' అని దశరథుణ్ణి గద్దిస్తూ వార్త పంపాడు. (శీఘ్రమాఖ్యాత మాం ప్రాప్తం కౌశికం గాధిన స్సుతమ్॥)

నిజానికి అది గద్దింపు కాదు. విశ్వామిత్రునికి కలిగిన భయం. (ఇక్కడ రామునికి, ఏ దేశపు రాకుమార్తెనిచ్చి వివాహం గూర్చో, ఒక నిర్ణయాన్ని దశరథుడు ప్రకటిస్తాడో అనీ,ప్రకటించేసాడేమోననీ, అప్పుడు కథ తలక్రిందులై పోతుందనీను) వివాహానిక వాక్ + దానం (వాగ్దానం) చేయడమంటే, వివాహం చేసేసినట్లే. (నేటి కాలంలా కాదు! ఇప్పటికీ అలాటి వారుండవే ఉన్నారు కాబట్టే సుఖంగా జీవించగలుగుతున్నాం).

విశ్వామిత్రుడు లోభయంతో, గద్దించినట్లు పలికితే, విశ్వామిత్రుడు ఏం శపిస్తాడోననే లోభయంతో దశరథుడు స్వాగతం పలికి లోనికి తీసికెళ్లాడు.

పెళ్లి సంబంధాలగూర్చి ముచ్చటిస్తూంటే, ఎవరైనావస్తే, లోకంలో ఎవరైనా 'ముఖ్యవిషయాలు మాట్లాడుతున్నారు 'మళ్లీరండి' అనో-ఈ కాలంలో ఎక్కువగా 'విన్పిస్తూన్న' 'సంస్కారం' అనే మాట ఎక్కువగా కలవారైతే' - అసలు ఊళ్లోనే లేరనో- చెప్తారు గాని, పెళ్లి మాటలు మాట్లాడుతూంటే, 'బ్రహ్మచారి ఈయనెందుకు?' అనుకోకుండాలోనికి రమ్మంటారా?- భయమో? భక్తియో? దశరథుడు పిలిస్తే, సభ

గమనించి విశ్వామిత్రుడు వెళ్లిపోవద్దా? సభనంతా కలయజూచి మరీ, కూర్చున్నాడాయన.

ఈ చూడ్డానికి కారణం, 'ఎవరైనా కన్యాదాతలు అక్కడున్నారా?' అని. లేకపోయిన మీదట ఆనందం కల్గిందాయనికి. మారీచ సుబాహువులని గూర్చి- వారు చేసే యజ్ఞధ్వంసాన్ని గూర్చి వివరంగా చెప్పి రాముణ్ణి పంపమని విశ్వామిత్రుడు అడిగాడు.

ప్రజలకి కష్టం వస్తే రక్షించాల్సింది రాజు. లేదా తన పుత్రుణ్ణైనా పంపి రక్షించాల్సిన భాధ్యత ఆయనకున్నది. అందుకని, రాముణ్ణి రాజపుత్రునిగా భావించి, 'పంపించు' అని **మొదటిసారి అడిగాడు.**

దుఃఖపడుతూ, పంపనని పల్కిన దశరథునితో 'నీ పుత్రుడు ఒక్కడే వాళ్లని చంపగలడు. నేను అనేక విద్యలని ఉపదేశించి, త్రిలోకాలలోనూ ప్రసిద్ధుణ్ణి చేస్తాను - పంపు' అని-మహర్షి **రెండవమారు అడిగాడు.**

అవతారం ఎత్తిన దేవతామూర్తి కాబట్టి, అతడే చంపగలడని భావించు - అని దశరథునికి అర్థం చేయదలిచాడు విశ్వామిత్రుడు.

**మూడవమారు** రాముడి యొక్క గొప్పతనాన్ని చెప్తూ, ఆ గొప్పదనం నాకే కాక, వశిష్ఠునికీ, నీ కొలువులోని తాపసులకీ కూడ తెలుసునని పలికాడు.

రాముడంటే సాక్షాత్తూ పరబ్రహ్మస్వరూపమని గమనించు - అని బోధచేయదలిచాడు విశ్వామిత్రుడు.

అప్పటికీ దశరథుడు, తానే వస్తానని పల్కడంతో, 'రావణుడికి బ్రహ్మ యిచ్చిన వరాలూ - ఆ వరాల అహంకారంతో రావణుని ఆజ్ఞపై సాగుతున్న యజ్ఞ ధ్వంసమూ, మొదలైన వానిని వివరంగా చెప్పాడు విశ్వామిత్రుడు'.

'బ్రహ్మనుండి వరాలని పొందినంతటి రావణుణ్ణి, నా 12 ఏండ్ల పిల్లవాడైన రాముడు - ఎలా చంపగలడని విశ్వామిత్రుడు చెప్తున్నాడు?'- అని ఆలోచించైనా రాముని పరబ్రహ్మ స్వరూపాన్ని దశరథుడు గమనిస్తాడేమోనని భావించి, విశ్వామిత్రుడు **నాల్గవమారు** రావణ వృత్తాంతాన్ని చెప్పాడు.

విశ్వామిత్రుడు దేనిని అర్థం చేయదలిచాడో అది ఏమాత్రమూ అర్థంకాక మతిచలించిన దశరథుడు ' తానే వస్తాననీ, వచ్చినా ప్రయోజనం ఉండబోదనీ, రాముణ్ణి పంపనే పంపననీ' ....ఇలా మాటాడుతూంటే వశిష్ఠుడు మాట్లాడాడు.

దశరథుడు తానే వస్తాననడానికి కారణం, రామునిలో విశ్వామిత్రాది మహర్షులు చూచిన అవతార రూపాన్ని, ఆయన దర్శించలేదు. రాముణ్ణి కేవలం తన పుత్రుడిగానే భావిస్తున్నాడు దశరథుడు. అంతవఱకూ కూడా పెద్ద ఇబ్బంది లేదుగాని, 'తానే

వస్తాననీ, వచ్చినా ప్రయోజనం ఉండబోదనీ (శత్రువు రావణుడు గదా!) రాముణ్ణి పంపననీ' పలికే సరికి – భావి రామాయణకథా – తలక్రిందులౌతుంది. – రక్షింపవలసిన ధర్మం ఉన్న దశరథుడు ధర్మం తప్పినట్లూ ఔతుంది. రాముణ్ణి పంపుతానని పంపకపోతే, ఆ విషయం తన సమక్షంలోనే జరిగినందువల్ల, పురోహితుడైన తనకీ ఆ దోషం అంటుతుందని గమనించి, వశిష్ఠుడు, దశరథుడికి చెప్పేలా చెప్పి, పంపించాడు రాముణ్ణి.

## దశరథుడు అడగని రెండు ప్రశ్నలు

దశరథుడు విశ్వామిత్రుణ్ణి రెండు ప్రశ్నలడిగి ఉండవచ్చు గదా! అని నేటి వారికి అన్పిస్తుంది. (1) యజ్ఞానికి రాక్షసుల వల్ల బాధ – అరణ్యంలో కదా కలిగేది!. ఆ యజ్ఞమేదో అయోధ్య పొలిమేరలో చేసికొంటే, రాక్షసులు రావడానికి భయపడతారు – మాకు రక్షణసమస్యేఉండదు గదా! అనేది, ఒక ప్రశ్న. (2) ఎవరైనా విఘ్నం రానిపని చేసికొంటారు గదా! ఎన్ని మార్లు ప్రారంభించినా విఘ్నం వస్తూంటే, అసలు యజ్ఞాలే మానేయ కూడదా? లేదా మరో కాలంలో చేసికోరాదా? అనేది రెండవది.

ఈ ప్రశ్నలే అడిగితే, విశ్వామిత్రుని వద్ద సమాధానం లేకపోలేదు. అయోధ్య పొలిమేరలోనే యజ్ఞం చేసికోమని రాజు అన్నట్లైతే, మారీచసుబాహువులకి భయపడి వెనక్కి తగ్గినట్లే కదా! భయాన్ని నివారించేలా రాజుండాలని గాని, భయం లేనిచోటు వెదుక్కోమని సూచిస్తే ఆయన, ఏపాటి రాజు?

సరిగా మారీచసుబాహువులు ఎక్కడ బాధిస్తారో అక్కడే విశ్వామిత్రుడు యాగం చేయవలసినది. వారికి రాముని సత్తా చూపించాలని విశ్వామిత్రుని భావన. మారీచ సుబహువులకి కూడా ఎక్కడ యజ్ఞం జరుగుతుంటే అక్కడికే వెళ్లాలనేది రావణాజ్ఞ. భయపడకుండా నిలువబడి తమని కొట్టగలిగే వాడెవడో, వాణ్ణి, వాడి వివరాలనీ రావణునికి చెప్పాలనేది, వాళ్లకి రావణుడిచ్చిన ఆజ్ఞ. అయోధ్యపొలిమేరలో యాగం సాగినా, వాళ్లు విశ్వామిత్రుణ్ణి విడిచేవారు కారు.

'యజ్ఞం' అనేదాన్ని మహర్షులు చేసి, చివరిలో దాని నుండి వచ్చిన ఫలంలో 6వ వంతుని రాజుకి జమ చేస్తారు. (తప ష్షడ్భాగముక్షయ్యం దదంత్యారణ్యకా హి నః।) ఇది పన్ను (Tax) వంటిది. ఈ పన్ను వలన వచ్చిన పుణ్యాన్ని రాజు అనుభవిస్తున్న కారణంగా, వారిని రక్షించాల్సిన బాధ్యత, రాజైన దశరథునిది. అందుకని యజ్ఞాలు మానుకోమని రాజు అన్నట్లైతే, అవివేకి అవుతాడు. సభలో నవ్వులపాలౌతాడు. అలాటి అభిప్రాయమే దశరథునకు ఉంటే వివాహసభామధ్యం నుండి లేచి సాదరంగా స్వాగతమిస్తాడా?.

## దశరథుని న్యాయబద్ధవాదం

(1) నా పుత్రుడు 16 ఏండ్లలోపువాడు (Minor) కాబట్టి, పంపించననే హక్కు నాకున్నది. అది రాజనీతి ప్రకారం సరైనదే. (ఊనషోడశవర్షో మే రామః)

(2)నా పుత్రుడు 12 ఏండ్లవాడూ, అస్త్రాలని తెలియనివాడూ. పైగా బాలకుడున్నూ నా నీడన ఉండేవాడు. (బాలో ద్వాదశ వర్షోఽయ మకృతాస్త్రశ్చ బాలకః)

అందుకని రాజధర్మం ప్రకారం పంపకపోతే అపకీర్తికి తావులేదు, అధర్మమున్నూ (Illegal) కాదు.

(3) లౌకికంగా ఆలోచిస్తే, రాత్రి పూట బలం పెరిగేవాళ్లు రాక్షసులు. రాముడు మానవుడూ– రాత్రి కాగానే నిద్రించేవాడున్నూ. అస్త్రశస్త్ర నిపుణులు రాక్షసులు. అస్త్రాలనే ఎఱుగని వాడు రాముడు. ఇదంతా సరిపోయినా, వచ్చిన చిక్కల్లా మారీచ సుబాహువులున్న ప్రాంతం (Jurisdiction) అయోధ్య ఏలుబడిలోనిదే. అందుకే తానే బయలుదేరుతానని దశరథుడన్నాడు.

## విశ్వామిత్రుని లోకానుగ్రహవాదం

ఏ అంశాలతో దశరథుడు కాదంటున్నాడో ఆ అంశాల ద్వారానే విశ్వామిత్రుడు ఈ క్రింది అభిప్రాయాలని మనసులో ఉంచుకొని వాదిస్తున్నాడు.

(1)16 ఏండ్లలోపువాడు కాబట్టే, నీ ఆధీనంలో ఉండవలసినవాడూ – ఉన్నవాడూ కాబట్టే, నిన్ను యాచింపవచ్చాను. కాకపోయుంటే, రాముణ్ణే అడిగి ఉండేవాడిని కదా!.

(2) 12 ఏండ్లవాడు కాబట్టే, వివాహ వయస్సు కలవాడయ్యాడు. అతని పెళ్లి నేను చేయించాలి. అందుకే అతనితో నాకు పని కల్గింది. అస్త్రవిద్యరాదంటావా? నేర్పాల్సిన బాధ్యత ఉండేవచ్చాను.

అస్త్రాలన్నీ,ఈయనకు వైకుంఠంలో విష్ణురూపంలో ఉండగా తెల్సినా, కౌసల్యా గర్భం ద్వారా జన్మించాక, మానవుడయ్యాడు కాబట్టి, మంత్రాన్ని ఉపదేశం ద్వారా పొందకపోతే అస్త్రాలు పనిచేయవు. ఆ మంత్రోపదేశం నేను చేయాలి. మంత్రోపదేశం చేయాలంటే, శిష్యఋకం (గురువు నందు భక్తి ఏర్పడడానికి) చేయాలి. అందుకే, నా వెంట కొనిపోతాను,10 రాత్రులపాటైనా.

(3) అస్త్రవిద్య రానివాడూ,12 ఏళ్లవాడూ, రాత్రి కాగానే నిద్రించేవాడూ, అయినవాడు, మారీచసుబాహువులతో పోరాడి వధించాడన్నప్పుడే, రాముడు 'అసామాన్యుడు' అని లోకానికి తెలుస్తుంది. గాని, అన్నీ ఉన్నవాడే రాముడైయుంటే, తెలియాల్సింది

ఏముంది? సామాన్యునిగా కన్పిస్తూన్న ఇతడు భగవంతుడని అందరికీ తెలిపేదెలా? అది విశ్వామిత్రవాదం.

'విశ్వామిత్రుడు' ఎలాగ ఈ కార్యం సాధిస్తాడా?' అని దేవతలంతా ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. విశ్వామిత్రుడు, దశరథునికి ఎన్ని చెప్పినా ఫలించకపోయాక, చివరిసారిగా, రెండు ఆలోచనలని సంధించాడు.

**'అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్!**

**వశిష్ఠోఽపి మహాతేజా యే చేమే తపసి స్థితాః!**

ఓ! దశరథా! 'నేను' రాముణ్ణి ఎఱుగుదును- ' మహాత్మునిగా - సత్యపరాక్రముని గానూ. వశిష్ఠునికి తెలుసు. నీ కొలువులోని తాపసులకి తెలుసు ఈ విషయం' అని శ్లోకం పై అర్థం. లోభావం ఎంతో గంభీరమైనది.

## 'నేను 'అంటే ఎంత అర్థం!

'నేను ఎఱుగుదును రాముణ్ణి' అన్న విశ్వామిత్ర వాక్యంలో 'నేను' అంటే,

దశరథా! నువ్వు కర్మరుడివి. నేను పర- అపర తత్త్వాలు తెలిసినవాణ్ణి.

నువ్వు రాగ ద్వేషాలని కల్గినవాడివి. నేను జటావల్కలాలని ధరించిన వాణ్ణి.

నువ్వు రజోగుణం కలిగినవాడివి. నేను సత్త్వగుణం కలవాణ్ణి.

నువ్వు పుత్ర-కామ ఇష్టినిచేసి కోరిక లున్నాయని లోకానికి చాటినవాడివి. నేను మోక్ష-కామ ఇష్టిని చేసి స్వార్థబుద్ధి లేనివాడిని నీ పుత్రుణ్ణి యాచించడంలో కూడా దేవతల కార్యాన్ని నెఱవేరుస్తున్నానే తప్ప నాకు స్వార్థం ఏమాత్రం లేనివాణ్ణి.

నువ్వు కేవలం క్షత్రియుడివి. నేను క్షత్రియుని పై స్థాయి రాజర్షి-ఆపై స్థాయి బ్రహ్మ-ఆపైస్థాయి బ్రహ్మర్షి-దాన్నిపొందినవాణ్ణి.

కాబట్టి 'నేను' ఎఱుగుదును రాముణ్ణి అని అన్నాడు. 'నేను' కి ఇంత అర్థం ఉంది.

మహాత్మానమ్- 'మహాత్మునిగా ఎఱుగుదును' అనిపై అర్థం. పుట్టుక అనేదే లేనివాడు - చాలమందిగా, చాలవిధాలుగా, చాలస్థలాల్లో, చాలకాలాల్లో పుడతాడు. ఎక్కడ, ఎప్పుడు, ఎలా, ఎందుకు పుడతాడో దాన్ని తెలుసుకోగలిగింది (**అజాయమానో బహుధా విజాయతే - తస్య ధీరా పరిజానంతి యోనిమ్**). 'నిత్యమూ భగవంతుణ్ణి గూర్చి ఆలోచించేవారు మాత్రమే'. (ధీరా - ధ్యై చింతాయామ్) అలాంటి వాణ్ణి నేనని విశ్వామిత్రుడన్నాడు. ఈ నిత్యాలోచనమే 'తపస్సు' అంటే.

**సత్యపరాక్రమమ్ :** (1) రాముడు, సత్యమే పరాక్రమంగా (గెలిచే ఆయుధంగా) కలవాడు. (2) సతి + అపరాక్రమః- సజ్జనుల విషయంలో పరాక్రమాన్ని చూపించని

వాడు రాముడు – సత్య+పర+ఆక్రమః – సత్యముచేత పరలోకాన్ని కూడ ఆక్రమించినవా – అని విశ్వామిత్రుడు, తన తపోధనులస్థాయిలో చెప్పాడు. అంతేకాదు.

'నామాట నీకు నమ్మ వీలుకానిదైతే వశిష్ఠుణ్ణి అడుగు' అన్నాడు కూడా. కార 'తపోధనులు' మాత్రమే తపస్సుద్వారానే తెలిసికోగల 'పరబ్రహ్మ' నీపుత్రుడు – చెప్పడం. తపస్సు ద్వారా అందఱు మహర్షుల బుద్ధీ పరబ్రహ్మయందే లగ్న ఉంటుంది కాబట్టి, వశిష్ఠునికి కూడా – రావణవధనిమిత్తం దేవతలూ మహర్షులూ విష్ణువుని యాచించడమూ, ఆ విష్ణువే నీకుగా రాముడై జన్మించడమూ వంటి కథం తెలుసునని విశ్వామిత్రుడు దశరథునితో చెప్పడమన్నమాట.

బ్రహ్మర్షిని నేను, బ్రాహ్మణుడు వశిష్ఠుడున్నూ, మేమిద్దఱం కూడ బలుక్కొ అబద్ధ మాడతామనే అనుమానం – భయం (రజోగుణం ఉన్న క్షత్రియుడివి కాబట్టి నువ్వు పడవచ్చు. (*యద్బ్రాహ్మణశ్చ బ్రాహ్మణశ్చ ప్రశ్నమేయాతాం తాం బ్రాహ్మణాయ బ్రూయాత్. విశ్వామిత్రుడు బ్రహ్మర్షిగా అయ్యాక జరిగిన కథయిది. లేకపోతే రాముడంతటివా మంత్రోపదేశం చేసే అదృష్టం ఆయనకెక్కడా ?*) పోనీ ! నీ సభలో ఉన్న ఏ మహర్షినై అడిగిచూడు – చెప్తారని అన్నాడు.

'అహం వేద్మి' అంటే నేను ఎఱుగుదును అనేది ఒక అర్థం. 'రామమ్ అహమ్ వేద్మి' అంటే రాముణ్ణి (అహమ్) శ్రీ మహావిష్ణువుగా ఎఱుగుదునని మరో అర్థ అక్షరాల్లోమొదటిది 'అ'. చివరిది 'హ'. 'సాక్షాద్వర్ణగతో విష్ణుః' అక్షరాలలో ఉండేవా విష్ణువు కాబట్టి, 'అహః' అంటే శ్రీ మహావిష్ణువని అర్థం. అహస్సంవర్తకోవహ్నిః ........ విష్ణువు కున్న 1000 నామాల్లోనూ 'అహః' అనేది ఒక నామం. 'తస్యనామవై అహ ఇతి' పరమాత్మకి 'అహ' అనే పేరుందిట. ఆనందం వచ్చినా, దుఃఖం కలిగినా ఆయన తెలుపుతారు కాబట్టే సంతోషంలోనూ 'అహ!' అనీ, దుఃఖంలోనూ 'అహో!' అని అంట రుట. అందుచేత రాముడు 'విష్ణువే' అని విశ్వామిత్రుడిక్కడ చెప్పినట్లు గోచరిస్తుంది.

దీనివలన కూడా రాముని దైవత్వం, దశరథునికి అర్థంకాలేదు. ఇక లాభంలేద సహజమైన కోపాన్ని చూపుతూ ఆసనం నుండి విశ్వామిత్రుడు లేచాడు. ఇక లాభ లేదని (పురహితఃపురోహితః) భావికాలంలో జరుగబోయే శుభాన్ని చెప్పి, శుభాని అవకాశం కల్పించవలసినవాడు తాను కాబట్టే వశిష్ఠుడు లేచి, రాముణ్ణి పంపమన్నాడు. రాముణ్ణి పంపించడానిక్కారణాన్ని చెప్తూ వశిష్ఠుడు, విశ్వామిత్రుణ్ణి నిండుసభలో ప్రశంసించాడు. తన విషయంలో ఒకప్పుడు ఈ విశ్వామిత్రుడే చెప్పరాని విధంగ ప్రవర్తించినా కూడా, విశ్వామిత్రుణ్ణే గూర్చి అలా ప్రశంసించి వశిష్ఠుడు మాట్లాడాడు – అంటే వశిష్ఠుని సత్త్వ గుణం తెలుస్తుంది. 'దశరథా ! సర్వశస్త్ర అస్త్రరహస్యాలూ విశ్వామిత్రునికి తెలుసు. దక్ష ప్రజాపతి అల్లుడైన కృశాశ్వుడికి పుత్రులుగా పుట్టి శస్త్రాస్త్రాలన్నీ ఈయన వశంలో ఉన్నాయి. ఆయన భార్యలైన జయ–సుప్రభ అనే

అక్కచెల్లెళ్లు, రాక్షససంహారార్థమే నూఱు పుత్రులుగా పుట్టి, శస్త్రాస్త్రాలుగా మాఱిపోయారని గమనించు. ఈ విశ్వామిత్రుడు, రాక్షసులని అందఱినీ చంపివేయగలడు. కాని రామునికి మేలు చేయదలచి మాత్రమే, నిన్ను యాచిస్తున్నాడు' అని అన్నాడు. అలా అనడమేకాక, విశ్వామిత్రుడు వచ్చిన పనిని సఫలం చేయించాడు. మహాత్ములు పూర్వపు శత్రుత్వాన్ని గుర్తుంచుకోరని దీనివలన తెలుస్తుంది కూడ.

'విశ్వేదేవాశ్చమే మిత్రం-మిత్రమస్మిగవాం తథా ! విశ్వామిత్ర ఇతి ఖ్యాతం యాతుధాని నిబోధమామ్' అని విశ్వామిత్రుడే తన పేరుకి అర్థాన్నిచెప్పుకున్నాడు ఒకచోట. 'దేవతలంతా నాకు మిత్రులు. ప్రపంచానికి (ఇంద్రియాలకి) మిత్రుణ్ణినేను. కాబట్టి విశ్వ-మిత్రుణ్ణైన నేను విశ్వామిత్రుడనయ్యాను' అని భావం. (మిత్రేచర్షౌ - పాణిని మహర్షి వ్యాకరణం ప్రకారం 'విశ్వస్య మిత్రమ్' అనే అర్థంలో విశ్వ+మిత్ర = విశ్వామిత్రః)

## తల్లి దీవెన

దశరథుని అనుజ్ఞ లభించగానే విశ్వామిత్రునివెంటవెళ్లడానికి రాముడు సంసిద్ధమైనాడు. అంతకుమునుపే లక్ష్మణుడు సిద్ధమై ముందు నిలబడ్డాడు. దశరథుడు రామలక్ష్మణులని ఆశీర్వదించి, వారి తల్లులని పిలిచాడు. ఆశీర్వదింపచేసి పంపాడు. 'నగాయత్ర్యాః పరంమంత్రమ్-నమాతుః పరదైవతమ్ !' గాయత్రీ మంత్రానికి మించింది లేదు. తల్లికిమించిన దైవంలేదు. దైవాన్ని ప్రార్థిస్తే రక్షిస్తాడు. ప్రార్థన అక్కరలేకుండా ఎల్లవేళలా తన పిల్లవాని క్షేమం గూర్చి ఆలోచించి దుఃఖించేది తల్లి. ఇలాంటి ఇతిహాసాలు చదివితే, తలిదండ్రులకి నమస్కరించి, ఆశీర్వచనాలని పొంది వెళ్లాలనే భావమైనా కల్గుతుంది. అభివాదన శీలస్య నిత్యం వృద్ధోపసేవినః - చత్వారి తస్య వర్ధన్తే ఆయుః ప్రజ్ఞా యశో బలమ్ ! ఎప్పుడూ నమస్కరిస్తూ పెద్దలని సేవిస్తూ దీవెనలందుకొనే వానికి, ఆయుష్షూ, ప్రజ్ఞ, కీర్తి, బలమూ అనే నాల్గూ వృద్ధి పొందుతాయి. ఆశీస్సుకున్న శక్తి అంతటిది. కౌమారం పంచదశాబ్దః యౌవనంతు తతఃపరమ్. 15 వఏటకూ కౌమారం. 16వ ఏట నుండి యౌవనవంతుడు అవుతాడు. వ్రస్యయనే గచ్ఛతి - 'ప్రయాణం సుఖకరమై, మంగళప్రదమై తిరిగిరావాలి అని పుత్రుణ్ణి తల్లి దీవించాలి. సీతమ్మ హనుమంతుణ్ణి సుందరకాండలో దీవించింది'.

రాముడు పుట్టింది 12 నెలలకి. విశ్వామిత్రుని రాక 12వ యేట . పెళ్లయ్యాక అయోధ్యలో ఉన్న కాలం 12 ఏండ్లు. వనసంచారం 12 ఏండ్లు. వాల్మీకి ఆశ్రమంలో సీత ఉన్నది 12 ఏండ్లు. వాల్మీకి రామనామ మంత్ర సిద్ధిని పొందినది 12 లక్షల మార్లు రామనామాన్ని జపించి. శ్రీ మద్రామాయణ శ్లోకాలు 2x12 వేలు. శ్రీ మద్రామాయణంలోని గాయత్రీ మంత్ర బీజాక్షరాలు 2x12.

*ప్రత్యక్షే గురవః స్తుత్యాః పరోక్షే మిత్ర బాంధవాః - కార్యాంతే దాసభృత్యాద్యాన పుత్రాః కదాపిచ!* అని సిద్ధాంతం. గురువులను, వారి సమక్షంలోనే పొగడవచ్చు మిత్రులనీ, బంధువులనీ పరోక్షంలో పొగడాలి (వారి వెనుకగా చెప్పుకొనేది నిజం కాబట్టి పరోక్షంలో వారిగూర్చి మంచిగా చెప్పుకొంటే, నిజంగా వారు మంచివారన్నమాట దాసులనీ, భృతి (వేతనం) తీసికొని పనిచేసే భృత్యులనీ, బాగాపనిచేసావని పొగడవచ్చుట గాని, సొంతపిల్ల వాణ్ణి మాత్రం పరోక్షంగా, ప్రత్యక్షంగా, పని చేసికొని వచ్చాకా, ఎప్పుడూ కూడ పొగిడి పాడు చేయవద్దంటుంది ఈ శ్లోకం "భారతంలోకూడా కుంతీదేవికి నమస్కరించి పాండవులు అరణ్యానికి వెళ్లారు. గాంధారికి నమస్కరించి దుర్యోధనుడు యుద్ధానికి వెళ్లాడు. కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా న భవతి'. దుర్మార్గుడైన దుర్యోధనుడు వంటి పుత్రుడు కలుగవచ్చేమో కాని, తల్లి ఎక్కడా బిడ్డల విషయంలో దుర్మార్గురాలిగా ఉండదు. పుత్ర వాత్సల్యం అలాంటిది.

పరశురాముడు కూడా, తండ్రి ఆజ్ఞపై తల్లిని నరికి, 'తండ్రి ఆజ్ఞని పాలించినందుకు వరం అడుగు' - అనగానే తల్లిని బ్రదికించమని' అడిగాడు.

తల్లినే చంపి శవాన్ని మోసుకెడుతూన్న పుత్రునితో, శవరూపంలో ఉన్న తల్లి 'నిదానంగా పోనాయనా! చెప్పులులేని కాళ్లకి ఏ ముళ్లైనా గుచ్చుకుంటాయి - జాగ్రత్తగా పో' అన్నదని ఓ ఇతిహాసంలోని మారుమూలకథ. అలాటి మనసు తల్లిది. విశ్వామిత్రుడు ముందూ, రామలక్ష్మణులు ప్రక్కప్రక్కగా ఆయన వెనుకా నడుస్తూ వెళ్తూంటే శివునివెంట స్కందుడూ, విశాఖుడూ వెళ్లినట్లూ, బ్రహ్మవెనుక అశ్వినీదేవతలు. వెడుతూన్నట్లూ అన్పించింది. కుడి ఎడమ భుజాలకి అమ్ములపొదులు తొడిగి ఇద్దఱూ వెడుతూంటే, మూడు తలల పాములు తలవిప్పి వెడుతూన్నట్లనిపించింది.

వెడుతూంటే దేవతల పుష్పవృష్టి కురిసింది. దుందుభులు మ్రోగాయి. దిక్కులు పగిలిపోయేలా భేరులు ధ్వనించాయి. (*పూలవాన కన్పించాలిగదా! భేరిధ్వని విన్పించాలిగా! అని నేటి వారి వాదం. 'ఆతడన్నమాట నా మనస్సుకి చివుక్కు మనిపించింది" అంటాం. మనసుకి అయిన గాయం కన్పిస్తుందా? పర్యవసానం ద్వారా తెలుస్తోంది. ఇదీ అంతే. విశ్వామిత్రుని గెలుపుని అభినందిస్తూ శ్రీమహావిష్ణువుని ప్రశంసిస్తూ కురిపించిన - వినిపించిన - వృష్టీ ధ్వనీకదా! అది మహర్షులకి కన్పిస్తుంది. మానవులకి, ఆలోచిస్తే గోచరిస్తుంది. విశ్వాసం లేనివారికి, వదిబన్నలైనా కన్పించదు!*). ఒకటిన్నర యోజనాలదూరం వెళ్లాక సరయూనదీ దక్షిణ తీరం వచ్చింది. అప్పుడు విశ్వామిత్రుడు 'రామా! బల -అతిబల అనే రెండు విద్యలని నీకు ఉపదేశింప దలిచాను. ఆలస్యంచేయక స్వీకరించు! బ్రహ్మ సృష్టించిన వీటిని నాతపోబలంతో సాధించాను. జాగు చేయకు ఆచమించు!' అని ఉపదేశించాడు. రాముని విడువని లక్ష్మణుడు కూడా ఆ విద్యలని గ్రహించాడు. ఆ రాత్రి ఆతీరం లోనే వారు నిద్రించారు.

## బల – అతిబలలంటే ఏమిటి ?

విశేషాల పుట్ట శ్రీమద్రామాయణం. అడుగడుగుకీ చెప్పుకోవలసిన రహస్యాలు అనేకం. గ్రంథం పెరుగకుండా, వీలయినన్నిమాత్రం అనుకుందాం.

మొదట నారదుడే, వాల్మీకికి మంత్రోపదేశం చేసాడు. వాల్మీకి అడగలేదు. ఇక్కడ విశ్వామిత్రుడు కూడా రామునికి, మంత్రోపదేశం చేస్తున్నాడు. రాముడు అడగలేదు. శిష్యుడు, యోగ్యుడనిపించిన సందర్భంలో, అయాచితంగానే గురువు మంత్రోపదేశం చేయవచ్చని ఇక్కడ తెలుస్తుంది.

రాముడూ–లక్ష్మణుడూ అనే యిద్దఱూ ఒకటే ! అని (విష్ణువు యొక్క రూపాలే) విశ్వామిత్రునికి తెలుసు కాబట్టే, లక్ష్మణుని విషయంలో తీసుకొని పోయేందుకుగానీ, మంత్రాన్ని ఉపదేశించే విషయంలోగానీ ఆయన అభ్యంతర పెట్టనేలేదు.

ఉత్సాహాన్నీ, బలాన్నీ వృద్ధి పొందించేదీ, ఇతరులు వేసే ఆయుధాలని తట్టుకొనే శక్తినిచ్చేదీ, ఆకలి–దప్పుల బాధలేకుండా చేసేదీ బలవిద్య. (*ఉత్సాహంయో ర్వృద్ధిః పరాస్త్రప్రహిష్ణుతా న బాధా క్షుత్పిపాసాభ్యాం యత స్సా కథితా బలా*) 'మాట, –మనస్సు – శరీరం, – పని' – అనే నాలుగింటి చేతనూ శత్రువుని పారిపోయేలా చేసేదీ, ఈ మంత్రాన్ని మననం చేసినవాడు ప్రయోగించిన ఆయుధానికి, తిరుగు లేనితనాన్ని ఇచ్చేదీ అతిబల విద్య. (*యతః పద్య స్థైర్యం దృఢ్మనః కాయకర్మణామ్ స్వాహాయ్యమోఘత్వం భవేత్సాऽతిబలా మతా శత్రువుని పారిపడేలా చేయడం – అతిబలవిద్యాలక్షణం. ఇది వాల్మీకిరుచిగా జరిగి ఫలించింది రామునికి. (1) మాటద్వారా :– ఖరునితో యుద్ధం చేసేప్పుడు ఒక్కొక్క సైనికునికి ఒక్కొక్క రాముడున్నట్లు కన్పించడం (2) మనస్సు ద్వారా :– రామ బాణం తిన్న మారీచ – విరాధ – కబంధ – వాలి మొదలైన మహావీరులంతా రాముని స్తుతించడం. (3) శరీరం ద్వారా – ముక్కు చెవులు్ని కోసినా శూర్పణఖకి రామలక్ష్మణుల మీద యిష్టమే ఉండడం. (4) క్రియ ద్వారా –అతిబలవంతుడైన రామునిమీదకి ఒక్కమాటుగ అంతా దండెత్తకుండా ఒకరి వెమ్మట ఒకరుగా యుద్ధానికి రావడం).*

ఈ మంత్రాలు ఫలించాయా? ఈ మంత్రాలు ఫలించటానికి కొన్ని సంవత్సరాల సమయం కావాలి. ఈ విషయాన్ని ఆలోచించిన దేవతలు, కైకమ్మ ద్వారా 14 సంవత్సరాల కాలాన్ని రాముణ్ణి అరణ్యాలకు పంపి, మంత్రాలను మననం చేసే అవకాశం ఇప్పించారు. (ఇంకా అనేక విశేషాలూ అరణ్యానికి పంపించటంలోని అంతరార్థాలూ నా అయోధ్యకాండ వ్యాఖ్యలో వివరింపబడ్డాయి). ఇంతకీ ఈ బల మంత్రం ఫలించింది కాబట్టే, అరణ్యవాసకాలంలో ఆకలి దప్పుల బాధ వారు పడలేదు. అలాగే 'అతిబల' కూడా ఫలించిందని పైన చూచాం కదా!.

ఈ మంత్రాలనే ఇయ్యడాన్కి కారణం ముందునాటికి 'ఆకలిదప్పులబాధ పడవలసివస్తుందనీ, శత్రువులతో మహా యుద్ధం చేయవలసి వస్తుందనీ' రామునికి

చెప్తూ, తద్వారా మనకి అర్థం చేయడానికి. దృష్టిలో *ఓం హ్రీం బలే మహాదేవి హ్రీం మహాబలే క్లీం చతుర్విధ పురుషార్థ సిద్ధిప్రదే తత్సవితుర్వరదాత్మికే హ్రీం వరేణ్యం భర్గోదేవస్య వరదాత్మికే* అనేది బలమంత్రం. *అతిబలే సర్వదయామూర్తే బలే సర్వక్షుద్భమోపనాశిని ధీమహి ధియోయోనర్జాతే ప్రచుర్యా ప్రచోద యాత్మికే ప్రణవ శిరస్కాత్మికే హుం ఫట్ స్వాహా* అనేది అతిబలమంత్రం. నియమంగా మననం చేస్తే ఫలిస్తాయి. మంత్రం విత్తనంలాటిది. విత్తనం పాతి పెడితే చాలదు. పోషణ చేయాలి గదా! కేవలం మారీచసుబాహువులనే చంపడానికని తీసికెళ్లే విశ్వామిత్రుడు, వారిని చంపడానికైతే, ఇన్ని విద్యలని చెప్పనక్కఱ లేదు. రావణ వధ కోసమే ఇన్ని విద్యల ఉపదేశమున్నూ. 10 రాత్రుల కాలం యజ్ఞం సాగుతుందని చెప్పడానిక్కారణం, రాక్షసుల బలం రాత్రిపూట ఎక్కువ కాబట్టి, పగలు రాక్షస యుద్ధం సహజంగా ఉండదు కాబట్టేను. రాత్రిపూట తిరిగే రాక్షసులతో చేయవలసింది యజ్ఞంవలె పవిత్రమైన యుద్ధంగాని, యజ్ఞంకాదు అనిన్నీ.

## కౌసల్యా సుప్రజారామ !

**కౌసల్యా సుప్రజారామ ! పూర్వా సంధ్యా ప్రవర్తతే ।**

**ఉత్తిష్ఠ నరశార్దూల ! కర్తవ్యం దైవమాహ్నికమ్ ।**

అది సరయూనదికి దక్షిణపు ఒడ్డు. ఆ ఒడ్డున రెండు దర్భగడ్డిపరుపులు. ఆ పరుపుల మీద పరున్న ఇద్దరు పిల్లలు. రామలక్ష్మణులు. 12 ఏళ్ల వయసున్న వాళ్లు కావడంచేత, పరుపువేసినా, సగం నేలమీదే ఉన్నారు వాళ్లు. ప్రక్కనే అమ్ములపొదులు.

గిరజాలు తిరిగిన నున్నని జుట్టు. సమానమైన శరీరాల వాళ్లు. ఉడుము తోలు కవచంగా ధరించిన వాళ్లు. శరీర అవయవాలు ఇద్దఱికీ సమాన ఆకారంలో ఉన్నా నీలమేఘపు రంగుని బట్టి రాముడు అనీ, బంగారపు రంగునిబట్టి లక్ష్మణుడు అనీ గుర్తింప వీలుగా ఉన్నారు. ప్రశాంతంగా, చీకుచింతలేక నిద్రిస్తున్నారు. తెల్లవారు జాముకాలం.

అప్పుడే పద్మాలు వికసిస్తూ ఉన్నాయి. తుమ్మెదలు అప్పుడే బయల్దేరి మకరందపువేట సాగిస్తున్నాయి. మెల్లగా సరయూనది ప్రవహిస్తోంది. ఒక్కసారి చుట్టూ చూచాడు విశ్వామిత్రుడు. సాక్షాత్తు శ్రీ మహావిష్ణువుని ఇలా దర్శించగల్గడం! ఎంత అదృష్టం తనది !.

ఎప్పుడైనా వైకుంఠానికి వెడితే, ద్వారపాలకులు అడ్డగించే వారు. ఆ బాధ తొలగి లోనికి వెడితే. మహర్షులూ, దేవతలూ ఎందఱో ఆయన చుట్టూ ఉండేవారు. వారంతా ఒకవేళ లేకున్నా, హృదయం మీద ఉన్న లక్ష్మి, విష్ణువుని మాట్లాడ నిచ్చేది కాదు. ఆయన అనుగ్రహించేలోగా ఏదో ఒక లోకంలో ఆర్తనాదం ఆయనకు వినపడి, మనసు చెదిరిపోయేది. అలాటి శ్రీమహావిష్ణువు, మహర్షులూ, దేవతలూ లేక లక్ష్మికూడా లేక

ఒంటరిగా, అదీ తన చెప్పు చేతలలో ఉండి, పరమ పవిత్రమైన బ్రాహ్మిముహూర్తం (తెలవారు జాము 4.30 గంటలు) లో, అందునా నది ఒడ్డున దర్శన మీయడం, అందునా పరమప్రశాంతంగా నిద్రిస్తూ, తనకే ఈ అదృష్టాన్ని ప్రసాదిస్తూ ఉండడం – తలచు కొనేసరికి శరీరం గగుర్పొడిచింది. **జీవించి ఉండగా పొందిన మోక్షం అది.**

వెంటనే ఆ యిద్దఱి పాదాలవద్దా నిలబడ్డాడు. మనసు నిండిన ఆనందంలో ఈ శ్లోకాన్ని ఉచ్చైః స్వరంతో పాడాడు. చాల అర్థం ఉన్న శ్లోకం ఇది.

'కౌసల్యా పుత్రుడైన రామా ! తూర్పు తెలవారబోతోంది. నరశ్రేష్ఠా! ఈరోజు చేయాల్సిన దైవకార్యాల వేళ అవుతోంది –లే' అని పై అర్థం.

విశ్వామిత్రుని లోపలి భావాలు ఇలా ఉన్నాయి. రామచంద్రా ! ఇలా చూడ గల్గితేనే ఎంతో అదృష్టవంతుణ్ణని నేను భావిస్తూంటే, నిన్ను కన్న కౌసల్య ఇంకెంతటి అదృష్టవంతురాలు ! నా అదృష్టవశం వల్ల ఆమె మానవజాతి కాంత అయింది. లేకపోతే ఇలా నిన్ను తీసికెళ్లగల అదృష్టం మరెవరికో లభించేది కదా !

కౌసల్యా పుత్రుడివైన రామా! అనడం వలన బలరామ –పరశురాములు కాదు సుమా ! అని చెప్పడం. తండ్రి అయిన దశరథుడు నా వెంట పంపడానికి ఆలోచించినా, నిన్ను పంపినది ఆతల్లి కాబట్టి, 'ఆమె' (కౌసల్య) ఎంత గొప్పది' ! ఆ గొప్పదనం నిన్ను కనడం వలన వచ్చి ఉంటుంది.

'మాతృదేవోభవ' అనేది ముందు పలుకుతారు. తండ్రి కంటె తల్లి 100 రెట్లు గౌరవించ బడాల్సిందే. *(పితుశ్శతగుణం మాతా గౌర వేణాతి రిచ్యతే)* అందుకని రాముని తల్లి అయిన 'కౌసల్య' పేరు ముందుంచి సంబోధించాడు.

చిన్న వయసువాళ్లు కావడం చేతా, ముక్కూ మొగం ఎఱుగని తనతో వచ్చి నందు వలనా, తాను కూడా దశరథుణ్ణి గద్దించి తేవడం వలనా, తెచ్చి కూడా ఎక్కడ పరుండ బెట్టడం వలనా, ఎప్పుడూ ఇల్లు వదిలి ఉండని వాళ్లు అయిన రామలక్ష్మణులు లేస్తూనే ఇన్నీ ఆలోచిస్తూ 'అమ్మ ఏదీ' అని అడుగుతారని ఆ భయాన్ని తొలగించడానికి 'కౌసల్య' పేరు ముందుంచి పలికాడు. ఇల్లు వదలిన పిల్లలు అమ్మనే కదా కలవరిస్తారు!.

ఇప్పుడున్న తూర్పుసంధ్యాకాలం సూర్యుణ్ణి కనబోతున్నట్లు, 'రామచంద్రా !' నీ తల్లి అయిన కౌసల్య, రాముడనే సూర్యవంశం వాణ్ణి కన్నది.

సూర్యునికి అజ్ఞానులైన మందేహులనే రాక్షసులని (చీకట్లు) చంపే సమయమైతే నీకు కూడా లంకా రాక్షసులని చంపే సమయం రాబోతోంది. స్వామీ ! నా అజ్ఞానం కూడా తొలిగి పోయింది. (సూర్యుడు 'మందేహులు' అనే పేరుగల రాక్షసులనివధించడం వలననే 'ఉదయం' అవుతూ ఉంటుందని శాస్త్రం చెప్తుంది)

స్వామీ! నిద్రించే అవకాశం ఎప్పుడు లభిస్తుందా ? అని ఎంతోకాలం నుండీ ఎదురు చూచావు. (ఎప్పుడూ కార్యనిమగ్నుడివిగా ఉంటావు కాబట్టి) కాని ఇప్పుడు నేను కూడా నిన్ను నిద్రింపనీయకుండా 'ఉత్తిష్ఠ' (లే!)అంటున్నాను క్షమించు.

ఒక్కొక్క కాలంలో ఒక్కో అవతారంతో నువ్వు దర్శన మిస్తావు. ఇప్పుడు నువ్వు ఎత్తినది రామావతారం. నిద్రలేవగానే పరాకుతో నా గద, లక్ష్మి, శంఖం ఎక్కడ, అనకు. నువ్వు 'నరశార్దూలుడివి'. నరులలో శ్రేష్ఠునిగా ఉన్నావు. దేవ రహస్యం బయట పడనీయకు. రాక్షసులు వింటారు. ఒకే ఒక్క నరుడిగా విష్ణువు పుడతాడని ఊహించిన రావణుడు, గూఢచారులని ఈ అరణ్యంలో ఉంచాడు. ఎత్తుకుపై యెత్తుగా దశరథునికి నల్గురిగా నువ్వు జన్మించావు. ఈ నల్గురిలో ఎవడు విష్ణువో తెలియక, రావణుడు తికమకపడు తున్నాడు. అందుకని ఆ విషయం రహస్యంగానే ఉండనీ!.

స్వామీ ! ఈ ఆనందం నన్ను అనుభవించనీయక పోవడం కూడా నువ్వే చేస్తున్నావు. ఈ కర్తవ్యాన్ని నామీద ఉంచావుగదా ! బాధ్యత నిన్ను లేపమని అంటోంది. మనస్సు క్షమించమని ప్రాధేయ పడుతోంది. తప్పదు బాధ్యత ! స్వామీ ! రోజులో, ఎవరికి ఏమేమి విధి ప్రకారం కావాలో నిర్ణయించే వాడివి నువ్వైతే, ఆ నీకు ఈ రోజున ఏం చేయాలో నిర్ణయించి – 'ఈపనులు చేయవలసి ఉన్నావు కాబట్టి లే !' అని లేపేవాణ్ణి నేను కావడం ఎంత ఆశ్చర్యమో ! స్వామీ ! అని లేపాడు.

*ఇది శ్రీ వేంకటేశ్వర సుప్రభాతంలోని మొదటి శ్లోకంగా ప్రసిద్ధంగా కన్పిస్తూ ఉంది. సుప్రభాతాన్ని వ్రాసినవాడు 'సుందరజామాతృముని'. (శ్రీమత్సుందర జామాతృ ముని వ్రాసినవి). ఈ రామాయణ శ్లోకాన్ని తన సుప్రభాతంలో మొదట శ్లోకంగా ఉంచి, 2వ శ్లోకం నుండి సొంతంగా వ్రాసాడు. ఈ శ్లోకం చదివేప్పుడు పైన ఉన్న భావాన్ని మనసులో నిల్పుకోవాలి. మనసుతో శ్లోకాన్ని చదివితే చాలు. మనసు నిలవక 1000 చదివినా నిష్ప్రయోజనమే.*

*"ఆద్యమే సఫలం జన్మ సుప్రభాతాచమేనిశా ।*
*యదున్ని ద్రాబ్జపత్రాక్షం విష్ణోర్ద్రక్ష్యామ్యహమ్ముఖమ్॥" (నిద్రలేస్తున్న మహావిష్ణువు ముఖాన్ని చూస్తూ ఉండడం వలన నా జన్మకి రాత్రి అనేది పోయి తెల్లవారింది జీవితం.)*

## అంగదేశపు కథ (పైకథ)

రామలక్ష్మణులు నిద్రలేచి, ప్రాతఃకాలంలో చేయవలసిన గాయత్రీ జపాదులన్నీ ముగించుకొని మహర్షికి నమస్కరించి బయలుదేరారు. ఒక ఆశ్రమం కన్పించగానే రాముడు 'ఈ ఆశ్రమం ఎవరిది ? ఎవరున్నారు? విన కుతుహలంగా ఉంది. మా యిద్దఱికీ విన్పించండి స్వామీ !' అని ప్రార్థించాడు.

విశ్వామిత్రుడు చెప్పసాగాడు. 'శివుడు' ఒకప్పుడు ప్రమథగణాలతో ఇక్కడికి వచ్చాడు. తీవ్రనియమాలతో తపస్సు ప్రారంభించాడు. ఇంద్రుని ఆజ్ఞపై మోహాన్ని

కల్పించి క్షణకాలం చలించేలా చేసాడు. కోపించిన శివుడు మన్మథుణ్ణి భస్మం చేసేసాడు మన్మథుని అంగాలు(అవయవాలు) భస్మం అయిన చోటు కాబట్టే దీన్ని అంగదేశమన్నారు. అంగాలు లేనివాడు కాబట్టి అతణ్ణి అనంగుడన్నారు. అప్పటి నుండి ఎందరో తరతరాలుగా తపస్సు చేసుకుంటూ ఇక్కడే ఉన్నారు. ఈ రాత్రి ఇక్కడే ఉందాం. అంటూండగానే, ఆ ప్రాంతపు మహర్షులంతా వచ్చి దివ్యదృష్టితో విషయాన్ని గ్రహించి మహర్షికి, రామలక్ష్మణులకి అర్ఘ్య పాద్యాలిచ్చి సత్కరించారు.

సాయంత్రం కాగానే, ముగ్గురూ సాయంకాల జపాదులు ముగించారు. ఆ ఆశ్రమంలోనే సుఖంగా పుణ్యకథాకాలక్షేపం చేసి పిమ్మట నిద్రించారు.

**లో కథ**

విశ్వామిత్రుడు ఒకప్పుడు క్షత్రియుడు. పాలకుడైనవానికి ఏ దేశపు వృత్తాంత మేదో తెలియాలి. రాజు కాబోయే రామునికి దేశాల వృత్తాంతాలు తెలిసిన విశ్వామిత్రుడు, వాటి అన్నింటినీ చెప్పాలి. ప్రతి దేశపు పేరువెనుకా కథ ఉంటుందని దీనివి బట్టే గ్రహించాలి. లేదను కోరాదు. మనకి తెలియదను కోవడం, వివేకుల లక్షణం.

దీనిలో మరో బోధ కూడా ఉంది ! 'రామా! ముందు కాలంలో నీవు వియోగ బాధని అనుభవించాలి. ఇంతకు మీది కాలంలో నీ భార్య నీ వెంట ఉన్నా కూడా,తమ్మునితో అరణ్యంలో గడపాల్సి వస్తుంది. మన్మధుణ్ణి జయించిన శివుని కథ విన్నావుగా ! ఈకథ నీకు మార్గదర్శకమై, అపకీర్తిని నీకు తేరాదని దీన్ని చెప్తున్నాను' అనేది కూడా.

'తారకుడు' అనే రాక్షసుణ్ణి చంపగల 'కుమారుడు' పార్వతీ శంకరుల వ కలగాలని దేవతల ఆలోచన. అక్కడి శంకరుడు దేవతల ఆలోచనని గమనిం లోకక్షేమం కోసం చలించినవాడు కావలసి వస్తే, మన్మథుణ్ణి ధ్వంసం చేసి, కథి తలక్రిందు చేసాడు. రామచంద్రా ! కామాసక్తుడు కావలసిన శివుడు - కామజయాన్ని చేసాడు. కామజయాన్ని చేయవలసిన నువ్వు - కామాసక్తుడివి మాత్రం కాకు ! అని కూడ బోధ.

అక్కడి ఆశ్రమంలోని మహర్షులంతా ఘోర తపస్సు చేసారు కాబట్టే వారికి విష్ణు దర్శనం, వారి ఆశ్రమం వద్దే అయింది. శ్రీ మద్రామాయణంలోని చిత్రం ఇది. రామలక్ష్మణులని వెదుక్కుంటూ విశ్వామిత్రుడు వస్తే, స్థాణ్వాశ్రమమహర్షులకి దర్శన మిచ్చేందుకై విష్ణువే వారి వద్దకు వచ్చాడు.

ప్రపంచంలో అందరి మనస్సులనీ మథించి బాధించేవాడు మన్మథుడైతే, అతణ్ణి కూడా బాధించినవాడు శంకరుడు. స్థాణువుగా ఉండి శంకరుడు తపస్సు చేసిన ఈ ఆశ్రమమే 'స్థాణ్వాశ్రమం'.

## మలద - కరూశదేశాల కథ

రామలక్ష్మణులు విశ్వామిత్రునితో బయల్దేరి గంగలో నావ నెక్కి ప్రయాణిస్తూండగా 'పెద్ద ధ్వని' వినిపించసాగింది. ఆ వృత్తాంతాన్ని విశ్వామిత్రుడిలా చెప్పాడు.

'రాకుమారులారా! బ్రహ్మ ఒకసారి, కైలాసంలో సరస్సు ఉంటే బాగుంటుందని ఊహించి మనస్సుతో సరస్సుని సృష్టించాడు. అదే బ్రహ్మమానససరోవరం. దాంట్లోంచి పుట్టినది 'సరయూ' ఆ నది, అయోధ్యకు పడమరనుండి ఉత్తరం మీదుగావస్తూ, పల్లంగా తూర్పున ప్రవహిస్తున్న ఈ గంగలోనికి ఎత్తునుండి పడుతోంది. ఆ ధ్వనే యిది. ఈ నదుల సంగమానికి నమస్కరించండి ! అని పలికి గంగ దక్షిణపు ఒడ్డు రాగా తాను దిగి, వారిని వెంట పెట్టుకొని తీసికొని పోయాడు విశ్వామిత్రుడు.

రాముని ప్రశ్నపై, కనిపించిన అరణ్యాన్ని గూర్చి ఇలా చెప్పాడు. రామా! ఒకప్పుడు వృత్రుడనే బ్రాహ్మణునికీ, దేవేంద్రునికీ వైరం పెరిగింది. దేవతలు ఎలాగో సఖ్యం కలిపారు. కశ్యపుని పుత్రుడైన తాను శస్త్రాస్త్రాలతో వధింపబడరాదని వరంకోరాడు. ఇంద్రుడు మైత్రి నటిస్తూ, సముద్రతీరంలో నురుగులోనికి తన వజ్రాయుధ శక్తిని పంపి వృత్రుణ్ణి వధించాడు. బ్రాహ్మణుణ్ణి హత్య చేసిన కారణంగా ఇంద్రునికి బ్రహ్మహత్యాపాతకం చుట్టుకోవడం వలన అధికంగా ఆకలీ - స్వేదమూ ప్రారంభమయ్యాయి. దేవతలూ - మహర్షులూ ఆయన నిక్కడ మంత్ర పూర్వకంగా అధికంగా గంగలో స్నానం చేయించారు. ఆయన వెట్టి ఆకలీ- అధికస్వేదమూ ఇక్కడ నశించాయి. కాబట్టి మలద, కరూశ దేశాలు అయ్యాయి. సంతోషించిన దేవేంద్రుడు ఇక్కడ ఈ 2 దేశాలనీ సర్వసమృద్ధంగా నిర్మించాడు. అయితే అరణ్యంగా మారడానిక్కారణం ాటక అనే రాక్షసి.

### కో కథ

ఇంద్రుడైనా సరే తప్పు చేస్తే శిక్ష ననుభవించక తప్పదు. బ్రాహ్మణుడైనా ఆయుధంతో ఎదుర్కొని యుద్ధానికి సిద్ధపడ్డప్పుడు హత్యాపాతకం రాదు. పరశురాముడూ, అశ్వత్థామా సాక్ష్యాలు. అయితే ఇంద్రుడు వృత్రుణ్ణి నమ్మించి, సముద్రతీరంలో నిరాయుధుడైన వృతుణ్ణి వధించడంతో హత్యాపాతకం వచ్చింది.

కొన్నాళ్లపాటు ఇంద్రుడు బాధపడ్డాక, దేవ మహర్షులు మంత్రపూర్వక స్నానాన్ని గంగలో చేయిస్తే తొలగింది ఆ పాపం. ఆ పాపం యొక్క ఆధిక్యాన్నీ దాన్ని తొలగించు కోవడానికి పడ్డ శ్రమనీ గమనించమని రామునికి బోధ.

రావణుడూ పులస్త్యబ్రహ్మపుత్రుడే. అతడు, యుద్ధంలో ఆయుధంతో నిలబడ్డప్పుడు వధిస్తే దోషంలేదు గాని,నిరాయుధునిగా ఉన్నప్పుడూ - లేదా వంచనతోనూ

– వధిస్తే బ్రహ్మహత్యా దోషం రావచ్చును సుమా! అని హెచ్చరిక. ఈ కారణం చేతనే యుద్ధంలో ఒకరోజు నిరాయుధుడిగా ఉన్న రావణుణ్ణి రాముడు విడిచేసాడు కూడ.

చిన్నప్పుడు ఇలాటి పరమార్థకథలు చెప్తే ఆ నీతి బోధ ఒంటపట్టే అవకాశం ఉంటుంది. ముందునాటికి దేశాన్ని రక్షించగల పౌరుడౌతాడు. (అంతేగాని, వధలు, దోపిడీలు ఉన్న పిచ్చి సినిమాలని, నవలలనీ చదివించి, చూపించి, వాటిని అదుపు చేసే శక్తి ఉండీ పట్టించుకోక 'నేటి బాలుడే రేపటి పౌరుడు' అని అరిస్తే ప్రయోజనం లేదు. ఈలాటి వాటిని చూచిన, చదివిన వానిలో హింసా ధోరణి ప్రబలి, ఊహించని రీతికి దేశం వెళ్లిపోతుంది. రాజుకాబోయే 'ఛత్రపతి శివాజీ' కి తల్లి, భారతరామాయణ భాగవతాలని విన్పించినదిందుకే!).

ఇంద్రుడు నిర్మించిన నగరాలే అరణ్యాలయ్యాయేమిటి? అంటే, వ్యక్తి ఆయుస్సు లాగానే భవనాలకి, పట్టణాలకి కూడా ఆయుస్సు అనేది ఉంటుంది. ఒకప్పటి లంక, తక్షశిల, ద్వారక వంటి పట్టణాలు నేడు సముద్ర గర్భంలో ఉన్నాయిగా !

## తాటకాకథ (పై కథ)

'సుకేతుడు' అనే పేరుగల యక్షుడు, సదాచార సంపన్నుడు. బ్రహ్మ, అతని తపస్సుకి మెచ్చి, వేయి ఏనుగుల బలంకల కన్యని వరంగా ఇచ్చి, పుత్ర సంతానాన్ని వరంగా ఈయలేదు. రూపవంతురాలూ,కామరూపిణీ (కావలసిన రూపం ధరించగలది) అయిన ఆమె, ఝర్ఝపుత్రుడైన సుందునికి భార్య అయి, మారీచునికి తల్లి అయింది.

సుందుడు చేసే దుర్మార్గాలని తట్టుకోలేక, అగస్త్యమహర్షి శపిస్తే సుందుడ మరణించాడు. భర్తని చంపిన దుర్మార్గుడనే కోపంతో తాటక, తన పుత్రుడు మారీచునితో సహా, అగస్త్యుని మీదికి పోయి, ఆయననే మ్రింగజూచింది. మారీచుడూ తల్లిని అనుసరించాడు.

"రాక్షసుడిగా అయిపొమ్మని" ముందుగా మారీచునికి మహర్షి శాపం ఇచ్చాడు. తన పుత్రుణ్ణి శపిస్తాడా ? అని విజృంభించిన తాటకని కూడా 'నరమాంసభక్షణ చేసే రాక్షసిగా మారిపొమ్మని' శపించాడు.

రామచంద్రా! అప్పటినుండి అగస్త్యుని మీది కోపంతో, ఆయనని ఏమీ చేయలేక, తాటక ఈ రెండు నగరాలనీ 'ఇదిగో – ఇలా పాడుబడేలా చేసింది'. అది దుర్మార్గురాలు. అధర్మపరురాలు చంపెయ్యి' అని ఆజ్ఞాపించి –'స్త్రీవధ' గూర్చి అనుమానిస్తూన్న రామునికి – తప్పులేదని చెప్పి పురికొల్పాడు.

రాముడు ధనుష్టంకారం చేసాడు. అది ఆగకపోతే, బాహువులు తెగకొట్టాడు. అయినా విజృంభిస్తూంటే, లక్ష్మణుడు ముక్కు చెవులు కోసాడు. విశ్వామిత్రుడు 'ఇదే

సమయమని' మళ్లీ పురికొల్పాడు. అది ఇంకా దుశ్చేష్టలు చేస్తూంటే ఎదుటొమ్ముపై బాణంవేసి, రాముడు దాన్ని కొట్టి చంపాడు.

దేవేంద్రాది దేవతలు ప్రశంసించారు. దేవేంద్రుడు విశ్వామిత్రునికి అస్త్రోపదేశం చేయమని చెప్పివెళ్లాడు. రామలక్ష్మణులు ఆ రాత్రి అక్కడ నిద్రించి, విశ్వామిత్రునితో మఱునాటి ఉదయం బయలుదేరి వెళ్లారు.

## లో కథ

'వరం ఎప్పుడూ శాపమే' అని అనుకున్నాం. 1000 ఏనుగుల బలం. అదీ 'కన్య'కి ఈయడం - అది కూడా బ్రహ్మ ఈయడం (విధివ్రాత వ్రాసేవాడు) లో ఉన్న రహస్యాన్ని గమనించలేదు సుకేతుడనే తాటకతండ్రి. అంత బలం ఉంటే మదం పెరుగక తప్పదు.

బలిష్ఠురాలైన తాటకని సుందుని కిచ్చి వివాహం చేసారు. వాడూ బలవంతుడే. అంటే మదం మఱింత పెరిగిందన్నమాట. సత్పురుషుల విద్య ఎప్పుడూ నలుగురికి జ్ఞానదానం చేయడానికీ, సత్పురుషుల ధనం అనాథలకీ, పాత్రులైనవారికీ దానం చేయడానికీ, సత్పురుషుల శక్తి ఆపదలో ఉన్నవారిని రక్షించడానికీ ఉపయోగిస్తుందట. (విద్యా వివాదాయ ధనం మదాయ-శక్తిః పరేషాం పరిపీడనాయ-ఖలస్య సాధోర్విపరీత మేతత్-జ్ఞానాయ దానాయ చ రక్షణాయ కాని దుర్జనులకున్న విద్యా-ధన-బలాల్లో, విద్య, అడ్డదిడ్డంగా వాదించడానికి(పూర్తిగా గ్రంథాన్ని చదవకుండా, నాలుగు పాడిమాటలని విని వాదించడం), ధనం అహంకారాన్ని కల్గించడానికీ, బలం (శక్తి) ఇతరులని పీడించి భయపెట్టడానికీ పనిచేస్తాయట.

## చిన్నవాణ్ణి ముందు శిక్షించాలి

తాటకాసుందుల బలం దుర్జనబలం కదా! అగస్త్యుని మీదకి దూకాలనే బుద్ధిని పుట్టించింది. 'ప్రపంచంలో లోకువ ఎవడు?' అంటే 'ఎవనిజోలికిపోనివాడూ-వాడి గొడవని వాడు చూచుకొనే వాడున్నూ' అని దాని భావం. మొదట మారీచుడూ, తాటకా ఇద్దఱూ దూకి మీదికి వస్తే, మారీచుడికి రాక్షస శాపమిచ్చాడు అగస్త్యుడు. తాటక వయస్సు చెల్లిన రాక్షసి. దాని బుద్ధి 'పెడబుద్ధి' అయినా పెద్దగా లోకానికి నష్టం లేదుకాని, వయస్సుచేత చిన్నవాడైన మారీచుడు పాడైతే, వీడివలన లోకం చాలకాలం నష్టపడవలసి వస్తుంది. పైగా, వీణ్ణి ఆదర్శంగా తీసికొనే దుర్మార్గులు మఱికొందఱు ప్రబలవచ్చునని భావించి మారీచుణ్ణే శపించాడు. పూర్వ ఋషుల దృష్టి, లోక క్షేమ దృష్టి. 18 నుండి 25 మధ్య వయసువాడి ప్రవర్తనని బట్టి లోకం ఆధారపడి ఉంటుందని

ఎప్పుడూ ఆలోచిస్తుండే దూరదృష్టి. 2. ఈనాడు నేరాలు ఆ వయసు వారివలననే జరుగుతున్నాయి - అవి వార్తాపత్రికలద్వారా చూస్తున్నాం. పిల్లని ప్రోత్సాహించేవి సినిమాలని నేరం చేసినవాళ్లే చెప్పినట్లుగా కూడ వార్తాపత్రికలు వ్రాసాయి. విషయం తెలుసు. పరిష్కారం ఎలా(?)

## రూపంబట్టి దోషం

మారీచుని రూపాన్ని చూచిన ప్రతిక్షణమూ, వాడిచేత నేరం చేయించిన దోషం, 'తనదని' తల్లికి తెలియాలి. మారీచుణ్ణి చూచిన అందరికీ, రూపాన్ని బట్టి 'నేరం చేసినవాడు' అనే విషయం తెలియాలని మహర్షి భావన. అందుకే విరూపశాపం (రూపం మారి పోయేశాపం) ఇచ్చాడు.

పూర్వకాలపు రాజుల పాలనలలో 'దొంగతనం' చేస్తే నుదుటిపై '+' గుర్తుని వాతగా వేసేవారట. చూడగానే అందరికీ అర్థమయ్యేది. ఆ నేరం చేసినవాడు మానసికంగా వ్యథ చెంది దేశాన్ని విడిచి గౌరవంగా బ్రతికే చోటుకి పోతాడు. ఇతణ్ణే గమనించిన మరెవ్వరూ, అలాటి పనినీ చేయరు. అలాటి సత్‌దృష్టి ప్రాచీనులది.

మారీచుణ్ణి శపించగానే కోపించిన తాటక పశ్చాత్తాపపడక, ఇంకా మీదికి దూకింది. పశ్చాత్తాపం ఉన్నవాణ్ణి క్షమించవచ్చుగాని, లేనివాణ్ణి క్షమించరాదని భావించి, దానికీ ఆ శాపాన్నే మహర్షి యిచ్చాడు. తన భర్త 'మదం' వలననే చచ్చాడు. కొడుకూ తన మదం వలననే రాక్షసుడయ్యాడు. అయినా, తాటకలో పశ్చాత్తాప బుద్ధి కలగలేదంటే, దీన్ని క్షమించరాదని భావించి, తాటకనీ రాక్షసి కావలసిందని శపించాడు. కొడుకుని శపిస్తే, 'తప్పు ఎవరిది?' అని భావించక, వెనక వేసికొచ్చింది కాబట్టి, దీన్నీ శపించాడు. లోకంలో ఇలాటి వాళ్లుంటారు. వాళ్లపేరు ఏదైనా, లక్షణం దీనిదన్నమాట. అగస్త్యు డాలోచించి - చూడగానే 'ఇది నేరం చేసినది' - అని ముఖం బట్టి గమనించేలా శపించాడు.

ఈ మహర్షి అభిప్రాయానికి అనుగుణంగానే రాముడు విశ్వామిత్రుణ్ణి అడిగాడు. 'స్వామీ! యక్షులకి బలం తక్కువ అంటారు గదా! మరి దీనికి 1000 ఏనుగుల బలం ఏమిటి?' అని (అల్పవీర్యా యదా యక్షా శ్రూయతే మునిపుంగవ!) దానికి సమాధానంగా విశ్వామిత్రుడు 'పైకథ ' మాత్రం చెప్పి, (రాముడు లోకథని, అర్థం చేసికోగల దిట్ట కాబట్టి) ప్రజారక్షణం కోసం, పాతకమేమో ! అని ఆలోచించవలసిన అవసరంలేదనీ, నీ బాహుబలంతో 'చంపమనీ' పలికాడు. (పాతకం వా సదోషం వా కర్తవ్యం మహతా సతా).

రామునికి ధర్మసందేహం కల్గింది. మొదటగా తాను చేసే వధ ఇది. అది కూడా స్త్రీవధ. 'నస్త్రీ వధ్యా' స్త్రీని చంపరాదనేది రాజనీతి ధర్మం కూడాను. చంపమని

చెప్పేది గురువు. 'న గురోర్వాక్యమతిక్రమీత్' గురువాక్యాన్ని ఉల్లంఘించరాదు. ఏం చెయ్యాలి? అని ఆలోచన కల్గింది.

రాముని అభిప్రాయాన్ని గమనించి స్త్రీవధని చేసిన వారి విశేషాలు చెప్పాడు విశ్వామిత్రుడు. పృథ్వి నంతనీ నాశనం చేయదలచిన వైరోచని(విరోచనుని కూతురు) అయిన 'మంథర' అనే దాన్ని దేవేంద్రుడే చంపాడు. రాక్షస గురువైన శుక్రుని తల్లి, భృగుమహర్షి భార్యని (దుర్జనులైన రాక్షసులకి ఎప్పుడూ ఆశ్రయమిచ్చి, లోకక్షేమాన్ని నాశనం చేయిస్తూంటే, ఇంద్రుణ్ణే చంపించాలని ప్రయత్నిస్తూంటే) శ్రీ మహావిష్ణువే చంపాడు. ఇలా ధర్మం తప్పిన స్త్రీలని మహాత్ములే చంపారు, అని చెప్పాడు. (అధర్మ సహితా నార్యః హతాః పురుషసత్తమై ః పరోపతాపినో లోకే యోషై చోత్పథచారిణః తే హంతవ్యా న్నపై పౌర్త్రే ః) -

రామునికి ఆలోచన కలిగింది. దోషం చేసినదాన్ని విడువరాదు. 'స్త్రీని వధింపరాదు' అనే ధర్మం ప్రకారం విడిచిపెడుతూ వెడితే 'స్త్రీలైతే దోషం చేయవచ్చునని అనుమతి ఇచ్చినట్లేకదా!' అని భావించాడు. ధర్మం ఒకటి. ధర్మ సూక్ష్మం మఱొకటి. ధర్మం-రాముడాలోచించినది. ధర్మసూక్ష్మం-విశ్వామిత్రుడు చెప్పినది. లోకాన్ని బాధపెట్టేవాళ్లు ఎవరైనా, రాజులచే చంపబడదగినవారే! అనేది సిద్ధాంతం.

తండ్రి తనని పంపుతూ నా పరోక్షంలో, 'దశరథుడు ఈ విశ్వామిత్రుడే సుమా!' అని రామునికి చెప్పాడు. వెంటనే రాముడు 'మా తండ్రి మాట ప్రకారమూ, మీ శాసనం బట్టీ, గోబ్రాహ్మణులక్షేమం కోసమూ, దేశసుఖం ఆలోచించీ, ఏ శంకాలేకుండా దీన్ని చంపుతాను' అన్నాడు. సోఽహం పితుర్వచ శ్రుత్వా శాసనాద్బ్రహ్మవాదినః - గోబ్రాహ్మణ హితార్థాయ లోకస్యాస్య సుఖాయచ కరిష్యామి న సందేహః) అంటూనే వింటినారిని దిక్కులు పగిలేలా మ్రోగించాడు.

ఆ ధ్వనికి తాటక క్రోధపరవశురాలై మీదికి పరుగెత్తి రాసాగింది. రాముడు లక్ష్మణునితో 'తమ్ముడూ! ఆడుదైన దీన్ని చంపబుద్ధి కావడంలేదు. మాయాబలం ఉన్న దీని ముక్కూ చెవులూ- ఇంకా మీదికొస్తే కాళ్లు చేతులూనఱికేస్తాను' అంటుండగా అది రాముని మీదకే దూకబోతే, విశ్వామిత్రుడు హూంకారాన్ని చేసి, దానిని అదలించి రామ లక్ష్మణులని ఆశీర్వదించాడు.

అది దుమ్ము జిమ్ముతూ చీకటి చేయసాగితే, ఒక క్షణం రామలక్ష్మణులు సొమ్మసిల్లిపోయినారు. మీదట కన్పించకుండా రాళ్లవాన కురిపించ సాగింది. మీదకి దూకబోతే రాముడు బాహువులు నఱికాడు. కేకలుపెడుతూ పడిపోగా ముక్కూ చెవుల్నిలక్ష్మణుడు కోసేసాడు. (సౌమిత్రి రకరోత్ క్రోధాద్హృతకర్ణాగ్రనాసికామ్).

అప్పటికి రాళ్లవాన కురిపించ సాగింది. ఆకాశంలో అనేక రూపాలు చూపసాగింది. 'రామా!' సాయంకాలమైతే రాక్షసుల బలం, మఱింత అవుతుంది. 'జాలి విడిచి

చంపెయ్యి' అన్నాడు. (అలం తే ఘృణయా రామ! పాపైషా దుష్టచారిణీ - వధ్యతాం తావ దేవైషా పరా సంధ్యా ప్రవర్తతే.) విశ్వామిత్రుని సూచన విని మఱింత కోపంతో మీదికి దూకబోతే ఎదుఱొమ్ములో బాణం వేసి దాన్ని చంపేసాడు.

విశ్వామిత్రునితో చంపుతానని చెప్పిఎందుకిలా రాముడు చేసాడు? అంటే దానిలో విశేషం ఉంది. చంపమన్నారుగదా! అని చంపేస్తే ఆ దోషం గురువు మీదికి రావచ్చు గదా! ఈ రోజుల్లో అయితే, ఆ తప్పేదో పైవాడికి పోతుంది గదా! అని మహాసంతోషంతో, అన్ని పనులూ మాని, ఆ పని ఒక్కటి, అతి శీఘ్రంగా చేస్తారు. గురువుకి దోషం తెచ్చే శిష్యుడిని కారాదని ఆలోచించి, తాటకకి అవకాశ మీయదలచి ముందు ధనుష్టంకారం, తర్వాత బాహువులు నఱకడం, తర్వాత ముక్కు చెవులూ, ఆ మీదట ప్రాణమూ తీసాడు. (గురోర్దోషహరణం ఛత్రమ్. తచ్ఛీలమస్యేతి ఛాత్ర ః గురువు యొక్క దోషాల్ని పైకి రానీయ కుండా ఉంచేవాడు ఛాత్రుడు. అంటే గురువులు దోషాలు చేసి, ఇల్లాంటి శిష్యులని చేర దీయాలనికాదు. గరునింద చేయరాదు. గురువుకి నింద వచ్చే పనులనిపిస్తే చేయరాదనీను.)

ఈ విధానమే నేడూ అనుసరించబడుతోంది. రక్షకభటులు ముందు లాటీ చార్జి హెచ్చరిక, తర్వాత లాటీ చార్జి, ఆ మీదట బాష్పవాయువు, తర్వాత గాలిలోకి కాల్పులూ, చివరికి వధ చేస్తారు. ఇది రామాయణానుసరణమే కదా! మఱి ముక్కుచెవులను ఎందుకు కోయాలి? రాక్షస పద్ధతి ప్రకారం తిరిగి వచ్చే అవకాశమున్న బాహువులని నఱికాడు, వెనక్కి పోతుందేమోనని. కాని మీదకి వస్తూ చేతుః సృష్టించుకొని రాళ్ల వాన ప్రారంభించింది.

అది రాక్షస స్త్రీ. త్రాగిత్రాగీ, మాంసాన్ని తిని తినీ, మత్తూ-అహంకార అన్నిటితోటీ దానికి కళ్లు పనిచేయడం మానేసాయి. రాక్షసులకి 'ఘ్రాణశక్తి' (నరవాసన అనేది ఇందుకే) ఎక్కువ. పంచజ్ఞానేంద్రియాలలో ఏది లేకపోతే ఆ లేనిదాని శక్తి మిగిలిన వానికి వస్తుంది. ఆ వాసనతో, రామలక్ష్మణులెక్కడున్నదీ తెలుసుకుని రాళ్లవాన కురిపిస్తోంది. ముక్కు కోసేస్తే నరవాసన తెలియక ఱాళ్ల వాన కురిపించలేదుగదా! అని, భావించి - తమ మాటలని విని మళ్లీ వస్తుందని, ఆలోచించి ఆ అవకాశం లేకుండా చేయడానికై చెవుల్ని కూడా తెగకోసాడు. దానికి పంచజ్ఞానేంద్రియాలలో జిహ్వ (నాలుక) మాంసం తిని తినీ, ఏనాడో మొద్దుబాఱిపోయింది. కన్నులని బాణంతో పొడిచినా, ముక్కు ద్వారా వాసనచూసి చంపేఅవకాశం ఉంది. ఇక కన్నులు త్రాగుడు మత్తులో ఉండీ లేనట్టే, మాంసం వలన శరీరం ఏనాడో మొద్దుబాఱిపోయింది. ముక్కు చెవులని కొట్టాక, జ్ఞానేంద్రియాలు లేనట్టే.

అది ఎన్నో తప్పుల్ని చేసినా, రాముడు ఎన్నో అవకాశాలిచ్చినా లెక్క చేయక పోవడం వలన రాముడు చంపితే 'స్త్రీ వధ' అనడం సబబు కాదు. (తప్పు చేయడంతోటే

స్త్రీత్వం పోయింది. అటువంటప్పుడు ఆమెని తేవడానికి స్త్రీరక్షకభటులు కావాలనడాన్ని పూర్వపు ఇతిహాసం అంగీకరించదు).

## 'ఆతతాయి' అంటే ........

తాటకని చంపడం దోషం కాదు. కారణం ఆతతాయి చేసే 6 తప్పుల్లో ఏది చేసినా మరణ దండనం విధించవచ్చు. (నాతతాయి వధే దోషః హంతుర్భవతి కశ్చన - ప్రకాశం వా ప్రకాశం వామన్యు స్తం మన్యుమృచ్ఛతి॥ అగ్నిదో గరదశ్చైవ శస్త్రపాణిర్ధనాపహః క్షేత్రదారాప హర్తారౌ షడేతా హ్యాతతాయినః॥) (1) ఇంటికి నిప్పు పెట్టిన వాణ్ణి (దుర్యోధనుడు లక్కయింటికి పెట్టాడు. (2) విషాన్ని పెట్టినవాణ్ణి (భీమునికి విషాన్ని పెట్టించాడు) (3) నిష్కారణంగా ఆయుధాలతో మీదికి వచ్చిన వాణ్ణి (ఉత్తర గోగ్రహణం చేయించి నప్పుడు ఇంతేగదా! (4) ఇతరుల ధనాన్ని అపహరించిన వాణ్ణి (పాండవుల సంపదని అపహరించాడు) (5) ఇతరుల భూమిని ఆక్రమించినవాణ్ణి (రాజ్యం కాజేసాడు) (6) ఇతరుల భార్యని అపహరించదలచినవాణ్ణి (తొడచూపి ద్రౌపదిని రమ్మని పిలిచాడు) వధించితే దోషం లేదు. 6టిల్లో ఏ ఒక్కటి చేసినా 'అతతాయి' అంటారు. *(చిన్నప్పుడు తప్పు చేస్తే 'ఆకతాయి' అనేవారు. ఆమాటని బట్టైనా ఇతిహాసం వినవచ్చు. ఆకతాయి కాదు ఆతతాయి. ఇతిహాసంలో నుడివడిన అలాంటి తిట్లని బ్రతుక నిద్దాం.)* పై విధం ప్రకారం దుర్యోధనుణ్ణి 6 మార్లు మరణదండనచేసి వధించాలి. కాని విడిచారంటే పాండవులెంతటి శాంతిపరులో తెలుస్తుంది.

అలాటి 6లక్షణాల్లో 'శస్త్ర పాణిః' . నిష్కారణంగా రాముని మీదికి ఆయుధాలని ధరించి (రాళ్లూ, చెట్లూ) దూకడం బట్టి తాటక వధించదగినదే. కాబట్టి రామునిది ధర్మమే.

ఇంద్రుడు 'రామునికి' అస్త్రాలని ఉపదేశించమని విశ్వామిత్రునికి చెప్పి వెళ్లి పోయాడు. కారణం 'పరీక్షలయ్యాక పట్టా' ఇవ్వాలి. అస్త్రాలని (మంత్రంతో ప్రయోగింపబడే ఆయుధాలు) శిష్యుడు ప్రయోగించగల యోగ్యత ఉన్నవాడా? కాడా? అని ఆలోచించి, పరీక్షించి ఇవ్వాలిగా! (శిష్యం పరీక్ష్య దాతవ్యాన్యస్త్రాణి.) ఆ పరీక్షలో నెగ్గాడు రాముడు. అస్త్రాలనీయడానికి విశ్వామిత్రుడు పెట్టిన ప్రవేశ పరీక్షలాటిది ('Entrance') తాటకావధ. ఆ అస్త్రాలకి అధిష్ఠాతలైన దేవతలంతా ఎట్ట ఎదుట నిలువబడితే అవసరమైనప్పుడు పిలుస్తానని, నమస్కరించి చెప్పాడు రాముడు. మారణాయుధాలని అవసరమైనప్పుడే ధరించి ఉండాలి కాని, ఎప్పుడూ తనతో ఉంచడం సరికాదని బోధ.

విశ్వామిత్రుడు అస్త్రాలని ఇచ్చాడంటే, రావణవధ కోసం రాముణ్ణి సిద్ధం చేయడమేనని స్పష్టంగా తెలుస్తోందిగా. ఇక రావణుని వద్దకు వెళ్లినా, దశరథుని పుత్రుడు ఒక్కడే ఉండవలసివస్తే (ఒక్కడు) తాటకని చంపడానికి, ఇద్దరొచ్చారా? అనుకొంటాడు

అతడు. ఎవడు తనని చంపబోతున్నవాడు? అనే అనుమానం, అనుమానంగానే మిగలాలనే, విశ్వామిత్రుడు, రాముణ్ణి రమ్మనమన్నప్పుడు లక్ష్మణుడొచ్చినా వెంట రానిచ్చాడు. 'దేవరహస్యం' ఇలా ఉంటుంది. విషయం తెలిసినట్టూ- తెలియనట్టూను.

ఇదంతా ఒక ఎత్తు. తాటకని చంపిన వనంలోనే ఆ రాత్రి ఉండి, మర్నాడు బయలుదేరడం ఒక ఎత్తు. ఇలాటి సంఘటనం జరిగాక, దాని పుత్రుడు మారీచుడూ, వాని స్నేహితుడు సుబాహువు మఱి ఎందఱితో వస్తారో చూద్దామని రాత్రి ధైర్యంగా ఉండడం, ఆ వనంలోని మహర్షులకి లోపల ఉన్న భయాన్ని తొలగించడానికీ, తమ ధైర్యాన్ని గూఢచారులుగా ఉండే రాక్షసులకి చాటడానికీను. తాటకా వధ ద్వారా, శత్రువునైనా, ఎంత ఆలోచించి, ఎన్ని అవకాశాలో ఇచ్చి ఎలా, చంపవలెనో అర్థమయింది. ఇదంతా రావణవధకోసం రామునికి ఇచ్చే 'శిక్షణ' తప్ప వేఱు కాదు.

## సిద్ధాశ్రమ వృత్తాంతం

తెల్లవారింతర్వాత బయలుదేరి వెళ్లగానే ఒక పుణ్యాశ్రమం వారికగుపించింది. రాముని ప్రశ్నపై విశ్వామిత్రుడు చెప్ప ప్రారంభించాడు.

'రామా!' 'బలి' అనే చక్రవర్తి దేవేంద్రుణ్ణి జయించి, తానే రాజ్యపాలనం చేస్తూ యజ్ఞం ప్రారంభించాడు. ఒకప్పుడు శ్రీమహావిష్ణువు తపస్సు చేస్తూ ఉన్న కాలంలో ఇదంతా జరిగింది. బలిచక్రవర్తి మహా మహాదానాలని లెక్కలేకుండా చేస్తున్నాడు కాబట్టి, యజ్ఞం అయ్యే లోపులో ముల్లోకాలనీ దానంగా అడిగి దేవతల రాజ్యం వారి కిప్పించేలాచేయాలని దేవతలు విష్ణువుని ప్రార్థించారు. విష్ణువు అంగీకరించాడు.

ఇదే సమయంలో కాశ్యపుడు అదితితో సహా విష్ణువు గూర్చి తపస్సుచేసి, ప్రత్యక్షమైన విష్ణువుతో 'విష్ణూ! నా భార్య అదితి గర్భంలో నువ్వు జన్మించి దేవతల కోర్కె తీర్చు. నాతపస్సు ఇక్కడ సిద్ధించిన కారణంగా దీనికి సిద్ధాశ్రమమనే ప్రసిద్ధి వచ్చేలా అనుగ్రహించు' అన్నాడు.

ఆ విష్ణువు వామనావతార మెత్తి బలిని అణగద్రొక్కి దేవతల కోర్కెని తీర్చింది ఈ కాలంలోనే, (*తస్మాద్విష్ణు ప్రసాదాయ వైష్ణవాన్ పరిపూజయేత్. విష్ణువు మీద భక్తితో, విష్ణువునే ఆదరించి, విష్ణు భక్తులని 'బలి' పాఱద్రోలాడు. నేరం చేసిన వాడైనాడు. తండ్రి – తన కిచ్చిన గౌరవంతో, తమ్ముళ్ళని చావబాదితే తండ్రి అంగీకరిస్తాడా ? కాబట్టి విష్ణువు సంతోషించాలంటే విష్ణువుతోపాటు విష్ణుభక్తులనీ ఆదరించాలి. భగవంతుడే అంటాడు 'అహం స్మరామి మద్భక్తమ్' అని ఆయన తన భక్తులని గూర్చి ఆలోచిస్తుంటాడట.*) విష్ణువు తపస్సూ అదితి కాశ్యపుల తపస్సూ దేవతల కోరికా సిద్ధించిన కారణంగా ఇది సిద్ధాశ్రమం. ఇక్కడే రాక్షసులు యజ్ఞాన్ని నాశనం చేస్తున్నారు. అని విశ్వామిత్రుడనగానే రామలక్ష్మణులు 'దీన్ని సార్థకనామధేయం

కలదాన్నిగా చేస్తాం. ఇక్కడే మీరు యజ్ఞ దీక్ష స్వీకరించండి' అని పలికారు. ఆ ఆశ్రమ తాపసులు అర్ఘ్యపాద్యాదులతో స్వాగతం ఈయగా, విశ్వామిత్రుడు యజ్ఞదీక్ష స్వీకరించాడు.

5రాత్రులు పూర్తై, 6వనాటి పగలు నుండి యజ్ఞ దీక్షలో విశ్వామిత్రుడున్నాడు. ఏ క్షణం లోనైనా రాక్షసులు రావచ్చునని అతి జాగరూకతతో రామలక్ష్మణులున్నారు. 10 రాత్రులై, 11వ పగలురాగానే, ఆకాశం చిల్లు పడేంత మాయమబ్బులూ, చూస్తుండగా ప్రవాహంలా నెత్తురూ—ఒక్కసారి పడసాగాయి.

ఈ శతంగానిక్కారణం మారీచ సుబాహులే అని భావించి, ఆకాశంలో తిరుగుతున్న వారిని గమనించి, తనసమక్షంలోనే యజ్ఞధ్వంసాన్ని సహించలేక క్రుద్ధుడై, మానవమనే పేరుకల అస్త్రంతో రాముడు మారీచుణ్ణి ఎదురొమ్ముపై కొట్టాడు. వాడు సముద్ర మధ్యంలో పడ్డాడు. సుబాహువు మీదకి ఆగ్నేయాస్త్రాన్నీ, వాని వెంట వచ్చిన రాక్షసులని 'వాయవ్యము' అనే అస్త్రాన్నీ ప్రయోగించి చంపివేసినాడు. *(సతేన పరమాస్త్రేణ మానవేన సమాహతః - సంపూర్ణం యోజన శతం క్షిప్త స్సాగర సంప్లవే / - ఈ శ్లోకంలోని 'స' అనే అక్షరం గాయత్రీ మంత్రంలోని 2వ అక్షరం. (ప్రతివేయి శ్లోకాలకీ ఒక అక్షరం చొప్పున ఉండడంలో, ఇది 2000 వ శ్లోకమని గమనించాలి).*

ఋషులు శ్లాఘించారు. సిద్ధాశ్రమమనే పేరుని సార్థక పఱచారని మళ్లీ అభినందించారు రాముణ్ణి.

ఒకే రాముడు, మారీచుణ్ణి మానవాస్త్రం వేసి సముద్రమధ్యంలో పడవేయడానికి కారణాలు చాల ఉన్నాయి. (1) రాముణ్ణి చూచినప్పుడల్లా తాటకని (తన తల్లిని) చంపినవాడు— అని మారీచునికి గుర్తురావాలి. (2) వీడిని, ఇప్పుడే వధిస్తే, ముందునాటికి సీతాపహరణంలో లేడివేషం వేసే దేవడు? (3) మారీచ సుబాహువుల్లో సుబాహువు బాగా రెచ్చగొట్టే లక్షణం ఉన్నవాడు. రెచ్చగొట్టేవానివల్ల తప్పక ప్రమాదముంటుంది. అందుకని సుబాహుని చంపేశాడు. (4) సరిగా చదవని పిల్లవానిని, గురువు బెత్తంతో కొడితే, అభిమానపడ్డ విద్యార్థికి మఱునాటి నుండీ పట్టుదలపై చదువు బాగా వచ్చినట్లు, అప్పటివఱకూ లేని 'విష్ణుభక్తి', 'రామబాణక్షతి' (రాముని బాణపు దెబ్బ) తెలియగానే వచ్చి పడింది. అదీ రామబాణంలోని ప్రత్యేకత అంటే. (5) రాక్షసులని వాయవ్యాస్త్రంతో చంపడం - పాఱద్రోలడం - తన తల్లిని చంపడం - మొదలైనవాటిని ప్రత్యక్షంగా చూచిన మారీచుణ్ణి చంపేసి ఉంటే, రావణునికి (జరిగినది జరిగినట్లు 'చూచి' చెప్పేవాళ్లు. నిజాన్ని చెప్పేవారూ, ఉండకపోయేవారు.

విశ్వామిత్రుని యజ్ఞం (దేవపూజాయజ్ఞం) పరిసమాప్తమైంది. అక్కడివారు అందఱూ ప్రశంసించారు. జనకుని యాగంగూర్చి చెప్పి విల్లుని చూడరమ్మని పిలిచారు. విశ్వామిత్రుని అనుజ్ఞపై రామలక్ష్మణులు మిథిలకు బయల్దేరారు.

## 'మేం, మా నాన్న కూతుళ్లం'

మిథిలకి వెడుతూ, రాత్రికాగానే ఒకచోట మహర్షులతో రామలక్ష్మణులు ఆగారు. విశ్వామిత్రుడు ఆ విడిది చేసినచోటుని గూర్చి ఇలా చెప్పసాగాడు.

'రామా' ఉత్తరదిక్కున ఉన్న అయోధ్యకు పోతూ మనం, శోణ నదివద్దకు వచ్చాం ఇప్పుడు. (అప్రాచ్యులైన ఆంగ్లేయులు మనకి చరిత్ర లేదని చెప్పడంకోసం శోణనదిని సోన్ (Sone) అనీ, ఖాండవ వనాన్ని 'ఖోండ్' (Khonde) అనీ, పాటలీ పుత్రాన్ని పాట్నా (Patna) అనీ మార్చేసారు. ఆంగ్లేయుల మాట మన భారతీయుల మెదడుకి 'గంజాయి' లా పనిచేసి, గండ్వానా, పట్నా' అని వీళ్లు మటి కొంతగా ఆ పేర్లని మార్చారు. ఈ దేశాల కథలని విశ్వామిత్రుడు చెప్పడంలోని ఆంతర్యం, ప్రతిదేశానికీ వెనుక చరిత్ర ఉంటుందనీ, ఆ చరిత్రద్వారా దేశప్రశస్తిని గమనించాలనీను. అదే, ఇప్పుడు కఱవైంది. దేశం మీది భక్తి అనేది, దేశచరిత్ర తెలిస్తేనే ఉంటుంది). ఇది ఖాండవవనంలో పుట్టి, పాటలీపుత్రం వద్ద గంగలో కలుస్తోంది.

ఒకప్పుడు 'కుశుడు' అనే బ్రహ్మమానసపుత్రుడైన మహర్షి( బ్రహ్మగారు మనసులో సంకల్పించి, ఒకణ్ణి పుట్టించాలనుకొన్నప్పుడు కల్గినవాడు-చిత్రాన్ని గీచి ప్రాణం పోస్తే ఎలాగో, అలా పుట్టినవాడు) భూలోకానికి వచ్చి విదర్భ రాజపుత్రికను పెండ్లాడి నలుగుర్ని కని, తనరాజ్యాన్ని నల్గురికీ పంచాడు.

పెద్దవాడు కుశాంబుడు తనకై కౌశాంబీనగరాన్నీ, రెండవవాడు కుశనాభుడు మహోదయమనే నగరాన్నీ, అలాగే అధూర్తరజసుడు ధర్మారణ్యానీ, చివరివాడు వసువు గిరివ్రజాన్నీ రాజ్యానికై ఏర్పాటుచేసికొని కట్టించుకొన్నారు. ( ఆ రోజుల్లో రాజధానీ నగరాలని ఇళ్లులా తీర్చిదిద్ది రాజులు కట్టించుకొనేవారు. రావణుడూ అలాటి వాడే.)

రామచంద్రా! ఇప్పుడు మనం ఉన్నది చివరివాని రాజ్యంలో. ఈ నగరాన్ని 5 పర్వతాలు చుట్టు ముట్టి ఉండడంతో దీనికి 'గిరివ్రజం' అనిపేరు. (ఏనాడూ మార్చడానికి వీలులేని పర్వతాలూ-నదులూ బట్టి, ఆనాడు ఊళ్లకి పేర్లుండేవి) 5 కొండలమధ్య ఈ నది ప్రవహిస్తూ, ఆకాశంలో వెళ్లేవారికి పూలమాలలా కన్పిస్తుంది. దీన్ని మగధ దేశమని కూడా అంటారు. ఈ పేరుకి కారణం శోణనదికి 'మాగధి' అనే పేరు కూడా ఉండడమే. ఈ నది వల్ల ఇచ్చటి ప్రజలు కఱువు కాటకాలంటే ఎఱుగరు.

పై నల్గురిలో 'కుశనాభుడు' అనే రెండవవాడు రాజర్షి. 'ఘృతాచి' అనే అప్సరసని పెండ్లాడి, నూర్గురు ఆడపిల్లలని కన్నాడు. ఎంతో అందంగా ఉన్న ఆ పిల్లలు, యౌవనకాలంలో, రోజులానే వనంలో విహరిస్తూంటే, వాయుదేవుడు మోహించి, దేవకన్యలుగాచేస్తానని వారిని భ్రమింపచేసి, తనని పెండ్లాడమని కోరాడు.

వాళ్లంతా ఒకటేమాట అన్నారు 'వాయూ! మేం మానాన్న కూతుళ్లం. దేవేంద్రుణ్ణి కూడా ధర్మబలంతో పడగొట్టగలం. అయినా, తండ్రిచాటు పిల్లలం.

నువ్వు అడగాల్సింది మమ్మల్ని కాదు. నువ్వడగాల్సింది ఆయన్ని. మమ్మల్ని ఎవరికి మా తండ్రి ఈయదలిస్తే, మేం అతణ్ణి వరిస్తాం అన్నారు. (*యస్య నో దాస్యతి పితా స నో భర్తా భవిష్యతి (మాన్యా మాన్యా) ఏ తండ్రీ తన కూతుళ్లకి కాని సంబంధం చేయడు కాబట్టి, ఆ బాధ్యతని తండ్రికే విడువడం సరైనది. తనకు తానుగా చేసికొంటే రేపటిరోజున ఏదైనా జరుగరానిది జరిగితే 'నీకు నువ్వుగా చేసికొన్నావుగా! మా మాట వింటేనా?' అనే నింద పడవలసి వస్తుంది. కనడం చదివించడం - కాపాడడం అంతా తల్లిదండ్రుల బాధ్యత అయితే, తల్లిదండ్రుల అభీష్టానికి విరుద్ధంగా పెళ్లాడడంమాత్రం తన 'హక్కా' నా? ఈ విధానాన్ని ప్రోత్సహించి ప్రేరేపించే రచనల విషయంలో జాగ్రత్త పడాలి.)*

వాయువుకి కోపంవచ్చి, వారినందర్నీ 'మఱుగుజ్జు' లుగా తత్క్షణం చేసేసాడు. (మఱుగుజ్జుతనం వాతరోగం కదా!) విషయం తెలిసింది తండ్రికి. (వాయుదేవుడంతటివాడు అలా ప్రవర్తించాడంటే కారణం ఉండి ఉంటుందని గమనించాడు). 'పిల్లలారా! వంశప్రతిష్ఠకోసం రూపహీనలయ్యారు. సంప్రదాయపద్ధతికోసం వివాహాన్ని విడిచిపెట్టారు. పురుషులకైనా స్త్రీలకైనా ఎల్లకాలమూ 'తగినకాలం' కాబోదు. 'క్షమా దానం క్షమాయజ్ఞం క్షమా సత్యంహి పుత్రికాః క్షమాయశః క్షమాధర్మః క్షమయావిష్ఠితం జగత్॥' 'ఓర్పు' అనేదానికి సాటి ఏదీ లేదు. ఓర్పు అనేది దానం-యజ్ఞం-సత్యం-కీర్తి-ధర్మాలతో సమానం!' అని ఓదార్చి తగిన వరుని కోసం ఎదురుచూడసాగాడు.

(ఆ కన్యలందఱూ కుబ్జలైన దేశం కాబట్టి 'కన్యాకుబ్జం' అన్నారు. అప్రాచ్యులు దీన్ని (Kanoj) 'కనోజ్' గా దిద్ది, మనచేత పలికించి, చరిత్ర చెడగొట్టాం లే! అని సంతోషించారు.)

కాంపిల్య నగర రాజు బ్రహ్మదత్తుడనే ఆయన (చూళి సోమదల పుత్రుడు) ఈ పిల్లలని పెండ్లాడదలచి చేయిని పట్టుకోగానే (పాణి-గ్రహణము) ఒక్కొక్కరి కుబ్జత్వమూ పోయి అందఱూ పూర్వపు సౌందర్యాన్ని పొందారు.

## ఇదీ- నా కథ

తన కూతుళ్లంతా పెళ్ళై బ్రహ్మదత్తునితో వెళ్లిపోవడంతో కుశ నాభుడు దిగులుపడ్డాడు. 'పుత్రుడు లేడే!' అని విచారిస్తూంటే తపస్వి అయినఆయన తండ్రి కుశుడు వచ్చి పుత్రుడు కల్గుతాడనీ, కీర్తిమంతుడౌతాడనీ ఆశీర్వదించి పోయాడు.

కొంతకాలానికి ఆయనకు 'గాధి' అనే పుత్రుడు కల్గాడు. ఆగాధికి ఒక కూతురు 'సత్యవతి' కల్గింది. 'కుశ' వంశలో కలగడంచేత 'కౌశికి' అన్నారు. ఆమెని ఋచీక మహర్షికిచ్చి పెండ్లి చేసారు. వారిద్దఱూ బొందితో స్వర్గానికి పోయారు. అయినా, కౌశికి లోకంలోని వారిని అనుగ్రహిస్తూ ఉండ దలచి, హిమవత్పర్వత ప్రాంతంలో నదిగా (కౌశినది) ప్రవహిస్తూ, ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలంచేస్తోంది. ఆ 'గాధి' కి పుట్టిన సత్యవతికి ఒక తమ్ముడు కూడ ఉన్నాడు. అతని పేరే విశ్వామిత్రుడు. అతడే నేను.

కుశవంశంలో పుట్టడంచేత కౌశికుడంటారు. నా అక్క హిమాలయపర్వత ప్రాంతంలో నదిగా ఉండడం వలన, నేమా అక్కడే సంచరిస్తూతపస్సు చేసికొంటూ ఉంటాను. 'ఇదీ నా కథ' అని ముగించి, రాత్రి బాగా ప్రొద్దుపోయిందని విశ్వామిత్రుడువారిని పరుండబెట్టాడు. (కౌశికీనది కథ ఇది అయితే అప్రాచ్యులు దీన్ని 'కూసి' 'క్షి' గా మార్చి చరిత్రని ధ్వంసం చేసారు. పరుండబోయేప్పుడు పుణ్యకథలని వినడం అనేది ఆనాటినుండే వచ్చింది).

**ఈ కథ వల్ల తెలిసిందేమిటి ?**

పెళ్లి కావలసిన పిల్లని, సంపన్నులైనాసరే, వేరుగావచ్చి వివాహం గూర్చిఅడిగే సందర్భాలుంటాయి. ఉండవచ్చు. అప్పుడు చెప్పవలసిన సమాధానం' తండ్రిని అడుగు' అనేదే. నాకు నేనే నిర్ణయం తీసికోగలనని కన్య అంగీకరించిందనుకుందాం. పెంచిపెద్దచేసిన తండ్రినే, వివాహ విషయానికి సంప్రదించ లేదంటే, వివాహమయ్యాక మాత్రం 'భర్తని'ఏమంత సంప్రదిస్తుంది? మొదటి నుండీ స్వతంత్రించి నిర్ణయించుకునే అలవాటున్న ఈకన్య ,ఎప్పుడూ అలాటిదే ఔతుందని గమనించాలి.

పురుషుడు – తాను ఇష్టపడగా తనని కాదన్న కన్య విషయంలో, మరుక్షణంలోనే 'ప్రతీకార బుద్ధి'ని, చూపిస్తాడని గమనించాలి. పురుషలక్షణం అలాటిది. 'లొంగనంతకాలం' 'స్త్రీ' వెంట పడతాడు. లొంగితే ఆమెని చులకన చేస్తాడు. లొంగకపోతే ప్రతీకార బుద్ధిలో ఉంటాడు. ఎలాగైనా పురుషుని తత్త్వం హానికరమే కాబట్టి, అసలు ఏ మాత్రపు చనువూ లేకుండా ఉంచడం మంచిదని, స్త్రీలకి ఆనాటివారు కట్టుబాట్లని చేసారు. క బాట్లులేని ఈ కాలంలో, స్త్రీలు ఎంతగా సుఖిస్తున్నారో ప్రపంచ వ్యాప్తంగా తెలుస్తోంది. దీనిని నివారించడానికి మార్గం ఒక్కటే. పర స్త్రీ పర పురుష పరిచయాలు ఉండరాదు. ఎవరి హద్దుల్లో వారుండాలి. స్త్రీ, ఏ మాత్రపు చనువునీ పర పురుషునికి ఈయక, ఉంచగలిగినంత దూరంలో ఉంచాలి

ఇంత జాగ్రత్తగా ఉన్నా, ఏదైనా దోషం జరిగితే ఓర్పు వహించాల్సి వస్తోందే తప్ప, చేయగలిగింది ఉండడం లేదు. అందుకే పాతకాలపు సామెత 'అరటాకు వచ్చి ముల్లుమీద పడ్డా ముల్లొచ్చి అరటాకు మీదపడ్డా' అనేది పుట్టింది. దీన్ని – 'కాదు' అని అందాం – అని అనిపించినా, నిజం మాత్రం మనస్సుకు తెలుసు.

ఇక 'కామోఽష్టగుణ : స్త్రీణామ్' అనడం వల్ల, పురుషునికంటె కామం స్త్రీకి 8 రెట్లు ఎక్కువ అయినా, నిగ్రహ బుద్ధీ, పురుషుణ్ణి తిరస్కరించగల శక్తీ 16 రెట్లుంటుందిట. అందుకే లోకం ఇంకా, కులస్త్రీలతో ఉండగల్గుతోంది. దీన్ని బట్టి రామునికి విశ్వామిత్రుడు చెప్పదలచింది ఒకటే – 'కామం సహజమే అయినా, నిగ్రహబుద్ధి ఉండాలి' అని. స్త్రీలకి ఈ శక్తి ఉంటుంది కాబట్టి, రావణుడెన్ని మాయలు పన్నినా, సీతమ్మ లొంగదని, ఆనాటి కథకి బీజాన్ని ఇక్కడే వేసాడు విశ్వామిత్రుడు.

## "ఇద్దఱు తల్లుల ముద్దుల బిడ్డడు"

శోణనది ఎండిపోవడంతో రామలక్ష్మణులు శోణనదిలోనే నడిచి నడిచి గంగను చేరారు. మహర్షుల ప్రశ్నకి సమాధానంగా గంగా వృత్తాంతాన్నీ, గంగా పుత్రుని వృత్తాంతాన్నీ, ఇలా చెప్పాడు విశ్వామిత్రుడు. (ముందుగా పై కథని చూద్దాం)

శంకరుడు ఎంతో ఇష్టంతో 'పార్వతి' ని పెండ్లాడాడు. శివ తేజస్సుని ఆమె భరించలేక, గంగ కిచ్చింది. గంగ ఈ తేజస్సుని భరించలేక అగ్నిహోత్రునితో మొఱ పెట్టుకొంటే, ఆయన హిమవత్పర్వత ప్రాంతంలో ఉంచమని చెప్పాడు.

అక్కడ వెండి బంగారాలు పుట్టాయి. ఇంకా అనేక లోహాలు పుట్టాయి. దాని నుండే ఒక బిడ్డడూ కల్గాడు. ఆ బిడ్డను రక్షించడానికి కృత్తికలనే వాళ్లని ఆఱ్గురిని ఇంద్రుడు పంపాడు. వాళ్ల వలన పెరిగి పెద్దవాడై కార్తికేయుడయ్యాడు. అగ్నిదేవుడు ఇతణ్ణి దేవతలకి సేనాధిపతిగా అభిషేకించాడు. ఇదీ కథ – అన్నాడు.

ఏకథనైనా చెప్పి దాని గొప్పదనాన్ని(ఫలశ్రుతి) చెప్పని వాల్మీకి, ఈ వృత్తాంతాన్ని వ్రాసి – ధన్యమూ పుణ్యమూ అయినది ఈ చరిత్ర – అన్నాడు. అందుకని ఆలోచించాలి. (కుమారసంభవ శ్చైవ ధన్యః పుణ్యస్తథైవ చ)

## కుమార స్వామికి ఇన్నిపేర్లా ? (లోకథ)

కుమారస్వామికి, శరవణభవుడు (ఱెల్లులోపుట్టినవాడు) – షణ్ముఖుడు ఆఱుముఖాలు కల్గినవాడు) – కార్తికేయుడు (కృత్తికలచే పెంచబడినవాడు) – బ్రహ్మణ్యుడు(అతిపవిత్రుడైనవాడు) – అగ్నిపుత్రుడు(అగ్నికిపుట్టినవాడు) గాంగేయుడు గంగాదేవికి పుత్రుడు) – దేవసేనాపతి (దేవసేన అనే ఆమె భర్త–దేవతలసేనకు సైన్యాధ్యక్షుడు) – స్కందుడు (జారిపడినవాడు) – మొదలైన ఇన్నిపేర్లు ఉన్నాయి. ఒకపేరుకీ మఱోపేరుకీ సంబంధం లేకపోవడం తప్పుకాదుకాని, ఒకచోట ఱెల్లులో పుట్టాడని శరవణభవుడనే పేరు చెప్తూంటే, గాంగేయుడనే పేరు గంగకి పుట్టాడని చెప్తుంది. ఒకనికి అనేక నామాలుండడం తప్పుకాదుగాని, ఒకటి వేఱొకదానికి విరోధంగా ఉండరాదు కదా ! అనిపిస్తుంది. కాని, ఈ అన్నిపేర్లూ సరైనవే. ఇంత గట్టి చిక్కుముడి ఉండడం బట్టే వాల్మీకిమహర్షి ఈ కథకే 'ఫలశ్రుతి' చెప్పాడు. (ఇది పెద్దలు చెప్పిన ప్రకారమే వ్రాయబడులోంది).

సనత్కుమారులవారు బ్రహ్మమానసపుత్రులు. ప్రపంచాన్నే 'కల'గా భావించేంతటి వైరాగ్యరూపులు. ఆయనకి ఒకనాడు కల వచ్చింది. బ్రహ్మవద్దకుపోయి 'తండ్రీ! దేవాసురులు యుద్ధం చేస్తూంటే, నేను దేవతల వైపు సేనాపతిగా ఉండి పోరాడనట! విరాగినైన నాకు, కల ఎందుకొచ్చింది?' అని ప్రశ్నించాడు.

బ్రహ్మ నవ్వి *'నిరంతరం వేదాధ్యయనం చేసే నీకు, వేదంలో చెప్పబడిన దేవాసురుల యుద్ధమే కలగా వచ్చి ఉంటుంది. అయినా, నీ కల, కలగానే ఉండిపోదు.. నీ కల, రాబోయే పుట్టుకలో నిజమౌతుంది'* అన్నాడు. బ్రహ్మదేవుడు, సత్యాన్ని చెప్ప నక్కఱలేదు. ఆయన చెప్పింది, సత్యమై తీరుతుంది.

నిత్యమూ పరబ్రహ్మారాధనచేసే సనత్కుమారులు తనకు కలవచ్చిన మాటని మఱచే పోయారు. తపస్సులో మునిగిపోయారు. కాబోయే పుట్టుకలో సనత్కుమారుల కల నిజమౌతుందనే మాట, ఉమాశంకరులకి ఆనందం కలిగించింది. సనత్కుమారుల వారినే పుత్రునిగా కనాలని వారు అభిప్రాయపడ్డారు. శంకరుడు సనత్కుమారుల వారిని; పుత్రునిగా పుట్టమని యాచించడానికి ఆయన తపస్సు చేసే చోటికి వెళ్లాడు. తపోనిష్ఠలో ఉన్న ఆయన, వీరిని పల్కరించనేలేదు. *'జ్ఞానిననే అహంకారం కదా ఇంత గర్వాని క్కారణం!'* అని సనత్కుమారులవారి తపస్సుని భంగపరుస్తూ శంకరుడు అన్నాడు.

నన్ను చూచీ, నేను వచ్చానని గ్రహించీ మాఱు మాటాడు! లేదా శపమిస్తానన్నాడు శంకరుడు. తపోభంగాన్ని సహిస్తూ సనత్కుమారుల వారు తలెత్తి చూచి 'ఇస్తే ఇవ్వండి నా ఆత్మనేం చేయలేదుగా!' అన్నాడు. శంకరునికి అవమానం అనిపించింది. అభిమానం-అడ్డువచ్చింది. 'శాపానికి – అందునా – నేనిస్తానన్నా భయపడనన్నావుగా! వరం ఇస్తా కోరుకో!' అన్నాడు శంకరుడు

*'నాకా? వరమా? నీవా యిచ్చేది ! ఏమీ అక్కఱలేనివానికి ఇదో అవసరం కూడానా? కావలిస్తే నువ్వే కోరుకో!'* శంకరునికి సమాధాన మిచ్చారు సనత్కుమారుల వారు.అంతే! బోళాశంకరుడి ఆనందం శరీరం పట్టలేదు *'నాయనా! 'నాకు' కుమారుడి పుట్టు'* అని కోరాడు. సనత్కుమారులవారు క్షణం ఆగి 'ఆలోచించి మళ్లీ కోరుక అన్నారు. శంకరుడు అదే కోరికని మళ్లీ కోరాడు. సనత్కుమారులవారు *'తథాఽస్తు'* అ వెళ్లి పోయారు.

పార్వతి వద్ద ఈ విషయం శంకరుడానందంతో చెప్పాడు. ఆమె దుఃఖం ఇంతా అంతాకాదు. *'శంకరా! నా గర్భవాసాన జన్మించ కుండా 'నీకే' కల్గాలని అడిగావా?'* ఎంత పని అయింది ? వెళ్లి 'నాకు' అనడానికి బదులు 'మాకు ( 'శివపార్వతులకు) అని ఒప్పించు కొని రమ్మంది. ఎన్నిమాఱులు ప్రాధేయపడినా సనత్కుమారులవారు మాట తప్పనన్నారు. అయోనిజులుగా జన్మించడమే వారి అభిప్రాయం. 'నాకు' అని శంకరుడు ఆనాడు కోరినది ఇలా కావాలని ముందుగా ఊహించి కాదు. సనత్కుమారులవారు కోరికను అనుగ్రహించారనే ఆనందంలో ఒళ్లుతెలియక మాత్రమే. 'ఆలోచించి మళ్లీకోరుకో' అన్నాకూడా, తాను అడిగిన దానిలో తప్పుని గ్రహించక పోవడానికి కారణం కూడా ఆ ఆనందమే.

శంకరుని ఊర్ధ్వనేత్రంనుండి సనత్కుమారులవారే తేజోరూపంగా వచ్చారు.ఆ ప్రకాశపు ముద్ద 'గంగ' లో పడింది. ఆ 'తేజస్సు' ని భరించలేక పోయింది గంగ. ఒకప్పుడు భస్మాసురునికి వరమిచ్చి, వాడు తనమీదికే వస్తూన్నప్పుడు శంకరుడు అదృశ్యంకాగా, పార్వతి 'శరవణము' అనే తటాకంగా మారిపోయింది. గంగ భరించలేక, ఆ తేజస్సుని ఈ శరవణంలో విడిచింది. ఆమె కూడా భరించలేక ఒడ్డున ఉన్న తెల్లిలోనికి జార విడిచింది.

మొదట గంగలో పడడంవల్ల గాంగేయుడు. శరవణంలో పడడం వల్ల శరవణ భవుడు. అక్కడినుండి తెల్లిలో (స్కన్నుడు) జారి పడ్డాడు కాబట్టి 'స్కందుడు' అయ్యాడు.

'తేజస్సు'నుండి పుట్టడంచేత అగ్నిపుత్రుడు. తాను తేజోవంతునిగా ఉండడంచేత 'గుహుడు'(చీకటిని హరించేవాడు) అయ్యాడు. అద్భుత తేజోవంతుడూ, అయోనిజుడై అతిపవిత్రుడూ కాబట్టి సుబ్రహ్మణ్యుడు అయ్యాడు. దేవతలకు సేనాపతి కాబట్టి (అలాటి స్వప్నాన్ని పొందాడు గదా!) దేవ+సేనాపతి అయ్యాడు. కాని దేవసేనా+పతి అని విడగొట్టి, ఈయన భార్య పేరు 'దేవసేన' అన్నారు కొందరు. ఇది సరికాదు.

## ఇంకా లో అర్థం

వ్యక్తికి 'శక్తి' ఉంటుంది. 'వ్యక్తి' పదార్థమైతే, ఆతనిలోని చైతన్యానికి (కదలిక మున్నగువానికి) కారణం 'శక్తి'. ఆ పదార్థాన్నే 'శివుడు' అనీ, ఆ శక్తినే 'పార్వతి' అనీ పెద్దలన్నారు. ఈ ఇద్దఱూ అర్ధ నారీశ్వరరూపంతో, అంటే తలనుండి కాలివఱకూ (ఆ పాదమస్తకం) కలిసి ఒకేరూపంగా ఉండడానిక్కారణం ఎక్కడెక్కడ దేహం ఉందో, అక్కడక్కడ 'శక్తి' ఉంది కాబట్టి. ఆ రెంటికీ పుట్టిన సారమే 'కుమారుడు'.

ఇంటిలో గది గదికీ ఫ్యూజ్‌లు (Fuse) ఉండి, మెయిన్‌స్విచ్ ఎలా ఉంటుందో, అలాగే శరీరంలో కూడా 6 చక్రాలు (Fuseల వంటివి) ఉన్నాయి. కూర్చున్నప్పుడు మూలాధార చక్రం. జననస్థానంలో స్వాధిష్ఠాన చక్రం - బొడ్డువద్ద మణిపూరకం - హృదయ స్థానంలో అనాహతం - కంఠం వద్ద విశుద్ధి - రెండు కనుబొమల మధ్య ఆజ్ఞా చక్రమనీ ఉంటాయి. ఈ ఆఱున్నూ 'షట్ చక్రాలు' అని పిలువబడతాయి.

ఈ అన్నింటినీ అదుపులో ఉంచే 'సహస్రారచక్రం' అనేది బ్రహ్మరంధ్రం (తలలోని మధ్య భాగం - మాడు) లో ఉంటుంది. జపం చేయదలచిన వ్యక్తి కూర్చుని ఉన్నప్పుడు, అతడు కూర్చున్న విధానం (మఠం వేసికొని - బాసిం పెట్టువేసికొని - పద్మాసనం) పాము యొక్క చుట్టలాగానూ, నిటారుగా ఉంచిన వెన్నెముక పాము శరీరంలాగానూ, (అందుకనే, వెన్నుపాము అంటారు) గంభీరంగా ఎత్తి ఉంచిన తల,

పాము పడగలాగానూ గోచరిస్తుంది. అందుకే 'సుబ్రహ్మణ్యేశ్వరస్వామి'ని 'పాముదేవుని'గా ఆరాధిస్తారు.

ఒక వస్తువుని కొంత కొంత దూరం చొప్పున 6 మార్లు కత్తిరిస్తే (కృత్తిక) ఏడుముక్కలౌతాయి (సప్త చక్రాలు). ఆ ఆఱుమార్లు చేసిన కత్తిరింపులే ఆరు కృత్తికలున్నూ. (షట్చక్రాలు). ఈ పై చెప్పిన సుబ్రహ్మణ్యుడు, ఈ ఆఱు కృత్తికల నుండీ తేజోరూపంగా ప్రయాణిస్తాడు కాబట్టి, కృత్తికల పుత్రుడు 'కార్తికేయుడు' అయ్యాడు. క్రిందనున్న మూలాధార చక్రం నుండి 6 చక్రాల (కృత్తికల వలన ఏర్పడినవి) ద్వారా ప్రయాణించడం బట్టి 6 ముఖాలున్నవాడు (షట్ ముఖుడు) 'షణ్ముఖుడు' అయ్యాడు. షష్ఠినాడు పుట్టిన కారణంగా షడక్షర మంత్ర(ఆఱు అక్షరాలు కలమంత్రం – శరవణభవ) ప్రియుడవ్వారు. ఈ మూలాధారం నుండి సహస్రారం వఱకూ ఉండే 'కుండలినీ శక్తి'ని తన అదుపులో పెట్టుకొన్న శక్తిగల వాడు ఆయన. కుండలమంటే పాము చుట్ట. అది కలది కుండలిని. కాబట్టి ఆ 'శక్తి'ని 'అదుపులో ఉంచుకున్నవాడు' అనేందుకు సంకేతంగా, పాముని తన వశంలో ఉంచు కోగల 'నెమలి'ని ఇతని వాహనంగా చెప్పారు. 'వల్లి' అంటే చుట్ట. కుండ లినీ శక్తికి అధిష్ఠాత కాబట్టి ఇతణ్ణి 'వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరుడు' అంటారు

శరీరంలో 'రస –శక్త – మాంస – మేధః – అస్థి – మజ్జ – శుక్రం' అనే 7 ధాతువులు (Tissues)ఉన్నాయి. చివరిదైన 'శుక్రం' కాక ఇంకా ఆ మీద ఓజస్సు – భ్రాజస్సు – తేజస్సు అనేవి ఉన్నాయి. 'తేజస్సు' అంటే సంతానోత్పత్తికి అవకాశమిచ్చే 'పురుషవీర్యం' కానేకాదు. శరీరం నుండి అధోముఖంగా (క్రిందుగా) స్త్రీయందు ప్రవేశించేది 'రేతస్సు'. యోగులు ఆవిధంగా పోనీయక, దానిని ఊర్ధ్వముఖంగా ప్రయాణింప చేస్తారు.

ఆ శుక్రమే పై పైకి ప్రయాణించి 'ఓజస్సు – భ్రాజస్సు – తేజస్సు' గా అవుతుంది. అది కన్నులలో నిక్షిప్తమై ఉంటుంది. అందుకనే యోగులు అదృష్టిలో చూస్తేచాలు 'కావాలనుకున్న 'స్త్రీ' కి గర్భం లభించేది. వ్యాసుడు, ధృతరాష్ట్ర-పాండురాజాలని కన్నది ఈ తీరుగానే. దీనివలన ఆమె కన్యాత్వమూ చెడదు. సంతానమూ కల్గుతుంది. లోకంలో వేదు అనుకునేలాటి నీచసంబంధం వారికి లేదు కాబట్టే, వ్యాసుడు, మఱెన్నడూ తాను సంతానం కన్నది ఎవరి ద్వారానో, ఆ అంబిక-అంబాలిక(ధృతరాష్ట్ర – పాండురాజాలతల్లు లను )చూచినట్లుగానైనా భారతం చెప్పలేదు.

వెన్నెముకలో మూడు నాడులుంటాయి. 'ఇడ – పింగళ – సుషుమ్న, అని. ఆచార్యస్వాముల ముఖం మీది నామాన్ని చూస్తే రెండువైపులా ఒకే రంగులోనూ,నడుమ వేఱురంగులోనూ నామం ఉంచి, ఆ మూడు గీతలని రెండు కనుబొమల మధ్యన

కలిసినట్లు పెడతారు. వెన్నెముక క్రింది భాగం నుండి 'ఇడ – పింగళ – సుషు మ్న అనే పే రుతో ఈ 3 నాడులు వచ్చాయని తనకి తెలుసుననీ, వాని మధ్యలో ఉండేది "సుషుమ్నానాడి' అని తనకి తెలుసుననీ, అందుకే దానికి వేఱురంగుని ఉంచాననీ, ఈ మూడున్నూ కనుబొమలమధ్య ఉన్న 'ఆజ్ఞా' చక్రం వద్ద కలుస్తాయని కూడా తెలిసి బొట్టు పెట్టానని, మనకి తెలపడానికే ఆ బొట్టు.

లోకంలో ఎవరికైనా సంతానం లేకపోతే, సుబ్రహ్మణ్య స్వామిని ఆరాధిస్తూంటారు. సర్ప ఆకారమైన కుండలినీ శక్తివల్ల కలిగిన అగ్నితత్త్వంలో దోషం ఉందన్నమాట. అందుకని అగ్నిపుత్రుడైన ఆయనను ఆరాధిస్తే ,సంతానోత్పత్తికి కారకమైన 'అగ్నితత్త్వపు తక్కువదనం ఎంత శరీరంలో ఉందో అంతా పూర్తి చేసి' సంతానాన్ని కలుగచేసేశక్తినిస్తాడు.

## 'ఈయనే 'అయ్యప్ప'

దేశపటానికి (Map) క్రిందివైపు ఎలా దక్షిణమో, అలాగే శరీరానికి క్రిందివైపు దక్షిణమే. అక్కడినుండి కుండలినీ శక్తి బయలుదేరి ఉత్తరానికి ప్రయాణం చేయడమే ఉత్తరాయణమంటే. అక్కడ 'జ్యోతి' ని దర్శించడమే జ్యోతిర్దర్శనమంటే, నల్లగుడ్డలు కట్టడం సర్ప స్వరూపానికి సంకేతం. నేలపడక మొదలైన నియమాలు యోగం చేయాలని చెప్పడం కోసం. ఉత్తరాయణ సంక్రమణ పుణ్య కాలంలో(సంక్రాంతి) జ్యోతిని దర్శించడమే సహస్రారచక్రంలో, జ్ఞాన సూర్య ప్రకాశంతో వికసించిన కమలాన్ని దర్శించ గల్గడం.

ఆకర్షణ లేకుండా ఉండడానికీ, పామురూపాన్ని తలపించ డానికే నల్లని బట్టలు దీక్షగా ధరించడం. శివతేజస్సు నుండి పుట్టినవాడు కాబట్టే, శివాలయం నుండి బయలు దేరడం. అగ్నిపుత్రుడు కాబట్టే ఆజ్యాన్ని(కొబ్బరికాయలో నేయి)పట్టుకుపోయిఇవ్వడం.

## మఱి ఇంకో విశేషం

సంతానాన్ని కల్గించలేని 'శుక్రం' వ్యర్థపదార్థంలో లెక్క గదా ! అలాంటి శుక్రం నుండి స్త్రీ సంబంధం లేకుండా పుత్రునిగా కావడంవల్ల ' అయోనిజుడు' అన్నారు. ఏ కుండలోనో, తొట్టెలోనో దాచడం వలన అగస్త్య ద్రోణాదులు పుడితే, అలా కాకుండా ఎక్కడా దాచనవసరం లేక జన్మించిన వాడూ, ఒక్కచోట కాక శంకరునికి, గంగకు, శరవణానికి, ఇలా ఇన్ని చోట్ల జన్మించినవాడూ కాబట్టే గొప్పవాడు.

ఇంత విశేషం ఉండబట్టే, కుమారసంభవాన్ని అంత గొప్పగా మహర్షి కొనియాడాడు: యోగశక్తిని పెంపొందించుకొని, కుండలినీ శక్తిని తమ వశంలో సాధకుడైన వాడు ఉంచుకోవాలి సుమా! అని, రామ లక్ష్మణులకి, ఈకథ వల్ల తెలిసింది.

రాత్రి బాగాప్రొద్దు పోయినందున ఆ రాత్రి వారంతా నిద్రించారు. విశ్వామిత్రుడాలోచించి, రాముని క్కావలసిన అన్ని లక్షణాలనీ కూరుస్తున్నవాడై గంగఒడ్డున ఉండడం చేత గంగావృత్తాంతాన్ని చెప్పదలచి ఇలా ప్రారంభించాడు.

రామా! ఈ గంగానదికి భాగీరథి, జాహ్నవి అనే పేర్లు కూడ ఉన్నాయి. ఎలా వచ్చాయో విను. మీ పూర్వుల్లో 'సగరుడు' పరిపాలన చేస్తూ విదర్భ రాజ పుత్రిక కేశినినీ, అరిష్టనేమి పుత్రికా, గరుత్మంతుని సోదరీ అయిన సుమతిని వివాహం చేసికొన్నాడు.

పిల్లలు లేక తపస్సు చేస్తే ప్రత్యక్షమైన భృగువు వరమిస్తూ *"ఒకరికి ఒకరినీ, మరొకరికి 60 వేల మందినీ"* వారు కోరుకున్నట్లే అనుగ్రహించాడు. పెద్ద భార్య కేశినికి 'అసమంజుడు' కల్గాడు. సుమతికి పెద్ద సొరకాయ (ఆనపకాయ) వంటి గర్భపిండం పుడితే సమానమైన ముక్కలు చేసి, కుండల్లో పెట్టగా 60వేల పుత్రులయ్యారు.

అసమంజుడు రోజురోజుకూ దుర్మార్గుడై, అయోధ్య ప్రజలని తన వినోదం కోసం సరయూనదిలో ముంచి బాధిస్తూంటే, సగరుడు, పుత్రుడని కూడా ఆలోచించక వెళ్ల గొట్టాడు.

సగరుడు కొంతకాలానికి అశ్వమేధం ప్రారంభించాడు. యజ్ఞాశ్వం వెంట తన మనుమడు అంశుమంతుడు వెళ్లి సంవత్సరంలోగానే తిరిగి వచ్చాడు. ఇక యజ్ఞారంభం చేయాలనుకొనేసరికి దేవేంద్రుడే రాక్షసవేషంతో ఆ గుఱ్ఱాన్ని ఎత్తుకుపోయాడు.

దానితో ఋత్విక్కులంతా *'వెంటనే గుఱ్ఱాన్ని తెప్పించాలనీ, లేదా యజ్ఞకర్తకూ, లోకానికి దుఃఖం కల్గుతుందనీ'* పల్కారు.

సగరుని ఆజ్ఞపై 60 వేలమందీ భూమిని బద్దలు కొట్టుకుంటూ వెళ్లసాగారు దానితో భూమిలో, నీటిలో దాగుకొని ఉన్న సర్వప్రాణులూ హాహా కారాలు చేసారు. ఆధ్వనులకి లోకం తల్లడిల్లి పోయింది. దేవగంధర్వాదులంతా ఈ పనికి భయపడి బ్రహ్మతో మొఱపెట్టుకొంటే, ఆయన నవ్వి 'వాళ్లు అల్పాయుష్కులే' అని చెప్పి పంపించేసాడు.

తిరిగి వచ్చి తండ్రికి తమ నిస్సహాయతని చెప్పారు. ఆయన మండిపడివెదుక్కు రమ్మన్నాడు. భూమిని మోస్తుండే దిగ్గజాలు - తూర్పున విరూపాక్షాన్నీ, దక్షిణాన మహాపద్మాన్నీ, పశ్చిమాన సౌమనసాన్నీ - ఉత్తరాన భద్రాన్నీ చూచారు గాని తమగుఱ్ఱం కన్పడ లేదు. ఇక లాభం లేదని తూర్పు ఉత్తర దిక్కుల మధ్య అయిన ఈ శాన్యాన్ని తవ్వుతూ భూగర్భంలోకి పోయారు.

అక్కడ కపిల రూపంతో ఉన్న విష్ణువు ప్రక్కనే గరికమేస్తూన్న యజ్ఞాశ్వాన్ని చూచి, ఆ కపిలమహర్షే 'దొంగ' అని భావించారు. ఆయన మీదికి దూకి, ఆయన తపశ్శక్తికి బూడిదైపోయారు.

ఎంత కాలానికీ పుత్రులు రాకపోవడంతో, మనుమడైన అంశుమంతుణ్ణి సగరుడు పంపాడు. వెదికి వెదికి దిగ్గజాల సూచన ఆధారంగా పినతండ్రుల్ని చూచి దుఃఖంతో జలతర్పణాలు విడవాలని ఆలోచించాడు. గరుత్మంతుడు కన్పించి, దేవలోకపు గంగ ఇక్కడికి వస్తే కాని ప్రయోజనం లేదన్నాడు. ముందుగా యజ్ఞాన్ని పూర్తిచేయించమన్నాడు కూడ.

సగరుడు ఈ వార్తవిని తలక్రిందై పోయాడు. యాగాన్ని చేయించాడు. దేవగంగని భూలోకానికి తెచ్చే ఉపాయం ఆలోచిస్తూనే దేహం చాలించాడు. అంశుమంతుడు రాజై ఈ ప్రయత్నం ప్రారంభించి, హిమాలయాల్లో తపస్సు చేస్తూనే కాలధర్మం చెందాడు. ఆపిమ్మట దిలీపుడు రాజయ్యాడు. ఎలాగైనా సాధించాలని శ్రమచేసి, తన పుత్రుడు భగీరథునికి పట్టం కట్టి పంచత్వం పొందాడు.

## భగీరథ ప్రయత్నం

భగీరథుడు మాత్రం ఈ విషయాన్ని విడువ రాదని భావించాడు. తపస్సుతో బ్రహ్మని సంతృప్తి పఱచాడు. భగీరథుని కోరికలు విని 'నాయనా' నీ తాతముత్తాతలకి జలతర్పణాలు విడవడం జరుగుతుంది. కాని చాల శ్రమమీద ఆపని సాధ్యమౌతుంది. ఇక నీ వంశం నీతో ఆగిపోదు. అయితే గంగని నేలమీదికి పంపి, నీ తాత ముత్తాతలని స్వర్గానికి పంపించడమనేది కష్టమైనదేంకాదు. కాని, భూమికి వచ్చే గంగని తట్టుకోగల శక్తి శంకరునికి మాత్రమే ఉంది. ఆయనని ప్రార్థించు' అని చెప్పి దేవతలతో పాటువచ్చిన *గంగనిచూచి 'గంగా!' ఈతని కోరిక నెరవేర్చు'* అని చెప్పి అదృశ్యమయ్యాడు.

భగీరథుని తపస్సు తీవ్రమైంది. శంకరుడు ప్రత్యక్షమై భగీరథవాంఛని అంగీకరించాడు. నేలమీదకి పడబోయే గంగకే, పట్టుకోబోయే శంకరునికీ, ఒకరికి మఱొకరిని గెలవాలనే పట్టుదల కల్గింది.

శివుడి నెత్తి మీదికి పడి శంకరునితో సహా పాతాళానికి తీసికొని పోవాలని గంగ ప్రయత్నించి దూకితే, ఒక్క బొట్టుకూడా నేలను పడకుండా, తన జడలనే పెద్దపెద్ద గుహలుగా విశాలంచేసి గంగని బంధించాడు వ్యోమకేశుడు.

దానితో ఖేదపడిన భగీరథుడు, పూర్వం కంటె మహోగ్ర తపస్సు చేసాడు. శంకరుడు కరుణించి, ఆ గంగని బిందుసరోవరంలో విడిచాడు. ఆ గంగ ఏడుపాయలుగా ప్రవహించింది.

రామచంద్రా! తూర్పుదిక్కుగా ప్రవహించిన మూడు పాయలూ హ్రాదినీ, నళినీ, పావనీ, అనేవి. ఈ జలం పరమపావనమైనది. పడమటికి మఱో మూడు పాయలు వెళ్లాయి. సుచక్షు, సీత, సింధు అనే పేర్లతో. ఇవి నిర్మలంగా ఉంటాయి. 7వ పాయ భగీరథుని వెంట వెళ్లసాగింది.

ముందుగా చల్లని గాలి, ఆటుమీద పెద్ద నీటి చప్పుడూ, ఆతర్వాత ప్రవాహం, అంతలో అక్కడి చెట్లూ, పుట్టలూ, అన్నీ విఱిగి పడుతూండడం, అంతలోనే నురుగులు నురుగులుగానూ, జలబిందువులుగానూ, నీరు ఎగిరిపడుతూండడం, హంససారసపక్షులు రావడం,తాబేళ్లూ, మొసళ్లూ, పాములూ, చేపలు కన్పిస్తూండడం ఎంతో వింతగా అన్పించింది.

భగీరథుని రథం వీటన్నిటికీ ముందు వెళ్తోంది. పాములా వంకరటింకరగా, ఒకచోట మిట్ట ఎక్కి, ఒకచోట పల్లానికి పోయి, ఒకచోట పడగని విప్పినట్టు విశాలమై, మఱొకచోట శరీరాన్ని కుదించినట్లు సన్నంగానూ ప్రవహిస్తూ, సమతలప్రదేశంలా ఉన్న ఆగంగని చూడడానికి దేవలోకంనుండి రానివారులేరు.

శాపగ్రస్తులైన ఎందఱో అప్పటి కప్పుడే ఆ గంగ తగిలి స్వర్గానికి పోతూండడం స్పష్టంగా కన్పించింది . అప్పటివఱకూ జనులు వెళ్లే త్రోవలు జలమయ్యాలై, *'వనానికీ వనానికీ దూరం మఱింత అయిపోయింది. వింత వింత పక్షులు ఎగుర సాగాయి'. తడిగా గాలి వీచసాగింది. జలచరాల అఱుపులు విన్పించసాగాయి.*

ముందుగా వెడుతూన్న భగీరథ రథం జహ్ను మహర్షి ఆశ్రమం వద్ద ఆగినా, వేగంగా వస్తూన్న గంగా ప్రవాహం ఆగలేక, మహర్షి ఆశ్రమాన్ని ముంచెత్తింది. దాంతో కోపించిన జహ్నువు జలాన్ని 'ఆపోఽశ న' పట్టాడు. భగీరథుని దుఃఖం కట్టలు త్రెంచుకొంది. గంగలో మునగాలని భావించిన ఎందఱో, ప్రాధేయపడితే చివరికి జాలిదలిచిన జహ్నువు తన చెవి నుండి గంగని విడిచాడు.

ఆ గంగ పాతాళానికి పోయింది. భస్మ రాసులమీదుగా ప్రవహించింది. అప్పుడు బ్రహ్మ ప్రత్యక్షమై *'భగీరథా! సగర పుత్రులంతా తరించారు. ఈ సగరపుత్రులచే త్రవ్వబడిన ఈ ప్రదేశాలలో నిండిన ఈ సాగరాలు ఇంకిపోయేంత వఱకూ ,వీరికి స్వర్గ వాసం ఉంటుంది .భూలోకంలో ఈ గంగకు ఆ ధారభూతుడివి నీవు కాబట్టి 'భాగీరథి అంటా ముందు కాలంలో పిలుస్తారు. ఈ గంగని సాధించలేని దిగులుతో శరీరం విడిచిన నీ తాత తండ్రులు అంశుమంతుడు - దిలీపులకు జలతర్పణాలియ్యి'* అని చెప్పి, భగీరథుడు అలా తర్పణాలిచ్చాక బ్రహ్మ అంతర్ధానమయ్యాడు.

రాత్రి చాలసేపు గంగావతరణాన్ని గూర్చి 'రామలక్ష్మణులు' ఆలోచిస్తూ ఉండి పోయారు.

**ఈ కథవల్ల ఏం తెలిసింది ?**

తమ పూర్వులు ఎంతటి పట్టుదలతో ఉన్నారో, తరాలు మారినా కార్యసాధనని ఎలాచేసారో రామునికర్థమైంది. 60 వేల మంది పుత్రులని భస్మం

చేయడం, లోకానికి గంగని ప్రసాదించి, వారి కీర్తిని శాశ్వతం చేయడానికేనని తెలిసింది. బ్రహ్మవరం ఇయ్యడం వెనుక ఉండే ఆంతర్యం, లోకోపకార దృష్టి బోధపడ్డాయి. **తల్లిదండ్రులని తలుచుకొని జలతర్పణాలు విడవడం ఎంత ముఖ్యమో తెలిసింది. తరాలు మారినా మారనిది తర్పణమని అర్థమైంది,**

బ్రహ్మ ఆజ్ఞ మీదట గంగాదేవి భూలోకాన్ని తరింపజేయడానికి వచ్చింది. కాని విశ్వామిత్రుని సోదరి కౌశికీనది అయిన తాను, తన భర్తతో స్వర్గానికి పోయినా లోకానుగ్రహకాంక్షతో స్వయంగా దిగివచ్చింది. అలాటి ఆమె సోదరుడు కాబట్టి గురువైన విశ్వామిత్రుడు ఇంకెంతో కీర్తి ప్రతిష్ఠలని కల కార్యాలు చేయవలసిన వాడయ్యాడు. చేసాడు కూడ. (ప్రస్తుతానికి రామలక్ష్మణులని తేవడం. మీద మరికొన్ని తెలుస్తాయి.)

లంకాధినేత రావణుడు, సముద్రం అవతల ఉన్నా, సముద్రుడు రావణునికి ఏ మాత్రం సహాయాన్ని చేయడనీ, సముద్రుడు నీ వంశంవాడే కాబట్టి నీకు మాత్రమే సహాయం చేయగలడనీ విశ్వామిత్రుడు రామునికి ఉపదేశాన్ని చేసినట్టయ్యింది..

గంగానది 3 పాయలుగా, తూర్పు - పడమరలుగా ప్రవహించింది కాబట్టే, శివారాధనతత్పరులు నుదుటిపై అడ్డంగా తెల్లని విభూతిని (3 రేఖలుగా) బొట్టుగా ధరిస్తారు.

(ద్విర్గతాః ఆపః యస్మిన్ దేశే సోఽ యం దేశః ద్వీపః) రెండు వైపులా ప్రవహిస్తున్న నీళ్లు కల ప్రదేశం ఏదుందో, అది (ద్వి+అప) 'ద్వీపము'. అంటే జంబూప్లక్షా న్వయ ద్వీపౌ శాల్మలి శ్చాపరో ద్విజ । కుశః క్రౌంచ స్తథా శాకః పుష్కరశ్చైవ సప్తమః । ఈ 7 టితో నిండింది కాబట్టే 'సప్తద్వీపావసుంధరా' అంటారు.

సహగమనమనే దురాచారం కూడా ప్రాతకాలంలో లేదు. దశరథుడు పోయాక కౌసల్యా సుమిత్ర కైకమ్మలూ, పాండురాజు పోయాక కుంతీ జీవించే ఉన్నారు. తానే తన భర్త మరణానికి కారణమని భావించిన మాద్రి, కావాలనే చితిలో దూకిందని భారతం చెప్తోంది. కుంతీమాద్రులిద్దరూ స్వర్గానికి పాండురాజుతో వెళ్లారని భారతం చెప్తోంది. నడిమికాలం వాళ్లు కల్పించిన దురాచారాలివి. ఈ దురాచారాన్ని రూపుమాపారని ఎవరికో హారతులు పట్టడం, ఈ దురాచారానికి కారకులు కాని పూర్వమహర్షులని కారకులే అని తిట్టడం సరికాదు.

లోకంలో భర్తపోయిన 'స్త్రీని 'గంగాభగీరథీ సమానురాలు' అని పిలుస్తారు (గం। భా।స). పూర్వులు ఏ పేరు పెట్టినా ఆలోచించి పెట్టినదే. పుత్రుడైన భగీరథుడు తపస్సు చేస్తే, భర్త ఉన్నా కూడా గంగాదేవి, పుత్రుని కోరిక మన్నించి, భర్తని విడిచి పుత్రుల కోసం దిగివచ్చింది. లోకంలో కూడా, భర్త గతించాక, ఏ స్త్రీ బ్రహ్మచర్య వ్రతంతో తన పుత్రులకోసమే జీవిస్తూ ఉంటుందో, ఆమెని గం. భా.స అని, అందుకు పిలిచారు.

గంగతెల్లగా ఉంటుంది కాబట్టే, ఆమెకూ తెల్లని వస్త్రాన్ని ధరింప చేస్తారు. గంగ ఎలా పవిత్రురాలో, ఆమె కూడా అలాంటిదని తెల్పారు. తరువాత కాలంలో ఎవరో దీన్ని అర్థం చేసికోక తక్కువ దనం అంట గట్టారు. తల బోడి చేయటం కూడా నడిమికాలపు దురాచారమే.

జహ్ను మహర్షి తన చెవినుండి గంగని విడిచాడనడమూ, అంతకుముందు అలా ప్రవహిస్తూ వస్తూన్న గంగని ఆపోశన పట్టాడనడమూ ఎంత వఱకు సరి ? అన్పిస్తుంది. లోకంలో మనం పరిణామాన్నే చూడగల్గుతున్నాంగాని పూర్వరూపాన్ని గమనించలేక పోతున్నాం. ఒక పెద్ద మఱ్ఱి చెట్టుని చూపించి ఇది 'ఇంతచిన్న' విత్తనం నుండి వచ్చిందని చెప్తే అనుభవంలో లేదు కాబట్టి, పిల్లవాడు నమ్మడు. తెలిసిన మనం, వాడి ప్రశ్నలకి ఏ విధంగానూ సమాధానం చెప్పలేం. తల్లి గర్భం నుండి జన్మించిన అందఱూ కూడా అంతే. ఈ శరీరం, భూమి కొచ్చాక పరిణామం చెందింది. ఇలా మూలం సూక్ష్మంగా ఉండి, పెద్దదిగా పరిణామంచెందే విధానం (Evolution) మనకి తెలుసుగాని, విస్తృతంగా పెరిగిన రూపం (చెట్టు) మూలరూపాన్ని పొందే విధానం (Involution) మనకి అనుభవంలో లేదు. ఆ విధానాన్ని జహ్నుడు చేసాడు. నీటిని మూలరూపంగా చేసి స్వీకరించి, తిరిగి దాన్ని యథారూపంగా ఉండేలా చేసాడు. శ్రీమన్నారాయణుడు చేసే పనిని తాను చేసాడు. చేయగలిగాడు.

పరిణామం చెందిన సృష్టిని మూలంగా మార్చి తిరిగి తాను పరిణమింపజేస్తూ సృష్టిస్తున్నాడు. వంద సంవత్సరాలవాడు మరణించి, ఒకరోజు పిల్లవానిగా పుట్టడమనేది దీనికి ఉదాహరణ. మనం ఒకరోజు నుండి వంద సంవత్సరాల వఱకు ఉండే వ్యక్తి యొక్క పరిణామాన్ని చూడగలుగుతాం తప్ప, ఒకరోజు పిల్లవానిగా అయ్యే విధానాన్ని ఎఱుగం. ఎఱుగని దాన్ని అసలు లేదనడం మన సంప్రదాయం కదా!. అందుకనే జహ్నుమహర్షి గంగా కథని నమ్మం. దానివలన మహర్షి ఏమాత్రమూ నష్టపోడు.

పరిణామం పొందిన దాన్ని మూలరూపంగా చేయగల ఆ శక్తి ఈ మహర్షికి ఉన్నదా? లేదా? తపోబలంతో ఎంతవాడు కాగలిగాడని, బ్రహ్మాదిదేవతలు జహ్నువుకి పెట్టిన పరీక్షయిది. శాశ్వత కాలం, గంగ (జహ్నువు కూతురు) 'జాహ్నవి' అనే పేరుతో పిలువబడేంతగా పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడాయన.

గంగానది స్వర్గంలో, భూలోకంలో, పాతాళంలోనూ ప్రవహించడం వల్ల 'త్రిపథగ' (మూడు మార్గాలలో ప్రయాణించినది) అయింది. భూలోకంలో తూర్పుగా, పడమరగానూ భగీరథుని వెంటనూ – వెళ్లి మూడు విధాలుగా కావడం మూలాన కూడా 'త్రిపథగ అనిపేరు.

## క్షీరసాగరమథనం

విశ్వామిత్రుడు రాముణ్ణి ఆదరంగా వాత్సల్యంతో చూస్తూ 'రామా!' . కశ్యప ప్రజాపతికి *'దితి – అదితి'* అని భార్యలిద్దఱు. *'దితి'*కి బలవంతులైన రాక్షసులు పుడితే *'అదితి'*కి ధార్మికులైన దేవతలు జన్మించారు. అయితే, ఇద్దఱికీ ఒక ఆలోచన కల్గింది. అనారోగ్యమూ- ముసలితనమూ అనేవి- పాలసముద్రాన్ని చిలికి 'అమృతం' సాధిస్తే ఉండబోవని నిశ్చయించి అలా చేయ ప్రారంభించారు.

మందరపర్వతాన్ని కవ్వంగా ఉంచారు. 'వాసుకి' అనే పాముని కవ్వానికి తాడుగా చేసారు. (ముందునాటికి 'కవ్వం' అంటే అసలు తెలియకపోయే ప్రమాదముంది. ఇప్పటికే వెనుక బడింది. తెలియకపోతే తప్పులేదుగాని, *'మాకు తెలియని ది అసలు ఎలా ఉండేది ? ఉండడానికి వీల్లేదు'* అనే మేధావిజనం పుడుతున్నారు. అందుకని బాధ). రాక్షసులు ఒక వైపూ, దేవతలు ఒకవైపూ ఆ పాముని పట్టి చిలుకడం ప్రారంభించారు.

పామైన వాసుకి, ముఖంనుండి విషం కక్కడం ప్రారంభించింది. చాలకాలం చిలకగా, చెప్పలేని మంటలతో 'హాలహలము' అనే విషం పుట్టింది.

విష్ణువు శంకరుని ప్రార్థిస్తే, ఆ హాలహలాన్ని శంకరుడు మ్రింగినాడు. ఆ మీదట మళ్లీ పాలసముద్రాన్ని మథించడం ప్రారంభించగానే, కవ్వం క్రిందికి దిగడం ప్రారంభించింది. 'విష్ణువు తాబేలు రూపంతో క్రిందికిపోయి, తన వీపున మందరపర్వతాన్ని నిలబడేలా చేసి సహకరించాడు.

అలా చిలకగా, దండ కమండలువులతో ముందుగా వైద్యుడు 'ధన్వంతరి' వచ్చాడు. సముద్రంలో నుండి ఒక 'రసం' వచ్చింది. ఆ రసం నుండి 60 కోట్ల మంది అందగత్తెలు పుట్టారు. అప్ నుండి (నీరు) పుట్టిన రసం నుండి వచ్చారు కాబట్టే 'అప్సరసలు' అయ్యారు.వాళ్లతో పనికత్తెలు కూడ వచ్చారు. దేవరాక్షసులలో ఎవరూ వాళ్లని వివాహమాడ నిష్టపడక పోతే, వాళ్లు యథేచ్ఛగా సంచరించే స్త్రీలుగా మారిపోయారు.

ఆ తర్వాత వరుణుని కూతురు 'వారుణి' అనే ఆమె వచ్చింది. రాక్షసులు ఈమెని పరిగ్రహించకపోతే, ఆదిత్యులు (దేవతలు) స్వీకరించారు. 'వారుణి' అంటే 'సుర' .సుర అంటే మద్యం. ఇది దేవలోకంలో పాలసముద్రంనుండి లభించినది కాని, లోకంలో మద్యం కాదు. ఆ 'సుర' ని స్వీకరించిన వారు 'సురులు' . కానివారు 'అసురులు' అయ్యారు. ఇంకా చిలికితే, తెల్లనైన ఉచ్చైః శ్రవమనే గుఱ్ఱమూ, కౌస్తుభ మణీ పుట్టాక, చిట్ట చివరికి 'అమృతం' పుట్టింది.

అంతే ! ఇప్పటివఱకూ దేవరాక్షసులలో ఉన్న మైత్రి, అకస్మాత్తుగా విరోధంగా మాఱింది. యుద్ధం ప్రారంభంకాగా విష్ణువు, మోహినీ అవతారంలో వచ్చి, రాక్షసులని వంచించి,అమృతాన్ని అపహరించుకొని పోయి, అడ్డొచ్చిన వారిని వధించాడు.

రాక్షసమాత అయిన 'దితి' కి, తన పుత్రులు చాల మంది వధింప బడడమూ, వంచింప బడడమూ, శ్రమచేసి ఫలితాన్ని పొందలేక పోవడమూతో, దుఃఖం తీవ్రమై, భర్తని ఆరాధించింది. దేవాధ్యక్షుడైన ఇంద్రుణ్ణి వధించేంత యోగ్యుడూ - బలిష్ఠుడూ అయిన పుత్రుడు పుట్టడానికై, తపస్సు చేసికోడానికి, కాశ్యపుని నుండి (భర్త) అనుజ్ఞ పొందింది. కాని నిష్ఠగా ఉంటేతప్ప, ఈ కార్యం సాధింపబడదని, ఆయన చెప్పిన మాట, ఆమెకు భయాన్ని కల్గిస్తూనే ఉంది.

కుశప్లవంలో ఆమె తపస్సు ప్రారంభమైంది. వేయి కన్నుల ఇంద్రుడు, తనని జయించే పుత్రుడు పుట్టడానికై ఆమెచేసే తపస్సుని చూచాడు. ఆ మెకి సేవ చేసేందుకు ఆమె వెంటే ఉండసాగాడు. ఆమె మనసులో ఏ ఆలోచన మెదిలితే వెంటనే ఆ పనిని చేసికొనివస్తూ, తక్కువ కాలంలోనే ఇంద్రుడు ఆమెని సంతోషపఱచాడు.

ఇలాసేవ చేస్తూన్న ఇంద్రుని బాధ చూచింది. మనసు మార్చుకుంది. *"నాయనా! ఇంద్రా ! నిన్ను జయించే పుత్రుడు కావాలని నీ తండ్రిని యాచించాను. ఆయన అంగీకరించాడు. అదీ కాక తపస్సు ముగిసి, నేను ప్రసవించ బోతూఉన్నాను కూడ. అయితే, నిన్ను సంహరించే వానిగా కాక, నీతో మైత్రిలో ఉండేలా నేను చేస్తాను- మీ యిద్దఱూ కలసి ఏలండి"* అని చెప్పి, మిట్ట మధ్యాహ్న కాలంలో ఆమె, తలవైపు కాళ్లనీ, కాళ్లవైపు తలనీ పెట్టి నిద్ర పోయింది.

యోగ శక్తితో ఇంద్రుడామె గర్భంలో ప్రవేశించాడు. వజ్రాయుధంతో 6 మార్లు నఱికాడు. 7 ముక్కల యింది లోపలి పిండం. ఆ నఱికేప్పుడు గర్భంలో శిశువు రోదిస్తూంటే, ఏడవద్దు! ఏడవద్దు! ( మా రుదః ! మా రుదః ! ) అంటూ నఱికేవేసాడు కాబట్టి-మా రుదులే-మరుత్తులయ్యారు.

ఇంద్రుడు గర్భంనుండి బయటికి వచ్చి *'తల్లీ! వ్రతభంగం చేయరాదని తండ్రి కాశ్యపుడు చెప్పినా, మంచెపై తలవైపు కాళ్లనీ కాళ్లవైపుతలనీ పెట్టి జుట్టు విరబోసికొని నిద్రించావు. అశుచివయ్యావు. వధించాను. మన్నించాలి'* అన్నాడు.

దితి చాల బాధపడింది. ఇంద్రా ! జరిగింది ఎలాగూ పోయింది. ఆ నెత్తురు గుడ్డులు అయిన ఏడుగురికీ శాశ్వతత్వం ఉండేలా అనుగ్రహించు. ఏడులోకాల్లో ఉండే వాయుసమూహాలకి అధిపతులు అయ్యేలా చెయ్యి. నల్గురూ నాలుగు దిక్కుల్లోనూ, మిగిలిన ముగ్గురూ బ్రహ్మ -ఇంద్ర- అంతరిక్షాల్లోనూ విహరించాలి. వీళ్లని లోకం అంతా 'మరుద్గణాలు' అని పిలవాలని నా ఆకాంక్ష అని కన్నీటితో చెప్పి, ఇంద్రుని అంగీకారంపై వారిని దేవతలతో సమానం చేసికొంది దితి.

రామచంద్రా! ఈ ప్రదేశం దితి తపస్సు చేసిన కుశప్లవం. ఇంద్రుడు వధించిందీ ఇక్కడే. ఇక్ష్వాకువు ఇక్కడే పుట్టాడు. మీ మూలపురుషుడు ఆయనే. ఆయనకి అలంబుసాదేవికి కల్గినవాడే ఈ 'విశాలుడు'. ఆయన పేరనే ఈ దేశం 'విశాలదేశం' అయింది.

ఆ విశాలుని తర్వాత హేమచంద్రుడూ-సుచంద్రుడూ-ధూమ్రాశ్వుడూ-సృంజయుడూ-సహదేవుడూ-కుశాశ్వుడూ- సోమదత్తుడూ-కకుత్స్థుడూ వంశపారంపర్యంగా రాజ్యాన్ని ఏలుతూంటే, ఆ చివరివాని పుత్రుడైన 'సుమతి' నేటి విశాలాపురరాజుగా ఉన్నాడు. ఈ రాత్రి ఇక్కడే ఉండి రేపు మిథిలకు పోదాం.

ఇక్కడి నుండి మిథిలా నగరమార్గం చీలుతుంది ! అంటుండగా సుమతి తన పరివారంతో వచ్చి, రామలక్ష్మణులని పూజించి, విశ్వామిత్రుణ్ణి కొనియాడి, రామ లక్ష్మణుల విశేషాలని తెలిసికొని, తన భవనానికి తీసికొనిపోయి మరెంత సేవ చేసాడు.

అనుకున్నట్లుగా బయలుదేరి వారు మిథిలాపురం సమీపించారు. ఆ పురం కనుచూపుమేరలో ఉండగానే అందరికీ ఆనందమైంది.

'క్షీరసాగర మథనం' అనేది జరిగిన కథ కాదు. యోగశాస్త్ర విషయాన్ని గుర్తుంచుకొనేందుకు వీలుగా కల్పించబడిన ఓ కథ. ఆలోచించ నక్కఱ లేకుడానే, ఆకథలో అనేక అసందర్భాలు కన్పిస్తాయి. సందర్భ శుద్ధి ఎలాలేదో, దానిని వివరించడం కూడా ఎందుకు? లో అర్థం తెలియాలి ! అంతేగా !

| | | | |
|---|---|---|---|
| సరస్వతి | (1) మూలాధార చక్రము | - | వెన్నెముక క్రింది చోటు (గణపతి) |
| అంబ | (2) స్వాధిష్ఠాన చక్రము | - | లింగ స్థానము (శివుడు) |
| లక్ష్మి | (3) మణిపూరక చక్రము | - | బొడ్డు (విష్ణువు) |
| | (4) అనాహత చక్రము | - | హృదయస్థానము. |
| | (5) విశుద్ధి చక్రము | - | భుజమూ మెడాకలిసే చోట ఉండే గుంట |
| | (6) ఆజ్ఞా చక్రము | - | స్త్రీలు కుంకుమ ధరించే చోటు |
| | (7) సహస్రార చక్రము | - | బ్రహ్మరంధ్రము (మాడు) |

ఈ పట్టికలోని 6న్నూ షట్చక్రాలు. ఆ మీదిది సహస్రార చక్రం. యోగాభ్యాసం చేయడమంటే, ఈ వెన్నెముక క్రిందుగా ఉన్న మూలధార చక్రం వద్ద ఉండే 'కుండలినీ' శక్తిని, (తలక్రిందుగా పెట్టి నిద్రిస్తూన్న పాముని) పైకి పంపడమే. ఆ యోగ శక్తి ద్వారా వరుసగా 6 చక్రాలలో నుండి ప్రయాణించి, 7వ చక్రాన్ని చేరడమే, అమృతత్వాన్ని పొందడమంటే. ఈకథనే కుమారస్వామి వృత్తాంతంలో చెప్పాడు. 'క్షీరసాగర మథనం' అనే ఈ కథ ద్వారా యోగాభ్యాసం చేసిన వానికి, 'ముక్తి' ఎలా కలుగుతుందనే విషయం చెప్పబడులోంది.

ముక్కుకి ఉన్న రెండు రంధ్రాలలో, కుడివైపుది పింగళనాడి. దీన్నే 'సూర్యనాడి' అంటారు. ఎడమవైపు 'ఇడానాడి'. దీన్నే 'చంద్రనాడి' అంటారు. కుడిముక్కు రంధ్రం

నుండి గాలిపీల్చి, బంధించగలిగినంత సేపు బంధించి, ఎడమ ముక్కు రంధ్రం గుండా విడువడం. అలాగే ఎడమ వైపు నుండి పీల్చి బంధించి, కుడి వైపునుండి విడువడం అవే ఈ అభ్యాసాన్ని 'ప్రాణ ఆయామము' అంటారు.

రోజుకి ఒక ఆరోగ్యకరమైన వ్యక్తి 21,600 మాట్లు మాత్రం ఉచ్ఛ్వాస నిశ్వాసాలని చేస్తాడు. బ్రహ్మయిచ్చిన ఆయుర్దాయం ప్రకారం, ఫలాని వ్యక్తి తన జీవితంలో ఇన్ని మాటులు ఇన్ని శ్వాసలు చేయాలని ఉంటుంది. అయితే, ఈ ప్రాణాయామవిద్య ద్వారా రోజులో చేయవలసినన్ని శ్వాసలు చేయక పోతే,శ్వాస బిగబట్టిన అంతకాలం తన ఆయుష్యాన్ని పెంచుకున్నట్లే. అందుకే దీనిపేరు ప్రాణ +ఆయామము అని. అంటే ప్రాణం పోకుండా వాయిదావేసుకుంటూ, ఆయుష్యాన్ని వృద్ధి చేసికొంటూ, మఱి కొంతకాలం బ్రతకడమన్నమాట.

ఒక గడియారం రెండు సంవత్సరాల కాలం పని చేస్తుందనుకొందాం. కొంతకాలం వాడ కుండా ఉంచితే, ఎంతకాలం వాడలేదో, అంత కాలం, రెండు సంవత్సరాల కాలానికి, అదనంగా పని చేస్తూందిగదా ! ఇక్కడా అంతే. ప్రాణాయామాన్ని నిత్య నియమంగా చేస్తే, శరీరంలో ఒక విధమైన కంపనం కల్గుతుంది. దీన్నే యోగ ప్రక్రియ అంటారు. దీన్నే ఈ పాలకడలి కథ చెప్తోంది గూఢంగా.

వెన్నెముక చివర (మూలాధార చక్రం) త్రికోణంగా ఉన్నదే పర్వతం అంటే. దాన్ని కవ్వంగా చేసి తిప్పిన వాళ్లు దేవతలూరాక్షసులూ -అంటే ఇడా పింగళానాడులు. కవ్వంతాడుగా పాము-అంటే, కుండలిని. ఆధార భూతంగా ఉన్న తాబేలు(కూర్మ రూపంలో)విష్ణువు. కుండలినీ ప్రారంభంలో వికారాలు పుడతాయి. (క్రొత్తగా యోగాభ్యాసం చేసేప్పుడు) అవే హాలహాలం-అపాయం. అపాయం లే(రా) కుండాచేసేవాడు గురువు (శివుడు). తర్వాత వచ్చే శుభప్రదమైన వన్నీ కూడా, వ్యక్తికి గౌరవాన్నీ- స్థితినీ కల్గించేవే. అమృతం పుట్టే వేళ పుట్టిన అప్సరసల వల్ల చెడ కుండా ఉండడంచేత, వీళ్లంతా సిద్ధులే. చెడినవాడు పతితుడు. కానివాళ్లు అమృతులు.

*'హాతాపిగణపతిం భజే'* అనే ప్రసిద్ధ వినాయక కీర్తనలో 'మూలాధార క్షేత్రస్థితమ్' అని ఉంటుంది. ఈ వెన్నెముక క్రిందిచోటులో, కుడివైపు గణపతి - ఎడమవైపున సరస్వతి ఉంటారు. అందుకనే తులసీదాసు 'రామచరిత మానస్' లో, 'మంగళానాం చ కర్తారౌ వందే వాణీ వినాయకౌ' అని సరస్వతినీ-వినాయకుణ్ణీ స్తుతించాడు. ఈ యిద్దరూ మూలాధార చక్రానికి సంబంధించిన వాళ్లే. సరస్వతీ పూజ కూడా 'విజయ దశమి' కి ముందు, 'మూల' నక్షత్రం వచ్చినపుడు చేయడంలోని ఔచిత్యం ఇదే. స్వాధిష్ఠాన చక్రంలో (పట్టిక చూడండి) అంబతో కూడిన శివుడు ఉంటాడు కాబట్టి వ + అంబశివుడూ-సాంబశివుడయ్యాడు. అమ్మ వారి చేతిలో చెఱకుగడ ఉంటుంది. చెఱకు

గడకి కణుపు లుంటాయి. ఆకణుపులే ఈ చక్రాలు. ఇలా చాల విశేషాలున్నాయి. అయితే గ్రంథం పెరుగుతుందనే భయంతో వ్రాయలేక పోతున్నాను.

ఇక లౌకికవిషయానికి కొస్తే, అమృతం పుట్టేవరకూ-దేవరాక్షసులకి చిలకడంలో ఉన్నమైత్రి-అమృతం పుట్టగానే విరోధంగా మారింది. ఫలితాన్ని ఆశించి, ప్రయోజనంతో చేసికొన్న స్నేహం, ప్రయోజనం చేకూరగానే, లేదా చే కూరుతోందనగానే 'నాకే అంటే నాకే' అనే అభిప్రాయంతో విరోధంగా మారిపోతుంది.

అమృతాన్ని ఉపయోగించగల శక్తి ఉన్నవాళ్లే అయితే, విష్ణువు యొక్క మోహినీ అవతారానికి ముగ్ధులు కారాదు. అప్సరసలని పాలకడలి నుండి ఉద్భవింప చేసినది కేవలం పరీక్షకే. దాంట్లో నెగ్గి ఈయన చేతిలో ఓడారు. సామాన్యమైన దానిని పొందడానికే ఎన్నో పరీక్షలని వ్రాస్తూంటే, అమృతమంతటి మహావిషయానికి ఎన్ని పరీక్షలుంటాయి? పరీక్ష - అని తెలియని పరీక్షలుండవా ? వాటిలో ఇది ఒకటి.

తపస్సు చేయదలచి నప్పుడే దితి చాల జాగ్రత్త వహించాలని తెలుస్తోంది. పైగా ఇంద్రుణ్ణి జయించే పుత్రుడు కావాలనేది ఆమె కోరిక. తపస్సు ప్రారంభించిన ప్రతి వ్యక్తికీ పరీక్షని పెట్టే పరీక్షాధికారి ఇంద్రుడు. అందునా, ఆ ఇంద్రుని కంటె గొప్పవాడై, అతణ్ణి వధించే పుత్రుడు కావాలని తపస్సు చేస్తున్న దితి విషయంలో, అజాగ్రత్తగా ఉంటాడా ? చాల జాగ్రత్తగా ఉండు సుమా ! అని కశ్యపుడు కూడా హెచ్చరించాడు. అయినా ఆమె అజాగ్రత్తగా ఉంటే, ఆమెదోషాన్ని తెచ్చి ఇంద్రునికి కట్టడం ఏమంత న్యాయం ?

అయినా ఇంద్రుడు ఆమెపై కనికరించి, సప్తమరుత్తులుగా లోకంలో ప్రసిద్ధి కల్గేలాచేసాడు. లో అర్థం తెలియకపోతే, పురాణేతిహాస కథలన్నీ అసత్యాలనీ అభూతకల్పనలనీ, మోసం నిండినవనీ అన్పిస్తాయి. గగనము - స్పర్శనుడు - ప్రాణము -అనిలుడు -ప్రాణము-ప్రాణేశ్వరుడు - జీవము అనేవి సప్తమరుత్తులు. *(గగనః స్పర్శనో వాయు రనిలశ్చ తథా ఽ పరః ప్రాణః ప్రాణేశ్వరో జీవ యిత్యేతే సప్త మారుతః । అని శ్లోకం.)*

## అహల్యా పతివ్రత కథ(పై కథ)

మిథిలకి వెడుతూండగా,రాముడు ఒక నిర్జనవనాన్ని చూచి, ఏదో ముని ఆశ్రమంగా భావించి విశ్వామిత్రుణ్ణి దాని వృత్తాంతం అడిగాడు. ఆయన ఇలా చెప్ప సాగాడు.

రామచంద్రా ! ఇది ఒకప్పటి గౌతమ మహర్షి ఆశ్రమం. దేవతలు కూడ ప్రశంసించేవారు. ఆయన భార్య అహల్య. దేవేంద్రుడు ఒకసారి, గౌతమమహర్షి ఆశ్రమంలో లేని సమయం కనిపెట్టి, ఆ మహర్షిరూపంతోనే ఆశ్రమానికి వచ్చి, ఆమెతో తన సంగమవాంఛని వెల్లడించాడు. ఆమె అంగీకరించింది.

అహల్య ఇంద్రునితో 'స్వామీ! నీవు ఎవరికంటా పడకుండ వెళ్లిపో! ఈ విషయం రహస్యంగా ఉంచు! నా గౌరవాన్ని రక్షించు' అన్నది. ఇంద్రుడు కూడ 'నేనూ సంతోషపడ్డాను. ఎలా వచ్చానో అలా వెడుతున్నాను' అంటూ వెళ్లిపోయాడు.

ఎదురుగా వస్తున్న గౌతముడు, దేవేంద్రుణ్ణి చూచి(తనరూపంలోనే ఉన్న వాణ్ణి) నీ అండములు(వృషణములు) తెగిపోవుగాక! అని శపించాడు. అహల్యని చూచి, వాయువునే భక్షిస్తూ, ఆహారం లేనిదానవై, బూడిదలో పొర్లాడుతూ, ఎవరికీ కనబడకుండా ఇక్కడే చాల వేలసంవత్సరాలుండిపో. ఎప్పుడు దశరథపుత్రుడు రాముడిక్కడి కొస్తాడో అప్పుడు నీకు శాపమోక్షం, అని శపించి, ఆయన తపస్సుకై హిమవత్పర్వతానికి వెళ్లిపోయాడు.

దేవ సభలో దేవేంద్రుడు తన కథ చెప్పగా, వారంతా ఆయనకు మేషవృషణాలని ఇచ్చారు. అప్పటి నుండే అయన 'మేషాండుడు' అయ్యాడు. ఓ రామా! నీ రాకని ఎదురు చూస్తున్న ఈమెని చూడు – అనగానే ఆమె కన్పించింది. రామలక్ష్మణులు ఆమె పాదాలు పట్టుకొని నమస్కరించారు. ఆమె అర్ఘ్యపాద్యాలనీ, అతిథ్యాన్నీ ఇచ్చింది. అది తెలిసి గౌతముడు అహల్యని తిరిగి స్వీకరించాడు. దేవదుందుభులు మ్రోగాయి. పుష్ప వృష్టి కురిసింది.

**లో కథ**

అదేం దురదృష్టమో కాని, అహల్యకి వచ్చినంత చెడ్డపేరు ఇతిహాసాలలో ఎవరికీ రాలేదు. దీని క్కారణం లోకథ తెలియక పోవడమే. చాల జాగ్రత్తగా గమనించవలసిన చరిత్ర ఈమెది.

అహల్య భర్త గౌతముడు. ఈయన తనని గూర్చి ఒక ప్రతిజ్ఞని చేసికొన్నాడు.

**గోతమో దమలో ఽ ధూమో ఽ దమస్తే సమదర్శనాత్ ।**

**విద్ధిమాం గౌతమం కృత్యే యాతుధాని విబోధమామ్ ।** అని.

'భూమినీ, స్వర్గాన్నీ నావశంలో ఉంచుకొన్న వాణ్ణే, ఇతరులంచేత అణచబడరాని వాణ్ణే – పొగ లేని నిప్పు లాంటి వాణ్ణే – ఇంద్రియాలని అదుపు చేసికొన్న వాణ్ణే – పర బ్రహ్మ స్వరూపదర్శనం చేసిన వాణ్ణే – నేను' అని గౌతముడు చెప్పుకున్నాడు.

ఆయన – తన భార్యతో కలిసి నిత్యమూ చేసే తపస్సులో, ఆయన 100 యాగాలు చేసిన ఇంద్రుని సింహాసనాన్ని అధిష్ఠించేంతటి శక్తి కలవాడయ్యాడు. ఎక్కడైనా ఉద్యోగాని క్కావలసినంత చదువూ– దానితో పాటు ఆ ఉద్యోగానికి అర్హుడా? కాడా ? అని నిర్ణయించేందుకు తగిన వేఱే పరీక్ష (Interview) ఉంటాయికదా ! అలాగే, గౌతముని క్కూడా ఇంద్రపదవిని పొందేందుకు తగిన విద్య ఉందికాని, అర్హుడా? కాడా

అని నిర్ణయించేదుకు తగిన పరీక్ష మాత్రం జరగాల్సి ఉంది. దానిలో నెగ్గితే ఇంద్రుడు – తన సింహాసనాన్ని గౌతముని కీయాల్సిందే.

దేవసభ జరిగింది. దేవతలంతా ఆపరీక్షని నిర్వహించేందుకు తగిన అధికారాన్ని ఇంద్రునికే కట్ట బెట్టారు: (ఓడే వాడే అయి నప్పటికీ, ముఖ్యమంత్రి ఎన్నికలని జరపాల్సి రావడం లేదా ?) పరీక్షించాలని ఆలోచించిన ఇంద్రుడు, గౌతముణ్ణి ఏ విషయంలో (Subject) పరీక్షించాలని ఆలోచించాడు. అభ్యర్థి తానుగా ఏవిషయంలో ప్రవీణుణ్ణి – అని తెలుపుతాడో దానిలో కదా పరీక్ష జరపాలి! పై శ్లోకం ద్వారా గౌతముడు– ఇంద్రియాలని అదుపు చేసికొన్నవాడిననీ–అణచబడరాని వాడిననీ–చెప్పుకున్నాడు. ఈ విషయంలోనే పరీక్షించాలని భావించాడు ఇంద్రుడు. ఇది దేవసభలో తీసికొన్న నిర్ణయం మేఱకు జరిగేదే తప్ప, తన నిర్ణయం ప్రకారం కాదు.

ఎప్పుడూ తపస్సు చేసికొనే వాళ్లవద్దకి అప్సరసలని పంపిస్తాడాయన. కారణం, కామాన్ని జయిస్తే తప్ప ('కామం' అనే (Subject) లో ఉత్తీర్ణుడైతే తప్ప) అతడికి ఫలాని స్థానం నిర్ణయింపరాదనే భావంతోనే. దాన్ని అపార్థ పఱచుకోరాదు .

గౌతముని వేషం ధరించాడు. గౌతముడు ఆశ్రమంలోకి ప్రవేశించాడు.

*'మునివేషధరం సహస్రాక్షం విజ్ఞాయ'*–ఆమె వచ్చిన వాణ్ణి గౌతమ వేషంలో ఉన్న ఇంద్రునిగా గమనించి,*'సహస్రాక్షా!'* అంది. ఆశ్చర్యపడ్డాడు ఇంద్రుడు. *'ఎంతటి పాతివ్రత్యం'!* రూపం మార్చి, దేవాధ్యక్షుడంతటివాణ్ణి నేను వచ్చినా కనుక్కోగలిగింది కదా! అనుకొన్నాడు. ఏదో భయంకర శాపం తనకిస్తుందేమోనని భావించాడు. కాని ఆమె కనికరించింది.

వెంటనే అన్నాడు. *'సంగమం త్వహమిచ్ఛామి త్వయానహ సుమధ్యమే!'* అని. *'అహల్యా! నేను నీ సంగమాన్ని కోరుతున్నాను'* అని పై అర్థం. సంగమం అంటే 'శారీరక సుఖం' అని అర్థం కానేకాదు. 'నేను నీతో ఐక్యాన్ని కోరుతున్నాను' అన్నాడు. భగవంతునితో ఐక్యం కావడమంటే మోక్షాన్ని పొందడమే అని భావించాలి. 'దాన్ని తను గ్రహించదలిచాను' అని అన్నాడు.

ఆమె ఆలోచించింది. *'వచ్చినవాడు ఇంద్రుడు.' తాను అడుగవలసిన ఐక్యాన్ని, ఇంద్రుడే యాచిస్తున్నాడు. ఇది ధర్మ బద్ధమౌతుందా? భర్త ఆశ్రమంలో లేడు. ఏం చేయాలి?'* అని. *'ధర్మేచార్థేచ కామేచ త్వయైషా నాతిచరితవ్యా - నాతిచరామి'* అని వివాహ మంత్రం. పురుషునికి స్త్రీలకే ఉండే కట్టుబాట్లని చెప్తూ *'ఓ వరుడా! ధర్మం గాని, అర్థం (ధనసంపాదనా–వ్యయమూ), కామమూ అనే వాటిని ఈమెకు తెలియక నువ్వు చేయరాదు'*–చెప్పి అనుజ్ఞ పొంది చెయ్యమన్నది 'శాస్త్రం. కాని నాల్గవ దైన మోక్ష విషయంలో ఈ కట్టడి లేదు. మోక్షానికి సంబంధించిన ఏ కార్యక్రమం చేయ తల పెట్టినా, దానికి అనుజ్ఞ తీసికోవాలనే నియమం లేదు.

అహల్య అప్పుడాలోచించింది. 'ఇంద్రుడంతటివాడు, తన వద్దకి వచ్చి మోక్షాన్ని ఇస్తానంటుంటే, స్వీకరిస్తే ! ............. అని'.

అంతే! ఇంద్రుడు నవ్వాడు. మోసం ఏదో జరిగిందని అప్పుడామెకు అర్థమైంది. మోక్ష విషయంలో భార్య భర్తలు ఇద్దరూ, ఎవరికివారే అయినా కూడా, ధర్మపత్ని కాబట్టి, భర్తకు చెప్పి, ఆమె మోక్షానికి పోవచ్చు. భర్త అయిన గౌతముడు ఆశ్రమంలో లేనప్పుడు, అహల్య వద్దకు వచ్చి, ఆమెని మోక్ష విషయంగా ఆలోచింప చేసాడు ఇంద్రుడు. (నెలకి పదివేల జీతం తీసికొనే అధికారే అయినా కూడా, లంచాన్ని గురించి (ఒక్క రూపాయే కావచ్చు ఆలోచించడం అధర్మం-నేరం). ఇంతటి మహా పతివ్రతని, భర్త తోడిదే లోకంగా సంచరించే ఆమెని, భర్తని లెక్క చేయకుండా ప్రవర్తించే ఆమెనుగా చేసాడు ఇంద్రుడు. మానసికమైన దోషం ఇది. దోషాలు మూడు. కాయిక (శరీరంతో చేసేవి)- వాచిక (మాటలతో చేసేవి)-మానసిక (మనసుతో చేసేవి) అని.

ఈ మానసిక దోషం చేయించిన కారణంగా, తాను గెలిచానని నవ్వాడు ఇంద్రుడు. ఆమెకి విషయం అర్థమై, స్వామీ ! రక్షించు, మర్యాదని కాపాడు. ఇక్కణ్ణించి వెళ్లిపో ! అన్నది. ఇంద్రుడంతటి వాణ్ణి 'వెళ్లిపో!' అనేంత శక్తి కలది అహల్య.

*సుశ్రోణి పరితుష్టోఽస్మి గమిష్యామి యథాఽగతమ్*' 'ఓ ! అహల్యా ! ఎలా వచ్చానో *(యథా+ ఆగతమ్) అలా వెళిపోతాను'* అన్నాడు. అహల్యతోటి శారీరక సంగమమే జరిగి ఉంటే, ఎలావచ్చాడో అలా వెళ్తున్నట్టు కాదుగా! అపవిత్రుడై వెళుతూన్నట్టేగా!

ఇక్కడ మరో చిత్రం ఉంది. అహల్యని ఓడించాడు. అయినా, అసలు అభ్యర్థి గౌతమునికి పరీక్ష ఇంకా మిగిలి ఉండనే ఉంది, అందుకని గౌతముడువచ్చే త్రోవలో ఇంద్రుడు ఆయన కెదురుగానే వెళ్లాడు.

నిజంగా అహల్యా-ఇంద్రుడు శారీరకమైన తప్పే చేసిఉంటే, ఒక్కసారిగా ఇంద్రుడు అంతర్ధానం కావాలి. తాను ధరించిన గౌతమమహర్షి రూపాన్ని మార్చి కూడా ఉండాలి. ఆయన వచ్చే త్రోవలో, ఆయనకు ఎదురుగా అసలు పోరాదు కూడా కదా!

ఎలాగైనా గౌతమునికి కోపం తెప్పించి, దాంతో శాప మిప్పించి, గౌతముని తపశ్శక్తిని తగ్గించి, తాను నెగ్గి, గౌతముణ్ణి ఓడించాలి. ఇంద్ర పదవికి అర్హుడైతే, తాను తొలగాలి-లేదా, కోపాన్ని జయించి కోపం లేని వాడని నిరూపించాలి.

'*తీర్థోదక పరిక్లిన్నం దీప్యమాన మివానలమ్*' ప్రకాశిస్తూన్న అగ్నిలా గౌతముడు వస్తూ తన వేషంలోనే ఉన్న ఇంద్రుణ్ణి చూచాడు. ఆ వెనుక, కొద్ది దూరంలో భయపడుతూ నిలుచున్న అహల్యనీ చూచాడు. ఇలా చూస్తున్నాడని తెలియగానే ఇంద్రుడు(పరీక్షాధికారి) (*త్రస్త · విషణ్ణవదనోఽ భవత్*) భయపడుతున్న వానిలా, ముఖం పాలి పోయిన వానిలా కన్పించేలా నటించాడు.

తన వేషంలో రావడమూ-భయపడుతూండడమూ - ఇవన్నీ గమనించి, వేడు అందరూ అనుకునే తీరులోనే గౌతముడు కూడా భావించి, ముందుగా ఇంద్రుణ్ణి చూచి 'మమ రూపం సమాస్థాయ కృతవానసి దుర్మతే! అకర్తవ్య మిదం తస్మా ద్వి ఫల స్త్వం భవిష్యసి!' అన్నాడు.

ఓరి దుర్మార్గుడా! నా రూపాన్ని వేసికొని వచ్చి మోసం చేసావు. అందుకని చేయరానిపని చేసిన వాడివయ్యావు కాబట్టి ,నీవు అండములు (వృషణములు) లేనివాడ వగుదువు గాక ! అని శపించాడు.

గౌతమునికి కోపం తెప్పించి, తనకు శాపం ఇప్పించుకొని, తపశ్శక్తిని తగ్గించగలిగానని ఇంద్రుడు లోలోపల ఆనందపడ్డాడు. అయితే, గౌతమ తపోబలం, ఇంద్రసింహాసనాన్ని అధిష్ఠించడానికి మించి ఉండడం బట్టే, దేవతలతో సమావేశం మొదలైన కథఅంతా జరిగింది. ఈ శాపంతో తపశ్శక్తి తగ్గినా, ఇంకా ఇంద్ర సింహాసనాన్ని అధిష్ఠించేంత ఉండవచ్చు కదా! అయినా పరిశీలిద్దామని లోపల భావించి, తాను గౌతముని శాపానికి భయపడ్డవానివలె, కొద్ది ప్రక్కకి తప్పుకున్నాడు.

దానితో ఆశ్రమంలో ఉన్న అహల్య గౌతముని కంట పడింది. ఇంద్రుడు దొంగ భయాన్ని నటిస్తే, అహల్య నిజంగానే భయపడింది. ఆ తొట్రుపాటుని చూచి ఆమెనీ శపించాడు. వాయుభక్షా నిరాహారా తప్యంతీ భస్మశాయినీ - అదృశ్యా సర్వభూతానా మాశ్రమేఽస్మి న్నివత్స్యసి - యదా త్వేత ద్వనం ఘోరం రామో దశరథాత్మజః- ఆగమిష్యతి దుర్ధర్ష స్తదా పూతా భవిష్యసి' అని.

'ఓ ! అహల్యా! వాయువునే భక్షిస్తూ-ఆహారాన్ని విడిచి-బూడిదలో పొర్లాడుతూ ఉండేదానవై-ఎవ్వరికీ కనబడనిదానివై-ఈ ఆశ్రమంలోనే చాలకాలం పడి ఉండు. ఏనాడు దశరథ పుత్రుడైన రాముడు ఈ ఆశ్రమానికి వస్తాడో, అప్పుడు నువ్వు పవిత్రురాలవౌతావు' అని దీని భావం.

ఈ శాపాన్ని కూడా విని ఇంద్రుడు పరమానంద పడ్డాడు. రెండు శాపాలు ఇచ్చిన కారణంగా,ఇంద్రుని తపశ్శక్తి, నిశ్చయంగా ఇంద్రసింహాసనాన్ని అధిష్ఠించేందుకు సరిపోనిది అయి తీరుతుంది. సహజంగా లోకంలో తపస్సు చేసికొనే వారి వద్దకు, రంభ మొదలైన అప్సరసలని పంపించి 'కామం' లో పరీక్ష పెట్టి ఇంద్రుడు ఓడిస్తూంటాడు. కామాన్ని గౌతముడు జయిస్తాడనే నమ్మకం ఉండి, క్రోధంలో పరీక్షపెట్టగా, గౌతముడు చిత్తు చిత్తుగా ఓడిపోయాడు. రెండు శాపాలూ ఇచ్చేసాక, గౌతమునికి కోపం చల్లారి, స్మృతి వచ్చి, 'ఎంత పని చేసాను! కోపంలో ఓడిపోయాను!' అనే పశ్చాత్తాపం కల్గింది.

సహజంగా మహర్షులు శాపం ఇస్తూంటారు. శాపం పొందినవాడు ప్రాధేయ పడితే, శాపమోక్షాన్ని అనుగ్రహిస్తూంటారు. అహల్య ఇక్కడ శాపమోక్షాన్ని ఏమాత్రమూ ఇమ్మని

ప్రాధేయపడలేదు. తనకు తానుగానే రాముని కోసం ఎదురు చూడవలసిందని శాపమోక్షాన్ని గౌతముడు అనుగ్రహించాడు. కారణం,

(1) అహల్య విషయంలో తప్పు ఇంద్రునిదే తప్పు అహల్యది కాదని తెలిసి, (2) ఇంద్రుడు వచ్చాడంటే దేవలోకపు కార్యం కోసమే వచ్చి ఉంటాడని అర్థమయ్యిన్నీ. అందుకే తపస్సు చేసికొనడానికై హిమలయాలకు వెళ్లిపోయాడు.

విశ్వామిత్రుడు లోకాన్ని అనుగ్రహించే లక్షణం కలవాడు. ఇలాటి వారికి సహాయ పడేవాడు ఇంద్రుడు. అందుకనే తాటకని చంపగానే రామునికి అస్త్ర మంత్రాలను బోధించవలసినదిగా వచ్చి మరీచెప్పి వెళ్లాడు. అలాగే, రాబోయే అరణ్య కాండలో కూడ శరభంగ మహర్షి ఆశ్రమానికి వచ్చి, చెప్పవలసిన వాటిని చెప్పి వెళ్లి పోతాడు.

ఒక పనిని నెరవేర్చడానికి మానవులమైన మనమే, కొన్ని సంవత్సరాల ముందు నుండి ప్రయత్నాలని ప్రారంభిస్తాం. మఱి మనల్ని సృష్టి చేసిన భగవంతుడు, కొన్ని వందల సంవత్సరాల ముందుగాప్రణాళికని ఏర్పాటు చేసి కొంటాడంటే, అది నమ్మదగినదే కదా!. గౌతమునికి క్రోధంలో పరీక్ష పెట్టి నట్టుగా చేసి, పరమ పతివ్రతయైన అహల్య చేసిన తపస్సు ద్వారా వచ్చిన శక్తిని, రామునికి ఇప్పించే ఏర్పాటు చెయ్యాలని ఇంద్రుని ఆలోచన. కాబట్టే, గౌతముని యొక్క శాపం అహల్యా విషయంలో అలా ఉంది. అహల్య ద్వారా రామచంద్రునికి తపశ్శక్తిని ఇప్పించవలసిన అవసరమేమిటని అన్పించవచ్చు రావణాసురుడు మహాతపశ్శక్తి మంతుడు. బ్రాహ్మీ ముహూర్తంలో (తెల్లవారు ఝామున 4.30 ని. లకు) నాలుగు సముద్రాల్లోనూ స్నానం చేసి శివపూజ క్రమం తప్పకుండా చేసే నైష్ఠికుడు. అలాటి వాణ్ణి అకస్మాత్తుగ జయించడం అసాధ్యం కాబట్టే దేవతలంతా అతణ్ణి చంపడానికై మహర్షుల తపశ్శక్తి అవసరమని భావించారు. రామచంద్రుడు అరణ్యాలలో పధ్నాలుగు సంవత్సరాల పాటు తిరిగినది కూడ, ఆయా మహర్షుల తపశ్శక్తిని స్వీకరించడానికే.

ఒకరిని ఒకరు గెలవడం అంటే భుజబలం వలన కాక, తపోబలం వలన అని అర్థం చేసి కొనాలి. ఆ తపోబలమే, ఏదైనా ఆయుధం ద్వారా(శస్త్రం) ప్రయోగింపబడితే, 'అస్త్రం' అవుతుంది. అలాటి అస్త్రాలని ప్రయోగించే రావణుణ్ణి, రాముడు సంహరించాలి.

అందుకై ఈ తపశ్శక్తి అవసరమని భావించిన ఇంద్రుడు, ఉత్తమ తపోబలం అహల్యా గౌతములకు ఉన్నదని తెలిసి, ఇలాటి పనిని చేసాడు. ఇది యథార్థం కాబట్టే – ఇలా చేయడంలో మోసం, దురాలోచనా, ఇంద్రునికి ఏ మాత్రము లేవు కాబట్టే – అండములు లేని ఇంద్రుణ్ణి, దేవతలంతా పరామర్శించి, మేక యొక్క అండములను అతనికి ఇచ్చి, సంతానానికి అర్హునిగ చేసారు. దేవేంద్రుడే, అహల్యా విషయంలో

శారీరకమైన తుచ్ఛ సుఖాన్ని పొంది ఉంటే, దేవలోకానికి వెళ్ళి తన భంగపాటుని చెప్పుకోగలడా ? ఇంద్రుడు ఒకవేళ చెప్పలేదని భావించినా, దివ్యదృష్టి గల దేవతలు నిజాన్ని గ్రహింపరా ? పతివ్రతా విషయంలో ఇలా చేసినందుకు ఇంద్రుణ్ణి అంతా శిక్షిస్తారే తప్ప, సంతోషించి మేక అండాలను దేవేంద్రునకు ఇస్తారా? (*క్రోధ ముత్పాద్య హి మయా సురకార్య మిదం కృతమ్) 'దేవతలారా! గౌతమునికి కోపాన్ని తెప్పించి దేవతాకార్యాన్ని చక్కబెట్టాను'* అని ఇంద్రుడన్నాడు – అంటే, ఇది ఒక్క ఇంద్రుని పనే కాదు దేవతల అందరి పనీను.

విశ్వామిత్రుడు తన కీయబడిన ఆజ్ఞ ప్రకారం–తనకి నిర్దేశించబడిన ప్రణాళిక ప్రకారమున్నూ–అహల్యా దర్శనాన్ని చేయించడం పనుల్లో ఒకపని. ఆమె ఎవరికీ కనిపించక, దశరథ పుత్రుడైన రాముడు వచ్చినపుడు మాత్రమే కనిపించేలా గౌతముడు శపించడంలో కూడా, ఒక విశేషం ఉంది. ఈ సమాధి కాలంలో చేయబోయే తపస్సు, ముందు నాటికి భగవంతున కీయవలసినది సుమా! అని. లోకంలో ఎవరైనా తపస్సు చేస్తే, తపస్సు చివరలో *"ఏతత్సర్వం శ్రీ పరమేశ్వరార్పణ మస్తు లేదా తత్సత్ బ్రహ్మార్పణమస్తు"* అని పలికి జలం విడుస్తారు. ఆ తపోబలమే స్థాయి మించితే, పరమేశ్వరుడే స్వయంగా వచ్చి, తపశ్శక్తిని దానంగా గ్రహించి మరీ వెడతాడు.

శ్రీ మహావిష్ణువే ఎందరెందరో మహర్షులని తనకు తానుగా వెళ్ళి దర్శించడం – వారి ఆశ్రమంవద్ద వారిరాక కోసం ఎదురు చూడడం–వారి తపశ్శక్తిని స్వయంగా స్వీకరించడం–అనేది, అరణ్య కాండలో జరుగ బోతోంది. (ఇది వివరంగా నా అరణ్యకాండ వ్యాఖ్యలో చూడవచ్చు.) అలాటి తపశ్శక్తిని మొదటగా స్వీకరించినది అహల్య నుండి అని గ్రహించాలి.

***"రాఘవౌ తు తతస్తస్యాః పాదౌ జగృహతు స్తదా – రామలక్ష్మణు లిరువురూ విశ్వామిత్రుని ఆజ్ఞపై ఆమెను దర్శించడమే కాక పాదాలను స్పృశించి నమస్కరించారు కూడా. అహల్యకో దోషమే ఉండి ఉంటే, ధర్మ పరుడైన రాముడు పాదాలను తాకి నమస్కరిస్తాడా ? విశ్వామిత్రుడు, అలా నమస్కరిస్తున్న వారిని ఆమోదించి ఊరుకొంటాడా? అదీ కాక రాముడు వచ్చిన పిమ్మట అహల్యని గౌతముడు తిరిగి భార్యగా స్వీకరిస్తాడా ? వీరిరువురి పుత్రుడైన శతానంద మహర్షి, జనకుని సభామండపమధ్యంలో "మా తల్లిని, తండ్రి తిరిగి స్వీకరించాడా?" అని అడుగుతాడా?.***

అహల్య–అర్ఘ్యాన్నీ (చేతులు కడుగుకొనేందుకు నీరు) పాద్యాన్నీ (కాళ్లు కడుక్కొనేందుకు నీరు) ఆ పిమ్మట ఫలాలనీ ఇచ్చి రాముడికి ఆతిథ్య మిచ్చింది.

**ఫలాలంటే పట్టే పళ్లని అర్థం కాదు. తపః ఫలాలని అర్థం ఈ విషయమే భగవద్గీతలో "పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి" అనే శ్లోకంలో చెప్పాడు పరమాత్మ. హృదయ పత్రాన్నీ–మంత్ర పుష్పాన్నీ–తపః ఫలాన్నీ––తపశ్శక్తినీ**

(స్త్రీల్లద్వారా) అర్పణం చేయాలని దీని భావం. కాని పట్టి పత్రినీ-పూవులనీ - ఫలాలనీ-నీటినీ తన కిమ్మని భగవంతుని అభిప్రాయం కానేకాదు.

ఆ తపః ఫలాలని ఆతిథ్యంగా స్వీకరించిన రాముడు పరమ కృతజ్ఞుడై ఆమెకు నమస్కరించాడు. **తాను ఆర్జించిన తపస్సుని - ఎవరి నుండీ దానాన్ని స్వీకరించని రామునికి, రాముణ్ణి రప్పించుకొని తన తపఃశక్తిని దాన మిచ్చినంతటి ఉత్తమురాలు అహల్య. రాముణ్ణి వెతుక్కుంటూ విశ్వామిత్రుడు వస్తే, రాముణ్ణి రప్పించుకొన్న పతివ్రత అహల్య. యాగానికి విఘ్నం కలక్కుండా విశ్వామిత్రునికి రాముడు అభయమిస్తే, రాముడు చేయబోయే రావణవధకి తపశ్శక్తి నిచ్చి, రాముడికే అభయాన్నిచ్చిన తపస్వి అహల్య.**

దీనికి వేదాంత పరంగా కూడా మహార్థముంది. అయితే అది సామాన్య స్థాయిని మించేది. మఱొక చోట దాని గురించి ముచ్చటిద్దాం.

"మునినా సంగతా పత్నీ భార్గవేణేవ రేణుకా" అని ఇక్కడి మాట. జమదగ్ని మహర్షి రేణుకాదేవిని స్వీకరించి నట్టుగా, అహల్యను గౌతముడు స్వీకరించాడని దీని అర్థం. రేణుకాదేవి కూడ, మానసికమైన దోషాన్నే చేసింది. "ఆమెను జమదగ్ని స్వీకరించినట్లే" ............. అని అనడంలో, అహల్య చేసిన దోషం కూడా మానసిక దోషమనే గ్రహించాలి.

అహల్యని బండఱాతిగా శపించినట్లు వ్యాసుడూ, కాళిదాసూ వ్రాసారు. బండ ఱాతిగా శపించడంలో ఒక దోషం ఉంది. ఒక డెవరో ఏదో నేరం చేసాడను కొందాం. ఆతనికి న్యాయాధిపతి శిక్ష విధించాడనుకొందాం. మూడురోజులపాటు శిక్ష అనుభవించవలసి వస్తే, 4 రోజుల పాటు ఆ నేరం చేసిన వ్యక్తికి,తన శరీరం తనకి తెలియని మత్తుమందు ఇచ్చామనుకుందాం. శిక్ష అనుభవించి నట్టు గాని, తప్పు చేసినందుకు బాధ పడాలని గాని, ఏ మాత్రపు ఆలోచనా అతనికి ఉండక, అతనిలో పశ్చాత్తాప బుద్ధి కలుగనే కలుగదు. మత్తుమందు ఇవ్వడం ఎలాంటిదో, ఱాతిగా శపించడమూ అలాటిదే. పైగా, అమూల్యమైన తపః ఫలం ఆమెనుండి పొందడానికి వీలుగా, ఆ శాపం అంత చక్కగా వాల్మీకంలో (వాల్మీకిరామాయణంలో) ఇవ్వబడింది. పైగా, ఈ శ్రీమద్రామాయణ కథని విని, రాముడే 'నిజమని' ఆమోదముద్ర వేయగా, ఱాతిగా శపించాడని వ్రాయడం-రామాయణానికి వ్యతిరేకమూ-ఆమోదం పొందని శాపమున్నూ కదా!.

భర్త తనవద్ద ఉండగానే, మానసికంగా దోషాన్ని చేసింది అహల్య అయితే, (ముందునాటికి) రావణుని సమక్షంలో ఉండికూడా, ఏమాత్రపు మానసిక దోషం కూడా చేయనిది సీత. మానసికదోషం చేసిన అహల్యనే గౌతముడు గ్రహిస్తే, అలా చేయని సీతమ్మని గ్రహింపక పోవడం దోషమౌతుంది సుమా!-అని రామునికి ముందు కాలానికి హితబోధ కూడా ఇందులో ఉంది.

బయలుదేరి ప్రయాణిస్తున్న రామలక్ష్మణులు మహర్షి గణంతో మిథిల పొలిమేరలు చేరారని తెలిసి, జనకమహారాజు తన వారందరితోను ఎదురొచ్చి, రాజ మర్యాదలతో తన దేశానికి తీసుకొని వెళ్లాడు.

పన్నెండు రోజుల యాగం సాగేంత వరకూ మీరిక్కడే ఉండాలని విశ్వామిత్రుణ్ణి ప్రార్థించిన జనకుడు రామలక్ష్మణుల సోయగాన్ని త్రాగివేస్తున్న వానిలా సంతృప్తితో చూస్తూ ఇలా అడిగాడు. *'మహర్షీ! తామరలవంటి నేత్రాలూ, రమణీయ రూపమూ అక్షయ తూణీరాలూ కలిగిన ఈ యిద్దరూ అశ్వినీ దేవతల్లా ఉన్నారు. దేవతలే నడిచి భూలోకానికి వచ్చారా?'* అనిపిస్తోంది. ఏపని మీద వచ్చారు? ఎవరి పిల్లలు ? అని.

దీని - లోభావం - స్పష్టంగా తెలుస్తోంది. వీరిద్దరూ దేవతలే అనే అభిప్రాయం నిత్యమూ యాగాలుచేసే జనకునికి కలిగే అడిగాడు అని. దేవ రహస్యం బయటపెట్టరాదు కాబట్టి, జనకునికి అర్థ మయ్యే స్థాయిలో విశ్వామిత్రుడు వీరికథనంతా చెప్పి,ఇంకా అర్థం కాకపోతే అర్థమయ్యేందుకు *'నీయింట శివధనువుని చూడవచ్చినవారు'* అని చెప్పి ఊరుకున్నాడు.

పూర్వకథని వినగానే, అహల్యా గౌతముల పుత్రుడు శతానందుడు, తమతల్లిని గూర్చి అడిగి, సమాధానం తెలిసికొని సంతోషించాడు.

## రామా! విశ్వామిత్రుణ్ణి గూర్చి విను!

లోకంలో ఎవరైనా తమ గురించి తాము చెప్పుకుంటూ ఉంటారు. కాని విశ్వామిత్రుడెక్కడా తన గొప్పదనాన్ని తాను చెప్పుకోలేదు. ఆయన గూర్చిన కథని ఇప్పటి వరకూ రామలక్ష్మణులు వినలేదు. తన సోదరిని గూర్చి విశ్వామిత్రుడు చెప్పి వేరొక కథలోనికి వెళ్లిపోయాడు. రామలక్ష్మణులకి తమ గురువు గూర్చి తెలిసికోవాలని ఏనాటినుండో ఉన్న కోరికని తీర్చదలచి, జనకుని పురోహితుడైన శతానందుడు, రామునితో ఇలా చెప్పసాగాడు.

*'నాయనా! విశ్వామిత్రుడు నిన్ను వెంటపెట్టుకొని వచ్చాడంటే అది నీ అదృష్టమే. ఎంతో మేలు చేయదలచి నిన్ను తెచ్చి ఉంటాడు . ఆయన 'బ్రహ్మర్షి' కూడ అయినాడు. నీకా కథని చెప్తాను విను.*

## "ఈ గోవుని ఇవ్వనే ఇవ్వను"

రామచంద్రా ! దేశదేశాల చరిత్ర తెలిసిన విశ్వామిత్రుడు ఒకసారి, తన అక్షౌహిణీ సైన్యంతో భూలోకంలోని ఆశ్రమాలన్నీ తిరుగుతూ వసిష్ఠుని ఆశ్రమానికి వచ్చాడు.

ఉభయుల కుశలప్రశ్నలయా అయ్యాక అక్షౌహిణీ సైన్యంతో ఉన్న విశ్వామిత్రునికి వసిష్ఠుడు ఆతిథ్యాన్ని ఇచ్చాడు.

ఎవరెవరికి ఏ యేవి ఇష్టమో అలాటి పదార్థాలూ, భక్ష్యాలూ (పిండి వంటలు) భోజ్యాలూ (తినదగిన కాయలు-పళ్లు) చోష్యాలూ (పులుసులు) లేహ్యాలూ (నాలుకకు అంటించుకొని తినదగినవి) పానీయాలతో త్రాగడానికి వీలైన పాయసం వంటివి) చక్కని నీటితో వండిన బియ్యంతో ఉడికిన అన్నాన్నీ ఏర్పాటుచేసాడు వసిష్ఠుడు. ఏ కబురూ లేకుండా వచ్చిన తనకి, ఇన్ని పదార్థాలని ఇంత తక్కువ కాలంలో ఇంతమందికి ఇంత రుచిగా చేయడానిక్కారణం వసిష్ఠుని యింట ఉన్న 'శబల' అనే పేరున్న 'గోవు' అని తెలిసింది విశ్వామిత్రునికి.

*'వసిష్ఠా! క్షత్రియుణ్ణైన నేను తమని ఏదీ యాచింప రాదు. పైగా మీరు మాటల్లో వేర్పరిటనం ఉన్నవాళ్లు. యాచిస్తున్నాను కాబట్టీ, నూటిగా మర్మం లేకుండా అడుగుతున్నాను కాబట్టీ ఆ 'శబల గోవు' ని నాకిప్పించండి. రత్నహారీ తు పార్థివ ! అని కదా న్యాయం ! (లోకంలో శ్రేష్ఠమైన ఏ వస్తువున్నా అది రాజుకే చెందుతుంది) ఇక మీకు ఈ గోవుకి బదులుగా లక్ష గోవులని వెంటనే వంపిస్తాను'* అన్నాడు విశ్వామిత్రుడు.

'విశ్వామిత్రా! పౌరుషవంతుణ్ణి ఆశ్రయించుకున్న కీర్తిని, అతని నుండి ఎలా వేరు చేయసాధ్యం కాదో, అలాగే-లక్షకాదు -కోటికాదు - నూఱుకోట్ల ధేనువులనిచ్చినా, నుండి ఈ 'శబల' దూరమయ్యే ప్రసక్తి లేదు. నా తపశ్శక్తికి అంతకీ నా ఈ ధేనువే మూలం' అందుకని ఇవ్వనే ఇవ్వను అని వసిష్ఠుడు నొక్కి చెప్పాడు.

ఈసారి విశ్వామిత్రునిలో (రాజు కాబట్టి రజోగుణం పెరిగి) కోపం పెరిగి - బంగారు గొలుసులూ, బంగారు నడికట్టు త్రాళ్లూ, బంగారు అంకుశాలూ, కల 14,000 ఏనుగులనీ, బంగారు గంటలూ మువ్వలూ ఉన్న నాల్గు గుఱ్ఱాలు పూన్చిన బంగారు రథాలని ఇస్తాను. 11,000 ఉత్తమ జాతి గుఱ్ఱాలని ఇస్తాను. కోటి చూడి ఆవులని, కోరిన వాటినిస్తాను. ఇది కాక, మీరడిగినవి ఇస్తాను. శబలనిప్పించు' అని ఆజ్ఞగానూ, ప్రార్థనగానూ అడిగాడు.

ఏమైనా ఈయనని వసిష్ఠుడూ - ఇవ్వకతప్పదని విశ్వామిత్రుడూ వాదవివాదాలు చేసారు. ఇక లాభం లేదని తలచిన విశ్వామిత్రుడు, తన భటులతో శబలని బలవంతానా తెమ్మని ఆజ్ఞచేసాడు. శబల వసిష్ఠుని వద్దకు దుఃఖిస్తూ వచ్చి అడిగింది "పంపుతున్నావా?" అని -

శబలతో వసిష్ఠుడు *'శబలా! నీవు నా సహోదరిలాంటిదానివి. జరుగుతున్నది చూస్తున్నావు కదా! నేనెలా ఇష్టపడి పంపుతాను? నేను బ్రాహ్మణుణ్ణి. తపోబలంతో ఏదైనా చేయాలి భావిస్తే ఇతణ్ణి (రాజుని-ఇప్పుడే ఆతిథ్యాన్ని నేనీయగా స్వీకరించినవాణ్ణి) నేనేమీ చేయరాదుకదా! నీవే సేనలని సృష్టించుకో!'* అన్నాడు.

శబల అంకెవేసింది. హూంకారం నుండి కాంభోజాలూ, పొదుగునుండి పహ్లవులూ, రోమాలనుండి రోమీయులూ, (మ్లేచ్ఛులు) (శకృత్) గోమయం నుండి శకులూ, యోని నుండి యవనులూ ఇలా పుట్టి, విశ్వామిత్ర సేనలని వధించి, రథాలని ధ్వసంచేసి, అశ్వాలని కండతుండాలుగా నటికి బీభత్సం చేయడంతో, విశ్వామిత్రుడు బ్రతికి ఉన్న తన ఒక్క పుత్రునితోమా ఆశ్రమం నుండి పాటిపోయాడు.

ఆ కుఱ్ఱవానికి రాజ్యాన్ని పట్టం గట్టి, శివుణ్ణి గూర్చి తపస్సు చేసి ధనుర్వేదాన్నీ, అస్త్రరహస్యాలనీ, మంత్రాలనీ వరంగా పొంది, మఱుక్షణంలోనే ఆశ్రమం మీదికి దూకి వసిష్ఠుని మీదికి ఒక్కొక్కటీ విడువ సాగాడు.

మూఢుడైన విశ్వామిత్రుని క్షత్రియబలాన్ని ఎదిరించడానికి తనతపశ్శక్తిని నిక్షిప్తం చేసిన తన బ్రహ్మదండాన్ని పట్టుకుని నిలబడ్డాడు వసిష్ఠుడు. అంతే ! ఒక్క అస్త్రం కూడా వసిష్ఠుణ్ణి ఏమీ చేయలేక పోయింది. విశ్వామిత్రునికి సిగ్గువేసింది. అభిమానపడ్డాడు.

**'ధిగ్బలం క్షత్రియబలం బ్రహ్మతేజో బలం బలమ్ ।**

**ఏకేన బ్రహ్మదండేన సర్వాస్త్రాణి హతాని మే ।** 'అయ్యో! క్షత్రియబలం ఎంత నీచమైనది. బ్రాహ్మణుని మంత్రబలం ముందు నా బలం అంతా వ్యర్థమై పోయింది. ఒక్క బ్రహ్మదండం ముందు నా క్షత్రియబలం నిర్వీర్యమై పోయింది'. అని పశ్చాత్తాప పడుతూ బ్రహ్మబలం సంపాదించడానికి తపస్సు చేయాలని సంకల్పించాడు.

## ఈ కథ వల్ల తెలిసిందేమిటి ?

ఈ కథ అంతా విశ్వామిత్రుడు 'బ్రహ్మర్షి' కాకముందు, కేవలం క్షత్రియుడుగా ఉన్నప్పటి కథ. శతానంద మహర్షి, రామలక్ష్మణులకి మంత్రులతో ఉన్న జనకమహారాజా సమక్షంలో, ఈ కథని చెప్తూంటే, విశ్వామిత్రుడు కూడా వింటూ ఉన్నాడు.

లోకంలో ఎవరైనా సంమానాలని కోరుకుంటారుగాని అవమానాన్ని కోరుకోరు. ఒకవేళ ఎక్కడైనా అవమానం జరిగినా, దాన్ని తిరిగి గుర్తు తెచ్చుకోడానిక్కూడా ఇష్టపడరు. ఇక్కడ శతానందమహర్షి చెప్పే యీ కథ, విశ్వామిత్రుని అవమానం గూర్చి. ఎవరైనా ఆతిథ్యమిస్తే స్వీకరించి పోవాలిగాని, భోజనం వడ్డించిన వెండిపళ్లెం ఇమ్మంటే అది మర్యాద ఔతుందా ? కుదురదు అని అన్నందుకు, ఆతిథ్యమిచ్చిన వానిపై విరోధించి యుద్ధం చేయడం ఎంత అవివేక మౌతుంది ? అలాటి తన దుశ్చేష్టని శతానందుడు తన ఎదురుగా అంతమందిలో రామలక్ష్మణుల సమక్షంలోకూడా వివరించి చెప్తూంటే, విని ఊరుకొనేంత సత్త్వగుణం కలవాడు విశ్వామిత్రుడు. 'బ్రహ్మర్షి' అంటే అంతటి సత్త్వగుణం ఉన్నవాడన్నమాట.

తన అవమానం గురించి ఎంతగానో, ఎందరికో తెలిస్తే, ఎంతో జాగ్రత్త పడుతూ, అలాటి అవమానంతెచ్చే లక్షణం ఉండకుండా ప్రయత్నించేందుకు వీలౌతుందని విశ్వామిత్రుని అభిప్రాయం. చరిత్రని గూర్చి, నడవడికని గూర్చి జాగ్రత్త పడాలని నేటి కాలపు ఏ ఒక్క ప్రకటనా చెప్పదు. శరీర సౌందర్యాన్ని గూర్చి జాగ్రత్త తీసికొనాలనీ, ప్రత్యేక శ్రద్ధ వహించాలనే నేటి వ్యాపార ప్రకటనలుగానీ, కొన్ని రచనలు గానీ చెప్తాయి. అవమానం గూర్చి ఈనాడు చెప్పబోతే, అవమానపడిన వ్యక్తి చెప్పనీయడు సరికదా *'నీకు మాత్రం జరగలేదా ?'* అంటాడు. ఇదేమీ వీలు కాకపోతే మరో విషయంలోకి సంభాషణని మార్చి సంతృప్తిపడతాడు.

ఇదంతా ఎందుకంటే, రామునికి హితబోధ చేయడానికే. ఏమని? అంటే– *'రామా! నువ్వు క్షత్రియుడివి. క్షత్రియబలంతో మాత్రమే వ్యవహరిస్తే విశ్వామిత్రుని వద్దతి కల్గుతుంది. క్షత్రియబలం, బ్రాహ్మణబలం ముందు ఎందుకూ పనిచేయదు. నీ క్షత్రియబలంతో కాక, అరణ్యాలలోని మహర్షుల తపోబలాలతో ముందు కాలంలో రావణుణ్ణి వధించుసుమా'!* అని భావం. అందుకే, విశ్వామిత్రుడిచ్చిన అస్త్రాలమంత్రాలని పునశ్చరణచేసి అవి, 'పట్టివ్వడానికి' మహర్షుల తపోబలాలని స్వీకరించడానికి, 14 సంవత్సరాల కాలం అరణ్యంలో తిరిగాడు రాముడు. విశ్వామిత్ర వాక్య ప్రభావమే దీనిక్కారణం. మహర్షులందరూ తపోబలాన్ని శ్రీ మహావిష్ణువుకే కదా ధారపోయవలసినది. ఆ తపశ్శక్తిని స్వయంగా విష్ణువేవచ్చి స్వీకరించి పోవడం వారికే గర్వకారణం అయింది. ఎందరెందరికి, విష్ణువే వచ్చి స్వయంగా స్వీకరించే అంతటి ఆ స్థాయి తపశ్శక్తి ఉందో, ఆ స్థాయి మహర్షులంతా దండకారణ్యంలో ఉండడం బట్టి, వారివారివద్దకి మాత్రమే రాముడు వెళ్లాడు. అందరి దగ్గరా స్వీకరించక పోవడానిక్కారణం కూడ అందరికీ ఆ స్థాయి లేక పోవడమే.

ఇక, శబల అనే గోవుకోసం అంత తాపత్రయమందేనికి? అంటే, గోవు సాధారణ మైనది కాదు.

## గోమాహాత్మ్యం

పరమాత్మ సృష్టి చేస్తూ వసు– రుద్ర ఆదిత్యులనే ముగ్గురు దేవతలని సృష్టించి, వారి కోరిక మీద వారికే సృష్టిచేయగల శక్తినిచ్చాడు. దానితో వారంతా ఒక గోవుని సృష్టించారు.

ఇది వారి *'ఉమ్మడి ఆస్తి'* కదా అని, బ్రహ్మ వద్దకు పోయి ఆయనకే ఇస్తే, దీన్ని సంవత్సరానికొకరు చొప్పున రక్షించి, ఆ పిమ్మట తన వద్దకు రావలసినదని బ్రహ్మ పలికాడు.

3 సంవత్సరాలూ అయ్యాక వేయి ఆవులతో ఈ ముగ్గురూ ఆయన వద్దకు పోయారు. 'అయ్యా! ఈ ఆవు ఒక్కొక్క సంవత్సరంలోనూ పెట్టిన పిల్లలూ, పిల్లల పిల్లలూ అలా మొత్తం కలిపి ఒక్కొక్కరి దగ్గఱా333 చొప్పున అయ్యాయి. అలా ముగ్గురి వద్దా కలిపి '999' ఆవు పిల్లలూ, +మీరిచ్చిన ఆవూకలిపి 'వేయి' అయ్యా యన్నారు.

ఒక్క ఆవుని దానం చేస్తే, పుట్టబోయే 999 ఆవులని కనగల శక్తి ఉన్న ఈ ఆవు, వేయి ఆవులకి సమానమౌతుందట. అందుకని ఒక్క ఆవుని దానంచేస్తే, వేయిటిని దానం చేసిన ఫలిత మిస్తానని బ్రహ్మగారు చెప్పారు. ఆవు రోమాలు ఎన్ని ఉన్నాయో అంత కాలమూ బ్రహ్మలోకంలో నివాసం చేసే అధికార మిస్తానన్నాడాయన. అదే కపిలగోవైతే, 7 తరాలదాకా వంశాన్ని తరింపచేస్తాననీ చెప్పాడు.

గాలివూ – వర్షమూ – చలిబాధలలో తనకంటె ముందుగా ఎవడు గోవుని రక్షించ ప్రయత్నిస్తాడో వాడికి మహాపుణ్యమే కాక, అపమృత్యు భయం (ప్రమాదాలలో అకస్మాత్తుగానూ లేదా బంధువులకి దూరంలోనూ మరణించడం) లేదని నియమం చేశాడు బ్రహ్మ.

ఇతరుల సొమ్ముని వారికి చెప్పకుండా తేవడం దొంగతనమే ఐనా, గోవు గడ్డి కోసం తెస్తే అది దొంగతనం కాదని వేదం పలికింది. ఇంత గొప్పది కావడం వలననే, వివాహానికి ఆదిలో గోదానం చేయించడం – పితృకార్యాలలో గోదానాన్ని చేయించడమూను. గోదాన ప్రత్యామ్నాయమని(బదులుగా) ఏదో రెండ్రూపాయలిస్తే, రెండురూపాయాల దాన ఫలితం వస్తుంది తప్ప, పైఫలమెలా వస్తుంది ? పైగా, చేసేదానం గోదానం కాదని ఇచ్చేవానికీ, పుచ్చుకునేవానికీ, చూచే అందఱికీ కూడ తెలుసు. కాని,గోదాన మిచ్చినట్లే అనుకుంటే ఎలా? ఇలా ఈయలేని పక్షంలో 'గోదాన మీయగల శక్తి నాకు లేదు – పై జన్మలోగానీ, ఈ జన్మలోనే గాని అనుగ్రహించు', అని వేడుకోవడం సరైనదని శ్రీమద్భాగవతం చెప్పింది.

అంతేగాని దొంగదానం చేయవద్దంది. బలరామ కృష్ణులు పుట్టినప్పుడు, బ్రాహ్మణులకి గోదానం చేసే అదృష్టం తనకి లేదని చెఱసాలలో ఉన్న వసుదేవుడు దుఃఖించాడు. అయితే, మనస్సులో మాత్రం 'గోదానం 'చేస్తాను అని మ్రొక్కుకున్నాడు. ఈ మొక్కు కారణంగా కంసవధ పిమ్మట, కంసుడు తోలుకొని పోయిన ఆవులన్నీ బలరామ కృష్ణుల ఉపనయన కాలానికి తనకి కలిగాయి. అప్పుడు దానమిచ్చాడు. ఇయ్యలేక పోవడం తప్పు కాదు గాని, ఇవ్వనిదానిని ఇస్తున్నట్టు చెప్పడం నేరం.

గోసేవచేసి సంతానాన్ని దిలీపుడు పొందితే, గోమూత్రాన్ని కళ్లకు రాసికొన్న రఘు మహారాజు, అశ్వమేధయాగంలో గుఱ్ఱాన్ని ఎవరు అపహరించి, ఎక్కడ దాచారో

తెలిసికోగలిగాడు. గోవులు శుభానికీ, సంపదకీ గుర్తు. అందుకే విరాటరాజుకి ఉన్న ఐశ్వర్యాన్నీ, శుభ పరంపరనీ ఎత్తుకుపోవాలనే ఉద్దేశ్యంతోనే కౌరవులు ఉత్తర దక్షిణ గోగ్రహణాలు చేసారు. (ఉత్తర దిక్కునా; దక్షిణ దిక్కునా ఉన్న విరటుని గోవులని బలవంతగా మరల్చి తెచ్చుకోవడం).

*'అచరేభ్యశ్చ భూతేభ్య శ్చరా శ్శ్రేష్ఠా నరాస్సదా - బ్రాహ్మణాశ్చతత : శ్రేష్ఠా తేషు యజ్ఞః ప్రతిష్ఠిత : - యజ్ఞై రవాప్యతే సోమ : సచ గోష్వప్రతిష్ఠితః'* (సోమో గోషు ప్రతిష్ఠితః అని వేదం).

ప్రాణం లేనివాని కంటె ప్రాణం ఉన్నవి గొప్పవి.

ప్రాణం ఉన్నవానిలో కూడ కదిలేవి, కదలలేని వానికంటె గొప్పవి.

కదిలేవాటిలో, ఆలోచించగల శక్తి ఉన్న నరులు, బుద్ధిలేని పశుపక్ష్యాదుల కంటె గొప్పవారు.

నరులలో వేదాధ్యయనాన్ని చేసి, ధర్మ బోధ చేస్తూ, హింసని వ్యతిరేకించే విధానం నేర్పే బ్రాహ్మణులు గొప్ప.

వారిలో కూడ యజ్ఞాలు చేయించగలిగిన శక్తి ఉన్నవారు గొప్ప.

ఆ యజ్ఞంవల్ల వచ్చే 'సోమం' అనే ద్రవ్యాన్ని, దేవతలు గోవులలో దాచుకుంటారు. అంటే, దేవతలకి ఆహారం దాచుకొనే చోటు గోవులు. అలాంటి గోవుని సేవించడమంటే, దేవతలకి ఆహారమిచ్చినట్లే కదా! (ప్రత్యేకంగా గోవుకోసం ఏమీ కొనుక్కురానక్కఱలేదు. మన యింటిముందు నుండి గోవు పోతూంటే, ఒక పాత్రలో నీటినీ, ఏ కూరగాయనో ఇవ్వగలిగినంత యిచ్చినా చాలు, స్వీకరిస్తుంది. మనం తెచ్చుకునేప్పుడే, ఒక ఆకుకూర కట్టని దానికి పెట్టిరావచ్చు. నేడు పెట్టామని, రేపు లేదని తిట్టదు. రోజూ పెట్టాలని శాసించదు. ఏనాడైనా పెట్టకపోతాడా? అని ఎదురుచూచే సాధువు. ఈ నాటినుండే ఇలాటి గోసేవని ప్రారంభించవచ్చు. కష్టం ఏముంది?).

## "నన్ను కొనుక్కో"

గంగా యమునలు కలిసేచోట తపస్సు చేసుకుంటూన్న చ్యవన మహర్షి ఒకసారి పల్లెవాళ్ల వలలో పడ్డాడు. ఆ దేశపు రాజు నహుషుడు అడిగాడు *'మహర్షీ! వీరికి ఆహారంగా నువ్వు చిక్కావు. ఏం చేయను ?'* అని.

'నన్ను కొనుక్కుని ఆ మూల్యాన్ని వీరికియ్యి' అన్నాడు చ్యవనుడు. ఎన్నిటినిచ్చినా సరికాదు - కాదని తిరస్కరించిన చ్యవనుడు, గోవు నిచ్చిన నహుషునితో *'ఉత్తిష్ఠో త్తిష్ఠ రాజేంద్ర! సమ్యక్క్రీతోఽస్మి తేఽనఘ - గోభి స్తుల్యం న పశ్యామి - ధనం కించి దిహా చ్యుత !'* అన్నాడు. నన్ను సరియైన విలువతో కొన్నావు. ఇదిగో ఈ గోవుని వారికిద్దాం. 'గోవుతో సమానమైన దేదీ లేదు' అని. ఆ గోవుని రాజుకిచ్చి

చెప్పలేని ధనాన్ని పొందారు. ఆ పల్లెవారు ఇంకచాలు వద్దని వెళ్లిపోయారు తప్ప, నహుషుడు ఇస్తూనే ఉన్నాడు వారికి. అంతటి శక్తికలదిగోవు.

## గోబ్రాహ్మణేభ్య శ్శుభమస్తు నిత్యమ్!

విశ్వామిత్రుని గూర్చి చెప్పిన యీ కథలో గోవులకీ, బ్రాహ్మణులకీ, ఉన్న శక్తిని శతానందుడు చెప్పాడు. అందుకే ఈ ఇద్దఱూ (గో బ్రాహ్మణులు) సుఖంగా ఉంటే, (సుఖంగా ఉంచితే) గో బ్రాహ్మణుల ఆశీర్వచనాలవల్ల, లోకం క్షేమంగా ఉంటుందని పెద్దలమాటా - పైగా పూర్వ ఇతిహాసపురాణాల సాక్ష్యమున్నూ.

*అష్టౌ పూర్వనిమిత్తాని నరస్య వినశిష్యత । బ్రాహ్మణాన్ ప్రథమం ద్వేష్టి - బ్రాహ్మణైశ్చ విరుధ్యతే - బ్రాహ్మణస్వాని చాదత్తే - బ్రాహ్మణాంశ్చ జిఘాంసతి - రమతే నిందయా చైషాం ప్రశంసాం నాభినందతి - నైతాన్ దోషస్సుర । ప్రాజ్ఞ । బుద్ధ్యా బుద్ధ్యా వివర్జయేత్'* అని భారతం చెప్పింది.

తట్టుకోలేని కష్టాన్ని పొందబోయే వ్యక్తికి, 8 విధాలైన బుద్ధులు పుడతాయట. *'బ్రాహ్మణులని ద్వేషించడం - వారితో కావాలని విరోధం పెట్టుకోవడం - వారికి సంబంధించిన స్థలాలనీ గృహాలనీ అన్యాయంగా ఆక్రమించడం - వారిని చంపాలని ప్రయత్నించడం లేదా చంపడం - వారిని, ఎవరు నిందిస్తున్నా చాల సంతోషపడడం, వారి గొప్పదనాన్ని ఏమాత్రమూ సహించక 'నీచులనుగా' చిత్రీకరించి ఆనందించడం'* అనే ఈ మొదలైనవి కలుగుతాయని ధృతరాష్ట్రునితో విదురుడన్నాడు. ఈ చెప్పిన వాడూ, దీన్ని విన్నవాడూ ఇద్దఱూ బ్రాహ్మణులు కారు కాబట్టైనా, నిజమని గ్రహించాలి.

ఎవరి జోలికీ పోని గోవూ బ్రాహ్మణుడూ అనేవి నిస్సహాయులు. వీళ్లకి దైవశక్తి హెచ్చు. భీష్ముడంతటి వాడు మరణిస్తూ 'బ్రాహ్మణనింద' సరికాదని చెప్పాడు. అలాగని దుర్మార్గాలు చేస్తున్న బ్రాహ్మణుణ్ణి భగవంతుడు సహించడు. ఎవరికీ ఇవ్వని శాపాన్ని, కరుణా సముద్రుడైన కృష్ణుడు, బ్రాహ్మణుడైన అశ్వత్థామకే ఇచ్చాడు - అతని ప్రవర్తన కారణంగా. కాబట్టి బ్రాహ్మణుణ్ణి శిక్షించడమనేది భగవంతుని చేతిలో ఉంది. శిక్షించడ మనేదే వస్తే బ్రాహ్మణునికి అతి తీవ్ర శిక్షని భగవంతుడు విధిస్తాడని కూడ దీన్ని బట్టి గ్రహించాలి. కావున పదిమందికి అహింసా బుద్ధిని పుట్టించి, ధర్మబుద్ధిని కల్గించవలసినది బ్రాహ్మణుడు కాబట్టి, క్షత్రియుడైన విశ్వామిత్రుడు కూడ అంతటి పట్టుదలతో 'తాను బ్రహ్మర్షి' కావాలని సాధించినది కూడాను.

వసిష్ఠుని ఆశ్రమానికి వచ్చి, విశ్వామిత్రుడు విరోధం పెట్టుకున్న కారణంగా మఱో విశేషమూ తెలుస్తుంది. సజ్జనుడు ఎంత దూరంగా ఉన్నప్పటికీ, ఒక్కోసారి దుర్జనునివల్ల విరోధం రాకపోదు. వచ్చినా విగ్రహాన్ని పాటించాలి. ఆత్మ రక్షణ చేసి

కోపాలి తప్ప, ఎదుటి వానిలా బ్రాహ్మణుడు ప్రవర్తింపరాదని కూడా నీతి. తన తపశ్శక్తిని అనవసరకోపం, పట్టుదలలకి విశ్వామిత్రుడు వ్యయం చేస్తూంటే, నిష్కారణమైన విరోధం కారణంగా వసిష్ఠునికి కొంత తపశ్శక్తి వ్యర్థం కాకతప్పలేదు. ఒక్కొకసారి అనవసరమైన, నిష్కారణమైన తగాదా మనపైనపడి, వ్యయం కావడం ఇలాటిదే.

తపస్సు తన శ్రేయస్సుకి లోకక్షేమానికి చేయాలి. విశ్వామిత్రుడు శివుణ్ణి గూర్చి తపస్సు చేసి, ఆ తపస్సు ద్వారా సాధించిన అస్త్రాలని, వసిష్ఠుని మీద విసరడానికి ఉపయోగించాడు. అతి ప్రయోజనకరమైన దానిని, నిష్ప్రయోజనం చేయడమంటే యిదే.

## గురుశాపం చాల తీవ్రమైనది

బ్రహ్మర్షికావాలనే దృఢవాంఛతో, భార్యతో సహా విశ్వామిత్రుడు దక్షిణదిక్కుకి పోయాడు: హవిష్యంద - మధుష్యంద - దృఢనేత్ర - మహారథులనే నల్గురు పుత్రులు వారికి కల్గారు. *(హవిష్యందో మధుష్యందో దృఢనేత్రో మహారథః)* ఎంతో కాలం తపస్సు చేయగా బ్రహ్మ ప్రత్యక్షమై 'నీ తపశ్శక్తితో రాజర్షి' అయ్యా వన్నాడు: *(జితా రాజర్షిలోకా స్తే రాజర్షి రితి విద్మహే.)* నిరుత్సాహపడిన విశ్వామిత్రుడు తపస్సుని తీవ్రం చేసాడు.

ఇది ఇలా ఉండగా, ఆ దేశపురాజు అయిన త్రిశంకునికి ఒక చిత్రమైన కోరిక *'సశరీర స్వర్గ గమనం' (శరీరం ఇక్కడ విడువకుండా స్వర్గానికి శరీరంతోనే పోవడం)* **ఆవేది కల్గింది .కుల పురోహితుడు అయిన వసిష్ఠుణ్ణి అడిగితే అది అశక్యమనీ - ఆ ఆలోచనే తప్పు అనీ చెప్పాడు.**

ఏమైనా తన కోరిక తీరాలనే పట్టుదల కలిగిన త్రిశంకువు, దక్షిణదిక్కులో తపస్సు చేస్తూన్న వసిష్ఠుని పుత్రులని అడిగి చూచాడు. వారికి కోపం కల్గింది. *"రాజా! యాగం చేయించే అధికారం వసిష్ఠునికే ఉంది. పైగా, ఈ యాగం అసలు చేయించరానిది. అదీ కాక, సమర్థుడైన ఆ వసిష్ఠుడు కాదని చెప్పాక, మళ్లీ ఆయన పుత్రులైన మమ్మల్ని అడగడంలో నీ అంతర్యం ఏమిటి - ఈ కోరిక మానుకొని వెళ్లు'* అని మందలించారు.

దానికి కోపించిన త్రిశంకువు 'మీరు కాకపోతే మరొకరిని వెదికి చేయించుకుంటాను. *(అన్యాం గతిం గమిష్యామి స్వస్తివోఽస్తు తపోధనాః)* ఇక మా వంశానికీ మీ పౌరోహిత్యానికీ స్వస్తి' అని వెళ్లి పోయాడు. కానిపనికి వచ్చి, నిందించి పోయినందుకు - చండాలుడివి కమ్మని - వాసిష్ఠులు (వసిష్ఠ పుత్రులు) శపించగా రాజు రూపం తెల్లవారేసరికి మారిపోయింది. *(అతః మితి వా వ్యాక్యం వసిష్ఠేన మహాత్మనా । త్రిశంకోర్వచనం శ్రుత్వా క్రోధసమన్వితమ్ । శేపుః పరమసంక్రుద్ధా శ్చండాలత్వం గమిష్యసి)*

అయినా పట్టువీడని త్రిశంకువు విశ్వామిత్రునికి ఈ వృత్తాంతం చెప్పాడు. వసిష్ఠ - వాసిష్ఠులు కాదన్నారనే సరికి, వారి మీది కోపంతో తాను చేయిస్తానని అంగీకరించి, శిష్యులని పిలిచి, యాగవస్తువులని సిద్ధం చేయించాడు. అన్ని దిక్కులకి వర్తమానాలు పంపితే, ఏం శపిస్తాడోననే భయంతో, ఎందఱో వచ్చారుగాని, వాసిష్ఠులు మాత్రం రాలేదు - సరికదా నిష్ఠురాలు మాట్లాడారు. దాంతో కోపించిన విశ్వామిత్రుడు వాసిష్ఠుల నందఱినీ కుక్క మాంసంతింటూ, 'ముష్టికులు' అని పిలువబడే హీన జాతిలో పుట్టినవాళ్లై, వికార ఆకారాలతో జీవించండి' అని శపించాడు. (*శ్వమాంస నియతాహారా ముష్టికా నామ నిర్ఘృణాః వికృతాశ్చ విరూపాశ్చ లోకా ననుచరంత్విమాన్॥*)

యాగానికి వచ్చిన వారందఱూ ఈ శాపం వింటూ భయపడి పోయారు. యాగం ఆరంభమైంది. యజ్ఞంలోని 'హవిస్సు'ను( యాగంలో మంత్రాలని చదువుతూ అగ్నిలో వేసే నేయి) తీసికొని పోవలసినదిగా పేరు పేరునా దేవతలని ఆహ్వానిస్తే, ఏ ఒక్కరూ రాలేదు. ఒక ప్రక్క యాగం చేయిస్తానని ఇచ్చిన మాటా - వేఱొక ప్రక్క అందఱిముందూ అవమానపడుతున్నాననే ఆలోచనా - కలిగి కోపంతో ఊగిపోతూ విశ్వామిత్రుడు, '*దేవతలారా' నేను సంపాదించిన మొత్తం తపస్సుతో ఇతడు స్వర్గానికి పోవుగాక!*' అన్నాడు. అనడమే కాదు ధారపోసాడు కూడ.

త్రిశంకువు స్వర్గానికి వెళ్లడం ప్రారంభించాడు. దేవతలతో ఆలోచించిన దేవేంద్రుడు '*గురుశాపాన్ని పొందిన నీవు స్వర్గానికి రా వీలులేదు 'పో' అని ఆజ్ఞాపించాడు*' మళ్లీ అంతవేగం గానూ, తలక్రిందుగానూ, త్రిశంకువు పడిపోతూ '*రక్షించండి రక్షించండి*' అని అఱచాడు. తన తపోబల ప్రభావం ఇంకా ఉండడం వలన '*అక్కడ ఆగు*' అనగానే త్రిశంకువు - అటు స్వర్గమూ - ఇటు భూమీ - కాక అంతరిక్షంలోనే నిలిచిపోయాడు.

ఆ మిగిలిన తపః ప్రభావంతో సప్తర్షులనీ, నక్షత్రాలనీ, ఇతరదేవతలనీ సృష్టిస్తూ వేఱే దేవేంద్రుడి గూర్చి ఆలోచిస్తూంటే, దేవతలంతా వచ్చి 'కోపం చల్లార్చుకొని *విశ్వామిత్రా! నీవు చేసేది ఎంతవఱకూ సమంజసమో?*' ఆలోచించమన్నారు. ఒక్కక్షణం ఆలోచించాడు. "*ఎవ్వరూ కాదన్న పనిని ప్రారంభించాను పట్టుదలకి పోయాను. నలుగురిలో నవ్వులపాలయ్యే పని చేస్తున్నాను. అన్నింటికీమించి,ఎంతో కాలం ఆర్జించిన తపోబలాన్ని దీనికి వ్యర్థం చేసాను*" అని తనకి అన్పించింది.

దేవతలతో '*అయ్యా! ఎలాగూ అన్నాను కాబట్టి నా వాగ్దానం నెరవేరేలా, ఈతడు ఉండే దాన్ని స్వర్గం అనండి. ఈ సృష్టించినదాన్ని స్థిరంగా ఉండనీయండి*' అని ప్రార్థించాడు. దేవతలు ఇష్టపడి, జ్యోతిశ్చక్రానికి(నక్షత్రచక్రం) వెలుపల నీ నక్షత్రాలన్నీ ఉంటాయి. ఈ త్రిశంకువు తలక్రిందుగా వ్రేలాడుతూ ఉంటాడు' అని చెప్పి వెళ్లి పోయారు.

## ఈ కథవల్ల తెలిసిందేమిటి?

రాజైనవాడు అహంకరించి, కోరరాని కోరికని కోరరాదు. ఎవరు ఇలా కోరినా ఫలితం ఇలాగే ఉంటుంది. స్వర్గంలో తలక్రిందుగా వ్రేలాడుతూ, అందరూ చూచి, ఈ కథని చెప్పుకొనేలా ఉన్నాడు త్రిశంకుడు. అదే, కోరకుండా ఉంటే, మామూలుగా స్వర్గాన్నే పొందేవాడు. తాను సరైన స్వర్గాన్ని పొందలేదు సరికదా - విశ్వామిత్రుని తపోబలాన్ని వ్యర్థపఱచిన వాడయ్యాడు కూడ. కాబట్టి "ఓ రామా! చెల్లదగిన కోరికలు *కోరుకో!. నెరవేర్చదగిన కోరికలే నెరవేరు! కోపం వల్ల విశ్వామిత్రుడు ఎంతో కాలాన్నీ - తపశ్శక్తినీ - గౌరవాన్నీ నష్టపోయాడు - గుర్తుంచుకుని మసలు!"* అని నీతిబోధ. విశ్వామిత్రుడు వసిష్ఠుని మీద క్రోధాన్ని ఇంకా విడనాడలేదని తాత్పర్యం. చేసే ఏ పనైనా, మనస్సుతో ధర్మపూర్వకంగా చేద్దామని కాక, మఱొకణ్ణి సాధించాలనీ, లేదా బుద్ధి చెప్పాలనీ (వసిష్ఠ వాసిష్ఠులకి) ప్రయత్నిస్తే, ఫలితం ఇలాగే ఉంటుంది. ఇప్పటినుండే *'త్రిశంకుస్వర్గం'* అనే మాట లోకంలోకి వాడుకలోనికి వచ్చింది.

బ్రహ్మాస్త్రం ఎవరికైనా తగిలితే ప్రమాదం జరుగుతుందని, వసిష్ఠుడు మొదట్లో తానే మింగేసాడు అస్త్రాన్ని. బ్రహ్మ అయిన వసిష్ఠుడు బ్రహ్మాస్త్రాన్ని మింగాడు అంటే తనలోనే లయం చేసికొన్నాడు అని అర్థం. విశ్వామిత్రుడు సంధ్యావందనం చేసినా, బ్రహ్మ (బ్రాహ్మణుడు) కాడు కాబట్టి ప్రయోగించగలడేగాని, త్రిప్పి వస్తే తట్టుకోలేడు. ఆ విషయం గ్రహించిన వసిష్ఠుడు, దయాబుద్ధితో విశ్వామిత్రుని మీదికి త్రిప్పి కొట్టక, తనలో లయం చేసికొన్నాడు. *"బ్రహర్షి రాజర్షి"* లకు భేదం ఇక్కడ తెలుస్తుంది. సత్త్వ (బ్రహ్మర్షి) రజో (రాజర్షి) గుణాలకు భేదం యిదే.

తన ఆతిథ్యాన్ని స్వీకరించి, తనపైనే యుద్ధం ప్రకటించినవాడు విశ్వామిత్రుడైతే శక్తి ఉండీ, ఎదుటివాణ్ణి శిక్షించక ఆత్మ రక్షణ చేసికొన్నవాడు వసిష్ఠుడు. ఆత్మవిద్య (వసిష్ఠుడు) కి అనాత్మ విద్యకి (విశ్వామిత్రుడు) భేదం ఇదే. బ్రాహ్మణుడు ఇతరుల అపకారాన్నుండి రక్షించుకుంటాడే తప్ప, ఇతరుల్ని నాశనం చేయడు . (ఘాతు ర్న ఘాతుకో విప్రః).

ఒక్క పుత్రుడే కలవాడూ, అసలు సంతానం లేనివాడూ సమానమట. అటువంటి వానికి మోక్షం కల్గదని భావించి, నల్గురిని కన్నాడు. క్షత్రియుడు సంన్యసించరాదు కాబట్టి, విశ్వామిత్రుడు వానప్రస్థాశ్రమంలోనే ఉన్నాడు. వసిష్ఠ వాసిష్ఠులు, యాగం చేయరాదని పల్కినా, విశ్వామిత్రుణ్ణి ప్రార్థించి భంగపడడమనేది ఒక విషయాన్ని చెప్తుంది. ఎవరివద్దకైనా పోయి 'ముహూర్తం' పెట్టమని అడుగుతారు కొందఱు. ఫలాని రోజువఱకూ సరిలేదని ఆయన చెప్పగానే విని, ఎలాగో ఒకలా ముహూర్తం ఉందనే వారి

వద్దకు తిరిగి తిరిగి, ఏదో ముహూర్తం పెట్టించుకొని " అమ్మయ్య కుదిరింది పరవాలేదని" కొందఱు భావిస్తూంటారు. అలాటివి పెట్టుడు ముహూర్తాలే గాని నిజంగా ఉండేవి కావు. ఈ ముహూర్తాలు ఎదుటివారి బాధకి తట్టుకోలేక పెట్టేవే. వాటివల్ల అనర్థాలే తప్ప, సార్థకత ఉండదు. అందుకని యోగ్యుడైన వానివద్దకే పోవాలి. బలవంత పెట్టకుండా, ఎప్పుడు సరియైనదని వారు నిర్ణయిస్తే అంతవఱకూ ఆగాలి. అలా ఆగలేని పక్షంలో, అసలు ముహూర్తాలే సరికాదనుకొని, ఏదో ఒకరోజున చేసికొంటే పోలేదా ? ముహూర్తమూ కావాలి, అది మనమనుకొన్న రోజే కావాలంటే, అది అన్ని వేళలా కుదురుతుందా? *'భాండంలో అన్నం కదలకూడదు. పిల్లలు దుండుల్లా ఉండాలి'* అందట వెనకటికి ఒక తల్లి. ఇదీ అంతే!.

అసలు 'త్రిశంకువు' అనే పేరే, మూడు తప్పులుచేసినవాడు అని చెప్తోంది. *"పితు శ్చాపాదిదోషేణ, గురుదోగ్ర్గేవధేన చ, అప్రోక్షితోపయోగా చ్చ త్రివిధ స్తద్వ్యతిక్రమః - ఏవం త్రీ న్యస్య శంకూని - తాని దృష్ట్వా మహాయశాః - త్రిశంకు రితి హోవాచ - త్రిశంకు స్తేన స స్మృతః (హరివంశం)".*

(1) పెండ్లి అయి పోయిన ఆమెను స్వీకరించడం (2) వసిష్ఠ మహర్షిగోవును చంపడం (3) దేవతానివేదనం చేయని ఆహారాన్ని భుజించడం అనే 3 దోషాలున్న కారణంగా అతడు త్రిశంకుడు. కోరరాని కోర్కె కోరడం 4 వతప్పు. పురోహితనింద 5 వది. అందుకనే, రూపం బట్టే ఈ తప్పుల్ని గ్రహించేందుకు వీలుగా - వాసిష్ఠులు - 'చండాలరూప శాపం' ఇచ్చారు.

## పెద్ద - చిన్న కాని 'మధ్యపుత్రుడు' ఎవరికీ కానివాడు (?)

దక్షిణ దిక్కులో విఘ్నం అయిందని (త్రిశంకు కథని విఘ్నంగా భావించాడు విశ్వామిత్రుడు)తలచి, పడమటి దిక్కు తపస్సుకి పోయాడు. *(మహాన్ విఘ్నః ప్రవృత్తోఽయం దక్షిణా మాస్థితో దిశమ్)* నియమంగా తపస్సుచేస్తూ ఉన్నాడు.

ఆ కాలంలోనే అయోధ్యారాజు అంబరీషుడు యజ్ఞం చేస్తూంటే, యజ్ఞ పశువుని దేవేంద్రుడు ఎత్తుకుపోయాడు. యజ్ఞం ఆగినా, శాస్త్రోక్తంగా సాగకపోయినా దేశానికి అరిష్టం కల్గుతుందనే భయంతో, ఎన్నోచోట్లు వెదికించిన అంబరీషుడు భృగుతుంగ ప్రదేశంలో ఉన్న ఋచీక మహర్షిని చూచి, నమస్కరించి, ఆయన పుత్రులలో ఒకరిని యజ్ఞ పశువుగా ఇమ్మని ప్రార్థించాడు. (యాగంలో ఆ పశువుని నవద్వారాలూ మంత్రాలతో మూసివేస్తారు. దానికి పుణ్యలోకాలు సంప్రాప్తిస్తాయి. ఆ పశువు స్థానంలో ఋచీక పుత్రుణ్ణుంచడానికై ప్రార్థన).

మహర్షి తన పెద్దవాణ్ణి ఈయనన్నాడు. ఆయన భార్య చిన్నవాణ్ణే ఇయ్యనన్నది. మధ్యపుత్రుడైన శునశ్శేపుడు, అంబరీషునితో 'నన్ను వారు అమ్మినట్టే. లక్ష గోవుల

నిచ్చి తీసికొనిపొండి అని పలికాడు. *(పితా జ్యేష్ఠ మవిక్రేయం మాతా చాహ కనీయసం। విక్రీత మ్మధ్యమ మ్మన్యే రాజన్ పుత్రం నయస్వ మామ్॥)*

ప్రాణత్యాగం చేయబోతున్నానే భయంతో, శునశ్శేపుని ముఖం వాడిపోయింది. అంబరీషునితో ప్రయాణమై వెడుతూ వెడుతూ, మార్గమధ్యంలో తపస్సు చేసికొంటున్న విశ్వామిత్రుని పాదాల మీద పడి కథనంతా చెప్పాడు. విశ్వామిత్రుడు కరిగిపోయాడు. తనపిల్లలని పిలిచి, 'ఎవరో ఒకరు ఈ పిల్లవాని స్థానంలో యజ్ఞంలో నిలబడి, వీని బాధని తీర్చండి అని అడిగాడు. వారంతా పరిహసిస్తూ 'అకార్యం మేం చేయం' అన్నారు.

కోపించిన విశ్వామిత్రుడు, లోగడ వాసిష్ఠులని శపించినట్లే తన పుత్రులనీ దారుణంగా శపించి, శునశ్శేపునికి విభూతిని మంత్రించి యిచ్చి, రెండు మంత్రాలని ఉపదేశించాడు. ఈ రెంటినీ నిన్ను విశసనం చేయడానికై (నవద్వారాలూ బంధించి వధించడానికై) వచ్చినపుడు చదువుకోమని చెప్పి పంపివేసాడు. అయోధ్యలో యాగం ఆరంభమైంది. శునశ్శేపుడు ధైర్యం వహించి అలాగే చేసాడు. శునశ్శేపునికి దీర్ఘాయుష్యాన్నీ, అంబరీషునికి యజ్ఞ ఫలాన్నీ దేవతలు అనుగ్రహించారు.

### విశేషం ఏమిటి ?

వసిష్ఠునితో మొదటగా విరోధించినప్పుడు పట్టి కోపమే ఉంది విశ్వామిత్రునికి. త్రిశంకు స్వర్గ విషయంలో, కోపంతో పాటు ఇతరుల్ని ఆదుకోవాలనే తపన ఉంది కానీ, అక్కడ, ఆదుకోరాని చోట ఆదుకొంటానని చెప్పి, భంగపడ్డాడు. మూడవదైన ఇక్కడ, రక్షించవలసిన శునశ్శేపుణ్ణి రక్షించడానికి మంత్రోపదేశం కూడా చేసేంత గొప్ప వాడయ్యాడు. అయితే, తన పిల్లలని శపించడం వలన కోపాన్ని ఇంకా అణచుకోలేక పోయాడు.

కష్టంలో ఉన్నవాణ్ణి రక్షించేందుకు మంత్రం ఉపయోగపడుతుందని ఈ కథ స్పష్టంగా చెప్తుంది.

పశువులని చంపితేనే యాగఫలం రాదనీ, నిష్ఠతో మంత్రమననం చేస్తే, యాగఫలం వస్తుందనీ, ఎదుటివాని ప్రాణరక్షణకై తన పుత్రులనే వియోగించేంతటి గొప్పవాడు విశ్వామిత్రుడు అని కూడ ఇక్కడ తెలుస్తుంది.

### మళ్లీ కూలిన తపస్సు

ఇంతలో బ్రహ్మ వచ్చి - నీ తపశ్శక్తిని బట్టి 'ఋషివి' - అని చెప్పి వెళ్లిపోయాడు. చాల బాధపడ్డ విశ్వామిత్రుడు మళ్లీ తపస్సు మొదలెట్టాడు. ఇంతలో 'మేనక' అనే అప్సరస వచ్చింది. ఆమె వలలో పడి 10 సంవత్సరాలు గడిపేసాడు. తర్వాత సిగ్గుపడ్డాడు.

దుఃఖం కలిగి నిట్టూర్పులు విడుస్తూంటే, ఆమె భయపడి వణికిపోయి నమస్కరించింది.

ఆమెని శపించకుండా చక్కగా పల్కరించి, ఉత్తర దిక్కుకి వెళ్లిపోయాడు.

### ఎందుకు శపించలేదు?

ఇప్పటి వఱకూ క్రోధాన్ని అణచుకోలేని విశ్వామిత్రుడు, క్రోధాన్ని అణచుకోవాలని మనసా నిశ్చయించుకున్నాడు. బ్రహ్మర్షి పదవికై ప్రయత్నిస్తూన్న విశ్వామిత్రునికి, పరీక్షాధికారి ఐన ఇంద్రుడు ఎన్నో పరీక్షలని పెడుతూ, క్రోధంలోనే ఓడగొడుతూ వస్తూన్నాడు. ఈసారి 'కోపం'లో ఉత్తీర్ణుడౌతాడని భావించి, 'కామం'లో పరీక్ష పెట్టాడు. విశ్వామిత్రుడు నిలువునా కూలాడు. 'మేనక'ని పంపించడంలో ఇక్కడ రెండు కారణాలున్నాయి. (1) విశ్వామిత్రుడు ఇకముందు కామవిషయంలో జాగ్రత్తపడడానికి (2) ఈ ఇరువురికీ జన్మించిన శకుంతల ద్వారా తర్వాతిదైన ద్వాపరయుగంలో భారత కథ జరగడానికీను. విశ్వామిత్రుని చరిత్రలో 'మేనక' పాత్ర అత్యల్పమైనది. ఆ పాత్రని-అతి ప్రాధాన్యాన్నీయవలసిన పాత్రగా, శ్రీమద్రామాయణం చెప్పలేదు. అందుకే, 'మేనక' చాల చాల తక్కువసేపు ఉంటుంది కథలో.

### మహర్షి వయ్యావు!

ఇక కామక్రోధాలకు అతీతంగా ఉంటూ విశ్వామిత్రుడు తపస్సు తీవ్రంగా చేయప్రారంభించాడు. (*విశ్వామిత్రో మహాతేజా । పున స్తేపే మహాయశా. ఇది 3000వ శ్లోకం. లోని 'వి'. అందుకే గాయత్రీ మంత్రంలోని 3 వ అక్షరం ప్రయోగించాడు శ్లోకంలో.*) బ్రహ్మ వచ్చి 'మహర్షివి' అయ్యావన్నాడు గాని, జితేంద్రియుడివి మాత్రం (ఇంద్రియాలని జయించినవాడు) కాలేదన్నాడు. (*శ్రుత్వా స్పృష్ట్వా దృష్ట్వాచ భుక్త్వా ఘ్రాత్వా చ యో నరః। న హృష్యతి గ్లాయతి వా న విజ్ఞేయో జితేంద్రియః॥ అని మను స్మృతి. దేన్ని గూర్చి విని, స్పృశించి, చూచి, అనుభవించి, వాసన చూచి కూడా, ఏ వ్యక్తి సంతోషాన్ని మితి మీఱి పొందడో, తిరిగి కావాలని దేని కోసం ఎదురుచూడడో, దానికై దిగులుపడడో అతడు జితేంద్రియుడు.*) దానితో పట్టువీడని విశ్వామిత్రుడు, వాన కాలంలో బహిరంగంగా నిలబడీ, వేసవిలో అగ్నిమధ్యంలో ఉండీ, రెండు చేతులూ పైకెత్తి నిలుపబడీ, శీతకాలంలో కంఠం వఱకు నీళ్లలో ఉండీ తపస్సు సాగించగా ఇంద్రుడు రంభని పిలిచాడు.

ఇంద్రుడు కోకిలగానూ, మన్మథుడు చలిగాలిగానూ వస్తామని భయపడుతూన్న ఆమెని ఓదారుస్తూ, చెప్పి పంపారు. రంభ చేసిన శృంగార చేష్టలకు కోపించిన విశ్వామిత్రుడు 'కామక్రోధాలని జయించ దలచిన నన్ను పాడుచేయవచ్చావా? చాల కాలం శిలవైపో!' అని శపించాడు.

## శిలా శాపం తెలిపిందేమిటి?

ఇంద్రునివద్ద చాలమంది అప్సరసలున్నారు. ఈ వచ్చిన రంభని శిలగా శపిస్తే, మఱొకతె రావడానికి భయపడుతుంది. పశ్చాత్తాప పడవలసినంత తప్పు రంభ వద్ద లేదు కాబట్టి, యజమాని అయిన ఇంద్రుని ఆజ్ఞకి అనుగుణంగా వచ్చింది కాబట్టి, ఈమెకు శిలాశాపాన్ని ఇచ్చాడు. అహల్యకి ఈ శాపం ఈయకపోడానిక్కారణం - ఆమె తపస్సు చేసి తపశ్శక్తిని రామునకు ఈయవలసి ఉండడమే. ఇక విశ్వామిత్రుడు ఈ సారి కామాన్ని గెలిచాడుగాని, క్రోధంలో ఓడాడు. 'బ్రహ్మర్షి' కావాలంటే, ఎన్ని పరీక్షలలోనో నెగ్గాలి.

ఎన్నివిఘ్నాలు వచ్చినా చలింపరాదని, తపస్సు ప్రారంభించాడు విశ్వామిత్రుడు. ఒకనాటి తపస్సు అయిపోయి, పారణం చేయబోతూంటే (తపస్సు లేదా వ్రతము పిమ్మట చేసే భోజనం - చేయబోతూంటే) బ్రాహ్మణ రూపంతో ఇంద్రుడు వచ్చి అన్నం యాచించాడు. తనకి ఆకలి దహించి వేస్తూన్నా, తపోవిఘ్న భయంతో, కోధ్రాన్ని దరిచేర నీయకుండా ఆ అన్నాన్ని శ్రద్ధతో అతిథికి ఇచ్చివేసాడు. *(శక్ర పెటిగి ఇంద్రుడని గుమించి, (అహల్య ఇంద్రుని గుర్తించినట్లు) అన్నాన్ని ఇచ్చేసాడు.)*

మఱల తపస్సు ప్రారంభించగానే - ఇక విశ్వామిత్రుణ్ణి గెలవలేమని భావించి, దేవతలతో బ్రహ్మ ప్రత్యక్షమై 'బ్రహ్మర్షీ! ఇప్పుడు నీవు బ్రాహ్మణుడవైనావు. దీర్ఘాయుష్యాన్ని ఇస్తున్నాం' అన్నాడు.

ప్రత్యక్షమైన అందరినీ వరుసగా చూచాడు.

వసిష్ఠుడు కన్పించలేదు.

బ్రహ్మతో విశ్వామిత్రుడు - 'స్వామీ! నాకు బ్రాహ్మణత్వమూ, దీర్ఘాయుష్యమూ ఇచ్చినందుకు కృతజ్ఞుణ్ణి. అయితే ఓం కారమూ, వషట్కారమూ, వేదాలూ నాకు స్వాధీనం కావాలి. నేను వాటిని ఇతరులకి ఉపదేశించే అర్హతా, ఉపదేశిస్తే ఎదుటివారికి పనిచేసే అనుగ్రహమూ ఇప్పించాలి. ఇదంతా ఒక యెత్తు. బ్రహ్మర్షిఅయిన వసిష్ఠుడు, నన్ను 'బ్రహ్మర్షి' అని అనాలి' అని స్పష్టంగా చెప్పాడు. *(బ్రహ్మపుత్రో వసిష్ఠో మా మేవం వదతు దేవతా! బ్రాహ్మణ్యం యది వా ద్వీర్ఘ మాయు స్త్వ తైవ చ ఓంకారో వషట్కారో వేదాశ్చ వరయన్తు మామ్!)*

దేవతలు వెళ్ళి వసిష్ఠుణ్ణి తెచ్చారు. ఆయన సంతోషంలో 'విశ్వామిత్రా! వీరంతా చెప్పినట్లు నీవు బ్రహ్మర్షివే. బ్రహ్మర్షికి ఉండే అన్ని అర్హతలూ నీకు ఉన్నాయి అని చెప్పాడు. *(బ్రహ్మర్షి త్వం న సందేహ సర్వం సంపత్స్యతే తవ)*

రామలక్ష్మణులు తమ గురువుగారి చరిత్రని పూర్తిగా విని ఆనందపడ్డారు.

## వియ్యానికి ముందు కయ్యం వస్తోంది

ధనుస్సుని చూడడానికి రామలక్ష్మణులు వచ్చారని తెలిసి, జనకుడు విశ్వామిత్రునితో మహర్షీ! మా పూర్వుల్లో నిమి చక్రవర్తి ఉన్నాడు. ఆయన 6వతరంవాడు దేవరాతుడు. ఆయనకు ఈ వింటిని దేవతలు న్యాసంగా (వాడు కున్నంత కాలం వాడుకొని, తిరిగి భద్రంగా దాని యజమాని కర్పించడం) జనకునకిచ్చారు. అసలు రెండు విల్లని విశ్వకర్మ సిద్ధం చేసి, దేవతలకిస్తే, దేవతలు శివునికిచ్చారు. శివుడు వరుణునికీ, వరుణుడు దేవరాతునికి ఇయ్యగా, అది జనకునకిబడింది కొంత కాలానికి. ఈ సీత అయోనిజ. నాకూతురు కాదు.

ఒకప్పుడు యజ్ఞం కోసం భూమిని దున్నుతూ ఉంటే, నాగటి చాలులో నుండి పైకి ఈ శిశువు లేచింది. అందుకని సీత (నాగటి చాలునుండి జన్మించినది) అని పేరుపెట్టాను. (*అథమే కృషతః క్షేత్రం లాంగలా దుత్థితా మయా। క్షేత్రం శోధయతా లబ్ధా నామ్నా సీతేతి విశ్రుతా ॥*) పరాక్రమాన్ని కన్యాశుల్కంగా ఇచ్చి, ఈమెను ఎవరైనాచేసికోవాలని నాఆశ. దానికి పరీక్షగా ఈ శివ ధనుస్సునే ఉంచాను. దీన్ని ఎక్కుపెడితే చాలు, అయోనిజ అయిన సీత నిచ్చి వివాహం చేస్తానని ప్రకటిస్తే, ఎందఱో రాజపుత్రులు వచ్చి ఈ ధనుస్సుని ఎత్తనే లేక పోయినారు. (*యద్యస్య ధనుషో రామః కుర్యా దారోపణ మ్మునే। సుతా మయోనిజాం సీతాం దద్యాం దాశరథే రహమ్॥*)

ధనుస్సుని ఎక్కుపెట్టడమనే వంకతో రాజాలని అవమానించడం నా అభిప్రాయమని భావించిన రాజులు కొందఱు, నా మీద దండయాత్రకి వచ్చారు కూడ. వియ్యానికి ముందు కయ్యం సాగులోంది. ఇంతకీ, ఆ శివ ధనుస్సును మీకు చూపుతా చూడండి' అంటూ శివధనుస్సును తెమ్మని ఆజ్ఞాపించాడు.

(కావడి కఱ్ఱలాగా ఉంటుంది విల్లు. దానికి ఒక ప్రక్క వింటినారి ముడివేసి ఉంటుంది. వింటినారి మఱొక ప్రక్క 'దూముడి'(ఒక కొనలాగితే ఊడిపోయేలాగానూ, వేఱొక కొన లాగితే, బలంగా బిగుసుకు పోయేలాగానూ, తాడుతో వేసిన ముడి) ఉంటుంది. విల్లుని వంచి, ఈ దూముడిని, వింటి యొక్క రెండవ ప్రక్కన చెక్కబడి ఉన్న గాటుకి తగిలించాలి. అప్పుడు నిటారుగా ఉన్న విల్లు, వింటినారి పొడుగు తక్కువ కావడం చేత, అర్ధచంద్రాకారంగా అవుతుంది. ఈ విధంగా వింటినారిని రెండవైపు తగిలించడం, దాంట్లో బాణాన్నిసంధించడాన్ని ఎక్కు పెట్టడం అంటారు. ఇంత చేస్తేచాలు - సీత తనకి దక్కుతుంది).

ఆజ్ఞ మేఱకు, బలాఢ్యులు ఎందఱో, ఒకపెద్ద బండివంటి పెట్టెపై ధనుస్సుని ఉంచి లాగుకొని వచ్చారు. 'ఆ వింటిని చూడు' అని రామునితో అన్నాడు విశ్వామిత్రుడు.

మూత తెఱచి చూచి, పూజచేయబడిన ధనుస్సును ఒకసారి చేతితో ముట్టుకొని, దాని స్థాయి గమనించి, ఎక్కుపెట్ట దలిచానని వినయంగా రాముడన్నాడు. (ఇదం ధను ర్వరం దివ్యం సంస్పృశా మీహ పాణినా యత్నవాం శ్చ భవిష్యామి తోలనే పూరణేఽపి వా)

జనక విశ్వామిత్రులు శుభమని పలికారు. రాముడా వింటి మధ్య భాగాన్ని పట్టి తేలికగా ఎత్తివేసాడు, వింటి రెండవ చివరను పట్టుకొని, మొదటిచివరను నేలతాకించి వంచి, వింటి నారిని అవలీలగా బిగించాడు. దానిలో బాణాన్ని సంధించి, అవలీలగా లాగాడు. అంతే ! ధనుస్సు విఱిగి పోయింది.

పిడుగు శబ్దమైన చప్పుడు, సముద్రాలు అల్లకల్లోలమైన చప్పుడు, భూకంపనం కల్గిన చప్పుడూ విన్పించింది.

## ధనుస్సు విఱవడం లోని రహస్యం

'వింటి యొక్క మఱొక వైపుకి నారితగిలించి, బాణం దాంట్లో సంధిస్తే చాలు' సీతని ఇవ్వగలనని, జనకుడన్నాడు. రాముడు ధనుస్సు విఱువనే విఱిచాడు.

'అర్థికామాదధిక ప్రదః' అడిగిన దాని కంటె ఎక్కువగా ఇచ్చే అలవాటున్నవారితో ఉన్నదే, ఇక్ష్వాకువంశం ఎప్పుడూనూ. 'ధనుస్సు ఎక్కుపెట్టు' అని అడిగితే విల్లు విఱువడం ఇలాటిదే.

అసలు విల్లు ఎత్తలేకా, ఎత్తినా నారితొడగలేకా, తొడిగినా బాణం సంధించలేకా అంతా నానా అవస్థలూ పడి వెళ్లిపోయారు. అంతకు పైనదైన విల్లు విఱువడాన్ని చేస్తే సభలో ఉన్న అంతా తన గొప్పదనాన్ని అర్థం చేసికోగలరు.

తాను ఎక్కుపెట్టి వచ్చేస్తే, ఒకవేళ రావణుడే మాయారూపంతో వచ్చి, తాను ఎక్కుపెట్టగల శక్తి కలవాడు కావడం వలన ఎక్కుపెడితే, కథ అడ్డం తిరుగుతుంది.

పైగా తాను చేసిన పని వేఱొకడు చేయగలిగితే భగవంతునికీ, ఇతరునికీ భేదం ఏముంటుంది?.

తాను ఎక్కుపెట్టాక, మఱొకరు ఎక్కుపెట్టే పరీక్ష చేయడానిక్కూడా వీలు లేకుండా ఉండేందుకే ఈ విఱువడం.

ఎక్కుపెట్టే పరీక్షలో ఇతడే మొదటివాడై, విల్లు విఱిచి ఉండి ఉంటే, రాజ సమూహమంతా 'అధర్మం' అని ఉండేది. తమకి అవకాశం రాకుండా రాముడు అలా విఱువడం దోషమని అని ఉండేవారు. అందుకనే-కొంతకాలంపాటు ఇతరదేశ రాజపుత్రులంతా విల్లుతో వ్యవహారాలు సాగించి, ఇక విల్లుని కనీసం ఎత్తనైనా ఎత్తలేక, తమని అవమానిస్తున్నాడు జనకుడనే అభిప్రాయానికి వచ్చాక, విశ్వామిత్రుడు రాముణ్ణి మిథిలకు తీసికొని పోయాడు.

రామునికి సీతనిచ్చి వివాహం అంగీకరిస్తున్నానని అంత సభలోనూ జనకుడు ప్రకటించాడు. దశరథుని అనుమతి కోసం దూతలనివెంటనే పంపించాడు కూడ. తనకి చక్కని అల్లుణ్ణి ఇచ్చినందుకు విశ్వామిత్రుణ్ణి అభినందించాడు.

జనకుని దూతలు నాల్గవనాటి ఉదయానికి అయోధ్య చేరి శివధనుర్భంగ వ్యవహారం తెల్పారు. పరమానంద పడ్డ దశరథుడు మంత్రులని చూచి *'మీకు ఇష్టమై తే ఆలస్యం చేయకుండా జనకనగరానికి పోదాం'* అన్నాడు.

వారంతా, ఈ వార్తవింటూనే పుత్రుల వివాహం కోసం వీరందఱితో సభచేసి ఆలోచిస్తున్న విశ్వామిత్రుడు వచ్చి రాముణ్ణి తీసికొనిపోయాడు. ఇప్పుడు పెళ్లి కబురు పంపాడు. అందుకని మంత్రులని అపార్థపడవలదని చెప్పడం కోసమూ, వారి అభిప్రాయాన్ని స్వీకరించడం కోసమున్నూ వారిని దశరథుడు సంప్రదించాడు.

క్షత్రియుడైన వానికి, బలపరీక్షలో నెగ్గడం కంటె కావలసినదేముంది? అంతసభలో ఎవరూ ఎత్తనైనా లేనిదానిని విఱిచాడంటే, ముందునాటికి దశరథుని పిమ్మట అయోధ్యకు రాజు కాబోయే రాముడు ఉండే అయోధ్యా రాజ్యం పైకి దండెత్తడానికి భయపడతారు కూడాను. అదీ కాక రముని భార్య అయిన సీత అయోనిజ కూడ. జనకుడు యాగాలని అనేకం చేసి ఉన్నవాడు. అందుకని బాగున్నదన్నారు.

*'కన్యా వరయతే రూపం మాతా విత్తం – పితా శ్రుతమ్।*
*బాంధవాః కుల మిచ్ఛన్తి – మృష్టాన్న మితరే జనాః ॥'* అని పెద్దలమాట.

వరుడు అందగాడా? కాడా ? అని మాత్రమే వధువు ఆలోచిస్తూందట. వరుడు, మంచి ఆస్తి ఉన్నవాడా ? కాడా ? అని కన్య తల్లి ఆలోచిస్తుందట. వంశమూ – సంప్రదాయమూ – అన్నిటికీ మించి వరుని చదువూ గుఱించి కన్య తండ్రి ఆలోచిస్తాడట. చెడ్డపేరు లేని వంశంలో పుట్టినవాడేనా ? అని బంధుజనం, ఆలోచి స్తారట. విందు విషయం బాగుంటే చాలని భావిస్తారట మిగతాజనం.

## వివాహపు ఏర్పాట్లు

మిథిలానగరానికి పెళ్లికళ వచ్చేసింది. నేల నిండుగా చిక్కగా కర్పూరపునీళ్లని చల్లారు. ముత్యాలతో ముగ్గులు కళకళలాడు తున్నాయి. పగడాల తోరణాలు ఎక్కడెక్కడా దర్శనమిస్తున్నాయి. ఊరునిండా పలచటి బంగారురేకు జెండాలని కట్టారు.

ఎందఱెందఱో రాజులు వస్తూండడమూ, వారికి స్వాగతంపలకడమూ, విడిది గృహాలకు పంపడమూ, ఎంతోకాలానికి చూచుకొన్న కారణంగా పరమానందంతో కౌగిలించు కోవడమూ, పలకరించుకోవడమూ, బాల్యవృత్తాంతాల్ని చెప్పుకోవడమూ – ఇలా చూచే వారికే సంతోషం కల్గుతోంది.

ఎందఱో రాజుల రాకచేత గుఱ్ఱాల సకిలింపులూ, ఏనుగుల ఘీంకారాలూ, జనుల కోలాహలమూ రథాల మువ్వల చప్పుడూ, ఏన్గుమెడగంటల ధ్వనీ, దేవాలయ ఘంటా ధ్వనులూ, వేద బ్రాహ్మణుల మంత్రనాదాలూ, వందిమాగధుల స్తోత్ర వాక్యాలూ, వలన కల్గిన ధ్వనికి మిథిలానగరం శబ్దమయమై పోయింది. సామంతరాజులు తెచ్చే కానుకలని తీసికొని పోయే రథాల వరుసలు, రాజభవనం లోనికి ఒక ప్రక్కగా వెళ్లి వేఱొక వైపు నుండి, అవే ఖాళీగా తిరిగి వస్తూ ఉన్నాయి. అలా విరామంలేక సాగుతూనే ఉన్నాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే ప్రతి యింటా పెళ్లి జరుగు తున్నట్లనిపించింది. జనకుని తమ్మునికి కబురంది, కుశధ్వజ మహారాజు స్వాగతలాంఛనాలమధ్య రథం దిగాడు. మేడల మీదినుండి స్త్రీలూ, క్రింది భాగంలో నిలబడి బాలురూ, వృద్ధులూ ఆయనని దర్శించి అభినందించారు.

మిథిలకి ఎన్ని జాతుల గుఱ్ఱాలో, ఏనుగులో వచ్చాయి. ప్రపంచంలోని జాతులెన్నెన్ని ఉన్నాయో, ఒక్కొక్క జాతిలో శ్రేష్ఠమైనవి ఏవో అవి అచటికి రానేవచ్చాయి. ఏ రాజు గుఱించి తఱుచుగా విని ఉన్నారో, ఏ రాజునిగూర్చి అసలు వినలేదో, ఎవరెవర్ని చూడాలని ఉవ్విళ్లూరారో, అలాటి కోరికలన్నీ మిథిలజనులకి తీరిపోయి ఇంక చూడవలసినదీ, వినవలసినదీ ఏమీ లేదని వారికన్పించింది.

### 5 రోజుల పెళ్లి

**పెళ్లి 5 రోజులుగా నిశ్చయించారు ఋత్విక్కులు.** ఆడపెళ్లి వారివైపున శతానందుడూ, మగపెళ్లివారివైపున వసిష్ఠుడూ వేదికల నలంకరించారు. (పెళ్లి మంత్రాలూ – వాటి అర్థమూ – విశేషాంశాలూ నా మాంగల్యతంతునానేన, అనే పుస్తకంలో తెలుగు వ్యావహారిక భాషలో మరీ వివరంగా చదువుకోవచ్చు).

**మొదటి రోజున వంశవృత్తాంతాలని ఒకరికొకరు తెలియజేసికోవడం – వచ్చిన వారికి చెప్పడమూ ప్రారంభమైంది.**

దీని వలన వధూవరులకి ఇద్దఱికీ, ఒకరి వంశవిశేషం వేఱొకరికి తెలిసే అవకాశం ఏర్పడుతుంది. అంతటి గొప్పవంశానికి నేను వెడుతున్నాను గాబట్టి, చక్కటినడవడికతో ఉండి, ఆ వంశచరిత్రకు మచ్చ తేరాదనే భావం ఇద్దఱికీ కల్గుతుంది.

అదీ కాక, పెళ్లి సందర్భంలో పెద్దలని స్మరించడం వలన, గతించిన ఆ పెద్దలకి ఆనందంకలిగి, వారి ఆశీస్సులూ లభిస్తాయి.

పెళ్లి అయిపోయాక 'వీరిది ఇలాటి వంశమని ముందు తెలియక చేసుకున్నాం' లాటి మాటలు విన్పించే అవకాశం ఉండదు.

## వంశ కథనం

ముందుగా వసిష్ఠుడు వంశక్రమం ప్రారంభించాడు. → బ్రహ్మ → మరీచి → కశ్యప → వివస్వంత → మను → ఇక్ష్వాకు (వంశం ఇతని పేరు మీదే) → కుక్షి → వికుక్షి → బాణ → అనరణ్య (రావణుని శపించినవాడు)→ పృథువు → త్రిశంకుడు (విశ్వామిత్రుడు స్వర్గానికి ఇతనినే పంపాలని భావించాడు) → ధుంధుమారుడు → (యవనాశ్వుడని కూడ పేరుంది). → మాంధాత → సుసంధి → ధ్రువసంధి → భరతుడు → అసితుడు→ ప్రసేనజిత్(ఈయనకు పిల్లలులేరు). తక్కువకాలం జీవించిన వాడితడు ఒక్కడే. ఇతని మీదికి యవనులూ, హైహయులూ, తాళజంఘులూ దండయాత్రకిరాగా ఓడి, ఇద్దఱు భార్యలతోనూ హిమవత్పర్వతానికి పారిపోయి, భృగుప్రస్రవణంలో తలదాచుకున్నాడు. పెద్దభార్య కాళింది, తన సవతికి విష భక్ష్యాన్నిచ్చింది. గరళంవలన గర్భం పోతుందని భయపడుతూన్న ఆమెని, చ్యవనుడు మంత్ర ప్రభావంతో రక్షించాడు.

గరళంవల్ల పుట్టిన వాడే సగరుడు → అసమంజుడు (అయోధ్యాప్రజల్ని సరయూనదిలో వినోదంకోసం ముంచుతూంటే దేశబహిష్కారం వీనికే శిక్షగా పడింది) → అంశుమంతుడు → దిలీపుడు (గోసేవచేసి, కామధేను ప్రభావం వలన వంశకర్త అయినపుత్రుణ్ణి, కన్నాడు).

భగీరథుడు (భూలోకానికి గంగని తెచ్చి 3 తరాల కిందటి వారిని మోక్షానికి పంపాడు. 'భాగీరథి (గంగ) అయ్యింది ఇతనివలననే) కకుత్స్థుడు (గౌరవంకోసం ఈపేరుని తరువాతవారంతా ధరించారు. అందుకే కాకుత్స్థులయ్యారు. ఇతని అసలుపేరు పురంజయుడు. ఇంద్రుడు ఆబోతురూపం ధరిస్తే, ఆ ఆబోతు మూపురం (కకుత్) లో ఉండి (స్థ) యుద్ధంచేసి శత్రువులని జయించాడు. → యాగాశ్వం ఎత్తుకుపోబడితే రఘువు గోమూత్రాన్ని కళ్లకి రాసికొని కనుక్కొన్నాడు. నాల్గుదిక్కుల్నీ జయించి సర్వరాజ్యాన్నీ, సంపదనీ అందఱికీ దానంచేసి మట్టి కుండతో మిగిలాడు. ఆ సమయంలో వచ్చిన కౌత్సుడనే ఋషిపుత్రునికి గురుదక్షిణగా - అతడడిగిన దానికి మించి - తనపై యుద్ధానికి రఘుమహారాజు వస్తాడేమోననే భయంతో కుబేరు డిచ్చిన బంగారాన్నంతనీ, ఇచ్చివేసాడు. ఉండి సహాయం చేయడం కాదు. లేనప్పుడు సహాయ పడడం ఇతని గొప్పతనానికి నిదర్శనం. → ప్రవృద్ధుడు (వసిష్ఠుణ్ణే శపించబోతే మనుష్యులని తినే శాపం (మనుష్యాదుడూ -పురుషాదుడూ) ఇచ్చాడు వసిష్ఠుడు. ఆ శపించబోయిన జలాన్ని తన కాళ్ల మీదే పోసికొని శాప జలం పడిన కారణంగా మాడిన పాదం (కల్మాషపాదుడు) కలవాడయ్యాడు. → సుదర్శనుడు → అగ్నివర్ణుడు → శీఘ్రగుడు → మరువు → ప్రశుశ్రుకుడు → అంబరీషుడు → నహుషుడు → యయాతి → నా భాగుడు → అజుడు (బ్రాహ్మముహూర్తంలో ('అజ'కాలంలో జన్మించినవాడు

కావడం వలన ఈపేరు. ఇందుమతికి భర్త ) → దశరథుడు. (అశ్వమేధ పుత్రకామేష్టులు చేసి నల్గురు పిల్లలని పొందిన వాడు) ఈ రామలక్ష్మణులు, నీ పుత్రిక కిచ్చుటకి పెండ్లి చేయ యోగ్యులని చెప్పి వసిష్ఠుడు కూచున్నాడు.

జనకుడు లేచాడు. తన వంశ క్రమాన్ని ఆయన ఇలా చెప్పాడు. మా వంశానికి మూల పురుషుడు నిమి → మిథి (ఈయన పేరిటి నగరమే మిథిల - ఈయనే మొదటి జనకుడు. ఈయనపేరిటి వంశమే జనకవంశం). → ఉదావసువు → నంది వర్ధనుడు → సుకేతుడు → **దేవరాతుడు (శివధనుస్సు ఇతనిదగ్గరే వచ్చింది)** → బృహద్రథుడు → మహావీరుడు → సుధృతి → ధృష్టకేతువు → హర్యశ్వుడు → మరువు →ప్రతీంధకుడు → కీర్తిరథుడు → దేవమీఢుడు → విబుధుడు → మహీధ్రకుడు → కీర్తిరాతుడు → మహారోముడు → స్వర్ణరోముడు → హ్రస్వ రోముడు → ఇతనికి ఇద్దఱుకలిగితే నేను జనకుణ్ణి పెద్దవాణ్ణి. నా తమ్ముడు కుశధ్వజుడు చివరివాడూ, రెండవవాడున్నూ.

సాంకాశ్య దేశాధిపతి సుధన్వుడు, నా వద్ద ఉన్న శివధనుస్సు కోసం నామీదికి యుద్ధానికొస్తే, వాణ్ణి చంపి కుశధ్వజుణ్ణి ఆ దేశాధిపతిని చేసాను. విశ్వామిత్రా నీ ఆజ్ఞ ప్రకారం, అయోనిజ సీతను రామునికీ, నా కూతురు ఊర్మిళను లక్ష్మణునికీ ఇస్తాను అన్నాడు.

వంశక్రమం విని విశ్వామిత్ర దశరథు లానందించి ఒకరినొకరు అభినందించు కొన్నారు. విశ్వామిత్రుడు లేచి, 'జనకా ! నీ తమ్ముని కూతుళ్లు మాండవీ శ్రుత కీర్తి లనుకూడా మా భరత శత్రుఘ్నుల కీయవలసినదిగా మా కోరిక అని దశరథుని తరఫున చెప్పాడు. జనకుడు, తన పురోహితుడు శతానందునితో సంప్రదించి, వియ్యానికి సిద్ధమే అన్నాడు. వంశాన్ని ఎఱిగి వివాహమంటే యిదే.

**రెండవ రోజున విశ్చితార్థం (తాంబూలాలు) తీసికోవడం.**

ఒకరి కొకరు అంగీకారాన్ని తెలుపుకోవడమన్నమాట. వంశవృత్తాంతాన్ని విని, ఒకరోజు ఆలోచించుకుని అంగీకారాన్ని తెలపడం, ఎంత చక్కని సంప్రదాయమోకదా!.

**మూడవరోజున గోదానం జరిగింది.**

గోశబ్దానికి తలవెంట్రుకలు అనీ,గోవులు అనీ కూడా అర్థం. అనాటి ఆచారం ప్రకారం, వారికి తలవెంట్రుకలని తీసి, తెల్లని తలపాగలు ధరింపచేసారు

బంగారు తొడుగు గిట్టలతోనూ, బంగారు తొడుగు కొమ్ములతోనూ అలంకరించి అనేక గోవులని, దానం చేసారు. (గోదాన విశేషం ఇంతకు వెనుక వివరింపబడింది. ఇలా జరిగిన గోదానాన్ని చూడటం కూడ అదృష్టమే).

**నాల్గవ రోజున మంటపాగమనం.**

వారు వీరూ మంటపానికి (వివాహవేదిక) రావడం - అగ్నిహోత్రాలు వెలిగింప బడడం - వివాహం శాస్త్రోక్తంగా సాగడం జరిగింది.

నల్గురు కన్యలూ, వెలిగించిన ప్రమిదలలా కన్పించారు. జనకుడు అగ్నిహోత్రం వద్దకు రాముణ్ణి సాదరంగా తెచ్చి, సీతమ్మ చేతిని ఆతనికి అందిస్తూ ఇలా అన్నాడు.

*'ఇయం సీతా మమ సుతా*
*సహధర్మ చరీ తవ।*
*ప్రతీచ్ఛ చైనాం భద్రం తే*
*పాణిం గృహ్ణీష్వ పాణినా॥'*

**ఈ శ్లోకానికి 6 అర్థాలు**

'అస్తంగతోఽర్కః' (సూర్యుడు అస్తమించాడు).

అనగానే బ్రాహ్మణ బాలకునికి సంధ్యావందన సమయమైందనీ,

గోప బాలురకి ఆవులని మళ్లించే వేళ అయిందనీ,

గృహిణికి, సందె ముగ్గువేసి దీపం పెట్టే వేళ అయిందనీ,

ఋషి పత్నికి హోమ ద్రవ్యాలు సిద్ధం చేసే సమయం ఆసన్న మైందనీ,

వేశ్యకి విటులని ఆకర్షించే వేళ అయిందనీ అర్థమట.

ఎవరి మనోభావాన్ని బట్టీ, స్థాయిని బట్టీ, వారివారికి ఆ అర్థాలు ఎలా కల్గుతాయో, అలాగే ఈ శ్లోకం అనేకులకి ఆయా అర్థాన్ని ఇచ్చింది.

శ్లోకంలోని ఒక్కొక్క మాటనీ ఒక్కొక్కరి మనోభావం ప్రకారం వివరంగా చూద్దాం.

**శ్లోకానికి అసలు అర్థం :**

ఓ రామా! ఈమె నాకూతురు సీత. నీకు సహధర్మ చారిణి. ఈమె చేతిని పట్టుకో నీకు శుభమగు గాక!.

**(1) జనకుని అర్థం :**

(i) ఈమె సీత(రామా! ఈ అద్దాల భవనంలో, ఎన్నెన్నో రత్న దీపాల కాంతుల మధ్య అద్దాలలో ప్రతిబింబిస్తూ ఎక్కడెక్కడ చూచినా, సీత కన్పిస్తూ, అనేక సీతలు ఉన్నట్లుగా నీకు అన్పిస్తోంది కదా! వాళ్లందరూ నిజమైన సీతలు కారు. ఇదిగో! నేను తెస్తున్న ఈమె నిజమైన సీత!)

(ii) నా కూతురు (రామా! ఇన్నాళ్ల వఱకూ ఈమె వివాహం నాకొక సమస్య అయింది. ఎవ్వరడిగినా, కూతురిని చూపించడానికి భయంగా ఉండేది. (వివాహం అయ్యిందా? అని అడుగుతారేమోనని) ఇదిగో! ఈ రోజున ఈ కల్యాణ మండపంలో సగర్వంగా చెప్తున్నాను. ఈమె నాకూతురు).

(iii) నీకు సహధర్మ చారిణి (రామా! నీవు యోనిజడవనీ - సీత అయోనిజ అనీ - అలాగే నీవు ఈమెనే ఆశించి వచ్చినవాడివి అనీ - ఈమె ఎందఱిచేతనో ఆశింపబడిన అందగత్తెఅనీ - ఇలా భావిస్తూ నీతో ధర్మాచరణాన్ని చేస్తుందా? లేదా? అని భావించకు. యజ్ఞయాగాదులని చేసిన - చేస్తూ ఉన్న - కర్మిష్ఠి అయిన నాకూతురు కదా ఈమె! అందుకని నీకు సహధర్మ చారిణిగా ఆజీవన కాలమూ ఉంటుంది సుమా!).

(iv) చేతిని పట్టుకో! (రామా! తాటక - సుబాహు మొదలైన రాక్షసులని చంపిన విల్లుని పట్టుకొనే చేతితో కర్కశంగా కాక, అహల్యకు శాపమోక్షాన్ని అనుగ్రహించిన హస్తంతోనూ, సిద్ధాశ్రమంలో ఉన్న మహర్షులకి అభయాన్ని ఇచ్చిన హస్తంతోనూ, ఈమె చేతిని గ్రహించు. వివాహానికి సుముహూర్తం అంటే - పాణిగ్రహణమే కదా!).

(v) నీకు శుభమగు గాక! (రామా! శివధనుస్సును విఱిచి ఎంతో కాలంగా ఉన్న నా బాధ పోగొట్టి నా మనస్సుకి ఊఱట కలిగించిన నీకు, ప్రత్యుపకారంగా నేను ఏమి ఇయ్యగలను? 'మామ'గా, ఏవో యజ్ఞాలని చేసిన వానిగా, ఆ తపశ్శక్తితో, మాట మాత్రంగా "నీకు శుభమగు గాక!" అనే ఆశీర్వచనాన్ని ఇయ్యగలను).

**(2) మహర్షుల అర్థం :**

(i) ఈమె సీత (రామా! రావణ వధ కోసం లోకానికి అవతార రూపంలో వచ్చినదీ - వధ అయిపోయిన పిమ్మట వైకుంఠానికి వెళ్లడానికై వాల్మీకి మహర్షి ఆశ్రమంలో కొంత కాలం ఉండబోయేదీ - మహర్షుల అందఱి సహాయాన్నీ కోరేదీ అయిన ఈమె - సీత).

(ii) నా కూతురు (రామా! మీ గురువు విశ్వామిత్రుల వారికి కలిగిన శకుంతలలా కాక, నాయింటనే పెంచుకొన్న ఈ సీత నా కూతురు సుమా! నిజానికి అయోనిజ అయినా, నా కూతురిగానే పెంచాను. రావణ వధ తరువాత కూడ, వాల్మీకి ఆశ్రమంలో ఈమె ఉండబోయే కాలంలో మహర్షులంతా కూడ తమ తమ కూతురిలాగానే (నేను చూచుకొన్నట్లు) చూచుకోబడవలసినది సుమా!).

(iii) నీకు సహధర్మ చారిణి (రామా! దుష్టశిక్షణం - శిష్ట రక్షణం నీ ధర్మం కదా! ఈమె కూడా ఆ ధర్మాన్ని నీతోపాటు నెరవేర్చడానికి అరణ్యానికి వస్తుంది).

(vi) చేతిని పట్టుకో! (రామా! అగ్నితో సమానమైన పవిత్రత కలవాళ్లం. ఎప్పుడో జరిగిన నీ పెళ్లిమాకు గుర్తులేదు. చూడడానికే తపస్సుమానుకొని వచ్చాం. మాకు ఆనందం కల్గేలా చేతిని చేతితో పట్టి చూపించు).

(v) నీకు శుభమగుకాక! (రామా! 'ధర్మో రక్షతి రక్షితః' ధర్మాన్ని రక్షిస్తే ఆ ధర్మం మనల్ని రక్షిస్తుంది) అనిగదా! మేమంతా నీ శుభాన్ని కోరేవాళ్లం. నీ అవతార ప్రయోజన కార్యాన్ని ప్రారంభించు, నిర్విఘ్నంగా సాగిపోతుంది).

**(3) దేవతల అర్థం :**

(i) ఈమె సీత (రామా! స-ఈ-త. మర్త్యలోకంలో ఉన్న వారిని దేవ లోకంలో ఉన్నవారిగా చేయడానికి, మర్త్య అమర్త్యలోకాలకి వంతెనలా ఉపయోగించేది ఈమె. స-ఈ-త. నీవు సత్య-పరా-ఆక్రముడివి. సత్యధర్మాలచేత పరలోకాన్నే ఆక్రమించే వాడివికదా!)

(ii) నా కూతురు (రామా! యజ్ఞాలనెన్నింటినో చేసి హవిస్సులద్వారా మిమ్మల నందలినీ తృప్తిపఱచిన కారణంగా నీ భార్యగా అయ్యే ఆమె, నా కూతురు కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను).

(iii) నీకు సహధర్మ చారిణి (రామా! ఒక్కొక్కప్పుడు నీ యందలి ప్రణయకోపంతో వినోదంగా వెళ్లి పోయేది లక్ష్మి. అది దేవలోకంలోనే సుమా! ఈ లోకంలో సహధర్మచారిణిగానే ఉంటుంది. నీవు శిక్షించదలచిన వాణ్ణి, తన ఐశ్వర్యంతో రక్షింపదలచి విఫలురాలయ్యేది ఆలోకంలోనే. ఈ లోకంలో అలా చేయదులే!).

(iv) చేతిని పట్టుకో! (రామా! ఇది పెళ్లికాదు. నిత్య దంపతులకి మీకు క్రొత్తగా పెళ్లి ఏముంది? రావణ వధని చేయడానికె మీ యిద్దఱూ ఒకరికొకరు సహాయపడతామని చేతితో చేతిని కలిపి ప్రతిజ్ఞ చేయండి).

(v) నీకు శుభమగుగాక! (రామా! నీలోని శక్తిరూపమైన సీత, నీ నుండి దూరమై లంకలో ఉన్నప్పుడు నీకు ఏ కష్టమూ కలుగకుండా శుభమే అవుతుంది! (సీతారాముల్లో సీత 'శక్తి' రాముడు 'శివుడు'. శివుడూ - శక్తీ కలిస్తే వస్తువౌతుంది. (Matter and Energy) సీత లేని రాముడు, పంపానదీ తీరంలో తీవ్రంగా దుఃఖిస్తే, రాముడులేని సీత *'భస్మం చేస్తాను!'* జాగ్రత్త అని రావణుణ్ణి బెదిరించింది. *'శీతోభవ!'* అని హనుమంతుని తోక చివరి అగ్నిని చల్లార్చింది. దుఃఖాన్ని <u>నటించింది</u> ఆమె).

**(4) పెండ్లికి వచ్చిన ముత్తయిదువుల అర్థం :**

(i) ఈమె సీత (రామా! "ప్రాసదే సా పథిపథి చ సా పృష్ఠత స్సా పుర స్సా" వైకుంఠం నుండి బయలు దేరిన నాటినుండి ఎదురు చూస్తూ, ఎప్పుడు సీతని చూస్తానా? - అని ఆలోచిస్తున్నావుగా! ఇదిగో సీత. వెనుకా - ముందూ - ఎక్కడ చూచినా నీకు సీత-సీత-సీతే కన్పిస్తోందిగా! ఆ సీత- ఈమెయే!).

(ii) నా కూతురు (రామా! ఈ సీత అయోనిజ కదా! తల్లిలేని పిల్ల. తండ్రి అయిన నా పెంపకంలో పెరిగింది. ఏదైనా ఆడువారి పెంపకానికీ, తండ్రి పెంపకానికీ

తేడా ఉండదా! తొందరలో ఓ మాట అన్నా, పట్టించుకోకు. ఈమె 'తండ్రి కూతురు' అని ఉదాసీనంగా ఉండు సుమా!).

(iii) నీకు సహధర్మచారిణి (రామా! ఈ వివాహానికి వచ్చిన ఇందరినీ - అయోధ్యకు మించిన సంపదనీ - నీకు మించిన గుణాలనీ - (ఆంజనేయుడు సుందరకాండలో అంటాడు. ధ్రువం విశిష్టా గుణతో హి సీతా (సీత, రాముని కంటే గొప్పది) అని గమనించి - నామాట వింటుందా? (నాతో అరణ్యాలకి, ఇంతటి సంపన్నురాలు వస్తుందా?) - అని భయపడకు. సహ-ధర్మచారిణిగా ఉండేంతటి వినయమూ ఈమెకుంది సుమా!.

(iv) చేతిని పట్టుకో! (రామా! ఆడ పిల్ల - కన్య కదా! సిగ్గుతో ఆమెచేతిని చాచలేదు కూడా! నీవే చేతిని తీసికొని పట్టుకో! ఆ సందర్భాన్ని చూడాలనే ఎందఱమో ఇక్కడికి వచ్చి ఉన్నాం. ఒకప్పటి మా ముద్దు ముచ్చటలని గుర్తు చేసుకుంటాం).

(v) నీకు శుభమగుగాక! (రామా! పెళ్లి అయ్యాక ముత్తయిదువుల దీవనలు తీసుకుటావుగా! ఎప్పుడో ఎందుకు! ఇదిగో! ఇప్పుడే ఇస్తున్నాం దీవనని! గ్రహించు).

**(5) బలిష్ఠులైన సేనాధిపతుల అర్థం :**

(i) ఈమె సీత. (రామా! బలిష్ఠులైన 5,000 మంది సైనికులు తెచ్చే శివధనుస్సు ఉండే పెట్టెని అవలీలగా తొలగించగల శక్తి ఉన్న కన్య 'సీత' - అని, మిథిలకు రాగానే ఎందఱో నీకు చెప్పి ఉంటారు. ఇదిగో, ఆ శక్తి మంతురాలు ఈమెయే!).

(ii) నా కూతురు (రామా! క్షత్రియుడవైన నీవు ఏ కష్టంలో ఉన్నా ఆదుకోగల భౌతిక శక్తి కలది అయినా, యజ్ఞయాగాదులు చేసే నా కూతురు కాబట్టి, దైవశక్తి కూడా ఉన్నదే సుమా!).

(iii) నీకు సహధర్మచారిణి (రామా! ఇంతటి శక్తిమంతురాలు, నాశక్తికి కూడా మించిన దౌతుందేమోనని ఆలోచించకు. శక్తి విషయం ఎలా ఉన్నా, సహధర్మచారిణిగా ఉండడంలో సందేహం లేదు. ధర్మాచరణంలో తన శక్తినీ, దైవశక్తినీ కూడా ఉపయోగించ గలదు సుమా!

(iv) చేతిని పట్టుకో (రామా! వీరుడివైన నీవు, శౌర్యవంతురాలైన ఆమె చేతిని పడితే జగత్తంతా మీ వశంలో ఉండదా?).

(v) నీకు శుభమగుగాక! (రామా! భర్తశౌర్యం - భార్య ధైర్యం - తండ్రి దైవశక్తి కలిస్తే లోకంలో వాళ్లకి శుభ పరంపరలు గాక అశుభం ఉంటుందా?).

**(6) రాముని అర్థం :**

(i) ఈమె సీత (ఓ సీతా! ఇది ఎంత అబద్ధం! నువ్వు 'లక్ష్మి' వి అని నాకు తెలుసు)

(ii) నా కూతురు (సీతా! ఎలాగౌతావు? సముద్రుని కూతురువు కదా!)
(iii) నీకు సహధర్మచారిణి (సీతా! ఎప్పటినుండో కదా! - ఇప్పుడేం క్రొత్తగాదు).
(iv) చేతిని పట్టుకో! (సీతా! వైకుంఠం నుండి రావణ వధార్థమై నువ్వు వెళ్లిందగ్గర్నుండీ నిన్ను స్పృశించాలని భావిస్తున్నాను. ఇప్పుడు జనకుడు (మీతండ్రీ పట్టుకోమంటున్నాడుగదా! సీతా! చేతినియ్యి - పట్టు కుంటాను).
(v) నీకు శుభమగుగాక! (సీతా! నా 'లక్ష్మి'ని సీతగా పిలుస్తూ, నిన్నుగా ఇస్తున్నారు కాబట్టి, ఎప్పుడో 'శుభం' జరుగుతుందని ఎదురు చూడనక్కఱలేక, దీవించే కాలంలోనే శుభం జరుగుతోంది కదా!. ఇక ముందుకాలంలో కూడ అనుమానం ఎందుకు?).

అని ఇలా 6 అర్థాలు కలిగాయి. పెళ్లికాలంలో దేవతల పుష్ప వృష్టి, దేవదుందుభి ధ్వానాలూ, అప్సరో నృత్యాలూ, గంధర్వ గానాలూ దేవలోకంలో సాగాయి.

**5వ రోజున అందఱూ అయోధ్యకి ప్రయాణమయ్యారు.**

## ఈ వివాహం గూర్చి కొన్ని విశేషాలు

వివాహాలు 8 తీరులైతే ఇది 'ప్రాజాపత్య'మనే తీరుకి చెందినవివాహం. (*సహోభౌ చరతాం ధర్మ మితి వాచాఽ నుభాష్య చ*) వరుణ్ణి గౌరవించి, ధర్మాచరణం కోసమై కన్యని ఇచ్చి చేసే వివాహం, ప్రాజాపత్యం. ఒక యింట్లో ఒకే శుభకార్యాన్ని చేయాలిగాని రెంటిని కలిపి చేయరాదంటారు కదా! అంటే ఒకే కాలంలో పుట్టిన యిద్దఱికీ, ఒక తల్లికి పుట్టిన యిద్దఱికీ చేయరాదని శాస్త్రం. చిన్నవాడైన లక్ష్మణునికి ముందు వివాహమయ్యాక, భరతునకు తర్వాత చేయడమా? అంటే ఈ చిన్న-పెద్ద అనే భేదం ఒక తల్లి పిల్లల మధ్య ఉండేదే తప్ప వేరు తల్లుల మధ్య ఉండదు.

రాముడు కన్యాశుల్కం ఇచ్చి పెళ్లి చేసికొన్నాడు కాబట్టి, వరకట్నం ఉండవచ్చుగా! అంటే, రాముడు సీతకి ఇచ్చినది పరాక్రమమే కాని, (వీర్యశుల్క) మనం అనుకొనే విధంగా సొమ్ము మాత్రం కానే కాదు.

(పెళ్లికి సంబంధించిన అన్ని వివరాలకి నా '*మాంగల్య తంతునానేన*' అనే గ్రంథం చూడవచ్చు).

శివ ధనుస్సుని ఎక్కుపెట్టేవాడు, 'కురూపి' అయినా, దుర్గుణుడే అయినా కూడా, సీత, వివాహం చేసికొని తీరాల్సిందేగదా! క్షత్రియ స్త్రీకి పుట్టేవాడు పది మందిని రక్షించగలిగే వాడు కావాలి. క్షత్రియ స్త్రీకి కావలసిన వరుని విషయంలో బలపరీక్ష మాత్రమే పెట్టడానిక్కారణం, లోకాన్ని రక్షించాలనే ధర్మానికి కట్టుబడి ఉండడమే. తమ ఇష్టాన్ని వదులుకొని కూడా, బలవంతుణ్ణే వివాహం చేసికోడానికి ముందుకొచ్చిన సీత, ద్రౌపది వంటి స్త్రీలు లోకానికి మార్గదర్శకురాండ్రు.

జనకుడు, తమ తమ్ముని కూతుళ్ల వివాహం కూడా ప్రకటించడం బట్టే, ఈనాడు కూడా ఆ సంప్రదాయాన్ని పాటించే పెద్దలు చాలి మంది, తమ వంశంలో జీవించి ఉన్న పెద్దల పేర్లనే శుభలేఖలలో ఉంచుతూ, వారే ఆహ్వానిస్తున్నట్లుగా శుభలేఖలని వేస్తూంటారు.

తెల్ల వాఱగానే విశ్వామిత్రుడు దశరథునికీ, రామలక్ష్మణులకీ వీడ్కోలు చెప్పి, హిమవత్పర్వత ప్రాంతానికి వెళ్లిపోయాడు. దీన్ని బట్టి విశ్వామిత్రుడు వచ్చినది - రామునికి అస్త్ర విద్య నేర్పడానికీ, తాటకావధకీ, అహల్యా శాప మోక్షానికీ, శివధనుర్భంగం చేయించి పెళ్లి చేయించడానికీన్నీ - అని స్పష్టంగా తెలుస్తుంది.

**శ్రీమద్రామాయణంలో అనవసరంగా ఏ పాత్రా ఒక్క క్షణం కూడా ఉండక పోవడం వాల్మీకి మహర్షి గొప్పతనాన్ని తెలియచేస్తుంది. మహర్షులకి, కాలం విలువ తెలుసని తెలియచెప్తుంది.**

## యుధాజిత్తు మంచితనం

కైకమ్మ సోదరుడూ, కేకయ మహారాజ పుత్రుడూ, దశరథుని బావమఱదీ అయిన యుధాజిత్తు, అయోధ్యకు వచ్చి, అందఱూ మిథిలకి వివాహానికి వెళ్లారని తెలిసి, అక్కడికి వచ్చాడు. పెళ్లికై గోదానం చేయిస్తూండగా వచ్చిన యుధాజిత్తు కూడా, తిరుగు ప్రయాణమయ్యాడు.

రామునికి పెళ్లి జరుగుతోందని తమకి తెలియజేయకపోయినా, యుధాజిత్తు మిథిల వఱకూ రావడం, అక్కడికక్కడే నిర్ణయింపబడిన తన మేనల్లుడు భరతుని పెళ్లిని చూచి సంతోషించడమూ గమనిస్తే, కేకయ వంశీయుల సహృదయత తెలుస్తుంది. మఱొకరైతే, అలా అకస్మాత్తుగా నిర్ణయింపబడిన పెళ్లిళ్లని అసలు ఆమోదించరు. అదీ కాక, యుధాజిత్తు కైకమ్మ సోదరుడు కావడం వలన, మఱింత సహింపకపోవాలి. కా ఆ లక్షణమే అతనిలో లేదు. (అయోధ్యాకాండ ప్రారంభంలో భరత శత్రుఘ్నుల్ని తనే తీసికొని పోవడంలోని రహస్యం, నా అయోధ్యా కాండ వ్యాఖ్యలో వివరింప బడిం ఇక్కడ అది అప్రస్తుతం కాబట్టి విడువబడుతోంది).

## పరశురామ వృత్తాంతం

అయోధ్యకు బయలుదేరిన రథాలు వస్తూ ఉన్నాయి. ఇంతలో ఆకాశం నల్లబడింది. జగత్తు చీకటి అయింది. వెంటనే, భయాన్ని కల్గించే కాంతులు రాసాగాయి. అంతలో భుజం మీద గొడ్డలితో, క్రోధం ఉట్టిపడే కళ్లు కలిగి, భయంకర దేహంతో ఉండి, మెఱుస్తూన్న బాణాలూ విల్లూ పట్టుకొని, త్రిపురాసుర సంహారానికి వెళ్లే రుద్రునిలా, ఒక యోధుడు ఎదురుగా నిలబడ్డాడు. అతడు పరశురాముడని అందఱికీ అర్థమైంది.

ఆకాశంలోని పక్షుల అఱుపులు భయాన్ని సూచిస్తూంటే, ప్రదక్షిణంగా తిరిగే మృగాలు భయం వలదని చెప్తున్నాయని వసిష్ఠుడు దశరథునితో పలికి, ధైర్యం చెప్పాడు.

*(ఘోరా స్తు పక్షిణో వాచః వ్యాహరంతి సమంతతః। భీమా శ్చైవ మృగా స్సర్వే గచ్ఛన్తి స్మ ప్రదక్షిణమ్। ఉపస్థితం భయం ఘోరం దివ్యం పక్షిముఖా చ్చ్యుతమ్। మృగాః ప్రశమయ న్త్యేతే సంతాప స్త్యజ్యతా మయమ్। )*

పిమ్మట వసిష్ఠాదులిచ్చిన అర్ఘ్యపాద్యాదులని క్షణంలో గ్రహించి, రాముని వంక చూస్తూ 'శివ ధనుస్సు విఱిచినంత వఱకూ , నీ కథని విన్నాను. ఇదిగో! ఈ విల్లు నా తండ్రి జమదగ్నిది. దీన్ని ఎక్కు పెడితే, నీతో ద్వంద్వ యుద్ధం చేస్తాను' అన్నాడు పరశురాముడు. *(రామ ! దాశరథే రామ ! శ్రూయతే ధను రద్భుతమ్। ధనుషో భేదనం చైవ నిఖిలేన మయా శ్రుతమ్। ద్వంద్వయుద్ధం ప్రదాస్యామి వీర్యశ్లాఘ్యస్య రాఘవ।)*

దశరథుడు రథం దిగి 'పరశురామా! భృగువంశంలో పుట్టిన బ్రాహ్మణుడివి. శస్త్రాస్త్రాలను విడిచి పెడుతున్నానని ఇంద్రుని యెదుట ప్రతిజ్ఞ చేసినవాడివి. నువ్వు జయించిన భూమినంతా కాశ్యపునికి దానం ఇచ్చి, మహేంద్రపర్వతంపై తపస్సు చేసికొంటూ ఉన్న నీకు' మా మీద కోపమా? ఈ రామునికి ఏ ఆపద కల్గినా, మేమంతా బ్రతకడం వట్టిమాట' అని ప్రాధేయపడ్డాడు.

ఆ మాటలు విని పరశురాముడు రామునితో 'రామా! విశ్వ కర్మ సృష్టించిన రెండు విండ్లలోనూ ఒకటి త్రిపురాసుర సంహారానికై శివునికి ఇచ్చారు. రెండవదాన్ని విష్ణువు కిచ్చారు. శివధనుస్సును విఱిచావు. ఇది వైష్ణవ ధనుస్సు . దీన్ని విష్ణువు ఋచీకునికిస్తే ఆయన మా తండ్రికిస్తే ఆ జమదగ్ని నాకిచ్చాడు. అస్త్ర సన్యాసం చేసిన నా తండ్రిని కార్తవీర్యార్జునుడు చంపితే, సర్వరాజ వంశాలనీ 21 మాఱులు తిరిగి తిరిగి వధించాను. రా! ఎక్కుపెట్టి ద్వంద్వ యుద్ధానికి తలపడు' అన్నాడు.

రాముడు, తండ్రి సమక్షంలో ఉన్నందువల్ల వినయంగా పల్కరిస్తూ పరశురామా! నీ తండ్రిని అవమానించినందుకు పితృఋణాన్ని తీర్చుకున్నావు. అభినందించవలసినదే. కాని, నన్ను పరాక్రమమూ, శక్తీ లేనివానినిగా మాట్లాడుతున్నందుకు శిక్షించవలసినదే' - *(వీర్యహీన మివా శక్తం క్షత్రధర్మేణ భార్గవ। అనుజానాసి మే తేజః పశ్య మేఽద్య పరాక్రమమ్॥)* అంటూ ఆతని చేతిలోని వింటినీ, బాణాన్నీ ఒక్కసారి లాగుకున్నాడు. క్షణంలో ఎక్కుపెట్టాడు. 'పరశురామా! దేవలోకపు వింటిలో ఎక్కుపెట్టబడ్డ బాణం వ్యర్థం కారాదు. నీ పాదాలని ఖండించనా? లేక తపో లోకాలని సంహరించనా?' చెప్పు - అన్నాడు.

ఆకాశంలో యక్షకిన్నరాది దేవయోనిగణం చూస్తూ ఉండి పోయారు. పరశురాముడు పరాక్రమహీనుడై *'దాశరథీ! భూమినంతా దానం చేసిన నేను, రాత్రి అయ్యేసరికి భూమిమీద ఉండరాదు. నా పాదాలని ఖండిస్తే, దాన మిచ్చి కూడ, దత్తమైన భూమిలో ఉన్నందుకు ఆ పాపం నన్నంటుకుంటుంది. నా తపశ్శక్తితో సంపాదించిన లోకాలని కొట్టెయ్యి. స్వామీ! నీవు మహావిష్ణువే - నాశనం లేనివాడివీను. నీ వంటి వానివలన అవమానం జరిగిందని నేను భావించనక్కఱలేదు. ఇక బాణాన్ని విడిచి నా ఎదురుగా నేను సంపాదించిన నా తపో లోకాలని గ్రహించు వెళ్లిపోతాను'* అన్నాడు.

అలాగే జరిగింది. పరశురాముడు వెళ్లిపోయాడు. రాముడు ఆ విల్లునీ బాణాన్నీ వరుణునకు ఇచ్చివేసాడు.

## దీవిలోని విశేషాలేమిటి?

ఏ విధమైన రాక్షస మాయా సాగకుండా ఉండడానికే, పరశు రాముణ్ణి దేవతలు పంపారు. అందుకే, పరశురాముడు వస్తూనే *'శివధనుస్సు విఱుకూ అయిన కథని విన్నాను'* అన్నాడు. అంటే, *'ఓ! రామా! నా పాత్ర, ఆ ధనుస్సు విఱిగాక రావాల్సినది సుమా!'* అని తెలియచెప్పడం. నాటకం సవ్యంగానే సాగుతోందని విష్ణువుకి చెప్పడమున్నూ. భూమినంతా దానాన్ని ఇచ్చాను, అంటూ తన కథని మొత్తం చెప్పడానిక్కారణం, తాను, దేవతలు పంపగా వచ్చిన రూపమే తప్ప, ఇందులో రాక్షసమాయ లేదని చెప్పడంకోసం.

గోవుకీ, బ్రాహ్మణునికీ ప్రతీకార బుద్ధి ఉండనే ఉండదు. వారి సహనాన్ని పరీక్షించి రెచ్చగొడితే, ఎంతగా అవుతారనేందుకు పరశురాముడే సాక్ష్యం. బ్రాహ్మణులలో ఐకమత్యం లేకుండా చేయడం, మహాశక్తిగల ఏనుగులకి మందబుద్ధి నీయడం, పాములకి అతి నిద్రనీ భగవంతుడు ఏర్పాటు చేయడం, లోకక్షేమ దృష్టితోనట.

బ్రాహ్మణానా మనే కత్వం సర్పాణా మతి నిద్రతా।
గజానాం మందబుద్ధిశ్చ త్రిభిః లోకోపకారతా।

శివధనుస్సుని ఎక్కుపెట్టడమనేది అపచారమనే భావంతో *'రావణుడు'* రాలేదని రాక్షసులు భావిస్తారేమోనని, వైష్ణవ ధనుస్సువృత్తాంతాన్ని ఇక్కడుంచారు దేవతలు. సర్వలోకాలూ తిరిగిన రావణుడు, వైష్ణవ ధనుస్సుని ఎక్కుపెట్టనూ లేదు - ఎక్కుపెట్టలేడు కూడ. కార్తవీర్యార్జునుడు రావణుణ్ణి బంధిస్తే, రావణుని తండ్రి పులస్త్యుడు రావణుణ్ణి విడిపించమని ప్రార్థించాడు. ఆ ప్రార్థనపై కార్తవీర్యుడు విడిస్తే, రావణుడు విడిచిపెట్ట బడ్డాడు. ఆ మీదట అతని జోలికి పోలేదు. ***'రావణుణ్ణే జయించిన కార్తవీర్యుణ్ణే పరశురాముడు చంపితే, ఆలాటి పరశుముని ఓడించినవాడు ఈ రాముడు'*** అని, రాక్షసులు లంకలో చెప్పాలనే ఈ నాటకమంతా జరిగింది. పరశురాముణ్ణి బాణంతో కొట్టకపోవడానిక్కారణం, పరశురాముని తాత ఋచీకుడు, విశ్వామిత్రుని తోబుట్టువైన సత్యవతికి భర్త కావడం వలనా, గురువైన విశ్వామిత్రుని చుట్టం అయిపోవడం వలనా.

అసలు రహస్యం మఱొకటుంది. అహల్య నుండి తపశ్శక్తిని గ్రహించిన రాముడు, పరశురాముని తపోలోకాలని కూడా గ్రహించాడు. బాణంతో విలుకాడు, ఏ మృగాన్ని కొడితే, ఆ మృగం అతని దైనట్లు, తాను బాణంతో కొట్టిన తపోలోకాలు తనవై పోయాయి. అహల్యకి నమస్కరించి తపశ్శక్తిని గ్రహించడానికీ, పరశురాముణ్ణి బెదిరించి స్వీకరించడానికీ కారణం, బ్రాహ్మణుడైన పరశురాముడు, క్షత్రియుని పద్ధతిని అవలంబించడమే. పరధర్మో భయావహః - తనది కాని ధర్మాన్ని ఆచరించడం సరికాదని భగవద్గీత. అందుకే పరశురామావతారం నిర్వీర్యమై పోయింది.

## అయోధ్యకి విందుదనం

నలుగురు పుత్రులూ, తమ తమ భార్యలతో అయోధ్యకి వచ్చారు. ఎవరెవరి మందిరాలు వారివారికి ఏర్పాటు చేయబడ్డాయి. బ్రాహ్మణోత్తములని రప్పించి దానాల నిచ్చారు. ఆశీర్వచనాలని పొందారు.

కొన్నాళ్లు కాగానే దశరథుడు భరతుణ్ణి, యుధాజిత్తు కోరికపై వాని తాతగారింటికి (కైకమ్మ పుట్టింటికి పంపించాడు. శత్రుఘ్నుడు కూడా అతని వెంటవెళ్లాడు.

అయోధ్యలో ఏ యింట చూచినా రాముని వార్తలే. పెద్ద-చిన్న భేదంలేక, సమయ-అసమయ విచక్షణలేక ఏమరుపాటుతనం లేక అందరికీ సహాయపడడం, నవ్వుతూ తానే ముందుగా పల్కరించడం రాముని స్వభావం. ఇదే మిగిలిన తమ్ముళ్లకీ స్వభావమైంది. దశథుడు నలుగురు పుత్రులతోనూ, చతుర్భుజుడైన విష్ణువులా ప్రకాశించాడు అయోధ్యలో.

తండ్రి దశరథుడు ఆమోదించిన వివాహం కావడం వలనా - సహజ సౌశీల్యం కలది కావడం వలనా - సీత అంటే రామునికి మరింత మక్కువ. మిగిలిన తమ్ముళ్లకీ తమ తమ భార్యలంటే అంతటి ప్రేమే. **(ప్రేమించి పెళ్లాడడమనేది ఈనాటి మాట. పెళ్లాడి, భార్యని ప్రేమించమనేది ఆనాటివారు నేర్చుకోమన్న బాట).**

రాముని హృదయంలో అభిప్రాయం పుట్టక ముందు గ్రహించ గలిగేది సీతమ్మ అయితే, సీత హృదయంలో అభిప్రాయం పుట్టాక, గ్రహించేవాడు రాముడు. ఆయన రాజసుతుడైతే, ఆమె ఉత్తమ రాజకన్య. ఇలా ఆనందగా గడుప సాగారు అయోధ్యలో.

*తయా స రాజర్షిసుతోఽభిరామయా సమేయివా నుత్తమరాజకన్యయా।*
*అతీవ రామ శ్శుశుభేఽతికామయా విభు శ్శ్రియా విష్ణు రివా మరేశ్వరః॥*

రాముని వయస్సు 12. సీత వయస్సు 6. శారీరకానందం కంటె, మానసికాకర్షణం ముఖ్యమని సూచన. వివాహంలో గంధర్వ హోమం అని ఉంటుంది. వధూవరులిద్దరికీ పరస్పరాకర్షణం శాశ్వతంగా కల్గించడం దీని లక్ష్యం. ఈ కాలంలో ఏర్పడే పరస్పర స్నేహ, ప్రేమ, అభిమానాలు శాశ్వతమై, పరస్పర అనురాగాన్ని కల్గిస్తాయనే అభిప్రాయంతోనే ఇలా బాల్యకాలంలో వివాహాలు ఏర్పాటు చేసేవారు ప్రాచీనులు. శారీరక సుఖం అప్రధానం అనురాగభావం ప్రధానమని నాటిమాట అయితే, ఇది నేటి కాలంలో తలక్రిందు చేస్తూ చిత్రాలూ, రచనలూ సాగుతున్నాయి. అలా చిత్రాలని తీయడం, పుస్తకాలని వ్రాయడం వారి తప్పు అవునో కాదో అలా ఉంచి, వాటికి, మనం లోబడకపోవడాన్నినేర్చుకోవడం మంచిది కదా!

**రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే**
**రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః**
**శ్రీమత్పరివారసమేత**
**శ్రీరామచంద్ర పరబ్రహ్మార్పణమస్తు॥**

ఓం

## దీనితోపాటు రామాయణ గాయత్రీ బీజాక్షర శ్లోకాలు

24 బీజాక్షరాలూ ఉన్న ఈ క్రింది శ్లోక పాదాలని, రోజుకి ఒకసారైనా చదివితే, గాయత్రీ మంత్ర మననం చేసినట్లే.

| క్రమ సంఖ్య | గాయత్రీ బీజాక్షరం | పాదము | వివరము |
|---|---|---|---|
| 1. | త :- | తపస్స్వాధ్యాయ నిరతం<br>తపస్వీ వాగ్విదాం వరమ్ । | (బాల 1-1) |
| 2. | స :- | సతేన పరమాస్త్రేణ<br>మానవేవ సమాహతః । | (బాల - 30-6) |
| 3. | వి :- | విశ్వామిత్రో మహాతేజాః<br>భూయస్తేపే మహత్తపః । | (బాల - 63-3) |
| 4. | తు :- | చతురశ్వే రథశ్శ్రీమాన్<br>నిస్త్రింశో ధనురుత్తమమ్ । | (అయోధ్య 14-36) |
| 5. | వ :- | వర్తతే చోత్తమాం వృత్తిం<br>లక్ష్మణోఽస్మిన్ సదానఘ ! । | (అయోధ్య 44-5) |
| 6. | రే :- | ద్వారేణ వైజయంతేన<br>ప్రావిశచ్ఛాంత్ర వాహనః । | (అయోధ్య 71-33) |
| 7. | ణి :- | ఉటజే రామమాసీనం<br>జటామండలధారిణమ్ । | (అయోధ్య 99-25) |
| 8. | య :- | తే వయం వనముత్యుగ్రం<br>ప్రవిష్టాః పితృశాసనాత్ । | (అరణ్య - 12-3) |
| 9. | భ :- | మమ భర్తా మహాతేజాః<br>వయసా పంచవిం శకః । | (అరణ్య - 47-10) |
| 10. | గ :- | తతః పరమ సంతుష్టో<br>హనుమాన్ ప్లవగర్షభః । | (కిష్కింధ - 4-3) |
| 11. | దే :- | నరేంద్ర సూనుర్నర దేవ పుత్రం<br>రామానుజః పూర్వజమిత్యువాచ । | (కిష్కింధ - 31-1) |
| 12. | వ :- | తతో రావణ నీతాయాః<br>సీతాయా శ్శత్రుకర్శనః । | (సుందర - 1-1) |
| 13. | స్య :- | తతస్తస్య నగ స్యాగ్రే<br>హ్యాకాశస్థస్య దన్తినః । | (సుందర - 27-14) |

| | | | |
|---|---|---|---|
| 14. | ధీ :- | నావమాన్యో భవద్భిశ్చ<br>హరిర్ధీర పరాక్రమః । | (సుందర - 46-9) |
| 15. | మ :- | శ్రుత్వా హనుమతో వాక్యం<br>యథావదభి భాషితమ్ । | (యుద్ధ - 1-1) |
| 16. | హి :- | రక్షోగణపరిక్షిప్తో<br>రాజా హ్యేష విభీషణః । | (యుద్ధ - 28-27) |
| 17. | ధి :- | ప్రదర్శనం చ బుద్ధిశ్చ<br>స్మృతిశ్చ ద్విగుణా తయోః । | (యుద్ధ - 50-40) |
| 18. | యో :- | రాక్షసా రాక్షసేంద్రాయ<br>రాక్షసాయ న్యవేదయన్ । | (యుద్ధ - 66-1) |
| 19. | యో :- | విజ్ఞాయ తు మనస్తస్య<br>రాఘవస్య మహాత్మనః । | (యుద్ధ - 81-1) |
| 20. | న :- | మరణానాని వైరాణి<br>నివృత్తం నః ప్రయోజనమ్ । | (యుద్ధ - 112-26) |
| 21. | ప్ర :- | ప్రాప్తరాజ్యస్య రామస్య<br>రాక్షసానాం వధే కృతే । | (ఉత్తర - 1-1) |
| 22. | చో :- | తతః ప్ర చోదయన్సూతః<br>తానశ్వాన్ రుధిర ప్రభాన్ । | (ఉత్తర - 2-28) |
| 23. | ద :- | తత్రైనాం విజనేదేశే<br>విసృజ్య రఘునందన | (ఉత్తర - 45-18) |
| 24. | యా (త్) | బ్రాహ్మణస్య తు ధర్మేణ<br>త్వయా జీవాపిత స్సుతః | (ఉత్తర - 76-27) |

**శ్రీమద్రామాయణపు చివరి శ్లోకం :**

తత స్సమాగతాన్ సర్వాన్
స్థాప్య లోకగురు ర్దివి ।
జగామ త్రిదశై స్సార్థం
సదా హృష్టైర్దివం మహత్ । (ఉత్తర - 110-28)

**శ్రీమద్రామాయణ ఫల శ్రుతి చివరి శ్లోకం :**

ఏవమేతత్పురావృత్త
మాఖ్యానం భద్రమస్తు వః ।
ప్రవ్యాహరత విస్రబ్ధం
బలం విష్ణోః ప్రవర్ధతామ్ । (ఉత్తర 111-26)

# అయోధ్య కాండ

శ్రీమద

వాల్మీకిరామాయణపారాయణమ్

# అయోధ్యాకాండము

( కథ మఱియు అంతరార్థముతో )


: గ్రంథకర్త :

'రామాయణ ప్రవచన సుధాకర'

'రామాయణ సుధానిధి'

'భాషాప్రవీణ'

డా॥ మైలవరపు శ్రీనివాసరావు

ఎం.ఏ., (తెలుగు) ఎం.ఏ., (సంస్కృతము) పి. హెచ్.డి.,

# విషయసూచిక


అయోధ్యా మందిరం
అభివాదనలూ - అభినందనలూ
గ్రంథకర్తృ దంపతుల చిత్రం
గ్రంథకర్త గురించి
చిత్రకూట సదనం
గ్రంథ ముద్రాపయితల చిత్రం

1. శ్రీమద్రామాయణ పరిచయం 1
2. ఇంతకుముందు, ఎంతవఱకూ కథ అయ్యింది? 4

అయోధ్యాకాండ కథా ప్రారంభము

మామయ్య వెంట వెళ్లిన పిల్లలు 6
వెళ్లారా? తీసికొని వెళ్లాడా? 9
ఏమిటి ఆ ఆలోచన? 11
దశరథ-కేకయ రాజులకి ఉన్న దేశభక్తి 16
రాముడే నలుగురిలో ఇష్టుడా? ఎందుచేత 18
రాముడంటే ఎవరు? ఎందఱు? 19
మానవసేవయే మాధవసేవ 21
రాముడు ఎందుకు పుట్టాడు? 22
నాన్నకొడుకు, కొడుకు తండ్రికి ఎలా ఉన్నాడు? 26
దశరథుని చింత 27
సమావేశ తీర్మానము 28
త్రేతాయుగంలో ఉన్న నిజమైన ప్రజాస్వామ్యం 30
యువరాజుని ఎన్నుకోవలసిన అధికారులు ఎవరు? 31
సభ-సమితి-బ్రాహ్మణులు-ప్రజలు-స్త్రీలు-పురోహితులు-భూదేవి-సేనాధిపతులు-ఏ విభాగానికీ చెందనివారూ ఏమన్నారు? 31-38

సుమంత్రుని పిలుపుతో రాముని రాక 39
ఇలా ఎందుకు చెప్పుకోవాలి? 40
సమావేశంలో దశరథుని అంగీకారం 41
మళ్లీ తీసికొని రా! 42
భరతుడు రాకుండా రాజువి కావాలి! 42
తండ్రీకొడుకులలో ఎవరు ఎక్కువ అధర్మపరులు? 44
లక్ష్మణా! రాజ్యం నీ కోసమే! 49
మంథరా దుర్బోధ (పై కథ) 52
లోకథ 55
కైక చాల గొప్పది! 57
కైకాదశరథ సంభాషణం 60
చెప్పిందొకటి – అడిగింది మఱొకటి 61
దశరథ విలాపం 63
అంతఃపురం వెలుపల ఆనందం 68
సుమంత్రుని జన్మ ధన్యం 69
తల్లీకొడుకుల వాగ్వివాదం – మానవ దైవశక్తుల పోరాటం 72
రాముని దృష్టిలో కైకమ్మ 75
దేవుడు ఎక్కడ ఉంటాడు? 76
'దైవజ్ఞురాలు' కౌసల్య 78
తీసికొని పోకపోతే ప్రాణాలు విడుస్తాను! 79
పురుషుని వేషంలో స్త్రీవి....అంటే? 81
లక్ష్మణా! ఇక్కడే ఉండు!! 83
తాపసులేమిటి? మారణాయుధాలేమిటి? వెళ్లబోతూ ఈ దానాలేమిటి? 84
సీతాలక్ష్మణులనే ఎందుకు రాముడు తీసికొనిపోదలిచాడు? 86
రామునిది ఏ కోవకు చెందిన దానం? 89
ఒక్క రోజైనా ఆగు! 90
కైకా! ఆ తల్లి కూతురివి కదా! 91

| | |
|---|---|
| కైకకు బుద్ధి చెప్పిన సిద్ధార్థ మంత్రి | 92 |
| అయోధ్యయే దండక, దండకయే అయోధ్య | 93 |
| స్త్రీల లక్షణాలు - భర్త విలువ | 94 |
| రాబోయే కథ తెలి(సి)పిన సుమిత్ర | 95 |
| రామం దశరథం విద్ధి....౯ అర్థాల శ్లోకం | 96 |
| దుఃఖంతో తెల్లవారని రాత్రి | 100 |
| రాబోయే కథను చెప్పిన సుమిత్ర | 101 |
| విశేషాంశాలు | 103 |
| ఇవ్వలేనికాలంలో ఇయ్యగలిగిన కానుక | 104 |
| విశేషాంశాలు | 105 |
| మర్కటకిశోరమా? మార్జాలకిశోరమా? | 109 |
| భరద్వాజ దర్శనం | 111 |
| విశేషాంశాలు | 112 |
| వాల్మీకి దర్శనం | 113 |
| కైకమ్మ లేమ. భయం విడిచి అడగండి! | 114 |
| నువ్వు తప్ప ఎవ్వరూ ప్రాణంతో లేరు! | 116 |
| 'అరాజకం' అంటే— | 119 |
| 'సహగమనం' అనే ఆచారం ఎప్పటిది? | 120 |
| భరతునికి దుస్స్వప్నం | 121 |
| ఇదంతా నీకోసమే చేశాను! | 125 |
| భరత నిర్ణయం | 127 |
| ఎంత గొప్పవాడివి! | 128 |
| స్త్రీ అయితే చాలు పూజ్యురాలే! | 130 |
| అవ్యక్తం-వ్యక్తం-లోఅర్థం | 132 |
| భరతుని ఆజ్ఞలూ-అంతరార్థాలూ | 133 |
| ఛీ! వశిష్ఠుడా! | 134 |
| కైకమ్మ చేసిన మంచిపని ఒక్కటే | 136 |
| శృంగిబేరపురపు కథా రహస్యాలూ | 137 |
| భరద్వాజాశ్రమ విశేషాలూ-రహస్యాలూ | 140 |

ముగ్గురు రాణుల పరిచయం 144
భగవద్దర్శనం కావాలంటే—
రామ-లక్ష్మణ దృష్టి భేదం 145
ఇక్కడి రహస్యాలు 146
రామభరత సమాగమం 149
సమాధానం తెలిసిన ప్రశ్నలు 151
అతిముఖ్య పరిపాలనా సూచనలు
ఉత్తర ప్రత్యుత్తరాలు
నాస్తిక సిద్ధాంతం-ఖండనం 160
రాముని నిశ్చయం! 166
పాదుకలు ఎలా ఉంటాయి? ఎక్కడివి? 167
అత్రి-అనసూయల దర్శనం లో రహస్యం

# అయోధ్యా మందిరం

అపి స్వర్ణమయీ లంకా న మే లక్ష్మణ రోచతే
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ ॥

లంకా నగరాన్ని రాముడు జయించాడు. క్షత్రియధర్మం ప్రకారం ఎవరు ఏ రాజ్యాన్ని జయిస్తే రాజ్యం అతనిదౌతుంది. ఆ నియమం ప్రకారం లంకానగరానికి రాముడే రాజు కావాలి. కాని, రాముడు యుద్ధానికి ముందే ఈ లంకని విభీషణునికి పట్టం కట్టేసాడు.

రావణవధ అయ్యాక లంకని పరిశీలనగా చూచాడు రాముడు. ఎక్కడ చూసినా బంగారపు విగ్రహాలు, బంగారపు రేకుతాపడాలున్న గోడలు, బంగారపురజను పొదిగిన నేలలున్న ఇళ్లు— ఇలా బంగారపుమయంగా ఉంది లంక. ఇంత ఐశ్వర్యం ఉన్న లంకని చూచి రాముడు తమ్మునితో ఇలా అన్నాడు. 'లక్ష్మణా! ఇంతటి బంగారపుముద్దగా లంకానగరం ఉన్నా నా మనసులోని ఏ కోశంలో కూడా నా దృష్టి లంకమీదికి పోవడంలేదు. జన్మనిచ్చిన తల్లీ - జన్మించిన ప్రదేశమూ అనేవి స్వర్గంకంటె గొప్పవి సుమా!' అని. ఈ శ్లోకం వాల్మీకి శ్రీమద్రామాయణంలో లేదుగాని, ఉండదగినంత పట్టైన శ్లోకం.

ఇది చాల నిజం. శ్రీమద్రామాయణంలో వాల్మీకి అయోధ్యనీ, అలాగే లంకనీ కూడా వర్ణించాడు. అయితే వర్ణనలో ఓ ప్రత్యేకత ఉంది. లంకని ఎక్కడ వర్ణించినా మేడలూ, మిద్దెలూ, జలాశయాలూ, అక్కడి ఐశ్వర్యం, భోగలాలస విధానమూ, ఆయుధాలూ— వంటి వానినే వర్ణించాడు. అయోధ్యని ఎక్కడ వర్ణించవలసి వచ్చినా మేడలు మిద్దెలుకాక అందులో ఉండే ధార్మికబుద్ధి ఉన్న మహాపురుషులనీ, జలాశయాల్నికాక వాటిలో స్నానం చేసి దీక్షనిపట్టిన మహర్షుల యాగవిధానాన్నీ, ఐశ్వర్యం - భోగలాలసతని కాక దానధర్మ విశేషాలనీ-అంటే-ఇంకొకణ్ణి కూడ సంతోషపడేలా చేసే విధానాన్నీ, ఆయుధాలు కాక అయోధ్యజనులచేతులలో నిత్యమూ కన్పడే దర్భలూ-భక్ష్యాలూ-పూజాద్రవ్యాలూ— మొదలైన వాటినీ వర్ణిం

చాడు. రాక్షసుల అఱపులు లంకలో ఉంటే, అయోధ్యలో దేవాలయ ఘంటికాధ్వానాలు ఉన్నాయని వర్ణించాడు.

దీన్నిబట్టి తెలిసేదేమంటే 'ఇల్లు-ఇంటిలోనివారు' అనే రెంటిలో ఇంటి లోనివారిని గూర్చి చెప్పుకోదగిన విశేషాలు ఏమీ లేనప్పుడు ఇంటి గొప్ప దనాన్నే వర్ణించక తప్పదు-అని. లంకలోని రాక్షసులలో వర్ణించదగిన ఏఒక్క విశేషమూ లేనికారణంగా వారిఇళ్లని వర్ణించిన వాల్మీకి,అయోధ్యలో ఇళ్లు ఉన్నా ఇంటిలోని వారి విధానాలని గొప్పవిగా వర్ణించాడు.

'ఇంటిని చూచి ఇల్లాలిని చూడు' అనేది ఒక నానుడి. ఇంటిని ఇంత పరిశుభ్రంగా ఉంచిన ఆ ఇల్లాలు మరెంత పరిశుభ్రంగా ఉంటుందో చూడా లనేది దీనిభావం కానేకాదు. ఇల్లు అనేది బాహ్యపద్ధతికీ, ఇల్లాలు అనేది అంతరపద్ధతికీ సంకేతాలు. 'ఇల్లు పరిశుభ్రంగా ఉన్నా ఇల్లాలుకూడా అలా ఉందో లేదో చూడు' అని అర్థం చేసికోవాలి. 'ఇల్లు' అంటే శరీరం. 'ఇంటి లోని పోరు ఇంతింత కాదయా!' అని వేమన అన్నాడు. శరీరంలో ఉన్న కామ-క్రోధ-లోభ-మోహ-మద-మాత్సర్యాలనే శత్రువుల పోరు ఇంత-ఇంత కాదు! ఎంతెంతగానో ఉంటుందని దాని భావం గదా! కాబట్టి వ్యక్తి, పైకి పరిశుభ్రంగా ఉన్నా, లోపలి గుణాలతో పరిశుభ్రంగా ఉన్నాడా? గమ నించు - అని అర్థం.

లోకంలో ఎందఱో ఇంటివిషయంలోనే పరిశుభ్రంగా ఉంటారు. అంటే బాహ్యవిషయంగా - స్నానం, అలంకారంవంటి వాటిలో - చాల పరి శుభ్రంగా ఉంటారు. ఇక ఇల్లు+అలి విషయంలో - అంటే లోపల ఉండా ల్సిన గుణాల విషయంలో (దానం-ధర్మం-ఋజుప్రవర్తనం వంటివి) పరి శుభ్రంగా ఏ కొందఱో తప్ప ఉండనే ఉండరు. ఇంటితోపాటు ఇల్లాలూ పరిశుభ్రంగా ఉంటే ఎంత గొప్ప నిజంగా!

ఇంటిని తీర్చిదిద్దేది 'ఇల్లాలు' కాబట్టి వ్యక్తికి నిజమైన బాహ్యసౌంద ర్యానికి వన్నెతెచ్చేదికూడా, వ్యక్తిలోపల ఉన్న సద్గుణాలే అని దీని అర్థం.

## ఇంతకీ ఈ కాండకి ఈ పేరే ఎందుకు పెట్టారు?

ఈ చర్చ అంతా ఎందుకంటే శ్రీమద్రామాయణంలో ఏ కాండకి ఆ కాండకే మహాప్రాధాన్యం లోపల స్పష్టంగా ఉంది. అయినా అయోధ్యలో మఱో విశేషం కూడ ఉంది.

లౌకికంగా చూస్తే— ప్రజల రాజ్యానికి రాజధానిస్థలం అయోధ్య.

వైదికంగా చూస్తే—ఇక్కడ ఉన్నన్ని దేవాలయాలుగాని, ఇక్కడ జరిగినన్ని యజ్ఞయాగాదులుగాని, దేశంలోనే ఎక్కడా మఱి జరుగ లేదు.

కథాపరంగా చూస్తే—దశరథుణ్ణి పరలోకానికీ, రాముణ్ణి దేశాంతరానికీ పంపించిన కాండ యిదే. రావణవధకి బీజంపడ్డ కాండ కూడా ఇదే.

అ-యోధ్య దీని పేరు. 'యోద్ధుం శక్యా యోధ్యా'. న యోధ్యా 'అయోధ్యా' అని ఈ సమాసానికి విగ్రహవాక్యం. గెలవడానికి ఏమాత్రమూ వీలుకానిది అని అర్థం. అయోధ్య అనే నగరాన్ని ఎవరూ జయించలేరనేది పై అర్థం కాగా, లోఅర్థం మఱింత రమ్యంగా ఉంటుంది.

బాలకాండలో దేవరాక్షస యుద్ధం ఉంది. అయోధ్యాకాండ మీదిదైన ఆరణ్యకాండలో, రామునికి రాక్షసులతో యుద్ధం జరుగుతుంది. కిష్కింధలో వాలిసుగ్రీవుల యుద్ధం ఉందని తెలియనిదెవరికి? సుందరకాండలో ఆంజ నేయునికి రాక్షసులతో యుద్ధాలే యుద్ధాలు! ఇక యుద్ధకాండని గూర్చి చెప్పే దేముంది?— ఇలా అయోధ్యాకాండ తప్ప అన్ని కాండలలోనూ యుద్ధం ఉంటే, యుద్ధంలేని కాండ అయోధ్య ఒక్కటే.

బాహ్యయుద్ధం లేకపోయినా, అంటే కత్తులూ కటారులతో ఒకరితో ఒకరు యుద్ధాన్ని చేసికోక పోయినా ప్రతిపాత్రా తనలో తాను అనేక ఆలోచనలతో యుద్ధాన్ని చేస్తూనే ఉన్న కాండ ఇదే. 'పట్టాభిషేకం ఏ కార్య

ఱంగా ఆపినట్లు ప్రకటించాలి?' అని దశరథుడు, 'నాకిచ్చిన వరాన్ని తీర్చ మంటే అంత బాధపడాలా?' అని కైకమ్మ, 'నన్ను అరణ్యానికి పోనియ్య రేమిటి?' అని రాముడు, 'ఎందుకు అరణ్యానికి పోవాలి?'అనిలక్ష్మణుడు— ఇలా అనేకాలోచనలతో అందఱూ అంతర్మథనం పడే హృదయం వంటిది అయోధ్యాకాండం.

మఱి ఇంకో రహస్యమూ ఉంది. అయోధ్యని ఎవరూ గెలువలేరనికదా సిద్ధాంతం! రాముణ్ణి వెళ్లనీయకుండా ఆపుచేయాలనుకున్న దశరథుడు తన ప్రయత్నంలో ఓడిపోయాడు. అలాగే లక్ష్మణుడు. సిద్ధార్థుడు. వశిష్ఠుడు మొద లైన వారెందఱో రాముణ్ణి అయోధ్యలో ఉంచాలని వాదించి వాదించి ఓడి పోనే పోయారు. సీతని తీసికొనిపోనని పల్కిన రాముడు సీతని తీసికొని వెళ్ల వలసి తానూ ఓడాడు. రాముణ్ణి వనాలకి పంపడంతోపాటు భరతునికి పట్టాభి షేకాన్ని అడిగిన కైకమ్మ కూడా భరతునికి పట్టాభిషేకం చేయించలేక ఓడి పోయింది. చిత్రకూటంలో ఉన్న రాముణ్ణి పిలిచికొని వచ్చి రాజ్యం ఏలింప చేయాలని భావించిన అయోధ్యాప్రజలూ కైకమ్మతోపాటుకౌసల్య-సుమిత్రలు కూడా రాముణ్ణి అయోధ్యకు రప్పించలేక ఓడిపోయారు. రాముడు రాకపోతే ప్రాయోపవేశ దీక్ష చేస్తానని ప్రత్యక్షచర్యకు దిగి నేలపై కూర్చున్న భర తుడు కూడా రాముని వాక్కులకి ఓడి ప్రాయోపవేశ దీక్షని విరమించి ఓడి పోయాడు. నాస్తికవాదాన్ని ఇష్టంగానో మఱో కారణంగానో చేసిన జాబాలి మహర్షి కూడా రామునిముందు ఓడిపోయాడు. రామునివెంట వెళ్లి ఇక రామునితోనే ఉండిపోవాలని భావించిన సుమంత్రుడూ ఓడిపోయాడు. 14 సంవత్సరాలు తనవద్దే ఉండి వెళ్లవలసిందని పల్కిన గుహుడూ, ఇక్కడే ఉండవలసిందని ప్రార్థించిన భరద్వాజుడూ—ఇలా అంతా అంతా ఆ అయోధ్యకాండలో గెలువలేక ఓడిపోయినవాళ్లే.

అంతా ఓడినవాళ్లే అయితే గెలిచినవారే లేరా? అనుకోనక్కఱ లేదు 'అరణ్యాలకి వెళ్లవలసిందే' అని నిశ్చయించుకున్న రాముడు గెలిచాడు. 'నీకంటె ముందు నేను అరణ్యానికి వెడతాను సుమా!' అని పల్కిన సీతమ్మ గెలిచింది. 'ఇక్కడ ఆశ్రమం కట్టుకొని ఉండు'. అని రామునితో పలికి సీతా రామలక్ష్మణులని క్రొత్తగా కట్టుకొన్న ఆశ్రమంలో కొంతకాలంపాటు ఉంచ్చి

వాల్మీకి కొంతగా గెలిచాడు. అందుచేత అయోధ్యాకాండ సామాన్యమైనది కానే కాదు. భగవంతుని గెలుపుని తెలిపేదీ, ఇతరుల ఓటమిని వివరించేదీను. కాబట్టి శ్రద్ధగా దయచేసి చదవండి.

ఇక స్వగతానికి వస్తే,

అవి నేను క్రొత్తపేట ఆంజనేయస్వామి దేవస్థానం - గుంటూరులో దీక్షపట్టి దాదాపు సంవత్సరకాలం శ్రీమద్రామాయణాన్ని ఉపన్యాసరూపంగా అందిస్తున్న రోజులు. సాయంత్రమయ్యేసరికి కచ్చితమైనసమయానికి కట్టుబడి ప్రారంభమయ్యే రామకథని గ్రోలడానికి ఎందఱో ఎందఱెందఱో అలావచ్చి ముందుగానే కూర్చునేవారు. ఆ శ్రోతలలో ఆశీర్వదించే, అభినందించే,ఆనందించే, అనుగ్రహించే అన్ని వయసులవారూ, విద్యావృద్ధులూ, ఒక్కోసారి పీఠాధిపతులూ కూడా ఉండేవారు.

బాలకాండం కాగానే సీతాకల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా చేయించారు భక్తులు. అయోధ్యాకాండం కాగానే పాదుకాపట్టాభిషేకోత్సవాన్ని పెద్ద ఊరేగింపు జరిపి సప్తగంగా జలాలనీ తెచ్చి చేయించారు. ఆనాడు జరిగిన అన్నసంతర్పణం మఱువలేనిది. మధ్యాహ్నం ప్రారంభించిన వడ్డన రాత్రి వఱకూ విశ్రాంతిలేక కొనసాగుతూనే ఉంది. ఇలా చేయాలనే వాక్కు నాది. చేసే ఉత్సాహమూ, నిర్వహణమూ భక్తులది.

ఇక చివరిలో శ్రీరామచంద్రునిమహాపట్టాభిషేకోత్సవానికి చెప్పలేనంత వైభవంగా ఉత్సవం సాగింది. ఉత్సవం సరిగా నవంబరు నెలలో సాగితే పట్టాభిషేకం అయిన వెంటనే, శ్రీరామచంద్రుని అనుగ్రహం లభించిందన డానికి సాక్ష్యంగా, చక్కని చిరువానజల్లు రెండే రెండుక్షణాలపాటు పడడం అక్కడి వారందఱికీ తెలుసు జీవితంలో మఱపురాని ఘట్టం అది.

ఆ ఉపన్యాసాల శ్రోతలైనభక్తజనమంతా కలిసినా 'సుందరకాండ'ని (కథ+విశేషాంశాలు నిత్యపారాయణానికి వీలుగా ఉన్న గ్రంథం) ప్రచురింప చేశారు.

ఆ సుందరకాండ గ్రంథానికి ప్రథమ ముద్రణలో ఒందఱెందఱో చూపి విరాళాన్ని ఈయడమేకాక, ఆ సుందరకాండ ప్రతులన్నీ 4 నెలలలోనే

చెల్లిపోగా, తామే సంపూర్ణ వ్యయాన్ని భరించి రెండవ ముద్రణని కూడా చేయించిన ఉదారులు, సహృదయులు శ్రీయుతులు చెన్నంశెట్టి నవరత్న కుమారి వేంకటేశ్వర్లు (వేంకటేశ్వరరావు) దంపతులు. ఆలయంలో జరిగిన సీతాకళ్యాణానికి ముత్యాల తలంబ్రాల నిమిత్తం ముత్యాలని (108) ఇచ్చిన ప్రసిద్ధ దాతృ దంపతులు.

అలాగే ఉపన్యాస శ్రోతలలో ఒకరైన శ్రీయుతులు కొరళ్ళ సరోజినీ పూర్ణచంద్రరావు (పున్నారావు) దంపతులు నా 'బాలకాండ'ని (కథ + అంతరర్థం) ముద్రింపించారు. అది ఇప్పుడు 2వ ముద్రణ అయి వచ్చింది.

ఈ ఆంజనేయుని అనుగ్రహం వలననే సీతాకళ్యాణం రోజున నా వివాహమంత్రాల వ్యాఖ్య నచ్చిన శ్రీయుతులు అన్నా వసుమతీ కృష్ణమూర్తి అంజనీదేవప్రసాదరావు దంపతిద్వయమూ నా మాంగల్యతంతునానేన'ని (పెళ్ళిమంత్రాలకు సరైన అర్థమూ + వ్యాఖ్యా) ముద్రింపించారు. ఈ దంపతిద్వయమూ స్థానిక అన్నా శ్రీనివాసరావు కల్యాణమండప అధినేతలు కావడం ఔచిత్యవంతమైన విశేషం కదా! దీని రెండవ ముద్రణ వ్యయాన్ని భరించిన ఉదారులు డా॥ పుయ్యూరు లక్ష్మీనరసింహారావు (విద్యాన్ కళాశాల డైరెక్టరు).

ఇలా నేను శ్రీమద్రామాయణ ఉపన్యాసకర్తగా లోకానికి పరిచయం కావడానికి సంపూర్ణానుగ్రహాన్ని ఇచ్చింది ఈ క్రొత్తపేట ఆంజనేయుడూ ప్రోత్సహించింది ఇచటి భక్తజనసందోహమూను.

ఈ స్ఫూర్తితోనే మితభాషులు శ్రీయుతులు పచ్చిపులుసు లలితా హరి వేంకటేశ్వరరావు దంపతులు 'లలితా సహస్రపూజా-నామ మంత్రార్థ రణం' అనే గ్రంథాన్ని ప్రచురింపజేశారు. పుస్తకావిష్కరణం రోజున ఒక ంటసేపు విజయవాడ కనకదుర్గమ్మ గర్భాలయంలో లలితాపారాయణ సామూహికంగా జరపడం విశేషాలకే ఒక విశేషం. ఇదీ 2వ ముద్రణ అయి వచ్చింది. దీని రెండవ ముద్రణ వ్యయాన్ని భరించిన ఉదారులు ప్రముఖ పారిశ్రామికవేత్తా — ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులూ శ్రీయుతులు కోనేరు చిట్టెమ్మ లక్ష్మయ్య దంపతులు.

నా పుస్తకాలని తెప్పించుకుని చదివి తమకు కలిగిన ఆనందంతో ఉత్తరకాండని ముద్రించదలచిన ప్రముఖులు Lt. Col. కందికుప్ప రమణ మూర్తిగారు-బొంబాయి.

'భాగవతమూ-అంతరార్థ సౌందర్యమూ' అనే గ్రంథాన్ని ప్రచురించ దలిచినవారు (ప్రస్తుతం అచ్చులో) శ్రీయుతులు గుండా సత్యనారాయణగారు. (పద్మాలయా పాలిషింగ్ స్టోన్ ఇండస్ట్రీస్ అధినేతలు, బేతంచెర్ల).

ఎందరెందరో మహనీయులని ఇలా నాకు సహకరింపజేస్తూన్న క్రొత్తపేట ఆంజనేయస్వామికి నమస్కారాలని ఘటిస్తూ

సెలవు

గుంటూరు,
22-6-94.

మైలవరపు శ్రీనివాసరావు
గ్రంథకర్త.

శ్రీ శివాయనమః

# శ్రీ మ ద్రా మా య ణా య న మ్

## అ యో ధ్యా కాం డ ము

**రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే!**
**రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః ॥**

అది అయోధ్యానగరం. అక్కడ ఒకే శ్రీరాముణ్ణి రామా! రామభద్రా! రామచంద్రా! వేధః! రఘునాథా! నాథా! సీతాపతీ! అని ఇన్ని పేర్లతో పిలుస్తున్నారు.

అయితే, పిలిచే పిలుపునిబట్టి పిలిచేది ఎవరెవరో, అక్కడి వారందరికీ తెలుస్తోంది.

'రామా!' అని పిలువగల అదృష్టం, కన్నవాళ్లైన దశరథ, కౌసల్య, సుమిత్ర, కైకమ్మలకే ఉంది. అలా పిలుపు వినబడితే ఆ కంఠస్వరం ఈ నలుగురిలో ఎవరో ఒకరిదన్నమాట.

'రామభద్రా!' అనే పిలుపులో (భద్రశ్చాసౌ రామశ్చ) లోకానికి క్షేమాన్ని కల్గించేవాడా! అనే అర్థం ఇమిడి ఉండటంబట్టి, అలా పిలిచేవారు దశరథుని మంత్రులు తప్ప వేరెవరూ కారు. ధృష్టి - జయంత - విజయ — అశోక - సిద్ధార్థ — అర్థసాధక — మంత్రపాల — సుమంత్రులు ఎనిమిది మందీ ఆయన మంత్రులు.

అయితే, సుమంత్రుడు మాత్రం అంతఃపురంలోనికి కూడా వెళ్లగల అధికారం ఉన్నవాడు. దశరథునికి అంతరంగికుడున్నూ. ఆయన ఇదే పేరుతో పిలవాలనే నియమమేదీ లేనివాడు.

'రామచంద్రా!' అని పిలిచే అదృష్టం అయోధ్యా ప్రజలది. ఆకాశంలో చంద్రుడు ఎంతో ఆకర్షణీయుడుగా ఉండి, ఎప్పుడూ ఎలా మనచేత చూడబడుతూ

ఉంటాడో, అలా 16 కళల చంద్రునిలా 16 గుణాలున్న రాముడే చంద్రునిలా చూడబడుతూ రామచంద్రుడయ్యాడు అయోధ్యా ప్రజలకి.

"యశ్చ రామం న పశ్యేత్తు
యం చ రామో న పశ్యతి ।
నిందితస్స జనో లోకే
స్వాత్మాప్యేనం విగర్హతే ॥"

రాముణ్ణి ఏ రోజున చూడలేదో, రాముడు ఎవరిని ఏ రోజున చూడలేదో, ఆ రోజున రాముణ్ణి చూడనివాడూ, రామునిచేత చూడబడనివాడూ తమని తాము నిందించుకొనేవాళ్లట.

వశిష్ఠ — వామదేవ — జాబాలి — కశ్యప — సుయజ్ఞులంతా హే వేధః! (ఓ పరబ్రహ్మ స్వరూపుడా!) అని పిలిచేవారు.

రఘువంశ ప్రతిష్ఠని ఎఱుగున్న వృద్ధులంతా, రాముడే రఘువంశాన్ని ఉద్ధరించగలడని, రఘునాథా! అని పిలిచేవారు. అది ఒకవిధంగా ఆశీర్వచనంతో కూడిన ఆకాంక్ష.

దశరథ— కౌసల్యా— సుమిత్ర— కైకమ్మలు రామా! అని పిలిస్తే,
ఎందఱో మంత్రులు 'రామభద్రా!' అని సంబోధిస్తే,
అయోధ్యా ప్రజ లెందఱో 'రామచంద్రా!' అని సంభావిస్తే,
ఎందఱో మహర్షులు 'వేధః!' అని సంస్తుతిస్తే,
వయోవృద్ధు లెందఱో 'రఘునాథా!' అని సమారాధిస్తే,

ఒకేపేరుతో, ఆ ఒక్కడినే సేవించుకోగల అదృష్టం ఉన్న ఆమె 'ఒక్కతె' మాత్రమే.

ఆ 'ఒక్కతె' సీతమ్మ. ఆ ఒక్క సంబోధన 'నాథా!' అని.

అందుకే, ఆ రాముడు శ్రీ (సీతతో కలిసి) రాముడు.

ఇంతటి రాముడూ, రామభద్రుడూ, రామచంద్రుడూ.... ఇలాటివాడు, అత్త గారింటికి మిథిలకి వెడితే 'సీతాపతీ!' (సీతమ్మ మొగుడా!) అని పిలువబడతాడట.

అలాటి రామునికి నమస్కారమని శ్లోకభావం. ఎక్కడిదో, ఎవరు వ్రాసినదో తెలియదుగాని, శ్రీ మద్రామాయణ సారమంతా అక్షర రూపంలో ఉంచుకొన్న శ్లోకం.

అలాటి రాముణ్ణి, నిరంతరం ధ్యానించేవాడు వాల్మీకి మహర్షి. గ్రంథ ప్రారంభంలో రాముణ్ణీ, రాముణ్ణి హృదయంలో నిల్పుకొన్న వాల్మీకి మహర్షినీ స్మరించడం కర్తవ్యం.

**కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్ !**

**ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలమ్ ॥**

'కవిత్వం' అనే చెట్టుకొమ్మని ఎక్కి, 'రామరామా !' అని మధుర మధురంగా పల్కుతూండే 'వాల్మీకి' అనే కోకిలకి నమస్కారం - అని శ్లోకభావం.

వాల్మీకి కీ — కోకిలకీ పోలిక ఈ శ్లోకంలో కన్పడుతుంది. 'రామ రామా !' అనే అక్షరాలు మధు— ర— అక్షరాలట. మధు= తేనెని, ర= పిండితెచ్చే, అక్షరా లని భావం. అందుకే 'ఎంత మధురం రామనామం !' అనే కీర్తన లోకానికి వచ్చింది. పక్షులలో ఇష్టంగా తేనెని త్రాగే పక్షి 'కోకిల' మాత్రమే నట. వాల్మీకితో కోకిలని పోల్చడంలోని ఔచిత్యం చూద్దాం.

కోకిలకి 'కూ, కూ' అనే ఒకే ధ్వని వచ్చినట్లు, వాల్మీకికీ రామరామా ! అనే ధ్వనే వచ్చు.

వేసవిలో కూడ కోకిలకూత ఆనందాన్ని కల్గించినట్లు, సంసారబాధలనే వేసవిలో ఉన్నవానికూడా ఈ రామకథ, తాపాన్ని తీరుస్తుంది.

ఎప్పుడూ అదే పనిగా కూ, కూ అని కోకిల కూసినా, దానికి విసుగురానట్లూ, మనకి చిరాకూ కల్గనట్లు, రామనామాన్ని ఎంతసేపు జపించినా మనసు ఉల్లాసంతో తేలిపోయి శరీరానికి ఒక 'అద్భుతశక్తి' వస్తుంది తప్ప, అలసట రాదు.

పక్షులు, తిండికోసం, భయం తెలుపుతూనూ, అఱచినట్లు కాక, నిస్స్వార్థంగా కోకిల అఱచినట్లుగా, వాల్మీకి కూడా తన జీవిక కోసం కాకుండా నిస్స్వార్థంగా రామ జపం చేస్తాడు.

కాకి గూటిలోనే గ్రుడ్డు రూపంలో చాలకాలం ఉండి, వసంతకాలం వచ్చాక పక్షిరూపం ధరించి, అప్పుడు కూడా కాకి పోలికతో గుర్తుపట్ట వీలులేనట్లు ఉండి, గొంతు విప్పాక 'కోకిల'గా తెలిసి, కాకుల నుండి వేఱుచేయబడినట్లు, చాలకాలం కిరాత ధర్మంతో త్రోవలు కొడుతూ (కాకిలా) జీవించి, సప్తమహర్షుల రాకతో (వసంతకాలం) జీవితం మారి (మంత్రోపదేశం పొంది) రామజపం చేసి 'వాల్మీకి' అయ్యాడు ఒకప్పటి ఋషిడు. (కిరాత ధర్మంతోజీవించినప్పటి వాల్మీకి అసలుపేరు).

ఆ మహర్షి వ్రాసిన శ్రీ మద్రామాయణాన్ని గూర్చి (అయనమ్) తెలిసికోవ దమే 'శ్రీమద్రామాయణాయనమ్' అంటే. అందులో 'బాలకాండ వ్యాఖ్య' విశేషాలతో పూర్తిఅయింది. (పుస్తకంగా వెలువడింది కూడ) ఇక 'అయోధ్యాకాండ' విశేషాలని చూద్దాం.

## ఇంతకు ముందు, ఎంతవరకూ కథ అయ్యింది ?

శ్రీమద్రామాయణాన్ని ప్రారంభం నుండీ చదివే వారికి ఈ ఇబ్బంది రాదు గాని, ఈ కాండ మాత్రమే చదివే వారికీ, ఇంతకు ముందు ఒక కాండ ఉందని తెలియని వారికీ ఈ ఇబ్బంది తప్పదు. అందుకే ఈ సంక్షిప్త వివరణం.

శ్రీ మహావిష్ణువు అనుగ్రహంతో 'వాల్మీకి మహర్షి'కి కవిత్వం వచ్చింది. ఆ కవిత్వాన్ని, రామకథని వ్రాయడానికిగా ఉపయోగించమని 'బ్రహ్మ' స్వయంగా చెప్పాడు. రామాయణ కథని, (వాల్మీకి వ్రాయవలసిన రామకథా వస్తువుని) నారదుడు చెప్పివెళ్లాడు. సరస్వతి వాల్మీకి హృదయంలో ఉండి కవిత్వాన్ని పలికించి వెళ్లింది.

ప్రతి వేయి శ్లోకాలకీ ఒకొక్క బీజాక్షరం చొప్పున 24 వేల శ్లోకాలలో శ్రీమద్రామాయణం వెలువడాలని గాయత్రీమాత నిర్ణయించి ప్రతి వేయి శ్లోకాలకి ఒకసారి తన బీజాక్షరాన్ని వాల్మీకికి జ్ఞప్తికి తెచ్చింది.

వ్రాయబడిన శ్రీమద్రామాయణం ఆశ్రమంలోని మహర్షుల వద్దా, దూరప్రాంతంలో ఉన్న ఋషుల వద్దా, సాక్షాత్తూ కథానాయకుడైన రామునివద్దా, వినిపింపబడింది. స్వయంగా రాముడే విని, ఆనందపరవశుడయ్యాడు.

తన కథని, తానే విని, బాగున్నదని రాముడన్నాడనే అపవాదు తనకి వస్తుందనీ, అది సరికాదనీ భావించిన రాముడు శ్రీమద్రామాయణ గాథని తన రాజధాని 'అయోధ్య'లో పాడమని ఆహ్వానించాడు వాల్మీకిని.

పాడేవాళ్లు : రాముని పిల్లలు లవకుశులు.

పాడబడేది : రామ కథ.

వినేది : శ్రీమద్రామాయణ కథానాయకుడు, రామునితో పాటు అతని భక్తులు.

పాడబడే చోటు : రాముడు పుట్టిన అయోధ్య

వ్రాసినది : రాముడే హృదయంగా కల వాల్మీకి మహర్షి.

ఆశీర్వదిస్తున్నది : రామపరబ్రహ్మాన్ని ఆరాధించే మహర్షులు.

వేదిక : రాముడు అనునిత్యం తిరిగే రతనాల మందిరం.

అలా పాడిన పాట, దశరథునికి పిల్లలు కల్గడం — ఆ పిల్లలకి వివాహాలై అయోధ్యకి కోడళ్లతో దశరథుడు రావడం, అయోధ్యలో 12 ఏండ్లు సుఖంగా గడిచిపోవడం వరకూ అయింది.

ఇక అయోధ్యా కాండ గానం ప్రారంభమౌతుందని వాల్మీకి మహర్షులవారు ప్రకటించారు.

కుశలవులు (లవకుశులు) గురువుగారికి నమస్కరించారు. నారతో కట్టిన జడలు, విశాలమైన నుదురు, శ్రీకారపు చెవులు. రాముని ముఖాన్ని పోలిన తేజస్సుతో నిండిన ముఖాలు, ఆకర్షణీయమైన కళ్లు, కంఠంలో అక్షమాలలు, భుజాలకి చుట్టబడిన జపమాలలు, భుజాలపై నార ఉత్తరీయాలు, మెడలో వేలాడుతున్న వీణలు, ఎడమచేతులలో చిడతలు.

శ్రోతల హృదయాలు పరవశించాయి. పాట ప్రారంభమైంది. రామచంద్రుడు ఉన్నతాసనం నుండి లేచి సభాసదుల్లోకి వచ్చి కూర్చున్నాడు. అయోధ్యాకాండ కథని కుశలవులు ఇలా పాడసాగారు.

# అయోధ్యాకాండము

## మామయ్యవెంట వెళ్లిన పిల్లలు.

> గచ్ఛతా మాతులకులం భరతేన మహాత్మనా ।
> శత్రుఘ్నో నిత్యశత్రుఘ్నః నీతః ప్రీతిపురస్కృతః ॥

భరతుడు కైకమ్మ కొడుకు. కైకమ్మకి సోదరుడు యుధాజిత్తు. అందుచేత యుధాజిత్తు భరతునికి మేనమామ అవుతాడు. మేనుసంబంధం (రక్తసంబంధం) కల మామ మేనమామ. పిల్లనిచ్చిన ఆయనని 'మామ' అనే అనడానిక్కారణం రక్త సంబంధం (మేనుసంబంధం) లేకపోవడమే.

ఈ యుధాజిత్తనే మేనమామ, దశరథుడు తన పరివారంతో మిథిలకి పెళ్లికి వెడితే అయోధ్యకి వచ్చాడు. అక్కడ ఉన్నవారంతా, రాముడు విల్లు విరిచాడనీ, పరాక్రమానికి గుర్తుగా పెళ్లి మిథిలలో జరుగబోతుందనీ, ఆయనకు చెప్పారు. యుధాజిత్తు అయోధ్యనుండి వేగంగా బయలుదేరి సరిగా 'గోదానం' జరుగుతుండగా 'మిథిల' కి చేరాడు. పెళ్ళి ఇంకా 2 రోజులుండగానే చేరగలిగానని ఎంతో ఉప్పొంగి పోయాడు. పెళ్లిఅయి, అందరితోబాటు తానూ అయోధ్యకి వచ్చాడు.

2 రోజులున్నాక, తన మేనల్లుడు భరతుణ్ణి తనతో పంపించమని అడిగాడు. దశరథుడు సరేనన్నాడు. కైకమ్మా పంపిస్తానని అన్నది. "అలా అంగీకారం జరిగాక, యుధాజిత్తు తన మేనల్లుడు భరతుణ్ణి, అతడితోపాటు వస్తానని పలికిన శత్రుఘ్నుణ్ణీ కూడా ఇష్టంతో తన దేశానికి తీసికొనివెళ్లాడు" అని శ్లోకభావం.

ఈ మొదటి శ్లోకం చాల అర్థం కలిగినది. అయోధ్యాకాండ ప్రారంభశ్లోకపు మొదటిమాట 'గచ్ఛతా' అని.

తెలవారుజామున లేస్తూనే ఎలా ముందుగా భగవంతుణ్ణి (అతి పవిత్రుడైన వాణ్ణి) చూడాలని సంకల్పిస్తామో, అలాగే కాండ ప్రారంభంలో కూడ చాల అర్థం కలిగిన శ్లోకాన్ని వాల్మీకి మహర్షి ఉంచి ఉండడా ? ప్రారంభశ్లోకమే కాక, శ్లోక ప్రారంభంలోని మాటనికూడా ఎంత ఆలోచించి పెట్టి ఉంటాడు !

## మొదటిమాటలో కూడా విశేషముంటుందా ?

ఉంటుంది. ఈ దృష్టితో బాలకాండ ప్రారంభశ్లోకాన్ని చూస్తుంటే సరి పోతోంది. అయితే ముందుగా ఆ శ్లోకాన్ని చూచి, మీదట ఈ శ్లోకాన్ని కూడా అలా సంభావించడం న్యాయం కదా! అక్కడికిపోయి చూద్దాం (సంక్షేపంగా).

**తపస్స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరమ్ ।**
**నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుంగవమ్ ॥** (బాల—1-1)

వాల్మీకి నారదుణ్ణి ఒక ప్రశ్న అడిగాడు. అడిగిన వాల్మీకి, తపస్సు చేసే స్వభావమున్న వాడైతే అడిగించుకొన్న నారదుడు తపస్వీ, అంతేకాకుండా వేదాన్ని నిత్యమూ పారాయణచేసే స్వభావమున్నవాడున్నూ.

అడిగిన వాల్మీకి, ముని అయితే, అడిగించుకొన్న నారదుడు మునిశ్రేష్ఠుడు. అడిగిన వాల్మీకి, పండితుడు అయితే, అడిగించుకొన్న నారదుడు పండిత పుంగవుడు (శ్రేష్ఠుడు).

అడిగిన వాల్మీకి, ఇప్పుడిప్పుడే వల్మీకంనుండి (భార్య-పుత్రులు-సంసారం-వంటి అజ్ఞానం) బయటపడుతున్నవాడు అయితే, అడిగించుకొన్న నారదుడు, నార (జ్ఞానాన్ని) ద (పంచియిచ్చే స్వభావము ఉన్నవాడు) మహర్షి.

చిన్నవాడు పెద్దవారిని ప్రశ్నిస్తాడు. అన్ని లక్షణాల్లోనూ ఆ వాల్మీకి కంటే నారదుడే గొప్పగా ఉన్నాడు గదా! అందుకనే, ఆ వాల్మీకి ఈ నారదుల వారిని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకూడా పరబ్రహ్మ స్వరూపాన్ని గురించిన ప్రశ్న కాబట్టి (పరిపప్రచ్ఛ) పరిప్రశ్న. మామూలు ప్రశ్న కాదు. కాబట్టి వాల్మీకి నారదుణ్ణి ప్రశ్నించ లేదు, పరి ప్రశ్నించాడు. ఇలా అశేషార్థంతో ఉన్న శ్లోకం బాలకాండ మొదట్లో అంటే శ్రీమద్రామాయణం మొదట్లో ఉంది.

ఆ శ్లోకం మొదటిమాట 'తపః' అనేది. బాలకాండ అంతా తపస్సులతో నిండినదే కదా :

నిరంతర శివార్చన తత్పరుడు రావణాసురుడు తపస్సు చేసికదా, ఆ బలంతో దేవతలను పారద్రోలాడు. మహర్షులంతా తపోబలంతో కదా, నారాయణుణ్ణి దర్శించి

రావణవధకై ప్రార్థించారు. సుమంత్రుడు తన తపశ్శక్తితో కదా, సనత్కుమారుల వారి మాటను విని దశరథుణ్ణి యాగం చేయమన్నాడు. దశరథుడు కూడ తనయొక్క-తన పూర్వులయొక్క తపశ్శక్తితో కదా, శ్రీ మహావిష్ణువంతటివాణ్ణి పుత్రునిగా పొందగల్గాడు. అలాగే తపశ్శక్తితోనే కదా, అహల్య రాముణ్ణి చూడడం, జనకుడు శివ ధనుస్సుని తన యింట ఉండేలా చేసికోగల్గడం, రామునంతటివాణ్ణి అల్లునిగా పొందడమున్నూ.

చివరికి పరశురాముడు కూడ తన తపస్సుచేత ఆర్జించిన లోకాలని (మనం వస్తువుల ద్వారా ద్రవ్యాన్ని ఆర్జించినట్లు) గదా, రామునికిచ్చివేసాడు.

ఇలా మొత్తం రామాయణ ప్రారంభంలోని బాలకాండ ప్రారంభ శ్లోకపు ప్రారంభ పదం 'తపః' అనేదీ, తపోమయం చేసేసింది కాండ కాండ అంతటినీ.

అలాగే, అయోధ్యాకాండ ప్రారంభాన్ని కూడ గమనించాలి. 'గచ్ఛతా' అనేది మొదటి శ్లోకపు మొదటిమాట.

"గచ్ఛతా"

'గచ్ఛతా' అంటే 'వెడుతూన్న'అని అర్థం. వెళ్ళడానికీ, వెళ్లిరావడానికీ, భేదం ఉంది. ఇంటి నుండి బయలుదేరే సమయంలో 'వెళ్తున్నాను' అని చెప్తే, సంప్రదాయం తెలిసిన పెద్దలు ఇంట్లో ఉండి ఉంటే,- 'వెళ్లివస్తాను' అని చెప్పాలని మందలించి చెప్తారు. ఆ సంప్రదాయం ఇక్కడిదే. ఎలాగో గమనించాలి.

రాముడు సీతాలక్ష్మణ సమేతుడై అరణ్యానికి 'వెడుతూన్న' కాండ యిదే.

తనని ఆరాధించే గుహునికి బహుమతిగా కౌగిలి నివ్వడానికి 'వెడుతూన్న' కాండ యిదే.

ఎంత కాలం నుండో తనని అర్చిస్తూన్న భరద్వాజ మహర్షికి జీవన్మోక్షం (జీవించి ఉండగా మోక్షం) ఇయ్యడానికి 'వెడుతూన్న' కాండ యిదే.

శ్రీమద్రామాయణ కావ్యకర్త అయిన వాల్మీకి ఆశ్రమానికి, సాక్షాత్తు రామాయణ కథాధినాథుడైన రాముడు 'వెడుతూన్న' కాండ యిదే.

రాముడు తన నివాసాన్ని చిత్రకూటానికి మార్చి 'వెడుతూన్న' కాండ యిదే.

భరత శత్రుఘ్నులు కైకమ్మ పుట్టింటికి (కేకయ నగరానికి) 'వెడుతూన్న' కాండ యిదే.

అందఱూ లోకంలో ఒకచోట నుండి వేఱొక చోటికి వెడుతూంటే సాక్షాత్తుగా దశరథుడు పరలోకానికే 'వెడుతూన్న' కాండ యిదే.

వశిష్ఠ వాక్యం మేరకు భరతస్వామి అయోధ్యకు 'వెడుతూన్న' కాండ యిదే.

రామ సందర్శనానికై భరతుడు చిత్రకూటానికి 'వెడుతూన్న' కాండ యిదే.

రాముణ్ణి తిరిగితెచ్చుకోవటానికి 'అయోధ్య' అంతా 'వెడుతూన్న' కాండ యిదే.

రాముడు రానని పలికాక, నంది గ్రామానికి భరతుడు 'వెడుతూన్న' కాండ. మొత్తం అయోధ్య అయోధ్య అంతా నంది గ్రామానికి 'వెడుతూన్న' కాండా యిదే. మహర్షులు దుఃఖిస్తూంటే సీతారామలక్ష్మణులు అరణ్యమార్గం పట్టి 'వెడుతూన్న' కాండా యిదే.

## వెళ్లారా ? తీసికొని వెళ్లాడా ?

ఈ శ్లోకంతో, ఈ సంఘటనంతో ప్రారంభమయ్యే అయోధ్యాకాండ చాలా చిక్కగా, చక్కనైన కథతో నడుస్తుంది. పిల్లలే వెడతామని అడిగితే, యుధాజిత్తు వెంట, దశరథుడు పంపాడా ? లేక యుధాజిత్తే తీసికొని వెళ్లాడా ? అనేది చక్కని ప్రశ్న. కొద్ది వెనక్కివెడితే గాని, యథార్థం బయటపడదు.

యుధాజిత్తు, పిల్లల పెళ్లిళ్లకుముందే కేకయదేశంలో బయలుదేరాడు. కేకయ దేశంనుండి అయోధ్యకి బాగావేగంగా వస్తే 8 రోజులూ, విడిదిచేస్తూ విశ్రాంతిగా ప్రయాణిస్తే 12 రోజులూ పడుతుంది. (దశరథ మరణవార్త తెలుపడానికి దూతలు వెళ్లినప్పుడు ఈ దూరం, ఈ కాలం, ముందుకథలో తెలుస్తుంది) అంటే, పెళ్లిళ్లకి దాదాపు 10, 15 రోజులముందే ఆయన బయలుదేరాడు. వచ్చేసరికి అయోధ్యలో ఎవ్వరూ లేరు. మిథిలకి వెళ్లారని తెలిసింది అక్కడ ఉన్న భటులవల్ల. అదికూడా పెళ్లికి అని.

ఇక్కడ ఒక విషయం ఆలోచించాలి. శుభలేఖని సకాలంలో పంపినా, అందకపోతే ఈ నాటివారు అదోలా నిష్ఠురంగా మాట్లాడతారు. ఒకవేళ సకాలంలో చేరినా, వచ్చే ఉద్దేశ్యం వారికి లేదు. అయినా మాటమాత్రం అనకుండా ఉండరు.

అలాటి సందర్భం లోకంలో ఉంటే, యుధాజిత్తు అయోధ్యకు వచ్చి, పెళ్ళికి వెళ్ళారని తెలిస్తే, అక్కడనుండి మిథిలకు వెళ్ళడం ఆశ్చర్యం కాదా మరి! కనీసం తమకు కబురైనా పంపనక్కఱలేదా! అనే ఆలోచన అతడికి ఎందుకు రాలేదు?

మిథిలకు వెళ్ళాడు. అక్కడైనా దశరథుడు యుధాజిత్తుతో - అత్యావసరంగానూ అనుకోకుండగానూ పెళ్ళి నిశ్చయమై కబురుచేయ వీలుపడలేదని చెప్పి ఉండాలి. కాని చెప్పినట్టు లేదు. అసలు ఏ కార్యాలకీ దశరథుడు కబురు పంపలేదా? అలాటి అలవాటు ఆయనకి లేదా? అంటే, ఒకప్పుడు (14 ఏండ్లక్రిందట) అశ్వమేధయాగం చేసేముందు ప్రత్యేకదూతతో మిథిలకీ, కేకయరాజుకీ కబురు చేసాడు కూడ.

"అప్పటికి రామునికి ఒక్కనికే కదా పెళ్ళి నిశ్చయమైంది! అక్కడికి వెళ్ళాక మిగిలిన ముగ్గురికీ కూడా అనుకోకుండా పెళ్ళిళ్లు అయ్యాయి."— "అందుకని దశరథుడు కబురు పంపలేదని భావిద్దాం"— అనుకోవచ్చు యుధాజిత్తు. అయినా, అలా సర్దుకుపోయే మనస్తత్వం ఉండడం ఎంత గొప్పదనం!

## యుధాజిత్తు తీసికొని వెళ్ళడంలోని ఆంతర్యం

అయోధ్యాకాండానికే ఆయువుపట్టైన అంశం ఇది. వివరంగా, నిదానించి అర్థం చేసికోవాల్సిన అంశం. అయితే చాలచాల వెనక్కిపోతే తప్ప అర్థం కాదు.

యుధాజిత్తు కైకకి సోదరుడు. వీరిరువురి తండ్రీ కేకయమహారాజు. ఆయన పేరుమీదే 'కేకయరాజ్యం' అన్నారు. ఆయన, తన కూతురికూడా తనపేరూ - తనరాజ్యం పేరూ కలిసివచ్చేలా 'కైకయి, కైక' అని పేరు పెట్టాడు.

కౌసల్యా సుమిత్రలని పెండ్లాడినా కూడా సంతానం కలుగని దశరథుడు కేవలం సంతానాపేక్షతో ఈ కైకని పెళ్ళాడదలచాడు. "కైకవల్ల కలిగే సంతానానికే రాజ్యాన్ని ఇచ్చే" నియమాన్ని పెట్టి, దశరథుడు దానికి అంగీకరించాకే— తన పుత్రిక నిచ్చాడు కేకయరాజు.

'ఇలాటి నియమానికి దశరథుడు అంగీకరింపరాదు' అనేది సామాన్యులంతా అనే మాట. దశరథుడు సామాన్యుడు కాదు. రాజనీతి — ధర్మశాస్త్రాలలో పండితుడు. బాగా ఆలోచించి కేకయరాజు నియమానికి అంగీకరించి కైకని భార్యగా పొందాడు.

**పురా భ్రాతః! పితా నః స మాతరం తే సముద్వహన్।
మాతామహే సమాశ్రౌషీద్రాజ్యశుల్క మనుత్తమమ్॥**

ఓ! భరతుడా! మన తండ్రి దశరథుడు, నీ తల్లి కైకమ్మని పెండ్లాడడానికై, అయోధ్యా రాజ్యాన్ని మొత్తాన్ని, నీ తాత కేకయరాజుకి శుల్కంగా (మగవాడు స్త్రీకి ఇచ్చే ధనం) ఇచ్చాడు' అని రాముడే భరతునితో రాబోయే కథలో అంటాడు.

**ఇలా పందెంగానూ, తన సొంత వస్తువుగానూ రాజ్యాన్ని, రాజైనవాడు మరో రాజువద్ద శుల్కంగా ఉంచవచ్చా? అది కూడా తన వ్యక్తిగత ప్రయోజనానికి (వివాహానికి) అలా చేయవచ్చా?**

ఇక్కడ ఒక విషయం ఆలోచించాలి. మనలాటి సామాన్యులకే 'అధర్మం' అనిపించేంత అంశం వశిష్ఠాది మహర్షులని మంత్రులుగా చేసికొని అందరు సామంత రాజులతో అయోధ్యా రాజ్యాన్ని చేసే దశరథునికి తెలిసిఉండదా? స్పష్టంగా తెలుసు. అందుకే ఆయన బాగా ఆలోచించి అంగీకరించాడు.

**ఏమిటి ఆ ఆలోచన?**

తనకి సంతానం లేకపోతే అయోధ్యకి యోగ్యుడైన రాజు లభించడు. సూర్య వంశానికి చెందిన ఇక్ష్వాకుకులం, ఇద్దరు భార్యలని పెండ్లాడినా కూడా సంతానం లేని తన వలన అంతరించిపోయింది— అనే అపకీర్తి తనకీ, తనద్వారా తన వంశానికీ లభిస్తుంది. ఈ విషయమే అప్పటికి తనని, ఇద్దరికి భర్తగా చేసింది. రాజవంశ మందున్న గౌరవంతోనే ఆనాడు కౌసల్య, సుమిత్రతో వివాహానికీ, అలాగే అదే గౌరవంతో సుమిత్ర, కైకమ్మతో వివాహానికీ అంగీకరించింది. కైకా వివాహానికి మంత్రి పురోహితులంతా కూడ అంగీకరించారు కాబట్టి దశరథుని ఈ పెళ్లి, మహా భారతంలోని శంతనుని పెళ్లిలా ఎవరినో ఇష్టపడి, ఆమెని విడువలేక చేసికొనే పెళ్లిలాటిది కాదని గమనించాలి.

దశరథునికి పుత్రుడు కల్గి రాజ్యానికి రాజు లభిస్తాడనే ఇహలోక సుఖమూ — పుత్రుడు ఉంటే 'పుత్' అనే పేరుగల నరకం నుండి ఉద్ధరించేవాడు ఉంటాడనే పరలోక సుఖమూ — అనే ఈ రెంటినీ ఆలోచించి, దశరథ క్షేమాన్ని కోరిన మంత్రి

పురోహితులు మూడవ వివాహానికి తమ ఆమోదాన్ని తెల్పారు. వివాహమైతే పుత్రులు కలుగకనూ పోవచ్చు – కలిగినా, పుత్రుడుకాక పుత్రికైనా (రాజ్యాన్ని చేయ అధికారం లేనిదీ - మోక్షాన్ని ఈయలేనిదీ) కలుగవచ్చు కదా! పుత్రుడే పుడతాడనే గట్టి నమ్మకం వారికెలా కల్గింది? అంటే, ఆ మంత్రి పురోహితులు సామాన్యులు కాదు. రాబోయే కథని తెలిసున్నవాళ్లు. రాజక్షేమాన్ని ఆలోచించేవాళ్లు.

అలాటి "వారు" ఈ వివాహానికి అంగీకరించారంటే దశరథునికి ఇహ—పర సుఖాలని ప్రాప్తింపచేయడానికే. రాబోయే కథ తెలుసుననడానికి మంత్రులలో ఒకడైన సుమంత్రుడే సాక్ష్యం. అతడు చెప్పాకనే దశరథుడు అశ్వమేధ – పుత్రకామేష్టులని చేసి సంతానవంతుడయ్యాడు.

ఇలా పెళ్లికి ఛార్యల— మంత్రి పురోహితుల అంగీకారాన్ని పొందిన దశరథుడు, కేకయరాజు అంగీకారాన్ని యాచించాడు, కేకయరాజు ఈ సంద ర్భంలో పైన చెప్పిన నియమాన్ని పెట్టాడు. 'పెల్లికి చెలగాటం - ఎలుకకి ప్రాణ సంకటం' అంటే యిదే. పెళ్లికాక ఈయన బాధపడుతూంటే, ఆస్తి కోసం ఆయన తంటాలు పడుతూన్నట్లనిపిస్తుంది సామాన్యులకి. కాని ఇది సరికాదు. కేకయరాజు కూడ ధర్మబుద్ధి ఉన్నవాడే, పైగా ఒక మహర్షి ఉపదేశం వలన చీమల భాషతో పాటు పక్షుల భాష కూడా తెలిసినవాడు. జరుగబోయే విషయాన్ని పక్షులు స్పష్టంగా తెలుసుకోగలవు. అందుకనే 'శకునం' చూచి వెళ్లాలని పెద్దలమాట. 'శకునం' అంటే పక్షి అని కూడ అర్థం. (పక్షులు జోస్యం చెప్తాయి (47వ పేజీ నా 'మాంగల్య తంతునానేన'లో) – పక్షి సూచించిన శుభం (150 వ పేజీ నా 'సుందర కాండ'లో) అనే శీర్షికలో వివరంగా ఈ విషయం ఉంది).

ఆలా ధర్మబుద్ధీ, రాబోయే వృత్తాంతమూ తెలిసిన కేకయ రాజుకి, దశరథుని నుండి వివాహపురాయబారం రాగానే ఆలోచన ప్రారంభమైంది. తన కూతురైన కైకమ్మను దశరథుడు కేవలం సంతానం కోసం అపేక్షిస్తున్నాడు. ముందునాటికి ఈమెకు సంతానం కలిగితే, అవసరం తీరిందని ఈయన విడువకపోయినా, ఈనాడు ఉన్నంతటి గౌరవం ఆమెమీద ఉండకపోవచ్చు. లేదా ఆయన ధర్మబద్ధుడే కాబట్టి ఆయనలో దోషం ఉండకపోయినా, సవతుల వలన ఒత్తిడి కల్గవచ్చు. ఒకవేళ ఈమెకు సంతానం కల్గినా కల్గకపోయినా, సవతులకి సంతానం కల్గితే, తన కూతురికి మటీఅత కష్టం కలిగే ప్రమాదం ఉంది.

ఇంతగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు - రాజ్యాన్ని, "తన పుత్రికకి కలిగే సంతానానికే సంక్రమింపజేస్తేతప్ప పిల్లనీయనని". రాజ్యం అనేది పట్టమహిషి (పెద్దభార్య) యొక్క పెద్దకొడుకు, ఆమీదట ఆతని పెద్దభార్య పెద్దకొడుకు........ అలా సాగిపోయేదేకాని కనిష్ఠభార్య సంతానానికి రారాదనీ, అది శాస్త్రవిధానం బట్టి ధర్మమూ, లౌకికవిధానం బట్టి న్యాయమూ కాదనీ, న్యాయవాదులు అంగీకరించబోరనీ తనకి రాజ్యం తన వంశంలో సంక్రమిస్తున్న తీరునూ గమనించి, ఆ మీదటే పై నిర్ణయం చేసాడు. ఈ నిర్ణయం వల్ల సంతానం కైకమ్మకు కలుగకపోతే ఆదరణ తక్కువ అయిపోదు. కల్గితే, సంతానం కల్గిన అనంతరం రాజ్యాధికారియైన పుత్రుడు కల్గాడు కాబట్టి సవతులకి కూడా ఈమెయెడ-పుత్రునియెడ భయభక్తులే ఉంటాయికాని ద్వేషం ఉండదు. ఒకవేళ సవతులకి కూడా సంతానం కల్గినా, తనకిచ్చిన మాట తప్పరాదు కాబట్టి, మహారాజైన దశరథుడు కైకమ్మ పక్షాన ఉండి తీరవలసినదే. పుత్రిక కలుగదని, భావికథ తెలిసిన తనకి స్పష్టంగా తెలుసు అందుకని కేకయ రాజు కేవలం తన పుత్రికక్షేమం కోసం ఒక తండ్రిలాగానూ, రాజ్యానికి వారసుని కల్పించే నిమిత్తం ఒక తోటి రాజులాగానూ, భావి కథని తెలిసి దైవసహాయాన్ని చేసే ఒక ధార్మికునిలాగానూ ఈ సందర్భంలో ప్రవర్తించాడు. అంతటి ఉత్తముడు ఆయన.

ఇక దశరథుని వైపునుండి చూద్దాం. కేకయరాజు పెట్టిన నియమాన్ని బాగా ఆలోచించిన దశరథుడు, కేకయ ఏ కారణంగా అలాటి ధర్మవిరుద్ధమైన నిర్ణయాన్ని పెట్టాడో గమనించి ఆ కారణంగానే 'సరే' అన్నాడు. కైకమ్మవలన కలగబోయే పుత్రునిద్వారా తాను మోక్షాన్ని కోరుకోబోతున్నాడు. అదే సమయంలో పట్టమహిషి పెద్దకొడుక్కి మాత్రమే ఈయవలసిన రాజ్యాన్ని, కలగబోయే పుత్రునికి ఇస్తానని అధర్మాన్ని పల్కుతూ, ఏ మోక్షం కావాలని సంతానం కోసం వివాహం చేసికోబోతున్నాడో, ఆ వివాహం గూర్చిన వాగ్దానంద్వారా నరకానికి పోదోతున్నాడు. పిల్లలు కలగడమనేది పెళ్లికి పెమ్మట కదా! అందుకని వాగ్దానంద్వారా నరకానికి సిద్ధపడి మోక్షాన్ని కోరుకుంటున్నాడన్నమాట. ఇది సాధ్యంకాదని తెలియనంతటివాడు తాను కానేకాదు.

అదీకాక, నియమాన్ని పెట్టిన కేకయరాజు గుణగణాలు తనకు తెలియనివి కావు. అందుకనే అశ్వమేధ, పుత్రకామేష్టి యాగాలని మంత్రులతో తలపెట్టి నప్పుడు కూడ తన మామగారనే అభిప్రాయంతోగాని, మరే కారణంతోనైనాగాని

తానే వెళ్లి ఆహ్వానించకుండా ప్రత్యేక దూతలతో ఆహ్వానం పంపాడు. కేకయ సచ్చరిత్రతా, మంచిదనమూ తెలిసినవాడు కాబట్టే తన పుత్రుల వివాహకాలంలో, అసలు వర్తమానం కూడా తాను పంపించలేడు. రామలక్ష్మణులు విశ్వామిత్రుని వెంట వెళ్లి, జనకుని కొలువులో విల్లు రాముడు ఎక్కుపెట్టబోతే విరిగిందనీ, ముహూర్తం కోసం వెంటనే పెళ్లి జరుగవలసివచ్చిందనీ తాను చెబితే, జరిగిన పరిస్థితి తొందరని అర్థం చేసికోగల కేకయ, ఏ మాత్రమూ అన్యథా భావించడని తనకి స్పష్టంగా తెలుసు, అందుకే అలా ప్రవర్తించాడు. ఇలా అని కేకయరాజంటే తనకు 'చులకనభావం' లేదు. అర్థం చేసికొనగల సహృదయుడు, గంభీరుడు కేకయరాజు అనే గౌరవం దీనికి కారణం. ఆ లక్షణమే కల కైకమ్మ కూడా 'వర్తమానం పంపాలి' అనే విషయాన్ని, కనీసం అడిగినట్లుగా కూడ కన్పించదు. అంతేకాక ఈ విషయమై ఒక్కమాట కూడ, తన జీవితకాలంలో అనలేదు.

మరో క్షత్రియకన్యనికాక, కైకనే వివాహం చేసికోవాలనుకోవడానికి కారణం భావివృత్తాంతం తెలిసిన కేకయరాజు, తన పుత్రికని సంతానార్థం ఇస్తానని అంటే చాలు - దశరథునకు సంతానప్రాప్తి ఉండదన్నమాటే. అలాటి ఆయనే నియమాన్ని పెట్టడం తన మంచికే అయితీరుతుందని కూడ దశరథుని నిశ్చయమైన అభిప్రాయం. మొత్తానికి అయోధ్యా రాజ్య ప్రతిష్ఠతోపాటు కేకయ తన పుత్రికా క్షేమాన్ని, దశరథుడు వివాహాన్ని, మంత్రులు భావికాలపు రామ వృత్తాంతాన్ని, తద్వారా రావణవధనీ ఊహించారు.

ఇలా వివాహం అంగీకరింపబడ్డాక కౌసల్యకి రాముడూ, వెనువెంటనే కైకకి భరతుడూ (రామునిపిమ్మట రాజ్యాధికారం కలవాడు), సుమిత్రకి లక్ష్మణశత్రుఘ్నులూ కలిగారు. తన పుత్రిక క్షేమమూ, భర్తకు ఆమెపై అనురాగాన్ని మాత్రమే కోరే కేకయరాజు తనకు మనుమడు కలిగాడని తెలిసినప్పుడు (రాజ్యానికి వారసుడనే ఆలోచన ఉంటే) 'బాలసారె' (బారసాల) కైనా వచ్చిఉండాలి. రాలేదు. అయోధ్య నుండి వచ్చే అప్పటప్పటి వార్తలద్వారా (కౌసల్యాతో ఽతిరిక్తం సు సోఽనుశుశ్రూషతే హి మామ్) రాముడు ఎక్కువగా కైకకి సేవచేస్తూ ఉంటాడనీ, ఎక్కువ సేపు ఆమె మందిరంలోనే గడుపుతూంటాడనీ తెలిసి కేకయరాజు సంతోషమే పొందాడు. రాజ్యకాంక్షే తనకి ఉండి ఉంటే రాముణ్ణి (సవతిపుత్రుణ్ణి) దరి చేరనీయవద్దని కైకమ్మకి కబురు పంపిఉండడా?

పోనీ ! చిన్నప్పుడు రాజ్య వారసత్వం గురించి ఆలోచించడం బాగుండదని కేకయ భావించాడనే అనుకుందాం. పెద్ద ఒరు పిల్లల పెళ్ళిళ్ళకి దశరథుడు సభ పెట్టినప్పుడైనా ఆయన రాదేమి ? ఆయనకు కబురు లేదని మనం భావిద్దాం. కేకయ కూతురు కైక కబురు చేయవచ్చుగా ! ఆమె కూడా చేసియుండలేదు. కారణం, ఆమెకు తన తండ్రి అభిప్రాయం స్పష్టంగా తెలుసుకాబట్టే.

ఇలాంటి కేకయరాజు, ఇప్పటివరకూ తనకు రాజ్యకాంక్ష లేదనే విషయాన్ని గూఢంగా ఉంచిన కేకయరాజు, ఇప్పుడు యుధాజిత్తు (తనపుత్రుడు) ను అయోధ్యకి పంపడంతో తన అభిప్రాయాన్ని బహిరంగపరుస్తున్నాడు. రాజ్యం అనేది వివాహానంతరం లభిస్తుంది. విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులు వెళ్లారనీ, జనకుని కొలువు కూటానికి పోబోతున్నారనీ తెలిసి, అహల్యాశాపమోక్షాన్ని చేయగలిగినంత ధన్యుడు సీతతో వివాహాన్ని తప్పక చేసికోగలడనీ గ్రహించి, ఇక తన మనుమడైన భరతునికి కూడా వివాహం కాబోతుందని గ్రహించి, వివాహానంతరం రాబోయే రాజ్యాధికార సమస్యకి అడ్డురాబోయే తన మనుమణ్ణి రంగంలో ఉంచనేరాదనే సదాలోచనతో భరతుణ్ణి తనయింటికి తేవలెననదిగా యుధాజిత్తుని పంపించాడు.

రాజ్యవారసత్వం తన మనుమనికే లభించాలనే ఆలోచన కేకయరాజుకి ఉన్నా, తన పుత్రునికే రావాలనే ఆలోచన కైకకి ఉన్నా, తన మేనల్లునికే కలగాలనే ఊహ యుధాజిత్తుకి ఉన్నా, వివాహం అయిన వెంటనే భరతుణ్ణి అయోధ్యనుండి పోనీయరు. భరతుణ్ణే అనుసరించి ఉండే శత్రుఘ్నుని వలన ఏదైనా రాజ్యవారసత్వపు ఇబ్బంది (భరతునికి లేకపోయినా) ఏర్పడుతుందేమోనని అతణ్ణికూడా యుధాజిత్తు తీసికొని పోయాడు. అయోధ్య మిథిలా నగరాల వియ్యం, వియ్యంగానే ఉండాలి గాని కయ్యంగా మారరాదని యుధాజిత్తు కేకయరాజుల భావం. భరతశత్రుఘ్నులని పట్టుకొని పోవడంలో ఇంత లోతు భావం ఉంది.

శ్రీమద్రామాయణంలో లోకానికి చిత్రం అన్పించే సంఘటనలు చాలఉంటాయి. శిష్యుడు గురువువద్దకి వెళ్ళడం లోకంలో ఉంటే, గురువైన నారదుడు బాలకాండలో వాల్మీకివద్దకు వచ్చి రామకథ చెప్పివెడతాడు (చూ॥ నా బాలకాండ వ్యాఖ్య

పేజి6....10). మోక్షంకోసం భక్తులు పోవలసి ఉంటే పరమాత్మ రాముడే స్వయంగా అహల్యకీ, సిద్ధాశ్రమ వాసులకి దర్శన మీయడం వంటివన్నీ ఇలాంటివే.

అయితే ఈ తీసికొని పోవడంలో బాలకాండ, అయోధ్యాకాండలకి కొన్ని పోలికలు కన్పిస్తాయి. బాలకాండలో విశ్వామిత్రుడు రాముణ్ణి మాత్రమే యాచిస్తే, లక్ష్మణుడు వెంట వచ్చాడు. ఇక్కడ భరతుణ్ణి తీసికొనిపోదలిస్తే, శత్రుఘ్నుడూ వెంటవస్తే తీసికొనిపోయాడు యుధాజిత్తు. అక్కడ దశరథుణ్ణి విశ్వామిత్రుడు నిందిం చాక రామలక్ష్మణులని పంపడం జరిగితే, ఇక్కడ ఇష్టంతోనే భరతశత్రుఘ్నులని పంపడం జరిగింది. అక్కడ రామలక్ష్మణులకి అస్త్రవిద్యలు లభించి, దేశక్షేమం జరిగితే, ఇక్కడ లోకక్షేమం జరగడమేకాక, అన్నదమ్ముల సంబంధం ఎలా ఉండాలో తెలియజెప్పటం జరిగింది. అక్కడ దేవతల ప్రేరణపై విశ్వామిత్రుడు రామలక్ష్మణులని తీసికెడితే, ఇక్కడ యుధాజిత్తు తండ్రి ఆజ్ఞపై వీరిని తీసికెళ్లాడు. అయితే అక్కడా ఇక్కడా కూడా రామలక్ష్మణులనీ, భరతశత్రుఘ్నులనీ పంపించి నవాడు 'దశరథుడే' కావడం విశేషం.

## దశరథ - కేకయరాజులకి ఉన్న దేశభక్తి

'దేశభక్తి ఉండాలి' అని అరిస్తే దేశభక్తి ఉండదు. ఆచరణలో ఉండాలి. అది ఈ ఇద్దరు రాజుల్లోనూ చూడగలం. ఈ విషయాన్ని అయోధ్యాకాండ ప్రారంభ శ్లోకం పదపదానా నిరూపిస్తుంది.

> గచ్ఛతా మాతులకులం భరతేన తదానఘః ।
> శత్రుఘ్నో నిత్యశత్రుఘ్నః నీతః ప్రీతి పురస్కృతః ॥
> (అయో 1-1)

గచ్ఛతా :- భరతశత్రుఘ్నులనిద్దరినీ ఒకేసారి తీసికెళ్లడంలో కారణం, ఒకరి వెనుక ఒకరిని తీసికెడితే, ఒకరు వెళ్లిన వెనుక అయోధ్యా పరిస్థితులని గమనించిన వేరొకరివలన ఏదైనా కీడు జరిగినా జరుగకున్నా కనీసం తలపెట్టడమైనా జరుగవచ్చు గదా !

మాతులకులమ్ :- ఈ యిద్దరినీ వేరువేరు చోట ఉంచక, కేకయరాజు తన యింట్లోనే ఉంచుకొనేలా తెచ్చుకోడానికి కారణం, అయోధ్యకి మచ్చ రానీయ కుండా చేయాలనే అభిప్రాయం ఉన్నవాడు తాను కాబట్టి, తన అభిప్రాయాన్ని

గౌరవించే పుత్రుడు యుధాజిత్తు కాబట్టీను. రాజ్యవిషయంగా ఏదైనా అయోధ్యకి మచ్చ వస్తే కైక వలనే రాబోతుంది. కాబట్టి, కైక పుట్టింటిలోనే వీళ్లని ఉంచడం సరైనది. భరతశత్రుఘ్నులని కైక అదుపు చేయగలదైతే, కైకని తాను అదుపులో ఉంచగల సమర్థత కలవాడుకదా !

**భరతేన** : 'బిభర్తీతి భరతః' రాముడు ముందునాటికి "అక్కరలేదు" అనబోయే రాజ్యాన్ని, "భరించవలసినవాడు కాబట్టి భరతుడు" అయ్యాడు. ఈ భరతుని పేరును సార్థకం చేయాలంటే, ఇష్టంలేకుండా రాజ్యాన్ని భరింపచేయాలంటే అతణ్ణి తమ యింటికి తేక తప్పదు.

**తదా** : యుధాజిత్తు, పిల్లలని పంపించమని అడిగిన తత్‌క్షణం దశరథు డామోదించాడు లోకంలోని మనమే ఏదైనా ఊరు వెళ్లాలంటే తారాబలం, చంద్ర బలం చూచుకుంటాం. మరి వశిష్ఠాది మహర్షులున్న అయోధ్యకి రాజు దశరథుడు ఆ 'మంచీ - చెడూ' చూడకుండానే వీరిని పంపించాడంటే, తాను చేయబోయేది దేశ క్షేమంకోసం అంటే మంచికే మంచి. అందుకని చూడలేదు. ఇతరుల ఇల్లు నాశనం చేయడం అధర్మమే అయినా, అంటుకున్నప్పుడు ఆ భాగాన్ని నాశనం చేయక పోవడం ధర్మంకాదుగదా ! ఏ క్షణంలోనైనా ఉపద్రవం రాబోయే కాలంలో మంచి కోసం ఆగడమంటే, కావాలని ఆపదని ఆహ్వానించడమేగదా ! అందుకే శాస్త్రంలోని మెఱుకువని గ్రహించాలి.

**అనఘః శత్రుఘ్నః నిత్యశత్రుఘ్నః** : పాపం లేనివాడూ, నిత్య శత్రువులని చంపినవాడూ, అయిన శత్రుఘ్నుడు తీసికొనిపోబడ్డాడని దీని భావం. రాజ్య సంబంధపు ఆలోచన లేనివాడూ, అనవసర విషయాలని భరతునికి చెప్పి రెచ్చగొట్టే లక్షణం లేనివాడూ ఇతడు. రాముడు రాజ్యం అక్కఱలేదంటే, ఇష్టం లేకుండా తప్పనిసరిగా రాజ్యభారాన్ని భుజంమీద భరిస్తూ భరతుడుంటే, రామసేవయే తన జీవితలక్ష్యంగా లక్ష్మణుడుంటే, వీరందరికీ పట్టనిరాజ్యాన్ని, నేను ఏలితే బాగుం టుందనే ఆలోచన (మోహ-లోభ) లేక కామ-క్రోధ-లోభ-మోహ-మద-మాత్స ర్యాలనే ఆరు అంతశ్శత్రువులనీ శాశ్వతంగా జయించినవాడు (నిత్యశత్రు-ఘ్నుడు = శాశ్వతంగా అంతశ్శత్రువులని నాశనం చేసినవాడు) శత్రుఘ్నుడు అని దీనిభావం.

**నీతః** : ఇతడు అయోధ్యకి ఏ కష్టాన్ని కల్గిస్తాడోనని బలవంతానా పట్టు కొనిపోకుండా (నాసా-మీసా వంటి చట్టాలతో అదుపులోకి తీసుకోవడం లాగాకాక)

ప్రీతి పురస్కృతః : ఇష్టపూర్వకంగా తీసికొనిపోబడ్డాడు. కారణం శత్రువునైనా మంచిమాటలతో, ప్రీతితో లొంగదీయవచ్చును. సొంతపుత్రుణ్ణి కూడా మహామహా నియమాలని పెట్టి వ్యతిరేకింప సికోవచ్చును. రెంటిలోనూ ఇష్టపూర్వక మైన ప్రీతిలోనే, వ్యక్తిని చెడుఆలోచనసుండి మరల్చ వీలౌతుందనే భావనతో ఇష్టం తోనే శత్రుఘ్నుణ్ణి తీసికెళ్లాడు యుధాజిత్తు. అతడు వ్యతిరేకించేవాడు ఏ మాత్రమూ కాడు. అయినా 'విధి' బలీయమైనది కాబట్టి తీసికొనిపోయాడు. ఎలాంటి ఉపద్రవం కలుగబోతుందోనని.

భరత శత్రుఘ్నులిద్దఱూ కేకయపురంలో ఉంటూ, వృద్ధుడైన దశరథ మహా రాజునిగూర్చి తలచుకుంటూ ఉండేవాళ్లు. (భ్రాతరౌ స్మరతాం వీరౌ వృద్ధం దశరథం నృపమ్). అలాగే దశరథుడు కూడ- తన శరీరానికి నాల్గుచేతులే పుట్టినంటే ఆ నాలుగూ ఈ నల్గురు పిల్లలై ఉండేవారనిభావిస్తూ. ఐశ్వర్య భోగాలని-భరత శత్రుఘ్ను లిద్దఱూ దూరంగా ఉండగా తానే అనుభవిస్తున్నానే అని తానూ దుఃఖిస్తూ ఉన్నాడు. (రాజాऽపి మహాతేజాః సస్మార ప్రోషితౌ సుతౌ) అలా వారిని గూర్చి తండ్రి ఐన దశరథునికి బాధకల్గుతూ ఉన్నా, ఆయనకు రాముడంటేనే అమితమైన ప్రీతిగా అన్పిస్తూ ఉంది. (తేషా మపి మహాతేజా రామో రతికరః పితుః). ఈ పిల్లలంతా తనకి నాలుగు చేతులవంటి వారే అయితే అందఱికీ సమప్రాధాన్యం ఉండాలి గాని రామునికే ఎందుకు ప్రాధాన్యమీయాలి? (స్వశరీరాద్వినిర్వృత్తాశ్చత్వార యివ బాహవః)

రాముడే నలుగురిలో ఇష్టుడా ! ఎందుచేత ?

దీనికి కారణం వాల్మీకిమహర్షి చెప్పాడు.

"సహి దేవై రుదీర్ణస్య రావణస్య వధార్థిభిః ।

అర్థితో మానుషేలోకే జజ్ఞే విష్ణుస్సనాతనః ॥ (అయో. 1/7)

దశరథునికి పుత్రుడుగా కల్పిస్తున్న ఈ రాముడు సామాన్య పుత్రుడు కానే కాడట. శ్రీమహావిష్ణువేనట. అందుకని ప్రీతిపాత్రుడట. అయితే ఇక్కడొక చిత్రం ఉంది.

రామునికి తనకి తనికిగా తెలుసు తాను మహావిష్ణువని. కాని తెలియనట్లు ఉంటాడు. దశరథునికి తన రాముని దైవత్వాన్ని

గురించి ఏ మాత్రమూ తెలియదు. కాని అంతా తెలుసనుకుంటాడు. రామునికీ తన తండ్రిని గూర్చి బాగా తెలుసు!– 'ఆయనకు తనరూపం విశేషం గూర్చి ఏమీ తెలియదనీ'. దశరథునికి తన పుత్రుని గూర్చి బాగా తెలుసు– 'పాపం! రామునికి ఏమీ తెలియదని.'

సహజంగా తండ్రికి పెద్దపిల్లవాడంటే మక్కువ ఎక్కువ ఉంటుంది. కారణం, తనని 'తండ్రి' అనే స్థాయికి తెచ్చినవాడు ఇతడేకదా! ముందునాటికి తనకి తర్పణాదికాలు (మరణించాక) చేయవలసినవాడూ ఇతడే కదా! ఇదికాక లక్ష్మణునకున్న కోపంగాని, భరతునికున్న గట్టిదనంగాని, శత్రుఘ్నునకున్న ధైర్యంగాని రామునికి లేవనీ, మెత్తటివాడు రాముడనీ భావించే దశరథునికి, రాముడంటే జాలితోకూడిన ప్రీతి. సహజంగా పెద్దపిల్లలు వినయంగా, మెత్తగా కార్యసాధకులుగా ఉంటే, చివరిసంతానం గడుసుగా, వంకర తెలివితేటలతో ధైర్యంగా ఉండి, ఏదైనా పనిని సాధించుకోగలిగి ఉంటారు. లేదా ఇక అతికించుకోలేనంతగా పనిని తమ వంకర తెలివితో చెడగొట్టుకోగలిగీ ఉంటారు. ఎక్కడో తప్ప జ్యేష్ఠపుత్రుడు కార్యసాధకుడు కాక మానడు.

దశరథునికి రాముడు మెత్తనివాడనే అభిప్రాయంతో ఇష్టుడైతే దేవతలందరికీ రాముడు రావణవధని చేయబోతున్నాడు కాబట్టి ఇష్టుడట.

### రాముడంటే ఎవరు ? ఎందుకు ?

అంతకుముందు చెప్పిన శ్లోకంద్వారా రాముడే శ్రీమహావిష్ణువని తెలిసింది. "అజాయమానో బహుధా విజాయతే-తస్య ధీరాః పరిజానన్తి యోనిమ్" అని పురుష సూక్తం చెప్తుంది. అసలు 'పుట్టుక' అనే లక్షణం లేనివాడయిన పరమాత్మ లోకాన్ని ఉద్ధరించుటకై అనేకరూపాలలో పుడుతూంటాడట. అవే దశావతారాలూ–భాగవతం ప్రకారం 21 అవతారాలున్నూ, అలాటి పరమాత్మ శ్రీమద్రామాయణంలో ఎత్తినది నలుగురిగానే. 'అవతారం' అంటేనే లోకాన్ని (తౄ) తరింపచేయడానికి పై నుండి దిగిరావడం అని అర్థం అయితే, ఈ దిగువనిచ్చిన ఆయన ఫలానివాడని ఎవరికి తెలుస్తుంది? అంటే (ధీరాః పరిజానన్తి) ధీరులకి తెలుస్తుందట. 'ధీరులు' అంటే- ధైర్య పరాక్రమాలున్నవాళ్లు-అనికాదు అర్థం. 'ధ్యైచింతాయామ్' నిత్యమూ భగవత్ ధ్యానంలో ఉండి పరమాత్మని గూర్చి చింతించేవాళ్లకి మాత్రమే తెలుస్తుందట. విష్ణు ధ్యానతత్పరుడు నారదునికి తెలుసు. అందుకే ఆయన వాల్మీకికి చెప్పాడు. ఆయన

మనకి చెప్పగలుగుతున్నాడు రాముడు శ్రీమహావిష్ణువనీ, మిగిలిన ముగ్గురు తమ్ములుకూడా ఆయన రూపాలేననీ. కాబట్టి 'రాముడు' అంటే విష్ణువు· ఆయన కూడా నలుగురు.

నలుగురిలో ఒకడుగా కన్పించే రామునిలో మళ్లీ ఇద్దరున్నారు. దశరథుని యొక్క పుత్రునిగా కన్పించే మానవుడైన రాముడొకడు (ఆత్మానమ్ మానుషమ్మన్యే రామం దశరథాత్మజమ్). భగవంతుని అవతారమూర్తిగా కొందరికీ మాత్రమే (ధీరులకి) కన్పడే రాముడు వేరొక్కడున్నా. (అహంవేద్మి మహాత్మానం రామమ్....) అయితే ఈ రెండు రూపాలూ కలిసి ఒకే శరీరంలో ఉంటాయి.

ఈ మానవ - దైవరూపాలూకలిసిన రాముణ్ణి కేవలం మానవుని గానే దర్శించినవాడు దశరథుడైతే, కేవల పరమాత్మరూపంగానే భావించినవారు భరద్వాజాది మహర్షులంతా. పైకి మానవుడనీ, లోపల భగవంతుడనీ... ఇలా రాముని యథార్థరూపాన్ని చూచినవారు విశ్వామిత్ర వాల్మీక్యాది మహర్షులు. భగవంతుడెలా ఔతాడు? అనే సంశయం ఆత్మలో కలవాళ్లై కేవలమానవుడే రాముడని భావించేవాళ్లు రాక్షసులు. తొలిరోజుల్లో మానవునిగా గుర్తించి, పిమ్మట భగవంతుడే అని నిర్ధారించుకున్నవాళ్లు 1) వానరజాతిలో సుగ్రీవుడు 2) లంకకి ఇవతలి రాక్షసులలో మారీచుడూ 3) లంకలోని రాక్షసులలో విభీషణుడూను. ఈ మారీచ విభీషణులే రాముని దైవరహస్యాన్ని అందరిలోనూ ప్రవేశపెట్టదలచి విఫలులయ్యారు కూడ.

ఇక స్త్రీల విషయానికి వస్తే రాముడు మానవుడు మాత్రమే అని భావించినవాళ్లు దాటక-శూర్పణఖలు. భగవంతుడే అని నిశ్చయంగా భావించినవాళ్లు అహల్య - మండోదరి - సుమిత్ర - తార-లు. ప్రారంభకాలంలో మానవునిగా భావించి పిమ్మట భగవంతుడని భావించినవాళ్లు కౌసల్య - కైకమ్మలు. ఇక తనికీ రామునికీ భేదమే లేని వాడు ఆంజనేయుడు. (తాదాత్మ్యబుద్ధి)

## మానవసేవయే మాధవసేవ

ఈ సామెత ఈ కాలంనాటిదే. మానవుణ్ణి సేవిస్తే మాధవుణ్ని సేవించినట్లే అని దీనిభావం. కారణం, త్రేతాయుగంనాటి ఆ మానవుడు రాముడు, మాధవుడే కాబట్టి. అలాగని కన్పడిన ప్రతి మానవుణ్ణి సేవిస్తే మాధవసేవ కానేకాదు. ఈనాడు దీనికి అర్థం ఎలా మారిందో మనకవసరంగాని అసలు అర్థం ఆలోచించాలి. లోకము లోని ప్రతిమానవుణ్ణీ సేవించంగాని అనేకులు సాధువులు, సన్యాసులు, బాబాలు, తపోధనులు.... ఇలా కన్పిస్తున్నారుగా! వీరిలో ఎవరిని సేవించాలి ? ఎవరు వీరిలో నిజమైనవారు ? అనే విషయం ఈ సాధు-సన్న్యాసిజాన్ని ఆలాపిస్తే తెలియ దట. నిత్యమూ భగవదారాధనని చేస్తే లోకంలో నిజమైన అవతారమూర్తి ఎవరో తెలుస్తారట. ఇదంతా ఎందుకంటే అలా భగవద్ధ్యానం చేసిన వాల్మీకి విశ్వామిత్రులు మానవుడైన రాముణ్ణి మాధవునిగా గుర్తించగలిగారు. ఇలా గుర్తించగలిగిన స్థాయి కెదిగినప్పుడే ఋషి, మహా+ఋషి=మహర్షి కాగలుగుతాడు. నిజమైన భగవంతు డంటూ ఒకడుంటే మధ్యలో వీళ్లెందుకు? అనే అనుమానం వస్తుంది. నిజమే. దేవుని స్వరూపాన్ని, స్వభావాన్ని, దేవుణ్ణి సులభంగా పొందే మార్గాన్ని బోధించేం దుకు ఉండే ఉపాధ్యాయుల వంటివాళ్లు వీరు. సాధు-సన్యాసులు ఎవరైనా, తాము ప్రోత్సాహపరచి జనులని భగవంతుణ్ణి సేవించేలా చేయాలిగాని, తమని సేవించ వలసిందిగా కోరరాదు. తమని జనులు సేవిస్తూ ఉంటే సేవింపచేసుకోరాదు. ఇలా జనులు తమ సేవచేస్తూ ఉంటే, వారికి భగవంతుడు దూరమయ్యే మాట నిశ్చయం. సేవించడం మానినరోజున ఈ జనులని కూడా వారు ప్రక్కకినెట్టడం నిస్సంశయం. విశ్వామిత్రమహర్షి రాముణ్ణి సాక్షాత్ శ్రీ మహావిష్ణుస్వరూపంగా భావించి, రాముని చేత భగవంతుణ్ణి ఆరాధింపజేసాడు. తానూ భగవంతుణ్ణి ఆరాధించాడు తప్ప 'అవ తారస్వరూపం గదా!' అని రాముణ్ణి సేవిస్తూ కూచోకపోవడం గమనించాలి. రాముని ద్వారా పరబ్రహ్మ స్వరూపాన్ని వాల్మీకి సందర్శించాడు గాని, రామసేవచేస్తూ ఉండి పోలేదు. భగవంతునికీ, భగవంతుణ్ణి చేరదలచిన ప్రజలకీ నడుమ నిచ్చెనలాటి సాధు సన్న్యాసులద్వారా భగవంతుణ్ణి చేరే ప్రయత్నం చేయాలి - అంటే నిచ్చెన ద్వారా గమ్యాన్నిచేర ప్రయత్నించాలిగాని, నిచ్చెనలని సేవిస్తూ కూచోరాదు.

రాముడు ఎందుకు పుట్టాడు ?

శ్రీ మద్రామాయణానికి మూలమైన ప్రశ్న యిది. ఆ విషయాన్ని చెప్పే శ్లోకం—"

"సహిదేవై రుదీర్ణస్య రావణస్య వధార్థిభిః ।

అర్థితో మానుషే లోకే జజ్ఞే విష్ణుస్సనాతనః ॥ (1/7)

అనేది ఈ శ్లోకంలో కూడా మాటమాటకీ లోలోతు అర్థం ఉంది.

**సహిః :** ఆ విష్ణువే పుట్టాడుట రామునిగా అవతారాలు-అంశావతారాలు, పూర్ణావతారాలు. అని రెండు విధాలుగా ఉంటాయి. ఆ సందర్భానికి అక్కడికి వచ్చి ఆ ఘట్టంలో పాల్గొని ఇకతర్వాత కనిపించనివి అంశావతారాలు. (పరశురాముడు వైష్ణవధనవును తెచ్చి రామునికి తపోలోకాలనిచ్చి వెళ్లిపోతాడు బాలకాండలో)ఈ అవతారాలకి గుళ్లూ గోపురాలూ పూజా పురస్కారాదికాలు ఉండవు రామావతారం అలాంటిదికాదు. కథా ప్రారంభం నుండి కథాంతం వఱకు తన మీదుగా కథ సాగిపోయే అవతారం పూర్ణావతారం. అందుకని విష్ణువే పుట్టదలిచాడు రామునిగా. తాత్కాలిక ప్రయోజనానికి అంశావతారాన్నీ. శాశ్వత ప్రయోజనానికీ మోక్షానికీ పూర్ణావతారాన్నీ ఉపాసించాలని చెప్తారు.

**దేవైః** విష్ణువును రామునిగా అవతరించవలసినదిగా దేవతలందఱూ ప్రార్థించారట. ఇక్కడ 'దేవైః' అనేది బహువచనం. దేవతలు అందరిచేతా విష్ణువు కోరబడ్డాడట. 'అందరు దేవతలూ' అనడం ఎందుకంటే. ఏ కొందరితో వెడితే, మిగిలినవాళ్లు కూడా కోరాక చూద్దాం అనవచ్చు. లేదా అర్థించడానికి రాని దేవతలకి తాను భూలోకంలో పుట్టడం ఇష్టమైనది కాదేమోనని విష్ణువు భావించవచ్చు. దేవతా సహాయం లేనిదే తానేమి చేయగలడు? అలాటి దేవతలంతా ప్రార్థించారు 'పుట్టవయ్యా' అని. అందుకే ఆయన పుట్టాడు.

ఏదో ఒక పనిని సాధిస్తే కలిగేది తాత్కాలికగర్వం. కాని రావణునిది సహజగర్వం గర్వం అనేది ఆత్మనాశనాన్ని చేస్తుంది. కాని రావణుని గర్వం ప్రపంచ నాశనాన్ని చేస్తుంది. ఈ విషయమే 'ఉదీర్ణస్య రావణస్య' అనే మాటలో చెప్పబడింది. అలాటి రావణుణ్ణి మందలించి విడిచినా, ఏదోచిన్న శిక్షవేసినా ప్రయోజనం ఉండబోదని గ్రహించిన దేవతలు అతని 'వధ' ని కోరారు. (వధార్థిభిః)

ఎవరికైనా అనుగ్రహించవలసినదిగా వేచే దేవతలు, రావణుడి విషయంలో వధించమని ప్రార్థిస్తున్నారు. దేవతలందరూ వచ్చినా, వారు పట్టుబట్టక ప్రార్థిస్తూంటే (అర్థితః) విష్ణువు ఆలోచించి 'ఉపాయః కోవధే తస్య — రావణుణ్ణి వధించాలంటే ఉపాయం చెప్పరూ! అని విష్ణువే దేవతలని అడిగాడు. (నేటిరోజుల్లో కూడా ఫిర్యాదు చేసేవాడు 'I pray........' అని ప్రారంభించి తనకి ఏ విధంగా న్యాయం జరగాల్సి ఉందో వివరిస్తాడు. అడిగేది (Prayer) న్యాయబద్ధమైన దనిపిస్తే ఆ ఫిర్యాదును న్యాయస్థానం స్వీకరిస్తుంది. (Admission) ఈ సాంప్రదాయం త్రేతాయుగం నాడిదన్నమాట. దేవతలు ఫిర్యాదిదారులు. విష్ణువు న్యాయస్థానం. ఫిర్యాదిప్రార్థన రావణవధ.)

పని అయ్యేంతవరకూ బతిమలాడి చేయించుకుని, పని పూర్తి అయ్యాక విరోధం పెట్టుకునేవాళ్లే రాక్షసులంటే. నరకాసురుణ్ణి చంపవలసినదని ప్రార్థించి, కృష్ణునిగా తాను వానిని సంహరించాక తనతోనే వైరం పెట్టుకున్నారు రాక్షసులు. అలాటి రాక్షసనాయకుణ్ణి చంపడమే 'సరి' అని నిశ్చయించుకొని ఇలా అడిగితే, వాళ్లే సూచన చేసారు. 'మనుష్యరూపమెత్తి సంహరించు' అని. ఇలా సూచించడంలో 5 కారణాలున్నాయి.

1) తనకు చావు రాకాదని వేడుకొన్న జాతులలో రావణుడు అలా కోరుకోవడం కూడా అవమానమని 'మానవజాతి' ని కావాలని విడిచాడు. (నా కీర్తయదవజ్ఞానాత్....... మృత్యుర్నాన్యోఽస్యవిద్యతే) 2) ఎంతోకాలంగా విష్ణువును పూజిస్తూ మోక్షాన్ని ఆర్జిస్తున్న ఇక్ష్వాకులు మానవజాతిలోనిది. 3) జ్ఞానమనేది ఉన్నది మానవజాతికే కాబట్టి, ధర్మప్రవర్తనమంటే ఎలా ఉంటుందో విష్ణువుకి చెప్పవీలౌతుంది. 4) భగవంతుడనగానే 'ఎక్కడో కన్పించనివాడు' అనే భావంకాక మానవోత్తముడే భగవంతుడనే బుద్ధి ప్రజలకు కలుగుతుంది. 5) రాక్షసజాతివాడైన రావణుడంతటివాడు, సామాన్య మానవజాతివానిచేతిలో వానరాల సహాయంతో వధింపబడ్డాడని తెలిస్తే, గెలుపు ఓటములకు కారణం ధర్మం - అధర్మమేకాని శరీరబలంకాదని తెలుస్తుంది అయితే తాను భగవంతుడూ, మానవుడూను కదా! ఆ విశేషం తెలియజేసేందుకై అందరిలాకాక తల్లికి 11 నెలలు నిండాక పుట్టాడు. (తతశ్చద్వాదశేమాసే....). అందరిలా పుట్టని 'అయోనిజ' అయిన సీతని పెండ్లాడాడు. ఇవన్నీ ఊహించిన తాను మానవలోకంలో ఇంటుకు వచ్చాడు. (మానుషేలోకే).

ఆ పుట్టడం కూడా నృసింహునిలా స్తంభంలోనుంచి కాక మానవగుణంగానే పుట్టాడు (జజ్ఞే). పాము నీళ్లలో ఉండి ఎలా తనమాత్రం పైకిపెట్టి 'తాను పాము సుమా!, అని గుర్తించేలా చేస్తుందో, అలానే తనను కూడా పట్టి మానవరూపంతో పైకి కల్పిస్తూ ఆదరణ, సంభాషణ, సంభావనల ద్వారా 'శ్రీమహావిష్ణువు సుమా!' అని గుర్తింపవీలయ్యేలా చూపుతాడు. అయితే తనకుతాను మాత్రం 'మానవుణ్ణే' అని విస్పష్టంగా చెప్తాడు. ఆ చెప్పడంలో కూడా ఓ చమత్కారం ఉంది. 'ఆత్మానం మానుషమ్మన్యే రామం దశరథాత్మజమ్' అని. నన్ను నేను దశరథుని పుత్రునిగా ఉన్న మనుష్యుడనే అనుకుంటాను' అని దీని సరైన అర్థం. ఇలా ఎవరైనా స్వపరిచయం చేసికొంటే ఎదుటివారు నవ్వాలా? ఇలాగే అనడానికి కారణం నిజంగా కాదుకాబట్టి. ఈ రాముడు అసలు విష్ణువుట (విష్ణుః). వ్యాపింపచేసాడు- అని దీని అర్థం. ఎవరెవరి భక్తికి తగినట్లు వారివారి బుద్ధిలోకి వ్యాపించేవాడన్న మాట. ఈ పుస్తక ప్రారంభంలో ఉన్న శ్లోకం చూచాం గదా! అలా ఆయా వ్యక్తుల బుద్ధిలోకి వ్యాపించాడు. రావణునికి పైకిమాత్రం 'వైరి' గానే కన్పిస్తాడు. యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్' అని భగవంతునివాక్కు- ఎవరు తనని ఎలా (చూస్తే) సేవిస్తే అలాగే తానూ ఉంటాడట. రావణునిని శత్రువు కాక ఏమౌతాడు? ఈయన (సనాతనః) చాలా సనాతునడట. ప్రాచీనుడని ఒక అర్థం, సత్యాన్నే మాట్లాడటం, ప్రియాన్నే పల్కడం........ వంటి భగవద్గీతలో చెప్పబడిన విధంగా ఉండడం అనికూడా ఒక అర్థం.

ఇలా ఈ రసవత్తరమైన శ్లోకం ద్వారా విష్ణువే రామునిగా దేవతల ప్రార్థనపై రావణవధ కోసమే జన్మించిన మానవుడు అతి స్పష్టంగా తెలియడమేకాక, ఆయన సనాతన ధర్మాన్ని అనుసరిస్తూ ఉంటాడని కూడ చెప్పబడింది.

రాక్షసులని విష్ణువు సంహరిస్తూంటే, భృగుమహర్షి భార్య వారిని దాచి ఆశ్రయమిచ్చి రక్షిస్తూండేది. స్త్రీవధ అవుతుందనే భయంతో దేవతలు ఆమెని వధింపక విష్ణువుతో చెప్తే విష్ణువు ఆమెని వధించాడు. భార్యావియోగాన్ని సహింపలేని భృగువు విష్ణువునుకూడా తనలానే భార్యావియోగాన్ని పొందవలసినదని శపించాడు. ఆ శాపం అనుభవించే కాలం ఎప్పుడా? అని ఎదురు చూస్తున్న విష్ణువు, ఇది సరైన కాలమని భావించాడు. ఈ వియోగమనే వంకతో రావణవధ చేయనౌతుందని ఆలోచించాడు.

రావణ - కుంభకర్ణ - అవకాసుర - గంధర్వులనే నలుగురిని సంహరించడానికై తాను నల్గురిగా జన్మించాలని కూడ నిశ్చయించుకున్నాడు. ఇక్ష్వాకుకులపు తపస్సంపద గొప్పదీ కాబట్టి దశరథుని పుత్రులుగా జన్మించాలనుకున్నాకూడా, కౌసల్య - సుమిత్ర - కైకమ్మల తండ్రుల ఆరాధన మరింత గొప్పది కావడంవలనా, ఆ ముగ్గురూ దశరథుని భార్యలై భర్తపుణ్యంలోని సగపు పుణ్యాన్ని పొందినవారు అయిన కారణం గానూ, ఈ ముగ్గురు కాంతల గర్భవాసానా జన్మించి కావాలని వారి సేవలని పొందాడు. ఆలోచిస్తే దశరథుని కంటె ఆ ముగ్గురు స్త్రీల జన్మమే ధన్యం. వారిలో కూడ కౌసల్యది మరింత. అందుకే విశ్వామిత్రుడు "కౌసల్యా సుప్రజారామ !" అన్నాడు. (మిగిలిన ఇక్కడి విశేషాలు నా బాలకాండ 58 పుటలో, అలాగే పాయసాన్ని $1/2+1/4+1/8+1/8$ గా విభజించడంలోని రహస్యాన్ని 38 వ పుటలోనూ చూడవచ్చు).

ఇప్పుడు రాముడు 'ఇద్దరు'గా ఉన్నాడనే విషయం మరింత స్పష్టమైంది. 1. తండ్రిని సంతోషపెట్టదలచిన మానవుడు రాముడు, (భూమావనుపమస్యానుః 1/9) 2. దేవతాప్రార్థనపై రావణవధకై భార్యా వియోగాన్ని పొందబోయేరాముడు:- (దేవా నామదితిర్వజ్రపాణినా 1/8) అని. దశరథునిలోనూ ఇద్దరున్నారు. 1. ఇక్ష్వాకుకులంలోని అయోధ్యారాజైన దశరథుడు 2. లేకలేక కలిగిన సంతానమైన రాముని తండ్రియైన దశరథుడు - అని. 'అందరు పిల్లలలోకీ రాముడంటే దశరథునికి చాల యిష్టం' (తేషామపి మహాతేజా రామో రతికరః పితుః) అనే మాటకి అర్థం 'తండ్రిని సంతోషపెట్టదలచిన రాముడంటే, లేకలేకకల్గిన పుత్రుని తండ్రియైన దశరథునికి చాల యిష్టం' అని. ఇక్కడి వలకూ చిక్కులేదు. ఇక మరోవిధమైన రామ - దశరథుల వలననే అయోధ్యా కాండ నడిచేది. విష్ణువే నల్గురిగా జన్మించినప్పుడు రాముడైన తనకి మిగిలిన మూడురూపాలూ సమానమే. కాని దశరథునికి అలాకాదు. నాల్గు రూపాల్లోనూ రాముడంటేనే మిక్కిలిప్రీతి. ఈ రామునిలో ఇద్దరు రాములు, దశ రథునిలో ఇద్దరు దశరథుల్ని వివరించడానికే ఇంత వ్యాఖ్యానమున్నా. రామునికీ కృష్ణునికీ పోలికలు ఇంతకుముందు బాలకాండలో చూశాం (నా బాలకాండ పుట 45) మరోపోలిక ఇక్కడిదేమంటే, ఇక్కడి రామునిలా అక్కడి కృష్ణుడూ ఇద్దరుగా ఉంటాడు. గోపగోపికాజనాన్ని రక్షించే ఋషులకి మోక్షాన్ని ఇచ్చే కృష్ణుడనీ, రాక్షస వధచేసే కృష్ణుడనిన్నీ. 'పరిత్రాణాయ సాధూనాం, వినాశాయ చ దుష్కృతామ్' అనికదా భగవద్గీత. ఈ రెండూ చేసిననాడు ధర్మసంస్థాపనం జరిగినదన్నమాటేగదా!

అయితే భాగవతంలో కృష్ణుడు, తాను దేవుడని నిరూపించేందుకు ఎన్నో నిదర్శనాలని చూపిస్తాడు. రాముడు అలాచేయడు. అక్కడ కృష్ణుడు యశోదకొడుకైతే (అమ్మకొడుకైతే) ఇక్కడ ఈయన నాన్నకొడుకు. ఇలాటి నాన్నకొడుకైన రాముడు ఆ కొడుక్కి తండ్రైన దశరథునికి ఎలా ఉన్నాడో చూద్దాం.

## నాన్నకొడుకు, కొడుకుతండ్రికి ఎలా ఉన్నాడు ? (రాముని శీలసంపద)

రాముడు, అమిత సౌందర్యవంతుడూ, అసూయ లేనివాడూ, భుజబలవంతుడూ అయి గుణాలతో తండ్రిని పోలినవాడు. ఎదుటి వారెవరైనా మనసు గాయపడాలని కఠినంగా మాట్లాడితే కోపం తెచ్చుకోక, ప్రశాంత చిత్తంతో మాట్లాడి, ఎదుటివానిదే తప్పు అని అతనికి అతడే తెలిసికొని సిగ్గుపడేలా చేస్తాడు. (నేడు ఈ గుణమే ఎందరిలోనో లోపిస్తోంది. ఎదుటివారు ఎంతకోపంతో అంటే, అంత కోపంతోనూ సమాధానించడమే చేస్తూ శాశ్వత విరోధులౌతున్నారు. ఆ కక్షల ఆధారంగా పరస్పరం చంపుకొంటున్నారు. బాగా గొడవలు చెలరేగినప్పుడు 'Freedom run' 'శాంతికోసం పరుగు' అనే పేరుతో అంతా కలిసి పరిగెత్తి (ఇది ఎక్కడి ఆచారమో మరి ?) శాంతి వచ్చేసిందని భావిస్తున్నారు). ఎన్ని అపకారాలని తనకి చేసినా, ఒక్క ఉపకారం చేస్తే చాలు మహానందపడతాడు రాముడు.(నస్మరత్యపకారాణాం శతమప్యాత్మవత్తయా కథంచిదుపకారేణ కృతేనైకేన తుష్యతి 1/11). భగవంతుడిలాటి లక్షణం కలవాడు కాబట్టే ఇన్ని అపకారాలని దైవసంబంధంగా చేస్తున్నా, ఎప్పుడో ఒకప్పుడాయనను సేవించినరోజును గుర్తుంచుకొని రక్షిస్తూనే ఉన్నాడు గదా ! గురిపెట్టి విలువిద్యని అభ్యసించే సమయంలోనైనా సరే, జ్ఞాన - వయస్సు - శీలములచేత వృద్ధులైనవారు వస్తే వారితో మాటలాడి మరీ పంపిస్తూంటాడు. (వృద్ధస్త్వావచ్ఛింతాసక్తః తనని ఎవరైనా పలకరించి కాలక్షేపం చేస్తే బాగుండునని భావించుకునే వయసు వారిది. ఒక్కపలకరింపుచాలు వారిని మహానందపడచడానికి. వృద్ధులని ఎలా గౌరవించాలో నేర్పేది రామాయణం. రాజైనాసరే "రథంమీద వెడుతూ, బ్రాహ్మణుడు - గర్భిణి - వృద్ధుడు - బరువు మోసేవాడు - రోగి అనే వీరిలో ఎవరు ఎదురొచ్చినా తానే త్రోవనియ్యాలని చెప్పి వృద్ధులని గౌరవించమని చెప్పేది భారతం. అనుభవం కలవాళ్లు వృద్ధులు. క్లిష్ట సమయంలో ఉపాయాన్ని చెప్పగలవాళ్లు. అందుకే 'వృద్ధజనసేవ' ఉండాలని పెద్దల

మాట. పెద్దలకి నమస్కరించాలనే విధానాన్ని సంప్రదాయంగా ఏర్పఱచిన కారణం ఇదే). బుద్ధిమంతుడూ, తానే ముందుగా నవ్వుతూ పలకరించే స్వభావం ఉన్నవాడూ, (ముందుగా పలకరించడం తక్కువదనం అనుకునే రోజులు నేడు), రాబోయే కాలపు సుఖానికి ఉపాయాలని చెప్పేవాడూ, పరాక్రమం ఉన్నా గర్వంలేనివాడూ, దేవతలని మంత్రంతో ప్రార్థించి ప్రసన్నుణ్ణి చేసికోగల బ్రాహ్మణులని పూజించే బుద్ధి కలవాడూ, క్షత్రియ ధర్మంతో భూలోకంలో ఉండి ధర్మాన్ని రక్షించడం-ఈ కీర్తితో స్వర్గాన్ని పొందడమనే ఆలోచన కలవాడూ, (ముందు రావణవధ-పిమ్మట వైకుంఠ ప్రయాణం) మాటకారితనం కలవాడూ, దేశకాలవిధానం తెలిసినవాడూ, రోగికాని వాడూ, వయసుకాడూ, ఆకర్షణీయుడూ, ఎదటివారి భావాన్ని గమనించగలవాడూ, ప్రజలచేత నిత్యం మన్నన పొందేవాడూ, ప్రజలు అందఱికీ బయట తిరుగుతూన్న ప్రాణం వంటివాడూ, (....ప్రజానాం పార్థివాత్మజః బహిశ్చరయివ ప్రాణోబభూవ గుణతః ప్రియః 1/19) గా దశరథునికి కన్పించాడు.

## దశరథుని చింత

అందఱిచేత కొనియాడబడేవాడూ, ప్రజలకి నాకంటె ఇష్టుడూ (మత్తః ప్రియ తరోలోకే) అయిన రాముణ్ణి నేను బ్రతికి ఉండగానే ఎలా రాజుగా చూడగలను ? (కదా నామ సుతం ద్రక్ష్యామ్యభిషిక్తమహం ప్రియమ్- ప్రీతిరేషా కథం రామో రాజా స్యాన్మయి జీవతి 1/35-36) అని భావించి తన మంత్రులతో కలిసి ఆలోచించాక యువరాజుగా రాముని చేయాలని భావించాడు. (నిశ్చిత్య సచివైస్సార్థం యువరాజ మమన్యత 1/42). తన పుత్రుడు రాజయ్యాడనే ఆనందం తనకీ, ప్రజలకి శ్రేయస్సూ కలుగుతుందని భావించి, భూమికూడా రాముడే రాజు కావాలని భావిం చిందని గ్రహించాడు (లోకపాలోపమం నాథమకామయత మేదినీ 1/34). రాముణ్ణి రాజు చేయడానికి గ్రహగతినీ, తన శరీరస్థితినీ కూడా ఆలోచించాడు. దివిలో రాహు కేతు సంచారంలో మార్పూ, అంతరిక్షంలో అకాలపు ఎండా, వానా, భూమియందు భూకంపం, సారహీనస్థితీ అనేవి రాబోయే అశుభాన్ని సూచించే 'దివి-అంతరిక్ష-భూ ఉత్పాతాలు'. తన శరీరంలోని వృద్ధాప్యాన్నీ చూచుకున్నాడు. ఈ ఉత్పాతాలూ - ఈ వృద్ధాప్యమూ అనేవి ప్రస్తుత అయోధ్యారాజైన తనకి కష్టాన్ని కల్గించేవే అని దశ రథునికి తెలిసింది. అందుకని వీలయినంత తొందరలో యువరాజ నిశ్చయ సమా వేశం ఏర్పాటుచేయాలని నిశ్చయించి ప్రధానమైన రాజులని వివిధ నగరాలలో ఉన్న

వారినీ, జనపదాలవారినీ కూడ పిలిపించాడు. కేకయరాజునీ, జనకుణ్ణీ మాత్రం - సమయం చాలక పోవచ్చుననీ, రామ యౌవరాజ్య విషయం వారికి ఆనందదాయకం అవుతుంది కాబట్టి తర్వాత వారికి తెలుస్తుందిలే అనిన్నీ - పిలవలేదు. (దివ్యంతరిక్షే భూమౌచ ఘోర ముత్పాతజం భయమ్ - సంచచక్షే చ మేధావీ శరీరే చాత్మనో జరామ్ 1/43 - నతు కేకయ రాజానం జనకం వా నరాధిపః త్వరయా చానయా మాస పశ్చాత్తౌ శ్రోష్యతః ప్రియమ్ 1/48).

## సమావేశ తీర్మానము

ఇంద్రుని అధ్యక్షతన జరిగే దేవసభలా ఉన్న ఆ సమావేశంలో (సహస్ర చక్షుర్భగవానివామరైః 1/51) దశరథుడు మేఘగంభీర గర్జనలా అందరికీ విన్పడేలా అతిస్పష్టంగా ఇలా అన్నాడు. "ఓ సభ్యులారా! పూర్వుల అడుగుజాడల్లో ఇంత కాలమూ రాజ్యంచేస్తూ ఈ రాజలాంఛనమైన గొడుగుక్రిందే మునలివాడినయ్యాను. యోగ్యునికి కట్టబెట్టి విశ్రాంతిని పొందదలిచాను. గుణాధికుడూ, ప్రజలకి ఇష్టుడూ. వినయసంపన్నుడూ, నాకు జ్యేష్ఠుడూ అయిన రాముణ్ణి యువరాజు చేయదలిచాను. ఇతనిని వెంటనే పుష్యమీ నక్షత్రంలో పట్టాభిషేకం (రామునికి 'సంపత్తార' అవుతుంది) చేయదలిచాను. రాముడు i) అనురూపుడూ (1 తగినవాడు-2 ఉరూపం (శివరూపం) లేనివాడు అంటే విష్ణువు 3. మత్స్య-కూర్మ-వరాహ........ ఇలా అనేక రూపాలని ధరిస్తూ అను (స్యూతనానా) రూపుడు! ii) నాథుడు (1. ప్రభువు 2. 'వైనాథుడు' అని అసలు మాట. వి=పక్షులకు, నాథుడు=రాజైన గరుత్మంతుడు. అట్టి 'వినాథ' సంబంధం కలవాడు విష్ణువు. వైనాథుడు 3. పక్షులకు రాజైన హంస సంబంధం కల బ్రహ్మ తండ్రి విష్ణువే) iii) లక్ష్మీవంతుడూను. (1 సంపద పుట్టుకతో కలిగినవాడు 2. లక్ష్మి భార్యగా కలవాడు). అందుకని రాముడే రాజు కావడం ఉచితమని నా భావన నా యిష్టాన్ని నేను మీకు చెప్పియున్నాను. కాని ఇంతకంటె హితమైనది మీకు మరొకటి ఏదైనా తోస్తే చెప్పండి. మధ్యస్థుల నిర్ణయం మరింత గొప్పది." (హితమన్యద్వి చింత్యతామ్) అంటూండగానే సభ్యులంతా కురియబోతూ గర్జిస్తూన్న మేఘాలని చూచిన నెమిళ్లలాగా ఆనందం పొంది సంతోషధ్వనులని చేసారు. అంతలో పౌరజానపదులతో జనముఖ్యులూ, బ్రాహ్మణులూ ఆలోచించి "ఓ రాజా! చాలాకాలం రాజ్యాన్ని చేసిచేసి వృద్ధుడివై పోయావు గదా! ఆ మా రాముణ్ణి యువరాజుని చేయవలసినదిగా ప్రార్థిస్తూన్నాం. మహా

బాహువూ, రఘువీరుడూ, మహాబలుడూ, ఆ పెద్దదైన శత్రుంజయ మనే ఏనుగుపై వస్తూంటే, తలపై రాజలాంఛన మైన తెల్లని గొడుగు క్రింద రాముడు కన్పిస్తే చూడాలని మేమెంతోకాలం నుండీ అనుకుంటున్నాం" అన్నారు.

వీరు పల్కిన శ్లోకం ఏమిటో, ఎంత మధురమైనదో చూద్దాం ఇచ్ఛామోహి మహాబాహుం రఘువీరం మహాబలమ్ గజేన మహతాయాంతం రామం ఛత్రావృతాననమ్! (1/22) దశరథా! ఇచ్ఛామః- రాముడు రాజు కారాదనే ఆలోచన ఏ ఒక్కనికీ లేక అందఱు "ఇచ్ఛామః" ఏకగ్రీవంగా కోరుతున్నాం. కోరగలిగినవాళ్ల మేతప్ప అంగీకరించవలసినవాడివి నువ్వేకదా ! ఈ సభ ఎప్పుడు పెట్టి అడుగుతావా ? అని ఎదురుచూస్తూ సభని కూడ కోరుకుంటున్నాం.

రాముడు మహాబాహుడు సుమా ! ఎక్కడెక్కడివారికీ చేయిచాచి సహాయపడే స్వభావం వానిది. పట్టుకోలేనివానికి దురదృష్టం గాని, ఆయన చేయి ఎప్పుడూ చాచబడే ఉంటుంది కాబట్టి మహా-బాహుడు. ఆయన సాక్షాత్తు విష్ణువే కాబట్టి సత్యలోకం నుండి పాతాళం వఱకూ, ఎవరు ఆర్తనాదాన్ని చేసినా అంతదూరం పంపించి రక్షించగలంతటి (పొడుగైన చేయికల) మహా-బాహుడు.

రాముడు రఘువీరుడు కూడ. రఘువంశంలో కీర్తిప్రతిష్ఠలున్నవారిని ఎందఱినో చూచాం కాని చిన్నతనం నుండే కీర్తిప్రతిష్ఠలూ - శౌర్య ధైర్య పరాక్రమాలూ ఉన్నవాళ్లని ఎఱుగం. మానవబలానికి సాక్ష్యమైన తాటకావధనీ, దైవ బలానికి సాక్ష్యమైన అహల్యా శాపమోక్షాన్నీ చేసిన వీరుడైన రాముడు మానవ - దైవ బలాలు కల రఘువీరుడే. రఘువంశంలోని పూర్వపు రాజుల్లో ఏదో ఒకతీరు బలం ఉన్నవాళ్లే ఉన్నారు గాని దైవ మానవ బలాలు రెండూ ఉన్నతంగానూ, సమానమైన స్థాయిలోనూ కల ఇలాంటి వీరులు లేరు.

రాముడు మహాబలుడు సుమా ! 1. ప్రతి వ్యక్తికీ సహజంగా ఉండే బలం కంటె (తన వయసువారికుండే బలంకంటే) హెచ్చుబలం కలవాడు. 2. బలం అంటే సైన్యం అని కూడ అర్థం కాబట్టి ఇష్టంతో సహరించే ఎక్కువ సైన్యం కలవాడు. 3. తాటకని వధించటానికి బలానికి ఏం తక్కువ ? కాబట్టి బలమంటే శరీరబలం - సైన్యబలం అనికాక 'ధర్మబలం' అని అర్థం చేసికొని గొప్ప ధర్మ బలం కలవాడు మీ పుత్రుడు - అని ప్రజలు అన్నట్లుగా అర్థం చేసికోవాలి.

4. (మహా+అబలః=మహాబలః - మహతీ సహకారరూపిణీ అబలా యస్య సః= గొప్పదైనదీ, తనకి సహకరించేదీ అయిన అబల, (విష్ణుపత్ని లక్ష్మియే ఇప్పటి సీతగా వ్యవహరింపబడుతూ) వెంట కలిగిన వాడున్నూ ఇలాటి రాముణ్ణి (రామమ్) 1. అందరినీ ఆనందింప చేసేవాణ్ణి 2. యోగులు కూడా ఎవనియందు ఆనందాన్ని పొందుతారో అలాటివాణ్ణి 3. తనకు తానుగా ఆత్మానంద సౌఖ్యాన్ని పొందేవాణ్ణి - గొప్పదైన శత్రుంజయమనే పేరుగల ఏనుగును ఎక్కించి పురవీథుల్లో ఊరేగిస్తూ తెస్తూంటే, (గజేన మహతా ఆయాంతమ్) ఆ మా రాముడు అలా వస్తూంటే, శత్రుంజయ గజానికి చేసిన అలంకారాన్నే చూడాలా ? రాముని ఠీవినే చూడాలా ? ఇలాంటి అదృష్టాన్ని కల్పించిన దశరథుణ్ణి చూడాలా ? లేక ఈ ఉత్సవానికి విచ్చేసిన జనసందోహాన్ని చూడాలా ? - ఓ దశరథమహారాజా ! ఆ రామునికి పట్టిన ఆ అదృష్టాన్ని చూస్తూన్న మా వల్ల దృష్టిదోషం (దిష్టి) ఆ రామునికి కలుగుతుం దేమో ననిపిస్తోంది." అని ఈ విధంగా పౌరులూ, జానపదులూ పల్కుతూంటే దశరథమహారాజు ఆసనం నుండి లేచి "ఓ జనులారా ! ఇక్ష్వాకువంశంలో ఏ రాజైనా మరింతకాలం కొనసాగబడాలనే కోరుకోబడ్డాడు గాని — ఇలా ప్రకటించిన వెంటనే ఫలాని వానిని రాజుగా చేయండి - అని ప్రార్థింపబడినవాడు లేడు. నా పితృపితామహులు పరిపాలించిన తీరుగానే పరిపాలించానే ! ఎందుకని వెంటనే మీరందరూ రాముడే రాజు కావాలని అడుగుతున్నారు ? ఈ వృద్ధుని పీడ పోవాలి అనా ? అన్నాడు.

ఇలా అడగడంలో, రాముడంటే దశరథునికి గల ఇష్టమే కారణం. తన పుత్రుణ్ణి తాను మెచ్చుకోవడం కంటె ఆ పుత్రుణ్ణి 'లోకులు పొగిడితే' విని ఆనం ఆనందిద్దామని ఆయన అభిలాష. ఇలా అడిగితే బాగుండునే ! రాముని గుణాలని చెప్పుకొని సంతోషించాలని ప్రజల ఆలోచన. దశరథుడు అడుగనే అడిగాడు. ప్రజా సమూహమంతా రాముని గుణగణాలని చెప్పటం ప్రారంభించారు.

## త్రేతాయుగంలో ఉన్న నిజమైన ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్యం అంటే ఏమిటో ఎలా ఉండాలో, ఎలా ఉంటే అది ప్రజా స్వామ్యమని అనిపించుకుంటుందో, ఆ విధానం రామాయణకాలంలో అంటే త్రేతా యుగంలోనే ఉంది. కేవలం తన పుత్రుని గొప్పగుణాలని విని మురిసిపోవాలని దశరథుని ఆలోచన, అభిలాష కాదు. ఆనాటి సభలో ఉన్నది ఎవరో కాదు. ఒకరిని

యువరాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేయాలంటే ఎవరెవరు కావాలో వారందరూ ఆ సభలో ఉన్నారు. మహారాజుగా దశరథుని బాధ్యత ఏమంటే, "రాముణ్ణి యువరాజు చేయ వచ్చునా ?" అనే విషయాన్ని చర్చకి వారిముందు ఉంచడమే. అందుకే, రాజనీతి చతురుడైన దశరథుడు రామపట్టాభిషేక విషయాన్ని వారిముందు ఉంచాడు. శ్రీ మద్రామాయణాన్ని అర్థం చేసికోలేని నేటికాలపు కొందరు అనుకున్నట్లుగా అనాడు ప్రజాస్వామ్యమే లేకుంటే, దశరథుడు తన పుత్రుని పట్టాభిషేక విషయాన్ని ప్రస్తా వించి, "మీరు అనుమతి ఇయ్యండి" అని ప్రజలని కోరవలసిన అవసరమే లేదు గదా ! కాని అలా కోరడం ధర్మబద్ధంగా రాజ్యాన్ని ఏలుతున్నాడనడానికి నిదర్శనం కదా !

పట్టాభిషేకానికి అర్హుణ్ణి నిర్ణయించే అధికారంగల వారున్న సభలో, ఆయా అధికారులని దశరథుడు "మా రాముడు అర్హుడేనా" అని అడగలేదు. పట్టాభిషేక వార్తని ప్రకటించగానే వారే చెప్పసాగారు.

### యువరాజుని ఎన్నుకోవలసిన అధికారులు ఎవరు ?

1) సభ 2) సమితి 3) స్త్రీలు 4) బ్రాహ్మణులు 5) ప్రజలు 6) భూమి 7) కాలము 8) పురోహితులు 9) ఇందరూ ఎవరిని ఎన్ను కొన్నారో ఆ అభ్యర్థి అంగీకారమున్నూ. ఈ రోజుల్లో కూడా ఒకణ్ణి ఉద్యోగిగా నియమించాలంటే కొందరు సభ్యుల అంగీకారం ఉండాలనే నియమం కన్పిస్తుంది. ఆ నియమం త్రేతాయుగం నాటిదన్నమాట.

త ఈం విశోన రాజానం వృణానమ్ (ఋగ్వేదం 10/124-8) త్వాం విశో వృణతాం రాజ్యాయ (III 4/2) అనే ఋగ్వేదమంత్రాల ప్రకారం ప్రజలే రాజుని ప్రజాస్వామ్య విధానం ప్రకారం ఎన్నుకొంటూ ఉండేవారు. అయితే ఆ ఎన్నుకొన్నబడిన వాణ్ణి తిరిగి సభ-సమితి అనే రెండు సభలవారూ క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నుకొన్నబడినవాని ఎన్నిక "చెల్లుతుందని" తీర్పునిస్తూండేవారు.

సభా చమాం సమితిశ్చావతాం ప్రజాపతే ర్దుహితరే సంవిధానే- యే గ్రామాః యదరణ్యం యా స్సభా అధిభూమ్యామ్ (అధర్వ వేదం 7/12–1) యేసంగ్రామాః సమితయః తేషు చారు వదామ్యహమ్ (అ. వే 12/1–56) అనే ప్రమాణాల ప్రకారం సభ-సమితి అనే రెండు

ఉండేవని తెలుస్తుంది ఆ సంప్రదాయమే నేడు కేంద్రంలో లోక్‌సభ - రాజ్యసభ అనిన్నీ, రాష్ట్రంలో శాసనసభ - విధానమండలి (ఒకప్పుడు ఉండేది) అనిన్నీ, కొనసాగుతూ ఉన్నాయి.(నేటికాలపు భేదాభి ప్రాయాలుమాత్రం వీటిలో ఉండేవికావు).

అలాంటి సభ - సమితి అనేవి కలిసిన సమావేశం అనాడు దశరథుడు చేసినది. ఆ సమావేశంలో బ్రాహ్మణులూ, జనముఖ్యులూ (V. I P. s) మాత్రమే జనాభిప్రాయాన్ని వెల్లడించవలసిన వాళ్లు. ఆ రెండు తెగలవాళ్లూ జనాభిప్రాయాన్ని అందరివద్దనుండీ సేకరించి ఇలా చెప్పారని అర్థం చేసికోవడం తప్పుకాదు. ఎందు చేతనంటే ఈ పరిషత్తులో అనేకుల అభిప్రాయాలు చెప్పబడుతున్నాయి కాబట్టి, ఆ పరిషత్తులో ఏ ప్రతినిధుల అభిప్రాయాలు ఏ బ్రాహ్మణులూ, జనముఖ్యులచేత మాత్రమే చెప్పబడాలో, ఆ ప్రతినిధులు కూడ అక్కడే ఉంటడమనేది ఆనందించ దగిన అంశం. 'మీమీ అభిప్రాయాలు తెల్పండి' అనిదశరథుడనగానే బ్రాహ్మణులూ, జనముఖ్యులూ ఆ ప్రతినిధులనుండి విషయాన్ని సేకరించి అలా చెప్పారని(బ్రాహ్మణా జనముఖ్యాశ్చ పౌర జానపదైస్సహ సమేత్య మంత్రయిత్వాతు సమాగత బుద్ధయః ఊచుశ్చ మనసా జ్ఞాత్వా వృద్ధం దశరథం నృపమ్ 2/20) వాల్మీకి స్పష్టంగాచెప్పాడు. ఇక ఎవరెవరి అభిప్రాయం ఎలా బ్రాహ్మణ జనముఖ్యులచేత చెప్పబడిందో, (అది కూడ ఆ అభిప్రాయాన్ని ప్రకటించిన వారి సమక్షంలోనే) ఆ విశేషాలని వివరంగా చూద్దాం. ఎందుకు ఈ వివరణ మనుకోరాదు. దశరథుడు రాజ్యాన్ని ఇయ్యడంలోని ఔచిత్యాన్నీ – ధర్మవిధానాన్నీ పరిశీలించడమనే ముఖ్యాతి ముఖ్యఘట్టం కదా ఇది !

## 1. 'సభ' అభిప్రాయ మేమిటి ?

ప్రియవాదీ చ భూతానాం సత్యవాదీ చ రాఘవః ।
బహుశ్రుతానాం వృద్ధానాం బ్రాహ్మణానా ముపాసితా॥

**(2/33)**

'రాజా ! రాముడు కేవలం సత్యాన్నే లేదా కేవలం ప్రియమైన మాటలనే చెప్పడు. ప్రియమైనది కదా ! అని అసత్యాన్ని చెప్పడు. సత్యమైన అప్రియవార్తని చెప్పవలసివస్తే ఆ అప్రియాన్ని తట్టుకోగల రీతిలో ధైర్యాన్నీ ఓదార్పునూ ఇస్తూ ప్రియంగానే చెప్తాడు. ప్రతి పుష్పం నుండీ మకరందాన్ని తుమ్మెద గ్రహించినట్లు శీలవంతులూ - జ్ఞానవృద్ధులూ అయిన బ్రాహ్మణుల ఇండ్లకు తానే పోయి (వారిని రప్పించుకొనగలిగి కూడా) ఎన్నెన్నో ముఖ్యవిషయాలని తెలిసికొంటూ ఉంటాడు.

రాజ లక్షణాలైన ప్రియహిత సత్యవాక్యాలని పల్కడం, నిష్పక్షపాతబుద్ధి - పగ తీర్చుకొనే బుద్ధి ఉండని వేదవేత్తలైన బ్రాహ్మణుల యెడ వినయం రామునిలో ఉండడం చేత రాముడే పట్టాభిషేకానికి తగును'. అన్నది సభ.

### 2. 'సమితి' ఏమంది ?

నాస్య క్రోధః ప్రసాదశ్చ నిరర్థోఽస్తి కదాచన।
హంత్యేవ నియమాద్వధ్యా నవధ్యే న చ కుప్యతి॥ (45)

'రాజా ! సభవారు చెప్పిన అభిప్రాయం ప్రకారం రాముడు కేవలం ప్రియ హిత సత్యవాక్యాలని చెప్పేవాడూ, వినయపరుడూ మాత్రమేనని భావించకు. అతడు ధర్మపరుని విషయంలో అనుగ్రహించినా, అధర్మపరుని విషయంలో ఆగ్రహించినా ఆ ఆగ్రహ - అనుగ్రహాలు వ్యర్థంకావు. అంటే ధర్మవిధానం ప్రకారం చంపదగిన వాడని నిర్ణయింపబడితే విడిచిపుచ్చడు. అలాగే రక్షింపబడవలసిన వాడయితే దండిం పనీయడు. నేరానికి తగినట్లు శిక్షని వేయడమూ - ఒకసారి నిర్ణయించి వేయబడిన శిక్షని మళ్లీ ఆలోచించి శిక్షని మార్చడం లేదా తగ్గించడమూ అనేవి రామునిలో లేవు. 'నేరమూ - శిక్ష!' విషయంలో ధర్మబద్ధంగా ఉండడం రాజలక్షణా లలో ముఖ్యమైనది. (నేటిరోజున 'నేరమూ-శిక్ష' విధానం సక్రమంగా ఉంటే ఇన్ని నేరాలు జరుగవనిపిస్తుంది). రాజా ! ఈ రాముని లక్షణం పట్టాభిషేకానికి అతణ్ణి అర్హునిగా చేస్తోంది' అని అన్నది సమితి.

### 3. బ్రాహ్మణులు ఏమన్నారు ?

దేవాసురమనుష్యాణాం సర్వాస్త్రేషు విశారదః ।
సమ్యగ్విద్యావ్రత స్నాతో యథావత్సాంగ వేదవిత్ ॥ (2/34)

రాజు కాదగినవాడు నేర్చుకోవలసిన విద్యలు రెండు. ఒకటి సాధారణవిద్య (Basic qualification). రెండవది విశేషవిద్య లేదా ఔద్యోగిక విద్య (Professional Education). ఈ రెంటినీ రాముడు సంపూర్ణంగా ముగించాడని బ్రాహ్మణులంతా పల్కి, రాజునకుండవలసిన విద్యాసంస్కారం - 'యథావత్' - ఎలా ఉండాలో అలా ఉందని దృఢపఱచి రాజుగా రాముడే తగునని పల్కారు. సాధారణ విద్య ఆ రోజుల్లో వేదం. ఔద్యోగిక విద్య అనగానే క్షత్రియులందఱికీ కూడా

అస్త్ర-శస్త్ర విద్యయే ఔతుంది. కారణం 'క్షత్రాత్ త్రాయతే' (ఎవరివాని దెబ్బనుండి రక్షించేవాడు) అనికదా వ్యుత్పత్తి. ఈ విద్యార్థత ప్రకారం రాముడు తగినవాడే అని బ్రాహ్మణులు పల్కారు.

### 4. ప్రజలు ఏమన్నారు ?

ఇచ్ఛామో హి మహాబాహుం రఘువీరం మహాబలమ్ ।
గజేన మహతాయాంతం రామం ఛత్రావృతాననమ్ ॥ (2/22)

రాజా ! మేమంతా రాముడే రాజు కావాలని (ఇచ్ఛామః = కోరుతున్నాము (బహువచనం) ఏకగ్రీవంగా కోరుతున్నామని నీకూ తెలుసుకదా ! (హి). కారణం ఏమంటావా ? ఆయన మహాబాహుడు. సాముద్రికశాస్త్రం ప్రకారం మోకాళ్ళ వఱకూ ఉన్నచేతులు కలిగిఉండడం (అజానుబాహుత్వం) రాజలక్షణం. ఒట్టి చేతులపొడుగు దనమే కాక, ఏ ఒకరో ఇద్దఱికో కాక, ఎందఱికో సహాయం చేసే చేతులున్న నీ పుత్రుడు మహాబాహుడు సుమా ! (ఇంక కొంతలోతుకు వెడితే సత్యలోకమునుండి ఏ లోకంలో వారు ఏ ఆర్తితో ఒక్కమాఱు ప్రార్థించినా వెంటనే చేతిని ఊతగా పంపించే లక్షణం ఉన్నవాడు ఆ రాముడు. సాక్షాత్తు విష్ణువు కాబట్టి ఏ లోకానికైనా పంపగలంతటి నిడుపైన చేయికలిగి ఆయన మహాబాహుడు).

రాజా ! మీ వంశంలో యుద్ధంలో ఓడి పారిపోయిన వాడున్నాడు. కపిల మహర్షి కోపానికి భస్మమై మరణానంతరం చేసే క్రియలు లేక కొంతకాలం భస్మ రాసులుగా పడిఉన్నవారున్నారు. యజ్ఞంచేస్తూ గుఱ్ఱాన్ని పోగొట్టుకున్నవారున్నారు, సరయూనదీ జలాల్లో అయోధ్యాప్రజలని ముంచుతూ ఆనందించే స్వభావం కలవారు న్నారు. సంతానం లేక దుఃఖిస్తూ నువ్వున్నావు. కాని రఘువంశంలో ఏ చింతా లేక (నా విజిత్య నివర్తతే) యుద్ధానికిపోయి పరాజయం ఎఱుగక తిరిగివచ్చే రాము డున్నాడే ఆయన నిజంగా రఘువీరుడు. తాటకను చంపినవాడూ, సుబాహుని మట్టి కఱిపించినవాడూ, మారీచుని మదమణగించినవాడూ పరశురాముని గర్వాన్ని ఖండించినవాడూ అయిన నీ పుత్రుడు మహాబలుడు. (మహా+బలుడు = మహతీ రక్ష ణీయా అబలా యస్యసః = విష్ణుభార్య అయిన, గొప్పదైన సీతారూపములో ఉన్న, లక్ష్మిని రక్షించవలసిన బాధ్యత కలిగిఉన్నాడు అని మహర్షుల భావం).

ఇలాటి రాముణ్ణి, పట్టాభిషేకానికి గుర్తుగా ఊరేగించే శత్రుంజయమనే పేరున్న ఏనుగునెక్కించినపుడు చూడాలని ఉంది. ఆయన ముఖానికి దృష్టిదోషం

తగులకుండా ఆ నెత్తిపై రాజలాంఛనమైన గొడుగు ముఖాన్ని కప్పుతూంటే చూడాలని మా అందరికీ ఉంది. అయినా, ప్రజలైన మేము (ఇచ్ఛామః) మా కోరికను చెప్ప గలవాళ్లమే కాని తీర్చే అధికారం నీదికదా! అయినా ఇందరు కోరుతుంటే మా కోరిక కాదంటావా? కాబట్టి పట్టాభిషిక్తుణ్ణి చెయ్యి' అని అన్నారు ప్రజలు.

### 5. స్త్రీల అభిప్రాయమేమిటి ?

ఆనాడు స్త్రీలకు ప్రాధాన్యం లేదని నేటిస్త్రీలు ఎందుకో (పాపం!) వాపో తూంటారు. ఇతిహాసాలు చదువక - చూడక - చెప్పేది వినక. రాజ్యానికి ఎన్ను కోబడే వారి విషయంలో స్త్రీల అభిప్రాయమూ స్వీకరించేవారు.

**స్త్రియో వృద్ధా స్తరుణ్యశ్చ సాయంప్రాతస్సమాహితాః**
**సర్వాన్ దేవాన్ నమస్యంతి రామస్యార్థేయశస్వినః॥ (2/52)**

సహజమైన గాంభీర్యంతో తమ అభిప్రాయాన్ని బయటపెట్టని స్త్రీలూ, వార్ధక్యం బాగా వచ్చిన కారణంగా ఏ విషయాన్నీ లక్ష్యపెట్టని వృద్ధురాండ్రూ, యౌవనంలో ఉండి ప్రపంచంలోని ఏ విషయమూ పట్టకుండాఉండే తరుణస్త్రీలూ కూడా, రోజూ ప్రొద్దునా సాయంకాలమూ అందరు దేవతలకీ నమస్కరిస్తూ 'రాముడే రాజు అయ్యేలా చేయవలసినది' అని ప్రార్థిస్తున్నారు. ఏ ఉదయమో, లేక సాయం త్రమో ఏ ఒక్కణ్ణో దేవుణ్ణి ప్రార్థిస్తే ఎక్కడ రాముడు పట్టాభిక్తుడు కాడోనని అంతటి ఇష్టంతోఅందరూ అన్నివేళలా స్త్రీలు నమస్కరిస్తున్నారట. కాబట్టి రాముడే పట్టాభిషిక్తుడు కావాలని అన్నారు స్త్రీ సమూహం అంతా.

### 6. పురోహితుల ఆలోచనం ఏమిటి ?

**వత్సశ్శ్రియసి జాతస్తే దిష్ట్యాసౌ తవ రాఘవ।**
**దిష్ట్యా పుత్రగుణైర్యుక్తో మారీచ యివ కాశ్యపః॥ (2/49)**

భావికాలంలో రాబోయే శుభాన్నీ హితాన్నీ చెప్పేవారు పురోహితులు. వాళ్లంతా అన్నారు 'రాజా! నీ అదృష్టంకొద్దీ నీకు ఇతడు పుత్రుడుగా గలిగాడు. నీకు శ్రేయస్సుని కలుగజేస్తాడు. పుత్రునికి ఉండవలసిన గుణాలు ఏవి ఉన్నాయో వానిని అన్నింటినీ కలిగినవాడు (పరమాత్మ అయిన విష్ణువు నిర్గుణుడు. కాని ఓ రాజా! నీకు పరలోకంలో సుఖమైన శ్రేయస్సుని కలుగజేసేందుకై ఇతడు పుత్రగుణాలతో

పుట్టి నిర్గుణుడు అయినా సగుణుడు (గుణాలు కలవాడుగా) అయ్యాడు. 'ముందునాటికి ఏం జరిగినా దుఃఖపడకు'— అని లోతుఅలోచనతో పలికారు) కాబట్టి 'రాముణ్ణి రాజుగా చెయ్యి' అన్నారు పురోహితులు.

### 7. 'భూదేవి' ఏమంది ?

తమేవం గుణసంపన్నం రామం సత్యపరాక్రమమ్ ।
లోకపాలోపమం నాథ మకామయత మేదినీ॥ (2/48)

ఇందఱు అంగీకరించినా ఏ భూమిని పరిపాలించాలో ఆ భూమి అంగీకరించకపోతే ధాన్యాలూ ఉండవు. భూకంపాదులూ సాగి ప్రజానష్టమూ ఔతుంది. ఆ సభలో భూదేవి అభిప్రాయం ఇది. 'రాజా! భయార్తులైన వారికీ, శరణుకోరిన వారికీ దిక్కుగా ఉండడమే తనవ్రతంగా కలిగినట్టీ, నాకు ముందున్న వారందఱూ చెప్పిన సద్గుణాలన్నీ కలిగినట్టీ, ఆ రాముడు సాక్షాత్తు లోకపాలురతో సమానుడు. (ఉపమః = ఉప సమీపే మా యస్యసః = లక్ష్మి తనకి తోడుగా కలవాడు - సాక్షాత్తు విష్ణువేసుమా! శ్రీదేవి ఆయనవెంట ఉంటే భూదేవిని నేను అంగీకరిస్తున్నానుగదా!) 'ఈ రామునికి నన్ను (భూమిని) పాలించే అధికారం కట్టపెట్టవలసినది' అని అంది. (భూదేవి నిజంగా సభలో ఉండి ఇలా అన్నదా? అని ఆలోచించకూడదు. భూమికి సంబంధించిన ఏ ఉపద్రవాలూ లేకపోవడమే ఆమె అంగీకారంగా భావించాలి. ఈ విషయాన్నే సభలో పౌరజానపదులతో ఆలోచించి బ్రాహ్మణులు చెప్తున్నారు).

### 8. సేనాధిపతులు ఏమన్నారు ?

యదా వ్రజతి సంగ్రామం గ్రామార్థే నగరస్య వా ।
గత్వా సౌమిత్రిసహితో నాఽవిజిత్య నివర్తతే ॥ (2/37)

రాజా! అయోధ్యానగరం గూర్చిగాని, ఈ నగరపు ఏలుబడిలో ఉన్నగ్రామాల ప్రయోజనాన్ని గూర్చిగాని ఏ యుద్ధానికి వెళ్లినా రాముడు లక్ష్మణునితో కలిసి విజయాన్ని సాధించే వస్తాడు. గెలుపులేక తిరిగిరావడమనే ప్రశ్నేలేదు. ఈ అదృష్టవంతుడు మాకు రాజుకావడం అంటే మాకూ అదృష్టాన్నీ, యుద్ధంలో పాల్గొనాలనే ఉత్సాహాన్నీ కల్గించడమే కదా! కాబట్టి 'రాముణ్ణి రాజుగా చెయ్యవలసినది' అని సేనాధిపతులన్నారు.

## 9. ఏ విభాగానికి చెందనివారు ఏమన్నారు ?

పైన అనుకున్నట్టుగా సభ—సమితి........ ఇలా ఏదో ఒక విభాగానికి చెందిన వాళ్లు తమతమకి సంబంధించిన విధంగా చెప్పి రాముని యువరాజపట్టాభిషేకానికి అంగీకారాన్నీ, ఉత్సాహాన్నీ చెపితే ఏ విభాగానికీ చెందనివారంతా తమతమ అభిప్రాయాలని తమలోనే ఉంచుకొనక, ఆ సంతోష సమయంలో తమమాట కూడా విన్పించుకోవాలని ఇలా చెప్పారు.

వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః ।
ఉత్సవేషు చ సర్వేషు పితేవ పరితుష్యతి॥ (2/41)

రాజా ! ఎవరికి ఏ కష్టం వచ్చినా అది తనకే వచ్చిందన్నట్లుగా వారి కంటె కూడా దుఃఖపడి ఎదుటివారికి ఊరట కల్గిస్తాడు దుఃఖకాలంలో వారికి ధైర్యాన్ని కలిస్తాడు. ఏ సంతోషసమయం ఏ యింట వచ్చినా ఆ యింటి యజమాని అయిన తండ్రి ఆనందపడినంతగా సంతోషపడి సంతోషంలో ఎక్కువ భాగస్వామి అవుతాడు. యుద్ధంనుండి తిరిగివస్తూ ఇంకా రథాన్ని దిగకుండా, లేదా ఏనుగుమీద నుండే మమ్మల్ని 'కుశలమా?' అని అడుగుతూంటాడు. సుఖాన్ని కల్గించడంలో చంద్రునిలా చల్లనైనవాడూ (తాను క్షీణిస్తూ కూడా సుఖాన్ని ఇచ్చేవాడు) ఓర్పులో భూదేవి వంటి వాడూ, బుద్ధిలో బృహస్పతికి సాటియైనవాడూ, పరాక్రమంలో ఇంద్రునితో సమానుడైనవాడూ నీ రాముడు.

"బలమారోగ్య మాయుశ్చ రామస్య విదితాత్మన :- దేవాసురమనుష్యేషు సగంధర్వోరగేషుచ-ఆశంసతే జనస్సర్వో రాష్ట్రే పురవరే తథా - ఆభ్యంతరశ్చ బాహ్యశ్చ పౌరజానపదో జనః (2/51)"

రాజా ! దేవతలు - వీరంటే గిట్టని రాక్షసులు - మనుష్యులు - గంధర్వులు - నాగులు - మన అంతఃపుర జనం - జనపదాల్లో ఉండే జానపదులు - మన పురంలో ఉండే పౌరులూ - ఇంకా రాష్ట్రంలో - ఇతరదేశాల్లో ఉండే అందరూ, రాముడు బలంతోనూ, ఆరోగ్యంతోనూ దీర్ఘాయుష్యం కలవాడు కావాలని కోరుతున్నారు. రాజా ! ఇన్నిమాటలెందుకు ? ఈ మొత్తం సమావేశమంతా చూచావుగా. అన్ని విభాగాలతో కూడిన సమావేశం మొత్తం అభిప్రాయాన్ని ఒక్కమాటలో విను.

"తం దేవదేవోపమ మాత్మజంతే సర్వస్య లోకస్య హితే నివిష్టం
హితాయ నః క్షిప్రముదారజుష్టం ముదాభిషేక్తుం వరద ! త్వమర్హసి॥
(2వ సర్గ చివరిశ్లోకం)

"రాజా ! విష్ణువుతో సమానుడై నీకు పుత్రుడుగా ఉండి, లోకక్షేమమే తనకు ముఖ్యంగా భావించే రాముణ్ణి మా సుఖం కోసం (అతని సుఖము కోసం కాదు) సంతోషంతో యువరాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేయవలసినది. ఎన్నో వరాలని అనుగ్రహించే ఓ రాజా ! సజ్జనసేవ్యుడైన రాముణ్ణి రాజు చేయడమనే వరాన్ని కూడా అనుగ్రహించి 'వరదుడు' అని అనిపించుకో!' అని ముగించారు.

## 10. అనుకూల కాలం - దశరథుని సంతోషం.

ఈ మాటలకి పరమానందపడ్డ రాజు, వారందరూ నిలబడి నమస్కరిస్తూ ఉన్న దృశ్యాన్ని చూచి, ప్రసన్నతతో చూస్తూ, 'ప్రజలారా ! ఎంతో సంతోషంతో ఉన్నాను. నా అదృష్టం సామాన్యం కాదు. నాకు జ్యేష్ఠపుత్రుడు మీకు ప్రియుడయ్యాడంటే అందునా అతణ్ణి యువరాజుగా చేయవలెనని అంతా ఏకకంఠంతో అంటున్నారంటే ఆ ఆనందాన్ని చెప్పగలనా ? మరొక్క మాట. ఈ కాలం చైత్రమాసం కూడ రమణీయమై పూలతో నిండిన అడవిలా అన్పిస్తూ ఇతరులకంటె రాముడు ప్రధానమైనట్లు అన్నికాలాల కంటె వేరుగా ఉంది. అందరికూ సుఖాన్ని కల్గిస్తూ అందరూ రాముణ్ణి కోరినట్లు అన్ని మాసాలూ ఈ మాసాన్ని గొప్పదిగా చేస్తున్నాయి. పూలతో ఈ మాసంలో అడవి అలంకరింపబడ్డట్లు మన నగరమూ అలంకరింపబడి ఉంది. రామునికి బంగారుకిరీటం రాబోతున్న ఈ సమయంలో ముందుగా పుష్ప కిరీటాన్ని కాలమే ఇచ్చిందా? అన్నట్లుంది' అని సంతోషంతో పలుకగానే జనులంతా ఆనందధ్వనులని చేసారు. కొంత సేపటికి ఆ ధ్వనులు తగ్గగా, యువరాజుగా అభిషేకించటానికి ఏమేమికావాలో వాటిని ఏర్పాటు చేయవలసినదిగా వసిష్ఠుణ్ణి ప్రార్థించాడు దశరథుడు. కాబట్టి కాలంకూడా పట్టాభిషేకానికి అంగీకరించిందన్నమాట.

వసిష్ఠుడు వామదేవునితో కలిసి అంతఃపురంలో కూడ ప్రవేశించగల అధికారం ఉన్న సుమంత్రుణ్ణి, మిగిలిన మంత్రులతో పిలిచి యౌవరాజ్య పట్టాభిషేకానికి ఏమేమి వస్తు సంభారాలు కావాలో వానినన్నింటినీ వివరంగా చెప్పి తెల్లవారేలోగా ఏర్పాటుచేయాలని ఆజ్ఞాపించాడు. వారు మరుక్షణంలోనే అన్నీ సిద్ధంగా ఉన్నాయని

చెప్పారు. రామునికి పట్టాభిషేకం కావాలనే ఉత్సాహంతో, ఎదురుచూపుతో ఏనాడో అన్నీ సిద్ధపఱచారు మంత్రులు. (ఏర్పాట్లు ఎలా ఉన్నాయనేది ముందు చూడ బోతున్నాం.)

## 11. సుమంత్రుని పిలుపుతో రాముని రాక.

ఏర్పాట్లన్నీ అయ్యాయని విన్న దశరథుడు అంతరంగిక మంత్రి సుమంత్రుణ్ణి పిలిచి 'మంత్రీ! **ధర్మ - అధర్మాలని గూర్చి పెద్దలచే చక్కగా బోధింప బడిన రాముణ్ణి** వెంటనే తీసికొనిరా!' (రామః 'కృతాత్మా' భవతా శీఘ్ర మానీ యతామితి) అన్నాడు.

ఆ సభలో తూర్పు - దక్షిణ - పశ్చిమ - ఉత్తరదేశాల రాజులూ మ్లేచ్ఛదేశపు ప్రభువులూ - వన - పర్వతరాజులూ - ఆటవికులూ అంతా ఉండి, దేవతలు ఇంద్రు నిలా వీరంతా ఆ దశరథుణ్ణి సేవిస్తూ ఉన్నారు.

**ప్రాచ్యోదీచ్యాః ప్రతీచ్యాశ్చ దాక్షిణాత్యాశ్చ భూమిపాః-మ్లేచ్ఛా**
**చార్యాశ్చ యే చాన్యే వనశైలాన్త వాసినః - ఉపాసాం చక్రిరే**
**సర్వే తం దేవా ఇవ వాసవమ్ ॥ (3/25)**

ఆ దశరథుడు రథంలో వస్తూన్న రాముణ్ణి ఇక్కడినుండే చూచాడు. **అతని** ఆనందానికి ఆ కళ్లు చాలలేదు. మదించిన ఏనుగులా నడిచే రాముడు తనని సమీ పిస్తూంటే దశరథుడు ప్రాసాదాన్ని కొద్దిగా ఎక్కి మరీచూచాడు రామ సౌందరా (ఇంతకు పూర్వపు రాముడు తనకే ప్రియుడు. ఇప్పటి రాముడు సర్వజనప్రి ఇంతకుముందు తన మనోరథం ఎలా ఔతుందోనని భయపడుతూన్న తండ్రి ఇప్పుడు యువరాజుకి తండ్రి తాను. ఆ ధైర్యంతో, ఆనందంతో యువరా రాముణ్ణి చూస్తున్నాడు. కాని, వాల్మీకి మహర్షి రాముణ్ణి 'మదించిన ఏనుగు న కలవాడు' (మత్తమాతంగగామినమ్ 3/27) గా చెప్తాడు. ఏనుగుపై బరువు వేసి వేయకున్నా ఒకేవిధంగా నడుస్తుంది. ఆ బరువుని, ఒక బరువుగానే తాను లెక్క చేయదు. మఱింత వేయవద్దని అనదు-తీసెయ్యమని కోరదు. అలాగే సుఖమున్నా దుఃఖమున్నా ఒకేవిధంగా ఉంటాడు రాముడు. కష్టపరంపర వచ్చినా సుఖం కావాలని మరోవిధంగా అధర్మప్రయత్నాన్ని చేయడు. సుఖపరంపర కల్గిందని గర్వించనూ గర్వించడు. పోలికని చెప్పడంలో కాళిదాసుకి ముందువాడు వాల్మీకి.)

వస్తూనే రాముడు, అందరితో సభలో ఉన్న దశరథునికి పాదాభివందనం చేస్తూ తన పేరునీ గోత్రాన్నీ చెప్పుకున్నాడు.

'ఇలా ఎందుకు చెప్పుకోవాలి ?'

దీన్నే 'ప్రవర' అంటారు. 'చతుస్సాగర పర్యంతం గోబ్రాహ్మణేభ్యశ్శుభం భవతు' ఆంగీరస బార్హస్పత్య భారద్వాజ త్రయార్షేయ ప్రవరాన్వితః యజుర్వేదీ - తైత్తిరీయశాఖాధ్యాయీ - ఆపస్తంబ సూత్రీ శ్రీనివాసశర్మాహం, భో అభివాదయే' అని అనడం ప్రవర చెప్పుకోవడం అంటే. నాలుగు సముద్రాలు నిలిచి ఉండేంత వరకూ ఎవరికీ అపకారం చేసే లక్షణం లేనట్టిన్నీ, ఒకరు అపకారం చేసినా తిరిగి అపకారం చేయాలనే ప్రతీకారబుద్ధి లేనట్టిన్నీ సహజంగా సాధుస్వభావం కల్గినట్టిన్నీ, గోవులకూ- బ్రాహ్మణులకూ శుభం జరుగుగాక ! అంగిరుడూ—బృహస్పతి—భరద్వాజుడు అనే ముగ్గురు ఋషులతో ఏర్పఋప బడినదీ, భరద్వాజుడు అధిపతిగా వ్యవహరింపబడుతూన్నదీ అయిన ఈ ముగ్గురితోకూడిన ఋషి సంఘానికి చెందినవాణ్ణి నేను కాబట్టి భారద్వాజ=సగోత్రుణ్ణి. (అంటే భరద్వాజ మహర్షితో సమానమైన గోత్రం కలవాణ్ణి, లేదా భరద్వాజగోత్రుణ్ణి. అంతేకాని భారద్వాజస+గోత్రుణ్ణి అని ఇలా పదవిభాగం చేయకూడదు, భరద్వాజగోత్రం లేదా భారద్వాజ+సగోత్రం — అన్నమాట).

ఆ మహర్షుల ఆశీస్సులు కల్గినవాణ్ణీ, యజుర్వేదాన్ని చదివేవాణ్ణీ, శుభ-అశుభ సందర్భాలలో ఆపస్తంబమహర్షి చెప్పిన పద్ధతి ప్రకారం నడిచేవాణ్ణీ అయి ఫలాని పేరుకలనేను, నమస్కరిస్తున్నానని దీని భావం. శర్మాహం+భో అభివాదయే అని పలకాలి గాని శర్మా+అహం భో అభివాదయే అనకూడదు. శర్మ అయిననేను + అయ్యా నమస్కరిస్తున్నానని అహంకరించకుండా పల్కాలి గాని, శర్మని + 'నేను, నమస్కరిస్తున్నానని అహంకరింపరాదు. (గోబ్రాహ్మణుల మాహాత్మ్యం తెలియాలంటే నేను రచించిన 'మాంగల్యతంతునానేన' (పెళ్లిమంత్రాలకి అర్థం) 33వ పుట గాని, 'బాలకాండ' 99—102 పుటలుగాని చూడగలరు. తండ్రికి నమస్కరించడమే అరుదైన ఈ కాలంలో, అందునా నలుగురిలో నమస్కరించడం నామోషీగా భావించే ఈ కాలంలో ఇలాటి ఇతిహాసపు మర్యాదలని గమనిస్తే అంతటి రాముని కంటె గొప్పవాళ్లమని భావించినవారెవరైనా తండ్రికి నమస్కరింపరేమో గాని మిగిలినవారికి అలాటి ఆలోచన కలిగి, తండ్రి ఆశీస్సులని పొందుకునే అదృష్టం కల్గుతుంది. ('నామ స్వంశ్రావయన్ రామో వవందే చరణౌ పితుః అంటే ఇంత అర్థం ఉంది).

## 12. సమావేశంలో దశరథుని అంగీకారం

రాముడు తన తండ్రి చూపించిన బంగారు ఆసనంలో కూర్చొని అస్తమయ కాలంలో సూర్యుడు సావర్ణి మేరుపర్వతాన్ని ప్రకాశింపజేసినట్లు మిక్కిలి ప్రకాశించాడు. గ్రహాలవంటి సుమంత్రాదుల నడుమ, నక్షత్రాలవంటి వశిష్ఠాదుల నడుమ, మినుకుమినుకుమనే నక్షత్రాల్లా ఉన్న రాజులందరి నడుమా రాముడు శరత్కాలపు చంద్రునిలా సమావేశమనే ఆకాశంలో ప్రకాశించాడు (విమలగ్రహనక్షత్రశారదీ ద్యౌరివేందునా). సర్వావయవాలలోనూ, అలంకారాలలోనూ తనకు సమానంగా కన్పిస్తున్న రాముణ్ణి చూచి అద్దంలో తనని తాను చూచుకున్నట్లు ఆనందపడుతూ దశరథుడు ఇలా అన్నాడు.

జ్యేష్ఠాయామసి మే పత్న్యాం సదృశ్యాం సదృశస్సుతః ।
ఉత్పన్నస్త్వం గుణైః శ్రేష్ఠః మమరామాత్మజః ప్రియః ॥
యత స్త్వయా ప్రజాశ్చేమాః స్వగుణై రనురంజితాః ।
తస్మా త్త్వం పుష్యయోగేన యౌవరాజ్య మవాప్నుహి॥ (3/40)

రామా ! నాకు తగినట్టుగా ఉండే నా జ్యేష్ఠభార్యకి కల్గిన ప్రియపుత్రుడివి. నువ్వుకూడా ప్రజలచేత గుణవంతుడవనిపించుకొన్నావు. కాబట్టి ప్రజాభీష్టానికీ, నా సంతోషానికీ అనుగుణంగా పుష్యమీ నక్షత్రంలో పట్టాభిషిక్తుడివి కావలసినదిగా కోరుతున్నాను (జ్యేష్ఠభార్యకి కల్గిన ఒకే పుత్రుడివి కాబట్టి రాజరికానికి తగినవాడివి. అర్హతలలో ఏ దోషమూ లేనివాడివి. నీది పునర్వసునక్షత్రం కాబట్టి పుష్యమీ నక్షత్రం (సంపత్తార) జ్యోతిషం ప్రకారం సంపదని ఇచ్చేది ఔతుంది అని తండ్రి భావం). రాజు కాబోతున్నవాడివి కాబట్టి కొన్ని చెప్పదలచాను. 'రామా ! పరుషంగా మాట్లాడకు. క్రూరంగా దండించకు. వ్యసనపరుడివి కాబోకు. సామాన్య సేవకులకి పరోక్షంగా ఆజ్ఞలనిస్తూ, మంత్రులతో కలిసిమెలిసి ఆలోచించి ప్రవర్తించు. గూఢచారుల ద్వారా ఇతరదేశవృత్తాంతాలని ఎప్పటికప్పుడు జాగ్రత్తగా తెలిసికొంటూ ఉండు. గాదెల నిండుగా ధాన్యాన్నీ, శాలలలో ఆయుధాలనీ ఉంచి ప్రజలకి సంతోషాన్ని కూరుస్తూ అనుకూలుడువై రాజ్యాన్ని ఏలుతూ, మనోనిగ్రహంతో ఉండు.' అంటూండగానే రాముని స్నేహితులు కొందరు కౌసల్యకి ఈ వృత్తాంతం చెప్పారు. ఆమె ఈ వార్త వింటూనే ఎన్నెన్నో దానాలు చేసింది. పురజనులంతా రామాభిషేకం సాగాలని తమ యిళ్లలో ఎందరెందరు దేవతలకో మొక్కారు.

### మళ్లీ తీసికొనిరా !

రాముడు వెళ్లాక దశరథుడు మంత్రులని పిలిచి పుష్యమీ నక్షత్రం ఎప్పుడని అడిగి మఱునాడే అని తెలిసికొని 'సుమంత్రా ! రాముణ్ణి మఱల తీసికొని రా !' అని ఆజ్ఞాపించాడు. (శ్వ ఏవ పుష్యోభవితా రామం పునరిహానయ). రాముని వద్దకు వెళ్లి సుమంత్రుడు నమస్కరించి 'రామా ! మీ తండ్రి మఱల నిన్ను రమ్మంటు న్నాడు' అన్నాడు. రాముడు సుమంత్రుడి మాట వింటూనే (శంకాన్వితోఽభవత్) కారణమేమైయుంటుందా ? అని భావించి సుమంత్రుణ్ణి అడిగాడు 'నీ రాకకు కారణం ఏమిటి? (యదాగమనకృత్యం తే భూయస్త ద్బ్రూహ్యశేషతః) వివరంగా చెప్పు' అని. విషయం తెలిసినా కూడా రాజమర్యాద నెఱిగిన సుమంత్రుడు 'రామా ! రాజు గారు నిన్ను చూడాలనుకుంటున్నారు. వెళ్లడమూ - మానడమూ అనే వాటిని నీవు నిర్ణయించుకోవాలి' అన్నాడు. (**తమువాచ తతస్సూతో రాజా త్వాం ద్రష్టుమిచ్ఛతి - శ్రుత్వా ప్రమాణమత్రత్వం గమనాయేతరాయ వా॥ 4/7**) రాముడు రథంమీద వచ్చాడని తెలియగానే దశరథుడు తన గృహంలోనికి రప్పించుకున్నాడు. పూర్వంలాగానే రాముడు పాదాభివందనం చేసి గోత్రప్రవరులని చెప్పుకొన్నాడు. అతనిని కౌగిలించుకొని ఆసనమిచ్చి దశరథుడిలా చెప్పసాగాడు.

### భరతుడు రాకుండా రాజువి కావాలి !

రామా ! వృద్ధుణ్ణి - సమస్త భోగభాగ్యాలనీ అనుభవించినవాణ్ణి అన్నదానాలని చేస్తూ అనేక యాగాలని నూఱ్ఱుకొలదీ చేసినవాణ్ణి అయిన నాకు నిన్ను పట్టాభిషిక్తుణ్ణి చేయడమనే కోరిక తప్ప మఱోటిలేదు. యాగాలని చేసి దేవఋణం నుండీ, వేద వేదాంగాలని చదివి ఋషి ఋణంనుండీ నిన్నుకని పితృఋణం నుండీ, అనేకవిధ మైన దానాలని చేసి బ్రాహ్మణ ఋణంనుండీ, సమస్త సుఖాలనీ పొంది శరీరఋణం నుండి విముక్తుణ్ణి అయ్యాను. ప్రజలంతా నిన్ను రాజుగా కావాలని కోరుతున్నారు. అయితే ఇప్పుడే యువరాజుగా చేయడానికి మఱోకారణం ఉంది. నాకు స్వప్నంలో అమంగళకరదృశ్యాలు కన్పిస్తున్నాయి. నా జన్మనక్షత్రాన్ని సూర్య - అంగారక- రాహుగ్రహాలు చుట్టుముట్టిన కారణంగా రాజుకి మృత్యువుగాని, దానికి సరియైన ఆపదగాని సంభవిస్తాయని జ్యోతిషికులు చెప్తున్నారు. ప్రాణులబుద్ధి చంచలం. అందునా మరణించబోయే నా బుద్ధి మఱింతగదా ! నా ఆలోచనా, ప్రజాభిప్రాయం ప్రకారం నా నిర్ణయమూ మాఱకమునుపే పట్టాభిషేకం చేసికో. ఈ రోజున

చంద్రుడు పునర్వసులో ఉన్నాడు. తెలవారితే పుష్యమీ నక్షత్రంలోకి రాగలడని పండితులంటున్నారు. నా మనసెందుకో తొందరచేస్తోంది. దర్భపఱుపుమీద పరుండి నీ భార్యతో ఈ రాత్రి అంతా ఉపవాసముండాలి. నాయనా! మంచిపనులు చేయ బోతేనే విఘ్నాలు కలుగుతూంటాయి. నీ స్నేహితులు అన్నివిధాలా నిన్ను రక్షిం చాలని కోరుకుంటున్నాను. రామా! భరతుడు తన మేనమామ ఇంటికి వెళ్లిఉన్నాడు గదా! వాడు వచ్చేలోగానే నీకు పట్టాభిషేకం అయిపోవాలి. భరతుడు సజ్జనుడు. అన్నఅయిన నిన్ను అనుసరించేవాడూ-ధర్మాత్ముడున్నూ. అయినప్పటికీ మనుష్యుల మనస్సు చంచలం అని నా విశ్వాసం. ధర్మాత్ములైనవారు జరిగిన విషయాన్ని గురించి ఆలోచించి ఆనందిస్తారే తప్ప వ్యతిరేకభావంతో ఉండరు. రఘువంశం గూర్చి నీకు తెలియనిదేమీ లేదుకదా! శుభమౌతుంది వెళ్లిరా!' అని ఆశీర్వదించి పంపించాడు దశరథుడు.

ఇక్కడ దశరథుడు మాట్లాడిన మాటల్లో లోతుగా భావించవలసినది ఎంతో ఉంది. దశరథుడు అనిన మాటల్లో చిక్కు విప్పేముందు శ్లోకాలని సరిగా పరిశీలిం చాలి. చాలమంది పైభావాన్ని మాత్రం చూడడమే తప్ప శ్లోకంలోని పదాల మీద పరిశీలన చేయకపోవడం వలన మహర్షులని దూషించే దుఃస్థితి కల్గుతోంది. ఒకరిని నిందించేముందు పరిశీలన అవసరం.

'అవష్టబ్ధం చ మే రామ! నక్షత్రం దారుణైర్గ్రహైః ఆవేదయన్తి దైవజ్ఞాః సూర్యాంగారకరాహుభిః - ప్రాయేణ హి నిమిత్తానా మీదృశానాం సముద్భవే - రాజా హి మృత్యుమాప్నోతి ఘోరాంవాఽఽపదమృచ్ఛతి - తద్యావదేవ మే చేతో న విముంచతి రాఘవ - తావదేవాభిషించస్వ చలా హి ప్రాణినాం మతిః- సుహృదశ్చా ప్రమత్తాస్త్వాం రక్షంత్వద్య సమంతతః - భవంతి బహువిఘ్నాని కార్యాణ్యేవం విధాని హి - విప్రోషితశ్చ భరతో యావదేవ పురాదితః- తావదేవాభిషేకస్తే ప్రాప్త కాలో మతోమమ - కామం ఖలు సతాం వృత్తే భ్రాతాతే భరతఃస్థితః- జ్యేష్ఠానువర్తీ ధర్మాత్మా సానుక్రోశో జితేంద్రియః - కిన్నుచిత్తం మనుష్యాణా మనిత్యమితి మే మతిః - సతాం తు ధర్మనిత్యానాం కృతశోభి చ రాఘవ! - అద్య ప్రకృతయస్సర్వా స్త్వామిచ్ఛన్తి నరాధిపమ్ - న కించిన్మమకర్తవ్యం తవాఽన్యత్రాభిషేచనాత్-అతస్త్వాం యువరాజాన మభిషేక్ష్యామి పుత్రక! - అతోయత్త్వా మహంబ్రూయాం తన్మేత్వం కర్తుమర్హసి ॥ (4/15–27)!

## తండ్రీకొడుకులలో ఎవరు ఎక్కువ అధర్మపరులు ?

ఇంతవఱకూ జరిగిన సంభాషణ వింటే తండ్రి ఇలా భరతుణ్ణి గూర్చి పల్కరాదనీ అన్పిస్తుంది— కొడుకూ, ధర్మమూర్తీ, అయిన రాముడు దాన్నివిని అంగీకరింపకూడదనీ అన్పిస్తుంది. లోభావాన్ని జాగ్రత్తగా పరిశీలిద్దాం.

దశరథుడు ముందునుండీ దూరదృష్టి కలవాడూ, బాధ్యత కలవాడున్నూ దశరథునిలో ఇద్దఱున్నారని ముందే అనుకున్నాం. రాజైన దశరథుడూ - తండ్రి అయిన దశరథుడూ అని. రాజైన దశరథుడు తనకి ఇంకా పిల్లలులేని కాలంలో విచారిస్తూ ఉన్నప్పుడు సుమంత్రునిద్వారా విషయాన్ని విని తాను తండ్రి అయిన దశరథుడుగా కావాలని అశ్వమేధ - పుత్రకామేష్టి యాగాలని రెంటిని చేసాడు అశ్వమేధంవల్ల పిల్లలు కలగరని తనకి తెలిసినా, పుత్రకామేష్టిని మాత్రమే చేయకుండా అశ్వమేధాన్ని కూడా చేయడంలో కారణాలు రెండు. 1) తనకీ తన వంశానికి ఉన్న పిల్లలు కలగడంలో ఏదైనా పాపం అడ్డుగా ఉంటే తొలగడానికీ 2) చిర కాలం నుండీ రాజ్యం తానే చేస్తున్న కారణంగా తనయెడ విసిగిన రాజులెవరైనా ఉన్నారేమో అనే విషయాన్ని తాను విడువబోయే గుఱ్ఱాన్ని పట్టుకోబోయే రాజుద్వారా గ్రహించాలనిన్నీ. రాజైన దశరథునిగా దేశవిషయాన్ని కనుక్కోవాలనీ, తండ్రి కాబోయే దశరథునిగా పుత్రులని పొందాలనీ భావించిన ఆయన అశ్వాన్ని విడువడం బట్టి దశరథునిలో ఇద్దఱు దశరథులు ఈ విషయంలోనూ స్పష్టంగా కన్పిస్తారు.

అలాటి దశరథునికి చెడ్డకలలు రావడం ప్రారంభమైంది. రాజు మరణించడానికి పూర్వం దివి—అంతరిక్ష-భూభాగ—రాజశరీరాల్లో ఉత్పాతాలు (అకస్మాత్తుగా కన్పించే ఉపద్రవాలు లేదా దుష్పరిణామాలు) కలుగుతాయి. సూర్యచంద్ర నక్షత్ర ప్రకాశం తగ్గడం వంటి దివి ఉత్పాతాలూ - కాలంకానికాలంలో మేఘాలూ, విస్తృత వర్షాలూ వంటి అంతరిక్ష ఉత్పాతాలూ భూకంపం వంటి భూమి ఉత్పాతాలకి తోడుగా తన శరీరంకూడా వృద్ధాప్యాన్ని మఱింతపొందిన చాయలని సూచింపచేస్తూ ఉండడం పుత్రులని గూర్చిన తొందర, తొందరగా రాజ్యాన్ని ఇచ్చివేయాలనే బాధ్యతావిముఖత మొదలైనవన్నీ రాజైన తన మరణాన్ని స్పష్టంగా సూచిస్తున్నాయి. దానికితోడుగా కలలు రావడంతో దశరథుని మరణాన్ని గూర్చిన ఊహ దృఢమైంది. ప్రయాణానికి సిద్ధమైనవాడు, చేసికోవలసిన పనులని తొందరగా ముగించుకొనేటట్లు దశరథుడు కూడా తానింక ఏమి చేయవలసి ఉన్నదా ? అని భావించి పుత్రులని కన్నందుకూ,

అయోధ్యకి రాజుగా ఉన్నందుకూ - ఇటు పుత్రక్షేమమూ - అటు అయోధ్యాపుర ప్రజాకుశలమున్నూ గురించి ఆలోచించాడు. తాను రాజే అయినా నిరంకుశంగా ఫలానివాణ్ణి రాజుగా చేస్తున్నాననే దృక్పథం తనకి లేదు. రాజైన తాను రాజరికానికి తగినవాడు ఎవరా? అని తనలో ఆలోచించుకున్నాడు. 1) రాజ్యానికి సర్వాధిక బలం కలవాడు రాజు కావాలి. 2) ప్రజలందరూ ఆతణ్ణి అతని ప్రవర్తననీ మెచ్చుకోవాలి (రాజు కావడానికి ముందే). 3) సభ—సమితి—బ్రాహ్మణ—పురోహిత స్త్రీ........ ఇందరూ అంగీకరించాలి. ఈ మూడు ప్రశ్నలకీ సమాధానంగా మరో ఆలోచన లేకుండా 'రాముడు' సరైనవాడని తనకి తోచింది. దేవతలు ఇచ్చిన పాయసంలోని సగభాగాన్ని స్వీకరించగా కౌసల్యకి కల్గిన పుత్రుడు రాముడుకదా ! లక్ష్మణుడూ, శత్రుఘ్నుడూ చెరి 1/8 వాటాలవారైతే, భరతుడు 1/4వ వాటావాడు. అంటే అంతభాగపు పాయసాన్ని స్వీకరించడంవల్ల కల్గినవాళ్లు. మిత్రుడనే భావం నుండి పరబ్రహ్మస్వరూపమే అనే భావం వరకూ రాముని విషయంలో సర్వప్రజలకూ ఉంది. అయినా సమావేశం ఒకటిచేసి అందరి అభిప్రాయాన్నీ తెలిసికొని రామ పట్టాభిషేక విషయాన్ని బహిరంగపరిస్తే తప్ప తాను యథార్థమైన ధర్మ పరిపాలన చేసినట్లు కాదని భావించి తూర్పు—దక్షిణ—పశ్చిమ—ఉత్తర దేశపు రాజులనీ, మ్లేచ్ఛ—కానన—పర్వతదేశ ప్రభువులనీ చివరికి ఆటవికులనీ, పౌర జానపదులనీ అందరినీ పిలిచాడు.

తన వివాహం జరిగి తాను తండ్రి కావడానికై కేకయమహారాజు కిచ్చిన వాగ్దానం తనకు గుర్తు లేకపోలేదు. తాను వాగ్దానం చేసినది తన వ్యక్తిగతవిషయం. రాజుని చేయడమనేది ప్రజావిషయం. వ్యక్తిగత, ప్రజాగత విషయాల్లో ముఖ్యమైనది ప్రజావిషయమే అని భావించిన దశరథుడు భరతుని అభ్యర్థిత్వాన్ని ఒకమారు పరిశీలన చేసికొని చూచాడు.

1) రాముడు సగపు పాయసభాగాన్ని స్వీకరించగా కలిగిన కౌసల్యా పుత్రుడైతే భరతుడు 1/4 భాగపు పాయసభాగం వల్ల కైకమ్మకి కల్గినవాడు. 2) రాముని కన్నతల్లి కౌసల్య తనకి జ్యేష్ఠభార్య - పట్టమహిషి ఐతే భరతుని కన్నతల్లి కైకమ్మ 3వ భార్య, 3) రాముణ్ణి సర్వప్రజలూ (తానుకూడా) ధర్మాత్ముడనీ........ ఇంకా అనేక విధాల కొనియాడుతూంటే భరతునకు అధర్మపరుడనే పేరు లేకపోయినా ప్రత్యేకమైన గుర్తింపు లేనివాడు. 4) పుట్టిన దగ్గఱ నుండి అయోధ్య ఆ పరిసర ప్రాంతాలని తెలిసి వివాదాలు ఏర్పడ్డ

సందర్భాలలో లక్ష్మణునితో కలిసి వెళ్లి యుద్ధంచేసి గెలుపుని తెచ్చే లక్షణం గలవాడు రాముడైతే, ఎక్కువకాలం కేకయరాజు (తనతాత) వద్ద కేకయపురంలో గడిపినవాడు భరతుడు. 5) దశరథుని వాగ్దానం గురించి తెలిసినా రాముడు భరతుని తల్లి కైకమ్మ ఒడిలో పెరుగుతూ కైకకి ప్రియపాత్రుడైతే భరతుడు కౌసల్యవద్ద గడపగల అవకాశాన్ని తాతగారి యింటివద్ద పెరగడం చేత పొందలేకపోయాడు. 6) రాముడు లక్ష్మణునితో కలిసి విశ్వామిత్రుని శిష్యత్వాన్ని పొంది అనేక విషయాలని నేర్చుకొని, అయోధ్యా తత్పరిసరప్రాంత విశేషాలనికూడా ఆయనద్వారా గ్రహించినవాడైతే, భరతునికి ఆ అవకాశమే లేదు. 7) తాటక-సుబాహులని చంపి పరశురాముని శక్తిని లాగుకొన్నవాడు రాముడైతే భరతుడు శత్రుఘ్నునితో శత్రు సంహారం చేసిన జాడ కన్పించదు. 8) పరాక్రమంతోపాటు రామునికి వశిష్ఠ–విశ్వామిత్ర–సిద్ధాశ్రమ మహర్షుల ఆశీర్వాదాలు ఉంటే, భరత శత్రుఘ్నులకు ఆ అవకాశమే లేదు. 9) రాజ్యాధికారార్హత కల జ్యేష్ఠభార్య జ్యేష్ఠపుత్రుడు రాముడుకాబట్టి భరతునకు రాజ్యాధికారం లేదని అతిస్పష్టంగా తెలుస్తుంది. 10) ఏది ఎమైనా భరతుడు శత్రుఘ్నునితో కలిసి రామునితో విరోధించినా $1/8+1/8=2/8$ బలమె ఔతుందిగాని రామలక్ష్మణ బలంతో $(1/2+1/4=6/8)$ సమానం కాదు. లక్ష్మణుడు కూడ రామునికి ఎదురుతిరిగి వీరితో చేరితే రామునితో ఈ ముగ్గురూ సమానమౌతారు $(1/8+1/8+1/4=1/2)$ తప్ప రామునకు మించరు. ఏమైనా లక్ష్మణుడు ఎన్నడూ రామునితో విరోధపడనేపడడు అని ఈ తీరుగా ఆలోచించి సమావేశంలోనే రాజుని నిర్ణయించాలని భావించి సమావేశాన్ని ఏర్పాటుచేసాడు.

సమావేశ ప్రారంభంలో రాజైన తాను ఒకరిపేరును ప్రతిపాదించవలసిన ధర్మం ఉంది కాబట్టి రాముని పేరుని ప్రతిపాదించాడు. ఆ పేరును బలపఱచడం లేదా విరోధించడం అనేది సమావేశం చేయవలసి ఉంది. ఎవరెవరు ఒక రాజు యొక్క పట్టాభిషేక విషయంలో భాగస్వాములు కావాలో వారందఱినీ ఏర్పాటుచేసి బహిరంగంగా వారివారి అభిప్రాయాన్ని సేకరిస్తూన్న దశరథుడు నిజమైన ప్రజాస్వామ్యాన్ని కాపాడినరాజు. ఈ సమావేశాన్ని ఎందుకు ఏర్పాటుచేస్తున్నాడో కూడ తెలియకుండా సమావేశపఱచి ఆ అభిప్రాయాన్ని ఆ సమయంలోనే వ్యక్తం చేసిన దశరథుడు నిజమైన ధార్మిక రాజకీయవాది కాదా! తన రాముని పేరుని విరోధించినా సిద్ధపడి కదా! తాను ఆ సమావేశం చేసాడు. సమావేశంలోనూ యథార్థాన్నే చెప్పాడుగాని వక్రత ఏ మాత్రమూ లేదు. ప్రజలకు అవకాశాన్నిస్తూ 'నేను చెప్పా

నని రాముణ్ణి గూర్చి ప్రశంసింపక మీ అభిప్రాయాన్ని చెప్పండి. మధ్యస్థులైన మీ నిర్ణయం సరైనది' అన్నాడు కూడ. అప్పుడు కూడా వాళ్లు రాముణ్ణే రాజుగా పల్కుతూంటే 'నేనేమైనా తప్పుచేసానా ? లేక ఈ వృద్ధుని పీడ తొలగాలని భావిస్తున్నారా? అంటూ కూడా రాముడుకాక వేఱొకరు ప్రజల మనస్సులలో ఉంటే ప్రతిపాదించేందుకు తగిన ధైర్యాన్ని తానే అందించాడు.

అయినా వారంతా తమ మనస్సులలో ఉన్న రాముణ్ణే అనేక కారణాలు చెప్పి ప్రతిపాదించారు. వాటిని విన్నపమ్మట రామునికి కబురుచేసాడు. సూర్యవంశపు అయోధ్యారాజ్యం తనవద్ద ఉంది. దానిని సమావేశంలో ఉంచాడు. అందఱూ ఆ సామ్రాజ్యాన్ని రామునికే కట్టబెట్టాలని సూచించారు. ఇప్పుడు ఆ రాజ్యాన్ని అందఱి సూచనమేఱకూ రామునికీయవలసి ఉంది కాబట్టి, తీసికోవలసిన రాముని అంగీకారాన్ని సభకి తెల్పడానికి అతణ్ణి పిలిపించాడు. ఇందఱి అంగీకారం ఉన్నా అభ్యర్థి అంగీకారం లేనిదే ఇదంతా దండుగ కదా ! రాముడు తండ్రి చెప్పింది విన్నాడు. ఆయన ముఖంలో ఏ మార్పూలేదు. రాముడు అంగీకరించినట్లూ లేదా అంగీకరించనట్లూ లేదు. కారణం 'పుష్యమీ నక్షత్రంలో పట్టాభిషేకం నీకు చేయడానికి సభ నిశ్చయించింది' అని తండ్రి చెప్పాడు. 'ఆ నక్షత్రం వచ్చినప్పుడు కదా తన నిర్ణయం చెప్పవలసి ఉంది' ఇది రాముని భావన.

వృద్ధుడూ, మరణం దగ్గఱ పడ్డవాడూ, ఎంతోకాలంగా యువరాజుగా రాముణ్ణి అభిషేకించాలని ఉత్సాహపడుతూ ఆ కోరికకు సమావేశం ద్వారా ఆమోదం పొందినవాడూ అయిన దశరథుడు, ఆనందం పట్టలేక 'పుష్యమి ఎప్పుడు?' అని అడిగి, మఱునాడే అని గ్రహించి మళ్లీ కబురుపెట్టాడు.

ఇంతకుముందు రామునికి చెప్పని మఱో రెండుమాటలు ఎక్కువ చెప్పాడు. వాటిలో గొంతుపట్టుకునే మాటలు—1) భరతుడు రాకపూర్వమే అభిషేకం చేసికోవాలి. 2) మనుష్యుల మనస్సు చంచలం కాబట్టి తొందరగా అభిషేకించుకో - అనేవి. ఇలా దశరథుడనడం తప్పుకానేకాదు. కొద్దిపాటి అనారోగ్యం చేస్తేనే పిచ్చిపిచ్చిగా మాట్లాడుతూ, అసందర్భంగా ప్రలాపించే వారిని చూస్తాం. మరణం నిశ్చయంగా ఉందని స్పష్టంగా తెలిసిన దశరథుడు ఏ మాత్రం తొణుకు బెణుకు లేకుండా సమావేశం జరిపి ఇలా నిర్ణయించడం తన మనఃస్వాస్థ్యానికి నిదర్శనం. ఆ పరిస్థితిలో ఉన్న మఱెవ్వరూ ఇంత నిదానంతోనూ, గంభీరంగానూ వ్యవహారాన్ని పరిష్కరించలేరనడం నిజం. అలాటి దశరథునికి ఎక్కడ తాను ప్రజాభిప్రాయాన్ని

(భరతునిద్వారా, కైకద్వారా ఏదైనా తేడా వచ్చిన పక్షంలో) మన్నించలేనో అనే భయం ఒకకోణంలో కలిగి 'భరతుడు రాకపూర్వమే చేసికో' అని రామునితో అన్నాడు. తమ్ముని సమక్షంలోనే చేసికొంటానని రాముడే అన్నాకూడా కబురువెళ్లి అతడు రావడానికి 8+8=16 రోజులు పడుతుంది. ఈలోగా తానే కన్నుమూస్తే.... లేదా భరతునకు ఇష్టమే ఐ కూడా కైకమ్మద్వారా పేచీపడితే అదీ ప్రమాదమే కదా! అందుకుగా అన్నది 'మనుష్యుల మనస్సు చంచలం' అని. రామా! కైకమ్మ నిన్నెంతగానో చూస్తున్నా మనుష్యజాతిది కాబట్టి ఎలా ఉంటుందో. తొందరగా ముగించుకో అని చెప్పడం దీనిలో భావం. ఒకవేళ ఈ యిద్దరివల్లా ప్రమాదం వచ్చినా నీ చెలికాండ్రు నిన్ను రక్షింతురుగాక! అన్నాడు. 'ఇలాటివేమీ జరుగవని' రాముడంటాడేమోనని భావించి రెండువిధాల సమాధానం చెప్పాడు దశరథుడు. 1) చేయబోయేది మంచిపని కాబట్టి విఘ్నం జరగడానికి అవకాశం చాల ఎక్కువ. (భవంతి బహువిఘ్నాని కార్యాణ్యేవం విధాని హి) 2) నీ తమ్ముడైన భరతుడు నీ పట్టాభిషేకానికి అడ్డుచెప్పనే చెప్పడు. అతడు జ్యేష్ఠానువర్తి (అన్నచెప్పిన ప్రకారం నడిచేవాడు) - ధర్మాత్ముడు (అయోధ్యా ప్రజలందరూ కలిసి నీపై నిందచెప్పినా నువ్వుచేసింది 'తప్పు' అనడు. నీవే ధర్మస్వరూపమని భావించే ధర్మాత్ముడు) - సానుక్రోశుడు (నీది తప్పుకాదని పలికి తండ్రిని నిందించడు. నాపై ఈగ వ్రాలనీయనంతటి జాలి కలవాడు— జితేంద్రియుడు (ఎలాగైనా రాజ్యం తనకి రావాలనే బుద్ధి కలవాడు కాదు. నీకు ఇచ్చిన రాజ్యం గురించి మోహం—మాత్సర్యం లేనివాడు.) అయినా 'చలా హి ప్రాణినామ్మతిః' ప్రాణుల బుద్ధి చంచలం కదా! అని కైకమ్మని దృష్టిలో పెట్టుకుని అన్నాడు. (కామంఖలు సతాం వృత్తే భ్రాతాతే భరతఃస్థితః - జ్యేష్ఠానువర్తీ ధర్మాత్మా సానుక్రోశో జితేంద్రియః)

రామోవిగ్రహవాన్ ధర్మః - రాముడు రూపుకట్టిన ధర్మంకాబట్టి దశరథుడు ఇలా తనకు భరతుడు ఊళ్లో లేనప్పుడు రాజ్యాన్ని కట్టబెట్టడం అధర్మమే అయితే నిశ్చయంగా కాదని అనేవాడే. ఈ పై చర్చనుబట్టి దశరథుడు దేశక్షేమ దృష్టితో బలిష్ఠుడూ - ధార్మికుడూ - ప్రజామోదం పొందినవాడూ ఐన రాముణ్ణే రాజుగా నిశ్చయిస్తూ తాను కేకయరాజుకిచ్చిన వాగ్దానాన్ని వ్యక్తిగతమైన విషయంగా భావించి ధర్మపరీక్ష చేసాడని తెలుస్తుంది. ఇది సర్వజనుల దృష్టిలోనూ ధర్మమే కాబట్టే రాముణ్ణి నిందింపబోయే - వాలి - రావణుడు మొదలైనవారెవరూ భరతుడు ఊళ్లో లేకుండా రాజ్యం పొందబోయినవాడివి' అనే నిందని వారి నిందలలో జోడించలేదు.

## లక్ష్మణా ! రాజ్యం నీకోసమే !

తన అభిషేకాన్ని గూర్చిన వార్తని తెల్పడానికి రాముడు కౌసల్యామాత మందిరానికి వెళ్లాడు. అప్పటికే సుమిత్ర - లక్ష్మణుడు అక్కడున్నారు. దాసీజనం చేత రప్పించగా సీత కూడా వచ్చింది. రాముడు తన అభిషేకవార్తని తల్లికి చెప్పి రేపటి రోజున చేయవలసిన మంగళకార్యాలని నాతో సీతతో చేయింపవలసినదని కౌసల్యని ప్రార్థించాడు. ఆమె అనందపరవశయై తాను కన్నందుకు జన్మధన్యమైందని పల్కి పురుషసూక్తంలో చెప్పబడిననారాయణుణ్ణి ధ్యానించసాగింది. అప్పుడురాముడు లక్ష్మణునితో ఇలా అన్నాడు. 'తమ్ముడూ !' నువ్వు నాకు రెండో ప్రాణానివి. నాతో కూడి రాజ్యాన్ని పాలించు. రాజ్యానికి సంబంధించిన లాంఛనాలైన ఆభరణ-వస్త్ర - రత్నాదులన్నింటినీ నువ్వు అనుభవించు. నా ప్రాణాన్నీ - రాజ్యాన్నీ నీ కోసమే కోరుతున్నాను' అని పల్కి తల్లులకి మ్రొక్కి తన మందిరానికి వెళ్లాడు.

లక్ష్మణేమాం మయా సార్థం ప్రశాధి త్వం వసుంధరామ్
ద్వితీయం మేఽంతరాత్మానం త్వామియం శ్రీ రుపస్థితా ।
సౌమిత్రే భుంక్ష్వ భోగాంస్త్వ మిష్టాన్ రాజ్యఫలాని చ
జీవితం చ హి రాజ్యం చ త్వదర్థ మభికాంక్షయే (4/44)

(లక్ష్మణా ! ఒకే నారాయణ రూపం నలుగురై మనం జన్మించాం. అందులో మనిద్దరం ఇక్కడ ఉన్నవాళ్లం. వైకుంఠాన్ని ఏలుతూండే నాకు అయోధ్యారాజ్యం ఏలితే బాగుండుననే ఆలోచన ఎందుకుంటుంది ? ఇక్కడే రాజ్యాన్ని ఏలుతూ కూచుంటే, దేవతలూ మహర్షులూ కలిసి వైకుంఠంలో ఉన్న నన్ను కలిసి రావణవధ చేయమని ప్రార్థించిన ప్రార్థనని ఎలా తీర్చగలను ? అందుకై ఓ లక్ష్మణా ! నేను రావణవధకి వెళ్లక తప్పదు వెడతాను. ఎలాగో ఒకలా రాజ్యాన్ని నీకు ఇచ్చే ఏర్పాటు చేస్తాను. స్వీకరించు. తమ్ముడూ ! ఈ రాజ్యాన్ని స్వీకరించేది నీ కోసమే సుమా ! అని లోభావం రామునిది. రాజ్యం సంపదతో కూడినది కాబట్టి లక్ష్మణునికి 'తన అన్న — ధనం' అనే రెంటిలో ఏదిముఖ్యమో తేల్చి చెప్పేందుకున్నా ఈ మాటలు. నేను రాజ్యాన్ని ఏలనని ముఖ్యంగా చెప్పడమూ ఉద్దేశ్యమే).

### దేవలోకపు ఏర్పాటు - భూలోకపు తోడ్పాటు.

గతే పురోహితే రామః స్నాతో నియతమానసః ।
సహ పత్న్యా విశాలాక్ష్యా నారాయణ ముపాగమత్ ॥ (6/1)

వశిష్ఠుడు వెళ్ళగానే రాముడు స్నానంచేసి, స్వచ్ఛమైన మనస్సుతో భార్యతో కూడి నారాయణధ్యానం చేయసాగాడు. (రాముడే నారాయణ స్వరూపుడైతే ఆయన తిరిగి నారాయణుణ్ణి ధ్యానించడమేమిటనిపిస్తుంది. ఇక్కడే శ్రీమద్రామాయణంలోని చిక్కుముడి ఉంది. అయోధ్యలోని ప్రజలతోపాటు అంతా రాముణ్ణి యువరాజుగా చేయాలని తొందరపడుతూంటే, రావణవధ కోసమే అవతరించిన రాముడు, ఈ కష్టంనుండి ఎలా గట్టెక్కడమా ? అని ఆయన ఆలోచిస్తూ తొందరపడుతున్నాడు. తండ్రి అయిన దశరథుని భావనలో అయోధ్యకి యువరాజు కావడం చాలగొప్ప విషయమైతే, పుత్రుడైన రాముని విషయంలో (వైకుంఠాన్ని పాలించే నారాయణుడైన తనకి) ఆ సామ్రాజ్యం సముద్రంలో నీటిబొట్టంతటిది. మారువేషంలో వచ్చిన మహారాజుకి మేకలకాపరి ఉద్యోగమిచ్చిన చందమని విద్యారణ్యులవారి మాట.) పైగా తాను అయోధ్యలో పట్టాభిషిక్తుడు అయితే, దండకారణ్యానికి పోయే వీలుండదు. మహర్షులకి మోక్షమీయలేడు. రావణునితో విరోధపడే అవకాశం కల్గదు. తనభార్యని కూడా ఎత్తుకుపోయిన దుర్మార్గుడు రావణుడనే వంక తనకి దొరకదు. అది లేనినాడు రావణుణ్ణి చంపే ఉపాయం ఉండదు. మహర్షుల దేవతల ప్రార్థనపై తాను రావణుణ్ణి వధిస్తానని చెప్పిన మాట అసత్యమౌతుంది. ఇంత ఆలోచిస్తూ తన అంశయైన వైకుంఠనారాయణ స్వరూపాన్ని మనసులో భావిస్తూ 'ఓ ! నారాయణా ! దేవలోకం చేసిన రావణ వధకు సంబంధించిన ఏర్పాటుకి అనుకూలంగా ఈ భూలోకం తోడ్పాటు చేసేలా ఇక్కడ ఎవరికో ఒకరికి బుద్ధిలో మార్పు కల్గించు' అని ప్రార్థిస్తున్నాడు. 'బుద్ధిం తు సారథిం విద్ధి' అని పరమాత్మమాట. పరమేశ్వరుడే ఈ శరీరమనే రథానికి సారథి. ఆయన ప్రాణి అయిన ప్రతి జీవానికి బుద్ధి. అలాటి నారాయణుడు రామప్రార్థనకి ముందుగానే ఒక పథకాన్ని సిద్ధంచేసికొని ఉంచాడు కాబట్టి పట్టాభిషేకాన్ని భగ్నంచేసే బుద్ధిని మంథరలో ప్రవేశపెట్టి, దానిద్వారా కైకమ్మని ప్రేరేపింపచేసాడు, భగవంతుడు 'ఉపాయేన- అపాయేన వా' ఉపాయంతో గాని, ప్రాణసంకటమైన పరిస్థితిలోనైనాగాని తాననుకున్న పనిని సాధించుకొంటాడే తప్ప మానవుడనుకొన్న రీతిగా జరుగనీయడు. అలాగని భగవంతుడు తెరచాటుగా వ్యక్తిని పడగొట్టడు. ముందుగా చెప్పి మరీ చేస్తాడు. భాగవతంలో దేవకీవసుదేవుల అష్టమ గర్భం కంసుణ్ణి వధిస్తుందని కంసునికే చెప్పి కంసుణ్ణి అసమర్థుణ్ణి చేసి తాను నెగ్గాడు. నూరు తప్పులు నిండకుండా చేసికొని ఉన్నట్లైతే శిశుపాలుడు జీవించి ఉండేవాడు కదా ! అలా ఎందుకు చేసికొనలేకపోయాడు ? విష్ణుద్వేషం మాని తన బ్రతుకు

సాగిస్తే హిరణ్యకశిపుని వలన విష్ణువు ఎంతటి చిక్కులో పడేవాడు ? అందుకని భగవంతుడే తాను సృష్టించిన వానివిషయంలో ఒక నిర్ణయాన్ని చేసి ఆ సమయానికి అలా కచ్చితంగా జరిగేలా ఆ వ్యక్తికిగాని, ఆ వ్యక్తి తప్పించుకొనే వీలులేకుండా మతొకరిద్వారాగాని ఒక కల్పనచేసి తన సమర్థతని నిరూపించుకుంటాడు. అందుకే విష్ణువుకి ఉండే వేయినామాల్లో 'భూతభావనః' అనేది కూడా ఒకటి. ప్రతిప్రాణి యొక్క భావనలో ఉండేది కూడా తానే. అంటే తన పథకానికి అనుగుణంగా ప్రాణిలో జీవించే బుద్ధి తానే అన్నమాట. అలాటి బుద్ధిని మంథరలో ప్రవేశపెట్టం డకు భూలోకనారాయణుడు (రాముడు) ఆ వైకుంఠ నారాయణుణ్ణి ప్రార్థించడమే ఇక్కడి విషయం. రామునికి యువరాజ పట్టాభిషేకం తప్పిపోవడమనేది భూలోక వాసులకి బాధాకరమైతే, భూలోకాన్ని ఉద్ధరించే మహాత్ములైన దేవతలు, మహర్షులకీ భూలోకవాసులని బాధించే రావణవధకోసం పట్టాభిషేకం తప్పిపోవడమనేది సంతోష కరమైన అంశం. అందుకే లోకంలో ఒక సామెత ఉంది. 'మానవుడు ఊహిస్తాడు. భగవంతుడు నిర్ణయిస్తాడు' అని. కాబట్టి లోకంలో మనం అనుకున్నది ఏదైనా ఒక్కొక సందర్భంలో అలా జరుగకపోతే, అలా జరుగకపోవడం మంచికే అని భావించాలని ఈ సృష్టి మనకు చెప్తుంది. పురాణేతిహాసాల వలన నేర్చుకోవలసినది ఇలాటి సద్బుద్ధిని. అంతేకాని తాననుకున్నది కాలేదని దైవాన్ని నిందించడంకాదు).

తెలవారితే రామపట్టాభిషేకమని తెలిసిన అయోధ్యా జనులకి ఆ రాత్రి నిద్ర పట్టడంలేదు. మార్గాలని వారే శుభ్రంచేసి కస్తూరి నీటిని చల్లి, కర్పూరపు పొడిని చల్లుతున్నారు. కొందరు రంగురంగుల జెండాకట్టలని తెచ్చి దేవాలయాలకీ, మంద పాలకీ, ఎత్తైన అంగడులకీ, విశాల భవనాలకీ ముందు వరుసగా అందం ఉట్టిపడేలా పాతుతున్నారు. అయోధ్యలో ఉన్న ఎక్కడెక్కడి వేదికలమీదా నృత్యాలో, గానాలో, అభినయాలో ఏవో ఒకటి సాగుతూ కన్పిస్తున్నాయి. ఏ యింటిలో జనమైనా రామాభి షేక వార్తనే ముచ్చటించుకుంటూ ఆ పండుగ తమయింటనే జరుగుతోందా ? అన్నంత ఆనందంగా ఉన్నారు. గుర్రాలని కడగడానికి అశ్వికులూ, ఏగుగులని శుభ్రం చేయడానికి మావటీలూ మందలుగా సరయూనదికి తీసికొనిపోతూంటే మెడలలోని గంటలధ్వని అమోఘంగా విన్పిస్తోంది. చీకటి అనేది లేకుండా రత్నదీపాలని ఎక్క డెక్కటి చెట్లమీదా ఎత్తైన చోట్ల ఒకటికి మఱిరెండు చొప్పున కట్టారు. రాముడు పట్టాభిషిక్తుడై శత్రుంజయ మనే పేరుగల ఏనుగుపై మొదటిసారిగా వస్తుంటే అం దరూ చూడడానికి వీలుగా మార్గానికి ఇరుప్రక్కలా కట్లలతో అడ్డుకట్లు కట్టారు.

పుష్పాలు మార్గాలనిండా చల్లేవాళ్లూ, గుమగుమసువాసనల పొగలని వేసేవాళ్లూ, అరటి చెట్లని నాటేవాళ్లూ, రంగురంగుల చిత్రాలని మార్గాలపై వేసేవాళ్లూ, ఒక రేమిటి ఎందరెందరో ఎవరికి తోచిన పనిని వారు శ్రద్ధాభక్తులతో చేస్తూ కన్పిస్తు న్నారు. తెల్లని పట్టుచీరకట్టి నాలుగు మార్గాల కూడలిలో నిలువబడి చెప్పలేని ఆనం దం తాండవిస్తూన్న ముఖంతో కౌసల్యామాత తీపిపదార్థాలనీ, ఇతరమైన తినుబండా రాలనీ దోసిళ్లతో పంచిపెడుతోంది. ఆబోతుల అంకెలూ, ఏనుగుల ఘీంకారాలూ, గుర్రాల సకిలింపులూ, దేశవిదేశాలనుండి వచ్చే రాజుల రథధ్వనులూ, అయోధ్యా జనుల ఆనందధ్వనులూ, దశరథుని కీర్తిస్తూ చేసే గానాలూతో అయోధ్య మొత్తం ధ్వనిమయమై పోయింది.

ఇలా ఉన్న ఆ పుర వైభవాన్ని కైకమ్మకి అరణంగా (సారె) వచ్చిన దాసి మంథర మేడమీద నుండి చూచింది. ఆనందం పట్టలేక మేడ దిగుతూన్న రాముని దాదిని పిలిచి 'ఏమే ? డబ్బుని కూడబెట్టుకోవడమే తెలిసిన రామమాత, ('కౌసల్య' అని పేరుని పలకడం కూడ మంథరకి ఇష్టంలేదు) డబ్బుని పంచిపెడుతోందేమిటి ?" (ఉత్తమేనాభి సంయుక్తా హర్షేణార్థపరా సతీ– రామమాతా ధనం కిన్ను జనేభ్యః సంప్రయచ్ఛతి ? (8) అని అడిగింది. పుష్యమీ నక్షత్రంలో రామునికి యౌవరాజ్య పట్టాభిషేకాన్ని దశరథుడు చేయబోతున్నాడని ఆ దాది పట్టలేని ఆనందంతో (విదీర్య మాణా హర్షేణ ధాత్రీ తు పరయా ముదా–శ్వః పుష్యేణ జితక్రోధం యౌవరాజ్యేఽభి షేక్ష్యతి) చెప్పింది. మంథర ఆ వార్తని వింటూనే మేడని చరచరా దిగి కైకా శయనమందిరంలోకి నేరుగాపోయి పరుండిన కైకమ్మతో ఇలా ప్రారంభించింది.

## మంథరా దుర్బోధ (పైకథ)

**ఉత్తిష్ఠ 'మూఢే' కిం శేషే భయం త్వా మభివర్తతే ।...**
**చలం హి తవ సౌభాగ్యం నద్యాస్స్రోత ఇవోష్ణగే॥ (7/15)**

"మూఢురాలా ! దగ్గరలో నీకు భయం ఉంటే నిద్రిస్తున్నావా ? వేసవికాలంలో నీటి ప్రవాహం తగ్గినట్లు నీ భర్తకి కూడా నీ మీద ప్రేమ తగ్గింది సుమా ! పైకి తీపి తీపి మాటలను పలుకుతూ నీకు నష్టాన్ని కల్గించేదీ, కౌసల్యకి ప్రయోజనపదేదీ అయిన రామ పట్టాభిషేకాన్ని కొంత వ్యవధిలోనే చేయబోతున్నాడు. పిచ్చిదానా ! నీ పుత్రుడైన భరతునివలననే రామునికి ఆపద ఉందని ముందుగా గ్రహించిన మహా రాజు, భరతుణ్ణి మేనమామ యింటికి పంపించివేసి, అతడు లేని సమయంలోనే

పట్టాభిషేకాన్ని ముగించాలని చూస్తున్నాడు. ఎవరో ఒక అమాయకురాలు విషం ఉంటుందని తెలియక పాముని లాలించసాగిందని ఎప్పుడో చెప్పిన మాట గుర్తొస్తోంది. అలాగే ఇచ్చకాలని పలికే మగణ్ణి నువ్వూ నమ్ముతున్నావు. కాబట్టి వెఱ్ఱిదానా! రాముని విషయంలో పట్టాభిషేకాన్ని ప్రకటించిన దశరథుణ్ణి నమ్మకు. నీ భరతుణ్ణి కాపాడుకో!' అని తీవ్రంగా పలికింది.

రామ పట్టాభిషేక వార్తని వింటూనే ఆనందంతో శయ్యనుండి లేచింది కైక. మెడలో హారాన్ని తీసి మంథరకి ఇస్తూ 'మంథరా! ఇంతటి ఇష్టమైన మాటని చెప్పిన నీకు ఇంకా ఏం చేయమంటావో చెప్పు. రాముడు - భరతుడు అనే ఈ ఇద్దరిలో నాకు భేదమే లేదు. రాజుగా భరతుణ్ణి అభిషేకిస్తూంటే చాల సంతోషంగా ఉంది నాకు. ప్రియమైన వాటిలో ప్రియమైన రామపట్టాభిషేక వార్తని చెప్పిన నువ్వు' 'ఏది కోరుకుంటే దాన్ని ఇస్తాను' - అన్నది.

మంథరకి అసూయ, కోపం వచ్చాయి. కళ్లెఱ్ఱబడ్డాయి. 'తెలివితక్కువదానా! ఇది నీకు సంతోష సమయం ఎలా అయింది? ఓడ మునిగిపోయేంతగా సముద్ర మధ్యంలో గాలివీస్తే చల్లగాలి వీస్తోందని సంతోషిస్తారా ఎవరైనా? నీకు దుఃఖం వచ్చిందని చెప్తున్నా నీకు అర్థం కావడం లేదే? అనే దుఃఖం నాకు కల్గుతోంది. సవతి కొడుకు శత్రువే ఔతాడు. అతడు మన పాలిటి మృత్యువుతో సమానం. అన్నదమ్ముల వరసలో తనకి తరువాతి వాడైన భరతుడంటేనే రామునికి భయం ఉండడం సహజం. భయపడిన వానివలననే భయం పుడుతుంది. లక్ష్మణ శత్రుఘ్నులవల్ల రామునికి భయంలేదు. కారణం, లక్ష్మణుడు తనని ఆశ్రయించినవాడు కాగా, శత్రుఘ్నుడు భరతుని అడుగుజాడల్లో ఉండేవాడు గదా! వయస్సు వరసనిబట్టి చూస్తే రాముని వెమ్మట భరతుడే రాజు కావాలి. అయితే ముందు రామునికే రాజ్యం రావాలి కదా? అంటావా? ఆ విషయం తర్వాత ముచ్చటిస్తాను.

ఏ పనిని ఎప్పుడు చేయాలో రామునికి బాగా తెలుసు. మన భరతుడు అంతటి సమర్థుడు కాడు. భరతుని వల్ల ఏమి కీడు రాబోతుందో నని ఇప్పటినుంచే రాముడు ఆలోచిస్తుంటాడు. రాముడు యువరాజైతే అతని తల్లికి నీవూ, నీతోపాటు మేమూ దాసీలౌతాం. భరతుని విషయం చెప్పాలా? దాసీ పుత్రుడౌతాడు. రామునికి సంబంధించిన స్త్రీలంతా పరమానందంతో ఉంటారు'. అని చెప్పబోతూంటే కైకేయి దాన్ని వారించి 'మంథరా! రాముణ్ణి నువ్వెఱుగవు. అతడు ధర్మాన్ని

తెలిసినవాడు. వశిష్ఠ విశ్వామిత్ర శిక్షణలో పెరిగినవాడు. అసత్యం మాడడు. ఇక రాజ్యమంటావా? జ్యేష్ఠుడు కాబట్టి అతనిదే. భరతునికి రాముని వలన భయం ఉండనే ఉండదు. రాముడు ఇతరులనే తనవారిలా చూచేవాడైతే తన తమ్ముణ్ణి ద్వేషిస్తాడా? కౌసల్య కంటె నాకే ఎక్కువ సేవ చేసే రామునికి రాజ్యం రావడమంటే నా పుత్రునికి రాజ్యం వచ్చినట్లే. భరతుడు రాజు కానే కాడని అనుకోకు. రాముడు నూరేళ్ళు పరిపాలించాక రాజ్యం భరతునికే వస్తుంది', అని సంతృప్తిగా పల్కింది.

మంథర వేడినిట్టూర్పులు విడిచింది. 'పిచ్చిదానా! రాముని రాజయోగం పిమ్మట అతని పెద్దకొడుకు రాజౌతాడు. అతని తరువాత అతని జ్యేష్ఠుడు రాజౌతాడు. భరతుడు ఏనాటికీ రాజు కాడు. దాసీపుత్రుడే ఔతాడు. రాజైన రామునికి ఏనాటికైనా భరతుని వలననే భయం ఉంటుందనే ఆలోచనతో భరతుణ్ణి చంపడానికైనా రాముడు వెనుకాడక పోవచ్చు. కాబట్టి కేకయరాజు గృహం నుండి భరతుణ్ణి అలాగే అడవికి పొమ్మని కబురంపు. రాజ్యమనేది స్నేహితుల మధ్యనే పైరాన్ని తెస్తుంది. రామ భరతుల నడుమ ఉన్నది రాజ్యవైరంతో పాటు సవతితల్లుల పుత్రులు కావడం చేత పుట్టుకతో ఉన్న సహజవైరమని గమనించు. దశరథుడు నిన్ను ఆదరిస్తున్నాడనే గర్వంతో కౌసల్యని చాలసార్లు నిరాదరించావు. రాముడు రాజు కాగానే కౌసల్యకూడా నీ మీద పగసాధించుకోదా? రాముడు రాజైతే భరతుడు నశిస్తాడని గమనించు. కాబట్టి వెర్రిబాగులదానా! నీ కొడుక్కి రాజ్యం వచ్చేలాగానూ, రాముణ్ణి పట్టణం నుండి వెళ్ళగొట్టేలాగానూ ఉపాయం ఆలోచించుకో' అని చెప్పింది మంథర.

ఈ మాటలు కైకమ్మ చెవిని పడీపడడంతోనే ఆమె కళ్ళు ఎఱ్ఱబడ్డాయి వేడిగా నిట్టూర్చింది. 'మంథరా! నీ మాట వింటున్నానే. రాముణ్ణి వేగంగా అడవికి పంపి భరతునికి పట్టాభిషేకం చేయిస్తాను అయితే ఉపాయాన్ని నువ్వుచెప్పు' అంది.

మంథర అందుకుంది. 'కైకా! నాచేత చెప్పించాలనే ఆలోచన కాక నీకు మాత్రం తెలియదా? దేవతలూ రాక్షసులకీ యుద్ధం భీకరంగా జరుగుతూంటే దేవేంద్రుడు నీ భర్తని సహాయం యాచించాడు. అంగీకరించిన దశరథుడు తోడి రాజులతో సహాయపడదలచి తిమిధ్వజుడనే మరోపేరు కూడా కల శంబరుడనే రాక్షసుని మీదికి దండకారణ్యంలో తలపడ్డాడు. పోరు భీకరమైంది. మధ్యాహ్నం అయినా కూడా యుద్ధానికి ముగింపు లేకపోయింది. మాయలమారి అయిన రాక్షసుడు ఇది

సరికాదని భావించి రాత్రివేళ ఒక్కుమ్మడిగా దూకి నిద్రిస్తున్న ఎందరినో నిర్దాక్షిణ్యంగా చంపుతూన్న వేళ చేతిలోఉన్న గుర్రాల కళ్లాలని విడిచి రథాన్ని దూరంగా తీసికొనిపోయి దశరథునికి ప్రాణభిక్ష పెట్టావు. అక్కడికి కూడా రాక్షసులు రాగా అక్కడా ఆతణ్ణి రక్షించావు. రెండుమాయిలు రక్షించినందుకు సంతోషపడ్డ రాజు రెండు వరాలిచ్చాడనీ, అవి అవసరమైనప్పుడు కోరుకుంటానని నీవు బదులు పల్కావనీ నువ్వే నాతో చెప్పావు. అప్పుడు వరాలియ్యడానికి అంగీకరించిన దశరథునితోనే నేటి అవసరం. అడుగవలసిన దానిపైన నీకే ఆపద. అప్పురాలనైన నేనే నీకు ఉపాయం చెప్తున్నాను. అడుగవలసిన కాలం కూడ సిద్ధంగా ఉంది. ఆలస్యమెందుకు? నీ భరతునికి పట్టాభిషేకాన్ని అడుగు. పదునాల్గు సంవత్సరాలు రాముణ్ణి అడవికి పంపించినట్లయితే నీ పుత్రుని రాజ్యం సుస్థిరమై పోతుంది.

ఉపాయం విన్నంతతో సరిపోదు. అపాయం రాకుండా చూచుకోవాలి. ఆచరణలో పెట్టే విధాన మంటావా? అదో పెద్ద సమస్య కాదు. చీనిచీనాంబరాలని విడిచి మాసినచీర కట్టుకో. మెత్తని పరుపులని మాని గట్టి నేలపై పడుకో. నవ్వుతూ ఉన్న నీ ముఖాన్ని కోపంతో నింపుకో. దశరథుడు వచ్చి మాటాడినా ముఖం చూపించకుండా ఏడుస్తూ ఉండు. ఏమైనా నీకోసం చేయడానికి సిద్ధపడే దశరథుడు ఎన్నో తీపిమాటలని చెప్తాడు. చాలమంది స్త్రీలు ఇక్కడే మగవారిని నమ్మి మోసపోతారు. ఎన్నెన్నో బహుమతులని ఇయ్యజూపినా వినక వరాలమీదే దృష్టి ఉంచి రాజు అంగీకరించే వరకూ అలుక మానకు' అని ప్రేరేపించింది.

దానికి సమాధానంగా కైకమ్మ 'మంథరా! భరతుడు రాజు కాగానే నీ గూనికి బంగారుదండ చేయించి బహుమతిగా ఇస్తాను. ఇంత తెలివైన నువ్వు నీ సర్వావయవాలతో ఎంత అందంగా ఉన్నావో? గూనీ! రాముడు అరణ్యాలకు పోవడం, భరతుడు రాజు కావడం లేదా నా ప్రాణాలు అనంతవాయువుల్లో కలవడం ఏదో ఒకటి జరిగి తీరుతుంది' అంటూ కోపగృహానికి తరలిపోయింది కైకమ్మ.

లోకథ !

మంథరకి ఇలాటి బుద్ధిని దేవతలే ప్రవేశపెట్టారు. రాముడు అరణ్యాలకి పోకపోతే రావణవధకి అవకాశమే ఉండబోదు. కౌసల్యని (అర్థపరా) దెబ్బ కూడ పెట్టుకునే లక్షణం కలదని నిందించడమూ, అయోధ్యాజనం ఆనందంతో ఉంటే సహించలేకపోవడమూ, తాను దాసే అయినా మహారాజుగారికి ఇష్టపాత్రురాలైన

మహారాణీ శయనమందిరంలోనికి నేరుగా వెళ్లిపోవడమూ, ఆమెను (మూఢే) మూఢురాలా! అని సంబోధించడమూ, రామపట్టాభిషేకవార్త విన్న కైకమ్మ హారాన్ని బహుమతిగా ఇస్తే దానిని విసరివేయడమూ వంటివన్నీ మంథర చేయగల్గడానికి కారణం దేవతలు తనని తనకు తెలియకుండా నడిపించుతూ ఉండడమే. ఈ పాత్ర రామాయణంలో ఇక కన్పించపోవడానిక్కారణం కూడ ఏ పాత్ర ప్రయోజనం ఎంతవరకో ఆ పాత్రని వినియోగించుకోవడం వలననే. ఈ విధానం ప్రకారమే సాక్షాత్తు రామలక్ష్మణులకే గురువైన విశ్వామిత్రుడంతటివాడున్నూ సీతాకల్యాణమయ్యాక మఱి కన్పింపడు. అలాగే వాలి-శబరి-గుహుడు వంటివారెందరో ఆ సమయానికి వచ్చి తమపని పూర్తిచేసికొని మఱి కన్పించరు.

దేవతల పన్నాగమే యిది అని తెలిపేందుకు మరో కారణమూ ఉంది. ఏ కైకమ్మ రాముణ్ణి అరణ్యాలకు పంపించబోతోందో, ఆమె మంథరద్వారా రామపట్టాభిషేక వార్త విని ముత్యాలహారాన్ని మెడలో వేస్తోంది. ఇంకా ఏం కావాలో కోరుకోమంది కూడ. రాముని గూర్చి మంథర చెడుగా చెప్తే కైకమ్మ రాముణ్ణి గూర్చి 'ధర్మజ్ఞో గురుభిర్దాంతః కృతజ్ఞస్సత్య వాక్శుచిః - భ్రాతౄన్ భృత్యాంశ్చ దీర్ఘాయుః పితృవత్పాలయిష్యతి - యథా మే భరతో మాన్యః తథా భూయోఽపి రాఘవః - కౌసల్యాతోఽతిరిక్తం ను సోఽను శుశ్రూషతే హి మామ్ - రామో రాజ్ఞః సుతో జ్యేష్ఠః యౌవరాజ్యమతోఽర్హతి - రామే వా భరతే వాహం విశేషం నోపలక్షయే - తస్మాత్తుష్టాస్మి యద్రాజా రామం రాజ్యేఽభిషేక్ష్యతి - ఇతః పరం కిం ప్రవదామి తం వృణు - సంతప్స్యసే కథం కుబ్జే శ్రుత్వా రామాభిషేచనమ్?' - ఇన్ని మాటలు మాట్లాడింది (పై కథలో చదివాం) చివరిగా మాట్లాడుతూ రామ పట్టాభిషేకానికి ఎందుకు దుఃఖిస్తున్నావు ? అని పలికింది.

అలాటి కైక ఒక్కమాఱుగా మాఱిపోయినట్లు కన్పిస్తుంది. మంథర మాటల్లో ఆమెకు బాధ కల్గించినవి నాలుగు అంశాలు. 1) ప్రతిరాజుకీ కల్గిన జ్యేష్ఠుడే రాజౌతూంటే ఆ సంప్రదాయం సరికాదు. ప్రస్తుత విధానం అదే కాబట్టి భరతుడు రాజు కానే కాబోడు. 2) భరతుడంటే గిట్టని రాముడు చంపవచ్చు కాబట్టి అటునుంచి అటుగానే భరతుణ్ణి వనాలకి పొమ్మను. 3) నీ సవతి కౌసల్యని ద్వేషించావు గదా! రాముడు రాజైతే పగతీర్చుకుంటుంది. 4) నీ భర్త దశరథుడూ, నీ ఒడిలో పెరిగిన రాముడూ ఇద్దఱూ నీకు కష్టాన్ని కల్గిస్తూ నీ పుత్రునికి రాజ్యం రానీకుండా చేస్తున్నారు అనేవి. [ఈ వాక్యాలే శ్లోకాలలో ఇలా ఉంటాయి. 'నహి రాజ్ఞ

స్మృతాస్సర్వే రాజ్యే తిష్ఠన్తి భామిని! స్థాప్యమానేషు సర్వేషు సుమహాననయో భవేత్-తస్మాద్రాజగృహాదేవ వనం గచ్ఛతు తే సుతః - దర్పాన్నిరాకృతాపూర్వం త్వయా సౌభాగ్యవత్తయా - రామమాతా సపత్నీతే కథం వైరం న యాతయేత్? యదా హి రామః పృధివీ మవాప్స్యతి ధ్రువం ప్రణష్టో భరతో భవిష్యతి - అతోహి సంచింతయ రాజ్యమాత్మజే పరస్య చైవాద్య వివాస కారణమ్-తౌ వరౌ యాచభర్తారం భరత స్యాభిషేచనమ్-ప్రవ్రాజనం తు రామస్య త్వం వర్షాణి చతుర్దశ)

ఈ నాల్గుమాటలూ అనేసరికి ఇంతకాలం రాముణ్ణి పెంచిన కైకమ్మ అనురాగమూ, వాత్సల్యమూ, దశరథుని వెంట యుద్ధాలలో కూడా వెంబడించి వెళ్లే ఆమెకున్న రాజనీతి కుశలతా, కేకయరాజు ఇంత పెరిగిన ఆ సంప్రదాయ బుద్ధీ, అన్నీ గంగ కలిసిపోయాయా ? కానేకాదు.

## కైక చాలా గొప్పది.

రామభరతులు ఇరువురిలోనూ ఆమెకు ఏవిధమైన బేధాభిప్రాయమూ, ఎక్కువ తక్కువలూ లేవు. ఆమె ధర్మపరురాలు కూడ. అందుకే జ్యేష్ఠుడైన రామునికే రాజ్యం రావాలని స్పష్టంగా చెప్పింది కూడ. అలాంటి ఆమె ఒక్కసారిగ మారి పోవడానికి కారణం పైకి మంథరగా అన్పిస్తుంది, కాని కానేకాదు. మంథరని అలా రామునిగూర్చి తప్పుగా ఆలోచించవద్దని మందలిస్తూ బహుమతినికూడ ఇచ్చిన కైక ఒక్కసారిగా మారిపోవడానికి కారణం చటుక్కున ఆమెకుగుర్తుకువచ్చిన ఎప్పటిదో ఐన దశరథునికి ఈయబడిన శాపం. చాలకాలం క్రితం జరిగిన కథకి వెడదాం.

వివాహం అప్పటికికాని దశరథుడు 'శబ్దవేధి' (ఏ ప్రక్కనుండి శబ్దం విన్పిస్తే ఆ ప్రక్కకి బాణంవేసి అక్కడ ఉన్న లక్ష్యాన్ని కొట్టడం)అనే విద్యను అభ్యసిస్తున్నాడు. సరయూనదికి అర్ధరాత్రంలో వెళ్లిన తాను భయంకర వర్షం కురుస్తున్నంతసే - చెట్టుక్రిందే గడిపి, ఆ పిమ్మట ఏనుగు నీరు త్రాగుతూన్న చప్పుడు నదిలో నుండి రాగానే బాణాన్ని ఆ దిక్కుగా విడిచాడు. బాణం ఏనుగుకి తగిలింటుందని దశరథుడు భావిస్తూంటే ఒక బాలకుని ఆర్తనాదం విన్పించింది. ఒక మునిబాలకుడు అంధులైన తన తలిదండ్రులకి నీరు తీసికెళ్ళడానికి కుండని ముంచుతూంటే వచ్చిన చప్పుడుని ఏనుగు నీరు త్రాగుతూన్న ధ్వనిగా భావించాడు దశరథుడు ఆ ముని బాలకుని చూచి ఆ తలిదండ్రుల వద్దకి తీసికొనిపోయాడు. ఆ వృద్ధులిద్దరూ తమ పుత్రుడు తమ సమక్షంలో మరణిస్తున్న ఆ సంఘటనకి తట్టుకోలేక, తెలిసి ఈతప్పు

దశరథుడు చేయలేదని తెలిసికూడా దశరథుణ్ణి శపించారు. 'ఏవం త్వం పుత్రశోకేన రాజన్ కాలం గమిష్యసి' అని. 'దశరథా! పుత్రుడు లేడనే శోకంతో మేమెలా మరణిస్తున్నామో అలాగే పుత్రశోకంతో నువ్వుకూడా మరణిస్తావు' అని దీని భావం. నిజానికి ఇది శాపమే అయినా అప్పటికి పుత్రులులేని దశరథునికి ఇది వరమే అయింది. తనకి పుత్రులు పుడితేగదా శోకం కల్గేది. అందుకని తనకి పుత్రులు పుడతారనే ఆనందం కల్గింది. ఆ విషయాన్ని ఎవరికి చెప్పాడో ఊహింపవీలుకాదుగాని ముద్దుల భార్య, యుద్ధ సమయాలలో కూడ అతనిచేత తీసికొని పోబడేదీ అయిన కైకమ్మకి మాత్రం చెప్పాడు. ఈ విషయం విన్న కైకమ్మకి మొదట్లో దుఃఖమే కలిగింది. కాని సంతానం లేక పరితపిస్తున్న తన భర్తకి సంతానంవల్ల దుఃఖంతీరి, అతని ఆనందం తనకు సంతోషాన్ని కల్గిస్తుంది కదా అని సంతోషమైంది. ఈ విషయాన్ని విన్న కైకమ్మ దశరథుని మరణం గూర్చి ఒకింత బాధపడినా, ఈ ఆనందపు వెల్లువలో ఆ దుఃఖం ఆమెకు అప్పుడు మనసుకు పట్టలేదు. కాలం గడిచాక దశరథునికి చెడ్డకలలు (మరణాన్ని సూచించేవి) వస్తూన్నాకూడా ఆమెకు ఈ విషయం గుర్తురాలేదు. కారణం, ఆలనాడు దశరథుడు చెప్పిన పుత్రశోకానికి సంబంధించిన శాపంలోని 'కష్టం' అనేది, సంతానం కల్గుతుందనే ఆనందపు మడతలలో భద్రంగా ఎక్కడో కనిపించనంత లోపల ఉండిపోవడమే, మంథర వచ్చి రామ పట్టాభిషేక వార్త చెప్పినా ఆమెకు దుఃఖం గుర్తురాలేదు.

మంథర దేవతల బుద్ధికి అనుగుణంగా అలా చెప్పుకుపోతోంది. కైకమ్మ తప్పుతప్పని మందలిస్తూనే ఉంది. ఎప్పుడైతే మంథర "ధ్రువం ప్రణష్టో భరతో భవిష్యతి" రాముడు రాజాకాగానే భరతుణ్ణి చంపుతాడు కాబట్టి నశిస్తాడని అన్నదో, ఆ పుత్ర శోకశాపం చటుక్కున కైకమ్మకి గుర్తువచ్చింది. పుత్రుడు పోయాడనే శోకంతో మరణించడం పుత్రశోక మరణమంటే. కైకమ్మ ఆలోచించింది. రామలక్ష్మణులు మాత్రమే దశరథుని వద్ద ప్రస్తుతం ఉన్నారు. భరత శత్రుఘ్నులు తన తండ్రియింట ఉన్నారు. దుఃస్వప్నాలు (చెడ్డకలలు)వస్తూన్న దశరథునకు మరణం ఎలాగూ తప్పదు. ఆయన పోవాలంటే పుత్రశోకంతోనే పోవాలి. అంటే దశరథుని వద్ద ఉన్న రామలక్ష్మణులకి మరణం కలిగితే తప్ప దశరథునికి చావురాదు. దశరథుని మరణం నిశ్చయం కాబట్టి, అతని మరణానికి రామలక్ష్మణ మరణం కారణంగాని, ముందు జరిగేది కాని కారాదని ఆమె తీవ్రంగా ఆలోచిస్తూ, ఎలా ఈ చిక్కుని విప్పాలా? అని ముఖంలో గాంభీర్యాన్ని చూపిస్తూ ఉంటే, ఎదురుగా ఉన్న మంథర

కైకమ్మ చూస్తూ, తన మాటలకి కైకమ్మ లొంగిపోయి ఆలోచిస్తోందని భావిస్తోంది.

శ్రీ మద్రామాయణం అంతా ఇలాగే ఉంటుంది. మంథర మాట్లాడేది ఒకటి. కైకమ్మ ఆలోచిస్తూన్నది వేరొకటి. రావణవధకోసం పన్నాగం పన్నిన దేవతలు చేస్తున్న ఆలోచన ఇంకొకటి. కాని మంథర అనుకుంటోంది- 'తన మాటనే కైక వింటోందని'. కైక అనుకుంటోంది-'తాననుకునేది తెలియని మంథర తనని నమ్మేలా ప్రవర్తిస్తున్నాను గదా' అని. దేవతలనుకుంటున్నారు- 'ఈ యుద్ధపు ప్రవర్తనలకీ కారణం మనమైతే వాళ్ళకి వాళ్ళే దీనికి కర్తలమనుకుంటున్నారు గదా-సంతోషించ దగినదే' అని. ఇలాంటి సందర్భంలో కైకమ్మ ఆలోచించి మంథరనే ఉపాయం అడిగింది. మంథర వెంటనే అంది, 'తౌ వరౌ యాచ' అని. 'ఆ రెండు వరాలనీ అడుగు' అని. ఏ రెండువరాలు? అంటే దేవేంద్రునితో కలిపి రాక్షసునితో పోరాడి నప్పుడు కైకమ్మ రెండుమాఱులు రక్షిస్తే దశరథుడిచ్చిన వరాలు రెండున్నూ.

ఈ వరాల కథ అంతా దేవేంద్రునికి సహాయపడినప్పుడు జరిగింది. అంటే దేవతలు ఏనాడో ఈ పథకాన్ని సిద్ధం చేసికొని దేవేంద్రునిద్వారా దశరథుణ్ణి ఆహ్వా నింపచేసి రెండువరాలనీ దశరథునిద్వారా కైకమ్మకి ఇప్పించి, ఆ వరాలు ఉపయోగ పడే కాలం వచ్చినప్పుడు ఏం అడగాలో అప్పుడు నిర్ణయించవచ్చుననుకొన్నారని స్పష్టంగా తెలుస్తోంది కదా! సరిగా అదే అయింది. దైవబుద్ధి ప్రేరణచేత మంథర చెప్తే, దైవప్రేరణచేత చెప్తూన్నానని తెలియని కైక తన రాముని క్షేమం కోసమే వరాలని అడుతున్నానని భావించి వరాలని అడుగుతానని అంది. లోకం అంతా తనని ఆడిపోసుకొంటారని తెలిసినా రామునిక్షేమాన్నే కోరి అరణ్యాలకి పంపించ నిశ్చయించిన కైక భూ-స్వర్గలోక వాసులిద్దఱికీ కూడ ప్రశంసాపాత్రురాలే.

ఇక్కడ మహా రహస్యంకూడ ఉంది. తనకి పుట్టబోయే కొడుకుకే రాజ్యం పట్టం కట్టడమనే నియమానికీ లోబడి తన వివాహం జరిగింది. అంటే భరతుడనే వాడు పుట్టుకతోటే రాజటికాన్ని పొందే అర్హుడయ్యాడు. ఆ విషయం తెలిసిన కైక అసలు ఆ మాటనే ఎత్తదేమి? తన వివాహమే తన పుత్రునికి రాజ్యాధికారాన్ని కట్టబెట్టేది అయినప్పుడు తాను భరతుని విషయాన్ని గూర్చి దశరథుణ్ణి యాచించడం గాని పీడించడం గాని చేయనవసరం లేదు కదా! ఎందుకిలా ఆమె వరాలని యాచిస్తూ దశరథుణ్ణి పీడించాలి? కారణం తన పుత్రునికి పట్టాభిషేకం జరగాలనే దురాశ ఎక్కడ కైకమ్మకి లేనేలేదు. కైకమ్మ ఇలా ప్రవర్తించడానికి కారణం కైక

కానే రాదని చెప్పడానికి వాల్మీకి శ్లోకమే ప్రమాణం. మాసినచీర కట్టుకొని, నేల మీద పడుండిన ఆ కైకమ్మ "లతామివ వినిష్కృత్తాం, పతితాం దేవతామివ, కిన్నరీ మివ నిర్ధూతాం, చ్యుతామప్సరసం యథా - మాయామివ పరిభ్రష్టాం హరిణీమివ సంయతాం కరేణుమివ దిగ్ధేన విద్ధాం మృగయునా వనే॥ 10/25" త్రెంపబడిన తీగలా, పుణ్యం తరిగిపోగా నేలపడిన దేవతాస్త్రీలా, మనోవ్యాకులంతో ఉన్న కిన్నర స్త్రీలా, భూలోకానికి జారిపడిన అప్సరఃశకుంతలా. పనిచేయని మాయలా, వలలో చిక్కిన ఆడులేడిలా, వేటగాని విషబాణం గ్రుచ్చుకున్న ఆడఏనుగులా ఉందట. ఈ పోలికలన్నింటినీ పరిశీలిస్తే ఏ ఒక్కటీ కూడా తనకు తాను చేసుకొన్నవి కావు. 'త్రెంపబడిన తీగలా' అంటే త్రెంపినది మరొకరైతే బాధ అనుభవించేది తాను అలాగే చివరపోలిక విషబాణం మరొకరు గ్రుచ్చితే బాధననుభవించేది ఆడఏనుగు కదా! అలాగే దైవకృత్యానికి దేవతలు ఈమెను ఉపయోగించుకుంటూంటే బాధని ఈమె పడుతోందన్న మాట.

## కైకా దశరథ సంభాషణం

తాను వస్తూంటే ఎదురురావడంగాని, మాటలను పంపడంగాని, చెలికత్తెలూ దాసీలూ కైకమ్మ జాడని చెప్పడంగాని లేకపోవడంతో ఏదో కీడుని శంకిస్తూ దశరథుడు రాసాగాడు. వస్తూనే పై చెప్పిన విధంగా ఉన్న కైకమ్మని చూచి "కైకా! వ్యాధి కల్గిందా? వైద్యులను రప్పిస్తాను. ఏదైనా కోరిక ఉందా? ఎవరికి ప్రియాన్ని చేయాలో చెప్పు. ఎవరికి అప్రియం కల్గించాలో చెప్పు? ఎవరిని చంపించను? చంప వలసిన ఎవరిని విడిపించాలో చెప్పు. ఎవరిని ధనవంతునిగా చెయ్యను? ఎవరిని దరిద్రునిగా చేయాలో చెప్పు. తప్పక చేస్తాను. (అవధ్యోవధ్యతాం కోవా - కోవా వధ్యో విముచ్యతామ్ - దరిద్రః కోవా భవత్వాఢ్యో ద్రవ్యవాన్ వా వ్యకించనః- కఃప్రియం లభతామద్య కోవా సుమహదప్రియమ్ 10/31) అని ఇలా అసందర్భంగా ఇక్ష్వాకు వంశీయుడు మాట్లాడవచ్చా ? అన్పిస్తుంది. దీనికి ఒకే సమాధానం, 'కామీకమలపత్రాక్షీ మువాచ వనితామిదమ్' అనేది. ఈ సంభాషణ ప్రారంభంలోనే దశరథుణ్ణి గూర్చి వాల్మీకి ఇలా అన్నాడు. "చావు దగ్గఱపడినవాడు, అదీకాక కామంతో ఉన్న 'కామి' ఇప్పుడు. ఆతడు కమలపత్రాల వంటి కళ్ళున్న కైకని చూచాడు. అందుకే ఇలా మాట్లాడుతున్నాడు"అని. కామమే ప్రధానంగా ఉండే 'కామి' స్త్రీలతో ఇలాగే మాట్లాడుతాడనీ, ఇన్ని వరాలని ఇస్తున్న దశరథుడూ ఇంతే నని మహర్షి బోధిస్తున్నాడు. పురుషుడు మాటలాడుతున్న కొద్దీ, తన మనోరథాన్ని

పొందదలచిన స్త్రీ మౌనమే పాటిస్తుంది. స్త్రీ మౌనాన్ని కలిగి ఉన్నంతసేపూ 'కామి' అయినవాడు మాటలాడుతూనే ఉంటాడు. ఎక్కడ సరిగా కంఠం పట్టుకునే మాటని 'కామి' పలుకుతాడో, అప్పుడు ఆమె గట్టిగా ఆ మాటని పట్టుకుంటే, ఇప్పటివరకూ ప్రసంగించిన 'కామి' అవాక్కై అయిపోతాడు ఈ లోకవిధానాన్ని ఇక్కడ గమనించాలి. దశరథుడలా మాట్లాడుతూ పండకాన్ని గమనించి ఆమె 'చేస్తానని ప్రతిజ్ఞ చేస్తే' చెప్తానన్నది. (ప్రతిజ్ఞాం ప్రతిజానీష్వ యదిత్వం కర్తుమిచ్ఛసి). కామియైన దశరథునికి రాబోయే కష్టం తెలియలేదు. 'కైకేయీ! స్త్రీలలో నువ్వూ, పురుషులలో రాముడూ కంటె నాకిష్టులు లేరు. అలాటి రామునిమీద, ఎవనిని చూడకుండా ఒక్క ఘడియకూడా జీవించలేనో అలాటి రామునిమీద, దేహాన్నీ ఇతర పుత్రుల్నీ విడిచి అయినా ఎవడు లేక బ్రతుకలేనో అలాటి రామునిమీద ప్రతిజ్ఞచేసి చెప్తున్నాను— 'నీవు అడిగినది తీరుస్తాను' అన్నాడు. (తేనాఽజయ్యేన ముఖ్యేన రాఘవేణ మహాత్మనా-శపే తే జీవనార్హేణ బ్రూహి యన్మనసేచ్ఛసి-యం ముహూర్త మపశ్యంస్తు జీవేయమహం ధ్రువం తేన రామేణ కైకేయి శపే తే వచనక్రియామ్-ఆత్మనా వాఽఽత్మజైశ్చాన్యైర్వృణేయం మనుజర్షభమ్—తేన........11/8)

రామునిమీద ఒట్టుపెట్టాక ఆమె చెప్ప ప్రారంభించింది. "ఓ! చంద్రసూర్యులారా! ఆకాశము, గ్రహించబడ్డవి, దిక్కులు, దేవతలు, రాక్షసులు అందరూ వినండి. (వరం మమ దదాత్యేష తన్మే శృణ్వన్తు దేవతాః)" అంటూ. అప్పటికి కూడా దశరథునికి ఆలోచన కలుగలేదు. భర్త తన కోరికను తీరుస్తానని అనగానే సూర్యచంద్రుల దగ్గరనుండి దేవతలవరకూ అందరినీ సాక్షులుగా ఉండమని పలుకుతోందంటే ఎంత గట్టివరం అడుగబోతోందో కదా! కైకమ్మకి ఈ బుద్ధిపుట్టించినవాళ్ళు దేవతలు కాబట్టి కైకమ్మ ఆ దేవతలనే ఉద్దేశించి ఇలా పల్కింది కూడ.

## చెప్పిందొకటి - అడిగింది మరొకటి

మంథర కైకమ్మతో '1. భరతునికి రాజ్యం కట్టబెట్టించు 2. రాముణ్ణి 14 ఏండ్లు అరణ్యానికి పంపించు' అనే చెప్పింది. కాని కైకమ్మ మరికొన్నింటిని కలిపి ఎలా అడిగిందో చూస్తే దేవతల పన్నాగమే అని అర్థమౌతుంది. (అభిషేకసమారంభో రాఘవస్యోపకల్పితమ్-అనేనైవాభిషేకేణ భరతో మేఽభిషిచ్యతామ్ - నవపంచ చ వర్షాణి దండకారణ్యమాశ్రితః చీరాజినజటాధారీ రామో భవతుతాపసః - తదాద్వైవాసు దే యుద్దే (వరోద త్తః) తస్యకాలోఽయ మాగతః - అద్యచైవ హి పశ్యేయం ప్రయాంతం రాఘవం వనమ్ 12/28).

ష్ఠాది మహర్షులు రామునికోసం ఎదురుచూస్తున్నారు. వారికి దర్శనాన్ని ఈయవచ్చును. అని ఇన్ని ఆలోచించిన దేవతలు కైకమ్మద్వారా ఇలా వరాన్ని అడిగించారు. ఈ వార్త ఎక్కడ భరతునకు తెలిసి ఈ పట్టాభిషేకం ఆగిపోదో అని భయపడిన దేవతలు 'ఈ రోజునే రాముడు అరణ్యానికి బయలుదేరాలనే' నియమాన్ని కూడా పెట్టించారు. 14 సంవత్సరాలూ తాపసునిగా జీవిస్తూ అరణ్యాలలో గడపడానికి దేవతల ఆలోచన ఇదైతే, లౌకికమైన ఆలోచన వేఱుగా ఉంటుంది. ఒకరాజు 14 సంవత్సరాలు పట్టణంలో ఉండక జీవించినట్లైతే, అందునా అరణ్యంలో తాపస జీవనం గడిపితే వైరాగ్యబుద్ధి కలిగి రాజుగా రాడు. వచ్చినా రాజ్యాధికారం చేయడానికి పౌరుదే కాకపోవడం వలన సాంకేతికమైన చిక్కు వస్తుంది. రాజ్యాధికారం చేయడానికి కాలదోషం పడుతుందన్నమాట. దేవతాప్రేరణకాక నిజంగా కైకయే వరాలు అడిగి ఉండి ఉంటే 'రాజా: రాముని చేత ఎప్పటికీ రాజ్యాన్ని చేయమని శపథం చేయించు భరతుణ్ణి రాజుచేసి రక్షిస్తూంటానని ఒప్పించు' అని అడిగి ఉండవచ్చు. ఆ వరాలు దశరథునికి కొంతలోకొంత ఇష్టమైయుండేవి. కారణం రాముడు తనవద్దే ఉంటాడు. కాబట్టి ఇంత దారుణమైన వరాలు అడిగే బుద్ధే కైకమ్మకు సహజంగా ఉంటే ఆమె ప్రవర్తన వెనుకకాలంలో కూడ ఏదో ఒకటో రెండో కనీసం ఇలాటి అన్యాయపు ఆలోచనలు కలిగించాలి కదా! సవతిపుత్రుణ్ణి ఆదరించే లక్షణమూ, రామపట్టాభిషేక వార్తని విని ముత్యాలహారాన్ని బహుమతినిచ్చే శీలమూ, రాముడే రాజు కావాలని వాదించిన ప్రవర్తనమూ వెనుకకాలంలో కన్పడిన ఈమె ఒక్కమాఱుగా ఇలా దర్శనమీయడానికి కారణం రాముణ్ణి దండకారణ్యాలకి పంపించడానికి ఈమెయే తగినదని దేవతలు ఈమెని నిర్ణయించుకోవడమే.

## దశరథ విలాపం.

భరత పట్టాభిషేకమూ, రామ వనవాసవిషయమూ వింటూనే మూర్ఛపోయి తేరిన దశరథుడు కైకమ్మని చూచాడు. జింక నిద్రనుండిలేచి పులిని చూచినట్లూ, మంత్రంచేత కట్టుబడ్డ పాము మంత్రగాణ్ణి చూస్తున్నట్లూ అన్పించింది. నిజమో? కలో? తెలియలేదు. ఒకక్షణంపాటు కోపంతో కళ్లు ఎఱ్ఱబడ్డాయి. ద్వేషంతో నిట్టూర్పులు రాసాగాయి. 1) దుర్మార్గురాలా? పశుపక్ష్యాదులు కూడ రాముణ్ణి ప్రేమిస్తూంటే, ఏ కారణంతో నువ్వు ద్వేషిస్తున్నావు? కౌసల్యా సుమిత్రలనైనా విడుస్తామగాని రాముణ్ణి విడువలేను నాకు ప్రాణహాని కల్గించే కోరికను కోరావు. కాబట్టి నాతలతో నీ పాదాలకి మ్రొక్కుతాను. దయచూపు. 2) భరతునిమీద నాకు ప్రేమ ఉన్నదో

లేదో తెలిసికోదలిస్తే రాముణ్ణి అరణ్యాలకి పంపించాలా? రాముణ్ణిగూర్చి భరతుని కంటె గొప్పగా చెప్పేదానివే! అవన్నీ అసత్యాలా? కైకా! నిన్నేవో పిశాచాలు ఆవే శించి ఉండవచ్చు. ఎప్పుడూ అధర్మాన్నిగాని అప్రియాన్నిగాని చేయనిదానికి నీకు ఈ బుద్ధి ఎందుకు కలిగింది? (న హి కించిదయుక్తం వా విప్రియం వా పురా మమ అకరోస్త్వం విశాలాక్షి! తేన న శ్రద్ధధామ్యహమ్ 12/20) నీ ఈ మార్పుని నమ్మ లేకపోతున్నాను. 3) రాముడు అధర్మాన్ని కాలుపెట్టనే పెట్టడు. వేలమంది సేవకు లలో పరిచారికలలో ఎవ్వరుగాని అతనిలో ఒక్క తప్పునికూడ చెప్పలేదే ? ఇలా అడగడానికి కారణం ఏమిటి?నాకు చావు సమీపిస్తోందని తెలిసైనా నన్ను కరుణించు' అన్నాడు.

శ్రీ మద్రామాయణంలో ఇలాటి ఘట్టాలు వినడానికి చాల ఆసక్తికరంగా ఉంటాయి. ఎవరు వాదిస్తూంటే వారిదే ధర్మమనిపిస్తూంటుంది. కైకమ్మ అంది. "1. రాజా! వరాలు ఇస్తే అడిగానా ? నా అంతట నేనడిగానా ? రామునిమీద ఒట్టు పెట్టి మరీ ఇస్తానన్నావే ? ఆ మాటలేమయ్యాయి? 2. నా భార్య నాకు యుద్ధ రంగంలో రెండుసార్లు ప్రాణదానం చేస్తే, ఆమెకు వరాలిస్తానని ఈయలేదని తోటి రాజులతో చెప్పుకుంటావా? ఇక్ష్వాకు వంశమర్యాద యిదేనా? 3. శైబ్యుడనే రాజు యొక్క దానగుణాన్ని పరిశీలించాలని ఇంద్రుడు డేగగానూ, అగ్నిదేవుడు పావురం గానూ ఒకరివెంట ఒకరురాగా పావురం శైబ్యుణ్ణి శరణువేడిందట. డేగపావురాన్ని ఇమ్మని శైబ్యుణ్ణి అడిగితే శైబ్యుడు తన దేహమాంసాన్ని కోసి పావురానికి ఇచ్చి మాట నిలబెట్టుకున్నాడు అలర్కుడనే రాజర్షి అంధుడైన బ్రాహ్మణునకు కన్నులు అడగగానే దానమిచ్చాడుగదా! 'చెలియలి కట్టదాటరాదు' అని సముద్రుణ్ణి దేవతలు ప్రార్థిస్తే సముద్రుడు మాట ఎప్పుడైనా తప్పాడా? రాజా! నా నిశ్చయాన్ని చెప్తున్నా విను. నేనడిగేది ధర్మం కావచ్చు-అధర్మమే కావచ్చు. మంచిదే అయ్యుండవచ్చు లేదా చెడ్డదని నీకు తోచవచ్చు. నాకిచ్చిన ప్రతిజ్ఞ నెరవేర్చాల్సిందే. ఏమైనా సరే ఇయ్యనని అంటే నీ ఎదుటే విషాన్ని త్రాగి నువ్వు చూస్తుండగానే ప్రాణాలు విడుస్తా నని, రాముణ్ణి అరణ్యాలకు పంపిస్తే తప్ప నాకు శాంతిలేదని నామీద భరతునిమీద ఒట్టుగా చెప్తున్నాను' అన్నది. (భవత్వధర్మో ధర్మోవా సత్యం వా యది వానృతం యత్త్వయా సంశ్రుతం మహ్యం నాస్తి తస్య వ్యతిక్రమః-అహం హి విషమద్యైవ పీత్వా బహు తవాగ్రతః-పశ్యతస్తే మరిష్యామి రామో యద్యభిషిచ్యతే-భరతేనాత్మ నా చాహం శపే తే మనుజాధిప ! న కథంచిదృతే రామాద్భరతో రాజ్యమావసేత్)

దశరథుడు దుఃఖిస్తూ ఇలా అన్నాడు. (అనర్థమిమ మర్థాభం కేనత్వ ముప దర్శితా శీలవ్యసనమేత త్తే నాభిజానామ్యహం పురా-బాలాయా స్తత్త్విదానీం లక్షయే విపరీతవత్ 12/57) 1) కైకా ! ఈ అనర్థాన్ని ప్రయోజనం కలదానివిగా ఎవరు నీకు చెప్పారు ? చిన్నప్పటినుండి లేని బుద్ధి ఎక్కడనుండి వచ్చింది ? నాకు ఆశ్చర్యంగా ఉంది. 2) మంత్రులూ - పౌరులూ - జానపదులూ అందరూ నిర్ణయించినదానిని భార్య కారణంగా చేయడం లేదని మహర్షులతో చెప్పనా ? 3) నీ ఇష్టాన్ని నెరవేర్చి నిన్ను ఎలాగూ నమ్మను. కాని నీ ఇష్టాన్ని నెరవేర్చిన మీదట కౌసల్య నన్ను నమ్ముతుందా ? నా గతి ఏమిటి ? 4) ఒక స్త్రీ కోసం (భార్య) రాముణ్ణి అడవులకి పంపించాడని లోకం నన్ను నిందిస్తే మన వంశ చరిత్రకి ఎంత మచ్చవస్తుంది ? స్త్రీ కారణంగా అధర్మాన్ని చేయరాదనే భావనతోనే భరతునకు రాజ్యాన్ని ఈయకుండా ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి రామునికి పట్టాభిషేకాన్ని నిర్ణయించిన దశరథుడు ధర్మాత్ముడు కాడా ?) 5) రాముణ్ణి పిలిచి 'అరణ్యానికి వెళ్ళు' అని నేను చెప్తే నా మనసులో 'ఇష్టంలేదు' అని గమనించక అరణ్యానికే వెళాడు రాముడు. (యది తే రాఘవః కుర్యాద్వనం గచ్ఛేతి చోదితః- ప్రతికూలం ప్రియం మే స్యాన్నతు వత్సః కరిష్యతిః 12/86) మేమందరం వెళ్ళాక ఈ నరకంలో శాశ్వతంగా జీవించు. అందరు ఆడాళ్లూనీలా ఉండరుగాని నీలాటి స్త్రీలు రహస్యంగా భయంకరమైన కీడు తమ భర్తలకి చేస్తారు. వారి పనిని సాధించుకోవాలనే ఆలోచనే తప్ప ఇతరుల విషయాన్ని లక్ష్యపెట్టరు. (ధిగస్తు యోషితో నామ శఠాస్స్వార్థపరాస్సదా న బ్రవీమి స్త్రియ స్సర్వా భరతస్యైవ మాతరమ్ 12/102). కైకా! భర్త అనే మర్యాదతో నైనా ప్రసన్నురాలివి కావా!' అని ప్రార్థించాడు.

దేవతల బుద్ధిచే ప్రేరేపింపబడింది కాబట్టి కైకమ్మ లొంగకపోతే దశరథుడు కైకమ్మని దృష్టిలో ఉంచుకుని లోకంలోని స్త్రీలందరినీ నిందించాడు ఇది లోక సహజమైన విధానం. కష్టం కలుగనంతవరకూ ఏది సుఖానికి కారణమనిపిస్తుందో దానిమీదనే కష్టం కలిగిన రోజున ద్వేషం జనిస్తుంది. ఇలాటి సందర్భంలోనే స్త్రీల మీద కొన్ని శ్లోకాలు పుట్టాయి. అయితే ఆ శ్లోకాలని సందర్భం విడిచి చదువుకున్న ట్లైతే స్త్రీజాతికి అవమానకరంగా అన్పిస్తాయి. సందర్భాన్ని గమనించాలి. దురదృష్ట వశాత్తు నేటి స్త్రీలు చాలమంది పురాణేతిహాసాలలోని శ్లోకాలలో స్త్రీనింద జరిగినప్పుడు సందర్భాన్నీ, నిందించిన వ్యక్తినీ, అతని స్థితినీ గమనించకపోవడం వలన పురాణ

వ్యతిరేకత స్త్రీలలో కల్గుతోంది. ఇలాటి సందర్భంలో పుట్టిన శ్లోకాలు - **స్మితేన రాగేణచ లజ్జయాభియా పరాఙ్ముఖై రర్ధకటాక్ష వీక్షణైః వచోభిరీర్ష్యా కలహేన లీలయా సమస్తభావైః ఖలు బంధనం స్త్రియః** - నవ్వుతో (శంతనుణ్ణి గంగ) అనురాగంతో (సత్యవంతుణ్ణి సావిత్రి) సిగ్గుతో (దుష్యంతుణ్ణి శకుంతల) భయంతో (సుందోపసుందులని మోహిని) క్రీగంటి చూపులతో (వ్యాసుణ్ణి సత్యవతి) ఈర్ష్య నిండిన మాటలతో (శివుణ్ణి పార్వతి) కలహంతో (కృష్ణుణ్ణి సత్యభామ) విలాసంతో (పాండవులని ద్రౌపది) స్త్రీలు పురుషులని కట్టివేస్తారుట. చివరికి వారివలన బాధ కల్గినప్పుడు - **నాసాం స్నేహో నరఃకార్యః తథా వైరో జనేశ్వర** - ఆడువారితో స్నేహంగాని విరోధంగాని పెట్టుకోరాదనీ చెప్పారు ఆ బాధ పడ్డ వ్యక్తులు. 'పుత్రులు పుట్టనంతవరకూ ఆదరించిన భార్య, తాను తల్లి కాగానే ప్రేమని పిల్లలమీదికి త్రిప్పుతుంది. కాబట్టి పిల్లలున్న తల్లిని (భార్యని) నమ్మద్దు అని మరొకరన్నారు. (**నహిభార్యేతి విశ్వాసః కార్యః పుంసాకథంచన నహి కార్యమనుధ్యాతి నారీ పుత్రవతీ సతీ**) ఇవన్నీ అలాటికాలంలో పుట్టినవే అని గమనించాలి.

"కామాతురుణ్ణి కాబట్టి ప్రమాణం చేసాను, తెలివి వచ్చింది. అంగీకరించను" అని దశరథుడు అనచ్చు. కాని దశరథుడు ధర్మాత్ముడు. కాబట్టే అలా తప్పించుకోకుండా మథనపడుతున్నాడు. పెళ్ళినాటి ప్రమాణం' - అదీకాక యుద్ధంలో ఇచ్చిన వరాలు - కోరినది తనకిష్టురాలైన భార్య-అందునా పట్టాభిషేక సమయంలో-ఎవరి గురించో కాక తన భార్య తన పుత్రుణ్ణి గూర్చేకదా కోరింది. ఒక ప్రక్కగా చూస్తే కైక వాదనలో అర్థం లేకపోలేదు. అందుకని రాజ్యాన్ని ఇద్దరికీ భాగించనా? అని ఆలోచించి రాజ్యం మొత్తం రామునికి చెందవలసినస్తే వాడికియ్యకపోవడం ఒక దోషం. వాడి అర్ధరాజ్యాన్ని మరొకనికి ఈయదలచడం రెండవదోషం. ఈ సందర్భంలో ఇద్దరికీ కాకుండా తాను మరణించేంతవరకూ తనవద్దే రాజ్యం ఉంచుకొని ఏలేటట్లైతే (ప్రజలందరూ రామునికి నిర్ణయించాక) అది మరింతదోషం. దీనికి తట్టుకోలేక 'మరణిస్తాను' అని దశరథుడనగానే 'రాముణ్ణి వనానికి పంపితే సమస్య తీరిపోయేప్పుడు చావడమెందుకు ?' అని కైకమ్మ ప్రశ్నించింది. (విషం తాగేస్తే పరిష్కారమయ్యేప్పుడు చావడమెందుకు ? అన్నట్లుంది ఈ చిత్తు). రాముణ్ణి పంపితే తనకి ప్రాణాలు నిలువవు. పంపకపోతే ప్రజలతిప్పువి పాటిస్తానని చెప్పిన సత్య

వాక్కుకి హాని జరుగుతుంది. పంపితే ఆత్మ ప్రాణహాని, పంపకపోతే సత్యహాని జరుగుతుంది. అందుకనే దశరథుడు ఈ రెంటికీ నడుమపడి కాడికీ చక్రానికీనడుమ ఉండే ఎద్దులా ఉన్నాడని వాల్మీకి వ్రాస్తాడు. ఎద్దు-ధర్మానికి సంకేతం. ధర్మ నిర్ణయాన్ని ఎలా చేయాలా? అనే విషయంలో నిర్ణయం చేయలేని తనస్థితిని ఈపోలిక చెప్తుంది. పైగా ఎద్దు తెల్లగా ఉండి సత్త్వగుణానికి ప్రతీక. కైక వరాల విషయంలో ఏ విషయమూ తెలియని అ-మాయ-కుడు దశరథుడని కూడ ఈ పోలిక చెప్తుంది. దశరథుడు అ-మాయ-కుడే అయితే ఎందుకిలా అయ్యాడు? అంటే లౌకికంగా ఓ సమాధానం చెప్పుకోవాలి. రాజులు వ్యసనపరులు. స్త్రీ వ్యసనంతో ఈయన (తన భార్యే అయినా అతిరాగంతో ఉండడమూ వ్యసనమే. కైకవిషయంలో దశరథుడు ఇదే చేస్తున్నాడు.) ద్యూతం వలన ధర్మరాజు, వేటవలన యయాతి,మద్యం వలన అగ్నివర్ణుడు, ఆచార్యులలో శుక్రాచార్యుడు, పరుషంగా మాట్లాడడంవలన శిశుపాలుడు ఎక్కువమోతాదు శిక్ష విధించడం వలన కంసుడు, తండ్రి ఆర్జించిన దాన్ని నిలుపుకోక - అలా అని క్రొత్తది సంపాదించలేక దుర్యోధనుడు నష్టపోయారు. ఈ నష్టానికి కారణాను 'సప్త వ్యసనాలు.' (స్త్రీద్యూత మృగయా మద్య వాక్పారుష్యో గ్ర దండనాః అర్థ సందూషణం చేతి రాజ్ఞాం వ్యసనం సప్తకమ్).

దశరథుని ఏడుపు వినికూడా ఆమె చలించలేదు. (ప్రియామదుష్టాం ప్రతికూల భాషిణీమ్ 13/25) ఇలా ఉండడంలో ఆమె తప్పులేదని వాల్మీకి 'అదుష్ట' (దోషంలేనిది) అని చెప్తున్నాడు. తన ప్రార్థనని కైక పాటింపలేదని బాధపడిన దశరథుడు 'కైకా! పాపిష్టైన నిన్ను ఏ అగ్నిసాక్షికంగా పెండ్లి చేసి కొన్నానో ఆ నిన్ను పుత్రునితో సహా విడిచేస్తున్నాను. రామాభిషేకమే సాగాలి. ఒకవేళ విఘ్నమే కలిగి నేనే మరణిస్తే అపే సంభరాలతో నా ఉత్తరక్రియలని నువ్వూ నీ కొడుకూ మాత్రం చేయవద్దు. పెద్దవాడుండగా చిన్నవానికి పట్టాభిషేకం చేయమంటున్నదానినీ, భర్తని దేశదేశాల జనులమధ్య, అవమానించ సిద్ధపడుతున్నదానినీ, పట్టుదలని విడువనిదానినీ, రాముణ్ణి ఇప్పుడే వెళ్ళాలని చెప్తూ నాకు అప్రియాన్ని కల్గించుతున్నదానినీ అయిన నిన్ను విడువడం దోషంకాదు - (యస్తే మంత్రకృతః పాణి రగ్నౌ పాపే! మయాధృతః-తం త్యజామి స్వజం చైవ తవ పుత్రం త్వయాసహ 14/14 - ధర్మవిఘ్నకరీం భార్యామ

సతీం చాతి కోపనాం త్యజేద్ధర్మస్య రక్షార్థం సదైవా ప్రియవాదిన్సిమ్) అంటూ ధర్మానికి కట్టుబడ్డాను నా తెలివి పోయింది. ధర్మాత్ముడైన రాముణ్ణి చూడా లనుకుంటున్నాను అన్నాడు దశరథుడు. (ధర్మబంధేన బద్ధోఽస్మి నష్టా చ మమచేతనా- జ్యేష్ఠం పుత్రం ప్రియం రామం ద్రష్టుమిచ్ఛామి ధార్మి కమ్ 14/24). ఈ మాటలవలన రాముణ్ణి పంపించడమనే దానికి దశరథుడు అనుజ్ఞని ఇస్తున్నాడని తెలుస్తోంది. రెండవది-రాముడు ధార్మికుడు. 'ఇలా చెయ్య' అని నేను చెప్పినా, చెప్పలేకపోయినా ఏది ధర్మమైతే అది తాను ఆచరిస్తాడు కాబట్టి అతణ్ణి చూడదలిచాను-అన్నాడు.

## అంతఃపురం వెలుపల ఆనందం

ఊరి వెలుపల సరయూనదిలో స్నానంచేసి అయోధ్యాజనం అంతా జట్లు జట్లుగా అంతఃపురం వైపు వస్తున్నారు. ముందుభాగంలో వశిష్ఠుడు శిష్యులతో వేదాన్ని పఠిస్తూ వస్తున్నాడు. కర్పూరపు నీళ్ళని చల్లి మార్గాలని శుభ్రపరచడం చేత ఎనలేని దివ్యపరిమళం ముక్కుపుటాలని తాకుతోంది. ఎటుప్రక్కకి చూచినా సమానదూరంలో రంగురంగుల జెండాలు మార్గాలకి ఇరుప్రక్కలా కన్పిస్తున్నాయి. నాలుగుమార్గాల కూటళ్ళలో అందమైన బొమ్మల ఆకారాలలో రంగురంగుల పుష్పా లని పేర్చారు. ప్రజల కంఠాలలో విలువ తక్కువైన ఆభరణమే లేదు. ఆ సంద ర్భంలో వశిష్ఠుడు తన వెంట వస్తూన్న శిష్యులని ఆపి సుమంత్రుని వద్దకు వెళ్ళి, "సుమంత్రా! ఇదుగో అయోధ్యాజనం పుష్యమీనక్షత్రం రాబోతోంది పట్టాభి షేకానికి బంగారు కుండలివిగో, నవధాన్యాలు -తేనెలూ- పెరుగూ -పేలాలూ అన్నీ సిద్ధమే. నృత్యం చేయాల్సిన ఎనమండుగురు కన్నెలూ, ఊరేగింపుకై శత్రుంజయ మదగజం, రామునికి కప్పేందుకు తెల్లని గొడుగూ, వీచడానికి వింజామరం,ముందు నడిపించేందుకు బండితోకూడా బంగారుపగ్గాల త్రాళ్ళున్న బలిసిన ఎద్దులజతా, ఇటు అటు నడిచేందుకు మంచిజూలున్న గుఱ్ఱాలూ - ఒకటేమిటి-ఇంక సిద్ధంకానిది రాజు గారు మత్రమేనని చెప్పు" అని పలికి సుమంత్రుణ్ణిలోనికి పంపించాడు.

దశరథుణ్ణి స్తుతిస్తూలోనికి వెళ్ళిన సుమంత్రుడు దీనంగా ఉన్న రాజునుచూసి నమస్కరిస్తూ కొద్దిగాప్రక్కకి తొలిగాడు. నోరు విప్పలేక రాజు బాధపడుతూంటే "సుమంత్రా ! రాముని పట్టాభిషేకవార్తతో రాత్రి రాత్రంతా ఆనందపడిన రాజుకి ఇప్పుడే కొద్దిగా కునుకుపట్టింది. వెంటనే రాముణ్ణి పిలుచుకునిరా ! ఆలోచించ

నక్కఁలేదు" అని కైకమ్మ సుమంత్రునికి ఆజ్ఞనిచ్చింది. రాముణ్ణి పిలుచుకుని వద్దామని సుమంత్రుడు ఇవతలికి రాగానే అక్కడివారంతా 'దశరథుడు ఇంకా రాలేదేమి? కారణం కనుక్కో' అనగానే తిరిగి రాజువద్దకు వచ్చి తెరచాటున నిలబడి, "రాజా! నీ దర్శనానికి ఎందరో ఎదురుచూస్తున్నారు" అని అన్నాడు. దానికి బదులుగా రాజు 'సుమంత్రా ! రాముణ్ణి తీసుకొని రమ్మన్న నా ఆజ్ఞని ఎందుకు పాటించవు ? నేను నిద్రపోవడంలేదు. రాముణ్ణి తీసికొని రా' అన్నాడు. (సుమంత్ర! రాజా రజనీం-రామహర్ష సముత్సుకః ప్రజాగరపరిశ్రాంతో నిద్రాయా వశ మేయివాన్ - రామ మానయ భద్రంతే నాత్రకార్యా విచారణా - రామ మానయ సూతేతి యదస్యభిహితోఽనయా కిమిదం కారణం యేన మమజ్ఞా ప్రతిహన్యతే । 4/62-63+5/26)

### సుమంత్రుని జన్మ ధన్యం.

తం వై శ్రవణ సంకాశ ముపవిష్టం స్వలంకృతమ్ ।
దదర్శ సూతః పర్యంకే సౌవర్ణే సోత్తర చ్ఛదే॥ (8)

సుమంత్రుడు వెళ్ళేసరికి రాముడు స్వచ్ఛమైన దుప్పటి పరచిన బంగారు మంచం మీద కూర్చుని ఉన్నాడు. ప్రక్కన నిలబడి సీత చామరంతో వీస్తోంది. భార్యతోకలిసి ఉండి, ఐశ్వర్యాన్ని ఇచ్చే దాతలో, కుబేరునితో సమానంగా కన్పిస్తూ (దాతలా ఉన్నాడు కాబట్టి రాజ్యానికి యాచింపడు-రాలేదని బాధపడనూపడ తనమీద వ్రాలిన ఆకాశాన్ని బంగారుకొండ ఎలా అందగింపజేస్తుందో అలా మంచ మీద కన్పించాడు చందనంతో, అలంకారాలతో అలంకరింపబడి పరిమళాన్ని వెదజల్లుతూన్నవాడై (వన ప్రయాణానికి సిద్ధంగా) చిత్రానక్షత్రంతో కూడిన చంద్రునిలా సీతతో కలిసిన రాము కన్పిస్తున్నాడు.

సరయూ నదీతీరంలో తెల్లవారుజామున రామలక్ష్మణులని మేల్కొలిపినప్పుడు విశ్వామిత్రుని జన్మ ధన్యమైతే, శాపమోక్షమిచ్చినప్పుడు అహల్యాజన్మ ధన్యమైతే, ఇక్కడ ఇలా రాముడు భార్యాసమేతుడై కన్పించినందువల్ల సుమంత్రుని జన్మ ధన్యమైంది. ఏమి కావలిస్తే దాన్ని ఇచ్చేరూపం (కామేశ్వరో వై శ్రవణోదవాతు)తో రాముడున్నాడు. దర్శనంచేతనే సుమంత్రునికి మోక్షం లభించింది. ఆనంద పారవశ్యంతో ఆ రూపాన్ని చూచిన సుమంత్రుడు(కౌసల్యానుప్రజా రామ! పితా

తపస్తున్న విశ్వామిత్రునకు యోగనిద్రతో దర్శనమిచ్చిన రాముడు, భార్యాసమేతుడై బంగరుమంచంపై తాను మాత్రం కూర్చొని సుమంత్రునికి దర్శనమిచ్చిన రాముడు. పురుషసూక్తంతో నారాయణుణ్ణి ధ్యానిస్తున్న తన తల్లికి ఇక్కడ దర్శనమిచ్చాడు భగవంతుణ్ణి మనసులో ధ్యానిస్తుంటే, స్వయంగా ఆయనే వచ్చి దర్శనమిచ్చిన స్థలాలు ఇవి. (శ్రీమద్రామాయణంలో విష్ణు దర్శనం ఇలా ఉంటే, భారత భాగవతాల్లో 'విశ్వరూపం' పద్ధతిలో ఉంటుంది).

## తల్లీ కొడుకుల వాగ్వివాదం - మానవ దైవ శక్తుల పోరాటం.

రాముడు రావణవధని చేయవలసిన విష్ణుస్థితికి ఎదిగిపోయిన ఆ తరుణంలో కైకమ్మ దేవతల పనిని సానుకూలపరచే దేవదూత స్థితికి ఎదిగిపోయిన ఆ తరుణంలో, కౌసల్య రాముణ్ణి ఇంకా తన పుత్రునిగానే భావిస్తూ ఇలా అనబోతోంది. (కౌసల్యమానవశక్తికీ-ప్రయత్నానికీ, రాముడు దైవశక్తికీ-నిర్ణయానికీఇక్కడ ప్రతీకలు. దైవమానవ శక్తులనడుమ సాగే వాగ్వివాదం ఎలా ఉంటుందోదాన్ని ఈఘట్టంలో చూడవచ్చు. దైవశక్తీ, నిర్ణయమూ గెలుస్తాయని వేరే చెప్పనక్కరలేదు గదా !) "రామా! దుఃఖాన్ని అనుభవించడానికే నేను పుట్టి ఉంటాను, నువ్వుపుట్టక పూర్వం గొడ్రాలి నౌతానేమోనని భయం. అప్పుడు కేవలం సంతానదుఃఖంతప్ప వేఱులేనే లేదు. జ్యేష్ఠభార్యని అయికూడా నా భర్తకి మిగిలిన ఇద్దరినీ వివాహానికి కట్టబెడుతూ ఏ స్త్రీ కూడా పడరాని దుఃఖాన్ని పొంది లోలోపల దాచుకున్నాను. ఈ కష్టాలన్నింటినీ నాకు సంతానం కలుగకపోదుగదా! అనే ఆనందంతో దిగమ్రింగుకున్నాను. కాని ఇది పూర్వపు దుఃఖాలు అన్నింటినీ మించిన దుఃఖకారణమైంది రామా ! నీకు ఉపనయనం అయి 17 ఏళ్ళు అయింది. ఎప్పుడు యువరాజు వౌతావా ? సవతులలో ఎలా గొప్పగా ఉందామా ? అనుకుంటూ ఉంటే మళ్ళి నేను నా పూర్వపు స్థితికే వచ్చేసాను. రామా ! వనాలలో నీతో పాటేకనక ఆకు గడ్డితింటూ జీవించినా చాలు అన్నపానాలు మాని ప్రాయోపవేశనం చేస్తాగాని నీవులేక బ్రతుక (లే)ను. 'పితుశ్శత గుణం మాతా' తండ్రికంటె నూరురెట్లు తల్లిగొప్పదని శాస్త్రం చెప్తోందిగదా! నీవు అడవికి పోయేందుకు నేనే అనుజ్ఞనీయను. నిన్నాజ్ఞాపించింది తండ్రికాదు సవతి. ధర్మమే ఆచరించబడాలి అనిగదా నీ మాట ! మాతృశుశ్రూష ధర్మంకాదా ! యాగానికీ - సంన్యాసదీక్షకూ కూడా అనుజ్ఞ నీయవలసినది తల్లి! సంన్యాసి అయినా మాతృ

మరణంలో దర్శించవలసినంత గొప్పదనాన్ని 'తల్లి' మాత్రమేకల్గిఉంది" అంటూ ఏమేమో చెప్తూ మానవయుక్తులతో మాటాడుతూన్న తల్లిని దేవతాస్థాయికి తీసికొనిపోదలచిన రాముడు ఇలా చెప్పసాగాడు.

తల్లీ ! 'పితురాజ్ఞా పరోధర్మః- స్వధర్మోమాతృరక్షణమ్' తల్లిని రక్షించు కోవాలి. మొదటిదీ - బలీయమైనదీ అయిన తండ్రి ధర్మవాక్యాన్ని ఆచరించాలి. లేనిపక్షంలో నాకారణంగా నా తండ్రి, ధర్మకావ్యాన్ని ఉల్లంఘించి అధర్మపరుడై పోతాడు. కండుమహర్షి తండ్రి ఆజ్ఞపై గోవుని చంపాడు- సగరపుత్రులందరూ తండ్రి ఆజ్ఞ కారణంగానే భూమిని త్రవ్వి భస్మమయ్యారు-పరశురాముడు తనతండ్రి ఆజ్ఞతో తల్లి రేణుకను చేతులారా వధించాడు- ఈ మూడూ ప్రజాక్షేమం కోసం చేయబడినవే. 1) కలువుకాటకాలు లేకుండా యాగం చేస్తుండగా ఒక గోవు అకస్మాత్తుగా యాగద్రవ్యాన్నీ, యాగాన్నీ ఛిన్నభిన్నం చేయబోతే తండ్రి ఇచ్చిన ఆజ్ఞపై దాన్ని కండుమహర్షి చంపాడు. పిమ్మట ప్రాణదానం చేసాడు. ii) సగరపుత్రులు భస్మమైనా వారు త్రవ్విన 'సాగరం' నేటికి, ఏ నాటికీ చిరస్థాయికదా! సముద్రం లేకుంటే ప్రపంచమేలేదు. iii) ఆకాశంలో అలంకరించుకొని వెడుతూన్న గంధర్వుణ్ణి నీళ్లలో చూచిన రేణుక 'నా భర్తకూడా ఇలా అలంకరించుకుంటే బాగుండును' అనిభావించింది. ఏ రోజూ తాను ఇసుకతో కుండని చేసి నీటిని తెచ్చేది. కాని ఆరోజున కుండకాలేదు. విషయాన్ని గ్రహించిన జమదగ్ని తన పుత్రుణ్ణి పిలిచి వధించ మన్నాడు. వధించి 'తల్లిని బ్రదికించు' అని వరంకోరాడు పరశురాముడు. తన భర్తప్రాణదానం చేయగలిగిన గొప్పదనం కలవాడై తే, ఆకాశంలోని గంధర్వునిఅలంకారాలపట్లఒకక్షణం మోహితురాలయానయ్యానే! అనిఆమెసిగ్గుతో బాధపడింది. వ్యక్తికి అందం కాదు - గౌరవం(గొప్పదనం) ప్రధానమని సారాంశం). కైకమ్మ యిచ్చిన ఆజ్ఞయేగాని తండ్రి ఆజ్ఞ ఏది ? అనడానికి వీలులేదు. ఆమె మరింతగా పురికొల్పితే ఆమె మాటనే ఆతడు చెప్పాడు. ఆయన స్థితి నాకు తెలుసు. ఒక భార్య తన భర్త వాక్యానికి అనుకూలంగా ప్రవర్తించి ధర్మాన్నీ, ప్రియురాలై కామాన్నీ, యోగ్యుడైన పుత్రుణ్ణి కని భాగ్యరేఖచేత అర్థాన్నీ పొందాలి. ఈ అన్నీ కూడా ధర్మాన్ని ఆచరిస్తే లభిస్తాయి. పైగా తండ్రి నా మీది విరోధం వలన ఇలా శిక్ష విధించాడందామా ? అది సరికాదని నీకూ తెలుసు. ఇక నాతో కూడి నువ్వు కూడా అరణ్యానికి వస్తానన్నావే - అదీ సరికాదు. భార్యకి భర్త తోడిదే ధర్మం.

భర్త జీవించి లేనపుడు పుత్రుని వెంట ఉండాలి. అమ్మా ! ఆశీర్వచనాన్ని కోరే పుత్రుణ్ణి దీవించు. క్షణంలో 14 సంవత్సరాల వనవాసాన్ని గడిపితిరిగి వచ్చేస్తాను." అంటూండగా లక్ష్మణునికి దుఃఖం, కోపం ముంచుకొచ్చాయి. వెంటనే ఇలా ప్రారంభించాడు.

'అన్నా ! ఇలా వెళ్లడం సరికాదు. స్వస్థ చిత్తుడూ, అధికారి అయినవాడూ ఆజ్ఞచేయాలిగాని వృద్ధుడూ, చస్తాననే భయంతో కాలం గడుపుతున్నవాడూ, ఈ వయసులోనూ కైకా విషయంలో కామదాసుడై యున్న ఆయన చేసినది ఆజ్ఞ ఔతుందా ? అయినా శిక్షని విధించే ముందు న్యాయవాది నేరాన్ని చెప్పి శిక్ష విధించాలి. దండకారణ్యాలకి పోవాల్సినంత నేరం నీలో ఏముందో ఎందుకు చెప్పడు ? పైగా తాను నోటితో ఎందుకు చెప్పక ఎవరితోనో ఎందుకు చెప్పించాలి? ఏది తప్పో తెలుస్తుందా ? ఎప్పుడూ నిన్ను విడువక తిరిగే నాకు తెలియని నేరం, కైకమ్మతో సరసాలాడే వృద్ధకామదాసునికి ఏలా తెలుస్తుంది ? వృద్ధాప్యం చేతనే మతిచెడింది. కామగుణం వలన విచక్షణజ్ఞానం పోయింది. కాటికి కాళ్లు చాచిన ఆ కామికి 'కామే ప్రసక్తః పురుషఃకిమకార్యం విసర్జయేత్ ? ' ఏది చేయరాదో అని మానుతాడు ? ఎంతటో జీతభత్యాలు పొందుతూన్న వారున్నారు. వారెవరైనా రామునిలో ఒక దోషాన్నైనా చెప్పారా? ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన రామునితండ్రిగానే అయోధ్యలో పిలువబడుతున్నాడు గదా ! నా దగ్గఱ ఉన్న ఈ కత్తీ, విల్లూ అలంకారార్థం లేవు. నువ్వు 'సరే!' అనట్లైతే క్షణంలో సంకెలలు త్రెంచుకున్న ఏనుగులా తండ్రిని అయోధ్యతో సహా పెకలించిపైచి ఈ ఉపద్రవాన్ని తొలగిస్తాను. కైకమ్మకి ముందేవరాలిచ్చి, రామునికి యౌవరాజ్య మని ఒక నాటకమాడి, ఆమెని వరాలడగమని చెప్పి, ఇలా చెడగొట్టాడుదశరథుడు. లేకపోతే చాల వేలసంవత్సరాలక్రితం ఇచ్చిన వరాలని రాజు ఇంతకాలం ఈయ కుండా ఉండడానికి తీర్చలేకపోవడం కారణమా ? ధర్మం - ధర్మం అంటూతామను కున్న తప్పపనుల్ని సాధించుకొనే వాళ్లలో ఒకడైన దశరథుడు 'పితృధర్మం'అనే మాటతో నిన్ను పడగొట్టాడు. ఇటువంటి సందర్భాలలో దైవం-దైవంఅనుకుంటూ ఉండడం కంటె మానవబలం (పౌరుషం)తో కార్యాన్ని సాధించుకోవడమే సరైనది" అంటూ కోపంతో ఊగిపోసాగాడు.

# రాముని దృష్టిలో కైకమ్మ

తల్లీ - తమ్ముడూ మానవ ప్రయత్నంతో దైవ నిర్ణయాన్ని త్రిప్పికొట్టాలని ప్రయత్నిస్తూంటే రాముడు సమాధానం చెప్పసాగాడు. లక్ష్మణా! స్త్రీ సహజమైన మానసికమైన అబలతతో ఆమె అలా మాట్లాడితే మాట్లాడవచ్చుగాని నువ్వూ అలాగే మాట్లాడడం ఏంబాగుంటుంది ? తండ్రి నిజంగా కైకమ్మతో ఆలోచించి నాకే శిక్ష విధించదలిస్తే 14 ఏండ్లేనా విధించేది ? పోనీ; రాజ్య విషయంలో నాకు ఇష్టం ఉంటే నేనూ 'రాజ్యం తప్పిపోయిందే!' అని దుఃఖపడవచ్చు. నేను కైకమ్మతో ఏమని చెప్పివచ్చాను ? (అహం హి రాజ్యం సీతాం చ ప్రాణానిష్టాన్ ధనాని చ - హృష్టో - భ్రాత్రే స్వయం దద్యాం భరతాయాప్రచోదితః॥ నాహమర్థపరోదేవి ! లోక మావస్తు ముత్సహే - విద్ధి మాం ఋషిభిస్తుల్యం కేవలం ధర్మమాస్థితమ్॥) "రాజ్యాన్నీ, సీతనీ, ప్రాణధనాలనీ కూడా భరతునకుఆనందంతో ఇస్తాను. నాకు సొమ్ము ప్రధానం కానేకాదు. (ఐశ్వర్యానికి మూలభూతురాలు లక్ష్మి నా భార్య గదా! లోకంలో ఉండాలనే ఇచ్ఛ అసలే లేదు. (విష్ణువుని) వైకుంఠానికి చెందిన వాణ్ణి కాబట్టి) ధర్మాన్ని అవలంబించదలచిన వాణ్ణి (రావణవధ ధర్మం) ఋషి వంటివాణ్ణి." (ముందు కాలంలో 'అరణ్యకాండ'లో మహర్షుల నుండి తపఃఫలాలని తీసికొంటే తప్ప రావణుణ్ణి చంప వీలుకాదు. మహర్షులు తపఃఫలాన్ని నాకు ఇయ్యాలంటే నేను ఋషిధర్మంలో ఉండాలి గదా! నేనూనలుగురిగా అవతరించిన రూపాల్లో భరతుడూ కూడ ఒకడే కాబట్టి భరతునకు సీతనిస్తాను- అని అంటే నా భార్యని నేనే స్వీకరిస్తాననే గదా అర్థం. ఇది నిజం కాకపోతే ఊర్మిళ మాండవి, శ్రుతకీర్తి అనే లక్ష్మణ భరత శత్రుఘ్నులభార్యల ఊసు రామాయణంలో ఉండదు). అని అన్నాను గదా! నాకు ఒక్కటే బాధ. తండ్రి, తనకు తానుగానే నాతో చెప్పిఉంటే, ఆయన చెప్పిన దేనినైనా తన పుత్రుడు ఆచరిస్తాడనే నమ్మకం ఆయనకు ఉన్నదని నేను సంతోషపడి ఉండేవాణ్ణి. అలాగని నేను ఆయన చెప్పినది మానినది లేదు. చెప్పనిది చేసినదీ లేదు. ఇప్పుడు కైకమ్మ ద్వారా చెప్పించినది చేస్తే ఆయనకు ఆ నమ్మకం మరింత గట్టిపడుతుంది. లక్ష్మణా! ఎందరో కోర్కు

దని అంగీకరించారు. జీవితంలో కలిగే సుఖాలూ - దుఃఖాలూ మనశ్శాంతీ - కోపం - లాభమూ - నష్టమూ - మరణమూ - జననమూ అనే ఇవన్నీ ఎప్పుడు ఎందుకు ఎలా ఎంతకాలం జరుగుతాయో తెలియక ఉంటామే అదే దైవం అంటే. కారణం తెలియనిదే దైవం (దీన్నే అ - దృష్టం (కారణం కన్పించనిది అంటారు). మరో ఉదాహరణ విను. మన గురువు విశ్వామిత్రులవారు బ్రహ్మర్షులు కాకపూర్వం దైవమే కదా 4 దిక్కులలోనూ అన్ని కష్టాలకి గురి చేసింది. కాబట్టి లక్ష్మణా! కైకామాత దీనికి కారణం కాదు. దైవమే కారణం. దైవ మానవబలాల్లో దైవబలమే గాని నువ్వనుకొనేటట్లు మానవ బలం గొప్పది కానే కాదు. తండ్రిని చంపైనా రాజ్యాన్ని తెస్తానన్నావు కదా!" లక్ష్మణుని ద్వారా రాముడు, తండ్రిని చంపించి రాజ్యాన్ని తెచ్చుకున్నాడు - ఇలాంటివాడు భరతుణ్ణి చంపుతాడని" అనుకోరా? అయినా తమ్ముడూ! కష్టంతో చేయవలసినది రాజ్యపాలన. దాని ద్వారా ధర్మాన్ని ఆచరించి, ఆ ధర్మం ద్వారా మోక్షాన్ని పొందాలి. రజోగుణాన్ని పెంపొందించేది రాజ్యం. ఇక సుఖంతో చేయగల్గినది వనవాసం. వనవాసం ద్వారా తపస్సుని చేసి, ఆ తపస్సు ద్వారా మోక్షాన్ని పొందవచ్చు. పైగా తపస్సు సత్వగుణాన్ని పెంపొందిస్తుంది" అని చెప్పి లక్ష్మణుణ్ణీ, కౌసల్యనీ ప్రశ్నవేయకుండా చేసాడు రాముడు.

ఒకే విష్ణువు రామునిగా, లక్ష్మణునిగా కన్పిస్తూ తన రెండు రూపాల్లోనూ రెండు విభిన్నమైన ఆలోచనలని కల్పింపజేసి, ఒక ఆలోచనతో (దైవమేగొప్పది) వేరొక ఆలోచనని (దేవుని కంటె మానవ ప్రయత్నమే శ్రేష్ఠమైనది) చర్చింపజేయడం అనే చిత్రమైన సన్నివేశమున్న ఘట్టం ఇది. భగవంతుడే, ఇద్దరు మానవులుగా జన్మించి, మానవునిలో భగవదంశ కలిగిన రూపంగా తానుండి (రాముడు) మానవునిలో కేవల మానవాంశ మాత్రమే ఉన్నరూపంగా తమ్ముణ్ణి ఉంచి (లక్ష్మణుడు), ఈ రెంటిలోనూ సరైనదాన్ని (తన సమక్షంలోనే తన రూపంతోనే, తనకి వచ్చిన చిక్కుముడిని విప్పుకొనే సమస్యలోనే పరిష్కరించి) నిర్ణయించి ప్రజలకి చెప్పడం అనే ఈ విశేషం చాల గొప్పది. 'కేవల మానవ ప్రయత్నమే గొప్పది అనే వాళ్ళంతా లక్ష్మణులే. 'కేవలం భగవంతుడ్నే ఆధారం' అనే వాళ్లంతా రాముల్లే.

అందుకనే భగవంతుడే ఆధారమని పల్కిన రాముడు లక్ష్మణుణ్ణి విడిచిపోడు-మానవుడే గొప్ప అని పల్కిన లక్ష్మణుడు రాముణ్ణి కాదనిపోడు. అంటే శ్రీమద్రామాయణం ద్వారా గ్రహించవలసినది — భగవంతుడే ఫలితాన్ని నిర్ణయించే వాడనే భావనతో ఉంటూ మానవ ప్రయత్నాన్ని చేయగలిగినంతగానూ చేయాలి- అని మానవ ప్రయత్నం వ్యర్థమని రాముని భావన కానేకాదు. అదే నిజమైతే తాటకని ఎలా చంపాడు ? దైవం వట్టి దండుగ అని లక్ష్మణుని భావన కానేకాదు. అదే నిజమైతే విశ్వామిత్రుడిచ్చిన భగవత్ సంబంధమైన మంత్రబలాలున్న అస్త్రాలని ఎందుకు స్వీకరించాడు ? రోజూ లాగానే ఇలా అన్న రోజున కూడా ఎందుకు 'సంధ్యావందనం' (దైవకృత్యం) చేసాడు ? చాల మందికి, లోతుగా ఇతిహాస పురాణాలని పరిశీలించమని వారికి, పురాణేతిహాసాలన్నీ "అన్నిటికీ భగవంతుడే ఆధారం - మానవుని ప్రయోజనం ఏమీలేదు" అని వివరించాయని భావన. ఇది చదివి అర్థం చేసుకొని సత్‌దృష్టి పొందితే ఒక నమస్కారం. అయినా 'నమ్మను' అంటే 'వంద'. కైక వరాలని అడిగిన వర్గసంఖ్య ('18'. ఈ '18' అంకెకు గల ప్రాధాన్యాన్ని వివరించుకున్నాం. నా బాలకాండ పుట) భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునునికి యుద్ధరంగంలో సేనలమధ్య ఉపదేశం చేస్తే ఇక్కడ రాముడు లక్ష్మణునికి కౌసల్యా సమక్షంలో (తల్లి) ఉపదేశం చేసాడు.

## "దైవజ్ఞురాలు" కౌసల్య

భావికాలంలో జరగబోయే విషయాన్ని తెలిసినవారిని దైవ -జ్ఞు లంటారు. రాముని మాటలని విన్నపిమ్మట ఆమె దేవతాస్థితికికైకమ్మలాఎదిగిపోయింది. ఇంతకు ముందువఱకూ ఎన్నో పర్యాయాలు నారాయణుణ్ణి ఆమె ధ్యానించినా ఏ నాడూ అసలు నారాయణుడు ఆమెకు దర్శనాన్నియ్యలేదు. పట్టాభిషేకభంగ మయ్యాక నారాయణుడే (రామునిరూపంలో) దర్శనమిచ్చిమాతృధర్మాన్ని తెల్పాక, జ్ఞానోదయమై రాముణ్ణి నారాయణుణ్ణిగానూ, తనని దేవతలమాత అదితిగానూ చేసికొని రాబోయే దానిని స్పష్టంగా కన్నులకి కట్టినట్లు ఎలా చెప్తూ దీవించిందో చూద్దాం.

(యన్మంగలం సహస్రాక్షే సర్వదేవ సమస్కృతే - వృత్రనాశే సమభవత్—
25/21 =అమృతోత్పాదనే దైత్యాన్ఘ్నతో వజ్రధరస్య యత్ అదితిర్మంగలం

ప్రాహ - త్రీన్విక్రమాన్ ప్రక్రమతో విష్ణోరమిత తేజసః యదాసీన్మంగలంరామ ! "తత్తేభవతు మంగలమ్" (ప్రతిశ్లోకపు చివరా ఉంది). రామచంద్రా ! వృత్రాసురుణ్ణి చంపడానికి ఇంద్రుడు బయలుదేరే వేళ దేవతలతల్లి అదితి ఏ మంగళ పూర్వకమైన ఆశీస్సుని ఇచ్చిందో, యుద్ధంచేసి అమృతాన్ని తేవడానికి గరుడుడు బయలుదేరే వేళ గరుత్మంతుని తల్లి వినత ఏ మంగళాశీర్వచనాన్ని ఇచ్చిందో, రాక్షసులని చంపడానికి అమృతం చిలికే వేళలో వెళూన్న ఇంద్రునికి ఆ తల్లి ఏ మంగాళాశీస్సుని ఇచ్చిందో, బలిరాక్షసుణ్ణి అణచడానికి వామన రూపంలోవెడుతూన్న విష్ణువుకి ఆ అదితి ఏ మంగళాశీస్సుని ఇచ్చిందో, ఆ మంగళాశీస్సులన్నీ నీకు కలుగుగాక ! " అని దీవిస్తూ అతని చేతికి 'విశల్యకరణి' అనే పేరున్న మూలికని ఆమె కట్టింది. ఈ మంగళాశీర్వచనాలు అన్నింటిలోనూ రాముణ్ణి విష్ణువుగానూ, అతడు రాక్షసవధ కోసం వెళ్తూ న్న వారిగానూ, తనని దేవతల తల్లి అదితిగానూ పోల్చుకొంది కౌసల్య. ఇది తెలిసి చేసిన ఆశీస్సుకాదు. దేవతాస్థితికి ఎదిగి, వారు ప్రవేశించిన నోటితో పల్కిన ఆశీస్సు. బాణాలదెబ్బలు శరీరానికి తగులకుండా ఉండేందుకై 'విశల్యకరణి'ని చేతికి కట్టింది· విశ్వామిత్రుని అస్త్ర మంత్రాలకంటె ఈ మూలిక పని చేస్తుందా ? అంటే అస్త్రమంత్రాలు అస్త్రాలని తగులనీయకుండా చేస్తాయి. ఈ మూలిక శస్త్రాల వలన గాయాలు కాకుండాచేస్తుంది. అయిన గాయాన్ని వెంటనే మానిపోయేలా చేసి నిరుత్సాహాన్ని కల్గించదు. ఇదంతా లౌకిక సమాధానం. ఇక అలౌకికం మరొకటి ఉంది. రాముడు సీతమ్మ మెడలో మంగలసూత్రాన్ని కట్టి రావణవధకి నాంది పలికి, జగత్కల్యాణం చేస్తే, కౌసల్య రాముని చేతికి సూత్రాన్ని కట్టి రావణవధ అయ్యేంతవఱకూ దీక్షని విడనాడకు' అని సూచించింది నర్మగర్భంగా. చేతికి తోరాన్ని కట్టుకునేది ఎందుకు ? ఆ కార్యక్రమం అయ్యేంతవరకు విరమించనని ప్రకటించేందుకు కదా ! అలాగే ఇక్కడ కూడ జరిగింది. అన్నింటికంటె మించి మరో రహస్యం ఉంది. ఆమె తన పుత్రునికి ప్రదక్షిణం చేసింది కూడ. కారణం, అతడు విష్ణువేనని తెలిసి.

### "తీసికొని పోకపోతే ప్రాణాలు విడుస్తాను!"

రాముని విషయం తెలిసిన సీతకి దుఃఖమూ కోపమూ ఏకకాలంలో కలిగాయి. తన బాధని ఇలా వివరించింది. "రామచంద్రా! ఎక్కడినుండో వచ్చేదే అయినా భార్య మాత్రమే భర్త పుణ్యఫలాన్ని అనుభవించగలుగుతోంది. స్త్రీలు

స్వతంత్రులుకారు. వారికి స్నేహితులాంత్రమూ, చెలికత్తెలూ గతికాదు. భర్తయేగతి. నీకు ముందుగా నేను నడుస్తూ మార్గంలో ఏ ముళ్లు, గులకరాళ్లూ లేకుండాచేస్తాను. ఒంటరిగా భర్త లేక, మేడమిద్దెలలో ఉండడం కంటె భర్తతో వనాలలో ఉంటూ కందమూలాలు స్వీకరించినా చాలు. నోములూ వ్రతాలూ చేయడం కంటె భర్తకి సేవ చేస్తేచాలు. నా సౌఖ్యంకోసమై అడవిలోలభించని వేటినీటినీ, మొత్తదనాన్నీ ఇంకా ఇక్కడ లభించే వేటినీ కోరను. నీ సహవాసం మాత్రం విడువను. ఆహారం, నిద్ర, పులులు మొదలైన మృగాల భయం గూర్చి నాకు చింతయేలేదు. ఎందరో శత్రుసైనికులని చంపగల దిట్టమైన నా భర్త తన భార్యని నన్ను రక్షించుకోలేడా? ఇక వనవాసం క్రొత్తదై, నీ 14 సంవత్సరాల వనవాసకాల నియమాన్ని భంగపరుస్తుంచేమో నని భావిస్తున్నావా ? ఆ సందేహం అసలు వద్దు. జ్యోతిషమూ, సాముద్రికములలో పండితులు, నాకు భర్తతో వనవాసంతప్పదని ఎప్పుడోచిన్నతనంలోనే చెప్పారు. అప్పటినుండి వనాలు చూడాలని ఎదురుచూస్తున్నాను. అలాగే ఒక తాపసి కూడా నాకు వనవాసం కల్గుతుందని చెప్పింది. ఒక్కమాటలో చెప్తావిను. మృగాలతోటీ (మారీచుడు) వానరాలతోటీ (వాలిసుగ్రీవాదులు) నిండిన వనాన్ని ప్రవేశిస్తాను. అలాగే మా నాన్న యింట్లో ఉన్నంత ధైర్యంతో వనంలో (అశోక) జీవిస్తాను. నీ పాదపద్మాలనుంచే లగ్నమైన మనసుండి, ఇతరులవైపుకు దృష్టిపోవని (రావణుడు అడిగినా రాదని, రాముడే భర్త అంటూన్న నన్ను) నన్ను నీ ఎడబాటుతో ఉరివేసికోబోయూంటే, నా ప్రార్థనని మన్నించి ఇష్టాన్ని కల్గించు. (ఉరివేసికోబోతూన్నప్పుడే ఆంజనేయుణ్ణి పంపించు) అయినా నన్ను తీసికొని పోకపోతే ప్రాణాలైనా విడుస్తానుగాని నిన్ను వీడి ఉండను. (అహం గమిష్యామి వనంసదుర్గమం మృగాయుతం వానరవారణై ర్యుతం వనే నివత్స్యామి యథాపితుర్గృహే తవైవ పాదావుపగృహ్య సంయతా ॥ అనన్య భావా మనురక్త చేతసం త్వయా వియుక్తాం మరణాయ నిశ్చితాం నయస్వ మాం సాధు కురుష్వ యాచనాం న తే మయాతో గురుతా భవిష్యతి॥ అయినా నీ తల్లి కౌసల్య దశరథునితోనే ఉండాలని చెప్తాంటావే ? ఆ ధర్మం మన దంపతుల విషయంలో మారుతుందా ? అయినా నా తండ్రి నిన్ను పురుషుడనుకొని పెండ్లి చేసాడుగాని ఆడుదానిపై పురుష రూపాన్ని ధరించిన వాడివని భావించలేదు. ఆర్యపుత్రా ! నీవు వెళ్లాక నీ వియోగంతో ప్రాణాలు విడువడం కంటె నీ ముందే చనిపోవడం మేలు కదా !" అంది.

ఈ మాటల్లో, పట్టైన శ్లోకాలు మూడున్నాయి. 'అహంగమిష్యామి....' అనే 2 శ్లోకాలలోనూ ఆమె దండకారణ్యానికి వస్తాననీ, మారీచుణ్ణి చూస్తాననీ, అపహరింపబడతాననీ, పిమ్మట పరమధైర్యంతో అశోకవనంలో ఉంటాననీ, ఎప్పుడు ఉరివేసికోబోతానో అప్పుడు దూతగా ఎవరినైనా పంపవలసిందనీ రాముని కి నర్మగర్భంగా చెప్పింది. 'జగన్నాటకం ప్రకారం ఈ పై విధంగా జరగాలనే విషయం నాకు గుర్తున్నది సుమా!' అని రామునికి మాత్రమే అర్థమయ్యేలా తెల్పింది సీత. 'అసలు నేను లేకపోతే, నన్నపహరించడమనేది లేకపోతే, నీవు రావణవధనే చేయలేవనే అర్థం కల్గేలా మాట్లాడుతోంది కాబట్టి 'రామా! నేను ముందు వెళ్లి నిన్ను రప్పించవలసి ఉంటే, నన్ను తీసికొని వెళ్లనంటావేమిటి ?– అంటూ— 'అహం గమిష్యామి....' నువ్వు తీసికెళ్లకపోయినా నేనే వెడతానని' పల్కింది సీతమ్మ. ఈ మాట పైకి దుఃఖ స్థితినీ, లోపల గంభీరార్థాన్నీ చెప్తుంది.

### పురుషుని వేషంలో స్త్రీవి...అంతే?

రాముణ్ణి ఈ నింద చేసింది సీత. ఇది ఆమె తెలివి తక్కువగా అన్న మాట కానేకాదు." కిం త్వా మన్యత వైదేహః పితా మే మిథిలాధిపః - రామ జామాతరం ప్రాప్య స్త్రియం పురుష విగ్రహమ్॥" అని ఈ మాటలనన్నది సీత. ఈ శ్లోకం చాల అర్థవంతమైనది కాబట్టి వివరంగా చూద్దాం. 1) 'రామా!' i) లోకాన్ని ఆనందింప చేసే మోహన రూపం కలిగిన వాడివి కాబట్టే - శత్రునాశ నాన్ని చేయగలడనే 'శత్రుఘ్నుడు' అనే పేరుని - వశిష్ఠుడు నీకు పెట్టలేదు. (రామ యిత్యభిధానేన వపుషా తస్య చోదితః - నామధేయం గురుశ్చక్రే జగత్ప్రహ్లాద మంగలమ్॥) ii) సహస్రనామతత్తుల్యమ్... అనడం బట్టి 'రామ' అనే నామం విష్ణుసహస్రనామాలని పఠించిన ఫలితమిస్తుందన్నారే! ఆ శక్తి గల నామాన్ని ధరించిన నీవు- నన్ను తీసికొనిపోవడానికి భయపడే వాడివా ?(విష్ణువు వేయి నామా లు దేవలోకంలో ఎప్పుడో ఉన్నాయి. వాటినే భారతంలో భీష్ముడు తర్వాత చెప్పాడు. 2) మే పితా- జనకుడు నాకు తండ్రి. నీ కంటె ముందుగా వనానికి వెడతానన్నంత ధైర్యం చూపిస్తున్న నాకు తండ్రి ఆయన. నన్ను వనానికి తీసికెళ్లావని దుఃఖపడ తాడేమో ననుకోకు. 3) వైదేహః - 'కర్మణైవహి సంసిద్ధి మాస్థితా జనకాదయః' అన్నట్టు కర్మ చేయడం చేతనే మోక్షానికి ప్రయత్నించే జనకుని కూతుర్ని నేను·

భార్యలేకుండా కర్మ చేయలేరు కాబట్టి పత్నిని విడువడమనేది మా వంశంలో ఎక్కడా లేనిది సుమా ! (కర్మ అంటే యజ్ఞయాగాదులూ, నిత్యం చేసే పూజలూ అన్నీను). 4) మిథిలాధిపః i) మా తండ్రి మిథిలకి ప్రభువు. అనురాగంతో ప్రజలని పరిపాలిస్తున్న ఆయన బాధపడితే, మిథిల అంతా బాధపడుతుంది సుమా ! ఒక నగరాన్ని బాధపెట్టిన క్షత్రియుడివౌతావు జాగ్రత్త ! ii) మా నాన్న ఒక నగరాన్ని భరిస్తూంటే ఒక స్త్రీని నువ్వు భరింపలేవా ? 5) స్త్రియం పురుష విగ్రహమ్ i) పొలాల మధ్యలో దృష్టిదోషం తగులకుండా పెట్టే పురుష విగ్రహంలా ఉన్న నిన్ను నిజమైన పురుషుడని భావించాడు. ఆ దృష్టి బొమ్మ దగ్గఱకు వెడితే అది ఏమీ చేయ (లే) నట్లు నువ్వూ అలాటి వాడివని పరీక్షింపబోయిన నాకు అర్థమైంది. నీ గురించి అడిగితే, నా తండ్రికి ఏమని చెప్పాలి ? ii) భోగే భవానీ - పురుషేషు విష్ణుః - క్రోధే చ కాళీ - సమరే చ దుర్గా - అనే ప్రమాణం ప్రకారం ఒకే స్త్రీ అవతారం భోగాలకి తగిన రూపం ధరిస్తే 'భవాని' గానూ- (కంచి), పురుషరూపాన్ని ధరింపచేస్తే విష్ణువుగానూ (తిరుపతి), క్రోధాన్ని కల్గింప చేస్తే 'కాళి'గానూ (కలకత్తా), యుద్ధ వేషం వేస్తే 'దుర్గ'గానూ (విజయవాడ) ఔతుంది కాబట్టి- 'రామా ! నువ్వు విష్ణువువి. అంటే, పురుషరూపాన్ని ధరించిన స్త్రీవి కావా ? అని యథార్థరూపం తెలిసిన సీతమ్మ మాట. 6) జామాతరం ప్రాప్య 'జామాతా దశమోగ్రహః' అన్నట్లుగా పట్టి పీడించేవాడివిగా కన్పిస్తున్నావు. అయితే ఇది నీ తప్పుకాదు. (ప్రాప్య) ఆయనే ధనుఃపరీక్ష ద్వారా నిన్ను అల్లుణ్ణి చేసికొన్నాడు గదా ! అనే అర్థం వస్తుంది. ఈ అర్థమే కాక 1) వాసుదేవు డొక్కడే కాక మిగిలిన లోకమంతా స్త్రీయే అని భావించిన నా తండ్రికి నీ సంగతి తెలియదు సుమా ! (స ఏవ వాసుదేవోఽయం సాక్షాత్పురుష ఉచ్యతే - స్త్రీప్రాయ మితరత్సర్వం జగద్బ్రహ్మపురస్సరమ్) 2) తల్లి కాని తల్లి కైకమ్మతో విరోధం వస్తుందని తెలిస్తే నన్ను ఇచ్చేవాడే కాడేమో ! అయినా జగల్లీల కోసం పుట్టిన రామా ! అడవికి తీసికొనిపో ! 3) భక్తపురుషులని విశేషంగా (అను) గ్రహించే వాడివీ, రాముడనే పేరున్న అల్లుడివీ అయిననిన్నుపొందినాతండ్రితనస్త్రీని(భార్యనీ- ఇతర బంధుగణాన్ని కూడా) ఇతర ఆ ముష్మికాన్ని అన్నిటినీ కాదని పరిపూర్ణు డయ్యాడు- అలాంటి తండ్రి నన్నెలాగూ పట్టించుకోడు. వనాలకి తీసికొని పో! - అని ఇలాంటి అర్థాలు కూడా పదాల విఱుపువల్ల వస్తాయి.

## లక్ష్మణా! ఇక్కడే ఉండు !!

సీత మాటలని విన్న రాముడు 'సీతా ! నీ భావం నాకు స్పష్టంగా తెలియక పోవడం వలన రావద్దన్నాను. వనంలో నీకు ఏ భయమూ లేదు. నాతోపాటు నిన్నూ అడవులలో కష్టాన్ని పంచుకోమని భగవంతుడు పుట్టించాడనిపిస్తోంది. రా! తీసికొని వెడతాను. నాతో ధర్మసంభాషణలని చేస్తూ ఉండు. ఇక మనకి సంబం ధించిన అన్ని సంపదలనీ బ్రాహ్మణులకీ, ఇతరులకీ, భిక్షుకులకూ దానం చేసేస్తే వెంటనే బయలుదేరదాం' అంటూండగానే సీత దానాలని ప్రారంభించింది.

అతికష్టం మీద సీతని వనాలకి అనుమతించిన రాముడు, తనని కాదంటాడే మోననే భయంతో కళ్ళనీళ్ళు నిండుతూండగా అన్నపాదాలని గట్టిగా పట్టు కొని, సీతమ్మ ముఖం చూచాడు లక్ష్మణుడు. (స భ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య రఘునందనః - సీతామువాచాతియశాః రాఘవం చ మహావ్రతమ్).

అన్న ఆజ్ఞని పాలించడమే తప్ప వేఱు కర్తవ్యమే లేని వాడూ - ఆలోకం లోనే కాక ఈలోకంలోనూ సేవచేయడానికే అవతరించినవాడూ - ఎక్కడ రాముని తో వియోగం సంభవిస్తుందోనని భయపడుతూండే వాడూ - రాజకుమారుడై ఉండి కూడా జ్యేష్ఠుణ్ణి అనుసరించడమే రాజనీతమనే సదాలోచనతో ఉన్నవాడూ (ఆ కారణంగా మహాకీర్తిమంతుడు) అయిన లక్ష్మణుడు, శరణన్న వాణ్ణి రక్షించడమే ధర్మంగా ఉండే రఘు వంశంలో పుట్టిన రాముని పాదాలని (అభిమానపడి చేతులని పడితే పని కాకపోతేనో- గట్టిగా పట్టుకొని, ఉత్తీర్ణుడైన వారిని ఉత్తీర్ణుడు కావలసిన వాడు యాచించినట్లు సీతమ్మద్వారా రాముణ్ణి ప్రార్థించ మొదలెట్టాడు. 'అన్నా! దేవ లోకం కూడా నాకు వద్దు. సీతతో ఇందాక మాట్లాడుతూ - భరత శత్రుఘ్నులని సరిగా చూచుకో- మన్నావు. (నేను నీతో వస్తున్నట్లే భావించి కదా ! - అలా పలి కావు. ఎంత సంతోషమైందో !) నా పేరు లేక పోవడం వల్ల, నేనూ వనానికి సిద్ధపడ్డాను, వారించవద్దు' అని రాముని మాటకు ముందే తాను మాట్లాడి ప్రార్థిం చాడు లక్ష్మణుడు.

(భగవంతునికి దూరమైపోతున్నామనే ఆలోచన కల్గినంతలోనే దుఃఖం కలిగితే, ఆ ఆలోచన (భక్తి) కల్గినవాడే నిజమైన భక్తుడు. ఇక్కడ రాముడు

పరమాత్మ. లక్ష్మణుడు భక్తుడు. భక్తుణ్ణి భగవంతుని వద్దకు చేర్చేది 'భక్తి' మాత్రమే -(పునర్విశ్లేషభీరుత్వం పరమాభక్తి రుచ్యతే).

"లక్ష్మణా ! నువ్వు కూడా నాతో వచ్చేస్తే అశ్వపతి కూతురైన మన తల్లి కైకమ్మనీ, సుమిత్ర, కౌసల్యలనీ ఎవరు చూస్తారు ? నేను వెళ్లాననే దుఃఖం నా తల్లికి పోవాలంటే, నీలో నా ముఖం చూసుకొనేందుకు వీలుగా నువ్వుండాలి కదా!" అని రాముడన్నాడు.

"అన్నా ! వీరుడవైన నీకు భయపడి అయినా భరతుడు మన తల్లులని మన కంటె శ్రద్ధతో చూస్తాడు. అయినా కౌసల్యామాతకి వేలకొలది గ్రామాలు ఉండగా ఆమెని మరొకరు పోషించాలా ? నా తల్లి వంటి వారి నెందరిని పోషించాలనుకుంటే ఆమెకు కష్టం ఔతుంది? (యస్యాస్సహస్రం గ్రామాణాం సంప్రాప్తాము పజీవికామ్) - పసుపు కుంకుమలుగా పుట్టినింటివారూ - భరణంగా భర్తా - లాంఛనాల పేరిట అత్తింటివారూ తమతమ స్థాయికి తగినట్లుగా స్త్రీకి ఇవ్వడమనేది త్రేతాయుగం నాటి నుండీ ఉంది. అయితే ధర్మబద్ధులైన ఆనాటి వారూ - అలాంటి లక్షణం ఉన్న ఏ కొందరో నేడున్నూ స్త్రీ ధనాన్ని స్పృశించడం లేదు.) ఇదంతా కాదు రామచంద్రా ! నన్ను నీ సేవకునిగా నియోగించు. ఇది అధర్మమేమీ కాదు. దీనివలన నేను కృతార్థుణ్ణి ఔతాను. నీకూ ప్రయోజనం సిద్ధిస్తుంది. నువ్వు లేని సమయాల్లోనూ, నిద్రిస్తున్న సమయంలోనూ, కాపు కాయడానికైనా పనిచేస్తాను' అని లక్ష్మణుడనగానే 'అయితే రా ! నీ స్నేహితులందరికీ చెప్పిబయలుదేరు. వశిష్ఠులవారి యింటిలో వరుణుడియ్యగా నేను దాచిన రెండు ధనుస్సులూ, రెండు కవచాలూ, రెండు అమ్ములపొదులూ, రెండు ఖడ్గాలూ ఉన్నాయి. వీటిని కూడా పట్టుకొనిరా ! వశిష్ఠుని పుత్రుడు సుయజ్ఞుణ్ణి కూడా వెంటనే తీసికొనిరా! అరణ్యానికి పోబోయే ముందు అన్నీ దానం చేసి, వారిని పూజించాలి' అన్నాడు రాముడు.

**తాపసు లేమిటి ? మారణాయుధాలేమిటి ?**
**వెళ్లబోతూ ఈ దానాలేమిటి ?**

ఇదే అసలు రహస్యం. తపస్సు చేసికోవడమే లక్షణంగా కలవాళ్లని 'తాపసులు' అనాలి. ధర్మమూర్తి అయిన రామునికి ఈ మాత్రం ధర్మం తెలియదా ?

తాపస లక్షణానికి పూర్తి విరుద్ధంగా విల్లూ - కవచాలూ - ఖడ్గాలూ - బాణాలూ ఏమిటి ? అన్పిస్తుంది. పైగా తాను సంపాదించింది ఏమి ఉన్నదని ఆ ధనాన్నీ వస్తువులనీ దానం చేస్తున్నాడు ? వెళ్తూ - వెళ్తూ దశరథుని సంపదని దానం చేయడం- ద్వేషంతో చేసినది' అని చెప్పుకొనేందుకు కూడా వీలైనది కదా!

రామునిగా అవతారాన్ని ఎత్తడానికి కారణం 'రావణ వధ' కదా ! అయోధ్య పట్టాభిషేకాన్ని తప్పించుకోవడం కూడా దీని కోసమే కదా ! పట్టాభిషేకం తప్పి పోవాలనీ, ఆ పిమ్మట ఈ విల్లూ - ఖడ్గాలూ.... వీటన్నింటితోనూ అరణ్యానికి పోవాలనీ ముందే నిర్ణయించుకున్న రాముడు, ఈ ఆయుధాలని సుయజ్ఞుని ఇంట ఎప్పటినుండో ఉంచాడు. లేని పక్షంలో బ్రాహ్మణుడైన సుయజ్ఞునికి మారణా యుధాలని దాచి ఉంచవలసిన అవసరం ఏముంది ? వరుణుడిచ్చిన విల్లు కాబట్టి వాటిని పవిత్రంగా, వాటి శక్తి చెడిపోకుండా, నిత్యపూజ చేత శక్తి పెరిగేలా చేయ డానికై ఆయన యింట ఉంచాడు. అరణ్యానికి వెళ్లవలసినది ఇద్దరు కాబట్టి ఆయు ధాలు కూడా రెండు రెండుగా దాచి ఉంచాడు. దీన్ని బట్టైనా పట్టాభిషేకం ఆగి పోవడమనేది 'రావణవధ'కే అనే విషయం అతి స్పష్టంగా గనునించవచ్చు.

ఇక తాపసుడు' అంటే తపస్సే ప్రధాన లక్షణంగా కలవాడనే అర్థం. కాని తపస్సంటే ముక్కుమూసికొని జపం చేసికోనడమనేదే అర్థంకాదు. తైత్తిరీయోప నిషత్తు నారాయణవల్లి 118వ మంత్రం తపస్సంటే ఏమిటో చెప్పింది.

"ఋతం తపః - సత్యం తపః - శ్రుతం తపః - శాంతం తపః - దమ స్తపః - శమస్తపః - దానం తపః - యజ్ఞంతపః — ఓం భూర్భువస్సువరోమి త్యేత దుపాస్వై తద్బ్రహ్మ". (వరుసగా ఉదాహరణలని చూపిస్తూ ఈ కాండ చివర్లో ఈ విషయం నిరూపింపబడుతుంది. కథ కాకుండా వీటన్నింటికీ ఉదాహర లని రాయడం సముచితం కాదుగదా !) సత్యాన్ని పలకడం, వేదం చెప్పినట్లు ఆచరించడం, అంతరింద్రియాలనీ - బహిరింద్రియాలనీ అదుపు చేయడం, ప్రజలకిఅభయాన్ని దానం చేయడం (భయం లేదని చెప్పడం)- తపస్సులో భాగమే కాబట్టి'రావణవధ' అనేది చేయదలచడం ఒక తపస్సే. ఇక దానాలకిసంబంధించిన సొమ్ము దశరథునిది కాదు. 'పితృద్రవ్యావిరోధేన యదన్యత్ స్వయమార్జితమ్ - మైత్రమౌద్వాహికం చైవ మధుపార్కికమేవ చ - పితృభ్యాం యస్య యద్దత్తం

తత్తస్యైవ ధనంభవేత్' అనే యాజ్ఞవల్క్యస్మృతి ప్రకారం తండ్రికి సంబంధించనిదీ తనకి జరిగిన వివాహ - జన్మదిన - ఇతరఉత్సవకాలాల్లో మిత్రులు - బంధువులూ- ఇతరులచేత ఈయబడిన కానుకలూ, అలాగే తండ్రీ - మామగార్లు తనకుగా ఇచ్చినవీ ఏవున్నాయో అవన్నీ తనకి సంబంధించినవే కదా ! అలా తనకీ, తన తమ్ముడు లక్ష్మణునికీ, తన భార్య సీతకూ వచ్చిన ద్రవ్యాలని దానం చేయమని రాముడాదేశించి తానూ దానాలు చేయ సంకల్పించాడు.

ఉన్న ద్రవ్యాలని దానం చేయటం వలన, ముందు నాటికి దండకారణ్యంలో కష్టపడుతూన్న రోజులలో- 'అయోధ్యలో ఉంటే ఆ సౌఖ్యం ఉండేదిసుమా!' అని ఆలోచించే అవకాశం ఉండదు. వినోద విలాసాలకి సంబంధించిన వస్తువులదగ్గఱ నుండీ, విలువైన వస్త్రాలూ, ఆభరణాలూ, మంచాలూ....అలా అన్నీ నడివీధిలో దానం చేయబడ్డాయి.

## సీతా లక్ష్మణులనే ఎందుకు రాముడు తీసికొని పోదలిచాడు ?

మేమూ నీతో అరణ్యాలకి వస్తామని రామునితో పల్కినవారు 'దశరథుడు- కౌసల్య - సీత - లక్ష్మణుడున్నూ. వరుసగా ఒక్కొక్కరూ దుఃఖిస్తూ రాముణ్ణి వనాలకి తీసికొనిపొమ్మన్న తీరు చూస్తే, మనకు ఈ సమస్యకు సమాధానంలభిస్తుంది.

పట్టాభిషేక భంగం కాగానే దశరథుడు మూర్ఛపోయాడు. కైకని నిందించాడు. సీతారాములని గూర్చి జాలిపడి బాధపడ్డాడు. తనని ప్రజలు ఏమనినిందిస్తారో ఒక్కసారి ఆలోచించమన్నాడు. కైకమ్మని విడిచేస్తానన్నాడు. 'రాజ్యం నీకిస్తాను - ఆగిపో! అని రామునితో అనడమే కాక చివరికి 'ఈ రాత్రికి ఆగివెళ్లు' అన్నాడు.

రాజ్యం అక్కఱలేదనేది రాముని ఆలోచన కాగా, రామునికి రాజ్యం కట్టిపెట్టలేకపోతున్నాననే బాధ దశరథునిది. తనకి లేని రాజ్య బాధ ఆ తండ్రిబాధ. రావణవధ ఎలాగా ? అని తాను బాధపడుతూంటే, తనకిలేని మరో బాధని ఈ తండ్రి ద్వారా ఎందుకు తెచ్చుకొని బాధపడడం ? - 'అనవసరమని' తండ్రిని వద్దన్నాడు.

కౌసల్య రాముని వలన వార్త విన్నది. ఛత్రచామరాలా- వింజామరలా - రాజలాంఛనాలా నీకు లేవేమి ? అన్నది. తాను పుట్టిన దగ్గర నుండీ సుఖపడలేదని బాధపడింది. దశరథుడు ఉండగానే తన గతి అలా అయితే, ఇకమీదట ఎలా ఉంటుందో నని బాధపడింది. దాసదాసీజనం - ఐశ్వర్యం తలచుకొన్నది కాని కైకనీ భరతుణ్ణి నిందించలేదు. తన పుత్రుడు మరీ అనాథలా వెళ్లరాదని భావించి, అనిష్టం కల్గుతుందే మోననే భయంతో దీవించింది గాని మనఃపూర్ణంగా కాదు.

ఏ పట్టాభిషేకం రామునికి ఇష్టం లేదో, ఆ పట్టాభిషేకం తన పుత్రునికి జరగలేదే ? తాను చక్రవర్తి మాత కాలేకపోయానేమో ? అనే బాధ కౌసల్యది. రామునికి లేని బాధ కౌసల్యది. కాబట్టి ఈమె కూడ వనాలకి అనవసరమని రాముని భావన.

"నీ మాట అలా ఉంచి నీకంటె ముందు నేను బయలుదేరుతాను. నన్ను తీసికొనిపోవడానికి భయపడుతున్న నువ్వు ఆడుదానివే. నువ్వు వెళ్లాక ఆ వియోగంతో పోవడం కంటె నువ్వుండగానే ఇక్కడే నువు తీసికొనిపోవడం లేదనే దుఃఖంతో మరణిస్తాను. అరణ్యాలకి వచ్చినా సౌఖ్య -వినోద-విలాస-వస్త్ర-ఆహారాదులని నువ్విలా సమకూరిస్తే అంతతోనే తృప్తి చెందుతాను. ఇవీ అవీ కావా లని అడుగను. అయినా తీసికొని పోనంటే మరణిస్తాను" అని సీతమ్మ రాముని దానిగా పల్కింది. ఈమె మాటల్లో ఎక్కడా రామునికి లేని రాజ్యబాధ లేదు. రామునితోనే ఉండాలనే ఆలోచనా, తీసికొనిపోవడం లేదనే బాధా తప్ప వేఱుబాధ లేదు. ఇదే రామునికి కావలసినది. అందుకే సరేనన్నాడు. రావణవధ జరిపించడానికి ఆమె అవసరమూ ఉంది. అది లోవిషయం.

ఈ తతంగాన్ని చూస్తూనే లక్ష్మణుడు రాముని పాదాలని పట్టుకొని సీతమ్మ ముఖాన్ని చూస్తూ కన్నీరు పెట్టడం సోదరభక్తికి పరాకాష్ఠ. విష్ణువుకి శేషుడు లక్ష్మణుడు కదా ! పాదాలని చుట్టబెట్టాడు. "నువ్వు వెడుతూంటే, నేను ముందు వెడతా. నీ కిష్టమేమో అనుకుని దశరథుణ్ణి చంపైనా పట్టం కట్టిస్తానన్నాను. నీకు రాజ్యం అక్కఱలేకపోతే నాకు మాత్రం ఎందుకు ? నీ కోసం రాజ్యాన్ని తీసి కొంటున్నాను' (త్వదర్థమభికామయే) అని నాతో అన్నావు. నువ్వు రాజ్యాన్ని తీసి కొన్నప్పుడు కదా! రాజ్యాన్ని నా కోసం గ్రహించడమనేది కుదురుతుంది ! నీకే

రాజ్యం అక్కఱలేకపోతే నాకు మాత్రం ఎందుకు ? నీ వెంట ఉండడమే రాజ్యం మళ్లీ మాటాడితే అంతకుమించినది కూడాను. నేను రాక మానను" అన్నాడు లక్ష్మణుడు. రామునికి లేని రాజ్యబాధ వీనికి లేదు. ముందు రామునికి రాజ్యం లేదే ? అనే ఉక్రోషంతో ఏమేమో అన్నా, రాముని హృదయాన్ని గ్రహించి మారాడు.

కైకమ్మ అడిగిన వరాల ప్రకారం (గ్రామం వా నగరం వాపి....) రాముడు ఈ వనవాస కాలంలో నగరంగాని గ్రామం గాని ప్రవేశించకూడదు. ముందు నాటికి వాలివధ అయ్యాక సుగ్రీవునికి రాజ్యం అప్పగించాక, భార్యలైన రుమ - తారల సౌఖ్యాల్లోపడి సీతాన్వేషణ విషయాన్ని మఱచి పోయినప్పుడు, అతనికి విషయాన్ని గుర్తుచేసేందుకు తనకి ఒక వ్యక్తి కావలసివస్తాడు. తాను నగరాన్ని ప్రవేశించరాదు. ప్రవేశించనిదే సుగ్రీవునికి జ్ఞానోదయం కాదు. ఆనాడు లక్ష్మణుని అవసరం చెప్పలేనంతటిది. మారీచుణ్ణి వధించడానికి తాను వెళ్లబోయేముందు సీతమ్మకి రక్షణగా ఉంచడానికి ఒకరు కావాలి. అప్పుడూ లక్ష్మణుని అవసరం ఉంది. రాబోయే జగన్నాటకకథలో (తన ఇచ్ఛకి అనుగుణంగా సాగుతుంది కదా !) అవసరమయ్యే లక్ష్మణుణ్ణి ఇందుకై కూడ రమ్మన్నాడనేది లోవిషయం. లక్ష్మణునికి తెలియకపోయినా చూచాయగా అన్నాడు. (తవ చార్థః ప్రకల్పతే) 'నీకూ నావల్ల ప్రయోజనం ఉంటుంది' అని. నోట మాటైతే వచ్చింది గాని లక్ష్మణునికి ఇంత వివరం తెలియదు.

ఈ ఘట్టంలో భగవత్ - భాగవత సంబంధం కూడ ఉంది. భగవంతుడంటే ఆరాధింపబడేవాడు. భాగవతుడంటే ఆరాధించేవాడు లేదా భక్తుడు. భక్తుడు తన తోచిన రీతిలో విలువైన నివేదనలనీ, వస్త్రాలనీ, ఆభరణాలనీ భగవంతునికి ఇస్తే భగవంతుడానందపడడు. కారణం, రామునికి లేని రాజ్యబాధ వీరికిపట్టుకున్నట్లు భగవంతునికి లేని అట్టహాసాలు భక్తునికి పట్టుకుంటే, ఆయన సంతోషించడు. తన వెంట వీరిని పట్టుకొనిపోడు. ఎవడైతే 'నీవే తప్ప ఇతఃపరం బెఱుగ - శరణు శరణు' అని కోరుతాడో అతణ్ణి స్వీకరిస్తాడు. దీన్నే 'భక్తి' అంటారు. బంగారు విగ్రహానికి, లక్షల ఖర్చుతో పూజచేసామా ? లేదా? అనేది ప్రధానం కాదు. మట్టి విగ్రహానికైనా భక్తితో మనసుని అర్పించామా ? లేదా ? అనేది ముఖ్యం. కన్న

తల్లిదండ్రులు కాక మరోతల్లికి కల్గిన భార్య, సోదరులు రాముని వెంట వెళ్లడాని క్కారణం 'భక్తి' మాత్రమే. పెద్దపెద్ద త్రాళ్లకి కట్టుబడని విశ్వరూపం చూపిన కృష్ణుడు, యశోదమ్మకి జానెడు త్రాటితో లొంగిపోలేదా ?

మరో విశేషం కూడ ఉంది. దైవ ప్రయత్నం దండుగ - మానవ ప్రయత్నమే గొప్పదని వాదించిన లక్ష్మణుడు దైవం పాదాలని ఆశ్రయించి శరణ న్నాడు. దైవ ప్రయత్నం ముందు మానవ ప్రయత్నం ఫలించదన్న రాముడు లక్ష్మణుణ్ణి విడిచి పోలేదు. కాబట్టి మానవ ప్రయత్నాన్ని చేయగలిగినంత చేసి దైవ సహాయానికి ప్రార్థన చేయాలి. ఫలితం 'చెడు' అయినా 'మంచి'అయినా అది 'తన' వలన జరిగిందని భావించకూడదు. 'మంచి' జరిగితే తన తెలివితేటల ఫలితమనీ, 'చెడు' జరిగితే కాలం కలిసిరాలేదనీ భావించేవారు ఈ విషయాన్ని మరింతగా గమనించాలి.

## రామునిది ఏ కోవకు చెందిన దానం ?

వశిష్ఠుని పుత్రుడు సుయజ్ఞునికి భుజకీర్తులూ, కిరీటాలూ, కుండలాలూ, బంగారు పానుపూ, తన మేనమామ యిచ్చిన శత్రుంజయమనే పేరున్న ఏనుగుతో మరి వేయి ఏన్గులనీ కలిపి దానమిచ్చాడు రాముడు. అతని భార్యకు కూడా సీత ఆభరణాలని ఇచ్చాడు. కౌసల్య ఇంట 'తైత్తిరీయశాఖ'ని చదివే వారికి గురువైన పండితునికీ, దశరథునికి సారథియైన చిత్రరథుడనే వానికి, చాలు చాలనేంత వరకూ ఇచ్చాడు. 'కఠ - కలాపశాఖ'లని అధ్యయనం చేసే వారికి వారికి అభీష్టమైన మంచిబియ్యాన్నీ, పాడికోసం మంచి ఆవులనీ దానమిచ్చాడు. ఇంకా ఎంత ధన మున్నదో తెమ్మని ఆజ్ఞాపించి, తెచ్చిన ధనాన్ని అందరికీ పంచియిస్తూ నా యింటినీ లక్ష్మణుని యింటినీ రక్షిస్తూ ఉండండి' (మా అమ్మనూ - సుమిత్రమ్మనూ జాగ్ర త్తగా రక్షించండి !) అన్నాడు. ఇంతలో త్రిజటుడనేవృద్ధబ్రాహ్మణుడు తనకేదైనా యిమ్మని యాచించాడు. రాముని కోరికపై త్రిజటుడు తన చేతిలోని కఱ్ఱను దూరం గా విసిరాడు. కఱ్ఱపడినంతలోగా ఉన్న గోసంపదని వాని ఆశ్రమానికి పంపించి వేసాడు. 'కృతేయుగే బలిర్దాతా త్రేతాయాం రఘునందనః, కృతయుగంలో బలి చక్రవర్తీ, త్రేతాయుగంలో రాముడూ గొప్పదాతలనే పేరు ఇందుకే వచ్చింది. (ద్విజస్సుహృద్భృత్య జనోఽథవాతదా - దరిద్ర భిక్షా చరణశ్చయో ఽభవత్-

నతత్ర కచ్చిన్న బభూవ తర్పితః - యథార్హ సంమాననదాన విభ్రమైః॥) దానం విషయంలో బ్రాహ్మణ - అబ్రాహ్మణ భేదంగానీ, హితుడు - అహితుడనే భేదం గాని, అధికారి - భృత్యుడనే భావంగాని ఏమీ పాటింపబడలేదు.

ఈ దానం చేయబడినదంతా తనకీ, సీతకీ వివాహ - జన్మదినకాలాల్లో వచ్చిన కానుకల సొమ్మే గాని - పిత్రార్జితం గాని, పర సంపాదితం గాని ఇందులో లేదు. నేనిస్తున్నాననే భావంతో కాక 'అడవికి వెళ్లే మాకెందుకు ?' అనే 'నిర్మమ' (మాదికాదు - అక్కఱలేదు) భావంతో చేయబడినదే ఈ దానం అంతా. దానం చేయకుండా ఈ సంపద అయోధ్యలోనే తనకి చెందినదిగానే ఉన్నట్లయితే 'అరణ్యవాసంలో కష్టకాలంలో ఈ సంపదా - సౌఖ్యమూ' గుర్తుకువచ్చి దుఃఖం పెరగవచ్చు. 'సౌఖ్యమూ - సంపదా లేదు' అనుకున్నవానికి, లభించినదే సుఖంగా ఉంటుంది కదా ! పైగా 'దానం తపః' అని (తైత్తిరీయం 118 నా. వా) వేదం చెప్తోంది దానం చేయడం కూడ తపస్సులో భాగమే అని. అందుకని తాపసునిగా జీవించాలనే కైక మాటని అరణ్యాలకి పోబోయే ముందే నెరవేరుస్తూన్న రాము డెంతటి ధర్మాత్ముడు !

## ఒక్కరోజైనా ఆగు !

దానాలన్నీ అయ్యాక తన తండ్రి వద్దకు సీతాలక్ష్మణసమేతుడై వెళ్లాడు రాముడు. రాముణ్ణి తన అందఱు భార్యలతో కలిసి చూడాలనే కోరిక దశరథునికి కల్గింది. (చివర చూపు ఇదే కదా ! అందుకని) దశరథునికి ఉన్న 308 భార్యల తోనూ రాముణ్ణి చూస్తూ 'అహం రాఘవ కైకేయ్యా వరదానేన మోహితః - అయోధ్యాయా స్త్వమేవాద్య భవరాజా నిగృహ్యామామ' రామా ! కైకకిచ్చిన వరం వల్ల మోసపోయాను. అయోధ్యకి నువ్వేరాజు అయితీరాలి' అని దీనుడై విలపిస్తూ అన్నాడు. ధర్మ విధానాన్ని పల్కి, తండ్రి పైన నిన్ను అసత్యవాదిని చేయనని పల్కిన రాముడు వెళ్లి పోబోతూంటే 'రామా ; ఈ రాత్రికైనా ఆగి వెళ్ల రాదా ! అని ప్రార్థించాడు దశరథుడు. 'అనుమతి కోసమే వచ్చిన నాకు ఆగేందుకుఅనుమతి లేదు' అంటూ నమస్కరించి రాముడు మఱలిపోయాడు. కైక తప్ప రాజపత్ను లంతా 'హా' అని ఏడ్చారు. (అంతకాలే చ మామేవ స్మరన్——' అని గీతా చార్యుని మాట. మరణించబోయేప్పుడు భగవత్ స్మరణని చేయాలట. అప్పుడతను

స్వామిలో ఐక్యమౌతాడు. కౌసల్యగర్భాన పుట్టి కౌసల్యకు మోక్షమీయదలచిన రాముడు దశరథునితో ఏ సంబంధమూ లేనివాడు కదా ! అందుకని దశరథునికి మోక్షమీయదలచి, దశరథునికి అంత్యకాలంలో భగవత్స్మరణం (రామా ! రామా!) మాత్రమే ఆ అవకాశాన్నీయగలదని భావించి ఇలా ఏడ్పింపచేసాడు. దుఃఖిస్తూ ఉన్నా, తాను మోక్షప్రాప్తికి అర్హుణ్ణనే విషయాన్ని దశరథుడు గమనించలేక పోయాడు. భార్యలందఱితోనూ దశరథుడు పరమాత్మ దర్శనాన్ని చేసికొన్నాడు. భగవద్దర్శనం దంపతులుగా చేయాలనే సూక్ష్మం ఇక్కడ తెలుస్తుంది).

'అరణ్యానికి వెళ్లు' అని నోటితో చెప్పని దశరథుడు'అయోధ్యకి రాజు నువ్వే - వెళ్లద్దు' అని అన్నాడు. మరెవరైనా అయితే ఈ మాట పట్టుకొని రాజ్యానికి సిద్ధపడేవారే. ధర్మాత్ముడు కాబట్టి దశరథుని మాటగా కైకమ్మ చెప్పిన మొదటిమాట 'వెళ్లు' అనే దానినే ఆధారంగా తీసికొని వనప్రవాసానికి సిద్ధమైనాడు. దశరథుని మందిరం నుండి ఇవతలకు రాసాగాడు.

### కైకా! ఆ తల్లి కూతురువి కదా!

రాముడు బయలుదేరబోతూండగా సుమంత్రుడు మూర్ఛపోయి కొంత సేపటికి తేరుకున్నాడు. ఎదురుగా కైకమ్మ కన్పించింది. కోపం కట్టలు దాటింది. దశరథుడున్నాడనే మాపే సుమంత్రునికి స్పృహలో లేదు.

'కైకమ్మా ! తియ్యమామిడి చెట్లను నఱికి వేపచెట్టులని పెంచుకుంటారా ఎవరైనా ? రాముడు ఈ రోజే వెళ్లకపోతే 'తినను—త్రాగను' అని పల్కుతున్నావే ? అసలు స్త్రీ లక్షణమేనా ఇది ? వేపచెట్టు నుండి తేనె వస్తుందా ? 'మాతరమంగనాః' అన్నట్లు స్త్రీలకు తమ తల్లి బుద్ధులే వస్తాయి.

మీ నాన్నకి, పశువులు - పక్షులు - ఇతరకీటకాలూ మాట్లాడుకొనే భాషని ఒక సిద్ధుడు నేర్పాడు. జృంభమనే పేరున్న చీమ ఒకనాడు మీ తండ్రి పాన్పు క్రింద ఉండి ఏదో మాటాడితే - దానికి ఆయనకు చెప్పలేనంత నవ్వు వచ్చి అనేక పర్యాయాలు నవ్వుతున్నాడు. నీ తల్లి తననే చూచి పరిహాసం చేస్తున్నాడని భావించి మీ తండ్రిని 'చెప్పవలసిందేనని' నిలదీసింది. ఏమైనా సరే చెప్పరాదని సిద్ధుడు చెప్పి ఉన్న కారణంగా' మీ తండ్రి మీ అమ్మకు ఆ విషయాన్ని చెప్పనని

పలికి, పరిహాసానికి కారణం మీ తల్లి మాత్రం కాదని చెప్పాడు. నీ తల్లి పీడించడం ప్రారంభించింది. మానసిక వ్యథకి తట్టుకోలేని నీ తండ్రి తల్లిని విడిచాడు. ఆయమ్మ కూతురికి నీకు మరి, పట్టుదల తక్కువ ఉంటుందా ?

కైకా ! పిన్నవాడైన భరతుడు, పెద్దవాడైన రాముడండగా ఎలా అర్హుడౌతాడు ? అని పలికాడు. ఆమె ముఖంలో మార్పులేనే లేదు. అంతమందిలో తనకి అవమాన కారణమే అయినా రావణవధకి అవకాశం కల్పిస్తున్నాననే ఆనందమే ఆమెకు ఉండడం. అచంచలమైన విశ్వాసంతో ఎంతనిందనైనా సహిస్తూ నిలబడడంలో ఎవ్వరూ ఆమెకు సాటిరారు.

## కైకకు బుద్ధిచెప్పిన సిద్ధార్థ మంత్రి

సీతాలక్ష్మణులతో ఉన్న రాముణ్ణి చూచి దుఃఖిస్తూన్న దశరథుడు సుమంత్రుణ్ణి పిలిచాడు. 'సుమంత్రా ! నా చతురంగబలాలనీ, ధనధాన్యాలన్నింటినీ రాముని వెంట పంపించు. అయోధ్యకి వచ్చి భరతుడు మిగిలిన వారిని ఏలుకుంటాడు' అన్నాడు.

ఏ మాత్రపు జంకూ లేక కైక 'రాజా ! పూర్తిగా త్రాగివేయగా మిగిలిన మడ్డిలా, ధనధాన్య పరివారాన్నంతటినీ రాముని వెంట పంపి, బోసిగా ఉన్న నగరాన్ని భరతునకు ఈయడం ధర్మం కాదు. నేనంగీకరింపను. నీ పూర్వులలో సగర చక్రవర్తి తన పుత్రుడు అసమంజుణ్ణి అడవికి పంపాడు. ఆనాడు ఇలా పంపి ఉండలేదే ? నిర్ధనుడుగానే రాముడు వెళ్లాలి.' అని పల్కింది.

దశరథునికి కైకమాటలు ఇక వినబుద్ధి పుట్టలేదు. 'దుర్మార్గురాలా ! నీ వరాలలో రాముణ్ణి ఇలా ససైన్యంగా పంపరాదనేది లేదు. ఇక, అసమంజుడు అయోధ్య ప్రజలని సరయూనదీ జలాల్లో ముంచుతూ వినోదిస్తూంటే సగరుడు వెడలగొట్టాడు. ఆ అసమంజునికీ, ఈ రామునికి పోలికా ? అని గర్జించాడు వృద్ధుడైన సిద్ధార్థుడనే మంత్రి. 'కైకా ! రామునిలో ఏ తప్పూలేదని ఇక్కడి వారంతా అంటున్నారు. నీవూ అసమంజునితో పోల్చావు. తప్పు లేనివాడు రాముడని తేలిపోయింది. కాబట్టి రామునిలో తప్పుదొరికిన మరుక్షణం పంపిద్దాం!' అని కూడా సిద్ధార్థుడన్నాడు. కైకలో ఏ మాత్రపు మార్పూలేదు.

అయోధ్యయే దండక.
దండకయే అయోధ్య.

'తండ్రీ ! కందమూలాలు తిని జీవించదలచిన నాకు చతురంగ బలాలు వద్దు. మదపుటేనుగునే ఇష్టంతో దానమిచ్చినవానికి దాని నడుముత్రాటిపై ఆశ ఉంటుందా? తల్లి కైకమ్మ కిచ్చిన మాట ప్రకారం నారచీరలనీ, కందమూలాలని త్రవ్వుకోడానికి పలుగు - గంపమాత్రం ఇప్పించండి - చాలు' వినయంగా పలికాడు రాముడు. 'కట్టుకో' అంది ఏ సంకోచమూ లేకుండా నారచీరలని కైకమ్మ వెంటనే తెచ్చి. రాముడూ లక్ష్మణుడూ ధరించాక సీత, రాముణ్ణి నీరు నిండిన కళ్లతో చూస్తూ 'ఏలా కట్టుకోవాలి ?' అని అడిగింది.

ఆ దృశ్యాన్ని చూస్తూన్న అంతఃపుర స్త్రీలంతా బావురుమన్నారు. రాముడు తన లోపలి దుఃఖాన్ని అణుచుకుంటూ కన్పించాడు. అన్నకి కట్టుబడిన లక్ష్మణుడు ఎత్తకుండా కోపాన్ని ముఖంలోనే దాచుకున్నాడు.

గుంపుగామూగి దుఃఖిస్తూన్న అయోధ్యా జనాన్ని తొలగిస్తూ వశిష్ఠుడు అందటి మధ్యలో ఇలా అన్నాడు.

కైకా! "అర్ధోవా. ఏష అత్మనో యత్పత్నీ" అని వేదం చెప్తోంది. రాముడు కాదన్నా అతని భార్య సీత రాజ్యం ఏలుతుంది. రామునికి అక్కరలేని రాజ్యం సీతకీ అక్కరలేకపోతే, అయోధ్యలో ఏ ఒక్కడూ మిగలడు. అంతా దండకారణ్యానికి ప్రయాణం సాగిద్దాం. అప్పుడు అయోధ్య దండకారణ్యం అవుతుంది. ఆ దండక అయోధ్యలా కన్పిస్తుంది. ఇదీ సాగదని అనకు. భరతుడు రామునిమాట జవదాటడు. వచ్చాక రాముణ్ణి సింహాసనంలో కూచోపెట్టి నీ అంతు తేలుస్తాడు" అంటూ కంఠం గద్గదం కాగా 'కైకా ! రామునిమీది కోపానికి సీత బలికావాలా ? మంచి విలువైన సొమ్ములూ నగలూ ఇప్పించు ఆమెకి. నారచీర కట్టద్దని నీ మాటగా చెప్పు. మరొక్కమాట ! నీ వరాలలో ఆమె గూర్చిన ఏవిధమైన నియమ నిబంధనలూ లేవు - గుర్తుందా ?" అన్నాడు.

'కైకా ! నా కోడలూ, జనకవియ్యంకుని కూతురూ ఆమె. నారచీరలతో పంపడం మన గౌరవ - సంప్రదాయాలకు చేటు. నా మాట విను లేదా నరకానికి పో!' మందలిస్తూ అన్నాడు దశరథుడు.

'మహారాజా ! ఆజ్ఞ మేరకు వెడుతున్నాను. తండ్రీ ! మా తల్లి కౌసల్యని జాగ్రత్తగా చూసుకోండి! అంటూ ఆ ప్రదేశం నుండి కదిలాడు.

దశరథుడూ, భార్యలూ మూర్ఛిల్లినా రాజాజ్ఞ ప్రకారం సుమంత్రుడు రథం తెచ్చి సిద్ధంగా నిలువబడి ఉండనే ఉన్నాడక్కడ. అయోధ్యా ప్రజలంతా అనుకొనే మాటలతో ఆ ప్రాంతం నిండిపోయింది.

ఇంతలో దశరథుడు తేరుకున్నాడు. 'సీతమ్మా! ఈ పదునాలుగేళ్లకూ సరి పడే వస్త్రాలూ-ఆభరణాలూ ఇవిగో ! రాజు గారి ఆజ్ఞ' అంటూ ధనాధ్యక్షుడు ఇచ్చి వెనక్కి అడుగు వేసాడు. కౌసల్య సీతని కౌగిలించుకుంది. విలవిల ఏడ్చింది.

## స్త్రీల లక్షణాలు

'అమ్మాయీ ! పురుషులు ఎన్ని ఇచ్చి ఎంతగా ఓదారుస్తూన్నా స్త్రీలు తాత్కాలికంగానే సంతోషిస్తారు తప్ప భర్తకి కష్టం వచ్చిన సమయంలో నీటిని అసలు గుర్తుకే తెచ్చుకోరు. సంపాదన ఉన్నంతకాలం భర్తని ఆదరంగా చూసిన భార్యలు, భర్త సంపాదన తగ్గితే చాలు నిరాదరణ ప్రారంభిస్తారు. ఇక అబద్ధాలని ఆడడంలో, గడియకొకసారి మనసు మార్చుకోవడంలో, భర్త గౌరవాన్ని నవ్వుల పాలు చేయడంలో, చపలబుద్ధిలో స్త్రీలకు ఎవరూ సాటిరారు. ఆ సమయంలో వారికి భర్త చేసిన మేళ్లు గాని, లోకమర్యాదగాని, వంశప్రతిష్ఠలుగాని గుర్తుకురావు. ఎలా చూసుకుంటావో గాని రాముణ్ణి నీకు అప్పచెప్తున్నాను' అని కైకమ్మని దృష్టిలో పెట్టుకుని పల్కుతూ ఆమె పెద్దగా రోదించింది.

## భర్త విలువ

పెనుగాలికి అరటి చెట్టులా వణుకుతూన్న అత్తగారిని కౌగిలించుకుని సీతమ్మ మెల్లగా ఇలా ధైర్యం చెప్పింది. 'అత్తా! దుర్మార్గపు ఆలోచనలు కల స్త్రీల సహవాసం వలననే భర్తమీద విరోధం స్త్రీలలో పెరుగుతుంది. అలాంటి వారి విషయంలో నేను ముందే జాగ్రత వహించడమే కాక వారినీ సన్మార్గంలోకి మరలు స్తాను తప్ప వారి త్రోవకి పోనేపోను. జన్మనిస్తుంది తల్లి. పోషణచేస్తాడు తండ్రి. బ్రతికున్న కాలంలో ఎక్కువ జీవించే చోటు భర్త వద్దనే. అలాంటివానికోవిరోధ

చేసుకుంటే జీవితంలో మిగిలేది ఏముంది ? ఏ సత్కర్మని భర్త ఆచరించినా సగం ఫలం భార్యకి ఇస్తాడే ? అతని ఋణం ఎలా తీర్చుకోగలం ? భార్యకు తల్లి తనాన్ని ప్రసాదించేవాడూ, పుట్టబోయే సంతానం ద్వారా తల్లి ని ప్రేమపాత్రురాలిని గా చేసి తన భార్యని ఆరాధించే సంతానాన్ని ఆమెకు కట్టబెట్టేవాడూ, భార్యపాప ఫలానికి కూడా బాధ్యత వహించేవాడూ భర్త కదా !

కౌసల్యామాతా ! ఇన్ని మాటలెందుకు ? మెట్లు లేకుండా మ్రోగిన వీణని నేను ఎన్నడూ చూడలేదు. చక్రం లేకుండా తిరగ్గల రథాన్ని నేనెఋగను. అలాగే నూర్గురు పిల్లలకి తల్లి అయినా కూడా భర్త లేకుండా సుఖాన్ని పొందిన భార్యని కూడా చూడలేదు. నీ పుత్రుడూ, నాకు భర్తా ఈ ప్రజల ఆరాధ్య దైవమూ అయిన ఆ రాముణ్ణి నీడలా అనుసరిస్తూనే ఉంటాను' అంటూండగానే అత్తాకోడళ్ల కళ్లు చెమ్మగిల్లాయి. (నాతంత్రీ వాద్యతే వీణా నాచక్రో వర్తతే రథః నాపతిస్సుఖమేధేత యా స్యాదపి శతాత్మజా) (ఇలాటి ఇతిహాసాలని విన్నా, చదివినా దాంపత్యం సుఖంగా సాగుతుంది.)

ముందుగా కౌసల్యకి నమస్కరించిన లక్ష్మణుడు, సుమిత్రామాత పాదాలని పట్టుకొని పైకి చూస్తూ, కన్నీళ్ల వలన కన్పడని తల్లితో 'అమ్మా!' అని బావుర మన్నాడు. ఆ తల్లి లక్ష్మణుణ్ణి లేవనెత్తి తలపై చిన్నని ముద్దుపెట్టుకుని 'నాయనా లోకరక్షణం కోసం కౌసల్య రాముణ్ణి కన్నది.

'సృష్టస్త్వం వనవాసాయ స్వనురక్తః సుహృజ్జనే !
రామే ప్రమాదం మాకార్షీః పుత్ర భ్రాతరి గచ్ఛతి ॥
రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజామ్ ।
అయోధ్యా మటవీం విద్ధి గచ్ఛ తాత యథా సుఖమ్ ॥'

## రాబోయే కథ తెలిపి(సి)న సుమిత్ర

రావణవధ కోసమే రాముణ్ణి కౌసల్య కనవలసివచ్చిందనీ, అది దైవ నిర్ణ యమనీ సుమిత్రకు తెలుసు కాబట్టే తన యిద్దఋ పిల్లల్నీ కౌసల్యకీ, కైకకే కల్గిన రామ భరతులకు దాసులుగా పంపింది. ఆ యిద్దఋతో కూడా మైత్రితో వ్యవహరించింది.

ఇలా తల్లులలోనూ - పిల్లలలోనూ మైత్రి చెడకుండా చేసినదీ; దేవతల పనికి (తన పుత్రుణ్ణి పంపించీ, కౌసల్యకు దుర్బోధ చేయకుండానూ) అనుకూలంగా వ్యవహరించింది కాబట్టి, ఆమె 'సు-మిత్ర' అయింది. సవతిపుత్రునితో తన పుత్రుణ్ణి అరణ్యాలకి పంపించ దలిచిన అసాధారణ స్త్రీ సుమిత్ర. ఇతరుల కష్టాన్ని తన సంతానంతో తీర్చదలచిన ఈ తల్లి ఆదర్శప్రాయురాలు. ఆమె ఇలా అంది.

లక్ష్మణా! రాముని విషయంలో నీకు చెప్పలేని అనురాగం ఎందుకో తెలియదా ? అతనితో వనాలలో ఉండడానికే సుమా ! నీ విషయంలోనైనా పొరబడు కాని, రాముని విషయంలో పరాకు పడకు. అన్న ఎక్కడికైనా వెళ్ళినసందర్భంలో సీతమ్మ విషయంలోనూ పరాకు పొందకు ! (ముందురోజుల్లో 'అన్న' వెళ్ల వలసిన సందర్భం (మారీచవధ) వస్తుంది. సీతావిషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరమూ (సీతాపహరణం) వస్తుంది. జాగ్రత్త ! అని సూచన. ఈ కారణంగానే లక్ష్మణుడు హాసీతా ! లక్ష్మణా ! అన్న రాముని వంటి కంఠధ్వనిని విన్నా ఆశ్రమం నుండి కదలను అన్నాడు).

## రామం దశరథం విద్ధి... 8 అర్థాల శ్లోకం.

రాముణ్ణే దశరథుడనుకో ! సీతనే నీ తల్లి (నన్ను) గా భావించుకో ! దండకారణ్యాన్నే అయోధ్యగా తలచుకో ! సుఖంగా వెళ్లు ! 'తిరిగి రా!' అనలేదు. (గచ్ఛ !) అని దీవించింది అనేది ఒక అర్థం.

రాముడు, దశరథుడు (మహారాజు) ఔతాడని తెల్సుకో. నన్ను నీ తల్లిగా (మహారాణి) ఔతానని గ్రహించు. దండకారణ్యం అయోధ్య (రాజధాని)గా మారుతుందని గ్రహించు ! అనేది రెండవ అర్థం.

రామునికీ దశరథునికీ భేదం గ్రహించు. అంటే రాజు సరియైన విధంగా పరిపాలిస్తే రాజభార్యకీ (నాకూ) ప్రజలకీ (అయోధ్యకీ) కష్టం కలగదు. సరిగా పాలించే విధానం రామునికుంది. అతని భార్యగా ఉండే అర్హత సీతకి ఉంది. రాజధానిగా అర్హత అయోధ్యకి ఉంది. రాముడూ, సీతా ఉంటే చాలు - ఆస్థలం దండక అయినా అయోధ్యయే - అనేది మూడవ అర్థం.

రాజ్యం రామునిదే అయినా, దశరథుడు రాజుగా ఉన్నాడని గ్రహించు. దశరథుని భార్యనే అయినా నా (జనకునికి ఆత్మజ) తండ్రికి కూతురిగానే ఉన్నానని గ్రహించు. ప్రజలతో ఉండవలసినదే అయినా ఈ అయోధ్య మనసులేని మనుష్యులతో ఉంది, చెట్లూచేమలతో ఉండే దండకారణ్యమే అని గ్రహించు అనేది 4వ అర్థం.

రాముణ్ణి అరణ్యాలకి పంపించాడనే కోపంతో కాక దశరథుణ్ణి కూడా రాముని లా గౌరవించు. ఆ దశరథుని భార్యననే ఆలోచనతోనూ, కౌసల్యకి సవతిననే ఆలోచనతోనూ కాక నన్ను సీతమ్మలా భావించు. రాముడు ఉండే అరణ్యాన్నే గొప్పదని భావించక, అయోధ్యని మరచిపోకు - వెళ్ళు నాయనా ! అనేది 5వ అర్థం.

ఉపాధికారణంగా తండ్రి ఐన దశరథుణ్ణి విడిచి నిరుపాధి అయిన రాముణ్ణి సేవించు. అలాగే తల్లి ఐన నన్ను విడిచి నిరుపాధి అయిన సీతమ్మని ఆశ్రయించు. అదే విధంగా ఉపాధివలన కల్గిన అయోధ్యని విడిచి నిరుపాధి అయిన దండకకి వెళ్ళు - అనేది 6వ అర్థం.

పరిచారకులు ఉన్న దశరథుణ్ణి విడిచి రాముణ్ణి సేవించు. పరిచారికలూ, భోగాలూ ఉన్న నన్ను విడిచి ఏ భోగభాగ్యాలూ లేని సీతనిగౌరవించు. ఐహికమైన భోగాలతో ఉన్న అయోధ్యా రాజ్యాన్ని కాదని పరలోకాన్ని ప్రసాదించే ఆముష్మిక రాజ్యమైన దండకకి రాముని కైంకర్యం (సేవ) కోసం వెళ్ళు అనేది 7వ అర్థం.

రాముడు సాక్షాత్తూ దశ (పక్షి) రథుడు (వాహనంగాకల విష్ణువు). జనకుని కూతురైన సీతయే (మా) లక్ష్మీదేవి. దండకగా కన్పిస్తున్నది దేవతల రాజధాని అయోధ్య అని గమనించి శ్రీ మహావిష్ణుసేవకి వెళ్ళు. నాకూ తండ్రికీ లేని అదృష్టం నీకు కల్గిందని సుమిత్ర దీవించింది - అనేది 8వ అర్థం.

తల్లి ఆశీస్సులని పొందిన లక్ష్మణుడు మెల్లగా రథం వద్దకి వచ్చాడు. సీతకి దశరథుడిచ్చిన ఆభరణాలూ, వస్త్రాలూ, రామలక్ష్మణుల ఆయుధాలూ, కవచాలూ, లక్ష్మణుని గంప, గొడ్డలి, పలుగు అన్నీ రథంలో కన్పించాయి. మౌనంగాముగ్గురూ రథమెక్కారు సుమంత్రుడు రథాన్ని కదలించాడు. నేల మీద వేసిన ముగ్గులన్నీ చెరిగిపోయి ఉన్నాయి. రాజమార్గాల ప్రక్కన దీపాలు దించేసారు. ఎక్కడా

మంత్రధ్వనులు వినపడడం లేదు. దేవాలయాలు మూసి ఉన్నాయి. ఏ ఇంటా ఆ రోజు వంటలని చేసికోలేదు. అగ్నిహోత్రాలు వెలగడం లేదు. ధారగా కన్నీటిని కార్చని కన్నులేదు. మౌనంగా రోదించని హృదయంలేదు. కైకా దశరథులని నిందించని నోరులేదు. రాముని రథం వెంట కదలని కాలు లేదు. 'ఆగు ఆగు' అని సంజ్ఞచేయని చేయిలేదు.

దూడని తీసికొనిపోతూంటే పరుగుపరుగున వెంటవచ్చే గోమాతలా కౌసల్య రథం వద్దకి రాసాగింది. అంతలోనే రథం సాగి వెళ్ళిపోయింది. పుర ప్రజలంతా రథానికి అడ్డుగా వస్తూ 'ఓ ! గుర్రాలూ ! మెల్లగా వెళ్ళరూ ! ' అని ప్రార్థిస్తున్నారు. "మంచి గుణాలున్న వాణ్ణి ఎక్కడినుండైనా తెచ్చుకోవాల్సి వస్తే ఈ దశరథుడు పంపించేస్తున్నాడు" అని బ్రాహ్మణులు దుఃఖిస్తున్నారు. "నిన్ను పెంచిన చేతులనే ఇప్పుడు చాచి ప్రార్థిస్తున్నాం - వెళ్ళవద్దు నాయనా !" అని వృద్ధ స్త్రీలు విలపిస్తున్నారు. "ఎవరికీ చెప్పుకోలేని రహస్యాలు నీలో మేం దాచుకున్నాం ! ఎవరింక "మాకు మైత్రితో ఉంటారు - ఆగిపో !" అని మిత్రులంతా కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు. "బాగా దుమ్మురేగి ఆ దశరథుణ్ణి మాకు కన్పించనీయకు" అంటూ ఉక్రోషంతో బాలురు పలుకుతున్నారు. ఎన్నో భావాలు మెదులుతుంటే ఏది చేస్తే ఏది మానినట్లౌతుందోననీ, ఎన్నింటిని చెప్పుకోగలమనీ దుఃఖిస్తూ మౌనంగా రోదిస్తున్నారు ముత్తైదువులు. కన్నుమూసి తెరిచేంతలోగా అందరి కళ్ళూ నీళ్ళతో నిండుతూ ఉంటే మళ్ళీ మూయవలసి వస్తోంది.

'సంయచ్ఛ వాజినాం రశ్మీన్ సూత యాహి శనైశ్శనైః' — 'సుమంత్రా ! పగ్గాలని లాగి గుర్రాలని మెల్లగా పోనియ్యి' అని ప్రజలంటుంటే 'త్వరత్వరగా సాగనీ' అని రాముడన్నాడు, మేడపైనుండి దశరథుడు పెద్ద ఎలుగుతో అరుస్తూ 'సుమంత్రా ! రథం ఆపు' అన్నాడు. రాముడు సాగనిమ్మన్నాడు. రథచక్రానికీ కాడికీ మధ్యన ఉన్న గుట్టంలా ఏమీ తోచక సుమంత్రుడు రాముని ముఖం చూచాడు.

'సుమంత్రా ! రథచక్రాల శబ్దంలో నాకు నీ ఆజ్ఞ వినబడలేదని రాజుతో తిరిగివచ్చి చెప్పవచ్చును గాని రథాన్ని సాగనీ!' అన్నాడు రాముడు. (ధర్మాన్ని రక్షించడానికీ, దేవతల కార్యాన్ని నెరవేర్చడానికీ పలికిన ఈ వాక్యం అసత్య వాక్కు కాదు. అబద్ధమాడి అయినా ధర్మ పరిరక్షణాన్ని చెయ్యాలనేందుకు సాక్ష్యం. నా క్రౌషమితి రాజాన ముపాలబ్ధోఽపి వక్ష్యసి.)

(అయసం హృదయం నూనం రామహూతురసంశ సుమే) 'కౌసల్యది ఇనుప గుండెఅయ్యుంటుంది.లేకపోతేఈ దృశ్యాన్ని చూచి కూడా పగలకుండా ఉంటుందా? అన్నారు అయోధ్యాజనం.

'రాముడు అడవికి పెడుతూంటే తల్లి ఆపగల్గిందా ? తల్లులు ఏం చేయ గల్గుతారు ? ' అని తల్లులని గూర్చి పుత్రులు వ్యాఖ్యానించుకున్నారు. 'ఎంత పెంచి పెద్ద చేస్తే ఏం లాభం ? పట్టు విడువక వెళ్ల నే వెళ్లాడుగా ! పుత్రులు ఇంతే' అని పుత్రులని గూర్చి తల్లులు అభిప్రాయపడ్డారు. 'భర్త స్థితిని ఏ మాత్రమూ గమనిం చని కైకమ్మ లాంటి వారే భార్యలంతా' అని భార్యలని గూర్చి భర్తలు ఈసడిం చారు. 'ఇచ్చిన కోరికలని అడిగితేనే భార్యని విడిచిపెడతాననాలా ? భర్త లంతా ఇంతే' అని భర్తలని గూర్చి భార్యలు ఆలోచించుకున్నారు, 'ఎప్పుడూ రాముని వెంట తిరిగినా, రాముడు పెడుతూంటే మనం మాత్రం ఆపగలిగామా ? మనమూ అంతే' అని యథార్థస్థితిని గమనించుకొన్నారు అయోధ్యా జనమంతా. (ఇదంతా తాత్కాలిక వైరాగ్యం. నిలిచేది కాదు). ఇంతమందీ ఇలా వ్యాఖ్యానించినా రాముణ్ణి గురించి ఒక్కరూ నిందించలేదు.

రాముడు పెడుతూంటే కోసలదేశ నక్షత్రమైన 'విశాఖ' పొగమబ్బుతో కూడి కన్పించింది. (ఇక్ష్వాకుకుల నక్షత్రం విశాఖ. ఆ నక్షత్రం అలా కన్పించడం అంటే దశరథుని మరణాన్ని సూచించడమే). వాయువు చల్లగా వీచలేదు సూర్యుని ఎండ లేనేలేదు. జనుల ఏడ్పులు తప్ప మంగలధ్వని విన్పించలేదు ఇవన్నీ ఏ అశుభాన్ని కల్పిస్తాయో నని ప్రజలంతా భయపడ్డారు. ఇలా కొంతసేపు కాగానే రథాన్ని వెంబడించిన జనం అయోధ్యానగరానికి రాసాగారు, (అపస్నాత యివారిష్టం ప్రవివేశ పురోత్తమమ్) బంధువు మరణించగా వెంబడించి స్నానం చేసి తిరిగి వచ్చే వారిలా దశరథునికి వాళ్లు కన్పించారు. కైకని నిందింపరాని విధంగా మాట్లాడిన దశరథుడు కైకని భార్యగా విడిచానన్నాడు. తాను చనిపోయాక భరతు డిని ఉత్తర క్రియలు చేయరాదని పలికాడు. (నూనం భయసుపైష్యతి - సకామా భవ కైకేయి ! విధవా రాజ్యమావస) ఎంతో కష్టం అయోధ్యకి కల్గుతుంది. కైకా! నీ కోరిక తీర్చుకో. భర్తలేని దానిపై రాజ్యాన్ని పొందు! అని తన మరణాన్ని తానే ధ్రువపరచి బాధకి తాళలేక కౌసల్య యింటికి తనని తీసికొని పోవలసినదని పలికాడు,

## దుఃఖంతో తెల్లవారని రాత్రి

'రామం మేఽనుగతా దృష్టిః అద్యాపి న నివర్తతే ।
న త్వా పశ్యామి కౌసల్యే! సాధు మాం పాణినా స్పృశ॥'

వస్తువులని దొంగిలించిన దొంగ, నేరం ఒప్పుకుని యజమానిముందుకి వచ్చినట్లుగా దశరథుడు కౌసల్యామందిరానికి వచ్చాడు. సర్వేంద్రియాలతోనూ దుఃఖాన్ని పొంది కన్పిస్తున్నాడు. నడుమనడుమ మూర్ఛపోతూ ఇలా అన్నాడు.

'కౌసల్యా ! వస్తువుని చూడగలిగేది కన్ను. కాని, వస్తువే కన్నుని ఎత్తుకుపోయింది ఇక్కడ. (చక్షుర్దేవానాముత మర్త్యానామ్) శీలవతి అయిన స్త్రీ, భర్త వెంట వెళ్ళినట్లు నాకన్ను రామునివెంట వెళ్ళిపోయింది. తిరిగిరానేరాదు. (న త్వా పశ్యామి) ఇప్పుడు కన్పించడం లేదు కాబట్టే నిన్ను చూడలేకపోతున్నాను. కౌసల్యవి నువ్వని నాకు తెలియడానికి నీ కంఠధ్వని కారణం. కైకని ఎలా చూచాను ? అంటావా ? నిజమే చెప్తన్నా విను. పుణ్యాత్ములు నాకు కనపడరు. ఎక్కడికో రాముని వేత తీసికొని పోబడిన కళ్లని ఇక పొందలేను. మరి ఎలా చూడగల నంటావా ? దొంగపడ్డాక దీపం తెమ్మని యజమాని పలికి 'దీపంవచ్చేలోగా చీకటిలో వెతికినట్లు, దృష్టిలేని నేను చూడదలుస్తున్నాను.నిన్నే ఎందుకుచూడదలిచానంటావా ? రాముడు లేనప్పుడు వాని తల్లి అయిన నీవైనా నన్ను స్పృశించు. అతని స్పర్శని నీ ద్వారా పొందుతాను. (పరమాత్మ అయిన రాముణ్ణి దర్శించడానికి దశరథుడు నేత్రం లేదని పల్కుతున్నాడు. భగవంతుణ్ణి కంటిద్వారా కాదు దర్శించవలసినది. మనస్సు ద్వారా దర్శించాలి. 'న తు మాం శక్యసే ద్రష్టు మనేనైవ స్వచక్షుషా అంటుంది గీత. ఈ శరీరంలోని కన్ను భగవంతుణ్ణి చూడవీలైనది కాదు. ధృతరాష్ట్రునికి కన్నులని పరమాత్మ ఇచ్చాక విశ్వరూప దర్శనమైందని భారతం చెప్పిందంటే హేతువిదే. దశరథునికి రాముణ్ణి చూడాలనే తపనని వర్ణిస్తూ తనకీ గల అదే కాంక్షని పరోక్షంగా వాల్మీకి మహర్షి ఇక్కడ వెల్లడిస్తున్నాడు)

కౌసల్య తన పుత్రుణ్ణి గూర్చి ఎన్నెన్నో భర్తకు చెప్పుకుని, తన దుఃఖానికి తన పూర్వజన్మపాపం కారణమని తనకు తాను నిందించుకొని దుఃఖించింది. దుఃఖం అయిపోయింది కాని రాత్రి తెలవారలేదు.

## రావోయే కథను చెప్పిన సుమిత్ర

ఆమె ప్రక్కకి సుమిత్ర వచ్చింది. కన్నీరుతుడుస్తూ 'అక్కా ! దుఃఖించకు! దివ్యాస్త్రాలు కలిగిన రామునికి కష్టంలేసేలేము. రాముని లౌకిక శక్తిని ఆలోచించకు.

'సూర్యస్యాపి భవేత్సూర్యః హ్యగ్నే రగ్నిః ప్రభోః ప్రభుః।
శ్రియశ్శ్రీశ్చ భవేదగ్ర్యా కీర్త్యాః కీర్తిః క్షమా క్షమా॥'

సూర్యుడనేవాడు ఒకడున్నాడని చూడాలంటే, ప్రకాశాన్నిచ్చే సూర్యుడొకడు ఉండాలిగా ! అతడే రాముడు. ('తమేవ భాన్త మనుభాతి సర్వమ్' అనే వేద వాక్కుకి అనుగుణం సుమిత్ర మాట). అగ్నిలో ఉండే దహింపచేసే శక్తి ఒక టుంటుంది చూచావా ? ఆ శక్తి రాముడు. (అహం వైశ్వానరోభూత్వా — గీత) బ్రహ్మకి పుట్టించే శక్తినీ, రుద్రునికి లయంచేయగల శక్తి నీ ఇచ్చిన ప్రభువులకి ప్రభువు రాముడు. బ్రహ్మాది దేవుళ్ళకి ఏ సంపద ఉందో ఆ సంపద నిచ్చిన ఆలక్ష్మి దేవికి సంపదనిచ్చే వాడు రాముడు. (యస్మిన్ ద్యౌః పృథివీ చాంతరిక్షం తం దైవ తానాం పరమం చ దైవతమ్) దేవతలకు దేవుడు. సర్వానికీ ఆధారమైన వాడు అతడు. సాక్షాత్తు నారాయణుడే అని ఓదార్చి ఇదంతా జగన్నాటకమని అర్థం చేసి కొమ్మని పలికింది. (ఓదార్చే వాళ్ళంతా సుమిత్రలే. ఓదార్చబడే వాళ్ల కౌసల్యలు. మనసులో, మాటలో ఒకే ఆలోచన ఉంటేనే ఈ పోలిక).

(ఇక్కడ అనేకమైన వేదవిశేషాలని చెప్పింది సుమిత్ర. భీషోదేతిసూర్యః— భీషాస్మాద్వాతః పవతే - తస్య నామ మహద్యశః - భయాదస్యాగ్ని స్తపతి - భయాత్తపతి సూర్యః - భయాదింద్రశ్చవాయుశ్చ - మృత్యుర్ధావతి పంచమః - మృత్యుర్యస్యోపసేచనం క ఇత్థా వేద యత్ర సః-ఇవన్నీ పలికి చివరికి 'తవార్యే! సద్గుణైర్యుక్తః పుత్రస్స పురుషోత్తమః అని 'రాముడు నారాయణుడే' అని చెప్పనే చెప్పింది. ఒకే సూర్యకిరణం గాజుపట్టకాన్ని తాకి 7 రంగులుగా మారినట్లు, మళ్లీ ఒకొక్కక్క కిరణమూ అనేకమైన రంగులుగా మారేటట్లూ - ఏకో విష్ణుః మహాభూతం పృథగ్భూతాన్యనేకశః - ఒకే రాముడు అనేక రూపాలలో ఉన్నాడు తప్ప ఉన్నదంతా అతడే అన్నది సుమిత్ర. రాముడు ఒక్కడే అన్నట్లుగానే సీత కథా ఒక్కతెయే. ఆమె కూడ అనేక రూపాలలో ఉంది. రాముని కష్టమే మిగిలిన

ముగ్గురి తమ్ముల కష్టమూ కావడానికి కారణమిదే. అలాగే సీతా వనవాసమే మిగిలిన ముగ్గురి వనవాసంవంటి కష్టానికి కారణమిదే. మిగిలిన ముగ్గురి భార్యల ప్రస్తావనా రామాయణంలో ఉండకపోవడానికి కారణమూ ఇదే. సీతారాముల పరతత్త్వాన్ని బాగా తెలిసినవాడు లక్ష్మణుడు కావడం వలననే లక్ష్మణుడు వెడుతూ ఊర్మిళకి వెడుతున్నానని చెప్పలేదు. రామలక్ష్మణులు అడవిలో ఉండగా మిగిలిన ఇద్దరికీ సంతానమూ సంతోషమూ కలిగి ఉంటే రామాయణం చదవాల్సిన పనే లేదు. మన చరిత్రే అవుతుంది. తనని చేసికొనేవాడు అరణ్యాలకి వెడతాడనే వార్త సీతకి చిన్నప్పుడే తెలుసునని ఆమెయే చెప్పింది. ఆమెతో బుట్టువూ, కలిసి పెరిగినదీ అయిన ఊర్మిళ్లకూ తెలుసు గదా ! అందుకే ఆమె దుఃఖపడనూ లేదు. వస్తానని పలుకనూ లేదు. ఈ తత్త్వం తెలియని వాళ్లకి మాత్రం ఊర్మిళ గురించి చాల బాధ వచ్చింది. అయినా కందకి లేని దురద కత్తిపీట కెందుకట ?)

రామునికి సుఖదుఃఖాలు సమానం. (పూర్ణ మదః పూర్ణ మిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణ మేవావశిష్యతే. సున్నకి ఎంత కలిపినా, తీసివేసినా, భాగించినా సున్న మారనట్లు పరమాత్మ స్వరూపునికి ఇవేమీ మార్పునీయవు. ఇక సీతమ్మ రాముని వెంట వెళ్లిందంటే (సీతే వానుగతా లక్ష్మీః) రాజ్యలక్ష్మి రామునితో వెళ్లిపోయినట్లే. (రాజ్యం లేనప్పుడు భరతుడు ఏమి ఏల గలడు ? అందుకే 'లేని రాజ్యాన్ని' పాదుకలతోనే ఏలాలని భవిష్యత్కథని సూచించింది సుమిత్ర)

అంతఃపురంలో ఇలా ఉంటే అక్కడ సీతారామలక్ష్మణులు ముగ్గురూ ఉత్తరంగా ప్రయాణం ప్రారంభించి తమసానదీతీరానికి చేరారు. గుంపులు గుంపులుగా తమతోవచ్చిన అయోధ్యా పౌరులని చూచే రాముడు రహస్యంగా సుమంత్రునితో తెలవారుజామున వేరే త్రోవలో రథాన్ని ఒకచోటికి చేర్చవలసిందని గుర్తుచెప్పాడు. తెల్లవారి అయోధ్యా జనులు నిద్రలేచే సరికి రథమూలేదు వ్యక్తులూ కన్పించలేదు. వారు దుఃఖంతో తిరుగుముఖం పట్టారు.

తమసానదిదాటి రథం కోసలదేశపు సరిహద్దులకి రాగానే తమ తల్లి పుట్టిన ప్రదేశమనే ఆలోచన కల్గిన రాముడు వెనుదిరిగి నమస్కరించాడు. చూస్తూండగానే వేదశ్రుతి – గోమతీ నదులు కూడా వెనక్కి వెళ్లిపోయాయి. రాత్రి కాబోతూంటే రథం గంగా నదీతీరంలో శృంగిబేరపుర సమీపంలో ఆగింది.

విశేషాంశాలు :

'తస్మాదుత్తరతోఽభిప్రయా జయంతి' అనే ప్రమాణం ప్రకారం విజయం పొందాలంటే ఉత్తరదిక్కుగా వెళ్లాలి. భారతంలో పాండవులూ అదే దిక్కుగా వెళ్లారు. పెళ్లిలో కూడా ఉత్తరం వైపుకే 'సప్తపది' సందర్భంలో నడిపిస్తారు. ఇలా వెళ్లి తమసానదిని దాటారు. వాల్మీకి మహర్షికి శ్రీమద్రామాయణం వ్రాయడానికి మొదటి శ్లోకం మానిషాద....అనేది (అవిశేషాలకి నా బాలకాండ వ్యాఖ్య చూడండి) సరస్వతీ అనుగ్రహంతో వచ్చింది ఈ ప్రదేశంలోనే. తమస్సు అంటే నల్లని లక్షణం కలది. దీన్ని దాటితే భగవన్మండలం గోచరిస్తుంది. సీతారామలక్ష్మణులు విడిది చేసిన మొదటిచోటు ఈ నదీ తీరమే. పరుండిన ప్రథమ రాత్రి కూడ ఇదే. తీర్థోపవాసం చేయడం (నది ఒడ్డున ఉపవాసం చేయడం) దీక్షపూనడానికి ప్రతీక. రావణవధ వీరు చేయదలచిన పని. ముగ్గురూ నీటిని ఆచమించి ఉపవసించారు. వీరి వెంట రాదలచిన అయోధ్యా పౌరులకి గాఢంగా నిద్రపట్టింది. కారణం కష్టంవచ్చింది వారికి కాదు కాబట్టి. రాముడు వారిని మోసగించి వెళ్లడానిక్కారణం కైకమ్మ సంతోషిస్తుందని. అదీ కాక ముందు కాలంలో తమకి ఎవరెవరితో పరిచయాలు ఎలా ఔతాయి? అనే విషయం, వీరికి అనవసరమని తోచి కూడాను. తాత్కాలిక వైరాగ్యం ఎంతో సేపు ఉండదు. తెల్లవారింతర్వాత పౌరులు దుఃఖించి అయోధ్యకు తిరిగి వెడుతూ 'తమ భార్యలూ - అయోధ్యా జనులూ అడిగితే ఏమని చెప్పుకోవాలి' అని బాధపడ్డారు. రాముణ్ణి విడిచిన దుఃఖం కంటె ఈ దుఃఖం వారికెక్కువ అయింది. ఊరిలోని వాళ్లకి వీళ్లని చూడగానే 'అలనాడు రాముడి వెంట వెళ్లి నిద్రపోయి తిరిగి వచ్చిన వాళ్లు' అనిపిస్తుంది. దురదృష్టవంతుడు కాశీక్షేత్రానికి వెడితే పెట్టె పోంగిలింపబడుతుంది. వాడికి 'కాశీ' అనగానే దేవునికంటె ముందు ఆ పోయినపెట్టె గుర్తుకు వస్తుంది. ఇదీ అంతే. వెంటవెళ్లిన పౌరులకీ, లక్ష్మణునికీ భేదం చూపించడానికి ఈ ఘట్టం చక్కటి సాక్ష్యం. తన కష్టం తా ననుభవించాలి గాని అయోధ్యా పౌరులు తప్పు చేయలేదు కాబట్టి, వారికి కష్టం ఉండరాదు. వంచనతోనైనా ధర్మాన్ని నిలబెట్టాలనేది రాముని ధర్మం. ఇదే విధానాన్ని భారతంలో కృష్ణుడు ముందు కాలంలో చూపెడ్తాడు. మాతృభూమి కోసలదేశం. నమస్కరించడం గౌరవం కోసం. రాత్రి సమీపించగానే 2వ రోజున గంగాక్షేత్ర తీర్థోపవాసం చేయదలచి ఆగాడు రాముడు.

## ఇవ్వలేని కాలంలో ఇయ్యగలిగిన కానుక

సీతా రామలక్ష్మణులు గంగాతీరానికి వచ్చారని తెలియడంతోనే శృంగిబేర పురపు నిషాదరాజు గుహుడు దర్శించాలని వచ్చాడు. ఈకలకిరీటం, పెద్దపూసల కుండలాలూ, బలమైన వక్షఃస్థలం, దూరంగా చూడగల నిశితమైన కళ్లు, యాస మాట, అర్ధకంచుకం (చొక్కా), తోలుచెప్పులు, పందివారుతో చేసిన వింటినారికల బలమైన విల్లు, పేము బాణాలూ వాని వేషం.

పిండివంటలతో దాసులు వెంట వచ్చారు. 'ఈ వచ్చిన అందరితో నా రాజ్యాన్ని నీకర్పిస్తున్నాను. (వయం ప్రేష్యా భవాన్ దాతా) ఈ పదునాలుగేళ్లూ ఇక్కడే ఉండి ఇటునుండే అయోధ్యకి వెళ్లి మమ్మల్ని ఆదరించు.

'రామా ! పులుల్ని పిల్లుల్లా లెక్కచేయం. అలా అని కఠినాత్ములం కాము. లేళ్ల మమ్మల్ని లెక్కచేయవు. కొండవాలుల్లో పాకుడు మమ్మల్ని జారనీయకుండా త్రోవనిస్తుంది. 'ఉడుం' లా కొండని ఎక్కగలం. వనమృగాన్ని కావాలనుకుంటే కంఠం పట్టివధిస్తాం. ముళ్లు మాకు పూలలా మెత్తగా ఉంటాయి. పునుగు జవ్వాదులు మా సొత్తు. ఏ చెట్టుకి ఎన్ని పూలు, పళ్లు, ఆకులున్నాయో, ఎప్పుడు ఏ మార్పు జరుగుతోందో అది మాకు తెలియక ఉండదు. ఇలా మాట్లాడుతూ నీకు నిద్రాభంగం కలుగజేయను. విశ్రాంతి తీసికోండి. కాని, లక్ష్మణుడు మా రాజ్యంలో కాపలా కాస్తూ, మీరు పడుకోగా ఇలా విల్లెక్కుపెట్టి నిలబడడం మాకుఅవమానం' అన్నాడు గుహుడు.

మేఘ గంభీర కంఠంతో రాముడన్నాడు. గుహా ! నేను ప్రతిగ్రహం (దానం తీసికోవడం) మానాను. ఏదైనా ఇవ్వాలని అనిపిస్తే నా తండ్రి గుర్రాలు అయోధ్య నుండి వచ్చాయి. అలసి ఆకలితో ఉన్నాయి. వాటికి ఆహారం పెట్టి నన్ను ఆనంద పెట్టు. నా మీది అభిమానానికి చెప్పలేని సంతోషమౌతోంది. ఇవ్వగలిగిన కానుక ఏమీ ఇయ్యలేని ఈ కాలంలో నేనివ్వగలిగిన కానుక ఇదే అంటూ అతణ్ణి సాదరంగా కౌగిలించుకున్నాడు,(భుజాభ్యాంసాధువృత్తాభ్యాం పీడయన్ వాక్య మబ్రవీత్)

గడ్డిని మెత్తగా పరుపులుగా చేస్తే దానిపై సీతారాములు పరున్నారు. కొద్ది దూరంగా నిలబడ్డ లక్ష్మణుడు అన్నాడు 'గుహా ! నేనిలా విల్లెక్కుపెట్టి నిలబడినది నిన్ను అవమానించాలని కాదు. మా అన్న వదినెలిలా ఉంటే నాకు నిద్ర పట్టకా - జాగరం చేయాలనే ఆలోచన కలిగేను. ఈ రాత్రి గడవడానికి రాముని గుణాలు చెప్తావిను ! అంటూ రాముని గుణాలెన్నో చెప్తూనే ఉన్నాడు. రాత్రి అయిపోయింది గాని లక్ష్మణుడు చెప్పదలచిన రాముని గుణాలు మిగిలిపోనేపోయాయి.

(కౌసల్యా చైవ రాజా చ తథైవ జననీమమ - నాశంసే యది జీవన్తి సర్వే తే శర్వరీ మిమామ్) 'గుహా ! ఆకాశంలోని విశాఖానక్షత్రం పొగకప్పి ఉండడం చేత మా తండ్రి కాలం చేస్తాడు. అతణ్ణి బట్టి కౌసల్య జీవించదు. వీరిని బట్టి మిగిలిన వారున్నా. శత్రుఘ్నుని కోసం బ్రతికితే నా తల్లి ....అయినా అనుమానమే (విశాఖాస్తు సధూమశ్చ నభసి ప్రచకాశిరే) ఏమైతేనేం ? వారికి నీళ్ళ నివదిలేఅదృష్టం మాకులేదు' అని నిరాశగా పల్కాడు లక్ష్మణుడు. తెల్లవారగనే నావ సిద్ధమైంది. లక్ష్మణుడు పట్టుకొన్నాడు. సీతారాములెక్కారు. లక్ష్మణుడు ఎక్కాక నావ కదిలింది. సుమంత్రుడడిగాడు 'రామా! నన్నూ తీసికొని పోవా ?' అని. 'కైకయా ప్రత్యయం గచ్ఛేదితి రామో వనం గతః' 'సుమంత్రా! నన్ను అడవులలో దింపావని కైకమ్మకి తెలియాలంటే నువ్వు అక్కడికి వెళ్ళక తప్పదు. దండకకి వెళ్ళవలసినవారిలో నీ పేరు లేదు. ఎలా తీసికెళ్లను ? ఇక వీరిద్దరూ అంటావా ? తప్పనిసరియైన వాళ్లు. నేనా ? వానప్రస్థుణ్ణి. వెంట నీలాంటి వారిని తీసికొనిపోరాని వాణ్ణి- గమనించు' నావ గంగానది మధ్యకి వెళ్లగా సీత గంగమ్మకి ఎన్నెన్నో ఇవ్వగలనని మ్రొక్కింది.

**విశేషాంశాలు :**

అడిగినా దానం చేయ నిరాకరించడం అధమం. అడిగితే దానమీయడం మధ్యమం. తానై యాచించి దానం తీసికొమ్మని ప్రార్థించడం ఉత్తమం. ఈ పనిని చేసినవాడు గుహుడు. అందుకే రాముడు ముందుకాలంలో సుగ్రీవ - ఆంజనేయులకి మాత్రమే ఇచ్చిన కౌగిలి భాగ్యాన్ని ఇప్పుడు గుహునికి ఇచ్చాడు. 'గుహేనసహితో రామో లక్ష్మణేన చ సీతయా' సీతారామలక్ష్మణులతో సమానస్థాయిలో గుహుణ్ణి ఉంచి వాల్మీకి శ్లోకాన్ని వ్రాయడానికి కారణం రామాలింగన సౌభాగ్యాన్ని పొందిన

అదృష్టవంతుడు గుహుడు కావడం వలననే. 'గుహ ప్పెరుమాళ్' అంటారు దాక్షిణాత్యులు.

గుహలక్ష్మణులు గంగఒడ్డున పరమాత్మ గుణగణాలని చెప్పుకున్నారు- అది కూడా భగవంతుడు వింటూంటే. క్షేత్రానికి వెళ్లినప్పుడు భక్తుబు చేయవలసినదికూడా ఇదే. ఒక చేతి గడియారానికి వేరొక చేతి గడియారానికి కాలంలో తేడా ఉంటుంది గాని భగవంతుని గడియారం (సూర్యచంద్రులు) ఎప్పుడూ అందరికీ ఒకే కాలాన్ని చెప్తుంది. పైగా ఆ గడియారం భవిష్యత్ కాలంలోని విశేషాలని కూడ చెప్పగలదు.

లక్ష్మణుడు ఆకాశాన్ని చూచే సరికి చంద్రుడు కర్కాటకంలో ఉన్నాడు. పుష్యమి సాగుతోంది. గురు - బుధ - అంగారక గ్రహాలు మూడూ చంద్రుణ్ణి పీడిస్తున్నాయి. అంగారకః కలహహేతుః - అనవసరమైన వివాదాన్ని కల్గిస్తాడు అంగారకుడు. బుధఃపాపయుతఃపాపః. బుధుడు, మంచి గ్రహం ప్రక్కన ఉంటే మంచినీ, పాపగ్రహం ప్రక్కన ఉంటే చెడునీ చేస్తాడు.తనకంటూ ఓ స్వభావంలేని వాడు. దశరథునిది విశాఖా నక్షత్రం. అది పొగతో కప్పి ఉండడం వలన దశరథ మరణం చెప్పాడు లక్ష్మణుడు. జ్యోతిషం తప్పుకానే కాదు. పరిశీలకుల దోషం ఉండవచ్చునేమో గాని శాస్త్రం తప్పుకాదు. (పూర్ణే చతుర్దశే వర్షే పంచమ్యాంభరతా గ్రజః) 14 సంవత్సరాల పిమ్మట రాముడు అయోధ్యకి పంచమినాడు రావడాన్ని బట్టి రాముడు వనవాసానికి బయలు దేరింది కూడా పంచమి అయ్యుంటుంది. కాగా ఈ రోజు 'షష్ఠి'.

'హీన సఖ్యం హీనప్రేష్యం హీన గేహ నిషేవణమ్' తక్కువ వానితో స్నేహం చేయరాదని శాస్త్రం ఉంటే రాముడు ఎలా స్నేహం చేసాడు ? అనేది సందేహం. 'న శూద్రా విష్ణు భక్తాశ్చ విప్రా భాగవతాః స్మృతాః - సర్వవర్ణేషు తే శూద్రా యేహ్యభక్తా జనార్దనే ॥ - యశ్శూద్రం భగవద్భక్తం నిషాదం శ్వపచం తథా - వీక్షతే జాతి సామాన్యాత్ స యాతి నరకం నరః॥' అని ప్రమాణం. విప్రుడైనా విష్ణు (పరమాత్మ) భక్తుడు కాకపోతే శూద్రుడే. శూద్రుడైనా జనార్దనభక్తుడైతే ఉత్తముడే. జాతి కంటె భగవద్భక్తి ప్రధానమని దీని భావం.

పరమాత్మని అయోధ్య నుండి పంపిన కారణంగా కైకకు వైధవ్యం, దశరథునకు మరణం, అయోధ్యకు శోకం కల్గింది.

ముందుగా గునపం, గంప, వస్త్రాభరణాలు, విల్లు, ఆయుధాలని నావలో పెట్టి, సీతని ఎక్కించి, రాముడెక్కాక లక్ష్మణుడెక్కాడు. ప్రయాణం చేయవలసిన విధానం, భృత్యుడు ఆచరించవలసిన తీరూ ఇక్కడుంది. 'స్త్రీలని ముందు కూర్చుండబెట్టి పురుషులు పిమ్మట రక్షగా బయలుదేరాలి' అనే శాస్త్రమర్యాద ఇక్కడ తెలుస్తుంది.

'భక్తం చ భజమానం చ తవాస్మీతి చ వాదినం - త్రీనేతాన్ విషమప్రాయాన్ విషమేష్వపి న త్యజేత్' - నీ కోసమే నేనుంటానని పలికే వాణ్ణి విడువరాదంటారు గదా ! సుమంత్రుణ్ణి కాదనవచ్చా ? అంటే సుమంత్రుడు దశరథుని మంత్రీ, సేవకుడున్నూ. రాజకార్యాన్ని నిర్వర్తింపవచ్చినవాణ్ణి తనతో తీసికొనిపోవడం నేరమౌతుంది. అందుకే కాదన్నాడు. గంగమ్మకు మ్రొక్కడం త్రేతాయుగపు సంప్రదాయమే.

గంగ అవతలి ఒడ్డుకి నావ చేరింది. ముందు లక్ష్మణుడూ, వెనుక రాముడూ, నడుమ సీతా నడువసాగారు. (జీవాత్మ - పరమాత్మల నడుమ 'మాయ' ఉంటుంది. 'మాయని తొలగిస్తే జీవాత్మకి పరమాత్మ దర్శనమౌతుంది. పెళ్లిలో వధూవరుల నడుమ తెరని ఈ విషయం సూచించదలిచే పెడతారు. (విశేషాలు కావలసివస్తే నా 'మాంగల్యతంతునానేన'—చూడగలరు).

"భాస్కరోదయకాలోఽయం గతా భగవతీ నిశా - అసౌ సుకృష్ణో విహగః కోకిలస్తాత కూజతి" అని ప్రయాణానికి ముందు రాముడు తమ్ముణ్ణి లేపుతూ అన్నాడు. 'రాత్రి అయిపోయింది. ఇటు కృష్ణపక్షి (వానరాదనీ) అటుకోకిల (ఎండ వస్తుందనీ) కూస్తున్నాయి' అన్నాడు. (పక్షులకి తెలిసినంత వాతావరణ విశేషం మరెవ్వరికీ తెలియదు. వర్షపురాక చీమలూ, తూనీగలూ, కుక్కలూ, నెమిళ్లూ చెప్పగలవు. ఎండరాకని కోకిలా, నిప్పుకోడీ, కోడీ చెప్పగలవట). అలాగే సీతతో 'సీతా ! తిరిగి తల్లిదండ్రులతో ఎప్పుడు నేను సరయూనది ఒడ్డున ఉన్న వనాల్లో సంచరిస్తాను ?' అన్నాడు. (దశరథమరణం జరుగుతుంది కాబట్టి ఇక ఆ వేడుక తీరదని చెప్పడం దీని భావం)· అంతేకాదు- 'ఈనాడు మనం భోజనం చేయాలి' అని కూడా అన్నాడు.

(పట్టాభిషేకానికి ముందు రాత్రి అయోధ్యలో, పట్టాభిషేకపు నాటి రాత్రి

తపసాతీరంలో, క్రిందటి రాత్రి గంగ ఒడ్డున మూడు రాత్రుల ఉపవాస దీక్ష అయింది కాబట్టి ఇక భోజనం (పారణ) చేయాలని అన్నాడు. దీన్ని 'త్రిరాత్రోపవాస దీక్ష' అంటారు. ఏదైనా ఒక పనిని సాధించదలచుకుంటే ఇలా చేస్తారు. భారతంలో సావిత్రి కూడా సత్యవంతుని మరణాన్ని ముందుగానే తెలిసినది కాబట్టి త్రిరాత్రోపవాస దీక్షని నిర్విఘ్నంగా చేసి విజయాన్ని పొందింది).

ముగ్గురూ ఒక వృక్షం నీడలో చేరి, దొరికిన ఆహారం స్వీకరించారు. లక్ష్మణుడు జాతిదిమ్మలని తలగడలుగా ఉంచి ఆకులతో మెత్తటి రెండు పక్కలని సీతారాములకి ఏర్పరిచాడు. ఇష్టంతో లక్ష్మణుణ్ణి చూచి రాముడన్నాడు. (జాగర్తవ్య మతంద్రిభ్యా మద్యప్రభృతి రాత్రిషు - యోగక్షేమం హి సీతాయా వర్తతే లక్షణా వయోః) లక్షణా ! ఇది ఇల్లు బయలుదేరాక 3వ రాత్రి. సుమంత్రుడు లేకుండా మనం ముగ్గురం కలిసి ఉన్న మొదటి రాత్రి కూడాను. ఈ క్షణం నుండి ప్రతిరాత్రీ సీతని మనం చాల శ్రద్ధతో రక్షించాలి. ఆమె యోగక్షేమాలు మనవే ! అంటూ ఏవేవో చక్కని మాటలని పలికి 'తమ్ముడూ! మన తండ్రి నామీది దిగులుతో నేల మీద పడుకుని ఉంటాడు. తన కోర్కె తీరింది గదా అని కైక ఆనందపడుతూ ఉంటుంది. భరతుడు రాగానే 'భరతుడు యువరాజుగా ఎందుకుండాలి ?' అనే ఆలోచనతో, 'ముసలిరాజు పోయిన పక్షంలో భరతుడు మహారాజే ఔతాడు గదా!' అనే కుటిల స్వభావంతో దశరథుణ్ణి చంపాలని ఆమె ఆలోచిస్తూ ఉంటుంది. కైకకి రాజును చంపడం పెద్ద కష్టమైన విషయం కానే కాదు. ఆమె అంటే రాజుకి ఒళ్లుమాలిన మోహం కదా ! (కిం కరిష్యతి కామాత్మా కైకయావశమాగతః కామ ఏవార్థ ధర్మాభ్యాం గరీయానితి మే మతిః.) తనని కట్టడానికి త్రాళ్లు తానే తెచ్చుకున్నట్టు కామకారణం చేత కామిఅయిన మన తండ్రినష్టపోతాడు. అర్థ ధర్మాల కంటెకామమే గొప్పది సుమా ! అయోధ్యా రాజ్యాన్ని కైక ద్వారా భరతుడుఎంత తేలికగా సంపాదించ గలిగాడు ? (మన్యే దశరథాంతాయ మమ ప్రవ్రాజనాయ చ కైకేయీ సౌమ్య సంప్రాప్తా రాజ్యాయ భరతస్య చ) దశరథుణ్ణి చంపడానికీ, నన్ను అరణ్యాలపాలు చేయడానికీ, భరతుడికి రాజ్యం కట్టబెట్టడానికీ కైకమ్మ పుట్టిందను కుంటాను.

లక్ష్మణా ! నేను వచ్చాక కౌసల్య ఎలా ఉందో ? భరతునికి 14 ఏండ్ల తర్వాతనైనా నేను అడ్డువస్తాననే భయంతో కైక కౌసల్యని ఏం చేస్తుందో ? ఏ కారణమూలేక నిన్ను తెచ్చిన నన్ను గూర్చి మీ అమ్మ ఏమను కుంటోందో ? 'ఈ

బాధ ఎందుకు ? పట్టం కట్టుకోరాదా ?' అనకు రాజ్య కాంక్షలో ధర్మాన్ని వీడాడు రాముడనరా ? తమ్ముడూ ! నువ్వు అయోధ్యలోనే ఉండి పరిస్థితులనిచక్కదిద్దుతూ నాకు మనశ్శాంతి కల్గించు. వెళ్లు' అన్నాడు. (కైకా దశరథులని రాముడు ఇలా అనవచ్చా ? అన్పిస్తుంది. ఆశ్లేషానక్షత్రంలో పుట్టిన లక్ష్మణునికి కోపం అనుమానం ఎక్కువ. కైకాదశరథులను గూర్చి లక్ష్మణుని అభిప్రాయాన్ని విందామని రాముడు ఇలా అన్నాడు. లక్ష్మణుడు కూడా తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పి ఉండే వాడే కాని 'నువ్వు అయోధ్యకు వెళ్లు' అన్న వాక్యం మహా దుఃఖాన్నికల్గించడంతో రాముడితో ఉండే ఉపాయాన్ని ఆలోచించాలనే దృష్టికి వచ్చేసాడు. కైకమ్మకి దేవతలు కల్గించిన బుద్ధి వలన ఏ దశరథమరణం, రామవనవాసం, భరత రాజ్య పదవీ జరగాలో, వాటిని జరిపించడానికే కైక పుట్టిందని రాముడన్నాడు. నిజమే కదా! రాముడు లక్ష్మణునితో ఈ రాత్రి నుండి రాత్రి వేళల్లో సీతని రక్షించాలని పల్కాడు. పగలు రక్షించనక్కరలేదా ? రాక్షసులు నిశాచరులు కాబట్టి రాత్రివేళ వారు ఎత్తుకొని పోవచ్చుననేది పై భావం. లో భావం అది కాదు. రావణుడు రాక్షస రూపాన్ని, ధర్మాన్ని మార్చి దొంగిలిస్తాడు. నిశాచరుడైన అతడు సీతాపహరణానికి వచ్చేది పగలు కాబట్టి, అతని చేత సీత అపహరింపబడితే తప్ప రావణవధ జరు గదు కాబట్టి, రాత్రివేళల్లోనే భద్రతతో ఉండాలన్నాడు. సీతారక్షణ భారం మనిద్దరిదీ అని చెప్పిన రాముడు కొంత సేపట్లోనే లక్ష్మణుణ్ణి అయోధ్యకు ఎలా వెళ్లమని అన్నాడు ? కాబట్టి లక్ష్మణుని మనస్సుని పరీక్షించడం, రావణవధకు ముందు జరుగ వలసిన సీతాపహరణానికి కావలసిన సందర్భాన్ని సిద్ధపఱచడం రాముడే చేస్తున్నా డనేది సారాంశం).

## మర్కటకిశోరమా ? మార్జాలకిశోరమా ?

అయోధ్యకి పోవాలనే మాట లక్ష్మణునికి అశనిపాతం వంటిదైంది. రాము నితో ఉండడం, అయోధ్య నుండి దండకకి వచ్చేప్పుడు జరిగిన సంఘటనలలో తానూ ఉండడం, రాముని ప్రవర్తనా - అన్నిటినీ చూచి గ్రహించుకోగల లక్ష్మ ణుడు, తానెలా ఉండవలసినదీ గ్రహించాడు. అందుకనే కోపావేశాలు లేకుండా 'అన్నా! నేను అయోధ్యలో ఉండాలన్న ఆలోచన, నేను వనవాసానికి వచ్చాక నీకు కల్గిందా ? క్రియ అయిన పిమ్మట ఆలోచించడం బుద్ధిమంతుల లక్షణం కానేకాదు,

మేమిద్దఱమూ సుఖం కోరి అరణ్యాలకి రాలేదు. సుఖమే కావలసివస్తే అయోధ్య ఉండనే ఉందిగా ! నీ సేవను చేసికొందామని వచ్చాం. ఆ సేవని నువ్వూళ్లో ఉంటే అక్కడ, అరణ్యంలో ఉంటే ఇక్కడ స్వీకరించక తప్పదు. (న చ సీతా త్వయా హీనా నచాహమపి రాఘవ, ముహూర్తమపి జీవావో జలాన్మత్స్యా వివో ద్ధృతౌ) నేనూ సీతా, నువ్వు లేక, ఒడ్డున చేప జీవించలేనట్లు, జీవించలేం. అయినా నువ్వు ఏమన్నావు ? అధర్మానికీ, పరలోకానికీ భయపడి రాజ్యాన్ని స్వీకరించడం లేదన్నావు. నువ్వొక్కడివే కొట్టగలిగినా, ధర్మం కాదని మానానన్నావే ? నీ సేవయే పరమధర్మమని వచ్చిన మమ్మల్ని విడువడం ధర్మమా ? (ఏ కో హ్యహ మయోధ్యాం చ పృథివీం చాపి లక్షణతరేయమిషుభిః క్రుద్ధో నను వీర్యమకారణమ్॥ అధర్మభయభీతశ్చ పరలోకస్య చానఘ తేనలక్ష్మణ నాద్యాహ మాత్మానమభిరోచయే 53/26”) అన్నాడు.

మర్కటకిశోరన్యాయం - మార్జాలకిశోరన్యాయమని రెండున్నాయి. కోతి పిల్ల, కోతిని గట్టిగా పట్టుకుంటుంది. ఎగిరినా, దూకినా బాధ్యత పిల్లదే. తల్లి కోతిది కాదు. ఇది మర్కటకిశోర న్యాయం. ఇక పిల్లి, తన పిల్లని తానే మెడకఱచుకొని తీసికొనిపోతుంది. ఇక్కడ బాధ్యత తల్లి దేగాని పిల్లదికాదు. ఇది మార్జాలకిశోర న్యాయం. లక్ష్మణునిది మర్కటకిశోరన్యాయం. బాధ్యత వహించవలసిన తల్లి వంటి వాడివైన నువ్వే నన్ను విడిచి పొమ్మంటే ఎలా పోతాను ? అనేది లక్ష్మణ వాక్యం. రాముణ్ణి ఎక్కడ విడిచి పోవలసి వస్తుందోననే భయమే నిజమైన భక్తి అంటే. (పునర్విశ్లేష భీరుత్వం పరమాభక్తి రుచ్యతే)

ఇక్కడ మఱొక రహస్యం ఉంది. లక్ష్మణుణ్ణి ఇలా వెళ్లి పొమ్మంటుంటే సీత ఏమీ మాట్లాడదు. ఎందుచేత ? ఇది లక్ష్మణునికి పెట్టబడిన పరీక్ష తప్ప రాముని అభిప్రాయం కానే కాదని ఆ తల్లికి తెలుసుగదా ! అదీ కాక రావణవధ అయ్యాక తాను వైకుంఠానికి వెళ్లవలసి వస్తుంది. అప్పుడు తనని పంపించడానికీ ఇదేవిధంగా రాముడు మాట్లాడవలసి ఉండి. ఏ విధంగా రాముని మాట ఉంటుందో వినాలని కూడ ఆమె ఆలోచన.

## భరద్వాజ దర్శనం.

గంగాయమునలు కలిసే చోట ఉన్న భరద్వాజ మహర్షి ఆశ్రమానికి రోజు రోజంతా ప్రయాణించి సీతారామలక్ష్మణులు చేరారు. ఆయన హోమం పూర్తి అయ్యే వఱకూ నిరీక్షించారు. ఆయన రాగానే నమస్కరించి ఆత్మపరిచయం చేసికొన్నారు. భరద్వాజుడు సంతోషించి 'ఈ ప్రదేశం గంగా యమునా సంగమం. నిర్మలమైన ప్రదేశం. ఇక్కడే గడిపి వెళ్లవచ్చు' అని పలికి కందమూలాలూ, ఫలాలూ ఎన్నింటినో ఇచ్చాడు.

రాముడాయన మాటలని విని 'స్వామీ! ఎన్నో గ్రామాలకీ పట్టణాలకీ దగ్గఱగా ఉన్న ఈ ప్రదేశాన్ని చూడవచ్చే అందఱి వల్లా ఏకాంతానికి భంగం కలుగుతుంది. మఱో ఆశ్రమ ప్రదేశాన్ని చెప్పండి' అన్నాడు.

రాముని సౌందర్యాన్ని చూడాలనీ వినాలనీ వచ్చిన మృగాలూ పక్షులమధ్య కూచున్న భరద్వాజుడు' నాయనా! గంధమాదన పర్వతం వంటిది ఇక్కడికి 10 క్రోసుల దూరంలో చిత్ర కూటం ఉంది. దర్శన మాత్రం చేతనే పాపపు ఆలోచనలు తొలగి పుణ్య కార్యాలోచన కల్గుతుంది. అక్కడైనా సరే లేదా ఇక్కడైనా ఉండవచ్చు' అన్నాడు.

రాత్రి తెల్లవారింది. 'రామా ! అక్కడుండే లేళ్లూ, సెలయేళ్లూ, జింకలూ మొదలయిన ప్రకృతి దృశ్యాలని ఈమెకు చూపించవచ్చు. ఏకాంతం కాబట్టి నువ్వు ఆశ్రమం కట్టుకోవచ్చును. ఇక్కడి నుండి పడమరగా పోయి యమునని దాటి శ్యామమనే మఱ్ఱిచెట్టుకి మ్రొక్కులు చేసికొని మోదుగు - రేగు - వెదుళ్లతో నిండి చిత్రకూటాన్ని చేరండి' అని చెప్తూ తండ్రి తన పుత్రులని వెంబడించినట్లు చాల దూరం వచ్చి ఆయన వెనుదిరిగాడు.

'లక్ష్మణా ! భరద్వాజుడంతటి మహర్షి మనలని ఆదరంగా చూడడం మన అదృష్టం సుమా !' అని రాముడన్నాడు· యమునానదిని దాటుతూండగా నదికి సీత మ్రొక్కింది. తిరిగి శ్యామవృక్షానికి మ్రొక్కింది. అక్కడి నుండి నడుస్తూ వెళ్లగా వెళ్లగా చిత్రకూట శిఖరాలు కన్పించాయి. పూలూ, తీగెలూ, పండ్లూతో చక్కని ఆశ్రమం కన్పించగా ముగ్గురూ ఆ ఆశ్రమంలోనికి వెళ్లారు.

**విశేషాంశాలు :**

ఆత్మ పరిచయాన్ని రాముడంతటివాడు "పుత్రౌ దశరథస్యావాం భగవన్ రామలక్ష్మణౌ" అంటూ ఏ గొప్పదనమూ చెప్పుకోకుండా - దశరథపుత్రులం రామలక్ష్మణులం - అని మాత్రమే చెప్పుకున్నాడు. వీరి ముగ్గురినీ ధ్యానంలో దర్శించిన భరద్వాజుడు వీరి ఆగమనాన్ని కాంక్షిస్తున్నాడు. వారు వచ్చారు. తనను ఎదురుచూస్తూ నిలబడ్డారు కూడ. 'సమిత్పుష్పకుశాజ్యాంబు మృదన్నాక్షత పాణికం - జపం హోమం చ కుర్వాణం నాభివాదయతే ద్విజమ్' అని స్మృతి. హోమం చేస్తూన్న వానికి నమస్కరించరాదనే ధర్మం తెలిసిన రాముడు ఎదురుచూచాడు తప్ప అహంకరించలేదు. తాను భగవంతుడే అయినా, మహర్షికోసం భార్యా సోదరుల సమక్షంలో ఎదురు చూస్తూ ఉండడం అహంకారం లేని తనాన్ని సూచిస్తుంది.

(పుణ్యశ్చ రమణీయశ్చ వసత్విహ భవాన్ సుఖమ్) 'ఇక్కడనే ఉండు' అని రామున్ని అడగడం పరీక్షించడం కోసమే. దండకకు పోవాలనే పట్టుదల రామునిలో ఒక వేళ లేకపోయినట్లయితే ఉండేలా తాను చేయాలి. రాముడు కూడా మహర్షి ప్రశ్నలోని భావాన్ని గమనించి మెల్లగా తప్పుకున్నాడు. (భగవన్నిత ఆసన్నః పౌర జానపదో జనః సుదర్శ మిహ మాం ప్రేక్ష్య మన్యేఽహ మిమ మాశ్రమమ్ - ఆగమిష్యతి వైదేహీం మాంచాపి ప్రేక్షకో జనః - అనేక కారణేనాహ మిహ వాసం న రోచయే) నాకు ఏకాంతం భంగమౌతుందని చెప్పి తప్పుకున్నాడు. తనని చూడవచ్చిన రామునంతటి వాణ్ణి సాగనంప వద్దా ? అందుకే వెంట వెళ్లాడు. (ప్రస్థితాం శ్చైవ తాన్ ప్రేక్ష్య పితాపుత్రానివాన్వగాత్).

'చిత్రకూటం' అంటే ఎక్కడో ఉన్న పుణ్యక్షేత్రం కానే కాదు. 'అయోధ్యలో ఉండేవారూ అయోధ్యకి వచ్చేవారూ, అయోధ్యకు చెందనివారూ, అందరూ ఒకచోట చిత్రంగా ప్రోగుపడిన చోటు' అని అర్థం. ఈ స్థలం ప్రతివ్యక్తికీ కూడ ఉంటుంది. స్పర్శ చెప్పే చర్మానికీ, చూపుని చెప్పే కన్నుకీ, వినే చెవికీ, రుచిని చెప్పే నాలుకకీ, వాసనని చెప్పే ముక్కుకీ—ఇలా విభిన్నమైన జ్ఞాన ఇంద్రియాలకి కేంద్రం చిత్రకూటం. కర్మేంద్రియాలతో ఏది చేసినా, దాన్ని కూడా గుర్తుంచుకొనే కేంద్రం చిత్రకూటం. గంగా యమునల సంగమం నుండి దీనికి దారి ఉందిట. ముక్కుకి, కుడి - ఎడమవైపుల ఉండే రంధ్రాలే ఇడ - పింగళ నాడులు. ఆ

రెంటి సంగమమే కనుబొమలనడుమ. అదే ప్రయాగక్షేత్రం. అక్కడినుండి 10 క్రోసులదూరంలో చిత్రకూటం ఉందిట. కనుబొమలనడుమ నుండి అడ్డంగా, వ్రేలు ప్రక్కన వ్రేలు పెడుతూ బ్రహ్మరంధ్రం వఱకూ పెట్టి కొలిస్తే,సరిగా చిత్రకూటం 10 వ్రేళ్ల వెడల్పు దూరంలో ఉంటుంది. దీని అసలు పేరు 'గంధమాదనము' అని. గంధ - వాసనలవలన కలిగే, మాద - మద సంబంధమైన ఊహాలని, న లేనిది, కల్గించనిది; అని అర్థం. వాసనలవల్ల కలిగే మదం లేనిదని భావం. ఇది ఒక యోగ విశేషం. 'కృతపుణ్యాః స్మ సౌమిత్రే! ముని ర్యన్నోఽను కంపతే' - 'భరద్వాజుడు మనమెడ కనికరం చూపాడు' అనడానికి కారణం, భావికథకీ, రావణవధకీ ఈ భరద్వాజుడు తన తపఃఫలం అందింపబోతున్నాడని తెల్పడానికే.

ఇప్పటి వఱకూ తాము నడుస్తూన్న తీరుని మారుస్తూ అంటే జీవాత్మ రూపమైన లక్ష్మణుడు 'ఉ' కారం గానూ, శుభవాచకమైన 'మ' కారం రాముడు గానూ, అన్నివర్ణాలతోనూ కలిసి ఉండే వర్ణంలానూ- అక్షరాలలో ఆదిగానూ ఉండే 'అ' కారం సీతమ్మగానూ అంటే ఉ+మ్+అ = ఉమారూపంగా ఉండే టట్లయితే గాని రావణ వధ జరగదు. ఇలా రాక్షసవధకై వెళ్లబోతూన్న విష్ణువే శివుడు. ఇక్కడి నుండి రామునిలో రుద్రాంశరాబోతోంది.

## వాల్మీకి దర్శనం.

పూర్వగ్రంథాలు నిలిచి ఉంచడానికీ ఆ గ్రంథకర్తలపైన గౌరవం ఉండ డానికీ కారణం, తమ గ్రంథంలో తామూ పాత్రధారులు కావడమే. గ్రంథంలో తమ ప్రవర్తన ఎలాంటిదో, అదే తీరుగా మాటా, నడవడికా, కార్యసాధన విధా నమూ, బయటకూడా ఉండేది. ఈ ముగ్గురూ (సీతారామలక్ష్మణులు) వాల్మీకి ఆశ్ర మానికి వెళ్లారు. 'ఇతి సీతా చ రామశ్చ లక్ష్మణశ్చ కృతాంజలిః - అభిగమ్యాశ్రమం సర్వే వాల్మీకి మభివాదయన్.' ఈ ముగ్గురిలో ముందుగ 'సీత' నమస్కరించింది. సీత 'ఉ' అనే బీజవర్ణానికి ప్రతీక. 'ఉ' అంటే యుద్ధం. రుద్రాంశ చేరిన రాముడు ఇక్కడి నుంచి యుద్ధ ప్రధానుడౌతాడని దీని భావం. ఈ చిత్రకూటంలో- అందునా తన బుద్ధిలో - శ్రీమన్నారాయణుని దర్శించి, ఇంకా తపస్సు కూడా చేస్తూన్న మహర్షి 'వాల్మీకి' ఒక్కడే.

'ఆస్యతామితి చోవాచ స్వాగతంతు నివేద్య చ! ఈ ముగ్గురూ తమ గోత్ర ప్రవరలని చెప్పుకున్నాక వీరికి వాల్మీకి స్వాగతం పలికి అతిక్లుప్తంగా 'కూచోండి'

అని మాత్రమే అన్నాడు. తమసానదికి దగ్గఱగా ఉన్నది వాల్మీకి నివసించే ఆశ్రమం. చిత్రకూటంలోనిది తాను తపస్సుచేసిన ఆశ్రమం. తన ఆశ్రమానికి కథా నాయకుడు వస్తే అతిక్లుప్తంగా మాట్లాడి వాల్మీకి పంపివేసాడు. తమతమ నివాసాలలో ఉండవలసినదని భరద్వాజుడూ - గుహుడూ రాముణ్ణి ప్రార్థిస్తే కాదు కాదని పలికి, వట్టిగా కూర్చొనుమని పల్కిన వాల్మీకి ఆశ్రమానికి చేరువలోనే కుటీరం నిర్మింపదలిచాడు రాముడు. 'లక్ష్మణానయ దారూణి వరాణిసుదృఢాని చ- కురుష్వావసథం సౌమ్య ! వాసే మేఽభిరతం మనః' 'లక్ష్మణా ! బలిష్ఠమైన చెట్లమానులు తెచ్చి ఇక్కడ ఇల్లు వేసికొందాం' అన్నాడు రాముడు.

భక్త పరాధీనుడు భగవంతుడు. సహస్రారమే అయిన చిత్ + త్ర + కూటంలో భగవంతుణ్ణే ఉంచాలి. అందుకే వాల్మీకి రాముణ్ణి ఇక్కడే ఉండమని పల్కాడు. లోభితనంతో ఏ పనిని చేసినా అది దోషమౌతుంది గాని, ఎవ్వరిసహాయమూ అవసరం లేని చిత్రకూటంలో తపస్సుకై ఇల్లు కట్టడం లోభితనం అనిపించుకోదు. ప్రతిఫలాపేక్ష లేకుండా ఏ పనిని చేసినా అది ఉత్తమ ఫలితాన్నే ఇస్తుంది విశ్వామిత్రుడు త్రిశంకుని కోసం ఆ రోజున యాగం చేసినా వశిష్ఠునిమీది పగని తీర్చుకోవడం ప్రతిఫలం కాబట్టి ఆ సహాయం ఫలించకపోయింది. ఇక్కడ లక్ష్మణుడు ఇల్లు కట్టడం ప్రతి ఫలాపేక్ష రహితం కాబట్టి రాజధర్మాన్ని అతిక్రమించినట్లు కాదు. ఇల్లు కట్టినందుకు 'ఇంత' అని తీసికొంటే అది 'వృత్తి ధర్మం' అవుతుంది. లక్షణస్వామికైం కర్యం అలాంటిది కానేకాదు కదా !

## కైకమ్మ లేదు. భయం విడిచి అడగండి !

సీతారామ లక్ష్మణులు చిత్రకూటానికి వెళ్లారని తెలిసాక సుమంత్రుడుగుహుని వద్ద సెలవు తీసికొని మూడవనాటి సాయంత్రానికి అయోధ్య చేరాడు.

ఎందరెందరో అతణ్ణి గమనిస్తున్నారని గమనించినా, విడిచిన బాణంలా వేగంగా వెడుతూ దశరథుని మందిరంలో తలఎత్తాడు.

సుమంత్రుణ్ణి చూస్తూనే దశరథుడు మూర్ఛపడితే, కౌసల్య ఉపచారాలు చేసి 'మహారాజా ! కైక ఇక్కడ ఎలాగూ లేదు కదా ! భయం విడిచి ఏం జరిగిందో అడగండి' అని ఘోరంగా విలపిస్తూ అడిగింది. (నేహ తిష్ఠతి కైకేయీ విస్రబ్ధం ప్రతిభాష్యతామ్ !)

కిముువాచ వచోరామః ? కిముువాచ హి లక్ష్మణః ?
సుమంత్ర ! వనమాసాద్య కిముువాచ చ మైథిలీ ?

నిట్టూర్పులు విడుస్తూ దశరథుడు "సుమంత్రా ! రాముడేమన్నాడు ? లక్ష్మణుని పల్కలేవి ?' అని అడిగాడు.

కుమార ! రాజ్యే జీవ త్వం తస్యైవాజ్ఞా ప్రవర్తనాత్ ।
మాతేవ మమ మాతాతే ద్రష్టవ్యా పుత్ర గర్ధినీ ॥

సుమంత్రుడు మెల్లగా ఇలా ప్రారంభించాడు. 'మహారాజా ! తల్లులందరికీ నమస్కరించి, ఇతరులందరికీ తమ తమ యోగ్యతలకి తగినట్లు అడిగినట్టు చెప్పమనీ పల్కిన రాముడు మీతో 'అర్ధ జ్యేష్ఠా హి రాజానః రాజధర్మ మనుస్మర!' - తండ్రీ ! రాజులు అధికారం వలన గొప్పవారు ఔతారు గాని వయసు వలన కాదు. కాబట్టి భరతుణ్ణి రాజుగా గౌరవించు' అని పల్కాడు.

'భరతా ! మీ అమ్మని చూచినంతటి ఇష్టంతో మా అమ్మనీ చూస్తూ ఉండు' అని వానితో చెప్పమని చెప్పి మఱి మాటాడలేకపోయాడు.

లక్ష్మణుడు మాత్రం కోపంతో బుసలుకొట్టే పాములా ఊగిపోతూ' వరాలనే వంకతో దశరథుడు చేయరాని పనిచేసాడు. తప్పుని కైకమ్మమీద పెడుతూన్నప్పటికీ తప్పుతనదే. ప్రభువనే గర్వంతోనూ, మదంతోనూ, వయసు కారణంగా మతిచెడిన కారణంగానూ రాముణ్ణి అడవులకి పంపాడు. నేనుగా ఆయనకి చెప్పేది ఏమీ లేదని చెప్పు. నాకు ఆయన తండ్రిగా తోచడం లేదు. అన్న-ప్రభువు బంధువు - తండ్రి అన్నీ నాకు రాముడే' అన్నాడు. (వరదాన నిమిత్తం వా సర్వః దుష్కృతం కృతమ్ - రామస్య తు పరిత్యాగే న హేతు ముపలక్షయే ॥ అహం తావన్మహారాజే పితృత్వం నోపలక్షయే - భ్రాతా భర్తా చ బంధుశ్చ సఖా మమ చ రాఘవః॥).

తెల్లని స్వచ్ఛమైన నవ్వే అలంకారంగా ఉండే ఆ తల్లి సీతమ్మ మాత్రం, వాడిన పద్మంలా కన్పిస్తూ భర్తవంక చూస్తూ కన్నీరు కారుస్తూ నా వంక చూస్తూ అలా బోరున విలపించింది - అంటూ సుమంత్రుడు కన్నీరు పెట్టాడు.

'రాజా! కోపంతో లక్ష్మణుడు కన్నీస్తూ, దుఃఖిస్తూన్న రాముని ముఖాన్ని చూస్తూ నిలబడ్డాడు. రాముడు కన్నీరు కారుస్తూ అయోధ్యవైపుకి నమస్కరిస్తూ నిలబడగా, సీతమ్మ రథాన్నీ రాముణ్ణీ చూస్తూ అలా వెక్కివెక్కి దుఃఖిస్తూ అలా (తథైవ రామోఽశ్రుముఖః కృతాంజలిః స్థితోఽభవలక్ష్మణబాహుపాలితః - తథైవ సీతా రుదతీ తపస్వినీ నిరీక్షతే రాజ! రథం తథైవ మామ్॥- ఈ శ్లోకాన్ని దుఃఖకాలంలో పఠిస్తే దుఃఖాన్ని తట్టుకోగల స్థితీ — దుఃఖాన్ని దాటగల శక్తి వస్తుందని పెద్దల మాట - అనుభవం చెప్పిన సాక్ష్యమూ).

## నువ్వు తప్ప ఎవ్వరూ ప్రాణంతో లేరు !

రాజా ! వాళ్లు ముగ్గురూ వెళ్లిపోయినా తిరిగి నన్ను పిలుస్తారేమోనని 4 రోజులు అక్కడే ఉన్నాను (గుహేన సార్థం తత్రైవ స్థితోఽస్మి దివసాన్ బహూన్ ఆశయా యది మాం రామః పునశ్శబ్దాపయే దితి).

అపివృక్షాః పరిమ్లానాః సపుష్పాంకుర కోరకాః ।
ఉపతప్తోదకా నద్యః పల్వలాని సరాంసి చ ॥

త్రోవలో తిరిగి వస్తూంటే మొగ్గలతో పూలూ, చెట్లూ ఎండిపోయాయి. కోనేళ్లలో 'నీటి చుక్క' అనే మాటలేదు. ఆకులు గలగలలాడుతూ ఎండిపోయాయి. అడవి అంతా నిశ్శబ్దమై క్రూరమృగాలు సైతం వేటమాని దుఃఖిస్తున్నాయి ... ('రాజా ! ప్రపంచంలో అన్నీ జీవం విడిచాయి. కాని నువ్వే ప్రాణాలతో కన్పిస్తున్నావు') అంటూ ఎంతో వివరించి చెప్పాడు సుమంత్రుడు.

జబ్బుపడిన ఏనుగులా కొట్టుకుంటూన్న దశరథుడు 'సుమంత్రా ! రాముడు లేనిదే జీవించలేను. నేను వానితోనే ఉంటాను' అని పెద్దగా పలికాడు. (రాముని వద్దకు వెళ్లి అనేక దినాలు ఉండిన సుమంత్రునికే రాముని ఆహ్వానం లేకపోతే దశరథునికి ఇప్పుడు కల్గుతుందా ? రాముని వెంట వెళ్లడానికి సీతాలక్ష్మణులకి ఎంత కష్టం అయింది ? - దుఃఖంలో తాత్కాలికంగా సామాన్య మానవులు పలికే మాటలకి ప్రతీకలు ఈ దశరథ వాక్యాలు).

'కౌసల్యా! నేను శోకమనే సముద్రంలో మునిగి పోతున్నాను. రాముని

గూర్చిన నా దుఃఖమే దానికి వేగం. సీతా వియోగం దాని ఒడ్డు. నా నిట్టూర్పులే దాని సుడి గుండాలు. నా కన్నీళ్ళే కెరటాల నురుగు. గుండెని బాదుకొనే నా చేతులే చేపలు. నా రోదనం దాని ధ్వని. విడివడిన నా తలవెంట్రుకలే నాచు. కైకమ్మ బడబాగ్ని. మంథర మాటలు దానిలోని గ్రహాలు. కైకావరాలు దాని తీవ్రత.రాముణ్ణి వెళ్ళగొట్టడం దానిలోతు. ఇక నేను బ్రదుకడం వట్టిది' అంటూ మూర్ఛపోయాడు దశరథుడు. (రామశోకమహావేగః సీతావిరహ పారగః శ్వసితోర్మి మహావర్తో బాష్పఫేన జలావిలః - బాహువిక్షేప మీనౌఘో విక్రందిత మహాస్వనః - ప్రకీర్ణ కేశ శైవాలః కైకేయీ బడబాముఖః - మమాశ్రువేగ ప్రభవః కుబ్జావాక్య మహా గ్రహః వరవేలో నృశంసాయా రామప్రవ్రాజనా యతః - అవగాఢః సుదుష్పారం శోకసాగర మబ్రవీత్")

మూర్ఛ తేరుకున్న దశరథునికి అంతలో నిద్ర వచ్చింది. ఎప్పుడో అక స్మాత్తుగ మెలకువ వచ్చి కౌసల్యని లేపి 'కౌసల్యా ! నిన్ను వివాహం చేసికోవడానికి పూర్వం నేను ఒక బ్రహ్మహత్యని తెలియక చేసిన ఆ అశుభఫలం నేనిలా అనుభ విస్తున్నాను. (చూ. 57వ పుట). (యదాచరతి కల్యాణి శుభం వా యది వాశుభమ్ తదేవ లభతే భద్రే! కర్తా కర్మజ మాత్మనః) ఏ వ్యక్తి అయినా ఇతరులకి శుభాన్ని చేస్తే శుభాన్నీ, అశుభాన్ని చేస్తేఅమంగళాన్నీ పొందుతాడనేది పరమసత్యం' అంటూ తన శాపవృత్తాంతాన్ని పూర్తిగా చెప్పాడు. 'చావు తెలివి' అంటే ఇదే. చనిపో బోయే ముందు తాను చేసిన 'తప్పు' తనకి స్మరణకి రావడమే 'చావు తెలివి'అంటే. రాత్రి రాత్రంతా మేలు కోవడాన్ని 'జాగరణం' ('జాగారం' అంటూంటారు) అని చేస్తూంటారు. జాగరణం అంటే వట్టిగా మేలుకొని ఉండడం కాదు. ప్రపంచంలో మనం ఎవరికి ఏ మంచిని చేసాం ? అని ఒక్క క్షణం కన్నులు తెఱచి ఆలోచిం చడం నిజమైన జాగరణం. (వివరంగా కావలిస్తే నా లలితాసహస్ర పూజా - నామ అంతరార్థ వివరణం పుట....93 చూడగలరు). ఆ జాగరణమే దశరథునికి కల్గింది. ఇదే జీవితానికి అతిముఖ్యం. ఈ విషయాన్ని సూచించడానికే దీని పిమ్మటనే దశరథమరణం సాగింది.)

రామం మేఽనుగతా దృష్టి రద్యాపి న నివర్తతే ।
న త్వా పశ్యామి కౌసల్యే ! సాధు మా పాణినా స్పృశ॥

కౌసల్యా ! నా చూపు రాముని వెంట వెళ్లిపోయింది. సంతానం ఎవరైనా ఎక్కడికెళ్ళైనా మళ్లీ తిరిగి వస్తుందని భావిస్తాం. కానీ నా చూపు ఇక తిరిగిరాదని నాకు నిశ్చయంగా తెలుస్తోంది. ఇప్పుడు నా కన్ను కన్పించడం లేదనడానికిసాక్ష్యం, నిన్ను నేను చూడలేక పోతూండడమే. మరి-'కౌసల్యా' అని ఎలా గుర్తించగలుగు తున్నావంటావా ? చివరి క్షణాలలో నన్ను, నీ ఇంటికి తీసికొనిపొమ్మనిఅన్నాను గనుకనూ నీ మాట విన్పిస్తోంది గనుకనూ. కైకమ్మని చూచిన నీ కన్నులు, నన్ను చూడలేకపోతున్నాయా ? అంటావా ? - పుణ్యాత్ములు నాకు కనపడరు. దొంగ పత్రాక దీపం తెమ్మని, ఈలోగా యజమాని చీకట్లో వెతికేటట్లు నాకు దృష్టి లేక పోయినా నిన్ను చూడాలనే అనుకుంటున్నాను. నిన్నే ఎందుకు చూడాలని భావి స్తున్నా నంటావా ? నాకు సర్వప్రాణమైన రాముని తల్లివి కాబట్టి, వాడు లేనప్పుడు నువ్వైనా స్పృశిస్తావు గదా! అని. నువ్వు స్పృశిస్తే పంచేంద్రియాలలో ఒకటైన శరీరం ఉందనీ, నువ్వు కన్పిస్తే చక్షువనే ఇంద్రియం ఉందనీ, మాట విన్పిస్తే శ్రోత్రేంద్రి యమూ ఉందనీ, నేను మాట్లాడుతూంటే 'జిహ్వ' ఇంద్రియం పని చేస్తోందనీ, శ్వాసఆడుతూంటే ఘ్రాణేంద్రియం ఉందనీ గ్రహించగలను. ఇప్పటికి చక్షువనే ఇంద్రియం తొలగింది. కౌసల్యా ! నీ కంఠస్వరం విన్పించడం మానింది. అదుగో ! శ్రోత్రేంద్రియం పోయింది- మాట రావడం లేదు. జిహ్వేంద్రియం పోయినట్లే- అంటూ ('హా ! రాఘవ ! మహాబాహో ! హా క్వాసి గతః సుత ! హా కౌసల్యే ! వినశ్యామి హా సుమిత్రే ! తపస్విని ! హా నృశంసే ! మమామిత్రే! కైకేయి కులపాంసని ! ఇతి రామస్య మాతుశ్చ సుమిత్రాయాశ్చ సంనిధౌ రాజా దశరథ శ్శోచన్ జీవితాంత ముపాగమత్') రామా ! ఎక్కడికి వెళ్లావు? కౌసల్యా! సుమిత్రా ! మరణం ఆసన్నమైంది. కులభ్రష్టమైన కైకయ్యా ! ఎంత దారుణం చేసావు !' అంటూ రాముని తల్లి కౌసల్య, సుమిత్రలల సమక్షంలో కౌసల్యా మందిరంలో దశరథుడు సరిగా అర్ధరాత్ర కాలంలో ప్రాణాలు విడిచాడు. మరణించే కాలంలో రాముని స్మరణా, రామునికి కష్టాన్ని కల్గించినట్లుగా లోకానికి కన్పడే కైకని నిందించడం, కౌసల్యని రాముని తల్లిగా భావించడం వలన భగవత్స్మరణా చేసినట్లయింది. అంతకాలే చ మామేవ స్మరన్....చనిపోతూ భగవత్స్మరణ చేయా లనే భగవద్వాక్యాన్ని తశరథుడు పాటించాడు. 'దశరథుని ఏ సంబంధమూ లేక జన్మించిన రాముని వలన దశరథునికి మోక్షం ఎలా రావాలి?' అని ఆలోచించిన భగవంతుడు దశరథునికి భగవచ్చింతని కల్గించాడు. పంచ జ్ఞానేంద్రియాలూ పని చేయకపోవడమే నిజమైన మరణమంటే.)

## 'అరాజకం' అంటే...

దశరథుని మరణవార్త గాలికంటె వేగంగా అయోధ్యలో ప్రాకిపోయింది.

కెరటాల్లేని సముద్రంలా , చల్లారిన కార్చిచ్చులా, పోరాడిపోరాడి ఆరిన యోధునిలా, కాంతిలేని సూర్యునిలా ఉన్న దశరథుని చుట్టూ అంతఃపుర స్త్రీలు రోదించసాగారు. "ఓ ! కైకమ్మా ! (కుబ్జానిమిత్తం కైకేయ్యా రాఘవాణాం కులం హతమ్- సకామా భవ కైకేయి ! భుంక్ష్వ రాజ్య మకంటకమ్ ॥) రాఘవవంశం నాశనమైంది. ఇక నీ కోరిక తీరిందిగా ! రాజ్యం మొత్తం ఏలుకో !" అంటూ కౌసల్య బిగ్గఱగా ఏడ్చింది.

ఇంతలో వశిష్ఠుడు, 'రాజుగా ఎవరిని నియమించాలి ?' అనే విషయానికై మంత్రి సమావేశం ఏర్పాటు చేసాడు.

'రాజు లేక పోయినా, ఉన్న రాజుపరిపాలన సక్రమంగా లేకున్నా దానిని 'అరాజకం అంటారు'- అని ప్రారంభించి మంత్రులంతా అరాజక లక్షణాలని ఇలా చెప్పారు.

"దేశం అరాజమైతే వర్షాలుండవు. ప్రజఎప్పుడూ వర్ష భయంతో ఉంటారు. పంటని గూర్చిన భయంతో ప్రతి సంవత్సరమూ భయపడుతూంటారు. ఎవరికి ఎవరూ తక్కువ కారనే అహంకారంతో పెద్ద - చిన్న భేదం లేకుండా ఉంటారు.
కొడుకులు తండ్రినీ, భార్య భర్తనీ, సామాన్యులు విద్వాంసులనీ గౌరవిం:
దేవాలయాలు జూదాలకి మందిరాలై పోతాయి. బ్రాహ్మణులు యజ్ఞాలని మానివేస్త
క్షత్రియులు వైశ్యులవలె వ్యాపారాల పైకి దృష్టి సారిస్తారు·దోపిడిదొంగలభయ
వైశ్యులు దూరదేశవ్యాపారాలకి పోరు. యతులలో జితేంద్రియత్వం ఉండదు. వ
రాత్రి ప్రయాణాలు కొనసాగిస్తారు. దేవాలయాలలో నైవేద్యాలు ఉండవు. ప్రజ
తీర్థయాత్రాద్వేషం పెరుగుతుంది. నృత్య - నాట్య - పుణ్య కథా లాపాలు పోం
వ్యాపార చింత, ధనార్జన మీదికి దృష్టి వెళ్లిపోతుంది. సంపన్నుడు కూడ ద
ద్రునివలె శ్రమిస్తూనే ఉంటాడు. లేక దరిద్రుడూ- ఉండి రాజూ- కొల్లగొట్టుకొ
పోతారేమోనని సంపన్నుడూ-విషాదంగా ఉంటారు. న్యాయాధిపతులు తమ పదవి
న్యాయం చేకూర్చరు. మాటనమ్మకాలు అసలుండవు సరికదా ! వ్రాతకోతలకూ
దిక్కుండదు. స్త్రీలకు దుష్టులవలన తఱుచుగా భయం కల్గుతుంది. ప్రజలు చేప లా

పులులు లాగా తమ జాతిని తామే ధ్వంసం చేసికొంటారు. నేరానికి శిక్ష ఉండదు. ఉన్నా తగినంత ఉండదు. దానితో నేరాలు అదుపులో ఉండవు. జనులలో సంప్రదాయ వ్యతిరేకతా, వేదధిక్కారమూ పెరిగిపోతుంది. (భారత రామాయణ భాగవతాలలో మూటిలోనూ రాబోయే కాలం ఎలా ఉంటుందో అది స్పష్టంగా చెప్పబడింది. ఇలా చెప్పగలగడానిక్కారణం ఆ రచయితలు వ్యాసవాల్మీకి మహర్షులు దైవజ్ఞులు కావడమే. 'దైవ - భవిష్యత్కాలమును (సామాన్య జనానికి తెలియనిది) జ్ఞ - తెలిసి చెప్పగలవారు' అని దైవజ్ఞ పదానికి అర్థం కాని' ఏదో సొమ్ము తీసికొని జాతకం చెప్పేవాడని అర్థం కానే కాదు. సరిగా నేటి పరిస్థితి రామాయణ కావ్యం ప్రకారం అరాజకమేమో ! ఆలోచించండి).

కాబట్టి రాజుగా ఒకరిని నిర్ణయించాలి' అని మంత్రులు అన్నారు. వెంటనే వశిష్ఠుడు సిద్ధార్థ - విజయ - జయంత - అశోక - నందన - అనే వారిని పిలిచి 'రాజకార్యం ఉన్నందున వశిష్ఠాజ్ఞ - మంత్రుల ఆదేశం ప్రకారం మీరు రావాలి' అని భరతుణ్ణి వెంట తెమ్మని చెప్పాడు. ('మా చాస్మై ప్రోషితం రామం మాచాస్మై పితరం మృతమ్ - భవంత శ్శంసిషు ర్గత్వా రాఘవాణా మిమం క్షయమ్') దూతలారా! రాముని అరణ్యగమనంగాని, దశరథ మరణం గాని అక్కడ చెప్పవద్దు.' అని కూడ స్పష్టంగా చెప్పాడు. సరిగా నేటికివారం క్రితంపట్టాభిషేకం-అదిఏర్పాటు చేసిన రాజు వారం రోజులకి రాజ మరణం ! ఏమాశ్చర్యం ? పిల్లలెవరూ దగ్గర లేని రాజశవాన్ని నూనెతొట్టెలో భద్రపరిచారు. (పిల్లలరాక కోసం తండ్రి శవాన్ని సంస్కారాలు చేయకుండా నిలుపడం రామాయణ కాలం నాటి ఆచారమే ?

## సహగమనమనే ఆచారం ఎప్పటిది?

దశరథుడు గతించాక నల్గురూ జీవించే ఉన్నారు గాని సహగమనాన్ని చేయలేదు. ఈశావాస్యోపనిషత్తు ఇలా చెప్పింది. 'తస్మా దుహనః పురాయుషః ప్రేయాత్· అసూర్యా నామ తే లోకా అంధేన తమసా వృతాః. తాం స్త్రీ ప్రేత్యాభిగచ్ఛంతి....' అని మనుస్మృతి. 'మృతే భర్తరి సాధ్వీ స్త్రీ బ్రహ్మచర్యవ్రతే స్థితా - స్వర్గం గచ్ఛత్యపుత్రాపి యథాతే బ్రహ్మచారిణః, అంది. 'భర్తపోయిన పిమ్మట బ్రహ్మచర్య దీక్షని అవలంబించే భార్య, సంతానం లేనిదైనా స్వర్గాన్ని పొందుతుంది' అని దీని

భావం. భారతంలో పాండురాజు పోగా మాద్రి సహగమనం చేసింది. దానికి కారణం పాండురాజుమరణానికి తానే బాధ్యురాలని భావించి. సహగమనం చేసిన మాద్రీ, చేయని కుంతీ సమానంగా స్వర్గానికి చేరుకున్నారని భారతమే ఇలా చెప్పింది. 'పాండురాజు వీఁడె బహురత్నఖచిత విమాన మెక్కి గొంతి మాద్రి తన యుపాంతభాగమున సుఖాసీనలుగ నాదు వలను వచ్చుచున్నవాఁడు. కంటె !(స్వర్గ 1/62) అని. మాద్రిని సహగమనం చేయవలసిందని ఎవరూ ప్రోత్సహించలేదు. 'నాకదియిమ్ము లెమ్ము కురునాథు మనః ప్రియ ధర్మపత్ని ! నే నేకత మెట్టు లుండెదు? 'మహేశుని తోడనఁబోదు' పుత్రులన్ జేకొని పెన్పు, నా పనుపుఁ జేయుము" అంటూ తానే అగ్నిలోకి దూకింది. శ్రీ కృష్ణునికి పిమ్మట రుక్మిణి చేసి నదీ ఇలాంటిదే. ఇలా ఇతిహాసపురాణాల్లో సహగమనం లేకపోగా, ఎక్కడో ఎవరో కల్పించిన ఈ ఆచారాన్ని పురాణాలకి అంటగట్టడం ఎంత నేరం ? రాజారామ మోహనరాయ్ అనే ఆయన సహగమనాన్ని రూపుమాపాడని చెప్పగానే గ్రుడ్డిగా నిజమని నమ్మిన యీ ప్రజ, యిది పురాణ కాలంనాటిది కాదంటే ఎందుకు నమ్మదు? అయినా పురాణకాలంనాడున్నంతటి పతిభక్తి, ఈయన ఈ దురాచారాన్ని మాన్ప డానికి వచ్చేనాటికి స్త్రీలలో ఉందా ? అయినా ఎంత పతిభక్తి ఉన్నా ఎవరిప్రాణాలు వారికి తీపి కదా ?) కాబట్టి సహగమనాలు ఎప్పుడూ లేవని సిద్ధాంతం. కొందఱు క్షత్రియ స్త్రీలు పౌరుషంతో, అవమానభారంతో అగ్నిలో దూకారు గాని అది సహగమనం కానేకాదు.

## భరతునికి దుస్స్వప్నం.

వశిష్ఠాజ్ఞ ప్రకారం దూతలు అపరతాల పర్వతానికి పడమరగా వెళ్లి ప్రలంబాద్రికి ఉత్తరవాయవ్యంగా ప్రయాణించి పై రెండు కొండల మధ్యనా ఉన్నమాలినీ నది వెంబడి హస్తినాపురం చేరి గంగ దాటి పశ్చిమంగా కురుదేశంలోని జాంగల దేశ మార్గంలో సాగి పాంచాలాన్నిదాటి శరదండా నదికి పడమట నిహాల వృక్షానికి ప్రదక్షిణం చేసి కుళింగపురం పోయి, అభికాళ గ్రామం దాటి బోధిభవన పర్వతం వద్ద ఇక్షుమతీ నది నీటిని త్రాగి బాహ్లీకదేశం చేరి సుదామ పర్వతాన్నీ విష్ణు పాదాలనీ దర్శించి, వశిష్ఠుడు పుత్రశోకంతో (విశ్వామిత్ర శాపకారణంగా) నదిలో దూకగా పాశాలని ఛేదించి ఒడ్డుకు చేర్చిన విపాశానదికి ఇంకా ముందు ముందుకు పోయి గుఱ్ఱాలు అలిసిన కారణంగా వాటిని అక్కడే విడిచి దూతలు నడిచి కేకయ

పట్టణమైన గిరివ్రజం చేరారు. (నందవ్రజం ఇదే అంటారు. శ్రీమద్రామాయణంలో ఉండే భూగోళవర్ణనా అద్భుతమైనదే. ఇన్ని దేశాలనీ, నదులనీ, దిక్కులనీ వర్ణించిన యీ విధానం నిజం కాకపోతే, కల్పనకి సాధ్యమా ? ఇప్పటి భూగోళవిధానానికీ సరిపోతూండడమే ఇతిహాసాలు జరిగాయనడానికి సజీవ సాక్ష్యాలు. మార్గాలు ఏ మాత్రమూలేని ఆ రోజుల్లో 8 రోజుల్లో అయోధ్యనుండి గిరివ్రజానికి దూతలు వెళ్లారంటే దేశభక్తి, కర్తవ్యం మీద బాధ్యతా బుద్ధీ వీనికి కారణాలు).

దూతలు తనవద్దకు రాబోయే రోజునే భరతునికి పీడకల వచ్చింది. అది కూడ తెలవారు జామున. దశరథుడు మానవ వస్త్రాలతో విరియబోసిన తలతో పేడమడుగులోకి దూకి నూనె అన్నాన్ని తిన్నట్లూ, చంద్రుడు నేలమీద పడ్డట్లూ, సముద్రాలు ఎండినట్లూ,....ఇలా కలలో అశుభసూచనలు గోచరించాయి. నల్లని పచ్చని స్త్రీలు దశరథుణ్ణి గాడిదల రథం మీద దక్షిణానికి తీసికొనిపోవడం వలన మరింత భయంకర దుస్స్వప్నమే అనేది భరతునికి అర్థమై, మిత్రులు - విదూషకులు గాయకులు ఎన్నెన్ని విధాల వినోదింపచేయాలని భావించినా భరతుడు తేరుకోలేక పోయాడు.

(శ్రీ మద్రామాయణంలో వచ్చిన స్వప్నాలు మూడే మూడు. ఒకటి దశరథునికి అయోధ్యలో వచ్చింది. తాను మరణిస్తాడనేది దాని సారాంశం. నిజమైంది. ఇక రెండవది గిరివ్రజంలో భరతునికి వచ్చింది. తండ్రి మరణిస్తాడనేది దాని సారాంశం. అదీ నిజం అయింది. మూడవది లంకలో త్రిజట అనే రాక్షసికి వచ్చింది. ఒక కోతి లంకని తగులబెడుతుందనీ, రావణుడు ఓడి, రాముడు రాజు కాగలడనేది దాని సారాంశం. అదీ నిజం అయింది. (అయితే ఎలాంటి కలలు నిజమౌతాయి ? కలలలో విధాలా — ఏ కాలంలో వచ్చినవి నిజమౌతాయి ? వంటి విశేషాలు నా సుందరకాండ వ్యాఖ్య మొదటి ముద్రణ 152 పుట, రెండవ ముద్రణ 113 పుటలోనూ చూడగలరు).

భరతుడు అలా దుఃఖిస్తూన్న కాలంలోనే అయోధ్య నుండి వచ్చిన దూతలు, యుధాజిత్తు- కేకయలకు కానుకలని అందించి, భరతుని వద్దకు వచ్చి నమస్కరించి కానుకలని ఇచ్చారు. భరతుడు, అయోధ్యలోని అందరి క్షేమాన్నీ పేరు పేరునా అడిగి తన తల్లిని గురించి ఇలా అన్నాడు. 'ఆత్మకామా సదా చండీ క్రోధనా

ప్రాజ్ఞమానినీ - అరోగా చాపి మే మాతా కైకేయీ కిముమాచ హ ?' అంతా తనకే రావాలని ఆశించేదీ, మహా భయంకరురాలూ, కోపమే స్వభావంగా కలదీ, అన్నీ తనకే తెలుసుననే అహంకారంతో ఉండేదీ అయిన నా తల్లి కైకమ్మ ఏమైనా చెప్పిందా ?.

(అయోధ్యలోని మిగిలిన అందరి క్షేమాన్నీ గూర్చి అడిగిన భరతుడు తన తల్లి క్షేమాన్ని అడుగకుండా 'అరోగా' - ఎప్పుడూ ఆరోగ్యంతో ఉండేది - అని తానే చెప్పాడు. అయోధ్యలోని ఎవరైనా ఏమైనా చెప్పారా ? అని అడగకుండా తన తల్లి కైకమ్మే ఏమైనా చెప్పమని అన్నదా ? అని అడిగాడు. ఆ తల్లి లక్షణాలని కూడ చాల కటువుగా చెప్పాడు. అసలు ఇలాటి లక్షణాలు ఏ తల్లికైనా ఉన్నా పుత్రుడు తనలోనే అనుకుంటాడు గాని పైకి అనడు. అందునా తన వద్ద పనిచేసే దూతల వద్ద (అన్ని ఊళ్లకీ వెళ్లే వాళ్లు) అసలు అనడు. 12 సంవత్సరాల నుండీ తాను మామయ్య తాతయ్యల ఇంటివద్ద ఉన్నకారణంగా తనతల్లిని గూర్చి దాచవలసిన పని లేదని భరతుడు భావించి ఉంటాడు. అదీ కాక ఏ వర్తమానమూ లేక హఠాత్తుగా దూతలు రావడం బట్టి కూడ ఏదో ఉపద్రవం వచ్చి ఉంటుందనీ దానికి కారణం తన తల్లియే అయ్యుంటుందనీ, దానికి కూడా కారణం అలాటి లక్షణాలే నని భరతుడు భావించి ఇలా అన్నాడు. భరతుడంతటివాడు తన తల్లిని గూర్చి దూతల వద్ద పలికేంతటి లక్షణాలు కైకమ్మకి ఉండడం బట్టే, దేవతలంతా రాముణ్ణి పంపించడానికి ఆమెయే తగినదని భావించి ఆమెలో ఈ బుద్ధిని మంథర ద్వారా ప్రేరేపించారు. అయోధ్యాజనం, దశరథుడూ కూడ, అంతతప్పూ కైకమీదికి నెట్టేసారు. లక్ష్మణుడు దశరథుణ్ణి దోషిగా నిశ్చయించాడు. సుమిత్ర - రాముడు మాత్రమే నిజాన్ని తెలిసినవాళ్లు కాబట్టి తప్పుకైకది కానే కాదని అన్నారు. భరద్వాజ మహర్షి కూడా ఇలాగే అన్నాడు. రాముని దైవకార్యాన్ని, తన పిల్లవాడే కాబట్టి కౌసల్య చేయదు. పరమాత్మ శక్తి ఉన్న సుమిత్ర దీనికి పనికిరాదు. ఇక ప్రజలందరికీ దేవరహస్యం బట్టబయలు కాకుండా ఉండేందుకై 'ఇలాంటి వరాలు కైకమ్మ తప్ప మరెవరు కోరగలరు ?' అని అందరూ అనుకొనే లక్షణాలున్న కైకమ్మనే దేవతలంతా దేవకార్యానికి ఆశ్రయించారు. కైకమ్మ ఇలాటిది కాబట్టే భామె సోదరుడైన యుధాజిత్తూ, తండ్రి కేకయూ కూడ ముందుగానే ఆలోచించుకుని

భరతశత్రుఘ్నులని తమ యింటికి తెచ్చేసారు. (రామునికే పట్టాభిషేకం కావాలనే ఉద్దేశ్యంతో - 9వ పుట చూడగలరు).

దూతలు భరతునితో 'శ్రీశ్చ త్వాం వృణుతే పద్మా యుజ్యతాం చాపి తే రథః - త్వరమాణశ్చ నిర్యాహి కృత్య మాత్యయికం త్వయా' 'భరతా ! అశేష మైన సంపద నిన్ను వరించబోతోంది. ఏ విధమైన జాగు చేయక రా ! అత్యంత ముఖ్యమైన కార్యం నువ్వు నిర్వహించాల్సి ఉంది' అన్నారు. (వివరంగా భరతుడు అడుగక పోవడానికి కారణం - వాళ్లు దూతలు.అంతకుమించివాళ్లకు తెలియకూడదు. తెలిసినా చెప్పకూడదు. వాళ్లని చెప్పమని నిర్బంధించడం రాజధర్మోల్లంఘనమే ఔతుంది. వశిష్ఠాదులు రమ్మన్నారు. తానెలాగూ బయలుదేరుతున్నాడు గదా ! అడిగి ప్రయోజన మేముంది ? అదీ కాక తన తల్లి గురించి ఏదో అశుభాన్ని ఆలోచి స్తూనే ఉన్నాడు. అదేదో ముందుగానే తెలిసికొని త్రోవంతా మనోవ్యథ పడడం దేనికి ? - భరతుని ఆలోచన ఇలా ఉంటే కేకయ యుధాజిత్తులు - దూతలు వచ్చిన వెంటనే భరతుణ్ణి ఏ ప్రశ్నలూ అడుగకుండా పంపించడానికి కారణాలు కైకమ్మ వలన ఏదో ఉపద్రవం వచ్చిందని ఊహించుకోవడమే. రాబోయే విషయాలని పశు - పక్షి - క్రిమికీటకాల భాషవలన తెలిసికొనగల శక్తి కేకయకి ఉందని కైక మ్మని నిందిస్తూ సుమంత్రుడే అన్నాడు అయోధ్యలో. అలాంటి కేకయకి యథార్థం తెలుసు కాబట్టీ, తన పుత్రుడు యుధాజిత్తుకి చెప్పి ఉంటాడు కాబట్టీ (అర్థమయ్యేలా పరోక్షంగా చెప్పి ఉంటాడు) ఈ యిద్దరూ వివరాలేమీ అడుగకుండానే భరతుణ్ణి పంపించేసారు. అయితే విషయం తెలియడానికై కేకయ, తన దూతలతో భరతుణ్ణి అయోధ్య వరకూ సాగనంపి రమ్మని ఆజ్ఞాపించాడు).

రథాలు ఒక్క-మాఱుగా కదిలాయి. విశ్రాంతి అనేది లేకుండా ప్రయాణిస్తూ ఉజ్జిహాన గ్రామం దగ్గఱ కడిమిచెట్ల తోపు వద్దకి వచ్చాయి. సైన్యం బాగా అలిసి పోయిందని గమనించిన భరతుడు 'అనుజ్ఞాప్యాథ భరతో వాహినీం త్వరితోయయౌ శత్రుఘ్నుణ్ణి సేనలతో మెల్లగా రావలసిందని ఆజ్ఞచేసి తాను వేగంగాపోయే రథంలో అయోధ్యకి బయలు దేరాడు. (తన వెంట కోట్ల కోట్ల విలువయిన కానుకలున్నా వాటిని తృణప్రాయంగా భరతుడు భావించడం, తాను రాజ్యాన్ని స్వీకరించబోననే దానికి నాందీవాక్యం వంటిది. ఇక కైకమ్మ నిజాన్ని నిజంగా మనసు విప్పి, తాను పుత్రుడు కాబట్టి తనకే చెప్తుంది. ఆ సమయంలో శత్రుఘ్నుడు ఉండడం అతనికి

ఇష్టం ఉన్నా, ఆమె కారణంగా ఇష్టమన్పించలేదు.ఇతడే కాక శత్రుఘ్నుడు ఆశ్లేషలో పుట్టినవాడు. దుడుకు స్వభావం, కోపం, బుసలు కొట్టే లక్షణం ఉన్నవాడు. పని చెడవచ్చు కూడ).

అయోధ్య చేరువౌతున్న కొద్దీ అశుభలక్షణాలు స్పష్టంగా గోచరించసాగాయి. జన సంచారం లేకపోవడం, దేవాలయ ఘంటికల మ్రోతలు వినబడకపోవడం, వీథులన్నీ మురికి పేరుకొని కన్పించడం, తమరథం కూడ, వైజయంత మనే పేరున్న ద్వారం గుండా నగరంలోనికి ప్రవేశిస్తూ ఉండడంతో 'సారథీ! కారణాలు చెప్పకుండా నన్ను తెచ్చారు. ఏదో అమంగళాన్ని నా మనస్సు శంకిస్తోంది. రాజ వినాశన లక్షణాలన్నీ కనబడుతున్నాయి' అంటూ రథం దిగి తండ్రి మందిరం లోనికి వెళ్లబోతూ మందిరపు బయటి పరిస్థితిని పరిశీలించి దుఃఖంతో లోనికివెళ్లాడు భరతుడు. (కిమహం త్వరయా ఽనీతః కారణాని వినాఽనఘ । అశుభాశంకి హృదయం శీలం చ పతతీవ మే॥ భరతుడు ఎన్ని మాటలు గుచ్చి గుచ్చి అడిగినా, కారణం తెలిసిన సారథి కారణాన్ని చెప్పకపోవడంలో, అతని రాజోద్యోగ నిర్వహణ దీక్ష - దక్షతా తెలుస్తాయి).

## ఇదంతా నీ కోసమే చేసాను!

లోపలికి వచ్చి పాదాభివందనం చేసిన భరతుడి నెత్తిని ముద్దాడి తన ఆసనంలోనే కూచోబెట్టుకుని 'నాయనా ! ప్రయాణం ఎన్నాళ్లు పట్టింది ? బాగా అలిసి పోయావా ? నీ మామయ్య - తాతయ్యలు క్షేమమా ? .... అంటూ కైకమ్మ· (సా తం మూర్ధ్న్యుపాఘ్రాయ పరిష్వజ్య యశస్వినమ్ - అంకే భరత మారోప్య ప్రష్టుం సముప చక్రమే అపి నాధ్వశ్రమః శీఘ్రం రథే నాపతత స్తవ ? ) భర్త పోయి ఏడువవలసి ఉండగా, భర్తమృతికి తానే కారణం అయ్యుండి కూడా, నిదానంగా ఇలా కైకమ్మ ప్రశ్నించడం కేవలం దైవమాయా విలాసం తప్ప మరేదీ కాదు - లోకంలో మరెవరైనా ఇలా కైకమ్మ పరిస్థితిలోఉంటేఇక్కడి కైకమ్మలా అసలు ప్రవర్తించనే ప్రవర్తించరు. ఇదే ఇక్కడి మహా విశేషం. ఈ దేవ మాయ వలన ఆమెకు కల్గిన ధైర్య మంతా ఆమెకు సహజంగా ఉండే లక్షణాలలో మరుగుపడిపోయింది.

'అమ్మా ! ముందుగా నాన్నకి నమస్కరించాలని భావించి వస్తే ఎక్కడా ఆయన కన్పడరేం ? (తమహం నాద్య పశ్యామి - ద్రష్టు మిచ్ఛ న్నిహాగతః.)' అంటూ తన అనుమానానికి సరైన ప్రశ్నని భరతుడు అడిగాడు. తనకి ఇష్టమైనదీ భరతునికీ ఇష్టమే ఔతుందని భావించిన కైకమ్మ, చాల సామాన్యంగా 'సర్వభూతా లకీ ఎలా మరణం గమ్యమో మీ తండ్రి అక్కడికే వెళ్లారయ్యా!' అంది. గొడ్డలితో నరికిన మద్దిచెట్టులా నేలను పడ్డ భరతుడు, రోగగ్రస్తమైన అశ్వంలా ఎన్ని మారులు నేలనుపడి చేతులు కొట్టుకుంటూ విలపించాడో ఆమె చూస్తూనే ఉంది. అతని శరీరాభరణాలు తెగుతున్నాయి. విలువయిన ముత్యాలు, కెంపులు నేలను దొర్లుతున్నాయి. శరీరం దుమ్ము కొట్టుకుపోతోంది. ముఖం ఎఱ్ఱబడిపోతోంది. నీళ్లతో కళ్లు కన్పడడం లేదు. 'తండ్రి గారు రాముణ్ణి అభిషేకిస్తూ పిలిచి ఉంటారు- లేదా - అభిషిక్తుడైన నా అన్న యాగాన్ని చేస్తూ పిలిచి ఉంటాడని భావించాను. ఏం జరిగింది ? అని ఎలుగెత్తి దుఃఖిస్తూ అడిగాడు. (ఈ ఘట్టంలోని శ్లోకాలు చాల ముఖ్యమైనవి. తం ప్రత్యువాచ కైకేయీ ప్రియవద్ఘోరమప్రియమ్ - అజానంతం ప్రజానంతీ రాజ్యలోభేన మోహితా॥ తల్లి కంటె ముందుగా తండ్రికి నమస్కరించా లని వచ్చిన భరతునికి (తం ప్రతి), కైకేయీ కైకమ్మ - ఎలాంటిది ? తనకే అంతా ఉండాలనుకొనే కోరిక (కామం) కలదీ, క్రోధమే స్వభావంగా కలదీ (క్రోధ నా) రాజ్యలోభం కలదీ, ఆ లోభగుణంతో మోహం ప్రవేశించినదీ, తన భర్త తనకి ఏమైనా ఇస్తాడనే అహంకారంతో మదించినదీ (మదగుణం), పట్ట మహిషి అయిన కౌసల్యయెడ మాత్సర్యం (అసూయ) కలదీ అయినకైకమ్మ, అజానంతమ్- దైవమాయ ఏ మాత్రం ఎఱుగని భరతునికి, ప్రజానంతీ - దైవమాయ ప్రకారం పట్టుతప్పక నడవడం బాగా తెలిసినది అయిన కైకమ్మ, తనకి ఇష్టమూ, వానికి అప్రియమూ అయిన పలుకులని చెప్పిందని భావం. 'యా గతి స్సర్వ భూతానాం తాం గతిం తే పితా గతః - రాజా మహాత్మా తేజస్వీ యాయజూక స్సతాం గతిః.' భరతా ! సతాంగతిః - దేవతలకి కూడా యుద్ధాలలో సహాయపడినవాడే అయినా, యాయజూకః - ఋశ్యశృంగుడంతటి వాణ్ణి తెచ్చి అశ్వమేధ - పుత్రకామేష్టియాగా లని నిర్వహించినవాడే అయినా, అంతాతేజస్సు నిండి ఉన్న రాముడే తనకు సర్వ స్వమై 'తేజస్వి' కూడా అయినా, ఆత్మా వై పుత్రనామాసి....అనే వేదమంత్రం

ప్రకారం (మహా+ఆత్మ) రాముణ్ణి ఉత్తమ పుత్రునిగా పొందినవాడే అయినా, సర్వ దేశాధీశులకీ రాజు కూడా అయినా ఈ వ్యవహారంలో 'నీ తండ్రిగానే' (భరతునికి రాజ్య విషయమైన చిక్కు విడదీయలేని తండ్రిగా) మరణించాడని శ్లోక భావం. ఇక భరతునికి రాజ్య కాంక్ష ఏ కోశంలోనూ లేదనడానికి 12 ఏండ్లు గిరివ్రజంలో ఉండడమూ, వచ్చి కూడ 'తండ్రి రామునికి పట్టాభిషేకం చేస్తున్నాడో లేక రాజైన రాముడు యాగం చేస్తున్నాడో నని వచ్చాను' అని అనడమూ సాక్ష్యాలు. (అభిషేక్ష్యతి రామన్ను రాజా యజ్ఞన్ను యక్ష్యతే. ఇత్యహం కృత సంకల్పో హృష్టో యాత్రా మయాసిషమ్.) తండ్రి చివరిమాటలు విందామని అడిగాడు. 'రాజా రామేతి విలపన్ హా సీతే! లక్ష్మణేతి చ స మహాత్మా పరంలోకం గతో మతిమతాం వరః' రామా ! సీతా ! లక్ష్మణా ! అంటూ ప్రాణాలు విడిచాడని కైకమ్మ చెప్తే, అందులో తన పేరు లేదనీ, తండ్రి తనని స్మరించ లేదనీ మరింత దుఃఖోద్విగ్నుడయ్యాడు భరతుడు. (మరణకాలంలో స్పష్టంగా భగవత్ స్మరణని దశరథుడు చేసాడనేదీ ఇక్కడి రహస్యం). తండ్రిగారు అలా ఎందుకు ఆక్రోశించారు ? అనగానే రాముని అరణ్యవాసగమనం, ఎందుకు వెళ్లారు ? అనగానే తానడిగిన కోరికలని దాచకుండా చెప్పిన కైక ఉత్తమురాలు కదా ? (స హి రాజసుతః పుత్ర చీరవాసా మహావనమ్-దండకాన్ సహ వైదేహ్యా లక్ష్మణానుచరో గతః. మయాతు పుత్ర శ్రుత్వైవం రామ స్యైవాభిషేచనం యాచితస్తే పితా రాజ్యం రామస్య చ వివాసనమ్' ఈ శ్లోకాలలో ఆమె నిజాన్ని నిర్భయంగా చెప్పడం, మంథరమీదికి నెట్టక పోవడం, రాజైన దశరథుడిచ్చిన వరాలనే అడిగానని తప్పించుకోకుండా సూటిగా మాట్లాడడం అనే ఇదంతా, తాను దైవ ప్రతినిధినని తనకుగా తాను తెలియక దైవరహస్యాన్ని రక్షిస్తున్నట్లుగా కూడ తెలియక, 'ఉన్నది ఉన్నట్లు మాట్లాడడమే' అని భావించాలి. ఎందుకిలా చేసావు ? అని భరతుడడిగితే 'తే' నీ కోసమేరా నాయనా ! అని బదులిచ్చిన ఇల్లాలు కైకమ్మ. దేవతల పని కోసం లోకనిందని మోసి, పుత్రునిచే కూడ అసహ్యించుకోబడిన పతివ్రత ఆమె.

## భరత నిర్ణయం.

ఏ కారణంతో రాముణ్ణి అడవులకి పంపావు ? నారబట్టలతో వాడు వెళ్లినా 'పాపాత్మురాలా !' నీకు దుఃఖం ఎందుకు లేదు ? నీ కోరిక, 'నేను రాజు కావ

డమే కదా !' దాన్ని తీర్చను. రామునికే- నీ మీద తల్లి వంటి గౌరవం లేకుండి ఉంటే- ఈపాటికి వెళ్లగొట్టి ఉండేవాణ్ణి. ఎప్పుడూ జ్యేష్ఠుడే రాజ్యంలో అభిషేకింప బడతాడనే విషయం తెలియని క్షత్రియ స్త్రీవి కాదు గదా నువ్వు ? పతివ్రతా, ఒక్కనికే తల్లీ అయిన కౌసల్యని దుఃఖపెట్టిన కారణంగా ఎప్పుడూ ఏడుస్తూ ఉండు. నరకానికి పో! అంటూ గుహలో సింహంలా గర్జిస్తూ నేలపడిన ఇంద్రధ్వజంలాగా, అనర్ఘమైన వస్త్రాభరణాలు విడివడిపోగా వట్టినేల మీద పడిపోయాడు భరతుడు. (అపాపదర్శనం శూరం కృతాత్మానం యశస్వినమ్ - ప్రవ్రాజ్య చీరవసనం కిన్ను పశ్యసి కారణమ్ ? ప్రస్థాప్య వనవాసాయ కథం పాపే ! న శోచసి ? అథవా మే భవే చ్ఛక్తిర్యోగై ర్బుద్ధిబలేన వా - సకామాం న కరిష్యామి త్వా మహం పుత్ర గర్ధినీమ్॥ న మే వికాంక్షా జాయేత త్యక్తుం వా పాపనిశ్చయామ్ - యది రామస్య నావేక్షా త్వయిస్యాన్మాతృ వత్సదా॥ సతతంరాజవృత్తే హిజ్యేష్ఠోరాజ్యేఽభిషేక్ష్యతే- రాజ్ఞామేతత్ సమం తత్స్యాత్ ఇక్ష్వాకూణాం విశేషతః॥ ఏకపుత్రా చ సాధ్వీచ వివ సేయం త్వయా కృతా - తస్మాత్త్వం సతతం దుఃఖం ప్రేత్యచేహ చ లప్స్యసే॥ సంరక్తనేత్రః శిథిలాంబర స్తథా విధూతసర్వాభరణఃపరంతపః బభూవభూమౌపతితో నృపాత్మజః శచీపతేః కేతు రివోత్సవక్షయే ॥) ఎన్నోవేల పుత్రులున్న కామధేనువే, భూలోకంలోని రెండు ఎద్దులు బండిని లాగలేక కర్షకునిచేతిలో మోదులు తిం టూంటే దుఃఖించిందని విన్నాను. ఒకే ఒక్క పుత్రుని తల్లి కౌసల్య, ఏమై పోతుంది ? (యస్యాఃపుత్ర సహస్రాణి సా శోచతి కామధుక్ - కిం పున ర్యా వినా రామం కౌసల్యా వర్తయిష్యతి ?

## ఎంత గొప్పవాడివి !

భరతుని రాక విని మంత్రులంతా వచ్చారు. తననే దోషిగా భావిస్తున్నారని భరతునికీ మరింత దుఃఖం కల్గింది 'ఓ! సభ్యులారా ! నేను శత్రుఘ్నునితో ఎంతో దూరంలో ఉన్నాను. నాకు ఏ పాపమూ తెలియదు. ఏమీ తెలియదు' అంటూ బోరున విలపించాడు. ఆ మాటలు విన్న కౌసల్య భరతుణ్ణి చూడాలని ఆ మందిరా నికి వచ్చి భరతుణ్ణి చూస్తూనే ఉక్రోషం ఆపుకోలేక 'భరతా ! లోలోపల రాజ్య కాంక్ష ఉన్న నీకు, శత్రువులెవరూ లేని రాజ్యాన్ని ఇదిగో ! ఈ దారుణవిధానం ప్రకారం నీ తల్లి తెచ్చి యిచ్చింది. అయినా నాయనా ! నీకు రాజ్యం వస్తే నాకేం

గాని, నా పుత్రుణ్ణి నారబట్టలతో అరణ్యానికి పంపి నీ తల్లి ఏ సుఖాన్ని పొందుతుందయ్యా ? నా పుత్రుడుంటే నీకూ అండకదా ? నా పుత్రుని అభిమానులంతా నీకూ విరోధులు కదా ! రాజ్యం యుద్ధంవలన రావాలి గాని ఇదా సాధించే పద్ధతి ? నాకు రాజ్యం వద్దే వద్దుగాని, నాయనా! - రాజైన నీకు నాదో ప్రార్థన ! స్వయంగా మమ్మల్ని రాముడి దగ్గఱకి తీసికొని పోయి అప్పగించి నీ రాజ్యం నువ్వేలుకో!' అంది.

భరతునకు సరైన సమయం వచ్చింది. దుఃఖం కట్టలు త్రెంచుకుంది అయోధ్యతోపాటు ఇతరదేశాలవారూ, అందఱూ వింటూండగా ఇలా పెద్దగా అఱిచాడు. 'అమ్మా! రాజ్యాన్ని లోలోపల ఆశించి రాముణ్ణి అడవులకి పంపాలని ఏ కోణాన ఆలోచించి ఉన్నా, అడవులకి పంపించినా ఇవిగో నా ప్రతిజ్ఞలు విను— నేను నిద్రపోతున్న గోవును తన్నిన బుద్ధిహీనునితో సమానం. సేవకులచేత పని చేయించుకుని ప్రతిఫలాన్ని ఎగవేసినవానితో సమానం. ప్రజలనుండి పన్నుని తీసికొంటూ సరిగా పాలించని రాజుతో సమానం. ధర్మప్రభువుకి ద్రోహం చేసిన వానితో సమానం. యజ్ఞానికి ఋత్విక్కులని పిలిచి నియమబద్ధంగా చేయించి ఆ మీదట దక్షిణలని ఎగవేసినవానితో సమానం. సంగ్రామ మధ్యంలో పాఱి వచ్చిన వానితో సమానం. పెళ్లాన్ని విడిచి పిల్లలకి తిండి పెట్టక తాను విందుచేసికొనే వానితో సమానం. మద్యాన్ని త్రాగి, జూదాలు ఆడే వానితో, ఇళ్లకు నిప్పుపెట్టే వానితో, లేగలకు పాలనీకుండా తానే పిదికికొని త్రాగే వానితో, ఇద్దఱిలో ఒకరికి గెలిచే ఉపాయాన్ని చెప్పి మఱొకరిని చంపించే వానితో, బిడ్డలు లేకలర్థాయుష్యంతో చనిపోయే వానితో సమానం....అంటూఇలాప్రతిజ్ఞలు (36)చేస్తూఅంతటిలోనూపిల్లవానిలా విలపించాడు. 'నాయనా! ధర్మం తప్పని నువ్వెంత గొప్పవాడివిరా ! ఉత్తమలోకాలు నీకు లభిస్తాయి' అని చేతులెత్తి ఆశీర్వదించిందిఆ తల్లి. (వనవాసం న జానామి రామస్యాహమ్మహాత్మనః। వివాసనం చ సౌమిత్రేః సీతాయాశ్చ యథాఽభవత్। తమహం ద్రష్టుమిచ్ఛామి భరతం దీర్ఘ దర్శినమ్ - ఇదంతే రాజ్యకామస్య ప్రాప్తం రాజ్య మకంటకమ్ - కైకేయీా కం గుణం తత్ర పశ్యతి క్రూరదర్శినీ - ప్రస్థాప్య చీరవసనం పుత్రం మే వనవాసినమ్ - కామం మే స్వయమేవాద్య తత్ర మాం నేతుమర్హసి - సంశ్రుత్య చ తపస్విభ్యః సత్రే వై యజ్ఞదక్షిణామ్ - తాం

విప్రలపతాం పాపం యస్యార్యోఽనుమతే గతః - దిష్ట్యా న చలితో ధర్మాదాత్మాతే సహలక్షణః (శుభ లక్ష్మణః) వత్స! సత్య ప్రతిజ్ఞో మే సతాం లోకా నవాప్స్యసి).

## స్త్రీ అయితే చాలు పూజ్యురాలే !

దశరథుని దహనసంస్కారమై 10 రోజుల అశౌచం (మైలు) కూడ అయిపోయింది. రాముని దగ్గఱకు పోయే ఉపాయాన్ని ఆలోచిస్తూన్న భరతునికి, గూని మంథరని నేలమీద పడేసి మోదబోతున్న శత్రుఘ్నుడు కన్పించాడు. ఎన్నెన్నో విలువైన హారాలనీ, చందనచర్చనీ చేసికొన్న మంథర, నడుముకి తాడు కట్టిన కోతిలా భరతునికి కన్పించింది. (వ్యక్తికి గుణం ప్రధానం కాని అందం కాదని వాల్మీకి ఎంత బాగా చెప్పాడు!) తన రామునికి అంత ద్రోహాన్ని చేసిన మంథర విషయంలో భరతుడు ఉదాసీనతని చూపలేదు. పరుగు పరుగునపోయి 'శత్రుఘ్నా! స్త్రీ అయితే పూజ్యురాలే ! స్త్రీని శిక్షించామని తెలిస్తే రాముడు మనతో మాట్లాడ నైనా మాట్లాడడని ఊరుకొన్నాను గాని చంపలేకనా ? విడువు' అన్నాడు. మంథర పెద్దగా అరుస్తూ కైకమ్మ పాదాలమీద పడిపోయింది. దశరథుడు పోయిన 14వ రోజున వశిష్ఠుడు రాజ్యాభిషేకానికి ఆనాడు చేసిన ఏర్పాట్లనన్నింటినీ సిద్ధంచేసి భరతునితో రాజ్యం స్వీకరించవలసిందని పలికాడు.

వెంటనే భరతుడు ఆ వస్తు ద్రవ్యాలనన్నింటినీ చూచాడు. ఆ పట్టాభిషేక ద్రవ్యాలన్నింటి చుట్టూ ప్రదక్షిణం చేసి సభ్యులందఱ నడుమా నిలబడి' నా తల్లి కోరికని నేను నెరవేరనీయను. అడవులలో నేనుంటాను. (వనే వత్స్యామ్యహం దుర్గే రామో రాజా భవిష్యతి) రాముడే మీకు రాజు' అని బిగ్గఱగా చెప్పాడు. (భరతునికి రాజ్యకాంక్ష లేదని వశిష్ఠునికి తెలుసు. కాని రాజ్యాభిషేకపు ఏర్పాట్లు చేసాక ఆ ఏర్పాట్లని చూచాక భరతుని ఆలోచనని గమనించాలని వశిష్ఠుని ఆలోచన. లోకంలో ముందుగా ఒక మాటని అని ఉన్నా, ఆ తర్వాత పశ్చాత్తాపదే వాళ్లని మనం చూస్తాం. భరతునికి మనసులోపలా, బయటా కూడా రాజ్యం మీద అభిప్రాయం లేదని వశిష్ఠునికి అర్థమయింది. పట్టాభిషేక వస్తు ద్రవ్యాలన్నింటినీ చూచి ప్రదక్షిణం చేయడానికి కారణం ఒకటే. ఆ సింహాసనమూ, కటకాలూ, కేయూరాలూ అన్నీ అందఱికీ కన్పిస్తూ ఉన్నా, భరతునికి మాత్రం వాటిని ధరించిన రాముడు వాటిలో కన్పిస్తున్నాడు. గుడిలోని వస్తువులన్నీ భగవంతునివే అయి

నట్లు పట్టాభిషేకపు అన్ని ద్రవ్యాలూ అతని సొత్తే - అని భరతుని భావం, ఇలాటి ఇతిహాసాలని చదివితే స్వార్థంతో గద్దెనెక్కి రాజ్యం చేయాలనే దుర్బుద్ధి తొలగుతుంది. (ఇమాహాపి హతాం కుబ్జాం యది జానాతి రాఘవః త్వాం చ మాం చ హి ధర్మాత్మా నాభిభాషయతే ధ్రువమ్ - అభిషేచనికం భాండం కృత్వా సర్వం ప్రదక్షిణం - భరత స్తం జనం సర్వం ప్రత్యువాచ ధృతవ్రతః - మేఖలాదామభిశ్చిత్రై రన్యైశ్చ శుభ భూషణైః బభాసే బహుభి ర్బద్ధా సూత్రబద్ధేవ వానరీ.) కుబ్జ పేరు మంథర. రామాయణంలోని అన్ని పాత్రల మనస్తత్వాలనీ మథనం చేసింది కాబట్టి ఇది మంథర. అందరి చరిత్రలనీ వంశవృత్తాంతాలనీ చెప్పిన వాల్మీకి, దీని వృత్తాంతాన్ని చెప్పకపోవడానికి కారణం శ్రీ మహావిష్ణువే తన పట్టాభిషేక భంగానికి ఏర్పాటుచేసికొన్న వస్తువులలో ఒకటి మంథర కాబట్టి. దీనిని గూర్చి చెప్తూ 'యతో జాతా' అన్నాడు. లోకంలో 'ఎక్కడ పుట్టిందో గాని, ఎప్పటి నుండి ఈ బుద్ధి పుట్టిందో గాని'....అనే మాటలని వింటూంటాం. అవి 'యతో జాతా'అనిన వాల్మీకి మాటలకి తెలుగు అనువాదాలే. మంథర, భగవత్కార్యాన్ని చేయించడానికి ఏర్పాటు చేయబడినదే. కాబట్టే దశరథుడు మంథరకి ఏ శిక్షనీ విధించలేదు. అలాటి ఆలోచనా ఎవరికీ రాలేదు. 'పొట్టి వాళ్లకి పుట్టెడు బుద్ధులు' అనే సామెత ఈ పాత్ర వలననే లోకానికి వచ్చింది. పాము కఱచిన తరువాత పాముని ఏం చేసినా రోగికి దాని వలన ప్రయోజనం లేనట్లు, మంథర గూర్చిన ఆలోచనరామాయణంలో కన్పించదు. కాటుతిన్న కైకమ్మకి ఎందఱు చేసిన చికిత్సా పనిచేయకపోవడమే కన్పిస్తుంది. మంథరని ఆడుకోతితో పోల్చాడు వాల్మీకి. "దేవతలంతా వానరరూపంలో రామునికి సహాయపడ్డట్లు ఈమె కూడా సహాయపడుతోంది సుమా! అందుకే రహస్యం బట్టబయలు అవుతుందని దీని వృత్తాంతం చెప్పను సుమా !" అని మనకి చెప్తూన్నట్లుగా మహర్షి దానిని గూర్చి 'యతోజాతా!' (ఎక్కడో పుట్టింది. చెప్పడం అనవసరం) అని తీసిపారవేసినట్లుగా మాట్లాడి ఎంతో విలువగా తీసికోవలసినదాన్నిగా చేసాడు. వైద్యుని వద్దకి, కాటు తిన్న వ్యక్తి వచ్చినట్లుగాకైకమ్మ చిత్రకూటానికి వచ్చింది గాని పామువంటి మంథర రానవసరం లేదు. రాలేదు కూడ).

## అవ్యక్తం - వ్యక్తం-లోఅర్థం

క్రియతాం శిల్పిభిః పంథా స్సమాని విషమాణి చ।
రక్షిణశ్చాను సంయాంతు పథి దుర్గ విచారకాః ॥

రాముణ్ణి చూడటానికి పోయి, అయోధ్యకు రాజుగా ఆహ్వానించాలని భరతుడు నిశ్చయించి అన్ని వృత్తులవారినీ పిలిచి వారివారి పనులని వారికి అప్పగించాడు. వడ్రంగులూ, శిల్పులూ, కమ్మరులూ, నూతులు త్రవ్వేవాళ్లూ, వాహనాలు మోసే వాళ్లూ, చెట్లుకొట్టే వాళ్లూ—ఇలా ఎవరిపనులు వారు ప్రారంభించి చిత్రకూటం వరకూ త్రోవని సిద్ధం చేసారు. ఇదంతా పైఅర్థం.

మహర్షులూ, సామాన్యులూ—ఇలా అందరూ కూడా కన్పించని పర బ్రహ్మాన్ని గూర్చి ఆరాధిస్తారు. అలా ఎన్నోవేల సంవత్సరాలు తపస్సు చేస్తే లభ్యమయ్యే పరబ్రహ్మం అవ్యక్తంగా (కన్పించనిది) ఉంటుంది. రాముడు వ్యక్తపర బ్రహ్మస్వరూపం, అంటే కన్పించే పరబ్రహ్మం ఆయన. ఇలా కన్పించే పరబ్రహ్మం చేరువలో ఉంటే, కన్పించని పరబ్రహ్మం కోసం ఎందుకు అన్నివేల సంవత్సరాలు శ్రమించాలి ? అని గమనించిన భరతుడు చిత్రకూటానికి ప్రయాణం కట్టాడు. 'స్వయం తీర్ణః పరాం స్తారయతి' తాను ఒడ్డెక్కి ఇతరులని దాటించాలి అని శాస్త్రం. తనకి ఈ రహస్యం తెలుసు కాబట్టి, వ్యక్తపరబ్రహ్మాన్ని ఆరాధించ డానికి అందరికీ అవకాశాన్ని కల్పించదలిచాడు భరతుడు. భక్తునికి ఉండవలసిన లక్షణం ఇదే. మహర్షి వాల్మీకి కూడ ఆచరించినది ఇదే. తాను ఏ రామ పర బ్రహ్మాన్ని దర్శించాడో ఆ పరబ్రహ్మాన్ని మనకి శ్రీమద్రామాయణం ద్వారా చూపిస్తూ అయోధ్యా ప్రజల వంటి మనకి భరతునివంటివాడయ్యాడు. ఇక్కడ మహోరహస్యం కూడ ఉంది. 'స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః' - ఎవరి ధర్మంతో వారు భగవదా రాధనం చేయడం ఉత్తమం -కానిది నిష్ప్రయోజనం అని. ఎవరివృత్తి ధర్మం ద్వారా వారు పరబ్రహ్మారాధనకి మార్గాన్ని చేసికోవచ్చు ననీ, అలా చేయడం సర్వోత్తమమనీ భరతుడు చెప్పిన మాట. దేవాలయం నిర్మించి తాపీవారూ, చెక్కపని చేసి వడ్రంగీ, ఇనుపపని చేసి కమ్మరీ, మంత్రపూర్వక ప్రతిష్ఠ చేసి బ్రాహ్మణుడూ, మంగళవాయిద్యాలని చేసి మంగళులూ, ఉత్సవమూర్తు లని ఊరేగించి రజకులూ—ఒక్కరేమిటి అందరూ సమాన భాగస్వాములు కావాలనే అద్భుత. ఐకమత్య, సర్వసామ్య వ్యవస్థా సూత్రం ఇందులో కన్పిస్తుంది.

ఈ పై శ్లోకంలో మరో విశేషమూ ఉంది. పట్టిగా ఆలయాలు నిర్మించి మార్గాన్ని పొందడం సాధ్యం కాదు. జీవితంలో కూడా పరబ్రహ్మారాధనని చేసే విధానాన్ని ఈ ఆజ్ఞలలో చెప్పాడు వాల్మీకి మహర్షి. 'న జాతిః కారణం లోకే గుణ ఏవ హి కారణమ్' అని రామానుజులు పలికి 'జాతికంటె గుణం ప్రధానమనిన మాటలని ఇక్కడ గుర్తుంచుకోవాలి.

## భరతుని ఆజ్ఞలూ - అంతరార్థాలూ.

రాముడు ఉన్న చిత్రకూటం వఱకూ మార్గం వేయవలసిందిగా భరతుడిచ్చిన ఆజ్ఞలలో వేదాంతధర్మం ఉంది.

1. ఎత్తులు త్రవ్వి నేల సమానంగా చేయండి. (గర్వాన్ని తగ్గించుకొని సమస్థితికి రండి). 2· పల్లాలని పూడ్చండి. (దుఃఖంతో క్రుంగిపోకుండా సమస్థితికి రండి) 3. నడిచేవారికి ముళ్లు గ్రుచ్చుకోకుండా కొట్టివేయండి. (తమ తమ శ్రేయస్సుకే హోమాలని చేయడం మాని, అందఱికీ క్షేమం కల్గించుకై 'సర్వేజనాః సుఖినో భవంతు' అని యాగాలు చేయండి) 4. ముళ్లని ఎన్ని విధాలుగా ఉన్నా సమూలంగా తొలగించండి. కామమూ-క్రోధమూ—అనిఈ తీరుగా అనేకవిధాలుగా ఉండి వ్యక్తి పతనానికి త్రోవ తీసేవానిని సమూలంగా మనస్సునుండితొలగించండి. 5. దుమ్ము రేగకుండా మార్గాన్ని సరిచేయండి. (మనస్సుమీద ఏ ప్రభావమూ పడకుండా తుడుచుకోండి)' 6· నునుపు - గరుకు దనాలు లేకుండా చేయండి. (సుఖ దుఃఖాలూ - రాగద్వేషాలూ - అహంకార మమకారాలూ - అని ఈ తీరుగ ఉండే ద్వంద్వాలని తొలగించండి). 7. వంతెనలు నిర్మించండి. (సంసారాన్ని అంటకుండా మీదుగా ప్రయాణించడం నేర్చుకోండి). 8. అక్కడక్కడ విడుదలని ఏర్పాటుచేయండి. (ఎప్పుడూ ధ్యానంలోనే ఉండడం కాక అప్పడప్పుడు విశ్రాంతి పొందడం నేర్చుకోండి) 9. మార్గాన్ని పరిశుభ్రంగా ఉంచండి. (మనస్సుని పరిశుద్ధం చేయండి) 10. పదిమందితో గుంపులు గుంపులుగా పొండి. (తనదొకే లోకం అనుకోక మీతోపాటు పదిమందినీ ఉద్ధరించేందుకు సామూహికంగా భగవదారాధన చేసికోండి). ఇలా ఈ ఆజ్ఞలన్నింటిలో ఉన్న తత్త్వం అతి విచిత్రమైనది. తపనయే భగవంతుడు. మనస్సే ఆయన నిలయం. మౌనమే ఆయన దర్శనానికి ప్రధాన ద్వారం. నిశ్చల దృష్టియే ఆయనవద్దకి చేర్చే వాహనం. ఏకాగ్రతయే

ఆయనని చూపే కన్ను. నిత్యస్మరణమే మోక్షం. మఱుపే నరకం. ఈ ఆజ్ఞలలో ఇంతటి తత్త్వం లేకపోయే పక్షంలో పురపాలక కార్యాలయం వారి ఆజ్ఞలకి వీటికీ భేదం లేనట్లే కదా ! అలాటి వాటిని వ్రాసి కాలాన్ని వ్యర్థ పుచ్చుకొనేంత అవివేకి వాల్మీకి కానేకాడు.

## ఛీ ! వశిష్ఠుడా !

చిత్రకూటానికి దాదాపు మార్గం సిద్ధం అయింది. భరతునికి పట్టాభిషేకం కోసం వశిష్ఠుడు ఆరాత్రి చేయవలసిన అన్ని ఏర్పాట్లూ చేసి మఱునాడు మంగళ ధ్వనులతో భరతుణ్ణి మేల్కొలిపాడు. భరతుడు ఆధ్వనులని ఆపివేయించాడు. పట్టాభిషేకానికి సాక్షులుగా ఉండదగిన అందరినీ పిలిచి ఆమీదట భరతశత్రుఘ్ను లకి వశిష్ఠునాహ్వానం పంపాడు. కొంతసేపటికి వచ్చిన భరతుణ్ణి కూర్చుండబెట్టి "భరతా ! చంద్రుడు లేక వెన్నెలలేదు. నీరులేని సముద్రాన్ని చూడలేదు. పంచ భూతాలు లేనిదే ప్రపంచం కానేకాదు. అలాగే రామునిపిమ్మట నీవు లేక ఇదిరాజ్యం అనిపించుకోదు. అయోధ్యకి రాజు లేడని తెలిస్తే ఇతరదేశాలనుండి అపాయం కల్గ వచ్చు. నీ అన్నమీది యిష్టం, ఈప్రజలకి కష్టాన్ని కల్గించరాదు.మీ తల్లి అడిగింది. తండ్రి కాదనలేదు. మౌనంగా అంగీకరించాడు. నేను విశేషించి చెప్తున్నాను. ఈ సభ ఆమోదిస్తోంది. కానుకలివిగో ! కాదనవద్దు" అన్నాడు.

'స బాష్పకలయా వాచా కలహంసస్వరో యువా - విలలాప సభామధ్యే జగర్హే చ పురోహితమ్ ॥

చేతులు పైకెత్తి వరుణజపం చేసే బ్రాహ్మణునిలా నిలబడ్డ భరతుడు బోరున ఏడుస్తూ వశిష్ఠుణ్ణి 'ఛీ !' అన్నాడు. (ఈ శ్లోకానికి చాల అర్థం ఉంది. సః - దశరథుని మరణం పిమ్మట రాజ్యాధికారం ఉన్నవాడూ, వశిష్ఠునం తటి నిచే - రాజుగా భరతుడుండవచ్చుననే అధికారాన్ని పొందిన వాడూ, యువా - వయస్సులో ఉండి ఎన్నోవేల సంవత్సరాల కాలం రాజరికాన్ని అనుభవించ గల అవకాశం ఉన్నవాడూ అయిన భరతుడు, కలహంస స్వరః - గొంతులో ఏ విధ మైన మార్పూ లేనివాడై, కంఠంలో సంశయం ఏ మాత్రమూ లేనివాడై బాష్ప కలయా వాచా - కన్నీటితో కలిసిన మాటతో, సభామధ్యే - ఎందఱెందఱో ఉన్న

సభలో రాజపుత్రుడైన తాను గౌరవంగా గంభీరంగా ఉండాలని తెలిసినా [illegible] ఎక్కువ - తక్కువ అధికారులున్న సభామధ్యంలో, విలాప- [illegible] చాడు. పురోహిత మ్ - రాబోయే శుభాన్ని చెప్పవలసినవాడు పురోహితుడైతే రాజ్యాన్ని తీసికొమ్మని పలికే వశిష్ఠుడు పురోహితుడౌతాడా ? అనుకుంటూ [illegible] పురోహితునిగా కన్పిస్తున్న వశిష్ఠుణ్ణి చూచి, జగన్నై చ - సభామధ్యంలో [illegible] ప్రశ్నకి సభామధ్యంలోనే సమాధాన మీయాలని భావించి, రాజ్యాన్ని [illegible] ఎన్నో కారణాలని చెప్పదలచి, తనని రాజ్య కాంక్ష కలవానిగా వశిష్ఠుడు భావించాడా ? అని తలుచుకుంటూ 'ఛీ' అన్నాడు భరతుడు.

రాముడు వనానికి వెళ్లిన దుఃఖంకంటె, తనకి రాజ్యం వస్తోందనే [illegible] ఎక్కువై భరతుడు ఛీ కొట్టాడు. పెద్దబిందెతో నీరు తెమ్మని పిల్లవాణ్ణి [illegible] ఆజ్ఞాపిస్తే, తేలేని బాలుడు ఛీ కొట్టినట్లు భరతుడూ ఛీ అన్నాడు.

రామాయణం. పోలికలు భారతంలో వ్యతిరేకదృష్టితో కన్పిస్తాయి.

| రామాయణం | భారతం |
| --- | --- |
| 1. ధర్మాన్ని (భరతుడు) తప్పను. | 1. ధర్మాన్ని తప్పుతాను.([illegible]) |
| 2. అన్నయైన రామునిదే రాజ్యం. | 2. తమ్ముడినైన నాదే రాజ్యం. |
| 3 నాకు రాజ్యమా ? | 3. పాండవులకు రాజ్యమా ? |
| 4. రామా ! నీదే రాజ్యం. నేను పుచ్చుకోను. | 4. ధర్మజా ! నాదే రాజ్యమని [illegible] పోనియ్యను. |
| 5. దశరథుడు తీసికోమన్నా రాజ్యాన్ని తీసికోను. | 5. విదురుడు చెప్పినా రాజ్యాన్ని ఇవ్వను. |
| 6. కైక మూలకారణం. | 6. ధృతరాష్ట్రుడు మూలకారణం. |
| 7. చిత్రకూటానికిపోయి రాజ్యాన్ని అప్పగించి వస్తాను. | 7. ఇక్కడికి వచ్చి అడిగినా రాజ్యాన్ని తిరిగి ఇవ్వం. |
| 8. 14 ఏళ్లూ రాజ్యాధికారం ఉంచే రాజధానిలో ఉండను. | 8. 13 ఏళ్లూ రాజ్యాధికారం [illegible] రాజధానిని వీడను. |

| | |
|---|---|
| 9. వద్దంటే రాజ్యాన్ని ఇస్తా రేమిటి ? తీసికోను. | 9. కావాలని తెచ్చుకొన్న రాజ్యాన్ని అడుగుతారేమిటి ? ఇవ్వను. |
| 10. ధర్మం ద్వారా లభించింది మాత్రమే రాజ్యం. | 10. రాజ్యం ఎలా వస్తే అది మాత్రమే ధర్మం. |

## కైకమ్మ చేసిన మంచి పని ఒకటే !

వశిష్ఠుడు ఇప్పటికి భరతునికి 2 పరీక్షలు పెట్టాడు. మొదటి పరీక్షలో పట్టాభిషేక ద్రవ్యాలకి ప్రదక్షిణం చేసి నెగ్గిన భరతుడు, రెండవ పరీక్షలో వశిష్ఠుణ్ణి ఛీ కొట్టి నెగ్గాడు. మొదటి పరీక్ష సమయంలో- ఉండవలసిన అందరూ లేరనీ, పైగా తండ్రిపోయిన దుఃఖంలో భరతుడున్నాడనీ కైకమ్మ భావించి, ఆకారణంగా భరతుడు రాజ్యానికి అంగీకరించలేదని- అనుకోవచ్చు. వశిష్ఠునికి భరతుడు రాజ్యం చేయడం ఇష్టం లేక, అలాటి కాలంలో ఇలాటి పరీక్షని పెట్టాడని ఆమె నిందించవచ్చు. ఆ విషయాన్ని ఆలోచించిన వశిష్ఠుడు మళ్లీ పరీక్షని ఈ నిందలకి తావు లేకుండా పెట్టి కైకమ్మకి ఎప్పుడూ సంశయం రాకుండా చేసాడు. (ఈ విషయం లౌకికంగా ఉండే ఆలోచన ప్రకారం చేసిందే తప్ప, నిజానికి కైక ఆధిదైవికమైన దృష్టి కలది).

'ఆనేదిష్యామి తు పై రామం హవ్యవాహ మివాధ్వరాత్ అహం త్వరణే వత్స్యామి వర్షాణి నవపంచ చ - జగామ మనసా రామం ధర్మజ్ఞో ధర్మకాంక్షయా' 'యజ్ఞంలోని అగ్నిహోత్రంలా అతి పవిత్రంగా రాముణ్ణి తెస్తాను. నేను అడవిలో 14 ఏండ్లూ ఉంటాను' అనేదే భరతుని నిర్ణయం.

భరతుని ఆలోచన ప్రకారం తన దేహమూ, ఆత్మాకూడా రాముని సొత్తులే. ('నేను నమస్కరిస్తున్నాను' అని అంటే దేహంతోనూ ఆత్మతోనూ కూడా చేయాలి. అదే నమస్కారమంటే. సాష్టాంగదండం శరీరంతోనూ, ఆత్మ ప్రదక్షిణ నమస్కారాలు ఆత్మతోనూ చేయబడతాయి కాబట్టే గుళ్లో ఈ రెంటినీ చేయిస్తారు). పెట్టెలో రత్నాన్ని ఉంచితే ఆ పెట్టె, రత్నాన్ని రక్షిస్తోందిగాని అంతమాత్రం చేత ఆ రత్నం పెట్టెది అయిపోదు. ఈ పెట్టె, ఆ రత్నమూ రెండూ ఒక యజమానికి సంబంధించినవే. పెట్టె స్వతంత్రంగా తెరుచుకుని రత్నాన్ని ఒకరికిచ్చెయ్యదు. రత్నం, తనంతతానుగా పెట్టి తెరిచి ఉన్నప్పుడు వెళ్లిపోనూపోదు. పెట్టెలోరత్నాన్ని

ఉంచి తాళం వేసి తాళం చెవులని యజమాని తనవద్ద ఉంచుకున్నట్లు, భద్రంగా ఉంచవలసిన ఆత్మని దేహమనే పెట్టెలో ఉంచి ఈ దేహాత్మల రెంటినీ పరమాత్మ రక్షిస్తూ ఉంటాడు. రత్నం ఉంటేనే ఆ పెట్టెకి రక్షణ అవసరం-విలువా-ఉంటాయి కూడ. భరతుని ఉద్దేశ్యం ప్రకారం తన దేహాత్మలు రెండూ రాముని సొత్తు. మరోమాటగా చెప్తే భరతుడు దేహం. శత్రుఘ్నుడు ఆత్మ. ఇక లౌకికంగా చూస్తే కూడా 1) రామునికి రాజ్యాన్ని - "ఎందరో కాదు" - అందరూ అంగీకరించారు. 2) తనకి రాజ్యం తన తల్లి బలవంతం వల్ల వచ్చింది. అది-'దశరథునికే కాదు'- ఎవ్వరికీ ఇష్టం లేనిది. 3) తప్పదని యిచ్చిన దశరథుడు- కైకని భార్యే కాద న్నాడు. భరతుణ్ణి విడిచానన్నాడు. తన మరణం పిమ్మట శ్రాద్ధం పెట్టే హక్కు లేదన్నాడు. 4) అదీకాక రాముణ్ణి రాజుగా ఉండవలసినదని చివరిలో చెప్పాడు. కైకమ్మ చేసిన మంచి పని ఒక్కటే. 'రాముని విషయంలో లక్ష్మణుని కంటె మించిన భక్తి ఉన్న భరతుణ్ణి కనడం.'

## శృంగిబేరపురపు కథా - రహస్యాలూ

రాముణ్ణి తీసికొనిరావడానికి 9000 ఏనుగులూ, 60, 000 ఆయుధధారులూ, లక్ష గుఱ్ఱాలూ...ఇలా బయలుదేరారు. భరతుడు ఒక్కసారి తేరిపార చూచాడు. ముందుగా కైకమ్మ రథం ఉంది. (లోకంలో తప్పు ఎవరైనా చేస్తే, వాళ్ల వెనకగా ఉంటారు. కాని కైకమ్మ జంకు ఏ మాత్రమూ లేకుండా బయలుదేరడాన్ని బట్టి చూస్తే, కైకమ్మ వ్యవహారమంతా దేవతల ఆలోచనమే అని అర్థంకాక మానదు). సైన్యం ఉత్సాహంతో బయలుదేరి గంగ ఒడ్డుకి చేరింది. గుహానికి అనుమానం కలిగి తన సైన్యాన్ని అప్రమత్తం చేశాడు. సుమంత్రుని ఆహ్వానం అందగానే భరతునివద్దకి సాదరంగా వచ్చి 'స్వామీ! నా దొక్కమాట. రాముడు ఎవరినీ నొప్పించే మనస్తత్వం కలవాడు కాడు. ఇంత సైన్యంతో మీరు వెళ్ళడం నాకుఏదో అనుమానాన్ని కలిగిస్తోంది' అన్నాడు. తనని గుహుడు అనుమానిస్తున్నందుకు లోలోపల దుఃఖించిన భరతుడు 'గుహా ! నన్ను అనుమానించకు. రాముడు నా పెద్ద అన్న. తండ్రి పిమ్మట తడే నా తండ్రి. 'ఒక్కడిమాటవిన్నావినకున్నా, ఇందటి మాటనీ కొట్టివేస్తావా ? అని ఇందటితో బయలుదేరాను' అన్నారు. 'అయాచితంగా వచ్చిన రాజ్యాన్ని విడుస్తూ, రాముణ్ణే ఆహ్వానిస్తున్న నీ కీర్తి శాశ్వతమౌతుంది.

నువ్వు ధన్యుడివి, అని గుహుడన్నాడు. (అడవిలోని వన్యమృగాల చరిత్రలే ఎరి
గినవాడు గుహుడు. రాజప్రాసాదాలలో ఉంటూ రాజవృత్తాంతాలనే తెలిసినవాడు భర
తుడు. ఇద్దరూ మాట్లాడుకునేందుకు సద్గుణ విషయం 'రామకథ'. 'సతాం ప్రసంగే
మమవీర్య సంవిదః భవంతి హృత్కర్ణ రసాయనాఃకథాః' అని భాగవతం అంటుంది
సజ్జనుల ప్రసంగంలో పరమాత్మ విషయాలే విన్పిస్తూ ఆనందదాయకాలు ఔతా
యట. మహాపండితుడైన వానికి - అక్షరజ్ఞానం లేని పామరునికి అనుసంధానం
పరమేశ్వర విషయమే ఔతుంది. 'ఆడవిమనిషివి! నీకు భాగవతం ఏం తెలుస్తుంది?'
అని తక్కువచేసి మాట్లాడరాదు. గుహాభరతులిద్దరూ క్రొత్తవాళ్లే అయినా,
ఒకరికొకరు మాటలాడుకొని గౌరవించుకున్న తీరు గమనిస్తే, దేశంలో సమైక్య
విధానానికి లోటుండదు.) అన్న గురించి ఆలోచిస్తూన్న భరతునికి జ్వరంవచ్చింది.
మంద నుండి చీలిన ఎద్దులా దుఃఖించసాగాడు. (చీలిన ఎద్దు, తన మందతో చేరా
లనే దుఃఖంతో ఉందని దాని మౌనాన్ని బట్టి తెలుస్తుంది. కానిఆమంద ఎక్కడిదో
అది చెప్పలేదు. మనం తీర్చలేం. ఆ దుఃఖం అలా తీరవలసిందే. తండ్రి దశరథుని
మరణం అనంతరం చేయవలసిన కర్మలకంటె, పరబ్రహ్మ అయిన రాముణ్ణి
తేవడం ముఖ్యం అని భరతుడు భావించడం వలన, కర్మకాండకంటె జ్ఞానం ముఖ్యం
అని గమనించాలి. నిత్యమూ లేచి పూజలు - పురస్కారాలు - కొబ్బరికాయలు -
నివేదనల కంటె భగవంతుణ్ణి గూర్చి తెలిసికోవాలనే తపనమూ - దాని కోసం
భగవంతునికి సంబంధించిన గ్రంథాలూ - ఉపన్యాసాలూ వంటి వానితో జీవితం
గడపడం సరియని తెలుస్తుంది. అలా అని కర్మని విడవాలని దీని అభిప్రాయం
కాదు. కర్మ శారీరకమైతే, జ్ఞానం ఆత్మకి సంబంధించినది కదా! దశరథునికి
చేయాల్సిన కర్మకాండల విస్మృత రాముణ్ణి భరతుడు దర్శించడానికి బయలుదేరిన
కారణంగానే, నేటికీ ఎవరైనా పోయాక కర్మలు ముగిసిన అనంతరం భగవద్దర్శనం
చేయిస్తారు. పూర్వకాలపు పుస్తకాలు ఏవీ కూడా, దుఃఖానికి పర్యవసానం మరణం
అని చెప్పవు. తన నడవడికమీదనే భయంకరమైన అపవాదు వస్తే దాన్ని తొల
గించుకొనేందుకు భరతుడు బయలుదేరాడు తప్ప, ఆత్మహత్యకు పాల్పడలేదు.
అలా అని అపనిందకు కారణమైన మంథరని హింసించనూలేదు. హింసింపించనూ
లేదు. అలా హింసిస్తే అది అదనపు నిందకి కారణం అవుతుంది. అదీ కాక
మంథరని హింసించినంత మాత్రాన తన అపవాదు తొలగదు కదా! పైగా నిజం
లేకపోతే "మంథరని ఎందుకు హింసించవలసివచ్చింది ?" అని కూడ ప్రజ అను

కానే అవకాశమూ కల్పించినట్లవుతుంది. 'విశ్రుతి భరతః'. రాజ్యాన్నే కాదు-వాని ముందు అపవాదుని కూడా భరించినవాడు కాబట్టి "భరతుడు" అన్నారు. రాముని వద్దకు వెడుతున్న భరతుణ్ణి అనుమానించి ప్రశ్నించిన గుహునిలో లోకక్షేమదృష్టి కన్పిస్తుంది. విద్య ఉన్నవాడే కాదు జాగ్రత్త లేనివానికి గుహుడు సాక్ష్యం. రాజరికానికి కావలసిన అర్హత 'లోకం క్షేమంగా ఉండే మార్గాలనే ఆలోచన' అనే విషయాన్ని గుహునిద్వారా మహర్షి తెలియచేసాడు. అపవాదువస్తే అంతకన్నా భయపడదగినది ముందు అని తెలిసినవాడు భరతుడు. కాబట్టే అతనికి జ్వరం - మూర్ఛ వచ్చాయి. అలా గని తొలగించుకొనే ప్రయత్నాన్ని మానలేదని కూడా గమనించాలి. రాజుకి వెళ్లే ఆహారాన్ని ముందుగా రాజవైద్యుడు పరిశీలించినట్లు రాముని వద్దకు వెళ్లే భరతుడు గుహుని పరీక్షకు గురి అయ్యాడు. రాముణ్ణించి వచ్చిన సుమంత్రుడూ రామునివద్దకి వెళ్ళబోతూ భరతుడూ పొందిన దుఃఖం ఎంతటిది ? అనే విషయాన్ని మహర్షి వర్ణించనే లేదు. జ్వరం - మూర్ఛ అనే పదాలతో చెప్పి వదిలాడు. ఆ దుఃఖం ఎందుకనే దాన్ని వివరించడానికి వాల్మీకి కూడ చాలడు. పదేపదే వర్ణించడం మహర్షికి ఇష్టం కానేకాదు. అత్యవస్థ లోకంలో సహజం ఈ దుఃఖం. రాముడు అరణ్యానికి వెళ్ళాడనగానే మానవులంతా దుఃఖించారు. ఇది చేతనదుఃఖం. ఇది సహజం. ఒక వ్యక్తికి కష్టం కలిగితే 'అయ్యో!' అని తోటివారంతా అంటారు. కాని రాముని కష్టానికి చెట్లు కాయలేదు. పూవులు పూయలేదు - అని ఇలా చెప్పడం బట్టి ఇది అచేతన దుఃఖం అని గమనించాలి. సీత అంటని చెట్టు తన దుఃఖాన్ని, ఎండిన కొమ్మద్వారా చెప్తుంది. విరబూయలేని పువ్వులదుఃఖాన్ని తొడిమెను ఉన్న కీటకం ద్వారా సూచిస్తుంది. ఇలా చెట్లూ చేమలూ దుఃఖించడానికి భగవన్నిర్ణయం కారణం. ఒక్క మనుష్యజాతిగాని, ఒక్క పశుపక్షి జాతిగాని దుఃఖించవచ్చు. అలా కాక 'ఈచేతన - అచేతన - స్థావర - జంగమ జాతులన్నీ దుఃఖించాయి' అంటే ఈ జగత్తంతా దైవవ్యవహారం అని గమనించుకోగలగాలి. భగవంతుని వద్దకు వెళ్లేందుకు ప్రత్యేకంగా అనుమతిని పొంది వెళ్ళనక్కరలేదనే దానికి నిదర్శనమే, భరతుడు రామునివద్దకు వెళ్ళడానికి ముందుగా కబురు పంపి అనుమతిని పొందకపోవడం. (కనీసం అలాంటి ఆలోచన కూడా లేదు). ఒక్కొక్క రామునికి సంగం కలుగుతోందనే భయంతో సుమంత్రుడు రాముని దగ్గరకు

గూర్చి గంగానది దాటేంతవరకు మాత్రమే దశరథుని వద్ద చెప్పాడు. భరద్వాజాశ్రమానికి వెళ్ళడం సుమంత్రునికి తెలియని విషయం కాదు. (తేషాం శశంసగంగాయామహ మాపృచ్ఛ్య రాఘవమ్). పోనీ భరతుడు అనుమతి లేక చిత్రకూటానికి వచ్చినా రాముడు ఇదేమిటని మందలించలేదు. సుమంత్రుడు రాముణ్ణి దింపి వచ్చాక కొంత మాత్రమే చెప్పి పూర్తిగా చెప్పలేకపోయాడంటే, ఆ చెప్పలేకపోవడం సుమంత్రునిది కాదు. వాల్మీకి మహర్షి ఆ బాధని తట్టుకోలేక-శ్లోకాలని వ్రాయలేక పోయాడని అర్థం. శివోఽహం - నేనే శివుణ్ణి అని లోకంలో అనడంవింటూంటాం. 'భగవంతుణ్ణి నేనే' అని భావించడమే శివోఽహం అంటే. అందుకే రాముడు వనవాసానికి వెడుతూ 7 రాత్రులు ఉపవసిస్తే, ఏ మాత్రపు అవసరమూ లేకున్నా సుమంత్రుడూ ఉపవసించాడు. భరతుడు మీది కాలంలో రామునిలా జడలూ, నారబట్టలూ ధరించబోతున్నాడు. (ధన్య స్త్వం న త్వయా తుల్యం పశ్యామి జగతీతలే అయత్నాదాగతం రాజ్యం య స్త్వం త్యక్తుమిహేచ్ఛసి ॥ కౌసల్యాచైవ రాజా చ తథైవ జననీ మమ నాశంసే యది జీవేయుః సర్వే తే శర్వరీ మిమామ్ ॥ రాజ్యే రామ మనిక్షిప్య పితామే వినశిష్యతి - సిద్ధార్థాః పితరం వృత్తం తస్మిన్కాలే హ్యుపస్థితే- ప్రేతకార్యేషు సర్వేషు సంస్కరిష్యంతి భూమిపమ్. భ్రాతా మే క్వావసద్రాత్రిం క్వ సీతా క్వ చ లక్షణః ?).

దశరథుడు మరణిస్తాడనీ భరతశత్రుఘ్నులే ప్రేతకార్యాలు చేస్తారనీ లక్ష్మణుడు శృంగిబేరపురంలో చెప్పాడు. అదే జరిగింది. సీతారామలక్ష్మణులు అయోధ్య విడిచాక మొదటగా నిద్రచేసినది శృంగిబేరపురంలోనే. అది కూడా గంగ ఒడ్డునే. నది ఒడ్డున ఉన్న స్థలాన్ని క్షేత్రం అనడానికి కారణం ఇదే. క్షేత్రంలో ఉపవాసం మరీ పుణ్యప్రదం అని చెప్పడానికి కారణం వారంతా ఆ రాత్రి ఉపవసించి పరుండడమే. జాగరణంచేయడం పుణ్యదాయకం అనడానికి కారణం సీతారాములునిద్రించి నప్పుడుగుహలక్ష్మణులు భగవంతుడైన రాముణ్ణి గూర్చి తలుచుకొంటూ ఉండడమే. రాత్రి రాత్రంతా అయిపోయిందిగాని లక్ష్మణుని దుఃఖం, రాముని చరిత్రం అయిపోలేదు. క్షేత్రవిధి ప్రకారం ఆచరించడం అనే సంప్రదాయమూ ఇక్కడిదే. కారణం భరతుడిక్కడే రామునిలా జడలు ధరించాడు.

### భరద్వాజాశ్రమ విశేషాలూ - రహస్యాలూ.

గుహుడివద్ద సెలవుతీసికొన్న భరతుని సైన్యంలో, కొందరు తెప్పలమీదా,

కొందఱు కుండలతోనూ, కొందఱు ఈదుతూ, కొందఱు ఏనుగులపైనా — ఇలా గంగ దాటారు. (భగవద్దర్శనానికి వెళ్ళే అందఱూ ఒకే స్థాయిలో ఉండరు. ఆ ఒడ్డు చేరడానికి నావలూ, తెప్పలూ, కుండలూ....ఇలా ఎన్నో సాధనాలని దాటడానికి ఉపయోగించారు. అందరి గమ్యమూ నదిని దాటి భగవద్దర్శనం చేయడమే. వేదాన్ని అభ్యసించిన పండితుడూ, కేవలస్తోత్రాలు మాత్రమే తెలిసినసామాన్యుడూ అక్షరజ్ఞానమే లేని పామరుడూ, ఎవరైనా పరమాత్మని — తమ తమకు తోచిన శక్తి వంచనలేని విధంగా ప్రయత్నించి - పొందగలరనే విశేషం ఈ దాటడంలో రహస్యంగా కన్పిస్తుంది. ఒక వస్తువుని పైకి ఎత్తడంలో ఏ వ్రేలుకి తగినంత సహాయం ఆ వ్రేలు చేస్తోందో, అలాగే తమతమ శక్తి మేఱకు ప్రయత్నంసాగించాలనే విశ్వజనీన విశేషం దీనిలో కన్పిస్తుంది).

గంగదాటి భరద్వాజ మహర్షి ఉండే ప్రయాగవనానికి మైత్రముహూర్తంలో భరతుణ్ణి బయలుదేరదీసాడు వశిష్ఠుడు. (మైత్రే ముహూర్తే ప్రయయౌ ప్రయాగ వన ముత్తమమ్ - రోజు 1కి 30 ఘడియలుంటాయి. ఘడియ అంటే 24ని॥ల కాలం సూర్యోదయం నుండి 6వ ఘడియ మైత్ర ముహూర్తం అవుతుంది. ఈ రోజు సూర్యోదయం 6. 06 ని॥లకు అయితే, 8.06 నుండి 8.30 వఱకు మైత్ర ముహూర్తమన్నమాట. 'భాగాధిక్యం చ మైత్రే స్యాత్' అనే జ్యోతిషసూత్రం బట్టి గౌరవమూ, సంపదా- ఈ ముహూర్తంలో మొదటిసారిగా ఏ పనికైనా ప్రయాణిస్తే- కల్గుతాయి. రాముణ్ణి రప్పించడం ఇష్టంలేని వశిష్ఠుడు, రాముడు రాడనికూడ భావించిన వశిష్ఠుడు, ఈ ముహూర్తాన్ని పెట్టాడు ప్రయాగవన ప్రయాణానికి, కాబట్టి భరతుడు రాజుగానే కొనసాగాలనీ, కొనసాగుతాడనీ వశిష్ఠునకు ఎప్పుడో తెలుసన్న మాట. ఎందరో జ్యోతిషికులు ఉన్నా పట్టాభిషేకం ఎలా తప్పిపోవాలో అలాటి ముహూర్తాన్ని నిశ్చయించి, రావణవధకి ముహూర్తాన్ని నిశ్చయించిన వాడూ ఈ వశిష్ఠుడే).

కుశలప్రశ్నలైన మరుక్షణం భరద్వాజుడు భరతుణ్ణి చూస్తూ, మీ అమ్మకు లొంగిన మీ తండ్రి, రాముణ్ణి వనాలకు పంపితే పంపి ఉండవచ్చుగాని, వనంలో ఉన్న ఆ అన్నదమ్ములకి అపకారం చేయడానికి నువ్వు ఇలా సైన్యంతో వెళ్ళ

వద్దని నా కోరిక. ఇది జగడు' (కచ్చిన్న తస్యాపాపస్య పాపం కర్తుమిహేచ్ఛసి అకంటకం భోక్తు మనా రాజ్యం తస్యానుజస్య చ) అన్నాడు.

భరతుడు ఒక్కసారిగా నేలకూలి దుఃఖిస్తూ 'త్రికాలజ్ఞులైన తామూ ఇలాగే భావిస్తున్నారా ? కైకకి పుత్రుడు కావటమేనా నే చేసిన దోషం ?' .... అంటూ రాముణ్ణి తేవడానికే తాను వెడుతూన్న విషయాన్ని వివరంగా చెప్పాడు భరతుడు.

'నాయనా ! నీ మనస్సు నాకు తెలుసు. అయినా తెలుసుకుందామనిఅడిగాను. నీ అన్న చిత్రకూటంలో ఉన్నాడుగాని రేపు వెడుదువు లే! ఈ రాత్రికి నీ మంత్రులతో ఇక్కడే ఉండు' అని ఆజ్ఞాపించాడు భరద్వాజుడు. (బంగారాన్ని కొనదలచిన ప్రతివ్యక్తి ఆ బంగారపు ముక్కని, గీటు రాతిపైన గీసి అటూ ఇటూ త్రిప్పుతూ అనేక పర్యాయాలు పరీక్షించినట్లు భరతుణ్ణి కౌసల్య - గుహుడు - ఇప్పుడు భరద్వాజుడూ- ఇలా ఎందరో పరీక్షిస్తున్నారు. 'జానన్ దశరథం వృత్తం న రాజాన ముదాహరన్' దశరథ మరణం గూర్చి కూడా తెలిసిన భరద్వాజుడు, ఆ విషయాన్ని భరతుడి దగ్గర ఎత్తలేదు. అలాగని భరతుడు చెప్పనూ లేదు. నీ మనసునాకుతెలిసినా నమ్మకం కోసం అడిగాను' అని అనిన భరద్వాజునికి, మీది కాలంలో మాత్రం రాముడు వస్తాడా ? రాడా అనే విషయం తెలియనిదా ? - ఇదే నిజమైతే పరీక్ష మాత్రం ఎందుకు పెట్టాలి ? అనుకోవచ్చు. ఇలా పరీక్ష పెడితే దాంట్లో భరతుడు నెగ్గిన కారణంగా ఆ నెగ్గిన విధం ప్రకారం, రామ రాజ్యాన్ని కోరుకోవడమే తనకి శ్రేయో హేతువనే విషయం స్పష్టంగా భరతునికి అర్థం కావాలి భరతుడు ఎలాగూ రాముణ్ణి తీసుకొని రాలేడని ముందుగా భరతునికి సూచించడానికీ, రాముడు రాకపోతే ఏం చేయాలో ఆలోచించుకోవడానికి కూడా అవకాశాన్ని ఇస్తూ 'రేపు వెళ్ల వచ్చు' అన్నాడు భరద్వాజుడు. ఈ విషయం తెలియనిగుహుడు మాత్రంతొందరగా వీరిని గంగ దాటించాడు.

తండ్రిపోయిన పిమ్మట ప్రేతకార్యాలు ముగిసిన వెంటనే భరతుడు బయలు దేరడానికి కారణం, కర్మ పూర్తికాకుండా పోరాదనే నియమం. కొన్నాళ్ల ఆగకుండా కర్మ ముగిసిన వెంటనే వెళ్లడానికున్నూ కారణం, ఎవ్వరైనా ఏమైనా కొన్నింటిని చెప్పి తనలో లేదా కౌసల్యా సుమిత్రలలో మార్పు తేవచ్చునని. వీటన్నింటి కంటె ముఖ్య కారణం 'ఆ రాజ్యం తనది కాదనేది ! '. ఎంతో తొందరగా బయలుదేరి

రాజ్యాన్ని రామునికి అప్పగించి, అస్తుతిప్పనవానిలా ఆనందపడాలని భరతుడు వెడుతూంటే 'రేపు వెళ్లవచ్చు' అని తీరుబడిగా భరద్వాజుడు పల్కడంలో కారణం, ముందనుకున్నట్లుగా రాముడు రెండు విధాలుగా నడుచు - మాట్లాడడని సూచించడానికే. ఇలాగే రాముణ్ణి, దశరథుడుండవలసిందిగా కోరితే ఆయన ఆగనేలేదు. భరతుడు ఆగిపోదలచాడు. ఋషులని ప్రార్థించే లక్షణం భరతునిది. ఋషులు ప్రార్థించే రూపం రామునిది. 'నేనుండమంటే నేనుండనని వెళ్లిన రాముడు నీ మాటమాత్రం వింటాడా?" అని అనే స్వభావం లేదు కాబట్టే భరద్వాజ మహర్షి రామునికి గౌరవపాత్రుడయ్యాడు. భరతునికి ఇప్పటి వరకూ అయోధ్యలో రాజలాంఛనాలు ఎలా ఉంటాయో ఆ విశేషాలు, 12 ఏండ్లుగా అతడు కేకయనగరంలో ఉండడం వలన తెలియవు. వాటిని ఇప్పుడే చూపిస్తే మనస్సులోని ఏ కోణంలో ఆ ఆలోచన ఉన్నా తనకి తెలుస్తుందనీ, ఈ పరివారమంతా కూడా గమనిస్తారనీ గమనించి భరద్వాజుడు సమస్త రాజసౌకర్యాలనీ ఆ రాత్రి తన తపశ్శక్తితో తన ఆశ్రమంలో ఏర్పాటు చేసాడు.

మయుడు గృహాలని నిర్మించాడు. యమవరుణ కుబేరులు సహాయపడ్డారు. తూర్పు పడమర నదులు అటుగా ప్రవహించసాగాయి. చూస్తూండగానే దేవలోకపు అప్సరసలు వచ్చారు. తంబుర నారదగానాలు ప్రారంభమయ్యాయి. ఎక్కడెక్కడి సువాసనల పూవులూ అక్కడ కన్పడ్డాయి. ఫల పుష్పవృక్షాలూ, సమతలమైన నేల, మధ్య మధ్య చలువమందిరాలూ, అక్కడే పీటికాసనాలూ, దివ్యవస్త్రాలూ, శిబికలూ....ఇలా ఒకటేమిటి ? క్షణాలలో అన్నీ అలా చిత్రం గీచినట్లు ప్రత్యక్షమయ్యాయి. ఇన్నిటినడుమ పెద్ద మందిరంలోని, మధ్యన విశాలమైన భవనంలో దివ్యసింహాసనం, పైన తెల్లని గొడుగూ చక్కని దీపకాంతిలో కన్పడ్డాయి. ఒక్కసారి భరతుడు ఆ పరివారాన్నీ, ఆ మందిరాన్నీ, ఆ సౌకర్యాలనీ చూచాడు.

'ఆసనం పూజయామాస రామాయాభిప్రణమ్య చ - వాలవ్యజన మాదాయ న్యషీదత్సచివాసనే' - భరతుడు చేతితో ఒక వింజామరాన్ని పట్టుకొని సింహాసనంలో రాముడున్నట్లు భావించి నమస్కరించి, మంత్రి కూర్చునే ఆసనంలో సింహాసన ప్రక్కగా కూర్చున్నాడు. సైనికులు మాత్రం ఆ సౌకర్యాలలో మునిగి తేలిపోయారు. భరద్వాజుడు ఆనందపడి భరతునికి రాముడున్న పర్ణశాలకు త్రోవచెప్పాడు. ఎలాగో మత్తు వదిలిన పరివారం బయలుదేరింది. (అనుమానం ఉన్న వ్యక్తిని అనేకులు ప్రశ్నించి విడిచినట్లుగా భరతుణ్ణి మహాత్ముడాయన పరీక్షించి విడిచాడు

భరద్వాజుడు. (హతో౽స్మి యది మామేవం భగవానపి మన్యతే- మత్తో న దోష మాశంకే నైవం మా మనుశాధి హి॥ త్వామి చైతన్యనస్తం తే ద్రక్షేకరణమ స్త్వితి అసౌ వసతి తే భ్రాతా చిత్రకూటే మహాగిరౌ - శ్వస్తు గంతాసి తం దేశం వసాద్య సహ మంత్రిభిః॥).

## ముగ్గురు రాణుల పరిచయం.

ఎండ కన్నెఱుగని కౌసల్యా సుమిత్ర కైకమ్మలు ముగ్గురూ వట్టినేలమీద పాదచారిణులై భరద్వాజునికి నమస్కరిస్తే భరద్వాజుడు వారిని పరిచయం చేయ వలసినదిగా భరతుణ్ణి అడిగాడు. (దీన్ని బట్టి భరతునికి వారి మీద గలఅభిప్రాయం తెలుస్తుంది గదా !)

'అయ్యో ! ఉపవాసాల వల్ల చిక్కిపోయి ధర్మదేవతలా కన్పిస్తున్న ఈమె కడుపున, అదితికి విష్ణువులా రాముడు జన్మించాడు. ఈమె కౌసల్య. ఈ తల్లి పడి పోకుండా గట్టిగా ఎడమభుజాన్ని పట్టుకొని, మనస్సు వికలమై పూలు రాలిన కొమ్మలా ఉన్న ఆ రెండవ ఆమె లక్ష్మణశత్రుఘ్నుల్ని కన్న సుమిత్రామాత. ఇక ఈ మొత్తం ఉపద్రవానికి కారణమూ, అహంకారస్వరూపిణీ, భర్త ప్రాణాలను తీసిన దుర్మార్గురాలూ - నాకు తల్లీ - కులపాంసనీ- ఆ మూడవ ఆమెకైక'-అంటూ పాములా బుసకొట్టసాగాడు భరతుడు.

రాముణ్ణి అరణ్యాలకి పంపడం వలన దేవతలకీ, మానవులకీ, రాక్షసులకీ, లోకానికంతకీ క్షేమం కలుగుతుంది. మీ తల్లి ని కైకను నిందించవద్దు. తప్పు పట్టవద్దు' అని భరద్వాజుడు చెప్పాడు. (ఏ రాముని దివ్య దర్శనం కోసం ఋషు లంతా తపించిపోతారో, ఎదురువచ్చి నమస్కరిస్తారో అలాంటి మహర్షులలో ఒక రైన భరద్వాజుడు మాత్రం రాముడు వచ్చాడని తెలిసినా తన తపస్సు నుండి లేచి ఎదురు రాలేదు - రాముడు కూడ ఆయనకై ఎదురుచూస్తూ ఆశ్రమప్రాంగణంలోనే నిలబడి ఉండిపోయాడంటే ఆయన గొప్పదనాన్ని గమనించాలి, కైకని నిందించ ద్దనే దైవరహస్యాన్ని రామునికంటె ముందు స్పష్టంగా చెప్పినవాడీయనే. ల్యా సుమిత్రలకు మాత్రమే తన పట్టాభిషేకవార్తని చెప్పినరాముడు.కైకమ్మకు కపోవడం, చెప్పాలని భావించకపోవడంలో కూడ దైవరహస్యం బట్టబయలు

కాదనే అభిప్రాయం దాగివుంది). (యామిమాం భగవన్ దీనాం శోకానశన కర్శి తామ్ - పితుర్హి మాహిషీం దేవీం దేవతామివ పశ్యసి - కౌసల్యా సుషువే రామం ధాతార మదితి ర్యథా॥ అస్యా వామభుజం శ్లిష్టా యైషా తిష్ఠతి దుర్మనాః - కర్ణి కారస్య శాఖేవ శీర్ణ పుష్పా వనాంతరే - ఇయం సుమిత్రా దుఃఖార్తా దేవీ రాజ్ఞశ్చ మధ్యమా ॥ మమైతాం మాతరం విద్ధి నృశంసాం పాపనిశ్చయాం యతో మూలం హి పశ్యామి వ్యసనం మహదాత్మనః - ఐశ్వర్యకామాం కైకేయీ మనార్యా మార్యరూపిణిమ్ ॥ దేవానాం దానవానాం చ ఋషీణాం భావితాత్మనాం - హితమేవ భవిష్యద్ధి రామప్రవ్రాజనాదిహ॥ న దోషేణావగంతవ్యా కైకేయీ భరత త్వయా ॥)

## భగవద్దర్శనం కావాలంటే...

ముందుగా నిర్వేదం(ప్రపంచ సంబంధం వద్దు అనేభావం) రావాలి. భరతదుఃఖం నిర్వేదమే. తర్వాత ప్రయత్నించాలి. మార్గాలు వేయించడమంటే ఇదే. తర్వాత మిత్రుడు బలపడాలి. గుహునిప్రోత్సాహం దీనికోసమే. ఆ మీదట ఆచార్యోప దేశం కావాలి. భరద్వాజుని మాటలు ఈ పనినే చేసాయి. మీదికాలంలో శిష్యుణ్ణి పరీక్షించాలి. భరద్వాజపరీక్షలోని అంతరర్థమిదే.

వ్యక్తినుదుటి భాగమే గంగ. ఆ విషయాన్ని సూచించడానికే 3 పాయలుగా 3 తెల్లని గీతలని బొట్టుగా ధరించడం. దీనికే మందాకిని (దుఃఖాన్ని తగ్గించగల శక్తి గలది.) అని పేరు. అక్కడి నుండి దక్షిణంగా, అంటే క్రిందికి ఒకేమార్గం ద్వారా (సుషుమ్నానాడి )పోతే 2 త్రోవలుంటాయన్నాడు భరద్వాజుడు. ఆ రెండు త్రోవలే ఇడ - పింగళ మార్గాలు. అని ఇలా చెప్పగలిగిన శక్తి భరద్వాజునికి (ద్వా - జ భర) మాత్రమే ఉంది. (ద్వాజ - రెండైన ఇడ పింగళల నుండి ఉద్భ వించిన ప్రాణాయామ శక్తిని, భర - భరించగలవాడు).

## రామ - లక్ష్మణ దృష్టి భేదం

దాదాపు అయోధ్య మొత్తం జనం, 9000 ఏనుగులూ, గుర్రాలూ ఒక సైన్యంగా వస్తూవుంటే ఆధ్వనికీ, రేగే దుమ్ముకీ, అడవిజంతువులు తిరిగి అరుస్తూ పరిగెత్తుతుపోతూంటే, పక్షులు ఎగిరిపోతూంటే లక్ష్మణుడు చెట్టెక్కి- గమనించాడు.

'అన్నా ! అగ్నిహోత్రాన్ని ఆర్పు. సీతని గుహలోదాచు. ఆయుధాన్ని ధరించు. కోవిదార ధ్వజం కన్పిస్తోంది. మనకి శత్రువు రానే వచ్చాడు. పరివారం, బంధువులనీ కైకమ్మతో కూడా వధిస్తా' అంటూ బిగ్గరగా అరిచాడు లక్ష్మణుడు. (సంప్రాప్తోఽయ మరిర్వీర భరతో వధ్య ఏవ మే. కైకేయీం చ వధిష్యామి సానుబంధాం సబాంధవామ్॥)· 'తమ్ముడూ! పొరపడ్డావు. అరణ్యానికి నేను వెళ్లానని తెలిసిన భరతుడు, స్వయంగా ఇక్కడికి వచ్చి ఉంటాడు. మన తండ్రిని ఒప్పించి నాకే పట్టం కట్టడానికి ఈ సైన్యాన్ని తెచ్చి ఉంటాడు. (కిమత్రధనుషా కార్యమసినా వా స చర్మణా ? మహేష్వాసే మహాప్రాజ్ఞే భరతే స్వయమాగతే ?)

అంతే కాదు. మననాన్న కూడ వస్తూ ఉంటాడు. అదిగో శత్రుంజయ ఏనుగుని చూడు' — అంటూ 'లక్ష్మణా ! దాని మీద ఛత్రం లేదురా ? తండ్రికి ఏమైనా.... అనే సంశయం కలుగుతోంది'(నతుపశ్యామి తచ్ఛత్రం, పాండురం లోక సత్కృతమ్ పితుర్దివ్యమ్) అంటూ మనసులో అధైర్యపడ్డాడు రాముడు. (ఒకే విషయాన్ని రాముడు చూచిన తీరులో, లక్ష్మణుడు ఆవేశపడిన రీతిలో భేదాన్ని గమనించాలి. లోకంలో ఇలాంటి వ్యక్తులుంటారని గమనింపజేయడానికే మహర్షి ఇంత విపులంగా వ్రాసాడు. రాముని దృష్టి మనకి ఉంటే, ఆవేశపడే లక్ష్మణులని కూడ త్రోవలోకితేగలం. లేనిపక్షంలోఉగ్రవాద సిద్ధాంతమే శరణ్యమై లోకం క్షోభపూరితం అయిపోతుంది.

## ఇక్కడి రహస్యాలు!

1) రామో ద్వి ర్నాభిభాషతే. వనానికి వెడుతున్నానని చెప్పాక అయోధ్యకు తిరిగి రాముడు రావాలంటే 14 సంవత్సరాల పిమ్మటనే. దీనిక్కారణం రామునికి రెండు మాటలు మాట్లాడడం రాదు. 2) 14 సంవత్సరాలలోగా రామునికి 'నప్రతిగ్రహణవ్రతం'(దేనినీ స్వీకరింపరాదు)ఉంది. కాబట్టి రాజ్యంఅంగీకరింపడు. 3) గుహుడు తెచ్చిన కానుకలని కూడా స్వీకరించనంతటి ధర్మవ్రతం రామునిది. 4) రాజు కాబట్టి పన్నుగానైనా గ్రహింపవచ్చుగా! అనుకుంటే రాముడు అందుకూ అంగీకరింపడు. కారణం, పన్నైతే కోసలదేశపు ఖజానాకు జమ చేయాలి గాని తాను స్వీకరింపరాదు. పైగా తాను ఇప్పుడు కోసలదేశపు వాడు కాదుగూడ.

5) గుహుడు పెట్టిన పండ్లనైనా స్వీకరింపవచ్చుగదా! అంటే తాను క్షేత్రోపవాస దీక్ష (గంగ ఒడ్డున ఉపవాసం)లో ఉన్నాడు. 6) రామునికి వనవాసం

5 విధాల ఇష్టం- i) లక్ష్మణునితో కలిసి ఉండచ్చు. ii) రాజకార్యాలు ఉండవు కాబట్టి సీతతో చక్కగా ఎడబాటు లేకుండే వీలుంటుంది. iii) గృహస్థుడుగా ఉండి కూడా మోక్షాన్ని పొందే వీలుందని నిరూపించవచ్చు. iv) నాన్నమాటని నెరవేర్చి ఆనందపఱచవచ్చు. v) భరతుని గొప్పదనాన్ని లోకానికి చాటవచ్చు. 7) భరతుడు తనమీదికి దండయాత్రకిరాడు. దానికి కారణం రాముడంటే భరతునికి గౌరవమే తప్ప ద్వేషం లేదు. ఒక వేళ ఉన్నా అతడు తమ్ముడు కాబట్టి 'అది తప్పు' అని చెపుతాడే తప్ప, తాను చిన్నవాని మీద ఆయుధాన్ని ప్రయోగించడు. పైగా భరతుడే చూడ్డానికి వచ్చే వాడైతే వశిష్ఠ - కౌసల్య - సుమిత్రలతో రాడు. చూడ్డానికి వచ్చే తీరు అది కాదు. పైగా వానప్రస్థంలో ఉన్న తన మీదికి, యుద్ధానికి రానేరాడు. దానికి వశిష్ఠుడు సారథ్యం చేయడు.

8) రాముణ్ణి చంపాలనే భరతుడు వస్తే, ఆ నింద దశరథుని మీదికి వెళ్తుంది. (అలా వనాలకి పంపినట్లు రాముణ్ణి పంపి, భరతుణ్ణి రాముని మీదికి దండయాత్రకి పంపించాడనే అపకీర్తి వస్తుంది). 9) తమ్ముడూ అన్నల మధ్య పోరాటంకాగా వచ్చిన రాజ్యం, రామునికి ఇష్టం కాదు. సౌభ్రాతృత్వం రాముని సిద్ధాంతం. 10) రాజ్యమే కావాలని భరతుడడిగితే ఆరాజ్యమేదో అయోధ్యలో ఈనాడూ సిద్ధంగానే ఉంది కాబట్టి, అసలు భరతుడు ఇక్కడిదాకా రా నవసరం లేదు. 11) రాజ్యానికి రాముడైన తాను అడ్డుపడితే భరతుడు చిత్రకూటానికి వచ్చాడనుకుంటే, అది సబబు గాని, రాజ్యం వద్దని అరణ్యాలకి వచ్చిన తనదగ్గఱకు భరతుడు వస్తున్నాడంటే యుద్ధానికి కానే కాదు.

12) ఇక అయోధ్యకి రమ్మని భరతుడే ప్రాధేయపడితే తానిచ్చిన మాట ప్రకారం 14 ఏండ్ల పిమ్మట రాక మానడు. 14 ఏండ్ల తర్వాత ఎలాగూ భరతుడు రానక్కఱలేదు. కారణం తానై అయోధ్యకు వెళ్లవచ్చు గనుక. 13) కాబట్టి తండ్రి దశరథుడే రాముణ్ణి (తనని) చూడాలని వస్తూ ఉండి ఉంటాడని రాముడు లక్ష్మణునికి తెల్పాడు. 14) నహీచ్ఛేయ మధర్మేణ శక్రత్వమపి లక్ష్మణ ! అధర్మంగా వచ్చిన ఇంద్రపదవి కూడా రామునికి గిట్టదనేది లోకవిదితమైన విషయం. 15) రాజ్యానికి రమ్మని అడగడానికే ఇందఱూ వెళ్లారా ? అంటే ఒక విషయాన్ని సాధించడానికి, ఒకరు అనుకూలంగా-ఒకరు ప్రతికూలంగా-వేరొకరు నయానా,

మహారాకరు భయూనా.... ఇలా ఎలా కార్యసాధన కోసం ప్రయత్నిస్తారో, అలా రాముణ్ణి రప్పించడానికి చేసే అన్ని ప్రయత్నాలకీ ఈ అందయూ వచ్చి ఉంటారు. 16) రాముడైన తాను అయోధ్యకి రానసేది వారికిబాధని కల్గించినా, ఇందరిని తాను చూడగల్గటం తనకి ఎంతో సంతోషకరమైంది. 17) ఇప్పుడు రాజ్యాన్ని కాదన డమూ, 24 సం॥ రాల పిమ్మట రాజ్యానికి రాదలచడమూ - అనే ఈ రెండూ ధర్మ రక్షణం కోసమే.

18) భరతుణ్ణి నిందించే లక్ష్మణా ! నీకు నిందించడం అనే అలవాటుంటే రేపు నన్ను మాత్రం నిందించక ఉరుకుంటావా ? కాబట్టి భరతుణ్ణి తిడితే 'నామీద ఒట్టే' అన్నాడు రాముడు. లక్ష్మణుణ్ణి నిందించడం, లక్ష్మణుణ్ణి తన దగ్గరకు చేర్చు కోవడమేనన్న మాట. 19) ఒకప్పుడు కైకమ్మని - పిమ్మట తండ్రిని - ఇప్పుడు భరతుణ్ణి - ఇలా నింద నీకు అలవాటయితే ఈ నిందలన్నిటినీ రాముడే చేయిస్తు న్నాడని తనని (రాముని) అంటారు. అది నిజం కానేకాదు కాబట్టి నిందించవద్దు.

20) దశరథునికీ, రాముడైన తనకీ రాజ్యమనే అడ్డుగోడ ఉందని తండ్రి భావించినా, సీతని చూడడానికి ఆయన వస్తూ ఉండవచ్చుని కూడ రాముడు భావిం చాడు. 21) ప్రాప్త కాలం యదేషోఽస్మాన్ భరతో ద్రష్టు మిచ్ఛతి - అస్మాసు మనసా హ్యేష నా ప్రియం కించిదాచరేత్॥- ఇక్ష్వాకుల నుండి రాజ్యం దశరథునికి వచ్చింది. అది పట్టాభిషేకపు నిర్ణయం ద్వారా రామునికి చేరింది. తగిన హోమాలు పూర్తికావడం వలన కూడా రాజ్యం రామునికి చేరింది. అయితే ఆ రాజ్యాన్ని రాముడంగీకరించి ఉండలేదు. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చినా, దాన్ని పై అధికారి ఆమోదించేంతవరకూ పదవిలోఉన్నట్లే.దశరథుడు రాజ్యాన్నిచ్చినా,రాముడు వద్దన్న ఆ దరఖాస్తు,ఇంకా ఆమోదం పొందలేదు. రాముని కోరికపై భరతుడు అంగీకరిస్తే, ఆమోదం పొందలేదనే చిక్కు రాముని విషయంలో తొలగిపోతుంది.

భరతుడు స్వయంగా వచ్చేది రాముడిచ్చిన తిరస్కారపత్రాన్ని ఆయన చేతనేఉపసంహరింపచేయడానికి. ఈ ప్రజలంతా ఈయనను ఒప్పించడానికీను.అయితే లక్ష్మణుడు దీనిని వేరువిధంగా భావించాడు. కారణాలు బాల్యమూ - వ్యవహార రాన్యతా కూడ. 22) రామునికి దశరథుడు రాజ్యాన్నీయ దలచి 'కొంత ఉప దేశాన్ని' చేసాడు, తానుకూడ భరతునకు ఈ 'ఉపదేశాన్ని' చేయవలసి ఉండగా,

భరతుడు రానేలేదు. తానా?-పట్టణంలోనికి (రాముడు)వెళ్లరాడు.ఎలాగా ?అనిఆలోచి స్తూంటే రాముడే అన్నాడు 'ప్రాప్తకాలం.... కించిదాచరేత్' అని. భరతుడెలాగూ వస్తున్నాడని తెలిసి ఆ ఉపదేశాన్ని చేసేయవచ్చుననే ఉద్దేశ్యంతోనే సంతోషించాడు పరమాత్మ.

22) భరతుడు అయోధ్య నుండి పోకపోతే రాజ్యలోభం అంటారు అలాగే రాముడుఅయోధ్యకి వస్తానంటే రాజ్యలోభ మంటారు. ఇద్దఱూ రాజ్యలుబ్ధులుకారని వశిష్ఠుడు తేల్చివేసాడు.

## రామ భరత సమాగమం.

ఎత్తైన చెట్లకి ఉన్న నారచేలికలు త్రోవ తెలియడం కోసమైన గుర్తులుగా కన్పిస్తున్నాయి. తడి బట్టల నీటి చారలు ఆశ్రమాలున్నాయని చెప్తున్నాయి. అటూ ఇటూ పేడపిడుకలు, చలికాచుకొనేందుకు కన్పిస్తున్నాయి. చెట్లపై ఆరవేసిన నార బట్టలు ఆశ్రమాల జాడ చెప్తున్నాయి. భరతుడు నడుముకి ఉత్తరీయం కట్టుకొని వెడుతూంటే గుహసుమంత్రులు అనుసరించారు. (భగవద్దర్శనానికి ఇంత తపనా, కష్టమూ పడితే కానీ ఆనందం ఉండదు. అతి సుఖప్రయాణం చేసి అరక్షణంలో తిరుమల వేంకటేశ్వరుని దర్శనం చేసిన దానికీ, ఎదురు చూపులతో దర్శించి వచ్చి నదానికీ భేదం ఎంత ఉంటుందో తెలియాలి). (దదర్శ మహతీం పుణ్యాం పర్ణ శాలాం మనోరమామ్ - సాలతాలాశ్వకర్ణానాం పర్ణైర్బహుభి రావృతామ్)॥

ఇంతగా ఎదురుచూచిన ఆ పర్ణశాల మనోరమంగానూ, పుణ్యం మూర్తీభ వించినట్లుగానూ కన్పించింది. మద్ది ఆకులపై తాటి ఆకులూ, ఆపైన మినుమద్ది ఆకులని కప్పుగా వేసారు పర్ణశాలకి. (మద్ది ఆకు, నీటిని లోపలికి రానీ యదు. తాటి ఆకు చల్లదనాన్ని లోనికి పంపుతుంది. మినుమద్ది ఆకు, తాను తొంద రగా ఎండక, క్రిందనున్న తాటి ఆకు పచ్చిదనాన్ని ఎండనీయకుండా చేస్తుంది. ఆకులనేత బాగా చిక్కగా ఉండడం వలన చలిబాధ ఉండదు. మినుమద్ది వాసన వలన పురుగు దరిచేరదు. కప్పు బరువు కారణంగా అడవులలో తఱచుగా వచ్చే తీవ్ర వేగవాయువుకి పర్ణశాల ఏమీ నష్టపోదు).

ఈశాన్యంలో పల్లంలో అగ్నివేదీ, ఆశ్రమం నిండుగా దర్భలూ, ఎక్కడ చూచినా ప్రశాంతతా, చూడగానే రెండు పెద్ద పాములులా వ్రేలాడే ధనుస్సులూ,

దానికి సరిపోయిన బాణాలూ, కవచాలూ, అంగుళీత్రాణాలూ—కన్పించాయి. (రాముడు తాపసుడా ? యుద్ధం చేయబోయే సైనికుడా ? ఆరణ్యకాండలో గాని ఈ రహస్యం పూర్తిగా తెలియదు. రావణాసురవధకి సైనికుడిలా వెడుతూ, రావణవధకి కావలసిన తపశ్శక్తిని సంపాదించదలచిన తాపసుడాయన. విశ్వామిత్రుడిచ్చిన మంత్ర మన నాన్ని చేసేందుకు ఈ 14 ఏండ్ల కాలాన్ని ఆయన వినియోగించుకోదలిచాడు). 'తంతు కృష్ణాజినధరం చీరవల్కలవాససమ్ - ఉట జే రామమాసీనం జటామండల ధారిణమ్'.

పెలలేని ఆభరణాలనిధరించే రాముడు నల్లని జింకతోలు కప్పుకొని ఉన్నాడు. మణిమయమైన ఆసనం బదులు దర్భలే అతనికి సింహాసనంగా ఉన్నాయి. మితిలేని సుగంధ పుష్పాలతో నిండిన తలపై ఉండే కిరీటం స్థానంలో జడలు కన్పిస్తున్నాయి. చిక్కని చందనపు పూత లేదు సరికదా, ఎండతీవ్రతకు మాడిన శరీరం ఎఱుపునలు పులు కలిసి కన్పిస్తోంది. ఎందఱి మధ్యలోనో ఉండవలసిన రాముడు, దుఃఖిస్తూన్న సీతాలక్ష్మణులతో మాత్రమే కన్పిస్తున్నాడు. అయితే ఇలా ఉన్న రాముడే అను గ్రహ దాత ఔతాడు. అలాంటి రాముణ్ణి తేరిపారచూచి 'ఉక్త్వార్యేతి సకృద్దీనం పున్నర్నోవా చ కించన' 'ఆర్యా !' అని దీనాతిదీనంగా భరతుడు పలికి మఱి మాట్లాడలేకపోయాడు. (ఇలాటి కష్టస్థితిలో రాముడు ఉన్నాడు గదా ! అని భరతుడు తలచుకొని దుఃఖించాడని అక్కడి వారనుకున్నారు. కాని కారణం అదికాదు. దర్భల మీద కూర్చోవడం, జటలని ధరించడం, నారబట్ట, కృష్ణాజినాలని ధరిం చడమనేవి- గ్రామం లేదా నగరప్రవేశం చేయరాదని తెల్పే దీక్షని సూచిస్తాయి. దీనితో- రాముణ్ణి రమ్మని అడిగినా, రాముడు ఏం చెప్పబోతున్నాడనే ఫలితం భర తునికి తెలిసిపోయింది. ఆ కారణంగా 'ఆర్యా!' అని మాట పల్కలేక పోయాడు. (దివాకరశ్చైవ నిశాకరశ్చ యథాంబరే శుక్రబృహస్పతి భ్యామ్ -సర్వేఽప్యభ్రుణ్య ముంచన్ ప్రవిహాయ హర్ష మ్॥).

రామలక్ష్మణులు సూర్యచంద్రులులాగానూ, గుహసుమంత్రులు శుక్రబృహ స్పతులులాగానూ కన్పించగానే అందరూ కన్నీళ్లు పెట్టారు. (జ్యోతిషం ప్రకారం రవి శుక్రునితోనూ, చంద్రుడు బృహస్పతితోనూ కలిస్తే ఫలం వర్షం. వాల్మీకంలో చాల సందర్భాలలో జ్యోతిషం కన్పిస్తుంది. 'శశినం రోహిణీయథా'. రాముని

వెంట సీతమ్మ, చంద్రుని వెంట రోహిణిలా వెళ్ళిందని వాల్మీకి వ్రాసాడు. (రోహిణీ నక్షత్రం వృషభరాశికి చెందినది. చంద్రునికి వృషభం ఉచ్చస్థానం. అందుచేత. రాముని వెంట సీత వెళ్ళినందువలన, సీతకంటే రామునికే గొప్పతనం ఏర్పడుతుందని భావం).

జటిలం చీరవసనం ప్రాంజలిం పతితం భువి - దదర్శ రామో దుర్దర్శం యుగాంతేభాస్కరం యథా॥ రాముని పాదాలపై ఒక్కసారిగా పడిపోయాడు భరతుడు. రాముడుభరతుణ్ణి అలా పరిశీలించాడు. (జటిలమ్) ఎప్పుడూ తలంటిపోసి దువ్వినట్టుగా ఉండే కురులు కలవాడూ, దశరథుని ప్రియురాలి కొడుకు [illegible] పుష్పమాలికలని ధరించే కురులున్నవాడూ జడలని ధరించాడా ? - (చీరవసనమ్) యుద్ధానికి వెళ్ళినా పట్టువస్త్రాలని దశరథుడు వీనికోసం తెచ్చేవాడు. [illegible] లని ఎన్నో ఆటబుపట్టించి గాని అంతవిలువైన పట్టవస్త్రాలని ధరించేవాడు కాడు భరతుడు. అలాటి వాడు నారబట్టలలో ఉన్నాడా ? (ప్రాంజలిమ్) ఎప్పుడూ నమస్కరించే జనుల మధ్యలో వెలిగిపోతూండే భరతుడు, తానునమస్కరిస్తూ [illegible] చేసే విప్రునిలా కన్పిస్తున్నాడా ?

(పతితం భువి) 1) తన గుణాల వలన దివికి వెళ్ళి ఉండవలసిన వాడైనప్పటికీ భువిలోనే ఉన్నాడా ? 2) తల్లి చేసిన లౌకికమైన అపరాధం వల్ల లోకంలో పతితునిగా లెక్కించబడుతున్నాడా ? 3) ధర్మాచరణంలో తనని కూడ పతితుణ్ణి (తక్కువస్థాయి వాణ్ణి) చేస్తూ భరతుడున్నాడా ? (రామః) అందరినీ ఆనంద పఱచేవాడు రాముడైతే, భరతుణ్ణిమాత్రం ఈ [illegible] దలిచాడా ? (దుర్దర్శమ్) ధర్మపరిపాలనంలో తనకి కూడ చూడశక్యం గానివాడా ఉన్నాడా ? (యుగాంతే భాస్కరం యథా) ప్రళయకాలంలో సూర్యుడు మరోమాఱు మళ్ళీ ఉదయించినట్లు, రాజ్యాన్ని తాత్కాలికంగా అనిష్టంగా ధరించబోతున్నాడా ? అలాటి భరతుణ్ణి ఇన్ని మానసికమైన ఊహలతో రాముడు (దదర్శ) చూసాడు. భరతుని గొప్పతనాలని అయోధ్యలో తాము కలిసిలేని కారణంగా చాలాకాలం విన్నాడు. నేడు ఆ గుణాలని కలవాణ్ణీ, గుణాలకి అద్దంపడుతూ తన దగ్గరికి వచ్చిన వాణ్ణీ ప్రత్యక్షంగా చూచాడు రాముడు.

## సమాధానం తెలిసిన ప్రశ్నలు.

రాముడు భరతుణ్ణి ఇక్కడ కొన్ని ప్రశ్నలని కుశల ప్రశ్నల రూపంలో

అడిగాడు. దాదాపుగా సమాధానం, ప్రశ్నలలోనే అలాఅలా కన్పిస్తుంది. ఇది రాముని దైవభావనకి నిదర్శనం.

క్వచ్చి తే ఽ భూత్పితా తాత యదరణ్య మిహా గతః- న హి త్వం జీవత స్తస్య వన మాగంతు మర్హసి॥ భరతా ! మీ నాన్న జీవించి ఉండగా నువ్వు వనానికి రావచ్చునా ? (వానప్రస్థంలో ఉన్నవాడూ, తండ్రికి ప్రేతకార్యాలని చేయనివాడూ, విపరీత దుఃఖంతో ఉన్న తండ్రి మరణిస్తాడని తెలిసి కూడా అరణ్యానికి వచ్చినవాడూ, తండ్రి చివరికోరికని తీర్చనివాడూ అయిన తాను, దశరథునికి పుత్రునిగా అర్హుడే కాదని భావించిన రాముడు, భరతునితో దశరథుణ్ణి గూర్చి పల్కుతూ 'నీ తండ్రి' అన్నాడు. పైగా ఆయన జీవించి ఉండగా నీవు అరణ్యానికి రావడమా? అనికూడఅన్నాడుఅంటే.- 'ఆయన మరణించాడు గాబట్టివచ్చావు. దైవకార్యంకోసం నేనున్న గృహస్థాశ్రమం విడిచి వానప్రస్థానికి నేను వెడితే, ఇప్పుడున్న భూలోకం విడిచి పరలోకానికి ఆయన వెళ్లాడు. పరలోక క్రియలని చేసినవాడే పుత్రుడు. 'పుత్' అనేనరకంనుండి తండ్రిని తప్పించేవాడు పుత్రుడైతే ఆయన బ్రతికుండగానే లౌకికనరకాన్ని కల్గించినవాణ్ణి నేనని రాముడు దుఃఖించాడని భావం).

కచ్చి ద్దశరథో రాజా కుశలీ సత్యసంగరః రాజసూయాశ్వమేధానా మాహర్తా ధర్మనిశ్చయః॥. భరతా! రాజైన దశరథుడు, అశ్వమేధరాజసూయయాగాదులనిచేసినవాడు, క్షేమమా ? అన్నాడు. (దశరథుడు ఈ యాగాలని చేసి రావణవధ కోసం మన నల్గురి జన్మకీ అవకాశమిచ్చాడు. తన పాత్ర అయిన వెంటనే నాటకం నుండి తొలగే విధానం ప్రకారం, దశరథుడు చేయవలసినది లేదుగదా! దేవతలకి సహాయం చేసినందుకు స్వర్గాన్ని చేరి క్షేమంగా ఉన్నాడా ? అని లోరహస్యం.)

సా తాత కచ్చిత్కౌసల్యా సుమిత్రా చ ప్రజావతీ - సుఖినీ కచ్చిదార్యా చ దేవీ నందతి కైకయీ ! ॥. 'భరతా ! కౌసల్య- చక్కని పిల్లలని గన్న సుమిత్ర- అలాగే ఆనందాన్ని పొందుతూ సుఖిస్తూన్నపూజ్యురాలుకైకమ్మ-క్షేమమా?అన్నాడు. (ఇది నింద కానేకాదు. తల్లికి కష్టాన్ని తెచ్చిన తాను యోగ్యుడు కానేకాడని రాముని భావం. కౌసల్యకి ఏ విశేషణమూలేదు. కారణం, ఆమెకంటె - తన పుత్రుడైన లక్ష్మణుణ్ణి, రామునికి తోడుగా అడవులకి పంపిన సుమిత్ర-మరింతగొప్పది కాబట్టి.

సంస్కృతంలో శబ్దాలకి మహార్థం ఉంటుంది. శరీరంలో పుట్టే పేండ్రుకలూ, పుట్టుమచ్చలూ, స్వేదమూ లాగా శరీరం నుండి పుట్టేవారంతా తనూ-జాలు. తండ్రి గుణాలని కలిగి పితృసేవచేస్తూ తండ్రిని ఆనందపఱచేవారు ఆత్మ-జాలు. తన లక్షణాలే (తండ్రివి) కల్గినవారన్నమాట. అలాగే 'జః' అంటే ఊరికే పుట్టినవాడనీ, 'ప్ర-జః' అంటే ఏదో ఒక విశేషకార్యసాధనం కోసం పుట్టినవాడని అర్థం. సుమిత్ర ప్ర-జావతి. రామ కార్యార్థంలక్ష్మణుణ్ణీ, భరత సేవార్థం శత్రుఘ్నుణ్ణీ కన్న ఇల్లాలని దీనిభావం. 'ప్రజ' అంటే 'జనాభా' అనే నేటి అర్థం ప్రకారం, నాటి మాటలని ఊహించకూడదు. నాటి చక్కటి అర్థాలున్న పదాలు నేడు ఎంత చౌకగా వాడబడుతున్నాయో గమనించి బాధపడాలి).

ఇక కైకమ్మని 'ఆర్య!' అన్నాడు రాముడు. కైకమ్మని నిందించనివాళ్లు రాముడు, భరద్వాజుడు, సుమిత్ర మాత్రమే. నిందించలేదు సరికదా ! ఆమె వల్ల రామునికి లోకకీర్తి వస్తుందనీ, దానివలన ప్రపంచ క్షేమం కల్గుతుందని కూడా చెప్పారు. 'భరతా! మీ అమ్మ కైక లేకపోతే ఎవరిని వంకగా పెట్టుకొని, మానాన్న నన్ను అడవులకి పంపేవాడు ? రావణవధకి వచ్చిన నేనెంత చిక్కులో పడేవాడిని? అని రాముడు మనసులోభావించాడు-అని దీని లో భావం.

## అతిముఖ్య పరిపాలనాసూచనలు.

రాజ్యానికి సంబంధించి ఎన్నో సూచనలని భరతునికి రాముడు చెప్పాడు. దీనికి కారణం తనకి రాజ్యాన్నిస్తూ దశరథుడు చెప్పినమాటలని తానూ తన తరువాతి వానికిస్తూ చెప్పాలి గదా ! అని. ఈ సూచనలలో ముఖ్యమైనవి కొన్ని: 1) వేలకొలదీ మూర్ఖులని తనకి అండగా ఉంటారని చేర దీసిన రాజు, వారి వలననే దెబ్బతింటాడు. మూర్ఖుల వలన ప్రయోజనం శూన్యం. 2) సమర్థుడూ, యుక్తాయుక్త వివేకం కల్గినవాడూ, మేధావీ, శూరుడూ అయిన మంత్రి ఒక్కడు చాలు రాజ్యాన్ని నడిపించడానికి. 3) ఉద్యోగాల నిచ్చే విషయంలో మనవాళ్లూ-పైవాళ్లూ అనే భావం కాకుండా రాజ్యతంత్రం- రాజోద్యోగనిర్వహణం-వంటిరాజపరిపాలనా శాఖోద్యోగాలలో తలతో పనిచేయగల శక్తిఉన్న(చదువు నిండుగా ఉన్న) ఉత్తములనే నియమించాలి. రాజ్య సంబంధం లేక ఉత్తరాలని అందజేయడం, పొరుగు దేశాలకి పోయిరావడం వంటి మధ్యమోద్యోగాలలో మధ్యములని (చదువులో మధ్యమంగా ఉత్తీర్ణులయిన వారిని) నియమించాలి.

ఇక రథాలు నడపడం, శయ్యలని అలంకరించడం, ఏనుగులని తోమడం వంటి బుద్ధితో అవసరంలేని పనులున్న ఉద్యోగాలలో, చదువు తక్కువున్న వారిని నియమించాలి. ఈ విధానంలో ఎక్కడ మార్పు చేసినా రాజ్యతంత్రం ఛిన్నభిన్నం అవుతుంది. 4) వ్యక్తి చేసిన తప్పుకి శిక్షని ఎక్కువగాగాని, తక్కువగా గాని, సమానంగా శిక్షవేయడంలో ఆలస్యంగాని చేస్తే, అన్యాయం చేసినట్లే. పన్నులని అధికంగా వేస్తే రాజుని జనులు ఇష్టపడరు. 5) ఎప్పటికప్పుడు రాజ్యానికి సంబంధించిన ఆదాయ వ్యయాలని చూసుకొని దానికనుగుణంగా రాజ్యతంత్రం నడపాలి. ప్రతిదినం రెండు మాఋలు లెక్క చూసుకోవాలి. 6) రథ - గజ - అశ్వ- పదాతి బలాల యోగక్షేమాలని ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి.

7) తామే పండితులమని భావించుకునే బాలురయిన లోకాయతికులని దూరంగా ఉంచాలి. తెలిసి తెలియని విషయంతో వాదం చేసే లక్షణం ఉన్నవాళ్లూ- కన్పించేదాన్నే నమ్ముతామని పక్కవాళ్లనూ లోకాయతికులు. ప్రమాణ బుద్ధి లేకుండా వేన్నైనా తృణీకరించి మాట్లాడేవాళ్లూ- 'ఎందరో గొప్ప' అని ప్రశంసించినవారిని ఎందుకూ పనిచేయని వారిగా చిత్రీకరించి మెప్పుపొందాలని ప్రయత్నించే వారు మరికొందరు. వీరితో సహవాసం తగదు. భరతా ! ఇలాగే చేస్తున్నావా ? అని అడిగాడు రాముడు. (దీన్నే 'ముందుకాళ్ల బంధం' అంటారు. ఇలాటి విషయాలని అడిగితే దాన్ని బట్టి రాజు కావాలనే ఆలోచన ఎదుటివానికి ఉన్నదీ లేనిదీ తెలుస్తుంది. అదీకాక 'రాజధర్మాన్ని నెరవేర్చు' అంటూ మెళకువలను చెప్తూ ఉంటే 'రాజ్యం తీసికో!' అని అడిగే అవకాశమే భరతునికి ఉండదుగదా !. ఇందుకే ఇలా మాట్లాడాడు రాముడు - సహస్రాణ్యపి మూర్ఖాణాం యద్యుపాస్తే మహీపతిః - అథ వాప్యయుతాన్యేవ నాస్తి తేషు సహాయతా ।। ఏకోఽప్యమాత్యో మేధావీ శూరోదక్షో విచక్షణః - కచ్చిన్ముఖ్యా మహత్స్వేవ మధ్యమేషు చ మధ్యమాః జఘన్యాస్తు జఘన్యేషు భృత్యాః కర్మసు యోజితాః।। కచ్చిన్నోగ్రేణ దండేన భృశ ముద్వేజిత ప్రజమ్-తం రాష్ట్రం నావజానంతి మంత్రిణః కైకయీసుత!కచ్చిన్న లోకాయతికాన్ బ్రాహ్మణాం స్తాత మన్యసే ! అనర్థ కుశలా హ్యేతే బాలాః పండిత మానినః।। ధర్మశాస్త్రేషు ముఖ్యేషు విద్యమానేషు దుర్బుధాః - బుద్ధి మాన్వీక్షకీం ప్రాప్య నిరర్థం ప్రవదన్తి తే।।)

## ఉత్తర ప్రత్యుత్తరాలు.

దశరథుని మరణవార్తని భరతుడు చెప్పాడు. రాముడు విలవిలలాడిపోయాడు. మందాకినీ తీరంలో యథావిధిగా తండ్రికి 'పిండశ్రాద్ధం' (బియ్యపు పిండి లేదా పేల పిండితో ముద్దలని పెట్టి మంత్రంతో శ్రాద్ధం పెట్టడం) నిర్వర్తించాడు. రాజాన్నాలు తినే దశరథునికి ఇలా పిండి ముద్దలని దర్భలమీద పిండాలుగా ఉంచవలసి వచ్చిందా ? అంటూ సుమిత్రని కౌగిలించుకుని మరీ ఏడ్చింది కౌసల్య. రాముడు అందరి తల్లులకీ నమస్కరించాడు. తిరిగి ఆశ్రమానికి వచ్చాక అయోధ్యకు రమ్మనే భరతుని ప్రార్థన, రాముని మృదుతిరస్కారమూ ఉత్తరప్రత్యుత్తరాలుగా ఇలా సాగాయి. అయోధ్యా రాజ్యాన్ని తీసుకోవలసినదిగా భరతుడు ప్రార్థిస్తూంటే, రాముడు రానురానని పలికిన ఇలాటి ఇతిహాసాలని చదివినా, వినిపించినా, వీనిపై చర్చచేసినా నిస్స్వార్థబుద్ధి కల్గుతుంది.

1) రామచంద్రా ! స్వధర్మాన్ని ఆచరించి పరధర్మాన్ని చెప్పాలి. అదృష్టం ఉంటేనే రాజయోగం. 'నా విష్ణుః పృథివీపతిః' విష్ణుఅంశ లేనివాడు రాజు కాలేడు. దైవంగా నిన్ను కొలుస్తూన్న ఈ ప్రజలు, నీలో విష్ణ్వంశ ఉందని తెలిసి నిన్ను రాజుగా నిర్ణయిస్తే, దాన్ని నాకు ఇయ్యడమేమిటి ? కాకి హంసలా ఎగురుతుందా? గాడిదకీ గుఱ్ఱానికీ భేదం లేదా ? నీవు భరించలేని రాజ్యాన్ని లేగనైన నేను భరిం పగలనా ? క్షత్రియుడవూ, జ్యేష్ఠుడవూ అయిన నీకు స్వధర్మం రాజు కావడం - పరిపాలించడమూను. నేను రాజుని కాలేను. 'కిమ్మే ధర్మాద్విహీనస్య రాజధర్మః కరిష్యతి ? జ్యేష్ఠే పుత్రే స్థితే రాజన్ న కనీయాన్నృపో భవేత్ !' 2) ఇక 'పితుర్యస్తు ప్రియతమః' తండ్రికి ఎవరిష్టుడో నీకు తెలియనిది కాదు. భవాంస్త్వేవ పితుః ప్రియః. మా అమ్మకొడుకుగా తండ్రికి నేను ఇష్టుడినయినా, రాజ్య విషయంలో నువ్వే ప్రీతిపాత్రుడివి.

3) నాకు రాజ్యం వచ్చినా అది దశరథునికి ఇష్టపాత్రమైనది కాదు. నా తల్లిని తిట్టాడు. నన్ను పుత్రుడికాదన్నాడు. చానుపోతే ఉదకక్రియలు చేయ వద్దని అన్నాడు. ఇలా వచ్చినది రాజ్యమా ? విత్తనం వేసి, మొక్క మొలిపించి నీళ్ళుపోసి పెంచి, తీరా పళ్లు పండే స్థితికి వచ్చాక అది ఫలిస్తుందనుకొంటూంటే

చెట్టు గొడ్డువారి పోతే ఎంత నిరాశ కల్గుతుంది! అయోధ్యా రాజనీతివిషయమూ ఇలాటిదే. 4) గృహస్థాశ్రమం అతి ముఖ్యమైనదని ధర్మశాస్త్రం చెప్తుంటే నువ్వు నారబట్టలతో తాపసిగా జీవించడం సరి కానే కాదు. 5) నీ రాజనీతికానికి ఎందఱువచ్చారో గమనించు. వీరికోసమైనా రాజ్యాన్ని అంగీకరించు. అయోధ్యకు 'రా'! నన్ను దుఃఖాన్నించి గట్టెక్కించు - అని ప్రార్థించాడు భరతుడు.

రాముడు మెల్లగా పలుకనారంభించి 'తమ్ముడూ ! 1) తండ్రి లేక నేనెలా అయోధ్యకి రాను ? తండ్రికి విధిగా పుత్రుడు చేయవలసిన జలతర్పణాదులని విడువని వాణ్ణినేను! రాముడు తండ్రి మాట వినక వెళ్ళాడు- కాబట్టేతండ్రి పోయాడని అనరా ? తండ్రి పోయాక వస్తే మరోలా అనుకోరా ? అన్పించుకోడానికా ? అనిపింపజేయడానికా నేను రావాల్సినది ! తండ్రికి సపిండీకరణ విధి (బియ్యపు పిండి ముద్దలు) చేసిన నేను, ఈనాడు ఏదోలా చేసిన క్రియలు, ఆనాడు చేయలేక పోయాను గదా ! ('ఏత త్తే రాజశార్దూల! విమలం తోయ మక్షయం - పితృలోక గతస్యాస్య మద్దత్త ముపతిష్ఠతు). పెద్దవాడే రాజుకావాలనే నియమం ఉన్నా, వానికి అర్హత లేనప్పుడు (అంధుడు - వ్యాధిపీడితుడు వంటివి) చిన్నవాడు రాజైన సందర్భాలు లోకంలో లేకపోలేదు.

2) నీ తల్లిని నిందించకు. దశరథుణ్ణి ఆడిపోసికోకు. తల్లి, పిల్లవాడి విషయంలో ఏం చేసినా అది ప్రేమతోనే అయ్యుంటుందని ముందు అర్థం చేసికోలేం. తర్వాత తెలిసికొని పశ్చాత్తాపపడతాం. కైకకి నా మీద ప్రేమమెండుగాబట్టే ఇలా చేసింది· కట్టెల దోషం అగ్నిహోత్రానికి లేదు. నీటికి ఉన్న దోషం ప్రతిబింబించిన సూర్యచంద్రులకి రాబోదు. జాతిలోని దోషం శిల్పికి సంక్రమించదు. నీ తల్లి దోషగ్రస్తురాలైతే నువ్విలా ఎలాఉంటావు ? నీ వినయం-విధానంఎంతచక్కనివి ! 3) భరతా ! ఆలోచించి చెప్పు. గడ్డి చూపించగానే నోరుతెరచి, కత్తిం చూపించగానే నోరుమూసే గుఱ్ఱంలా తండ్రి ఇచ్చిన సంపదని స్వీకరించి 'వనాలకి పో !' అనే అప్రియాన్ని చెప్పగానే కాదని విరోధించడం తగునా ? ఇది కొడుకు చేయవలసినపనేనా ? 4) తండ్రి, ఆస్తిపంపకాలని పెట్టినట్లు మన తండ్రి నీకు రాజ్యాన్నీ, నాకు వనవాస సౌఖ్యాన్నీ పంచితే, అంతా విని, 'ఇది సరికాదు' అంటే అది గౌరవ కారణమౌతుందా ? పరలోకానికి వెళ్ళపోయే తండ్రి, మనకి ఇలా పంపకం చేసి పోయాడు· ఇది కాదని అంటూ ఆయన బ్రతికున్నకాలంలో ఎందుకో

దాసుడు చేసిన దోషం యజమానికీ, శిష్యునిదోషం ఆచార్యునికీ వచ్చినట్లు పుత్రుడు చేసిన దోషం తండ్రికి చెందుతుంది. అసర్హుడినైన నేను రాజ్యం స్వీకరిస్తే పర లోకంలోనితండ్రికి ఆత్మశాంతి లభించదు. "ఏభిశ్చ సచివైః సార్థంశిరసా యాచితో మయా - భ్రాతుశ్శిష్యస్య దాసస్య ప్రసాదం కర్తు మర్హసి॥" తమ్ముణ్ణి కాబట్టి నీ మాట వినవలసినవాణ్ణి. శిష్యుణ్ణి కాబట్టి నీ శాసనాన్ని పాటించవలసిన వాణ్ణి. దాసుణ్ణి కాబట్టి నా తప్పులని నీవు దిద్దితే సంతోషపడవలసిన వాణ్ణి. చిన్నవాణ్ణి కాబట్టి పెద్దవాడైన నీ ముందు కష్టం చెప్పుకోగలిగిన వాణ్ణి కూడాను. కాబట్టిరాజ్యం స్వీకరించు.

2) రాజ్యాన్ని నీకిస్తే, నేనుఎలా స్వీకరించడం ? అని అంటావా ?దశరథుడిచ్చాడు గాని నేను స్వీకరించనేలేదు కదా! ఇవ్వడం వరకూ జరిగిందిగా !అంటావా ? అది నా అంగీకారంమీదకాదు. ఇప్పుడు అంగీకరించవచ్చు గదా ! అంటావా? అంగీకరించవచ్చు. కాని,ఆమోదంలేదుగదా ! నీ అంగీకారమే అవశ్యం ఆమోదించాల్సిన విషయమంటావా?రామునికి రాజ్యం ఇవ్వడమనేది నాకు అంగీకార్యమైన విషయం. రాజపుత్రుడివి కాబట్టి స్వీకరించాలని అంటావా ? స్వీకరించినట్లే స్వీకరించాను. అధికారివన్నావువికాబట్టి ఈయడానికే వచ్చాను. రాజ్యంనీకుసంక్రమించిందంటావా?

పట్టాభిషేకంలోని అతి ముఖ్యమైన 'సాంగ్రహణేష్టి' ఇంకా ముగియనే లేదు. అసలు ప్రారంభింపబడిందికదా ! అంటావా ? అందుకే నీ కివ్వాలని రావలసివచ్చింది. లేని పక్షంలో నువ్వే రాజువని ప్రచారం చేసి నిశ్చింతగా ఉండేవాణ్ణి. బిచ్చంలా ఇస్తున్నానని భావిస్తున్నావా ? ఇది శిష్యుడైన నావిత్తం సుమా ! శిష్య విత్తం గురుపరమైనట్లు ఈ రాజ్యపు అధికారం నీదే. రహస్యంగా చెప్తే దోషం ఉన్నట్లే ఇందరి సమక్షంలో చెప్తున్నాను. రాజ్యం క్షాత్రధర్మం ప్రకారమే రావాలంటావా ? యుద్ధాన్ని చేసి తీసికో. నీ ధర్మబలం ముందు మా సైనికబలం చాల ఎక్కువ అయినా, ధర్మానికి ముందు సైన్య బలం ఓడి తీరుతుంది.

దశరథుడనే తోటివాడు నాటిన రామమహావృక్షం, వశిష్ఠసుమంత్రుల పోషణలో ఎదిగిఎదిగి, కైక అనే గొడ్డలిదెబ్బకి గుటి ఆయిందనుకో! అంతమాత్రం చేత రాజ్యం చేయడమనే పుష్పఫలాలని ఇవ్వడం మాని, రాజు లేక గొడ్డుపోవాలా? కాబట్టి నీవు రాక తప్పదు." అని నమస్కరిస్తూ ఉండిపోయాడు.

రాముడు అంతా విని 'భరతా! ఎవరూ దేనికీ కర్తలు కారు. వ్యక్తి అస్వతంత్రుడే. పండిన పండూ, ప్రవహించే నీరూ, గడిచే కాలం, నడిచే జీవితం ఇలా అన్నీ ఎప్పుడో ఒకప్పుడు ముగిసిపోయేవే. (నాత్మనః కామకారోఽస్తి పురుషోఽయమనీశ్వరః - ఇతరశ్చేతరశ్చైనం కృతాంతః పరికర్షతి) రాత్రి వస్తోంది కాబట్టి సుఖించవచ్చుననీ, పగలైంది కాబట్టి ధనం ఆర్జించవచ్చునని ప్రజ అనుకొనేలా మోహాన్ని పరమాత్మ కల్పించాడు. కాని రాత్రింబవళ్లు, వ్యక్తి ఆయుస్సు తరిగిపోతోందని చెప్పడానికి గుర్తులని గమనించవలసి ఉంది. గడ్డిపురుగు, తన ముందు కాళ్లని ఒకచోట గట్టిగా ఆన్చి వెనుకకాళ్లని ఎత్తినట్లు (తృణజలూకా న్యాయం) జీవి కూడా మరొక్కచోట ఉపాధి శరీరాన్ని చూసుకొని ఈ శరీరాన్ని విడుస్తాడు. వెంటనే ప్రవేశించకపోయినా జీవునికి గమ్యం తెలుసు. (ఆత్మాన మనుశోచ త్వం కిమన్య మనుశోచసి ?) కాబట్టి ఎవరో రాజ్యం వద్దంటున్నారనీ, తననెవరో నష్టపెట్టారనీ బాధపడరాదు. తన జీవితాన్ని గూర్చి, తన గూర్చి తాను ఆలోచించుకోవాలి.

సముద్రంలో కలిసిపోయిన యమునానది మళ్లీ వస్తుందా ? రాదు. కాని సూర్యుని వేడికి ఆవిరై మేఘమై జలంగా వస్తుంది. దశరథుడూ అంతే! తండ్రి లేడని దుఃఖించకు! నిన్ను రక్షించు చూచిన వానిలోనే దశరథుణ్ణి చూచుకో! అనేక దక్షిణలిచ్చి బహుయాగాలు చేసిన దశరథుడు వయోధర్మాన్ని బట్టి మరణించాడు. మానవశరీరం శిథిలం కావడంతో విడిచి దివ్యదేహంతో బ్రహ్మలోకానికి వెళ్లాడు. కాబట్టి సామాన్యునిలా ఆలోచించక బుద్ధిమంతునిలా విషయాన్ని గ్రహించు. ఆ తండ్రే నన్ను వనవాసం చేయమన్నాడు. (పురా భ్రాతః పితా నః స మాతరం తే సముద్వహన్ మాతామహే సమాశ్రౌషీ ద్రాజ్యశుల్క మనుత్తమమ్) మీ తాత కేకయకు, మన తండ్రి ఆయన పెళ్లికి ముందిచ్చిన వాగ్దానం కారణంగా, కోసల రాజ్యం నీదే. ఆ వరం దేవాసురయుద్ధ సహాయ సందర్భంలో పుట్టింది. అంతటి ముఖ్యమైన దానిని తృణీకరించడం సరికాదు.

ఒకప్పుడు గయలో గయుడు యాగం చేస్తూ 'పుత్' అనే పేరున్న నరకం నుండి - 'త్ర' - పడకుండా రక్షించేవాడే పుత్రుడని వివరించి చెప్పిన మాటని గుర్తు చేస్తున్నాను. మన తండ్రికి మనం పుట్టినది ఆయనను చేజేతులా నరకంలోనికి

త్రోయడానికా ? ఇందరు ఈ ఘనకార్యానికి సాక్షులు కావాలా ! బొమ్మలో ఉన్న ఓడలో ప్రయాణిస్తూన్న సంసారం మునిగితే దుఃఖపడక్కఱలేదు. అలాగే తండ్రి పోయాడనిన దానికంటె. తండ్రిమాట ఆచరించని దానికి చింతపడాలి.

ఇంతకూ నా నిర్ణయం మారదు. విను! 'త్వం రాజా భరత ! భవ స్వయం నరాణామ్ వన్యానామహమపి రాజరాణ్మృగాణామ్ । గచ్ఛ త్వం పురవరమద్య సంప్రహృష్టస్సంహృష్టస్త్వహమపి దండకాన్ ప్రవేక్ష్యే॥' భరతా ! నువ్వు మనుష్యులకి రాజువికా ! నేను వనంలో ఉండే మృగాలకి రాజరాజుని ఔతాను. (పక్షులకి రాజు జటాయువైతే ఆజటాయువుకి రాజుని! అంటే రాజరాజుని! నేనుకాగలను. వానరాలకి రాజు సుగ్రీవుడైతే అతనికి రాజుని అంటే రాజరాజుని నేను కాగలను. అలాగే భల్లూక రాజైన జాంబవంతునికి రాజై రాజరాజుని! రాక్షసులకి రాజైన విభీషణునికి రాజై రాజరాజుని! నిషాదులకు రాజైన గుహునికి రాజై రాజరాజుని! మహర్షులకు రాజైన మునిరాజు భరద్వాజునికి రాజై కూడా రాజరాజుని! నా గురించి చింతించకు. నీకు పై మెట్టునే ఉన్నానని ఆనందపడు).

నీది అయోధ్యా రాజ్యం. నాది దండకారణ్యం. నీకు శ్వేతచ్ఛత్రం. నాకు విశాలతరు పర్ణచ్ఛత్రం. (పెద్ద చెట్ల ఆకుల గొడుగు). నీకు ఎవరో వేసే వింజామరం. నాకు వాయువే విసరే, శీతల వాయుస్పర్శం. నీకు శత్రుంజయగజం. నాకు సీతాలక్ష్మణ సహాయం. మనకి తేడాలేదు. ప్రదేశం మాత్రం వేఱు. (ఇంత మాట్లాడుతూన్నా కౌసల్య మాఱుపలుకదు. ప్రార్థించదు. అలాటిది ఆనాటి రాజనీతి. రాజ్య విషయిక చర్చ జరిగేటప్పుడు రామభరతులే మాట్లాడాలి. చిత్రకూటానికి రావడానికి అనుజ్ఞ తీసికొనకుండా భరతుడు వచ్చినా, రామునకు కోపం రాకుండా ఉండడానికొక్కారణం తమతండ్రి శత్రుంజయగజ దర్శనం. దూరం నుండే శత్రుంజయం మీది ఛత్రం లేకపోవడాన్ని బట్టి రామాయణకథ ఎంత వఱకూ అయిందో రాముడు (విష్ణువు) గమనించేందుకై వశిష్ఠుడు చేసిన ఏర్పాటు అది). రాముడు తన నిర్ణయం ప్రకటించగానే, భరతుని పక్షాన్ని సమర్థిస్తూ 'జాబాలి' అనే పేరున్న బ్రాహ్మణోత్తముడు ఇలా ప్రారంభించాడు.

### నాస్తిక సిద్ధాంతం - ఖండనం.

రామా ! చదువులేనివానివలె ఇలా మాట్లాడుతూ హేతువాదం తెలియని వానిలా మాట్లాడుతున్నావు. విను.1)'ఎవరు ఎవరికి బంధువు?ఎవడివల్ల ఎవనికి ఏం

జరుగుతోంది ? ఎవడికి వాడు పుడుతున్నాడు. కొంతకాలమయ్యాక పోతున్నాడు. ఎవరికి ఎవరితోనూ సంబంధం లేనే లేదు. పొరుగూరు పెడుతూ ఒక రాత్రి ఒక చోట బస చేసి మఱునాడునిద్రలేచివెళ్ళిపోతాం. ఇక ఆరాత్రివిడిదికీమనకీ సంబంధం లేనట్లే. అలాగే ఈ జన్మ ఇంతతో సరి.' అన్నాడు జాబాలి.

'జాబాలీ ! నువ్వన్నది నిజమే. (ఏకఃపాలయతే లోకం, ఏకః పాలయతే కులమ్. మజ్జత్యేకో హి నిరయే ఏకస్స్వర్గే మహీయతే) పుట్టేది ఒకరిగా పుట్టినా పదిమందిని ఆనందపెడుతున్నాడు. పోయేప్పుడు పదిమందికి దుఃఖాన్ని కల్గిస్తున్నాడు. అందఱూ ఒకలాగా పుట్టినా ఒకడు సామాన్యునిగానే ఉంటున్నాడు. ఒకడు చక్రవర్తి అవుతున్నాడు. వ్యక్తికీ వ్యక్తికీ భేదం లేకుండా ఏ యిద్దఱూ లేనే లేరు. ఇక రాత్రి విడిది వంటిది జీవితమంటావా ? అదీ సరికాదు. రాత్రి ఒక యింటవిడిది చేసినా నేలని శుభ్రం చేసికొని, పై నుండి వానపడకుండా ఉండే చోట, దీపం పెట్టుకొని, అంత సుఖంగానూ నిద్రిస్తున్నావు. ఉన్నంతసేపూ ఆ విడిదిని నీకు అనుకూలంగా ఉండేలా చేసుకుంటున్నావు. వెళ్ళిపోయినా 'ఆ రోజు రాత్రి అక్కడ సుఖంగా ఉన్నాను' అని తలుస్తూనే ఉన్నావు. ఇక నీ భార్య పుత్రులు రాత్రి విడిదిలోని వంటి వాళ్ళు అయితే ఆ విడుపులకీ, సత్రాలకీ ఆపద కలిగితే పట్టించుకోని నీవు, నీ భార్యా పుత్రులకి ఏ మాత్రపు కష్టం కల్గినా ఎంతగానో దుఃఖిస్తావు. అహర్నిశం వారి కోసమే శ్రమిస్తావు. ఉన్నంతవఱకూ నీకు సరిపోయేంత వఱకే సత్రం కోసం శ్రమించావు గాని,నీ భార్యా పుత్రుల విషయంలో శ్రమించినంత శ్రమపడవు కాబట్టి, భార్యాపుత్రులకీ చలువపందిళ్ళకీ పోలిక సరి కాదు ? అన్నాడు రాముడు. జాబాలి అన్నమాటలలో ఏదో రహస్యమూ ఉంది. పొరుగూరైన లంకకి వెడుతూ రాముడనే నువ్వు అయోధ్యలో ఆగావు. ఆ అయోధ్యని విడిచిబయలుదేరుతున్నావు గదా ! ఎందుకు ఈ దుఃఖం ? అని అసలు అర్థం పైశ్లోకానికి).

2) 'రామా ! పురుషుని శుక్లం, స్త్రీ శోణితం కలిసినందువల్ల ప్రాణి పుడుతోంది. అలాగే మీ తండ్రి కూడాను. దీనికోసం ఇంత వేదాంతం ఎందుకు ?' అన్నాడు జాబాలి.

రాముడు - "జాబాలీ ! శుక్ల శోణిత సంయోగంతోనే అందఋూ పుట్టలేదు. పాయసభాగం వల్ల మేం నల్గురం కలిగాం. పృథివి నుండి మొక్క, స్వేదం నుండి పేను, మావినుండి కీటకం, గ్రుడ్డునుండి పక్షి....ఇలా ఉద్భిజ్జ - స్వేదజ - అండజ - జరాయుజ అనే జాతులు లోకంలో ఉన్నాయి. అన్నిటికీ నీ శుక్ల శోణిత సూత్రం సరిపోదు. శుక్లాన్నీ శోణితాన్నీ ఇస్తే ప్రాణిని సిద్ధపఋుపగలమా ? కాబట్టి కన్పించే వస్తువుని, కన్పించకుండా సిద్ధపఋుపగల ఎవరో ఒక అద్భుత నిర్మాత ఉన్నాడు. అతడే దేవుడు.' అని బదులిచ్చాడు.

3) 'నాల్గు భూతాలతో (ఆకాశం చార్వాకమతంలో ఉండదు) శరీరం పుడు తోంది. పోయాక నాల్గుభూతాలలో కలిసిపోతోంది. చనిపోయాక బూడిద తప్ప ఏదీ మిగలదు. దీనికోసం ఏదో చేయడం శుద్ధ అనవసరం. కన్పిస్తేనే నమ్మడం సరైన విధానం. కనిపించనిది లేనట్లే.'

రాముడన్నాడు. 'నాల్గుభూతాలతోనే శరీరం పుట్టేదైతే పోయిన వానిలోనికి నాల్గుభూతాలనీ పంపి బ్రదికించగలమా ? బ్రతికినవానిలో నుండి తీసివేయ గలమా? ముక్కుమూసి గాలిని బంధించి ఎందరు మహర్షులు జీవించేవారు లేరు ? కన్పించే దానిని బట్టే నమ్ముతాననే వాదం సరికాదు. గాలి, వీస్తూ -స్పృశిస్తూతానున్నట్లు కన్పించ కుండా చెప్తోంది. కన్పిస్తూన్న ఎండమావి వెళ్లినకొద్దీ జరిగి జరిగి తానులేనని నిరూపి స్తోంది. కాబట్టిమనమనకున్నదిప్రమాణంకానేకాదు. కట్టిన ఇంటిలో సున్నమూ ఇసుక, ఇటిక కన్పిస్తూ ఉన్నా' ఒకప్పుడుండి ఇప్పుడు లేనిది 'నీరు'. అది లేక ఇల్లు కట్ట డమే అసాధ్యం. ఆ నీరు ఇప్పుడుంటే ఇంటికి శత్రువు కూడా. కాబట్టి ప్రపంచ నిర్మాణరీతిని తెలిసినవాడు కావాలి మాట్లాడకానికి. ఆ తెలిసినవాడు భగవంతుడు. ఆయన పంచభూతాలతో ప్రపంచాన్ని సృష్టించాడు. యమునలోని నీరు ఆవిరై మేఘంగామారి నీరౌతోంది. నీరు కాగి ఆవిరై మళ్లీ సముద్రానికే వస్తోంది. ఇలా పదార్థం పుడుతూ నశిస్తూ పుడుతూ నశిస్తూ ఉంటుంది. చనిపోయే వాళ్ల తిరిగి పుట్ట కపోతే ఇక చనిపోయేందుకు మనుష్యులేరీ ? అలాగే పుట్టేవారు పోవడమున్నా. ఇది చక్రం వంటిది. దాన్నే కాలచక్రంగా భావించాలి. అందఋూ పంచభూతాల కల యికతో పుట్టిన వస్తువులతో సమానమే అయితే, ఒకే చెక్కతో చేయబడిన ఏనుగు, నెమలి, కుక్క బొమ్మలకి చుట్టఋికాలు లేనట్లు, మనుష్యులమధ్య కూడా అక్క - తమ్ముడు - చెల్లి వంటి అనుబంధాలు ఉండనేకూడదు. వీరందఋికీ-భార్యకీ ఇంట్లో

ఆహారం అన్నమైతే, మృగాల ఆహారం జంతువులే. అలాగే ఇక్కడ మరణించిన ప్రాణి మనోమయదేహంతో ఉన్నప్పుడు ఆ దేహానికి ఆహారం మంత్రమే. భౌతిక శరీరానికి మాత్రమే అన్నం ఆహారం. అందుకని ఈ భౌతిక శరీరానికి మంత్ర పూర్వకంగా శ్రద్ధతో అన్నాన్ని పెడుతూ, ఇలాటి భౌతిక శరీరానికి అన్నాన్ని ప్రస్తుతం మనోమయ దేహంతో ఉన్న ఆ జీవునికి మంత్ర పూర్వకంగా శ్రద్ధతో చేస్తూ 'శ్రాద్ధం' అన్నారు. సామాన్య సహాయం చేసినవానికీ, సహాయం చేస్తానని వాగ్దానం చేసి ఇంకా సహాయపడనివానికీ కూడా నమస్కరిస్తూ ఉండే వ్యక్తులు, శరీరాన్నిచ్చి రక్షించి పోషించి పెద్ద చేసిన పితరులకి శ్రద్ధతో శ్రాద్ధం పెడితే అది నేరమౌతుందా ? కన్పించేదే నిజమనే మాట పూర్తి అసత్యం. అతిదూరంలో ఆకాశం 5వ కక్ష్యలో ఎగిరే ఖానపక్షి కన్పించదు. లేదంటావా? ముఖానికి దగ్గరగా పెట్టిన పలకమీది అక్షరాలు అతిసమీపకారణంగా కన్పడవు. లేవన్లేనా ? కంటి వ్యాధి లేదా దోషం ఉన్నవానికి ఒకటి రెండులానూ, ఎత్తు, పల్లంగానూ కన్పిస్తే అది నిజమా ? మనసుసరిగా లేనివానికి స్పర్శకూడ గుర్తుండదు, అది యథార్థం కాదుగా! నీళ్లలో ఉండే జలక్రిములెన్నో కన్పడవు. త్రాగవచ్చా ? గోడచాటున ఉన్న మనిషి, వ్యవధాన కారణంగా కన్పడడు. లేడంటే సరిపడుతుందా ?

సూర్యప్రకాశంలో లీనమైన గ్రహకాంతి 'అభిభవం' అనే కారణంగా కన్పడదు. నిజమేనందామా ? నల్లనిమసిలో కన్పడని అక్షరాలకి అస్తిత్వమే లేదా ? కళ్లు ఎంతవరకూ ప్రమాణంగా ఉపయోగపడగలవు ? కాబట్టి ఈ హేతువూ సరి కాదు. అయినా జాబాలీ ! ఇది నీ తప్పు కాదు. నీలాటి నాస్తికుణ్ణి కొలువులో ఉండనిచ్చిన మా తండ్రిదీ తప్పు. లోకాన్ని నడిపించేది సత్యమే. 'సత్యమేవ జయతే-సత్యమూలం హి జగత్ - సత్యాన్నాస్తి పరోధర్మః - సత్యేన లోకాన్ జయతి' గమనించు. అంటూ ఆగ్రహపడ్డాడు రాముడు. (శ్రీమద్రామాయణంలోని చిత్రం ఏమంటే రామాయణాన్ని ఎలా, ఏమని నిందించవచ్చునని అన్పిస్తుందో, ఆ నింద రామాయణంలోనే ఉంటుంది. సమాధానం కూడా అక్కడే ఉంటుంది. హేతువాదం, నాస్తికం అంటూ ప్రచారం చేయాలంటే శాస్త్రేతిహాసాలని మరింత శ్రద్ధతో చదవాలి. రామాయణం మీద నిందచేయాలంటే కనీసం ఐదు వేల శ్లోకాలు అవలీలగా నోటికి వచ్చి ఉండాలి. అర్థం చూడకుండా చెప్పగలగాలి. అలా వచ్చిననాడు నాస్తికుడు కాలేడు. రామాయణ నింద చేసే వ్యక్తిని గమనించి, స్థాయిని తెలిసికొన్ని

## రాముని నిశ్చయం !

ఈ వాదవివాదాలని విన్న పిమ్మట వశిష్ఠుడుముందుకువచ్చి 'రామా !జ్యేష్ఠుడే రాజు కావడం మీ ఇక్ష్వాకుకుల ప్రారంభం నుండి వస్తోంది-అంటూ వివరంగా రాజుల వృత్తాంతాన్ని చెప్పి, నీ తండ్రికీ నీకూ గురువైన నామాట విను. అయోధ్య కు రా!' అని ప్రార్థించాడు. దేవర్షులూ - సిద్ధులూ ఎందరో ఇదే సమయంలో అక్కడికి వచ్చి, 'ఈ సంభాషణం- ఈ పితృవాక్పాలనం - సౌభ్రాతృత్వం ఎంతో రమ్యంగా ఉంది' అన్నారు. భరతుడు దర్భలను తెచ్చికొని వాని మీద ప్రాయోప వేశ దీక్ష (అన్నాహారాలు మాని కూర్చోవడం) ప్రారంభించాడు. వచ్చినవారిని అందరినీ రాముడి మనసు మార్చుకొనేలా చేయవలసిందని పలికాడు.

రాముడు నవ్వుతూ 'భరతా ! ఇది నీవు చేయదగినది కాదు. ఈ ప్రజలంతా నీ రాజరికాన్నే కోరుతున్నామని మౌనంగానూ, నాతో ఏ మాటాపలుకలేకయున్నా చెప్తూనే ఉన్నారు. లే ! ఆచమించు' అన్నాడు. చేసేది లేక భరతుడు దీక్ష విర మించాడు. (నిర్ + అశనదీక్ష - తిండి లేకుండా దీక్ష చేయడం నిరశనదీక్ష. 'నిర సన' కాదు. నిరశన దీక్ష పట్టడం - విరమించడం మొదటగా జరిగింది త్రేతా యుగంలోనే. అయితే అది మంచికోసం జరిగింది. పైగా వాదవివాదాలకి తావులేక అతి ప్రశాంతంగా- రాముడు 'కాదు' అనే సరికి విరమించేంత నియమవంతంగా సిద్ధాంత విధానానికి కట్టుబడి సాగింది. తమ పని అయ్యేంతవరకు పోట్లాడి సాధిం చుకొనే దీక్షకి మరి ఏం పేరో వాల్మీకికి తెలియదు. కైకమ్మ ఒక పట్టుదల పట్టినా ఫలితాన్ని అనుభవించిన రాముడూ, భరద్వాజుడూ కూడా ఆమెది తప్పుకాదని అన్నారు కాబట్టి ఆమెదీ 'మొరటు దీక్ష' కాదని గ్రహించాలి).

'లక్ష్మీ శ్చంద్రాదపేయాద్వా హిమవాన్వా హిమం త్యజేత్ ।
అతీయాత్ సాగరో వేలాం న ప్రతిజ్ఞా మహం పితుః॥'

రాముని నిర్ణయం ఇది. 'భరతా ! చంద్రుడు తన వెన్నెలని కోల్పోయినా, హిమవంతుడు మంచుని తొలగించుకున్నా, సముద్రం తన ఒడ్డుని దాటినా, నేను తండ్రికిచ్చిన మాటని దాటను'. 1) చంద్రుడు వెన్నెలతో ఉండడం, హిమ పర్వతము మంచుతో ఉండడం, సముద్రం తన ఒడ్డుని దాటకుండా ఉండడం ఎలా

లోక క్షేమానికి కారణాలో అలా నేనూ ప్రతిజ్ఞని దాటకపోవడం (రావణ కథ కారణంగా) లోకక్షేమం కోసమే అని లోఅర్థం. 3) వెన్నెల లేక చంద్రుడు ఎలా ఉండడో, మంచు లేక హిమవంతుడు ఎలా ఉండడో, ఒడ్డుంటే అది సాగరం ఎలా కాదో అలాగే నా తండ్రి మాట దాటితే నేను కూడా నేను కానని మరో అర్థం.

4) వెన్నెల వలన చంద్రునికీ, మంచువల్ల హిమవంతునికీ, ఒడ్డు దాటక పోవడంవల్ల సముద్రునికీ లోకంలో కీర్తి ప్రతిష్ఠలు ఎలా వచ్చాయో, అలాగే నా తండ్రిమాట దాటకపోవడంవలననే నాకు లోకంలో ఒక వ్యక్తిగా గుర్తింపు సుమా! అని ఇంకొక అర్థం. 5) చంద్రుని వెన్నెల తగ్గినాక, హిమవంతుని మంచు తగ్గినా, సముద్రం తన ఒడ్డు దాటినా అది ప్రళయం వస్తోందనేందుకు ఎలా సూచనో, అలాగే నా తండ్రి మాటని నేను అతిక్రమిస్తే అదీ ప్రళయ సూచనే అవుతుంది. ప్రళయాన్ని మీరు కోరవద్దు. లోకక్షేమాన్ని కోరండి అని ఇంకొక అర్థం.

6) రాబోయే కథని కూడ సూచించాడు రాముడు. (సీతేవానుగతా లక్ష్మీః-అవ్యయానామనే కార్థత్వమ్ అనే ప్రమాణాలని బట్టి ఇక్కడి 'వా' అంటే 'ఏ' అర్థం అనుకొంటే) 1) లక్ష్మి (సీత) చంద్రుణ్ణి (రామచంద్రుణ్ణి) దాటిపోవు గాక! (రావణుడు ముందుకాలంలో ఎత్తుకుపోయినా) 2) ప్రతాపం ఉన్న నేను ఇక్కడ ప్రతాపహీనునిగా చల్లగా ఉంటూ ఖరదూషణాదులని వధించే సందర్భంలో నా చల్లదనం తొలగిపోయినా (శౌర్యప్రతాపాలని చూపించవలసి వచ్చినా,) 3) సముద్రం ఒడ్డున కూర్చుని నేను ప్రాయోపవేశ దీక్ష పట్టినప్పుడు ఆ సముద్రుడు త్రోవనీయక తన వేలని (హద్దుని) అతిక్రమించినా, "అయ్యో! తండ్రి మాటని ఆనాడే నేను కాదని ఉంటే ఎంత బాగుండేది!" అని ఏకోశానా ఆలోచించను సుమా! అని రాముడు పల్కడం అర్థాలన్నింటికీ పరాకాష్ఠ. ఈ కష్టాలు ఒక్కొక్కటిగా వచ్చినా దుఃఖించను. అన్నీ కలిసి ఒక్కమాఱుగా వచ్చినా బాధపడను అని రామ భావనం.

## పాదుకలు ఎలా ఉంటాయి ?
## ఎక్కడివి ?

ముందుగా పై కథని చూద్దాం.

వశిష్ఠుడు తనతో తెచ్చిన పాదుకలని భరతున కిచ్చాడు. భరతుని ప్రార్థనపై రాముడు క్షణకాలం పాదుకలపై నిలువబడి దిగాడు. "ఈ పాదుకలే 14 సంవత్

రాజా రాజ్యమేలుతాయి. రామా ! 14 సంవత్సరాల పిమ్మటి రోజున నీ రాకని చూడకపోతే అగ్నిప్రవేశం చేస్తాను' అని భరతుడన్నాడు. 'తమ్ముడూ ! మీ తల్లి కైకమ్మ మీద కోపం చేయకు. ఆమెను రక్షించు. ఇది తప్పితే నా మీదా సీతమీదా ఒట్టు పెట్టినంత. గుర్తుంచుకో!' రాముడన్నాడు. పాదుకలకి ప్రదక్షిణం చేసి శత్రుంజయగజం మీద వాటిని ఉంచి రామునికి సాష్టాంగపడి భరతుడు అయోధ్యకి మరలాడు. అందరూ అతణ్ణి అనుసరించారు. పట్టరాని దుఃఖంతో రాముడు తల్లులందరి కీ నమస్కరించి, పర్ణశాలలోనికి వెళ్ళాడు. అడవిలో ఉండే సింహాలు కూడా చూచి ఎదురుగా పోలేని ప్రతాపం ఉన్న 'అడవి పంది' అనే జాతి మృగం ఒకటుంటుంది. భూమిలోని దుంపలూ, మృగ మాంసమే దాని ఆహారం. అలాటి పంది చర్మాన్ని బాగా నునుపు చేసి పాదాల ఆకారంలో పాదుకలని చేస్తారు. ప్రస్తుతం అయోధ్య సింహాసనంలో కూర్చున్న రాజు ఎన్నవవాడు ? అనే విషయాన్ని ఆ పాదుకలలో ఎన్ని చర్మపు పొరలున్నాయో ఆ సంఖ్యనిబట్టి తెలుసుకోవచ్చు. పట్టాభిషేకపు రోజున, శుద్ధిచేసిన ఒక చర్మపు పొరని- దానిపై ఆ రాజు పేరూ ఇతర జయ వివరాలూ చిత్రించి- ఆ పాదుకలకి చేర్చి కుట్టుతారు.(నేడు మన కార్యాలయాలలో తగిలించే 'Successors list' వంటిదన్నమాట) ఆ విశేషాలన్నీ రాజగురువు (కుల పురోహితుడు)వద్ద భద్రంగా ఉంటాయి. అతడి పేరు వశిష్ఠుడు.

ఆ పాదుకల పైన ఎఱ్ఱని రంగులో ఉండే మణి, తమది సూర్యవంశమని చెప్పేందుకు ప్రతీకగా ఉంటుంది. క్రిందివరుసలో రెండు మణులు ప్రక్క-ప్రక్కగా ఉంటాయి. ఒకటి ఇక్ష్వాకు వంశాన్ని తెలిపే మణి, ఆ ప్రక్కది ప్రస్తుతపు రాజు విశేషాన్ని తెలిపేదీను. సూర్యవంశంలో పుట్టిన రాజులంతరూ చేసిన యాగఫలం సూర్యమణిలో ఉంటుంది. ఇక్ష్వాకువు అనే రాజు పరిపాలనకు వచ్చిన దగ్గఱ నుండి తనవరకూ ఉన్న రాజులు చేసిన యజ్ఞ హోమాదుల పుణ్యఫలమూ, తపఃఫలమూ ఆ రెండవ మణిలో ఉంటుంది. ఇక తాను చేసిన పుణ్యతపఃఫలం మాత్రం 3 వ మణిలో ఉంటుంది. తన పిమ్మట ఎవరు రాజు కాబోతారో ఆ పట్టాభిషేకపు రోజున చేసే 'సాంగ్రహేష్టి'లో ఈ 3వ మణిలోని పూర్వరాజు తపఃఫలాన్ని ఇక్ష్వాకు మణిలోనికి సంక్రమింప చేస్తారు. రాజ్యంలో ఎక్కడ అశాంతి, అరాచకం రేగినా ఆ విషయం ఈ 3వ మణి ప్రకాశం తగ్గడంద్వారా గమనించి ఇక్ష్వాకు వంశీయులు ధర్మాన్ని ఆచరించే వారు.

ఈ నేపథ్యంలో ఇప్పటికి 28 రోజులక్రితం జరిగిన పట్టాభిషేకపు భాగమైన 'సాంగ్రహాణేష్టి'లో ఇక్ష్వాకు కులం నుండి వచ్చిన తపశ్శక్తికల మణిలోనికి, దశరథుని వరకూ కల తపశ్శక్తినీ పుణ్యఫలాన్నీ ఆవహింపచేసారు. ఇక మూడవదైన మణిలోనికి రాముని తపశ్శక్తి చేరవలసి ఉంది. అది చేరినట్లయితే, ఇక ఇక్కడి నుండి ఏ తపస్సుని రాముడు చేసినా, అది యీ మూడవ మణిలోనికి చేరుతుంది. ఇక్ష్వాకు వంశ మణిలోనికి దశరథుని వరకూ ఉన్న తపశ్శక్తి చేర్చడమైతే అయిందిగాని, రామతపశ్శక్తిని ప్రవేశపెట్టేలోగా పట్టాభిషేక విఘ్నమయింది. ప్రస్తుతం మణి మాత్రం ఉంది. దానిలో ఏ తపశ్శక్తి లేదు. రాజ్యాన్ని ఏలడానికి సైన్యం-బలం కాదు కావల్సినది. ఎదుటివారు ధర్మానికి కట్టుబడి ఉండేలా చేయగలిగిన వశీకరణ శక్తి కావాలి. అది తపశక్తి వలననే సాధ్యం అవుతుంది. అందుకే రాముని మాటకు రామాయణంలోని ఏ పాత్రా కూడా (విరోధి కూడా) ఎదురు చెప్పలేకపోయారు. ఈ 28 రోజుల పాటూ వశిష్ఠుడు తన తపశ్శక్తితో అయోధ్యకు ఇతర రాజుల నుండి ఉపద్రవం లేకుండా నడుపగలిగాడు.

తనది ఆపద్ధర్మ ప్రభుత్వ పరిపాలనమే. అంటే స్వయంగా శాసన నిర్ణయాలని చేసే హక్కులేని పరిపాలనం. అందుకని యథార్థ రాజుని నియమించాలని భరతుణ్ణి పిలిచాడు. ఇంతటి శక్తిగల ఇక్ష్వాకు వంశ విధానం ఎరిగిన భరతుడు, తాను వారితో సరి కానన్నాడు. రామునివద్దకు అందరినీ తీసికొని వెళ్లాడు. ఎప్పుడయినా రాముడే రాజు కావలసి ఉన్నాడు గనుకనూ,రాబోయేఈ 14సంవత్సరాలలో ఏ ఉపద్రవమూ రాకుండా ఉండేందుకున్నూ, రాముని తపశ్శక్తిని 3వ మణిలోనికి వశిష్ఠుడు ప్రవేశపెట్టింప దలిచాడు. అందుకే ఆ పాదుకలని తీసి భరతునికిచ్చాడు. (సోఽధిరుహ్య నరవ్యాఘ్రః పాదుకే హ్యవరుహ్య చ ప్రాయచ్ఛత్ సుమహాతేజాః భరతాయ మహాత్మనే-ఏతే హి సర్వలోకస్య యోగక్షేమం విధాస్యతః.) భరతుని కోరికపై మహాతేజం కలవాడైన రాముడు వానిపై నిలబడి, తన తపశ్శక్తిని 3వ మణిలోనికి ప్రవేశింపచేసాడు. ఆ శక్తి దానిలో ప్రవేశపెట్టబడిన కారణంగా రాముడే రాజైనట్లయింది.

ఇక రాముని తపశ్శక్తి దీనిలోనికి వెడుతూ ఉంటుంది. రాముడు రాజయినప్పుడు ఆ రాజధాని కూడ ఆయనదే కాబట్టి, తాత్కాలిక ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని నడిపే తాను అయోధ్యలో ఉండడం సరికాదని నందిగ్రామంలో ఉండిరాజ్యతంత్రాన్ని

నడిపాడు. అనుక్షణం ఆ పాదుకలకి నివేదించడానికి కారణం దానిలో రాముడూ, ఇక్ష్వాకు వంశరాజులూ, వంశ మూల పురుషుడు సూర్యుడూ ఉన్నారు కాబట్టి. ఈ పాదుకలలో ఇందఱుండడం బట్టే, భరతుడు ముందుగా పాదుకలనిశత్రుంజయగజం మీద ఉంచి ఆ మీదట తన శిరసుపై పెట్టుకొని, నందిగ్రామంలో ప్రతిష్ఠించేవఱకూ వాటిని నేలకు దించలేదు. రాముడు కూడా 14 ఏండ్ల పిమ్మట రాజుగా రాగలనని చెప్పినట్లే అయింది పాదుకలమీద నిలబడడం ద్వారా.

ఈ పాదుకలలో ఇందఱి తపశ్శక్తి ఉన్న కారణంగానే భరతశత్రుఘ్నులు మాత్రమే రాజ్యం చేస్తూ ఉన్నా, వాళ్లు కూడా అయోధ్యలో లేకున్నా, రావణుడు అయోధ్యపై దండెత్త లేకపోయాడు. రాముణ్ణే నాగాస్త్రంతో బంధించగల శక్తి ఉన్న ఆ రాక్షసుడు, అయోధ్య దాపుకి రాకపోవడానికి కారణం పాదుకామణి ప్రభావమే. రాముడు ధర్మాన్ని ఎంతగా ఆచరిస్తూన్నదీ అలా స్పష్టంగా ప్రత్యక్షంగా మణిద్వారా తెలుస్తూన్న కారణంగా తాను కూడా రాముణ్ణి చూచి అనేకం నేర్చుకున్నాడు. భరతుడు ఆ పాదుకామణికే ఆదాయవ్యయాలూ, శిక్షలూ అన్నింటినీ నివేదించేవాడు. 'ఈ పాదుకలు యోగక్షేమాన్ని లోకానికి ఇస్తాయి' అనడం బట్టి (లేనిది రావడం యోగం, ఉన్నది చెదర కుండా ఉండడం క్షేమం. అలబ్ధస్య లాభః లబ్ధస్య పరిపాలనం చ యోగక్షేమౌ) భరతునితో పాటు అందఱికీ ఆనందమయింది. బాధతో కాకుండా మఱలిరాగలిగారు. రావణవధ అయిన పిమ్మట రామునికి పట్టాభిషేకం జరిగినప్పుడు రాముని తపశ్శక్తిని మణిలోనికి ప్రవహింపచేసారు.

అయితే, శత్రుంజయం మీద సంప్రదాయబద్ధంగా వచ్చే ఆచారాన్ని మార్చి సుగ్రీవుణ్ణి కూడా ఎక్కించారు. రాముని పిమ్మటవంశంలో ప్రతిష్ఠకలవాడు లేకపోవడంతో ఇలా చేయడం తప్పనిసరి అయింది. దశరథుడుండగా రాముడు శత్రుంజయంపై వచ్చాడు. అలా మఱొకరు లేక సూర్యునికి పుట్టిన సుగ్రీవుణ్ణి శత్రుంజయం ఎక్కించారు. సూర్యపుత్రుడు సుగ్రీవుడు శత్రుంజయాన్ని అధిష్ఠించడం ద్వారా సూర్యునితో ప్రారంభమైన ఈ వంశంలో ఇంతటి ప్రసిద్ధిమంతులు ఇక కల్గరనేది సూచింపబడింది. లవకుశులు కల్గినా, అగ్నివర్ణుని వఱకూ రాజ్యం జరిగినా, వారిదిసూర్యుని ముందు దివిటీల వంటి పరిపాలనే అయింది. ఇక్కడ రామునివద్ద ఈ పాదుకలలో మణులు ఉన్నట్లు రాముని అంగుళీయకంలోనూ, . అమ్మవారి జడకు ఆభరణమైన చూడామణిలోనూ 3 మణులు ఉన్నాయి.

(ఆ విశేషాలు నా సుందరకాండ వ్యాఖ్యలో చూడవచ్చు)

భరతుడు ఆనాడు తలపై పాదుకలని ధరించిన ఆచారమే నేడూ మనకి ఆలయాలలో శఠగోపవిధానంగా సాగుతూవస్తోంది. ఎలాగూ రాముడు రాడని ముందుగానే మనసుతో గ్రహించిన వశిష్ఠుడు పాదుకలని తెచ్చాడు. ఎవరికోర్కెనీ తీర్చకుండా ఉండని రాముడు భరతుని కోర్కెను పాదుకలపై నిలబడి, రాజ్యానికి వస్తానని అంగీకరించి తీర్చినట్టే అయింది. కాబట్టి చిత్రకూటానికి వెళ్లిన ఇందరి ప్రయాణమూ వ్యర్థం కాలేదు. వివాహానికి తాంబూలాలు తీసికొని మంచికాలంలో ముహూరం పెట్టుకోవాలి గదా ! అని ఎదురు చూస్తున్నట్లు,ఈచిత్రకూట యాత్రని కూడభావించవచ్చు. భారతంలోఅర్జునుడు తనకు తాను సమర్థుడను కాననిఅస్త్రధార విడుస్తూ ఉంటే, నిమిత్తమాత్రంగా ఉండవలసిందనీ - అంతానేచూచుకుంటాననీ కృష్ణుడు పలకడం భరతుని చిత్ర కూట ప్రయాణానికి స్పష్టమైన అనువాదంగా అన్పిస్తుంది. ('నామ మాత్రపు రాజువిగా నువ్వుండు. అంతా నేనేపరిపాలిస్తానని' రాముడు భరతునితో పలికినట్లుగా అయిందన్నమాట. భరతుడు ఎవరినీ తాత్కాలి రాజుగా ఉంచి కూడాశిక్షించకపోతే అయోధ్య రాజ్యపు హద్దులలో ఉన్న కిష్కింధా వాలిని రాముడు చంపడం దీనికి సాక్ష్యం). (మాతరం రక్ష కైకేయీం మా దోషం కురు తాం ప్రతి మయా సీతయా చైవ శప్తోఽసి రఘుసత్తమ ॥ న ద్రక్ష్యామి యది త్వాం తు ప్రవేక్ష్యామి హుతాశనమ్).

## అత్రి - అనసూయల దర్శనం.

అయోధ్యకు తిరుగు ప్రయాణమైన భరతుడు, జరిగిన విశేషాన్ని భరద్వాజునకు తెలిపి నమస్కరించి నందిగ్రామం చేరి అక్కడే పాదుకలనిరామునిగా భావించి రాజ్యపాలన ప్రారంభించాడు. ఎంతతొందరగానో 14 ఏండ్లూ గడవాలని, మొదటి రోజునుండే రామదర్శనానికి ఎదురుచూస్తూ ఉండిపోయాడు.

ఇక చిత్ర కూటంలో ఉన్న మహర్షులంతా ఖరుడనే రాక్షసుని బాధను ముందుగా ఊహిస్తూ చిత్రకూటం విడిచి వెళ్లిపోదలిచారని రామునికి అర్థమైంది. ఎంత చెప్పినా వారు వెళ్లిపోయారు. భరతునిరాకను గుర్తుచేసే చిత్రకూటంలో ఉండడం కంటె, అందరు వచ్చిన కారణంగా ఫలపుష్పాలు లేని వనంలో ఉండడం కంటె దండకారణ్యానికి (రాక్షసులు ఉండే చోటు) వెళ్లడం సరి అని భావించిన రాముడు ముందుగా అత్రిమహర్షుని ఆశ్రమానికి వెళ్లాడు.

ఆయన, తన భార్య అనసూయని చూపిస్తూ 'అమ్మాయీ! ఈమె అనసూయ. పూర్వం 10 ఏండ్లు కరువు రాగా ఈమె తపస్సే, గంగాజలాన్ని సృష్టించడమే కాక 10 రాత్రులను ఒకే రాత్రికి కుదించింది. (దశవర్షాణ్యనావృష్ట్యా దగ్ధే లోకే నిరంతరం యయా మూలఫలే సృష్టే జాహ్నవీ చ ప్రవర్తితా - దశరాత్రం కృతారాత్రిః సేయం మాతేవ తేఽనఘ - అనసూయేతి యా లోకే కర్మభిః ఖ్యాతిమాగతా.) అని ఇంకా ఆమె గొప్పదనాన్ని చెప్పాడు. పండుముసలి, తలనెరిసిన వృద్ధ తపస్విని, నిండుపొట్టుతో కళ్లు పెద్దవిచేసి చూస్తూ 'అమ్మాయీ ! నా ఒడిలోకూచో' అంది. సీత సంతోషంతో కూచున్నాక 'నీ పెళ్లి స్వయం వరంలో అయిందటగా ! ఆ కథ మొత్తం చెప్పవే ! వినాలని ఉంది' అంది. (తాం కథాం శ్రోతు మిచ్ఛామి విస్తరేణ చ మైథిలి!) ఎప్పుడూ వాడని పూమాలిక, అంగరాగం (మైపూత), ఒక చీర, ఆభరణాలు కొన్ని అనసూయ సీతకిచ్చింది. సీత తన స్వయంవరకథ మొత్తం చెప్పాక ఆమె, సీతని దగ్గరకు తీసికొని ఆశీర్వదించింది. (ఇదం దివ్యం వరంమాల్యం వస్త్రమాభరణాని చ అంగరాగం చ వై దేహి మహార్హం చానులేపనమ్).

### లో రహస్యం

ఆయన పేరు అత్రి. సత్త్వ-రజస్ - తమస్ అనే గుణాలు మూడు. ఆ మూటికీ అతీతుడు అ-త్రిమహర్షి. (ఆరాత్రిరత్రిః సా రాత్రిః యాం నాధీతే త్రిరద్య వై ఆరాత్రి రత్రి రిత్యేవ నామ మే విద్ధి శోభనే !) అర (పాపం) నుండి త్ర (రక్షించేవాడు)'అత్రి'.వేదాధ్యయనంచేయనిరాత్రిఅనేది జీవితంలోనే లేని ఆయన, రాత్రి. (అత్తీతి అదఃతస్మాత్ త్రాయతే)మృత్యువునుండిరక్షించగలవాడుకాబట్టి కూడా ఆయన అత్రి అయ్యాడట. ఇక ఆమె అసూయలేనిది అనసూయ. మంచిలో చెడుని కావాలని చూపదలచడం అసూయ. లోకమంతా సుఖంగా ఉండాలనే దృక్పథం తోనూ, అందరూ నాకంటె ఆనందంగా ఉండాలనే భావంతోనూ ఉండడం అనసూయ విధానం. ఆ కారణం చేతనే ఆమె కరువు వచ్చినప్పుడు అంతగా శ్రమించి సహాయపడింది. కష్టంవచ్చి సీతారామలక్ష్మణులు అడవికి పోతూంటే స్వయంవర కథని అడగడంలో చాల విశేషం ఉంది. ఆ సీత, కూడ ఈ ప్రశ్నలోని లోభావం గమనించి స్వయంవర కథని మొత్తాన్ని చెప్పింది.

సీతమ్మ కూడా సాధారణ స్త్రీలాగా - "ఎలా జరిగితే ఏం ప్రయోజనం ? వనవాసానికి పోతున్నాం గదా ! ఈ భర్తవలన ఇలాంటి కష్టాలని...."వంటివిధంగా

పల్కుతుందా ? లేక ఎవరూ ఎక్కుపెట్టలేని విల్లుని విరిచిన లోకోత్తర పురుషునిగా అతనిని భావిస్తోందా ? వనవాసానికి దుఃఖిస్తోందా ? లేక భర్తతోనే వనవాసం కాబట్టి ఆనందంగా ఉందా ? తాను అయోనిజ కాబట్టి ఈ కష్టాలు, కష్టాలు కానే కావని తలుస్తోందా ? లేక సాధారణస్త్రీలాగా ' నా జీవితం అంతా కష్టాలే! ' అని తోటి స్త్రీతో చెప్పుకుంటుందా ? వంటివి గమనించాలని ఈ ప్రశ్న వేసింది. సీతమ్మ సమాధానం చెప్పడమే కాకుండా, అనసూయతో మరో రెండు విశేషాలుచెప్పిరాబోయే కథని కూడ సూచించింది సీతమ్మ.

అనసూయాదేవీ ! స్త్రీలు ఎలా ఉండాలి ? అనే విషయాన్ని మా అత్తకౌసల్య నాకెప్పుడో చాల చక్కగా ఉపదేశించింది. నా భర్త స్వయంవరంలో విల్లుని ఎక్కుపెట్టమంటే అంతకంటె గొప్పగా విల్లుని విఱిచి (ఇందులో రహస్యం నా బాలకాండ వ్యాఖ్యలో చూడవచ్చు) నన్ను వివాహం చేసికొనే 'అర్హత'ని సంపాదించాడు. అయినా తన తండ్రి, అంటే నామామగారి అంగీకారం లేనిదే చేసికోనని పల్కాడు సుమా !' అని ముగించింది. ఈ రెంటి వల్ల తెలిసేవి 1) "పతివ్రతా ! ఎంత కష్టం వచ్చినా భర్తవెంటే ఉంటాను. రాముడు కష్టపడుతూంటే అతని తల్లి కౌసల్య దుఃఖిస్తుంది ఆ దుఃఖాన్ని ఆమె పొందకుండా ఉండేందుకై ఆమె చేసిన ఉపదేశాన్ని పాటిస్తాను. (అత్త మాట వింటాను). 2) నా భర్త రామునికి తన తండ్రి మాట మీద ఉన్న గౌరవం నామీది కంటె ఎక్కువదని గ్రహించాను. అందుకని ఈ కష్టాలకి కారణం ఒకవేళ నా మామ దశరథుడే ఐనా, నా భర్తకిఉన్న ఇష్ట గౌరవాలని బట్టి, ఆయనని తక్కువచేసి ఎప్పుడూ మాట్లాడను "అని సీతమ్మ తనలో ఆలోచించుకుని పల్కినట్లు తెలుస్తుంది.

ఇలాటి పురాణే తిహాసాలని చదివితే, సంసారాలలో ఐకమత్య భావం పెరిగి వసుధైక కుటుంబకం (ప్రపంచం అంతా ఒక కుటుంబం) అనే భావం కల్గుతుంది. అది దేశానికి కూడా తప్పనిసరి. ఇలాటి ఇతిహాసాలని చదువని లేదా చదివించని పక్షంలో- నేనూ, నా ఇల్లూ .... వంటి 'నేను' తో ప్రారంభమౌతుంది. ఈ 'నేను' శబ్దాన్ని ఎవరూ తట్టుకోలేరు. ముఖ్యంగా, తన సంతానం తనని నిలదీస్తూ 'నేను' .... అంటే, అంతకు మించిన శిక్ష తండ్రికి మరొక్కటి లేదు.

భారతరామాయణాల కుపోలికకూడకన్పిస్తుంది. ధర్మాన్ని 'ధర్మాన్ని తప్పిరాజ్యం తీసికొనను - అని రాముడంటే అవలంబించి రాజ్యాన్ని ఇవ్వనని దుర్యోధనుడన్నాడు. మాకురాజ్యం వద్దేవద్దనీ, ఎలాగైనా

తీసికోమని భరతుడంటే, మాకు రాజ్యం కావాలనీ, ఎలాగైనా రాజ్యాన్ని ఇవ్వమనీ దుర్యోధనుడన్నాడు. రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు శిష్ట చతుష్టయమైతే భారతంలో దుష్టచతుష్టయం ఉన్నారు. రాజ్యాన్ని ఏమైనా స్వీకరించనని రాముడు పలికితే, ఎలాగైనా నవే తిరిగి ఇవ్వనని దుర్యోధనుడన్నాడు. సత్త్వగుణంతో పరిపాలన చేస్తే రాజ్యం కూడా మోక్షదాయకమే అని రాముని ఆలోచనమైతే, రజస్తమో గుణాలతో యుద్ధం చేసి గెలుపొందడమే రాజ్య పద్ధతి సుమా ! అని దుర్యోధనుని నిశ్చితాభిప్రాయం. అన్నమెప్పుతో భరతుడు, రాముని కీర్తిని మొత్తాన్ని పాదుకలని మోసి క్షణకాలంలో సంపాదిస్తే - ధృతరాష్ట్రుని అండతో దుర్యోధనుడు కురువంశ కీర్తి మొత్తాన్ని పాండవరాజ్యాన్ని అపహరించడం ద్వారా ధ్వంసం చేసాడు. విశ్వరూపాన్ని చూచికూడా కృష్ణుణ్ణి మానవునిగానే దుర్యోధనుడు భావిస్తే, మనుష్యుణ్ణని వేలసార్లు చెప్పినా రాముణ్ణి దైవంగానే భావించారు రామాయణసహచరులందఱూ.

మంథర అసూయతో అయోధ్యాకాండ మొత్తం ఒక్కసారి అలా ఉప్పెన వచ్చిన సముద్రంలా అల్లకల్లోలమయితే, అనసూయాదర్శనంతో తిరిగి ప్రశాంతతని పొందింది. అంటే అసూయవలన పోయిన ప్రశాంతత, అనసూయ వలన తిరిగి లభించిందని భావం.

సీత సమాధానాలని విని అనసూయాదేవి అనుజ్ఞఈయగా, సీత పరమ సంతోషంతో రాముణ్ణి చేరింది.

ఋషులని రక్షింపవలసిన బాధ్యత తన మీదనే ఉందని గ్రహించినరాముడు, రాక్షసులు ఋషిబాధని చేస్తూ ఉన్న దండకారణ్యం పైపు సీతాలక్ష్మణ సమేతుడై బయలుదేరాడు.

స్వస్తి ప్రజాభ్యః.

(దీని మీదట అరణ్యకాండాన్ని చదవండి.)

ఇతిశమ్

శ్రీమద్

వాల్మీకి రామాయణాయనమ్

# సుందర కాండము

వివిధ పారాయణ పద్ధతులలో
నిత్యం పారాయణ చేసికొనేందుకు వీలుగా
తెలుగు వ్యావహారిక భాషలో కథ మఱియు విశేషాంశాలతో



: గ్రంథకర్త :
'రామాయణ ప్రవచన సుధాకర'
'భాషాప్రవీణ'

డాక్టర్. మైలవరపు శ్రీనివాసరావు
ఎం.ఏ.,(తెలుగు) ఎం.ఏ., (సంస్కృతము) పిహెచ్.డి.,



: ముద్రింపిస్తున్న ఉదారులు :
శ్రీయుతులు
చెన్నంశెట్టి నవరత్న కుమారి వేంకటేశ్వర్లు (వేంకటేశ్వరరావు)
దంపతులు
నగరం పాలెం – గుంటూరు.

# అంకితం



నీదుపేరిటి కాండము, నీదుకథయు
నీవు చెప్పఁగఁ జెప్పితి నీవు వినఁగ
ఎంతటి యదృష్టమీవు నాకిచ్చినావా!
అంకితమ్మిదె రామాయణాయనమ్మ!!

# విషయసూచిక


విషయసూచిక (i)

రెండో ముద్రణానికి ముందు రెండు మాటలు (v)

అభివాదనలూ - అభినందనలూ (viii)

ముద్రింపించిన దంపతుల ఫోటో (ix)

గ్రంథకర్తృ దంపతుల ఫోటో (x)

శ్రీమద్ వాల్మీకి సుందరకాండం నిత్యం పారాయణం చేయాలని ఉంటుంది.
సమయం చాలదు. ఎలా? అయినా పారాయణం అంటే ఏమిటి? ఎలా చేయాలి? 1

పారాయణ భేదాలు 3

(i) 16 రోజుల పారాయణ విధానం

(ii) సప్త సర్గపారాయణ విధానం

(iii) సప్తతి పారాయణ విధానం

(iv) ఇంతకీ అర్థం తెలియని పారాయణం వ్యర్థమేకదా! 5

(v) అందుకే, అర్థం తెలుసుకుంటూ ఇలా పారాయణం చేయండి!

ఇంతకీ, శ్రీమద్ రామాయణంలో మనం ఎక్కడున్నాం? 7

దీనికే 'సుందరకాండ' అని పేరు ఎందుకు పెట్టాలి? 11

కథా ప్రారంభానికి ముందు గమనికలు 15

పారాయణ ప్రారంభంలో చదువవలసిన శ్లోకాలు 16


గమనిక: (1) ప్రతి సర్గంలోనూ కథాభాగం కాగానే విశేషాంశాలు వివరంగా ఉన్నాయి. అయితే అతి ముఖ్యమైన విశేషాంశాల శీర్షికలను మాత్రమే ప్రక్కపుటలోని 'కథా ప్రారంభం' అనే శీర్షికలో ఇయ్యడం జరిగింది.

(2) గాయత్రీ మంత్ర బీజాక్షరాలున్న శ్రీమద్ రామాయణ శ్లోకాలని చాల మంది పాఠకులు అడిగిన కారణంగా 24 బీజాక్షర శ్లోకాలని గ్రంథం చివరిలో (పుట 237) ఇయ్యడం జరిగింది.

(3) గ్రంథ కర్త గురించి..........................................పుట 239

# కథాభాగ సూచిక


| సర్గ సంఖ్య | విషయము | కథ+ విశేషాంశాలు పుట |
|---|---|---|
| 1. | ఆంజనేయుని నాలుగు అసాధ్య కార్యాలు | 18 |
| 2. | లంక ఎంతో బాగుంది! | 32 |
| 3. | మఱికొంత ధైర్యం వచ్చింది | 35 |
| 4. | హనుమంతుని నగరప్రవేశం | 38 |
| 5. | ఇంకా సీత కన్పడలేదు | 41 |
| 6. | రావణుని అంతఃపురంలోకి ప్రవేశం | 44 |
| 7. | ...ఇక్కడ కూడా సీత లేదు | 46 |
| 8. | పుష్పకవిమానం ఎలా ఉంది? | 47 |
| 9. | రావణుని శయన మందిరం | 48 |
| | రావణుడు సీతని ఏ ఉద్దేశ్యంతో తెచ్చాడు? | 50 |
| | నిన్ను చంపించేందుకే పుడతాను. | 51 |
| 10. | సీత కనపడింది (దా?) | 59 |
| | రావణునికి ఎన్నిచేతులు? ఎన్ని తలలు? | 60 |
| 11. | సీత ఇలా ఉండదు- ఇంకా వెదకాలి | 64 |
| 12. | శోకం కార్యాన్ని చెడగొడుతుంది | 69 |
| 13. | మఱచిపోయిన నమస్కారం | 72 |
| 14. | సీతమ్మ కన్పించి తీరుతుంది | 79 |
| 15. | అయ్యో! సీతమ్మ ఇలా ఉందా? సీతేనా? | 81 |
| 16. | నిశ్చయంగా ఈమెయే సీత | 83 |
| 17. | పని నెఱవేర్చినందుకు తిరిగి నమస్కారం | 86 |
| 18. | అడుగో! రావణుడు వచ్చాడు!! | 87 |
| 19. | తన చావుకోసం వచ్చాడు రావణుడు | 89 |
| 20. | సీతా! నాగుఱించి చెప్పుకుంటాను - విను! | 91 |
| 21. | రావణా! మృత్యువుని కొని తెచ్చుకోకు!! | 97 |
| | ఈ గడ్డిపోచ శ్లోకానికి 15 అర్థాలు | 98 |

22. చంపగల శక్తి ఉన్నా, రామాజ్ఞ లేదు ....................................101
23. బ్రతకాలంటే భార్యగా అయిపో! ....................................105
24. సీతావిషయంలో భేద-దండోపాయ ప్రయోగం ....................................106
25. అయ్యో! నాచావు కూడా నా చేతిలో లేదా? ....................................109
26. ఏమైనా సరే ప్రాణాలు విడుస్తాను! ....................................110
27. 'త్రిజట' అనే రాక్షసికి వచ్చిన స్వప్నం - 'పక్షి' సూచించిన శుభం 112
**కలలు ఎలా ఉంటాయి? ఎన్నివిధాలు? నమ్మవచ్చా?** ............113
28. మఱికొన్ని శుభసూచనలు ....................................117
29. వర్షానికి విత్తనం మొలకెత్తింది ....................................118
30. ఎలా పల్కరించాలి? ...రామకథ ఉందిగా! ....................................119
31. రామకథను విన్పించి కన్పించిన హనుమ ....................................122
32. దేవతలారా! సత్యాసత్యాలు చెప్పండి ....................................124
33. అమ్మా! నీకథ చెప్పవూ?-నాకథ యిది... ....................................125
34. నువ్వు సీతవే! కాబట్టి నన్ను నమ్ము!! ....................................127
35. రాముని రూపంతో పాటు నా స్వరూపం కూడా విను! 130
**రామలక్ష్మణుల తొడలని గూర్చి చెప్పమని**
**సీత అడగడం అనౌచిత్యమా?** ....................................**132**
**రాముని కథతో హనుమ తన కథని ఎందుకు చెప్పుకోవాలి?** ......**136**
**ఆంజనేయునికి ఉన్న పేర్లూ - అంతరార్థాలూ** ....................**137**
36. తల్లీ! ఇదిగో! ఉంగరం తీసికో!! ....................................141
37. వీపునెక్కి రాను - రాముడే రావాలి! ....................................144
38. చూడామణిని చూపించు! కాక కథ వినిపించు! ....................................147
39. అమ్మా! రావణవధ తప్పదు! ....................................150
40. "మఱొక గుర్తు చెప్తాను - జాగ్రత్తగా వెళ్లిరా" ....................................153
41. అశోకవన ధ్వంసం ....................................154
42. అనుకున్నదే ఔతోంది సుమా! ....................................155
43. రావణుడు ఇక ఉండబోడు! ....................................159
44. మఱికొంతమంది మంత్రి పుత్రులూ! పొండి!! ....................................161
45. ఇంకా ఎవరొస్తారో! రండి!! ....................................162
46. మళ్లీ తోరణద్వారమే ఎక్కిన హనుమ ....................................163

47. రావణ వంశనాశన ప్రారంభం .......... 165
48. బ్రహ్మాస్త్రం హనుమంతుణ్ణి కట్టి తెచ్చింది .......... 167
49. అధర్మమే నాశనానికి కారణం .......... 172
50. నీకు మంచిని చెప్పేవారు లేరు! నే చెపుతా విను!! .......... 174
**51. ఈ కాండలోనే అతి ప్రధానమైన హనుమంతుని సందేశం .......... 176**
**ఈ సర్గ ముఖ్యమైనదని పెద్దలు చెప్తారు – ఎందుకో చూద్దాం! .......... 180**
52. దూతని చంపవద్దు! తప్పు!! .......... 189
53. శీతోభవ హనూమతః .......... 191
54. లంకాదహనం .......... 195
55. కోపం చాల చెడ్డది (కోపాన్ని కోప్పడాలి) .......... 196
56. ఇక్కడి నుంచి వెడతాను! – అక్కడి నుంచి తెస్తాను!! .......... 198
57. దృష్టాసీతా (సీత కన్పించింది) .......... 199
58. చేసింది చెప్పాను! – చేయాల్సింది చెప్పండి!! .......... 201
59. ఆమె పాతివ్రత్యమే రావణుణ్ణి చంపడానికి చాలు! .......... 204
60. రామాజ్ఞనే పాటించాలి .......... 205
**హనుమ చేసిన లంకా ధ్వంసం వలన ఏమి తెలిసింది? .......... 205**
**లంకా ధ్వంసం ఎందుకు చేసాడు? .......... 206**
61. ఆనందంతో మధువన ధ్వంసం .......... 210
62 రామునిబంటుకి ముందుగా సుగ్రీవుని బంటు .......... 212
63. ప్రీతోఽస్మి సోఽహమ్ .......... 214
64. నియమం కలదీ – పతివ్రతా, సీతమ్మ .......... 215
65. జరిగింది ఇది! జరుగబోయేది నువ్వు చెప్పు!! .......... 217
66. వివరించి చెప్పవూ! .......... 218
67. .....అని సీతమ్మ ఆశీర్వదించింది .......... 219
68. అమ్మా! త్వరలో పట్టాభిషేకం జరుగుతుంది!! .......... 220
**(i) కాండ మొత్తంమీద మరో విశేషాంశం .......... 223**
**(ii) ఇంకా లోతు విశేషాంశం .......... 228**
69. శ్రీరామ పట్టాభిషేక సర్గము .......... 231
* గాయత్రీ బీజాక్షరాలున్న శ్రీమద్రామాయణ శ్లోకాలు .......... 237
* గ్రంథకర్త గురించి .......... 239

## రెండో ముద్రణకి ముందు రెండు మాటలు

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే ।
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః ॥

### విచిత్రమైన ప్రత్యక్షానుభవం

సుందరకాండని మూడవ మాఱు పారాయణం చేస్తూ 'రామ పట్టాభిషేకానికి నాలుగు దిక్కుల నుండీ సముద్ర జలాన్ని తెమ్మని, సుగ్రీవుడు నాలుగు వానరాలకి ఆజ్ఞ చేసాడు' అని చదువుతూ ఉన్నాను.

అకస్మాత్తుగా మా ఇంటిలో నేను పూజచేసికొనే చోటికి సరిగా నాలుగు వానరాలు వచ్చాయి. శ్రద్ధగా కూర్చున్నాయి. నా ఆనందం చెప్పలేనంత అయింది. మఱో చిత్రమేమంటే, ఆ నాలుగు వానరాలూ వెళ్లిపోబోతూ నాలుగు దిక్కుల వైపుకి ముఖాలు పెట్టి కాసేపు కూర్చున్నాయి. నాకు శరీరం గగుర్పొడిచింది. నా కుటుంబ మంతా ఈ చిత్రాన్ని తిలకిస్తూ ఉండిపోయింది. కాసేపటికి అవి వెళ్లిపోయాయి.

రోజూ కంటె ఆనందంతో నివేదన పూర్తి చేసికొని ఇవతలకి వచ్చానోలేదో, సరిగా అరగంటలోగా శ్రీయుతులు చెన్నంశెట్టి వేంకటేశ్వర్లు (వేంకటేశ్వరరావు)గారు వచ్చి'సుందర కాండ గ్రంథాన్ని ద్వితీయ ముద్రణ నేను చేయించదలిచాను' అన్నారు. నా ఆశ్చర్యానికి అవధిలేదు.

**ఇంత వఱకే అయితే మూఢమైన నమ్మకమని కొట్టిపారవేయవచ్చునేమో!** కాని ఇది జరిగాక ఒకనాడు శ్రీ వేంకటేశ్వర్లు (వేంకటేశ్వరరావు)గారు 41వ సర్గని పారాయణం చేసి 'మా ఇంటికి కూడ ఆంజనేయుడు ఒకసారి వస్తే బాగుండును' అనుకొన్నారట. అంతే! కొంతసేపటిలోనే వానరం వచ్చి తృప్తిగా పెట్టినవన్నీ ఆరగించి వెళ్లిందట. ఇది వారే చెప్పారు.

మా ఇంటి కంటె వారి ఇల్లు మరీ సందడిగా ఉండే ప్రాంతంలో ఉంది. మేడ మీద ఎన్నో గదులు దాటి పూజా గృహానికి వానరానికి వచ్చే అవకాశం అసలు లేదు. ఈ రెంటిని బట్టి నాకు ఇది గాఢమైన నమ్మకమే అయింది.

అసలు సుందర కాండ ప్రారంభం నుండీ నాకు ఇలాటి అనుభవాలే కలిగాయి. కొత్తపేట ఆంజనేయ స్వామి దేవస్థానం - గుంటూరులో శ్రీమద్ రామాయణం పై

ఉపన్యసింపవలసిందని ప్రధానార్చకులు శ్రీ అయినవోలు ప్రసాదుగారు నన్ను పిలిచారు. అప్పటికి ఆఱుమాసాలుగా అశేష శ్రోతల సమక్షంలో శ్రీమద్ రామాయణాన్ని ఉపన్యసిస్తూ ప్రజాపతి సంవత్సరాదినాడు సుందర కాండ ప్రథమ ఉపన్యాసం చేసి వేదిక దిగాను. శ్రీ చింతలపాటి వేంకట సీతారామాంజనేయ శర్మ ప్రతిపాదనపై సుందర కాండని ప్రచురించాలని నిర్ణయించడమూ, శ్రోతలందఱూ విరాళాలు వేసికొని ప్రచురించడమూ సాగింది. **జీవితంలో చెప్పుకోదగిన ఓ ఘట్టం ఇది.**

అకస్మాత్తుగా ధరవరలు పెరిగి అచ్చుపనికి కొంత ద్రవ్యం కావలసి రాగా 'ఎంత అయితే అంత ఇస్తామని ముందుకు వచ్చి, అప్పటికి అవసరమైన రు. 2,500 (అంతకు ముందు ఇదే గ్రంథం కోసం తామిచ్చిన రు. 650+ఇక్కడి శ్రీరాముని కల్యాణానికి 153 మేలిముత్యాలు కాక) ఇచ్చి ఈ గ్రంథాన్ని లోకానికి తెచ్చిన ఉదార దంపతులు శ్రీ చెన్నంశెట్టి నవరత్న కుమారి వేంకటేశ్వర్లు (వేంకటేశ్వరరావు) గారలు.

సుందరకాండం అచ్చు ప్రారంభం కాగానే శ్రీరామ చంద్రుని అనుగ్రహ కారణంగా నా ఈ క్రింది గ్రంథాలు స్వచ్ఛందగా వెలుగుచూచాయి.

| గ్రంథము | | ముద్రింపించిన వారు |
|---|---|---|
| (1) మాంగల్య తంతునానేన | - | శ్రీ అన్నా వసుమతీ కృష్ణమూర్తి - శ్రీ అంజనీ దేవప్రసాదరావు దంపతులు. |
| (2) బాల కాండము | - | శ్రీ కోరళ్ల సరోజినీ పూర్ణచంద్రరావు దంపతులు |
| (3) అయోధ్యా కాండము | - | శ్రీ పద్మనాభుని రామారావుగారు. |

బాల - అయోధ్యలకు ప్రేరణ శ్రీ నీలి శ్రీరామమూర్తిగారు. నా ఉపన్యాసాలకు వస్తూ శ్రీమద్ రామాయణం మీది భక్తితో నామీది ఇష్టంతో ఇలా ప్రచురింపచేయడం నాకు ఎంతో ఆనందాన్ని కల్గిస్తోంది.

శ్రీ చెన్నంశెట్టి దంపతులు నాకు నిత్య శ్రోతలు. ఆంజనేయ స్వామి గర్భాలయానికి ముందున్న బాగా వెడల్పయిన ఇనుపగేటు ఖర్చు, ప్రజాపతి సంవత్సర దేవీ నవరాత్ర వ్యయమూ భరించిన దాతలు. పాత గుంటూరులోని శ్రీ గంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామిదేవాలయ మహాకుంభాభిషేకానికి - అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠకీ ద్రవ్యదానంతో పాటు, మంచి వ్యాపారకాలంలో (Season)కూడ దైవ కార్యానికే ప్రాధాన్యాన్ని ఇచ్చి దాదాపు 2 నెలలు అహర్నిశలూ శ్రమించిన భక్తులు వీరు.

అజాతశత్రువులూ - విగర్వి - అయిన శ్రీ వేంకటేశ్వర్లుగారు ఇటీవలే శ్రీ శ్రీ శ్రీ రత్నానంద స్వాములు (శ్రీశైలం - కేదారనాథ్)వారి వద్ద భార్యా సమేతులై మంత్ర దీక్షను స్వీకరించారు. ఆధ్యాత్మిక దృష్టిలోనే హిమాలయాలని తమ గురువుల వెంట వెళ్లి దర్శించిన ముముక్షువులు.

భార్యా భర్తరి బద్ధవైర హృదయాః అని కలియుగ లక్షణంగా చెప్తారు. ఏ భార్యనైనా పిలిచి 'నీకు శత్రువు ఎవరు?' అని అడిగితే తడుముకోకుండా 'నా భర్తయే!' అని కలియుగంలోని స్త్రీలు చెప్తారని ఇతిహాసం చెప్పింది. కాని ఈ దంపతుల అన్యోన్యత చూస్తే "పరస్పర తపస్సంపత్ఫలాయిత పరస్పరౌ" అన్న కాళిదాసు మాట గుర్తుకు వస్తుంది. పార్వతి పరమేశ్వరుని కోసం - పరమేశ్వరుడు పార్వతికోసం తపస్సు చేసికాని దంపతులు అయ్యారట. అలాటి జంటే వీరిది. భర్త ఇస్తానంటే, భార్య - 'వెనుకవేయాలి' - అనడం కన్పించే ఈ కాలంలో ఆమె ఔదార్యం చెప్పుకోదగినది. ఏనాడూ విసుగూ - చిరాకూ లేక ప్రసన్నత ఆ యిరువురిలోనూ ద్యోతకమవుతూ ఉంటుంది. తానే నవ్వుతూ పల్కరించే శ్రీ వేంకటేశ్వర్లు గారు తన అదృష్టానికి కారణం 'తన వివాహం' అని పల్కుతూ ఆమెను చూపుతారు. ఎంతటి అదృష్టశీలిని ఆమె!

ఈ ఉదారులైన దంపతులు మంచి గంధపు పరిమళమూ+చల్లదనంలా, చంద్రుని వెన్నెలా+ఆకర్షణీయతా లాగా జీవితాంతమూ అన్యోన్యంగా ఇలాగే ఉండి భగవత్ కృపకు పాత్రులు కావాలని, ఈ గ్రంథాన్ని ముద్రింపిస్తూన్నందుకు కృతజ్ఞతాంజలులని ఘటిస్తూ, పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను.

ఈ గ్రంథాన్ని ఎవరు పారాయణం చేసినా, ఆ ప్రేరణ ఫలితం ఈ దంపతులకే చెందుతుందని వేఱే చెప్పనక్కఱలేదు కదా!

ఆంగీరస శ్రావణ బహుళ త్రయోదశి,
26-8-1992.

ఇట్లు
డా॥ మైలవరపు శ్రీనివాసరావు
గ్రంథకర్త

## అభివాదనమూ – అభివందనమూ

నాలుగు అక్షరాలు ఒంటబట్టే శరీరాన్నిచ్చి నా యోగక్షేమాలే వారి భోగభాగ్యాలుగా జీవించి అకాల ఆకస్మిక మరణాన్ని పొంది, దివి నుండి కూడా నిత్యం నన్ను ఆశీర్వదిస్తూ అనునిత్యం నాకు అభయాన్ని ప్రసాదించే పూజ్యులు నా తల్లిదండ్రులు కీ॥శే॥ సీతారామమ్మ చంద్రశేఖరరావు దంపతులకూ – కొవ్వూరు ఆంధ్రగీర్వాణ విద్యాపీఠంలో సంస్కృతాంధ్ర భాషాభిక్షని పెట్టిన సర్వ బ్రహ్మ శ్రీ కజ్జ శ్రీ రామమూర్తిశాస్త్రి కలగవేంకట సుబ్బారాయుడు, రావూరి వేంకటేశ్వర్లు, (పూర్వాశ్రమ) లక్ష్మణ యతీంద్రుల వారికీ – ఆ జీవన భిక్షాప్రదాత, నా విద్యాజీవితానికి సార్థకత చేకూర్చిన ప్రొఫెసర్. వేటూరి సుబ్బారావు పెదమామ గారికీ, మనసా వాచా కర్మణా నిరాడంబరులూ, నిష్కపటులూ, అనునిత్యం నా మనస్సులో మెదిలే ధర్మమూర్తి నామామగారు వేటూరి బ్రహ్మానందం గారికీ – నా మనసులో శ్రీరామచంద్ర పరబ్రహ్మన్ని, తమ తపశ్శక్తితో ప్రవేశపెట్టి, తాముగా తెనాలి తాలూకా జూనియర్ కళాశాలలో శ్రీమద్రామాయణ ఉపన్యాసాలని నాచే చెప్పించి, తమ చాతుర్మాస్యకాలంలో తాము విని అనుగ్రహించి ఆశీస్సులనిచ్చిన మన్మనోఒంబుజా రాధ్యులు పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ మదభినవోద్దండ విద్యాభారతీనృసింహ స్వాములవారికీ – గుంటూరులో నా రామాయణ విద్యని తొలుతగా ఆశీర్వదించిన ఓంకార క్షేత్రపు గాయత్రీ మాతకూ – నన్ను నిత్యమాశీర్వదిస్తూ, వాత్సల్యంతో చూచే మా అన్నగారు బ్రహ్మ శ్రీ మైలవరపు అంజనేయశాస్త్రిగారికీ నా సాష్టాంగ ప్రణామాలు.

గ్రంథంలో అచ్చుతప్పులు పడరాదనే ఉద్దేశ్యంతో తానుగా శ్రద్ధవహించి, నాకంటె ఎక్కువ ఓర్పుతో 'గ్రంథం అసాంతమూ నాదే' అనే స్ఫూర్తితో సర్వాంగ సుందరంగా ముద్రణ వ్యవహారాన్ని సాగించి నన్నానంద పరిచిన చి॥ శ్రీ కనమర్లపూడి సత్యనారాయణ **(బుజ్జి)** గారికి ఉత్తరోత్తరాభివృద్ధి ఆశీస్సులు. వారికి సహకరించిన మిత్రులు శ్రీ యకమా **నాగేశ్వరరావు,** శ్రీ గజవెల్లి వేంకటేశ్వరరావు గార్లకు నా ధన్యవాదాలు.

లోకంలో శ్రీమద్రామాయణవ్యాప్తి జరిగేలా భక్తుల మనసులోనికి ప్రవేశించి మొదటిసారి దేవస్థానం శ్రోతలచేత అచ్చువేయించి, రెండవమారు శ్రీ నవరత్న **కుమారి వేంకటేశ్వర్లు(వేంకటేశ్వరరావు)** దంపతుల ద్వారా అచ్చువేయించి, ఎందరినో పారాయణపరులని చేస్తూ ఎందరికో సుఖశాంతులని ప్రసాదిస్తూ – సీతారామ లక్ష్మణులకు నమస్కరిస్తూన్న – ఆంజనేయునికి మోకరిల్లుతున్నాను.

ఆంగీరస శ్రావణ బహుల త్రయోదశి, ఇట్లు

26-8-1992. మైలవరపు శ్రీ నివాసరావు (గ్రంథకర్త).

గ్రంథ కర్తృ దంపతులు



మైలవరపు సుబ్బలక్ష్మి, శ్రీనివాసరావు దంపతులు

శ్రీ మద్ వాల్మీకి సుందరకాండం
నిత్యం పారాయణం చేయాలని ఉంటుంది.
సమయం చాలదు.
ఎలా?
అయినా పారాయణం అంటేఏమిటి?
ఎలా చేయాలి ?

ఇది, ఈనాడు చాల మందిని వేధించే ప్రశ్న. అందుకే ఆ అభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకునే, ఈ గ్రంథాన్ని వ్రాయ సంకల్పించినది కూడ.

ఒకప్పుడు క్రొత్తపేట ఆంజనేయస్వామి దేవస్థానము- గుంటూరులో ప్రతి దినమూ రాత్రి 7 నుండి 8 వఱకు ది.19-10-90 నుండి దాదాపు సంవత్సర కాలం సాగిన నా శ్రీమద్రామాయణ ప్రవచనానికి ప్రతినిత్యం వచ్చే పన్నెండు వందల మంది శ్రోతల్లోనూ ఈ ప్రశ్న ఉండేది. దాదాపు అందరూ ఇదే ప్రశ్న అడిగితే ఇదే సుందర కాండ గ్రంథం వ్రాసాను.

**భగవదాశీర్వచనం వలన నాలుగు నెలల్లోనే ప్రతులన్నీ చెల్లిపోయి రెండవ ముద్రణకు వచ్చింది. అదే ఇది.**

నిత్య పారాయణం చేసిన అందఱకూ ఎన్నెన్నో ప్రయోజనాలు సిద్ధించాయని ఉత్తరపూర్వకంగానూ, సమ్ముఖంలోనూ తెలియచేసారు. అందుకే ఈ రెండవ ముద్రణ చేపట్టినది కూడ. **ఇలా వాంఛితం సిద్ధించిన వారిలో ఈ పుస్తకాన్ని ప్రచురింపిస్తున్న శ్రీ చెన్నంశెట్టి నవరత్నకుమారి వేంకటేశ్వర్లు దంపతులు ముఖ్యులు.** వీరికి పుస్తకాన్ని ప్రచురించడానికి నా అంగీకారాన్ని తెలిపిన పిమ్మటకూడ ఈ గ్రంథాన్ని ప్రచురింపించడానికి ఇద్దరు దాతలు ముందుకు వచ్చారు. కాని అప్పటికే అంగీకరించాను కాబట్టి వారిని అన్యథా భావించవద్దని మనవి చేసాను.

ఇంతకీ సుందరకాండని పారాయణం చేయడం అంటే ఎలా? సమయం చాలదు ఎలా? అనే ప్రశ్నలు చాలమందిలో ఉన్నాయి. దానికి సమాధానం చూద్దాం.

ప్రశ్న వేయడం తేలికేగాని, సమాధానం వివరంగా వ్రాయక తప్పదు మఱి.

కొద్ది ఓపిగ్గా, చివరివఱకూ చదివితే, మీకు సమాధానం వస్తుంది.

సులభవిధానం అనేది ఒకటి ఉండవచ్చా? అని మఱికొందరి ప్రశ్నకూడ.

ఇలాటి ప్రశ్నే, పార్వతి, శంకరుణ్ణి అడిగింది.

'విష్ణు సహస్రనామాలు' అని శ్రీమహావిష్ణువుకున్న పేర్లని, వేయింటిని చెప్పే ఒక స్తోత్రం ఉంది. ఏవైనా అనివార్య కారణాలవలన, అన్ని నామాలనీ రోజూ పారాయణ చేయడం, కష్టం కావచ్చునని భావించిన పార్వతీదేవి, శంకరుణ్ణి ఇలాగే అడిగింది.

కేనోపాయేన లఘునా విష్ణోర్నామసహస్రకమ్ ।
పఠ్యతే పండితైర్నిత్యం శ్రోతుమిచ్ఛామ్యహం ప్రభో॥ అని.

'ఇన్ని నామాలకి బదులుగా, లఘువుగా ఈ నామాల ఫలితం వచ్చేదీ, పండితులచే చదువబడేదీ ఏదైనా ఉంటే, చెప్పండి' అని.

దానికి, శంకరుడు సమాధానం చెప్తూ

శ్రీ రామరామ రామేతి రమే రామే మనోరమే ।
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే ॥ అన్నాడు.

ఇలాటి సులభపద్ధతి లేదనీ, ఉండరాదనీ శంకరుడు పల్కకుండా, 'శ్రీరామ రామ రామ' అని భక్తితో పల్కితే, ఒక్కొక్కసారి పలికినదీ ఒక్కొక్కవేయి విష్ణునామాల (ఒకసారి విష్ణుసహస్రనామాలు చదివినంత) ఫలితాన్ని ఇస్తుందన్నాడు.

నమ్మించడం కోసం ఇలా అని ఉండవచ్చు- నిజమౌతుందా? అని ఆలోచన. నిజం కానిదాన్ని శంకరుడు చెప్తాడా!

' ఓం నమో నారాయణాయ' లోని 'రా' అక్షరాన్నీ

ఆలాగే 'ఓం నమ శ్శివాయ' లోని 'మ' అక్షరాన్నీ కలిపితే శివవిష్ణు సమ్మేళన రూపంగా ఏర్పడిన ఉభయబీజాక్షరమంత్రం 'రామ' అనేది.

అయితే 'శ్రీ రామ రామరామ' అంటే 'వేయి' రామనామ ఫలితాన్నిస్తుందని శ్లోకం చెప్తోంది. ఎలా?

'యరలవ' అనే అక్షరాల్లో 'ర' 2వది.

'పఫబభమ' అనే అక్షరాల్లో 'మ' 5వది. దీన్ని 'సంకేత భాష' అంటారు. కాబట్టి 'రామ' 10ని సూచిస్తుంది. $\underset{రా}{2} \times \underset{మ}{5} = 10$.

రామ రామ రామ = 10 x 10 x 10 = 1000. కాని, సీతమ్మలేని రాముడు కార్యసాధకుడు కాడు. అందుకే 'సీత' ని బోధించేందుకు 'శ్రీ' కలపాలి. అపుడు 'శ్రీ రామ రామ రామ' అవుతుంది. ఇదీ 'భక్తితో' అంటేనే, విష్ణు సహస్రనామ పారాయణ ఫలితమిస్తుంది. 'శ్రీ' అంటే సీత - 'రామ' అంటే రాముడూ - కాబట్టే, 'శ్రీరాములు' (సీత మఱియు రాముడు, అందుకే బహువచనం ('లు') అని వ్రాయడం. "అప్రమేయం హి తత్తేజో యస్య సా జనకాత్మజా!" - రాముని యొక్క తేజస్సు అంతా సీతయే నట. అలాటి సీతారాముల్నిగూర్చి ధ్యానించడమే ఉండే, ఈ సుందరకాండని నిత్యం పారాయణ చేయడం వల్ల ఎన్నో సత్ఫలితాలని పొందిన ఎందఱో, మనకి కన్పిస్తుంటారు. అలాటి భక్తుల ప్రేరణయే ఈ పునర్ముద్రణకి కారణం

## పారాయణం అంటే......?

నిత్యమూ, భక్తి శ్రద్ధలతో ఈ కాండంలోని శ్లోకాలని దేవుని ముందు కూచుని పఠించడమే పారాయణమంటే.

అయితే శ్లోకాలు సంస్కృతంలో ఉండడం, అవి కూడా అర్థం కాకుండా ఉండడం, తప్పులు చదివితే ఏమైనా కల్గుతుందేమో ననే భయం వల్ల, చదువగోరే వారు కూడా మానేస్తున్నారు.

అందుకని అందఱికీ అర్థమయ్యే వ్యావహారిక తెలుగు భాషలో సుందరకాండాన్ని సంస్కృతంలో ముఖ్యమైన శ్లోకాలని అక్కడక్కడ ఉంచుతూ వ్రాసాను. ఇప్పుడు సంస్కృతాన్ని చదవలేమేమో అనేభయమూ ఉండదు. అర్థం కాదేమో అనే దిగులూ ఉండదు. ఇక పారాయణాల్లోని భేదాలని చూద్దాం.

## (i) 16 రోజుల పారాయణ విధానం

ఈ కాండలో మొత్తం 68 సర్గలు (సంస్కృతంలో కొన్ని శ్లోకాలని కలిపి చేసిన ఒక విభాగం పేరు) ఉన్నాయి.

కొందరు "రాఘవో విజయం దద్యాత్
మమ సీతాపతిః ప్రభుః" అనే వరుసలో పారాయణం చేస్తారు. అంటే, ఇందాక రామశబ్దాన్ని 2, 5, అక్షరాలకి సంకేతంగా గ్రహించినట్లు ఆయా అక్షరాలని బట్టి ఆ రోజుకి అన్నేసి సర్గలు పారాయణం చెయ్యడమన్నమాట.

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 4 | 4 | 4 | 8 | 1 | 8 | 1 | | |
| రా | ఘ | వో | వి | జ | యం | ద | ద్యాత్ | = | 32 |
| 5 | 5 | 7 | 6 | 1 | 6 | 2 | 4 | | 36 |
| మ | మ | సీ | తా | ప | తిః | ప్ర | భుః | = | 68 |

పారాయణ ప్రారంభం రోజున 2 సర్గలు, ఆ తర్వాతి రోజున 3వ సర్గ నుండి 6వ సర్గ వరకూ అంటే 4 సర్గలు. ఇలా 16 రోజుల్లో, కాండ పూర్తి చేసే విధానమే, **16 రోజుల పారాయణం** అంటే. రాముడు షోడశ కలా పరిపూర్ణుడు. 16 ఉత్తమ గుణాలు కల్గినవాడు కాబట్టి, 16 అంకె యోగ్యమైనదనే అభిప్రాయంతో, ఈ శ్లోకపాదం ప్రకారం పారాయణం చేయడం ఒక పద్ధతి. *"సీతాభర్తయైన రాఘవుడు, నాకు విజయమును చేకూర్చుగాక!"* అని ఈ శ్లోక పాదభావం.

సెలవులు నిర్ణీతకాలంలోనే ఉన్నవారికి, ఈ విధానం అనుకూలమైనది. అయితే 8 సర్గలు గరిష్ఠ పఠనం, కనిష్ఠం ఒక సర్గ పారాయణం చేయాల్సి వస్తుంది. 8 సర్గలని, పారాయణం చేయడానికి చదవడం బాగా అలవాటు ఉన్నవారికి గంట పడితే, లేనివారికి, మరో అరగంట అదనమౌతుంది. చిట్టచివరి రోజున ఈ గ్రంథం చివరన ఉన్న శ్రీ రామ పట్టాభిషేక సర్గని చదివి, మళ్లీ సుందరకాండ ప్రథమ సర్గాన్ని చదివి పారాయణాన్ని ముగించాలి.

## (ii) సప్త సర్గ పారాయణ విధానం

40 రోజుల దీక్ష తీసికొని చేయడం 'మండల' దీక్ష కదా! ఈ 68 సర్గల సుందరకాండని కూడా, రోజుకి 7 సర్గల చొప్పున, అంటే, ఈ రోజు 1 నుండి 7 సర్గలు, రేపటి రోజు 8 నుండి 14 సర్గలు . . . అలా రోజూ 7 సర్గల చొప్పున పారాయణం చేస్తే, 39వ రోజుకి, 4 మార్లు సుందరకాండ పారాయణం అవుతుంది. ఒక సర్గ చదవవలసి వస్తుంది కూడా. (ఎందుకంటే 39 రోజుల్లో, రోజుకి 7 చొప్పున 273 సర్గలు చదవాలి కదా! 4 మార్లు 68 సర్గాలూ చదివితే 4x 68=272 కదా! అందుకని). ఆ

మిగిలిన సర్గగా 'శ్రీరామ పట్టాభిషేక సర్గని' చదువుతారు. సుందరకాండ గ్రంథ ప్రారంభంలోని సర్గకూడా, 40వ రోజున చదివి ముగిస్తారు. రోజూ 7 సర్గల చొప్పున చేయబడే పారాయణం వలన **సప్తసర్గ పారాయణమని** పేరు వచ్చింది.

ఇందాకటి పారాయణ విధానంలా, రోజురోజూ ఎన్ని సర్గలు? అని గుర్తుంచుకోనక్కఱలేకుండా, రోజుకి 7 సర్గలు అని, మొద్దు అంకెగా గుర్తుంచుకొనే విధానం. 40 రోజుల దీక్షకూ అనువైనది.

## (iii) సప్తతిపారాయణ విధానం

రోజుకి 7 సర్గలు చదివే వీలుకూడా లేని పక్షంలో, రోజూ ఒక సర్గపారాయణం చేయడం. 68 రోజుల్లో గ్రంథం అయిపోగానే ముగించేయకుండా, 69వ రోజున శ్రీరామ పట్టాభిషేక సర్గనీ, 70వ రోజున సుందరకాండ ప్రారంభ సర్గనీ పారాయణం చేసి ముగించడం. 70 రోజుల దీక్ష కాబట్టి, **సప్తతిదిన పారాయణం** అంటారు.

ఇవన్నీ, సమయాన్నీ అవకాశాన్నీ బట్టి, మనకి మనం నిర్ణయించుకొనేందుకు వీలుగా, చేయబడినవి.

**ఇన్ని వెసులుబాటులున్నా పారాయణం కుదరడం లేదని అంటే, అదొక 'సాకు' మాత్రమే.**

## (iv) ఇంతకీ అర్థం తెలియని పారాయణం వ్యర్థమేకదా!

అందుకే సరళ వ్యావహారిక తెలుగు భాషలో సుందరకాండాన్ని వ్రాయడం జరిగింది. అర్థం తెలియకుండా పారాయణం చేస్తుంటేనే, ప్రయోజనం సిద్ధిస్తోందంటే, అర్థం తెలిసి చేస్తేనో. . . . . అందుకే, ముఖ్యమైన శ్లోకాలను నడుమ నడుమ ఉంచి, సంస్కృత శ్లోకాలభావం చెడిపోకుండా, పారాయణానికి వీలుగా కూడా, 68 విభాగాలుగా వ్రాయడం జరిగింది.

## (v) అందుకే, అర్థం తెలుసుకుంటూ ఇలా పారాయణం చేయండి!

చదివేది (పారాయణం చేసేది) తెలియకపోవడం వలననే, విసుగు పుట్టి, ఈ పని అయింతర్వాత పారాయణం చేద్దాం, అనుకుంటూ, అలా గడిపేసి, ఈ రోజుకి మాని, రేపు రెండూ కలిపి చేద్దాంలే, అనుకోడం, మొత్తానికి ఎగవేయడం సంభవిస్తోంది.

**అందుకని, అర్థం తెలిసేలాగునా, పారాయణం సాగేలాగునా, మనకి కార్యం సాధింపబడే లాగునా, సమయ నియమానికి లోబడి ఉండేలాగునా, కథాప్రారంభానికి ముందు ఉన్న ప్రకారం పారాయణ శ్లోకాలు చదివి పారాయణం ప్రారంభించండి.**

పారాయణ ప్రారంభానికి ముందు కొంత తెలుసుకోవలసి ఉంది.

వాల్మీకి మహర్షులవారు శ్రీమద్ రామాయణాన్ని వ్రాస్తూ, కొంత కొంత కథాభాగానికి, **"కాండ"** అని పేరు పెట్టారు.

శ్రీరామచంద్రునికి సీతమ్మతో పెళ్లి కావడం. అయోధ్యకి లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు, కూడా, భార్యలతో రావడం వఱకూ ఉన్న కథని **'బాలకాండ'** అన్నారు.

కైక, వరాలు కోరడం, సీతారామ లక్ష్మణులు పధ్నాలుగు సంవత్సరాల వనవాసం కోసం అయోధ్యని వీడివెళ్లడం, అత్రిమహర్షి-ఆయన భార్య అనసూయా దేవీ, వీరిని ఆశీర్వదించడం, అనసూయాదేవి సీతమ్మకి వాడని పూలనీ, వస్త్రాలనీ బహూకరించడం వఱకూ ఉన్న కథని **'అయోధ్యా కాండ'** అన్నారు.

సీతారామ లక్ష్మణులు అరణ్యంలో సంచరించడం, విరాధుణ్ణి వధించడం, మహర్షుల ఆశ్రమాలు సందర్శించడం, శూర్పణఖ రావడం సీతని రావణుడు అపహరించడం, కబంధుని వధ, శబరికి రాముడు దర్శనాన్ని ఇయ్యడం వఱకూ ఉన్న కథని, **'అరణ్య కాండ'** అన్నారు.

సుగ్రీవుని భార్య "రుమ" ను ఎత్తుకుపోయి, తనభార్యగా చేసికొన్న **'వాలి'** వధించడం, అతని ప్రశ్నలకు సరైన సమాధాన మీయడం, తన భార్య సీతని వెదకే నిమిత్తం అంగదుని సేనానాయకత్వంలో, ఆంజనేయునికి అంగుళీయకాన్ని ఇచ్చి పంపడం, ఆంజనేయుడు మొదలైన వానర శ్రేష్ఠులు లంకా సముద్రం దగ్గఱకు చేరడం, వఱకూ ఉన్న కథని **'కిష్కింధకాండ'** అన్నారు.

ఈ మీదట రాబోయే కథని **'సుందర కాండ'** అన్నారు.

వ్యక్తికి బలం ఉండవచ్చు. కాని బుద్ధిబలం లేక ప్రయోజనం లేదు. సింహం-కుందేలు కథ చిన్నప్పుడు చదివాం. అయితే బుద్ధిబలం - శరీర బలం ఉన్నా, ధైర్యం లేకపోతే పరాక్రమాన్ని చూపించే అవకాశం ఉండదు. అలా శరీర-బుద్ధిబలాలూ - ధైర్యం ఉన్నాయి కదా అని దేశాన్నిబట్టి, కాలాన్నిబట్టీ పోయే విధానమూ, అన్నిటికీ మించి ఈ లక్షణాలతో పోలికలేని 'వినయము' లేకపోతే కార్యసిద్ధి కాదు. ఇవన్నీ కావాలనీ, అవన్నీ హనుమలోనే ఉన్నాయనీ గమనించి, అంగుళీయకాన్ని హనుమకే ఇచ్చాడు రాముడు.

మరోవిశేషం కూడా ఉంది. సీతాన్వేషణం అనేది రామకార్యం. భగవంతుని పనికి ఎవరెవరు ఎంతెంత సహాయపడగలరు? అని ప్రశ్నిస్తే 10 యోజనాలు ఎగురుతానన్న గజుడు 10వ వంతు సహాయపడగలనన్నాడన్న మాట. అలాగే గవాక్షుడు 20 యోజనాలశక్తి కలవాణ్ణి- అన్నాడంటే 5వ వంతు సహాయపడతానని అన్నాడన్నమాట. భగవదనుగ్రహం ఎవరి మీద ఉంటుంది? అంటే, సంపూర్ణంగా సహాయపడగలనని ముందుకొచ్చే వాడిమీద. అలాగని శక్తిలేనివాడు సహాయపడతానని చెప్పి ప్రయోజనమేముంది? అందుకే, ఇంతకు మించి మావలన కాదని చెప్పారు. శక్తికి మించి వాగ్దానం చేయదలచడం, సహాయం చేయడం కూడ తప్పే.

అందుకే జాంబవంతుడన్నాడు. ***'దీనికి ఆంజనేయుడే తగును - అతని శక్తి అతనికి తెలియదు'*** అని. 'ఇదో పెద్ద పనా? ఇలా చేసాను - అలా చేసాను అని, చేసి ఉంటే పొగడు కోరాదనడానికీ, చేయకపోయినట్లయితే డాంబికాలు పల్క కూడదనడానికి నిదర్శనమే, ఆంజనేయునకు తన బలం తనకు తెలియక పోవడం. పుట్టినపుడే సూర్యుని మ్రింగదలచిన శక్తి ఉన్నవానికీ, అందరు దేవతల అనుగ్రహమూ, వరాలూ లభించిన వానికీ, 'అతని బలం అతనికి తెలియకుండా ఉండుగాక!' అని శాపం ఈయడంలోని ఔచిత్యం ఇదే.

ఎంత బలం తనకున్నదో తెలిసినందువలననే, రావణునకు అహంకారం పెరిగి, లంకానగరం సమూల ధ్వంసం కాబోతోంది. అహంకారం ఎవరికి ఉంటే వారు నశించడమే కాక, వారిని ఆశ్రయించిన వారికీ నాశనం తప్పదని భావం. అందుకే మహర్షులు, హనుమకి *'తన బలం, తనకు గుర్తు చేస్తే తప్ప తెలియదు'* అని శాపం ఇయ్యడం. **మహర్షుల శాపాలు ఎక్కడ చూచినా, వ్యక్తులకి వరాలే గాని, శాపాలు ఎక్కడా కానేకావు.**

గుర్తు చేసేవాడు ఉంటే కదా, హనుమకి గుర్తు వచ్చేది. పోనీ - ***"జాంబవంతా? గుర్తుచెయ్యి"*** అని రాముడు చెప్పాడా? - లేదు. పని సాధించుకోవలసిన రాముడు ఎందుకు చెప్పలేదు? ఆ బుద్ధికూడ అక్కడివాళ్లకి కలిగి పనిని సాధించాలి' అని.

రాముని ఆలోచన చిత్రమైనది. సీతమ్మని ఎఱిగిన లక్ష్మణుడు వెంతనే ఉంటే కాదని, ముక్కు మొగం ఎఱుగని ఆంజనేయుణ్ణి, లంకకి పంపించదలిచాడు. ఈయన పంపదలిస్తే, హనుమకూడా, 'నేనెఱుగను' అనకుండా వెళ్లడానికి సంకల్పించాడు. దక్షిణ సైన్యానికి నాయకుడు అంగదునకుగాని, అందఱికంటె పెద్దవాడైన జాంబవంతునకుగాని, ఈ అవకాశం లేక, హనుమకే ఈ అవకాశం, రాముడు ఇచ్చాడు. దీన్నే 'భగవదనుగ్రహం' అంటారు. మనం చేయలేని పనినికూడా, మనమీద భగవంతునకు అనుగ్రహ బుద్ధి, కల్గిన రోజున మనకే అప్పచెప్తాడు.

రాముని అంగుళీయకం ఎవరికీ కాకుండా, తనకే యిచ్చినా మిగిలిన వారిని తక్కువగా చూడడం కాని, తానే ఎక్కువ, అని భావించడం కాని హనుమకి లేవు.

ఈ లక్షణాలన్నీ, హనుమకి, నిరంతరం రాముణ్ణి మనసా భావన చేయడం వలన కలిగాయి. ప్రతి సందర్భంలోనూ, "ఇలాటి సందర్భంలో రాముడైతే ఏం చేస్తాడు?" అని ఆలోచించడమే, "రామభావన భావనం" అంటే. ఆ'రామభావన భావనం' కలవాడుహనుమ.

అయోధ్యా రాజ్యం వచ్చినా, ముఖంలో ఏ మార్పూ, అహంకారం రామునికి ఎలా లేవో, అలాగే హనుమకి కూడా, రాముడు అంగుళీయకాన్ని ఇచ్చినా, మార్పులేదు. ముఖంలో ఇలాటి స్థితి లక్ష్మణునకు ఇంకా ఏర్పడలేదు. **అందుకే, దూత లక్ష్మణుడు కాదు, ఆంజనేయుడే.**

వర్షకాలం దాటగానే వస్తానన్న సుగ్రీవుడు రాకపోతే, లక్ష్మణుణ్ణి దూతగా కిష్కింధకు పంపి, లక్ష్మణునకు తెలియకుండా పరీక్ష పెట్టాడు రాముడు.

ఏ క్రోధం, దూతకృత్యాన్ని చెడుగొడుతుందో, అదే కోపంతో, 5 తలల పాములా వెళ్లిన లక్ష్మణుడు, సుగ్రీవుని మేధావితనం వలన, తార ఎదురు రాగానే, చప్పచల్లారిపోయాడు.

శయ్యా గృహం నుండి, పర పురుషుడు చూడ వీల్లేని రీతిలో తార వస్తే, తలదించుకుని, తార అడిగినప్రశ్నలకి సమాధానంకూడ, పలుకలేక పోయాడు లక్ష్మణుడు.

వానరసేనలని తెచ్చినా, పరీక్షలోమాత్రం రాముడనుకున్నన్ని ఎక్కువ అంకాలతో (Marks), లక్ష్మణుడు ఉత్తీర్ణుడు కాలేదు. **ఇక్కడ సమాధాన పత్రాన్ని దిద్దిన వాడు హనుమ. పరీక్ష పెట్టినవాడు రాముడు. అభ్యర్థి లక్ష్మణుడు. పరీక్షా కేంద్రం కిష్కింధ.**

ఈ లక్ష్మణుడు, లంకకి వెడితే ఏమౌతుంది? అనేది, ఇక్కడే తేలిపోయింది.

ఇక్కడి సుగ్రీవుని కంటె ఎన్నోరెట్లు మాయావి రావణుడు, అక్కడున్నాడు. ఇక్కడి తారకంటె, అనౌచిత్యంగా, అసభ్యంగా కన్పించే నిత్య శృంగారపరాయణలైన

స్త్రీలు ఎందఱో, అక్కడున్నారు. ఇంతే కాక, ఇక్కడ కోపం రాదగిన సంఘటనలు మించిన, అనేక సంఘటనలు అక్కడ రానున్నాయి. అన్నింటికీ మించి, సుగ్రీవుడులాటి వాణ్ణి కూడా మాట వినేలా చేయగల హనుమ, ఇక్కడ ఉన్నాడు కాబట్టి, పనిజరిగింది. అక్కడ అలాటివాడు విభీషణుడు ఉన్నా, హనుమతో బలపరాక్రమాలకి సాటిరాడు.

మఱి, లక్ష్మణుణ్ణి వెంట తెచ్చుకున్నది ఎందుకు? అంటే, గ్రామంగాని, నగరంగాని, 14 ఏండ్ల కాలంలో, ప్రవేశించరాని నియమం కల రామునికి, సుగ్రీవుని వద్దకు పంపేందుకు కావాల్సిన వ్యక్తి, అంతరంగికుడై ఉండాలికదా! అందుకున్నూ, తన మానసిక బాధని వినడానికి, ఇంకా శూర్పణఖ, అయోముఖి, అవే వాళ్ల ముక్కు చెవులు కోయడం, మొదలైనవాని కోసమున్నూ.

అలాగే, సుగ్రీవుడు కూడ దూతకృత్యానికి పనికిరాడు. రాజైనవాడు దౌత్యానికి పోరాదు. పైగా, అతడు లేకపోతే, అతని సైన్యం తనమాట వినకపోవచ్చు. లేదా లంకకి వెళ్లిన సుగ్రీవుడు, మాయావియైన రావణునితో చేయి కలిపితే, విషయం జటిలం కావచ్చు. అదీ కాక, అనుమాన స్వభావం కల సుగ్రీవుడు, తాను లంకకి వెళ్లిన కాలంలో, తన సైన్యాన్ని రాముడు, తనవైపుకు తిప్పేసుకున్నాడేమోనని భయపడవచ్చు. దానితో పని అయినా కాకపోయినా, అల్ప వ్యవధిలో, తిరిగి వచ్చేస్తాడు. దౌత్యం చెడుతుంది. అన్నిటికీ మించి, అంగదునికి సైన్యంమీద అధికారం, కొంతకాలమైనా ఉండడం సుగ్రీవునకు గిట్టనిది.

అంగదుడు కూడ, దూతకృత్యానికి పనికిరాడు. పినతండ్రి సుగ్రీవునికి, వీనికీ సహృదయత అంతగా లేదు. వానరసైన్య మధ్యంలో, సుగ్రీవుని గూర్చి చాల తప్పుగా మాట్లాడాడు.

సముద్రపు టొడ్డుకి రాకముందు ఇతడు వెడితే, ఆలోచనలు సుగ్రీవునిమీదా, లోచనాలు లంకలోనూ ఉండి, పని సానుకూలపడదు. ఇక ఈ యిద్దఱిలో ఎవరు పనిని సాధించినా, మఱొకరికి అసూయా ద్వేషాలే.

ఇలాటి రామభావనని భావించగల జాంబవంతుడు కూడ, ఇక్కడే ఉన్నాడు. భగవద్భావనతో, శ్రీ మహావిష్ణు త్రివిక్రమావతారాన్ని, ముమ్మాఱు ప్రదక్షిణం చేయాలని సంకల్పించి, ఇరవైయొక్క మాఱులు చేయగలిగాడు. అందుకే, అలాటి జాంబవంతుడు, – సరియైన కాలం ఇది అని గ్రహించీ – సరియైన వ్యక్తి అంగుళీయ కాన్ని పొందిన 'హనుమ' అని గ్రహించీ – అతని బలం అతనికి గుర్తుచేసి, మహేంద్ర పర్వతంపై, సముద్రం ముందు, లంకకి ఎగిరేందుకు వీలుగా, ఆంజనేయుణ్ణి నిలబెట్టాడు.

**ఇక్కడి నుండి సుందరకాండ ప్రారంభమన్న మాట.**

## దీనికే "సుందర కాండ" అని ఎందుకు పేరు పెట్టారు?

మిగిలిన కాండలన్నీ 'సుందర కాండ'లు కావా? ఏదో విశేషం లేక ఇలా పేరు పెట్టరు కదా! వరసగా విశేషాలు చూద్దాం.

1. శ్రీ మద్రామాయణానికి కథానాయకుడు రాముడు. ఏ కథలోనైనా నాయకుడు అన్ని విభాగాలలోనూ (రామాయణంలో "కాండ"లలో) కన్పించి తీరాలి. బాల - అయోధ్య - ఆరణ్య - కిష్కింధలలో కన్పించే రాముడు, సుందరకాండలో కన్పించడు. మీద నున్న యుద్ధ - ఉత్తర కాండలలో మళ్లీ దర్శనమిస్తాడు. నాయకుడైన రాముడు కన్పించని కాండే అయినా, పరోక్షంగా ఆయన గుణగణాల ప్రశంసే ఉన్న కాండ కాబట్టి "సుందరం".

2. తప్పిపోయినవారిని గానీ, ఎత్తుకుపోబడిన వారినిగానీ, వెదకడానికి, వారిని ఎఱుగున్న వ్యక్తులను పంపిస్తాం. కాని సీతాముఖం ఏనాడూ ఎఱుగని ఆంజనేయుణ్ణి (ఒక్కణ్ణే) పంపించాలని రాముడు సంకల్పించడం, అలాగే ఆంజనేయుడు బయలుదేరడం, అనే విచిత్రత ఉన్న కాండ కాబట్టి "సుందరం".

3. కథకి సంబంధించిన అన్ని కాండలలోనూ నాయకుడూ, నాయికా అనే ఇద్దఱూ సహజంగా ఉంటారు-ఉండాలికూడ. కాని అయ్యవారే (రాముడే) ఉండి, అమ్మవారిని (సీతమ్మ) తలుస్తూ ఉన్న కాండ "కిష్కింధం". అమ్మవారే ఉండి, అయ్యవారిని తలుస్తూ ఉన్న కాండ "సుందరం". అందుకని కూడ "సుందరం".

4. తన భర్త రాజ్యం లేనివాడై, తనను కోరే రావణుడు రాజైనా - తన భర్త సంపద లేనివాడై, రావణుడు సంపన్నుడు అయినా - తన భర్త నార బట్టలు కట్టగా, రావణుడు పట్టువస్త్రాలు ధరించినా - తన భర్త అడవిలో ఉన్నా, రావణుడు మహామందిరాల్లో ఉన్నా - తన భర్త తననే కోరుతూ, రావణుడు కూడా కోరుతూ ఉన్నా - తన భర్తే తనకు సర్వస్వమని పల్కి, భారతీయ సంప్రదాయాన్ని కోటినోళ్లతో ఎలుగెత్తి ఆచరించి చెప్పిన సీతమ్మ ద్వారా, స్త్రీ ఔన్నత్యాన్నీ, ఆచరింపదగిన ధర్మాన్నీ చెప్పించిన కాండ, కాబట్టి 'సుందరం'.

5. ఎంతో ఆలోచనతో, రామలక్ష్మణులు లేని సమయం కోసం వేచి ఉండి బలాత్కారంగా అపహరించికొని వచ్చిన సీతమ్మని, ఆకాశంలో వెడుతూన్న ఏ

గంధర్వుడు, కిన్నరుడు మొదలైన ఎవ్వరైనా చూచి, రామునకు విన్నవించేలా, అశోకవనంలో బహిరంగంగా ఉంచి, తన మనస్సుని సరిగా అర్థం చేసికోవలసినదిగా రావణుడు ప్రార్థిస్తూ, దర్శనమిచ్చే కాండ, కాబట్టి "సుందరం"

6. అలా అపహరించిన సీతమ్మని, ఎంతో గట్టి రక్షణలో ఉంచాలని తెలిసిన రాజైన రావణుడు, అంగవైకల్యం ఉన్న రాక్షస స్త్రీలనే కాపలా పెట్టి, తన మనసుని అర్థం చేసికొనమని ప్రార్థిస్తూ దర్శనమిచ్చే కాండ, కాబట్టి "సుందరం".

7. "తీసికొని వెళ్లి రామునకు సమర్పిస్తాను రమ్మని" ఆంజనేయుడు ప్రార్థిస్తే, ప్రతి క్షణమూ మనోవ్యధతో క్రుంగిపోతున్నట్లు కన్పించిన సీతమ్మ, "రాను" అని బదులు పల్కిన గట్టిదనం ఉన్న కథ కలది, కాబట్టి "సుందరం"

8. ఇష్టం లేని ఆమెను, తన భార్యలముందే బ్రతిమలాడుతూ, తనవారి ముందే "కుక్కా!" అనే తిట్టు దగ్గఱనుండి, పైవరస తిట్లని తిట్టించుకొనే లంకాధినేత ఉండే కథ, కాబట్టి "సుందరం"

9. కైకమ్మ కోరిక ప్రకారం, ఏ పధ్నాలుగు సంవత్సరాలూ రెండునెలల్లో తీర బోతున్నాయో, ఆ రెండు నెలల్నే తానుకూడా గడువుపెడుతూ, తన యథార్థ రూపం గమనించమని ప్రార్థించే కథ కల రావణుడున్న కాండ, కాబట్టి "సుందరం"

10. ముద్గ, కుంత, తోమర, ప్రాస, మొదలైన పేర్లుగల మారణాయుధాలని నిత్యం ధరించి తిరిగే రాక్షసులని, నిరాయుధుడై వణికింపచేసిన చరిత్రకల ఆంజనేయుడున్న కాండ, కాబట్టి "సుందరం".

11. రావణుణ్ణి చంపగల దైవశక్తి తనలో ఉండి, సాక్షాత్తు శ్రీ మహావిష్ణు స్వరూపుడే అయికూడా, మానవ ధర్మంతోనే పోరాడాలని నిశ్చయించిన రాముని చుట్టూ తిరిగే కథ ఉండే కాండ, కాబట్టి "సుందరం".

12. తిండి రావణునిదే అయినా, బుద్ధి మాత్రం సీతాపక్షాన ఉండి, సీతమ్మ శుభాన్ని కోరే త్రిజట, సరమ మొదలైన రాక్షస కాంతలున్న కథ ఉండే కాండ, కాబట్టి "సుందరం".

13. భస్మం చేయగల శక్తి ఉండి కూడా, రాముని ఆదేశాలకై ఎదురు చూస్తున్నానని పలుకుతూ, భయం పైకి నటిస్తూ, లోపల మహాధైర్య సాహసాలున్న సీతమ్మ ఉన్న కాండ, కాబట్టి "సుందరం".

14. జీవాత్మ రూపిణియైన సీతమ్మని, పరమాత్మ రూపమైన రామునితో సంధానం చేయడానికి, శరీరమనే "లంక" అంతా అన్వేషిస్తూ గురురూపంలో ఉన్న ఆంజనేయుని కథ ఉన్న కాండ, కాబట్టి "సుందరం".

15. 24,000 శ్లోకాల రామాయణంలో, 12 వేలవ శ్లోకంతో ఈ కాండ ప్రారంభమౌతుంది. మొదటిదైన బాలకాండలానే, ఈ కాండ మొదటి శ్లోకం ప్రథమాక్షరం **'త'** – చివరి శ్లోకం చివరి అక్షరం **'త'** – అందుకని **"సుందరం"**.

16. 'విద్యార్థులు' అంటే విద్యార్థి, విద్యార్థిని – ఇద్దరినీ సంబోధించినట్లే. దీన్ని ఏకశేష సమాసం అంటారు. అలాగే 'సుందరశ్చ సుందరీచ సుందరౌ తయోరధికృత్య ప్రవృత్తః సుందరకాండః అని-అర్థం చెప్తే సుందరుడైన (విష్ణు సహస్ర నామాల్లో ఒకటి) రాముణ్ణి గూర్చి పరితపిస్తున్న సుందరియైన (బాలా త్రిపుర సుందరి) సీతని, వెదకి వానరుడై, నరునికి ధైర్యాన్నిచ్చిన సుందరుడున్న (సుందర హనుమాన్) కథ కలిగిన కాండ, కాబట్టి **"సుందరం"**.

17. తనకి నిత్య సన్నిహితుడైన లక్ష్మణస్వామి చెంతనే ఉన్నా, ఈ మధ్యే పరిచితుడైన ఆంజనేయునికి అంగుళీయక మిచ్చి, దూతగా లంకకి పంపాడు, కాబట్టి **"సుందరం"**.

18. సత్యం శివం సుందరం బ్రహ్మ. బ్రహ్మ పదార్థం ఈ మూడు గుణాలతోనూ ఉంటుందిట. మూడు కాలాల్లోనూ ఒకే రీతిగా ఉండేది **సత్యం**. సర్వకాలాల్లోనూ శుభాన్ని కల్గించేది **శివం**. అన్ని కాలాల్లోనూ వినయాన్ని వహింపచేసేది **సుందరం**. ఈ మూడు పర బ్రహ్మగుణాలూ వర్ణింపబడిన కాండ, కాబట్టి **"సుందరం"**.

19. రాముడు స్వయంగా బాలకాండలో చేసిన తాటకావధ ద్వారా ఆయన భుజశక్తి – అయోధ్యాకాండలో తానే చూపిన పితృవాక్య పరిపాలనం ద్వారా ఆయన సత్యశక్తి – అరణ్యకాండలో తానే వ్యతిరేకించిన శూర్పణఖ ద్వారా ఆయన శీలసంపదా – కిష్కింధాకాండలో తానే వధించిన వాలి ద్వారా ఆయన ధర్మ పరరక్షణ బుద్ధీ – తెలుస్తాయి. ఇవన్నీ రాముడే స్వయంగా సాధిస్తే, ఆయన కంటె ఆయన నామం, సేవ గొప్పవని తలచి, రామదూత అయిన ఆంజనేయుడు, పై రామ లక్షణాలన్నిటినీ తనయందు నిలిచిఉన్న రాముని వలన సాధించి చూపిన కాండ, కాబట్టి **"సుందరం"**.

20. తన కంటె వృద్ధులైన జాంబవంతుడు మొదలైన ఎలుగురాజులున్నా – దీర్ఘదృష్టి ఉన్న సంపాతి మొదలైన పక్షి రాజులున్నా – సుగ్రీవుడు మొదలైన వానర రాజులున్నా – రామనామాన్ని, దృఢంగా నమ్మితే అసాధ్యం లేదని నిరూపించిన ఆంజనేయుడున్న కాండ, కాబట్టి **"సుందరం"**.

21. ఇలా ఎన్నో విశేషాలూ ఇవికాక, కవితా సౌందర్యం భావ సౌందర్యం, వంటివీ దీనియందు ఉండడం వల్ల **"సుందరం"**.

22. అయ్యవారైన రాముని నుండి బయలుదేరి అమ్మవారిని దర్శించి రాముని కంటె సీతమ్మయే గొప్పదని ఆంజనేయుడంతటివాడు నిశ్చయించి చెప్పిన కథ ఉన్న కాండ కాబట్టి **"సుందరం"**.

23. పదమూడు సంవత్సరాలపాటు సాగిన కథకి ఒకేఒక్క రాత్రిలో ముగింపు ఉపాయం నిర్ణయింపబడిన కథ కల కాండ కాబట్టి సుందరం. (ఎంతో కాలంగా ఉన్న దుఃఖం ఒక్కరోజులో తొలగింపచేయగల శక్తిగల కాండ కాబట్టి పారాయణం వలన **"సుందరం"**.)

24. సీతారామాంజనేయ ఉపాసన వలన క్రొత్తశక్తీ, భక్తితోకూడిన అనుభవమూ ఈయగల శక్తి కల కాండ కాబట్టి సుందరం. గాయత్రీ మంత్రాక్షరాలు 24 వలె, 24 విశేషాలు ఉండి, గాయత్రీ మంత్రాక్షర శక్తిని ఇముడ్చుకున్న రామాయణంలోని ఈ కాండ, పారాయణం వల్ల ఫలితాన్ని యిస్తుంది కాబట్టి **సుందరం.**

ఇన్ని విశేషాలుండడం బట్టే

"త్రివర్గ ఫలకామేన విపదుత్తరణేచ్ఛునా ।
శ్రీమత్సుందర కాండస్య పాఠః కార్యో విజానతా" ॥

అన్నారు పెద్దలు. "ధర్మార్థకామాలూ, సత్వరజస్తమో గుణాలూ అనే ఈ మూటివల్ల కలిగే ఫలాన్ని పొందదలచినా సాంసారిక, మానసిక కష్టాల నుండి దాటదలిస్తే శుభాన్నిచ్చే సుందర కాండని చదివి తీరాలి" అని దీనిభావం. చివరిగా మఱొక్క మాట.

**"సుందరే సుందరో రామః**
**సుందరే సుందరీ కథా**
**సుందరే సుందరీ సీతా**
**సుందరే కిన్న సుందరమ్? సుందరకాండలో**
**రాముడు సుందరుడు (ప్రవర్తన చేత).**
**సీత సుందరి. (శీల సంపదచేత).**
**కథ సుందరం. (అంతరార్థం తెలియం చేత).**

**ఇలా సుందరంలో, ఏది సుందరంగా ఉండదు?**

## కథా ప్రారంభానికి ముందు గమనికలు

(1) ప్రతి సర్గానికీ కథా, కథ అయ్యాక "విశేషాంశాలు" వేఱు వేఱుగా వ్రాయబడ్డాయి. పారాయణం చేసికో దలచినవారు 'కథ' వఱకూ చదివితే చాలు.

కథ ఒంటపట్టి (ఒంటిలో ప్రవేశించే) శరీరం రామమయం కావాలంటే, విశేషాంశాలని తరవాత చదువుకోండి.

సమయం ఉంటే, విశేషాంశాలని పారాయణ కాలంలోనూ, చదువుకోవచ్చు. తప్పుకాదు. అలా అని విశేషాంశాలు చదవకపోతే, దోషమూ రాదు.

(2) కథాభాగంలో అక్కడక్కడ 1, 2... అని ఇలా అంకెలు కన్పిస్తాయి. అక్కడక్కడ విశేషాలున్నాయని అర్థం.

'విశేషాంశాలు' అనే శీర్షికలో కూడ కథాభాగంలో అంకెలు వేయబడిన ఆ వరుసలోనే విశేషాలు వ్రాయబడ్డాయి. అన్ని సర్గల మొత్తం కథ చివర, వేదాంతపరమైన అంతరార్థం, కాండ మొత్తానికి ఉంది.

(3) గాయత్రీ మంత్ర బీజాక్షరాలున్న శ్లోకాలూ, ఇంకా నోటికి రాదగిన శ్లోకాలూ, ఇతర ముఖ్య శ్లోకాలూ, కథాభాగంలో వ్రాయబడ్డాయి.

పారాయణ చేసే వారికి ఫలితం చేకూరేందుకే ఈ ప్రయత్నం.

(4) అదృష్టవశాత్తూ, పశుపక్ష్యాదులకి లేని 'బుద్ధి'ని మనకి భగవంతుడిచ్చాడు.

**కథని చదివేటప్పుడు కళ్లలో ఊహిస్తే, కథ కళ్లలో కన్పడి రామాయణం ఒంటపట్టి శరీరం రామమయమౌతుంది. సుందరకాండ పారాయణ ఫలితం లభిస్తుంది.**

**లేని పక్షంలో సమయం, శ్రమా దండుగ లౌతాయి.**

## పారాయణ ప్రారంభంలో చదువ వలసిన శ్లోకాలు

మీకు తోచిన ఒక పురోహితుని పిలిచి, ప్రారంభపు రోజున మాత్రమే, గణపతి పూజ, సంకల్పము (సుందరకాండ పారాయణం కరిష్యే వఱకు) చేయించమని చెప్పండి. 'కరిష్యే' అని వారు చెప్పించాక మీరు ఇలా చదువుకోండి. పురోహితులు లభించని పక్షంలో (ఇతర రాష్ట్రంలో ఉన్న తెలుగువారు ఈ సందేహాన్ని వ్రాసారు) వినాయకుని ప్రార్థన శ్లోకాన్ని భక్తితో చదివి కొబ్బరికాయ కొట్టి, 'సుందరకాండ పారాయణాన్ని నిర్విఘ్నంగా కొనసాగింపచేయి స్వామీ!' అని ప్రార్థించి పారాయణాన్ని ఇలా ప్రారంభించండి. ఈ క్రింది శ్లోకాలని పైకి చదువుకోండి.

మాతా రామో మత్పితా రామచంద్రః
స్వామీ రామో మత్సఖా రాఘవేశః ।

సర్వస్వం మే రామచంద్రో దయాలుః
నాన్యం దేవం నైవ జానే నజానే ॥

ఆపదా మపహర్తారం దాతారం సర్వసంపదామ్ ।
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్ ॥

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలమ్ ॥

శిరో మే రాఘవః పాతు-ఫాలం దశరథాత్మజః
కౌసల్యేయో దృశౌ పాతు- విశ్వామిత్రప్రియః శ్రుతీః ॥
ఘ్రాణం పాతు మఖత్రాతా-ముఖం సౌమిత్రి వత్సలః ॥
జిహ్వాం విద్యానిధిః పాతు-కంఠం భరతవందితః ॥
స్కంధౌ దివ్యాయుధః పాతు -భుజౌ భగ్నేశకార్ముకః ।
కరౌ సీతాపతిః పాతు- హృదయం జామదగ్న్యజిత్ ॥
పార్శ్వే రఘువరః పాతు - కుక్షి మిక్ష్వాకునందనః
మధ్యం పాతు ఖరధ్వంసీ - నాభిం జాంబవదా శ్రయః ॥
సుగ్రీవేశః కటిం పాతు- సక్థిని హనుమత్ప్రభుః ॥
ఊరూ రఘూత్తమః పాతు - గుహ్యం రక్షః కులాంతకృత్ ॥
జానునీ సేతుకృత్ పాతు- జంఘే దశముఖాంతకః ॥
పాదౌ విభీషణ శ్రీదః - పాతు రామో అఖిలం వపుః ॥

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః ।
రాజా జయతు సుగ్రీవో రాఘవేణాభిపాలితః ॥

నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యై చ తస్యై జనకాత్మజాయై ।
నమోఽస్తు రుద్రేంద్ర యమానిలేభ్యో
నమోఽస్తు చంద్రార్క మరుద్గణేభ్యః ।

స్వస్త్యస్తు రామాయ సలక్ష్మణాయ
తథా పితుర్మే జనకస్య రాజ్ఞః ।

దాసోఽహం కోసలేంద్రస్య
రామస్యాక్లిష్టకర్మణః ।

హనుమాన్ శత్రుసైన్యానాం
నిహంతా మారుతాత్మజః ॥

అస్త్రవిజ్జయతాం రామో లక్ష్మణశ్చ మహాబలః ।
రాజా జయతు సుగ్రీవో రాఘవేణాభిపాలితః ॥

ఇప్పుడు, రోజుకి ఒక సర్గచొప్పున, కథా ప్రారంభం నుండి ఈ గ్రంథంలోని భాగాన్ని శ్రద్ధతో చదవండి. అయిపోయిన వెంటనే, పై భాగంలోని

'జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః' అనే చోటి నుండి, 'రాజా జయతు సుగ్రీవో రాఘవేణాభిపాలితః' వఱకు చదివి, ఈ క్రింది మంగల శ్లోకాలు కూడ చదవండి.

మంగలం కోసలేంద్రాయ మహనీయ గుణాత్మనే
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగలమ్ ॥

ఆసాద్య నగరీం రమ్యామ్ అయోధ్యాం సహ సీతయా
రామాయ రామభద్రాయ రామచంద్రాయ మంగలమ్ ।

ఈ ప్రకారం మంగళం పలికి, ఏదో ఒకటి భగవంతునకు "నైవేద్యం"గా పెట్టండి. (అరటిపండు 1 లేదా పటికబెల్లం లేదా పంచదార) ఇంతే పారాయణమంటే.

ఇలా 68 రోజులూ అయ్యాక, మళ్లీ 1వ సర్గని పారాయణం చేసి ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి, స్వామికి అష్టోత్తర శత నామపూజ చేయించి, దీక్ష విరమించానని, ఆయనతో మనసులో ప్రకటించండి.

ఎంతటి మనశ్శాంతి చేకూరుతుందో, మీరే తెలుసుకుందురు గాక!

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే ।
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః ।

# 1వ సర్గము

## సుందరకాండ కథా ప్రారంభం

### ఆంజనేయుని నాలుగు అసాధ్య కార్యాలు

**తతో రావణ (1) నీతాయాః సీతాయాః శత్రుకర్శనః । (2)**
**ఇయేష పదమన్వేష్టుం చారణాచరితే పథి ॥ (1)**

జాంబవంతుడు ప్రోత్సహించిన మీదట, శత్రువులని నాశనం చేసే స్వభావం కల హనుమ, సీతాదేవిని వెదుకదలచి సముద్రం ఎదుట నిలుచున్నాడు. చుట్టూ వానరగణం నిలబడి ఉంది. రావణుడు ఎత్తుకొనిపోయిన సీత జాడని, దేవలోకంలో పాటలు పాడే **'చారణులు'** అనేవారు ప్రయాణించే మార్గంలో పోయి తెలుసుకోవాలని సంకల్పించాడు.

ఎదురుగా అంతా నీరే. అలలతో ప్రతిధ్వనిస్తున్న సముద్రాన్ని చూచాడు. *'ఇదెంత?'* అన్నట్లు, తలా - మెడా పైకెత్తి చూచేవారికి మదించిన వృషభం (3)లా కన్పించాడు.

ప్రయాణానికి ముందు వేగంగా, అటూ, ఇటూ, ఆనందంతో సంచరిస్తూ, పక్షి - మృగ సమూహాలని బెదరకొడుతూ సింహం (4)లా కనిపించాడు.

మదించిన ఏనుగులకి ఆటపట్టు అయిన, ఆ పర్వతంలోని ఒక ప్రదేశంలో నిలువబడిన హనుమ, మడుగు మధ్యలో ఏనుగు (5)లా అనిపించాడు.

న సూర్యాయ మహేంద్రాయ పవనాయ స్వయం భువే! (6)
భూతేభ్య శ్చాంజలిం కృత్వా చకార గమనే మతిమ్ ॥ (8)

ప్రయాణానికి ముందు దేవతలకి నమస్కరించవలెననే ఆలోచనతో, సూర్యునికీ, ఇంద్రునికీ, వాయువుకీ, బ్రహ్మకూ, పంచభూతాలకి నమస్కరించి, మళ్లీ తూర్పునకు తిరిగి తన, తండ్రి వాయువునకు నమస్కరించాడు.

ఇలా నమస్కరించగానే, హనుమ శరీరం పెద్దది కాసాగింది. (7) నాలుగు పాదాలమీదా, వానర రూపంతో అడ్డంగా నిలబడిన హనుమ శరీరం, 4 దిక్కులకూ, ఊర్ధ్వ

దిక్కుకీ పెరగసాగింది. వానరులు మొదట చూచినపుడు, ఆంజనేయుని మెడ ఉన్నచోటుకి, ఇప్పటి హనుమకి చీలమండలు వచ్చాయి. అంత ఎత్తు ఎదిగాడు. అలాగే వెనుకకీ, ముందుకీ, ప్రక్కలకి కూడా శరీరం పెరిగి 10 యోజనాల వెడల్పూ, 30 యోజనాల పొడుగూ అయిన శరీరం అయింది. పర్వదినాల్లో సముద్రునిలా, పరమోత్సాహంతో ఉన్నాడు హనుమ. నమస్కరిస్తూ నిలువబడిన అంగదాది వానరాలు తమ మెడని ఎత్తినా చూడ లేనంత ఎత్తుగా పెద్దగా అయ్యాడు హనుమ.

ఎగురదలచిన హనుమ, ఒక్కసారి పర్వతం మీద ఊగగానే, పర్వతం కదల సాగింది. ఆ కదులుడికి చెట్లు పూలురాల్చి, ఆంజనేయుడికి శుభం పలికినట్లైంది. తన నిండా పూలుపడి ఆ పర్వతం 'పుష్పగిరి' లా ప్రకాశించింది. ఆ పర్వతపు గుహలలో ఉండే జంతువులు, పర్వతం కదలడంతో ఒకదాని పిమ్మట మఱొకటి అతిభయంకరంగా అఱిచాయి. పర్వతంలో ఉన్న సర్పాలు, అకస్మాత్తుగా పడగలు విప్పి, కంఠం మీది కృష్ణపాదాలు కన్పడేలా నిటారుగా నిలబడి, ఎఱ్ఱని కళ్లతో, కోపంగా ఆ రాళ్లని ఎన్నోమార్లు కాట్లు వేసాయి. విషాన్ని హరించే ఓషధులు ఆ పర్వతం మీద ఉన్నా, విషం తీవ్రతకి రాళ్లు, ముక్కలు ముక్కలుగా పగిలిపోనే పోయాయి. తాపసులంతా ఏది జరుగుతోందో తెలియక భయపడ్డారు. విద్యాధర దంపతులు ఎందఱో, తమవిలువయిన వస్తువులను విడిచి ఆకాశంలోకి ఎగిరిపోసాగారు. ఎగురుతూ క్రిందికి చూడగా, పర్వతంలోని మహర్షులు వారితో ఇలా అన్నారు.

రామార్థం వానరాణాం చ చికీర్షన్ కర్మ దుష్కరమ్ । (8)
సముద్రస్య పరం పారం దుష్ప్రాపం ప్రాప్తు మిచ్ఛతి ॥ (30)

"విద్యాధరులారా! రామునికోసం, అతని అభ్యుదయాన్ని కోరే వానరుల కోసం, ఎవ్వరూ చేయలేని, సముద్రాన్ని దాటడం అనే అసాధ్యకార్యాన్ని ఇతడు చేస్తున్నాడు" అని. **ఇలా దాటదలచడం మొదటి అసాధ్యకార్యం.**

తన వలన పుట్టిన ఈ ఉపద్రవాలకి ఆనందించాడు. సంతోషంతో ఒక్కసారి ఒళ్లు విరిచాడు. అన్నివైపులకీ వెళ్లబోయే వాడిబాణాల్లాగా, శరీరంమీద రోమాలు నిలబడ్డాయి. గరుడుడు పాముని పట్టుకోగా, పాము వేగంగా తిరిగినట్లు, అతని తోకని గుండ్రంగా త్రిప్పాడు. ముందు కాళ్లని రెంటినీ దూరంగా చాపి, ఎగరడానికై పర్వతాన్ని గట్టిగా పట్టుకొన్నాడు. శరీరాన్ని సాగదీయడంతో నడుం సన్నగా కన్పించింది. పెద్ద భయంకరమైన పెడబొబ్బ పెట్టాడు. పక్షులు ఎగిరిపోయాయి. మృగాలు చెల్లాచెదురై పోయాయి. ఎగిరే దూరాన్ని ఒకసారి కళ్లతో చూచి, హృదయంలో ప్రాణ (9) వాయువుని బంధించి, ఎగురవలసిన ఆకాశాన్ని మళ్లీచూస్తూ వానరులతో ఇలా అన్నాడు.

యథా రాఘవనిర్ముక్తః శరః శ్వసన విక్రమః (10)
గచ్ఛేత్తద్వ ద్గమిష్యామి లంకాం రావణపాలితామ్ ॥ (40)
సర్వథా కృతకార్యోఽహమేష్యామి సహసీతయా । (42)

"రాముని బాణం, అతని ధనుస్సునుండి విడువబడి ఎలా వెడుతుందో, అలా లంకకి వెడతాను. సీత కన్పడకపోతే, ఈ వేగంతోనే దేవలోకానికి వెడతాను. అక్కడకూడ ఆమె లేకపోతే రావణుణ్ణి కట్టి తెస్తాను. మొత్తానికి పనిపూర్తి చేసికొని, సీతతో వస్తాను. లేదా లంకని మొత్తాన్ని రావణునితో సహా, పెకలించి తెస్తాను" అంటూ ఒక్కసారిగా ఆకాశానికి ఎగిరాడు.

హనుమ ఎగిరే వేగానికి (గాలి వీచుటవలన) వెంటవచ్చిన కొన్ని చెట్లు, పూలని రాలుస్తూ కొంతసేపట్లోనే సముద్రంలో పడి, చుట్టాన్ని సాగనంపడానికి వెళ్లిన బంధువులు తిరిగివస్తూ కన్నీరు కారుస్తూ దుఃఖ సముద్రంలో మునిగినట్లనిపించింది. మఱి కొన్ని చెట్లు రాజు వెంట వెళ్లే సైనికులులా కొంతదూరం వెళ్లి తిరిగి వచ్చినట్లనిపించింది (10 a). ఎగురుతూన్నప్పుడు, ఆ తోక వంకరగా ఉండి, గరుడుడు పట్టిన నిడుపైన పాములా ఉంది. క్రింది వానరాలకు ఇలా కన్పిస్తే, చాచిన రెండుచేతులూ - విప్పిన వ్రేళ్లతో, తమవైపు ఎగిరివస్తూన్న ఆంజనేయుణ్ణి చూస్తున్న విద్యాధరులకి 5 తలల పాములు రెండు, మీదికి వస్తూన్నట్లనిపించాయి. ఎఱ్ఱనైన కోపం కల కళ్లు, లంకని మ్రింగివేసేందుకు వస్తూన్న రెండు కార్చిచ్చుల్లా ప్రకాశించాయి.

ఇక, పై నుండి చూస్తూన్న సిద్ధులకి, తనచుట్టూ గుండ్రంగా త్రిప్పుకొని (11) ఉన్న హనుమతోక, సూర్యునిచుట్టూ ఉన్న పరివేషం (గుండ్రని గీత)లా కన్పించింది. గాలికి ఎదురుగా (దక్షిణానికి ఎదురుకదా!) పోతూంటే వచ్చిన ధ్వనులు మేఘ గర్జనలలా అన్పించాయి. హనుమ శరీరంతో సమానమైన (12) నీడ, సముద్రంలో పడుతూ, వేగంగా ఒకే కాలంలో ఇద్దఱూ (హనుమా, నీడా) వెళ్తూంటే నీళ్లలో కొంత మునిగి, పైన ప్రయాణిస్తున్న 'గాలిఓడ'లా అన్పించాడు. తన గాలి వేగానికి సముద్రంలోని నీళ్లు అటూ, ఇటూ, చెల్లాచెదరైపోతే, క్రిందనున్న జలచరాలు ఒక ప్రక్కనుండి స్పష్టంగా కనిపించాయి. ఆకాశానికి తాడు కట్టుకొని, భూమ్యాకాశాల మధ్యంగా, సముద్రంమీద అడ్డంగా ప్రయాణించే పెద్ద ఏనుగులా ఉన్నాడు మారుతి.

అతనికి కష్టం కలుగ కుండా సూర్యుడు (13) ప్రకాశం తగ్గించాడు. వాయువు అనుకూలంగా వీచాడు. యక్ష - కిన్నర - కింపురుషులు స్తుతించారు. ఈ కోలాహలంతో సముద్రుడు కూడ, తనవంతు సహాయం తాను చేయాలని సంకల్పించి, తనలో ఉన్న మైనాకుడనే పర్వత శ్రేష్ఠునితో "మైనాకా! రామ కార్యార్థం ఆంజనేయుడు వస్తున్నాడు.

లంకకి వెళ్లదలచిన అతనికి అలసట రాకుండా, నీ శరీరాన్ని పెద్దదిచేసి నడుమ నిలిచి, విశ్రాంతి తీసికొనే అవకాశం అతనికి కల్పించు. పాతాల రాక్షసులు రాకుండా, అడ్డుగా సముద్రంలో నిలువబడి, లోకానికి సహాయం చేసే స్వభావం ఉన్న నీవు ఈ పనిని చేసి, సత్పురుషుల అనుగ్రహాన్ని పొందు" అన్నాడు.

మైనాకుడు తన బంగారు శృంగాలతో పైకి లేచి నిలువబడగానే విఘ్నకర్త అని భావించిన ఆంజనేయుడు, ఱొమ్ముతో ఒక్క త్రోపు త్రోసాడు. దానితో శరీరం గగుర్పొడిచిన మైనాకుడు, మనుష్య రూపాన్ని ధరించి తన పర్వత శిఖరంపై నిలిచి ఇలా అన్నాడు.

"కృతేచ ప్రతికర్తవ్య మేష ధర్మః సనాతనః
సోఽయం తత్ప్రతికారార్థీ త్వత్త స్సంమాన మర్హతి ॥ (114)

ఉపకారం చేస్తే ప్రత్యుపకారం చేయడం శాశ్వత ధర్మం. రామునికి పూర్వులైన సగరపుత్రులు సాగరాన్ని (సముద్రుని) ఏర్పాటు చేసారు. ఆ కృత (చేసిన మేలుని)జ్ఞ (గుర్తుంచుకొనే) భావం సముద్రునికి ఉండి, నీకు అలుపు తీర్చేందుకు నన్ను నిలిపాడు. అతడు నీకు ఆవిధంగా ప్రత్యుపకారం చేయదలిచాడు. నాకున్న ఱెక్కలని ఇంద్రుడు నఱుక బోతుంటే మీ తండ్రి వాయువు, నన్ను వేగంగా సముద్రంలో పడవైచి, ఱెక్కలనీ నన్నూ రక్షించి నాకు ఉపకారం చేసాడు. నేను ఈ విధంగా ప్రత్యుపకారం నీకు చేయదలంచాను. ఆశ్రయమిచ్చి రక్షించిన సముద్రుని మాటపై అతనికీ ప్రత్యుపకారం చేయదలిచాను. (14)

అతిథిఃకిల పూజార్హః ప్రాకృతోఽపి విజానతా ।
ధర్మం జిజ్ఞాసమానేన కిం పునర్యాదృశో భవాన్ ॥ (121)

ఎంతటి అధముడైనా అతిథి అయితే పూజార్హుడే. కాగా నీవంటి ధర్మజ్ఞుడు అతిథిగా వస్తూంటే ఇక చెప్పవలసిందేమున్నది? నా పై విశ్రాంతినీ, నా ఆతిథ్యాన్నీ తీసికొని, నీ తండ్రిని సంమానించినంత (15) ఆనందాన్ని నాకు కల్గించు" అన్నాడు.

మనుష్య రూపంలో, మనుష్య ధ్వనితో మాటాడినవి విని, ఆంజనేయుడు మైనాకునితో ఇలా అన్నాడు.

"త్వరతే కార్యకాలో మే అహశ్చాప్యతి వర్తతే । (16)
ప్రతిజ్ఞా చ మయా దత్తా న స్థాతవ్య మిహా న్తరే ॥ (132)

మైనాకా! నిన్ను చూడడం, మాట్లాడడంతోనే అతిథి సత్కారం స్వీకరించి నట్టైంది. నేను ఉండడం లేదని కోపించవద్దు. పొద్దువాలేలోగా లంకకి వెళ్లాలి. మధ్యలో ఆగనని వానరులతో శపథం చేసాను" అని చిరునవ్వు ముఖంతో మైనాకుణ్ణి స్నేహ పూర్వకంగా స్పృశించి (17), అదే వేగంతో వెళ్లిపోసాగాడు. పై నుండి చూస్తున్న సిద్ధులూ, మహర్షులూ, దేవతలూ, ఇది **హనుమయొక్క 2వ అసాధ్య కార్యం.**

మైనాకుడు, ఇంద్రభయం లేకుండా పైకి వచ్చి దేవతాకార్యానికి సహాయపడ్డాడు కాబట్టి ఇంద్రుడు మైనాకునికి అభయ మిచ్చాడు:

ఆంజనేయుడు యథా ప్రకారం వెడుతుంటే, నాగులకి తల్లి ఐన 'సురస'ని దేవతలు ప్రార్థించి, అతనికి విఘ్నాన్ని కల్గించి, ఆతని ధైర్య - ఉత్సాహ - బుద్ధి బలాలని తమకి తెలియచేయవలసిందని అన్నారు.

పచ్చని కళ్లతో, పెద్ద కోరలతో, రాక్షస రూపంతో నిలబడిన సురస, ఆంజనేయునితో "ఓయీ! దేవతలు నిన్ను, నాకు ఆహారంగా చెప్పారు. నానోటిలోనికి పో" అంది.

"తస్యాస్సకాశం దూతోఽహం గమిష్యే రామశాసనాత్ ।
కర్తుమర్హసి రామస్య సాహ్యం విషయవాసిని ॥
...ఆగమిష్యామి తే వక్త్రం సత్యం ప్రతిశృణోమితే । (156)

"ఓ సురసా! రాముని పనిమీద వెడుతున్నాను. (రాముని కథ అంతా చెప్పి) నువ్వు అతనికి సహాయపడ దగినదానివి. నువ్వే ఇలా అంటే ఎలా? (18) అయినా సీతని చూచి తిరిగి వచ్చేటప్పుడు నీ నోటిలోనికి పోతాను గాని నన్నిప్పుడు అడ్డగించకు వస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను" (13) అన్నాడు హనుమ.

అయినా కాదని సురస నోరు తెరవడం ప్రారంభిస్తే, అంతకు మించి శరీరాన్ని పెంచాడు హనుమ. 90 యోజనాల నిడివిగా శరీరం పెంచిన హనుమని గెలవాలని, నూరుయోజనాల వెడల్పుగా నోటిని సురస తెరిస్తే, బుద్ధిమంతుడైన హనుమ సూక్ష్మరూపంతో లోనికి వెళ్లి క్షేమంగానూ - శీఘ్రంగానూ తిరిగి వచ్చి

"ప్రవిష్టోఽస్మి హి తే వక్త్రం దాక్షాయణి నమోఽస్తు తే ।
గమిష్యే యత్ర వైదేహీ సత్యశ్చాసీద్వరస్తవ ॥ (166)

"ఓ దక్ష పుత్రికా! నీవెవరవో నాకు తెలిసింది. బ్రహ్మవరం వల్ల ఇలా చేయగలిగావు. నీకు నమస్కరిస్తూ, సీతవద్దకి వెళ్లిపోతున్నాను" అన్నాడు.

సురస నిజరూపం ధరించి "హనుమా!

"అర్థసిద్ధ్యై హరి శ్రేష్ఠ గచ్ఛ సౌమ్య యథాసుఖమ్ ।
సమానయస్వ వైదేహీం రాఘవేణ మహాత్మనా ॥ (168)

"నీ పని సాధించడానికి సుఖంగా వెళ్లు. సీతని రామునికి చేర్చు" అన్నది. (20) **ఇది హనుమ చేసిన 3వ అసాధ్య కార్యమని** సర్వభూతాలూ ప్రశంసించాయి.

ఆంజనేయుడు అదే వేగంతో 'చారణమార్గం'లో ఎగిరివెడుతూనే ఉన్నాడు. 'చారణమార్గం' అంటే దేవగాయకులైన నారద తుంబురాది మహర్షులు తిరిగే త్రోవ. ఇంద్ర ధనుస్సు ఏర్పడేచోటూ - దేవతా విమానాలూ, మృగాలని వాహనాలుగా చేసికొని పోయేవారూ, సంచరించే మార్గమూ - పిడుగులకి అగ్ని రగిలేచోటూ - దేవేంద్రుని ఐరావతం, విశ్వావసుడనే గంధర్వరాజు నివాసం, విద్యాధర సమూహాలూ, అశ్వని మొదలైన నక్షత్రాలూ, కుజుడు మొదలైన గ్రహాలూ, సూర్య చంద్రులూ ఎప్పుడూ తిరుగుతూ కన్పిస్తూండేచోటూ అదే. గంధర్వ గానాలూ, యక్షుల గీతాలూ, కిన్నరుల వాయిద్యాలూ, నిరంతరం విన్పిస్తూంటాయక్కడ.

అలా పోతున్న హనుమని '**సింహిక**' అనే రాక్షసి చూచింది. దేహాన్ని పెంచి, వానిని తినడానికై, వాని నీడని పట్టుకొంది. తన వేగం కుంటువడడంతో, పైకీ, క్రిందికీ, ప్రక్కలకూ చూచి, క్రింద సముద్రంలో నుండి లేచిన మహారాక్షసిని గమనించి, వర్షకాల మేఘంలా శరీరాన్ని మఱింత పెంచాడు హనుమ.

"కపిరాజేన కథితం సత్త్వ మద్భుత దర్శనమ్ ।
ఛాయగ్రాహి మహావీర్యం తదిదం నాత్ర సంశయః ॥
సతాం బుద్ధ్వార్థతత్త్వేన సింహికాం మతిమాన్ కపిః (187)

సుగ్రీవుడు పంపుతూ "సముద్రంలో నీడని పట్టుకొనే రాక్షసి ఉంటుందన్నాడు. అది యిదేనన్నమాట." అని భావించాడు. దేహం పెంచిన హనుమని మ్రింగేటంతగా, నోరు తెఱచింది సింహిక. పాతాళ ద్వారంలాంటి దాని నోటిలోని ఆయువు పట్టుని చూచాడు హనుమ. తన దేహాన్ని క్షణంలో అతి సూక్ష్మంచేసి రాహువు నోటిలోనికి పోయే పూర్ణ చంద్రునిలా దాని నోటిలోనికి పోయాడు. అది నోరు మూసేలోగా తనగోళ్లతో, దాని ఆయువు పట్టుని చీల్చాడు. అది చచ్చి సముద్రంలో పడి పోయింది.

(రాహువు చంద్రుణి పట్టుకుంటాడు. చంద్రుడు రాహువు నోటినుండి బయటకు వస్తాడు. కాని, రాహువు కంఠాన్ని విష్ణువు ఛేదిస్తాడు. అలాగే సింహికని

ఆంజనేయుడు చంపి, బయటికి వస్తాడని చెప్పడమే, రాహువు నోటిలోనికి చంద్రునిలా హనుమ వెళ్లాడని పల్కడంలో భావం). ఇలా చచ్చిపడిన సింహికను చూచి, ఆంజనేయునిని ప్రశంసిస్తూ ఆకాశంలోని భూతాలు ఇలా అన్నాయి.

భీమమద్య కృతం కర్మ మహత్సత్త్వం త్వయాహతమ్ ।
సాధయార్థమభి ప్రేత మరిష్టం ప్లవతాం వర ॥

యస్య త్వేతాని చత్వారి వానరేంద్ర ! యథాతవ ।
ధృతిర్దృష్టిర్మతిర్దాక్ష్యం స్వ కర్మసు న సీదతి ॥ (198)

"ఓ హనుమా ! ఎందరికో అపకారం చేసిన ఈ సింహిక నీచేత చంపబడింది. ధైర్యమూ, సూక్ష్మదృష్టి, విషయాన్ని ఆలోచించే బుద్ధి, పనిని సాధించుకొనే శక్తి–అనే ఈ నాల్గూ ఉన్న సింహికనే చంపిన నీకు అసాధ్యం లేదు. (21) సీతాన్వేషణం చేసి రామానుగ్రహం పొందు" అని ఆ భూతాలన్నీ పలికాయి. **ఆంజనేయుడు చేసిన 4వ అసాధ్య కార్యం** సింహికావధ.

సముద్రం అయిపోయి, ఒడ్డు కన్పిస్తూంటే తన విశాలరూపాన్ని తగ్గించుకొని పోవాలని నిశ్చయించుకొని తన మామూలు రూపాన్ని పొందాడు.

"త ద్రూప మతి సంక్షిప్య హనుమాన్ ప్రకృతౌ స్థితః । (22)
త్రీన్ క్రమానివ విక్రమ్య బలివీర్య హరో హరిః ॥ (206)

అజ్ఞానం పోయిన ఆత్మజ్ఞానిలా, బలిని సంహరించి త్రివిక్రమావతారాన్ని విడిచిన వామనునిలా, పూర్వపు రూపాన్ని ధరించి, ఎదురుగా చూచాడు. లంబపర్వత శిఖరం మీదికి ఎగిరి, నిశ్వాసం విడిచి (ఎగుర బోయేముందు ఉచ్ఛ్వాసం చేసాడు) దేవతల రాజధాని అయిన అమరావతీ పట్టణంలా ఉన్న, త్రికూట పర్వతం మీది లంకానగరాన్ని చూచాడు. భర్తలను కలిసికోబోయే నదీ స్త్రీలున్న (23) 100 యోజనాల సముద్రాన్ని చూస్తూ (24) అనంతరకృత్యం ఆలోచించసాగాడు.

## విశేషాంశాలు :

### 1. తతో రావణ నీతాయా :-

'తతః' అంటే ఆ తరువాత, అని అర్థం. 'వానరులకి భేదాభిప్రాయాలు పోయాక - అందఱూ ఆంజనేయుడే సమర్థుడనే నిశ్చయానికి వచ్చాక -'సీతని వెదకడం అందఱి బాధ్యత' అనే భావనకు వచ్చాక' - అని అర్థం.

'రావణ నీతాయాః' - రావణ అనే పదంలోని 'వ' గాయత్రీ మంత్రంలోని 12వ అక్షరం. శ్రీమద్రామాయణ గ్రంథం శాశ్వత కాలం ఉండడానిక్కారణం, బీజాక్షరాలుండడమే. ప్రతి వేయి శ్లోకాలకీ ఒక్కొక్క అక్షరం చొప్పున 24వేల శ్లోకాల రామాయణంలో 24 అక్షరాలూ ఉంచబడ్డాయి. ఇది 12వ అక్షరం-అంటే 12 వేలవ శ్లోకమన్నమాట. అంటే సరిగా రామాయణం మధ్యలో ఉన్నామన్నమాట. (గాయత్రీ బీజాక్షరాలున్న 24 శ్లోకాలూ గ్రంథం చివరిలో ఉన్నాయి).

'రావణనీత' అంటే రావణునిచేత తీసికొనిపోబడినది' - అని భావం. ఎత్తుకొని పోబడినది అనకుండా, తీసికొనిపోబడినది అనడం వలన, రావణుని అభిప్రాయం, మోక్షం కోసం అమ్మవారిని తీసికొని పోయినట్లుగా తెలుస్తుంది. లేకపోతే 'రావణ హృతాయాః' అనవచ్చుగా! ఈ విషయం మఱింత ముందు వివరించబడుతుంది).

### 2. శత్రు కర్శన :-

రావణుడు శత్రువర్ధనుడు - హనుమ శత్రుకర్శనుడు. అందుకే రావణునిమీదికి హనుమ పోవడం. అనేక స్త్రీల విషయంలో **కామం.**

తనని కాదంటే **క్రోధం.**

పుష్పక విమానం మొదలైన వాటిని తేవడంలో **లోభం.**

ఇతర వివాహిత స్త్రీల విషయంలో **మోహం.**

దేవతలని పాఱద్రోలాననే **మదం,**

తనకి మించి ఎవరికీ ఉండరాదనే **మాత్సర్యం** - అనే ఈ ఆఱు శత్రువులూ ఉన్న దేహం రావణునిది.

శృంగార పరాయణులైన వానర స్త్రీల నడుమ ఉండికూడ **కామం లేనివాడూ,**
సీతాన్వేషణం వద్దని వానరులన్నా **క్రోధం లేనివాడూ,**

వాలిని చంపగలిగికూడ కిష్కింధా రాజ్య విషయంలో **లోభం లేనివాడూ,**

కనీసం ఒక దిక్కు సైన్యాధిపత్యమైనా (దక్షిణ దిక్కుకి అంగదుడు గదా!) కావాలనే **మోహం లేనివాడూ,**

**తనకే అంగుళీయక మిచ్చాడని** మదం ఉండవీలైనా **మదం లేనివాడూ,**

తనకు లేని కౌగిలిని ప్రారంభంలో రాముడు సుగ్రీవుని కిచ్చాడనే **మాత్సర్యం లేనివాడూ** హనుమ.

ఇలాటి 6 అంతశ్శత్రువులనీ కృశింపచేసాడు కాబట్టి శత్రుకర్శనః.

శత్రువులని వృద్ధి చేసికొన్నవాడు నశిస్తాడు. నశింప చేసికొన్నవాడు వృద్ధి పొందుతాడు. అందుకే రావణ నాశనమూ, హనుమకి కీర్తి పతాకమున్నూ.

**3, 4, 5 :** – వృషభం తెల్లగా ఉంటుంది. ఇది ధర్మానికీ, సత్త్వ గుణానికీ చిహ్నం. హనుమ, ముందుగా సత్త్వగుణంతో విజయాన్ని సాధించాలని, మానసికంగా భావన చేస్తే, అలా కన్పించాడు.

సింహం రజో గుణానికి సంకేతం. హింసకు ప్రతిరూపం. సత్త్వగుణం పనిచేయకపోతే రజోగుణం ద్వారా సాధించాలని భావన చేస్తూండగా, అలా కన్పించాడు.

ఏనుగు నల్లగా ఉండి తమోగుణానికి సంకేతం. పై రెండూ వీలుకాని పక్షంలో, (అశోకవన ధ్వంసం, లంకాదహనం, ఈ నడుమ అమాత్య పుత్రుల వధ వంటివి) తమోగుణ ప్రకారం సాధించాలని భావన చేయగా, అలా కన్పించాడు.

**6 :** – పుట్టిన వెంటనే సూర్యుణ్ణి పట్టబోయాననే కోపంతో తన పని చెడగొట్ట వద్దనీ, సూర్య పుత్రుడైన సుగ్రీవుని ఆజ్ఞపై, సూర్యవంశీయుడైన రాముని పనికై, సూర్య శిష్యుడైన తాను వెడుతున్నాననీ, సూర్యాంశ కల్గినవాడినని కూడా చెప్తూ సూర్యునకు ఆంజనేయుని నమస్కారం. 'ధియోయోనః ప్రచోదయాత్' అనే మంత్రం ప్రకారం బుద్ధిని ఇచ్చేది సూర్యుడే కాబట్టి, సకాలంలో సరైన బుద్ధికోసం నమస్కారం.

ఇంద్ర పుత్రుడైన వాలిని సంహరించామనే కోపం లేకుండా ఉండడానికీ, ఇంద్రియాలకి అధిపతి కాబట్టి, జ్ఞాన కర్మేంద్రియాలు సరిగా పనిచేసేవీలు కల్పించడానికి ఇంద్రునకు నమస్కారం. యజ్ఞం చేస్తే ఏ హవిస్సు ఇంద్రునకు వెడుతుందో, ఆ యజ్ఞాన్ని నాశనం చేసేవాడు (యజ్ఞఘ్నుడు) రావణుడైతే, యజ్ఞాన్ని నాశనం చేసే వారిని నాశనం చేసేవాడు (యజ్ఞఘ్నఘ్నుడు) రాముడు. 'రాముని పని సఫలం చేస్తే, నీకే హవిస్సులు లభిస్తాయి' – అందుకని సానుకూలం వ్యవహరించమని ఇంద్రునితో చెప్తూ ఇంద్రునికి నమస్కారం.

ఇంద్రజిత్తు వద్ద బ్రహ్మాస్త్రం ఉంది. తనకు క్షణకాలం బ్రహ్మాస్త్రానికి కట్టుబడాల్సిన శాపం ఉంది. ఆ బ్రహ్మ పేరిట అస్త్రం కాబట్టి రక్షించమని బ్రహ్మకి నమస్కారం.

ఎగిరి సముద్రాన్ని దాటవలసి ఉంది కాబట్టి ఊపిరితిత్తులకి శ్రమ లేకుండా, అనుకూల పవనాలని వీచడానికి, శరీరంలోనున్న వాయువులని (ప్రాణ–అపాన–వ్యాన–ఉదాన–సమాన) సరిగా ఉంచి రక్షించడానికి వాయువుకి నమస్కారం.

పంచభూతాలనీ అదుపుచేసి, రావణుడు ఏ పనైనా చేస్తాడు. 'ఏతేషామవిరోధేన...' పంచభూతాలనీ వ్యతిరేకించక పనిచేయాలి. అందుకే పంచభూతాలకి నమస్కారం.

మళ్లీ వాయువుకి నమస్కారం తండ్రి అనుజ్ఞకోసం. దక్షిణ దిక్కుకి తిరిగి నల్గురికి నమస్కరించడం రావణునకు అశుభం జరగాలని ప్రార్థించడమన్నమాట. తూర్పు తిరిగి నమస్కరించడం సూర్య వంశీయుడైన రామునికి శుభం కోరుతూ నన్నమాట. (దక్షిణ దిక్కుగా నమస్కరించరాదు. ప్రయాణం వేళ తూర్పుదిక్కుగా దేవతలకి నమస్కరించాలి) తండ్రి అనుజ్ఞకూడ పొందాలి.

7 :– ప్రారంభంలో హనుమ తనని వానరంగా భావన చేసికొన్నాడు. జాంబవంతుడు తనకి తనశక్తిని చెప్పాక, దేవతా భావన కల్గింది. నల్గురికీ, వాయువునకూ నమస్కరించగానే వాయుదేవతా స్థితికి ఎదిగిపోయాడు హనుమ. అదే శరీరం పెద్దది కావడమంటే.

8 :– రామునికోసం, వానరులకోసం దుష్కరమైన పని హనుమ చేయబోతున్నాడు– అంటే ఇక్కడి వానరాలు, వానరాలు కాదని గమనించాలి. "అప్సరస్సు చ ముఖ్యాసు గంధర్వీణాం తనూషు చ – సృజధ్వం హరిరూపేణ పుత్రాంస్తుల్య పరాక్రమాన్" – అప్సరసల, గంధర్వ స్త్రీల గర్భాలలో దేవతాంశలవలన కల్గినవారు వానరులు. వట్టి కోతులు కారు. కాబట్టి రామునికోసం, వానరుల కోసం హనుమ

వెడుతున్నాడు అంటే, విష్ణువు కోసం, దేవతల కార్యం కోసం వెడుతున్నాడని అర్థం. అలాటివారికి సహాయం, హనుమ చేయగల్గుతున్నాడంటే, దుష్కరం కాదా మఱి! ఎంత గొప్పవాడు మారుతి!

9. లోకంలో నోటినుండి వాయువుని విడుస్తూంటే మాటరావడం సాగుతుంది. కాని, ఆంజనేయుడు ప్రాణవాయువుని బంధించి మాట్లాడాడు కాబట్టి అసామాన్యుడు.

10. "రాముడు ధనుర్ధారి. బాణాన్ని నేను (హనుమ). లంక వెళ్లేచోటు". అన్నాడు హనుమ. బాణానికి ప్రాణం ఉండదు. అలాగే, ఎంత దూరం తన బాణం వెళ్లాలో, ఏమేమి ఆ బాణం చెయ్యాలో, ఎంతలోగా చెయ్యాలో నిశ్చయించి, విడిచేవాడు బాణం విడిచినట్లు, రాముని అభిప్రాయం ప్రకారం, అన్నీ నేను నిర్వర్తిస్తాను తప్ప, నా ఆలోచన ఏమీ ఉండదని హనుమ మాటలలోని ఆంతర్యం. 'రామభావనయే తన భావన' అని సారాంశం. 'రాముని బాణాన్ని నేను' అని హనుమ ఇక్కడ అనడం వలనే, 'రామబాణం' అంటే 'ఆంజనేయుడు' అనే అర్థం వాడుకలోకి వచ్చింది.

సీతాపహరణం చేయగలనా? లేనా? అని జంకుతూ రావణుడు వెళ్లి, వచ్చి—చెడి – ఆ పనిని పూర్తిచేస్తే, పనిని పూర్తిచేసికొని మరీ వస్తానని పనికి ముందే ధైర్యంగా చెప్తున్నాడు ఇక్కడ హనుమ. ఇలా చెప్పడానికి కారణం 'తాను రామదూత'. అంటే ధర్మదూత, 'ధర్మం' అంతటి ధైర్యాన్ని వ్యక్తీ కిస్తుంది. అధర్మం దొడ్డిత్రోవన (రామలక్ష్మణుల్లేక) సీతాపహరణం చేయిస్తే, ధర్మం బహిరంగంగా అధర్మపరులని వధించింది.

10 a. ప్రస్థితం దీర్ఘమధ్వానం స్వబంధుమివ బాంధవాః।
అనుజగ్ముర్హనూమంతం సైన్యా ఇవ మహీపతిమ్ । (47&48) అని శ్లోక వాక్యాలు. బంధువుని సాగనంపే బంధువులు ఇష్టంతో, భక్తితో వెళ్లినట్లు కొన్ని చెట్లు వెడితే, రాజు ఇచ్చే జీతభత్యాలని ఆశించి ఉద్యోగ ధర్మం వలన 'తప్పక' వెళ్లే రాజు వెంట సైనికుల్లా మఱికొన్ని చెట్లు వెళ్లాయి. పీఠాధిపతులెవరైనా వస్తే ఇష్టంతో భక్తితో దర్శించేవారు మొదటి జాతివారు. ప్రక్కవారు కూడా వెడుతూంటే తమని వెళ్లకపోతే నలుగురూ ఏమనుకుంటారో అనే ఆలోచనతో వెళ్లేవాళ్లు రెండోజాతివారు. ప్రక్కచెట్లు వెడుతూంటే, వాటితో మెలికపడిన తమ కొమ్మలున్న కారణంగా బలవంతానా వెళ్లిన చెట్లవంటివారు.

11. కొన్ని దేవాలయాలలో ఆంజనేయుని చుట్టూ వాలం ఉంటుంది. ఆ ఆంజనేయుడు, ఈ సందర్భంలో రామకార్యార్థియై ఎగురుతూన్నప్పటి వాడని గమనించాలి. అలా భావించి నమస్కరించాలి.

12. శరీరానికి సరిపడేంతటి నీడే, సరిగా ఆ శరీరం క్రిందే, పడుతోంది అంటే, సరిగా మిట్టమధ్యాహ్నమైందని అర్థం.

13. నమస్కారం చేసిన కారణంగా సూర్య-వాయు-అప్ (సముద్రుడు) మొదలైన భూతాలు సహాయపడ ప్రారంభించాయి.

14. ఉపకారం చేయడం గొప్ప ప్రత్యుపకారం అంటే, తీసికొన్న అప్పుని తీర్చినట్లే, అసత్యమాడకుండా, మైనాకుడు 'ప్రత్యుపకారం' చేస్తున్నానని పల్కడం, వినయాన్ని నేర్పడం.

పైగా, సముద్రునికి సహాయం సగరపుత్రులు (రాముని పూర్వీకులు) చేస్తే, హనుమకి సంమానం ఎందుకు చేయాలి?. చేస్తే, రామునిక్కదా సముద్రుడు చేయాలి!- చేయించాలి!- అంటే, రామభావన భావనతో పోయే ఆంజనేయుడు రామునిలాటివాడే. భగవంతునివిషయంలో ఎంతటి భక్తి శ్రద్ధలుండాలో వాటిని భాగవతుని మీద కూడ అది చూపాలి. అది ధర్మం.

ఇంద్రుడు, తన ఱెక్కల్ని ఇప్పుడైనా నఱుకుతాడేమోనని వంచనతో తప్పించు కోకుండా, భగవత్కార్యానికి సహాయపడ్డాడు కాబట్టే ఇంద్రుడు మైనాకునికి అభయమిచ్చి,స్థిరంగా, అలాగే ఉండిపోవచ్చునన్నాడు. భగవత్కార్యానికి వంచన సరికాదు.

కొన్ని లక్షల సంవత్సరాల క్రితం ఱెక్కలు నఱకడం, సాగరం త్రవ్వడం సాగితే, ఇప్పుడు వచ్చిన హనుమకి-వాళ్లు సహాయం చేస్తూ అదికూడ ప్రత్యుపకారమని గుర్తు చేస్తున్నారంటే, చేసిన మేలుని ఎంతకాలం గుర్తుంచుకోవాలో, అది ఎంతటి ఉత్తమ ధర్మమో తెలుస్తుంది.

15. పామరుణ్ణికూడా, అతిథి అయితే చాలు, పండితుడైనా ఆదరించాలనే ధర్మం తెలుస్తుంది.

16. రాముణ్ణి దశరథుడు, "ఒక రోజు ఆగి అరణ్యాలకి వెళ్లు"- అన్నప్పుడు రాముడన్నాడు, 'ప్రతిజ్ఞ చేసాను వెడతానని, వెళ్లక ఆగరాదు' అని. రామభావన భావన ఉన్న హనుమకూడా అదే చేసాడని భావం. గుహుడు అడిగినప్పుడుకూడ, ఇదే సమాధానం రాముడు చెప్పాడు. పైగా ముఖ్యమైన పనిమీద వెళ్లేవాడు, ఆతిథ్యాల జోరులో పడడం సబబు కాదుగదా!

ఆంజనేయుని బలాన్నీ, వేగాన్నీ గమనించి 100 యోజనాలూ ఎగరగలడా? అని పరీక్షించడానికి, రాబోయే సింహిక అనే రాక్షసినే, మొదటి విఘ్నంగా హనుమ

# 2వ సర్గము

## లంక ఎంతో బాగుంది!

శతాన్యహం యోజనానాం క్రమేయం సుబహూన్యపి ।
కిం పునస్సాగరస్యాంతం సంఖ్యాతం శతయోజనమ్ ॥ (4)

పూలచెట్లు, హనుమంతునికి పూలవాన కురిపించి శుభసూచన నిచ్చాయి. *"అనేక శతయోజనాలైనా ఎగిరిపోగల నాకు ఈ నూఱుయోజనాలొక లెక్కా?"* అనుకున్నాడు (1). అనేక వృక్షాలూ, ఉద్యాన వనాలూ, జలాశయాలూ ఎటువైపు చూచినా కళ్లకి ఇంపుగా గోచరించాయి.

దొంగతనంగా తాను తెచ్చిన సీతమ్మని, రాముడు దండయాత్ర చేసి తీసికెడతాడేమో ననే భయంతో, రావణాజ్ఞపై ఎందఱో రాక్షసులు, ధనుర్బాణాలతో, లంక చుట్టూ కాపలా కాస్తూ కన్పించారు (2).

ఎత్తైన త్రికూట పర్వతం మీద ఉంది లంక. లంక చుట్టూ పెద్ద అగడ్త (శత్రువులు రావీలులేకుండా త్రవ్విన, మొసళ్లని ఉంచిన, అగాధమైన కాలువ)లలో కలువలూ, కమలాలూ ఉన్నాయి. అగడ్త నానుకొని బంగారపు రేకుతాపడం చేసిన ప్రాకారం (పెద్ద ప్రహరీ) ఉంది. ఆ లోపల అనేకమైన అంతస్థులున్న భవనాలు, ఎదురు బదురుగా ఆకాశంలో గ్రహాల్లా ఉన్నాయి. ప్రాకారం బంగారపు రంగుతో, భవనాలు వెండి రంగుతో ఉండి, మేఘమండలం దాకా ఉండడంతో, మేఘాల రంగు కూడ ఈ రెంటికీ జతపడి, చూడచక్కగా కన్పించింది. ఆలోచిస్తున్నాడు హనుమ.

దాటవీలులేనిది సముద్రం. దాటివచ్చినా వెళ్లవీలులేనిది అగడ్త. దాటినా లెక్కలేనిది రాక్షస సైన్యం. రాముడు వానరులతో వచ్చినా జయింపలేడు.

## ఏ ఉపాయమూ లేదు

సామ-దాన-భేద-దండ- అని నాల్గు ఉపాయాలు. కఱకువాళ్లూ, మూర్ఖులూ రాక్షసులు. 'సామం' ప్రయోజనం లేదు. ప్రాకారం బంగారపు రేకులతో, ఇళ్లు వెండిరేకులతో తాపడం చేసికొన్న వీరికి ఏమి ఇయ్యగలం? ఇస్తే లొంగుతారన్పించినా 'అయోధ్య' విడిచి వచ్చిన రాముడు, ఏమి ఈయగలడు? 'దానం' నిష్ప్రయోజనకరం.

నేను వానరుణ్ణి, వీళ్లు రాక్షసులు. జాతి-భాష-భావం-ఆలోచన, ఒకటేమిటి? అన్నీ వ్యతిరేకమే, ఐతే భేదోపాయంఎలాసాధ్యం?(వాళ్లలోవాళ్లకి అభిప్రాయంభేదం కల్పించడం).

ఈ సైన్యాన్ని చూచాక 'దండోపాయమూ' అనవసరమే. ఉపాయం దొరికే ఉపాయం కావాలి. ఇక్కడికి సుగ్రీవుడూ–నీలుడూ, నేనూ–అంగదుడూ (6) మాత్రం రాగలం. ఇంతకీ ఈ ఆలోచన అంతా, సీతని చూచిన తర్వాత చేయాలి.

ఆమెని చూడాలంటే అదీ కష్టమే. రాక్షసులకి తెలియకుండా "వాయురప్యత్ర నాజ్ఞాతశ్చరేదితి మతిర్మమ" వాయువు కూడ వీచడానికి భయపడతాడనిపిస్తోంది. తొందరపడి ఏదైనా చేస్తే, పని చెడి పోతుంది.

"ఘాతయన్తి హి. కార్యాణి దూతాః పండిత మానినః ।" (40)

నేను చాల తెలివైనవాణ్ణి – అని భావించిన దూతలు, పనులని పాడుచేసి, రాజుకి కష్టం కల్గిస్తారు. నాకు, ఆ పేరు రాకుండా చూచుకోవాలి.

"తదహం స్వేన రూపేణ రజన్యాం హ్రస్వతాం గతః ।
లంకామభిగమిష్యామి రాఘవస్యార్థ సిద్ధయే ॥ (46)

కాబట్టి, ఈ రాత్రిలోనే, నేను నా రూపాన్నే (3) చిన్నదిగా చేసికొని, లంకని ప్రవేశిస్తాను. అన్ని భవనాలనీ రాత్రిపూట వెదికి వెదికి సీతని తప్పక చూస్తాను" అని నిశ్చయించి, రాత్రిపూట సీతా దర్శనం కోసం (4) ఉబలాట పడుతూ సూర్యాస్తమయం ఎప్పుడౌతుందా? అని ఎదురు చూచాడు.

### రాత్రి భాగం వెదుకుతాను

సూర్యే చాస్తం గతే రాత్రౌ దేహం సంక్షిప్య మారుతిః ।
వృషదంశకమాత్రస్సన్ బభూవాద్భుత దర్శనః ॥ (49)

అస్తమించగానే, ఆ రాత్రిభాగంలో 'గోమారుపు' (పశువుల కాళ్లపై వ్రాలి బాధపెడుతూండే చిన్నవైన కీటకాలు) పరిమాణంలో శరీరాన్ని తగ్గించుకొని, లంకానగరపు ముఖద్వారం నుండి లోనికి చూచాడు. లెక్కలేనన్ని గదులున్న, లెక్కలేని మేడలు కన్పిస్తే నిశ్చేష్టుడై, ఏమైనా సరే సీతని చూడగలననే ధైర్యాన్ని పొందాడు. ఇంతలో, చీకటి పల్చబడింది.

"దదర్శ చంద్రస్స కపి ప్రవీరః పోప్లూయమానం సరసీవ హంసమ్" (58)

తనకి సహాయపడేవానిలా, (5) తెల్లని కాంతితో ప్రకాశిస్తూ చంద్రుడు ఆకాశంలో ఉదయించి, తామరలతో నిండిన సరస్సులో విహరిస్తూన్న హంసలా అన్పించాడు.

## విశేషాంశాలు

(1) తండ్రి - పంచభూతాలూ - స్నేహితులు మనఃపూర్వక ఆకాంక్షా దీనిక్కారణం. అన్నిటికీ మించి 'రామదూత' కాబట్టి ఆ 'శక్తి' కల్గింది.

(2) ధనవంతుడు సుఖంగా ఉంటాడని లోకభ్రాంతి. 'విత్తానామార్జనే దుఃఖమ్ - అర్జితానాం చ రక్షణే - రక్షితానాం విభాగే చ - దుఃఖం విత్తస్య లక్షణమ్' అని ఉంది. ధనాన్ని సంపాదించడం ఒక కష్టం. దానిని దాచడం మఱీంత. (సీతా విషయక దుఃఖం ఇదే). కష్టపడి దాచినా, పంపకాలలో కష్టం రాకమానదు. అన్నదమ్ములూ, అప్పచెల్లెండ్రూ ఇలా ధన విరోధాలు పడుతూంటారు. అలా అని ధనం అక్కఱలేదని కాదు. అవసరమైన దానికంటె మించి ఉండడం అక్కఱలేనిది. మొత్తానికి ధనం, దుఃఖాన్ని కలుగ చేస్తుంది. అలాంటి భయం రావణునికి కల్గడం, అధర్మరూపంగా సీతమ్మని తేవడం వలననే.

(3) రూపం చిన్నది చేయడమంటే చిన్న శరీరంలోనికి 'పరకాయ ప్రవేశం' కాదు. పరకాయ ప్రవేశం వల్ల, కాయ మెవరిదో వారి లక్షణాలు వస్తాయి. అందుకని, తన శరీరాన్నే తన జాతి లక్షణాలు (ఎంతైనా ఎత్తు ఎగురడం, వాయు అంశ కారణంగా లభించిన ఇతర అసాధ్య లక్షణాలున్నూ) పోకుండా, రూపాన్ని చిన్నది చేసికొన్నాడు 'గోమారు పరిమాణ మంతది'గా.

కొందఱు, పిల్లిరూపమంత రూపం అన్నారు. రాత్రివేళ చూడ గలిగే కళ్లు పిల్లికి ఉంటాయి. కాబట్టి పిల్లి రూపమని సమర్థించారు. ఇంతకీ పరిమాణంలో పిల్లి అంతటి రూపమని అర్థమేకాని, రాత్రివేళ చూడ్డానికి వీలైన పిల్లి రూపం కాదు ఆంజనేయుడు ధరించినది. మరీ చిన్నవైన ఆంజనేయ రూపాలు ఆలయాల్లో కన్పిస్తాయి. ఆ రూపాలని సీతాన్వేషణ ధారియైన ఆంజనేయ రూపాలుగా భావించాలి.

4, 5 : 'చంద్రాం హిరణ్మయీం లక్ష్మీమ్' అని శ్రీ సూక్తం. 'సీతమ్మ, వైకుంఠంలో లక్ష్మి. చంద్రుని తోబుట్టువు కూడ. అందుచేతనూ, చంద్రుడు సహాయపడతాడు గదా! పైగా అమ్మవారి దర్శనం చంద్రబలం ఉంటేనే ఔతుంది. వసంత నవరాత్రులు, చైత్ర శుద్ధ పాడ్యమి నుండి చంద్రకళలు పెరుగుతూంటే సాగుతాయి. చంద్రోదయమై ప్రకాశం పెరుగుతున్న కొద్దీ, ఆంజనేయునికి మనోబలమూ, అమ్మవారి దర్శన భాగ్యమూ లభిస్తాయి.

(6) భగవద్దర్శనం, సూర్య (బుద్ధి నిచ్చేవాడు) పుత్రుడు సుగ్రీవునికీ, అగ్ని (సనః పితేవ సూనవే-కొడుక్కి తండ్రిలా అన్నీ ఇచ్చేవాడు) పుత్రుడైన నీలునికీ, వాయు (ప్రాణులకి ఆధారమైనవాడు) పుత్రుడు హనుమకీ, అం (భగవంతుని) గద (సంకీర్తన చేసే లక్షణమున్న అంగదునికీ తప్ప ఎవరికీ కాదని హనుమ అంతరాలోచనం.

❀ ❀ ❀

# 3వ సర్గము

## మరికొంత ధైర్యం వచ్చింది

మనోధైర్యం వహించి, ఉద్యాన వనాలనీ, జలాశయాలనీ చూస్తూ, చతురంగ బలాలు చేసే ధ్వనులని వింటూ, జెండాల రెపరెపలని ఆలోకిస్తూ, కుబేరుని 'అలకాపురం' లాగానూ, ఇంద్రునికి తూర్పున ఉన్న 'వస్వౌకసారము' అనే పట్టణంలానూ ఉన్న లంకని చూచి, ఉప్పొంగిపోయినాడు హనుమ.

"కుముదాంగదయోర్వాపి సుషేణస్య మహాకపేః ।
ప్రసిద్ధేయం భవేద్భూమిః మైందద్వివిదయోరపి ॥ (15)

"నేను మొదట భయపడినా, కుముదుడూ–అంగదుడూ–సుషేణుడూ–మైందద్వివిదులూ కూడ ఇక్కడకు రాగలరని ధైర్యంగా తోస్తోంది. వీరేకాదు సుగ్రీవ–కుశపర్వ–ఋక్ష––కేతుమాలులూ, నేనూ కలిసి, లంకని జయించివేయగలం." (1) అనుకుంటూ రత్నాల దీపాల వలన చీకటి ఏ మాత్రమూ లేనిదీ, చంద్రోదయం వలన సంతోషంగా ఉన్నదీ, అయిన రాత్రిలో హనుమ తిరగసాగాడు.

"ఒరే కోతీ! అడవిలో తిరిగే నీ కిక్కడ పనేమిటి? యథార్థం చెప్పు చంపేస్తాను" అని అసహ్య ఆకారం ఉన్న లంకకి అధిదేవత అయిన కామరూపిణి అరిచింది.

"చెప్తాను గాని నీవెవరవు? ఇంత అసహ్యంగా ఎందుకున్నావు? నన్నెందుకు జడిపిస్తున్నావు?" మారుతి అడిగాడు.

" 'లంక' అంటే నేనే. కాపలాకాస్తుంటాను. నన్ను కాదని ఎవ్వరూ లోనికి పోలేరు. నువ్వెవడివో నిజం చెప్పు (2) అంది లంకాది దేవత.

ద్రక్ష్యామి నగరీం లంకాం సాట్ట ప్రాకార తోరణామ్ ।
ఇత్యర్థమిహ సంప్రాప్తః పరం కౌతూహలం హి మే ॥ (33)

వనాన్యు పవనానీహ లంకాయాః కాననాని చ ।
సర్వతో గృహముఖ్యాని ద్రష్టుమాగమనం హి మే ॥ (34)

హనుమ చెప్పాడు. "ప్రాకారాలూ, బురుజులూ, ద్వారాలూ, వనాలూ, ఉపవనాలూ, ఒకటేమిటి? అన్ని భవనాలనీ ఊరికే చూచి పోదామని కుతూహలం కలిగి వచ్చాను". అని.

కూడదని ఆ రాక్షసి తిరస్కరించి హనుమంతుణ్ణి అఱచేత్తో ఫెళ్లున చరిస్తే, మారుతి కూడ 'స్త్రీ చేతి మన్య మానేన'(3) ఆడుదని ఆలోచించి చావవీలులేని గట్టి గ్రుద్దు గ్రుద్దాడు. ఆ గ్రుద్దు సామాన్యంగా లేక పోవడంతో రాక్షసి ప్రార్థిస్తూ: మహావీరా! స్త్రీని చంపరాదని అనుగ్రహించావు. ఎవరూ జయింపలేని నన్ను జయించావు.

> సీతా నిమిత్తం రాజ్ఞస్తు రావణస్య దురాత్మనః ।
> రక్షసాం చైవ సర్వేషాం వినాశ స్సముపాగతః ॥
>
> దిదృక్షయా త్వం జనకాత్మజాం సతీమ్ ।
> విమార్గ సర్వత్ర గతో యథా సుఖమ్ ॥ (51)

రావణుడు దేవతలపై దండయాత్ర చేసి నందికేశ్వరాదులని బాధించగా, 'లంక భస్మం అవుతుందని' వారు శపించారు. బ్రహ్మ, నా ప్రార్థనపై, "ఎప్పుడు ఒక కోతి నిన్ను అవలీలగా జయిస్తాడో" అప్పుడు ఈ శాపం అమలు జరుగుతుంది" అన్నాడు. అప్పటి నుండి భయంతో ఎదురుచూస్తున్నాను. దుర్మార్గుడైన రావణునిచే తేబడిన సీతకారణంగా, రాక్షసులకీ, లంకకీ చావు మూడింది. బ్రహ్మ వాక్కు అసత్యం కాదు. మొత్తం శాపగ్రస్తమైన లంక అంతా తిరిగి, అనాయాసంగా సీతని వెతుక్కో" (4) అంది.

## విశేషాంశాలు

(1) చంద్రుడు మనస్సుకి స్వస్థతని కల్గిస్తాడు. అందుకే చంద్ర ప్రకాశం పెరుగుతూన్న కొద్దికీ హనుమలో ధైర్యం పెరుగుతూ, "మఱి కొందఱు లంకకి రాగలరు" అనీ, గెలువగలమనీ నిర్ణయిస్తున్నాడు. వివాహ-గృహ ప్రవేశాది ముహూర్తాల్ని కూడా, చంద్రుడు పెరిగే కాలంలోనే పెట్టడానికి కారణం యజమానికి మనోబలం పెరుగుతూంటుందని.

(2) కష్టం కలుగుతుందని ఎవరైనా చెప్తే, జరిగే ప్రతిసంఘటననీ దానికి సంబంధించిన దానిగానే ఆలోచిస్తాం. కోతివలన కష్టం వస్తుందని నందికేశ్వర శాపం కదా! అందుకని, వచ్చిన హనుమని చూచి 'ఔనా? కాదా?' అని తేల్చుకోడం కోసమే, రాక్షసి - "యథార్థం చెప్పు" అని అడగడం.

శ్రీ మద్రామాయణంలో అన్ని సందర్భాలలోనూ 'ఒకరి విషయం ఒకరు చెప్పుకుని, ఆ పిమ్మట యుద్ధం చేసుకుంటారు'. దీనిక్కారణం, శాపం అనుభవించేవారు ఒకరు (రాక్షసి) - శాపానికి మోక్షాన్ని ఇచ్చేవారు మఱొకరు (హనుమ) కాబట్టి. విరాధ-ఖర-దూషణ-త్రిశిర-కబంధాదుల వధలో కూడ ఇంతే.

(3) శ్రీ రామచంద్రుడు మొదటగా సంహరించింది 'తాటక' అనే 'స్త్రీ' ని. హనుమకి మొదటి పరీక్ష 'రాక్షసి' పైనే. రామ భావభావనతో చంపరాదని నిశ్చయించి 'చావరాని గ్రుద్దుని గ్రుద్దాడు. 'రాముడు తాటకని చంపనే చంపాడు' కదా! అంటే, తాటకికి అనేక అవకాశాల నిచ్చాడు- తనని తాను రక్షించుకొమ్మని. అది వినలేదు. పైగా, దాన్ని చంపితే తప్ప, రాముని మీద ప్రతీకారబుద్ధి, దాని పుత్రుడు మారీచునికి కల్గదు. మారీచుడే లేకపోతే సీతాపహరణమూ - రావణ విరోధమూ ఉండక రామాయణమే ఉండేది కాదు.

(4) రామునికి 'సీతాపహరణ వార్తని' పక్షి అయిన జటాయువు చెప్పాడు. మృగాలు, ఆ దిశకు పరుగెత్తి - రావణుడే అపహరించాడని ధ్రువ పఱిచాయి. కోతి అయిన సుగ్రీవుడు, 'ఆభరణాలని చూపి', రావణుడే అపహరించాడని నిశ్చయించాడు. సంపాతి, "స్వయంగా చూస్తూ చెప్పున్నాను-లంకలో ఉంది సీత" అన్నాడు. ఎలుగుబంటి జాంబవంతుడు, హనుమని ప్రోత్సహించాడు లంకకి పొమ్మని. మనుష్య జాతివాడైన రామునికి అన్ని జాతుల ప్రాణులూ సహకరించడం, అలాగే ప్రతిపక్షందైన రాక్షసికూడా "సీత, లంకలోనే ఉంది - వెతుక్కో' అని అంది. ఇలా ఇందఱు పల్కడం చూస్తే, ధర్మాత్ములకి అందరూ సహాయపడతారని తెలుస్తుంది.

నిజంగా సహాయపడదలిస్తే 'అశోకవనం'లో ఉందని చెప్పవచ్చుగా! రాక్షసి చెప్పదేమి?' అంటే, హనుమ తనంత తానుగా లంకకి ఉన్న సర్వద్వారాలనీ, ప్రదేశాలనీ వెదుక్కోంటే తప్ప కార్యసాధన చేయలేడు కాబట్టి, రాక్షసి 'విమార్గ సర్వత్రగతో యథా సుఖమ్', సుఖంగా వెతుక్కో అంది. అయినా 'సోఽన్వేష్టవ్యో నిధిధ్యాసితవ్యః' అని శ్రుతి. భగవంతుణ్ణి వెదికి పట్టుకోవాలిట తప్ప, అక్కడున్నాడంటే తెలిసేవాడుకాడు'ట.

ఎందఱో దేవతలు ఉన్నా మనకు నచ్చిన ఎవరో ఒకర్ని వెదికి పట్టుకోవాలిట తప్ప 'న భక్తి ర్బహుముఖా' అన్నట్లు కొన్నాళ్లు ఒకరినీ, మఱికొన్నాళ్లు మఱో దేవుణ్ణీ చొప్పున ఆరాధించరాదట. తప్పని అర్థంకాదు. ఎక్కడా మనసు లగ్నంకాదని దీనిభావం. 'నీవే తప్ప ఇతః పరంబెఱుగ...' అన్న గట్టి భావంతో ఒకే భగవంతుణ్ణి వెదుక్కోవాలి. రాముణ్ణే నమ్మి, రామునికి నచ్చిన సీత గుణగణాలని రాముణ్ణి సేవించుతూన్నందువల్ల తెలిసి వెదుకుతున్నాడు కాబట్టి, ఇదే సరైన మార్గమని లంకిణి చెప్తోంది. లంకిణి సామాన్యురాలు కాదు. బ్రహ్మ దేవుడంతటి వాణ్ణి ప్రార్థించి లంకానాశనం ఎప్పుడౌతుందో తెలిసికోగలిగినంతటిది.

రాక్షసి మూడు విషయాలు చెప్పినట్టైంది. (1) బ్రహ్మ శాపంవలన లంక నాశనమౌతుంది. (2) రావణుడు, సీతని తేవడం తప్పు. దాని వలన లంకా రాక్షసులంతా చస్తారని మేం అనుకుంటూంటాం. ఈ భయంతో ప్రార్థించిన మాకు, లంకా నాశనాన్ని, బ్రహ్మ కూడా, కోతి వచ్చేవఱకూ - వాయిదా వేసాడే తప్ప, శాపాన్ని రద్దు చేయలేదు. (3) సుఖంగానే పని ఔతుంది. సీత ఇక్కడే ఉంది.

# 4వ సర్గము

## హనుమంతుని నగర ప్రవేశం

స నిర్జిత్య పురీం శ్రేష్ఠాం లంకాం తాం కామరూపిణీమ్ ।
అద్వారేణ మహాబాహుః ప్రాకార మభిపప్లువే ॥ (1)

లంకాధిదేవత ఐన రాక్షసిని జయించి, లంకా నగర ప్రధాన ద్వారం గుండా లోనికి వెళ్లడానికి వీలున్నా, హనుమ ప్రాకారం మీదుగా ఎగిరి లోపలికి వెళ్లాడు (1). సకల శాస్త్రవేత్త కాబట్టి, రావణుని నాశనాన్ని కోరుతూ, లంకలోకి ద్వారం గుండా కాక ప్రవేశించడమే కాకుండా, నగరంలో కూడా, మొదటగా ఎడమకాలు పెట్టి ప్రవేశించాడు.

నాలుగువైపులా ద్వారాలుండి, నాలుగు విశాలమైన శాలలుండే సర్వతో భద్రమనే పేరుగల మేడలూ – పశ్చిమం వైపు ద్వారం లేక మొదటి గది సన్నగా ఉండి, ఆపై గదులన్నీ వెడల్పుగా ఉండి, గుఱ్ఱం ఆకారంలో ఉండే హయాననమనే పేరుగల మేడలూ – దక్షిణద్వారం లేని వర్ధమానమనే పేరుగల మేడలూ – తూర్పు ద్వారం లేని స్వస్తికమనే పేరుగల మేడలూ – కన్పించాయి. ఇవన్నీ వాస్తు విధానానికి అనుగుణంగా ఉండి రాజుకి ఔన్నత్యాన్ని ఇస్తున్నాయి. (3).

దేవలోకంలో అప్సర స్త్రీలలా పాడుతూన్న ఉత్తమ సంగీతం విన్పించింది. ఇంక కొంత ముందుకు సాగగానే అందెల చప్పుడూ రత్నాభరణాల ధ్వనులూ, బంగారు అందెల రవళీ విన్పించింది.

అంతలోనే రాక్షసుల భుజాలు చఱచుకొనే చప్పుళ్లూ అనవసరంగా అఱచే మదపు ధ్వనులూ, విన్పించాయి.

మఱికొంత ముందుకి పోగా, ఆశ్చర్యమైంది మారుతికి.
శుశ్రావ జపతాం తత్ర మంత్రాన్ రక్షోగృహేషు వై
స్వాధ్యాయ నిరతాంశ్చైవ యాతుధానాన్ దదర్శ సః (13)
దీక్షితాన్ జటిలాన్ ముండాన్ గోఽజినాంబర వాససః ।
దర్భ ముష్టి ప్రహరణాన్ అగ్ని కుండాయుధాం స్తథా ॥ (16)

నిత్యం యథావిధిగా అగ్నిహోత్రాన్ని చేసే దీక్షితులూ, జడలు ధరించిన వాన ప్రస్థులూ, తలలని బోడి చేసికొన్న యతులూ, ఎద్దు చర్మాన్ని ధరించే వారూ, దిగంబరులైన అవధూతలూ, చేతిలో దర్భలని ధరించి అవసరమైనప్పుడు మంత్రించి అస్త్రాలుగా చేసే శక్తి ఉన్న 'దర్భ ముష్టి ప్రహరణులూ', అగ్ని కుండాల నుండి శక్తిని పుట్టించి ఆయుధాలుగా ప్రయోగించే శక్తి ఉన్నవారూ ఎందఱో అక్కడ కన్పించారు.

కత్తులూ, విళ్ళూ, కవచాలూ, ఇంకా ఇతర మారణాయుధాలని ధరించిన వారూ, భయంకరులూ, జండాలని ధరించినవారూ, పతాకాలని పట్టినవారూ(4), సురూపులూ, కురూపులూ, చందనం పూసికొన్నవారూ, వికారరూపులూ.....ఇలా చిత్రవిచిత్రంగా జనులు కన్పడ్డారు. అయితే అందటిలో ఏ ఒక్కరిలోనూ ఏమరుపాటు లేక అప్రమత్తంగా ఉన్నారు.

గుఱ్ఱాలు సకిలిస్తూంటే, స్త్రీల ఆభరణాలు ధ్వనిస్తూ ఉంటే, రాక్షసులు గోచరిస్తూంటే, బంగారు మెట్లతోనూ, ముత్యాల దండలు వ్రేలాడుతూనూ, చక్కని సువాసనలు వెదజల్లుతూనూ, బంగారు అరుగులు కలిగిఉండీ, కృష్ణాజినాలూ ఉన్న రావణుని అంతఃపురంలోకి మెల్లగా మారుతి ప్రవేశించాడు. (5)

## విశేషాంశాలు

1, 2) గ్రామం వా నగరం వాపి పత్తనం వా పరస్య హి-విశేషా త్సమయే సౌమ్య న ద్వారేణ విశేన్నృప! అనే ప్రమాణాన్ని బట్టి శత్రువుల నగరాన్ని ప్రధాన ద్వారం ద్వారా ప్రవేశించరాదు. (వాని నాశనాన్ని కోరేట్లైతే). అలాగే ప్రయాణ సందర్భంలో, గృహ ప్రవేశ, వివాహకాలాల్లో మొదట కుడికాలు పెట్టాలి. శత్రుపురంలో ఎడంకాలు ముందుంచాలి. (వాని నాశనాన్ని కోరేట్లైతే). ప్రయాణకాలే చ గృహ ప్రవేశే వివాహకాలేఽపిచ దక్షిణాంఘ్రిం కృత్వాగ్రత శ్శత్రు పుర ప్రవేశే వామం నిదధ్యాత్చరణ్ నృపాల! అని ప్రమాణం.

ఈ శరీరమే లంక. అనేక సౌఖ్యాలనీ, విలాస వినోదాలనీ సమకూర్చే ప్రతివ్యక్తి రావణుడే. ఈ సౌఖ్యవిలాసాలని క్రిందుచేసి పోవాలని భావించిన ఆంజనేయుడు జ్ఞాని కాబట్టి ఆ ప్రాకారాన్ని క్రిందుచేస్తూ పై నుండి ఎగిరి దూకాడు. జ్ఞానమీయవలసిన స్వాములూ, పీఠాధిపతులూ సౌఖ్యవినోదాలని ఆశ్రమాలలో నెలకొల్పుకుని, విలాసమయ జీవితాన్ని గడుపుతూంటే వాళ్లూ రావణులే ఔతారు. వాటిని త్యజిస్తే ఆంజనేయులౌతారు. రావణులైతే భగవంతుని ఆగ్రహానికీ, ఆంజనేయులైతే అనుగ్రహానికీ పాత్రులౌతారు.

(3) వాస్తు సరిగా లేకపోతే ముందు గృహ యజమానికీ, తర్వాత గృహంలో తాత్కాలికంగా నివసించే వానికీ, ఆ మీదట అలా కట్టుకొనడానికి అనుజ్ఞనిచ్చినందుకు ఆ పురాధినేతకీ నష్టం కల్గుతుంది. వాస్తు ప్రకారమే ఇళ్లు కట్టినా రావణునకు నాశనం ఎందుకు కల్గింది? అంటే, అధర్మమే కారణం. ఎంత శాస్త్రోక్తంగా ఇల్లు కట్టినా పర భార్యాపహరణం వంటి అధర్మం ఉంటే, ఈ వాస్తు ఏ మాత్రమూ రక్షింపలేదు. కాకపోతే ప్రమాదాన్ని వాయిదా వేస్తుంది. ఇలాటి మహా అధర్మాన్ని చేసిన రావణుణ్ణి కూడా ఆ లంకావాస్తు కొంతకాలం రక్షింప గల్గింది.

(4) ఈ పద్ధతిని బట్టి వైదిక విధానం లంకలో ఉందని స్పష్టంగా తెలుస్తుంది. ఇంతగా వేదోక్త పద్ధతిని ఆచరిస్తూ, యజ్ఞ యాగాదులని నిర్వహిస్తూన్నా, రావణుడు నశించాడంటే అధర్మం కారణం. **కాబట్టి అధర్మం చేసి యజ్ఞయాగాదులెన్ని చేసినా ప్రయోజనం శూన్యం.** పైగా వారిలో, దర్భలని మంత్రించి చంపజూచేవారూ, అగ్నిగుండాల్లోంచి శక్తిని పుట్టించి చంపేక్షుద్ర శక్తులవారూ ఉన్నారు. ఇది కూడా లంకా నాశన కారణాల్లో ఒకటి. క్షుద్రశక్తులూ, క్షుద్రమంత్రాలూ ఫలితంకంటె - దుష్ఫలితాన్ని దారుణంగా ఇస్తాయనడానికి రావణనాశనమే సాక్ష్యం. అన్నిటికీ మించి, ఈ వైదిక విధానం కొనసాగుతూన్నట్లు చెప్పబడుతూండడం వల్ల, కొందఱు భావించినట్లుగా రావణుడు ద్రావిడుడుకాదు. వైదిక నాగరికతని అవలంబించినవాడే. రాముడు ఆర్యులనే జాతికి చెందినవాడూ కాడు. అప్రాచ్యుడు (ఇంగ్లీషువాడు) తన పద్ధతిని ప్రవేశపెట్టాలనే భావంతో చరిత్రని తలక్రిందులుగా రాస్తే, అది చదివి గంజాయితో మత్తెక్కిన మేధతో, శ్రీమద్రామాయణాన్ని ఆ రాతకి అనుగుణంగా సమన్వయించారు మనవాళ్లు. చాలమంది సంస్కృత పండితులకి ఆంగ్ల చరిత్ర చదవాలనే ఊహ లేకపోడం, ఆంగ్లం రాకపోవడం - అలాగే చరిత్ర చెప్పేవారికి సంస్కృతం చదవాలనే ఊహ లేకపోవడం, సంస్కృతం సుతరాం రాకపోవడం - వలన అప్రాచ్యుల చరిత్రలు ఇంకా దేశంలో ఊపిరి పీలుస్తున్నాయి. వ్యాస వాల్మీకులని కూడా ఏ ఒకటవ శతాబ్దంలోకో లాగి మన సంస్కృతిని నాశనం చేయాలనే భావన కల అప్రాచ్యులు పుడతారనే, భారత రామాయణ భాగవతాల్లో ముఖ్య సంఘటనల సందర్భాలలో ఏ నక్షత్రాలు ఎక్కడున్నదీ, ఏ సంవత్సరమైనదీ వివరించి ప్రాచీనతని ప్రాచీనులు అదృష్టవశాత్తూ రక్షించారు. అప్రాచ్యుల కిది తెలియదు గదా!

అలాగే అప్రాచ్యులు 'జ్యోతిషం తప్పు' అనే వాదాన్ని లేవదీస్తే, దాని గూర్చి ఏ మాత్రపు అవగాహనా లేనివారంతా 'తప్పు' అని వంత పాడుతున్నారు. (తమ వివాహం-గృహప్రవేశం-మొదలైన అన్నీ జ్యోతిషం ప్రకారమే చేసికొని కూడ.)

(5) ఈ సర్గలో ముందుగా గృహాలనీ, పిమ్మట గృహిణులనీ, మీదట వైదికులనీ, ఆ తర్వాత యోధులనీ, ఇలా చూచాడు మారుతి. గృహాలు శాస్త్రబద్ధంగా ఉన్నా, గృహంలోని వారు అధర్మపరులు. గృహిణుల అలంకారాలు గొప్పవైనా, నిత్య శృంగార పరాయణలై వారు అధర్మిణులు. వైదికులు ధర్మబద్ధంగా యజ్ఞాదులని చేసినా, అధర్మాన్ని రక్షించాలని యజ్ఞాదులని నిర్వహించుతున్నారు కాబట్టి వారు అధర్మ పరులూ - పైగా క్షుద్రశక్తి మంతులున్నూ. యోధులు ఆయుధధారులే అయినా, అధర్మపరుణ్ణే సంరక్షిస్తున్నారు. ఇది గమనించాడు కాబట్టి మారుతి భావించాడు "రామలక్ష్మణులు రాగలరు. జయించి తీరుతారు" అని.

# 5వ సర్గము

## ఇంకా సీత కన్పడలేదు

రావణ సభాభవనంలోకి మారుతి వెళ్లే సమయానికి చంద్రుడు, ఆకాశమధ్యంలో ఉన్నాడు.

హంసో యథా రాజతపంజరస్థః సింహో యథా మందర కందరస్థః।
వీరో యథా గర్విత కుంజరస్థః చంద్రో విబభ్రాజ తథాఽంబరస్థః॥ (4)

వెండి పంజరంలో ఉన్న హంసలా, మందర పర్వతగుహలో ఉన్న సింహంలా, మదపుటేనుగు పై నున్న వీరునిలా ఉన్నాడు చంద్రుడు. వాడియైన కొమ్ములున్న ఆబోతులా, పెద్దపెద్ద శిఖరాలున్న పర్వతంలా, బంగారు కొమ్ములని కల్గిన ఏనుగులా ఉన్నాడు. (1)

రాక్షస సంచారం ప్రారంభమైంది. మత్తులో ఒళ్లు తెలియక చలుచుకుంటున్న వాళ్లూ, వికవిక నవ్వుతున్న వాళ్లూ, కోపంతో నిట్టూరుస్తున్న వాళ్లూ, ఒకళ్ల నొకళ్లు వెక్కిరించుకుంటూన్న వాళ్లూ, స్త్రీల యెడ 'అసభ్యత' అని తెలియక ప్రవర్తిస్తున్న వాళ్లూ, విల్లు ఎక్కుపెట్టే వాళ్లూ, రథ గజ భద్రగజాల మీద తిరిగేవాళ్లూ ఎందఱో కన్పిస్తున్నారు హనుమకి.

ప్రకాశ లక్ష్మ్యాశ్రయ నిర్మలాంకో రరాజ చంద్రో భగవాన్ శశాంకః (6)
రామాభి రామేరిత చిత్తదోషః స్వర్గప్రకాశో భగవాన్ ప్రదోషః (8)

చంద్రుని మిక్కిలి తెల్లని ప్రకాశంచేత, లోపలి నల్లదనం మఱింత ప్రకాశించింది. స్త్రీలయందుండే ప్రణయ కలహబుద్ధి తొలగి, వెన్నెల రాత్రి మఱింత ప్రకాశించింది. అందుకే, చంద్రుడూ, రాత్రీ రెండూ పూజ్యమైనవే - అని హనుమ భావించాడు. (2)

బుద్ధిమంతులూ - అహంకారులూ, జగత్ప్రసిద్ధులూ - నీచాతి నీచులూ, కేళీ పరాయణులూ - వైరాగ్య పురుషులూ, ఇలా పరస్పర విరుద్ధ జనం కూడా కన్పించారు.

సీతని చూడాలనే ఆలోచనకల మారుతికి దృష్టి, స్త్రీల మీదా - స్త్రీలలో ఉత్తమ స్త్రీల మీదా - ఉత్తమ స్త్రీలలోకూడా, కన్నీటితో పలుకలేని కంఠస్వరం కలదీ, ఉత్తమ ఆభరణాన్ని ధరించినదీ అయిన సీతమ్మ మీదా - ఉంది.

"అవ్యక్త రేఖామివ చంద్రరేఖాం పాంసుప్రదిగ్ధామివ హేమరేఖామ్।
క్షత ప్రరూఢామివ బాణరేఖాం వాయు ప్రభిన్నామివ మేఘరేఖామ్॥ (26)

# 6వ సర్గము

## రావణుని అంతఃపురంలోకి ప్రవేశం

స నికామం విమానేషు విషణ్ణః కామరూప ధృక్।
విచచార పునర్లంకాం లాఘవేన సమన్వితః ॥ (1)
ఆససాదాఽథ లక్ష్మీవాన్ రాక్షసేంద్ర నివేశనమ్ (2)

సీత జాడ లభించని కారణంగా, వదలని పట్టుదలతో హనుమ లక్ష్మీవంతుడై (1) రావణుని భవన ప్రాంగణాన్ని చేరాడు. సింహాలు రక్షించే వనంలా, రాక్షసులు ఆ ప్రాంగణాన్ని రక్షిస్తున్నారు.

వెండి బంగారాలతో ప్రధాన ద్వారాలు కన్పిస్తున్నాయి. వెండి బంగారు రథాలు ప్రతిద్వారానికీ అటూ ఇటూ ఉన్నాయి. ప్రతి కక్ష్యా (ద్వారానికీ ద్వారానికీ మధ్య ఉన్న ప్రదేశం) అగరు, చందన సువాసనలతో నిండిపోయి ఉన్నాయి. భేరీ మృదంగ ధ్వనులు విన్పిస్తున్నాయి. గుఱ్ఱాలూ, పులి - సింహ చర్మాలూ, దంతాల బొమ్మలూ, వెండి బంగారు శిల్పాలతో నిండిన రథాలూ అక్కడ తిరుగుతూ కన్పిస్తున్నాయి.

కామరూపుడు (ఏ రూపం కావలిస్తే ఆ రూపం ధరించగలవాడు) అయిన మారుతి నిర్భయంగా ఉద్యానవనాల్లోనూ, ప్రాసాదాలలోనూ, ఇంకా ఇంటింటిలోనూ సీత జాడ తెలుసుకోదలిచాడు. ముందుగా రావణుని మంత్రి ప్రహస్తుడి ఇల్లు - మీదట మహాపార్శ్వుని - అలాగే నిత్యం నిద్రించే కుంభకర్ణుని యిల్లు - తర్వాత ధర్మపరుడు విభీషణుని యిల్లు - ఇంకా మహోదర - విరూపాక్ష - విద్యుజ్జిహ్వ - వజ్రదంష్ట్ర - శుక - సారణ - ఇంద్రజిత్ - జంబుమాలి - సుమాలి - రశ్మికేతు - సూర్యకేతు - ధూమ్రాక్ష మొదలైన రాక్షసుల యిళ్లన్నీ తిరిగాడు. (2) ఎక్కడెక్కడా చూడని వైభవమంతా కన్పించింది.

ఈ భవనాలు దాటగానే రావణాంతఃపురం. ఆయుధాల్ని ధరించిన రాక్షస స్త్రీలు, వికృత రూపాలు కల్గి ఉన్నారు. మిక్కిలి వేగం పోగల ఎఱ్ఱని, తెల్లని గుఱ్ఱాలూ, శక్తిలో ఇంద్రుని యేనుగు ఐరావతంతో సాటియైన ఏనుగులూ, మహామేఘాలవలె ఘీంకరిస్తూ మదజలాన్ని స్రవిస్తూన్న ఇతర జాతి ఏనుగులూ అక్కడ కన్పిస్తున్నాయి. పదాతిబలాల మెడలో కూడ స్వచ్ఛమైన మేలిమి బంగారు ఆభరణాలున్నా యంటే ఇక ఐశ్వర్యాన్ని వేరే చెప్పాలా?

వివిధాకారాలున్న పల్లకీలు, విలాస గృహాలూ, పగటిపూట వినోదించ దగిన రమణీయ మందిరం, రతికేళీ మందిరమూ, ఉండి ఆ సమీపంలో మందర పర్వతంలా ఉన్న ఒక భవనమూ కన్పించింది.

భవనం ముందు పెంపుడు నెమళ్లు తిరుగుతూ, భవనం మీద జెండాలు ఎగురుతూ, ఎక్కడ చూచినా రత్నాల అరుగులు కన్పిస్తూ సాక్షాత్తు శివుని కైలాసంలా అన్పించింది.

ఆ మందిరంలోని పాత్రలూ, పీఠాలూ, మంచాలూ అన్నీ బంగారంవే. తేనె కల్లు చిందులుపడి పాన్పులమీది పైభాగం - కొద్దిగా తడిసింది. ఇంకా మధుపానం ప్రారంభం కాక, పాత్రలన్నీ నిండుగా ఉన్నాయి. బంగారు ఆభరణాలున్న స్త్రీల చేతి చప్పుడు, నడకల ధ్వని, ప్రక్క మందిరాలలోని మృదంగ వీణాధ్వనులతో నిండి పోయింది ఆ మందిరం. ఎక్కడచూచినా స్త్రీలతో, ధ్వనులతో, ఆభరణాలతో, ఐశ్వర్యంతో, విలాసంతో నిండిన, కుబేర భవనంలా ఉన్న (3) రావణ గృహంలోకి వెళ్లాడు ఆంజనేయుడు.

## విశేషాంశాలు

(1) లక్ష్మీవంతుడంటే సంపదకలవాడని అర్థం, 'సంపద' అనేది ఒక యోగం. 'అలబ్ధవ్య లాభో యోగః – లబ్ధస్య పరిపాలనం క్షేమః' అని చెప్తారు. లేనిది క్రొత్తగా కల్గడం యోగం. ఇప్పటివలకూ లేని సీతాదర్శనమనే సంపద, యోగరూపంగా కాబోతోంది హనుమకు - అని సూచించడానికి 'లక్ష్మీవాన్' అనే పదం, లంకా రాక్షసిని జయించడం - అన్ని మందిరాలనీ నిర్భయంగా తిరగగల్గడం - ఇవన్నీ కూడా యోగాలే కదా!

(2) ఇళ్ల వరుస, బుద్ధిమంతుడు కాబట్టి బాగా గుర్తుంచుకొన్నాడు. ఏదైనా యుద్ధమే వస్తే, ఎలా పారిపోవాలో నిర్ణయించుకోడానికూడ ఈ పరిశీలన చేసాడు. అవసరమైతే తమో గుణంతోనైనా సంహరించాలనే నిశ్చయం హనుమకి ముందే ఉందనుకున్నాముగా!

(3) కుబేర భవనంలా ఉంది రావణ మందిరం, అంటే ఈ సంపద అంతా రావణుని చేత ధర్మార్జితం కాదని భావం. చత్వారో ధనదాయాదాః ధర్మాగ్ని నృపతస్కరాః - ఆదేర్ధర్మావమానేన త్రయః కుప్యన్తి చేతరాః ధనమనేవానికి దాయాదులు (జ్ఞాతులు) నల్గురున్నారట. ధర్మమూ - అగ్నీ - రాజూ - దొంగా అనే వారు నల్గురట. పెద్దవాడైన ధర్మాన్ని అవమానిస్తే (అధర్మంగా ఆర్జిస్తే) అగ్నివలన లేదా రాజు ద్వారా (దండయాత్రలో హరించడం) లేదా దొంగద్వారా ఆ సొమ్ము నాశనం కావాలి. అంటే, 'అధర్మంగా ధనం నిలువదు' అని అర్థం. రావణుని కొలువులో ఎక్కడ చూచినా కన్పించేదంతా, దేవతాలోకాలని గెలవడానికని వెళ్లి దొంగిలించి, లేదా దౌర్జన్యంగా తెచ్చింది లాగానే హనుమకి అన్పించింది. అంటే ఇదంతా నశించేదే సుమా! అని అర్థం.

❀ ❀ ❀

# 7వ సర్గము

## ...ఇక్కడ కూడా సీత లేదు

తాని ప్రయత్నాభి సమాహితాని మయేన సాక్షాదివ నిర్మితాని।
మహీ తలే సర్వగుణోత్తరాణి దదర్శ లంకాధిపతేర్గృహాణి ॥ (4)

వైడూర్యాలు పొదిగిన బంగారపు కిటికీలతో, అనేక శాలలు, ఆయుధాగారాలతో, వాస్తుకి సరిపోయేలా నిర్మింపబడి, వర్షం వస్తే ఎగిరిపోయే పక్షుల్లా, మెరుపుతీగెల్లా ఆ రావణ భవనంలో అనేక గృహాలు కన్పించాయి. దగ్గరుండి రావణుడే కట్టించాడో, లేక మయుడే నిర్మించాడోగాని, చాల శ్రద్ధతో కట్టింపబడిన ఆ భవనాలని దేవతలు, రాక్షసులు అందఱూ ప్రశంసించారు.

అలా చుట్టూ ఉన్న భవనాల మధ్య, దేనికీ సాటిరాని విధంగా ఉంది రావణ భవనం. భూమండలానికి దిగి వచ్చిన స్వర్గమా? అన్నట్లూ, అనేక పుష్పాలతో, వృక్షాలతో, మెరిసే మెరుపులవంటి స్త్రీ రత్నాలతో, ప్రకాశించే చంద్ర శుక్రాది గ్రహాలతో ఉన్న ఆకాశంలా, పుప్పొడి నిండిన పర్వత శిఖరం కల పర్వతంలా, కన్పిస్తోంది రావణ గృహం. స్వస్తికమూ, సర్వతోభద్రమూ, వర్ధమానమూ అని యీ తీరుగా ఇల్లు కట్టిన విధానం ప్రకారం, ఎలా పేర్లు ఉంటాయో, అలాగే రావణుని యిల్లు 'పుష్పకం' అనే పేరుకి తగి ఉన్నది. పుష్పానికి ఎలా చుట్టూ రేకలుంటాయో, అలా గోపురాలున్న భవనాలుంటాయి. ఆ గోపుర భవనాలకి మధ్య ఉన్న 'పుష్పక భవనం' రావణునిది.

ఆ భవనంలో, వెండి బంగారులతో చేసి, పగడాలు గ్రుచ్చిన పక్షి బొమ్మలూ, అనేక జాతుల తేడాలను తెలిపే గుఱ్ఱాల బొమ్మలూ, ఉన్నాయి. పద్మాల పుప్పొడి అప్పుడే అంటుకున్నట్లున్న ఒళ్లుకల రెండు మదపు ఏనుగులు, తమ తుండాలతో తెచ్చిన నీటితో, పద్మాన్ని చేతిలో పట్టుకున్న లక్ష్మీదేవికి అభిషేకం చేస్తున్న చిత్రం పరమ మనోహరంగా కన్పించింది. (ఇప్పటికీ ఇళ్లలో కన్పించే ఈ చిత్రం రావణ భవనంలోనిది – అని గ్రహించాలి).

**తత స్తదా బహువిధ భావితాత్మనః కృతాత్మనో జనకసుతాం సువర్త్మనః ।**
**అపశ్యతోఽభవ దతిదుఃఖితమ్మనః, సుచక్షుషః ప్రవిచరతో మహాత్మనః ॥ (17)**

రమణీయ రావణ మందిరం చూచినా, ఇతర సౌఖ్యాలని దర్శిస్తూనా, కార్య సాధకుడైన, కార్యదీక్షా తత్పరుడైన హనుమకు దుఃఖమే కల్గింది.

# 8వ సర్గము

## పుష్పక విమానం ఎలా ఉంది?

న తత్ర కించి న్న కృతం ప్రయత్నతో న తత్ర కించి న్న మహార్హ రత్నవత్ ।
న తే విశేషా నియతా స్సురేష్వపి న తత్ర కించి న్న మహావిశేషవత్ ॥ (3)

రావణ భవనం చుట్టూ ఉన్న భవనాల నడుమ నున్న స్థలంలో 'పుష్పక విమానం' ఉంది. వజ్రాలూ, రత్నాలూ అలా ఎక్కడ తోచితే అక్కడ పొదుగబడిన విమానం అది. మేలి బంగారు ముద్ద ఆ విమానం. దానిని తయారు చేసిన విశ్వకర్మయే దాని పనితీరును చూచి అద్భుతమని పొగిడాడంటే చెప్పాలా? ఆ విమానంలోని ప్రతి వస్తువూ మహాప్రయత్నంతో చేయబడిందే. అందున్న ప్రతి రత్నమూ సాటిలేనిదే. దేవతా గృహాలలోనూ కన్పడని విశేషాలే ఇందున్నాయి. అసలు, ప్రతి విశేషమూ ఒక విశేషమే ఆ విమానంలో. యజమాని మనస్సు తెలిసి వాయు వేగంతో పోయేదీ, ఎవరు అడ్డగించినా అపులేక పోయే స్వభావం కలదీ ఆ విమానం.

ఆ విమానం భూమికి ఆనకుండా అంతరిక్షంలోనే నిలిచి సూర్యుని మార్గాన్ని చూపే ఒక గుర్తులా కన్పిస్తోంది. వసంతకాలంలో రంగు రంగుల పూలు గోచరించినట్లుగా విమానం మీద రంగురంగుల చెక్కడాలు వింతవింత ఆకర్షణని కలుగచేస్తూ ఉన్నాయి.

ఆ విమానాన్ని, కుండలాలు ధరించినవారూ, గుండ్రని పెద్ద కనుగ్రుడ్లు కలిగి, కోలకన్నులు కల వ్యోమగాములు (ఆకాశంలో తిరిగే లక్షణం ఉన్నవారు) వేల మంది, మోస్తున్నట్లుగా బంగారంతో చెక్కబడింది.

### విశేషాంశాలు

సంపదకి చిహ్నం వాహనం. రావణ సంపదకి గుర్తు ఈ పుష్పక విమానం. అయితే ఇది ఎత్తుకు రాబడినదే కాని అతని సొంతం కాదు. ఇలా తెచ్చిన సంపద శాశ్వతం కాదు. తాత్కాలికమే. ఇదిపోయే రోజున సొంతంగా ఆర్జించిన దానితో సహా పోతుంది. (లంకలో చివరికి అలాగే జరిగింది గదా!).

ఇక ఈ సర్గ సంఖ్య 8. సంపదకి అధికారిణియైన లక్ష్మీదేవతల సంఖ్య 8. (అష్టలక్ష్ములు). వీరి నివాస స్థానం 8 రేకుల పద్మం (అష్టదళ పద్మం). ఇంట్లో దేవుని ముందు ఈ ముగ్గే వేస్తాం కదా! ఈ సర్గలోని శ్లోకాల సంఖ్య కూడ 8. అమ్మవారి నుదురు, చంద్రుని 8వ రోజు (అష్టమి) రూపంతో సమానంగా ఉంటుందట. అష్ట ఐశ్వర్యాలూ ఉన్న లంకకి తానువచ్చి అష్టపుడియలు (గం 3-12ని॥లు) అయిందికాబోలు.

❀ ❀ ❀

# 9వ సర్గము

## రావణుని శయన మందిరం

యాచ వై శ్రవణే లక్ష్మీ ర్యా చేంద్రే హరివాహనే ।
సా రావణగృహే సర్వా నిత్యమేవాఽనపాయినీ ॥ (8)

ఒక ఆమడ పొడుగూ, అర ఆమడ వెడల్పూ ఉన్న రావణ భవనంలో రెండు - మూడు - నాల్గు - దంతాల ఏనుగులెన్నో తిరుగుతున్నా, కాపలా కాస్తున్న రాక్షసులు సంచరిస్తున్నా 'ఇరుకు' అనేది లేదు. కుబేరుని ఐశ్వర్యమూ, ఇంద్రుని సంపదా మొత్తం, ఇక్కడ ఎప్పుడూ కన్పిస్తోందా, అన్పించింది. యముడూ, వరుణుడూ మొదలైన వారి ఐశ్వర్యం కుంభకర్ణాది వీరుల గృహాల్లో ఉంది.

చుట్టూ రావణుని గృహాలు ఉంటే, మధ్యలో పుష్పక విమానం ఉంది. కుబేరుణ్ణి జయించి తెచ్చినది ఆ విమానం. లోపలికి ఎక్కడానికి బంగారు మెట్లు. ఇటు ప్రక్క, అటు ప్రక్క బంగారు, వెండి తోడేళ్ల బొమ్మలున్నాయి. మెట్లమీదుగా కనిపించే లోపలి భాగంలో సుందరమైన వేదిక. దానిని చేరడానికి పగడాలు, ముత్యాలు, మణులతో చేయబడిన నేల. ఆ విమానంలోకి ప్రవేశించాడు హనుమ. వాయుదేవుడు వివిధ రూపాలు పొందినట్లుగా, అన్న-పాన-భక్ష్య-భోజ్య పదార్థాల వాసనలూ, మితిమీరిన మద్యం వాసనా వస్తూ, ఆప్తబంధువుణ్ణి రమ్మని పిలుస్తున్నట్లుంది.

రావణున కిష్టమైన శయనమందిరం అదే. నేలపై పెద్ద తివాచీ. దానిపై గృహాలూ-రాష్ట్రాలూ-మొత్తం భూమండలమంతా చిత్రింపబడి ఉంది. బంగారు కుందెలలో మెరిసే రత్నదీపాలు నిరంతరం ప్రకాశిస్తూ, జూదంలో ఓడడం వలన దుఃఖిస్తూ రెప్ప వేయకుండా ఉన్న జూదరులవలె ఉన్నాయి. అనేక స్త్రీలు దివ్యాభరణాలతో ఆభరణ ధ్వని లేకుండా పరుండి ఉన్నారు. రావణుని చుట్టూ స్త్రీలు-స్త్రీలు-స్త్రీలు.

ఆ గృహంలో చల్లగా, మెల్లగా వీచే వాయువు శరీరాన్నీ, చక్కని శాలిం - స్త్రీల సౌందర్యం కన్నులనీ, మనోహర గానం చెవులనీ, రుచిగల భక్ష్యాలు జిహ్వనీ, ఎక్కడా చూడని సువాసనలు ముక్కులనీ, ఇలా పంచ ఇంద్రియాలనీ ఆనంద పరుస్తూ, తల్లి - తన పిల్లలని సంతోష పెట్టినట్లు చేస్తోంది. అర్థరాత్రి దాటడం వలన తాగి తాగి మత్తులో, ఆ స్త్రీలంతా గాఢ నిద్రలో ఉన్నారు. పద్మాలలో పోల్చదగిన ముఖాలున్న ఆ స్త్రీలు అలా పరుండి ఉంటే, హంసలూ, భ్రమరాలూ లేని పద్మవనంలా అన్పించింది.

శరత్కాలంలో నక్షత్రాలతో ఉన్న ఆకాశంలా ఉంది, నడుమ పరున్న రావణుడు నక్షత్రాల మధ్య చంద్రునిలా ఉన్నాడు. కొద్దిపాటి మిగిలిన పుణ్య ఫలంతో, భూమిపై రాలిన నక్షత్రాల్లా ఉన్నారు స్త్రీలు.

కొందటికి బొట్లు జారి చెరిగిపోయాయి. కాలి అందెలు ఊడిన వాళ్ళూ - హారాలు చెదిరిన వాళ్ళూ -వస్త్రాలు జారిన వాళ్ళూ - నోటినుండి వెలువడే కల్లు వాసనకు, గాలి విడిచినప్పుడు పైట చెరగు కదులుతూండే వాళ్ళూ - రావణ ముఖమనుకొని వాని సవతి ముఖాలని వాసన చూస్తూ, వాని యిష్టం కోసం ప్రాకులాడే వాళ్ళూ - ఒకరి చేతిపై, ఒకరి కాళ్ళపై, ఒకరి నడుముపై తల పెట్టి పరున్నవాళ్ళూ,...ఇలా అందటూ కలిసి గుండ్రంగా పడుకొని ఆ స్త్రీ సమూహం ఒక పూలమాలలా కన్పించింది.

రాజర్షి పితృ దైత్యానాం గంధర్వాణాం చ యోషితః ।
రాక్షసానాం చ యాః కన్యా స్తస్య కామవశం గతాః ॥ (68)

యుద్ధకామేన తాస్సర్వాః రావణేన హృతాః స్త్రియః।
సమదా మదనేనై వ మోహితాః కాశ్చి దాగతాః ॥ (69)

న తత్ర కాచిత్ప్రమదా ప్రసహ్య వీర్యోపపన్నేన గుణేన లబ్ధా ।
న చాఽన్య కామాఽపి నచాఽన్యపూర్వా
వినా వరార్హాం జనకాత్మజాం తామ్ ॥ (70)

న చాఽకులీనా న చ హీనరూపా నాఽదక్షిణా నాఽనుపచారయుక్తా ।
భార్యాఽభవ త్తస్య న హీనసత్త్వా న చాపి కాంతస్య న కామనీయా ॥ (71)

రాజర్షి - పితృదేవత - గంధర్వ - రాక్షస - దైత్య జాతులకి చెందిన స్త్రీలు అందటూ ఆ రావణుణ్ణి తమంత తామే కోరి వచ్చారు. తానై రావణుడు వారిని తేలేదు. కొందటిని కావాలని తెచ్చాడు. అయితే ఏ స్త్రీ తేబడిందో, ఆ స్త్రీకి సంబంధించిన వారితో యుద్ధం కలగాలని అతని కోరిక. (1) ఇలా యుద్ధ వాంఛతో తేబడిన స్త్రీల విషయంలో కూడ, అతనికి వారిపై మోహం లేనేలేదు. మోహంతోనూ తేబడలేదు. అయితే, సహజ యౌవన వశం వలన కొందటు అతని కామానికి యిష్టంతో లొంగిపోయారు. తమకు తామే ఇలా రావణ మోహంతో తిరిగి పోవాలనే ఆశ లేక ఉండిపోయారు. సీతమ్మను తప్ప ఎవరినీ బలాత్కారంగా రావణుడు తేలేదు. సీతమ్మ తప్ప మఱి ఎవరైనా రావణుణ్ణి వలచి వచ్చినవారే. లేదా వచ్చాక వలచినవారే. ఎవతెయైనా రావణుణ్ణి తప్ప మఱెవరినీ వలచినది లేదు, అలాగే రావణుణ్ణి ఇష్టపడడానికి ముందు మఱెవరినీ వలచినదీ కాదు. రావణుని భార్యలలో, సత్కులమున పుట్టనిది గాని,

మోహింప దగనిది కాని ఎవ్వరూ లేనేలేరు. అలాంటి స్త్రీలని చూడగానే ఆంజనేయునికి చిత్రమైన ఆలోచన కల్గింది.

బభూవబుద్ధి స్తు హరీశ్వరస్య యదీదృశీ రాఘవ ధర్మ పత్నీ ।
ఇమా యథా రాక్షసరాజభార్యాః సుజాత మస్యేతి హి సాధు బుద్ధేః ॥ (72)

పునశ్చ సోఽచింతయదార్తరూపో ధ్రువం విశిష్టా గుణతో హి సీతా (73)

లంకాధిపతి అయిన రావణుని భార్యలంతా ఎలా తమ భర్తతోకూడి సుఖంగా ఉన్నారో, అలాగే సీతమ్మ కూడా రాముణ్ణి చేరి ఉంటే, ఎంత బాగుండేది! రావణుడు సీతని, రామునికి అప్పగిస్తే ఇంకెంత బాగుండేది! పాతివ్రత్యం మొదలైన గుణాల్లో సీతమ్మ మిక్కిలి గొప్పది. సత్కులంలో పుట్టినవాడే అయినా, సీతమ్మని రావణుడు అపహరించి – 'సీతవంటి ఇల్లాలు కూడా అపహరింపబడిందనే అపవాదుని' – ఆమెకీ, రామునికీ కల్గించి, ఎంతటి తప్పు చేసాడు? ఎంతటి కష్టం? అని ఆలోచించాడు.

## విశేషాంశాలు

### రావణుడు సీతని ఏ ఉద్దేశ్యంతో తెచ్చాడు?

(1) లోతుగా ఆలోచించాల్సిన ప్రశ్న యిది.

యుద్ధకామేన తాస్సర్వా రావణేన హృతాస్త్రియః' అని మహర్షి మాట. రావణుడు ఎందరో స్త్రీలని అపహరించినది, కేవలం యుద్ధం కోసమట. పురుషులతో కదా యుద్ధం చేయాల్సింది. 'వాలి' లాగా ఏ హిమవంతుని వద్దకో, సముద్రుని వద్దకో పోతే భుజాల తీట తగ్గేది కదా! అందుకే, యుద్ధ ప్రియుడైన తాను, యుద్ధంకోరే తాను కిష్కింధా రాజు 'వాలి' మీదికి వెళ్లనే వెళ్లాడు. సముద్రం వైపు తిరిగి సంధ్యకు వందనం చేస్తున్న వాలిని, రావణుడు వెనుకవైపుగా పోయి నడుం చుట్టగా, కోపించిన యుద్ధప్రియుడైన వాలి, రావణుని చేతులని తన రెండు చంకల క్రిందా అదిమిపట్టి, సప్త సముద్రాలనీ త్రిప్పుతూ రావణునిచేత తన నామజపం చేయించాడు. అప్పటికీ ఊరుకోక, ఒక శపథం చేయించాడు రావణునిచేత.

"దారాః పుత్రాః పురం రాష్ట్రం భోగాచ్ఛాదనమైథునమ్
సర్వ మేవా విభక్తం నౌ భవిష్యతి హరీశ్వర" (34-7)

"నా భార్యలూ, పుత్రులూ, నా ఏలుబడిలోని పురమూ, సామంతుల ఏలుబడి లోని రాష్ట్రాలూ, ఇంకా ఇతరాలన్నీ కూడ మన యిద్దరికీ చెరి సగం" అనిపించి

అప్పుడు విడిచాడు రావణుణ్ణి. ఇంత అయినా కూడా "యుద్ధ ప్రీతి' రావణునికి పోలేదా? ఇక్కడే ఉంది రహస్యం. రావణుడు పోరాడదలచినది, వాలితో కాదు. శ్రీ మహావిష్ణువుతో ఇంద్ర పుత్రుడే కదా వాలి! వీణ్ణి పట్టుకుంటే, ఆ ఇంద్రుడు రాకపోతాడా? అనుకున్నాడు కాని, 'వాలి' తాననుకున్న దానికంటె చాల ఎక్కువగా బుద్ధి చెప్తాడని భావించలేదు.

## నిన్ను చంపించేందుకే పుడతాను

ఈ సంఘటనకు పిమ్మట రావణుడు కొంత కాలం బుద్ధిగానే ఉన్నాడు. అయితే లోకాల్ని చుట్టుముట్టి రావడం మానలేదు. ఒకనాడు వస్తూంటే కుశధ్వజమహర్షి పుత్రిక 'వేదవతి' కన్పడింది. (శ్రీ మహావిష్ణు భార్య లక్ష్మి, సీతా రూపం కంటె ముందుగా ఈ రూపంతో జన్మించింది Ladies first అనే నానుడి ఇక్కడ నుండి పుట్టినదే). రావణుని ప్రశ్నకి సమాధానంగా "శ్రీ మహావిష్ణువే తనకి భర్త అనీ, పుట్టినపుడే అలా తన తండ్రి నిర్ణయించాడనీ, లోగడ దంభుడనే రాజర్షి ఇలాగే అడిగి, కాదన్నందుకు తన తండ్రిని రాత్రిభాగంలో నిర్దయగా చంపాడనీ, తన తల్లి ఆ బాధతోనే అగ్నిలో దూకిందనీ పల్కి, రావణుని కోర్కెను తిరస్కరించింది వేదవతి. సహజ మదంకల రావణుడు, వేదవతి వెళ్లిపోతుండగా తనతో తీసికొనిపోదామని జుట్టుపట్టుకుని లాగాడు. రావణుడు ముట్టు కున్నంతవఱకూ ఉన్న తన శిరోజాలని, చేతినే కత్తిగాచేసి తెంపి, ఇలా చెప్పింది.

శాపేత్వయి మయోత్సృష్టే తపసశ్చ వ్యయో భవేత్ ।
తస్మాత్తవ వధార్థాయ సముత్పత్స్యేహ్యహం పునః ।
తస్మాత్వ యోనిజా సాధ్వీ భవేయం ధర్మిణస్సుతా । (ఉ 17 సర్గ)

"దుర్మార్గ రావణుడా! నేను శాపమిస్తే నా తపశ్శక్తి నష్టమై పోతుంది. కాబట్టి, నీలాటి మదాంధుణ్ణి చంపించడానికి అయోనిజగా, ఒక కర్మిష్ఠి (నిత్యం యజ్ఞ యాగాదులని చేసే మహాపురుషుడు) యింట పుడతాను" అని పలికి, అగ్ని రగుల్చు కొని భస్మీ భూతురాలైంది. ఆమెయే సీతామాతగా కర్మిష్ఠి అయిన జనకుని యింట నాగటి చాలులో జన్మించి, అయోనిజ అయింది. అసలు, రావణుడు ఎందుకిలా మదాంధకారంతో ప్రవర్తించాలి? అన్నందుకు మఱి కొంచెం వెనక్కి పోవాలి.

ఒకప్పుడు వైకుంఠ ద్వారపాలకులు 'జయుడు - విజయుడు (జయ విజయులు) అనే ఇద్దఱుండేవారు. నిత్యమూ శ్రీ మహావిష్ణు దర్శనార్థం, అనేక దేవతా ఋషి భక్త గణం వస్తూండేవారు. అందఱినూ లోపలికి పంపేవారు జయవిజయులే

కావడంలో, ఈ యిద్దఱికూ ఒక ఆలోచన వచ్చింది. ఎన్నో జన్మలెత్తి ఎత్తి, ఇలా ఈ జన్మకి, వైకుంఠ ద్వారం వద్ద ఉండే పవిత్ర జన్మకి వచ్చాం – జీవిత కాలమంతా ఇలా గడపడం కంటె, జన్మ అనేది లేకుండా) సాక్షాత్తు స్వామిలో లీనమై, మోక్షాన్ని పొందడాన్ని పొందితే బాగుండును) ఉండాలనేది, ఆ ఆలోచన.

'పునర్జన్మ లేకుండా ఉపాయం చెప్పండి' అని సనత్కుమారుల వారిని అడిగితే 'మహావిష్ణువు చేతిలో వధ పొందితే సరి' అన్నారు. 'వధ పొందాలంటే, శ్రీ మహావిష్ణువునకు నచ్చని పనులు చేస్తూ విరోధించాలి' అని తీర్మానించుకున్న జయ విజయులు తమ బుద్ధికి అనుగుణంగా, సనత్కుమారులవారినే విష్ణు దర్శనానికి పోకుండా నిర్బంధించారు. కోపించిన మహర్షులు, జయ విజయుల నిద్దఱినీ రాక్షసులు కండని శపిస్తే, వారే రావణ – కుంభకర్ణులుగా జన్మించారు.

ఎందుకిలా శపించవలసి వచ్చిందని, మహర్షులు ఆలోచించారు. వారిద్దఱూ చిరకాలంగా స్వామిని సేవిస్తూ ఉన్న కారణంగా, విష్ణు సాయుజ్యాన్ని పొందవలసి ఉన్నారు. అందుకని, తదనుగుణమైన బుద్ధిని విష్ణువు కల్పించాడనీ (మోక్షోపాయం గుఱించి వారు అడిగే బుద్ధినీ, వారు ఆ మహర్షులనే నిర్బంధించే బుద్ధినీ, మహర్షులు జయ విజయులని శపించే బుద్ధినీ) స్పష్టంగా ఊహించారు.

అలా వారిని శపించాక, వారు రావణ కుంభకర్ణులుగా జన్మించాక, విష్ణువు యొక్క ఆలోచన ప్రకారం, ఒకటొకటే కార్యక్రమంలో భాగంగా జరుగసాగాయి. వేదవతీ రూపంలో లక్ష్మీదేవి, కుశధ్వజునకు జన్మించడం మొదటిది. కుశధ్వజుడు వేదం చదువుతూంటే ఆ వేదమే ఒక సుందరీ రూపాన్ని ధరించితే, ఆమె వేద–వతి. వేద–రూప–వతి అన్నమాట. వేదం బ్రహ్మయొక్క విద్య. అలాటి విద్యయే స్వరూపంగా కలది. అందుకనే ఆమెని 'బ్రహ్మ విద్యా స్వరూపిణి'గా గుర్తించాలి. వేదస్వరూపాల్ని (వేదంలో ఉండే విశేషాలని) ఎలా తెలిసికోవాలి? అంటే 'వేదాధ్యయనగ్ం సర్వం గుర్వధ్యయన పూర్వకమ్' అనడం బట్టి గురువుద్వారా గ్రహించాలి. అలాంటి గురువు ఇక్కడ 'ఆంజనేయుడు'. అందుకే ఆయన సీతమ్మని గుర్తించి గమనించగలడు.

ఇంతకీ, ఆ వేదవతి రావణుణ్ణి శపించాక, రావణునకు ఒక విషయం తెలిసింది. 'తనని చంపించేందుకు ఒక ఆమె, కర్మిష్ఠియింట 'అయోనిజగా పుడుతుంది' అని. అప్పటినుండి కర్మిష్ఠిజనం ఎవరెవరున్నారో, అయోనిజ లెక్కడ జన్మించ బోతున్నారో, వివరాలు సేకరించదలిచాడు. అంతేకాదు – తనని చంపించేందుకు పుడతానన్నది వేదవతి. చంపేది ఎవరో చెప్పలేదు. ఆ చంపేవాడి చిరునామ కూడ వెదుకదలిచాడు. 'జాతిస్మరత్వం' అని ఓ గుణం ఉంది. (పూర్వజన్మపు ఆలోచనం). అది, రావణ

కుంభకర్ణు లిద్దఱికూ ఉంది. కాని నిత్య నిద్రా స్వభావుడు కాబట్టి, కుంభకర్ణునికి దాని గూర్చి ఆలోచించే వ్యవధికూడా లేదు. రావణునికి తెలుసు. తానెలా చివరికి శ్రీ మహావిష్ణు సాయుజ్యాన్ని వీలయినంత తొందరగా పొందవలెనా? అని ఆలోచించి, 'స్వయంతీర్ణః పరాంస్తారయతి' (తాను ఒడ్డెక్కి, ఇతరులని కూడ ఎలా ఒడ్డెక్కించడమూ?) అన్నట్లు వైకుంఠ ద్వారపాలకు నంతటి ఉత్తమ జన్మను పొందిన రావణుడు, లంకలో దిక్కులేక పడి ఉన్న రాక్షసజనాన్ని అందఱినీ ఒడ్డెక్కించాలని నిశ్చయించుకున్నాడు. మోసం చేసేవాడు కూడ, నమ్మికతోనే పని చేసి. చివరికి మోసపోయామని, అవతలివాడు గమనించేలా ఎలా చేస్తాడో, అలాగే రాక్షస జనాన్ని కూడా, వాళ్ల బుద్ధికి అనుగుణంగానే నడుస్తూన్నట్లు నమ్మించి, మొత్తానికి వాళ్లందఱికీ శుభాన్ని (శ్రీ మహావిష్ణువైన రామునిచేతిలో, దేవతలైన వానరుల చేతిలో వధని) కల్గించి, తనతో పాటు వారినీ ఉద్ధరించాడు.

ఇదంతా 'జాతిస్మరత్వం' అనే వెనుక చెప్పుకొన్న గుణంతోనే సాగింది. ఇంతకీ చంపించేది, ఎవరో తెలిసిన రావణుడు, చంపేవాని కోసం ఆలోచించాడు. అహంకారంతో పలు ప్రదేశాలు తిరుగుతూ అందఱితోనూ యుద్ధాన్ని మొదలెట్టాడు. మఱి చంపేవాడు తెలియాలంటే పద్ధతి అదే కదా! అప్పటికి ఇక్ష్వాకు వంశంలో 'అనరణ్యుడు' రాజ్యం చేస్తున్నాడు. ఆయన మీదికి యుద్ధానికెళ్లి, యుద్ధం చెయ్యి - లేదా 'నిర్జితోఽస్మీతి వా బ్రూహి' ఓడిపోయానని పలుకు - ఏదో ఒకటి ఈ క్షణంలోనే తేలాలి" అన్నాడు. 'ఇదే రాక్షస బుద్ధి' అంటే. మానవుడైన అనరణ్యుడిలా అన్నాడు. 'యుద్ధం చెయ్యడం క్షత్రియ ధర్మం. నిజమే - యుద్ధానికొచ్చిన నీతో - చేయను - అనను. కాని, ముందు నా బలాన్ని సమీకరించుకోకుండా, సైన్యాన్ని సిద్ధం చేసుకో నీయకుండా, యుద్ధాన్ని చేయనీయకుండా, 'ఒక్క మాటుగా గెలుపు ఓటములని తేల్చమంటే ఎలా?' అని. నచ్చలేదు రావణునికి. గట్టిగా వాదించాడు యుద్ధానికి రమ్మని. రాజ పద్ధతి కాదని అనరణ్యుడన్నాడు. రాక్షసుడైన రావణుడు ద్వంద్వ యుద్ధానికి, వినకుండా తలపడి, అనరణ్యుణ్ణి నేలమీద పడవైచి కాలితో త్రొక్కితే, దుఃఖించిన అనరణ్యుడు ఇలా అన్నాడు. "రామో దాశరథిర్నామ యస్తే ప్రాణాన్ హరిష్యతి" అని. మా ఇక్ష్వాకు వంశంలో, పుట్టబోయే దశరథునకు పుట్టబోయే రాముడనే వాడు నీ ప్రాణాలని తీస్తాడు' అని. **ఇది శాపం కాదు నిజానికి. రావణునికి సందేహ నివృత్తి.**

రావణునికి తనని చంపేవాడి పేరూ, తండ్రి పేరూ, వంశమూ తెలిసింది. చంపించేదాని ఆమాకే మాత్రం తెలియలేదు. చావు నిశ్చయమని తెలిసింది. అప్పటి

నుండే, 'రాముడు' అనే పేరు విన్పిస్తే చాలు. తనకి 'మరణ కర్త' – 'మోక్షప్రదాత' అనే భావం కల్గింది వానికి.

అప్పట్నుండి ఎదురు చూచాడు దశరథుని కోసం. చాల తరాల తర్వాత కలిగాడు దశరథుడు. పెరిగి పెద్ద అయ్యాడు. రాజయ్యాడు గాని ఏ దశరథుని పుత్రుడైన రాముని వలన మరణం లభించాలో, ఆ రాముడు కల్గనేలేదు. కొంత కాలానికి దశరథునికి నల్గురు పుత్రులు కల్గినట్లు తెలిసి, రావణునకు అనుమానం తీరినట్లూ, తీరనట్లూ అయింది. ఒక్కడే పుడతాడనీ వాడిపేరు రాముడే అవుతుందనీ ఊహిస్తూ ఉంటే నల్గురిలో రాముడెవరో గుర్తింపవలసిన అదనపు బాధ్యత కూడ మీద పడినట్లు రావణునకు అన్పించింది. అయితే, తనని చంపేవాడు మహా సమర్థుడౌతాడని తెలిసిన రావణుడు, రాముని( శ్రీ మహావిష్ణువు) జాడ తెలిసికొనేందుకు వీలుగా దండకారణ్యంలో తాటక, మారీచ, సుబాహులను కాపుంచాడు. వీరిని చంపి వచ్చేవాడు, 'మహా విష్ణు స్వరూపుడే' అని భావించవచ్చును గదా! అని. మళ్లీ రావణుని అనుమానాన్ని తీర్చినట్లూ, తీర్చనట్లూగా ఉంచేస్తూ రాముడు-తాటక, సుబాహులని నారబట్టలు ధరించి, ఇద్దఱుగా వచ్చి (రామలక్ష్మణులుగా) చంపాడు. (ఈ విషయమంతా బాలకాండ వ్యాఖ్యలో వివరంగా వ్రాయబడింది). ఈ ఇద్దరిలో రాముడెవరు? అనే అనుమానం మళ్లీ కల్గింది రావణునకు. రహస్యాన్ని చెప్పరాదని రాముడూ, తెలిసికోకుండా ఉండరాదని రావణుడూ, ఇలా రావణుడూ రాముడూ ఒకరికి మించిన ఎత్తుగడలతో ఒకరు వస్తూ, సీతాపహరణం ఘట్టాన్ని దాటారు. శ్రీమహావిష్ణువు సర్వలోకాల ప్రభువూను. ఆయన జాడ తెలియాలంటే, ఆయనకి కష్టమైన పనులు చేయాలి. పతివ్రతా రక్షణ, యజ్ఞ సంరక్షణ, దుష్టనాశనం ఆయన వ్రతాలు కాబట్టి, రావణుడు రాముణ్ణి (విష్ణువును) తెలుసుకోడానికి వీలుగా పతివ్రతా స్త్రీ అపహరణం, వారిని చెరబట్టడం, యజ్ఞనాశనం, నరకంలో ఉన్న పాపుల్ని యముని చెరనుండి విడిపించడం వంటి వానిని చేసాడు. (ప్రభుత్వ దృష్టిని ఆకర్షించాలంటే, ప్రభుత్వ కార్యాలయాలముందు నిరశనలా) "యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి...." ఎప్పుడు ధర్మం క్షీణిస్తుందో, అధర్మం పెరుగుతుందో అప్పుడు పరమాత్మ ఆవిర్భవించి దుష్ట శిక్షణా, శిష్టరక్షణా చేయాలి. లేకపోతే అసలు పరమాత్మే లేడని, నిశ్చయమై పోతుంది.

ఇలాటి నేపథ్యంలో రావణుడు, సీతని అపహరించాడు. పరమాత్మ శివ స్వరూపుడైతే, భగవతి శక్తి స్వరూపిణి, అనే మహా రహస్యం వానికి తెలుసు. అందుకే, రాముణ్ణి శక్తి హీనుణ్ణి (అమ్మవారిని ఎత్తుకుపోయి) చేయాలని నిశ్చయించి, అలా

ఎత్తుకుపోయాడు. ఎత్తుకుపోయేప్పుడుకూడా, ఆమె శిరోజాలని పట్టడానిక్కారణం - వేదవతీ రూపంలో ఈమె శిరోజాలనే పట్టగా, చేతితో శిరోజాలని స్పృశించినంత వఱకూ ఖండించుకొన్నది. అదే సీత, ఈనాడు దుఃఖిస్తోంది కాని ఖండించలేదు. కారణం, చంపించదలచిన సీత శపించ అక్కఱనూ లేదు - ఆనాటి వేదవతిలా ప్రవర్తించనూ అక్కఱలేదు. రావణుడు, తనను ఎత్తుకుపోతే తప్ప, రామునికి లంకా ప్రయాణపు ఆవశ్యకత ఉండదు. అప్పుడు గాని రావణ వధకు అవకాశం కల్గదు. ఇక తన భార్యని కూడా ఎత్తుకుపోయిన వాణ్ణి క్షమించడం నేరం కాబట్టి, రావణుని చంప వచ్చునని, రాముడూ భావించాడు. తన వధకు సరిపోయినంత తప్పు చేయాలని రావణుడూ నిశ్చయించుకుని సీతాపహరణాన్ని చేసాడు. రామునికి, రావణవధకై అవకాశం కల్పిస్తూ, తానూ అపహరింపబడుతున్నట్లుగా, లొంగి ప్రవర్తించింది సీత. ఇదంతా ఒక నాటకం(జగన్నాటకం). అందుకే, **అంతా విని రామునికి సీత ఏమౌతుంది? అని వెనకటికి ఎవరో ప్రశ్నించారని చెప్తారు** ఇది గట్టి ప్రశ్న. సీత 'రామునికి, లంకా ప్రయాణ అవకాశాన్ని కల్పించి రావణవధ చేసేందుకు మార్గదర్శకురాలు' అని సమాధానం చెప్పాలి. కాని ఈ ఘట్టం వఱకూ ఇంతే. రాక్షసమాయ ఉంటుందని తెలిసిన సీత, నిజమైన రావణుడే అపహరిస్తున్నాడా? లేదా? అనే భయంతో వివరాలన్నీ అడిగి మరీ అపహరించుకొనేలా చేసికొంది. రావణుడు కూడా, దైవ మాయ ఉంటుందని తెలిసి, సీతా వివరాలు అన్నీ ఆమె నుండి తెలిసికొన్న పిమ్మటనే అపహరించాడు (ఇంకా అనేక వివరాలు నాఅరణ్యకాండ వ్యాఖ్యలో వ్రాయబడ్డాయి).

ఇంతకీ, ఇప్పటికి ఈ 'సీత' అనే ఆమె, వేదవతీ రూపానికి అనంతర జన్మ అని గ్రహించగల్గాడు రావణుడు. ఈ విషయం గ్రహించడానికై వాడు చేసిన ప్రయత్నాలు, ఇన్నీ అన్నీ కాదు. ఎక్కడెక్కడ కన్పించిన లావణ్యవతి అయిన స్త్రీనీ, సీతగా భావించి తెచ్చి తన బందిఖానాలో పడవైచాడు. ఏ స్త్రీని తేగా, ఆమె భర్త యుద్ధానికొస్తాడో (వేదవతి చెప్పిన మాట అదేగదా) ఆమె సీత. యుద్ధానికి వచ్చేవాడు రాముడు. అదీ, అతని నిర్ణయం.

ఈ అభిప్రాయంతోనే, రావణుడు - రామునికి శ్రమ ఎక్కువ కాకుండా చేయాలనీ, తనకు తొందరగా మోక్షం లభించాలనీ (వధద్వారా) భావించి, అతికష్టంగా అపహరించిన సీతని అందఱకూ (దేవతా విమానాల మీద పోతూంటే యక్ష - కిన్న - కింపురుష - గంధర్వ - దేవతాదులకు) కన్పించేలా బహిరంగంగా వనంలో ఉంచాడు. దృఢమైన రక్షణలో, ఏ వేం మాళిగంలోనో దాచ శక్తి ఉన్న రావణుడు, ఆమెని, ఏదో

ఒక అంగవైకల్యం ఉన్న రాక్షస స్త్రీల మధ్యనే, ఉంచాడు. (సీతానిత్య సందర్శన భాగ్యం వల్ల, వారికీ మోక్షం లభించాలి). సీతకూ రామునికీ అరణ్యవాసపు గడువు, 14 సంవత్సరాలలో, ఏ సంవత్సర కాలం మాత్రం మిగిలి ఉందో, రావణుడు కూడా సీతకి పెట్టిన గడువు 'అదే సంవత్సరకాలం'. రావణుడు, తాను మోక్షాన్ని పొందేందుకూ, తన వారికి లభించేందుకూ, సీతని తెచ్చాడు. 'నూతిలో పడ్డవారిని రక్షించేందుకు, గాలం నూతిలోనికి వెళ్లి, వారిని పైకి తెచ్చినట్లు, సీతకూడా లంకలో ఉన్న పాపాచారిణులైన రాక్షస స్త్రీలను, పతివ్రతా స్త్రీలను రక్షించదలచి అక్కడికి పోయింది. సీత తనను, గాలంతో పోల్చుకున్నదికూడా. ('ఝషవద్బడిశం గృహ్య క్షిప్రమేవ వినశ్యసి'). కాబట్టి రావణుని అభిప్రాయం, రాముని చేతిలో వధ పొంది మోక్షాన్ని పొందడమే. (ఈ విషయం మరింత, ఆయా సందర్భాలలో వివరించబడుతుంది).

(2) బభూవ బుద్ధిస్తు హరీశ్వ రస్య - యదీదృశీ రాఘవ ధర్మపత్నీ - ఇమా యథా రాక్షస రాజభార్యా - సుజాతమస్యేతిహి సాధుబుద్ధేః (72)

అనేది శ్లోకం. దీనికి తొమ్మిది అర్థాలు వస్తున్నాయి. (1) ఈ సీత, రామునికంటె ముందే ఈ రావణుణ్ణి వివాహం చేసికొని ఉంటే, రావణుని జన్మ ఎంత ధన్యమై ఉండేది? ఈమెను అపహరించడమనే అధర్మం వీనిలో ఉండేది కాదుకదా!. (2) రావణుని భార్యలు, వానితో కలిసి ఉన్నట్లు, మా సీతమ్మ కూడ రామునితో ఉండి ఉంటే, రావణుని జన్మధన్యమై ఉండేది. (3) రాముని భార్య, ఈ దుర్మార్గునిచే అపహరింపబడినట్లు, రావణుని భార్యలు కూడా అపహరింపబడినట్టైతే రావణునికి తగిన శాస్తి జరిగి ఉండేది. (4) రావణునిచే అపహరింపబడి, ఈ కన్పిస్తూన్న స్త్రీలందరూ, ఎలా అతనికి లొంగిపోయారో, అలాగే సీత కూడా ఔతుందని భావించి, హరించడం వల్ల ఇతనికి శుభం కల్గనే కలగదు కదా! (5) రావణుని భార్యలను చూస్తున్నంత స్పష్టంగా, రాముని భార్యని కూడా చూడగల్గితే, నా జన్మ సఫలం కదా! సీతని చూచివచ్చిన వానికి, తనతో సమానస్థితినీ, గౌరవాన్నీ ఇస్తానని సుగ్రీవుడన్నాడు గదా!. (6) రావణ భార్యలవలె, సీత కన్పిస్తే, సుగ్రీవుని వలనా, రాముని వలనా, భయంలేక మా వానర సమూహపు జన్మ సార్థకమౌతుంది గదా! (7) రావణ భార్యలు జీవించినట్లు, సీతకూడ జీవించి ఉంటే రాముని జన్మ సార్థకం (అవతారానికి ప్రయోజనం అయిన రావణ వధ సాగి) అవుతుంది గదా! (8) ఓ! రావణా! నీవు తెచ్చిన ఇతర స్త్రీలతో సమానంగా, ఈమెని కూడా భావించడం వలన నీకు మంచి జరుగదు సుమా! (ఉపదేశం). (9) ఈ రాక్షసుని భార్యల లాటి రూపం, శీలం కలది కాదు సీతమ్మ. ఆమె త్రిలోక సౌందర్యవతి. సచ్ఛీల

సంస్కారాలు కల్గినది. కాబట్టి ఆమె ఇక్కడలేదు. ఉన్నా ఈ చోటులో ఉండనే ఉండదనే నిశ్చయ బుద్ధి హనుమకి కల్గింది.

ఈ శ్లోకానికి వచ్చిన అర్థాలలో, హనుమంతునికి రావణునిపై ప్రతీకార వాంఛతోపాటు, అతని నాశనం గూర్చిన విషయం తెలిసి, జాలీ, సానుభూతీ కన్పిస్తాయి. కాబట్టే ఆంజనేయుణ్ణి 'సాధుబుద్ధి' అని ఈ శ్లోకంలో అన్నాడు. పరభార్యని అపహరించే బుద్ధి కలిగి, తప్పుచేసిన రావణునికి, శిక్షగా, నాశనం కలుగవలసి ఉన్నా, ఆంజనేయుడు వానిని గూర్చి 'అయ్యో! అంటున్నాడంటే అది అతని సానుక్రోశతని (జాలిగుండెని) తెలియచేస్తుంది. భగవంతుడు 'అహంస్మరామి మద్భక్తమ్' అంటాడు. తన పిల్లవాడు పరమ దుర్మార్గాలు చేస్తూంటే, తండ్రి ఎలా ఎలా జాలిపడతాడో (ఎందుకు వీడు ఇలా పాడైపోతున్నాడా అనీ, శిక్షల ననుభవిస్తున్నాడనీను) అలాగే భగవంతుడు కూడా తన భక్తుడి విషయాన్ని గమనించుతూ, దోషం చేసే వాడి గూర్చి 'అయ్యో!' అని పరితపిస్తాడు. తప్పుకి ఏ శిక్ష విధించాలో తెలుసు కాబట్టి, ఆ శిక్ష వేసేముందు కొద్ది బాధపడతాడు. ఏ న్యాయాధికారీ, మరణ శిక్షని విధించేప్పుడు "ఈ ముద్దాయికి బాగా శిక్షని విధిస్తున్నానని" భావించడు. "అయ్యో! ఇలాటి శిక్షకు పాత్రుడయ్యే తప్పు ఎందుకు వీడు చేయాలి?" అని దుఃఖించి, శిక్షించకపోతే తాను శిక్షాపాత్రుడు కాబట్టి శిక్షిస్తాడు. అలాగే ఆంజనేయుడు 'జాలి' పడ్డాడు. మరో విశేషమూ ఉంది. దేశ – కాల – సాంగత్యాలవలన దోషబుద్ధి పుడుతుందని పెద్దల మాట. ఈ సీత రావణుణ్ణి పెండ్లాడి ఉంటే (మొదటి అర్థం).....అని తొలుత భావించాడు. లోకమాత ఆమె యెక్కడ? జగత్ నాశనకారుడు రావణు డెక్కడ? వీరిరువురికీ పోలికా? పైగా సీతమ్మకి రాక్షస స్త్రీలతో పోలికా? ఇలా భావించడానికి కారణం, తాను ఉన్నది దుష్ట ప్రదేశంలో స్థలానికి మాహాత్మ్యం ఉంటుంది కాబట్టే దూరభారాలకి ఓర్చి మనం తీర్థయాత్రల పేరిట అంత దూరంలోని భగవంతుని దర్శించి రావడం. కొన్ని స్థలాలలో నిరాహార దీక్షలే సాగుతుంటాయి. ఒకచోట పిల్లలు పుట్టినందువలన బంధుజనం ఆనందంతో ఉంటే, మరొకచోట శవదహన వాటిక సాక్షాత్కరిస్తుంది. పరిసరాలని బట్టి ఆలోచన లుంటాయి. నిత్య శృంగారం, ఉచ్చనీచ భేదం లేనిదీ, జుగుప్సావహమైనదీ, స్త్రీ పురుష మద్య మాంస పరాయణత, కామ దృక్పథం ఉన్నదీ ఆ చోటు కాబట్టే, హనుమంతుడంతటి స్థిరబుద్ధికి కూడా ఇలాటి ఆలోచన కల్గింది. అయితే సాధుబుద్ధి కాబట్టి, 'పునశ్చ సోఽచింతయత్' – నేను ఇలా ఆలోచించానేమిటి? అని పునర్విమర్శ చేసుకోగలిగాడు. మరో విశేషమూ ఉంది. ఈ

ఆలోచనలన్నీ సీతని గూర్చి మాత్రమే కల్గాయి. (యదీ దృశీ రాఘవ ధర్మపత్నీ). దీనిని బట్టి ఆంజనేయునకు, వాల్మీకికీ ఇద్దఱకూ అయ్య – అమ్మవార్లలో ఇష్టమైనది మొదట అమ్మవారూ, ఆ పిమ్మట అయ్యవారూ అని తెలుస్తుంది. 'ధ్రువం విశిష్టా గుణతో హి సీతా – సీతాయాశ్చరితం మహత్' అని పలికి, 'గుణాలచేత సీతయే గొప్పది' అని హనుమా, 'సీతా చరిత్రమే నేను వ్రాసేది' అని వాల్మీకి ఈ విషయాన్ని స్పష్టం చేసారు.

ధర్మాన్ని విడిచి అర్థ (ధనము) కామాలలో కూరుకుపోయాడు రావణుడు. అర్థ – కామాలని విడిచి, ధర్మాన్ని సర్వాంగాలచేతా ఆచరింప చేసేవాడు రాముడు. ఇలాటి ధర్మమూర్తి రామునికి, వట్టి పత్ని కాదు సీత – ధర్మపత్ని. కాబట్టి, ఈ అధర్మం తాండవించే ప్రదేశంలో, సీత ఉండదని కూడ హనుమ భావన.

వాల్మీకి మహర్షి శ్రీ మద్రామాయణంలో రాముని పురమైన అయోధ్యనీ అలాగే లంకనీ వర్ణించాడు. అయితే, అయోధ్యా వర్ణనంలో మేడల, మిద్దెల గొప్పతనం ఉండదు. వ్యక్తులూ – గొప్పదనం – పవిత్రతా ఉంటుంది. లంకా వర్ణనంలో గొప్పదనం – పవిత్రతా కల వ్యక్తులు లేకపోవడం వల్ల సౌధాలూ, ఐశ్వర్యమూ వర్ణింపబడ్డాయి. పుట్టబోయే పిల్లల కోసం దశరథుడు యాగం చేస్తుంటే, రాజుని ఆశీర్వదించి పోవాలని స్వాగతాల మధ్య మహర్షులూ, ఇతర ప్రజా అయోధ్యకి వచ్చారు. చావబోయే రావణుని వధ ఎలా చేయాలని తెలుసుకోవడం కోసం, రావణుణ్ణి జాలితో చూస్తూ, రాక్షస నింద చేస్తూ హనుమ లంకకి వచ్చాడు. అది పగలు జరిగితే, ఇది రాత్రి జరిగింది. మహర్షుల ఆశీస్సులతో అక్కడ యజ్ఞం ప్రారంభమైతే, లంకని రక్షించే కామరూపిణి (లంకిణి) వధతో, నాశనం ఇక్కడ ప్రారంభమైంది. నలుగురు పుత్రుల పుట్టుకతో అయోధ్య ఆనందపడితే, సర్వరాక్షస వినాశనంతో దుఃఖమయమయింది లంక. ఆనందాన్ని ముఖాల్లో ప్రదర్శిస్తూ శుభాన్ని సూచిస్తూ, అందఱూ అయోధ్యలో తిరుగుతూంటే, చావుని సూచిస్తూ, అంతా నిద్రపోతూండడం లంకా వర్ణనంలో కన్పిస్తుంది. దర్భలూ, హోమద్రవ్యాలూ, బంగారు చెంబులూ, భక్ష్యాలతో అయోధ్యా జనం ఉంటే, అడ్డకత్తూలూ, ఈటెలూ, విల్లంబులతో (మేలుకొని ఉన్నవారు కూడా భయంతో ఉండడం) రాక్షస లంక కన్పిస్తుంది.

❀ ❀ ❀

# 10వ సర్గము

## సీత కనపడింది (దా)?

పూలమాలలా చుట్టూ స్త్రీలు పరుండి ఉంటే, నడుమగా, స్ఫటికాలతో చేయబడి, రత్నాలు పొదుగబడిన శయ్య కన్పించింది. బంగారు మంచం అది. తలవైపు తెల్లని ఎత్తైన బంగారపు గొడుగు. మంచానికున్న పందిరి నుండి సువాసన గల పూల దండలు వ్రేలాడుతున్నాయి. తలవైపు గొడుగునుండి జాతి ముత్యాల దండలు గాలికి కదులు తున్నాయి. ఇంత - అని చెప్పవీలులేని విలువగల దుప్పటి పఱచి ఉంది. మెత్తని పొట్టేళ్ల తోలు కాళ్లవైపున మంచంపై అడ్డంగా పఱచబడింది. సముద్రపు ఒడ్డున ఇసుకలా బంగారం ఆ గదిలో ఎక్కడ చూచినా ఏదో ఒక వస్తురూపంలో కన్పిస్తోంది.

దాని మీద పరున్నాడు రావణుడు. ముత్యాల తెల్లని గొడుగు క్రిందుగా ఒక తల కలిగి ఉన్నాడు. (1) అద్భుత తేజస్సు కన్పిస్తోంది. ముత్యాలూ మణులూ కలిగి ప్రకాశిస్తూ కిరీటం కొద్ది ప్రక్కకి తొలగి ఉంది. ముఖమంతా సుగంధ వాసతో నిండి ఉంది. నీటి బరువుతో ఉన్న మేఘంలా నల్లని మూర్తి అతనిది. ఎఱ్ఱని (మద్య మాంస సేవచే) కళ్లూ - పరిమళిస్తూన్న ఎఱ్ఱని చందనం - చెవులకి విలువైన కుండలాలూ - చెవులకి క్రిందుగా కన్పిస్తూ బారుగా చాచబడిన, రెండు నిడివిగల పాముల్లా బలిష్ఠబాహువులూ - తలకి తగిన కంఠం - కంఠానికి తగిన బాహువులూ - బాహువులకి తగిన వ్రేళ్లూ - వ్రేళ్లకి తగిన బొటన వ్రేలూ - అన్ని వ్రేళ్లకూ తగిన ఉంగరాలూ ప్రకాశిస్తున్నాయి. ముఖం నుండి వెలువడుతూన్న నిశ్వాసాలకి పరిమళం రావడమే కాక, పై నుండి పాన్పుకి వ్రేలాడుతూన్న ఉన్న పూలదండలు సన్న కదులుతున్నాయి. బాహువులు రెంటికీ భుజకీర్తులున్నాయి. ఇంద్రుని వజ్రాయుధపు గాట్లూ ఉన్నాయి.(2)

వక్షఃస్థలం అనేక హారాలతో, ఎఱ్ఱని చందనంతో ప్రకాశిస్తూ, అతి కర్కశంగా ఉండి, లతలూ - పొదలతో నిండిన మందర పర్వతంలా ఉంది. విలువ కట్టలేని హారాలూ, ఆభరణాలూ ఉన్నాయి. మహా విష్ణువు చక్రపు దెబ్బల మచ్చలూ ఉన్నాయి. (3) చల్లని గాలికి మేలి పట్టు ఉత్తరీయం చెదిరి, నడుముకి కట్టిన పచ్చని వస్త్రమూ తొలగి, మినుముల రాశిలా అన్పించాడు. కనిపించని పాము బుసలా శ్వాస వినిపిస్తూంటే, అలసి సొలసిన పెద్ద ఏనుగు విశ్రాంతి తీసికొంటున్నట్లనిపించాడు. ఆభరణాల కాంతి, దీప కాంతులలో ప్రకాశిస్తూంటే మెఱపు మధ్య నల్లి మేఘంలా అన్పించాడు. దగ్గఱగా చూస్తున్న హనుమ భయపడ్డవానిలా, ప్రక్కకి తొలగి, వేఱొక వేదిక ఎక్కి చూడసాగాడు.

అతని పాదాలవైపూ, రెండు చేతులవైపూ ఎందఱో నిద్రపోతున్నారు. వారికి వారు పరుండిన తీరూ - చేతులలో ఉన్న సంగీతానికి సంబంధించిన వాయిద్యాలూ గమనిస్తే వారంతా, సంగీత, నృత్య శాస్త్రాలలో ప్రవీతణ కలవారని చెప్తోంది. కావాలని నిద్రిస్తున్నట్లు కాక, అలసి సొలసి మత్తులో, ఒళ్లు తెలియక నిద్రించిన వారిలా ఆ నిద్రిస్తూన్న తీరు చెప్తోంది. (2). వీణను కౌగిలించుకునీ, పిల్లన గ్రోవిని గుండెలకి చేర్చుకునీ, మద్దెలని హత్తుకునీ, కంజీరాను ముద్దాడుతూ, చేతిలోని కలశమందలి నీరు కలిపిన మద్యం, చుక్క చుక్కగా తనమీదే పడుతున్నా తెలియక ఒరగిల పెట్టి పరుండి, ముందున్న ఆమె పిఱుదులని పట్టుకొని, తన ఉరోజాలని తానే పట్టుకొనీ.... ఇలా నిద్రిస్తూ కన్పించారు. ప్రతి స్త్రీ కూడా తమ తమ ప్రియునితో నిద్రించిన భావనతోనే ఉన్నది తప్ప, సహజ నిద్రతో పవిత్ర భావంతో నిద్రించినట్లుగా లేనే లేదు. (4)

"ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం ననంద చిక్రీడ జగౌ జగామ ।
స్తంభా నరోహన్ని పపాత భూమౌ నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనామ్ ॥ (54)

వీరందఱికూ దూరంగా, వేఱొక మంచంపై, మేలిమి బంగారు రంగు శరీరంతోనూ, ఆభరణ ప్రకాశంతోనూ సుందరాంగి 'ఒకామె' కన్పించింది, ఆమెను 'సీత' అని భావించి సహజమైన వానరబుద్ధికి అనుగుణంగా మారుతి - జబ్బలు చఱిచి, తొడలు కొట్టి, తోకను త్రిప్పి ముద్దెట్టుకుని, ఆనందంతో నర్తించి, సంతోషంతో సన్నగా కూనిరాగం తీసి స్తంభాలెక్కి, దిగి,....ఇలా విచిత్ర విన్యాసాలు చేసాడు. (5)

**విశేషాంశాలు** — **రావణునికి ఎన్ని చేతులు? ఎన్ని తలలు?**

(1) రావణుని ఆకారం 10 తలలు, 20 చేతులుగా భావిస్తాం. కాని ఇక్కడ ఒక తల, రెండు బాహువులతో కన్పిస్తాడు. ఇది ఎలా కుదురుతుందని అనుమానం. అసలు రావణుడు పది తలలు, ఇరువది చేతులతో పుట్టినట్లు ఉత్తరకాండ చెప్తుంది. సీతమ్మకి కూడ, అపహరణం ముందు ఆ రూపాన్ని చూపాడు. అయితే అతడు కామరూపి. (కావలసిన రూపాన్ని సమయానికి అనుగుణంగా చూపగల శక్తి ఉన్నవాడు.)

పులస్త్యుని కొడుకు కాబట్టి, పౌలస్త్యుడు. కైలాసాన్ని ఎత్తి, నేలమీద ఆన్చబోతూంటే వ్రేళ్లు నలిగి అరిచిన (రావాలు) అఱపులను బట్టి, రావణుడు. ఉత్తరకాండం ప్రకారం (9/32) పది తలలతో పుట్టడం చేత దశగ్రీవుడని పేరు పెట్టారు. నిరాహారుడై తపస్సుచేసి, ప్రతి పదివేల సంవత్సరాలకి ఒక్కొక్క తల చొప్పున అగ్నిలో తొమ్మిదింటిని హోమం చేయగా, బ్రహ్మ ప్రత్యక్షమై, ఎవరిచేతనూ చావులేని వరాన్నీ, కామరూపాన్నీ, హోమం చేసిన తొమ్మిది తలలనీ అనుగ్రహించాడు. (10/26). సీతమ్మకు తన

రూపాన్ని, అపహరణ సందర్భంలో చూపినప్పుడూ పది తలలు, ఇరవై భుజాల వాడుగా అయ్యాడు. **(అరణ్య 49/7)**. మరి యిలాటి రావణుడు ఒక్క తలతో, రెండుచేతులతో ఎలా ఉన్నాడు? అంటే దీనికి మూడు కారణాలున్నాయి. (1) పది తలతో పుట్టినవాడు, తానే నరికి హోమాన్ని చేసికొని, తిరిగి అనుగ్రహాన్ని పొందించుకొని తలలని తెచ్చుకొనపోయి ఉంటే, ఎప్పుడూ పది తలల వాడే అయ్యుండేవాడు. కాని హోమం చేసిన కారణంగా ఆ మిగిలిన తొమ్మిది తలల శక్తీ, ఈతలకి చేరి, ఉన్నది ఒక్క తలే అయినా, పదింటి పెట్టుగా మారింది. అరిచినా పది తలల అరుపులాగా, కోపంగా చూసిన పదిరెట్లుగా, ఇలా సమస్త జ్ఞానేంద్రియాలూ ఉన్న తల (ఒక్కటి అయినా) ఏం చేసినా పదింతలుగా ఉంది. అలాగే ఉన్న రెండు చేతులూ రెండు పదులయ్యాయి అంటే 20 చేతుల బలం కలిగి ఉన్నాయి. ఆ చేతులు మన లాటి చేతులు కావు. అవసరమైతే సొంతతలలని ఛేదించనూ గలవు. అవకాశపడితే, కైలాసాన్ని ఎత్తడానికి వెనుకాడవు. అలాటి చేతులు అవి. వ్రేళ్లన్నింటినీ దగ్గరకు కలిపి కలిపి ఉంచితే - అరచేయి అయినట్లూ, విడివిడిగా కన్పించనట్టూ - వెడల్పు చేస్తే, ఒకే మణికట్టునుండి కొంత దూరంలో ఐదుగా విడినట్లూ, రావణునికి, ఈ భుజానికి పది - ఆ భుజానికి పది చేతులు కూడా, భుజం నుండి కొంత క్రింది నుండి విడివడ్డాయని భావించవచ్చు. కాని 'వింశతి కరః' - 'ఇరవై చేతుల వాడు అనక 'వింశతి భుజః'- ఇరవై భుజాలవాడు' అనడం వలన **(అరణ్య 49/7)** తాటి ఆకు పుట్టేప్పుడు ఎలా కలిసి ఒకే ఆకుగా కన్పించి, విస్తరిస్తే ఎలా ఎన్నో ఈనెలుండి, ఆధారం ఒకటేగా ఉంటుందో, అలా భుజం ఒకటే అయి, దానిలోనే మిగిలిన తొమ్మిదీ ఉంటాయని ఊహింపవచ్చు. తలలో మిగిలిన తొమ్మిది తలలూ లేకపోవడం వలన తలలని హోమం చేసాడు. భుజాల విషయం అలా లేకపోవడం వలన హుతం చేయలేక పోయాడు. 'సర్వస్య గాత్రస్య శిరః ప్రధానమ్' కదా. అందుక్కాడ తలలనే హోమం చేసాడు.

ఇలా కాని పక్షంలో చేతులు నిల్వడానికి, ప్రతి రెండు చేతులకూ ఒక కంఠం, వక్షఃస్థలం ఏర్పాటైతే - పది తలలూ ఇరవై చేతులతో ఒక మనిషిగా ఏర్పడ్డవాడు, రావణుడయ్యుండేవాడు. కాబట్టి ప్రధాన శిరస్సుకి ఇటు, అటు ప్రక్కలుగా తలలు ఆ తొమ్మిదీ, ఒకే భుజంలో ఇటు పది, అటు పది చేతులూ ఉన్నవాడు రావణుడు. ఈ పదిచేతుల ఆ పదిచేతుల మూలమూ భుజం కాబట్టి, బరువు మొత్తం భుజాల మీద ఉంటుంది. అందుకే 'సర్వాధిక బలిష్ఠ భుజః' అని రావణుణ్ణి అన్నాడు మహర్షి. శిరస్సులలానే భుజాలుకూడా ఒక దాని ప్రక్కన ఒకటిగా ఉండి ఉంటే, తలలని ఒక్కొక్కటినీ నరికినట్టుగా, భుజాలనీ రాముడు కొట్టి ఉండి ఉండాలి. కాని తలలని నూటుమార్లు రాముడు కొట్టగా నూటుమార్లూ తలలు మొలిచాయి **(యుద్ధ 108/57)**. చనిపోయాక ఒకేతల, రెండే భుజాలూ ఉన్నాయట. **(యుద్ధ 109/3)**. (2)

నిద్రా - మరణ - మైథున కాలాల్లో వ్యక్తి కామరూపత్వాన్ని కోల్పోతాడు. అందుకని ఒకేతల, రెండు భుజాల వాడయ్యాడు రావణుడు. హనుమ రావణుణ్ణి చూచింది నిద్రాకాలంలో కాబట్టి ఈ పద్ధతి సరియేకదా! (3) విభీషణుడు విలపించింది రావణ శవాన్ని చూచి. అది మరణకాలం కాబట్టి అప్పుడూ, ఒక తల - రెండు భుజాలుండడం సరియే కదా! ఎటొచ్చీ, మధ్య మధ్య పది తలలతో ఉండడం ఎలా? అని ప్రశ్న. యుద్ధం రజోగుణానికీ, అహంకారం తమోగుణానికీ ప్రతీకలు. రావణుడు ఎప్పుడెప్పుడు పది తలలు, ఇరవై భుజాలతో కన్పడ్డాడో, అప్పుడప్పుడల్లా అతడు యుద్ధం చేస్తూనో, భయపెడుతూనో ఉండనే ఉన్నాడు. కాబట్టి, అలాటి రజస్తమో గుణ ప్రకోపం లేనప్పుడు మామూలుగానూ, ఉన్నప్పుడు మరోలానూ ఉన్నాడని గ్రహించాలి. ఎవరో అన్నట్లు ఒక భుజం క్రింద వేరొక భుజం చొప్పున పది అటూ పదిఇటూ ఉన్నాయి - అంటే, అప్పుడు చేతుల క్రింది నుండి నడుము వరకు అటు ఇటు ప్రక్కల నున్న భాగాలు చేతులు మొలిచే చోటు అయిపోతుంది. అయినా, పైన - క్రింద చేతులు తప్ప నడిమి చేతులు ఏ పనినీ చేయలేవు. కారణం తమ తమ పై చేతులు అడ్డుగా ఉండడమే. కాబట్టి, అహంకారం ఉన్నప్పుడు తలలూ పదిగానూ, దానికారణాన రజోగుణం ఏర్పడి చేతులు ఇరవైగానూ అవుతాయని సమన్వయించుకోవాలి. ఇక దశాస్యుడు (పది ముఖాలు కలవాడు) అనేది, పది దిక్కుల యందలి విశేషాలనీ స్పష్టంగా చూచే శక్తి కలవాడనే అర్థాన్ని ఇస్తుంది. నాల్గు దిక్కులూ + ఈశాన్య - ఆగ్నేయ - నైఋతి - వాయవ్యమనీ నాల్గు విదిక్కులూ + ఊర్ధ్వ - అధోదిక్కులూ కలిపితే, పది.

(2) అతని భుజాల మీద కన్పడిన మచ్చలు దేవ యుద్ధాలలో కలిగిన దెబ్బలకు సంబంధించినవి. "అతని జీవితానికి ఇదొక మచ్చ" అంటూండడం లోకంలో ఉంది. 'మచ్చ' అంటే ఒక అధర్మాన్ని బయటపెట్టే చరిత్ర అని అర్థం. దేవతలు, అనుగ్రహాన్ని ఇచ్చేమూర్తులు. 'దేవ యుద్ధపు దెబ్బల గాట్లు' కన్పించాయంటే "పరమ కరుణా మూర్తులతో విరోధించే స్వభావమున్నవాడు, ఇతడు" అని ఆ మచ్చలు చెప్పే చరిత్ర. శ్రీరాముడు బాలకాండలో తాటకను చంపడానికి ముందు దాన్ని గూర్చి దాని పుత్రుడు మారీచుణ్ణి గూర్చీ అడుగుతూ, ఈ బలం, రూపం యక్షులవి కాదుగదా! వీళ్ల రాక్షసులు ఎలా అయ్యారని విశ్వామిత్రుణ్ణి రాముడు ప్రశ్నించాడు. 'అగస్త్య శాపం' అన్నాడు మహర్షి తాటక మారీచులని చూడగానే, రూపాన్ని బట్టి, వారి అధర్మపు చరిత్ర (మహర్షితో నిష్కారణ వైరం - ద్వేషించడం) తెలిసేలా అగస్త్యుడు శపించాడన్నమాట. (ఒక్కొక్క ఉద్యోగిపనిచేసేస్థలాన్ని బట్టి, అతడి ప్రవర్తన, లోగడ సరికాదేమోనని అనుమానించినట్లు). ఇక్కడ రావణ భుజం - వక్షఃస్థలం రావణుని అధర్మానికీ, ధర్మ వ్యతిరేకతకీ సూచికలన్న మాట. ఆంజనేయుని బుద్ధిలో, చూచిన అందరికీ కూడా రావణుడు అధర్మపరుడని, స్పష్టంగా విప్పిచెప్పేందుకు ఆ గాట్లు ఉన్నాయని ఆంజనేయుని భావన.

(3) అతనిపై చక్రపు గాట్లు కన్పించాయంటే శ్రీ మహావిష్ణువు చేతిలోని సుదర్శన చక్రం కాదు. అది ప్రయోగింపబడితే తల తెగాల్సిందే తప్ప గాటు చేసివిడువడం ఉండదు. పైగా రావణుని వధకై విష్ణువుని ఇంద్రుడు ప్రార్థిస్తే, కాలాంతరంలో (రామావతారంలో) నేనే చంపాలి-అందుకని ఇప్పుడు రానన్నాడు. అందు చేత,ఆగాట్లు, చక్రం ఆకారంలో ఉన్న ఒక ఆయుధం వల్ల అయిన గాట్లు తప్ప, సుదర్శనం వలన కాదు.

(4) రావణుని చేతులూ, పాదాలచుట్టూ ఒళ్లు తెలియక స్త్రీలు అలసిసొలసి పరుండడం, బొట్లు జారిపోవడం, వస్త్రాలు సరిగా లేకపోవడం ఇవన్నీ భావికాలపు వైధవ్యాన్ని సూచించే లక్షణాలు. ఒకని యందు అనేకరాండ్రకి ఇష్టం ఉండడం రసాభాసాన్ని సూచిస్తుంది కూడ. అలాటి సందర్భంలో వీనికి వారిలో ఏ ఒక్కతెమీదా, లేదా అందరిమీదా నిజమైన అనురాగం ఉండదు. ఆ నిద్రించే భంగిమా, సంగీత వాయిద్యాలూ, అలసి సొలయడం వల్ల లంకలోని స్త్రీలంతా నృత్య సంగీతాలలో ఆరితేరిన వారనీ, తన్మయత కల్గేంతవరకూ వినోదించే వారనీ, అనేక వాయిద్యాలని వాయించగల నేర్పరులున్నారనీ.....ఇలా అనేక విషయాలు బోధపడతాయి. అయితే ఈ నాట్య సంగీతాలన్నిటినీ కేవలం కామసుఖానికి దోహదపడేలా చేయడం దోషమని గ్రహించాలి.

డిండిమం పరిగృహ్యాన్యా తథైవాసక్త డిండిమా ।

ప్రసుప్తా తరుణం వత్స ముపగూహ్యేవ భామినీ ॥ అని శ్లోకం. 'డిండిమం' అనే వాయిద్యాన్ని కౌగిలించుకుని పరున్న ఆమె, వయసుగల తన పుత్రుణ్ణి లనుకుని పరుండినట్లనిపించింది. డిండిమాన్ని వాయిస్తూనే ముందు వెనుక డిండిమాల మధ్య నిద్రించిన ఆమె భర్త-పుత్రుల మధ్య పరున్నట్లు అన్పించింది.

(5) 'సతాం హి సందేహ పదేషు వస్తుషు ప్రమాణమంతః కరణ ప్రవృత్తయః' సత్పురుషుల యొక్క అంతఃకరణమే, వస్తు నిర్ణయంలో ప్రమాణం. మండోదరిని చూడగానే కపిబుద్ధి హనుమకి కల్గడానిక్కారణమిదే. చేతులూ, కాళ్లూ కొట్టుకుంటూ ఏడ్చే పిల్లవాడు, తల్లి కన్పించగానే బుగ్గల నీరు కారుస్తూ, మౌనంగా పాలు త్రాగుతూ ఉండిపోతాడు. అమ్మవారు మీది కాలంలో కన్పడగానే, కళ్లనీళ్లు నిండి పోతాయి హనుమకి. మౌనం ఆవహిస్తుంది. ఇలాటి కపి చేష్టలుండవు. కారణమిదే. సుగ్రీవునికి బుద్ధి చెప్పినవాడూ, అంగదాదులకి సీతాన్వేషణ బుద్ధి కల్పించినవాడూ, మైనాక సురసలకి చక్కని సమాధాన మిచ్చినవాడూ, సింహికని బుద్ధిబలంతో జయించినవాడూ అయిన హనుమకి, కపిచేష్టలు కల్గడానిక్కారణం, తన ద్వారానే తాను, ఎదురుగా నున్న ఆమె సీతమ్మకాదని తెలిసికోవడం కోసం. చేష్టలు బుద్ధివల్ల కల్గుతాయి. 'బుద్ధిం తు సారథిం విద్ధి'. బుద్ధి (పరమాత్మ) సారథిగా ఉండి వ్యక్తిని నడిపిస్తూంటాడు. ఈ బుద్ధి (ఈమెని సీత అనుకోవడం) సరికాదని నిరూపిస్తూ ఆ చేష్టలు, దానికి తగినట్లు జనించాయన్నమాట.

❋ ❋ ❋

# 11వ సర్గము

## సీత ఇలా ఉండదు – ఇంకా వెదకాలి

అవధూయ చ తాం బుద్ధిం బభూవావస్థిత స్తదా ।
జగామ చాపరాం చింతాం సీతాం ప్రతి మహాకపిః ॥
న రామేణ వియుక్తా సా స్వప్తు మర్హతి భామినీ ।
నభోక్తుం నాప్యలం కర్తుం న పాన ముపసేవితుమ్ ॥ (1-2)

హనుమంతుడు తన కపిచేష్టలు మాని క్షణం ఆలోచించి, "ప్రతివ్రతయైన సీత రాముని విడిచి ఉన్న చోటున ఈ విధంగా నిద్రిస్తుందా? భోజనాన్ని చేస్తుందా? అలంకరించుకుంటుందా? రామునితో సాటి ఎవరూ లేరని గ్రహించిన ఆమె, దేవేంద్రుడు వచ్చినా దగ్గరకు రానీయదు. ఎంత తప్పుచేసాను? ఈమె సీతకాదు. వేరొకతె" అని నిర్ణయించుకుని ఆ ప్రదేశం నుండి మద్యాలు స్వీకరించే 'పానభూమి' వెదుకవెళ్లాడు (1).

పెద్ద ఆవుల మధ్య ఆబోతులాగా, కరేణువుల మధ్యన ఉన్న పోతుఏనుగులా నిద్రిస్తూన్న రావణుడికి, ఆ స్త్రీ సమూహానికి ప్రక్కగా ఉంది పానశాల. పెద్ద పెద్ద బంగారు పళ్లాలలో, నెమిలి, అడవికోడి, జింక, ఎనుబోతు మాంసాలని వేలువేలుగా ఉంచారు. కొన్నిటి మాంసాన్ని ముద్దలుగానూ, కొన్నింటి మాంసాన్ని, ఆకారాన్ని బట్టి గుర్తింపదగిన జంతురూపం కలవిగానూ వండి, ఆరోగ్యం కోసం సౌవర్చ లవణాన్నీ పెరుగునూ కలిపి వేర్వేరుగా ఉంచారు. నల్లగొంతూ – ఎఱ్ఱని తలా – తెల్లని ఱెక్కలూ – కల వార్ధ్రాణస పక్షి మాంసం – శుద్ధి చేయబడి వండిన అడవిపంది మాంసం – ఏదుపంది నంజుడులలో ఉంచారు. ఇక గుర్తించలేనన్ని భోజ్య పదార్థాలనీ – నాకటానికి వీలైన తేనెనీ – త్రాగ వీలైన మాంసపు పులుసులనీ – తినడానికి వీలైన ఆటు రసాలతో ఉండే 'షాడబాన్నీ' – చక్కెర బాగా కలుపబడిన మద్యాన్నీ – పూదేనెలతో, పళ్ల రసాలతో, చేయబడిన మద్యాలనీ – వాసనకై వేయబడిన గంధపు పొడినీ – మత్తులో అటూ ఇటూ చిందరవందర చేయబడిన బంగారు చెంబులనీ – చూచాడు. (2)

అక్కడ కూడ స్త్రీ జనం ఉన్నారు. ఒకతె నొకతె కౌగిలించుకునీ – నిద్రపోతున్న ఒకదాని వస్త్రాన్ని మద్యమదంచే లాగి తాను కప్పుకునీ – ప్రతి స్త్రీ ముఖం నుండి, నిశ్వాస వాయువులతో మద్య మాంస వాసన వెదజల్లుతూ ఉన్న దానినీ – రావణుని కోసం పరితపించి మన్మథక్రీడలతో అలసి సొలసి నిద్రా పరవశలైన వారినీ – ఇంకా వివిధ

భంగిమలలో, కామ పురుషార్థ పరాయణలై, వింత వింత శరీరచ్ఛాయలున్న స్త్రీ జనాన్ని ఎందరినో చూచాడు.

ఏ ఒక్కతెనీ కూడ విడువలేదని మతొక్కమాటు నిశ్చయించుకుంటూ, ప్రతి స్త్రీనీ పరిశీలనగా, సీత ఉన్నదేమోననే ఉద్దేశ్యంతో చూచాడు.

ఇతరుని రాణివాసపు స్త్రీలు నిద్రిస్తూంటే, వారి వారి శయన మందిరాలకు పోయి మరీ, అదికూడ పరిశీలనగా చూచాను. ఎప్పుడూ పర స్త్రీలని, చూడాలనే ఆలోచనతో చూడలేదే! తప్పు చేసానా? అని ఆలోచించి, తప్పుకాదని భావించాడు. మగవారు ఎవ్వరూ రాలేని చోటు అని భావించి ఈ స్త్రీలంతా సిగ్గువిడిచి నిద్ర పోతూంటే, అలవోకగా కాక, పరిశీలనగా చూచినా నా మనసులో ఏ దుర్వికారమూ కలుగలేదు. కాబట్టి తప్పుకాదు. (3)

కామం దృష్టా మయా సర్వా విశ్వస్తా రావణ స్త్రియః ।
నహి మే మనసః కించిద్వైకృత్య ముపపద్యతే ॥ (40)

ఇంద్రియాల ప్రవర్తనకు మనసే కారణం. అది నాకు నిశ్చయంగా, స్థిరంగా ఉంది. స్త్రీ జనాన్ని ఇకమీదట చూచినా చలించదు. ఇంకా స్త్రీ జనాన్ని చూడక తప్పదు.

యస్య సత్త్వస్య యా యోని స్తస్యాం తత్పరిమృగ్యతే ।
న శక్యా ప్రమదా నష్టా మృగీషు పరిమార్గితుమ్ ॥ (43)

తప్పిపోయినది స్త్రీ అయినప్పుడు, ఆమెని స్త్రీలలో వెదకడం సరికాని, లేళ్ల మందలో వెదకడం సబబు కాదుగదా! మొత్తానికి, స్త్రీ జనం అయిపోయారు గాని, కన్పించిన గంధర్వ – నాగ – దేవతా కన్యలలో సీత మాత్రం లేదు. అయినా వెదుకుతానని భావించి, పానశాలని విడిచి, అంతఃపురంలో వెదుకని ప్రదేశాల వైపు, వెళ్లాడు హనుమ.

## విశేషాంశాలు

(1) కనిపించే చోట్లలో సీతని వెదకాలి గాని, పాన భూమిలో ఆమె ఎందుకుంటుంది? మద్యం త్రాగదు కదా! అంటే, అపహరించి తేబడిన వస్తువు రావణునికి సీత. మనకిష్టమైన చోటునా, లేదా ఆమె పాతివ్రత్యానికి సరిపోయే చోటునా ఉంచే అభిప్రాయం వాని కెందుకుంటుంది? అకార్యమైన పరస్త్రీనే అపహరణం చేసినవానికి, ఆమెను పవిత్ర స్థలంలో ఉంచాలనే భావన కూడానా? ఇదే ఉంటే, ఆ పని చేసేవాడే కాదుగదా! లంకిణి "విమార్గ సర్వత్ర గతః యథా సుఖమ్" అంది. అన్నిచోట్లా వెదుకు – అనడంలో కారణం, రావణుడు ఎక్కడైనా, ఔచిత్యా నౌచిత్యాలని ఆలోచించక, సీతని దాచి ఉంచుతాడని.

రావణుడే సీతని అపహరించాడని ముమ్మార్తులా సుగ్రీవునికి తెలిసినా, నాలుగు దిక్కులకీ సీతమ్మ జాడని తెలిసికొని రమ్మని వానరులని పంపడంలో కారణం కూడా ఇదే. అయితే దక్షిణపు దిక్కునే ఉంటుందనే నిశ్చయ జ్ఞానం ఉన్న రాముడు దక్షిణ దిక్కుకి వెళ్లే ఆంజనేయునికే అంగుళీయకాన్ని ఇవ్వడంలోని ఔచిత్యం ఏమిటంటే, సీతని రావణుడు తీసికొనిపోయిన అభిప్రాయం వేఱు కాబట్టి ఆమెని లంకలోనే 'భద్రపఱుస్తాడు' గాని మఱోచోట దాచడని.

(2) ఈ మద్యమాంస విశేషాలలో అనేక విశేషా లున్నాయని, మద్య మాంసా హారులైన కొందఱు శ్రోతలు, ఒకనాటి నా ఉపన్యాసం పిమ్మట చెప్పారు. అనుభవంలో లేని-ఉండబోని నాకు, అవి అర్థం కాలేదు కాని, ఏవో విశేషాలున్నాయని మాత్రం అర్థమైంది – అస్తు.

(3) హనుమ, స్త్రీలనీ, అందునా మద్యాన్ని చిత్తుగా త్రాగినవారినీ, మన్మథ క్రీడలచే అలిసిన వారినీ చూచి, తన మనసుని ప్రమాణంగా గ్రహించుకొని తప్పుకాదని భావించాడు. 'న రామః పరదారాన్వై చక్షుర్భ్యామపి పశ్యతి'. రాముడు ఇతర భార్యలని ఎన్నడూ కన్నులతో చూచి ఎఱుగడు. 'న పరదారాన్ గచ్ఛేత్ – పశ్యేత్' వంటి హెచ్చరికలు (ఇతర భార్యల పొందు గాని – కావాలని వారిని చూడడం గాని – తగదు) ఉన్నాయి. అందుకని పరీక్షగా చూచిన హనుమ, తప్పు చేసినట్లే, పైకి ఆలోచిస్తేఅన్పిస్తుంది.

"ఏకతశ్చతురో వేదాః – బ్రహ్మచర్యం తథైకతః –
ఏకత స్సర్వ పాపాని – మద్యపానం తథై కతః" అని శ్లోకం.

నాలుగు వేదాలని అభ్యసించడమూ, బ్రహ్మచర్యాన్ని రక్షించుకోవడమూ ఒకటైతే, సర్వపాపాలనీ చేయడం, మద్యాన్ని సేవించడమూ ఒకటని ధర్మశాస్త్రం, అలాటి మద్యపానం చేయడం స్త్రీల దోషమైతే, ఆ సర్వమహా పాపాలని చేసిన దోషమున్న ఈ స్త్రీలని చూడడం హనుమ దోషం అన్పించక మానదు. పుణ్యం అనేక విధాలుగా లభిస్తుంది. అలాగే పాపం కూడ. ఆనుషంగిక పుణ్యం – ఆనుషంగిక పాపం అని ఉన్నాయి. పిల్లవాణ్ణి వెదకడానికి వెళ్లి, వాడు తప్పించుకోడానికి నవ్వుతూ పారిపోతూంటే, ముమ్మాఱు గుడిచుట్టూ, వాణ్ణి పట్టుకోడానికి తిరిగాం. దేవుని మీద భక్తి శూన్యం. అయినా పుణ్యఫలం, (ముమ్మాఱు ఆలయ ప్రదక్షిణ ఫలం) దేవుడు మనకు జమ చేస్తాడు. ఇది ఆనుషంగిక పుణ్యం. అలాగే చూడాలని లేకున్నా, ఎందఱో స్త్రీలు కన్పడుతూంటారు. చూచినందువలన పాపం వస్తుందా? (పైన పరదారలని చూడరాదు అన్నందువలన) అంటే మనసులో దుర్వికారం లేకపోతే రాదని సమాధానం. పై ఉదాహరణలో మనసులో లేకపోయినా పుణ్యమిచ్చే భగవంతుడు, ఇక్కడ దుర్వికారం లేకపోతే పాపాన్ని అంటగట్టడు. అందుకే భగవంతునకు 'సానుక్రోశః' (విపరీతమైన

జాలి కలవాడు) అని పేరు. ఈ కారణంగా ఆంజనేయునకు పాపదోషం రాలేదు. ఇక మరో చమత్కారం ఉంది. ముఖ్యమైనది.

శ్రీమద్రామాయణంలో, వ్యక్తికి శీలపరీక్ష ఉంటుంది. మొదటి అభ్యర్థి రాముడైతే, పరీక్షా కేంద్రం జనస్థానం అనే పేరున్న అడవి. పరీక్షా నిర్వాహకురాలు శూర్పణఖ. పర్యవేక్షకులు (Invigilators) సీతాలక్ష్మణులు. ఫలితం, రాముని ఉత్తీర్ణతతో పాటు, నిర్వహించిన శూర్పణఖకు, రామునికి పరీక్ష నిర్వహించేంతటి యోగ్యత లేదని ప్రకటిస్తూ ముక్కు చెవులని తెగగోయటం.

రెండవ అభ్యర్థి లక్ష్మణుడు. పరీక్షా కేంద్రం పర్ణశాల. పర్యవేక్షకులు రావణుడు, పంచభూతాలు. పరీక్షా నిర్వాహకురాళ్లు (1) సీత (2) అయోముఖి. సీతాపహరణ సందర్భంలో మారీచుని కంఠధ్వని విని సీత లక్ష్మణునితో రాముడు లేకపోతే సముద్రంలో, లేదా అగ్నిలో, లేదా గోదావరిలో దూకుతా, లేదా ఉరివేసుకుంటాను తప్ప నిన్ను ఇష్టపడను అన్నప్పుడు సీతా రక్షణ భారాన్ని వన, భూదేవతలకూ, పంచభూతాలకూ, అప్పగించి చెవులు మూసికొని లక్ష్మణుడు వెళ్లిపోయాడు, ఫలితం నిర్వాహకురాలైన సీతకి, భర్తృ వియోగ కష్టం. లక్ష్మణుడు పరమ యోగ్యుడని తెలిసీ నిందించడం, ఈమెకు కష్టం కలిగేందుకు కారణమైంది. అలాగే 'అయోముఖి' అనే రాక్షస స్త్రీ, లక్ష్మణుణ్ణి కౌగిలించుకుంటే, ఆమె ముక్కు చెవులనీ, స్తనాలనీ కోసివైచాడు లక్ష్మణుడు. కాబట్టే లక్ష్మణుడూ కామాన్ని జయించినవాడే. అయితే లక్ష్మణుని కంటె రాముని గొప్పదనం ఏమిటి? భార్య ప్రక్కన ఉండగా చేసే బ్రహ్మచర్యం రామునిది. లక్ష్మణునిది అలాటిది కాదు. నారి (భార్య) కల (ప్రక్కన ఉండగా) బ్రహ్మచర్యం – చాల కఠినమైనది. అందుకని రాముడు గొప్ప. శీల పరీక్షలో రామలక్ష్మణులు ఓటమి లేక గెలిస్తే, వీరి గురువైన విశ్వామిత్రుడు ఓడి గెలిచినవాడు. మేనకా విషయంలో ఓడి, ఉత్తర దిక్కున తపస్సు చేస్తుండగా వచ్చిన రంభవలలో పడక, దానిని శపించి, గెలిచినవాడు.

విశ్వామిత్రుడు ఓడిగెలిస్తే, గెలిచి ఓడినవాడు సుగ్రీవుడు. తన భార్య ఐన 'రుమ'ని వాలి తీసికొనిపోగా, బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తూ ఉండి, వాలి మరణానంతరం వాలి భార్య 'తార'ని తన భార్యగా చేసికొన్నాడు. తన భార్య తన వద్ద లేనప్పుడు గెలిచి, అన్న పోయినప్పుడు అవకాశం రాగానే పదినెను తెచ్చుకొని ఓడిపోయాడు.

లక్ష్మణుడు పరీక్షలో రామునితో ఒకసారి పాల్గొంటే, ఒకసారి ఆంజనేయునితో పాల్గొన్నాడు. రామునితో శూర్పణఖా విషయంలో పరీక్షలో పాల్గొని గెలిచాడు. కిష్కింధకు వెళ్లి శృంగారరూపంతో, సుగ్రీవ శయ్యనుండి వచ్చిన తారను చూచి, తలదించి, కొంతసేపు మౌనంగా మాటాడలేక పోయాడు. ఆంజనేయుడు, ఆ మీదట కథ నడిపించాడు. లంకలో, ఈ తారకు మించిన భోగశృంగార పరాయణలైన (ఇప్పుడు హనుమ చూస్తున్న) స్త్రీలు ఎందరో ఉంటారు. ఒక్క తార విషయానికే తబ్బిబ్బైన

లక్ష్మణుడు, అక్కడ లంకలో ఇంకెంత సంభ్రమ పడిపోతాడోనని, లక్ష్మణుణ్ణి దూరగా పంపరాదని రాముడు నిశ్చయించాడు. పంపరాని కారణాల్లో ఇదొకటి. అదే కిష్కింధలో ఉన్న హనుమ, అక్కడ సుగ్రీవునికి ఉపదేశమూ, బెదిరింపూ చేసాడు. ఇక్కడ లంకలో కూడా స్త్రీ జనాన్ని చూచి, పరీక్షగా చూచి, మళ్లీ చూచి, లంకా విధానాన్ని తెలిసికొన్నాడు. రామలక్ష్మణులకి స్వదేశంలో పరీక్ష జరిగితే, హనుమకి పరీక్ష విదేశంలో (లంక) జరిగింది. వీరి పరీక్షకి (చూచే వారుంటే) పర్యవేక్షకులు, హనుమ పరీక్షకి పర్యవేక్షకులే లేరు. పర్యవేక్షకులు లేకుండా వ్రాయడం అభ్యర్థియొక్క గొప్పతనాన్ని, చెప్తుంది. మారుతి, తన సమాధాన పత్రాన్ని తానే దిద్దుకున్నాడు కూడ. ఇలా స్త్రీలని చూడడం వలన నాడు దోషం వచ్చిందా? అని భావించి, ఏ దుర్వికారమూ ఇంతసేపటినుండి పరీక్షగా చూస్తున్నా కూడా, కలుగలేదు కాబట్టి దోషం లేదని నిశ్చయించాడు. 'సతాం హి సందేహపదేషు వస్తుషు ప్రమాణ మంతఃకరణ ప్రవృత్తయః'. సందేహాస్పదంగా ఏదైనా తోస్తే, సజ్జనులకి తమ మనస్సే ప్రమాణం. అంటే సందేహ నివృత్తిని చేసే సాధనం అని అర్థం. దీన్నే 'ఆత్మపరీక్ష' అంటారు. ఇది అన్నిటిలోకి శ్రేష్ఠమైనది. అలాటిది హనుమ చేసికొన్నాడని భావం.

"న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి ।

హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే" అని యితిహాసం చెప్తోంది. కామమనేది అనుభవించే కొద్దీ పెరిగే స్వభావం ఉన్నది. లోకంలో అనుభవించిన కొద్దీ సంపద మొదలైనవి తరిగిపోతాయి. నేతిని యాగాగ్నిలో వేసిన కొద్దీ మంట పెరిగినట్లు, కామం కూడా అనుభవం వలన పెరుగుతుందని తెలిసికూడా, స్త్రీజనాన్ని చూడడం అనేది కామాన్ని ప్రేరేపించే గుణమని గ్రహించి కూడా, ఆ స్త్రీ జనంలోనే స్త్రీయైన సీతమ్మ దొరుకుతుందని, వారిలోనే వెదుక దలిచానని హనుమ భావించడం నిశ్చలమైన అతని మనస్సుకీ, సత్ బ్రహ్మచర్య దీక్షకూ, ఆత్మ నిగ్రహానికీ తార్కాణాలు. సీతమ్మని చూడాలని బయలుదేరడం అనేది, ఎలాటి ఒడుదుడుకులు వచ్చినా, నిగ్రహంతో కార్యసాధన చేయాలనే దృఢసంకల్పానికీ, లక్ష్యశుద్ధికీ నిదర్శనం.

ఎన్నో భక్ష్యాలూ-భోజ్యాలూ కన్పించినా వాటియందు ఆసక్తి, ఎందఱో స్త్రీలు కన్పడినా వారియందు ఇష్టమూ, ఎందఱో ఆయుధాలతో కన్పించినా వారితో పోరాడాలనే ఉత్సాహమూ లేవు సరికదా, తన మనసులో ఏ విధమైన తొణుకూ-బెణుకూ లేకుండా వెదుకుతూన్న ఆంజనేయుడు కార్యసాధన చేసికోవాలనుకునే వారికి మార్గదర్శకుడు. పాల సముద్రాన్ని చిలుకుతూంటే లక్ష్మీదేవి వచ్చినా, కాలకూట విషం వచ్చినా, అమృతం వచ్చేవఱకూ దేవతలు చిలుకుతూనే ఉన్నారంటే కారణం, లక్ష్యం చేరే వఱకూ పట్టుదల సన్నగిలరాదని ఉపదేశించడమే.

❋ ❋ ❋

# 12వ సర్గము

**శోకం కార్యాన్ని చెడగొడుతుంది**

అనిర్వేదః శ్రియో మూలమనిర్వేదః పరం సుఖమ్ ॥
అనిర్వేదో హి సతతం సర్వార్థేషు ప్రవర్తకః ॥ (10)

కరోతి సఫలం జంతోః కర్మ యత్తత్కరోతి సః।
తస్మాదనిర్వేద కృతం యత్నం చేష్టేఽహముత్తమమ్ ॥ (11)

సీతని చూడాలని, లతాగృహాలనీ, చిత్రశాలా గృహాలనీ, ఇంకా ఇతర భవన ప్రాంతాలనీ వెదికి – ధ్రువం హి సీతా మ్రియతే యథా న మే విచిన్వతో దర్శన మేతి మైథిలీ – ఎంత వెదికినా కన్పించని కారణంగా, ఆమె మరణించి ఉంటుంది. తన శీలాన్ని రక్షించుకుంటూ ఉన్న ఈమెను, దుర్మార్గుడైన రావణుడు చంపైనా ఉంటాడు. లేదా వికృతమైన ఆకారాలూ, చేష్టలూ ఉన్న ఈ రాక్షస స్త్రీలను చూచి భయపడి, ధైర్యం తగ్గి, చనిపోయి అయినా ఉంటుంది. తీక్షణంగా దండించే స్వభావమున్న సుగ్రీవుడు, నేను సీతా దర్శనం చేయక తిరిగి వెడితే ఊరు కొంటాడా ?

సీతని చూడకండా వెనక్కి వెడితే, సముద్రపు ఒడ్డున నే చేసిన ప్రతిజ్ఞలు ఏమౌతాయి? వానరులంతా, ఏం చేసుకొచ్చావని అడిగితే ఏం చెప్పగలను? చూడలేకపోయాననే దిగులుతో ఇక్కడే ఉండి ఆంస్యాన్ని చేస్తే, గడువు దాటగాన్నద్దుడూ, నన్ను ప్రోత్సహించిన వాడూ అయిన జాంబవంతుడు మొదలైన అందరూ ప్రాయోపవేశం చేస్తారు. అతనితో పాటు వానరులంతా నన్ను గురించి ఎంత నింద చేస్తారు?(1)

అలా అని ఒంటరిగా, సీత కనిపించని లేదని వెడితే, అది చావుతో సమానమైన అవమానం. అయినా శోకం కార్యాన్ని చెడగొడుతుంది. (2) ఉత్సాహం సుఖాన్నిస్తుంది. దాని ద్వారా ఏ పనినైనా సులభంగా, నేర్పరితనంతో చేసికోవచ్చును. ఉత్సాహమనేది చేసిన ప్రతికార్యాన్నీ సఫలం చేస్తుంది. కాబట్టి, తిరిగిన శాలంనీ, వెదికిన గృహాలనీ, చూచిన మంటపాలనీ తిరిగి వెదుకుతానని నిశ్చయించి, ఎగురుతూ, దిగుతూ, నిలుస్తూ, తలుపులు తోస్తూ, మూస్తూ, వంగివెడుతూ ......., ఇలా ఆయా ప్రదేశాలకి అనుగుణంగా వెడుతూ, రావణాంతఃపురంలో బెత్తెడు (నాలుగు వ్రేళ్లని అడ్డంగా పెడితే ఉండే దూరం) చోటు కూడ విడువకండా చూచాడు.

రావణుని చెఱలోని దేవకన్యలూ, వికారాకారం కల రాక్షస స్త్రీలూ, చంద్రముఖులైన నాగకన్యలూ, సౌందర్య వతులైన విద్యాధర కాంతలూ కన్పించారు గాని సీత జాడ తెలియరాలేదు.

విషాదముపాగమద్ధీమాన్ హనుమా న్మారుతాత్మజః (23/2)
వ్యర్థం వీక్ష్యానిలసుత శ్చింతాం పునరుపాగమత్ - (24/2)
చింతా ముపజగామాథ శోకోపహత చేతనః (25/2)

తాను సముద్రాన్ని దాటడం, ఇక్కడ వెదకడం అన్నీ కూడా, సీత కన్పించకపోతే వ్యర్థమౌతాయని ఊహించి, తన ప్రయాణాన్ని సఫలం చేసికొనడానికైనా, సీత జాడని తెలిసికోవాలని, ప్రయత్నం విరమించలేదు. సీత కన్పించలేదని, చెప్పలేని శోకాన్ని పొందాడు. ఉత్సాహాన్ని విడువకపోయినా, చింతని మాత్రం తొలగించుకోలేక పోయాడు హనుమ.

**విశేషాంశాలు**

(1) లోకాపవాదాద్భయమ్ - అని సత్పురుషుల లక్షణాలలో ఒకటి. తనని గురించి ఏదైనా అపనింద వస్తుందేమోననే భయంతో ఉండి, నిందాపాత్రమైన పని ఏమైనా చేస్తున్నానా ? అని ప్రతి వ్యక్తి, సజ్జనుడు కావాలనుకొంటే, భావించాలట. ఎలాగో ఒకలా, పది రోజులు రాజ్యం చేయాలను కోరాదు. ఇంత తక్కువకాలం రాజ్యం చేసిన ఒక దుష్టుడు, చరిత్రలో ఉన్నాడని, తర్వాతి వారనుకుంటారని భయపడాలి. వాల్మీకి నారదుణ్ణి, ఈ ఇతిహాస ప్రారంభంలో ప్రశ్నవేస్తూ 'చారిత్రేణ చ కో యుక్తః ?' - ఎవనికి సచ్చరిత్ర ఉందో అలాటి వాణ్ణి కథానాయకునిగా ఉంచాలని భావిస్తున్నానంటాడు. అలాటి నిందకి భయపడుతూన్నవాడు కాబట్టి, ఉత్తముడు మారుతి.

(2) 'తన సంతోషమె స్వర్గము - తన దుఃఖమె నరకమండ్రు' అని చెప్పడం ఇందుకే. శోకం ఎవ్వరికీ ఉండరాదనీ, అది ఏ ఒక్కరికి ఉన్నా, ఇతరులని కూడా నిరుత్సాహ పరుస్తుందనీ తెలిసి, పెద్దలు శోకించవద్దంటారు. చెక్కిలి మీద చేయిపెట్టుకొని కూర్చోవడం, నట్టింట ఏడుస్తూ ఉండడం, నెత్తిన చేతులు పెట్టుకొని లేదా గొంతుక్కూర్చుని ఉండడం సరికాదని పెద్దలు వారిస్తూ ఉండడాని క్కారణం, అవన్నీ శోకం కల్గినప్పుడు ఉండే లక్షణాలే అని. వివాహంలో సప్తపదిలో కూడా 'ఏకమిషే - ద్వే ఊర్జే ...... అని మంత్రాలు పలుకుతూ, వధూవరులని 7 తములపాకులపై, ఉత్తర దిశగా నడిపిస్తారు. 'ఇహలోక సుఖాలుండి దుఃఖాలుండరాదు' అనే భావంకూడా వీనిలో ఉంది. 'మా కశ్చిద్దుఃఖ భాగ్భవేత్ (ఎవరూ దుఃఖంతో ఉండరాదు) అని భారతీయధర్మం కోరుతుంది. 'ఇంటినిచూచి, ఇల్లాలినిచూడు' అంటే ఇల్లు అందంగా ఉన్నా, ఇల్లాలిలో శోకం ఉందేమో చూడు అని అర్థం. 'కలకంఠికంట కన్నీరుంటే సిరియింట నుండ నొల్లదు' కదా ! భారతీయ ఆలంకారికులు నాటకాలనీ, రూపకాలనీ వివరిస్తూ రంగస్థలం మీద చూపింపరాని షట్టాలని చెప్పారు. స్నాన - భోజన - మైథున - యుద్ధాదులు.

అవి ముగిసాయి అని, ఒక పాత్ర చెప్పడం జరగాలి. శోకం కూడా చూపదగినదే కాని, వెంటనే అతణ్ణి ఓదార్చే ఘట్టం చూపి ధైర్యాన్ని కల్గిస్తారు. ప్రతి స్తోత్రంలోనూ శోకం వద్దని కన్పిస్తుంది. చింతా - శోక ప్రశమనమ్. ......, (ఆదిత్య హృదయం). శ్రీమద్రామాయణం, మగ క్రౌంచపక్షి పోగా ఆడు క్రౌంచపక్షి శోకంవలన ఉద్భవించింది. శోకం ఉండవచ్చు. కాని మరణానికి, ఆత్మ హ(హ)త్యకూ శోకం పాల్పడరాదు. వ్యక్తిని, ఒడిదుడుకులకు తట్టుకునే స్థితికి పెంచడం భారతీయ మహర్షి లక్ష్యమైతే, 'ట్రాజెడీ' కథలు వ్రాయడం, అప్రాచ్యుల లక్షణం. దానితో మానసిక స్థైర్యం దెబ్బతింటుంది. తిని తీరుతుంది. ఈలాటి కథలు, నవలలు చదివి చదివి, అప్రాచ్యులు (ఆంగ్లేయులు) ఈనాడు మానసిక అధైర్యం - శోకం - అసంతృప్తి (Depression) తో బాధపడుతూంటే, వారినే అనుసరించాలనే దృఢదీక్ష కల మనవారు, ఇదే వ్యాధికి భారతదేశంలోనూ, గురి అవుతున్నారు. అందుకే 'కావ్యాలాపాంశ్చ వర్జయేత్' అని ఆలంకారికులన్నారు. పిచ్చి పుస్తకాలూ, చౌకగా అద్దెకు లభించే పుస్తకాలూ (Trash) చదవద్దని నిషేధించారు మనసుని పాడుచేస్తాయని.

ఐతే శోకం తప్పుకాదు. అధైర్యాన్ని పొందకూడదు. ఎవరికి వచ్చిన శోకమైనా, పుత్రుడుపోయిన అర్జునుని కంటె; రాజ్యాన్ని - భార్యని - మిత్రుడైన జటాయువుని - కోల్పోయిన రామునికంటె; భార్య పరాభవాన్ని కళ్లతో చూడవలసి వచ్చిన ధర్మరాజు కంటె; తమ రాజ్యంకోసం పాట్లుపడి అరణ్యాలలో తిరిగిన పాండవుల కంటె; మించిన శోకమా? ఆలోచించాలి. అందుకే అరణ్యాలలో ధర్మరాజు ఉన్నప్పుడు, మార్కండేయుడు మొదలైన మహర్షులు ఆయనకు కొన్ని కథలని చెప్తారు. (నల దమయంతులు, సీతారాములు). వీరికంటె, నీ కష్టం ఎక్కువకాదని నోటితో చెప్పకుండా, అర్థం చేసికోమనడానికి వీలుగా చెప్పారు. వివాహాది కార్యాలకు, చుట్టాలయింటికి పోకపోయినా తప్పుకాదట గాని, అశుభం జరిగితే అవతలి వ్యక్తి శోకంతో ఉంటాడు కాబట్టి - ఇంతమంది నీ వాళ్లం ఉన్నాం - అని చెప్పడానికి, వ్యక్తికి ధైర్యం కల్గించడానికి వెళ్లి తీరాలట. తమ కంటె దుఃఖాన్ని పడ్డవారున్నారని తెలిస్తే, కొంత ఉపశాంతి కల్గుతుందని, ఇంతకు మించిన కష్టం పడ్డ నలదమయంత్యాదుల కథలని, మహర్షులు, ధర్మరాజు మొదలైన వారికి చెప్పారు. కాబట్టి, అతి భయంకరమైన శోకం, పరామర్శింపబడితే, మరణంవైపు పర్యవసించేది, ఏనాడూ కాదు.

బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వమ్.....ఇవన్నీ ఆంజనేయ స్మరణవల్ల కలుగుతాయట. ధైర్యమూ, భయంలేకపోవడమూ కలుగుతాయని శ్లోకం చెప్తోంది. ధైర్యమంటేనే నిర్భయత్వం కదా! అంటే, శోకం వలన ఏం కీడు జరుగుతుందోననే భయం కల్గుతుంది. ఆ భయం ధైర్యాన్ని దెబ్బతీస్తుంది. కాబట్టి ధైర్యమూ, శోకం లేక పోవడమూ కల్గుతాయని భావమన్నమాట.

❀ ❀ ❀

# 13వ సర్గము

## మరిచి పోయిన నమస్కారం

ఆఖ్యాతా గృధ్రరాజేన న చ పశ్యామి తామహమ్ । (6/2)
....... అథవా నిహితా మన్యే రావణస్య నివేశనే। (15/2)

రావణుని లంకలోనే సీతమ్మ ఉందని గ్రద్దలరాజు సంపాతి చెప్పినా, (1) సీతమ్మ కన్పించడం లేదు. అయోనిజ అయిన సీత - పవిత్రమైన విదేహదేశంలో జన్మించిన వైదేహి - కర్మిష్ఠి ఐన జనకుని వంశానికి చెంది, పరమ వేదాంతి ఐన జనకునిచే పెంచబడిన మైథిలి - రావణుని వశం కానేకాదు.

రామబాణాలు, తన మీద ఎక్కడ పడతాయో ననే భయంతో, వేగంగా రావణుడు ఆకాశమార్గాన సీతని తీసికొని వెడుతూంటే, సీతమ్మ జారి పడిపోయుంటుందా? కానేకాదు. (కావాలని ఎత్తుకుపోయేవాడు జారిపడి పోనిస్తాడా ? అదీ కాక రామబాణాలు పారిపోయే రావణుని మీద పనిచేయవు కదా ! ఆ విషయం రావణునకు మారీచుడూ, అకంపనుడూ కూడ చెప్పారుగా ! (1) బహుశః ఎత్తుగా ఎగురుతూన్న సీతమ్మ, లోతైన, విశాలమైన సముద్రాన్ని చూచి భయపడి జారిపడి ఉంటుందా ? కానేకాదు. రాజపుత్రి - రాజపత్ని అయిన సీతకి సముద్రం క్రొత్తది కాదు. క్షత్రియ వంశ సంజాత అయిన ఆమెకు, ఆ మాత్రం ధైర్యం లేకపోతే ఖరదూషణాది వధలని ఎలా చూడగలిగింది? సీతమ్మని భుజాల మీద వేసికొని వేగంగా రావణుడు తీసికొని వస్తూంటే, (2) అణచి పెట్టిన వాని బాహుబలం వల్ల ప్రాణాలు విడిచిందా? కానేకాదు. (పడిపోతాననే భయంతో ఆమె గట్టిగా వాని బాహువులని పట్టుకొని ఉంటుంది కాని, వాడు బలిష్ఠంగా పట్టుకొని ఉండడు. ఒకవేళ పట్టుకొన్నా, తీసికొని పోదలచిన వాడు చనిపోయేంత గట్టిగా ఎందుకు పట్టుకుంటాడు?) వాని నుండి తప్పించుకోడానికై పెనగులాడుతూ సముద్ర మధ్యంలోకి పడిపోయిందా? అయ్యుండదు. (ఇంతకు ముందు జటాయు యుద్ధ సమయంలో జారిపడబోతే పట్టి రక్షించాడు. జటాయువుని పట్టుకొని ఏడుస్తూంటే, తెచ్చుకొని మరీ ఎత్తుకుపోయాడు. ఆ పెనుగులాట ఏదో, ఇంతకు ముందు భూమిపై ప్రయాణిస్తున్నప్పుడే సాగింది. తన ప్రయత్నం వ్యర్థమని భావించింది. అందుకే కన్పించిన అందరికీ "రామునికి ఈ వార్త చెప్పండి చాలు" అని చెప్ప నారంభించింది. శక్తి లేక, రాముని గొప్పదనాన్నీ, రావణుని పిరికిపంద తనాన్నీ, తాను నాశనం చేయదలచిన తన శక్తినీ విప్పిస్తోంది, ఆ కాలంలో వేగదా! సముద్రం మీద ఎగురుతూన్నాడు రావణుడు. అందుకని పెనగులాట లేక వాదులాట మాత్రం ఉంది, సముద్రం పైన ప్రయాణించేప్పుడు).

హా రామ! లక్ష్మణ! అయోధ్య! అని విలపించి, విలపించి, రామ ముఖాన్ని ధ్యానిస్తూ పోయి ఉంటుందా! **కానేకాదు.** (రామలక్ష్మణులని ధ్యానిస్తే క్రొత్త శక్తి వస్తుంది. కాని శక్తి హీనత – మరణం కలుగనే కలుగదు. మరణించే వానికే రామధ్యానం మోక్షాన్ని ప్రసాదిస్తూంటే, బ్రతికున్నవానికి రామధ్యానం చావునిస్తుందా? పైగా రాముని కొఱకు జీవించి ఉండాలని ఆమె పరితపించే లక్షణం కలది. మరణం వస్తూన్నా ఆపుకోగల శక్తి కలది). రావణుడు జటాయువుతో యుద్ధంచేసి, రథం విఱిగి, సారథి చచ్చి దిక్కులేక సీతని ఎత్తుకుపోతూంటే, ఆ నిరుత్సాహంలో రావణుని నుండి తప్పించుకొని సీత జారి ప్రాణాలు విడిచిందా? **కానేకాదు.** (పది తలలు, ఇరవైచేతులని రావణుడు ధరించిన కారణం, ఎన్ని విధాలుగానో ఆలోచించాలనీ, ఎంతో భద్రంగా ఆమెను పట్టుకు పోవాలనీను. అదీకాక సీతమ్మ చేతికి దక్కాక రావణునకు నిరుత్సాహమా? అది ఏదైనా ఉంటే సీత దక్కకముందు ఉండాలి. మారీచుణ్ణి ఉత్సాహ పఱచిన వాడు, తాను నిరుత్సాహ పడతాడా?) తన పాతివ్రత్యాన్ని రక్షించుకునే ఆమె, ఇక తన వశం కానే కాదని భక్షించి ఉంటాడా? **అయ్యుండదు.** (తన వశం, కాని వారిని తేవడమే వాని లక్ష్యం. వశమైన వారిని గూర్చి ఆలోచించక పోవడమూ వాని స్వభావం. అయినా, ఎంతో ఇష్టపడి, ఎంతకాలమో వేచి, ఎందఱికో అసత్యాలు చెప్పి, ఎందఱి మాటనో వినక తెచ్చే సీతమ్మని భక్షించేంతటి అవివేకి రావణుడు కాడు.) రావణుడు తినకపోయినా, సీతవల్ల, తమకీ తమ భర్త దూరమౌతున్నాడని భావించిన రావణ భార్యలు తిని వేసారా? **అయ్యుండదు.** (అదే నిజమైతే లంకిణి చెప్పాలిగా! 'వెదుక్కో' అని ఎందుకంటుంది? రాక్షస రాజపత్నులు, సామాన్య నీచ రాక్షసులవలె పీక్కుతినే జాతివారు అయ్యుండరు. పైగా రావణునకు ఇష్టమైన వస్తువుని, వాని అనుమతి లేక తినేంతటి ధైర్యం లంకలో ఎవరికుంటుంది! పంచ భూతాలే భయంతో సంచరిస్తాయి గదా లంకలో!) ఇదంతా అయ్యుండదు. రామునే ధ్యానిస్తూ, తిరిగి రాముని పొందలేనన్న దుఃఖంతో ప్రాణాలు విడిచి ఉంటుంది. అదీ **అయ్యుండదు.** (తాను మరణిస్తే, రాముడూ మరణిస్తాడని ఆమెకు తెలుసు గదా! తన కవమానాన్నీ, అపకారాన్నీ చేస్తున్న రావణుణ్ణి చంపిస్తానంటున్న తాను, మాట నిలబెట్టుకోదా? ప్రాణాలు విడవడ మనేది ఆమె చేతిలో ఉన్నపని. అలాటి ఆమెను రావణుడు ఏమీ చేయలేడు.) కాబట్టి సీత నిశ్చయంగా, కావాలని జీవించి ఉంది. అయితే, రూపమూ కన్పించడం లేదు – ఆమె విలాపమూ విన్పించడం లేదు – ఎవరికీ సీత కన్పడకుండా, తన భార్యలకి అసూయ, ఈమెపై కల్గకుండా, ద్వేషం లేకుండానూ, తాను వశం చేసికోవాలని కూడా, ఈమెను ఏ నేలమాళిగ (Under-ground)లోనో దాచి ఉంటాడు. (3) ఈ స్థితిలో నేనేం చేయాలి? యథార్థాన్ని చెప్పడం కష్టం. చెప్పకపోవడం దోషం. తటస్థంగా ఉండిపోతే పరిస్థితి మఱింత విషమం. నూఱు యోజనాల సముద్రాన్ని దాటింది దేనికోసమో, ఆ విషయం తెలియకుండా కిష్కింధకు

నెడితే, లంకకి రావడం, రాక్షసులని చూచివెళ్లడం వలన కలిగే ప్రయోజన మేమిటి? నా తోటి వానరజనం నన్నుచూచి ఏమంటారు! సీత కన్పడలేదని చెప్పడమంటే, రాముని ప్రాణాలని, నిలువునా తీయడమే! (4) రాముడు పోతే లక్ష్మణుడు - అతని ననుసరించి - భరతుడు, వాని మరణం విని శత్రుఘ్నుడు,.......ఇలా దైన్య వార్త తెలియగానే, ఒకరి మీది అనురాగంతో మటొకరు చొప్పున రాముని తల్లులు, సుగ్రీవుడు, రుమ, తార, అంగద - వానర వీరులు అంతా చనిపోతారు. నేను లంకకి పోయి సాధించినది ఏమిటంటే 'ఇందటిని చంపడం' ఔతుంది.

నేనిక్కడే ఉండిపోతే, వానర సైన్యాలలోని హనుమ ఇంకా వెదుకుతున్నాడనే ఆశతోనైనా రామలక్ష్మణులు ప్రాణాలని కలిగి ఉంటారు. (**"ఆశయా తౌ ధరిష్యేతే** వానరాశ్చ మనస్వినః"). ఇలా వారిని బ్రతికించి ఉంచినా, నాకు సీత కన్పడకపోతే, ఏ చెట్టు క్రిందనో జీవిస్తూ, చేతిలో పడింది తింటూ, నోటిలో పడింది నములుతూ, వాన ప్రస్థుడిని ఐపోతాను. లేదా చితి రగుల్చుకొని అందులో ప్రవేశిస్తాను. ప్రాయోపవేశం చేసి కాకులకి, క్రూరమృగాలకి నా ఈ శరీరాన్ని అర్పించుకుంటాను. (5) ఇది ధర్మబద్ధమే అని మహర్షులూ అంగీకరించారుగా! లేదా నీటిలో ప్రాణాలు విడుస్తాను. చంద్రోదయంతో మంగళకరంగా ఉండి, ఆశలని కల్పిస్తూ, హనుమ లంకలో ప్రవేశించిన రాత్రి - అని ప్రసిద్ధి పొందదగిన ఈ రాత్రి వ్యర్థంగా గడుస్తోంది. (గడవదు - గడువరాదు) (6) ఏమైనా సీతమ్మని చూడక వెనక్కి వెళ్లనే వెళ్లను, (అయినా సీత ప్రాణాలు విడిస్తే రాముడు - అతడు విడిస్తే లక్ష్మణాది సోదరులు....., ఇలా వానరసైన్యం వటుకూ అందటూ చనిపోతారని నేను ఊహించి, నేనే ప్రాణాలని విడవడమా?) వినాశే బహవో దోషా జీవన్ భద్రాణి పశ్యతి (47). చనిపోవడం వలన అనేక దోషాలున్నాయి. బ్రతికుండి సుఖాలని పొందాలి (7). తప్పుచేసిన రావణుణ్ణి చంపి ప్రతీకారం చేస్తాను. లేదా రావణుణ్ణి కట్టివేసి రామునికప్పగిస్తాను. నేను నా వెంట రాముణ్ణి కూడ తెచ్చి ఉంటే, సీత లేదని, అందటు వానరాలనీ దహించివేసి ఉండేవాడు. కాబట్టి నరులైన రామలక్ష్మణాదులూ, వానరులైన సుగ్రీవాదులూ జీవించాలంటే, నా ప్రయత్నమొక్కటే అధారం అని భావిస్తూ, దగ్గరగా కన్పిస్తున్న అశోకవనాన్ని చూచి, దీన్ని వెతకలేదు- వెతుకుతానని మారుతి భావించాడు.

> నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చ తస్యై జనకాత్మజాయై ।
> నమోఽస్తు రుద్రేంద్ర యమానిలేభ్యో నమోఽస్తు చంద్రార్క మరుద్గణేభ్యః ॥
> (59)

"8 మంది వసువులకీ, 11 మంది రుద్రులకీ, 12 మంది సూర్యులకీ, ఇద్దటు అశ్వినీ దేవతలకీ, 7గురు మరుత్తులకీ నమస్కరించి, అశోక వనాన్ని, వెదకడానికి సిద్ధపడి, "లక్ష్మణునితో ఉన్న రామునికి నమస్కారం. జనకుని 'ఆత్మజ' అయిన సీతకు

నమస్కారం. రుద్ర-ఇంద్ర-యమ-వాయువులకూ, చంద్ర-సూర్య-మరుత్తులకూ నమస్కారం". (8) అని పలికి సుగ్రీవునికి నమస్కారం చేసాడు. (9) ఇంకా బ్రహ్మ-అగ్ని-వాయు-వరుణ-ఇంద్ర-సూర్య-చంద్రులూ ఇతర దేవతలూ నాకు కార్య సిద్ధి చేయాలని ప్రార్థిస్తున్నాను.

"క్షుద్రేణ పాపేన నృశంసకర్మణా సుదారుణాలంకృత వేషధారిణా।
బలాభిభూతా హ్యబలా తపస్వినీ కథన్ను మే దృష్టిపథేఽద్య సా భవేత్।" (69)

ఏ దోషమూలేక, ప్రసన్న ముఖంతో, ప్రసన్నమైన నవ్వుని చిందించే సీతని ఎప్పుడు చూస్తానో? క్షుద్రుడూ, పాపి, దుర్మార్గుడూ అయిన రావణుని చేత బలవంతంగా తీసుకొని రాబడిన సీత, ఏ స్థితిలో ఉండగా నా కంటబడుతుందో? (10) అని దుఃఖిస్తూ ఉండిపోయాడు హనుమ.

## విశేషాంశాలు

(1) 'యాన్తి ధర్మ ప్రవృత్తస్య తిర్యంచోఽపి సహాయతామ్. అపంథానం తు వర్తంతం సోదరోఽపి విముంచతి' అని పెద్దలమాట. 'ధర్మ బద్ధంగా నడిచే వానికి పక్షులైనా (సంపాతి – జటాయు) సహాయపడతాయి. అధర్మంగా వర్తించే వారికి సోదరుడుకూడా, (విభీషణుడు) శత్రుపక్షంలో చేరతాడు' అని దీని అర్థం. ఏ జాతివారు ఆజాతివారికి సహాయపడడం లోకంలో చూచేదీ, ఆలోచిస్తే కూడ నమ్మదగినదీను. కాని పక్షి జాతికి చెందిన సంపాతి, నరుడైన రాముదులకు – 'సీత లంకలో క్షేమంగా ఉంది' అనే శుభవార్తని చెప్పాడంటే, అది ఎలా సంభవం? అనిపిస్తుంది. వానరుడైన సుగ్రీవుడూ, పక్షియైన జటాయువు-సంపాతులూ, సీత వెళ్లిన దిక్కుగా అరుస్తూ పరిగెడుతూ, రావణుని దొంగతనాన్ని బయటచేసిన ఇతర మృగాలూ, పక్షులూ, రాక్షసుడైన విభీషణుడూ, అతని భార్య - కూతుళ్లైన సరమ - నల అనే వాళ్లూ, ఇలా సహాయ పడ్డారంటే, దీనిక్కారణం ఏక ప్రియ దర్శనః (అందరికూ ఇష్టమైన తీరుగా ఉండేవాడు రాముడు) కాబట్టి. ఇదీ కాక శకున శాస్త్రమనేది ఒకటుంది. శకునమంటే పక్షి. రాబోయే విషయాలని చెప్పగల శక్తి వాటి కుంటుందట. ఎంతో దూరంలో ఉన్న గూటికి పుల్లలకోసం, ఆకాశమార్గాన ఎగిరి ఎగిరి, తిరిగి బయలుదేరిన చోటికి వచ్చేంత జ్ఞాపకశక్తి, గాలిలోని తేమని గ్రహించగల శక్తి, ఆకాశమంత ఎత్తులో ఎగురుతూన్నా చెఱువులోని చేప ఎగిరినప్పుడు అంతదూరం నుండి చూడగల సూక్ష్మదృష్టి, అన్నిటికి మించి విశ్వాసబుద్ధీ పక్షుల కుంటాయి. అలాంటి సంపాతి అనే గ్రద్దలరాజు, సీతమ్మని ఇక్కడ నుండి చూడగల్గుతున్నానని చెప్పడం వలన, నమ్మదగిన మాట అని అర్థం. వివాహకాలంలో కూడా, వరుడు, వధువు ఇంటికి మొదటిసారిగా వివాహానికై

వెడుతూన్నప్పుడు ("పక్షివాక్యాన్యశివాని శృణోతిచేత్ దేవీం వాచం బుచం జపేత్" అని ఉంది) ఏవైనా పక్షులు అశుభ ధ్వనులని చేస్తే, ఆగి "దేవీం వాచమజనయన్త......." అని కొన్ని మంత్రాలున్నాయి - వాటిని జపించి వెళ్లాలని శాస్త్రం చెప్తోంది. అలాగే ఆహారం తింటూ, తోటి వాటిని పిలవడం, తమ జాతిపక్షి పోతే అరుస్తూ అన్నిపక్షులూ స్నానాన్ని చేయడం, గ్రుడ్డు, పిల్లగా అయిన రోజున అన్ని పక్షులూ వచ్చి చూడడం వంటివెన్నో పక్షిజాతి నుండి తెలిసికొన దగినవి. 'అసత్యం' - ఎఱుగని జాతి కాబట్టి సంపాతిమాట నమ్మదగినదని సారాంశం.

(2) రావణుడు సీతని భూమితో పెకలించుకు తెచ్చాడనీ, మాయాసీతని తెచ్చాడనీ, ఇంకాఏమేమో చిత్రాలుగా చెప్తారు. వాల్మీకి శ్రీమద్రామాయణం ప్రకారం, సీతమ్మని స్పృశించి మరీ, రావణుడు రథంలో ఉంచి తెచ్చాడు. జటాయు ధాటికి రథం విరిగిపోగా, భుజం మీద వేసికొని ఎగురుతూ తెచ్చాడు. (ఈ విషయం నా'ఆరణ్యకాండ' వ్యాఖ్యానంలో వివరింపబడింది.)

(3) హనుమంతుడంతటి బుద్ధిమంతుడు కూడా, సీతమ్మని నేలమాళిగలోనే రావణుడు దాచి ఉంటాడని భావించాడంటే, రావణుడు మాత్రం ఆమెను బహిరంగంగా అశోకవనంలోనే ఉంచాడంటే, రావణునికున్న మోక్షాభిప్రాయం సుస్పష్టమౌతుంది.

(4) సీత లేక రాముడు చనిపోతాడనేది నిజమా? సీత లేక ఈ కాలంలో ఉన్నాడుగా! అడవులకి పంపినప్పుడు కూడ ఆమె లేక ఉన్నాడుగా! ఆమె తల్లి అయిన భూప్రవేశం చేసిన పిమ్మట కూడ ఉన్నాడుగా! నిజమే! ఒక నాణెం కూడా ఖర్చుచేయని లోభి ఉండవచ్చు. మహాదానం చేయాలనిపించి చేస్తే, తరువాత దానిగుఱించి ఆలోచించడు. కారణం ఉండి, ఆమెను అడవులకి పంపితే దుఃఖపడడు గాని, నిష్కారణంగా ఎత్తుకుపోబడితే దుఃఖింపడా? - 'ఆశతో జీవించడం ప్రస్తుత కాలకర్తవ్యం' అని రాముని విషయంలో ఆలోచించాలి.

(5) నిష్కారణంగా శరీరం, ముసలితనం - రోగం మున్నయిన వాటి వలన మరణించి, శరీరం కూడా తగులబెట్టబడితే (శీర్యత యితి శరీరః - ముడుతలు పడి జీర్ణించిపోయేది. దహ్యత యితి దేహః- తగులబెట్ట బడేది కాబట్టి, దేహం) ప్రయోజన పడదు. చనిపోయేప్పుడైనా ఒకరికి సహాయపడితే, ఆ జన్మ ధన్యమవి మహర్షుల అభిప్రాయం. పావురం ప్రాణంకోసం దేగకి'శిబి', తన తొడ మాంసాన్ని కోసి యియ్యలేదా ? మరో చిత్రమేమంటే, చనిపోయినాక మృగచర్మం మృదంగానికైనా పని చేస్తుంది గాని, మనిషి శరీరం ఎందుకూ కొఱగాదు.

(6) రాత్రి వేళ అందఱూ నిద్రపోతారు. కాని, హనుమ ఈ రాత్రి వేళ మొత్తం మెలకువగా ఉన్నాడు. ఈ మెలకువగా ఉన్న రాత్రి చరిత్రలో నిలిచిపోవాలని భావం.

రామ సుఖం గాని దుఃఖం గాని ఉంటాయి. అందుకని ఏ స్థితిలో ఆమె తనకు కన్పిస్తుందోనని భయం. పర భార్యని అపహరించడమనే అధర్మం ఉన్న రావణునకు వధ 'నిశ్చిత' మైన విషయమే. అయితే, రామబాణాలు ధర్మమయమైనవి. ధర్మపరుడైన వాణ్ణి గాని, తనను ఆశ్రయించిన వాడు అధర్మపరుడైనా గాని, అవి బాధింపవు. సీతలో ఏమాత్రం అధర్మం ఉన్నా, అపవిత్రత ఉన్నా రావణుని మీద రామబాణాలు పని చేయవు. వధ్యుడు రావణుడైనా, నిమిత్తం సీత కదా! అందుకని సీతమ్మ విశేషాన్ని కనుక్కోని రావాలి హనుమ. రామ భావనలో హనుమ ఉన్నాడు. కాబట్టి, రావణవధ జరిగేనా? అని భావిస్తూ, సీతని ఏవిధంగా చూస్తానో? అని హనుమ ఆలోచించాడు. 'అతిస్నేహః పాపశంకీ' అనిపెద్దల మాట. ఒకరిమీద ఉన్న ఎంతో ఇష్టం ఎన్నెన్నో చెడ్డ ఆలోచనలనే కలుగచేస్తుందని దీనిభావం. ఇంటికి రావడం ఆలస్యమైన పిల్లవాని గూర్చి తల్లి ఎలా, ఏం జరిగిందోనని 'చెడునే' తలుచుకుంటూ భయపడుతుందో, అలా ఆంజనేయుడు కూడా అమ్మవారిని గూర్చి తలచడం అతనికి ఆమెపైగల గౌరవానికీ - భక్తికీ సాక్ష్యం. అయితే ఈ భావన అంతా రామునిదే. హనుమ రామభావన కలవాడు గదా!, అందుకని.

"స్మరణమాత్ర సంతుష్టాయ నమః" (స్మరించినంత మాత్రంచేత తృప్తి పొందేవానికి నమస్కారం) అని రాముని నామాల్లో ఒకటి. "ప్రణిపాత ప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా" - నమస్కరిస్తే చాలు - ప్రసన్నురాలయ్యే లక్షణం ఆమెదిట. అలాటి నమస్కారాలు మఱచాడు. ఇప్పుడు చేసాడు. **సీతారాములలో మఱొక చిత్రం ఉంది. తనకి నమస్కారం చేయకపోయినా సీతకి నమస్కరిస్తే, ఆయనకు రెండుసార్లు నమస్కరించిన ఆనందం. అలాగే సీతమ్మకూ్కడా.** ఇద్దఱకూ నమస్కరించడమే కాక వాయువుకీ నమస్కరించాడు. వాయువు, హనుమకి తండ్రి. వెదికి వెదికి, నిరుత్సాహంతో ఉండి, ఉత్సాహం తెచ్చుకుంటూ కష్టంలో ఉన్న తాను (పుత్రుడు), తండ్రిని తలుచుకున్నాడు. ఇక రుద్ర-వసు-యమ-కుబేరాదులకు నమస్కారం- తనని ఏమైనా రాబోయే కష్టాలుంటే ఆదుకొమ్మని. '**యస్య బిభ్యతి** దేవాశ్చ జాతరోషస్య సంయుగే' - ఎవనికోపం వస్తే ఏ దేవతలు కూడా భయ పడతారో, అలాటి వాడు రాముడని దీని అర్థం. సీతమ్మని వెదకడానికి, రాముణ్ణి కూడ కలుపుకొని వచ్చి ఉంటే, సీత లేదని, వానరాలని రాముడు చంపి ఉండేవాడని, భావించాడు మారుతి. వానరులు, వానరులు కారనీ, దేవతలే అనీ లో భావం. కన్పిస్తూన్నవారినీ, కన్పించని వారినీ, వీరికి నాయకుడైన పరమాత్మనీ- "నన్ను రక్షించండి" అని ప్రార్థించాడు హనుమ. 'అంతర్బహిశ్చ తత్సర్వమ్ . . . ,. . .' అనే మంత్రపుష్ప వాక్యార్థమిది. బాహ్య జగత్తులోని వారు కన్పిస్తారు. అంతర జగత్తులోని వారు (శరీరం లోపల ఉండేవారు) కన్పించరు. వీరిరువురికీ నమస్కారమని భావం.

❀ ❀ ❀

# 14వ సర్గము

## సీతమ్మ కన్పించి తీరుతుంది

అలా ఆలోచిస్తూనే రావణ భవన ప్రాకారంలో నుండి అశోకవనంలోకి దూకాడు మారుతి. అశోక- పొన్న - సంపంగి - మామిడి మొదలైన చెట్లు పూలతో నిండి,(1) తాను దూకుతున్న వేగానికి మీద పూలను రాల్చి, పుష్పమయ పర్వతంలా తనని చేసాయి. ఎక్కడ చూసినా లతలూ, చెట్లతో పూలూ, పక్షులూ నేల అంతా పూలతో పఱచబడి ఉంది. తన దూకుడు కారణంగా చెట్లు, ఆకులనీ - పూలగుత్తులనీ - శిఖరాలనీ - కోల్పోతాయని గమనించాడు. జూదంలో పందెపు వస్తువుల్లా, క్రిందపడిన వస్తువులున్నూ - మోడులై నిలిచిన చెట్లు ఓడిన జూదరులలానూ అన్పించి ఆనందించాడు.

పూలూ, పూల తేనెకై తుమ్మెదలూ, తుమ్మెదలకై చిలుకలూ, వాటి మాటకి తోడుగా కోయిలలూ, ఇవన్నీ ఉండి వనమన్పించేందుకు గుర్తుగా ఉంది. మృగాలూ కన్పించి, చాలసేపు వెదకదగిన వనమనే భావం హనుమకు కల్గింది. వనంలోని నేల, బంగారుతో తాపడమై ఉంది. 4, 5 దిగుడు బావులున్నాయి. సెలయేర్లూ కన్పించాయి. అక్కడి ఇసుక, పగడాల పొడిగా, ముత్యాల చూర్ణంగా, స్ఫటికపు ఇసుకలా కన్పిస్తోంది. ఏ చెట్ల కాచెట్లని, గన్నేరు చెట్ల వరుసలో కంచె వేసినట్లుంది. దగ్గఱగా ఒక పర్వతం. దాని నుండి ప్రవహిస్తూన్న ఏఱు, చెట్ల కొమ్మల వఱకూ వెళ్లి ఆగి, వెనక్కి తిరిగింది. భర్తమీది కోపంతో పొబోయిన భార్యకి, నాలుగు మాటలు అందఱూ చెప్పగా, తిరిగి భర్త వద్దకు పశ్చాత్తాపంతో వెళ్లే భార్యలా ఉంది ఏఱు (2).

పెద్ద వృక్షాలూ - వృక్షాల క్రింద గొడుగులూ - గొడుగుల క్రింద అరుగులూ - అరుగులకి బంగారు తాపడాలూ - ఉన్నాయి. వృక్షాలకి నవ్వని బంగారు గంటలు గాలికి ధ్వనిచేస్తూ వీనుల విందు చేస్తున్నాయి. దగ్గఱలో క్రొత్త చిగుళ్లతో-పూలతో నిండిన శింశుపా (ఇరుగుడు) వృక్షం కన్పించింది.

హా రామా రామమహి షీ రాఘవస్య ప్రియాసతీ ।<br>
వన సంచారకుశలా నూనమేష్యతి జానకీ ॥ (45)<br>
సంధ్యాకాలమనా శ్శ్యామా ధ్రువమేష్యతి జానకీ! (49/1)

వన సంచార విధానం బాగా తెలిసినదీ, సంధ్యా వందనాన్ని ఈకాలంలో తప్పక చేసేదీ, (3) అయిన సీత, తప్పక ఇక్కడికి వస్తుందని, పైకి కానరాకుండా విశేషాలని తెలిసికోదలచి ఉండిపోయాడు మారుతి.

## విశేషాంశాలు

(4) అశోక-పొన్న-సంపెంగ..... ఈ చెట్లన్నీ వసంతంలో పూస్తాయి కాబట్టి, కథ వసంత ఋతువులో, అంటే 14వ సంవత్సర ప్రారంభంలో ఉన్నట్లూ, ఇక ఆ సంవత్సరపు గడువే ఉన్నట్లూ, సూచితం.

(1) సీత బ్రహ్మ విద్యా స్వరూపిణి. 'చంపకా శోక పున్నాగ సౌగంధిక లసత్కచా' అని ఒక నామం. ఈ పూలే కొప్పుగా కలది. 'వన సంచారకుశలా' అనేది కూడా అమ్మవారి నామమే. అందుకే రావణుడు సీతమ్మని ఈ వనంలోనే ఉంచాడు. 'విష్ణోరేషాఽనపాయినీ' (విష్ణువును ఈమె విడిచి ఉండదు) అనడం బట్టి (1) భూలోకంలో జన్మ. (2) అరణ్యావాసం (3) భర్తృవియోగం శోక హేతువులు. ఇలాటి ఈమెను తనకీ, తన వారికీ మోక్ష మిచ్చి 'అశోక' (శోకం లేనిది) కావలసినదిగా అభ్యర్థిస్తున్నాడు రావణుడు.

(2) నిజంగా ప్రియుడూ, ప్రియురాలూ, వారివలన ఒక కథ రావడంలో గొప్పతనం లేదు. సంస్కృతంలో పర్వత శబ్దం పుంలింగం. నదీశబ్దం స్త్రీ లింగం. (పర్వతం నుండి వేరుపడిన నది) అలాగే అడ్డుచెప్పి, నచ్చజెప్పి, వెనక్కిపంపిన వృక్షాలు (పుంలింగం) కన్పించడంలో, సంసారాలు నిలబడే తీరు, ఉపదేశింపబడింది. పుణ్యానికి పుణ్యం, 'సంసారాన్ని నిలపడం' అనేది.

(3) ఆడువారికి సంధ్యావందన విధి లేదు. ఇందుకు అనేక ఆధారాలున్నాయి. మచ్చుకి కొన్ని. (1) స్త్రీలకు యజ్ఞోపవీతం ఉండదు. అది లేనిదే సంధ్యావందనం లేదు కదా! (2) సంకల్పం చేసేటప్పుడు 'ధర్మపత్నీ సమేతస్య' (ధర్మపత్నితో కూడిన నేను ఈ సంధ్యావందనాన్ని చేస్తున్నాను) అని స్త్రీ అయితే ఎలా అనగలదు? (3) చిరం జీవితం వర్ధయన్తి....అనే మాటా, పద్భ్యాముదరేణ......అనే మాటా పురుషుడు మాత్రమే అనగల్గుతాడు. ఇవి స్త్రీకి సంబంధించినవి కానేకావు. (4) శ్రాద్ధ సందర్భాలలో కూడా దశ గాయత్రీ మంత్ర పఠనం కరిష్యే...అని పురుషుడే అంటాడు-చేస్తాడు కూడ. (5) ఉపనయన సంధ్యావందనాదులు స్త్రీకే ఉంటే శ్రాద్ధాదీ-తర్పణాదులూ అన్నీ స్త్రీ చేయవలసి వస్తుంది. ఇలాలేదు కాబట్టే 'స్త్రీణాముపనయనస్థానే వివాహః'. పురుషునకు ఉపనయన కాలంలో, స్త్రీకి వివాహం శాస్త్రసమ్మతం. భర్తృసేవ చేస్తేనే మోక్షం లభించే అదృష్టమున్న స్త్రీలు, తాము పఠింపరాని గాయత్రీ మొదలైన మంత్రాలని మననం చేసి క్రొత్త కష్టాలని తెచ్చు కోరాదట. చేయమన్నది చేయకపోవడం వలన, లాభమా? నష్టమా? – అన్నిటికీ మించి కష్టమా? పూర్వ కల్పంలో, ఉపనయనం, మౌంజీబంధనం వంటివి అందరూ స్త్రీలకూ ఉండేవి. కలిలో నిషేధించారు. **చేయవలసిన దానిని మానటం కంటె, వద్దన్న దాన్ని చేయాలనే ఉబలాటం మంచిదికాదు.**

నోములని నోచమంటే యిష్టపడని ఆడువారు సంధ్యావందనాన్ని క్రమం తప్పక చేయాలనే యిష్టాన్ని "చూపిస్తున్నారని" వినికిడి.

❀ ❀ ❀

# 15వ సర్గము

## అయ్యో! సీతమ్మ ఇలా ఉందా? సీతేనా?

లతలూ, వృక్షాలూ, పూలూ, కోకిలలూ, దివ్యగంధాలూ, ఋతునియమం లేక పండే పండ్లూ, కల ఆ అశోకవనం కుబేరుని చైత్రరథమనే పేరుగల ఉద్యానవనమా? అన్పించింది. దగ్గఱగా కైలాసంలా ఒక ప్రాసాదం, పగడపు మెట్లూ, వేయి స్తంభాలూ కలిగి కన్పడింది. పరిశీలించి చూస్తే, ఆ ప్రాసాదంలో ఒకామె ఉన్నది.

చుట్టూ ఉన్న రాక్షస స్త్రీలని, కుక్కలమధ్య చిక్కుపడ్డ లేడిపిల్లలా, జాలి గొలుపుతూ చూస్తోంది. బరువైన నిట్టూర్పులు మాటిమాటికీ విడుస్తోంది. ఏ అలంకారాలూ లేక, మాసిన చీర కట్టి, పైన నలిగిన పసుపుపచ్చ చీరని ఉత్తరీయంగా ధరించినా, శుక్లపక్ష పాడ్యమి చంద్రునిలా మనోహరమైన ముఖ కాంతితో ఉంది. ముఖంనిండా కన్నీరు నిండి, ఉపవాసాల చేత చిక్కిన శరీరంతో, అపహరింపబడ్డాననే సిగ్గుతో అంగారక గ్రహంచేత పీడంపబడ్డ రోహిణీ నక్షత్రంలా ఉంది. నల్లని త్రాచుపాము వంటి జడ పిఱుదుల వఱకూ వ్రేళ్లాడుతూ ఉంది. 'తర్క్యయామాస సీతేతి కారణై రుపపాదిభిః' (27). ఈమె సీత–అని అనేక కారణాలతో భావింపసాగాడు.

నిండు చంద్రుని ముఖం ఉన్నా, అలంకారాలు లేవు. తామరరేకుల నేత్రాలున్నా, కన్నీళ్లే తప్ప ఆనందం లేదు. నల్లని తల వెంట్రుకలు వత్తుగా ఉన్నా, తగిన సంస్కారం లేదు కురులకి. ఎందఱో చుట్టూ ఉన్నా, నిస్సహాయురాలిగా నిట్టూర్పులు విడుస్తోంది– అంటే ఈమె సీతయే. ఏయే ఆభరణాలని రాముడు చెప్పాడో, ఆ ఆభరణాలన్నీ చెట్టు కొమ్మలకి కన్పిస్తున్నాయి. ఆనాడు కట్టిపడవైచిన మూటలో నగలు, ఇక్కడ లేవు. కాని ఆ నగలని ఈమె ధరించిన ఆనవాళ్లు, శరీరం మీద ఉన్నాయి. ఆ వేళ మూట గట్టడానికి వాడిన వస్త్రం, ఈ చీరలో భాగమే. చాల కాలం నుండీ కట్టినందువల్ల మాసి, నలిగి ఉంది.

అయ్యో! సీతమ్మ ఎలా ఉందో! తరిగిన ఐశ్వర్యంలా, విఘ్నం వల్ల ఆగిన ఫలితంలా, కలుషితమయిన బుద్ధిలా, అబద్ధపు అపవాదుచే చెడిపోయిన కీర్తిలా, నిత్య మననం లేక మఱచిపోయిన విద్యలా, సరైన విద్యా సంస్కారం లేక, ఒక దానికి మఱొక అర్థం తోచిన వాక్కులా కన్పించింది.

"స్త్రీ ప్రణష్టేతి కారుణ్యాత్ ఆశ్రితే త్యానృశంస్యతః ।
పత్నీ నష్టేతి శోకేన ప్రియేతి మదనేన చ ॥ " (50).

రాముడు, ఈ విషయంలో నాలుగు కారణాల వల్ల దుఃఖపడుతూ ఉన్నాడు. (1) జాతి చేత తాను క్షత్రియుడు కాబట్టి, స్త్రీని రక్షించవలసి ఉన్నా, లేకపోయాడనీ (2) ఆ స్త్రీ కూడ, తన భార్యే ఐతే, ఆమెనే రక్షించుకో లేకపోయాడనీ (3) నమ్మివచ్చిన భార్య, తన శరీరంలో అర్ధభాగమైతే, తన దేహాన్నే రక్షించుకో లేకపోయాడనీ (4) లక్ష్మణునిలా సంపూర్ణ భార్యావియోగం లేకున్నా, భార్య ఉండీ, ఇంపుగా మాట్లాడడానికూడా నోచుకోలేకపోయాడనీను.

"దుష్కరం కురుతే రామో హీనో యదనయా ప్రభుః ।
ధార యత్యాత్మనో దేహం న శోకే నావసీదతి ॥ (53)

దుష్కరం కృతవాన్ రామః య ఇమామ్మత్తకాశినీమ్ ।
సీతాం వినా మహా బాహుః ముహూర్తమపి జీవతి ॥ (54)

ఈ యిద్దఱి మనసులూ, ఒకరి యందింకొకరిది ఉండడం బట్టి, బ్రతకడం కుదిరింది. అయినా వశిష్ఠ శిష్యుడు ఒక స్త్రీ కోసం ఇంతగా అవుతున్నాడంటే, సామాన్యురాలు కాదు. శోకంతో క్రుంగవలసి ఉన్నా, కఠినుడు గాబట్టి, దుష్కరమైన పనిని చేస్తూ, బ్రతికున్నాడు రాముడు. ఇలాటి పాతివ్రత్యమున్న ఈమెను దూరం చేసికొని బ్రతికున్నాడంటే, చాల దుష్కరం కదా!

(హనుమకు రామునిపై కంటె సీత మీదే ఎక్కువ ప్రీతి కల్గింది. ఇలాటి సీతమ్మతో వియోగం పొందిన రాముడు, అంతకు తగినట్లుగా కన్పించడం లేదే? పరిపాలకుడు కఠినుడౌతాడు కాబట్టి, బ్రతికున్నాడు. పోనీ! సీత యింత గొప్పదైతే ఆమె ఎలా జీవించి ఉంది? – సీత దేహమూ ప్రాణాలూ రాముని సొత్తు. అవి పోదలచినా, పోనీయక రక్షింపవలసిన బాధ్యత ఆమెది కదా! కాని, రాముడు స్వతంత్రుడు. ఆయన దేహ ప్రాణాలని విడువగల అధికార ముండీ, బిగబట్టాడు కాబట్టి దుష్కరమైన పనిని చేస్తున్నాడు రాముడు. అయినా, రామునికి నిజమైన ప్రేమే ఉంటే, అరణ్యాలకి వస్తాననే భార్యని వద్దంటాడా? ఆమెయే, ఏమైనాసరే విడువలేక వస్తానన్నంది. కాబట్టి ఆమె ముందు ఇతడు ప్రేమ తక్కువవాడే!

అయోధ్య విడిచి వచ్చేప్పుడు కన్పించినంతైనా దుఃఖం, సీత ఎలా ఉందోనని భావించినప్పుడు, ముఖంలో కన్పించదేమి? 'సీత లేక నేనుండను' అన్నవాడు ఎలా ఉన్నాడు? విడువలేక ఆమె వెంట వచ్చింది. ఆమె అపహరింపబడినా, ఈయన ఉన్నాడు. ఎలాగైనాఆలోచిస్తే, సీతే గొప్పదనిపిస్తోంది. అలాటి సీతని విడిచి ఉండగల్గుతున్నందుకు రాముడున్నూ గొప్పవాడే. ఎవ్వరూ చేయలేని సముద్రలంఘనాన్ని నేను చేసాననుకున్నాను గాని సీతకంటె, అంతకుమించి రామునికంటె, నాది గొప్ప కానేకాదు అని హనుమ భావించాడు).

❀ ❀ ❀

# 16వ సర్గము

## విశ్వయంగా ఈమెయే సీత

స ముహూర్తమివ ధ్యాత్వా బాష్పపర్యాకులేక్షణః ।
సీతా మాశ్రిత్య తేజస్వీ హనుమా న్విలలాప హ । (2)

యది సీతాఽపి దుఃఖార్తా కాలో హి దురతి క్రమః । (3/2)

సీతమ్మను చూస్తూ, రాముని ధ్యానిస్తూ ఉండగా, తనకి తెలియకుండానే హనుమకి తీవ్రదుఃఖం కలిగి, కన్నీళ్లు, ఆపలేనంతగా రాసాగాయి. లక్ష్మణుడంతటి వారికూడా సేవింపదగిన సీతమ్మకే కష్టం వస్తే ఇక చెప్పాలా? విధిని దాట శక్యం ఎవరికీ కాదు? రామలక్ష్మణ పరాక్రమం ఈమెకు ప్రత్యక్షంగా తెలుసు కాబట్టే, వర్షకాలంలో గంగానదిలా, వ్యథపడడం లేదు.

తనని ఆశ్రయించే పల్లెవాడు గుహునికీ, వానరుడు సుగ్రీవునికీ, గ్రద్ద జటాయువుకీ . . . . ఇలా అభయాన్నిచ్చే శీలం రామునకుంటే, తనని హింసించే రాక్షస స్త్రీల విషయంలోనూ దయదలిచే శీలం సీతమ్మది. ఈ విషయంలో ఎవరూ ఎక్కువ కాదు. సమానం. అరణ్య గమనానికి రామునికి 25 ఏండ్లుంటే, అమ్మవారికి 18 ఉండి, దాంపత్య యోగ్య వయస్సు అయింది ఉభయులకూ (1). కష్ట పెట్టడానికై అరణ్యాలకి తీసుకుపోవలసి వస్తుందని, ఆమెని వనాలకి 'వద్దు' అంటే, రాక మాననన్నది ఆమె. భర్త కష్టపెట్టరాదు. భర్త కష్టాలలో ఉండగా, భార్య సుఖిస్తూ ఉండరాదు. అందుకని ఇద్దరి వృత్తమూ (నడవడిక) కూడా సమానమే.

తన వద్ద లేకున్నా, తెచ్చి యిచ్చే లక్షణమున్న రఘువంశంలో (2) పుట్టి రాఘవు డీతడైతే, దేహం కూడా తనదని భావింపనంతటి వైరాగ్యమున్న విదేహాలో జన్మించి ఆమె 'వైదేహి' అయింది. ఈయనా నల్లి కన్నులవాడే. ఆమెకూడా నల్లికన్నులదే అయినా, స్త్రీ సహజమైన సౌందర్యమనేది, ఈయనకంటె ఎక్కువ కల్గినది ఆమెయే. తనని భయపెడుతూన్న రాక్షస స్త్రీలని కూడ ముఖం చిట్లించి చూడని ఈమెకోసమే, రావణుని మించిన వాలినీ, రావణునితో సమానుడైన కబంధునీ, జనస్థాన రాక్షసులనీ, ఖరదూషణ త్రిశిరులనీ, రాముడు చంపాడు. మా సుగ్రీవునికి ఐశ్వర్యం లభించినా, నేను సముద్రాన్ని దాటివచ్చినా, కారణం సీతమ్మే కదా!

సముద్రం చుట్టిన ఈ భూమిని-భూమినే కాదు, ఈమె కోసం జగత్తుని తల క్రిందులు చేసినా అది సరియే. ముల్లోక సామ్రాజ్యం, సీతమ్మలో పదునారవ వంతు.

పవిత్ర యజ్ఞం కోసం దున్నుతుండగా, అయోనిజయైన ఈమె, జనకుణ్ణి అనుగ్రహించి కూతురైంది. దశరథుని పెద్ద కోడలై, రామునికి ఇష్టురాలై, భోగాలకి తగిన వయసులో భోగాలని విడిచింది. ఆభరణాలు ధరించగల శక్తి ఉండీ కాదని, బంగారు ప్రాసాదాలలో ఉండగలిగీ, భర్తకోసం నిర్జనారణ్యానికి వచ్చింది. రమ్యమైన ఆహారాలని తినగలిగీ, కందమూలాలని సేవిస్తోంది. దాసదాసీ జనం ఉండీ, మెత్తని చిరునవ్వుతో కష్టాన్ని సహిస్తోంది. బంధుజనం ఎందఱో ఉన్నా, రాక్షస స్త్రీల నడుమ ఉంది. ఆపదలని పొంద వీలులేని జన్మనిఎత్తి, ఆపదల నడుమ చిక్కి, ఎవరినీ చూడక, ఎవరితోనూ మాటాడక, దేనినీ ఆలోచించక, రాముణ్ణే ధ్యానిస్తూ ఉన్న ఈమెను చూస్తుంటే,కేవలం రాముని కోసమే శరీరం నిల్పుకొని ఉందని పిస్తోంది. నాకు దుఃఖం కట్టలు తెంచుకునివచ్చేస్తోంది.

ఇంతకీ, దప్పిక అయిన వాడు చలువమందిరాన్ని (చలివేంద్రం) వెదికేటట్లు, రాముడు సీతని అన్వేషించాలి.

"భర్తా నామ పరం నార్యా భూషణం భూషణాదపి ।
ఏషా తు రహితా తేన భూషణార్హా న శోభతే ॥ (26)

ఆభరణాలన్నింటికంటె ఆభరణం, స్త్రీకి భర్తయే. (3) ఈమె దూరంగా ఉన్నా, రాముడు తప్ప వేఱెవరూ జీవించి ఉండలేరు. ఈమె ఇలాటి కష్ట మనుభవిస్తూ, మంచుగప్పిన తీగలా, ప్రియుణ్ణి పోగొట్టుకున్న చక్రవాకిలా, నాకు కనిపిస్తూ, మధ్యస్థుడినైన నాకే చెప్పలేని మనోవ్యథని కల్గిస్తూ, ఈ దుఃఖం నాదే ననిపింపచేస్తోంది". అని భావించి, ఈమెయే సీతమ్మ అని నిశ్చయించి (4) శింశుపావృక్షం (ఇరుగుడు చెట్టు) మీద కూర్చున్నాడు.

## విశేషాంశాలు

(1) "వర్షైరేక గుణాం భార్యా ముద్వహేత్త్రిగుణోవరః । ద్వ్యష్టవర్షోష్టవర్షాం వా వయో మాత్రా వరా చ యా ॥" అని ప్రమాణం. వరుని వయసు, వధువు వివాహ వయసునకు రెట్టింపు లేదా 3 రెట్లుండాలి. భర్తమీద గౌరవ ముండాలన్నా, తనకంటె ఎక్కువ అనీ, అనుభవ వ్యవహార జ్ఞానమున్న వాడనీ భార్య భావించాలంటే, 2 రెట్ల వయసువాడు కావాలి. భర్త వయసు ఇంత ఉండడంలో, మఱికొన్ని లోతు విశేషాలూ ఉన్నాయి. అయితే, ఇక్కడ అనవసరం. (వివాహానికి సంబంధించిన మంత్రాలకి అర్థాలూ, ఇతర విశేషాలూ నా **'మాంగల్య తంతునానేన గ్రంథంలో'** వివరింపబడ్డాయి.

(2) వరతంతు మహర్షి శిష్యుడు కౌత్సుడు. వద్దని పలుమార్లు అన్నా, గురుదక్షిణ అడుగమని నిర్బంధిస్తే, 14 విద్యలని నేర్పినందుకు 14 కోట్లని తెమ్మన్నాడు

పరతంతుడు. ప్రపంచాన్నంతటినీ జయించి, సంపాదించిన అంతటినీ 'సర్వస్వ దానం' చేసి మట్టికుండతో రఘు మహారాజు మిగిలితే, అతనిని చూచి వెళ్లిపోబోయాడు కౌత్సుడు. అడిగి విషయం తెలిసి, కుబేరుని మీదికి దండెత్తాలని భావించాడు రఘువు. ఆ రఘువు మీదికి రాకుండగానే ధనాన్ని అతని 'ఖజానా' లోనికి వర్షింపచేసాడు కుబేరుడు. అది 14 కోట్లకి మించి ఉండగా, 14 కోట్లకు మించి వద్దని కౌత్సుడూ, నీకోసం తెచ్చిన ఇదంతా నీదే- అని రఘువూ వివాద పడ్డారు. చివరకు కౌత్సుణ్ణి నిర్బంధపెట్టి, అంతటినీ అతనికే ఇచ్చి వేసాడు రఘు మహారాజు.

(3) భర్తమీద గౌరవం పెరిగి, సంసారం సుఖంగా ఉండాలంటే, తనకంటె భర్త ఎక్కువ, అనే అభిప్రాయం తప్పనిసరి. ఒక కార్యాలయంలో అంతా సమానోద్యోగులున్నా, అందఱకూ పైన ఒకడుండి పనుల్ని చేయిస్తాడు. నువ్వూ నేనూ సమానమనే భావంతో ప్రారంభమైతే, 'నువ్వెంత' 'నీ లెక్క ఏమిటి?' తో ముగుస్తుంది. కనీసం 'అతడు ఎక్కువ' తో ప్రారంభమైతే, 'సమానం' అన్నంతతోనైనా ముగుస్తుంది. "భర్త ఆదరించకపోయినా, నీ కాళ్ల మీద నువ్వు నిలబడడానికి చదువూ-ఉద్యోగం ముఖ్యం" అని - సారాంశం వచ్చేలా, అనేక భంగిమలలో వెలువడుతూన్న పిచ్చి పిచ్చి కథలు, నవలలు, చిత్రాల వలన, ఎన్ని ఇళ్లు ప్రశాంతంగా ఉండగలవు? 'భర్త రాజ్యం చేస్తే అర్ధ సింహాసనంలో, అడవికి వెడితే కటిక నేలమీదా ఉండు' అని నేర్పే చదువు ఇతిహాసాలది. రాజ్యం పోయిందని మచ్చుకి ఒకసారైనా దుఃఖింపని సీతారాములు. ఒకరికొకరు దూరంగా ఉంటున్నామనే దుఃఖించారు.

"విభాగే భ్రాతరం వింద్యాత్ - భార్యాం భాగ్య పరిక్షయే - మిత్రమాపది జానీయాత్ - పుత్రమంతే చ కర్మణి" అన్నారు. "వాటాలు పంచుకున్నాక, కలిసి మెలిసి ఉంటే, వాళ్లే, నిజమైన సోదరులు. భర్త సంపాదన తగ్గాక, లేదా కష్టస్థితిలో ఉన్నప్పుడు, వెంట ఉంటేనే, ఆమె భార్య. ఆపదలో ప్రక్కన ఉన్నప్పుడే, వాడు మిత్రుడు. మరణశయ్య ప్రక్కన ఉండి, పోయిన పిమ్మట చేయవలసిన శ్రాద్ధాదులని సరిగా నిర్వహిస్తేనే వాడు పుత్రుడు". అని భావం.

విదుషీమణులు ఇతిహాస కాలంలో ఎందఱు లేరు? చదువవద్దని స్త్రీలపై నిషేధం ఏనాడూ లేదు గాని, ముందునాటికి ఏది ఏమైనా, ఉద్యోగానికై . . . . . . . అంటూ చదవడం, ఆ ఆలోచనతో ఆడపిల్లలకి చదువు ప్రారంభింప చేయడం, సరికాదు.

(4) చంద్రుని కళలు 16. రాముని గుణాలు 16. అందుకని రామచంద్రుడు. అమావాస్య లేదా పూర్ణిమ అనేది 15వ కళ. ఇదీ ఒక 'కళ' కాబట్టి, ఈ 'కళ' లేని నిజరూపం చంద్రుని 'నిజ కళ'. ఆ కళతో కలిపిన ఈ 15 కళలూ, షోడశ కళ లౌతాయని భావం. అమ్మవారికి 'చంద్ర' అని పేరున్నది **(శ్రీ సూక్తంలో).**

❀ ❀ ❀

# 17వ సర్గము

## పని నెఱవేర్చినందుకు తిరిగి నమస్కారం

లంకని వెదకడానికి వీలుగా చంద్రుడు ఉదయించి, హనుమ వెదుకుతూన్న సమయంలో ఆకాశమధ్యంలో ప్రకాశించి, సీతా దర్శనమైందని కాబోలు మెల్లగా క్రిందికి దిగసాగాడు చంద్రుడు. దుఃఖమనే నీళ్లలో, శోకమనే బరువుతో నిండిన పడవలా, మునగడానికి సిద్ధమైనట్లు సీత ఉందని, చెట్టుపై నుండి గమనించాడు మారుతి.

ఆమె చుట్టూ మాంసాన్ని తింటూ, రక్తాన్ని త్రాగుతూ, అసహ్యమైన కంపు గొడుతూ, ఒక కన్నుదీ, ఒక చెవిదీ, అసలు చెవులులేనిదీ, గూనిదీ, ముసలిదీ, గడ్డమే పెదవిగా కలదీ, కోలముఖందీ, వెడల్పు ముఖందీ, పెద్ద చెవులదీ, పెద్ద పొట్టదీ, బోద కాళ్లదీ, వేలాడే పెద్ద పెదవులదీ, తలవెంట్రుకలు లేనిదీ, పెద్దశరీరం కలిగి చాల చిన్న తల కలదీ, చిన్న శరీరం ఉండి పెద్ద తల కలదీ, ఒక కాలిదీ, నెత్తిపై ముక్కు రంధ్రాలున్నదీ, అడ్డముక్కులదీ, పంది ముఖందీ, ఏనుగు తుండపు ముక్కుదీ ఇలా ఏదో వికారాకారం కలదీ అయి ప్రతి స్త్రీ, సీతని కాపు కాస్తున్నారు. (1)

కాంతి చెడి, వాడుక లేక చెడిన వీణలా – పుణ్యం క్షీణించి నేలపడ్డ తారలా – మందను వీడి, సింహం పాలబడ్డ ఆడు ఏనుగులా – ఆభరణాలు లేక పూలులేని తీగలా– భయంతో చూస్తూ బెదరిన జింకలా – ఉండికూడా, భర్త పరాక్రమాన్ని తలచుకొని, ధైర్యంతో తన శీలానికి తానే కాపుదలగా ఉంటూన్న సీతమ్మని, మళ్లీ చూచి ఆనందాశ్రువులు విడిచాడు. తాను నమస్కరించగానే అనుగ్రహించి కన్పింపచేసి నందుకు, మఱొక్కమారు సలక్ష్మణుడైన రామునికి నమస్కరించి, (2) తాను ఎవరికీ కనపడని తీరుగా చెట్టుకొమ్మల గుబురులో ఉన్నాడు మారుతి.

## విశేషాంశాలు

(1) ఎందఱో వద్దంటూంటే, తెచ్చిన దొంగసొత్తు సీతమ్మని, ఎంత కాపుదలలో ఉంచాలి? నేలమాళిగలో దాచి ఉంటాడని, హనుమయే భావించాడు ఒకప్పుడు. ఇలాటి సీతని ఈ అంగవైకల్యమున్న స్త్రీల నడుమ ఉంచడానిక్కారణం, సీతా సేవ వల్ల, నిత్య సీతా దర్శనంవలన మోక్ష మిప్పించాలని.

(2) పనికి ముందు మ్రొక్కడం అందఱూ చేసేదే. అయ్యాక తిరిగి నమస్కరించడం చేయాలి– అని హనుమ చెప్తున్నాడు. దీన్నే 'కృత–జ్ఞ–త' అంటారు. చేసిన మేలుని గుర్తుంచుకోవడం అని దీని అర్థం.

❀ ❀ ❀

(2) వాయు- రుద్రాంశ సంభూతుడైన హనుమకే ఆశ్చర్యం కలిగించేంత తేజశ్శాలి రావణుడు- అంటే, అతని గొప్పదనం గ్రహించాలి. విష్ణులోక ద్వారపాలకుడు- అంటే, అతని తపశ్శక్తి ఆలోచించాలి.

(3) శ్రీమద్రామాయణంలో కూడ ప్రతి కాండలోని 18వ సర్గకి ఓ ప్రాముఖ్యం ఉందనిపిస్తుంది. బాలకాండలో రాముడుల పుట్టుక, అయోధ్యలో కైక వరాల్నడగడం, ఆరణ్యంలో శూర్పణఖ రావడం, కిష్కింధలో వాలి సమాధానం, సుందరంలో సీతమ్మని చూడ్డానికి రావణుడు రావడాన్ని హనుమ చూస్తుండడం, యుద్ధంలో విభీషణ శరణాగతి, ఉత్తరంలో వేదవతి శాపం అన్నీ 18వ సర్గలే.

ప్రాచీనుల మతంలో '18' విశేషం కల సంఖ్య. 18 అంకెలోని రెండు అంకెల కూడిక 1+8=9 అవుతుంది. 2x9=18 మొదలుకొని 99x9=891 వరకు ఏ అంకెల లబ్ధాన్ని చూచినా '9' అవుతుంది. అంతటి మార్పులేని సంఖ్య 18 (9). మిగిలిన ఏ సంఖ్యకూ ఇలాటి పద్ధతిలేదు.

కృతయుగ కాల పరిమాణం 17,28,000 సంవత్సరాలు. అలాగే త్రేతాయుగం 12,96,000, ద్వాపరయుగం 8,64,000, కలియుగం 4,32,000. పై అన్నింటిలోనూ అంకెల మొత్తాన్ని కూడితే '9' అవుతుంది.

శ్రీ మద్రామాయణంలో రాముడు పుట్టింది నవమి (9) తిథినాడు. ఈ కావ్యంలోని 18విశేషం పైన చూశాం గదా!

ఈ విధానమే వ్యాస మహాభారతంలోనూ కన్పిస్తుంది. భారతంలోని పర్వాల సంఖ్య-భగవద్గీతకున్న అధ్యాయాల సంఖ్య-గీతలోని స్థితప్రజ్ఞుణ్ణి వివరించే శ్లోకాల సంఖ్య-ఆత్మను గూర్చిచెప్పిన శ్లోకాల సంఖ్య-వ్యాసుని పురాణాల సంఖ్య-యజ్ఞంలోని ఋత్విక్కుల సంఖ్య-భారతంలోని అక్షౌహిణుల సంఖ్య-యుద్ధం జరిగిన రోజుల సంఖ్య - ఇవన్నీ '18'లే.

ఇక ఒక్కొక అక్షౌహిణిలోని ఏనుగుల సంఖ్య 21870(9). గుఱ్ఱాలు 65610(9). కాల్బలం 1,09,350(9). మొత్తం అక్షౌహిణిలో ఉండే జీవుల సంఖ్య 2,18,700(9). మహాభారతానికున్న అసలుపేరు 'జయ' అనేది. సంఖ్యాశాస్త్రం ప్రకారం 'క' నుండి 'జ' 8వ అక్షరం కాబట్టి 'జ' అంటే 8. యరలవ లలో 'య' 1 కాబట్టి 'య' అంటే 1. జయ అంటే 81 కావాల్సి వస్తుంటే 'అంకానాం వామతోగతిః' నియమం ప్రకారం '18' అవుతుంది. 'జ' నుండి 'య' వరకూ ఉన్న అక్షరాల సంఖ్య కూడ 18. 18 తర్వాత 98 వరకూ 28,38.....ఇలా ఏ అంకెల మొత్తాన్ని కూడినా '9' రాదు. అందుకే '108' పేరిట భగవన్నామాలుంటాయి.

❋ ❋ ❋

# 19వ సర్గము

## తన చావుకోసం వచ్చాడు రావణుడు

"తతో దృష్ట్వైవ వైదేహీ రావణం రాక్షసాధిపమ్ ।
ప్రావేపత వరారోహా ప్రవాతే కదలీ యథా ॥ (2)
అను వ్రతాం రామ మతీవమై థిలీం ప్రలోభయామాస వధాయ రావణః ॥ (23).

రూపం, యౌవనం కలవాడూ, అనేకాభరణాలని ధరించిన వాడూ అయిన రావణుణ్ణి చూచి, పెద్ద గాలికి అరటిచెట్టులా సీత వణికి పోసాగింది. (1)

తొడలతో కడుపునీ, బాహువులతో వక్షఃస్థలాన్నీ కప్పికొని ఏడుస్తూ కూర్చుండి ఉంది.

ఒంటికి పట్టిన మట్టే ఆభరణాలుగా. బురద పట్టిన తామరతూడులా, రామునివద్దకి సంకల్పమనే గుఱ్ఱాలున్న మనస్సనే రథంలో పోవాలని భావిస్తూ, మంత్ర ప్రభావంచే కట్టుబడిన త్రాచుపాములా, వృత్తశీల అభిజాత్యాలున్న వంశంలో పుట్టినా దుష్టవంశంలో పడ్డ కన్యలా, అపవాదుతో తొలగిన కీర్తిలా, శూరులు పోయిన సేనలా, నీరు ఇంకిన నదిలా, రావణునికి సీత కన్పడింది.

రాముడు ఏనాడైనా వచ్చి నిన్ను చంపకమానడని భయపెడుతూ, ఏడుస్తూ, దీనస్థితిలో సీతమ్మ ఉంటే, కేవలం తన చావుకోసమే (2) సీతమ్మను ఆశించాడు రావణుడు.

## విశేషాంశాలు

(1) పెద్దగాలి రావణుడు, అరటిచెట్టు సీతమ్మ. వాయు విజృంభణం ఎంతో సేపుండదు. ఆ గాలి, అరటిచెట్టుని పడ త్రోయలేదు. లేదా ఆకులని పాడుచేస్తుంది. ఇంకా విజృంభిస్తే తల దించుకొనేలా (అపహరించి తేవడం) చేస్తుంది తప్ప, సమూలంగా నాశనం చేయలేదు. అయినా, అరటికి ఉన్న సంతానవృద్ధి (పిలకలు), చాల ఎక్కువది.

తల్లిచెట్టుకి ప్రమాదం కల్గినా, వంశం నాశనం కాదు. లోకంలోని చెట్లులోని అన్ని భాగాలూ ప్రయోజన పడతాయి. అరటిచెట్టు మరీని. శుభానికి ప్రతీక కూడా. వివాహానికి అరటిచెట్లని మండపానికి కట్టేది, ఇలా సంతాన వృద్ధి కావాలనీ, ఒక గెల అనేక ఫలాలని కాసినట్లు ఒక్కొక్కరూ అనేక సంతానవంతులు కావాలనీను.

ఒక గెల వేయగానే, అరటి తల్లిచెట్టు ఉండనట్లు, (చెట్టుని కొట్టివేస్తారు) లవకుశజననం కాగానే, ఆమె అవతారపు ముగింపూ ఔతుంది.

రావణుడు పెద్ద గాలి అయితే, హనుమ సాక్షాత్తు వాయువు పుత్రుడు కాబట్టి, రావణుడు హనుమకు లొంగుతాడని భావం. గాలి అరటి చెట్టుని తాత్కాలికంగా కుదిపివేసేటట్లు, రావణుడూ, ఈమెను కొంతసేపు వణికింపచేస్తాడని భావం.

2. తనకి కావలసింది అమ్మవారి ద్వారా అయ్యవారి చేతిలో మరణమే. ఆ విషయాన్ని మరోవిధంగా చెప్పాడు మహర్షి.

స్త్రీ కి 'ఉదరం' సంతానానికి ప్రతీక. రావణుడు వచ్చేసరికి తొడలనీ,కడుపునీ కలిపి, కన్పించనీయకుండా చేస్తోంది -అంటే (తన సంతానమే రావణుడు కూడా గదా!) నా సంతానాన్ని రక్షించుకోవాలని నేను తపిస్తూంటే, వీనికి ఈ దుర్బుద్ధి పుట్టి నశింపజేసికోవాలనుకుంటున్నాడేమో? అని దుఃఖిస్తోందని భావం.

❀ ❀ ❀

# 20వ సర్గము

## సీతా! నా గురించి చెప్పుకుంటాను-విను!

"స్వధర్మో రక్షసాం భీరు! సర్వథైవ న సంశయః ।
గమనం వా పరస్త్రీణాం హరణం సంప్రమథ్య వా ॥ (5)

రామసమాగమాన్నే వరంగా కోరుతూ, తపస్సు చేస్తూన్న సీతతో రావణుడు 'ఓ! సీతా! నీ ఉదరాన్ని, వక్షఃస్థలాన్ని ఎందుకు దాచుకుంటావు! ఎవ్వరూ ఇక్కడలేరు. పర స్త్రీలని అపహరించడం, వారితో వినోదించడం మా జాతి ధర్మం (1). అయినా, నీవు నన్ను కోరితే తప్ప స్పృశించను. (ఏవం చైతదకామాం తు న త్వాం స్ప్రక్ష్యామి మైథిలి! |6| నాయందిష్టములేని నిన్ను - లేదా - అకామ= అ= శ్రీమహా విష్ణువునందు, కామ=ఇష్టము గలిగిన నిన్ను- స్పృశించను అని అర్థం).

ప్రవహించిన నీరు వెనక్కి రానట్లే, పరిమళ ద్రవ్యాలతో, వస్త్రాభరణాలతో, సుఖకర పానీయాలతో వెళ్ళబుచ్చ వలసిన నీ యౌవనం, పూలులేక, మలిన వస్త్రాలతో, ఆభరణ హీనంగా, ఉపవాసాలతో గడిచిపోయినట్లైతే ఇక తిరిగిరాదు కదా! ఏ అవయవంలోనూ దోష మేలేని నీ రూపాన్ని ఎవరు స్మరించకుండా ఉండగలరు? (ఈ శ్లోకాలన్నింటిలోనూ పైకి వేఱర్థం తోస్తుంది. లో అర్థం అది కాదు. నిజంగా, ఒక కాముకునిగా రావణుడు, సీతమ్మతో పల్కే పల్కులే ఇవైతే, వీటిని పారాయణం చేస్తే సకల కార్యాలూ నెరవేరడం ఆశ్చర్యం కాదా? పైగా ఇలాంటి వర్ణనలు మఱే యితర గ్రంథాలలోనూ కన్పించవేమి ?

కాబట్టి ఇది అమ్మవారి అంగాంగ వర్ణనగా భావించాలి. చంద్రునితో సమానమైన నుదురు కలదానా! అని రావణుడన్నాడంటే, 'అష్టమీ చంద్ర విభ్రాజదలిక స్థలశోభితా' అనే లలితా సహస్ర నామ మన్నమాట. దొండపండువంటి పెదవిగల దానా! అంటే 'నవ విద్రుమ బింబశ్రీ న్యక్కారి రదనచ్ఛదా' అనే లలితా సహస్ర నామమన్నమాట. ఇలా సర్వత్రా అన్వయించుకోవాలి. నిత్యం దేవీఖడ్గమాలనీ, వనదుర్గా మంత్రాన్ని పారాయణ చేసేవాడూ, ఖడ్గరావణ మంత్రాన్ని పొందినవాడూ, అనితర శివభక్తి తత్పరుడూ ఐన రావణునికి, సీతమ్మ ఎవరో తెలియదని మనం అంటే, అంతకు మించిన అద్భుతం మఱొకటి లేదు.

సర్వలోకాలతోనూ విరోధించి, సకల రహస్యాలనీ ఎఱిగిన రావణునికి, విష్ణు భార్యతో సరససల్లాపమా? రాక్షస విధానంగా ఉంటూనే, వారికి మోక్షమిప్పించాలని, తన నిజరూపాన్ని దాచుకొని, ఇలా ఉన్నాడు. ఇదే 'వైర భక్తి'. దానిని, భక్తి విధానాలలో ఒకటని, మహర్షులే అంగీకరిస్తే రావణుడు సీతని కామదృష్టితో అపహరించాడంటే ఎలా సమంజసం ? దుర్మార్గుడు కాబట్టి రావణ వధని రాముడు చేసాడంటే, మఱి లంకా రాక్షసుల సందఱినీ రాముడెందుకు చంపలేదు ?

రామబాణంతో వధింపబడేంత తపశ్శక్తి, యోగ్యతా - నిత్యాగ్ని హోత్రీ, వేద ధ్యానాల మధ్య మేల్కొనేవాడూ - నిత్య శివపూజా ధురంధరుడూ, భక్తితో కైలాసాన్నే ఎత్తేంత వాడూ - అయిన రావణునకే ఉన్నాయి. పైకి, ఎలా కైకమ్మ, రాముని వనవాసాలకి పంపిన దుర్మార్గురాలిలా కన్పిస్తూ, లోపల, అవతార ప్రయోజనాన్ని రాముడంతటి వానికి కల్పించిన ఉత్తమురాలో, అలాగే రావణుడు కూడా, పైకి దుర్మార్గునిగా అన్పించి, (స్వయంతీర్ణం పరాంస్తారయతి) తాను ఉత్తీర్ణుడై, ఇతరులని (రాక్షస జనాన్ని కూడ) మోక్షార్హులనిగా చేసాడు. అంత గొప్పవాడు కాబట్టే, రావణుడు చెప్పిన మహన్న్యాసాన్నే, ఈ నాటికీ శివాలయాల్లో చెప్తూ అభిషేకం చేస్తున్నారు.

తెలిసి, మోక్షంకోసం ఆడే నాటకం కాకపోతే, రావణుడు, నిస్సహాయుడైన భరతుణ్ణి చంపి, అయోధ్యని స్వీకరించడేమి? లేదా శూర్పణఖ భర్తని చంపినవాడు, శూర్పణఖ వలన ఇదంతా కల్గిందని, రాక్షసాలోచన ప్రకారం దాన్ని వధించడేమి? విభీషణుడు శత్రుపక్షానికి పోతే, అతని భార్య, దాసీలను, కూతురిని మాత్రం ఎంతో గౌరవంగా చూస్తూ, ఇక్కడే ఎందుకు ఉంచ దలిచాడు?

ఏ పూజని చేయదలచినా ముందుగా 'ఆవాహయామి' అంటాం. ఎందఱో దేవతలు ఉంటే, ఏ దేవుణ్ణి మనం సేవించ దలిచామో సంకల్పించి, ఆయనను ఆవాహన చేస్తాం. అంటే మన దగ్గఱ ఉన్న పసుపు ముద్దలోనికి ఆయన వచ్చినట్లు భావించాలి. ఆ మీదట ఆ పసుపు ముద్దకి కుంకుమ అద్దినా, స్నానం చేయించినా, భగవంతునకే, అని అన్పించాలి. అలా సీతయందు సాక్షాత్ లక్ష్మీస్వరూపాన్ని ఆవాహన చేసిన రావణుడు, తాను స్వయంగా అమ్మవారితో మాట్లాడుతున్నట్లే సంభావిస్తున్నాడు.

ఏదైనా ఒక పూజని చేస్తూ "సహకుటుంబ క్షేమ - స్థైర్య - విజయ - అభయ - ఆయుః - ఆరోగ్య - ఐశ్వర్య - అభివృద్ధ్యర్థమ్" అని సంకల్పం చేస్తాం. రావణునికి సహకుటుంబం రాక్షస జనం. పూజని మనవారందఱూ ఉండగా మనం చేస్తున్నట్లే,

రావణుడూ తన వారిని వెంట తెచ్చుకున్నాడు. అంగవైకల్యమనేది పురాకృత పాపానికి సాక్ష్యం కాబట్టి, అంగవికలురాం(డు మరింతగా అమ్మవారిని సేవించి తరించాలని ఆమె చుట్టూ ఉంచాడు. 'స్వధర్మే నిధనం శ్రేయః" అని గీత. తమతమ ఉద్యోగ ధర్మం ప్రకారం ఉండాలని భావించిన రాక్షసస్త్రీలు ఆయుధదారులై ఆమెని హింసిస్తూ బెదిరించసాగారు. సీతా విశేషం తెలుస్తున్న కొద్దీ, వారిలో మార్పు రాసాగింది) ఏఒక్కరికీ ఎప్పటికీ అనుమానం రాకుండా ఉండేందుకై స్త్రీలనే ఆమెకు కాపుగా ఉంచిన పూజారి రావణుడు.

ఓ ! స్త్రీ ! ఉత్తమ స్త్రీలు - అనిపించిన ఎందరినో, ఇక్కడ - అక్కడ అనే భేదం [illegible]

మిథిలాయాం దహ్యమానాయాం నమే దాహోఒస్తి కశ్చన - (తన మిథిలానగరం తగులబడుతోందంటే కూడా, నాకేమీ అగ్ని కన్పడడం లేదు) అనేంతటి వైరాగ్య భావం ఉన్నవాడూ, సీతమ్మ తండ్రి, జనకుడు. పట్టాభిషేకం జరుగబోతోందన్నా, భంగమైంది అన్నా, అరణ్యాలకి పోతున్నా రన్నా ఒక్కమాటు ఆయన వచ్చిన దాఖలా లేదు. అలాంటి వానికి భూమిని జయించి ఇస్తానని రావణు డంటున్నాడు. జనకుడెలాటివాడో తెలియకనా? శివ ధనుస్సు గురించి దేశదేశాల ప్రచారం సాగినప్పుడు జనకుని [illegible]

కాంతలవలె నా భార్యలు నీకు సేవ చేస్తారు. (గరుడుడు పాముని పట్టుకున్నట్లు నీ సౌందర్యం నా మనస్సుని హరిస్తోంది - అనే రావణ వాక్యం ఆలోచించదగినది. సీత గరుడుడితోనూ, రావణుడు పాముతోనూ పోల్చబడ్డారు. ఇది కవి చెప్పిన వాక్యంకాదు. రావణుడు స్వయంగా పల్కినది.

గరుడునికీ పాములకీ విరోధం ఉన్నట్లు, దేవతా స్త్రీకి నీకూ, రాక్షసునికి నాకూ, విరోధం ఉంది. ఈ విరోధం, మన మధ్య ఇప్పుడు ప్రారంభమైంది కాదు. ఒకప్పుడు కలిసి ఉన్న, పాముల తల్లి అయిన కద్రువకీ, గరుడుని తల్లి ఐన వినతకీ విరోధం వస్తే, గరుడుడు, తనకి పాములే ఆహారం కావాలని అన్నాడు. దేవతల తల్లి అదితి. రాక్షసమాత దితి. వీరిరువురూ కలిసి ఉన్నా సంతానం కల్గాక వేఱయ్యారు. అలాగే, నీకూ నాకూ వైరం, అంత ప్రాచీనమైనది. అందుకే జన్మ జన్మల జన్మని నేను ఎత్తుతూ ఉండడం- ప్రతి జన్మలోనూ నిన్నాశ్రయించిన దేవుడైన విష్ణువు, నన్ను వధించడమూ సాగుతోంది. వైరం సహజమనీ, కృత్రిమమనీ రెండు తీరులు. ఏదో ఒక కారణంవల్ల కల్గినది కృత్రిమవైరం. పుట్టుకతోనే ఎలుక - పిల్లి; పామూ - ముంగిసా; లా ఉన్నవైరం, సహజవైరం లేదా జన్మ వైరం. అలాంటి సహజవైరమే గరుడునికీ సర్పాలకీ మధ్య ఉండాలని, కృత్రిమ వైరం రాగా, యాచించాడు గరుడుడు. కాబట్టి ఓ సీతా! సహజవైరం 'మరణాన్తాని వైరాణి' అన్నట్లు చావులో తప్ప ఎలా అంతం కావో, అలాగే పామైన నన్ను చంపి, గరుడుడైన నీవు శ్రీమహా విష్ణువునకు ప్రీతిపాత్రురాలివి కమ్ము! ఈ గరుడుడు ఈ పాముని చంపినా, గరుడ - సర్పాల వైరం శాశ్వత కాలం ఉండేది కాబట్టి, ఎప్పుడూ రాక్షసులు, పతివ్రతలకు విరోధులే. 'అందుకని నన్ను చంపు' అని రావణుని ప్రార్థన అతి స్పష్టంగా, మోక్ష కామంతో ఈ ఉపమలో కన్పిస్తుంది.

సీతమ్మ విషయంలో రావణునకు 'తల్లి' భావమే ఉందనడానికి, అరణ్యకాండలో సీతాపహరణం జరిగేప్పుడు వాల్మీకి'జగ్రాహ రావణస్సీతాం బుధః ఖే రోహిణీమివ (అరణ్య 50/17) - బుధుడు తన తల్లి అయిన రోహిణిని తెచ్చినట్లు సీతని గ్రహించాడు - అనడమే సాక్ష్యం. సీతని తెచ్చేప్పుడు కూడ - మూర్ధజేషు కరేణచ - జుట్టు ఎడమచేత్తో పట్టి, కుడిచేత్తో మోకాళ్ల క్రింద చేయివేసి, రోగిష్ఠియైన తల్లినిలా ఎత్తికొని రథంలోకి చేరవేసాడు. జుట్టుమీద చేయి వేయడం అవమానించాలని కాదు. అలనాటి వేదవతిగా ఉన్న ఆమెని, జుట్టు, పట్టుకొంటేనే శాపమిచ్చింది. ఆ శాపమిచ్చిన ఆమే, ఈమే ఒకరా? కారా? అని తేల్చుకోడం కోసం ఈ విధానం. ఇలా అనేక ఉదాహరణలు మోక్షార్థియై రావణుడు ప్రవర్తించాడని నిరూపించేందుకు కన్పిస్తాయి - (నా అరణ్యకాండ వ్యాఖ్యలో వివరింపబడ్డాయి.)

ఇది నా అభిప్రాయం కానేకాదు. మహేశ్వర తీర్థుడు మొదలైన వ్యాఖ్యాతలు అంగీకరించినదే. అసలు - రాముడే విష్ణువు - రాముడు కానేకాదు. సీతే లక్ష్మి - సీత కానే కాదు. వానరులే దేవతలు - వానరాలు కానేకాదు. శ్రీమద్రామాయణమే బ్రహ్మవిద్య - రామకథ కానేకాదు. ఇన్ని అసలువి, వేఱొకటి కాగా - ఒక్క రావణుడు, వేఱొకడు ఎందుక్కాడు? రావణుడు జయుడనే ద్వారపాలకుడు. అందుచేత శ్రీమద్రామాయణాన్ని రామకథగా - బ్రహ్మ విద్యగానూ, సీతా కథగా - పరమేశ్వరీతత్త్వం గానూ, రావణవధలా - తమోనాశకం గానూ, అన్వయించుకోవాలని గదా పెద్దల మాట).

"పిబ విహర రమస్వ భుంక్ష్వ భోగాన్ - ధననిచయం ప్రదిశామి మేదినీం చ - మయి లల లలనే యథాసుఖం త్వం - త్వయి చ సమేత్య లలంతు బాంధవాస్తే! (35)

ఓ లలనా! పానీయాలు త్రాగు. విహరించు. ఆనందించు, నైవేద్యాన్ని స్వీకరించు. మా ధన ద్రవ్యాలని ఇస్తాను - భూమితో కూడా - గ్రహించు. నీకు ఏ అడ్డూ లేదు. (ఇదీ పూజలోని భాగమే. "అమ్మవారికి, పానీయం సమర్పయామి - మహా నివేదనం కరిష్యే - అశ్వానారోహయామి - దోలామారోహయామి - చామరైర్వీజయామి - పానీయమిస్తున్నాను - నైవేద్యం పెడుతున్నాను. గజాలని - అశ్వాలని ఎక్కిస్తున్నాను. చామరలతో వీస్తున్నాను" వంటివి అమ్మవారితో పల్కేవే గదా ! కాబట్టి రావణుడు, నిశ్చయంగా అమ్మవారికి సేవని, భంగ్యంతరంగా చేస్తున్నాడని భావించాలి. ఇది నిజం కాకపోతే (1) మనకి పారాయణ ఫలితమూ రాకపోవాలి, (2) అమ్మవారికి ఇప్పటి ఈ మాటలతోనే పూజ చేస్తూన్నప్పుడూ, ఈ విధంగా అంటున్నప్పుడూ, మన భావం పవిత్రమూ కాకపోవాలి కదా!).

## విశేషాంశాలు

(1) సు+అధర్మో రక్షసాంభీరు - అని విభాగం. ఇతర స్త్రీలని తేవడం రాక్షస విధానం ప్రకారం, ధర్మమే అయినా, పెద్ద 'అధర్మం' అని తెలుసుననే పదవిభాగం వచ్చేలా, శ్లోకరచన ఉండడం గమనించాలి.

(2) "కిం కరిష్యసి రామేణ - సుభగే చీరవాససా - నిక్షిప్త విజయోరామో గతశ్రీర్వనగోచరః - వ్రతీ స్థణ్డిలశాయీ చ శంకే జీవతి వా? న వా? న హి వైదేహి రామస్త్వాం ద్రష్టుం వాప్యుపలప్స్యతే" (26 । 27) అనేవి మూలశ్లోకాలు. రెండర్థాలనీ ఇచ్చేవి.

* * *

# 21వ సర్గము

**రావణా! మృత్యువుని కొని తెచ్చుకోకు!!**

తృణమంతరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా
నివర్తయ మనో మత్తః స్వజనే క్రియతామ్మనః॥ (1)

రావణ వాక్యాలని విని వణకుతూ, చూచే వారికి జాలి గొల్పుతూ, దీన స్వరంతో మాటలాడదలచినదైన సీత, పర పురుషునితో, అందునా సభ్యతమీఱి మాట్లాడే వానితో మాట్లాడడం తగదని భావించి, గడ్డిపోచని(1) తమ ఇద్దఱి మధ్యా ఉంచి అగ్నిహోత్రంలా పవిత్రమై – వానిని దహించివేయగల – నవ్వుతో (2) మాట్లాడ ప్రారంభించింది.

"రావణా ! నా నుండి మనస్సు మఱ్ఱించుకొని, నీ వాళ్లని ఆదరించు. పవిత్ర వంశంలో పుట్టి, పూజ్యమైన వంశానికి కోడలిగా వెళ్లాను. పాపిష్ఠివానికి మోక్షం లేనట్లు, నీకు నన్ను కోరి ప్రయోజనం లేదు. నాకు రాముడే భర్త. ఇతర భార్యలని నువ్వాశించడమంటే, నీ భార్యలని యితరులు ఆశిస్తే "అంగీకరిస్తావని" భావమౌతోంది. తన భార్యని కాదని ఇతర స్త్రీలని ఆలోచించేవాడు, పరాభవింపబడతాడు సుమా ! 'యథా తవ తథాన్యేషాం దారా ర క్ష్యా నిశాచర- ఆత్మాన ముపమాం కృత్వా స్వేషు దారేషు రమ్యతామ్। (7). నువ్వు నీ భార్యలనిలా, ఇతరులుకూడా తమ భార్యలని రక్షించుకోవాలని భావింపరా? ఇంతకూ, మీ పట్టణంలో మంచి చెప్పేవారు ఉండరా ? ఉన్నా నువ్వు వారి నాశ్రయింపవా? ఆశ్రయించినా వాళ్లు చెప్పింది వినవా ? ఆశ్రయించి విని ఉండలేదని, నీ బుద్ధి చెప్తోంది. ఇది వంశనాశనకరం. కాని, నీ రాష్ట్రంకోసం, రాక్షస జనంకోసం విను. లేదా నీ తప్పుకి, లంక అంతా నాశనమౌతుంది. అదృష్టంకొద్దీ దుర్మార్గుడు నశించాడని, నిన్ను గూర్చి భావిస్తారు.

"శక్యా లోభయితుం నాహ మైశ్వర్యేణ ధనేన వా - అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా॥" (15) అధికారం కాని, సంపద కాని నన్ను లొంగదీయలేవు. సూర్యుడూ, కాంతీ ఎలా కలిసి మాత్రమే ఉంటాయో, అలా నేనూ, నా భర్తా ఉంటాం శాశ్వతంగా (3). బుద్ధిమంతుడూ, విదితాత్ముడూ అయిన బ్రాహ్మణుణ్ణి ఆశ్రయించుకొనే వేదవిద్యలా, నేను ఆ రాముని భుజాన్నే ఉపధానంగా (తలదిండు – తలగడ) చేసికొని ఉంటాను. "మిత్ర మౌపయికం కర్తుం రామః స్థానం పరీప్సతా - వధం చానిచ్ఛతా ఘోరం త్వయాఽసౌ పురుషర్షభః - విదిత స్స హి ధర్మజ్ఞ శ్శరణాగత వత్సలః - తేన "మైత్రీ" భవతు తే "యది జీవితు"మిచ్ఛసి॥ (19 & 20). "ఎంతో ఆశపడి కష్టంగా

తెచ్చానుగదా! ఇప్పుడు ఏం చేయాలి ?" అని భావిస్తున్నావా ? అడవిలో ఒంటరిగా ఉండి, దిక్కులేక ఏడుస్తున్న ఆడఏనుగు వద్దకి, దాని మగఏనుగుని తెచ్చి దుఃఖం పోగొట్టినట్లు, నా భర్తను తే. నీవు సుఖంగా ఉండాలని భావిస్తే, లంకావధ జరుగ రాదని తలిస్తే, ఇహ – పర లోకాలు రెండూ కావాలని అనుకుంటే, ఈ పని చెయ్యి. చంపడానికి సరిపోయేంతటి పాపం నువ్వు చేసినా, నీ చేతిలో ఆయుధం లేకపోతే విడిచి వేస్తాడు రాముడు. నీకు విలువైన నగలు ఆభరణాలయితే, ధర్మమే ఆతనికి ఆభరణం. తన విషయంలో చేసిన అపరాధం కంటె, తనని ఆశ్రయించిన వారి విషయంలో చేసిన అపరాధాలని ఎక్కువగా భావిస్తాడు రాముడు. నీవు బ్రతుకదలిస్తే, వానితో మైత్రి చేసుకో. (4) రామలక్ష్మణ బాణాలు, మీద పడకుండా, వారి వింటి నారిశబ్దాలని వినకుండా, నన్నిచ్చి, చావునుండి తప్పుకో. మూడడుగులతో త్రివిక్రముడు లక్ష్మిని తీసికొని పోయినట్లు, నా భర్త కొంతకాలంలో, నన్ను తీసికొని పోతాడు. రాముని యుద్ధం, నీకు తెలియదు. జనస్థానంలోని రాక్షసులని వధించడం, విన్నావేగాని చూడలేదు. వినికూడా, అసమర్థునిగా ఉండిపోయి, నన్ను దొంగతనంగా తెచ్చావుగాని, పౌరుషంతో ఎదురుబడి యుద్ధంచేసి మాత్రం తేలేదు గదా ! పెద్దపులుల వాసన తగిలిన కుక్క, జీవించాలనే భయంతో పారిపోయేటట్లు, వారి వాసన తగిలితే ఎప్పుడో బాగుపడేవాడివి. ఇంతకాలమూ, ఎదురుపడకుండా జాగ్రత్త వహిస్తున్నావు. యుద్ధమే జరిగితే నాతో మాట్లాడడాని క్కూడా నేడు ఉండే వాడివి కావు. సూర్యుడు, తన కిరణాలతో నీటిని పీల్చినట్లు, నీ ప్రాణాలని రామలక్ష్మణులు హరించడం నిశ్చయం. ఊర్ధ్వలోకమైన కైలాసానికి పోయినా, అధో లోకమైన సముద్రం లోపలి వరుణ సభాభవనంలో ఉన్నా (5) నువ్వు జీవించి ఉంటే, రామబాణం వధించక మానదు. పిడుగువడ్డ వృక్షంలా, సమూలంగా నాశనమౌతావు. కాబట్టి మృత్యువుని కొని తెచ్చుకోకు" అంది సీత

**విశేషాంశాలు**

**ఈ గడ్డిపోచ శ్లోకానికి 16 అర్థాలు**

(1) గడ్డిపోచ వేయడంలో అనేకార్థాలున్నాయి. (i) దుర్మార్గుడైనా, తన వద్దకు వస్తే గౌరవించాలి. (అపవం చాన్న ముదకం దేయమ్) ఆసనము, అన్నము, నీరు–నీటనియ్యాలి. చివరి రెండూ లేని పక్షంలో ఆసనాన్నైనా ఇచ్చి కూచో బెట్టాలి. అందుకు తృణం (గడ్డిపోచ), (ii) మూర్ఖుడవీ, పరస్త్రీ అపహర్తవీ అయిన నీకు ఆసనం – అన్నం – నీరూ అన్నీ ఇదే–అనికూడా తృణం. (iii) (స్తంభేన సలిలేన వా పంక్తిభేదః) దుర్మార్గులతో కలిసి భోజనం చేయరాదు. మనం కూర్చున్న పిమ్మట వాడు వస్తే, వానికీ మనకూ మధ్యగా, తృణం గాని, ఒక గీతలా నేలమీద నీటిని వేసినా, ఆతని పంక్తిలో కూచున్నట్లూ, సహపంక్తిలో భోజనం ఆరగించినట్లూ కాదు. అలాగే, అత్యవసరంగా

ఎక్కడికైనా వెళ్లవలసి వస్తేకూడా, తోటివారి భోజనం ముగిసేవఱకూ లేవరాదు. అలాటప్పుడు పంక్తి భేదాన్ని నీటితో, లేదా, దర్భతో చేయడం సంప్రదాయంగా వస్తోంది. ఈ దుర్మార్గునితో, తాను (సీత) చేరి ఉండలేదని చెప్పడానికి ఈ తృణం. (iv) (స్వయం నేక్షేత పురుషాన్) తాను తనకుగా పర పురుషులతో మాట్లాడరాదు. వాడు వచ్చి పలుకరిస్తున్నాడనీ, అది తన కిష్టముగానిదనీ, మర్యాదకోసం సమాధానాలు చెప్తున్నాననీ ఇతరులకి సూచించడానికి ఈ తృణం. (v) జ్ఞానేన హీనః పశుభిస్సమానః- జ్ఞానం లేని నీవు పశువుతో సమానం. ఇదిగో నీకు ఆహారం – అని ఈ తృణం. (vi) తృణమివ లఘుమేనే – గడ్డిపరక ఎంత అల్పమో – పుట్టుక నుండి మరణం వఱకూ – అంత తేలిక వాడివని చెప్పడానికి ఈ తృణం. (vii) నీ లంకారాజ్యం, ఐశ్వర్యం అన్నీ దీనితో సమానమని ఈ తృణం. (viii) బ్రదుకదలిస్తే ఈ గడ్డిపోచ నోటకరిస్తే, జీవింప ఆశ ఉన్నవాడివని రాముడు చంపడు. చంపనీయను కూడ. అందుకే ఈ తృణం. (ix) అవతారమూర్తియైన నా ప్రభువు ఎక్కడినుండైనా రాగలడు. అహంకరించావా? దీనిలో నుండి వచ్చి వధిస్తాడు. జాగ్రత్తవడు! అని ఈతృణం. (x) నీకూ–నాకూ మధ్య ఈ వచ్చగడ్డి వేస్తే, భగ్గుమనేంత విరోధముందని గమనించు. (xi) ఒకప్పుడు నా ప్రభువు, వామనావతారంలో ఇదే గడ్డితో మీ రాక్షస గురువుని శుక్రాచార్యుణ్ణి కన్నులేనివాణ్ణి చేసాడు. మీ గురువుకే దిక్కులేక పోతే నీ వొక లెక్కా? అని ఈ తృణం. (xii) దర్భ మంత్రించి విడిస్తే ఇంద్రునివద్దకు వెళ్లినా, కాకాసురునికి దిక్కు లేకపోయింది ఒకప్పుడు – మంత్రించక ముందు జాగ్రత్తపడు ! అని యీ తృణం. (xiii) ఆయన క్కాదు. వాకైనా మవ్వు దీనితో సమానం. నేను కోపిస్తేనా – అని యీ తృణం. (xiv) పంటపొలంలో కన్పడే యీ గడ్డిని, ఎంతటి అల్పుడైనా, పంటకి అడ్డు – అని పీకివేస్తాడు. రాముడంతటి వాడు ఉండనిస్తాడా ? అని యీ తృణం. (xv) ఇదీ ఒక ఆకే. బ్రతికి ఉంటే, దీన్నైనా తిని జీవించవచ్చు. బ్రదికే విధమాలోచించుకో అని ఈ తృణం. ఈ అన్ని భావాలలోనూ తల్లికి, తన పుత్రుడు చెడిపోతూంటే రక్షించాలనే సహజ లపన గోచరిస్తుంది.

(2) అగ్ని హోత్రంతో సమానమైన నవ్వు నవ్వింది. (i) నీవు నాశన మౌతావని సూచించడానికి, (ii) ప్రలయకాలంలో నా నవ్వుని తెలిసికొంటావని చెప్పడానికి, (iii) నా గుఱించి తెలియక, నన్ను బెదిరిస్తున్నావా ? అని భావిస్తూనూ, (iv) రామలక్ష్మణులులేనప్పుడు దొంగతనంగా తెచ్చి, నా ముందు ప్రగల్భాలు పలుకుతావేమి? – అని తనలో తాను నవ్వుతూనూ, (v) చీమని కప్ప మ్రింగబోతూ, గొప్పదాన్ని – అనుకొంటోందే కాని, తన వెనక పాము ఉందని తెలియడం లేదని ఆలోచిస్తూ (చీమ-సీత, కప్ప-రావణుడు, పాము- రాముడు) (vi) తల్లిముందు పిల్లవాడు కట్టడి

చేస్తూ పల్కే పల్కులని వింటూ ఆనందిస్తూ, క్రుతిమించిన కారణంగా వీడికి ఈ జన్మకి కాలం మూడిందని ఊహిస్తూ" నవ్వింది.

(3) "సూర్యుడు - రాముడు. ప్రకాశం - సీత" అని సీత చెప్పింది. ప్రకాశం సూర్యునిదే అయినా, ప్రకాశం వలననే సూర్యుడు ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే, సీత రామునిదే అయినా, సీతవలననే రాముని గొప్పదనం బయటపడుతుంది. ప్రకాశంలేని సూర్యునివలన ప్రయోజనం ఏ మాత్రమూ లేదు. ప్రకాశమూ, సూర్యుడూ అనే ఈ యిద్దఱూ లేకపోతే కలిగేది చీకటి. (రాత్రి ఫలితం నిద్రమత్తు. గాఢమైన తమోగుణం).

(4) చెట్టుని నఱుక దలచినవాడు, చెట్టుకొమ్మతో చేయబడిన కఱ్ఱ కల గొడ్డలి తేవాలి. భగవంతుడికి ద్రోహం తలపెట్టినా, వాణ్ణి ఆశ్రయించక తప్పదు. అహంకారివైన నువ్వు, శరణు కోరమని అంటే, అంగీకరించవు కాబట్టి, అతనితో 'మైత్రి' చెయ్యి. సుగ్రీవుడు ఒకప్పుడు రామునికి శరణు ఇచ్చానని ప్రగల్భం పలికి, మిత్రుడనే స్థితికి జాఱీ, ఈనాడు రామునికి దాసుడుగా ఉన్నాడు. నువ్వుకూడా మైత్రి చెయ్యి. సుఖంగా ఉండడానికి వాని అనుగ్రహం కావాల్సినట్లు, సుఖమరణానికి వానితో విరోధం ఉండరాదు.

దోషం ఉన్న వాడే, శరణంటూ వస్తాడు. దోషాన్ని అదోషంగా గ్రహించడమే వాత్సల్యమంటే. కొద్దిగా నలిగిన గడ్డిని మూచూడని ఆవు, తాను ఈనిన దూడ ఒంటిని ఇష్టంగా నాకుతుందిగదా! సీత చెప్తోంది - ఆడు ఏనుగైన తన వద్దకు, మగ ఏనుగువంటి రాముని తెమ్మని. అతనివద్దకు తనని తీసికొని పొమ్మనడం లేదు. సీతవద్దకు రాముణ్ణి తెస్తే, లంకా రాక్షసులంతా గ్రహిస్తారు - "రావణుడు ముందు తప్పు చేసాడనీ - తరువాత దిద్దుకున్నాడనీను".

(5) కైలాసానికి పోయి, ఎత్తలేక పరాభవింపబడి, రావాలు (అఱపులు) చేసి రావణుడివయ్యావు. వెళ్లినా ఆదరణ ఉండదు. పైగా ఆ కైలాసంలోని శంకరుడే, ఆరణ్యకాండ ప్రారంభం నుండీ ఈ విల్లుపట్టిన రాముడు. అధోలోకానికి వెడతానంటావా? మామయైన మయునితోనే నీకు విరోధం ఉందిగదా! ఎవరాదరిస్తారు? పాతాల కన్యలని తెచ్చావు. పట్టి బంధిస్తారు. లేదా ఆశ్రయమియ్యరు.

కాబట్టి - న స్మరత్యపకారాణాం శతమపి - అన్నట్లు నూఱు తప్పులు చేసినా లక్ష్యపెట్టనివాడూ, ఒక్క సహాయం చేసినా గుర్తుంచుకొనేవాడూ అయిన రాముణ్ణి ఆశ్రయించు.

❀ ❀ ❀

# 22వ సర్గము

**సంహారం శక్తి ఉన్నా, రామాజ్ఞ లేదు!**

"యథా యథా సాంత్వయితా, వశ్యః స్త్రీణాం తథా తథా ।
యథాయథా ప్రియం వక్తా పరిభూత స్తథా తథా ॥ (2)

రావణుడు, సీతావాక్యాలని విని "ఓ సీతా ! స్త్రీని పురుషుడు ఎంతెంత బతిమలాడుతాడో, అంతంత లోకువ అవుతాడు. ఆమెకు ప్రియమైన మాటల్ని ఎన్నెన్ని, చెప్తే, అంతంతగా తర్వాతకాలంలో అవమాన పడతాడు.

ఇంతకీ, నా కోరికే కారణం. గుఱ్ఱాలని సారథిలా, నా కోపాన్ని మన్మథుడు అపుతున్నాడు. మాయా సంన్యాసినీ ! నేను నీకు సంవత్సరకాలం గడువు పెడితే, ఇంక రెండు నెలలే మిగిలి ఉంది. గడువు పూర్తికాగానే నా శయ్యనధిష్ఠించక పోతే, నా వంటవాళ్లు ప్రాతఃకాల భోజనం నిమిత్తం, నిన్ను ముక్కలు ముక్కలు చేస్తారు" అన్నాడు. (1)

ఇలా రావణుడు బెదిరించగానే, దేవగంధర్వ కన్యలు భయపడ్డారు.

తక్కినవారు ముఖావయవాలతో (కన్ను – పెదవి) భయపడ వద్దని సీతని ఓదార్చారు. వానికి దేహబలముంటే, నాకు పాతి వ్రత్య బలం ఉందనే ధైర్యంతో సీత ఇలా అంది.

"నివారయత యో న త్వాం కర్మణోఽస్మాద్వి గర్హితాత్"–
తప్పు చేసావు నువ్వు. అయినా నీది తప్పని నీకు చెప్పి, నీ మేలుకోరి బ్రదికించ దలచినవాడు, లంకలో ఒక్కడు కూడా లేడు.

ఇంద్రపత్ని శచివంటి నన్ను నీవు కామించడం, రాముని శిక్ష పొందడానికే. మదపుటేనుగుతో కుందేలు పోరాడడం ధైర్యమన్పించుకోదు. పిటికి పందవై నన్ను దొంగతనంగా తెచ్చిన నీ నాలుక, చీలికలు కావాలి. నీ తేనె రంగు కన్నులు, నేల రాలాలి.

'అసందేశాత్తు రామస్య తపసశ్చాను పాల నాత్ । –
న త్వా కుర్మి దశ గ్రీవ ! భస్మ భస్మార్హ తేజసా ॥ (20).

నా రాముడు ఆజ్ఞ ఈయలేదని ఆగాను కాని, లేదా నా పాతి వ్రత్య ధర్మం వలన ఏనాడో శపించి ఉండేదాన్ని (2).

విధి స్తవ వధార్థాయ విహితో నాత్ర సంశయః'(21/2). నీ చావు నిన్ను ఈ పని చేయించింది." అంటూ రావణుణ్ణి చూచింది.

రావణుని నడకకి తగిన విధంగా, కిరీటం కదుల్తోంది.

జ్యోతుల్లా కళ్లున్నాయి.

లేత ఎఱుపురంగు కుండలాలని చెవులకు ధరించాడు. నీల మేఘపురంగులో ఉంది ముఖం.

అఱచే గిరిగుహలా ఉంది నోరు.

విశాల భుజాలవాడు. బలిష్టమైన మెడకి, విలువైన హారాలు వ్రేలాడుతున్నాయి.

కన్నులు చెదిరే ఎఱ్ఱని పూలదండలని, ఆ హారాలమీద వేసి కొన్నాడు.

భుజాల చివర బంగారు బాహుపురులు వ్రేలాడుతున్నాయి. నల్లని 'వాసుకి' అనే పాములా ఒడ్డాణం నడుముకి ధరించాడు.

ఒళ్లంతా ఎఱ్ఱచందనం నిండగా, ఎఱ్ఱని ఉత్తరీయాన్ని హారాల క్రిందుగా కప్పుకొన్నాడు.

కల్పవృక్షంలానూ, మూర్తీ భవించిన వసంతుడిలానూ, అలంకరించుకొన్నప్పటికీ శ్మశాన మండపంలా భయంకరంగా కన్పిస్తూ (3), "ఓ సీతా ! సాయంకాలపు సంధ్యని సూర్యునిలా, నా కాంతితో నాశనం చేస్తాను నిన్ను" అని అఱచాడు.

ఏదో ఒక అంగవైకల్యం ఉన్న అక్కడి కాపలా స్త్రీలతో "ప్రతికూలంగా గాని, అనుకూలంగాగాని- సామ దాన భేద దండోపాయాల చేతగాని ఈమెను నా వశం చేయండి". అన్నాడు రావణుడు (5).

ఇంతలో రావణుని కనిష్ఠ భార్య ధాన్యమాలిని, అతణ్ణి కౌగలించుకొని "స్వామి! నీ భోగభాగ్యాలని అనుభవించే భాగ్యం, ఈ మనుష్య స్త్రీకి లేదు. ఒల్లనిదాన్ని కామించడం దేహపరితాపానికి కారణం(6). నాతో ఆనందించు. ముమ్మూర్తులా నిన్ను కోరుతున్నాను" అనగానే, "ప్రహసన్మేఘ సంకాశో రాక్షస స్సన్న్యవర్తత" (44/1) దాని కౌగిలి వీడి నవ్వుతూ (7) అక్కడి నుండి వెళ్లిపోగా, అందఱూ అతనివెంట వెళ్లిపోయారు. తన భవనం ప్రవేశించినా, సీత మీద మోహం మఱపుకి రావడం లేదు.

## విశేషాంశాలు

(1) 14 సంవత్సరాల గడువు కైకమ్మ పెడితే, గడువులో ఆ చివరి సంవత్సరంలో సీతారాములుంటే, అదే గడువుని రావణుడు కూడా ఎందుకు పాటించాలి? గడువులోపల ఆమె అంగీకరించకపోతే చేసేదేమిటి? ఆమెను చంపేస్తానన్నాడు. ఆ పనిని, ఎలాగూ చేయలేడు. సీతని తేవడం వలననే, మృత్యువు తనకి సిద్ధమై ఉంది. ఆమెను చంపితే, తనకి శిక్ష ఇంకా పెరుగుతుంది. అదీకాక ఆమె తనకు దక్కదు. గడువు అనేది పెట్టడం సహజంగా రెండు నిమిత్తాలకోసం. (1) తనంతతామగా లొంగిపోతుందేమో చూడడానికి (2) లేదా లొంగేలా చేసి ఒప్పించడానికిను. ఈ రెండూ సాగని దానికి గడువెందుకు? పైగా, ఆమె కూడా 'గడువేమిటి?' అని నిగ్గదీసి అడుగదేమి? గడువయ్యాక 'అంగీకరిస్తుందా?' - లేదే! కాబట్టి ఆ గడువు- రావణ మృత్యువుకి, సీతకు రామునితో సమాగమానికి, దైవకార్యసిద్ధికి, ఋషుల ఆనందానికిను.

(2) రాముడు-సీత, ఇద్దరిలో గొప్ప ఎవరంటే, సీతయే. రాముడు తన బాణాలతో రావణ్ణుని వధించాలి. అయినా, అలాటి రావణ్ణుని వధించగలనా? అని కొద్దిగా అధైర్యం ఒకప్పుడు రామునికి కల్గింది. కాని, రామబాణం కంటె గొప్పది సీత. ఒక్కమాట, శాపంగాచేసి, చంపేస్తానని రావణునితో అంది.

తన వారైన వానర గణంతో ఉండి, అధైర్య పడ్డాడు రాముడు. తనని బెదిరించే రాక్షస స్త్రీలమధ్య ఉండి, నిర్భయంగా శపించి మరీ చంపుతానన్నది సీత. కాబట్టి రామబాణం కంటె సీతావాక్కు గొప్పది. అందుకే-"నమ్ము(బోవమని చెప్పవే "సీతమ్మ తల్లి" అని, ఈ ఆంతర్యం తెలిసిన రామదాసు, ఘోషించాడు.

(3) శరీరానికి ఎంత అలంకారం చేసినా, గుణం సరైనది కాకపోతే ఎలా ఉంటుందో తెలిపాడు మహర్షి. అంత అలంకారం చేసికొన్నా, రావణుడు శ్మశాన మండపంలా ఉన్నాడట.

ముక్కు చెవులు తెగ కోయించుకున్న - విరోధినియైన- శూర్పణఖకి కూడా ఏ అలంకారాలు లేక రాముడు, రూపసంపన్నుడిలా కన్పించాడు. అనేకాలంకారాలు చేసికొన్న మంథర కూడా 'సూత్ర బద్ధేవ వానరీ' తాడుకట్టిన కోతిలా ఉందని వాల్మీకి అంటాడు.

ఎంతో ఖర్చుచేసి అలంకారాలు చేయించుకున్నా, గంట గంటకీ మార్పు కన్పించదా? మారేరూపాన్ని, మార్పురాలేదని నిరూపించ ప్రయత్నించే అలంకారం కాదు కావల్సినది - మార్పురాని సద్గుణం కావాలి.

(4) 'సంధ్య' అనేది అమ్మవారి పేరు. (సంధ్యా విద్యే సరస్వతి!) సంధ్యని, సూర్యునిలా నాశనం చేస్తానని రావణుని మాట. సూర్యుడు ఉదయించేముందూ, అస్తమించాకా- రెండుమార్లూ సంధ్య ఉంటుంది. అంటే రావణుని పుట్టుకా-రావణ నాశనం అనే ఈ రెండూ, సీతకు తెలుసని రావణుని అభిప్రాయం. రావణుడు, సర్వశాస్త్ర పండితుడనేది మఱచి పోరాదు. ఆరణ్యకాండంలో కూడా (రహితాం చంద్ర సూర్యాభ్యాం సంధ్యామివ మహత్తమః) సీతమ్మని సంధ్యలో పోల్చి చెప్పాడు వాల్మీకి.

(5) ఆమెను ప్రతికూలంగా- అంటే క్షుద్ర మంత్రాలతో, అనుకూలంగా- అంటే నిత్య సాత్వి కార్చనలతో- అని అర్థం. ప్రతికూలంగా వశం చేసికోవడం దుస్సాధ్యం. వ్యతిరేక ఫలాన్ని కోరి తెచ్చుకోవడం.

(6) కలియుగ లక్షణాల్లో ఒకటి, 'భార్యా భర్తరి బద్ధవైర హృదయాః' అనేది. అనేక స్త్రీలకి, తమ భర్తలమీదే శత్రుత్వం ఉండడం, కలియుగ లక్షణం. అట్టిదానితో కామించడం, నిత్యశ్రాద్ధమే - మనోవ్యథకి హేతువూను. కలిగే సంతానానికి మనోవ్యథే కల్గుతుంది.

అందుకని, భర్త- అంటే ఇష్టం కలిగే ఇతిహాసాలనీ, పురాణాలనీ చదవడం-చదివించడం, సంసారాలు నిలబడేందుకు అవసరం. ఎంతమాట- భర్త లేదా భార్య అంటే అంతమాటా- భార్య లేదా భర్త, మఱో క్రొత్త పదజాలంతో అనడం, చక్కగా ఉండచ్చేమోకాని, సంసారాన్ని చిన్నాభిన్నం చేస్తుందని ఆలోచించక తప్పదు. 'మా స్మ ప్రతీపం గమః' - కోపం వచ్చి నోరు రగులుతున్నపుడు, ఆ ప్రదేశాన్ని విడిచి వెళ్లాలని చెప్పారు గాని, అక్కడే నిలబడి, అంతకంటె చక్కని పదజాలంతో సమాధానాన్ని చెప్పమని, ప్రాచీనులు చెప్పరు. పిచ్చిపుస్తకాలు మాత్రం, అలా నోరు పారేసుకోవడం, 'అభిమానానికి' నిదర్శనమని ప్రశంసిస్తాయి. ఫలితం భార్యకు తెలియదుగాని, ఆ భార్య తండ్రికి (ఒకప్పటి కన్యాదాత) తెలుస్తోంది.

(7) ధాన్యమాలిని కౌగిలించుకుని, తన ఆనందాన్ని కోరమంటే రావణుడు నవ్వడం- నిజంగా తన అభిప్రాయం (మోక్షం) దీనికి తెలియదేమో? అని. (ఇంద్రస్తు ప్రహసన్) బాలకాండలో కూడ అహల్యని, లోకమంతా భావించినట్లు సంగమించని ఇంద్రుడు కూడా ఇలాగే నవ్వాడు. ఆ నవ్వు నర్మగర్భమైనది. ఆ నవ్వులోని అర్థం, నవ్వినవారికే తెలిసేది.

❀ ❀ ❀

# 23వ సర్గము

## బ్రతకాలంటే భార్యగా అయిపో!

రావణాజ్ఞ ప్రకారం ఒక్కొక్క రాక్షస స్త్రీ ఒక్కోవిధంగా చెప్పసాగారు. "సీతా! పౌలస్త్య వంశంవాడూ - పరాక్రమవంతుడూను. అతడికి భార్యకావడం నీ అదృష్టం". - "ఓ సర్వాంగ సుందరీ! బ్రహ్మ మానసపుత్రుడు విశ్రవసుడు, ప్రజాపతి అయిన బ్రహ్మతో సమానుడాయన. ఆయన పుత్రుడు ఈ వైశ్రవసుడు (రావణుడు). రాక్షస ప్రభువు. గమనించు".

"35 కోట్ల దేవతలూ, దేవతల అధ్యక్షుడైన ఇంద్రుడూ ఈ రావణుని చేతిలో ఓడారు. మఱచిపోకు". - "యుద్ధాలలో వెనుకంజలేనివానికి భార్యగా ఎందుకుండనంటున్నావో చెప్పు?" - "ఇష్ట భార్య మండోదరిని విడిచి, అంతఃపురాన్ని కాదని, నిన్ను రాణిగా చేయదలిస్తే అదృష్టాన్ని కాల దన్నుతావా?" - "గంధర్వ, నాగ, దైత్య, దేవాదులని అనేక పర్యాయాలు జయించాడని ఎన్నిమాఱులు చెప్పాలి". - "పంచభూతాలైన నేల- నీరు- తేజస్సు- వాయు- ఆకాశాలు అతడి భయంవల్ల కదలక- వేగంగా ప్రవహించక- ఎక్కువగా ఎండకాయక- గట్టిగా వీచక - భయంకరంగా గర్జింపక ఉంటే, నీకెంత ధైర్యం? బ్రదుకదలిస్తే భార్యవైపో!" అని ఈ తీరుగా ఏకజట, హరిజట, ప్రఘస, వికట, దుర్ముఖి అనే రాక్షస స్త్రీలు, పిల్లి కళ్లు త్రిప్పుతూ, గ్రుడ్లు మిటకరిస్తూ, క్రోధంతో ఊగిపోతూ చెప్పారు.

(ఇష్టంలేని వివాహానికి, కన్యని ఒప్పిస్తూ మాట్లాడే వారంతా, ఈ జాతివారే. ఒకరు-వానికులం, మఱొకరు బలం, ఇంకొకరు సంపద, ఆ యింకొకరు వాని అహంకారం వర్ణిస్తూ, గొప్ప సంబంధమని చెప్పారు. ఇంతకీ సద్గుణం ప్రధానం. ఇష్టభార్య మండోదరిని విడిచి, సీతని రాణిగా చేస్తాడని చెప్పినమాట మకుటాయమానం.

ఒకతెను కాదని, వేఱొకతెను కట్టుకొనే స్థితికి మగవాడు వస్తే (మగవాడు 'ఒకటి' - అనే అంకె దాటరాదు. దాటితే) ఆమెతోనే ఆగడు. మండోదరిని కాదని, 'సీతమ్మ' - అనేవాడు , కొంతకాలం పిమ్మట మఱొక 'కాకమ్మ' అనకమానడని భావం.

భారతీయ ధర్మం, భర్తకి ఏకపత్నీ వ్రతమూ, భార్యకి పాతివ్రత్యమూను. ఈ లక్షణాలున్న జంట, సీతారాముల జంట.

అయితే, భార్యాధర్మమైన పాతివ్రత్యం మండోదరిలో ఉండి, ఏకపత్నీ వ్రతత్వం రావణునిలో లేనిది, రావణ మండోదరుల జంట. అందుకే ఈ జంట ఆదర్శ ప్రాయం కాలేకపోయింది).

❋ ❋ ❋

# 24వ సర్గము

## సీతా విషయంలో భేద-దండోపాయ ప్రయోగం

రాక్షస స్త్రీలు మళ్లీ సీత చుట్టూ చేరారు. "పిచ్చిదానా! మానవ స్త్రీవి, మానవునికే భార్యకావాలనుకోకు. రాజ్యంలేని రామునివల్ల ప్రయోజనం లేదు.

ఎవతె అయినా ఐశ్వర్యవంతుడైన భర్త కావాలని, కోరుకుంటుంది. పో! రావణునికి భార్యవి కా!" అని రామరావణులలో ఉన్న సంపదలోని భేదాన్ని చెప్పి, మనసు మళ్లింప ప్రయత్నించసాగారు.

"దీనో వా రాజ్యహీనో వా యోమే భర్తా సమేగతిః ॥
తం నిత్య మనురక్తాఽస్మి యథా సూర్యం సువర్చలా॥ (9)".

"రాక్షస స్త్రీలారా! మీరు పాపపు మాటలు చెప్తున్నారు. సహాయంలేక దీనుడైనా, రాజ్యం లేక సంపదచేత హీనుడైనా, నా భర్తయే నాకు దిక్కు. (1) సూర్యుణ్ణి సువర్చల (అధిక తేజస్సు) ఎలా అనుసరించి ఉంటుందో, అలా నేనూ, నా భర్తతో కలిసే ఉంటాను.

శచీ దేవేంద్రులు, అరుంధతీ వసిష్ఠులు,
రోహిణీ చంద్రులు, లోపాముద్రాగస్త్యులు,
సుకన్యా చ్యవనులు, సావిత్రీ సత్యవంతులు,
కపిల శ్రీమతులు, సౌదాస మదయంతులు,
సగర కేశినులు, నల దమయంతులలా,

భర్త కష్టాలలో ఉన్నప్పుడు వెంట ఉండి, విధివశాత్తూ దూరమైనప్పుడు అతనినే స్మరిస్తూ వారంతా ఉన్నట్లుగా నేనూ జీవిస్తాను" అని సీత దుఃఖిస్తూ చెప్పింది.

ఈ మాటలు వింటూనే, ఎఱ్ఱని కళ్లతోనూ, పెద్ద నాలుకలతో మూతుల ప్రక్కభాగాలని తుడుచుకుంటునూ ఆయుధాలని ధరించిన రాక్షస స్త్రీలు ఒకరిపిమ్మట ఒకరు "ఛీ! ఇది రావణునికి భార్యగా ఉండతగనిది" – అంటూ "నీ భర్త మీద చూపిన ప్రేమ చాలు. మించితే కష్టం వస్తుంది" "సముద్రం దాటి, ఇవతలకు వచ్చి, నిన్నెవడు రక్షిస్తాడు? చక్కగా అలంకరించుకొని, ఇతణ్ణే భర్తగా ఒప్పుకో!", అని ఆమెతో అనసాగారు.

మఱోకొంత మంది ఇదే విషయాన్ని వేఱ్వేఱు వాక్యాలలో చెప్తూ "సీత గుండెనీ, ప్లీహాన్నీ, అంత్రాలనీ, తలభాగాన్నీ, మాంసపు ముక్కలుగా చేసి తిని, మన రాక్షస

దేవత 'నికుంభిల' ముందు నృత్యాన్ని చేయాలి" అంటూ బెదిరిస్తూంటే, సీతమ్మ దుఃఖిస్తూ ఉండడాన్ని, హనుమ గమనిస్తూ ఉండిపోయాడు. (3)

**విశేషాంశాలు**

(1) సంపదా, అధికారమూ, ఆరోగ్యమూ, రూపమూ ఉంటే, ఎవతె భర్తని ఆదరించదు? ఇవి ఏమీ లేనప్పుడు ఆదరించడం గొప్ప. 'భార్యాం - భాగ్యపరిక్షయే' - భర్త సంపాదన తగ్గి, ఆస్తి లేక ఉన్ననాడు ఆదరిస్తేనే, ఆమె నిజమైన భార్య.

ఒక అప్రాచ్య వనిత(ఆంగ్లేయ స్త్రీ) 'జేన్ స్మిత్' ఇలా వ్రాసింది. "రావణుడు తన కాళ్లవద్దపడి ప్రాధేయపడుతున్నా వద్దని, సీత అనడంలో ఔచిత్యం నాకేం బోధపడలేదు". అని. పాపం భారతీయ ధర్మం దానికేం తెలుస్తుంది?

కట్టుకున్నవాడు ఇలాంటి స్థితిలో ఉన్నప్పుడు, తనని బ్రతిమలాడేవాణ్ణి స్వీకరించడం అనురాగానికి మారుపేరనీ, అది తప్పుకాదనీ సమర్థించే అద్దెపుస్తకాలు విశృంఖలంగా లభిస్తున్నాయి కలియుగం కాబట్టి. అవి వెలువడడం తప్పు కాదు. అయితే, ఇలాటి ఇతిహాసాలని చదివి, మాఱకపోవడాన్ని నేర్చుకోవాలి.

(2) వివాహారంభంలో దంపతులకి నమస్కారాలు పలికిస్తారు. అలా మేం క్షేమంగా, ఒకరికొకరంగా, ఉండాలని భావం. అలాగే వివాహాంతంలోనూను.

(1) ఇంద్రుడు, తన ఉద్యోగధర్మం ప్రకారం, ఎందఱినో పరీక్షిస్తున్నా, అర్థం చేసికోగలది శచీదేవి.

(2) విశ్వామిత్రుడిచ్చిన శాపకారణంగా వసిష్ఠపుత్రులు యాచకులైపోబోగా, ఆత్మహత్యకు పాల్పడబోయిన వసిష్ఠుని నివారించిన ఇల్లాలు అరుంధతి.

(3) భార్య 'రోహిణి' మహాక్రూరంగా చండప్రచండంగా ఉన్నా, చల్లగా ఉండే లక్షణమున్న వాడు చంద్రుడు.

(4) కాశీ విడిచి వెళ్లిపోవాల్సినప్పుడు అగస్త్యుడు దుఃఖిస్తూంటే, ఓదార్చిన ఇల్లాలు లోపాముద్ర. మహర్షి అయిన అగస్త్యుణ్ణి రాజపుత్రిక అయిన తాను,ఆదరిస్తూనే ఉంది.

(5) తండ్రి వివాహం చేసాడనే కారణంగా భర్త-చ్యవనుడు, అంధుడైనా, కురూపి ఐనా, అలాగే భార్యగా జీవించి, చివరికి సురూపవంతునిగా చేసికొన్న ధన్యురాలు సుకన్య.

(6) భర్త సత్యవంతుడు, సంవత్సరకాలంలో మరణిస్తాడని తెలిసికూడా, వివాహం చేసికొని, పరమ కఠినుడైన యముణ్ణి కూడ ప్రసన్నం చేసికొని, పుట్టింటినీ-మెట్టింటినీ కూడ ధన్యపఱచిన ఇల్లాలు సావిత్రి.

(7) నిత్యం యోగధ్యానంలోనే ఉండే కపిలుని విడువక సేవించినది సావిత్రి.

(8) వశిష్ఠ కోపంచే రాక్షసుడుగా అయినా, ఆ సౌదాసుని (కల్మాషపాదుని) సేవిస్తూనే ఉన్న ఇల్లాలు మదయంతి.

(9) తన సంతానం 60వేల మందీ కపిల మహర్షిచే బూడిద ఐనా, భర్త-సగరుణ్ణి విడువని ధన్యురాలు కేశిని. ఆ సగరులు త్రవ్వినదే నేటి సాగరం.

(10) విధివశాత్తూ భర్త నలుడు, ద్యూతంలో ఓడి, ఎక్కడికి పోయాడో చెప్పక విడిచిపోయినా, అతనికై పరితపించి, చివరకు వానిని చేరిన ధన్యురాలు దమయంతి.

శచీదేవితో ప్రారంభించి, జంటలని చెప్పి చెప్పి, దమయంతితో ముగించింది సీత.

తానై కోరివచ్చిన దేవేంద్రుణ్ణి కూడ నిరాకరించి, మానవుడైన నలుణ్ణి స్వీకరించినది దమయంతి కదా!

అలాగే కోరివచ్చిన రావణుణ్ణి కాదని, మానవునే అంగీకరిస్తానని చెప్పడం దీని లోభావం.

మానవ స్త్రీ జాతి ఔన్నత్య మిలాంటిదని చాటడం, సీత లక్ష్యం.

సీతాదేవి మాటమాత్రంగా చెప్పిన ఈ జంటల కథలే, పెంచి వ్రాయబడి, భారతభాగవతాలుగా, తరువాతి కాలంలో రూపొందాయి. భారత భాగవతాల్లోని దాదాపు 120 ఉపాఖ్యానాలు, రామాయణంలో సూచింపబడినవే.

(3) '... సమయగ్రాహీ రాజ్ఞాం దూత స్స ఇష్యతే' అని నీతి శాస్త్రం. దూతకి ఉండాల్సిన లక్షణాల్లో, సమయ-అసమయాలని గ్రహించడం కూడ ఒకటట. ఇంతకీ ఈ సమయం, రాక్షస స్త్రీలపై దూకడానికి సరికాదని, హనుమ ఆగిపోయాడు.

❀ ❀ ❀

# 25వ సర్గము

## అయ్యో! నా చావు కూడా నాచేతలో లేదా?

"ఓ రాక్షస స్త్రీలారా! నన్ను కొట్టినా, చంపినా కూడ మీ మాట వినను. ఓ! రామా! లక్ష్మణా! సుమిత్రా! కౌసల్యా! ఏమి యీ దుఃఖం, నాకు సంప్రాప్తించింది?.

"అకాలే దుర్లభో మృత్యుః స్త్రియావా పురుషస్యవా (12)"

కాలం రానిదే, పురుషులు గాని, స్త్రీలు కాని మరణించరని పెద్దలు అనే మాట యథార్థం. ఆ కాలం నాకింకా రాలేదు.

భయంకరమైన విషాన్ని స్వీకరించిన వారు జీవించనట్లు, నా భర్త లేక నేను జీవింపలేను.

పూర్వజన్మలో అల్పపుణ్యాన్నీ, మహాపాపాన్నీ చేసి ఉంటాను. ఈ దుఃఖంతో జీవించడం కంటె మరణమే మేలనిపిస్తోంది" – అని సీతమ్మ విలపిస్తూ, త్రాచువంటి జడ వ్రేలాడుతూంటే, అశోక వృక్షపు శాఖని పట్టుకొని విలపిస్తూ

"ధిగస్తు ఖలు మానుష్యం, ధిగస్తు పరవశ్యతామ్ ।
నశక్యం యత్పరిత్యక్తు మాత్మచ్ఛందేన జీవితమ్ ॥ (20)"

జన్మ అనేదే పరాధీనం. అందునా మనుష్య జన్మ-దానిలో, భర్త అధీనంలో ఉండే భార్యాజన్మ-నా ప్రాణాలని నేను తీసికొనే వీలు కూడ లేని పరాధీనతయా?" అని దుఃఖించింది.

(విష్ణువు భార్యగా ఉండడం స్వతంత్రతకి చిహ్నం. జన్మ ఎత్తడం అంటే, బ్రహ్మాజ్ఞకు లోబడిగదా!

సీతా రూపం ఎత్తడం విష్ణువు ఆజ్ఞకులోబడి. భార్యారూపం పొందడం, తండ్రి జనకునికీ, భర్త రామునికీ, లోబడి.

ప్రాణాలని ధరించి ఉండడం, ఆత్మహత్యకు పాల్పడిందని, నలుగురూ అనుకొనే అపనింద రాకుండా ఉండడానికి లోబడి).

❀ ❀ ❀

# 26వ సర్గము

## ఏమైనా సరే ప్రాణాలు విడుస్తాను!

"నా గుండె చాల కఠినం అయ్యుంటుంది. రాక్షస స్త్రీల బెదిరింపులకు గాని, రాముడు లేని దీనత్వానికి గాని, తట్టుకొని నిలిచే ఉంది కదా!

"చరణేనాప సవ్యేన న స్పృశేయం నిశాచరం-
రావణం పునరహం కామయేయం విగర్హితమ్ (10)" -

రాక్షసాంగనలారా! నన్ను మీ యిష్టం వచ్చినట్లు చేసికోండి. నా ఎడమకాలితోనైనా రావణుణ్ణి స్పృశించను. ఇంక వాణ్ణి కామించడం కూడానా?

జనస్థానంలోని 14 వేల రాక్షసులని ఒక్కడే సంహరించిన వాడూ, ధర్మపరాయణుడూ నా భర్త. అతడు లేని సమయంచూచి, దొంగతనంగా నన్ను తెచ్చినవాడు రావణుడు. విరాధుడంతటి వాణ్ణి సంహరించిన రామునికి, సముద్రపు నడుమనున్న లంక ఒక లెక్కా? లక్ష్మణునికీ, రామునికీ నా జాడ తెలియని కారణంగా, మీరింకా బ్రతికి ఉన్నారు.

లంకలో అశుభ సూచనలు కన్పిస్తున్నాయి. కాబట్టి, లంక రూపు మాసిపోతుంది. భర్తపోయిన స్త్రీలా, లంకఅంతా, గోలుగోలున, తొందరలోనే ఏడుస్తుంది.

"సమయోయస్తు నిర్దిష్ట స్తస్యాకాలో௨య మాగతః (34) రావణుని గడువు కావస్తోంది. కాగానే నన్ను వాడు ప్రాతఃకాల భోజనానికి చంపేస్తాడు. అయ్యో! విషం ఇచ్చేవారుంటే త్రాగి పోదును గదా! రామలక్ష్మణులకి నా జాడ తెలియదు. చెప్పేవారు లేరు. రాముడు, నా జాడ తెలియక దేవలోకంపోయి ఉంటాడు.

దృశ్యమానే భవేత్ప్రీతిః సౌహృదం నాస్త్యపశ్యతః ।
నాశ యన్తి కృతఘ్నాస్తు న రామో నాశ యిష్యతి (43)" -

ఎదురుగా ఉంటే ఉండే ప్రేమ, కన్పించక పోతూంటే ఉండదు. అయినా, రాముడు కృతఘ్నుడు (చేసిన మేలు మఱచేవాడు) కాడు. దేవలోకం వెళ్లిన రాముని చూచే మహర్షులూ, ఇతరులూ ధన్యులు. రామలక్ష్మణులు కంద మూలాలు తింటూ, అస్త్ర సంన్యాసం చేసారా? లేక, వంచనతో రావణునిచే చంపబడ్డారా? ఏమీ తెలియకుండా ఉందేమి? నాకు చావురావడం లేదు. ఏమైనాసరే! ప్రాణాలు విడుస్తాను" అని సీతమ్మ దుఃఖింపసాగింది.

(ఇక్కడ సీత పల్కినమాటలు, అన్నీ, పైకి దుఃఖంతో అన్న మాటలుగా కన్పిస్తాయి. కాని, సీతమ్మ ధైర్యంతో పల్కిన పల్కులు. ('దేవరహస్యం' రావణవధ. అది బయటపడరాదని గదా, ఈ జగన్నాటకం).

1. రాముడు దేవలోకానికి వెళ్లి ఉంటాడు- "రావణ వధ అయ్యాకే వెళతాడని ఆమెకి తెలుసు. ఒకవేళ భార్యా వియోగాన్ని భరించలేక వెళ్లాడా?-అనుకుందామంటే, భార్యయైన తాను లంకలో ఉందిగదా! అందుకని రాక్షసస్త్రీలు అందరూ, దుఃఖిస్తూన్న తనని చూచి 'దుఃఖిస్తోంది సీత' అనుకునేందుకూ- అలాగే, ఆంజనేయునకు తాను సీతయే అని, లక్ష్యం కుదిరేందుకూ- అలాగే, రాముడు దేవలోకం నుండి వచ్చినవాడని తెలియజేసేందుకూ అన్న మాటలు.

2. రాముడు అస్త్రసంన్యాసం చేసుకుంటాడు- 'అరణ్యకాండ' లో సీతయే స్వయంగా - ధనుర్బాణాలని విడువమని రాముణ్ణి కోరింది. విడిచేస్తానని రాముడని ఉంటే, లంకలో ఉండబోయేతనని, పట్టించుకోడని గ్రహించుదామని- కాని ఆయన విడువనన్నాడు- రావణవధ వఱకూ, ఈ ఆయుధాలు ఉండితీరాలని, సీతకి అర్థమయ్యేందుకు. అలాటి రాముడు-రెండు మాటలు మాట్లాడని రాముడు-ఆయుధాలని విడుస్తాడా? విడువడని తెలుసు.

3. వంచనతో రామలక్ష్మణులు చంపింపబడ్డారా?- రావణ వధకై, తపశ్శక్తిని మహర్షులనుండి ప్రోగు చేసికొన్న రామలక్ష్మణులిద్దఱూ మరణించడం అసత్యం కదా!.

4. చస్తాను బలవంతంగా- 'అతిమానాదతి క్రోధాత్ స్నేహాద్వా యది వా భయాత్ -

ఉద్బధ్నీయాత్స్త్రీ పుమాన్ వా గతిరేషా విధీయతే-<br>
పూయశోణిత సంపూర్ణే త్వంధే తమసి మజ్జతి-

షష్టిర్వర్ష సహస్రాణి నరకం ప్రతిపద్యతే-<br>
అశౌచం నోదకం నాగ్నిం నాశ్రుపాతం చ కారయేత్ -

బలవన్మరణం(ఆత్మహత్య) చేసిన వారికై 'మైలు'(అశౌచం)పట్టరాదు. అగ్ని సంస్కారం చేయరాదు. నీళ్లు విడువరాదు- అని ఉండగా అలాటి చావు చస్తానని సీత అంటుందా? అయినా పల్కడానిక్కారణాలు పైన (1లో) చెప్పినవే.

❀ ❀ ❀

# 27వ సర్గము

## 'త్రిజట' అనే రాకాసికి వచ్చిన స్వప్నం—'పక్షి' సూచించిన శుభం

"ఇత్యుక్తా సీతయా ఘోరా రాక్షస్యః క్రోధమూర్ఛితాః కాశ్చిజ్జగ్ముస్తదాఖ్యాతుం రావణస్య తరస్వినః ॥ (1)" నేను మరణిస్తానని సీత పల్కగానే, ఆ వార్తని రావణునికి తెల్పడానికి కొందరు రాక్షసస్త్రీలు వెంటనే వెళ్లిపోయారు (1). రాక్షసస్త్రీలు బెదిరిస్తూంటే, వృద్ధరాక్షసి అయిన 'త్రిజట' నిద్ర నుండి మేల్కొని 'ఓసే! సీతని కాదు. నన్ను తినండి. నాకు భయంకరమైన కల వచ్చింది ' అని చెప్పి, వారంతా చెప్పమని అడిగితే (2) ఇలా చెప్పసాగింది.

"శుక్లమాల్యాంబరధరో లక్ష్మణేన సహాగతః ।
స్వప్నే చాద్య మయా దృష్టా సీతా శుక్లాంబరావృతా ॥ (20-21)"

ఏనుగు దంతపు పల్లకిని, వేయి హంసలు తెస్తూంటే, పూమాలయా -వస్త్రాలయా ధరించి, రామలక్ష్మణులు దాంట్లో లంకకి వచ్చారు. సీత, తెల్లని బట్టలని ధరించి, శ్వేతపర్వతం మీదనుండి దిగుతూంటే, లంకనుండి రామలక్ష్మణులు, 4 దంతాల ఏనుగెక్కి, ఆమెను చేరారు. సీతకూడా ఆ ఏనుగు నెక్కి, రాముని తొడపై కూర్చుని, పైకి లేచి సూర్య చంద్రుల్ని పట్టుకుంది. మళ్లీవారంతా 8 ఎద్దులు కట్టిన రథంమీద ఇక్కడకొచ్చి, పుష్పకవిమానం ఎక్కి, ఉత్తరంగా వెళ్లిపోయారు.

రావణుడు ఎఱ్ఱగన్నేరు పూలదండ వేసికొని, ఎఱ్ఱ బట్టంతో, ఎఱ్ఱ చందనం ఒంటికి పూసికొని, నూనెతాగుతూ, గాడిదల రథంమీద దక్షిణానికి వెడుతూ, మధ్యలో తలక్రిందై, నేలనుపడి, మద్యం మత్తుతో, మలపంకంలో పడ్డాడు. కుంభకర్ణుడు కూడ, ఇలాగే ఉండగా, నల్లని బట్టలు కట్టిన స్త్రీ, రావణుని మెడకి తాడు కట్టి దక్షిణానికి ఈడ్చుకుపోతోంది. రావణ పుత్రులంతా నూనె రాసుకొని ఉంటే, పైకి లేచిన రావణుడు పందినీ, ఇంద్రజిత్తు మొసలినీ, కుంభకర్ణుడు ఒంటెనీ ఎక్కి ఆ దక్షిణానికే, వెళ్లారు.

విభీషణుడు తెల్లని పూలూ - బట్టలూ - గంధం - శంఖ దుందుభి వాద్యాలతో, దివ్యగజం ఎక్కి, ఎఱ్ఱని బట్టలున్న రాక్షస వాయిద్యాల మధ్య, ప్రకాశిస్తూ కన్పించాడు. గోపురాలూ-ద్వారాలూ, సేనలతో లంక సముద్రంలోకి జారిపోయింది. వానరు డొకడు అట్టహాసంగా లంకని తగులబెట్టాడు.

రాక్షసాంగనలారా! ఇప్పటివఱకూ హింసించినా, నమస్కరిస్తే ప్రసన్నురాలయ్యే ఈమెను ప్రార్థిద్దాం. మనకి భయం, మనందఱికీ నాశనం-రాముని విజయం, నిజమనడానికి స్పష్టంగా చూడండి - ఈమె ఎడమ కన్ను - భుజం- తొడ అదరుతున్నది. అంతేకాదు, ఆచెట్టు పై పింగళ పక్షి, కొమ్మలలో దాగి, దుఃఖానికి సమయం కాదని, సీతని ఓదారుస్తూ, సంతోషంతో కూస్తోంది". అని చెప్పింది. (4)

## విశేషాంశాలు

(1) బెదిరించమన్నాడు గాని, రావణుడు సీతని చంపమనలేదు. ఒకవేళ ఆమెకు ఆమె మరణించదలచుకొన్నా ఆ విషయాన్ని చెప్పమన్నాడు. అందుకే భయంతో, రావణునికి చెప్పడానికి పరిగెత్తారు. ఇక, లోభావం మఱొకటి. లంకలో ఉన్న రాక్షసులకి, కొందఱికి అశోక వన ధ్వంసంలో, కొందఱికి లంకాదహనంలో, విధి చావు లిఖించాడు. కొద్దిసేపట్లో అశోకవనభంగం కాబోతోంది. ఆ ఘట్టంలో చావవలసిన వారంతా, మద్య మాంస వినోదంలో ఉన్నారు. రావణుని కబురుద్వారా వారిని యుద్ధానికి సిద్ధంచేసి, రాబోయే కాలంలో పొదగిన వారిని, పైకి పంపడానికి, ఈ రాక్షస స్త్రీలు రావణుని దగ్గరకు వెళ్లారు.

(2) సీతని రక్షిస్తూ ఉండమని కాపలాపెడితే, వృద్ధ రాక్షసి కల గాంచడ మేమిటి? ఉద్యోగి నిద్రించవచ్చా? పోనీ అది వృద్ధురాలని అనుకొన్నా, ఈ స్త్రీలంతా, కలగుఱించి చెప్పమని అడిగారేమి?- నిశాచరీ లక్షణం ప్రకారం, మేల్కొని రక్షించే బాధ్యత త్రిజటదే. అయినా వృద్ధాప్యంవల్ల 'స్వప్నం' వచ్చింది. తన కంటిముందు పుట్టిన పిల్లలంతా, తనముందే మరణింపబోతున్నారని తెలిసి- వద్దని వారించింది. వారంతా చెప్పమని అడగడం, వారిలో నిశ్చయంగా అధర్మం చేస్తున్నామనే నమ్మకానికి, 'తప్పక చస్తాము' అనే భయానికి, నిదర్శనం.

### కలలు ఎలా ఉంటాయి? ఎన్ని విధాలు? నమ్మవచ్చా?

(3) శ్రీ మద్రామాయణంలో కలలు 3.

మొదటిది తాను మరణించబోతున్నాననే కల, దశరథునికి రాగా, రాముణ్ణి యువరాజు చేయాలని భావించాడు. తాననుకున్న యువరాజుగా రాముడు కాలేదుగాని, వచ్చిన కల ప్రకారం మరణం నిశ్చయమైంది.

రెండవది తన తండ్రి మరణించినట్లు భరతునికి వచ్చిన కల: పోనీ! రామునికి రాజ్యం వస్తుందని భావించి, దూతలు రాగానే అయోధ్యకి వెడితే తాననుకున్న రామరాజ్యం లేదుగాని, కల ప్రకారం తండ్రి మరణం నిశ్చయమైంది.

మూడవది త్రిజట కల. పై నుండి 'హనుమ' వింటున్నాడు. లక్ష్మణునిద్వారా ఆంజనేయుడు, రామకథని మొత్తం విన్నాడు కాబట్టి, ఆ రెండుకలలూ ఎలా నిజమయ్యాయో, అలాగే, ఈ కలా కూడా నిజమౌతుందని గ్రహించి, కల ప్రకారమే చేయదలిచాడు. అలా చేయించడానికే భగవదాలోచనం 'త్రిజట'కి కల కల్పించింది. 'రక్షించేవాడు రాలేదు. శిక్షించేవారు ఉన్నారు'- ఇదీ, సీత స్థితి. శిక్షించే రాక్షస స్త్రీలకి భయాన్నీ, హనుమకి కార్యాలోచన విధానాన్నీ కల్పించింది ఈ కల. కలతో కష్టం సీతకి తీరినట్లే. భగవంతుడు ఏదో ఒక రూపంలో సాక్షాత్కరిస్తాడంటారు.

ఇక్కడ స్వప్నమే భగవంతుడు.

కలలు నిజమౌతాయా? కలలు 3 తీరులు. చింతితాలూ, వ్యాధి జాలూ, యాదృచ్ఛికాలూ అని. రోజు రోజంతా, వేటిని గూర్చి ఆలోచిస్తామో, లేదా వేటి ప్రభావం మనమీద ఉన్నదో, నిద్రింపబోయే ముందు, దేన్నిగూర్చి ఆలోచించామో, అదే కలగా వస్తే అది చింతితం. ఇది ఫలించదు. అందుకే, రాత్రిపూట పాములూ, దొంగలూ గూర్చి మాటాడుకోరాదని పెద్దలు మందలిస్తారు. ఉబుసుపోకకి కూడా, ఆ మాటని ఎత్తనీయరు. ఒకరెత్తితే, ఆ రాత్రంతా అవే మాటలు వస్తాయనీ- అవె కలలుగా వస్తాయనీను.

ఇక, శరీరంలో ప్రవేశించిన వ్యాధి వలన (పిత్తదోషం) కలలు వస్తాయి. రోజూ కల చెప్పే అలవాటున్న వారుంటారు. అవీ, వ్యాధిజాలు-అంటే. ఇవీ ఫలించవు.

ఇకదేన్ని గూర్చి ధ్యానించలేదో దాన్నిగూర్చి కల రావాలి. మఱుద్దామన్నా మఱచి పోలేనంతగా ఉండాలి కల. బృహదారణ్యకోపనిషత్తు (4-3-9) 'తస్య వా ఏతస్య పురుషస్య ద్వే ఏవ స్థానే భవతః- ఇదం చ పరలోక స్థానం చ సంధ్యం తృతీయం స్వప్నస్థానమ్' అని అంటుంది.

ఇహలోకం పరలోకం, అనే రెండే, జీవాత్మకి స్థానాలైతే, రెండు గదులమధ్య నిలిచిన వానికి రెండు గదులూ కన్పడినట్లు, ఈ ఇహ-పర లోకాల సంధిలో స్వప్న స్థానంలో నిలిచి, ఈలోకపు విషయాలనీ, జరుగబోయే వాటినీ, కల వచ్చినవాడు గ్రహించ గలుగుతున్నాడు - అని దీని భావం. వ్యక్తిలోని స్వయంజ్యోతి రెండు లోకాల

నడుమ నిల్చి కళ్లకు కన్పింపచేస్తుంది. కాబట్టి, మనం ఆలోచిస్తూన్నదీ, ఎన్నడూ ఆలోచింపనిదీ, కలిసి వచ్చే కల నిజమైన కల. దాన్ని 'యాదృచ్ఛికం' అంటారు.

'స్వప్నస్తు ప్రథమే యామే సంవత్సర విపాకినః - ద్వితీయే చాష్టభి ర్మాసైః త్రిభి ర్మాసై స్త్రియామికే . . . , . . . , . అరుణోదయ వేలాయాం సద్య ఏవ ఫలం లభేత్' అని స్వప్న శాస్త్రం చెప్పింది. రాత్రి ప్రతి 3 గంటలనీ, జాము అంటారు. 6-9, 9-12, 12-3, 3-6 ఇవి 4 జాములు. మొదటి జాము కల సంవత్సరంలో, రెండవది 8 నెలల్లో మూడవది 3 నెలల్లో, 4వ జాము కల నెలలో, తెలవారుజాము కల అదే రోజునే ఫలితాన్నిస్తుంది. అయితే ఆ కల, పైన చెప్పినట్టు యాదృచ్ఛికమే కావాలి. కల వచ్చినంత మాత్రాన చాలదు. దానికి సంబంధించిన చిహ్నాలు కన్పిస్తున్నాయా? అని చూచి, ఫలాన్ని నిర్ణయించాలి.

వెంటనే 'త్రిజట' సీతని చూచి, చూపించింది రాక్షస స్త్రీలకి. ముందుగా, కన్ను-ఆ మీదట, భుజం-ఆ పిమ్మట ఎడమ తొడ, అదరడం స్పష్టంగా చూచారు. త్రిజటతో పాటు అందరికీ నమ్మకం కుదిరింది.

'అదరడం' అంటే 'రోజా రోజంతా వణకడం, అని అర్థం కాదు. 'పొద్దుట్నించి కన్ను అదురుతోంది' అంటారు. అది వైద్యుణ్ణి చూడాల్సిన వ్యాధి తప్ప ఫలితాన్నిచ్చే సూచనకాదు. "మీనాహతం పద్మమివాభితామ్రమ్(29-2)" నీళ్లలో ప్రయాణించే చేప, నీళ్ల అడుగున ఉన్న పద్మపు తూటి మొదలుని తాకితే, ఎలా ఒకసారి 'ఠక్'మని పద్మం కదుల్తుందో, అలా ఒక్కసారి, తనకి తెలియకుండా కదిలితే అది 'అదరడం'.

ఈ కల ఫలిస్తుందని, సీత శరీర భాగాల అదరడం ద్వారా ఋజువైతే, చెట్టుమీది పింగల పక్షి కూడా, దాన్ని ధ్రువీకరించింది. కలని నిజమని నిరూపించిన సీత, మహావిష్ణువు భార్య. పక్షి, మహావిష్ణువు వాహనమైన గరుడుని సంతానం. ఈ కలని వింటున్న వాడు రామదూత.

(4) పక్షి గుబురులో ఉండి కూయడం, అంటే దాని స్వగృహంలో ఉండి మాట్లాడుతూన్నట్టన్నమాట. పైగా, ఆ పక్షి, సీతని ఓదారుస్తూ అరుస్తోంది. భర్త వస్తూంటే 'అలంకరించుకో' అన్నట్లు, ఓసారి ఇటు తిరిగి, 'చెప్పాను సీతకి' అన్నట్లు ఓసారి అటు తిరిగీ, రా! రా! అని ఆంజనేయుని చూస్తూ ఓ సారీ అరిచింది.

స్వార్థబుద్ధి లేనిది పక్షి. ఏ రోజూ తిండిపెట్టినా, ఒకరోజు మానితే నిందించదు. ఈ యింట, ఆహారదానం చేసే దాత ఉన్నాడని తోటి పది పక్షులకి చెప్తుంది పక్షి. వర్షం

వచ్చే సూచన తెలుపగలం నెమలీ, ఎండ రాక చెప్పే కృష్ణకోకిలా, పక్షులే. శ్రీమద్రామాయణకథ పుట్టింది, ఆడు క్రౌంచపక్షి శోకం వలననే కదా!

శకున శాస్త్రమని ఉంది. శకునం అంటే పక్షి. పక్షి గమనాన్నీ, అఱపులని బట్టి చెప్పే శుభాశుభాలు అని అర్థం. ఆకాశంలో పక్షులు అఱుస్తూ అప్రదక్షిణంగా తిరిగితే అశుభం, అలాగే గ్రద్దా-డేగా ఇంటిమీద వాలినా కూడా. అటువంటి సందర్భాలలో భగవద్దర్శనం చేయాలి. "అశుభ సూచన కల్గుతోంది- వార్తని తట్టుకోగల మనశ్శాంతి నీయమని ప్రార్థిస్తూ". లేదా, శుభ సూచన కల్గుతోంది. నా మీద నీ అనుగ్రహాన్ని ఇలాగే ఉంచమని మ్రొక్కుతూ.

ఇలా కల రాగానే, త్రిజటా-ఇతర స్త్రీలూ అమ్మవారిని చూచారు. భగవతీ దర్శనమైంది వారికి. (అంగవైకల్యం ఉన్న వారికి) సీతమ్మ 'పక్షి' ని చూచింది. గరుడుని సంతానాన్ని. ఒకే కల రాక్షస స్త్రీలకి అశుభాన్నీ, సీతకి శుభాన్నీ కల్గించింది. 'పక్షీ చ శాఖానిలయః ప్రహృష్ట-పునః పునశ్చోత్తమ సాంత్వవాదీ సుస్వాగతాం వాచ ముదీరయానః- పునఃపునశ్చోదయతీవ హృష్టః' ॥ (52) అనేది శ్లోకం'.

ఇంతకీ, 'త్రిజట' పూర్వం ఆలోచించిన విషయమేగా, కలగా వచ్చింది. చింతిత కల కదా! ఫలితం ఎలా ఇస్తుంది? – అంటే, తామూహించిన రావణ నాశనం వఱకూ చింతితమైనా, ఎన్నడూ చూడని ఊహించని, వానరుడొస్తాడనీ, లంకని తగులబెడతాడనీ, గోపురాలు కూలగొడతాడనీ చెప్పడంవల్ల యాదృచ్ఛికం.

లంకని ఒక వానరుడు తగులబెడుతాడని త్రిజట చెప్పిన కల ద్వారా విన్న ఆంజనేయునికి, 'లంకా దహనం చేస్తే బాగుంటుంది' అనే ఆలోచన ఇప్పుడే తట్టింది. ఒక్కొక్కసారి కల కర్తవ్యాన్ని కూడా ఉపదేశిస్తుంది అనడానికి ఇదే సాక్ష్యం. అయితే ఇలా ఉపదేశమనేది కల ద్వారా లభించడమనేది 'యాదృచ్ఛికం' అనే కల ద్వారానే సాధ్యం కారణం యాదృచ్ఛికం జాతికి చెందిన కల భగవదనుగ్రహం ఉన్నప్పుడే వస్తుంది కనుక.

కోతి, కొమ్మలని విఱుగగొడుతుంది గాని తగులబెట్టడం, కూల్చడం విన్నామా? చూచామా?- అందుకని కల ఫలించి తీరుతుంది.

వేదంలోని భాగాలన్నింటినీ తన వశంచేసికొన్న గురువు, పరమాత్మ స్వరూపాన్ని సరిగా మననం చేయని శిష్యుడికి, పదేపదే చెప్తూ, జ్ఞానకర్మ మార్గాలద్వారా పరమాత్మ దర్శనం కల్గుతుందని ధైర్యం చెప్పడం ఈ శ్లోకంలోని మఱో అంతరార్థం. ఇంకా విశేషముంది. అస్తు.

❀ ❀ ❀

# 28వ సర్గము

## మళ్ళీకొన్ని శుభ సూచనలు

'త్రిజట' కల కేవలం రాక్షస స్త్రీలే వినగా, అప్పటివరకూ తనని బెదిరిస్తూన్న వారి మాటలని తలచుకొని సీత, ఒంటరిగా విడిచిపెట్టబడిన బాలికలా విలపించసాగింది. ఓ రామలక్ష్మణులారా! "రావణుడు ఏ ప్రయత్నం చేసినా, నా హృదయం మారదు. ఇంక 2 మాసాలే గడువు. సముద్రంలో మునుగబోతూన్న ఓడలా ఉన్న నన్ను రక్షింపరా! మృత్యువే, ఆనాడు నన్ను మృగరూపంలో వచ్చి మోహపెట్టి ఉంటుంది. రాముణ్ణే, ఆ మీదట లక్ష్మణుణ్ణే పంపించేసాను. నేను ఎలా ఉన్నానో, ఏమని విలపిస్తున్నానో నీకు తెలియదు కదా రామచంద్రా!

ఈ స్థితిలో ఇలా ఏడవడం వలన, నా పాతివ్రత్యం అంతా కృతఘ్నునికి చేసిన ఉపకారంలా నిష్ప్రయోజనమేనా? 2 నెలలే గడువైన వనవాసాన్ని ముగించి, మీ అన్నదమ్ములిద్దరూ అయోధ్యకు వెళ్లి, ఆనందంగా స్త్రీలతో ఉంటారు. (1) మీమీద అనురాగం నా నాశనానికి కారణమైంది. విషంగానీ, ఆయుధంగానీ నా ప్రాణాన్ని తీసి కోవడానికి కావాలి. దాత ఎవరూ ఇక్కడ లేరే! అని పరమదీనంగా దుఃఖిస్తూ, నోరు ఎండిపోగా, శరీరం వణుకుతూండగా పూలు పూచిన ఇరుగుడు చెట్టు దగ్గరకు పోయింది. శోకంతో తపించిపోతూ, చెట్టు మొదట్లో నిలబడి, రాముణ్ణి ఇక చూడలేననే భయంతో, నిరాశతో, తన జడని ఆ చెట్టుకొమ్మకి వేసికొని, ఉరిపోసికోవాలని కొమ్మ పట్టుకొంది.

"తస్యాస్తు రామం ప్రవిచింతయంత్యా- రామానుజం స్వం చ కులం శుభాంగ్యాః (19)". ఒక్కమారు రాముణ్ణి, లక్ష్మణుణ్ణి, తన వంశాన్ని, పూర్వపు గొప్పదనాన్ని ఆలోచించసాగింది. అంతలో అనేక శుభ శకునాలతో ఆమెకు చెప్పలేని ధైర్యం కల్గింది.

### విశేషాంశాలు

(1) హృష్టాః ఖలు భవిష్యంతి రామస్య పరమాః "స్త్రియః"- "స్త్రీభి" శ్రమవ్యే- భుజౌ. పరమ "నారీణామ్"- అనే చోటుల్లో ఉన్న 'స్త్రీలు' అనే పదం వలన రామునికి అనేక భార్యలున్నట్లు, రాముడంటే గిట్టనివారు చెప్తారు. 'యజ్ఞేయజ్ఞేచ పత్న్యర్థం కాంచనీ జానకీ'- ప్రతి యజ్ఞమూ, బంగారు సీతా ప్రతిమని ఉంచి, రాముడు నిర్వర్తించాడు. కారణం ఏకపత్నీ వ్రతుడు కాబట్టి. రాజులకి-పరిచారికలు- అనే దాసీ జనం ఉంటారు. వాళ్లని 'స్త్రీలు' అనే మాటచేత గ్రహించాలి.

❀ ❀ ❀

# 29వ సర్గము

## వర్షానికి విత్తనం మొలకెత్తింది

సంపద కలిగినవాణ్ణి, సేవకులు-మేమంటే మేమని ఎలా చుట్టుముడతారో, అలా సీతమ్మని శుభశకునాలన్నీ చుట్టుముట్టాయి. ఎఱ్ఱని కనుకొలకులూ, చక్కని వంపు కనురెప్పలూ, తెల్లని కనుగ్రుడ్లూ, నల్లటి కనుపాపలూ కల ఆమె కళ్లలో, ఎడమ కన్ను, చేప దెబ్బతిన్న తామరపువ్వులా, అలా ఒక్కమారు అప్రయత్నంగా అదిరింది. రాముని చేతి స్పర్శ సుఖం ఎఱిగిన ఆమె ఎడమభుజమూ, అలాగే ఆమె ఎడమ తొడా అదిరాయి. ఆమె కట్టిన బంగారు రంగుచీర, పన్నగా జాఱింది కూడ.

ఎండకి, గాలికి పూర్తిగా ఎండిపోయిన విత్తనం, వర్షపు చినుకులకి తిరిగి మొలక ఎత్తినట్లు, ఈ శుభసూచనలు, ఆమెకు ధైర్యాన్ని కల్గించాయి. అప్పుడామె ముఖం, రాహువు ముఖం నుండి ఇవతలకు వచ్చిన చంద్రబింబంలా ప్రకాశించింది. ఎఱ్ఱనైన దొండపండువంటి పెదవీ, చక్కగా కన్పించే పలువరుసా, ప్రసన్నత నిచ్చే కళ్లూ కలిగి, ఆమె ముఖం, శుక్ల పక్ష చంద్రునిలా కన్పించింది.

### విశేషాంశాలు

అమ్మవారి శరీర అవయవాలని ఎందుకిలా వర్ణించాలి? అన్పిస్తుంది. అంగవైకల్య మనేది, పూర్వజన్మలో తెలియకచేసిన పాపానికి, ఈజన్మలో దుఃఖానికి కారణం. అయితే దుఃఖపడుతూన్న సీతమ్మకి ఏ అంగవైకల్యమూ లేదని చెప్పడం కోసం ఈ వర్ణనం.

నూతిలో పడ్డ పుత్రుని రక్షించడానికి, తల్లి కూడా దూకినట్లు, రావణుని చెఱలో ఎందఱున్నారో, వారివందఱినీ రక్షించడానికి, తానే లంకకి వెళ్లి రక్షిస్తోంది. వారికోసం దుఃఖిస్తోందిగాని, ఆమె దుఃఖానికి మఱేమీ కారణం లేదని వర్ణనవలన తెలియాలి. పైగా సీతమ్మ, హనుమకు ఎలా కన్పించిందంటే, ఈ విధంగానని, హనుమ దృష్టిలో సీతని చూపించేందుకూ, ఈ వర్ణన.

2. రాత్రికి పతి చంద్రుడు. రాత్రి, చంద్రునితో ప్రకాశించినట్లు సీతమ్మ ఉంది. అంటే, సీతకూడా పతితో కలియబోతోందని సూచన.

* * *

# 30వ సర్గము

## ఎలా పల్కరించాలి?... రామకథ ఉందిగా!

చెట్టు క్రింద, ప్రాణాలు వీడడానికి సిద్ధంగా ఉన్న సీతమ్మని చూచి హనుమ, ఇలా ఆలోచించసాగాడు (1)

"అసంఖ్యాకంగా వానరులు వెళ్లి, వెదుకదలచిన సీతమ్మ కన్పించింది. ఎత్తుకువచ్చిన రావణుని గొప్పదనాన్ని చూచాను. సీతకి, రామునిపట్ల ఉన్న అనురాగాన్ని మఱింత స్పష్టంగా చూచాను. ఇలాటి ఈమెను ఓదార్చి తీరాలి. లేకపోతే తనని ఓదార్చే వారెవరూ లేరని, ప్రాణత్యాగం చేయవచ్చు. అప్పుడు ఈ మొత్తం, వ్యర్థమౌతుంది. ఓదార్చకుండా, వెంటనే వెళ్లిపోతే, సీతమ్మ ఏం నాతో చెప్పమంది?" అని రాముడడిగితే - "ఏమీ మాట్లాడిరాలేదు" అననా? అప్పుడు రాముడు నన్ను దహింపడా?-

"యది వాచం ప్రదాస్యామి ద్విజాతి రివ సంస్కృతామ్-
రావణమ్మన్యమానా మాం సీతా భీతా భవిష్యతి ॥ (18).

అవశ్యమేవ వక్తవ్యం మానుషం కార్యమర్థవత్ । (19/2)
ఏషదోషో మహాన్ హి స్యాన్మమ సీతాభి భాషణే

ప్రాణ త్యాగశ్చ వైదేహ్యా భవేదనభి భాషణే (36)" -

పెద్ద శరీరం కలవాణ్ణి. వానరుణ్ణి. మనుష్యుడు మాట్లాడేటట్లు (ఇతర జీవులు లాకాక) మాట్లాడితేనే, ఆమె భయపడదు. బ్రాహ్మణునిలా సంస్కృతంలో పల్కరిస్తే నిశ్చయంగా 'రావణుడే' అని సంశయిస్తుంది. ఆ సంశయంతో అరిస్తే, రాక్షసులంతా చుట్టుముట్టి, నన్ను గమనించి పట్టుకొని బంధిస్తే, రామకార్యం చెడుతుంది.

అసలు మాట్లాడకుండా పోతే సీతమ్మ ప్రాణాలు విడుస్తుంది.

సీతకోసం వచ్చిన ఈ ప్రయాణమూ, వెదకిన ఈ రాత్రీ, వ్యర్థం కాకుండా, నేను మాట్లాడి వెడతాను. నా వలన కానిదే, మఱియొకరు, ఇంతగా రాలేరు. ఒకవేళ వీళ్లతో యుద్ధం జరిగితే, నేను గెలుస్తాను కాని, అవతలి ఒడ్డుకి వెంటనే పోలేను. గెలుస్తానో? లేనో? అనే విధంగానే యుద్ధం గుఱించి, పెద్దలు ఆలోచించమన్నారు. సరైన అవగాహనలేని దూత చేతిలో, పని ఏదైనా పాడైపోతుంది. ఏం మాట్లాడితే ఆమె వింటుంది? అని ఆలోచించి 'సీతా మనస్సు ఎప్పుడూ రామమయం కాబట్టి' నన్ను

నమ్మించుకోవడానికి, నామాటలు ఆమె వినడానికి, రామునికి తిరిగి జరిగింది చెప్పడానికి, నేను నమ్మిన రామకథని, నమ్మేటట్టుగా ఆమెకు చెప్పి, నమ్మిస్తాను" అని ఆలోచించి- చెట్టుకొమ్మ మధ్యకి వచ్చి - సీత వంక చూస్తూ, ప్రారంభించాడు రామకథని (2). అది కూడా సీతకే తెలిసే భాషలో (3).

## విశేషాంశాలు

(1) సీత ఉరివేసికోదలచి ఉందని తెలిసి, ఆంజనేయుడాలోచించసాగాడట. ఎవరైనా ఉరి వేసి కోదలిస్తే, ఆ ప్రయత్నాన్ని ఆపాల్సిన తాను, ఆలోచించటమేమిటి? అన్పిస్తుంది. దీనికి రెండు కారణాలు.

(i) తథాగతాం తాం వ్యథితా మనిందితాం- వ్యపేతహర్షాం పరిదీనమానసాం- శుభాం నిమిత్తాని శుభాని భేజిరే- నరం శ్రియా జుష్టమి వోప జీవినః (29/1) అనే క్రిందటి సర్గ శ్లోకం ప్రమాణం. ఆమె 'తథాగత' అంటే ఎలా ఉండాల్సి (నాటకంలో) ఉండాలో, అలా ఉన్నది. పైగా వాల్మీకి హృదయంలోనూ ఎలా ఉండాలో అలాగే ఉంది. హనుమ కూడా ఆమెను ఏ స్థితిలో చూడాలని, వైకుంఠంలో నిర్ణయింపబడిందో, అలా ఉంది. అంటే నాటకం సవ్యంగా జరుగుతోందని భావం. అలాటి ఆమెకు, శుభసూచనలు కన్పించసాగాయి. దుఃఖాతీత స్థితిలో, అసహాయ పరిస్థితిలో మరణాలోచన కల్గవచ్చు. అంతలో రక్షింపబడే సూచన కల్గితే, ఆ ఆలోచన రాదు. సీతమ్మకూడ అంతే. శుభసూచనలు కలిగాక, ఆత్మహత్య చేసికోవాలనే ఆలోచనపైపెట్టుదలకంటె, శుభనిమిత్తాలకి ఫలమెలా కన్పిస్తుంది? అనే ఆలోచనలో పడింది. ఆ విషయం ఆమె ముఖంలో గోచరించబట్టే, హనుమ-సీతమ్మకి ప్రాణత్యాగపు ఆలోచన లేదని గమనించి, ఆలోచించ సాగాడు. లేకుంటే, తప్పుతప్పు అనేవాడే.

(ii) అదీకాక, రాముడు, ఈమెని అరణ్యాంకి రావద్దన్నప్పుడు సీత పల్కుతూ "అహంగమిష్యామి.... అని ప్రారంభించి-తథా వియుక్తాం మరణాయ నిశ్చితామ్ - నయస్వ మాం సాధు కురుష్వ యాచనామ్" అన్నది. "నేను వనాంకి వెడతాను. మృగాంతోటి (మారీచుడు), వానరుం (అంగదాదులు) తోటి నిండి యున్న వనం (అశోకం)లో, మా నాన్న యింట్లో ఉన్నంత ధైర్యంగా, ఉంటాను. నిన్నేధ్యానిస్తూ ధ్యానిస్తూ మరణించబోయేంతటి కష్టాన్ని ఎదుర్కొన లేక చావుకై ప్రాల్పడుతూన్నప్పుడు నన్ను తీసికెళ్ళు" అంది. సీతమ్మ, మరణానికి పాల్పడబోతూండగా, హనుమ రావడంలో ఔచిత్యమిది. హనుమ రాకకూ, సీత ఆత్మహత్యానికి సంధానకర్త 'ఉరి'. ఆమె ఉరివేసి

కొవదని జగన్నాటకం ప్రకారం స్పష్టంగా తెలిపిన కారణం వలననే హనుమ రక్షించ డానికై కనీసం తొందరకూడ పడలేదు. దేవయాని నూతిలో ఉన్నప్పుడు, యయాతి వెంటనే రక్షింపక తెలుగు భారతంలో ఆమెని ప్రశ్నలు వేయడం ఉంది. నన్నయ మహాకవి దీన్ని గమనించే వ్రాసి ఉంటాడు.

2. సీత, 'ఉరి' వేసికొనేంత కష్టంలో ఉంది. ఆ కష్టానికి ఔషధం రామకథ. ఎంతోకాలంగా వెదికినా, కన్పడని ఆమె కన్పించినా, ఎలా మాట్లాడాలో తెలియని దశ హనుమది. దానికి ఔషధం రామకథ. రామ భక్తుడు హనుమ, శ్రీరామ తత్త్వాన్ని ముమ్మూర్తులా ఎఱుగున్న సీతమ్మకి, 'రామకథ'ని విన్పించడం అతని అదృష్టానికే అదృష్టం. రాముణ్ణి స్మరించి దూరంగా ఉండే రామభార్యకి, దగ్గఱ కాగలిగాడు హనుమ. రాముణ్ణి అనుమానించి (మారీచుడు రాముని కంఠధ్వనిలో అఱచినప్పుడు రాముడు మరణించి ఉంటాడేమోనని - తనని లక్ష్మణుడు పరిణయమాడాలని భావిస్తున్నాడేమోనని అనుమానించి - ఈ రెండూ నిజానికి నిజం కావు. నా అరణ్యకాండ వ్యాఖ్యలో వివరించాను.) దగ్గఱగా ఉండే లక్ష్మణస్వామికి, దూరం కాగల్గింది సీత. ఇద్దఱినీ కలిపేది రామకథ. ఇద్దఱిని విడదీసేది రామనింద. మరణించ బోయే సీతా దేహానికి ప్రాణం పోసినది రామకథ.

జటాయువు కూడా రామ రామ అంటూన్నంతసేపూ ప్రాణాలని ధరించే ఉన్నాడు. రాముడు వచ్చాక ఆయనతో విషయాన్ని వివరించాక ఇక రామ రామా అని అనవలసిన అవసరం అతడికి లేకపోయింది. కాబట్టి రామనామం రామ సమాగమాన్నీ, రామనామాన్ని పలుకక పోవడం ప్రాణత్యాగాన్నీ కల్గించింది. భగవంతుని కంటె భగవన్నామం గొప్పది.

3. సంస్కృతంలో మాట్లాడితే. రావణుడే వచ్చి ఉంటాడని ఆమె పల్కరించదు. నమ్మదు. ప్రాకృతంలో మాట్లాడితే కోతికి ఈ భాష ఎలా వచ్చు ననుకుంటుంది ? లంకా భాషలో మాట్లాడితే, రాక్షస స్త్రీలకి అర్థమౌతుంది-సీతకి తెలియనూ తెలియదు. కాబట్టి సీత పుట్టింటి దైన కోసల భాషలో మాట్లాడాలని భావించాడు. అది సీతమ్మకే తెలుసు. మిగిలిన ఎవరికీ తెలీదు. కోతి కిచకిచలాడుతున్నట్లు రాక్షసులకి అన్పిస్తుంది. పట్టించుకోరు. అనుమానం వస్తే, అడిగితే, అంతకు మించిన అదృష్టంలేదు. అందుకేగా ఈ ప్రయత్నమంతా!

❀ ❀ ❀

# 31వ సర్గము

## రామకథను వినిపించి, కనిపించిన హనుమ.

"రాజా దశరథో నామ రథకుంజరవాజిమాన్ - పుణ్యశీలో మహాకీర్తి ఋజు రాసీ న్మహాయశాః (1) ...... అ క్రోశం రాఘవస్యాహం సేయ మాసాదితా మయా (161)

చతురంగ బలాలు కలవాడూ, పుణ్యశీలుడూ, గుణశ్రేష్ఠుడూ, కీర్తి మంతుడూ దశరథుడనే రాజా ఉన్నాడు. అతని జ్యేష్ఠ పుత్రుడు రాముడు. చంద్రముఖుడూ, మంచి విలుకాడూ, తండ్రికి ప్రీతి పాత్రుడూ, తన క్షత్రియ ధర్మంతో అందరినీ కాపాడి, శత్రువులని భయపెట్టేవాడూను. తండ్రి మాటని శిరసావహించి భార్యా సోదరులతో వనవాసానికి వెళ్లాడు (1). అనేక రాక్షసులని సంహరించాడు. ఖరదూషణులనే వాళ్లు జనస్థానం (రాక్షసులకు రాజధాని వంటిది - అంతటి ప్రధాన స్థలం)లో ఉంటే, అక్కడే వాళ్లని రాముడు చంపగా, మాయా మృగ రూపంతో రావణుడు మోసపుచ్చి, సీతని అపహరించుకొనిపోయాడు. రాముడు సీతని వెదుకుతూ, సుగ్రీవుడనే వానరునితో స్నేహం చేసి, వాలిని చంపి, సుగ్రీవుణ్ణి రాజా చేసాడు. ఆయన ఆజ్ఞపై, వేలకువేలు వానరులు అన్ని దిక్కులూ సీతని వెదకడానికి వెడితే, సంపాతి అనే పక్షిచెప్పగా నేను 100 యోజనాల సముద్రం దాటి వచ్చాను. ఎలాటి దేహచ్ఛాయతో, సీత ఎలా ఉంటుందని రాముడన్నాడో, ఆమెనే ఇక్కడ చూస్తున్నాను" అని విరమించాడు. (2)

విశ్వాసం కలిగేలా - జరిగిన, జరుగబోయే - కథని చెప్పిన హనుమ కంఠధ్వని వచ్చే దిక్కుకై తలయెత్తి, భయంతో వృక్షపు కొమ్మలన్నీ చూచింది. ప్రక్కకీ, క్రిందికీ, పైకీ అలా చూస్తుంటే, (3) సుగ్రీవ మంత్రీ, ఉదయ సూర్యునిలా ఉన్నవాడూ, వాయుపుత్రుడూ, ఇంత వరకూ రామకథని వినిపించినవాడూ, అయిన హనుమ కనిపించాడు.

### విశేషాంశాలు

(1) రామకథని, రాముడూ, లక్ష్మణుడూ, సీతా, ఆంజనేయుడూ - ఇలా అందరూ విరాధుడూ, అగస్త్యుడూ, అనసూయా, సుగ్రీవుడూ, సీతమ్మల వద్ద చెప్పారు. కైకా వరాల విషయం వంటి ఘట్టాలలో నింద, లోపల ధ్వనించేలా,

సీతాలక్ష్మణులు చెప్తే, హనుమ, కైక మాటనే విడిచి తండ్రి ఆజ్ఞపై వచ్చాడు రాముడని అంటాడు.

(2) ఎదుటివారిని మాట్లాడించడానికి, వారిని మనవైపు త్రిప్పుకోడానికి, ఇంతకు మించిన ఉపాయం లేదు. ప్రత్యక్షంగా సీతతో మాట్లాడకపోయినా, మాట్లాడినంత ఫలితం సాధించిన హనుమ 'బుద్ధి'మంతుడు. 'మృత సంజీవనం రామచరితమ్' అంటారు. చనిపోయేవారిని బ్రతికించేది రామమంత్రమట. ఆ విషయం సీతమ్మ మీదనే నిరూపణకాగా, వేరే పరీక్షించాలా ?

"రక్షితా స్వస్యధర్మస్య-స్వజనస్య చ రక్షితా। రక్షితా జీవలోకస్య ధర్మస్య చ పరంతపః (7)"- 'ధర్మో రక్షతి రక్షితః' అని ఆర్యోక్తి. తాను ధర్మాన్ని రక్షిస్తే, ధర్మం తనని రక్షిస్తుంది. రాముడు, ముందు తన ధర్మాన్ని తాను రక్షించుకొంటాడు. దానిలో అతని స్వజనాన్ని ఆకర్షించుకోగలడు. రక్షించుకోగలడు. ఇలా తానూ, స్వజనమూ రక్షింపబడితే, లోక ప్రజలని రక్షించడం ఏ విధంగానూ కష్టంకాదు గదా ! ఆ విధంగా సర్వ విధాలుగా ధర్మాన్ని రక్షిస్తాడు రాముడు. అందుకే, ఆయన రూపంకట్టిన ధర్మం, ధర్మ-మూర్తి అంటే యిదే.

(2) సా తిర్య గూర్ధ్వం చ తథా హ్యధస్తా న్నిరీక్షమాణా తమచింత్యబుద్ధిం - దదర్శ పింగాధిపతే రమాత్యం - వాతాత్మజం సూర్య మివో దయస్థమ్। (19). పైనుండి ధ్వని వినబడుతూంటే క్రిందకీ, ప్రక్కలకీ సీత ఎందుకు చూడాలి ?

(1) పైకి చూచి, ఆనందంతో తొందరకలదై చూపు త్రిప్పి, క్రిందికి చూచి - ఇంకా ఆనందంతో అలా చూపు త్రిప్పేస్తోంది తప్ప, చూడలేకపోయింది.

(2) రామునిచేత పంపబడే వ్యక్తి ఎక్కడినుండైనా రాగల శక్తికల వాడౌతాడు. అందుకని అన్ని దిక్కుల పరిశీలనా చేస్తోంది. ఇక లంకలోకి రావడం, తోటలో ప్రవేశించడం వలన ఊహించ వీలులేని తెలివికలవాడు హనుమ (అచింత్యబుద్ధిమ్) కంఠస్వరంలోని మార్పువలన వానరుడనీ, రాజు, తానుగా దూత కృత్యానికిరాడు కాబట్టి, వానర మంత్రి (పింగాధిపతే రమాత్యమ్) అనీ - రామునికీ, అతని ద్వారా తనకూ ప్రాణాన్ని ధరింపచేస్తున్నాడు కాబట్టి సర్వ జీవులకూ ప్రాణం నిలిపే వాయు పుత్రుడనీ (వాతాత్మజమ్) - ఉదయ సూర్యుని ముందు అనూరు నిలా, రాముడు రాబోతున్నాడని చెప్పేవాడనీ, గ్రహించింది ఆమె.

❀ ❀ ❀

# 32వ సర్గము

## దేవతలారా ! సత్యాసత్యాలు చెప్పండి!!

"అహో౽భీమ మిదం రూపం వానరస్య దురాసదమ్ ।
దుర్నిరీక్ష్యమితి జ్ఞాత్వా పునరేవ ముమోహ సా॥ (3-4)"

కొమ్మల మధ్యన దాగిన మారుతిని సీత చూచింది.

తెల్లని వస్త్రం కట్టాడు.

బంగారపు కన్నులతో క్రిందికి చూస్తున్నాడు.

ప్రియాన్ని పల్కుతున్నాడు.

చూడ్డానికి వీలులేని తేజస్సుతో, వానరానికి ఉండని రూపంతో కన్పిస్తున్నాడు.

సీత బహువిధాలుగా తన వారిని పేరుపేరున తలచి రోదించింది. మళ్ళీ ఒకమారు ధైర్యం తెచ్చుకోవాలని చూచి, మూర్ఛపోయింది.

కొంత సేపటికి తేరుకొని "కలలో కోతికన్పించడం దోషం.

అయ్యో! ఏ దోషం రాబోతోందో ? సహోదరుడు రాముడూ, మా తండ్రీ క్షేమంగా ఉందురు గాక ! అయినా - నిద్రపోని నాకు కలరావడ మేమిటి ?

రామధ్యానాన్నే నిరంతరం చేస్తూ, ఆ ఆలోచనలోనే ఉండడం వలన ఈ రామకథా, ఈ రూపమూ కన్పించి ఉంటుంది - అయినా, మనసుతో ఆలోచిస్తే, భావన ఉండాలి గాని, రూపం కన్పిస్తుందా ?

పైన రూపం కన్పిస్తోందిగా ! చెప్పేది నిజమైన కథే కదా !" అని ఇలా పరిపరి విధాలుగా ఆలోచించి

"ఓ ! ఇంద్ర - బ్రహ్మ - అగ్ని దేవతలారా! నమస్కారములు.

ఈ వానరుడు ఏమేం చెప్తున్నాడో అదంతా సత్యమగుగాక!" అని దుఃఖిస్తూ ప్రార్థించింది.

❀ ❀ ❀

# 33వ సర్గము

## అమ్మా! నీ కథ చెప్పవూ ? – నా కథయిది...

హనుమ చెట్టుదిగి, సీతమ్మకు శిరసా నమస్కరించాడు. "ఓ దోషం లేనిదానా! దేవ, రాక్షస, నాగ, గంధర్వ, యక్ష కిన్నరులలో ఏ జాతి దానివి ? తామర పూరేకుల నుండి నీళ్లు పడేటట్లు కన్నీరు ఎందుకొస్తోంది ? చంద్రుని విడిచిన రోహిణివా ? వశిష్ఠునికి కోపం తెప్పించి, ఈ లోకానికి వచ్చిన అరుంధతివా ? నీ భర్త-పుత్రుడు-తండ్రి-సహోదరులు ఎవరు ? ఎవరైనా పరలోకానికి పోతే దుఃఖిస్తున్నావా ? శోకమూ - నిట్టూర్పులు విడవడమూ- నేలని ఆని నిలవడమూ- రాజ లక్షణాలుండడమూ వలన దేవతా స్త్రీవి కావులా ఉంది. కాని శరీరావయవాల సాముద్రిక శాస్త్రం బట్టి, రాజకన్యవే. జనస్థానం నుండి రావణుడు బలవంతంగా ఎత్తుకొని వచ్చిన సీతవేమో ? అనుకుంటున్నాను. నీ దీనత్వం – రూపం – తపసూ అన్నీ చూస్తే రామపత్ని వనిపిస్తోంది." అన్నాడు.

రామ ప్రసంగంతో సంతోషపడ్డ ఆమె వెంటనే "రాజశ్రేష్ఠుడూ, శత్రుతాపనుడూ అయిన దశరథుని కోడలిని. (1) జనక పుత్రిని. మహా బుద్ధిమంతుడైన రామపత్నిని. మామగారింట 12 ఏండ్లు మానవ సుఖాలని అనుభవించాను (2).

13వ ఏట రామపట్టాభిషేకం చేయదలచగా, మా పిన్నత్త కైకమ్మ "రామునికి పట్టాభిషేకం జరిగితే, తినను – త్రాగను – మరణిస్తాను – నాకు ఒకప్పుడు వాగ్దానమిచ్చిన వరం ప్రకారం రాముణ్ణి అరణ్యానికి పంపించు" అనగా, మాట తప్పలేని మా మామగారు చేసేదిలేక, మూర్ఛపడ్డాడు. తేరుకొని, భరతునికి రాజ్యాన్ని ఈయమని రాముని ప్రార్థించాడు. "ఏది అడిగినా లేదనని నా భర్త – వ్యర్థపరాక్రముడు కాక సత్యపరాక్రముడు (2) నా భర్త – తన ప్రాణరక్షణ కోసం కూడా ఇతరులకి అప్రియం చేయని నా భర్త – మనసుతో ముందుగానే నిశ్చయం చేసికొని, మాటతో సరేనని అడవులకి వచ్చాడు.

నేను ఆయనకంటె ముందుగా వనాలకి రాగా, మా యిద్దరికంటె ముందు సౌమిత్రి నారబట్టలని ధరించి, బయల్దేరాడు (3).

అలాటి, మేం దండకారణ్యంలో ఉండగా రావణుడు 'అపహరించి', ఇప్పట్నించి రెండు నెలలు మాత్రం బ్రతికే అవకాశం ఇచ్చాడు. ఆ మీదట నేనిక ఉండను" అని సీత

## విశేషాంశాలు

(1) స్త్రీ, ముందుగా తన మామగారి పేరు చెప్పి, అలాటి వారి కోడలిని, అని చెప్పాలి. తర్వాత తండ్రి-మీదట, తన పేరు, ఆ తర్వాత భర్త పేరూ చెప్పాలి.

మా మామగారు జీవించిలేని కారణంగా, ఇలా ఉన్నాననే అభిప్రాయం కూడ ఈ మాటల్లో ఉంది.

మా తండ్రికి, ఆయన దేహంపైనే మమకారం లేనంతటి, వైరాగ్యం. ఆయనను అని ప్రయోజనం లేదు.

ఇక రాముడున్నాడే - ఆయన 'ధీమాన్' - ఆలోచించి చేసేవాడు. నా దురదృష్టవశాత్తూ, ఆ 'బుద్ధి' నా విషయంలో ఇంకా పని చేయడంలేదు" అని భావం.

(2) సత్యమే పరాక్రమంగా కలవాడు - సత్యమైన పరాక్రమం కలవాడు- సత్యముచేత (పరా+ఆక్రమః) పరలోకాన్ని కూడా జయించ గలవాడు రాముడట. అదీ 'సత్యపరాక్రమః' అంటే.

(3) నిజంగా రాముని పిమ్మట లక్ష్మణుడు నారబట్టలని కట్టాడు.

సీతకి-లక్ష్మణునిమీద ఉన్న సదభిప్రాయం, తమకంటె ముందుగా నారబట్టలని లక్ష్మణుడు ధరించాడని చెప్పడంలో కన్పిస్తుంది. మారీచ వధ కాలంలో, లక్ష్మణుణ్ణి నిందించిన నింద అంతా, తనని అపహరింప చేసికొని, రావణ వధ చేయించాలనే ఆలోచనతో చేసినదే సుమా! అని ఇక్కడ తెలుస్తుంది.

లక్ష్మణుణ్ణి, వాని అమ్మకొడుకుగా, (సౌమిత్రి-సుమిత్ర పుత్రుడు) చెప్పడం వలన, సవతి కొడుకుతో తన కొడుకుని అరణ్యానికి పంపే ఔదార్యం ఏ తల్లికి ఉందో, ఆ తల్లి కొడుకు, అనే అర్థం వస్తుంది. ఆమె వాక్కులో 'వెళ్లు' అంటే, ఇతడు సౌమిత్రి కాబట్టి 'క్రియ'తో నారబట్టలు (ధరించనవసరంలేని) కూడ, ధరించాడని చెప్పింది. సీత, తాను 12 ఏండ్లపాటు మానవసుఖాలని అనుభవించానని చెప్పడం వలన, తాను మానవ స్త్రీకాదని గ్రహించాలి. మానవులు మానవ సుఖాలు కాకఏ సుఖాలు అనుభవిస్తారు? తాను దేవత కాబట్టి ఈ సుఖాలని 'మానవసుఖాలు' అని అనగల్గింది.

❀ ❀ ❀

# 34వ సర్గము

## నువ్వు సీతవే! – కాబట్టి నన్ను నమ్ము!!

హనుమ ఆమెను ఓదారుస్తూ "తల్లీ ! రామాజ్ఞతో వచ్చాను. ఆయన క్షేమమే. బ్రహ్మాస్త్రాన్నీ, వేద విద్యనీ ఎఱిగిన రాముడు నీ క్షేమాన్ని అడిగాడు (1). లక్ష్మణుడు నీకు శిరసా నమస్కరించాడు" అన్నాడు.

రామలక్ష్మణ క్షేమం చెప్పి తన క్షేమాన్ని అడగడం విన్న ఆమె, పరవశించి పోయింది.

'కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మే ।
ఏతి జీవంత మానందో నరం వర్షశతాదపి ।(6)

మారుతీ ! 'జీవించి ఉంటే నూరేళ్లకైనా, ఆనందం నరుణ్ణి పొందుతుంది' అనే నానుడి నాకు నిజమనిపిస్తోంది. ఎంత శుభప్రదమైన సామెత. (2) 'అని హనుమతో అంది.

అంతే' ఆమె తనని నమ్మిందని, హనుమ దగ్గఱకు వస్తూంటే,- అతడు రావణుడే- అని భయం కల్గి 'అయ్యో' ఎంతపిచ్చిపని చేసాను ! ఆలోచించకుండా అంతా చెప్పేసాను (3).

ఏ రూపమైనా వేసికొని రాగల వచ్చే రావణుడే, ఈ రూపంలో ఇప్పుడు వచ్చుంటాడు' అని భావించి ఆ చెట్టు కొమ్మ విడిచి నేలపై కూలిపోయింది సీత

భయంతో, మూర్ఛపడిన సీతని చూచి నమస్కరించాడు హనుమ. తేరుకున్నా, సీత తనని చూడడానికి భయపడుతూన్నట్లు గ్రహించాడు.

నమస్కారం చేస్తూనే నిల్చున్నాడు. ఆమె భయ నిరాశలతో హనుమని చూస్తూ 'మాయావి యైన రావణుడవే నువ్వైతే, ఒకసారి నన్ను వంచించావు గదా జనస్థానంలో. మళ్లీ వంచించడం న్యాయం కాదు ! ఉపవాసంతో కృశించిన నన్ను లేించవేయవద్దు (4)'.

వానరుడా ! కోతిని చూస్తే శుభం కలుగదాదు, కానీ నిన్ను చూస్తుంటే ఆనందం
కల్గుతోంది. నేను నమ్మాలంటే నా రాముని గుణగణాలు చెప్పు" అని పల్కింది (5)

ఇలా అడిగినా సీత మళ్లీ ఆలోచించింది.

"నన్ను రావణుడు తెచ్చి చాలకాలం అయింది. వానరుడు కలలో ఇప్పుడు కన్పిస్తున్నాడు. కలలో కూడా రామలక్ష్మణులు కన్పించడంలేదు. కలకి కూడా నామీద పగయే.

వానరుడు స్పష్టంగా కన్పిస్తూండడం బట్టి, ఇది నిజం కాని, కలకాదు. ఇలా కన్పడడానికి ఉపవాసాలూ, మోహం, ఉన్మాదం ఇవీ కారణాలు. కానీ, అవి కాదు." అని ఆలోచిస్తూన్న సీతతో, హనుమ నమ్మబలుకుతూ ఇలా అన్నాడు.

"అమ్మా! సూర్యునివంటి తేజస్సూ, చంద్రునివలె లోకాహ్లాదకత్వం, కుబేరునిలా అధిపతిత్వం, విష్ణువులా విక్రమ సంపన్నతా, బృహస్పతిలా సత్యశీలతా, కలిగి, ఎవరిపై ఎప్పుడు కోపం తెచ్చుకోవాలో తెలిసినవాడు రాముడు.

అతణ్ణి ఆశ్రయించి మనం క్షేమంగా ఉన్నాం.

అలాటి వాణ్ణి మోసగించిన ఫలం రావణుడు పొందకమానడు. రాముడూ, లక్ష్మణుడూ, సుగ్రీవుడూ వారివారికి తగినట్లు కుశలమడిగారు. కొద్ది రోజుల్లో రామలక్ష్మణులు, సుగ్రీవునితో, వానర సమూహ సహాయంతో రావడం చూస్తావు.

నేను సుగ్రీవ మంత్రిని హనుమంతుణ్ణి. రావణుని తలపై నా పాదాన్ని, (లంకా నగరంలో ఎడమకాలిని) వాణ్ణి ధ్వంసం చేయాలని పెట్టాను. మాయావిని కాను, వానరుణ్ణి.

సందేహింపక నమ్ము.

## విశేషాలు

(1) అస్త్రాలన్నింటిలోకి ఉత్తమం బ్రహ్మాస్త్రం. కానీ దాన్ని ప్రయోగించడానికి ధర్మాధర్మాలూ, సమయ-అసమయాలూ, సందర్భ అసందర్భాలూ తెలియాలి. అవి తెలియాలంటే వేదాలని ఎఱుగుండాలి. అలాటివాడు రాముడు కాబట్టి, వ్యర్థంగా ప్రయోగించడని భావం.

(2) కష్టాలు సహజమనీ, ఆశతో జీవించి ఉండాలనీ ఉపదేశించడం భారతీయ ధర్మం. 'మంగళాదీని' మంగళ మధ్యాని, మంగళాంతాని చ.... ప్రతికావ్యం ప్రారంభంలో శుభం, మధ్యలో శుభం, చివరలోనూ శుభం కలిగి ఉండాలనేది మన సంప్రదాయం.

'Tragedy' అనే పేరిట, చావుతో అంతం చేసే సిద్ధాంతం అప్రాచ్యులది. ఇక 'చావు సంఘటన'తో పుస్తకాన్ని ప్రారంభించి, పరిశోధన మొదలైనవి చేయడం భారతీయ విధానం కానేకాదు.

'ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః' అనేది మన సూత్రం. అందుకని సీత అంటోంది 'ఆనందం నరుణ్ణి పొందుతుంది' అని.

నరుడు, ఆనందాన్ని పొందుతాడు అనక, పై విధంగా అనడంలో విశేషం ఉంది.

ఆనందం కానిది దుఃఖం. ఆనందం లేనివాడే, జన్మ ఎత్తుతాడు. 'బహూనాం జన్మనామంతే' ..... అనేక జన్మలయ్యాక నరుడు పరమాత్మాను గ్రహంతో ఆయనను చేరుతాడు.

పరమాత్మ - ఆనంద స్వరూపం. అక్కడితో జీవన వలయం పూర్తి అవుతుంది. అందుచేత జీవితంఆనందంతో ముగుస్తుంది. ఆనందమయుడైన భగవంతుడు, నరుణ్ణి తనలోకి పొందింప చేసుకుంటాడని భావం.

అలాగే భగవంతుడైన రాముడు తనని (సీతను) తెచ్చుకుంటాడని అర్థం.

(3) 'సుందరకాండ', అని పేరు పెట్టడంలో ఔచిత్యం ఇది కూడా - జరిగిన మొత్తం కథ ఆంజనేయుడు చెప్తాడు. జరుగబోయేది త్రిజట చెప్పింది. జరుగుతున్నదీ, జరిగినదీ, సీతమ్మ చెప్పింది.

బాల కాండ కథ నుండి యుద్ధ కాండ వరకు మొత్తం కథని అంటే మొత్తం రామాయణాన్ని ఆతడు వినడం, ఎంతటి అదృష్టం ! ఆ అదృష్టశీలి హనుమ. భగవంతుడే, భగవంతుని గూర్చి, - గానం చేయడంవల్లి కదా, భగవత్-గీత అయింది ! అలాటిదే ఇక్కడ సీత చెప్పడం కూడ.

(4) తపశ్శక్తి పెంచుకోవాలని ఉపవసించి జపించి శారీరకంగాచిక్కిపోయాను. ఆ అధిక తపశ్శక్తితో శపిస్తే హతుడై పోగలవు - అని హెచ్చరిస్తున్నట్లుగా పైకి చెప్పు.

'నేనేం భయపడడం లేదు - రావణుణ్ణి భయపెట్టేంత తపశ్శక్తి ఉన్నది సుమా!'

అని సూచించడం సీత భావం.

* * *

# 35వ సర్గము

## రాముని రూపంతో పాటు నా స్వరూపం కూడా విను!

'కీదృశం తస్య సంస్థానం రూపం రామస్య కీదృశమ్ ? - కథ మూరూకథం బాహూ లక్ష్మణస్య చ.శంస మే। (4)'. సీతమ్మ రామ కథని విని హనుమతో 'వశిష్ఠ విశ్వామిత్ర శిష్యులూ, నరులూ అయిన రామలక్ష్మణులకీ -విద్యాబుద్ధులు రెండూలేని వానరాలకీ, సమాగమం ఎలా కల్గింది ? నేను నమ్మాలంటే రామలక్ష్మణుల ఆకార స్వరూపం చెప్పు - రామలక్ష్మణుల చేతులూ, తొడలూ ఎలా ఉంటాయో చెప్పు' అంది.

(1)'జానంతీ బత దిష్ట్యా మాం వైదేహి పరిపృచ్ఛసి (6) 'అమ్మా ! నువ్వు నన్ను తెలిసి అడుగుతున్నావు (2). చెప్తా విను, అని, ఇద్దరి లక్షణాలనీ చెప్ప ప్రారంభించాడు హనుమ.

రామః కమల పత్రాక్షః సర్వసత్వ మనోహరః।
రూపదాక్షిణ్య సంపన్నః ప్రసూతో జనకాత్మజే। (8)

చూచే వారి చూపులద్వారా మనస్సుని ఆకర్షించి, మన్మథుడి మనస్సునికూడ మథించి వేయగలవాడూ, ఆనందాన్నిచ్చేవాడూ, తాను చూడనివాణ్ణి, తనని చూడని వాణ్ణి దిగులుపఱచే వాడూ రాముడు. ప్రవాహాన్ని చూస్తూ వెళ్లిపోయే చూపులు పద్మం కన్పడగానే ఎలా ఆగిపోయి పరిశీలిస్తాయో, అలాటి కన్నులు రామునివి. చంద్రునికి ప్రతి 15 రోజులకి హెచ్చుతగ్గులుంటాయి. కమలం సూర్యుణ్ణి బట్టి నిశ్చలంగా ఉంటుంది. అందుకని, రాముడు కమలాక్షుడు కాని చంద్రాక్షుడు కాదు.

ఎంతటి వస్తువు విలువైనా కూడా గ్రహించలేని జాతి, మా వానరజాతి. రూపం, ఔచిత్యం ఎఱుగనివాళ్లం. అయినా, మా మనస్సుతో పాటు ఇతర జాంబవంతుడు మొదలైన ఎలుగుబంటుల, సంపాతి మొదలైన పక్షుల, గుహుడు మొదలైన నిషాదుల, మనస్సుని కూడా హరించేవాడు రాముడు.

శరీరాని కుండే రూపం, ఆత్మకి ఉండే దాక్షిణ్యం - ఈ రెండూ కలవాడు. ఈ గుణాలన్నీ, పుట్టాక తెచ్చుకొన్నవి కాదు. పుట్టుకతోనే కలిగి పుట్టాడు కాబట్టి, పరిస్థితుల ప్రభావం వలన నశించేవి కావు. ఇటువంటి లక్షణాలున్న మఱియెవరైనా ఉన్నారా ? అంటే 'తుల్యశీలవయోవృత్తామ్....' సరిగా నువ్వు తప్ప వేఱెవరూ లేరు. పురుషులలో అతడు, స్త్రీలలో నీవు. (వియోగం కల్గాక పురుషుడై ధైర్యం వీడి దుఃఖిస్తూ స్త్రీలా అతడుంటే, రావణ వనంలో ఉండి, స్త్రీయైనా పురుషునిలా భయంలేక నువ్వున్నావు.

దీనిక్కారణం, ఆయన 'ప్రసూత'. జన్మలేకుండా ఉండేవాడు, తల్లి గర్భం నుంచి పుట్టాడు కాబట్టి. నీవు అయోనిజవి కదా !) ఉపకారీ, యజుర్వేద శాఖాధ్యాయీ, వేదాలు సంపన్నుడూ రాముడు. సామాన్య విద్య (General Education) అయిన వేదాలలోనూ వృత్తివిద్య (Professional Education) అయిన ధనుర్విద్యలోనూ, మహా పండితుడు. వెడల్పై ఆకర్షణీయమైన తలా. మూడు రేఖలు కల శంఖాకారపు మెడా, పొడవైన భుజాలూ, బారైనచేతులూ, నీల మేఘపు రంగూ కలవాడాయన. వక్షస్థలం, పిడికిలీ దృఢంగా ఉన్నవాడూ, కనుబొమలూ, బాహువులూ, వృషణాలూ సమంగా ఉన్నవాడూ – మోకాళ్లు, తల వెంట్రుక కొనలూ, వృషణాలూ సమంగా ఉన్నవాడూ – పొట్ట, బొడ్డు చుట్టు భాగమూ, హృదయమూ ఎత్తుగా కలవాడూ – కను చివరలూ, గోళ్లు, అఱచేతులూ ఎఱ్ఱగా ఉన్నవాడూ – పాదరేఖలూ, తల వెంట్రుకలూ, లింగమణి నునుపుదనం కలవాడూ–కంఠస్వరమూ, నడకా, బొడ్డులో లోతూ కలవాడూ – పొట్టపై 3 ముడుతలున్నవాడూ – స్తనములూ, వాటి మొనలూ, పాదరేఖలూ లోతుగా ఉన్నవాడూ – నరాలు కన్పించని పాదాలూ, ప్రతిరోమ కూపంలోనూ వెంట్రుక కలవాడూ, దీర్ఘము కాని లింగము కలవాడూ – కొంచెం అధికముగా లేని పొత్తికడుపు వాడూ –3 సుడులున్న శిరసువాడూ – వేలిబొటన వ్రేలి మొదట 4 రేఖలున్న వాడూ – నుదుటిలో, పాదమునందూ 4 చొప్పున రేఖలు కలవాడూ, 4 మూరల పొడుగువాడూ – సింహ – శార్దూల –గజ – వృషభముల నడక వంటి నడక కలవాడూ (బాణయుద్ధం –వాగ్యుద్ధం – అనుగ్రహం – శ్రమకి ఓర్చడం వంటి 4 కాలాల్లో 4 నడకలు), ధర్మార్థ కామాలని త్రికాలాల్లోనూ ఆచరించేవాడూ రాముడు. సౌందర్యంలో, గుణగణాల్లోనూ, లక్ష్మణుడు రామునిలా ఉన్నా, శరీరచ్ఛాయలో మాత్రం ఈయన బంగారపు వన్నెవాడు. నీ కోసం భూమి అంతా గాలిస్తూ, తిరుగుతూంటే, భయపడ్డ సుగ్రీవుడు నన్ను చారునిగా పంపాడు. నేను వారిని ఒప్పించి, వీపుమీద ఎక్కించుకొని (3) సుగ్రీవుని వద్దకు తెచ్చాను.

నిన్ను రావణుడూ – సుగ్రీవ భార్యను 'వాలి' అనే అతని అన్నా – ఎత్తుకుపోయిన కారణంగా, ఇద్దఱి దుఃఖమూ సమానమని ఒకరికొకరు విని ఓదార్చుకున్నారు. నీవు పాఱవైచిన ఆభరణాలని, వానర శ్రేష్ఠులు చూపగానే, రాముడు మూర్ఛ పోయాడు. సీతమ్మని, రావణుడే ఎత్తుకుపోయాడని రామునికి అర్థమైంది. పరభార్యని అపహరించిన 'వాలి'ని చంపాక, రాముడు సుగ్రీవుణ్ణి రాజుచేసి, వాలి పుత్రుణ్ణి అంగదుణ్ణి యువరాజు చేసాడు. నిన్ను వెదికించడానికి అన్ని దిక్కులకి వానరాలని, నెలలోగా వెదకిరావాలని, సుగ్రీవుడు. పంపాడు దక్షిణ దిక్కు సేనా నాయకుడైన అంగదుని వెంటనే వచ్చాను. మేం త్రోవ తెలియక చిక్కుపడ్డాక, సమయం గడిచిపోయాక, మా వానరాల్లో

భేదాభిప్రాయం వచ్చింది. సుగ్రీవుడు, కాలనియమం దాటిన కారణంగా వధిస్తాడని, మేం ప్రాయోపవేశం చేసి నేలమీద పరుండి (4) చర్చిస్తుండగా, జటాయు సోదరుడు 'సంపాతి'విని నీ వార్తని చెప్పాడు. జరిగిన కథ అంగదుడు చెప్పగా, తన తమ్ముడైన జటాయువును రావణుడు చంపినందుకు చాల దుఃఖించిన సంపాతి, నీ జాడ చెప్పగా ఇక్కడికు వచ్చి నిన్ను చూడగలిగాను. సముద్రాన్ని దాటడం, అనే ఈ మహాకార్యం నీవు కన్పించినందువల్ల సఫలమైంది. నిన్ను చూచిన కీర్తి నాకు దక్కింది.

ఇక నా కథ. 'కేసరి' అనే వానరుడు, ప్రసిద్ధమైన మాల్యవంత పర్వతంలో నివసిస్తూ, ఆ ప్రదేశం వదలి గోకర్ణానికి పోయి, దేవర్షుల ఆజ్ఞపై శంబసాదనుడనే రాక్షసుణ్ణి చంపాడు. ఆ కేసరి భార్య అంజనికి, వాయు దేవుని అనుగ్రహం వల్ల నేను జన్మించాను. హనుమానితి విఖ్యాతః లోకే స్వేనైవ కర్మణా (82) – నేను చేసిన బాల్యచేష్ట వలన నాకు హనుమంతుడని పేరు (5). ప్రభావంలో వాయువుతో సమానుణ్ణి." అని రామకథనీ, తన జన్మవృత్తాంతాన్నీ చెప్పి ముగించాడు మారుతి.

## విశేషాంశాలు

### రామలక్ష్మణుల తొడలని గూర్చి చెప్పమని సీత అడగడం అనౌచిత్యమా?

1 & 2) క్రొత్తగా కనిపించిన పురుషుడు హనుమ. అతనితో సీత మాట్లాడడమే తప్పుగా భావించే కాలం, అది. మాట్లాడినా ఔచిత్యవంతంగా ఉండాలి ! నా రాముని తొడలెలా ఉంటాయని అడగడమే ఒక తప్పు. పైగా, లక్ష్మణస్వామి తొడలు ఎలా ఉంటాయి ? అని అడగడం ఇంకా దోషం. ఇదంతా ఒక నూతన పురుషునితో సంభాషణ.

పోనీ సీతమ్మ అడిగినా, హనుమ 'తప్పు' అనాలిగదా! అలా అనకుండా చెప్తానని పల్కి చెప్పబోయి, 'తెలిసి అడుగుతావేం?' అన్నాడు. ఇదో గట్టిమాట. ఆమెకు రామలక్ష్మణ స్వరూపం తెలుసు, కాబట్టే అడిగింది. హనుమ చెప్పేదానితో, ఆ స్వరూపం సరిపోతే, హనుమ చెప్పింది నిజమని భావించేందుకే, అడిగింది. 'తెలిసి అడుగుతున్నావేమి ?' అని హనుమ అనడంలో, ఆమెకు తెలియకపోతే, తాను రామ స్వరూపాన్ని చెప్పాలని భావనయా? సీతకి ఎలా తెలిసి ఉండదని, హనుమ అనుకున్నాడు? అందుకని, దీని అసలు అర్థం, వేఱుగా ఉందని తోస్తుంది.

హనుమ రామలక్ష్మణుల ముఖాన్నీ, వక్షఃస్థలాన్నీ బాహువులనీ, పాదాలనీ చూచి ఉంటే, చూచి ఉండ వీలుంది కాని, తొడలూ, ఇంకా మర్మావయవాలూ తెలిసే అవకాశం

లేదు. చూడడం ఎంత అనౌచిత్యమో, స్త్రీ ముందు చెప్పడం ఇంకెంతటి అనౌచిత్యమో, తెలియని బుద్ధిహీనుడు కాడు మారుతి. సాముద్రిక శాస్త్రం వ్యక్తుల లక్షణాలని చెప్తుంది. ఏయే జాతివారు ఎలాఎలా ఉంటారో ఆ విశేషా లన్నింటినీ, (రామలక్ష్మణుల ముఖాలనీ, బాహువులనీ, వక్షఃస్థలాలనీ గమనించి, సాముద్రిక శాస్త్రం ప్రకారం, వారు ఏ జాతికి చెందినవారో) గమనించిన మారుతి, మిగిలిన లక్షణాలని శాస్త్రం తెలిసినవాడు కాబట్టి చెప్పాడు. ఆమెకూడా ఇందుకే అడిగింది. 'ఈ దూత చూచినదే చెప్పగలడా ? లేక ఇంగితం కలవాడై, తగినంత ఆలోచన చేయగలడా ? లేదా ?' అని గ్రహించడానికే.

సాముద్రిక శాస్త్రం, జ్యోతిషమనే రెండూ, పక్షికి రెండు రెక్కలవంటివి. సహజంగా ఒకటి వచ్చిన వారికి, రెండవది తెలియక మానదు, చదవకపోయినా, జాతకాన్ని బట్టి వ్యక్తి ఆకారం, తీరుతెన్నులూ గమనించి, దాని ద్వారా సాముద్రిక విశేషాలని తెలుసుకోవచ్చు. అలాగే వ్యక్తి ఆకారమూ, తీరుతెన్నులని బట్టి జాతక విశేషాలనీ గమనించవచ్చు. రాముని సాముద్రిక విశేషాలని, చూడనివాటిని కూడ చెప్పగలిగిన ఇతడు, జరిగిన విశేషాలని కాక, జరుగబోయే విశేషాలనికూడ ఎఱుగగలడు కదా !" అని తన మనస్సును దృఢపఱచు కొనేందుకే సీతమ్మ యీ ప్రశ్న వేసింది.

'తెలియించునగోచరార్థ విజ్ఞానము - లోకుంకు అక్షి శాస్త్రము' అని సూక్తి. శాస్త్రం-తెలియనిదీ, కనిపించనిదీ అయిన దాన్ని కూడ చెప్పగలదు. కన్ను వంటిది శాస్త్రమని దీని భావం. కన్ను తెరిస్తే ప్రత్యక్ష రూపదర్శనం, కన్నుమూసి ఆలోచిస్తే మనస్సు చెప్పే రహస్యం, తెలుస్తుంది. అందుకని, "సీతా యథార్థ స్వరూపమేమిటో, రాముని నిజరూపమేమిటో, లంకకి రావడంలోని రహస్యం ఏమిటో, అన్నిటినీ తెలిసినవాడివే నీవు," అని, నాకు తెలియాలి సుమా! అని సీత, హనుమకు చెప్పడంలోని రహస్యమే ఈ అడగడం.

తన గొప్పదనం గుర్తుండని శాపం మారుతికి ఉంది. ఆ కారణంగా, ఆతని యథార్థ స్థితిని అతనికి గుర్తుచేయాలి కదా! ఆ గుర్తుచేయడం నర్మగర్భంగా ఉండాలని భావించిన సీత, ఇలా ప్రశ్నింపగానే, హనుమకి యథార్థం గోచరించింది. కాబట్టి "జానంతీ బత దిష్ట్యా మాం వైదేహి పరిపృచ్ఛసి" - తెలిసి అడుగుతున్నావా? అని పలికి, సీత విషయం సీతకి తెలుసునని తనకి తెలుసనీ, తన విషయం సీత గ్రహించినట్లూ తాను గ్రహించాననీ పలికి, అనుమాన నివృత్తికై తన జన్మవృత్తాంతం కూడ చెప్పి, నా విశేషం మరిచిపోలేదు సుమా! అని, తన మఱపును మఱచానని, స్పష్టంగా సీతకు తెలియచెప్పూ, అందఱికీ లోతుకు వెళ్లి ఆలోచిస్తేనే తెలిసేలా చెప్పాడు. కాబట్టి, రావణ వధ జరుగుతుందని, సీత భయపడడం వట్టి నటన అని, ఉభయులకి తెలిసినట్లు, ఉభయులూ గుర్తించారు.

...వుతోంది, ఈ విషయం మనసులో ముందుగానే తెలిసినవాడు హనుమ కాబట్టే, ... ప్రాణత్యాగం చేయదలచి ఉన్నా భయపడక చెట్టుపై నుండి చూస్తూనే ఉన్నాడు. ...యితే లౌకిక విషయంగా, తాను భయాన్ని నటించక పోతే దేవరహస్యం ...యిపోతుంది. లోకంలో, నిజంగా ఇలాటి కష్టంలో ఉన్నవారి విషయంలో ... వచ్చిన ప్రతివ్యక్తి, ఎలా ప్రవర్తించాలో, అలాటి వారికి, తన ప్రవర్తన మార్గదర్శకం ... కదా! అందుకే, అతి జాగ్రతలో ప్రవర్తిస్తాడు మారుతి.

జరగబోయే విషయం తెలిసి, తెలియనివానిలా నటిస్తూ, మనకి ప్రవర్తన ఎలా ...లో చెప్పే వారు వాళ్లు. రాబోయేది తెలియక, తోచినట్లు చేస్తూండేవాళ్లం మనం. అందుకే వారు పరమ-ఆత్మలు. మనం జీవ-ఆత్మరూపులం. జీవాత్మరూపులంకి, ...లోకం (ఈ లోకం)లో ఉండే రహస్యాల వఆకే తెలుస్తాయి. పరమాత్మ రూపులంకి, ... ఇక్కడికి ఎందుకు వచ్చి, ఎందుకిలా నటిస్తోంది ? దాని అవసరమేమిటి? అనే విషయం కూడ తెలుస్తుంది.

పరమాత్మని కూడ, జీవాత్మగా గమనించి త్రాళ్లలో కట్టేయ దలిచిన వాడు-దుర్యోధనుడైతే, జీవాత్మగా కన్పిస్తున్న పరమాత్మని, పరమాత్మగానే భావించి ధన్యులైనవారు భారతంలో భీష్మాదులు - శ్రీమద్రామాయణంలో గుహుని దగ్గఆ నుండి విభీషణుని వఆకూ అందఆూ. రాముణ్ణి, ముందు జీవాత్మరూపునిగా త్రిజట భావించి, పరమాత్మరూపునిగా తర్వాత తెలిసి కొన్నది. ఇంతకీ సీతా హనుమల సంభాషణ ...ంశం, ఆ యిరువురూ ఒకరికొకరు, పరమాత్మ కర్తవ్యాన్ని చేయడానికి వచ్చినవాళ్లమని తెలిసి కోవడమే.

ఇక తోడలనిగూర్చి సీతమ్మ ప్రశ్నించడంలో లౌకిక సమాధానం - 'సరిగా ... లేకుండా పడిఉన్న లంకాస్త్రీలని చూచికూడా, మనో వికారాన్ని పొందని ...డైన మారుతిని, రామలక్ష్మణులని గూర్చి ఇలా ప్రశ్నిస్తే, తన విషయంలో ...డా?' అనేది.

ఒకే విష్ణువు 4 గురిగా జన్మించాడనే రహస్యం హనుమకి తెలిసి ఉన్నట్లైతేనే ... వేఆవేఆగా వర్ణించడు అని భావించి సీత ప్రశ్న అడిగితే ఇద్దఆనీ కలిపే వర్ణించి, ... వచ్చిన సమాధానం అందించి రామలక్ష్మణులిద్దఆూ ఒకే అవతారమూర్తులని ... తెలుసునని నిరూపించాడు హనుమ. అంతేకాదు అలా అమ్మవారు అడగడం ...కావేకాదని లోకానికి చాటాడు కూడ.

(2) యుద్ధంలో పడిపోయిన లక్ష్మణుణ్ణే ఎత్తలేక పోయాడు రావణుడు. హనుమ రామ లక్ష్మణులని ఇద్దఆనీ వీపుమీద ఎక్కించుకొన్నాడంటే 'భక్తి' దానికి కారణం. పెద్ద

త్రాళ్లతో బంధింప వీలులేకుండా విశ్వరూపం చూపి లొంగని శ్రీకృష్ణుడు, యశోదమ్మకి మూరెడు త్రాటితో లొంగిపోయి బంధింపబడ్డాడు. అది తాడు కాదు. భక్తి సూత్రం. ఇక్కడా అంతే కారణం. ఈ విషయం సీతమ్మ గ్రహించడానికే, ఇలా చెప్పడం.

(3) వానరులంతా ప్రాయోపవేశం చేసారని మాత్రమే చెప్పాడు కాని, ఆ సమయంలో వాళ్లని ఒక త్రోవకి తెచ్చి, అందరినీ సీతాన్వేషణానికి వచ్చేలా చేసినది తాను. ఆ విషయం చెపితే, ఎక్కడ, తనని తాను పొగడుకొన్నట్లు ఔతుందోనని, కావాలని చెప్పకండా దాటవేసినంతటి ఉదాత్తుడు హనుమ.

(4) తన హనుమ (దౌడ) విఱుగడానిక్కారణం ఇంద్రుని వజ్రాయుధం. అది తనమీద ప్రయోగింపబడడానిక్కారణం సూర్యుణ్ణి మ్రింగబోవడం అంతటి మహాకార్యం చేసిన తాను, ఆ పనిని చెప్పుకోవక పోవడం, ఆత్మ ప్రశంస ఔతుందేమోనవే భయంతో తనని తాను పొగడుకోనివాడూ, తన గొప్పదనాన్ని ఎవరైనా చెప్పితే తప్ప గుర్తురానివాడూ, ఎంతో మహాకార్యం చేసికూడా 'అది రాముని చలవ' అని పలికేవాడూ అయిన హనుమ, ఈ లోకంలో అందరికీ, ఆదర్శ ప్రాయుడు.

**అయ్యవారి పరీక్ష–అమ్మవారి పరీక్ష :** మొదటగా అయ్యవారిని మారుతి, భిక్షుకరూపంతో దర్శించి, రూపంమార్చి, వీపు నెక్కించుకుని సుగ్రీవుని వద్దకుతెచ్చాడు.

మొదటగా అమ్మవారిని మారుతి, మాఱురూపంలో కాక, నిజరూపంతోనే దర్శించాడు. తరువాత రూపం మార్చి వనం ధ్వంసం చేసి, వీపు నెక్కి రమ్మని అమ్మవారిని ప్రార్థించి, రానంటే, వార్త సుగ్రీవుని వద్దకు తెచ్చాడు.

మారుతిని, సర్వవేద పండితునిగా మొదటి మాటల్లోనే గుర్తించి, 'బుద్ధి' అనే విషయంలో (Subject) నూటికి నూఱు అంకాలనీ (Marks) వేశాడు రాముడంతటి పరీక్షాధికారి. అమ్మవారు 'రామసౌందర్యం' అనే విషయంలో పరీక్షపెట్టి, తానూ నూటికి నూఱు వేసింది. ఇద్దరి పరీక్షలోనూ నెగ్గినవాడు హనుమ. బుద్ధి పరీక్షవలన, ఎదుటి రావణుని బుద్ధి తెలిపి ప్రవర్తించి, దుర్మార్గునిగా వానివి లెక్కగట్టి, మనకు కార్యసాధకుడే ఔతాడని రామభావన. సౌందర్య పరీక్షవలన, రామ సాముద్రిక విశేషాలు తెలిపినట్లే, రావణ సాముద్రిక విశేషాలూ తెలిపి, ఎవరు రాజా కాగలరో, ఎవరికి నాశనం ఉందో గ్రహించి ధైర్యంగా పోరాడగలడనీ, లంకలోని సౌందర్యం–సీతా రామ సౌందర్యం ముందు దిగదుడుపని హనుమ గ్రహిస్తాడనీ సీతా భావన. అంతే అయింది చివరికి.

సీత 'సౌందర్యపరీక్ష పెట్టడానిక్కారణం రావణుడు 'సుందరుడు' కాబట్టి. హనుమ సమాధానం చెప్పుతూ సరిగ్గా సీతా అభిప్రాయాన్నే 'సర్వసత్వ మనోహరుడు, రూపదాక్షిణ్య సంపన్నుడు రాముడే, అని పలికి, రావణుడు కాడని, తేల్చి చెప్పాడు. అందుకే "సౌకారో

నిస్ప్రహో వాగ్మి నానా శాస్త్ర విచక్షణః - పరచిత్తావగంతా చ రాజ్ఞాం దూతస్స ఇష్యతే" అంది పంచతంత్ర గ్రంథం. రూపసీ, దేనియందూ 'కావాలనే' బుద్ధిలేనివాడూ, వాక్చతురుడూ, శాస్త్ర విచక్షణ శీలీ, మాత్రమే దూత కార్యానికి అర్హుడని దీనిభావం.

## రాముని కథలో హనుమ తన కథని ఎందుకు చెప్పుకోవాలి?

రాముని రూపాన్ని సీతమ్మ అడిగితే, దానితోపాటు తన జన్మకథని కూడా ఆంజనేయుడు ఇక్కడ చెప్తాడు. ఎవరు అడిగారట ?- ఇలాచెప్పడానికి కారణం (1) రాముని రూపాన్ని చెప్పేతాను సామాన్యుణ్ణికాదనీ, నమ్మదగినవాణ్ణేననీ సీతమ్మని నమ్మింప చేయడానికి - (2) తనని కష్టం నుండి ఇతడు దాటించగలడనే ధైర్యాన్ని ఆమెకు కలుగజేయడానికీను. ఈరెండూకాక, ముందు మరో కారణం చూడబోతున్నాం. అందుకనీను.

పైగా ఈ సర్గలో 3 విశేషాలున్నాయి.

(1) రామునికథా ఆంజనేయుని కథా ఒకే చోట ఒకేసర్గలో ఒకదానిపమ్మట మరొకటి ఉండడం.

(2) రామునికి పరమభాగవతుడైన ఆంజనేయుడే తన స్వామికథనిచెప్పి, తనజన్మవృత్తాంతాన్ని కూడ తానే చెప్పడం.

(3) తాను ఆరాధించే రాముని రూపాన్ని, భక్తుడైనతాను, రాముణ్ణే సదా ఆరాధించే అమ్మవారికి చెప్పడం.

భగవంతుడైన కృష్ణుడు,భగవంతుని విశేషాలని గూర్చి, భగవద్భక్తుడైన (భాగవతుడైన) అర్జునునికి చెప్పిన 'భగవద్గీత' ఎలాంటిదో దానికి పూర్వకాలంలోనే పుట్టిన ఈ ఆంజనేయకథకూడ అలాంటిదే. హరియొక్కరూపాన్ని హరిదాసుడైన ఆంజనేయుడు మొదటగా ఇక్కడే వివరించి చెప్పాడు.

భారతంలో జూదంజరిగిన సందర్భంలో దుర్యోధనుణ్ణి, దుశ్శాసనుణ్ణి యుద్ధంలో చంపుతానని భీముడు ప్రతిజ్ఞ చేయడంవలనవే భారతం కురుక్షేత్రయుద్ధం వరకూ జరిగింది. అలా భారత కథకి ఆధారభూతుడు ఆ వాయుపుత్రుడు భీముడు.

బలవంతానా ఎత్తుకుపోబడిన సీతమ్మకు ధైర్యాన్ని చెప్పి యుద్ధాన్ని రామునిచే చేయించి రామాయణకథకి ఆధారభూతుడైనవాడు ఈ వాయు పుత్రుడు హనుమంతుడు.

ఇలా ఇతిహాసాలని నడిపించిన ఇద్దరూ వాయుపుత్రులే. అయితే ఇద్దరిలో ఎవరు ఎక్కువ? అంటే హనుమయే ఎక్కువ. భారతంలో భీముడు సౌగంధికపుష్పాన్ని తేవడానికి వెడుతూంటే త్రోవలో ముసలికోతి రూపంలో తోకని అడ్డుగావేసి పరున్నాడు

"అమ్మా! సుగ్రీవుని వద్ద, నా కంటె బలిష్ఠులూ, నాతో సమానులూ ఉన్నారు గాని, నా కంటె తక్కువ వారు లేనేలేరు. అయినా, అందరిలోకి తక్కువవాణ్ణే ఇలాటి పనులకి పంపిస్తారు గాని, పెద్దవారిని పంపించరు గదా! (4). అందుకని, బాధపడకు.

రోహిణి చంద్రునితో కూడినట్లు, నువ్వు రామునితో చేరగలవు. నా వీపుపై రామలక్ష్మణులు వచ్చి, లంకని ధ్వంసం చేసి, రావణుణ్ణి చంపి, నిన్ను తీసుకొని పోతారు.

తల్లీ! రామునికంటె గొప్పవాడూ, లక్ష్మణునితో సమానమైనవాడూ లేనేలేరని గ్రహించు.

వానరాలనీ, భల్లూకాలనీ తక్కువగా భావించకు. వారు చేయలేనిది లేదుసుమా!

రామలక్ష్మణులు సూర్యచంద్రులు. అగ్ని వాయువుల వంటివారు (5).

ఎంతోకాలం నీ ఇక్కడ ఉండనూ ఉండవు - ఉండవలసిన కొద్దికాలమూ ఓర్చుకోకనూ - తప్పదు" అని ప్రార్థిస్తూ పలికాడు.

## విశేషాంశాలు

(1) సముద్రం దాటుతూన్నపుడు, విశ్రాంతి తీసికోమంటే తీసికొని హనుమ, ఆగమంటే ఒక రోజు ఆగుతాడా? కార్యం యొక్క తొందరని గమనించి ఆగనంటాడా? లేదా? అనే పరిశీలనకి, ఈ ప్రార్థన.

ఆగితే, రాక్షసులు హనుమ మీదికి దూకుతారు కాబట్టి, ఎదుర్కొనే ధైర్యం ఉందా? లేదా గమనించడానికిను ఈ ప్రార్థన. ఎదుర్కొంటే, రాక్షసుల బలవిశేషం కూడా, రామునికి చెప్పవీలౌతుంది అని కూడా ఈ ప్రార్థన.

అరణ్యానికి వెడుతూన్న రాముణ్ణి, దశరథుడు కూడా ఒక రోజు ఆగి వెళ్లమన్నాడు. రాముడు ఆగలేదు. రామ భావభావన ఉన్న హనుమకూడా ఆగడు. ఆగలేదు.

(2) సహాయాలు చేయటంలో, వాక్కుద్వారా చేయడమూ పుణ్యప్రదమే. సంపాతి చెప్పిన మాట ప్రకారమే కదా, సీత లంకలో ఉన్నదని హనుమ విశ్వసించాడు.

**బల-ధైర్య-పరాక్రమ-ధనాలు లేనప్పుడు వాక్సహాయమైనా చేయాలి. అది ఉపకారమే.**

(3) తాను విడిపించబడాలనే ఆలోచన, సీతమ్మకి లేనేలేదు. ఇక, ఇలా రావణుడు ప్రవర్తించకుండా, అతని ప్రవర్తనకు రాక్షసులు సహాయపడకుండా, లంకా నాశనాన్నే కోరుతోంది ఆమె.

ప్రతివ్యక్తికీ నాభినుండి బయలుదేరిన వాయువు పైపైకి ప్రయాణించిహృదయాన్నీ కంఠాన్నీ, కంఠంలోని శ్వాసతంత్రులనీ, నాదతంత్రులనీ స్పృశించి బయటికివస్తుంది. ఏ ఏ తీగని స్పృశిస్తే వీణ ఏయే ధ్వని విస్తుందో అలాగే ఈ వాయువు కూడా ఏయే స్థానాన్ని స్పృశిస్తే ఆయాధ్వని కంఠంనుండి వెలువడే వాయువు ద్వారాబయటికి వస్తుంది.

అ,క,ఖ,గ,ఘ,ఙ,హ - అనే అక్షరాలు కంఠంనుండి. (కంఠ్యాలు)

ఇ,చ,ఛ,జ,ఝ,ఞ,య,శ-అనేఅక్షరాలు తాలువులనుండి (దౌడలక్రింద ఉండే టాప్సిల్స్ తాలవ్యాలు)

ఋ,ట,ఠ,డ,ఢ,ణ,ర,ష- అనే అక్షరాలు మూర్ధంనుండి (నోటిలోపలి కొండలా ఎత్తైనభాగానికి ఈ నాలుకకొన తగులగా పలుకబడేవి)

ౡ,త,థ,ద,ధ,న,ల,స - అనే అక్షరాలు దంతాలనుండి (ముందుపళ్ల వెనుక ఉండే ఎత్తుకి నాలుకకొన తగులగా పలుకబడేవి)

ఉ,ప,ఫ,బ,భ,మ - అనే అక్షరాలు ఓష్ఠాల నుండి (రెండుపెదవులూ దగ్గర కాగా లేదా కలిస్తే పలుకబడేవి - ఓష్ఠ్యాలు)

'వ' అనే అక్షరం పైదంతాలు క్రింది పెదవిని తాకగానూ - పుడతాయి. ఎవరికి వారు నోటిలో నాలుక ఎక్కడ తగులుతూంటే ఏ అక్షరాలు పుడతాయో పరిశీలించు కోవచ్చు. కారణం భగవంతుడు అందరికీ ఒకే విధమైన ఏర్పాటు ఉన్న నోటిని ఇచ్చి ఉన్నాడు గనుక.

మరి అందరికీ ఇలాటి నోరూ, దౌడలూ, దంతాలూ ఉన్నా, కొందరు మాట్లాడంలో యాస, అదోవిధమైన తేడా కన్పిస్తుంది. కొందరు అతిస్పష్టంగా, మృదు మధురంగా మాట్లాడతారు. ఇలా మాట్లాడటానికి కారణం మాటకి ఉపకరించే నోటిలోని అవయవాలు సరిగా ఉండటమే కాదు. వ్యక్తికి భాషమీద ఉన్న అధికారం కూడ కారణం.

రాముని ఎదుట మొదటగా హనుమ మాట్లాడినప్పుడు లక్ష్మణునితో రాముడు హనుమని గూర్చి చక్కని ప్రశంస చేసాడు. 'బహువ్యాహరతానేన న కించి దపభాషితమ్ - కస్య నారాధ్యతే చిత్త ముద్యతాసే రరే రపి' - 'ఎంతసేపు మాట్లాడినా ఏ లోపమూ దోషమూ లేకుండా మాట్లాడిన ఈ తీరు, కత్తి ఎత్తినవాళ్లే కూడా ఆరాధించేవానిగా చేస్తుంది' అన్నాడు రాముడు.

ఈ మాట్లాడే శక్తిని ఎవరిచ్చారు? అంటే అతనికిగల ప్రశస్తమైన హనువులూ (దౌడలు) మొదలయిన ఏ అక్షరానికి ఎంత వాయువుని వాడాలో అంతే వాడగల శక్తి ఉన్న కంఠమును

వాటిలో పుట్టిన వాయువు (వాయుపుత్రుడు) నేరుగా కంఠంనుండి పైపైకిపోయి శరీరానికి సూర్యమండలమైన అంగుడును తాకుతుంది. ఆంజనేయుడు పుట్టినవెంటనే సూర్యునివద్దకు పోయాడంటే ఇదే. నోటిలోని ఎత్తైన కొండలాంటి భాగమే 'అంజన' అంటే. ఈవాయువు ఆ 'అంజన' భాగాన్ని తగిలితే పుట్టిన ధ్వనియే 'ఆంజనేయుడు' అంటే. కాబట్టి ఆంజనేయుడంటే 'ప్రశస్తమైనవాక్కు' అనిఅర్థం.

ఇలాంటి ప్రశస్తమైన వాక్కు, ప్రశస్తమైన దౌడలు ఉంటేనే సాధ్యం కాబట్టి హనుమాన్ లేదా హనూమాన్ అంటే ఎదుటివారిని ఆకర్షించే విధంగా స్పష్టమైన కంఠస్వరంతో ఉదాత్త-అనుదాత్త- స్వరిత భేదాలతో వేదాన్ని వల్లెవల్లుగా పలుకగలిగే విధానంకల దౌడలున్న వాడనిభావం.

కేవల దూతలని చూస్తాం - కేవలం దాస్యమే వృత్తిగా గల దాసులనీ చూస్తాం - కేవలం దేవతలనీ చూస్తాంగాని - దూతగా+దాసునిగా+భగవంతునిగా, అంటే 3గుణాలు ఒకనిలో కలవానిని చూడం. అతడే 'హనుమ'.

సుగ్రీవునిలా రాజరికాన్ని చేయగలడు. రామలక్ష్మణుల్లా యుద్ధాన్నీ చెయ్యగలడు. గరుత్మంతునిలా ఎంతోవేగంగానూ, అతనికంటె ఎత్తుగానూ ఎగురగలడు. లక్ష్మణుడు చేయలేని దూతకృత్యాన్నిచేయగలడు. ఇంత శక్తిఉన్నా సామాన్యునికోతివలె అహంకారం ఏ మాత్రమూ లేకుండా ఉండగలడు. ఎవరిలోనూ లేని ఇన్ని లక్షణాలు కలిగిన ఒకే ఒక వ్యక్తి హనుమ.

బ్రహ్మకు వాహనం హంస. శరీరంలో సంచరించే ఉచ్ఛ్వాసనిశ్వాసాలని 'హంస' అంటారు. అంటే వాయువనే అర్థం.

విష్ణువు వాహనం గరుడుడు. ఇతడు హనుమంతునితో అనేక పర్యాయాలు పోల్చబడతాడు. వాయువులో సంచరించే లక్షణమున్నవాడు.

'గరుత్మానితి విఖ్యాత ఉత్తమ స్సర్వపక్షిణామ్ -
పక్షయో ర్యద్బలం తస్య తావ ద్భుజబలం తవ'

(జాంబవంతుడు హనుమతో పైమాటలని పలికాడు) గరుత్మంతునితో సమానబలం కలవాడని దీనిభావం. కాబట్టే విష్ణు ఆలయాలలో ధ్వజస్తంభంక్రింద 'హనుమ' విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. విష్ణువుకి ధ్వజం అంటే వాహనం గరుడుడుగదా! ఆ గరుడుడూ ఈ 'మారుతి'ఒకడని చెప్పేందుకే ఇలాంటి ప్రతిష్ఠ చేస్తారు.

ఇక శంకరుని వాహనం వృషభం. వృషభం అంటే ఎద్దు. శివాలయాలలో ఉండే ధ్వజస్తంభం క్రింద కూడా ఆంజనేయప్రతిష్ఠ సాగుతుంది. అంటే శివవాహనంతో సమానుడని దీనిభావం.

'చత్వారి శృంగా త్రయో అస్య పాదా
ద్వే శీర్షే సప్త హస్తాసో అస్య
త్రిధా బద్ధో వృషభో రోరవీతి
మహోదేవో మర్త్యాగ్ం ఆవివేశ' అనే వేద వాక్యం శివవాహనమైన ఎద్దుని శబ్దంతో పోల్చి చెప్పింది.

ఈ ఎద్దుకి కొమ్ములు నాలుగట. (1) యోగులకి మాత్రమే వినిపించే శబ్దం పేరు 'పర'. (2) మహర్షులకి కూడ అర్థమయ్యే శబ్దం 'పశ్యంతి'. (3) ఎవ్వరిమటుకు వారు తమ హృదయంలో మాట్లాడుకొనే శబ్దం 'మధ్యమ'. (4) మనం పరస్పరం మాట్లాడుకొనే శబ్దం 'వైఖరి'

ఈ ఎద్దుకి కాళ్లు మూడట. భూత - భవిష్యత్ - వర్తమాన అనే కాలాలు మూడున్నూ.

ఈ ఎద్దుకి తలలు రెండట. నిత్యం - అనిత్యం అనేవి.

ఈ ఎద్దుకి ఏడు చేతులట. ఏడు విభక్తులూ ఏడు చేతులు.

ఈ ఎద్దుకి కట్టు తాళ్లు మూడట. నాభి - హృదయం - కంఠం లేదా హృదయం - కంఠం లేదా శిరస్సు అనేవి. అలాటి ఎద్దు వేసే ఱంకె 'శబ్దం' అనేది. దీనిని బట్టీ ఈ ఎద్దు కూడ శబ్దమే అయింది.

ఇలా త్రిమూర్తుల వాహనమైనవాడు హనుమ. శివ - విష్ణువుల ఇద్దఱి దృష్టి ఎదురుగా ఉండే ధ్వజస్తంభం క్రింద ఉన్న హనుమమీద పడుతూ ఉంటుంది. అంటే ఆ ఇద్దఱి దృష్టిశక్తినీ భరించగల అద్వితీయ దేవత 'హనుమ' అన్నమాట.

వివాహానికి సంబంధించిన సమావేశం జరుగుతూంటే ప్రవేశించి రాముణ్ణి తనతో తీసికొని పోయి అతనికి వివాహాన్ని చేసేంతవఱకూ ఉండి సీతమ్మతో రాముణ్ణి కలిపినవాడు విశ్వామిత్రుడు.

రావణుడు ఎత్తుకుపోయిన సీతమ్మజాడని రామునికి తెలిపి తాత్కాలికంగా విడిపోయిన వారిరువురినీ శాశ్వతంగా కలిపినవాడు హనుమ.

లోకరీత్యా తనని భర్తవిడిచాడనే అపఖ్యాతికి గురి అయినా (వైకుంఠానికి సీతమ్మని పంపించదలచి రాముడు సీతమ్మని ముందుగా ప్రయాణం చేయిస్తే ఆనిజాన్ని గ్రహించినవాడు వాల్మీకి) ఆ సీతమ్మని ఆదరించి సీతారాముల చరిత్రని రామాయణం ద్వారా లోకానికి ప్రచారమొనరించాడు వాల్మీకి మహర్షి.

రామాయణానికి ఈ ముగ్గురూ మూడుకళ్లు.

❀ ❀ ❀

# 36వ సర్గము

## తల్లీ ! ఇదిగో! ఉంగరం తీసుకో !!

"వానరోऽహమ్మహాభాగే దూతో రామస్య ధీ మతః। రామనామాంకితం చేదం పశ్య దేవ్యంగులీయకమ్। ప్రత్యయార్థం తవానీతం తేన దత్తం మహాత్మనా॥(2-3). గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కరవిభూషణమ్. భర్తారమివ సంప్రాప్తా జానకీ ముదితా భవత్ (4)". హనుమ ఇలా అన్నాడు." ధీమంతుడైన రాముడు, వానరుడైన నన్ను దూతగా పంపుతూ, నమ్మ వీలయ్యేందుకు నీ కిమ్మని, ఈ 'రామ' అనే అక్షరాలున్న ఈ ఉంగరాన్ని ఇచ్చాడు. (1) నీ దుఃఖాలు తొలగుతాయి. ఊరట పొందు" అని పల్కుతూ అఱచేతిలో ఉంచుకొని, "ఉంగరాన్ని చూడు" అన్నాడు.

ఆ ఉంగరాన్ని తాను తీసికొని, (2) పరిశీలనగా చూస్తూ, తన భర్తను పొందినంత ఆనందం పొందింది. సిగ్గుతో, సంతోషంతో, ఆమె దేహం పులకరించి హనుమను మెచ్చుకొంటూ 'నాయనా వానరా ! 100-యోజనాల సముద్రాన్ని దాటిన నీతో, రాముడు పంపిన నీతో మాట్లాడుతున్నాను మనసువిప్పి. భయం - సంభ్రమంవద్దు. నా భాగ్యంవల్ల వారిద్దఱూ కుశలమని తెలిసి సంతోషం. ఈ భూమిని దహించగల సమర్థుడెందుకు ఇంతకాలం ఊరుకున్నాడు ? ఆయనకు మిత్రులూ - సహాయపరులూ లేరా ? దైవంమీద భారం వేయక తనవంతు పురుష ప్రయత్నం కూడా చేస్తున్నాడా ? (3) మా అత్తల - మఱదుల క్షేమసమాచారాలు తెలుస్తున్నాయా ? భరతుడు నా రక్షణకోసం మంత్రి రక్షణలో అక్షౌహిణి (4) సైన్యాన్ని పంపిస్తాడా ? సుగ్రీవుడు సైన్యాన్ని ఇస్తే, రాముడు యుద్ధయాత్రకి వస్తాడా ? మహారణ్యానికి వచ్చినా, రాజ్యం విడిచినా, దుఃఖభయాలు ఆతనికి లేవు. (5) అలాటి మనోధైర్యంతోనే ఉన్నాడుగదా ! తల్లి-తండ్రి ఇంకెవరిమీదా, నాతో సమానమైన స్నేహం ఆతనికిలేదు. (6) నాకూ అలాటి స్నేహమే ఉంది. ఆయన సంగతి తెలిసేవఱకే జీవించాలని ఆకాంక్ష' అని రాముని మాటలను వినడానికై విరమించింది.

హనుమ చేతులుజోడించి, తలవంచి, 'అమ్మా ! నువ్విక్కడ ఉన్నట్టు ఆయనకు తెలియదు. ఒకప్పుడు దేవేంద్రుడు తన భార్య జాడ తెలియక, ఎలా వెంటనే తీసికొనిపోలేదో, ఇదీ అలాటి కథే. నేను వెళ్లి చెప్పగానే అశేష సైన్యంతో వచ్చి, ఎవరు అడ్డొచ్చినా ఆగక, యుద్ధంలో లంకని నిర్మూలం చేస్తాడు. ఐరావతం మీద ఇంద్రునిలా, ప్రస్రవణ పర్వతంపై రాముణ్ణి తొందరలో చూస్తావు. నీ వియోగంలో తిండి-నిద్ర-కర్తవ్యాలు విడిచాడు. నిత్యశోక పరాయణునిలా ఉంటాడు. నీ పేరే జపిస్తూ ఉంటాడు-నిన్ను పొందాలని ప్రయత్నిస్తున్నాడు" అని యథార్థాన్ని చెప్పాడు.

## విశేషాంశాలు

(1) ఈ ఉంగరంలో 3 మణులు బిగింపబడి ఉన్నాయి. పై వరుసలో ఒకేమణి, క్రింది వరుసలో ఒకటి ప్రక్క మరోటిగా రెండు మణులున్నా. కుశధ్వజుడనే పేరుగల వేదవతి (సీతా పూర్వరూపం) తండ్రి తపస్సూ, వేదవతి తపస్సూ, 2 మణులలో నిక్షిప్తం చేయబడి, జనకునికి సీతతో నాగటి చాలులో కన్పించాయి. ఈ రెంటితో, సీతమ్మ పెళ్లిలో ఒక మణిని కలిపి అంగుళీయకం చేయించాడు జనకుడు. ఈ మణిలో, రాజైన వ్యక్తికి, వంశపరంపరానుగతంగా వచ్చే, సూర్యవంశపు శక్తి, ఆవహింపచేస్తారు. అలాటి 3 మణులతో ఉన్నది అంగుళీయకం.

రామునికి యౌవ రాజ్య పట్టాభిషేకం కోసం ఏర్పాటు కాగానే, వశిష్ఠుడు ఆ సూర్యవంశ శక్తిని మణిలో నిక్షిప్తంచేసాడు. కాని భంగమైన కారణంగా రాముడు పాదుకలపై నిలబడి, తన ద్వారా, ఆశక్తిని పాదుకలలోకి పంపించివేసాడు. ఆ సూర్యవంశ శక్తి, పాదుకలలో ఉన్న కారణంగానే, రావణుడు గాని, ఇతర దేశాధీశులు గాని, రాజులేని అయోధ్యపై, దండెత్త లేకపోయారు. ఇలాటి అంగుళీయకం, తాను రాజైతే, రాజ్యాధికార ముద్ర ఔతుంది. 14 సంవత్సరాల పిమ్మటనే, దీనికి ఈ అధికారం వస్తుందని భావించరాదు. భరతుడూ, రాముడూ చిత్రకూటంలో కలిసి నప్పుడు, ఒక అంగీకారానికి వచ్చారు. 'త్వం రాజా భరత! భవ స్వయం నరాణాం-వన్యానా మహమపి రాజరాణ్మృగాణామ్ - గచ్ఛ త్వం పురవర మద్య సం ప్రహృష్టః - సంహృష్ట స్త్వహమపి దండకాన్ ప్రవేక్ష్యే'. అని "ఓ భరతా ! నువ్వు మానవులకి రాజవి కా ! నేను రాజరాజుని (చక్రవర్తిని) ఔతాను. ఎలుగుబంట్లకి రాజు జాంబవంతుడైతే, నేను ఆ రాజుకి రాజుని. కోతులకు రాజు సుగ్రీవుడైతే, నేను ఆ రాజుకి రాజుని. అలాగే పక్షిరాజులు జటాయు సంపాతులకి రాజుని. ఇలా రాజైన నీ కంటె పెద్ద - రాజరాజు - ని. మానవులు కూడ ఒక జాతియే కాబట్టి మానవరాజైన నీకూ రాజునే - అన్నాడు రాముడు. అలాటి రాముని రాజ్యాధికార ముద్ర ఈ అంగుళీయకం.

అది సువర్ణ (చక్కని 'శ్రీ రామ' అనే అక్షర రూపంలో మణులున్న) - సువర్ణ (మంచి వన్నెగల) సువర్ణ (బంగారపు) అంగుళీయకం. దీన్ని, సీతమ్మకు రాముడు పంపాడు. 'అప్రమేయం హి తత్తేజో యస్య సా జనకాత్మజా' - రాముని శక్తి మొత్తం సీతమ్మది. అందుకే సీత వెళ్లిపోగా, తేజస్సు క్షీణించిన రాముడు, లక్ష్మణుని చెంత బావురుమన్నాడు నిత్యమూ. సహజ తేజస్సున్న సీత మాత్రం, ఏడుస్తున్నట్లు నటించి, దేవరహస్యం బయట వేయకుండా, రావణుణ్ణి చేస్తానని బెదిరించి, తాను బెదరకుండా

ఉంది. అలాటి సీత వద్దకు, ఆమె తపశ్శక్తి దాగి ఉన్న ఉంగరాన్ని, రాముడు పంపాడు. ఏ తపశ్శక్తి దాగి ఉన్న ఉంగరాన్ని, రాముడు, పంపాడో, ఏ తపశ్శక్తితో ఇంతదూరమూ కథనడిపాడో, ఆ శక్తిని సీత వద్దకు పంపుతున్నాడు. అరణ్యంలోని మహర్షులంతా, 13 ఏండ్ల కాలంలో ఇచ్చిన తపశ్శక్తి, రావణ వధకు చాలును. పైగా రాజముద్రిక అయిన, ఈ ఉంగరం ఆమెకిచ్చాడు, అంగుళీయక మిచ్చివేయడమంటే, రాజ్యాన్ని విడవడమని అర్థం. అందుకని, రాజ్యం కూడ, సీత ముందు తృణప్రాయమనే భావనతో పంపించాడు. ఈ భావన ఆమెకుండడం బట్టే ఆమెకు, పెళ్లినాటి ఆనందం కంటె, అంగుళీయకం పొందిననాటి ఆనందం వేయిరెట్లని తర్వాతివారు వ్రాసారు.

(2) ఆ ఉంగరాన్ని ఆంజనేయుడామెకు ఈయలేదు. తన అరచేతిలో పెట్టుకొని 'పశ్య' చూడు అన్నాడు. ఆమె 'గృహీత్వా' తీసికొంది. హనుమ రామునికి చూడామణిని మీద కాలంలో ఇస్తాడు. రాముని చేయి క్రిందుగా, హనుమ చేయి పైనా ఉంటుంది. కాని అమ్మవారి చేయిఎప్పుడూ క్రిందుగా ఉండదు. అంగుళీయకం ఆంజనేయుడిస్తే, ఆమె తీసికొంటే, సీతమ్మ చేయి, క్రింద ఉండాలి. అందుకై ఆమె, తానే తీసికొంది గాని క్రింద చేయి ఉంచి గ్రహించలేదు. తన తపస్సూ, తన తండ్రి తపస్సూ నిక్షిప్తమైన ఉంగరం కాబట్టి, అధికారం తనదని అనుమానం లేక తీసికొంది. ఇక ఆ ఉంగరం, ప్రణయకోప సందర్భాలలో పందెంగా పెట్టుకొన్నది. ఇవన్నీ కూడ ఆమెకు గుర్తువచ్చాయి. స్వామి రాబోయేముందు ఆయన లాంఛనాలు వచ్చినట్లు, రామాగమనానికి ముందు అంగుళీయకం వచ్చిందని, ఆమెకు ఆనందం కల్గింది.

(3) పూర్వపు గ్రంథాలేవీ 'గాలిలో దీపం పెట్టి దేవుడా !' అనమనవు. పురుష ప్రయత్నం చేసి, దైవసహాయం కోరమన్నాయి.

(4) 21870 రథాలూ, 21870 ఏనుగులూ, 65610 గుర్రాలూ, 1,09,350 కాల్బలమూ కలిపి 2,18,700 మొత్తం సేన అక్షౌహిణి.

(5) పూర్వం వారికి, స్త్రీల విషయంలో గౌరవం ఉండేది కాదని, తెలియనివారు-పాపం ! వాపోతూ ఉంటారు. 'న చాస్య మాతా న పితా చ నాన్యః స్నేహా ద్విశిష్టోఽస్తి మయా సమో వా'-తల్లి తండ్రి కంటెకూడా నా యందున్న స్నేహం గొప్పదని సీత రాముణ్ణిగూర్చి అంది.

సీతని రాముడు, ఒక భార్యని గౌరవించవలసిన తీరులో సరిగా చూడలేదని నేటి వారు ఎందరో అంటూంటే, సీత, ఆ మాట అనకపోవడం గమనించాలి. అయినా సీతకు తెలియని రాముని హృదయం, వీరికి తెలిసిందంటే పరమాత్మ ఆశ్చర్య పడాల్సిందే!!.

❀ ❀ ❀

# 37వ సర్గము

## నీవు వెళ్ళు రాను – రాముడే రావాలి!

"హనుమా ! రాముడు నన్నే తలచుకొంటున్నాడన్న మాటలు అమృతంలా, శోకిస్తున్నాడన్న మాటలు విషంలా ఉన్నాయి.

వ్యక్తికి ఐశ్వర్యం కలిగినా, ఆపద వచ్చినా, అది తన ప్రతాపం అనుకోరాదు. దైవం, వాళ్లని త్రాడుతో కట్టి తన ఇష్టానికి అనుగుణంగా ఈడ్చుకుపోతాడు.

రావణుడు పెట్టిన సంవత్సరం గడువుకి 2 నెలలే మిగిలి ఉంది.

సోదరుడైన విభీషణుడు చెప్పినా, నన్ను రామునికి అప్పగించడానికి ఇష్టపడని రావణుడు మృత్యువుని పొందడానికే ఇష్టపడుతున్నాడు. విభీషణ పుత్రిక అనలా, భార్య సరమా చెప్పినా వినలేదు రావణుడు.

నన్ను నా రాముడు పొందుతాడనడానికి నా అంతరాత్మ పరిశుద్ధిగా ఉండడమే కారణం.

ఏ సహాయమూ లేక 14 వేలమందిని జనస్థానంలో చంపిన రామునికి రావణుడు ఒక లెక్కా?" అంటూ కన్నీరు కార్చింది (1).

మారుతి విని, 'తల్లీ ! నీ వార్తని రాముడొస్తాడు. కాని ఇప్పుడే నాకో ఉపాయం వచ్చింది. మెత్తని రోమం కల నా వీపు ఎక్కు. హోమ ద్రవ్యంలా అతి పవిత్రంగా నిన్ను తీసికొని రాముని వద్దనే ఆగుతాను.

రావణునితో సహా లంకని ఎత్తుకుపోగల బలం నాకుంది.

'యథైవాహ మిహప్రాప్త స్తథైవాహ మపంశయః'

ఎలా నేనొచ్చానో అలా తీసికొని వెడతాను. రా తల్లీ !' అన్నాడు. ఆ మాటలు సీతమ్మ విని 'నీ కపి బుద్ధి ఇప్పుడు తెలిసింది నాకు. అల్పశరీరంకల నీవు, నన్నెలా తీసికొని పోగలవు ?' అంది. ఆ మాటలు మారుతికి కొత్త అవమానంలా అనిపించాయి. (నవం పరిభవం కృతమ్).

ఈమెకు నమ్మకం కల్గడానికి, తన రూపం చూపాలని భావించి చెట్టు దిగి, తన ఎఱ్ఱని ముఖం, వజ్రనఖాలూ, దంష్ట్రలూ చూపుతూ, పర్వతంలా పెద్ద శరీరం చేసాడు.

ఆ రూపం చూచి 'హనుమా ! నీవాయు సమాన గమనం, అగ్నివంటి తేజస్సూ, సముద్రం దాటి వచ్చే శక్తి ఎఱుగుదును. కాని, నీ మీద వేగంతో వస్తూంటే, నేను సముద్రం చూచి భయపడవచ్చు. (2)

నన్నెత్తుకొని పోతున్నావని, రాక్షసులు వెంటాడి యుద్ధం చేస్తూంటే నాకు భయం కలుగవచ్చు. లేదా క్రిందపడ్డ నన్ను రాక్షసులు తీసికొని పోవచ్చు. చంపివేయవచ్చు లేదా అసలు కనుపడకుండా దాచివేయవచ్చు. మళ్లీ కథ మొదలౌతుంది. నీ ప్రయత్నం వ్యర్థమౌతుంది.

నీతో నేను రావడంకంటె, రామునితో నీవు రావడం మంచిది. నాకేమైనా అయితే వానరులతో సహా ప్రాణాలు విడుస్తారు రామలక్ష్మణులు. అదీ కాక, పవిత్రమైన నేను, రాముని తప్ప ఇతర పురుషుని (3) స్పృశించను. ఆ నాడు నేను నా స్వాధీనంలో లేక రావణునిచే స్పృశింపబడ్డాను. రావణుణ్ణి బంధుమిత్ర, సపరివారంగా వధిస్తే అది రామునకు (4) తగినది కాని ఇలాటిమకు పోవడం కాదు. రామలక్ష్మణులని తోడు తీసుకురా !. నన్ను సంతోష పెట్టు!" అని దీనురాలై పల్కింది సీత.

**విశేషాంశాలు**

(1) కందమూలాలు తినే రాముడు మాంసాన్నే తినే 14 వేల మంది రాక్షసుల్ని చంపాడు. మాంసంతినే రావణుడు ఒక్క గ్రద్ద (జటాయు)ని చంపలేక పోయాడు.

ఎదురుగా, మారువేషం లేక, ధైర్యంగా రాముడు రాక్షసులని చంపితే, చాటుగా, సంన్యాసిరూపంతో, భయంతో రావణుడు స్త్రీని ఎత్తుకొచ్చాడు.

శత్రువులకి కూడా అభయం రాముడిస్తూంటే, దేవతలని లెక్కచేయనని పలికే రావణుడు వరాలపేరిట వారినే యాచించుతాడు. దీన్ని బట్టి రామ రావణ బలధైర్యాలు సీతకి స్పష్టంగా తెలుసు.

(2) 14 వేల రాక్షసులని నఱికితే చూచిన సీత, గాయాలతో, పూచిన మోదుగ వృక్షంలా ఉన్న రాముణ్ణి చూచిన సీత, రావణ యుద్ధాన్ని జటాయువుతో చూచిన సీత, యుద్ధం అంటే భయపడుతుందా ?

లంకకి ఇష్టంలేకండా పోతూన్నప్పుడే పడిపోని సీత, కావాలని బయలు దేరి రాముని వద్దకు వెళ్లేప్పుడు పడిపోతుందా ? తాను వచ్చాక రావణునితో ఇక యుద్ధం ఎందుకని రాముడనుకోడని తనకు తెలియదా ? (రాముడు 2 మాటలు మాట్లాడడు

గదా) రాక్షసులూ—వాళ్ల బాధలూ—రావణుని మాటలూ కంటె భయంకరమా సముద్రం? ఇలా చెప్పడం కేవలం రాముడే వచ్చి రావణవధ సాగించాలని చెప్పడానికే.

విభీషణుడు రావణునకు చెప్పిన హితవాక్యం, రావణుడు వినని వాక్యం ఒక్కటే. "రావణా! పెద్ద వత్తితో ఉన్నదీపం తొందరగా ఆరిపోయేటట్లు, నీ తపఃఫలం, ఈ అధర్మంవలన తొందరగా నశించి, నీకు చావుని తెస్తుంది. కుండలోనుండి మఱు కుండలోనికి నూనెని పోస్తే, నూనె పరిమాణం తగ్గినట్లు, సీతాపహరణాన్ని సమర్థించే ఎందఱితో చర్చిస్తే, అంత తపశ్శక్తి తగ్గుతూంటుంది. ధర్మాన్ని, రక్షిస్తే రక్షిస్తుంది గాని అధర్మ చర్చ-ధర్మరక్షని చేయదు' అనేది.

(3) "సఏవ వాసుదేవోఽయం సాక్షాత్పురుష ఉచ్యతే - వాసుదేవు డొక్కడే పురుషుడు నా దృష్టిలో - కాని లోకదృష్టిలో నీవూ - రావణుడూ కూడ పురుషులే. నా వశం తప్పిన స్థితిలో రావణుడు స్పృశించాడు నన్ను. అది నా తప్పుకాదు. తెలిసి నీ భుజం ఎక్కి ఎలారాను ?" అని సీత ప్రశ్న.

I.P.C. Section 24 కూడా ఇలా చెప్తుంది. "Nothing is an offence which is done by a person, who is compelled to do it, by threat" అని.

**(4) రాముణ్ణే రమ్మనమనడానికి కారణాలు :-**

(1) సీతమ్మకు ఏ మాత్రమూ లంక-రావణుడు అంటే భయం లేకపోవడం — చాలా మంది అనుకొనేటట్లు ఆమె దీనంగా ఏడుస్తూ ఉండకపోవడం (యథా పితుర్గృహే - మా నాన్న యింట్లో ఉన్నంత ధైర్యంగా లంకలోనూ ఉంటానని అయోధ్యలోనే రామునితో అంది సీత)

(2) సీతని హనుమ తీసికొని వెళ్లి ఉంటే హనుమ లేకపోతే రామునికి సీత లభించి ఉండేది కాదని అంతా అంటారు.

(3) రావణుడు పరస్త్రీలని అపహరించినందున శిక్ష ఉండదు.

(4) సీత తన ప్రాణాలని తాను రక్షించుకొని పోయింది గాని, మా ఊసుపట్టించుకోలేదని, ఎత్తుకు రాబడిన స్త్రీలు దుఃఖిస్తారు,

(5) రావణుని చంపుతానని ప్రతిజ్ఞ చేసిన రాముని మాట అబద్ధమౌతుంది." అనేవి.

❀ ❀ ❀

# 38వ సర్గము

## చూడామణిని చూపించు – కాకకథ వివరించు!

హనుమ ఇలా అన్నాడు. "ఓ తల్లీ ! స్త్రీకి తగినట్లూ, పవిత్రతా ధర్మానికి అనుగుణంగానూ భయాన్నీ, వినయాన్నీ చూపావు.

లోకంలో ఏ ఆడుదీ ఇలాచెప్పదు.రావణుడు సీతో సంభాషించిన తీరూ, ఉరికై నీ ప్రయత్నం, రామునికి చెప్తాను. వెంటనే తీసికొని పోయి సంతోషపడాలనీ, నా సామర్థ్యం 'ఇంత' అని చెప్పాలనీ, నీవు నెక్క రమ్మన్నాను. రానంటున్న నువ్వు ఏదైనా, ఆయన నమ్మకంకోసం గుర్తుగా ఇవ్వు – అని ప్రార్థించాడు మారుతి.

వెంటనే సీత కన్నీరు కారుస్తూ "హనుమా! ఒకప్పుడు చిత్రకూటానికి ఈశాన్యంలో, మందాకినీ తీరంలో, సిద్ధా శ్రమమనే ప్రదేశంలో ఋష్యా శ్రమాలలో ఉన్నాం.

జల క్రీడల పిమ్మట, ఆయన వాలొడపై తలపెట్టి నిద్రిస్తే, ఒక కాకి నా చుట్టూ తిరుగుతూ నన్ను ముక్కుతో గీరింది. మట్టిగడ్డతో కొట్టినా అలాగే నన్ను గీరుతుంటే, వడ్డాణం తీయ బోయాను కొట్టడానికి.

కాకిని కొట్టడానికి ఒడ్డాణం తీస్తున్నానని నా భర్తనన్ను వేళాకోళం చేసాడు.

కాసేపు నేను – ఆ తర్వాత ఆయన, ఇలా నిద్రపోయాం.

కాకి వచ్చి నా స్తనంమీది బొడిపె పై గీరితే, రక్తం రామునిమీద పడింది. అంతే! తామలా మసలుకొడుతూ, దేవేంద్ర పుత్రుడైన కాకిని చూచి, కూచున్న దర్భాసనం నుండి దర్భ తీసిమంత్రించి బ్రహ్మాస్త్రం చేసి వేసాడు (1).

ముల్లోకాలూ, చివరికి తండ్రి అయిన ఇంద్రునీ శరణువేడితే, రాముని శరణువేడమనగా, చివరికి నా భర్తవద్దకే వచ్చింది.

దాని కోరిక మేరకు, దాని కుడికంటిని బ్రహ్మాస్త్రం దహించింది. ప్రాణాలు నిల్చిన కారణంగా, దశరథ దాశరథులకు (రామునికి) నమస్కారాలు చెప్పిపోయింది కాకి.

ఒక కాకిపై బ్రహ్మాస్త్రం వేసిన రాముడు, ఎందుకు ఉపేక్షిస్తున్నాడు? నేనేదో పాపం చేసి ఉంటాను (2)" అని మళ్ళీ కన్నీరు కార్చి ఇలా చెప్పసాగింది.

"హనుమా! కౌసల్యానంద వర్ధమునికి నా సాష్టాంగ ప్రణామాలు. దుర్లభమైన ఐశ్వర్యం విడిచి, అరణ్యానికి వచ్చిన లక్ష్మణునికి నా క్షేమ వార్త చెప్పు. లక్ష్మణుణ్ణి చూస్తూ, రాముడు తండ్రి బాధని మరచి పోతున్నాడు. కార్యకర్తవీ, రామదుఃఖాపహర్తవీ నీవు. ఒక నెల దాటాక నన్నిక రావణుడు బ్రదుకనీయడు, ఇది తీసికొని రామునికియ్యి' (3) అని దివ్యసుందరమైన (కొప్పులో పెట్టుకో వీలైన) చూడామణిని(3) హనుమకిస్తే, వ్రేలికి తొడుగుకున్నాడు.

ఆమెకి ప్రదక్షిణ నమస్కారాలు చేసాడు.

దేహం-సీత పక్కన ఉన్నా, హనుమ మనస్సు-రాముని వద్దకు పోయింది.

తిరుగు ప్రయాణమైనాడు.

## విశేషాంశాలు

(1) మంత్రించి వేసే ఆయుధం అస్త్రం. చంపడానికీ, వైద్యంచేసి రక్షించడానికీ, ఉపయోగించే ఆయుధం శస్త్రం. శస్త్ర చికిత్స అంటే ఇదే. మంత్రం పనిచేయాలంటే నియమ నిష్ఠలుండాలి.

సీతా దుఃఖంలో పడ్డ రాముడు, రావణ వధని మరచాడా? అనే అనుమానమున్న దేవతలు, దేవాధ్యక్షుడైన ఇంద్రపుత్రుణ్ణి కాకిగాచేసి, సీతమ్మపైకి పంపారు. స్వస్థతలో ఉన్నప్పుడు, మంత్రం పఠించి విడిస్తే ఫలిస్తుంది.

కాని, రాక్షసులు నిశాచరులు. రాత్రిభాగంలో వధించే లక్షణం వారిది. అలాటి వారిని చంపాలంటే రాత్రి – పగలు భేదంలేక, శస్త్రాలకంటె అస్త్రవర్షాన్ని కురిపించాలి. దేవతలు రామునికి అస్త్రవిద్య, నిద్రాకాలంలో కూడా పనిచేస్తోందా? అని పరీక్షించడానికి, దేవేంద్ర పుత్రుణ్ణి అస్త్రం విడిచేంత కోపం తెప్పించే సీతాబాధని చేయమని పంపారు. ఫలితం ద్వారా దేవతలకి ధైర్యం కల్గింది.

అల్ప ప్రాణి అయిన కాకిమీద, బ్రహ్మాస్త్రం 'నా కోసం' వేసాడనే ఆనందం అమ్మవారిది. అందుకే తనకింతటి గౌరవమిచ్చిన ఈ కథని, హనుమతో చెప్పి, చెప్పమంది.

(2) సీతమ్మ అయినా, మానవ సహవాసం కల్గేసరికి తప్పులు చేయక మానలేదు. (1) అయోధ్యని వీడేటప్పుడు, తనని తీసికొని పోనన్న రామునితో 'నీవు స్త్రీవి' అంది.

(స్త్రియం పురుష విగ్రహమ్) (2) నిష్కారణంగా, మారీచవధ కాలంలో లక్ష్మణుణ్ణి అనరాని మాటలు అంది. దేవరహస్యం ప్రకారం ఇవి నిందలు కావు

'భోగే భవానీ, పురుషేషు విష్ణుః, క్రోధే చకాళీ, సమరే చ దుర్గా'

ఒకే స్త్రీ శక్తి, భోగాలని అనుభవిస్తూ భవానిగా, పురుషరూపాన్ని ధరించి విష్ణువూగా, క్రోధం కల్గినప్పుడు 'కాళికగా, యుద్ధంలో దుర్గా రూపంలో ఉంటుంది.

కాని లౌకికంగా అతణ్ణి స్త్రీ అనడం పాపమే కదా!

అలాగే లక్ష్మణుడు పర్ణశాలనుండి వెళ్లకపోతే రావణుడు తనని అపహరించడు. రావణవధ కుదురదుకదా! **కాని పైకి అవి (లౌకికదృష్టిలో చూస్తే) పాపాలే. అందుకే ఆమెకు శిక్ష 'అశోక వనవాసం'. (కారాగారంలో సమానం).**

భగవంతుడైనా దోషం చేస్తే శిక్ష నుండి తప్పించుకోవలేడు - అనడానికి పై దోషాలు చేసిన సీతమ్మ సాక్ష్యం.

(3)స్త్రీలు మామూలుగా కొప్పు పెట్టి, పూలు ధరించడం సంప్రదాయం. ఆ రోజుల్లో జడ వేసికోవడం, దుఃఖంలో ఉన్నావని తెల్పడానికి సంకేతం ఆ సీత, జడను ధరించి, అందునా (ఏకవేణీ ధరా లేదా ఏక జటాధరీ) జడని ఒక్కటిగా వేసికొని, తన దుఃఖాన్ని సూచిస్తోంది.

కొప్పుకి పైన పెట్టేది (నాగరం - కొప్పుబిళ్ల) చూడామణి. దీనికి ఉంగరంలావే ఖాళీ చోటుంది. దాంట్లో తలజుట్టు దూర్చి అలంకరిస్తారు.

ఆ చూడా మణినే ఇయ్యడానిక్కారణం, రాముడు రానిని , వెంటనే సీతదని గుర్తింపగలడు కాబట్టి. ఎప్పుడూ పాదాభివందనం చేసే ఆమె పైకి లేచేప్పుడు, రామునకు ముందుగా కన్పించేది, ఈ చూడామణియే.

ఇప్పుడూ సీతా దర్శనానికి ముందు, రామునికి చూడామణి దర్శనమే

కాబట్టే 'సీత రాబోతున్న
దర్శనం కావడమే - అని గ్రహించాలి

❀ ❀ ❀

# 39వ సర్గము

## అమ్మా! రావణ వధ తప్పదు!

'మణిం తు దృష్ట్వా రామో వై త్రయాణాం సంస్మరిష్యతి ।
వీరో జనన్యా మమ రాజ్ఞో దశరథస్య చ । (2)'

'హనుమా ! ఈ చూడామణి-మా తల్లినీ, నన్నూ, దశరథుణ్ణి - రామునికి గుర్తుచేస్తుంది. దశరథ సమక్షంలో మా అమ్మ, వివాహకాలంలో రాముడు చూస్తూండగా, నాకు అలంకరించింది (1). ఇక నీవే, నా దుఃఖం తీరేలా సందేశం చెప్పి, రాముణ్ణి రప్పించాలి', అని సీత అంది.

వానరులు శీఘ్రంగా వస్తారనీ, ఎవ్వరూ రామబాణాలకు ఎదురు నిలబడలేరనీ చెప్పి, బయలుదేర బోతూంటే హనుమని ఆపి, జానకి ఇలా అంది.

"మారుతీ ! మఱుగున్నచోట ఒకరోజు విశ్రమించి వెళ్లు. (1) నువ్వుంటే నా దుఃఖం కొంత ఉపశమిస్తుంది. తిరిగి వచ్చేవఱకూ నా ప్రాణాలు నిలుస్తాయో ? లేదో? అయినా ఒక అనుమానం.

సముద్రాన్ని, గరుత్మంతుడూ, వాయుదేవుడూ, నువ్వూ మాత్రమే దాటగలరు గదా! ఎలా వానరులందఱూ రాగలరు! పైగా నువ్వు అందఱికంటె బలవంతుడివి. ఆ అల్పబలం కల వానరులు, ఎలా రావణవధకి సహాయం ఔతారు?

రావణుణ్ణి చంపి, రాముడు నన్ను తీసికొని పోతేనే, నాకు అది కీర్తికరంగా అనిపిస్తుంది. కాబట్టి (వాచా ధర్మ మవాప్నుహి) (2) రాముడిక్కడికి వచ్చేలా, మాట సహాయం చేసి పుణ్యం కట్టుకో. బలానికి, వానరులని తోడు చేసి కీర్తిని పొందు.

లంకని ధ్వంసం చేసి, రావణ సంహారం జరిగితేనే, (3) రాముని శౌర్యధైర్యాలు లోకానికి తెలుస్తాయి" అని సీతమ్మ పలికింది.

స్పష్టంగానూ, అర్థవంతంగానూ సీతమ్మ పలికిన పలుకులు విని హనుమ

'మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సంతి తత్ర వనౌకసః ।
మత్తః ప్రత్యవరః కశ్చిన్నాస్తి సుగ్రీవ సన్నిధౌ (38)

నహి ప్రకృష్టాః ప్రేష్యంతే ప్రేష్యంతే హీతరే జనాః (39)

"అమ్మా! సుగ్రీవుని వద్ద, నా కంటె బలిష్ఠులూ, నాతో సమానులూ ఉన్నారు గాని, నా కంటె తక్కువ వారు లేనేలేరు. అయినా, అందరిలోకి తక్కువవాళ్లే ఇలాటి పనులకి పంపిస్తారు గాని, పెద్దవారిని పంపించరు గదా! (4). అందుకని, బాధపడకు.

రోహిణి చంద్రునితో కూడినట్లు, నువ్వు రామునితో చేరగలవు. నా వీపుపై రామలక్ష్మణులు వచ్చి, లంకని ధ్వంసం చేసి, రావణుణ్ణి చంపి, నిన్ను తీసుకొని పోతారు.

తల్లీ! రామునికంటె గొప్పవాడూ, లక్ష్మణునితో సమానమైనవాడూ లేనేలేరని గ్రహించు.

వానరాలనీ, భల్లూకాలనీ తక్కువగా భావించకు. వారు చేయలేనిది లేదుసుమా!

రామలక్ష్మణులు సూర్యచంద్రులు. అగ్ని వాయువుల వంటివారు (5).

ఎంతోకాలం నీ విక్కడ ఉండమూ ఉండవు - ఉండవలసిన కొద్దికాలమూ ఓర్చుకోకనూ - తప్పదు" అని ప్రార్థిస్తూ పలికాడు.

## విశేషాలు

(1) సముద్రం దాటుతూన్నపుడు, విశ్రాంతి తీసికోమంటే తీసికోని హనుమ. ఆగమంటే ఒక రోజు ఆగుతాడా? కార్యం యొక్క తొందరని గుమనించి ఆగనంటాడా? లేదా? అనే పరిశీలనకి, ఈ ప్రార్థన.

ఆగితే, రాక్షసులు హనుమ మీదికి దూకుతారు కాబట్టి, ఎదుర్కొనే ధైర్యం ఉందా? లేదా గమనించడానికిను ఈ ప్రార్థన. ఎదుర్కొంటే, రాక్షసుల బలవిశేషం కూడా, రామునికి చెప్పవీలౌతుంది అని కూడా ఈ ప్రార్థన.

అరణ్యానికి వెడుతూన్న రాముణ్ణి, దశరథుడు కూడా ఒక రోజు ఆగి వెళ్లమన్నాడు. రాముడు ఆగలేదు. రామ భావభావన ఉన్న హనుమకూడా ఆగడు. ఆగలేదు.

(2) సహాయాలు చేయటంలో, వాక్కుద్వారా చేయడమూ పుణ్యప్రదమే. సంపాతి చెప్పిన మాట ప్రకారమే కదా సీత లంకలో ఉన్నదని హనుమ నిశ్చయించాడు.

బల-ధైర్య-పరాక్రమ-భావాల తెలివి

ఉపకారమే.

(3) తాను విడిపింపబడాలనే ఆలోచన, సీతమ్మకి లేనేలేదు. ప్రవర్తించకుండా, ఆటవి ప్రవర్తనకు రాక్షసులు సహాయపడకుండా, కోరుతోంది ఆమె.

అది జరిగేవఱకూ, తాను చిత్రహింసల పాలైనా బొతానన్నది తప్ప, అవకాశం దొరికిందని భర్తను చేరతాననలేదు.

**లంకలో బందీలైనలోట స్త్రీంకి విముక్తి కల్గాలని పాటుపడిన సీతమ్మ, లోకంలోని స్త్రీ వారికి ఆదర్శ ప్రాయురాలు.**

(4) సర్వాధిక బలిష్ఠుడు తానే. కాని ఇలా చెప్పుకోవడం ఎంత గొప్పదనమో ఆలోచించాలి.

నిజంగా 'గొప్ప' కానివాడు డంబాలు పలుకుతూంటే, 'గొప్ప' అయినవాడు 'కాదని' చెప్పడం, ఎంత గొప్పదనం!

అమ్మవారికి ధైర్యం కోసమే, ఇలా మాట్లాడడం - కాబట్టి అసత్యం కాదు.

(5) సూర్యుడు - రాముడు, చంద్రుడు లక్ష్మణుడు.

సూర్యుడున్నంతసేపూ చంద్రునికి ప్రకాశం లేనట్లు, రాముడున్నంతసేపూ లక్ష్మణుని నోట మాట సరిగా రాదు. సీత సంధ్యాకాలం వంటిది. అంటే ఇద్దఱి చేతనూ రక్షింపబడేది.

సూర్యప్రకాశం ఎప్పుడూ తగ్గనిది. చంద్ర ప్రకాశం తగ్గుతూ పెరుగుతూ పోయేది.

క్రోధానికి వశుడయ్యే లక్ష్మణుడిలాటివాడు. సూర్య చంద్రు లిద్దఱినీ రాహుకేతువులు గ్రహించేటట్లు, విరాధ-రావణులు వీరిని పట్టారు. రాహు కేతువులు నశించినట్లు, విరాధ రావణాదులు నశించారు.

కథ మిగిలింది లోకంలో.

అగ్ని వాయువులు వీరిద్దఱూ. అగ్ని లక్ష్మణుడు. వాయువు రాముడు.

అగ్నిని మండింపచేయాలన్నా-మండే అగ్నిని ఆర్పాలన్నా వాయువే అవసరం.

శత్రువుని భస్మం చేసేవాడు అగ్ని. ఆ భస్మాన్ని ఎగురగొట్టేవాడు వాయువు.

✻ ✻ ✻

# 40వ సర్గము

## "మరొక గుర్తు చెప్తాను - జాగ్రత్తగా వెళ్లిరా!"

మారుతీ ! సగం ఎండిపోయిన పైరు, వాన జల్లుకి తేరుకున్నట్లు, నా పని సగం అయినట్లుగా తోస్తోంది. అందుకని, మరొక గుర్తుచెప్తాను విను. ఒకనాడు చెమటకు నా నుదుటిబొట్టు జారిపోగా, 'మణిశిల'ని అరగదీసి నా చెక్కిలిమీద బొట్టుగా వినోదంకోసం నా రాముడు పెట్టాడు. ఈవిషయం కూడా చెప్పు.

ఇంత కష్టంలో ఉన్నా, ఈ చూడామణిని చూస్తూ (పాదాభివందనం చేసిన ప్రతిపర్యాయమూ ఆ రాముని చూపులు దీనిపై పడతాయి కాబట్టి) ఆయనను చూస్తూన్న ఆనందం పొందుతూ ఉండి, ఈనాడు నీ చేతికిస్తున్నాను. ఇక ఈ జీవితాన్ని తట్టుకోలేను. ఒకే మాసం ఉంటాను. తర్వాత జీవించడం అనిశ్చయం. ఇదివఱకటిలా నా విషయంలో ఉపేక్షించడం తగదు." అని చెప్పుమని పల్కింది సీత. ఆమెకు ధైర్యం కలిగే మాటల నెన్నింటినో చెప్పి "అమ్మా! ఇంకా ఏదైనా గుర్తు ఒకటి ఇవ్వు" అన్నాడు.

'చూడామణిని చూచి నిన్ను నమ్ముతాడు. అది దివ్యాభరణం' అని సీత పల్కగానే, హనుమ ఎగిరేందుకు వీలుగా దేహాన్ని పెంచసాగాడు. అప్పుడా తల్లి హనుమని సాదరంగా చూస్తూ 'నాయనా ! 'శివశ్చ తేఽధ్వా చ హరిప్రవీర!' (24) హనుమా! నా క్షేమాన్ని సుగ్రీవునికీ, అమాత్యులకూ తక్కిన వారికీ చెప్పు. నా దుఃఖాన్నీ, రాక్షసుల బెదిరింపులనీ రామునికి చెప్పు. దారిలో ఏ అడ్డంకి లేక, సుఖంగా వెళ్లు' అని పల్కింది.

'అల్పావశేషం ప్రసమీక్ష్య కార్యం
దిశం హ్యుదీచీం మనసా జగామ' (25).

ఆ మాటలు విని "మరికొద్ది పని మిగిలిందని భావించి, ఉత్తర దిక్కుకు పోవాలని, మనసులో ఆలోచించాడు మారుతి. (మారుతి కనుక్కోవాల్సిన అంశాలు రెండు. సీత జీవించి ఉందా? లేదా? - రావణుని నివాసస్థానం - అవేవి. సీత - ఆమెయొక్క పద్ధతీ మొదలైన అన్నింటినీ తెలిసికో గలిగాడు. రావణుని నివాసస్థానం 'లంక' అనేది తెలిసింది. ఊరికే రావణుని నివాసం తెలిసికొంటే యేం లాభం? వాని బలం -మదం-సైన్య ప్రతాపం - పోరాడే తీరు మొదలైనవి రామునకు చెప్పాలిగా ! అందుకని ఇంకొద్ది పని మిగిలింది' అనుకున్నాడు ఆంజనేయుడు.

❀ ❀ ❀

# 41వ సర్గము

## అశోక వన ధ్వంసం

'న సామ రక్షస్సు గుణాయ కల్పతే న దాన మర్థోపచితేషు యుజ్యతే ।
న భేద సాధ్యా బలదర్పితా జనా పరాక్రమస్త్వేవ మమేహ రోచతే' । (3)

ఆంజనేయుడిలా భావించసాగాడు. 'తమోగుణం నిండిన రాక్షసులతో మెత్తదనం (సామ గుణం) ఎందుకూ పనిచేయదు. మహా - ఐశ్వర్య సంపన్నులైన వీరికి ఏమి దానం ఇయ్యగలం ? అయోధ్యారాజ్యాన్ని విడిచిన రాముడు, ఏమీ ఎవరినుండీ స్వీకరించడు కాబట్టి ఏమియ్యగలడు? మదంతో ఐకమత్యంతో ఉన్న వీరిలో భేదం కల్పించడం సాధ్యంకాని పని. ఇక దండోపాయం (చంపడం) ఒకటే శరణ్యం. కొందరిని చంపితే, మిగిలిన వారికి అధైర్యం వస్తుంది. ముఖ్యమైనపని చెడకుండా, దానికి అనుకూలంగా ఎన్ని పైపనులు చేసినా, అది సరైనదే-అని పెద్దలమాట. పని చిన్నదే అయినా, అనేక విధాల ప్రయత్నం చేయాలి. శత్రుబలాన్ని కిష్కింధలో చెప్పగలితేనే, నా రాకకి ప్రయోజనం.

పైగా, రావణుణ్ణి కామపరవశుణ్ణిగా చూచాను. అతణ్ణి కోపంతో ఊగిపోతున్నప్పుడూ, మంత్రులతో-సైన్యంతో ఉన్నప్పుడూ చూడాలి. రావణుణ్ణి అలా చూడాలంటే వానికి ఇష్టమైన ఈ అశోకవనాన్ని పాడుచేయాలి. దాంతో తన సైన్యాన్ని పంపుతాడు. వారి ఆయుధాలనీ, ప్రతాపాన్నీ, యుద్ధపద్ధతినీ, తెలిసికొని రామునికి చెప్ప వీలవుతుందని ఆలోచించి. ఆకాశంలోకి ఎగిరి తిరుగుతూ, ఆ గాలికి చెట్లని ఊపసాగాడు. వృక్షాలని విరిచేసాడు. వాటిని ఆధారం చేసికొన్న పెద్దపెద్ద లతలన్నీమట్టికరచాయి. పక్షులు ఎగిరిపోసాగాయి. చెట్లని విసరడంతో జలాశయాలకి అందంగా కట్టబడిన మెట్లు విరిగిపోయాయి. చక్కని సన్నగా పాఱే సెలయేళ్ల మధ్య, విఱిగిన చెట్లుపడి అందం పోయి ఆ ప్రాంతం రొచ్చురొచ్చు అయిపోయింది. లతాగృహాలూ, చిన్నచిన్న క్రీడా పర్వతాలూ నుగ్గునుగ్గు కాసాగాయి, ఎక్కడెక్కడి లోకాలనుండో తెచ్చి, అపురూపంగా వేసికొన్న చెట్లన్నీ ఛిన్నభిన్నం కావడమే కాక, కొన్ని నడిమికి విఱిగి, కొన్ని మొదలంట నాశనమయి, మఱికొన్ని తలలు విఱిగి, మొత్తానికి, ఏ చెట్టు ఎక్కడ విఱిగితే మఱి జీవించదో, అలా చేయబడ్డాయి.

అయినా హనుమకి దుఃఖంగానే ఉంది. కారణం- 'ఒక్క రాక్షసుడూ పోరాటానికి రాకపోవడమే! 'సా విహ్వలాఽశోక వన ప్రతానా - వనస్థలీ శోక లతా ప్రతానా - జాతా దశాస్య ప్రమదా వనస్య-కపేర్బలాద్ధి ప్రమదావనస్య (20)' చూస్తేనే ఆనందం కల్గించే లతలు కల వన ప్రదేశం, శోకంతో నిండిన పుష్పాలు కలదిగా అయ్యింది. రావణుని ప్రమదా(స్త్రీలయొక్క) వనం,(విహారానికై ఉన్న ఉద్యాన వనం), ప్రమదా(సీతయొక్క) అవనుడు (రక్షణకై వచ్చిన వాడు) అయిన హనుమ ధాటికి రూపు చెడింది.

❋ ❋ ❋

# 42వ సర్గము

## అనుకున్నదే అవుతోంది సుమా!

అశోకవనంలో వృక్షాలు పెద్ద చప్పుళ్లతో విఱగడమూ, పక్షి మృగ సమూహాలు చెల్లాచెదరై పోవటమూతో పాటు, రాక్షస నాశనానికి వీలైన అశుభ శకునాలు కన్పించాయి. కాపలా ఉన్న రాక్షస స్త్రీలు లేచారు. విశాల శరీరం కల హనుమని చూచారు. భయం పుట్టించేందుకై మారుతి తన రూపాన్ని మఱింత చేసాడు. భయపడిన రాక్షసస్త్రీలు, వెంటనే సీత వద్దకి వచ్చి 'ఏడెవడు ? ఎవనివాడు ? ఎందుకు - ఎక్కడనుండి -ఎవరి కొఱకు వచ్చాడు ? నీతో మాట లేమిటి ? భయపడక చెప్పు' అనగానే తొట్రుపాటు లేని, పతివ్రత సీత "అహిరేవ హ్యహేః పాదాన్విజానాతి న సంశయః (9). 'ఓ! రాక్షసీమణులారా! కామరూపంతో వచ్చిన వీణ్ణి రాక్షసుడే అనుకున్నాను. పాము, ఎక్కడ ఉండేదీ, ఉండగలిగేదీ, ఉంటున్నదీ, లేనిదీ, పాముకే తెలుస్తుంది. కామరూపంతో వచ్చిన రాక్షసుడేమో అనిపిస్తోంది. ఇతణ్ణి నేను ఎఱుగను" అంది. (1)

ఈ మాటలు వింటూనే రాక్షసస్త్రీలు కొందఱు పరుగెత్తారు. అక్కడే నిలబడిపోయారు కొందఱు. రావణునికి చెప్పాలని మఱికొందఱూ పోయి "ఓ రాజా! మహాపరాక్రమ వంతుడూ, సర్వ భయంకరుడూ అయిన ఒక వానరుడు, సీతతో మాట్లాడి, అశోకవనంలో ఉన్నాడు. ఆమె నడిగాం. ఏమీ చెప్పడంలేదు. ఇంద్ర - కుబేరులే పంపించారో లేదా రాముడే పంపాడోగాని నీకిష్టమైన ప్రమదావనాన్ని నాశనం చేయడమే కాక, అతి రమణీయ ప్రదేశాలన్నింటినీ పాడుచేసాడు. కాని, సీతమ్మ ఉన్న శింశుపావృక్షం గాని, ఆ చోటుని గాని ఏమాత్రమూ తాకలేదు. నీకిష్టమైన వనాన్నిపాడు చేసినందుకూ, నీవు మనసు ఉంచిన సీతతో మాట్లాడినందుకూ వాణ్ణి రెండు విధాలుగా దండించాలి" అని అన్నారు.

అప్పుడే నేయి వేసిన అగ్నిహోత్రంలా మండిపడుతూ కోపంతో రావణుడు కను గ్రుడ్లు త్రిప్పాడు. మండుతూ ఉండే వత్తి నుండి మంటతో నూనె బిందువులు నేల పడ్డట్టు, వేడి కన్నీటి బిందువులు కళ్ల నుండి రాలిపడ్డాయి. (దీప్తాభ్యా మివ దీపాభ్యాం సార్చిషస్స్నేహ బిందవః - 23). వెంటనే, తనతో సమానులైన వారిని పిలిచి, హనుమని పట్టి తెమ్మని ఆజ్ఞాపించాడు.

మారణాయుధాలు చేత ధరించి, క్షణాలలో వికారరూపులైన రాక్షసులు గుంపులు గుంపులుగా బయలుదేరారు. అశోక వనద్వారం వద్దనే యుద్ధానికై ఎదురు చూస్తూన్నట్లు నిలబడ్డ హనుమంతుని వద్దకు, మిడుతలు అగ్నిమీదికి పోయినట్లు, వెళ్లారు. (అగ్నిలో మిడుతలు భస్మమౌతాయి గాని, అగ్నిని మిడుతలు ఏమీ చేయలేవు).

ఆంజనేయుణ్ణి, ఆయుధాలు కలవారంతా చుట్టుముట్టారు. కొందఱు ఎదురుగా నిలబడ్డారు. అనేకాయుధాలని విసరడం ప్రారంభించారు. ఏదీ అతణ్ణి ఏమీ చేయలేకపోతోంది. పోరు విజృంభిస్తూన్న రాక్షసులని చూచి, ఉత్సాహంకల ఆంజనేయుడు, వారి యుద్ధపద్ధతిని తెలిసినవాడై, తోకని నేలపై కొట్టి, నోరంతా తెఱచి పెద్ద కేక పెట్టాడు (2).

అతని భుజాల చఱపు లంక అంతా మ్రార్మోగింది. ఆ మ్రోతకి ఆకాశంలో ఎగిరేపక్షులు నేలపడ్డాయి. అప్పుడు పెద్దగొంతుతో ఎక్కడెక్కడికి వినిపించే ధ్వనితో

"జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః ।
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః ।
దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః ।
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః ॥ (3)

న రావణ సహస్రమ్మే యుద్ధే ప్రతిబలం భవేత్। (33–35)"

ఓ రాక్షస జనులారా! అతిబలుడైన రామునికి, మహాబలుడైన లక్ష్మణునికి జయము. రామునిచే రక్షింపబడే సుగ్రీవునకునూ జయము. నేను కోసల దేశాధీశుడైన రాముని దాసుణ్ణి. వాయుపుత్రుణ్ణి. ఎలాటి శత్రువులనైనా సంహరించగలను.

రాళ్లూ, చెట్లూ ఇతరాయుధాలతో పోరాటానికి నేను దిగడం అంటూ వస్తే, వేయిమంది రావణులు కూడా నా ముందు చాలరు. మీ రంతా చూస్తూండగానే లంకా నాశనం చేసి, సీతమ్మకి నమస్కారం చేసి, ఇప్పటికి పని పూర్తి చేసికొని పోతాను' అని అన్నాడు. భయపడిపోయిన రాక్షసులు, రాజాజ్ఞ ఉందని భయపడి, యుద్ధం చేయడం మొదలెట్టారు. తన చుట్టూ మూగిన రాక్షసులంతా తనపైకి వస్తూంటే, అశోక వనద్వారానికి ఉన్న పెద్ద ఇనుపగుదియ ఊడబీకి, రాక్షసుల మీదపడి, చాలమందిని బీభత్సంగా చంపి, గరుడుడు సర్పాన్ని పట్టుకొన్నట్టు, ఆ గుదియతో ఆకాశానికి ఎగిరి, మళ్లీ పూర్వంలాగానే, ఆ ద్వారంవద్ద నిలబడ్డాడు.

రాక్షసులు కొందఱు, గుంపుగా మళ్లీ వెనక్కి కదిలి, జరిగినవిషయం రావణునకు చెప్పారు. కనుతెప్పలని పూర్తిగా తెఱచి, గ్రుడ్లని కదప కుండా తీక్ష్ణంగా చూస్తూ, అనేక యుద్ధాలలో జయం తెచ్చిపెట్టిన ప్రహస్తుని పుత్రుడు 'జంబుమాలి' అనే రాక్షసుణ్ణి యుద్ధానికి పొమ్మని రావణుడు ఆజ్ఞాపించాడు.

## విశేషాంశాలు

(1) సీతమ్మకి తెలిసి కూడా, హనుమగూర్చి తెలియదనడం 'అసత్యం' కదా! అని శంక. సత్యం చెప్పడమనేది ధర్మం. తాను సత్యం పల్కినందువల్ల, వేఱొకరికి (ఉపకారికి) అపాయం కలిగేటప్పుడు తెలియదని, ఈ విధంగా పలకడం అసత్యం కాదనేది ధర్మసూక్ష్మం. గోవుని చంప పరిగెత్తే వేట్టవాళ్లు, మహర్షిని అడిగారుట "గోవు ఎటు పారిపోయింది?" అని. "చూచిన కళ్లు చెప్పలేవు. చెప్పేనోరు చూడలేదు" అన్నాడాయన. ఈ వేదాంతితో మనకేమిటని వారు వెళ్లిపోయారట. ఏ కోణంలోనైనా ఇదీ పాపమే అయితే, అనుభవింప సిద్ధమై సీతమ్మ ఇలా పల్కింది.

మఱో అర్థంకూడ ఉంది. హనుమ ఇలాటి వాడనీ, ఇక్కడుంటాడనీ ఒకవేళ ఆమె చెపితే, సమయానికి తగినట్టు వ్యవహరించే బుద్ధిమంతుడైన అతడు, సీత చెప్పినట్టు అక్కడ లేకపోయినా, పరిస్థితిని బట్టి సీతమ్మ చెప్పినట్టు వ్యవహరించకపోయినా, అప్పుడైనా సీతమ్మ 'అబద్ధం' ఆడినట్లు (రాక్షసుల దృష్టిలో) అవుతుంది. నిజం చెప్పమని మఱింత హింసిస్తారు. సమాధానం చెప్పగల హనుమని హింసిస్తే, రాక్షస బలమూ హనుమకి తెలుస్తుంది. తనకీ హింస తప్పుతుంది,' అని కూడ సీత భావన. ఇది అమ్మవారు చూపిన ధర్మసూక్ష్మం.

అలాగే మఱొకటి. దశరథుడు రథాన్ని ఆపమంటూంటే, రథం తోలమని (అరణ్యానికి బయలుదేరుతూ) రాముడాజ్ఞాపించాడు. సుమంత్రుడైన తాను, రాజాజ్ఞని పాటించాలి. ఏం చేయమంటావని రాముణ్ణి అడిగాడు.

రథం చప్పుడులో వినబడలేదని చెప్పమని రాముడన్నాడు. (నాశ్రౌషమ్) విన్పించిందని చెప్పి వెను తిప్పితే తండ్రి దశరథుడు అధర్మపరుడై, మాట తప్పిన వాడౌతాడు. ధర్మాన్ని తప్పబోయే తండ్రిని, ధర్మం తప్పనీయకుండా చేసేందుకై అసత్యమాడవచ్చనీ, అలా ధర్మం గతి తప్పేప్పుడు అసత్యం ఆడడం అధర్మం కాదనే, ఈ ధర్మసూక్ష్మం, 'అయ్యవారు' చూపినది.

(2) యుద్ధానికి రాక్షసులంతా వచ్చాక, సీతని రాక్షసులు అడిగిన ప్రశ్నకి, తాను సమాధానం చెప్పాడు, యుద్ధం చేయకుండా ఆగినది-అందఱూ రావడానికే. మీద

విసరుతూన్నా మౌనంగా ఉన్నది - వారి యుద్ధ పద్ధతీ, బలమూ గ్రహించడానికే. రామ భావభావన ఉన్న హనుమ, రామునిలాగే ఇక్కడ ముందుగా వారినే ప్రారంభించనిచ్చాడు. (తాటక - విరాధ - ఖర దూషణాది వధలో ముందు వారే యుద్ధం ప్రారంభిస్తారు). వారి బలం గ్రహించాక, వారికంటె పెద్దగా అఱపు, వారికంటె వేగంగా ఆకాశంలో తిరగడం, వారు చేయలేని ఇనుప గుదియని లాగివారిని చంపడం, వారు ఎన్నడూ చేయలేని, లోక గిరగిరా తిప్పి నేల బాదడం, వంటి కృత్యాలు చేయడం, చేసాడు. దీనితో భయపడ్డారు రాక్షసులు. అదే, హనుమ కోరుకున్నది కూడ. ఇనుప గుదియని లాగడం - ఇలా అన్ని ప్రధాన ద్వారాలనీ నాశనం చేసి, మా వానర సైన్యాన్ని లంకలోకి తేగలనని సూచించడానికి - ఎక్కడో యుద్ధం చేస్తూన్నా, సీతమ్మ, స్పష్టంగా దూరంనుండైనా తనకి కన్పించడానికి - ఇలాంటివి పీకి యుద్ధం చేయడమనేది ఎఱుగని రాక్షసులకి, ఇంకా ఇలాటి చిత్రాలు ఎన్నో చేయగల ఈ కోతితో, యుద్ధం చేయలేమనే భయం కల్గించడానికి - వచ్చినవాడు వానరుడు మాత్రం కాడని గ్రహింప జేయడానికిను.

**(3) జయత్యతిబలో రామో .... మారుతాత్మజః వఱకూ ఉన్న భాగాన్ని పడుకువేటప్పుడు చదువుకుంటే, చెడ్డకలలు రావనేది అనుభవంలో ఉన్న విషయం. అలాగే నిత్యం మననం చేసే వారిపై, క్షుద్రశక్తులు పనిచేయవే చేయవు. తనకు తాను తన గుఱించి చెప్పుకున్న మాటలుకదా అవి!** రాముని వద్దనుండి వచ్చేటప్పుడూ, వచ్చాకా, కూడ (దూతోఽహం గమిష్యే) నేను 'రామదూత'ని అన్న ఆంజనేయుడు, అమ్మ వారిని చూచాక, పల్కరించాక, 'సుఖంగా వెళ్లిరా, విఘ్నం లేకుండుగాక' (శివశ్చతేఽధ్వా చ) అని ఆశీర్వచనం పొందాక - 'దాసోఽహమ్' - నేను రామదాసుణ్ణి అన్నాడు.

యజమాని చెప్పిన పనికి వెళ్ళకుండా నిరాశగా వల్కేవాడూ లేక శాశ్వతంగా పని కాని తీరుగా చేసేవాడూ అధమ దాసుడు. చెప్పిన దానిని మాత్రం చేసేవాడు మధ్యమ దాసుడు. చెప్పిన పనిని సానుకూలపఱచేందుకై ఇంకా ఏమేమిచేయాలో ఆలోచించుకొని మఱీ చేసికొని వచ్చేవాడు ఉత్తమ దాసుడు. ఇలాటి ఉత్తముడు ఆంజనేయుడు.

కాబట్టి ఆంజనేయుడు రామదూత కాడు. రామదాసుడు లేదా రామబంటు. ఇక సీతా విషయమైన అపహరణాన్ని చెప్పి, సీత కోసం ప్రాణాన్ని, రాముని ఒడిలో విడిచి, రామునిచే అగ్నిసంస్కారం పొందిన జటాయువు రామబంధువు. (తర్వాతి కాలంలో దురదృష్టవశాత్తూ (రాంబందు-రాబందు' అయింది. చరిత్ర పోకుండా ఉండాలంటే 'రామబంధు' అనడం ఉచితం).

✻ ✻ ✻

# 43వ సర్గము

## రావణుడు ఇక ఉండబోడు!

'అస్త్రవిజ్ఞయతాం రామో లక్ష్మణశ్చ మహాబలః।
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః (8)

హనుమ కింకరులనందఱినీ చంపి, పాడుబడ్డవనాన్ని కూడ చూచి, మేరుపర్వత శిఖరంలా ఎత్తుగా, అందంగా ఉన్న చైత్య ప్రాసాదాన్ని పరిశీలించి, దీన్ని పగులగొట్టి నా శక్తి చూపాలి' అని భావించాడు. (వనాన్ని పాడుచేయడం - చెట్లతో యుద్ధాన్ని చేయగలను - అని చెప్పడంకోసం. ప్రాసాదాన్ని విఱుగ కొట్టాలనుకోవడం, లంకలో ఉన్న ఇన్ని ఎత్తైన మేడల్లో ఎక్కడో ఓచోట దాగి బ్రతుకుదాం-అనే 'ఆశ', రాక్షసులక లేకండా చేయడంకోసం-ఇలాతోచినట్టు యుద్ధం చేయడం, చేసేవాడు 'కపి', కాబట్టి అతని ధర్మయుద్ధ మిదేమో అని భావించేందుకు. అలాగ, తోచినట్టుగా ఇష్టంవచ్చినట్లు చేసే యుద్ధం, రాక్షసులకి రానేరాదని 'నిరాశ' పఱచేందుకూ, ఒక ప్రక్క సీతమ్మకి సంపూర్ణధైర్యం కల్గించేందుకూను.

చైత్య ప్రాసాదం, సీతమ్మకీ రావణ భవనానికీ నడుమ అడ్డుగా ఉంటుంది. దీన్ని తీసేస్తే, తానేం చేసేదీ సీతమ్మకి తెలిసి ధైర్యంగా ఉంటుందని మారుతి భావన. తన రూపాన్ని పెద్దది చేసి చూపడం, పెద్దశరీరం చేసి చూపే అలవాటున్న రాక్షసులు, ఎన్నడూ హనుమంతుడంతటి రూపాన్ని ధరించలేమని భావించేందుకు). అంతలోనే ఆ భవనం మీదికి దూకాడు. జబ్బ చఱిచాడు. సింహనాదం చేసాడు. యుద్ధానికి పిలిచాడు. గంగానదిలో సుడిగుండంలా ఎందఱిని తనలో కలిపి తిప్పుతున్నాడో తెలియదు. ఆ గృహానికి, శిల్పవిన్యాస మెంతో ఉన్న బంగారు స్తంభం ఉంది. దాన్ని పెకలించి మిక్కిలి వేగంగా తిప్పాడు. ఆ వేగానికి నిప్పుజనించింది. (ఆకాశాద్వాయుః వాయోరగ్నిః - వేగంగా తిప్పబడిన వాయువు నుండి 'Current' or 'Power' పుట్టింది.) భవనం చూస్తుంటే తగులబడసాగింది. స్తంభాన్ని అడ్డంగా తిప్పి నూరుగురు రాక్షసులనీ ఒకే మోదుతో పైకి పంపించి, తాను ఎగిరాడు.

ఆకాశంలో నిలిచాడు. పక్షులు నేలరాలేంతటి అఱపుతో "సీతాన్వేషణానికి వానరరాజు సుగ్రీవుడు, వేలకువేల మందిని పంపాడు. నూఱు, వేయి, పదివేల ఏనుగుల బలం వారున్నారు వారిలో వాయుదేవుని బలం ఉన్న వారున్నారు. అస్త్రాలన్నీ తెలిసిన

రామునికి (1) మహాబలుడైన లక్ష్మణునకూ జయము. రామరక్షణలో ఉన్న సుగ్రీవునకు శుభము కల్గుగాక ! వానరు లందరికీ కోరలూ, గోళ్లే ఆయుధాలు. (2) అవి విరిగినా, విరిచేసినా, ఇలా ఇనుప గుదియలతో - ఏది కన్పిస్తే దానితో చంపుతాం. ఆయుధాలంటూ మాకు అక్కరలేదు. మీ రావణుడు, రామునితో వైరం కావాలని పెంచుకున్నాడు. వాడూ బ్రదుకడు. లంకా ఉండదు, అని చాటింపు వేస్తూ తిరుగుతున్నాడు ఆకాశంలో

## విశేషాంశాలు

(1) మంత్రపూర్వకంగా పనిచేసే మారణాయుధం అస్త్రం. 'మాకు అనేక-అస్త్రాలున్నాయి. రాముడేం చేయగలడనుకోవద్దు.

రాముడు అస్త్ర వేత్త. పైగా 'జయత్యతి బలోరామః' - తాను వేసిన బాణాలు బాధిస్తాయిగాని, ఎదుటివాని బాణాలు వ్యర్థమౌతాయి. ఇలాటిది 'అతి బల' విద్య. విశ్వామిత్రుడుపదేశించాడు రామునికి. కాబట్టి 'అతిబల విద్య' కలవాడూ, మీకున్న అస్త్రవిద్యే తనకీ ఉన్నా, ధర్మంతో నిత్యమూ జీవించేవాడూ, అయిన రామునికి పలికినట్లు, ఇది నీకు పనిచేయదని సారాంశం.

ప్రతిపర్యాయమూ 'సుగ్రీవునికి జయం' అనడానిక్కారణం - ఈ సుగ్రీవుని భార్యని 'వాలి' ఎత్తుకుపోతే, వాణ్ణి చంపి, భార్యని సుగ్రీవున కిప్పించాడు.

ఇప్పుడూ అదే కథ. రావణుడు, రామ భార్యని ఎత్తుకువచ్చాడు 'వాలి'లా.

కాబట్టి న్యాయాధికారి, ఒకే నేరానికి, వ్యక్తిని బట్టి శిక్షని మార్చనట్లు, ఓ రావణా ! నీకూ అదే శిక్ష విధించక తప్పదు. ఆ శిక్ష, నా మీద పడదని ఆలోచింపకు. అస్త్రాలని ఎరుగున్నవాడు రాముడు! అని రావణునకు హనుమ హెచ్చరిక.

ఈ విషయం అందరికీ ఒకేసారి చెప్పేందుకూ, అందరూ కలిసి ఆలోచించుకొని తమ భయాన్ని రావణునికి చెప్పేందుకూ, ఆకాశంలో ఎగరడం.

(2) మాకు సహజమైన ఆయుధాలు గోళ్లూ, కోరలూ, వాటికి, రాచుకోవడం, పదునుపెట్టుకోవడం వంటి బాధలులేవు.

కత్తి లేదా ఇతర మారణాయుధాల గాయాల బాధ తగ్గుతుందేమో గాని, మా గోళ్ల, కోరల గాయాల బాధ మరణాంతం చావుతో సమానమే. గమనించండని హెచ్చరిక.

❀ ❀ ❀

# 44వ సర్గము

## మఱికొంతమంది మంత్రి పుత్రులూ! పొండి!!

రావణుని ఆజ్ఞకు కట్టుబడి, ప్రహస్తుని పుత్రుడు జంబుమాలి యుద్ధానికి వచ్చాడు. ఎఱ్ఱటి పూదండలు మెడలో వ్రేలాడుతున్నాయి. ఎఱ్ఱటి వస్త్రాలు కట్టాడు. ఇంద్రధనుస్సు వంటి వింటినుండి, పిడుగుచప్పుళ్లలా వింటి నారి ధ్వనుల్ని దిక్కుల్లో నింపుతూ, కంచర గాడిదల రథం మీద రాసాగాడు. హనుమ, పూర్వం కూచున్నట్టే ద్వారపు దూలం మీద కూర్చున్నాడు. చూస్తుండగానే వింటినుండి అర్ధ చంద్రాకార బాణం హనుమంతుని ముఖానికి తగిలి, రక్తాన్ని చిమ్మించి, ఉదయసూర్యునిలా నుదుటిపై కన్పించింది. మఱుక్షణంలో, ముద్దమొన ఉన్న పదిబాణాలు వేగంగా శరీరానికి గుచ్చుకున్నాయి. ఒళ్లు తెలియని కోపం హనుమకి వచ్చింది. ఇటు అటు చూచాడు. పెద్ద బండరాయి కన్పించింది. పెళ్లగించి జంబుమాలి మీదికి విసిరాడు. మళ్లీ విడిచిన పదిబాణాలూ ఆ రాతిని, ముక్కలు ముక్కలు చేసాయి. అవమానంగా భావించిన మారుతి, పెద్ద మద్దిచెట్టుని విసిరాడు. మళ్లీ పూర్వంలానే వ్యర్థమై పోయింది. ఇక లాభంలేదని, మళ్లీ ఇనుపగుదియని తీసి జంబుమాలి వక్షఃస్థలం మీదకొట్టి, నేలమీద పడేసి, తలా, చేతులూ, మోకాళ్లనూ దానితో బాది, గుఱ్ఱాలనీ, రథాన్నీ నాశనం చేసాడు. ఆభరణాలు కూడా చెదరకుండా శ్వాసవిడిచాడు, జంబుమాలి.

'కింకరులు' అనే భయంకరమైన రాక్షసులు పోయారు. 'జంబుమాలి పోయాడు' అని విన్న రావణుడు, ఎఱ్ఱటి కన్నుల్ని త్రిప్పుతూ, ఏడుగురు మంత్రి పుత్రులనూ పిలిచి, 'మీరు హనుమమీదికి పొండి' అని ఆజ్ఞాపించాడు. (తస్య చైవ శిరో నాస్తి న బాహూ నచ జానునీ న ధనుర్న రథో నాఽశ్వాః తత్రాదృశ్యన్త నేషవః (17) - జంబుమాలి శరీరం ఎలా ఏ అవయవానికి ఆ అవయవం, వేఱువేఱుగా పడి ఉందో, అలాగే ఈ శ్లోకంలో పదాలు కూడా, ముక్కముక్కలుగా ఉండడం వాల్మీకి రచనలో విశేషం.

ఒక్కడు - అందునా వానరుడు - అందునా ప్రత్యర్థి రాముని నుండి వచ్చినవాడు - ఇంతమందిని నిస్సహాయుడై చంపుతున్నాడనగానే, ఎంతటి తెలివిలేనివాడు కూడా, ఉన్న సైన్యాన్ని అంతనీ, ఒక్క మాఱు పంపిస్తాడు గాని, ఒకరిపిమ్మట ఒకరిని యుద్ధానికి పంపిస్తాడా ? ఓడిపోతూ కూడా ? అందఱినీ ఒక్కమాఱు పంపడం, పరువుతక్కువ అని ఆలోచిస్తాడా? యుద్ధకాండలో కూడా, అందఱినీ ఒక్కమాఱు పంపడం జరుగలేదు - కాబట్టి ఈ రాక్షసు లందఱినీకూడా రామదాసుని చేతిలో మరణింప చేయాలనీ, తాను రాముని చేతిలో మోక్షాన్ని పొందాలనీ, రావణాభిప్రాయంగా తోస్తుంది).

❋ ❋ ❋

# 45వ సర్గము

## ఇంకా ఎవరొస్తారో! రండి!!

రావణాజ్ఞపై ఏడుగురు మంత్రిపుత్రులూ, ఒకేమాటు రథాలమీద బయలుదేరారు. బంగారపు జెండాకట్టులు, బిరుదు జెండాలు, ఉన్నత వంశీయ అశ్వాలూ, కలిగిన రథాలు బయలుదేరాయి. చక్కని చెక్కడం పని కల పళ్లతో, మెఱుపులుకల మేఘాల్లా బయల్దేరి 'నేను ముందు అంటే నేను ముందు' అని హనుమ మీదికి దూకారు.

(ఎవరు, ఏయే ఘట్టంలో, హనుమచేత చావవలసివస్తే, రావణుడు వారికి వారికి, వార్త పంపుతున్నాడు. 'నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్' అంటే యిదే !

చావవలసిన యోగం వీళ్లకి ఉన్నా, ఆంజనేయుడు చంపాడని అనుకోవడానికే ఈ ప్రయత్నం.

'అడవి రక్షణలేని యబలుండు వర్ధిల్లు - రక్షితుండు మందిరమున చచ్చు-' (పోతన 7/41) - ఏ రక్షణాలేని నిస్సహాయుడు జీవిస్తాడు. అన్ని రక్షణలూ ఉన్నవాడు, తన యింట్లోనే పోవచ్చు' అని.

గృహ-వివాహ-సంతాన యోగాలెలాగో, అలాగే మృత్యువనేదీ ఒక యోగమే. అలబ్ధస్యలాభో యోగః-నిన్నటి వఱకూ లేనిది - నేడు రావడం యోగం. ఇప్పటి వఱకూ లేని రావణబుద్ధి, ఈ రోజు వీరిని ఎందుకు పంపమంది? వీరికి చావుంది కాబట్టి) ఆ ఏడుగురూ, ఒకేసారి బాణవర్షం ప్రారంభించారు.

చేసేది లేక, కొందఱిని గ్రుద్ది, మఱికొందఱిని క్రుమ్మి, ఇలాగే గీరి, ఱక్కి, కొరికి, వారందఱినీ చంపేసాడు.

దీనిని గమనించి, రాక్షస సైన్యమంతా పారిపోతూంటే, చూచి, మఱికొందఱిని కూడ చంపాలనే ఉత్సాహమున్న వాడై, అందఱూ కన్పించడానికి వీలుగా, అందఱికీ కన్పించేందుకుగా, మళ్లీ తోరణద్వారమే ఎక్కికూచున్నాడు.

(ఆ ద్వారమూ, ద్వారం మీద హనుమా - ఈ రెంటినీ చూస్తున్న రాక్షసులందఱి పై ప్రాణాలూ - పైనే పోయాయి).

❀ ❀ ❀

# 46వ సర్గము

## మళ్లీ తోరణద్వారమే ఎక్కిన హనుమ

అమాత్య పుత్రులు కూడ హనుమ చేతిలో చనిపోయారని విని రావణుడు క్రుంగిపోయి, విరూపాక్ష - యూపాక్ష - దుర్ధర - ప్రఘస - భాసకర్ణులని పిలిచి "ఓ! సేనానాయకులారా ! మీ అందరినీ వెంట పెట్టుకుని నాగ - యక్ష - అసుర - మహర్షులని ఎందరినో జయించాను. విశేషించి దేవేంద్రుణ్ణి ముప్పుతిప్పలు పెట్టాను. వారంతా కలసి చేసే పనియిది - అని భావిస్తున్నాను.

ఇతడు చూపే పరాక్రమం బట్టి, వానరుడు కాడని ఎప్పుడో తేలిపోయింది. కోతిజాతికి చెందిన వాలి - సుగ్రీవ - నీల - ద్వివిదులనీ - భల్లూక జాతికి చెందిన జాంబవంతుణ్ణి చూచాను గాని, వారెవరికీ ఈ తేజస్సూ, బలం, ఇష్టం వచ్చినట్లు పోరాడే శక్తీ అలసట లేని తనమూలేవు. ఏదో మహాభూతం ఇలా వచ్చి ఉంటుంది. భయపడక, ఆత్మరక్షణం చేసికొంటూ, వాణ్ణి పట్టితెండి" అన్నాడు.

5 రథాలూ, ఒకేసారి విడిచిన బాణాల్లా కదిలాయి. హనుమచుట్టూ మోహరించాయి. దుర్ధరుని వింటినారి ధ్వనించింది. హనుమ శిరసుకి ఐదు బాణాలు తగిలాయి. ఆకాశంలోకి ఎగిరిన అతనిపై నూట్లకొలది బాణాలని భుజానికి గ్లాని లేకుండా విడుస్తూనే ఉన్నాడు దుర్ధరుడు.

చూచిచూచి, ఏ ఆయుధమూ దొరుకని హనుమ, తనంతతానే, కొండపై పిడుగులా, దుర్ధరుని రథంపై పడ్డాడు. దుర్ధరునికి, గాలి పీల్చవలసిన అవసరం ఇక లేకపోయింది.

విషయం అర్థమైన విరూపాక్ష. యూపాక్షులకు, ఇది కోపకారణం అయింది. వాళ్లిద్దరూ మీదికి దూకుతూండగానే, నేలమీది పెద్ద మ్రానున్న మద్దివృక్షాన్ని వాళ్లమీదికి వేసాడు. ఈ యుద్ధవిధానం తెలియని కారణంగా, వాళ్లిద్దరూ మట్టికరిచారు.

ముగ్గురు చనిపోవడం చిత్రంగా తోచిన ప్రఘసుడూ, భాసకర్ణుడూ చెరి ఒకవైపునుండీ శూలాలు పట్టుకొని, కత్తులతోనూ చిత్ర విచిత్రంగా గాయపరుస్తూ హనుమని రక్తపు ముద్ద చేయసాగారు. దుర్మార్గులకి వెంటనే సమాధానం చెప్పాలని, మృగ-పర్వ సంకులమైన పర్వతాన్ని హనుమ వారిమీద విసిరి చంపాడు.

సహజమైన కోతి చేష్టలతో ఒకవిధమైన అలజడీ, కంగారూపుట్టించి, గుఱ్ఱాలు గుఱ్ఱాలతోనూ, ఏనుగులు ఏనుగులతోనూ, రథికులు రథికులతోనూ పోరాడేలా చేసాడు(1). ప్రాణభీతితో పరిగెత్తే మృగాలు ఒకటికొకటి తగిలి రెండూ చావడం అనేక సందర్భాల్లో జరిగింది.

'దారి' అనేది తెలియకుండా విరిగిన రథాల ముక్కలూ - రాక్షస శరీరాలూ- అవయవాలూ - గడ్డగట్టిన నెత్తురు బురదా - అసహ్య వాసనాతో ఆ ప్రదేశమంతా నిండిపోయింది. ప్రళయకాలంలో ప్రజాక్షయం చేస్తూన్న కొద్దీ, ఉత్సాహం పెరిగే యమునిలా, మళ్లీ తోరణద్వారం మీద కూర్చుని 'ఎవరొస్తారా ?' అని ఎదురు చూడ సాగాడు హనుమ.

## విశేషాంశాలు

(1) హనుమ లంకకి ఎగిరే ముందునుండీ, రామ భావభావన కల వాడేనని అనేకా ధారాల ద్వారా నిరూపింపబడుతోంది.

అందుకే, సీత బ్రతికున్న విషయమూ, రావణ నివాసస్థానమూ మాత్రమే, కనుక్కోవలసినవాడే అయినా, రాముని యుద్ధానికి ఎదురయ్యే అన్ని ప్రశ్నలనీ, ఆయన మనసులో తావే వేసికొని, సమాధానాలని సిద్ధం చేసి కొంటున్నాడు.

రావణ సైన్యం, యుద్ధ పద్ధతి, ఆయుధాలు - రహస్యాలు వంటివి అన్నీ ప్రశ్నలే కదా ! ఇలాటి హనుమ యుద్ధంలో కూడా రామ పద్ధతినే అవలంబించాడు.

నిస్సహాయుడై 14 వేల మందిని రాముడు చంపినట్లు తానూ జంబుమాలినీ - ఏడుగురు అమాత్య పుత్రులనీ - ఈ ఐదుగురు సేనానాయకులనీ పొట్టబెట్టుకున్నాడు.

రాముడు వారిలో వారికి యుద్ధాన్ని కల్పించినట్లు, తానూ, ఇక్కడ రథిక - అశ్వ - గజాల మధ్య యుద్ధం ఏర్పాటు చేసి వధింపచేసాడు.

రామదూత అంటే సందేశహరో దూతః' అన్నట్లు, పట్టి సందేశాన్ని మాత్రం చెప్పివచ్చేవాడు ఔతాడు. కాని రామ భావభావన ఉండీ, సర్వాత్మనా రామ విజయాన్ని కాంక్షిస్తున్నవాడు కాబట్టే ఈయన 'రామదాసుడు' ఔతాడు.

❀ ❀ ❀

# 47వ సర్గము

## రావణ వంశనాశన ప్రారంభం

కోపం, దుఃఖంతో, నిండిన తండ్రియైన రావణుని చూపు 'అక్షకుమారుడి' పై పడింది. అంతలోనే ద్వారంవద్దకు వచ్చిన బంగారు రథం ఎక్కాడు. రత్నాలూ - మణులూ పొదిగిన టెక్కెం దానిది. ఏ అడ్డూ లేకుండా పరిగెత్తే గుఱ్ఱాలున్న ఈ రథానికి దేవతలు ఎప్పుడూ భయపడేవారు.

రథంలోని ఇటు గోడలకు అమ్ముల పొదులూ, ప్రక్కగా విల్లూ, ఆ క్రింది వరుసలో తోమరాలూ, శక్తి ఆయుధాలూ ఉంటే, అటుప్రక్క గోడలకు, అతడు యుద్ధాల్లో జయించినప్పుడు - అప్పుడప్పుడు వేయబడిన వెండి-బంగారు పూలదండలు ఎన్నో అమర్చబడి ఉన్నాయి.

తోరణ ద్వారం వద్ద హనుమని తన తేనెరంగు కన్నులతో చూస్తూనే అమిత పరాక్రమవంతుడని, మెచ్చుకోలుతో చూచి లోపల ఎంతగానో ప్రశంసించాడు.

ఎలా యుద్ధం చేయాలో ఆలోచించుకుంటూండగానే, అక్షుడు హనుమంతునికి చేరువ అయ్యాడు. ఎప్పుడు గురిచూచాడో, ఎప్పుడు బాణాన్ని ఎక్కుపెడుతున్నాడో, తెలియదుగాని, వింటినారి వంగి, మామూలు స్థితికి వచ్చి, ధ్వనిస్తూ ఉండడాన్ని బట్టీ, ఎదురుగా ఉన్న ఆంజనేయుని నుదుటి రక్తధారలు అతని కళ్లని ఎఱ్ఱగా చేయడం బట్టీ, బాణాలు విడువబడ్డాయని అర్థమౌతోంది.

విషంతో సమానమైన మూడుబాణాలు, తన రక్తానికి కారణమని గమనించి మారుతి, సంతోషించాడు. అక్షుని యుద్ధాన్ని మనసా ప్రశంసించాడు. చంపితే, వీణ్ణే చంపాలని భావించాడు.

ఈ పోరాటం (రావణ పుత్రునితో యుద్ధం కదా!) విలువైనదని భావించి, ఆకాశంలో నిలబడి ఎందరో చూడసాగారు.

దుమ్ము రేగింది. సముద్రం అలలు పెంచింది.

సూర్యుడు చల్లబడ్డాడు. గాలి ఆగింది.

ఆకాశం రంగు మారింది. కొండలు కదలాడాయి.

అక్షుడికూడా హనుమ పరాక్రమం నచ్చింది. బాణాలని వర్షంగా కురిపిస్తూన్నా, గాయమై రక్తం సెలయేటులా ప్రవహిస్తూన్నా, చలించని అతణ్ణి ప్రశంసించాడు. ఎన్ని బాణాలు విడిచినా బాణబాణానికీ నడుమ సందులో నుండి వేగంగా నిరాయుధుడై తప్పించుకొనే అతని బుద్ధి చాతుర్యానికి సంభ్రమపడ్డాడు అక్షుడు. రెండే రెండు బాణాలతో హనుమని చంపదలచి ఎదుటిరొమ్ముపై కొట్టాడు.

అంతే! యుద్ధంలో ఇంతసేపూ వినోదించాను. విజృంభించే వీణ్ణి గడితేర్చక పోవడం సరికాదు. యుద్ధ తంత్రం తెలిసినవాడు కాబట్టి, చంపాలి (రామ జయంకోసం), ఉపాయమేమిటి? అని ఆలోచించి వీనిని ప్రాణాలతో విడిస్తే, వానరసేన చాలవటకు వీడితో పోరులో నిమగ్నమౌతుంది.

అంటుకున్న నిప్పుని ఆర్పకపోవడం బుద్ధిహీనుల లక్షణం అనుకుని, ఒక్కమాటు ఆకాశానికి ఎగిరి, గుఱ్ఱాల మీదికి దూకి అఱచేతులతో కీటకాలని చంపినట్లు చంపి, ఇరుసుని విఱుగదన్నాడు.

ఆ సమయానికి ఆకాశంలో ఎగిరే ఆ రథం నేలబడింది. దేహాన్ని విడిచి స్వర్గానికి పోయే మహర్షిలా రథాన్ని విడిచి, అక్షుడు ధనుస్సూ ఖడ్గంతో యుద్ధానికి తలపడ్డాడు ఆకాశంలోనే.

పైపైకి ఎగిరివస్తూన్న అక్షుణ్ణి చూచి ఒక్కమారుగా క్రిందికి దిగి, కాళ్లు రెండూ పట్టి, గరుడుడు సర్పాన్ని లాగా, వేలమార్లు గిరగిరా త్రిప్పి నేలమీద విసిరాడు.

నేలమీద నెత్తురూ, మాంసపు ముద్దలూ, విఱిగిన అవయవాలూ మాత్రం కన్పించాయి. యుద్ధం చూచిన వారికి తెలిసింది - అవి అక్షకుమారుని వని.

ఎఱ్ఱని కోపంతో వెలిగే కన్నులున్న హనుమని భయభయంగా చూస్తూ యక్ష-నాగ-దేవతలు ఆశ్చర్యపడుతూంటే, తన స్థానం ఇదే అన్నట్లుగా మళ్లీ 'తోరణ ద్వారం' ఎక్కి కూచున్నాడు హనుమ.

(దుమ్ము రేగడం- సముద్రం అలల్ని పెంచడం - సూర్యుడు చల్లబడటం - గాలి ఆగిపోవడం - ఆకాశం రంగు మాఱడం అనేవి క్రమంగా పంచభూతాలలోని మార్పుల్ని సూచిస్తాయి. వాటి సహజ లక్షణాలని పంచభూతాలు కోల్పోవడం రావణుని అశుభాన్ని సూచిస్తున్నాయి. పంచభూతాలనీ విరోధించకుండా ఏవనైనా చేయాలి. ఏతేషామవిరోధేన.....అని కదా సంకల్పం చెప్తోంది).

❀ ❀ ❀

# 48వ సర్గము

## బ్రహ్మాస్త్రం హనుమని కట్టి తెచ్చింది

పుత్రుడు పోయిన దిగులుతో కొంతసేపటికి తేరుకున్న రావణుడు, పుత్రుడైన మేఘనాథుణ్ణి చూచి (ఇంద్రుణ్ణి జయించడంచేత 'ఇంద్రజిత్' అనేది బిరుదు పేరు) "నాయనా! అస్త్రాలనీ, శస్త్రాలనీ ఎఱిగి, సురలకీ, రాక్షసులకీ మన ధర్మ ప్రకారం బాధలని కల్గించిన వీరుడివి. బ్రహ్మని ఆరాధించి బ్రహ్మాస్త్రాన్ని పొందినవాడివి. దేశకాల విధానం తెలిసిన మతిమంతుడివి. ఈ తపోబలం, పరాక్రమం మనకి విజయాన్ని తెస్తుంది. చూచావుగా! మనవారంతా ఒకరివెంట ఒకరు యమపురికి వెళ్లారు. మన అక్షుడుకూడ వెళ్లాడు. నీయంత సమర్థత లేకపోవడం కారణం.

మన సైన్యం నశించకుండా, ఎదుటివాని బలం తెలిసికొని పో ! వాడివేగం వాయువుకీ, తేజస్సు అగ్నికీ, లేవనిపిస్తోంది. వజ్రాయుధానిక్కూడా లొంగని పరాక్రమశీలిగా అగుపిస్తున్నాడు. నాకు నిన్ను పంపడం ఇష్టంలేకున్నా, దివ్యమైన నీ అస్త్రబలాన్ని స్మరిస్తూ, రాజక్షత్ర ధర్మాన్ని బట్టి పంపుతున్నాను! జాగ్రతతో విజయం సాధించు" అన్నాడు. తన చుట్టున్న వారంతా జయ జయధ్వానాలు చేస్తుంటే, తండ్రికి ప్రదక్షిణం చేసి, నమస్కరించి యుద్ధానికి వెళ్లాడు ఇంద్రజి. (ఇంద్రజిత్తు).

నాలుగు పెద్దపులులున్న రథం మీద, వింటినారిని మ్రోగిస్తూ, వస్తూనే క్రూరనారాచాల్ని విడిచిన ఇంద్రజిత్తుని మారుతి చూచాడు. క్రూరమృగాల అఱపులూ, పక్షులు గుంపులు గుంపులుగా తిరుగుతూ చేసిన ధ్వనీ, రాక్షస వీరుల కోలాహలంతో దిక్కులన్నీ ధ్వనిమయమైతే, ధూళితో కళ్లు కన్పించనంతగా అయింది.

ముందుగా ఎదుటి వారి బలాన్ని పరిశీలించే స్వభావమున్న హనుమ, ఆత్మరక్షణ చేసికో ప్రారంభించాడు. దాన్ని భయంగా భావించిన ఇంద్రజిత్తు, బంగారపు ములుకులుండి ఱెక్కలు కట్టిన, పాడుగాటి బాణాలని వజ్రాయుధంతో సమాన వేగంతో విడిచాడు. ఇంద్రజి బాణాలు విడిచిన ప్రతిసమయంలోనూ భేరీలూ-కాహళులూ-తప్పెట్లూ-వింటినారి ధ్వనులూ మిన్నుముట్టుతున్నాయి. బాణం విడిచే సమయానికి ఎదురుగా ఉండి, బాణం తగిలే కాలానికి ఒక్కక్షణం ముందే, పైకి ఎగురుతున్నాడు పావని.

ఇద్దఱూ అమిత వేగమున్నవాళ్లే. యుద్ధ విశారదులే. ఒకరి కొకరు తగ్గక పోరాడుతున్నారు. ఇంద్రజిత్తు బాణం వేయడంలో ఎంత గట్టివాడో, తప్పించుకోవడంలో మారుతి అంత గట్టివాడు. ఇలా ఎంత సేపైనా ఈ యుద్ధాన్ని, ఎటూతేలకుండా

చేయడం ప్రయోజనకరం కాదనీ, హనుమని జయించడం సాధ్యం కాదనీ, తలచి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు ఇంద్రజి. (1) ఏ అస్త్రానికీ వశంకాకుండా ఉండే వరం బ్రహ్మ ఇచ్చినా, బ్రహ్మాస్త్రానికి కట్టుబడక తప్పదని హనుమకి తెలుసు. (2)

"గ్రహణే చాపి రక్షోభి ర్మహాన్మే గుణదర్శనః।
రాక్షసేంద్రేణ సంవాదః తస్మా ద్గృహ్ణన్తు మాం పరే॥ (45)

అందుకని భావించాడు మనసులో 'నన్ను రాక్షసులిలా కట్టేసినా, అదీ నా మంచికే సుమా! (భగవంతుడేం చేసినా అది మన మంచికే చేస్తాడు. కష్టమని మనకి అన్పించినా, అదీ ఒక సుఖమేనేమో అని భావించగలగాలి. రావణుణ్ణి రాత్రి చూచాను. పగలు చూడలేదు. అతనితో మాట్లాడలేదు. నా ప్రతాపాన్ని చూపించాక అతని అభిప్రాయ మేమిటో తెలియాల్సి కూడా ఉంది. పైగా నేనుగా అతనికి చెప్పాల్సినది కూడా ఉందనిపిస్తోంది. అతనితో మాట్లాడితే, అతని మంత్రుల, సేనాపతుల అభిప్రాయమూ బయటపడి, వారి ఆలోచన బయటకు వస్తుంది. అందుకని బంధన మంచిదే. పెద్దల శాపం, శాపం ఎన్నడూ కాదు. వరమే.) రావణునితో మాట్లాడవచ్చుగా అని భావించి, కదలకండా ఉండిపోయాడు.

చేష్టలుడిగి కూచున్నా, గర్జనమాత్రం విడువని హనుమ, తమనేమైనా చేస్తాడేమోనని భయపడి, రాక్షసులు హనుమని జనుపనారతో, చెట్టు పట్టలతో గట్టిగా కట్టారు. తనని కడుతూ ఉన్నాసంతోషిస్తూనే ఉన్నాడు హనుమ. (రావణుణ్ణి మామూలుగా చూడాలంటే ముందుగా అనుమతి కావాలి. అనుమతించినా, ఎక్కువ మాట్లాడే అవకాశ ముండదు. మాట్లాడే అవకాశం లభించినా, మంత్రులు ఏదో సమాధానం చెప్పి పంపేస్తారు. కాబట్టి 'తాను' అనే ఒక వ్యక్తిగా పోయి, తననే రావణుడు చూస్తూ, తనతోనే మాట్లాడేలా చేయించుకోవాలనీ, లేదా రావణుణ్ణి రప్పించేలా చేయాలనీ భావించిన మారుతి, రావణుని కిష్టమైన వనం ధ్వంసం చేయ ప్రారంభించి, ఇప్పటికి ఇంత చేసాడు.

విజయగర్వంతో హనుమంతుణ్ణి దూరం నుండి చూసాడు ఇంద్రజి. అప్పటికే రాక్షసులునారతో, చెట్ల పట్టలతో మారుతిని కదలకుండా కట్టేయడం అయిపోయింది. హతాశుడై, 'అయ్యో చేసినదంతా దండుగ అయిపోయింది(3) బుద్ధిహీనులైన రాక్షసులకి ఈ రహస్యం తెలియదు. బ్రహ్మాస్త్రంతో ఒకణ్ణి కట్టివేస్తే, మరే దేనితోనైనా ఆ వ్యక్తిని తిరిగి కడితే, బ్రహ్మాస్త్రం పనిచేయదు. పోనీ మళ్లీ బ్రహ్మాస్త్రం వేద్దామా ? అంటే రెండవ మాటు అదే వ్యక్తిపై పనిచేయదు. ఎంతో కష్టపడి హనుమని బంధించినా ప్రయోజనం లేకపోయింది' అని దుఃఖపడ్డాడు.

ఇంకా త్రాళ్లతో బిగించి కట్టి లాగుతూన్న రాక్షసులని ఇంద్రజీ వారించలేదు. కట్టెలతో, పిడికిళ్లతో పొడుస్తున్నారు పావనిని. కట్టబడిన మారుతి ఉన్న రథం, ఈ రాక్షస జనకోలాహలాల మధ్య, ఇంద్రజిత్తు ప్రశంస ఘోషలమధ్య, రావణ సభాభవనానికి చేరింది. మదపుటేనుగుని కట్టి తెచ్చినట్లుంది ఆ తీరు.

సభలోని రాక్షస ప్రముఖులు "ఇతడెవడు? ఎవరివాడు? ఇక్కడినుండి ఏమి పనిపై వచ్చాడు?" అని అనుకుంటూంటే, అదే హనుమని చూచి వానిచే దెబ్బలుతిని బ్రతికున్న వారంతా "చంపండి - భక్షించండి" అని అరుస్తూంటే (4) హనుమ, మాత్రం రావణుణ్ణే చూడాలని భావించిన కారణంగా, రావణ దర్శన మౌతుందనే ఆనందం చెక్కుచెఱగక ఉన్నాడు. రావణునికి మరీ దగ్గఱగా తీసికొని పోగా, హనుమ ఆతని పాద సమీపంలో ఉన్న వృద్ధమంత్రుల్నీ, ఇతర ముఖ్యుల్నీ చూచాడు.

రావణుడు పావనినీ, మారుతి దశకంఠుణ్ణీ, పరస్పరం చూచుకున్నారు. ఒకరికొకరు ఆశ్చర్యపడుతూంటే, అక్కడి వృద్ధమంత్రులడిగిన ప్రశ్నకి సమాధానంగా 'నేను వానర రాజైన సుగ్రీవుడు పంపితే దూతగా వచ్చినవాణ్ణి' అని అంతమాత్రమే మారుతి చెప్పాడు (5).

## విశేషాంశాలు

(1a) **రావణుడు బ్రాహ్మణుడా ? క్షత్రియుడా ?** అనేది, ఓ పెద్ద అనుమానం లోకంలో క్షత్రియ ధర్మాన్నిబట్టిపో, అని ఇంద్రజిత్తుని ఆజ్ఞాపించడం బట్టి క్షత్రియుడే అని తెలుస్తుంది. రావణుని తండ్రి విశ్రవసుడు - బ్రాహ్మణుడు. తల్లి కైకసి - రాక్షసి. **ఏ కులంవారికి, అదే కులపు స్త్రీతో వివాహమై తే, పుట్టినవాళ్లని** 'సజాతీయులు' అంటారు. **వివాహం లేకపోతే, బ్రాహ్మణ స్త్రీకే పుట్టినా** బ్రాహ్మణుడు కాడు.

మను ధర్మశాస్త్రం ఆధారంగా బ్రాహ్మణ క్షత్రియులకు, క్షత్రియ వైశ్యులకు, వైశ్య శూద్రులకు పుట్టిన పిల్లలు మూర్ధాభిషిక్త - మాహిష్య - కరణులు అని పిలువబడతారు. దశరథునికి శాపమిచ్చింది ఈ 'కరణ' జాతివాడే.

బ్రాహ్మణునకు క్షత్రియ వైశ్య శూద్ర స్త్రీలలో పుట్టినవాళ్లూ, క్షత్రియునకు వైశ్య శూద్ర స్త్రీలలో, అలానే వైశ్యునికి శూద్రస్త్రీలో జన్మించిన వాళ్లని 'అపశదులు' అంటారు.

బ్రాహ్మణునికి వివాహిత క్షత్రియ స్త్రీ యందు జన్మిస్తే క్షత్రియుడే. అలానే క్షత్రియునికి వివాహిత వైశ్యస్త్రీయందు, అదేవిధంగా వైశ్యునకు శూద్ర స్త్రీయందు పుడితే

పురుషజాతి వాడే ఔతాడని శంఖు మహర్షి. కాబట్టి బ్రాహ్మణుడే అయిన విశ్రవసునికి, వివాహం కాని క్షత్రియ రాక్షసస్త్రీ కైకసికి పుట్టిన రావణుడు బ్రాహ్మణ జాతివాడు కాడు.

బ్రాహ్మణ జాతివాడే అయినా బ్రాహ్మణ ధర్మంతో లేకపోతే బ్రాహ్మణుడు కాడు (గొడ్డలి పట్టిన పరశురాముడు). వ్యాసునికి శూద్ర స్త్రీయందు పుట్టిన విదురుడు శూద్రుడే అయ్యాడు.

కుల వ్యవస్థ శ్రీమద్రామాయణ కాలం నాటికి ఉంది కాబట్టి, ఆ వివరాలు తెలిసికోకపోతే కొన్ని చోట్ల కథకి అడ్డుతగులుతుంది. అందుకై వ్రాయబడింది.

కులవ్యవస్థ, ఈనాడు లేదని అందఱూ 'చెప్తూనే' ఉన్నారు కాబట్టి, 'క్షేత్రబీజ ప్రాధాన్య చర్చ' అక్కఱలేదు.

ఇలాటి జాతి సంకరాలూ, వివాహిత స్త్రీలు ఇతర పురుషులనుండి పిల్లలని పొందడాలూ ఎంతో దోషంగా అన్పిస్తాయి నేడు. పిల్లలులేక, వంశం నిర్వంశమై పోయే కాలం అది. తపస్సు చేసి సంతానం కోరుకునే రోజులు అవి. అధిక సంతానం (3 దాటి) వద్దు మొఱ్ఱో! అనే, ఈ కాలపు మనం, వాళ్ళ బాధని అర్థంచేసికోలేం. ఒకప్పుడు సరే భర్తపోతే, వేఱు పెళ్ళిలేదు. చిన్న వయసులో నైనా దురదృష్టవశాత్తూ, అలాటి స్థితి కలిగినప్పుడు, ఒకప్పుడు-తప్పు-అన్న వారే కూతురి పరిస్థితిని బట్టి అంగీకరిస్తున్నారు గదా! ఆ 'బాధ' ఆ కష్టం ఉన్నవారికి తెలుస్తుంది. తొందరపడి నిందించకూడదు.

పిల్లలు లేకపోవడంలోని 'బాధ' పిల్లలు కన్నవారికి, కంటామేమో అని భయపడే వారికే తెలియదు. 'ధర్మం' అనేది యుగానికి ఒక్కోవిధంగా ఉంటుంది. యుగం మాఱినా, మఱో యుగధర్మం ఆచరించడం 'అధర్మం'.

(1) అస్త్రాలన్నింటికీ తలమానికం వంటిది బ్రహ్మాస్త్రం. అతి ముఖ్యమైన సందర్భాలలో వాడబడేది. సీత కావాలన్న లేడి మారీచుణ్ణి, కాకిరూపంలో వచ్చి సీతని బాధపెట్టిన ఇంద్రపుత్రుణ్ణి, బ్రహ్మాస్త్రంతో కొట్టాడు. మొత్తానికి, సీత సంతోషం కోసమే బ్రహ్మాస్త్రం వేసాడు. ఇంద్రజికి ఇష్టమైనది రామవధ. కాబట్టి రామునిపైన వేయాలి. కాని హనుమ మీద ప్రయోగించేసాడు.

ఇంద్రజిత్తు వద్ద ఉన్న అతి శక్తిమంతమైన ఆయుధాన్ని ప్రయోగించేంత చీకాకు చేస్తే - ప్రయోగిస్తాడా ? లేక సంయమనంతో ఉంటాడా ? - అని పరీక్షించాలని హనుమ ఆలోచన. ఈ బ్రహ్మాస్త్ర ప్రయోగం బట్టి ఇంద్రజిత్తు, యుద్ధానికి భయపడ్డాడనీ, యుద్ధంలో ఓర్పులేని వాడనీ హనుమకి అర్థమైంది.

(2) పరమాత్మ యిచ్చిన వరం, ఏ అస్త్రాలకి కట్టుబడడు హనుమ అనేది. అలాగే, క్షణకాలం బ్రహ్మాస్త్ర బాధ పొందాలనే శాపాన్ని కూడ వరంతో సమానంగా భావించేవాడే హనుమ కాబట్టి, బ్రహ్మాస్త్ర బాధకి సిద్ధపడే ఉన్నాడు. ఇంద్రజిత్తు వలన బంధింపబడలేదనీ, దైవశాపం కారణంగా బంధింపబడ్డాననీ హనుమ భావిస్తూంటే, తన ప్రతాప ఫలితమే అని ఇంద్రజిత్తు భావించాడు. లేని శక్తి, ఉందని భావించే లక్షణం, ప్రతి పక్షానికి ఉండడం, మంచిదేనని హనుమ భావించాడు.

(3) మనం చేసే ఆలోచనకి, దేవుని అనుకూలత కూడ ఉంటే ఏ కార్యమైనా ఫలిస్తుంది. ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని వేసినా, బుద్ధి హీనులైన రాక్షసులు నారలతో కట్టి ఇంతటి అస్త్రాన్ని వ్యర్థపఱచారు. (బుద్ధింతు సారథిం విద్ధి - బుద్ధి అనేది ఈ శరీర రథానికి సారథి. అందుకే భగవంతుడైన శ్రీకృష్ణుడు శరీరమనే రథాన్ని తోలుతూ ఉంటే, భగవంతునిచే రక్షింపబడే మానవులకు ప్రతినిధియైన అర్జునుడు రథంలో కూచుని ఉంటాడు. మనని నడిపించేది 'బుద్ధి'. ఆ బుద్ధే భగవంతుడు. అలాటి బుద్ధి-హీనులు అంటే దైవ - అనుకూల్యం లేనివారు)

రాముని బ్రహ్మాస్త్రం కాకి మీద ఫలించడాన్ని లక్ష్మణుని ద్వారా, సీతా సందేశం ద్వారా విని హనుమ ఆనందించాడు. ప్రత్యక్షంగా ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని చూచి, రాముని ముందు ఇంద్రజిత్తు పనికి రాడని సంతోషించాడు.

(4) అతి ముఖ్యమైన బ్రహ్మాస్త్రం వ్యర్థమైందనే బాధ రాక్షసులలో ఎవరికీ లేదు. హనుమని 'చంపండి-తినండి' అనే సహజ ధోరణి తప్ప. తమకి గాయాలుచేసి భయపెట్టిన వాణ్ణి వధించడమే వారికిష్టం తప్ప - కట్టడం తప్పు - అనే ఆలోచన, వారికి లేనే లేదు. అలాటి రాక్షసులని వధించడం తేలికే - అని హనుమ భావన.

(5) 'నిన్ను భయపెట్టిన వాలిని-రామసహాయంతో చంపిన సుగ్రీవుని దూతని' అనే అర్థం రావణునికి కలిగి, -యుద్ధంలో ఓడుతాం - అనే అభిప్రాయం కలగాలని, ఒకే వాక్యంలో అర్థం అయ్యేలా హనుమ చెప్పాడు. రాజు, నేరుగా దూతతో, అందునా 'కపి' వంటి నీచ ప్రాణితో మాట్లాడరాదు - కాబట్టి,మంత్రులద్వారా అడిగించాడు రావణుడు. రాముడు కూడా మొదటగా ఆంజనేయుణ్ణి చూచినప్పుడు, లక్ష్మణుని ద్వారా పావనితో మాట్లాడాడు. నేరుగా తాను మాట్లాడలేదు. కాబట్టి రావణునకు రాజధర్మం తెలుసని హనుమ గ్రహించాడు.

❋ ❋ ❋

# 49వ సర్గము

## అధర్మమే నాశనానికి కారణం

'అహోరూప మహాధైర్య మహాసత్త్వ మహాద్యుతిః।
అహో రాక్షస రాజస్య సర్వ లక్షణ యుక్తతా॥
యద్యధర్మో న బలవాన్ స్యాదయం రాక్షసేశ్వరః।
స్యాదయం సురలోకస్య సశక్రస్యాపి రక్షితా ॥ (17 : 18).

తాను చేసిన పనికి రావణుడే వస్తాడేమోనని భావిస్తే, తననే వాని వద్దకి పిలిపించుకొనిపోయినందుకు ఆశ్చర్యపడ్డ హనుమ, రావణుణ్ణీ, అతనిచుట్టూ, ఓ సారి చూశాడు. హనుమ, మంత్రుల వెనుకగా సభలోనికి తీసుకురా బడ్డాడు. దుర్ధరుడూ, ప్రహస్తుడూ, మహాపార్శ్వుడూ, నికుంభుడూ అనే రాక్షసులు, రావణునికి ఎదురుగా అర్ధచంద్రాకారంగా కూర్చుని ఉన్నారు. వారి వెనుక అదే ఆకారంగా అనేక రాక్షసమంత్రులు, అనేక విధమైన ఆలోచనలని ఈయగలవాళ్లు, కూచుని ఉన్నారు. వారందరికీ అభిముఖంగా - మేరుపర్వతంలాగానూ, ఆకర్షణీయంగానూ ఉన్న రావణుడు హనుమకి ఎదురుగా కన్పిస్తున్నాడు.

శ్రేష్ఠమైన బంగారంతో చేయబడి, నిండుగా ముత్యాలు పొదిగిన కిరీటం, నుదుటి నుండీ గడ్డంవరకూ ఉన్న ముఖ భాగపు కొలతకి సరిపోయేలా ఉంది. కనులు తిప్పినప్పుడూ, మాట్లాడుతున్నప్పుడూ రావణుడు త్రిప్పిన తలకి అనుగుణంగా, మెల్లిగా కదులుతూ ఒక వింత ఆకర్షణ నిస్తోంది కిరీటం.

తలకు సరిపడ కంఠం, బలిష్ఠంగా ఉంది. వజ్రాలూ, విలువ కట్టలేని మణులూ ఉన్న హారాలని కలిగి ఉంది కంఠం.

కస్తూరి వంటి సుగంధ ద్రవ్యాలతోనూ, రక్తచందనపు మైపూతలోనూ వక్షస్థలం పరిమళ భరితంగా ఉంది. అన్నీ, ఎప్పుడూ చూడని ఆభరణాలే. చూచినవే అయితే, క్రొత్త వనితనం కల్గినవి.

ఒక్కొక్క హారం, ఒక్కొక్క కాంతిని వెదజల్లుతూఉన్నా, అన్ని రంగులూ ఒకదానికొకటి, పొసగేవే తప్ప సరిపడనివి కావు. ఈ హారాలూ, మైపూతలూ అన్నింటికంటె మించి ప్రకాశిస్తూన్నవి ఆ ఎఱ్ఱటి కళ్లు.

పడగవిప్పిన పదితలల పాములా పది తలలూ మెఱుస్తూ ఉన్నాయి. పలువరుసకి అటూ ఇటూ ఉన్న రెండు కోరలూ ధగధగ ప్రకాశిస్తూంటే, వాటికి సరిపడ్డ పెదవులు

కోపంతో చలిస్తూ ఉన్నాయి. కాటుకలా నల్లగా ఉన్న రావణునితో, మెడలో తెల్లగా ఉన్న హారాన్ని మాత్రం చూస్తే, కొంగ విహరిస్తున్న ఆకాశం కన్పిస్తోంది.

భుజాలకి భుజకీర్తులూ, మోచేతులకు పైన దండ కడియాలూ, మణికట్టులకి మణిబంధాలూ, వాటికి వ్రేలాడే అపరంజి సన్నని కుచ్చులూ, కుచ్చులలో చిన్ని గంటలూ, కదిలినప్పుడు చేసే చిఱుసవ్వడీ, మనసుని కదిల్చి వేస్తోంది.

చక్కగా సింగారించుకొన్న రావణుడు, నవరత్న స్ఫటిక సింహాసనంలో కూర్చుని ఉంటే, సమీపంలో నిలబడ్డ సుందరాంగనలు, పిల్లగాలికంటె మెల్లని వేగంతో, హృదయ సుఖావహమైన వింజామరలు వీస్తున్నారు.

హనుమ నిశ్చేష్టుడయ్యాడు. ఓహో! రావణుని రూపం ఎంత గొప్పది? (రాముడు సరితూగడు).

నిత్యం ముల్లోకాలనీ జయించడానికి పోతూండే ఈతని ధైర్య మెంతది? (దీనిలోనూ రాముడు తూగడు.)

కైలాసాన్ని శంకరుడితోనే ఎత్తగల వీని బలమెంతగొప్పది? (దీనికి రాముడు సాటిరాడు).

ప్రతిపక్షంవాడైన నన్నుకూడా ఆకర్షించేంత అద్భుతమైన ఈతని తేజస్సు ఎంత గొప్పది? (రాముణ్ణి చూచిన నేను ఇతణ్ణి ప్రశంసిస్తున్నా నంటే దీనిలోనూ రాముడు వెనుకబడ్డట్టే)

కాని ధర్మ విషయంలో రాముని కాలి గోటికి పోలడు. (ఇదే రాముని జయ రహస్యం. రావణ వధ వెనుక దాగిన సత్యం). ఈ ధర్మమే లేకుంటే దేవేంద్రుడితో సమానంగా దేవరాజ్యాన్ని ఏలగలిగేవాడే. వీడి అధర్మమే వీనికి పతనహేతువు. వీడికున్న శక్తి అంతులేనిది' అని మనసులో భావించాడు.

(ఆంజనేయుడు రాముని రూపాన్నీ, రావణ రూపాన్నీ రెంటినీ చూచాడు. 'రామః కమలపత్రాక్షః సర్వసత్వ మనోహరః' అన్నాడు సీతతో. ఇలాటి అందం - ఆకర్షణా ఇద్దరిలోనూ ఉన్నాయి. కాని, 'రూపదాక్షిణ్య సంపన్నః' ఇతరులయెడ కరుణ - రక్షించాలనే బుద్ధీ ఆయనకే ఉన్నాయి కాని వీనికి లేవు. కాబట్టి-రావణుని కంటె రాముడే గొప్ప - అని నిశ్చయించాడు. రాముని దాసుడే అయినా రావణుణ్ణి గూర్చి ప్రశంసిస్తూ భావించడం, హనుమ నిష్పక్షపాత ధోరణికి నిదర్శనం.

❀ ❀ ❀

# 50వ సర్గము

## నీకు మంచిని చెప్పేవారు లేరు! నే చెపుతా విను!!

కిమేష భగవాన్నందీ భవేత్సాక్షాదిహాగతః।
యేన శప్తోఽస్మి కైలాసే మయా సంచాలితే పురా। (3)

గోరోచనపు రంగు కళ్లతో ఉన్న హనుమని చూచి, రావణుడు ఇలా భావించాడు. 'ఒకప్పుడు కైలాసం ఎత్తబోయినప్పుడు నాకు శాపం ఇచ్చిన నందీశ్వరుడే వానర రూపంతో వచ్చాడా ? (1) లేక బాణాసురుడే ఈ రూపంతో వచ్చాడా ? అనుకొని ప్రహస్తునితో ఇలా అన్నాడు. 'ఓయీ ! ఎక్కణ్ణించి వచ్చాడు వీడు ? కారణం ఏమిటి? అశోక వనాన్ని ఎందుకు పాడుచేసాడు ? ఎందుకు యుద్ధం చేసాడు ? కనుక్కోండి - అని. ప్రహస్తుడు హనుమని అడుగుతూ 'ఓరీ! వానరా! నీకు క్షేమాన్ని నేను కల్పిస్తాను. ఇంతకీ నువ్వు కుబేర-యమ-వరుణులలో ఎవడి గూఢచారివి ? (2) విష్ణువు గాని పంపాడా ? భయపడక జరిగింది జరిగినట్టు చెప్పి విడిపించుకుపో!" అన్నాడు.

హనుమ రావణుణ్ణి చూస్తూ 'నేను దేవేంద్ర-యమ-వరుణ-కుబేర దూతను గాను. విష్ణువు పంపలేదు. వానరుణ్ణి. రాక్షస రాజైన నిన్ను చూడాలనుకొన్నాను. మామూలుగా అయితే దర్శనం లభించదు. ఇలా అయితే తప్పక లభిస్తుందని వనాన్ని పాడుచేసాను. (3) ఇంతలో బలవంతులైన రాక్షసులు వచ్చారు. ఆత్మరక్షణార్థం నేను పోరాడితే వాళ్లు చనిపోయారు. దేవాసురులు ఎవరూ నన్ను ఏ అస్త్రం-పాశంతోనూ బంధించలేరని బ్రహ్మవరం ఉంది. నిన్ను చూడ వీలౌతుంది గదా అని బ్రహ్మాస్త్రానికి లొంగిపోయాను. (4) బ్రహ్మాస్త్రం విడిపోయింది. అయినా నీతో చెప్పాల్సిన మాటలు కొన్ని ఉండి రాక్షసులు బంధిస్తే వచ్చాను. నన్ను, అమిత తేజోబలాలున్న రామప్రభువు దూతగా పంపాడు. స్వామీ! నీకు హితవు చెప్పాలని ఉంది. విను' అన్నాడు.

### విశేషాలు

(1) కుబేరుని పుష్పక విమానాన్ని తెస్తూంటే, శివపార్వతులు విహరిస్తున్న కారణంగా ఇలా పోరాదని నందీశ్వరుడు రావణుణ్ణి అడ్డగించాడు. కోపించిన రావణుడు నందిని 'కోతిముఖం వాడవని' అపహాస్యం చేసాడు. అలా అపహసించినందువలన, ఆ కోతులవలననే నీకు చావు మూడు గాక ! అని శపించాడు నందీశ్వరుడు.

ఈ కథ ఉత్తర కాండలో ఉంది. ఉత్తరకాండని వాల్మీకి వ్రాయకపోతే, ఈ కథకి సంబంధించిన ఆలోచనని రావణుడు ఎలా చేయగలడు? చేసిన అపరాధం కష్టకాలంలోనే గుర్తుకు వస్తుంది. కష్టకాలంలోనే తన పుత్రుడు అక్షుడు, హనుమ చేతిలో పోయాక, ఈ చంపినవాడు, అలనాడు నన్ను శపించినవాడా? అని భావించాడు రావణుడు.

కాబట్టి నిష్కారణంగా ఎవరినీ అపహాస్యం చేయరాదు. శాపం నిజమౌతోందనే భయం రావణునిలో ఉంది - అంటే శాపం ప్రకారం తన చావు తప్పదని రావణునకు తెలుసన్నమాట. అందుకే రాముని చేతిలో మోక్షం పొందాలని,ఎవరు ఏం చెప్పినా సీతని విడువలేదు. ఈ మాటలు ఎవరితోనో అన్నవి కాక, తన మనసులో భావించుకొన్నవి - కాబట్టి మరింతగా నమ్మవలసినవి.

(2) రావణునితో పాటు,రాక్షసులకీ భయం ఉంది - ఇంద్ర - యమ - వరుణ - కుబేర- విష్ణువుల విషయంలో. కారణం-వాళ్లందరికీ అపకారం రావణుడు చేశాడు గనుక. యుద్ధం చేసి ఎవరెవరిని గెలిచాడో, వారు వారందరి గురించీ భయపడుతూ ఉన్నారు రాక్షసులు. కాబట్టే - వైరం తగదని పెద్దలమాట. పదిమందిని చంపినవాళ్లని చూసి 'చాలా ధైర్యస్థుడు' అని, కొందరు అల్పబుద్ధులు లోకంలో అనుకుంటారు. కానీ, తనచే చంపబడిన వారి బంధుమిత్రులు ఎవరు, తనని చంపుతారోనని చాలా పిరికితనంలో ఉండేది, వాడేనని, గమనించాలి. రావణునికే కాదు. వాని వెంట ఉండే మంత్రులకున్నూ ఇంద్ర-వరుణ-యమ-కుబేర-విష్ణువుల విషయంలో భయానిక్కారణం అదే. దుర్మార్గుని వెంట ఉంటే-ఆ భయంలో పాలు, మనకీ కల్గుతుంది.

(3) తాను నేరుగా మాటాడరాదని రావణుడు ప్రహస్తుని ద్వారా అడిగిస్తే, ప్రహస్తుడికి చెప్పాల్సినవాడు తాను కాదనీ, రామదాసుడు కాబట్టే రావణునితో మాట్లాడే అర్హత కలవాడిననీ భావించి హనుమ, అలాగే మాట్లాడాడు. 'రావణా! నిన్ను రప్పించుకొని నీతి చెప్పదామనుకొంటే, తప్పు నీలో ఉండి కూడా ఎందరినో చంపావు. ఆత్మరక్షణార్థం దాడిచేస్తే వాళ్లు పోయారు. నువ్వు ముందే వచ్చి ఉంటే, ఇందరూ బ్రతికుండే వారు అయినా, ఒక్కడికి సరిపోని ఇందరుండీ ప్రయోజనం లేదు. అని చెప్పడం దీని సారాంశం.

(4) బ్రహ్మవరం గొప్పదే ఐతే నీకున్నట్లుగా నాకూ వరాలున్నాయని చెప్పడం, నీ గొప్పదనం ఏమీలేదని చెప్పడం దీని భావం. బ్రహ్మాస్త్ర ప్రయోగం నీ పుత్రునికి తెలియదు. ప్రయోగించాక ఎలా రక్షించుకోవాలో నీ సైన్యానికి తెలియదు. మీరు యుద్ధానికి పనికిరారని భావం. బుద్ధిమంతులూ - అసమర్థులూ ఒక కార్యం తల పెట్టి కొంత చేయగానే, నీచులూ, అహంకారులూ మేం చేస్తామని వస్తే బుద్ధిమంతులు వెంటనే పనిని విడిచి వెళ్లిపోతారు. అదే - బ్రహ్మాస్త్రం మీద మామూలు కట్లు కడితే నిష్ప్రయోజన పడడమంటే.

* * *

# 51వ సర్గము

## ఈ కాండలోనే అతి ప్రధానమైన హనుమంతుని సందేశం

రావణా ! నీకు సోదరుని వంటివాడూ, నాకు రాజూ, మహాత్ముడూ, రామానుగ్రహ పాత్రుడూ అయిన సుగ్రీవుని సందేశాన్ని విను. చతురంగ బలాలు కలవాడూ, ప్రజారంజకుడూ ఐన దశరథుని పుత్రుడు రాముడు, తండ్రి ఆజ్ఞపై దండకారణ్యానికి భార్య సీతతో, తమ్ముడు లక్ష్మణునితో కలిసి వెళ్లాడు. పతివ్రతయైన సీత, అరణ్యంలో కన్పడకుండాపోతే, రాముడామెను వెదుక్కుంటూ ఋశ్యమూకంలో ఉన్న సుగ్రీవుణ్ణి కలిసాడు. సీతనిప్పిస్తానని సుగ్రీవుడూ, వానర రాజ్య మిప్పిస్తానని రాముడూ, పరస్పరం ప్రతిజ్ఞలు చేసికొన్నారు.

వాలిని చంపి, వానరరాజ్యం సుగ్రీవుని కిప్పించాడు రాముడు. వాలిని నీవు ఇంతకు ముందెఱుగుదువుగా! వాణ్ణి ఒక్కబాణంతో చంపేసాడు. తాను అన్నమాట ప్రకారం, సీతని వెదకడానికై సుగ్రీవుడు అనేక వేలకోట్ల వానరాలని, గరుత్మంతుడూ వాయువుతో సమానవేగం గల వారిని, అన్ని దిక్కులకి పంపితే, హనుమంతుడనే పేరున్న వాయుపుత్రుణ్ణి నేనిలా వచ్చి సీతమ్మని చూచాను.

పరదారా న్మహాప్రాజ్ఞ నోపరోద్ధుం త్వ మర్హసి
న హి ధర్మవిరుద్ధేషు బహ్వపాయేషు కర్మసు ।
మూలఘాతిషు సజ్జంతే బుద్ధిమంతో భవద్విధాః॥ (18)

సర్వశాస్త్రాలూ చదివి, ధర్మస్వరూపం తెలిసినవాడివి నీవు. ఇతరుల భార్యలను చేపట్టడం ఏ మాత్రమూ నీకు తగినది కాదు. ధర్మ విరుద్ధమైన ఇలాటి పనులవల్ల ఎన్నో కష్టాలు సంభవిస్తాయి.

రాజా ! రామునికి అపకారం చేసి క్షేమంగా ఉండేవాడు లేడు. రామునికి కోపం వచ్చిందంటే అది లక్ష్మణునికొచ్చినట్లేను. అంటే ఇద్దరికీ కోపం వచ్చినట్లు. పరదారాపహరణమనే అధర్మం పోవాలంటే రామునికి సీత నిచ్చి వెయ్యాలి.

నేను సీతని తేలేదని అంటావేమో? నీచ జనుల్లా అబద్ధం ఆడకు. నువ్వే తెచ్చావని దుఃఖిస్తూ ఉన్న ఆమెని, నీ లంకలోనే స్పష్టంగా ఇప్పుడే చూచి వస్తున్నాను.

ఆమె దుఃఖంతో కన్పిస్తోందిగా అనుకుంటావేమో! లోలోపల మథనపడుతూ, నీ ప్రాణాలు తీయడానికిసిద్ధంగా తెచ్చుకున్న 5 తలల మహాసర్పమని గమనించు. ఎంత అరిగించుకోగల శక్తి ఉన్న వాడైనా, మహావిషాన్ని మ్రింగడం మంచిది కాదు.

తపస్సువల్ల చావులేని వరం వచ్చిందనుకోకు. దేవాసురుల వల్ల మరణం లేదుగాని, పశుపక్ష్యాదులూ, మానవుల వలనా మరణం లేదనేది, వరంలో లేదు. రాముడు మానవుడు. మేం తిర్యక్ జాతివాళ్లం (1).

నా ధర్మం నన్ను రక్షించదా ? అని భావిస్తావా? అదీ సరికాదు.

పుణ్యంవల్ల రాజ్యం లభించినా, పాపం వల్ల రోగం కల్గితే రెండూ కలిసి అనుభవించి తీరాలి.

పోనీ! అలాగే పుణ్యపాపాల ఫలితాన్ని ఒకే కాలంలో అనుభవిస్తానంటావా? అది నీ విషయంలో కుదరదు.

**నువ్వు చేసిన ధర్మానికి ఫలం, చావులేక పోవడం. అధర్మానికి ఫలం చావు. ఇవి రెండూ ఒక కాలంలో అనుభవించే వీలులేదు.**

ధర్మ-అధర్మాలలో ధర్మం గొప్పదని ఎవరికైనా తెలుసు గదా ! ధర్మం తనదైన ధర్మఫలాన్ని ఇచ్చినంతకాలం, అధర్మం తన ఫలాన్ని (చెడుని) ఇయ్యదు. ధర్మం అనుభవించే కాలంలోనే, అధర్మఫలం అనుభవించకూడదని వ్యక్తి భావిస్తే, అధర్మఫలం రాకుండా, ధర్మాన్ని మఱింతగా ఆచరించాలి.

ఇది నీకే సమన్వయించి చూచుకో ఇతరుల భార్యని తేవడం అధర్మం. తపస్సు చేసి పుణ్యాన్ని సాధించడం ధర్మం. ఆ తపశ్శక్తి ఫలంగా రాజ్యాన్ని అనుభవిస్తున్నావు. అధర్మమైన సీతని తేవడానికి సంబంధించిన 'కీడు', ఆమెని రాముని కప్పగిస్తే, రాకుండా పోతుంది.

పోనీ ధర్మాధర్మాలు మారాక్షస జాతికి లేవంటావా ? లౌకికంగా ఆలోచించినా, ఒకనిభార్యని ఒకరు అపహరించడం సరైనదంటావా? అదే నీ విషయంలో జరిగితే సహించగలవా? ఇక బలాబలాల విషయమే రాక్షసులకి ప్రధానమంటావా ? ఒంటరిగా 14 వేల మంది రాక్షసులని జనస్థానంలో చంపాడు రాముడు. నిన్నే నాలుగు సముద్రాలు తిప్పిన వాలిని, ఒక్కబాణంతో సంహరించాడు రాముడు.

కోతులకి అధిపతి సుగ్రీవుడు. అతనితో మైత్రి రామునిది. సైన్యానికి ఆహారపదార్థాలు కావాలిగా! అంటావా ? కోతులకి లంకానగరం చెట్లుచాలు. ఫలాలూ పుష్పాలూ లేని పక్షంలో ఆకులే చాలు.

ఉండేచోటు కావాలంటావా? ఎక్కడైనా అభిమానం లేనివి కాబట్టి, పరుంటాయి. దుస్తులంటావా ? ఆ బాధ వాటికి లేదు.

నడిచి అలసిపోతాయంటావా ? ఆ దుఃఖం అవి ఎరుగవు. ఎగిరే లక్షణం కలవి కాబట్టి యుద్ధం వాటికేం తెలుసంటావా ? అవి పిచ్చి యుద్ధం ప్రారంభిస్తే, ఎలా యుద్ధం చేయాలో? మీకే తెలియదు. మిమ్మల్ని. ఒక పద్ధతీ, వ్యవహారమూ లేక చీకాకు పరుస్తాయి.

మేం చంపేస్తామంటావా? ఆ పనే నువ్వు చేయగల్గిన వాడివైతే, నా చేతిలో ఇందరు చావరుగదా? నిన్ను మాత్రం విడిచిపెడతామా ? అంటావా ? రామ దాసుణ్ణి నన్ను నువ్వు ఏమీ చేయలేవు. నువ్వు, నన్ను ఏమైనా చేయగలవనే భయం ఉంటే, ప్రాధేయపడతాను గాని, ఇలా నీకు ఉపదేశం చేస్తానా?

సాత్వికుడైన రామునికి నీ మీద ద్వేషం ఉండదనుకుంటున్నావా? వానర సమూహం ముందు రావణుణ్ణి, లంకతోసహా నిర్మూలం చేస్తానని నీ పేరు చెప్పి మరీ ప్రతిజ్ఞ చేసాడు. అపకారం చేస్తే ఇంద్రుడైనా, రాముని బారి నుండి తప్పించుకోలేడు.

దొంగసొత్తు, ఇంట ఉంటే చాలు శిక్షకి అర్హుడు. ఇక దొంగతనం చేసి, దొంగ సొత్తుని ఇంట ఉంచి, ఇమ్మని చెప్పినా ఇవ్వని వానికి శిక్ష అత్యధికం. ఆ శిక్ష వధయేతప్ప వేఱు కాదు.

సీతా తేజస్సుచేత నీ లంక మొత్తం తగులబడుతూన్నదని గమనించు. నువ్వు చేసిన తప్పుకి, నీ జ్ఞాతి – మిత్ర – సోదర – ఆప్తులందఱూ భార్యాపుత్రులతో, నాశనమై పోతున్నారు. నీ కారణంగా రాక్షసవంశం ముందునాటికి ఉండదు.

నేను 'కోతి'ని కాబట్టి నా మాట నమ్ము. (రాముడు మానవుడు. నీవు రాక్షసుడివి. నేను, మానవ రాక్షసులలో ఎవరినీ కాదు. జాతి పక్షపాతంలేదు. అతడు పురంలో ఉండేవాడు. నువ్వు నగరంలోని వాడివి. ఇక నేను, పుర నగరాలు రెంటిలోనూ ఉండేవాణ్ణికాదు. చెట్లపై నివసించే జాతికి చెందినవాణ్ణి. ఈ పక్షపాతమూ లేదు.

అతడికి ఒకప్పుడు ఐశ్వర్యం ఉండి, ఇప్పుడు లేదు. నీకు ఇప్పుడు ఉండి, పోబోతోంది. నాకు ఒకప్పుడు ఉన్నదీలేదు – ఇప్పుడు రాబోయేదీ లేదు. అందుకని మధ్యస్థుణ్ణి. నమ్మదగినవాణ్ణి). రామదాసుడిని అయి, అతని శక్తిని ప్రత్యక్షంగా చూచినవాణ్ణి. నీ శక్తిని ఇంతకుముందే పరిశీలించినవాణ్ణి.

పంచభూతాలనీ, లోకాలనీ ఒకమాఱు సంహరించి, సృష్టించగల శక్తి రామునికుంది. పంచభూతాలని మాత్రం తాత్కాలికంగా అదుపుచేయ గల శక్తి నీకుంది.

'బ్రహ్మ స్వయంభూశ్చతురాననో వా రుద్రస్త్రినేత్ర స్త్రిపురాంతకో వా - ఇంద్రో మహేంద్ర స్సురనాయకో వా - త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్' (46) చెప్పలేని ఐశ్వర్యం కలవాడు ఇంద్రుడు. వృత్రుడనే పేరుగల రాక్షసుణ్ణి చంపాక మహేంద్రుడయ్యాడు. మీదట ఆయన దేవతలకు అధ్యక్షుడయ్యాడు. అలాటి ఇంద్రుడు-మహేంద్రుడై - దేవేంద్రుడై కూడా రాముణ్ణి ఏమీ చేయలేడు. ఇక, ప్రళయకాలంలో జనుల్ని సంహరించి ఏడ్పించేవాడూ, బ్రహ్మకే సృష్ట్యాదికాలంలో వేదాలని చెప్పేవాడూ, అయిన రుద్రుడు గాని - ఆయనే ప్రళయకాలంలోనే కాక, ఇతర కాలంలోనూ మన్మథుణ్ణి నుదుటి కన్నుతో సంహరించి, త్రినేత్రుడైనప్పుడు గాని, ఒక్కణ్ణే కాక త్రిపురాసురులని చంపి త్రిపురాంతకుడై యుండీ, ఏమీ చేయలేడు. రుద్రుణ్ణి కూడ సృష్టిచేసిన బ్రహ్మగాని - పుట్టుకయేలేక స్వయంభువుడని పేరొందికూడా - నాల్గు వేదాలనీ ఉచ్చరించి చతురాననుడై యుండి కూడా, ఈయన రాముణ్ణి ఏమీ చేయలేడు. వేరువేరుగా కాదు. ఒక్కొక్కరూ మూడు రూపాలతో ఉండి, ముగ్గురూ కలిసివచ్చినా, ఏమీ చేయలేరని గమనించు.

(బ్రహ్మ, దేవతలని సృష్టించి, నీకు వరాలిచ్చాడనుకోకు. రామునికి ఎదురుతిరిగితే, ఆయన నిన్ను రక్షించడం మాట అటుంచి, తనని తానే రక్షించుకోలేడు. నీకు శిరస్సులని అనుగ్రహించినవాడూ, ఆరాధ్యదైవమూ అయిన రుద్రుణ్ణి నమ్ముకోకు. రామునితో విరోధం కదా నీది. తన పుత్రుణ్ణి (జయంతుడు కాకిగా మారితే, బ్రహ్మాస్త్రం రాముడు వేసాడుగా) రక్షించుకోలేని ఇంద్రుడు, రామవిరోధివి నిన్ను ఎలా రక్షిస్తాడు ?

ఇలా భయంలేక చెప్పిన హనుమని, 'చంపండి' అని క్రోధంతో ఆజ్ఞాపించాడు రావణుడు.

## విశేషాంశాలు

(1) తిర్యక్ అంటే పశుపక్షి క్రిమిజాతులని భావం. రెక్కలుంటే పక్షిజాతి, లేకపోతే పశుజాతి. వానరజాతికి రెక్కలులేవు గాని పక్షిలా ఎగురుతుంది. బరువు మోయడం, బుద్ధిలేకపోవడం పశులక్షణం. వానర జాతి బరువు మోయగల్గుతోంది. బుద్ధిలేనిది కాదు. తిర్యక్ అంటే 'అడ్డముగా' అని అర్థం. వెన్నెముక భూమికి (లంబంగా) నిలువుగా ఉంటే (కాళ్ల నుండి తలవైపుకి) అది బుద్ధికల జాతి! భూమికి సమాంతరంగా, అంటే, అడ్డంగా వెన్నెముక ఉంటే తిర్యక్ జాతివాళ్లు. నిటారు వెన్నెముక ఉండేవారికి

జ్ఞానం, అలా లేకపోతే అజ్ఞానమని లక్షణం. జాతీ, బుద్ధీ, సరిలేని వాకే అధర్మమని తోస్తే, నీకు ఎందుకు తోచలేదు ? నా కంటె బుద్ధిహీనుడివా ? అని ప్రశ్న. ఇతర ముఖ్య విశేషాలు !

## ఈసర్గ ముఖ్యమైనదని పెద్దలు చెప్తారు - ఎందుకో చూద్దాం!

'స్యాత్సందేశ హరోదూతః'. సందేశాన్ని పట్టికెళ్లి చెప్పేవాడు దూత. ఆ పనిని ఈ సర్గంలో చేసాడు హనుమ. శ్రీ మన్మహాభారతంలో కృష్ణపరమాత్మ స్వయంగా ఈ దూతకృత్యాన్ని చేసాడు. భారత రామాయణాలకు చాలచాల పోలికలున్నాయి.

ఈ సందర్భానికి సంబంధించినంత వఱకూ స్వల్పంగా చూస్తే - అక్కడ భగవంతుడు (కృష్ణుడు) రాయబారి-ఇక్కడ భగవద్భక్తుడు (పావని) రాయబారి.

అక్కడ కనకం (రాజ్యాన్ని) గుఱించీ-ఇక్కడ కాంత (స్త్రీ) గుఱించీ కలహం.

అక్కడ అన్నదమ్ముల మధ్యా ఇక్కడ నరరాక్షసుల మధ్యా వైరం.

అక్కడ దూత భూతలంలో-ఇక్కడ దూత ఆకాశమార్గంలో వెళ్లాడు.

అక్కడ ద్రౌపది ప్రోత్సాహం - ఇక్కడ రాముని ప్రోత్సాహం.

అక్కడ ఊహించి ధర్మరాజాదులు చెప్పిన మాటలని చెప్పడం-ఇక్కడ ఎవరూ చెప్పని మాటలను ఉహించి చెప్పడం.

అక్కడ చిన్నరూపాన్ని పెద్దది చేసి భయపెట్టడం (విశ్వరూపం) - ఇక్కడ పెద్దరూపాన్ని చిన్నదిచేసి భయంలేకండా చేయడం.

అక్కడ కౌరవులే త్రాళ్లతో కట్టి దౌర్జన్యానికి నాంది పల్కడం-ఇక్కడ తానే వనాన్ని ధ్వంసంచేసి నాంది పల్కడం.

అక్కడా-ఇక్కడా దూతలు నిర్భయంగా పల్కడం; అక్కడా దూతని ఏమీ చేయలేకపోవడం - ఇక్కడా అంతే కావడం.

అక్కడ వాయుపుత్రుడైన భీముడు ప్రతిజ్ఞలు చేస్తూ ప్రకటించినట్లు కురుక్షేత్రం రావడం - ఇక్కడ వాయుపుత్రుడైన హనుమ ప్రకటించినట్లు యుద్ధం రావడం.

ధర్మా ధర్మాల్లో ధర్మం గెలవడం - ఇలా రెండు ఇతిహాసాలలోనూ అద్భుత సామ్యం కన్పిస్తుంది.

అలాంటి హనుమకు అర్థమైనదీ, రావణునకు చెప్పినదీ, అయిన ఈ సందేశంలో రావణుని గూర్చి, హనుమ భావన ఇలా ఉంది.

(1) **రావణా!** దొంగతనంగా సీతని తేవడంవల్ల, రామలక్ష్మణుల కంటె తక్కువ వాడివి.

(2) సీతని పట్టమహిషిని చేస్తానన్నావు. పట్టమహిషీత్వం మాటేది కాదని తెలియనంతటి రాజువి నువ్వు.

(3) ఇతరులు స్పృశించిన దాన్ని చూడరానివాడుగా, రాజాండాల్ని వస్తే, అన్యభార్యని తెచ్చావు. రాజగౌరవం తెలియదు.

(4) వారిని గూర్చి తపస్సు చేసి, వారివే పాల ద్రోహమంటే, కృతఘ్నుడివే.

(5) తపస్సు వారి నారాధిస్తూచేసావు కాబట్టి, వారికంటె తక్కువవాడివి.

(6) సీత సామాన్యురాలే అని నీ కనిపిస్తే, సంవత్సరం గడువెందుకు ?

(7) సీతయందలి సంకల్పంతో స్వభార్యలలో కామం నశించిందన్నావు. సంకల్పానికే అంత ఫలం (బలం) వస్తే, బలవంతం చేస్తే, నీ గతి ఏమౌతుంది?

(8) మీ అన్నయైన కుబేరునితో విరోధం నీకున్న కారణంగామూ, నీ తండ్రితో ద్వేషం ఉన్న కారణంగామూ, అందటికీకూడా తండ్రీ సోదరులతో విరోధం ఉంటుందనుకోవడం సరికాదు.

(9) సీత విషయంలో కామం ఉండి, భార్యలంటే గిట్టడం లేదని పల్కావు. సీతా విషయంలో కామం ఉన్నంతకాలం, ఆమెను నాశనం చేయలేవు. కామమూ నశించదు. రాముణ్ణి శరణువేడితే, కామమూ నశిస్తుంది. శ్రేయస్సూ కల్గుతుంది. లేదా, లంకా నాశనం తథ్యం.

(10) యోగ్యుడైన ఏ పురుషుడైనా తన కామాన్ని తన భార్యకు తప్ప, ఇతరులవద్ద చెప్పడు. దీన్ని అతిక్రమించి పల్కడం నీలోని మహాదోషం.

(11) పుట్టుకవేళనే, స్త్రీ పరాధీనురాలు. వివాహిత అయితే భర్తా - తండ్రీ, ఇద్దరూ ఆమెకు రక్షకులు. అంటే నీకు శత్రువులు. కాబట్టే నీకు శత్రువులు ఇప్పుడు ఇద్దఱయ్యారు.

(12) రాముని వాక్కు నాకు విలువైనది. సీతయొక్క రూపం నీకు విలువైనది.

(13) వాక్కుద్వారా (మంత్రాన్ని మననం చేయడం) భగవంతుడు రక్షిస్తాడనేది వేద ప్రతిపాదితమైన విషయం. దేవుడే దిగివచ్చి, రూపంతో రక్షించాలనేది రాక్షస ప్రతిపాదితమైన అంశం.

(14) దేహంలో ఉన్న కాలూ-చేయీ మొదలైన ఇంద్రియాలు, దొంగతనమూ మొదలైన నేరాలని చేస్తే, రాజుకి తెలుస్తుంది. శిక్షించే అధికారం రాజుకి ఉంటుంది.

అదే నేరం, బుద్ధిలో చేస్తే, అది రాజుకి తెలియదు గాని లోనున్న పరమాత్మకు తెలుస్తుంది. పరమాత్మ శిక్షించక మానడు. రాజైన నాకు శిక్షించే రాజు లేడంటావా? నీకు పూర్వ చరిత్రజ్ఞానం లేదన్న మాటే.

(15) బుద్ధిలో చేసిన దోషానికి విరుగుడు, పశ్చాత్-తాపం. నీ బుద్ధి చేసిన నేరం, సీతని తేవడం. 'తప్పు' - అని, రామునికిచ్చి వేయడం విరుగుడు.

(16) 16 గురు ఋత్విక్కులూ, యజమానీ, పత్నీ మొత్తం 18 మందీ యజ్ఞకాలంలో, యజ్ఞం సమాప్తమయ్యేంత వరకూ ఒకటిగా భావించి, ఆచరించే యజ్ఞం 'తానూనప్త్రం' అనేది. వానరులందరిచేతా సుగ్రీవుడు, దీన్ని చేయించాడు. అందుచేత, బుద్ధిచేత చంచలులైన వానరులంతా, ఒకటిగా మెలగుతారు గాని, ఎవరికి తోచినవిధంగా వారుండరు.

(17) చెల్లెలైన శూర్పణఖభర్తని చంపినంత దుర్మార్గుడివి నువ్వు. మాయి తల్లి కొడుకుకి, తన ప్రాణం అడ్డుగా వేసి ఉండేవాడు అతడు.

(18) ఎన్నో వంతెనలూ, జలాశయాలూ, అగడ్తలూ, మేడలూ ఉన్నాయి - ఇవన్నీ దాటిరావడం రామునికి సాధ్యమా? అనుకోకు. ఎగిరే లక్షణ మున్న వానరాలమీద వాళ్లు రాగలరు. 'భక్తి' అనేది చెప్పలేని శక్తి నిస్తుంది వ్యక్తికి. విరోధం అనేదికూడా, చెప్పలేని శక్తినిస్తుంది వ్యక్తికి. అయితే, మొదటిది సత్ఫలితాన్నీ, రెండవది దుష్ఫలితాన్నీ ఇస్తుంది.

(19) బొట్టు ధరించడమనేది పతివ్రతా లక్షణాల్లో ఒకటి. చెమటపట్టి కొద్దిగా అక్కడున్న బొట్టు జారిపోతే కూడా సహించక, మణిశిలని అరుగ దీసి, సీతకి బొట్టునుంచాడు రాముడు. కష్టంలో కూడ వినోదంకోసం చెక్కిలి పై ఉంచాడు. క్షణకాలం కూడ 'తిలకధారణం' లేకుండా ఉండడాన్ని సహించడాయన. ఇంతకాలం ఎలా సహించాడంటావా? సీత ఉన్న చోటు తెలియక. తెలిసాక ఊరుకొనే ప్రసక్తిలేదు.

(20) నీ విజయ స్తంభాలన్నింటినీ పీకి కాపలా వాళ్ల మీదికి విసిరి, స్తంభాలని విఱుగ గొట్టాను. సైన్యాన్ని చంపాను. అంటే, నీకు విజయం రావేరాదు. పరాజయంలోకూడా సైన్యాన్ని మిగల్చవని గమనించు.

(21) నందీశ్వరుడూ మొదలైన వాళ్లిచ్చిన శాపాలు నీకున్నాయి - వట్టి వరాలేకాదు. అహంకారివై వరాలు మాత్రమే గమనిస్తూ ఉన్నావు. నీవు చేసిన తప్పుకి, నీవు ఏ శిక్ష అనుభవించాలో అదే 'శాపం' అంటే. తప్పైందని వేడుకోవడమే 'శాపమోక్షం' అంటే. అసలు నీమీద శాపమే పనిచేయదనే భ్రాంతిలో ఉన్నప్పుడు, నువ్వు ప్రాధేయపడవుగదా!

నువ్వు శాపమోక్షాన్ని గూర్చి ప్రాధేయపడితే, రామునికి నిన్ను వధించడం చాలాచాల కష్టం. అడిగే బుద్ధి నీకు కలుగకపోవడం, ఆయనకు విరోధివై ఆయన పనిని తేలిక చేయడమే. అయితే నీ యిద్దఱి మధ్యా లంకాజననాశనం తప్పనిసరి ఔతోంది. గమనించు.

(22) నన్ను అనేక విధాల చంపాలని, ముందు - వెనుక భాగాలలో, ఆకాశంలోనూ అనేక విధాలుగా యుద్ధం చేయగల నిపుణులని పంపావు. నీటి ప్రతాపం పల్లంవైపే. అగ్ని ప్రతాపం పై భాగంవైపే. పృథివీ ప్రతాపం తన గర్భంలోనే. కాని వాయు ప్రతాపం అన్ని దిక్కులలోనూ ఉంటుందని గుర్తించు. (విజ్ఞానశాస్త్రం ఇదే మాటలని Air exerts pr in every d n అంటుంది.) అందుచేత నీ వాళ్లు నన్నేమీ చేయలేదు.

(23) పై చెప్పిన నీరూ-నిప్పు-నేలా అన్నీ వాయువు లేనిదే ఎంతమాత్రమూ ప్రయోజనపడలేవు. నీరు ప్రవహించాలన్నా-నిప్పు మండాలన్నా, నేల కదలాలన్నా వాయువుండాలి. ఆ వాయుపుత్రుణ్ణి నేను.

(24) బ్రహ్మవేత్తని వెఱ్ఱివానిగా సామాన్య జనం చూచినట్లు, నువ్వుకూడా బ్రహ్మవేత్త అయిన రాముణ్ణి వెఱ్ఱివానిగా చూస్తే, నీకు వేదవిద్య - ప్రతిదినమూ ఒంటబట్టినట్టు లెక్క. వేదంలో ప్రామాణ్యబుద్ధి లేనివాడు నీవంటి వాడు, వైదికమైన యాగాలని లంకలో చేయించడం, తెల్లవారు జామున వినిపించడం వంటి పన్నీ దండుగే.

(25) బ్రహ్మవేత్తని అసమర్థునిగా లెక్క కడితే, నీ తండ్రే మొదటి అసమర్థుడౌతాడు.

(26) బ్రహ్మవేత్త రాముణ్ణి మోసగించి, నువ్వు కుశలంగా ఉండవనేది నిశ్చయం. నువ్వు రాముణ్ణి మోసగించినా, ఆయనకు ఏలోటూ రాదు కాని, నీకు వంశనాశనం ఫలితం.

(27) వాలి బ్రతికున్నప్పుడు, భార్య, పుత్రులు, పురం, రాజ్యం భోగాలూ ఇలా అన్నీ మీ యిద్దరికీ సమానమని అంగీకరించి 1 నెల పాటు కిష్కింధలో గడిపావు. వాలి పోయాక, సుగ్రీవుడు రాజయ్యాడు. వాలి, కిష్కింధా రాజుగా నీతో ఆ అంగీకారాన్ని చేసికొన్నాడు కాబట్టి, నేటిరాజు సుగ్రీవునికి ఉన్న ఆ అధికారం, రామునిపరమైంది.

మృగాన్ని ఎవరుకొడితే, ఆ మృగం వారిది. అలాగే రాజైన వాలిని కొట్టిన బాణం రామునిది. కాబట్టి రాజ్యం- అధికారం-రామునిది. వాలితో సోదర స్నేహం చేసావు కాబట్టి, సుగ్రీవుడు పంపించగా వచ్చిన నేను, నిన్ను సుగ్రీవుని సోదరునిగా సంబోధించాను.

(28) నీ పుత్రుడైన ఇంద్రజిత్తుకి వైదికయాగ-క్షుద్రతాంత్రిక విశేషాలు రెండూ తెలుసు. వైదికయాగాలు రామునికే ఫలిస్తాయి, నీలో అధర్మం ఉన్నందువలన. ఆ క్షుద్ర శక్తులు నాముందు నిలువవు. నేను భూతబేతాళ నాశనాన్ని చేయగలను కాబట్టి.

(29) అస్త్రాలలో పెద్దదైన బ్రహ్మాస్త్రం నన్నేమీ చేయలేకపోయింది. అంతకుమించిన అస్త్రం మీవద్దలేదు. ఈ అస్త్రం మరోసారి ప్రయోగించే వీలు ఇంద్రజిత్తుకి లేదు.

(30) నేను కట్టుబడి నీ సభాభవనానికి వచ్చిన కారణం, నీ గురించి మంత్రులేమంటారో విందామని, నీ దుష్టప్రవర్తనకి నువ్వే కారణమా? వారి ప్రోత్సాహం కారణమా? తెలిసికొందామనీను. లంకిణి దగ్గరనుండి చాలమంది రాక్షసులు సీతని తేవడం తప్పు-అని నాతోనే అన్నారు. ఆ ఆలోచనని సభలో ఎవరైనా సమర్థిస్తున్నారో? -విందామనీను.

(31) నిర్ణయాన్ని చేసే అధికారిక ప్రజాపతులు 9 మందిలో నీ తండ్రి పులస్త్యుడు కూడా ఒకడైతే, అలాటి ధర్మాధికారి పుత్రుడివి నువ్వు. సీతని దొంగిలించి వంశపు పరువునీ, తండ్రి గౌరవాన్నీ మంటకలిపావు.

(32) భగవంతునితో మైత్రిచేసి రామానుగ్రహం వల్ల రాజ్యాన్ని పొందినవాడు సుగ్రీవుడు. భగవంతునికి కానిపని చేసి, రామద్వేషంతో, నీతో పాటు లంకనీ, రాజ్యాన్నీ, పోగొట్టుకొనే వాడివి నువ్వు.

(33) నీ నాశనానికి సీతయెడ రాగం, రామునియెడ ద్వేషం కారణం.

(34) వాలి ఉన్నంతకాలం నీకు ధర్మం చెప్పాల్సిన అవసరం సుగ్రీవునికి లేక పోయింది. ఇప్పుడు అధికారికంగా చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. దానికి నిమిత్తంగా నేనొచ్చాను.

(35) ఎంత తపస్సు చేస్తే అంతకు సరిపడ మూల్యాన్ని ఇయ్యడమే 'వరం' అంటే. దాన్ని తప్పు పనులకు వినియోగించిన కొద్దీ ఆ సొమ్ము 'జరిమానాల' రూపంలో వ్యయమై పోయి, ఆర్థికంగా దరిద్రుడై పోయినా, - నేరంచేసినవాడు - అనే పేరు మిగిలి పోతుంది. వరాల ఫలం అనుభవించకపోగా, ఈ చెడ్డపేరు అదనంగా వస్తుంది.

(36) ఇంద్రుణ్ణి జయించడానికి తపశ్శక్తి లేక, తపస్సు చేసి శక్తి సంపాదించి, ఆ మీదట జయించావు. కాబట్టి ఇంద్రుణ్ణి జయించింది నీ తపశ్శక్తి గాని నువ్వుకాదు. ఆ శక్తి ఇంద్రజయానికి వ్యయమై పోయింది. ఇప్పుడు నీకు తపశ్శక్తి దాదాపు లేనట్లే.

(37) అందరూ కలిసి నిర్ణయం చేసికొన్న నియమాలే ధర్మ సూత్రాలు-అని రాక్షసులైన మీ మతం. అనాదిగా వచ్చేవి కావనేది మీ భావం. అయినా సంన్యాసి రూపాన్ని వేసి ధర్మపూర్వకమైన వేషంలో అధర్మాన్ని చేసావు. వారి ధర్మానికనుగుణమైన రూపంలో, నీ రాక్షస ధర్మాన్ని ఆచరించావు. అది తప్పు. కాదని పలుమార్లు వాదించినా, వైదికధర్మానికే లొంగి, సన్యాసి వేషం కట్టావు. నిజమైన రాక్షస ధర్మం అదికాదు. తాను నమ్మిన సిద్ధాంతానికి లొంగి ఉండడం సరియైన ధర్మం.

(38) నువ్వు సీతని ఇచ్చేటట్లయితే దూతనైన నేనుకూడా, ఇతనిలో పశ్చాత్తాపం ఉందని రామునకు (recommend) నచ్చ చెప్తాను. ప్రత్యక్షసాక్షిని కాబట్టి, నా సూచనకు విలువ ఉండి తీరుతుంది. శిక్ష పూర్తిగా తొలగవచ్చు లేదా తగ్గవచ్చు.

(39) పంచ భౌతికమైన ఆయుధాలచేత చావరాదని వరం అడిగి పుచ్చుకున్నావు. రాముడు కొట్టేది ధర్మమనే బాణంతో, అధర్మమనే దోషిని. ఈ ధర్మమయ బాణం ఎలా పనిచేసిందో, మారీచవధలో ప్రత్యక్షంగా చూచావు. పరోక్షంగా తాటక-సుబాహు-ఖరదూషణ త్రిశిరాది రాక్షసుల నుండి నీ పుత్రుడి, చావు వఱకూ చూచావు. బ్రహ్మాస్త్రం పంచభూతాల కంటె గొప్పది. దానితో సంహరిస్తానని పల్కుతావా? అప్పుడు నీ సిద్ధాంతమే వీగిపోతుంది.

(40) రామునిది ధర్మసైన్యం. పశ్చాత్తాపం కల్గిన సీతచుట్టూ ఉన్న రాక్షస స్త్రీలలో, కలగాంచిన త్రిజటలో, దుఃఖం కల్గిన సరమ-అనలలలో, బాధపడుతూన్న లం[illegible]జన[illegible]ో, (చివరికి నన్ను చూచి నందీశ్వర శాపంవల్ల వచ్చిన వానరుడా? అని ఆశ్చర్య[illegible]డిన సీలో) ధర్మం కన్పిస్తోంది. కాని, దేహబలమే రాజరికానికి అర్హత- అనే [illegible]క్షస మతానికి అనుగుణంగానూ, ధర్మం ముఖ్యంకాదనే మాత్రానికి అనుసరణం గానూ, నీవు దీన్ని అంగీకరించవు. దేహబలమే గొప్పదంటావా? నీకంటె ఎన్నో రెట్లున్న వాలి దేహబలం, ధర్మంముందు, ఒక్కబాణంతో ఎగిరిపోయింది.

(41) అధర్మం చేసినవానికి, ధర్మబలం తగ్గుతుంది. అపకారం ఎవరికి జరిగిందో, వానికి ధర్మబలం పెరుగుతుంది. వాలి అధర్మం చేస్తే, అపకారం పొందిన సుగ్రీవునికి ధర్మబలం పెరిగింది. అది రామబాణంలోనికి చేరి, వాలిని వధించింది. ఈ వాలి వధలోని అంతర్యం తెలుసుకో సుగ్రీవుడు 'సోదరా'! అని సంబోధించాడు. సుగ్రీవుని సోదరుడు వాలి. వాలిని వధించినవాడు రాముడు. ఇప్పుడు నీకు విరోధి రాముడు. ఆలోచించుకో!

(42) అశోకవనంలో ఏయేవి ధ్వంస మయ్యాయో వెదికి చూసుకో. బలవంతానా, దౌర్జన్యంగా లేదా అపహరించి, మోసగించి ఆ యా లోకాలనుండి తెచ్చిన అన్నీ నాశనమయ్యాయి. వాటిలో పాటు, ఉన్నవికూడా పాడయ్యాయి. పేరుకి, నేను నాశనం చేసానంటున్నారు గాని, నీ అధర్మమే వీటిని నశింప చేసింది.

**అధర్మంగా ఆర్జించిన ద్రవ్యం, ధర్మమయంగా ఆర్జించిన దానిలోని కొంతతో సహా, పోయి తీరుతుంది. పోయినదాన్ని, అధర్మమైనదని భావించేంతవరకూ నష్టం తప్పదు. అలా భావించి, ధర్మాచరణానికి పాల్పడకపోయినా, నష్టం జరుగుతూనే ఉంటుంది.**

(43) తేబడిన రాక్షస స్త్రీలబాధ-నీ భావిమరణానికి కారణం. ఏ ఒక్కరో ఒక చోటనుండి ప్రార్థించిన దానికంటె,ఎక్కువమంది ఆర్తులు దుఃఖిస్తే, దానికి ప్రాధాన్యం ఉంటుంది. అనేక రాక్షస స్త్రీల దుఃఖం, ఈ లంకనుండి వినిపిస్తోంది. వారి ఏక గ్రీవ ప్రార్థన, నీ వధకే.

(44) స్త్రీ పరాధీనురాలు కాబట్టి, సీత మీద నీవు చూపిన క్రోధం, మోహం అన్నీ రాముణ్ణే చేరాయి.

(45) వివాహబంధంలో, స్త్రీహృదయం భర్తహృదయంలో మంత్రాలద్వారా బంధింపబడుతుంది. ఆమె వేఱొకచోటనుండి వచ్చి తనని చేరినప్పటికీ వివాహ మంత్ర ప్రభావంవలన, తన భార్యని వేఱొకడు అక్రమంగా కామిస్తే, అది, భర్తయైన తన హృదయంలో ప్రభావితమై, భర్తకి బలం చేకూరి, వ్యతిరేక శక్తిలో కామించినవాడిని వధిస్తుంది. (పెళ్ళిలో మంత్రాలతో నీరు పోయిస్తూ చేసేది ఇదే).

(46) రాముని బలాన్ని ప్రత్యక్షంగా ఎఱుగున్న నేను, నీ బలాన్ని కూడా చూచి, ధర్మానికి సంబంధించిన ఆయ వ్యయపట్టిక (Balance Sheet) ని, నా రాజైన సుగ్రీవునికి చెప్పాలని వచ్చాను.

(47) దేశం దాటి విదేశానికి వచ్చే నాకు, స్వదేశానుమతి (Pass-Port) అక్కఱలేదు కారణం-సుగ్రీవుని అధికారికమైన ఆజ్ఞతో, అధికారపుహెూదాలో మంత్రిగా పర్యటనకి వచ్చాను కనుక.

(48) విదేశమైన నీ నుండి అనుమతి (Visa) అక్కఱలేదు. కారణం, మా సామ్రాజ్యానికి సంబంధించిన దొంగసొత్తు నీవద్ద ఉంది గనుక.

(49) ఉందనిఎలా తెలుసంటే, సంపాతి అనే పక్షిరాజు సాక్ష్యం (Eye-witness) ఉంది గనుక. ప్రస్తుతం అది నిశ్చయమై నువ్వు కాదనలేవు గనుకనూ.

(50) మా బందిఖానాలో ఉన్న పట్టమహిషితో మాట్లాడడానికి, అనుమతి తీసుకోలేదే? అంటావా? నేను ఆమె భర్తకు దాసుణ్ణి ఆయన ఇచ్చిన ఉంగరాన్ని, దాని ప్రతివిధిగా తెచ్చిన వాణ్ణి-గనుక. ఆ మాటకొస్తే నీకే మాట్లాడే అధికారం లేదు.

(51) వనం చెడగొట్టావేమిటి? అంటే వానరులకి వన ధ్వంసం సహజ లక్షణం గనుక.

(52) సుగ్రీవుడు నిన్ను-'సోదరుడు' అన్నాడు కాబట్టి, అడక్కుండా నీకు సలహా ఇచ్చే అధికారమున్న వాడు గదా!

(53) ఇంద్రజిత్తు వేసిన బ్రహ్మాస్త్రం నన్ను బాధించదు. కారణాలు కొన్ని.

(1) రామదాసుణ్ణి కాబట్టి, ఆ అస్త్రం రాముని మీద వేసినట్లే.

(2) బ్రహ్మాస్త్రంలో ఉన్న అగ్ని - వాయుపుత్రుడైన నన్ను, మిత్రుని పుత్రుడనే ఆలోచనతో ఏమీ ప్రతికూలం చేయదు.

(3) పాపి రాముణ్ణి బాధించవచ్చుగా–అంటే సూర్య వంశీయుడూ, ధర్మపరుడూ రాముడు.

(4) సీతా దుఃఖం పోగొట్టాలని నేను వచ్చి వుందుల్లైకె, ఆమె తపస్సూ, శీలమూ నన్ను రక్షిస్తాయి.

(5) అధర్మం లేనివాని మీద ప్రయోగించబడిన బ్రహ్మాస్త్రం విఫలమై, ప్రయోగించిన వాణ్ణి దహిస్తుంది. అఫలితాన్ని బట్టే, ఎదుటి వ్యక్తి ధర్మాన్ని పరీక్షించాలి. నా మీద బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించిన నీ పుత్రుడు ఇంద్రజిత్తుకి గాయాలు కావడంబట్టి, ధర్మం రామునిదనీ, అధర్మం నీపుత్రునిదనీ గమనించు.

(54) మానవులు రాక్షసులకి ఆహారపదార్థం. అందుకై రాక్షసులకి మానవులంటే పుట్టుకలోనే జాతిద్వేషం– తక్కువ బుద్ధీ ఉంటాయి. అలాటి మానవ జాతి కాంత అయిన సీత యందలి కామం, నీకు సజాతీయం కాదు. వేదం లోని 'జాయా' పదానికి అర్థం తెలియని వాడివి నువ్వు.

(55) ఇద్దరిలోనూ సామనస్యం ఉంటే, అది 'కామం'. కామం తిరస్కరింపబడితే అదిక్రోధం. ఒకని కామం, రెండవ వానికి క్రోధం అవుతుంది. దీని ఫలితం 'శోకం'. దీన్ని అనుభవించబోతున్నావు సుమా!

(56) మీ లంకలో నీకు హితాన్ని బోధించేవారు లేరా? లేక నువ్వు వినవా? అని సీతమ్మ ఇంతకు ముందే నిన్ను అడిగింది. హితాన్ని బోధించేవారు లంకలో లేక కాదు. నీకు భయపడి చెప్పరు. కాని నేను నిన్ను భయపెట్టదలచి చెప్పుతున్నాను. అసత్యం కానిదాన్ని చెపుతూంటే, నిజం కాబట్టి నువ్వు వింటున్నావు.

(57) ఇదంతా చెప్పగలిగింది రామ శక్తి వలననే. ఇనుప మొద్దుతో ఒకరిని చంపామంటే శక్తి మొద్దుది కాదు. మోదిన వ్యక్తిది. లంకారాక్షసిని మోదానంటే శక్తి, రామునిదే తప్ప నాదికాదు. అలాగే ఇంత సందేశాన్ని చెప్పగల్గానంటే శక్తి రామునిది.

❀ ❀ ❀

# 52వ సర్గము

## దూతని చంప వద్దు! తప్పు!!

దూతగా వచ్చిన పావనిని చంపవలసిందని విన్నవాడై, విభీషణుడు రావణునితో "రాజా! రోషంతో ఆజ్ఞాపించావు. ప్రశాంత చిత్తుడివై ఆలోచించు.

లోక ధర్మాన్ని తెలిసినవాడివీ, విద్యాంసుడివీ, పెద్దల పరిపాలన పద్ధతిని ఎఱుగున్న వాడివీ అయిన నీలాటివాడు ఇలాటి ఆజ్ఞ చేయడం తప్పు.

దూతకి దండనం తప్పుకాదు గాని, మరణదండన తప్పు" అన్నాడు.

'న పాపానాం వధే పాపం విద్యతే శత్రుసూదన' పాపాచారుడైన వాణ్ణి చంపితే పాపంరాదు. కాబట్టి చంపాల్సిందే" అని రావణుడు పల్కితే, విభీషణుడు "లంకేశ్వరా! ప్రశాంతుడివై విను. కోపం - ప్రతి ప్రాణికీ సహజం. ఆ క్షణంలోని ఆలోచన సరైనదో కాదో, విజ్ఞులైనవారు కోపం పోయి, ప్రసన్నులయ్యాక తెలిసికొంటారు.

నీ పుత్రుడైన అక్షునితో పాటు ఎందఱినో చంపినందువల్ల ఈ దూత నిస్సందేహంగా శత్రువే. అయినా ఏ దేశంలోనూ, ఏ జాతివాడైన దూతనీ చంపరాదని శాస్త్రం.

అయితే, కొరడాదెబ్బలూ, జుట్టు తీసివేయడం, శరీరముపై వాతలూ వంటివి, వాని దోషానికి తగినట్లు విధించవచ్చును.

మంచి చెడులని ఎఱిగినవాడివీ, ఉత్తమ శిక్షణని పొందినవాడివీ అయిన నీవు, కోపవశంతో ఇలా చేయద్దు. ఇతణ్ణి చంపినందువల్ల మనకి ఏ లాభమూ లేదు సరికదా కోతినీ, దూతనీ, చంపారనే అపఖ్యాతి వస్తుంది.

పైగా, శత్రువులు వీనిని పంపించారు. ఇతరుల అధీనంలో ఉన్న ఇతడు, వాళ్లు చెప్పమన్న మాటల్ని చెప్పాడు కాబట్టి, అతని తప్పుకాదు.

'అస్మిన్వినష్టే న హి దూత మన్యం
పశ్యామి యస్తౌ నరరాజపుత్రౌ
యుద్ధాయ యుద్ధ ప్రియ! దుర్వినీతా
వుద్యోజయేద్దీర్ఘ పథావరుద్ధౌ॥ (22)

నిశాచరాణా బదిపోఽనుజస్య
విభీషణాస్యోత్తమ వాక్యమిష్టమ్।

జగ్రాహ బద్ధ్వా సురలోక శత్రూ
మహాబలో రాక్షసరాజముఖ్యా (26)

'రావణా! ఇతణ్ణి చంపితే 100 యోజనాల సముద్రం దాటి మరొక్కరు ఇక్కడికి రాలేరు.

ఇతడు చనిపోతే, మరెవరిని రాముడు దూతగా పంపగలడు? రాబోయే యుద్ధానికి, యుద్ధప్రియుడైన నీవు అవకాశం చేసికోవాలి గాని, యుద్ధాన్ని మానుకొంటావా?

పౌరుషవంతులూ, శస్త్రధరులూ ఐన కోట్లకొలది యోధులు నీ వద్ద ఉంటే, వారిలో ఏ కొందఱిని పంపించినా నీ ప్రభావాన్ని రామలక్ష్మణులకి చూపి, వాళ్లని బంధిస్తారు గదా!" అన్నాడు.

'ఇది సరియైనదే' అని, ఆలోచించిన మీదట, రావణుడు ఒప్పుకున్నాడు.

(హనుమని చంపితే, రామలక్ష్మణుల రాక ఉండదు. రాముని చేతిలో వధ సాగదు. మోక్షలబ్ధి తనకుండదు.

పైగా రామదాసవధ సరికాదు. ఒక్కడే ఇందఱిని చంపినాడని తెలిసిన రావణుడు, హనుమని చంపవలసినదిగా ఎవరిని ఆజ్ఞాపించగలడు? ఎవరికి చంపేశక్తి లేదుగా!

శక్తియే ఉంటే, ఇంతకు ముందే చంపగలిగే వారుగా!

మన వద్దకి రామలక్ష్మణులు వచ్చే ఉపాయం ఉండదని విభీషణుడు చెప్పగానే, రావణుడు సరేనని అంగీకరించడం, మోక్షం కోరుతున్నాడనడానికి ప్రత్యక్ష సాక్ష్యం.)

(మహాభారతంలో కూడ శ్రీ కృష్ణ పరమాత్మ దూతగా కౌరవులవద్దకు వెళ్లినపుడు దుర్యోధనుడు త్రాళ్లతో కట్టదలచగా, శ్రీకృష్ణుణ్ణి దూతగా భావించినా కూడ ఇలా కట్టదలచడం తప్పే అవుతుందని పెద్దలు మందలించారు).

❀ ❀ ❀

# 53వ సర్గము

## శిరోభవ పాముఖిణి

తమ్ముడు విభీషణుడు చెప్పిన మాట నచ్చిన రావణుడు "విభీషణా! దూతని చంపడం మంచిదికాదు (1). కాని, దానితో సమానమైన అవమానం వీడికి చేసి, వీడి ఆప్త-దాయాద-స్నేహితులంతా పరిహసించేలా చేయాలి. (ఏనుక్కి తుండం - మనిషికి చేతులూ - సింహానికి పంజా - గుఱ్ఱానికి ముందుకాళ్లూ - గాడిదకు వెనుక కాళ్లూ) కోతికి తోకా బలిష్ఠంగా ఉండి చాలయిష్టమైనవి. (ఆత్మరక్షణచేసేవి). అందుకని, వీనితోకకి నిప్పంటించి నాలుగు మార్గాల కూడళ్ల కలుపుతూ ఊరంతా త్రిప్పండి అని ఆజ్ఞాపించాడు.

పాత గుడ్డపేలికలు తోకకి చుట్టి, నూనెతో తడిపి నిప్పంటించగానే మారుతి ముఖం ఎఱ్ఱబడింది. కోపం పెరిగింది. తోకని ఒక్కసారి విదిలించి, చుట్టూ ఉన్న రాక్షసులని పడత్రోసాడు. హనుమ తోకకి నిప్పంటించారని తెలిసి, వినోదంగా చూడ్డానికి పిల్లలనుండి వృద్ధులవఱకూ వచ్చారు.

ఆ సమయంలో ఇలా హనుమ ఆలోచించాడు. 'వీళ్లిలా చేసినా, నా ధాటికి తట్టుకోలేరని నాకు తెలుసు. కోపం, వీళ్లని చంపమంటోంది. తీరా, రాముడు, రావణుణ్ణి చంపుతానని ప్రతిజ్ఞచేసి ఉన్నాడు. కాబట్టి, రామ ప్రతిజ్ఞకోసం ఈ అవమానం భరించక తప్పదు. అయినా, ఏది చేసినా మన మంచికే అంటారు. రాత్రిపూట నగరం చూచాను. నన్ను త్రిప్పేటప్పుడు లంకనీ, నగర రక్షణ పద్ధతులనీ వివరంగా గ్రహిస్తాను. చూడడం త్రిప్పడం ద్వారానే కదా సాధ్యం. ఈ 'ఊరేగింపు' అవసరమే అని భావించాడు.

శంఖాలు ధ్వనించాయి. భేరీలు మ్రోగుతున్నాయి. ధ్వజాలు చటచకుంటున్నాయి. తోకకి నిప్పు అంటుకున్న హనుమ బంధింపబడి, రాక్షస జనమధ్యంలో నడుస్తూ రాసాగాడు.

వీధులనీ, కూడళ్లనీ, ఇళ్ల వరుసలనీ, ఇళ్లలోని నిర్మాణ పద్ధతులనీ, రహస్యద్వారాలనీ, ఇలా ఇళ్ల-వీధుల విశేషాల నన్నీ పరిశీలనగా చూస్తూ, నిప్పుగుఱించిన ఆలోచన లేక, పోతూంటే, కూడళ్లలోనూ, మంటపాలవద్దా నిలువబెట్టి - 'గూఢచారి'గా వచ్చి పరాభవం పొందుతున్నాడని - అపహాస్యం చేయసాగారు రాక్షసులు.

ఇంతలో రాక్షస స్త్రీలు సీతతో "అమ్మా! నీతో ఏదో మాట్లాడిపోయాడు చూచావా! ఆ ఎఱ్ఱమూతి కోతి తోకకి నిప్పంటించారు. ఊరంతా త్రిప్పుతున్నారు". అని చెప్పారు. "శ్రుత్వా తద్వచనం క్రూర మాత్మాపహరణోపమామ్" ఆ మాట విని, తన ఆత్మనే అపహరించినట్లుగా బాధపడుతూ, అగ్నిని సీత ఇలా ప్రార్థించింది.

'యద్యస్తి పతిశుశ్రూషా యద్యస్తి చరితం తపః ।
**యది చాస్త్యేక పత్నీత్వం శీతోభవ హనుమతః ।**

యది కించిదను క్రోశస్తస్య మయ్యస్తి ధీమతః ।
**యది వాభాగ్యశేషో మే శీతోభవ హనూమతః ।**

యది మాం వృత్త సంపన్నాం తత్సమాగమ లాలసామ్ ।
**స విజానాతి ధర్మాత్మా శీతోభవ హనూమతః ।**

యది మాం తారయే దార్య స్సుగ్రీవ స్సత్యసంగరః ।
**అస్మాద్దుఃఖాంబు సంరోధాత్ శీతోభవ హనూమతః । (28 నుండి 31)'**

నేనే పతిసేవా పరాయణు రాలనైతే, నాకు తపోబలం ఉన్నట్లైతే, నేనే పతివ్రతనైతే, **ఓ అగ్నీ! హనుమకు నీవు చల్లగా ఉండు!**

రామునికి నా మీద ఏమాత్రపు దయ ఉన్నా, నేను ఏ కొంచెం అదృష్టవంతురాలినైనా, **ఓ అగ్నీ! హనుమకి నీవు చల్లగా ఉండు!**

నా పాతివ్రత్యాన్నీ, రాముణ్ణి చేరాలనే ఆరాటంలో ఉన్న తనాన్నీ, హనుమ, గుర్తించినట్లైతే **ఓ అగ్నీ! హనుమకి నీవు చల్లగా ఉండు!**

తన ప్రతిజ్ఞని నెరవేర్చుకొనే వాడూ, పూజ్యుడూ, ఐన సుగ్రీవుడు నన్నీ దుఃఖంనుండి దాటింపచేసేటట్లయితే, **ఓ అగ్నీ! హనుమకు నీవు చల్లగా ఉండు!** (అని ప్రార్థించింది. (2) అంతే! హనుమకి, తన తోకనున్న అగ్ని, మంచులా చల్లగా ఉన్నట్ల నిపించింది.

'నాకు బాధ కల్గడం లేదు. నిన్నటిరోజున సముద్రం దాటేప్పుడు సముద్రుడూ-మైనాకుడూ, అంతటి తొట్రుపాటులో రామునికి సహాయపడితే, (3) అగ్నిదేవుడు సహాయపడడా? సీతమ్మకు నాపైగల కరుణా, రామతేజస్సూ, నా తండ్రి వాయుదేవునికి అగ్నిదేవునితోడి స్నేహమూ దీనికి కారణాలు' అని భావించి - 'ఇప్పుడేం చేయాలి?' అని మళ్లీ ఆలోచించి, తన మహాకాయాన్ని చిన్నదిగా చేసి, కట్లని వదులుచేసికొని సింహనాదంతో లంకాద్వారం మీదికి ఎగిరాడు. (4)

అందరూ చూస్తుండగా నాల్గు దిక్కుల్నీ ఓసారి చూచి, ద్వారానికి ఉన్న ఇనుప గుదియని ఊడదీసి అక్కడి కావలా వాళ్లని చంపి, ఒక్కసారి అటు, లంకవంక చూచాడు. ఇటు తోక చివర చల్లగా ఉన్నా మండుతూ ఉండడం గమనించాడు.

**విశేషాంశాలు : సంతానం ఆపదలో ఉంటే చదువుకోవలసిన శ్లోకాలు :**

(1) నందీశ్వరుడు శపమీయగా, వచ్చిన వానరుడు వీడు. ఇతణ్ణి మామూలు కోతిగా భావించి చంపడం ఏం ఉపద్రవాన్ని తెస్తుందో? అనే భావనలోపం చేసి, పైకి

విభీషణుని మాట విన్నట్లుగా నటించి, తోక కాల్చండని ఆదేశించాడు. బ్రహ్మాస్త్రానిక్కూడా కట్టుపడని కోతికి, తోక కాలిస్తే శక్తి ఉండదని, రావణుడంతటి వాడాలోచించాడంటే, అది ఎంతవఱకు సమంజసం? కాబట్టి నిజమైన హనుమశక్తిని గమనించాలనే, ఇలాటి ఆజ్ఞనిచ్చాడనిపిస్తుంది. తన శాపానికి సంబంధించిన అనుమాన నివృత్తికే ఇలాటి ఆజ్ఞ. ఇక, ఇంద్రజిత్తుకి రాజనీతి తెలియదు కాబట్టే, దూతపై బ్రహ్మాస్త్రం వేసాడని కూడా ఫలితమయ్యింది. బ్రహ్మాస్త్రం పనిచేయలేదనే దుఃఖం, రాక్షసులలో ఎవరికీ లేదు– కోతి తోక కాలుతోందంటే వినోదిద్దామనే ఆనందం తప్ప. సీతని లంకలో దాచానని రావణుడెవరికీ చెప్పలేదు. సీతావార్తని తెలిసున్న హనుమనికూడా చంపేస్తే, మఱికొంతకాలం తన లంక జీవించి ఉంటుందిగా! ఈ విభీషణుడు కూడా వద్దని చెప్పిన సీతాపహరణాన్ని చేయనే చేసాడు గదా! మఱి ఇప్పుడెందుకు విభీషణుని మాట వింటున్నాడు? కారణం ఒక్కటే. వీలయినంత తొందరగా తనకి రాముని చేతిలో మోక్షం రావాలి. తాను ఈ హనుమని చంపలేడు. అయితే, అతణ్ణి ఎలాగో ఒకలా, రాముని వద్దకి వెంటనే మాత్రం వెళ్లేలా చేయకుండానూ ఉండగలడు (అతికష్టం మీద). కాని, అది తనకోరికకు వ్యతిరేకం కాబట్టి దూతని చంపను – అని అన్నాడు.

(2) ఈ నాల్గు శ్లోకాలూ అతిముఖ్యమైనవి. రాబోయే రామాయణ కథని సంక్షిప్తంగా చెప్పేవి. **(పుత్రుడు, లేదా సంతానం ఆపదలో ఉన్నప్పుడు కొందఱు తల్లులు చదువుకొన్నవి. ఫలితాన్ని సాధించినవీకూడా).** ధర్మమయమైన రాముని బాణాలు, సీతయందు ఏ విధమైన అధర్మం ఉన్నా పనిచేయవు. నిత్యం రావణుడు, ఆమెను నిర్బంధిస్తూ ఉంటే ఆమె లొంగలేదు.

ఏ కోణంలోనైనా, రావణునియెడ అభిమానం ఆమెకు ఉందేమో తెలిసికొని రమ్మని, హనుమకి చెప్పడం ఎలా? ఉంటే, తన బాణాలు పనిచేయవు కదా! నిజంగా రామునకు అనుమానం ఉండికాదు. లోకం అనుకొనే వీలులేకుండా కనుక్కొని రావాలి హనుమ. రాముడు నోటితో, ఇలా కనుక్కొని రమ్మని చెప్పలేదు(డు).

అయితే రామమనస్సుని గ్రహించగల అమ్మవారు, ఈ శ్లోకంలో 'యది చాస్త్యేక పత్నీత్వమ్' అనేమాటలో – తనపై రామునికి, లోకదృష్టిలో కలుగబోయే అనుమానానికి సమాధానం చెప్పడంతో పాటు, ఎదురు పరీక్షకూడా పెట్టింది. నేనే పతివ్రతనైతే ఈ నిప్పు చల్లబడుగాక! అనేది ఒక అర్థం. నా భర్త రామ చంద్రుడే ఏకపత్నీ వ్రతుడైతే ఈ నిప్పు చల్లబడుగాక! అనేది మఱో అర్థం.

తనపై పరీక్షకి, తాను పతివ్రతనని నిరూపించుకొనటంతో పాటు, 'ఓ రామచంద్రా! నువ్వు ఏకపత్నీ వ్రతుడవేనా?' అని పరీక్షించి, తోక చల్లబడడం వలన నిజం గ్రహించాలని, లోకానికి చెప్పిందామె. అమ్మవారు–అయ్యవారికంటె గట్టిదికదామఱి.

(3) ఈ శ్లోకాలవలన, హనుమ తను యిద్దఱినీ కలుపగలడనీ, సుగ్రీవుడు రామకార్యాన్ని నెఱవేర్చగలడనీ కూడా, జరుగబోయే కథ ముందుగానే తెలియ వీలయింది. సీతాశక్తి (రావణా! చంపుతానుగాని రామాజ్ఞలేదు అన్న సీత శక్తి హనుమకి), నిజమని అర్థమైంది.

(4) 'శీతో భవ' అంటే నిప్పు చల్లబడింది గదా! 'హతో భవ!' అంటే రావణుడు చనిపోయేవాడే! కాని. అది రాముడు చేయాల్సిన పని. పైగా అమ్మవారు కరుణా రూపిణి. ఆ పనిచేయలేదు. ఇంత బాధలో ఉండికూడాను. 'కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా న భవతి' పుత్రుడు దుర్మార్గుడై పుట్టి ఏడ్పించవచ్చునేమో గాని తల్లి దుర్మార్గురాలై పిల్లలని బాధ పెట్టదని అర్థం. **లోకాన్ని చూచినా, పదిమంది బిడ్డలని ఒకే ఆప్యాయతతో తల్లి సమానంగా పెంచి పెద్ద చేస్తుంది కాని, ఆ పదిమంది బిడ్డలూ తల్లిని ఆలా చూడనే చూడరు.**

(5) రామాజ్ఞ లేదుకాబట్టి, నిన్ను చంపడంలేదని అన్న సీత, మఱి 'శీతో భవ' అని అగ్నిని చల్లబఱచడంలో ఆజ్ఞ పొందాలిగా! అని అనుమానం. ఇది 'ఉపకారం' అని అన్పించిన పనికి ఇతరుల అనుజ్ఞ అక్కఱలేదు. అలాగే కర్తవ్య బాధ్యతలకీ అక్కఱలేదు. తల్లి ప్రతిదినం బిడ్డలకు అన్నం పెట్టడానికి తండ్రిని అడగాలా?

అన్నిటికంటె అసలైనది- రావణ వధ రామునిచే జరగాలి. వధ పురుషకార్యం. ఆ రాముని పని, తాను చేయవలసి వస్తే అనుజ్ఞ కావాలి గదా! ఈ అగ్నిని ముట్టించడమనేది ఆ ప్రయత్నంగా జరిగింది. దీనికి అనుజ్ఞ, అక్కఱనే లేదు.

అమ్మవారి చూడామణి హనుమ వద్ద ఉంది. అంగుళీయకం రాజ్యాధికార ముద్ర. అది తన వద్ద ఉంది. అంటే, తనకి, ఆజ్ఞ ఇచ్చే అధికారం ఉన్నట్లే కదా!

(6) అగ్నిదేవుడు, సీతా పాతివ్రత్యాన్ని నిరూపించడమే కాక, ఆమె ఆజ్ఞకు బద్ధుడు కూడ కావడం, ముందునాటికి సీత-అగ్ని ప్రవేశం చేయబోయేప్పుడు కూడ దహింపడనీ, పాతివ్రత్యాన్ని నిరూపిస్తాడనీ తెలిసికోవాలని సూచించేందుకే.

(7) "బ్రహ్మ స్త్రమే పనిచేయని ఇతణ్ణి పట్టుకోవడం కష్టం-పట్టుకొని కట్టినా, త్రెంచుకుని మనని చంపుతాడు. అయినా రావణాసురుడు లేనప్పుడు, అతని పరోక్షంలో ఈ వధలు జరిగాయి గాని, అతని సమక్షంలో అయితే జరుగవు సుమా,! అనుకొనే వీలు లేకుండా అతని సమక్షంలోనూ చంపాడు. అలా అని, అధర్మపరుడు కాడు. ధర్మాన్ని చెప్తూనే ఉన్నాడు- 'సీతనిస్తే చాలు' అంటున్నాడు' - అనేభావన రాక్షసులలో కలిగి, రావణునికి,- అందఱూ రావణుడు చేసింది 'తప్పు' - అని చెప్పేలా చేసి సీతమ్మ నిప్పించాలనీ, లేదా రావణునికి వ్యతిరేకులై రాక్షసులని రామాభిమానులుగా చేసి, భేదోపాయంద్వారా దండం కాక, దండోపాయంద్వారా భేదం చేయదలిచాడు మారుతి.

❀ ❀ ❀

# 54వ సర్గము

## లంకా దహనం

కట్లు తెంచుకుని ఉత్సాహంతో హనుమ 'ఈ రాక్షసులకి ఇంకా దుఃఖం కలిగేందుకు నేనేం చేయాలి? ఈ కోటల్లా ఉన్న భవనాలని తగులబెడితే న్యాయంగా ఉంటుంది' అని భావించి, నిప్పుగల తోకని ముందుగా ప్రహస్తుని ఇంటికి పెట్టాడు. మహాపార్శ్వ - వజ్రదంష్ట్ర - శుక - సారణ - ఇంద్రజిత్ - ఇలా పెద్దపెద్ద మంత్రుల భవనాలకి నిప్పుపెట్టి విభీషణుని ఇల్లు మాత్రం విడిచి రావణ భవనానికి పెట్టాడు. (విభీషణుడు ధర్మాత్ముడని, శూర్పణఖ రామునితో ఒకప్పుడు చెప్పిందని లక్ష్మణుడు హనుమకి చెప్పాడు - అదీకాక, సభలో అసలు మాట్లాడినదీ, ధర్మబద్ధంగా మాట్లాడినదీ విభీషణుడే. అందుకు విడిచాడు.)

బంగారంతో కట్టిన యిళ్లు నేలకూలుతున్నాయి. పుణ్యం క్షీణించిన వాళ్లు నేలపడ్డట్లు, మేడల మీది నుండి రాక్షసులు దూకుతూ, కంగారుగా దిగుతూ, వృద్ధులూ, పిల్లలూ, స్త్రీలూ, జారుతూ అనేక అవస్థలకి గురి అవుతున్నారు. అయినా విడువకుండా హనుమ రశ్మికేతు-సూర్యశత్రు - హ్రస్వకర్ణ - దంష్ట్ర - రోమశ - మత్త - ధ్వజగ్రీవ - హస్తిముఖ - విద్యుజ్జిహ్వ - కుంభకర్ణ - నరాంతక - మొదలైన రాక్షసుల ఇళ్ల నన్నింటినీ, విడువకుండా ముట్టించాడు.

రావణ భవనం, చూస్తూండగానే నాల్గువైపులా అంటుకొని, గాలికి మరింతగా మండసాగింది. రత్నాల కిటికీలూ - మణులు తాపడం చేసిన గుమ్మాలూ - వాటిమీద అలంకారాలూ - ఎక్కడెక్కడ నుండి తెచ్చిన బంగారపు ప్రతిమలూ - అన్నీ తగులబడీ, ముద్దగా కరిగి నేలను పాటి, బూడిదై గాలికి ఎగిరి, ఆకారం చెడి, పనికిరానంతగా అయిపోయాయి.

'అగ్నిదేవుడే కోతిగా వచ్చాడు' - అని అనుకొంటూ పాలుత్రాగే బిడ్డలతో సహా నేలమీదికి దూకుతూ, ఏడుస్తూ, జుట్టు ముడులు వీడి రాక్షసస్త్రీలు ఏడవడం మొదలెట్టారు. 'క్వచిత్కింశుక సంకాశాః - క్వచిచ్ఛాల్మలి సన్నిభాః - క్వచిత్కుంకుమ సంకాశాః - శిఖా వహ్నేశ్చకాశిరే' మోదుగపూవు - బూరుగ పూవు - కుంకుమ రంగులలో అగ్ని అక్కడక్కడా ప్రకాశిస్తూ కన్పించింది. (దహించే వస్తువును బట్టి రంగు మార్పు.)

అనేక రాక్షసులని చంపి, భవనాలని కాల్చి, 'తాతా!, తండ్రీ!, పుత్రా'!, అని, యీ తీరుల ఆర్తనాదాలు వినబడుతూంటే, హనుమ, మనసులో రామధ్యానం చేస్తూ నిలబడిపోయాడు. దేవతలూ, మునులూ హనుమని 'ప్రళయకాలాగ్ని' అని భావించారు.

❀ ❀ ❀

# 55వ సర్గము

## కోపం చాల చెడ్డది (కోపాన్ని కోప్పడాలి)

'ధన్యాస్తే పురుష శ్రేష్ఠాః యే బుద్ధ్యా కోపముత్థితమ్!
నిరుంధంతి మహాత్మానో దీప్త మగ్ని మివాంభసా ।

క్రుద్ధః పాపం న కుర్యాత్కః క్రుద్ధో హన్యా ద్గురూనపి ।
క్రుద్ధః పరుషయా వాచా నరస్సాధూ నధిక్షిపేత్॥

వాచ్యావాచ్యం ప్రకుపితో న విజానాతి కర్హిచిత్ ।
నా కార్యమస్తి క్రుద్ధస్య నావాచ్యం విద్యతే క్వచిత్ ।

యస్సముత్పతితం క్రోధం క్షమయైవ నిరస్యతి ।
యథోరగస్త్వచం జీర్ణాం స వై పురుష ఉచ్యతే॥ (4 నుండి 7).

బుద్ధి అనే నీటితో, కోపమనే అగ్నిని ఎవడు ఆర్పుకోగలడో వాడు గదా గొప్పవాడు!

కోపం వస్తే కోపం వల్ల కలిగిన మోహంతో జ్ఞానం నశించి ప్రతిభావంతుడు కూడ గురువులనైనా చంపుతాడు. పెద్దలను నిందిస్తాడు.

చేయరానిపనీ, అనరాని మాటా, అనేవి కోపియైన వానికి ఉండవు.

పాము తన కుబుసాన్ని విడిచినట్లు, ఓర్పుతో ఎవడు కోపాన్ని విడుస్తాడో పురుషుడంటే వాడే.

ఒళ్లు తెలియని కోపంతో లంకని కాల్చేసాను. సీత కూడా కాలి ఉంటుంది. స్వామి ఘాతకుణ్ణి నేను. కోపం చాలా చెడ్డది.

ఇప్పుడు నేను అగ్నిలో దూకాలా? సముద్రంలో పడిపోవాలా? దురదృష్టవంతుడైన నాకు-కోపంతో ఒళ్లు తెలియక, ఈ అనర్థం దాపురించింది, అనుకుంటూ - తనకారణంగా ఇక్ష్వాకు కులంలో ప్రస్తుతం జీవించిన వారంతా మరణిస్తారని భావించసాగాడు.

ఇంతలో పుణ్య శకునాలు కన్పించాయి.

పూర్వం కూడ ఇలాగే కన్పించడం వలన ఆమెకు శుభం కల్గింది.

అయినా 'నాగ్ని రగ్నౌ ప్రవర్తతే ।
అపి సా నిర్దహే దగ్నిం న తా మగ్నిః ప్రధక్ష్యతి' ॥ (23-29)

తన తేజస్సుతో తాను రక్షించుకోగలిగిన ఆ పతివ్రత సీతని, అగ్ని స్పృశించలేదు.

**సీతారామ ప్రభావంచేత అగ్ని నన్నేమీ దహింపలేదు.**

అయినా, తపస్సూ, సత్యవాక్యం చేత, సీతమ్మ అగ్నిని దహించగలిగినదైతే అగ్ని ఆమెను దహించడమా? అని భావిస్తూ ఉండగా, చారణుల వాక్యాలు అతని చెవిని పడ్డాయి.

'ఎవరూ చేయలేని పని హనుమ చేసినాడు. అగ్నితో లంక లంకంతా తగులబడినా, అశోకవనంలోని సీత చెక్కు చెదఱక పోవడం చిత్రంగా ఉంది' అని చారణులు అనుకుంటున్నారు.

ఈ మాట వినగానే పరమానంద భరితుడైన హనుమ, ఆమెని ప్రత్యక్షంగా చూచి, ఆమె సెలవు పొంది వెనుకకు మఱలాలని సంకల్పించాడు.

(అగ్ని 2 విధాలు. సేంధనాగ్ని - అనింధనాగ్ని అని). ఏదైనా కఱ్ఱ - కాగితం మొదలైన ఇంధనాలని బట్టి మండితే ఆ అగ్ని సేంధనాగ్ని.

ఏ నిమిత్తమూ లేక వెలిగేది అనింధనాగ్ని.

ఈ రెంటిలోనూ రెండవది గొప్పది. సేంధనాగ్ని, ఇంధనం అయిపోగానే ఆరిపోతుంది. అనింధనాగ్నికి ఆ అవసరం లేదు.

'న దహ్యతే దహ్యమానే శరీరే' - శరీరం తగులబడుతున్నా దహింపబడనిది 'ఆత్మ'.

నాగ్ని రగ్నౌ ప్రవర్తతే - అగ్ని అగ్నిని దహింపదు - అంటే అనింధనాగ్నిని, సేంధనాగ్ని ఏమి చేయలేదని భావం. (ముందునాటి అగ్ని పరీక్షా కాలంలో కూడా ఈ కారణంగానే, సీతని అగ్ని దహింపలేదు).

**(కోప స్వభావం కలవాళ్లు కోపాన్ని తగ్గించుకోదలిస్తే (కోపం వలన రక్తం వేడెక్కి ఆరోగ్యం చెడుతుంది కాబట్టి ఆరోగ్యవంతులు కాదలిస్తే) ఈ పై శ్లోకాలని నలభై రోజుల పాటు మననం చేసికోవాలని పెద్దల మాట. ఫలితాన్ని పొందిన వారున్నారు).**

❀ ❀ ❀

# 56వ సర్గము

## ఇక్కడి నుంచి వెడతాను! – అక్కడి నుంచి తెస్తాను!!

హనుమ సీతమ్మను చూచి 'తల్లీ! అదృష్టవశాత్తూ నిన్ను చూడగలిగాను' అని బయలుదేరబోతూంటే. ఆమె 'నాయనా! లంకని జయించి తీసికొనిపోగల బలం నీకున్నా, రాముడే వచ్చి ఆపనిచేసి, నన్ను తీసికొనిపోవడం అతనికి తగిన పని' అంది.

'అమ్మా! నేను వెళ్లి వస్తాను. భల్లూకాలతో, వానరాలతో, రాముణ్ణితోడి తెస్తాను. నీ దుఃఖాన్ని రాముడు తొలగిస్తాడు' అని మారుతి ఆమెని ఊరడించి, ప్రయాణమై పోబోతూ ఆమెకు నమస్కరించాడు. సీతమ్మకు నమస్కరించి ఆమెని చూడగల్గాడు. నిప్పంటుకున్నా చల్లగా ఉన్నప్పుడు 'ఆమెదయే' అనుకున్నాడు. లంకాదహనంలో ఆమెకు కష్టం కల్గిందేమోనని భయపడి ఆత్మహత్య శరణ్యమనుకొన్నాడు. వెళ్లిపోబోయేప్పుడు తిరిగి నమస్కరించాడు. ఇదే నిజమైన శరణాగతి. తిరిగిపోవాలని ఆలోచించి అరిష్ట పర్వతం దగ్గరికి పోయాడు.

ఆ పర్వతం అనేక వృక్షాలతో గుహలతో నిండి ఉంది. గుహల్లో సింహాలూ, పులులూ ఉన్నట్లు ధ్వనులు విన్పిస్తున్నాయి. భయంలేని హనుమ తన పాదాలు పెట్టగానే ఆయన పాదాల క్రింద ఎన్నో శిలలు పొడి అయ్యాయి. ఎగరాలని సంకల్పించి పర్వతాన్ని గట్టిగా అదిమి పట్టగానే, శిఖరం ఊగులాడసాగింది.

పర్వతాన్ని క్రిందికి అదిమి పట్టడం వలన, గుహలలోని సింహాలపై బరువుపడి, అవిచెప్పలేని గర్జనలు చేసాయి. ఏదో జరుగుతోందనే భయంతో, విద్యాధరులంతా ఎలా ఉన్నవారు అలా, ఆకాశంలోకి ఎగిరిపోయారు. సర్పాలన్నీ మెలికలు తిరిగి వేగంగా బుసకొడుతూ, నేలమీదా, గాలిలోనూ పడగలెత్తి తిరుగసాగాయి.

ఒక్క ఊపులో హనుమ ఎగురగానే, ముప్పై - పదీ - యోజనాల పొడవూ వెడల్పూ గల ఆ పర్వతం నేలలోనికి దిగబడి నేల సమతలమై, లంకకి సమీపాన పర్వతమనేది లేకుండా పోయింది. ఆకాశంలో పెద్దగా కన్పిస్తూన్న మారుతి, దూరంగా చిన్నగా కన్పించసాగాడు ఉత్తర దిక్కుగా పోతూ. (ఈ పర్వతం ఎత్తుగా ఉండకపోవడం వలన కూడా వానరసేనం రాకల విషయం తెలిసే అవకాశం ఉంది). అదీకాక, తాము చేయలేని పని 'ఒక్కడే' చేసాడని మరోసారి రాక్షసులు గమనించేలా చేయడం కోసమూ, ఈ పర్వతాన్ని నేలకి సరిపోయేలా క్రుంగ చేసాడు.

❀ ❀ ❀

# 57వ సర్గము

## దృష్టా సీతా (సీత కన్పించింది)

సముద్రంలా ఉంది ఆకాశం.

చంద్రుడు అందులో కలువలాగా ఉన్నాడు.

సూర్యుడు, తిరుగుతూండే ఎఱ్ఱని పక్షిలా అన్పిస్తున్నాడు.

పుష్యశ్రవణ నక్షత్రాలు రెండూ రెండు హంసల్లా ఉన్నాయి. మేఘాలే నాచు.

తెల్లని పెద్ద శరీరమున్న ఐరావతం (ఒక ఏనుగు) ఒక ద్వీపంలా ఉంది.

చంద్రకిరణాలు సముద్రపు కెరటాల్లా అన్పించాయి.

హనుమ, ఒక పడవలా వెళ్లిపోతూంటే, ఆకాశాన్ని మింగుతున్నాడా! అన్పించింది.

మేఘాలలోకి వెడుతూ, తిరిగి బయటపడుతూ ఉన్న హనుమ ఆకాశంలో వెళ్తున్న ఏనుగులా అన్పించాడు.

ఆనందంతో చేసిన గర్జన, సూర్యమండలం దాటి విన్పించి, ఆకాశం బద్దలయ్యేంతగా అన్పించింది. ఉత్తర దిక్కున ఉన్న వానరులు ఈ విన్పించిన గర్జనని బట్టి, పని పూర్తయ్యుంటుందని తెలిసికొన్నారు.

సర్వథా కృతకార్యోఽసౌ హనుమాన్నాత్ర సంశయః ।
న హ్యస్యాకృత కార్యస్య నాద ఏవం విధో భవేత్ । (23)

జాంబవంతుడు, పని సఫలమై యుంటుందని చెప్పగానే, వానరులంతా పర్వత శిఖరాలకి ఎగిరారు.

చెట్ల చివర కొమ్మలకి వేగంగా ఎగ్రబాకారు.

తమ వస్త్రాలని చేతిలో ఉంచుకొని బంధువులకి స్వాగతం చెప్తున్నట్లు, చెట్లకొమ్మలని ఊపేసారు.

దగ్గర దగ్గరగా వచ్చిన హనుమకి, వారంతా నమస్కరించి నిలువబడితే, హనుమ రెక్కలులేని కొండ ఆకాశంలో నుండి పడినట్లు, మహేంద్ర పర్వతంపై వ్రాలాడు. అలా వచ్చిన హనుమకి వానరులు, పళ్లూ, కందమూలాలూ కానుకగా ఇచ్చారు.

హనుమకూడా, జాంబవంతుడు మొదలైన వృద్ధులకి, యువరాజా అంగదుడికి నమస్కరించి

'దృష్ట్వా సీతేతి విక్రాంత స్సంక్షేపేణ న్యవేదయత్ ।
నిషసాద చ హస్తేన గృహీత్వా వాలిన స్సుతమ్। (36)

'సీతని చూచాను.' అని ఒక్కమాటలో చెప్పి, తనకు యువరాజైన అంగదుని చేతిని చేత్తోపట్టుకొని పర్వతం మీద కూచోబెట్టి, మిగతా వానరాలంతా మూగి వింటూంటే, ఇలా అన్నాడు హనుమ.

'వానరులారా! ఉపవాసాంలో కృశించి, తల అంతా జటలు గట్టి, ఒంటి జడలో, మురికిపేరుకున్న సీతమ్మని, రాక్షస స్త్రీల మధ్య ఉండగా చూచాను' అన్నాడు.

దానితో, కోతులు కొన్ని గంతువేసాయి.

మరికొందరు ఱంకెలు వేసారు.

తోకలు నేలమీద బాదారు.

కిచకిచ ధ్వనులు చేసారు.

ఒకరు చేసినవి చూచి మరొకరు, చూస్తూనే మరికొందరు, పర్వతాలెక్కి దూకి కొందరు, హనుమంతుణ్ణి తాకితాకి మరికొందరు, ఇలా వింతచేష్టలని చేయసాగారు.

అంగదుడు మాట్లాడుతూ 'హనుమా! బలపరాక్రమాలతో పాటు, నీ స్వామిభక్తి కూడా చెప్పుకోదగ్గది. మా భాగ్యం వల్ల, సీతమ్మని చూడగలిగావు. ఇకమీదట ఆయన సుఖంగా ఉండడం మన అదృష్టం. అయితే, ఈ వానరుల కోరిక మేరకు, 'మొత్తం కథ వివరలిచాం'. అనగానే వానరులంతా చేతులు జోడించి, హనుమ ముఖం చూడసాగారు.

అంగదుడు పెద్దఱాతిపై కూర్చుండగా, అతనికి ఎదురుగా అంతంటే చిన్న రాళ్లపై ప్రక్కప్రక్కగా హనుమ జాంబవంతులు కూచున్నారు.

ఇతర వానరులంతా నిలబడి, కూచుని, వీరిద్దరి వెనుక ఉండగా ఏం చెప్తాడోనని వానరులు కళ్లప్పగించి ఎదురు చూడసాగారు.

❀ ❀ ❀

# 58వ సర్గము

## చేసింది చెప్పాను! - చేయాల్సింది చెప్పండి!!

జాంబవంతుడు ప్రీతితో 'సీత ఎలా ఉంది? రావణుని ప్రవర్తన ఎలా ఉంది? పూర్తిగా చెప్పితే, తర్వాత ఏం చేయాలో ఆలోచిద్దాం. దేన్ని చెప్పాలో, రామునికి ఏది దాచాలో మాకు చెప్పు' అన్నాడు హనుమతో.

(కష్టంలో ఉన్న రామునికి ఉత్సాహం కల్గించడానికి - దుర్మార్గుని వద్ద ఉన్న సీతమ్మ విషయంలో కొన్నిటిని దాచి, ఎలాగైనా రాముణ్ణి ఉత్సాహపఱుద్దామనే సదాలోచన జాంబవంతునిది.

గగుర్పొడిచిన శరీరంతో, సీతమ్మకు నమస్కరించి హనుమ ఇలా చెప్పసాగాడు. (ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై ప్రత్యభాషత - తన జీవనానికి - ఇలా చెప్పగల్గడానికి కారణం ఆమె. పైగా - ధ్రువం విశిష్టా గుణతో హి సీతా - రామునికంటె గుణాధికురాలు సీత - అని హనుమ ఆలోచన కూడా).

మీరు చూస్తూండగానే 'దక్షిణ దిక్కుకి ఎగిరాను కదా! ఇంతలో బంగారు శిఖరంకల పర్వతం నాకు అడ్డుగా నిలిచింది. దాన్ని తోకతో కొట్టాను. అది వేలవేల బీటలిచ్చినా, 'పుత్రా! నేను నీకు తండ్రి వంటివాణ్ణి. ఒకప్పుడు ఱెక్కలని నఱుకుతూన్న ఇంద్రుని బారి పడకుండా నన్ను, మీ తండ్రి వాయువు రక్షించాడు. అందుకని సహాయపడగలనని చెప్పాడు' అయినా నేనాగేది లేదని వెళ్తూంటే, పర్వత రూపంతోనే అతడుండి పోయాడు సముద్రంలో.

ఇంతలో నాగమాత 'సురస' అనే ఆమె అడ్డుపడి, తనకి ఆహారం కావాలని పల్కింది. నా కథ అంతా చెప్పినా వినకపోతే, ఆమె తెఱచిన నోటికి మించి నేను నోరు తెఱచి, అంగుష్ఠమాత్ర రూపంతో ఆమె నోటిలో ప్రవేశించి బయటికి రాగా, నన్నాశీర్వదించింది.

ఈ అడ్డుకూడా దాటి వెడుతూంటే, గరుత్మంతునిలాంటి నా నీడనిపట్టి ఏదో లాగింది. అది కూడా నోరు పెంచసాగింది. బాగా పెద్దది చేసాక దాని మర్మస్థానాలని తెంపి ఆకాశంలోకి వెళ్లిపోయాను.

అది పర్వతాకారంతో సముద్రంలో చచ్చిపడిపోయింది.

లంకలోకి దిగగానె ఒక స్త్రీ నన్ను చంపదలచింది. ఆమెని ఒక్క ఎడమ పిడికిడి పోటులో ఓడించి ప్రదోషకాలంలో పట్టణంలోకి వెడుతూంటే, 'రాక్షసులనందఱినీ జయిస్తావు' అని అది పల్కింది.

రాత్రి రాత్రంతా వెదికాను. సీత కన్పడలా. దుఃఖిస్తూ ఉండిపోగా, బంగారపు ప్రాకారంతో ఉద్యానవనం కన్పించింది.

ఆ అశోకవనంలో శింశుపావృక్ష సమీపంలో, సీతమ్మ కన్పించింది.

దుమ్ము కొట్టికొని పోయిన తలకలదీ.

ఒకే వస్త్రం శరీరమంతా కట్టుకొన్నదీ, ఉపవాసాలతో చిక్కిన శరీరం కలదీ, కమల పత్రాక్షి ఆమె.

పెద్దపులుల మధ్య లేడిలా రాక్షసస్త్రీల బెదిరింపుల మధ్య ఉన్నదామె.

ఇంతలో రావణుడు భార్యలతో ఆ స్థలానికి రాగా, శరీరం ముడుచుకొని దీనురాలై ఆమె ఉండిపోయింది. తన నాదరించుమని నమస్కరించి బ్రతిమలాడి, రెండు మాసాలు గడువు నిచ్చానన్నాడు.

'తనని దొంగిలించాడనీ- రామదాస్యానికి కూడా తగడనీ-వాని నాలుక వేయి వ్రక్కలు కావాలనీ' పరుషంగా సీతమ్మ పల్కింది.

ఇంతలో మండోదరి అనే భార్య 'సీతమ్మతో ఏమి పని? ఇందఱున్నారుగా' అని రావణుని వారించింది.

పిమ్మట ఎందఱో రాక్షసులు, ఎన్నో విధాలుగా ఆమెని హింసించారు. అందఱూ బెదిరించి ప్రయోజనం లేదని నిద్రపోతూంటే, త్రిజట అనే రాక్షసి లేచి, తనకు కల్గిన స్వప్నం ప్రకారం సీతని రాక్షసస్త్రీలంతా శరణువేడాలని పల్కింది.

త్రిజట చెప్పింది నిజమైతే, మిమ్ములని నేను కాపాడుతానని సీతమ్మ పల్కింది.

**ఆ సమయంలో నాకు తోచిన ఉపాయంతో ఇక్ష్వాకు వంశాన్ని కీర్తించాను. ఆమెకు సమాధానంగా సుగ్రీవ మంత్రిత్వం – రామ సుగ్రీవ సఖ్యమూ–చెప్పి, అంగుళీయకాన్ని ఇచ్చి, ఇప్పుడే రామ లక్ష్మణుల వద్దకు తీసుకుపోతా నన్నాను. రాముడే వచ్చి, రావణుని చంపి తీసికొని పోవాలని ఆమె బదులు చెప్పింది.**

ఆమె తిరిగి గుర్తుగా చూడామణి నిస్తూ, రెండుమాసాల గడువును మళ్లీ చెప్పింది. నాకోపం వచ్చి పర్వతాకారంతో అశోకవనాన్ని పాడు చేసాను.

దానికోపించిన రావణుడు 20 వేలమంది కింకరుల్ని పంపితే, ప్రాసాదం కూల్చి నూర్గురినీ, మళ్లీవచ్చిన మంత్రి పుత్రులనీ, ఆ పిమ్మట వచ్చిన సేనానాయకులని పరిఘతోనూ, చివరగా వచ్చిన రావణపుత్రుడు అక్షకుమారుణ్ణి ఆకాశంలో పాదాలుపట్టి గిరాగిరా త్రిప్పి, చంపేసాను.

రోషపడిన రావణుడు ఇంద్రజిత్తుని పంపితే, సైన్య హీనుడైన అతడు బ్రహ్మాస్త్రం వేసాడు. రాక్షసులు పగ్గాలతో కట్టారు. రావణుని వద్దకు తీసికెళ్లారు. సీతమ్మకోసమే వంపాననీ, వాయుపుత్రుణ్ణనీ, చెప్పుకుని, రామునికి వాలిసోదరుడైన సుగ్రీవసఖ్యం, అన్నీ చెప్పి సీత నిచ్చేయమని చెప్పాను.

నన్ను చంపమని ఆజ్ఞచేసిన అన్న రావణునకు, విభీషణుడు తగదని సూచించాడు.

తోకకాల్చమని రావణాజ్ఞ కాగానే, శరీరం కుంచించుకుని కట్లు వదిలించుకుని, పరిఘతో (ఇనుపగుదియ) రాక్షసుల్ని చంపి, లంకంతా కాల్చికాల్చి, సీతమ్మ బ్రతికుందనే చారణుల వాక్యం విని, శుభశకునాలని గమనించి, సీతని ప్రత్యక్షంగా చూచి, ఆమెవద్ద సెలవు గైకొని, అరిష్ట పర్వతమెక్కి బయలుదేరి, వాయుమార్గంలో మీ వద్దకు రాగలిగాను.

రామ ప్రభావంతోనూ, మీ అనుగ్రహంవల్లా, సుగ్రీవాజ్ఞ నెరవేర్చాను.

చేసినది మీకు నివేదించాను. చేయనిదీ, చేయవలసినదీ మీరు చెప్పాలి అని ఒక క్షణం ఆగాడు హనుమ.

(సుందరకాండ మొత్తం కథని, హనుమ చెప్పడంకూడ విశేషమే. కథ పూర్తిగా జరిగాక, ముగింపులో, మళ్లీ కథని వింటాం. అంటే, కథ పునరావృతమౌతూంటుందన్న మాట. ఇదీ విశేషమేగా మరి).

❀ ❀ ❀

# 59వ సర్గము

## ఆమె పాతివ్రత్యమే రావణుణ్ణి చంపడానికి చాలు!

హనుమ మళ్లీ చెప్పడం ప్రారంభించాడు. 'రావణుడు మహా తపస్సంపన్నుడు. ఆ కారణంగానే సీతమ్మని స్పృశించినా, వాడు భస్మం కాలేదు. (ఇప్పుడిప్పుడు, తపోబలం తగ్గిన కారణంగా–తగ్గుతున్న కారణంగా పుత్రశోకం–భవన నాశనం–సైన్యనష్టం కలుగుతున్నాయి. ఇప్పుడైనా సీత నిచ్చివేసి జాగ్రత్త పడవచ్చునని సూచన).

మీరంతా అంగీకరిస్తే, ఇటునుండి ఇటే లంకకిపోయి, రావణుణ్ణి నేను చంపగా, మనం మిగిలిన వారితో యుద్ధం చేసి, జానకిని రామలక్ష్మణుల కిచ్చివేద్దాం.

ఇంద్రజిత్తు ఏ అస్త్రాన్ని వేసినా, నాకు లెక్కలేదు. అనుజ్ఞనిస్తే ఇంద్రజిత్తుని కూడ చంపేస్తాను. సముద్రం చెలియలికట్టని దాటినా, మందరం చలించినా, జాంబవంతుడూ, అంగదుడు శత్రుసైన్యానికి చాలు. పనస నీలురు మందర పర్వతాన్నైనా ధ్వంసం చేయగలరు. అమృతాన్ని త్రాగిన మైందద్వివిదులు అశ్వినీదేవతల పుత్రులు కదా! వీరికి మరణం లేని వరంకూడ బ్రహ్మ ఇచ్చాడుగదా! నా పేరూ, ఊరూ, అన్నీ లంకలో చెప్పి వచ్చాను.

మేఘాలచే కప్పబడిన చంద్రరేఖలా ఉన్న సీత, నిత్యం రాముణ్ణే స్మరిస్తూ ఉంది. నహుషుడు ఎంత నిర్బంధించినా, ఇంద్రుణ్ణే ధ్యానించే శచీదేవిలా, ఆమె సంపన్నుడైన రావణుణ్ణి అణు మాత్రం ధ్యానించడం లేదు. కరుణా స్వభావురాలైన ఆమె, అంతచేసినా రావణుణ్ణి దహించలేదు.

ఆమెను ఇలా నిర్బంధించి, దుఃఖింపచేసి నందువలననే, వాని తపశ్శక్తి చాల నశించిపోయింది. 'నిమిత్త మాత్రం రామస్తు వధే తస్య భవిష్యతి'– ఆమె పాతివ్రత్యమే రావణుణ్ణి చంపుతుంది. రాముడు కేవలం నిమిత్తమాత్రునిగా ఉంటాడు. సహజంగా పద్మినీ జాతి స్త్రీయైన ఆమె, సన్నని శరీరం కలది. కాగా వియోగం వలన మరింత చిక్కి, పాడ్యమినాడు ప్రారంభించిన, లేదా పాడ్యమినాడు చదివిన విద్యలా కృశించి ఉంది. (ప్రతిపత్పాఠశీలస్య విద్యేవ తనుతాం గతా) అందుకని ఈ విషయంలో ఏం చేయాలో ఆలోచించండి'– అని ముగించాడు.

❀ ❀ ❀

# 60వ సర్గము

## రామాజ్ఞనే పాటించాలి!

హనుమ చెప్పింది విని అంగదుడు, 'వానరులారా! సీతని తీసికొని పోకుండా రామునివద్దకు పోవడం, నాకూ యుక్తమనిపించడం లేదు. మేం సీతని చూశాం. కాని తీసికొని రాలేదు' - అంటే, ఏం సమంజసంగా ఉంటుంది? మనతో సమానంగా ఎగురగల్గినవాడు ఏ జాతిలోనూ లేడు. పరాక్రమవంతుడూ లేడు. ఇక అక్కడ,-వీరుడు- అన్పించిన అందర్నీ, హనుమ స్వయంగా సంహరించేసాడు. ఇక చేయాల్సింది ఏమున్నది? కాబట్టి సీతని తీసికొని రామసన్నిధికి పోదాం' అన్నాడు.

వృద్ధుడూ - కార్యవిచక్షణశీలీ జాంబవంతుడు ఈ మాటలని విన్నాడు. 'అంగదా! యువరాజైన నీవు చెప్పింది చాలబాగుంది. కాని 'యథా తు రామస్య మతిర్నివిష్టా- తథా భవాన్ పశ్యతు కార్యసిద్ధిమ్' (1) రాముడు ఎలా చేయమన్నాడో, ఆయన బుద్ధికనుగుణంగా మనం చేయాలి గాని మన చిత్తానికి తోచినట్లు కాదుసుమా! అన్నాడు.

### విశేషాంశాలు

'రాముని ఆలోచనానికి అనుగుణంగా మనం చేయాలి' అని చెప్పిన జాంబవంతుని మాట చాలగట్టిది. జాంబవంతుని ప్రోత్సాహంమీదనే లంకా నగరానికి వెళ్లడానికి, హనుమ సాహసించాడు. 'ఈ సందర్భంలో రాముడైతే ఏం చేస్తాడు' అని, ప్రతి సందర్భంలోనూ హనుమ ఆలోచించే ప్రవర్తిస్తున్నాడు. దీన్నే 'రామ భావభావన' అనుకున్నాం. ఆ భావనతోనే లంకా ధ్వంసం చేసాడు.

### హనుమ చేసిన లంకాధ్వంసం వలన ఏమి తెలిసింది?

(1) 'కింకరులు' అనే కాల్బలాన్ని పూర్తిగా చంపగా, బలిష్ఠమైన కాల్బలం లేకుండా పోయింది.

(2) మంత్రులలో చాలమంది ముఖ్యులైన వారికి పుత్రశోకం కల్గించడం వలన, యుద్ధం అంటే వారికి భయం ఏర్పడింది. మనశ్శోకంలో వారు సరైన సూచనలని రావణునకు ఈయక, రావణ నాశనాన్ని కోరేలా అయింది.

(3) చైత్యప్రాసాదాన్ని పడగొట్టడంవలన, -హనుమ- అనే కోతిజాతివాడు మనుష్యులనే కాక మేడలని కూడా కూల్చగలడని రాక్షసులకి అర్థమైంది.

(4) విరూపాక్ష యూపాక్షాది సైన్యాధ్యక్షు లంతటి వారిని కూడ చంపడం వలన, సైన్యానికి మఱింత భయం ఏర్పడింది.

(5) సైన్యాధ్యక్షులూ, మంత్రులూ, మంత్రిపుత్రులూ, నశించినా, రావణుడు ధైర్యంగా ఉంటాడుగా!- అనుకొంటే, వానికి తన పుత్రుడు పోయినందువలన మనశ్శోకం కల్గింది. అందుకని అతడి యుద్ధమూ నిరుత్సాహకరంగా ఉంటుందని రాక్షసులకి తోచింది. ఎవరి ప్రాణాలని వాళ్లు రక్షించుకొంటే సరి, అనే అభిప్రాయం అందఱికీ తోచింది.

(6) త్రిజట మొదలైన రాక్షస స్త్రీలకి, సీత, తమని రక్షింపగలదనే దృఢనిశ్చయం ఏర్పడింది. ఆమె సామాన్యురాలు కాదని తోచింది.

(7) రావణుణ్ణే ధైర్యంగా చూస్తూ, 'సీతనిస్తే బ్రతుకుతావు' అని చేసిన ఉపదేశం, రాక్షసులందఱికీ నచ్చింది. వారిలా దొంగతనం కాక, 'దొరతనం' హనుమలో ఉండడం వలన కూడా వారిలో భయం ఏర్పడింది.

(8) తమ పక్షంలో ఉన్న విభీషణుడు కూడా రావణుణ్ణి వ్యతిరేకించాడని తెలిసిన రాక్షసులకి, తమ 'గెలుపు' పై నమ్మకంపోయి, చేసేది 'అధర్మమే' అని తెలిసి, యుద్ధానికి అంత ఇష్టాన్ని చూపించలేకపోయే పరిస్థితి కల్గింది.

(9) రాక్షసులు హనుమతో యుద్ధం చేయకుండా ఉండి ఉంటే, వీళ్లు ఇంతటి దద్దమ్మలనే విషయం హనుమకి తెలియకుండా ఉండేది. ఇలాటి వీళ్లని నమ్ముకుని, రావణుడు, రామునితో ఏమి యుద్ధం చేయగలడని, హనుమకి అర్థమైందని, రాక్షసులకి బాగా అర్థమైంది.

### [illegible]

(1) రావణునికి ఐశ్వర్యం (ఈశ్వరస్య భావః - ప్రభువుగా చెలాయించే అధికారం) సంపదా అనేవి రావడానికి 'లంకావాస్తు' కారణం. కాబట్టి, ముందు దీన్ని- దెబ్బతీయ్యాలి- అని భావించి-

(i) పల్లంగా ఉండి నీటి పాఱుదల కల్గిన ఈశాన్య భాగంలో, ఎక్కడెక్కడా విఱుగగొట్టిన మేడ మిద్దెల శిథిలాలనీ, చెట్ల కొమ్మలనీ వేసి ఎత్తుచేసాడు. దీని వలన నీరుకూడా ప్రవహించడం ఆగి, ఎటుగా నీరుపోరాదో, ఆ ఆగ్నేయం వైపు సెలయేళ్లు ప్రవహించసాగాయి.

(ii) అగ్ని దిశయైన ఆగ్నేయంలో నాటబడిన అగ్ని సంబంధమైన వృక్షాలు రావి, జువ్వి, వంటివి వానిని పూర్తిగా పెళ్లగించివేసాడు.

(iii) దక్షిణ పశ్చిమాలలో ఉన్న ప్రాకారపు గోడలు, తూర్పు ఉత్తరాల ప్రాకారపు గోడల కంటె ఎత్తుగా ఉంటే, ఆ విధానాన్ని తల క్రిందుచేసాడు.

(iv) దక్షిణ పశ్చిమాలు కలిసే నైఋతి దిక్కులో ఎత్తైన క్రీడాపర్వతాలూ, బరువైన మేడలూ ఉంటే, అటు ఎత్తునీ తగ్గించి, బరువులేకుండానూ చేసి, ఆ బరువుని ఈశాన్యంలో (తూర్పు ఉత్తరాలు) ఉంచాడు.

(v) సింహద్వారాన్ని కాల్చి, గదికీ గదికీ మధ్యలో ఉండే గోడలని విఱుగగొట్టి, 'ఆయము' అనే కొలతని మార్చాడు.

(vi) పిశాచ భాగమైన పడమటిభాగం, తూర్పుకంటె తక్కువగా ఉంటే, అక్కడున్న మేడమిద్దెలని ధ్వంసం చేసి పిశాచ భాగాన్ని మఱింత పెద్దది చేసాడు.

(vii) ఈశాన్యంలో ఉండాల్సిన జల యంత్రాల్ని ఆగ్నేయం (దక్షిణ పడమర) లోకి విసిరేసాడు.

(2) శాపం కారణంగా, బ్రహ్మాస్త్రం తనని బాధించవలసి ఉంది. ముందునాటకి జరుగబోయే రామరావణ యుద్ధంలో గనుక ఆ బ్రహ్మాస్త్రం, తనని కట్టివేస్తే, ముఖ్యమైన యుద్ధంలో రామునకు తాను సహాయం అందజేయలేకపోతాననే భయంతో, ఆ బాధేదో ఇప్పుడే పడిపోతే మంచిదని భావించి, 'బ్రహ్మాస్త్రానిక్కూడా వశుడు కాడనే' అంతటి యుద్ధం చేసి, బ్రహ్మాస్త్రాన్ని కావాలని మీద వేయించుకున్నాడు.

(3) దాన్ని పనిచేయకుండా చేసిన రాక్షసుల వెఱ్ఱితనమూ, ప్రయోగించిన ఇంద్రజిత్తు అసమర్థతా ఒక్కసారే అర్థమయ్యాయి.

4) తాను, 'ఇక్ష్వాకు కుల ప్రతినిధి' బ్రహ్మాస్త్రం తనని బాధించక పోవడం వల్ల, తన మీద ఏది వేసినా రామునిపైనే అని అర్థమై, ప్రయోగించిన బ్రహ్మాస్త్రం, రాముని మీద పని చేయలేదనీ, పనిచేయదనీ తెలిపి ఆనందమైంది.

(5) తన తోకకి నిప్పంటిస్తే, అమ్మవారి ఆజ్ఞవల్ల (శీతోధవ) తగుల బడలేదు సరికదా, వేడితనం కూడ లేదు సరికదా చల్లగా కూడ ఉంది- దీనికి ఆమె తపశ్శక్తి అత్యున్నత స్థాయిలో ఉండడం కారణం. మఱి రావణుని తపశ్శక్తి తెలిసికొందామని అంటించగానే, రావణ మందిరం కూడా తగులబడింది. కాబట్టి అతని తపశ్శక్తి స్థితి చాలచాల తగ్గి, అమ్మ వారిముందు ఓడిపోయేదిగా ఉంది.

అందుకని రావణుణ్ణి, అతడు తిరిగి తపస్సు ఆర్జించేలోగానే వధించాలి. వధించాలంటే అతణ్ణి యుద్ధానికి సిద్ధం కావలసిన పరిస్థితికి తేవాలి. దానిలో భాగంగానే.

(i) ఆయుధాలని తగులబెట్టాడు. అవి వెంటనే సిద్ధం కాలేవు కదా! పైగా, ఎందటికని సిద్ధం చేయ సాధ్యం?

(ii) యుద్ధం మఱింతగా సాగుతూంటే, రాక్షసులు దాక్కొనే-లేదా పారిపోయే రహస్య ద్వారాలని తగులబెట్టి, బహిరంగ పఱచాడు.

(iii) మేడమిద్దెలన్నింటినీ, తమ వారైన కోతులు ఎగురగలిగినంత ఎత్తే ఉండేవిధంగా, పొట్టిచేసాడు.

(iv) సముద్రం దాటిరాగానే, లంకా నగర రాజయిన రావణుని మందిరం కన్పించేలా, అడ్డుగా ఉన్న చెట్లన్నింటినీ ధ్వంసం చేసాడు.

(v) ఎవరి ముఖం చూచినా తమతమ బంధు-మిత్ర-పరిజన మరణంతో శోకభరితంగా కన్పించేలా చేసాడు.

(vi) పశువు లెన్నో, లంకాదహన కాలంలో మరణించాయి కాబట్టి, మాంస భోజనం రాక్షసులకి ఉండదు.

(vii) అన్ని చెట్లూ దాదాపు పోయాయి కాబట్టి, వారికి మద్యమూ ఉండదు.

viii) ఈ రెండూ లేక వారికి యుద్ధ ఉత్సాహమూ ఉండదు-ఒక ప్రక్క బంధుశోకం కూడాను.

(xi) ఎవరెవరు ఎంతెంత బంగారు-వెండి ఆభరణాలని దాచుకొన్నారో అవన్నీ ముద్దలుగా కారి నేలమీద పడితే, ఈ కాలిన ఇళ్లని బాగుచేసికొనే లోగానే యుద్ధం ప్రకటించాలని నిశ్చయించాడు హనుమ. అటు ఇల్లు-బంధువులు- పశువులు పోయిఏడుస్తూంటే, ఇటు యుద్ధం- అనగానే అంతా రావణుణ్ణి తిట్టిపొయ్యాలనీ, వాణ్ణి ఓడించాలనీ, హనుమ భావన. అలాగే జరిగింది కూడ.

(xi) తగులబడ్డ వాటినీ, బూడిదనీ, తన వాయుశక్తితో కుబేర స్థానమైన ఉత్తర దిక్కున ఉంచాడు.

(xii) సుగ్రీవుని ఆజ్ఞపై వెళ్లి చెప్పాల్సింది చెప్పకుండా రావడమా? అనుకొని, చెప్పవలసిందంతా చెప్పాడు. ఇలా అనుకొన్నాడు "చెప్పాల్సింది ఉందనిపించి చెప్పాను. వాడు వద్దని అనలేదు. నాకు మానాలనీ అన్పించలేదు. నాకు నిజమనిపించి చెప్పాను. వాడు అబద్ధం కాదనుకొని విన్నాడు" అని.

(xiii) 'సీతని తీసికొనిపో!' అని రావణుడు అనలేదు. అన్నా, సీతమ్మ రాదు. వస్తానన్నా 'రామాజ్ఞ' లేదు కాబట్టి, తాను తీసికొనిపోడు. రమ్మని అడిగినది

కేవలం అమ్మవారిని గమనించడానికే. ఆమె రానన్నాక ఆమె మీద భక్తి, మరింత పెరిగింది. అది రాముణ్ణి మించింది.

(xiv) ఆంజనేయుడు రావడం, వనం ధ్వంసం చేయడం, వీరోచితంగా పోరాడడం, రావణుని వద్దకు రావడం, వచ్చికూడా నిర్భయంగా ఉపదేశించడం, అనేవి, విభీషణుణ్ణి రామదాసుణ్ణి చేసాయి. అలాగే రావణుడు సీతాపహరణానికి పర్ణశాలకు పోవడం, మోసం చేయడం, సీతమ్మని తేవడం, ఎందరు చెప్పినా వినకపోవడం, ఇంత జరిగినా తప్పుని దిద్దుకోకపోవడం, నచ్చక, విభీషణుణ్ణి రావణ విరోధిని చేసాయి.

(xv) యుద్ధమే రామ రావణులకు జరిగితే, ఎదుటి వారిని జయించగల శక్తి ఉన్న వాలి మెడలోని 'కాంచనమాల' అనే సువర్ణహారం, వాలి పిమ్మట సుగ్రీవుణ్ణి చేరింది కాని రావణుణ్ణి కాదు.

(xvi) (వానరుడు కాని హనుమని, వానరుడు కాదని గ్రహించిన రావణుడు, సీతనీ-రాముణ్ణి కూడా, మానవులు కాదని గ్రహించలేడా?) పైకి మాత్రం, రావణుడు. సీతా రాముల్ని మానవులుగానే గ్రహించాడని కోపించిన హనుమ, యుద్ధమే సాగాలని భావించాడు.

**ఇదంతా రామభావభావనతోనే సాగింది. కాబట్టే, సీతాదేవి జీవించి ఉందా? రావణుని చోటెక్కడ? అనే ప్రశ్నలకి సమాధానం మాత్రమే తెలిసికొని రమ్మన్న రాముడు, హనుమని 'ఇవన్నీ ఎవరు చేయమంటే చేసావు?' అని ప్రశ్నించలేదు.**

"సీతని తెచ్చి ఆపిదట రాముని దగ్గఱకు వెడదాం" అని అనడానిక్కారణం, అంగదుడు యువరాజు. రాజు ప్రత్యక్షంగా లేనప్పుడు యువరాజునీ, యువరాజు లేకపోతే సైన్యాధ్యక్షుణ్ణి అడగాలనే రాజనీతి నియమానికి లోబడి, పై విధంగా పలికాడు హనుమ.

ఈ అంగదుడే ఒకప్పుడు వానరాలలో భేదం తెచ్చి ప్రాయోపవేశనం చేయించిన ఘనుడు. ఇప్పుడు కూడా తానో నిర్ణయం చేస్తే, అంగదుడు ఏమంటాడోనని భయపడి, పై విధంగా పలికి, జాంబవంతు డెలాగూ కాదంటాడని తెలిసి, పరోక్షంగా అంగదునికి 'రామాజ్ఞ పాటించాలి' అనే ఉపదేశాన్ని చేసాడు. జాంబవంతుడు వృద్ధుడు-పైగా తనకంటె బలశాలి. త్రివిక్రమావతారాన్ని చూచిన పుణ్యాత్ముడు-రామునిచే గౌరవింపబడేవాడు-లంకకి వెళ్లేందుకు హనుమని ప్రోత్సహించి పల్కినవాడున్నూ. అందుకని, అంగదునికి అతనిచేత చెప్పించాడు హనుమ.

❀ ❀ ❀

# 61వ సర్గము

## ఆనందంతో మధువన ధ్వంసం

రామాజ్ఞని పాటించాలన్న వాక్యాన్ని, అంగదాది వానరులంతా అంగీకరించి, మహేంద్ర పర్వతంమీద నుంచి కిష్కింధవైపు ఒక్కసారి ఎగిరారు.

క్రిందినుండి చూస్తే మేరుమందరపర్వతాలూ, మదపుటేనుగులూ ఆకాశంలో ప్రయాణిస్తూన్నట్లుంది.

అందరూ హనుమని అలా ఆనందంతో చూస్తూ, ముందుకూ వెనుకకూ వేగంగా ఎగురుతూ, రామునికీ వార్తను ఎవరిమట్టుకు వారు, ముందు చెప్పాలని ఉబలాటపడుతూ పోయారు.

ఇంతలో వాళ్లకి నందనోద్యానవనంలాటి సుగ్రీవుని మధువనం కన్పించింది. చెట్లలో, లతలలో ఉండీ, సుగ్రీవుని మేనమామ దధిముఖునిచే రక్షింపబడుతూన్న మధువనం అది.

వెంటనే అంగదుణ్ణి అనుజ్ఞ అడిగారు 'తేనెలు త్రాగుతాం' అని. జాంబవంతునితో సహా అంగదుడు అనుజ్ఞ ఈయడం తడవుగా, ఒక్కసారి కోతిమూక అంతా, వనంపై పడింది.

'గాయంతి కేచిత్ ప్రణమంతి కేచిత్ ।
నృత్యంతి కేచిత్ ప్రహసంతి కేచిత్ ॥

పతంతి కేచిత్ విచరంతి కేచిత్ ।
ప్లవంతి కేచిత్ ప్రలపంతి కేచిత్॥ (14)'

కొందరు పాడుతూంటే, కొందరు నృత్యం చేస్తూంటే,

కొందరు పక పక నవ్వితే, కొందరు నేలమీద దొర్లితే,

కొందరు తిరుగుతూంటే, కొందరు ఎగురుతూంటే, కొందరు పిచ్చిమాటలు మాట్లాడసాగారు.

ఒకళ్లతో ఒకళ్లు, ఏమీ లేకపోయినా రహస్యం చెప్పుకున్నారు.

కొమ్మల నుండి క్రిందికీ, క్రిందినుండి మీదికీ కొందఱు దూకారు. ఒక కోతి నవ్వుతూ ఒకనిమీదపడితే, కారణం ఏమీలేకుండా, వీడు మఱింత నవ్వుతూ వానిమీద పడ్డాడు.

ఒకడు ఏడుస్తూంటే, మరోడు పాడుతూ వచ్చి, పడతోసాడు. వారిలో తాగనివాడు లేడు. పీకలదాకా త్రాగి పిచ్చిగంతులు వేయసాగారు. అందరికీ మత్తు బాగా ఎక్కింది. కాని ఎవడికీ 'చాలు' అన్న తృప్తి లేదు.

అందఱూ ఒక్కుమ్మడిగా ఆకుల్నీ, చెట్లనీ విఱుగగొట్టడం ప్రారంభించారు. దధిముఖుణ్ణి కాదని, అందఱూ పెడసరంగా మాటాడారు కోపంతో

వన రక్షకుడైన దధిముఖుడు కొందఱిని తిట్టాడు. కొందఱిని వేడుకున్నాడు. కొందఱితో పోట్లాడాడు. కొందఱిని చేతిలో చఱిచాడు. అందఱు వానరులూ కలిసి, అనేక విధాలుగా నిందిస్తూ, తమతప్పు తమతమ మత్తులో తెలియక, అతణ్ణి ఇవతలకి ఈడ్చారు. గోళ్లతో ఆక్కి, కోరంలో కొఱికి, అఱచేతులతో చఱిచి, కాళ్లతో తన్ని, మధువనంలో 'తేనె' గానీ, తినడానికి ఏ పదార్థమూ కాని లేకుండా పాడు చేసేసారు.

(మారుతి, తన విజయాన్ని వివరించి చెప్పడంతో, అది విన్న వానరులందఱికీ తమకుతామే హనుమంతులమన్న భావన కల్గింది. మధువనమే అశోకవన మన్పించింది. దధిముఖుడే రాక్షసు డనిపించింది. ఫలితం ఇది.

**యోగ్యుడైనవాడు కార్యాన్ని నిర్వహించడానికీ, అయోగ్యులు వాణ్ణి అనుసరించాలని తపనపడుతూండడానికీ ఉన్న వ్యత్యాసమే హనుమకీ-వానరులకీ, అశోకవన మధువన ధ్వంసాలకీ మధ్య కన్పిస్తుంది).**

రామభావ భావనతో హనుమ సత్కార్యాన్ని చేస్తే, సరికాని హనుమ భావభావనతో వానరాలు వనాన్ని ధ్వంసం చేసాయి.

లోకంలో అక్కడక్కడ, కొందఱి ప్రవర్తన సరిగా ఇలాగే పిచ్చి మాటలూ, తోపులాటలూ వెఱ్ఱి నవ్వులతో ఉంటుంది. వాళ్లూ ఈకోవకి చెందినవారే.

'ఇల్లంతా మధువనమై పోయింది. కిష్కింధా పురాగ్రహారికులు (కోతులు) పిల్లలు' అంటూ విన్నప్పుడు పెద్దలు మందలించేవారు. ఆ మందలింపు మాటల్లో కూడా ఇతిహాసపు ఛాయ తొంగిచూడడం, నరనరాల్లోనూ జీర్ణించిన వారి పాండిత్యానికి నిదర్శనం. ఆ మాటలని బ్రతుకనిద్దాం).

❊ ❊ ❊

# 62వ సర్గము

## రాముని బంటుకే ముందుగా సుగ్రీవుని బంటు

ఈ వన ధ్వంసాన్ని చూస్తూ హనుమ 'వానరులారా! భయంలేదు. కావలసినంత త్రాగండి. నేనున్నాను ఎవరైనా వస్తే' అంటూ వారిని ప్రోత్సాహపరిచాడు.

అసలే కోతులు. అందునా తాగారు. ఇక చెప్పాలా? అంతలో అంగదుడు 'పని సాధించుకొని హనుమ వచ్చిన శుభ సందర్భంలో తాగి తీరాల్సిందే. హనుమ చెప్పినట్లు (చేయదగని) అకార్యం చేసినా చేయవచ్చును' అన్నాడు.

అంతే! అంగదుణ్ణి మెచ్చుకొని, కాపలావాళ్లమీద పడ్డారు. పట్టుకొని కొట్టి కట్టేసారు. కుండల కుండల తేనెని త్రాగడం మొదలెట్టారు. తేనె తుట్టెలతో కాసేపు కొట్టుకున్నారు.

తాగితాగి మత్తుతో చెట్లకొమ్మలు పట్టుకొని కూర్చున్నారు. కొందరు చెట్ల ఆకులు వేసుకుని కూచున్నారు.

కొందరు సింహగర్జననీ, కొందరు పక్షికూతలనీ, కొందరు అరుపులనీ చేసారు. కొందరు కోతులు చేసే అన్ని చేష్టలూ చేయసాగారు.

దానితో వనాన్ని రక్షించే సేవకులు దధిముఖునితో 'హనుమ చెప్పగా, వానరులంతా వనం నాశనం చేసారు. మమ్మల్ని లెక్కచేయకుండా వనం పాడుచేస్తున్నారు' అనగానే దధిముఖుడికి కోపం వచ్చి 'రండి-మనమంతా కలిసి పోరాడుదాం' అన్నాడు.

దధిముఖుడు చెట్టునీ, అతని సేవకులు రాళ్లనీ తీసికొని వానరుల మీదికి వెళ్లారు. అంతే! చెట్టుని తెస్తున్న దధిముఖుణ్ణి అంగదుడు రెండు చేతులతో బాదాడు.

తండ్రికి సాక్షాత్తూ మేనమామ అనే ఆలోచనని, 'తాగుడు' ఏనాడో హరించింది. అంతేకాక, నేలమీద అతణ్ణి పడేసి, కాలితో, మోకాలితో కుమ్మి తన్నాడు.

చేతులూ, తొడలూ దెబ్బతినగా రక్తంకారుతూ సేవకులైన వారిని పిలిచి, అంగదుడు కూడా ఇలా చేస్తున్నాడు. సుగ్రీవునితోనే చెప్తాను. తండ్రి తాతలనుండి వచ్చే యీ వనాన్ని ఇలా పాడుచేసినందుకు, ఈ వానరులందరికీ సుగ్రీవుడు భయంకర శిక్ష విధిస్తాడు- అన్నాడు.

అంటూనే ఆకాశమార్గంలోనికి పోయి, తన సేవకులతో దీనముఖంతో సుగ్రీవుని వద్ద దిగి, పాదాభివందనం చేసి నిలబడ్డాడు.

(సుగ్రీవశ్చోగ్రదర్శనః- సుగ్రీవుడు గట్టిదండన విధించే లక్షణం కలవాడనీ, అందుకని ఆ భయంకర రూపాన్ని చూడడం కంటె చావడం మేలనీ, ఒకప్పుడు వానరులనుకొన్నారు.

ఆ గడువు మఱింత దాటిపోయినా జరగాల్సిన పని అయింది. అయినా, కోపంతో సుగ్రీవుడూ, రోషంతో లక్ష్మణుడూ, నడుమ అంతర్మథన పడుతూ రాముడూ ఉంటారని, హనుమకి తెలుసు.

మనందరం సుగ్రీవుని వద్దకు వెడదామని తీసికెడితే, ఏదైనా పొరపాటున 'ఎందుకింత ఆలస్యం చేసారు?' అని అడిగితే, అంతా హనుమని 'దోషి' గా చూపిస్తారు.

దానివలన మారుతికి తక్కువదనమేమీ ఉండదు- రాముడు- ఇలాటి ప్రశ్నను హర్షించడూ కూడ.

అయినా, పావని అంతటివాడు కూడ, సుగ్రీవునితో మాటపడ్డాడని పించుకుంటాడు. అందుకని కోపం తగ్గి, మనస్సు ప్రశాంత పడేందుకై ముందుగా దధిముఖుణ్ణి పంపితే, 'సీతజాడ తెలిసిందని' గుర్తించిన సుగ్రీవుడూ, రామలక్ష్మణులూ ప్రసన్నులౌతారనీ, వానరులకి భయం ఉండదనీ, తమకి అవమాన భారం కూడా ఉండబోదనీ గ్రహించి, హనుమ-జాంబవంతులు, మధువన ధ్వంసానికి ప్రోత్సహించారు.

ఈ, లోభావం తెలియని వానరులు, తామే హనుమంతుల మనుకొని, మధువనమే అశోక వనమనీ భావించి పాడుచేసారు.

దీన్నేగా 'కపిబుద్ధి' అంటారు.

సందర్భ అసందర్భాలూ, సమయ-అసమయాలూ, ఔచిత్య-అనౌచిత్యాలూ లేకుండా ప్రవర్తిస్తే, అది కోతి లక్షణమే ఔతుంది మఱి.

**కోతులకీ కోతిరూపంలోనే ఉన్న ఆంజనేయునికీ ఉన్న భేదాన్ని ఇక్కడ గమనించవచ్చు. కాబట్టి ఆంజనేయుడు కోతి కాదు(డు)).**

* * *

# 63వ సర్గము

## ప్రీతోఽస్మి సోఽహమ్

'జరిగినదంతా చెప్పు' అనగానే దధిముఖుడు లేచి 'రాజా! మీ నాన్న ఋక్షరజాడు గాని, అన్న 'వాలి' గాని ఏనాడూ ఎవ్వరినీ ఈ వనంలోకి రానీకుండా రక్షించారు. కాని, వానరులు ఎంత అడ్డగించినా వినకుండా, ఇష్టం వచ్చినట్లు, తేనెని త్రాగడం- పూలని తుంపడం- కాయల్ని తినడం- చెట్లని విఱవడం- ఒకటేమిటి? మమ్మల్ని అనేక విధాలుగా బాధించడమూ చేసి, మొత్తం వనాన్ని ధ్వంసం చేసారు. మమ్మల్ని భయపెట్టి అవమానించారు' అన్నాడు.

వానర భాషలో చెప్తున్న దధిముఖుని మాటలు విని, ఏడుస్తూ చెప్తున్న కారణంగా, సీత కేదో అనర్థం కల్గిందని లక్ష్మణుడు భయపడ్డాడు. కాని, బుద్ధిమంతుడైన సుగ్రీవుడు 'లక్ష్మణా! సీతమ్మ వానరులకి కన్పించి ఉంటుంది. హనుమ మాత్రమే ఈ అసాధ్యకార్యాన్ని చేయగలడు. బుద్ధి-పట్టుదల-పరాక్రమము మొదలైన అన్నీ, పరేంగితజ్ఞతతో (ఇతరుల మనోభిప్రాయన్ని గ్రహించడం) పాటు వానికే ఉన్నాయి. సీతని చూసి ఉండకపోతే ఆ ఉత్సాహం వారికి రాదు'. (**నైషా మకృతకృత్యానా మీ** దృశస్స్యాదుపక్రమః- 15) అన్నాడు.

చెవులకింపైన ఆమాటల్ని రామలక్ష్మణులు విని ఆనందపడ్డారు. సుగ్రీవుడు దధిముఖుణ్ణి చూచి

'ప్రీతోఽస్మి సోఽహం యద్భుక్తం వనం తైః కృతకర్మభిః ।

మర్షితం మర్షణీయం చ చేష్టితం **కృతకర్మణామ్॥ (27)'** దధిముఖా! పని నెఱవేర్చుకొని వచ్చిన వీళ్లు, వనాన్ని ధ్వంసం చేసారు కాబట్టి వారిని క్షమించు. చేతికి కార్యసిద్ధి అందినట్లుంది. సీతని చూడ్డానికి వాళ్లు చేసిన ప్రయత్నాన్ని వినగోరుతున్నాను. వెంటనే వాళ్లని ఇక్కడికి పంపించు. రామలక్ష్మణ సమేతంగా నేను వినాలి' అన్నాడు.

రామునికి లక్ష్మణునికి కన్నులు సంతోషంతో విప్పారాయి. అది చూచిన సుగ్రీవుని ఒళ్లు గగుర్పొడిచింది. **తప్పు తమది** కాదని, సుగ్రీవుడు గమనించాడని గ్రహించిన దధిముఖునికి, సంతోషమైంది. వానర సమూహంతో, ఆకాశమార్గంలో, తన మధువన ప్రదేశానికి దధిముఖుడు తిరుగు ప్రయాణమైనాడు. 'రమ్మను' అనే ఇలాటి కబురుకోసమే హనుమ జాంబవంతులు ఎదురుచూచింది).

❀ ❀ ❀

# 64వ సర్గము

## వినయమం కలదీ–పతివ్రతా, సీతమ్మ

దధిముఖుడు వెళ్లాక సుగ్రీవుడు రాముణ్ణి ఓదారుస్తూ 'స్వామీ! సీతని చూడకపోతే, గడువుదాటిన పిమ్మట నన్ను చూచే ధైర్యం వారికి లేనేలేదు– ఉండదు.

పని సాధించి ఉండకపోతే, అంగదుడు అసలురాడు– వనాన్ని పాడుచేయనిచ్చి ఉండడు. ఆనందంతో, కావాలని వనాన్ని పాడు చేసినా, సీత జాడ తెలిసిందని నాకెంతో ఆనందంగా ఉంది.

కౌసల్య, అదృష్టవంతుణ్ణి కన్నది. అసాధ్యుడైన హనుమ సీతమ్మజాడ తెలిసి ఉంటాడు. ఇది మఱియెవ్వరూ సాధించ వీలులేనిది.

జాంబవంతుణ్ణే మంత్రిగా, అంగదుణ్ణి సేనా నాయకునిగా, హనుమంతుణ్ణి కార్యనిర్వాహకునిగా చేసుకుంటే ఎంతటి పనైనా అయినట్లే.. చింతించకు అన్నాడు.

అక్కడ మధువనానికి వెళ్లిన దధిముఖుడు, అంగదుణ్ణి చూచి 'యువరాజా! కావలావాళ్లు ఏదో తెలియక చేసినారని క్షమించు. యువరాజైన నువ్వే, దీనికి ప్రభువని వాళ్లకి తెలియదు. సుగ్రీవునికి ఈ విషయం చెప్తే, ఆయన కోపించకపోగా–సంతోషించి, 'అందఱినీ తన దగ్గఱకు పంపించమని చిరునవ్వుతో ఆజ్ఞ చేసాడు' అన్నాడు.

దధిముఖుని మాటలు విని అంగదుడు, 'శత్రు నాశకులారా! మనం పని సాధించినవాళ్లం. ఇక్కడ ఉండద్దు. యథేచ్ఛగా తేనె తాగి అలసట పోగొట్టుకున్నారు గదా! నేను స్వతంత్రుణ్ణి కాను.

యువరాజునే అయినా, మిమ్మల్ని, కార్యసాధకుడైన పావనినీ ఆజ్ఞాపించడం సరైనదికాదు!– అనగానే కోతులు ఆనందించగా, హనుమ, 'ఇప్పుడు మా యువరాజువు కావు. రాజువే కాబట్టి ఇలా చెప్పగలిగావు. మఱొకడైతే ఐశ్వర్యమదంతో మఱోలా ఆజ్ఞ చేసేవాడు. ఇలా చెప్పడం నీకే తగును. ఇలాటి వినయం, రాజులో కన్పించదు. నీకు శుభం జరగాలి. మనం వెంటనే వెడదాం. నీ ఆజ్ఞ శిరోధార్యం' అని అందఱూ కలిసి ఆకాశానికి ఎగిరారు.

అక్కడ రాముణ్ణి, సుగ్రీవుడు ఓదారుస్తూండగానే వానర గర్జనలు విన్పించాయి.

సుగ్రీవుడు ఆనందంతో తోకని పెద్దది చేసాడు.

ఆకాశంలో వానరులు ఎగిరివస్తూ కన్పించారు.

కొన్ని కోట్లసైన్యం అలా వస్తూంటే అదో చిత్రంగా, వర్ణించలేని రీతిగా ఉంది.

హనుమా, అంగదుడూ వానర సైన్యాన్ని వెంటబెట్టుకొని రాగా, హనుమ, రామునికి తలవంచి నమస్కరించాడు.

'నియతా మక్షతాం దేవీం రాఘవాయ న్యవేదయత్' (38). 'రామచంద్రా! సీతాదేవి తన నియమం తప్పక మహాపతివ్రతా మూర్తియై జీవించి ఉంది'- అని చెప్పగానే హనుమని ఇష్టంతో అధిక గౌరవంతో రాముడు చూచాడు.

**లక్ష్మణ సుగ్రీవుల ఆనందం శరీరంలో పట్టలేదు.**

(రామ భావభావన ఉన్నవాడు హనుమ. సఖులైన కోతులతో మాత్రం తాను కన్పించిన మఱుక్షణంలోనే 'దృష్టా, సీతా' అన్నాడు. (సీత కన్పించింది)

రాముని వద్ద 'నియతామక్షతామ్' అన్నాడు. (పాతివ్రత్య నియమం కలిగి జీవించి ఉంది).

ఇలా అనడంలో కారణం ఉంది. వానరులకి, సీత జాడ మాత్రమే ముఖ్యం. వారికి సరిపోయే సమాధానం అది.

సీత పాతివ్రత్యమే రావణుణ్ణి వధిస్తుంది కాబట్టి, రామునికి సీతా పాతివ్రత్యం ముఖ్యం. అలాగని పతివ్రతయై ఉండి కూడా జీవించి ఉండకపోతే ప్రయోజనం లేదు. కాబట్టి, ఆమె ప్రాణాలతో ఉండడమూ,

పతివ్రతయై జీవించి ఉండడమూ అనే ఈ రెండూ ముఖ్యం రామునికి. ఎవరికి ఏ సమాధానం చెప్పాలో, ఏ స్థాయిలో ఆలోచించాలో తెలిసిన కార్యసాధకుడైన హనుమ లోకంలో సహాయపరులు కాదలచిన అందఱికీ ఆదర్శప్రాయుడు.

❀ ❀ ❀

# 65వ సర్గము

## జరిగింది ఇది! – జరుగబోయేది నువ్వే చెప్పు!!

వానరులంతా అంగద సమక్షంలో రామలక్ష్మణులకూ, సుగ్రీవునికీ నమస్కారం చేసారు. వానరు లందరినీ చూచి, సీతా విశేషాలడగ్గానే, హనుమ, సీత ఉన్న దక్షిణదిక్కుకి తిరిగి నమస్కారం చేసి, '100 యోజనాల దక్షిణ సముద్రం దాటి రావణలంకలో పరమ పతివ్రతనీ, సౌందర్యవతినీ, నీ మీదే మనస్సుంచిన ఆమెనీ చూచాను.

ప్రమదావనం అనే పేరున్న అశోకవనంలో, రాక్షస స్త్రీల మధ్య బెదిరింపబడుతూ ఉంది ఆమె. కటిక నేల మీద నిద్రిస్తూ, శోకానికి గుర్తుగా ఒకే జడ ధరించి ఉంది.

రావణుని మీదికి మనసు పోనీయక, చనిపోవడానికి నిశ్చయించుకొని ఉందని చెప్పి, కాకాసుర వృత్తాంతాన్నీ, మణిశిలా వృత్తాంతాన్నీ కూడా విన్నవించి, నెల గడువును కూడ చెప్పిందని' చెప్పాడు.

ఆమె యిచ్చిన చూడామణిని రామునికి ఇస్తూ, 'జరిగింది జరిగినట్లుగా చెప్పాను. ఇక సముద్రం దాటే ప్రయత్నం చెయ్యాలి' అన్నాడు హనుమ.

(వానరులతో ఇదే విషయాన్ని హనుమ చెప్తూ, తాను సాధించిన విజయాలని చెప్పి, కాకాసుర, మణిశిలా వృత్తాంతాలని చెప్పలేదు. ఇక్కడ తన విజయాలని విడిచి, ఆ రెండు వృత్తాంతాలూ చెప్పాడు.

తన విజయాలని చెప్పడం, అహంకారానికి గుర్తు అవుతుందని మానేసాడు.

వానరులకి ఇవి అముఖ్యం.

కాకాసుర మణిశిలల విషయం రామునికి ముఖ్యం.

ఈ రెండూ హనుమకి ముఖ్యం.

కాబట్టి రెంటినీ ఎఱుగున్నాడు హనుమ. అందుకని వాటిని ఇక్కడే చెప్పాడు).

❀ ❀ ❀

# 66వ సర్గము

## వివరించి చెప్పవూ!

సలక్ష్మణుడైన రాముడు, హనుమ చెప్పిందంతా విన్నాడు. చూడామణిని గుండెలపై పెట్టుకొని దుఃఖించాడు.

'ఈ మణి మా మామగారు సీతమ్మకిస్తే, దీన్ని ఆమె వివాహ సమయంలో మొదటగా ధరించింది.

సుగ్రీవా! ఈ చూడామణి మా మామగారైన జనకునికి దేవేంద్రుడిచ్చినది. దీనిలోని మణులు సముద్ర గర్భంలో పుట్టినవి. ఇది నా సీత శిరస్సుపై ఎప్పుడూ ఉండేది.

దీన్ని చూస్తూంటే, సీతమ్మని చూస్తున్నట్టుంది. సీతమ్మ, ఒక నెల అయినా జీవించి ఉండగలుగుతోదంటే, చాల కాలం జీవిస్తున్నట్లే. నేనామెను చూడకక్షణమైనా ఉండలేను. (మనస్సులో నిత్యం దర్శిస్తున్నాడు. దర్శిస్తున్నదే ఆమెను కదా!)

రాక్షసుల మధ్య ఆమె ఎలా ఉందో!

దాహం వేస్తున్న వానికి, మఱింత మఱింతగా నీళ్లు ఇచ్చి తృప్తిచేసినట్లు, నాకు ఆమెని గూర్చి మఱికొంత చెప్పవూ!

ఔషధం లభిస్తేనే, సేవిస్తేనే, రోగికి ఉపశాంతి కల్గుతుంది.

ఆమెని గూర్చి, ఆమె నాకు చెప్పిందాన్ని గూర్చి, వివరంగా చెప్పవూ!' అని ప్రార్థించాడు రాముడు.

❀ ❀ ❀

# 67వ సర్గము

## ....... అని సీతమ్మ ఆశీర్వదించింది

హనుమ రామునితో చెప్పా, 'సీతమ్మ నీ ఒడిలో పరుండి, లేవగా, కాకి ఒకటి ఎగిరివచ్చి ఆమె స్తన మధ్యంలో గాయం చేసిందట.

మరలా కొంతసేపటికి అలాగే చేస్తే, ఆ రక్తస్పర్శకి నీకు తెలివి వచ్చి, సీత నడిగి, విషయాన్ని గ్రహించి, కాకిని చూచి, దర్భనే బ్రహ్మాస్త్రంగా మంత్రించి ప్రయోగించావట.

ముల్లోకాలూ తిరిగి వ్యర్థమై, రక్షణలేని కాకి, మిమ్మే శరణువేడితే, వ్యర్థంకారాదని దాని కుడి కంటిని పొడిచి విడిస్తే, ఆ కాకి, మీకూ, దశరథునికీ నమస్కారాలు చెప్పి దేవలోకం వెళ్లిందట కదా!

కాకి మీదనే బ్రహ్మాస్త్రం ప్రయోగించిన స్వామీ, మహా పరాక్రమ వంతుడూ, ఎందుకు ఉపేక్షిస్తున్నాడు?

లక్ష్మణుడు కూడా ఎందుకు రక్షింపరావడం లేదు? నేనేదో మహాపాపాన్ని చేసి ఉంటానని పల్కి ఆమె దీనదీనంగా దుఃఖించింది.

దాని కామెని ఓదారుస్తూ, 'నీవు పడే దుఃఖాన్నీ, లక్ష్మణ శోకాన్నీ వివరించి త్వరలోనే లంకని భస్మం చేయడానికి రాబోతున్నారని ధైర్యం చెప్పి, నమ్మించి', నేనడిగినమీదట ఆమె యిచ్చిన చూడామణిని, గుర్తుగా తెచ్చి నీకిచ్చాను.

వెళ్తూన్న నన్ను చూచి, సీతమ్మ ఎక్కువ సేపులో తక్కువ మాటలని, కన్నీటితో, డగ్గుత్తికతో పల్కుతూ 'హనుమా! రామ లక్ష్మణులనీ సుగ్రీవుణ్ణి మంత్రులనీ అడిగానని చెప్పు. ఎలాగైనా నన్ను దాటించే ఉపాయం ఆలోచించమని రామునికి చెప్పు. రాక్షస స్త్రీల బెదరింపులు కూడ చెప్పు.

నీ ప్రయాణమూ-మార్గమూ సుఖవంతమూ, ఫలవంతమూ అగుగాక!' (శివశ్చ తేఽధ్వా చ కపిప్రవీర!) అని దీవించింది-అన్నాడు.

❀ ❀ ❀

# 68వ సర్గము

## అమ్మా! త్వరలో పట్టాభిషేకం జరుగుతుంది!!

హనుమ ఇంకా ఇలా చెప్పసాగాడు. 'సీతమ్మ ఇంకా ఇలా అన్నది-హనుమా! రాముడు, రావణుని ఎంత శీఘ్రంగా చంపి, నన్ను తీసికొని పోతాడో, ఆ విధం ఆలోచించమన్నదని నువ్వు, అనేక పర్యాయాలు నా మాటగా రామునికి చెప్పు. రహస్య స్థలంలో ఒక రోజుండి వెళ్లినట్లయితే, ఈ దురదృష్టవంతురాలి శోకం, కొద్ది తగ్గుతుంది. మీరు తిరిగివచ్చే వఱకూ నా ప్రాణాలు ఉంటాయా? నువ్వు సముద్రాన్ని దాటివచ్చినా, అందఱికీ ఆ శక్తిలేదు కాబట్టి ఎలా రాగల్గుతారు? వాయువూ, గరుడుడూ, నువ్వూ మాత్రమే దాటగల సముద్రాన్ని, రామలక్ష్మణులైనా ఎలా దాటగలరు? నన్ను రాముడే వచ్చి రావణవధ చేసి తీసికొనిపోవాలని చెప్పు. ఆ కార్యానికి తగిన ప్రయత్నం నువ్వు చెయ్యాలి' అన్నది.

'ప్రభూ! ఆ మాటలకి నేనిలా చెప్పాను.' తల్లీ! వానరాలకీ, భల్లూకాలకీ అధిపతి అయిన సుగ్రీవుడు, ఆకాశంలో ఎగిరేవాళ్లలో శ్రేష్ఠుడు. మహాబలిష్ఠ. ఈ పని చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నవాడున్నూ. తన సైన్యమంతా అతని చెప్పుచేతలలో ఉంది. అందఱికీ మనోవేగం ఉంది. ఆకాశ-పాతాళ మార్గాల్లో ఏ దిక్కుకైనా ప్రయాణించగల శక్తి ఉంది. వానర వీరులు సామాన్యులు కాదు. అనేక పర్యాయాలు భూమినంతా చుట్టివచ్చిన మహావీరులు.

ఆ సుగ్రీవుని వద్ద ఉన్న వారిలో, కొందఱు నాతో సమానులు-కొందరధికులు. అయితే ఏ ఒక్కరూ నా కంటె తక్కువవారు కారు. (మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ తత్ర సన్తి వనౌకసః) రాజులు, దూతలుగా తక్కువవారినే పంపుతారు గాని, ఎక్కువవారిని పంపరు. అందుకే, ఓదేవీ! దుఃఖపడకు. ఈ సముద్రం దాటడమంటే, ఆ వానరులకి ఒక్క గంతువేయడం లాంటిది. ఇక రామలక్ష్మణులెలాగ అంటావా? నా వీపు, వారిని మోయడానికే ఉంది. లంకా సింహ ద్వారం వద్ద కోదండాన్ని ధరించిన రాముణ్ణీ, వాయువులాంటి అన్నకి, తోడైన అగ్నివంటి లక్ష్మణుణ్ణీ, వారివెంట ఎలుగు, వానరసైన్యాలనీ, చూస్తావు త్వరలోనే.

కన్నులతో చూస్తూండగానే సింహనాదాలని వింటావు. అవి ఈ పర్వత ప్రాంతాలలో ప్రతిధ్వనించడాన్ని కంటావు. లంకా వధ జరగడం తథ్యం.

'నివృత్త వనవాసం చ త్వయా సార్థ మరిందమమ్ ।
అభిషిక్త మయోధ్యాయాం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్ (28).
తతోమయా వాగ్భిరదీన భాషిణా శివాభిరిష్టాభి రభిప్రసాదితా।
జగామ శాంతిం మమ మైథిలాత్మజా।
తవాపి శోకేన తదాఽభిపీడితా। (29)

'అమ్మా! రావణునితో సహా శత్రువుల నందఱినీ జయించి, వనవాస నియమాన్ని పూర్తిచేసి, రాముడు అతిశీఘ్రంగా అయోధ్యలో నీతో పట్టాభిషిక్తుడౌతాడు. ఆ శుభఘడియని తొందరలోనే కాంచగలవు' అని శుభప్రదమైన మాటలని, మనః పూర్ణంగా మాట్లాడి, ఓదార్చగా, సీత ప్రశాంతురాలై ఆనందాన్ని పొందింది. రామచంద్రా! **ఆమె కోసం నువ్వు శోకిస్తున్నావనే శోకం తప్ప, వేఱే ఆమెను పీడించే మఱో శోకం లేదు!** అని చెప్పి హనుమ ముగించాడు.

## విశేషాంశాలు

(1) దక్షిణ దిక్కుకి హనుమ నమస్కరించడం, సంప్రదాయం కాదు. కాని, అమ్మవారుండడం చేత పవిత్రమైనదనే భావంతో నమస్కారం. తనని, సరిగా మాటాడిస్తూ, తనయందు రామునికి పూర్వమున్న భావం మఱింతగా పెరిగేలా చేయమని, అమ్మవారి అనుగ్రహాన్ని మనసులో ప్రార్థిస్తూ కూడ నమస్కారం.

(2) రావణునితో మాట్లాడినపుడు తనకూ వానికీ మధ్యగా సీతమ్మ వేసిన గడ్డిపోచ, ఆంజనేయునితో మాట్లాడేటప్పుడు వేయలేదు. కారణం, రామ ప్రతినిధిగా వచ్చిన ఆంజనేయుడు తనకి అభీష్టుడే కాని శత్రువు కాదు– అని. బుద్ధిమంతుడై ఆంజనేయుడు ఈవిషయాన్ని రావణ సంభాషణ కాలంలో గడ్డిపోచ వేయడం చూచాడు కదా! తనతో మాటాడేటప్పుడు తృణాన్ని వేయకపోవడాన్ని చూచి, సీతాభిప్రాయాన్ని గమనించి, మఱింత చొరవతో, ఉత్సాహంతో అమ్మవారి అనుగ్రహాన్ని పొందాడు.

(3) రాముడు, చూడామణిని స్వీకరించి హనుమతో మాటాడుతూ 'నన్ను ఆమె వద్దకు తీసికొనిపో (66వ సర్గము)' అంటాడు. శివుడూ శక్తీ కలిస్తే, వ్యక్తి ఔతాడు. తాను శివుడు. ఆమె శక్తి. ఎవ్వరైనా శక్తినే 'తెచ్చుకోవాలి' కదా! ఆమె రాదు. తేబడవలసిందే.

(4) కౌసల్యా పుత్రుడివి నీవు– అని సుగ్రీవుడు రామునితో అన్నాడు (64వ సర్గము). సీతా వియోగంతో రాముడు ఆత్మత్యాగం చేసినా, లేక సీతనే అసలు

ఎక్కడుందో గుర్తించలేక పోయినా, ఆ అపకీర్తి ఆ తల్లికి వచ్చి ఉండేది. 'ఈ తల్లి కొడుకు కదా రాముడు'-అని. (భరతుడు-కైక కొడుకు అన్నట్లుగా) అందుచేత, నిజమైన పుత్రోత్సాహం కల్గించిన వాడివి నువ్వని రామునితో పల్కడం, ఇక్కడి విశేషం.

(5) ఆంజనేయుడు సుందరకాండ మొత్తంమీద సాధించింది. అమ్మవారికి సంతోషం కల్గించడం. అదే వ్యక్తికి కావల్సినది. 'సంతోషమె సగము బలం' అనే నానుడి ఇక్కడ పుట్టిందే. రాముడొస్తాడనే ఆశ చిగిర్చింది.

**కాబట్టి సంతోషంతో ఉండి, ఆశలో ఉండాలనీ, దుఃఖంలో ఉండి నిరాశావాక్యాలని పల్కా కూడదనీ తెలుసుకోవాలి. చదివేవీ చూచేవీకూడా దుఃఖమయాలూ- నిరాశని పుట్టించేవిగా ఉంటే, మనకి మిగిలేది 'అసంతృప్తి' మాత్రమే. 'మాకశ్చిత్ దుఃఖభాగ్భవేత్' ఏ ఒక్కరూ దుఃఖంలో ఉండరాదనేది, ప్రాచీనుల ఆశీస్సు.**

(6) ఏ క్షణాన్నీ హనుమ, లంకలో వ్యర్థం చేయలేదు. బండిమీద తనని కట్టిపడేసి తీసికెడుతూంటే (48వ సర్గము) లంకని చూడసాగాడు హనుమ. ఎవరియింటి ప్రక్కన ఎవరి యిల్లు ఎంతెంత ఎత్తులో, ఎంతెంత చెక్కడపు పనిలో ఉన్నదీ గమనించాడు. తర్వాత తగులబెట్టడంలో, ఇదే ఉపయోగపడింది. ఆకారణంగానే విభీషణుని యిల్లు విడువ గలిగాడు.

(7) రావణునికి మరణశిక్షే విధించాలి- అనే దేవతల కోరికకి అనుగుణంగానే, శ్రీమహా విష్ణువు రాముడై పుట్టాడని (సహి దేవైః . . . . **జజ్ఞే విష్ణుస్సనాతనః** - అయోధ్యాకాండ 1/7) అయోధ్యకాండలో చెప్పబడింది - **కౌసల్యా శుశుభే తేన పుత్రేణామిత తేజసా**- అలాటి పుత్రుణ్ణి కని, దేవతల తల్లి అదితి, ఇంద్రుణ్ణి కన్నప్పటి ఆనందంతో ప్రకాశించిందని వాల్మీకి మహర్షి అన్నాడు.

అందుకని కర్త రాముడు. కర్మ సీతాపహరణం. క్రియ రావణవధ. మొత్తం వాక్యం 'రాముడు రావణుణ్ణి సీతాపహరణం చేసినందుకు వధించాడు' అనేది. వధ, ఎలా ఎవనిచే చేయబడాలని నిర్ణయమో, అలానే వధకి కాలం కూడా దైవనిర్ణయమే. దాని ప్రకారమే, కైకద్వారా 14 ఏండ్లుగా, దేవతలు కాలనిర్ణయంచేసారు. అదే కాలాన్ని, రావణుడూ సీతకి గడువుగా పెట్టాడు. ఈ ఇతిహాసం ఆలోచించిన కొద్దీ అమృతాయమానంగా ఉంటుంది.

సుందరకాండ ప్రథమశ్లోకం ప్రథమాక్షరం 'త' అనేది. చివరి శ్లోకం చివరి అక్షరం 'త' అనేది (తత్). అందరికీ ఆనందాన్ని కల్గించేదీ, ఆర్తిని పోగొట్టేదీ, ఎప్పుడూ సంతోషరూపంతో ఉండేదీ అయిన అమ్మవారు అందరికీ దుఃఖంకలిగేలా, తాను ఆర్తిలో ఉంది.

**నిస్సంతోషిణి ఐనప్పుడు, అమ్మవారంతటి ఆమెకు, ధైర్యాన్నీ సంతోషాన్నీ, ఆశనీ హనుమ కల్పించడం, అతి సుందరం కదా! అందుకనే, సుందరకాండని పారాయణం చేస్తే ఆ రామానుగ్రహాన్నీ, సీతాశీస్సులనీ పొందిన హనుమ యొక్క శక్తి, మనలో ప్రవేశించి, మనకి ధైర్యమూ, సంతోషమూ, క్రొత్తదైన ఆశా, మనస్సులో కల్గుతాయనేది నిస్సంశయమైన విషయం. అనుభవంలో ఉన్న సత్యం. శుభం భూయాత్. పరమేశ్వర ప్రసాదోఽస్తు.**

## (1) కాండ మొత్తమీద మరో విశేషం

ప్రతి వ్యక్తికీ గురువూ-దైవం-అని ఇద్దఱుంటారు. కనిపించనివాడే దేవుడు-అయినా నిత్యజీవితంలో జరిగే సంఘటనలూ- అనుభవాలూ ద్వారా ఆయన కన్పిస్తూంటాడు.

ఆయన కన్పించని దేవుడైతే, ప్రత్యక్షంగా కన్పించే దైవం గురువు. (దేవే రుష్టే గురుస్త్రాతా గురౌ రుష్టేన కశ్చన) దేవుడు శపించినా, గురువు రక్షించగలడట గాని గురువు శపిస్తే రక్షించగలవారు మఱెక్కడా ఉండరట. సూర్యపుత్రుడై కూడా, గురుశాపం పొందిన కర్ణుడు సాక్ష్యం మనకి. చివరికి దుష్టచతుష్టయంలో ఒకడనిపించుకున్నాడు. అలాంటి గురు శిష్య సంబంధం గోచరిస్తుంది ఈ కాండలో.

శరీరమనేది ఒకే క్షేత్రం. పొలాన్ని దున్ని, దాంట్లో ఏ విత్తనం వేస్తే, ఆ చెట్టే వచ్చినట్లు, కామ-క్రోధ-లోభ-మోహ-మద-మాత్సర్య (అసూయ) అనే వాటిలో ఏ విత్తనాలని వేస్తే, ఆ చెట్లే బాగా ఏపుగా పెరుగుతాయి. ఇంటి గోడమీద పెరిగే రావిచెట్టు-గోడనీ, ఇంటినీ కూడా ఎలా ధ్వంసం చేస్తుందో, అలాగే, ఈ విత్తనాలలో ఏ ఒకటి పడ్డావాలు- శరీరం (అసలే శరీరం-శీర్యత యితి శరీరమ్- నశించేది) మొత్తాన్నీ- ఈ శరీరంతో చేరి మైత్రితో ఉండే అందఱినీ - సహకరించినవారినీ - కూడా ధ్వంసం చేస్తుంది.

అలాటి శరీరమనే క్షేత్రంలో, బుద్ధి అనే నాగలితో ఏర్పడిన నాగటిచాలులో జన్మించిన 'ఆత్మ' సీత. ఈ 'ఆత్మ' అనేది భగవంతుని సొత్తు అయితే, (జీవ+ఆత్మ-పరమ+ఆత్మ-రెండూ ఆత్మలే) దాన్ని 'నేను-నాది-నావాళ్లు' అనే అహం-కార-భావన ఉన్న మనస్సు- రావణుడు ఎత్తుకుపోయాడు.

ఆ ఆత్మని, వాని శరీరం (లంక)లో బంధించాడు. ఆమెని వెదకి తేవడానికై చారణ మార్గంలో (చరణమంటే వేదశాఖ. వేదం చెప్పిన మార్గంలో, అంటే పూర్వులైన

మహర్షులు నడిచిన బాటలో- పెద్దలు అనుసరించిన విధానంలోనే) వెళ్లి గురువు లేదా ఆచార్యుడైన హనుమ, ఆ ఆత్మ స్వరూపాన్ని వెదకడానికి పోవడం సుందరకాండ ప్రారంభం.

సంసారమనే సముద్రాన్ని దాటడం (సముద్రంలో ఎన్ని అలలు నిరంతరం వస్తూంటాయో, అలా సంసారంలోనూ అన్ని బాధలు. ఎన్ని జంతువులుంటాయో- అన్ని అడ్డంకులు, ఓ మంచి పని చేయాలనగానే, ఎదురౌతాయి). అయినా దాటడం అనే మొదటి గొప్పపని హనుమ చేసింది.

రామునికోసం, సుగ్రీవాజ్ఞ నెరవేర్చడం కోసం వెళ్లాడు. ఆచార్యుడు కూడా లోకక్షేమానికి, లేదా భగవత్ప్రీతికి చేయాలి ఏపనైనా. (తనకోసం కాకుండా)-4 దిక్కులకి నమస్కరించడం నాల్గు దిక్కుల యందూ ఉన్న యోగ్యులయిన ఆచార్యులయిన మహర్షుల తపస్సూ, అనుగ్రహ శక్తి, తనయందు ప్రవర్తించడానికి. ఆత్మప్రదక్షిణ నమస్కారం అంటే ఇదే. 4 దిక్కులవారి ముందు 'నేను తప్పు చేసాను' అని ఒప్పుకోవడం కూడా దీనిలోని భావం. దిక్కులకి నమస్కరించడంలో, నా జీవనకాలాన్ని పెంపొందించండి' అని ప్రార్థన చేసే అంతటి శక్తి ఉంది,

ఇక ఎగిరేప్పుడు చేసిన చేష్టలు ప్రాణాయామానికి సరిగా సరిపోయేవే. 'ముక్కు పట్టుకో'- 'ఉత్తిష్ఠంతు భూతపిశాచా' అంటూ చదువుతారు. వట్టిగా ముక్కు పట్టుకొన్నా, మూతి తుడుచుకున్నా ప్రయోజనం లేదు. అక్కడ ప్రాణాయామాన్ని చేయాలి. (కుడిముక్కు రంధ్రం నుండి గాలిపీల్చి, బంధించ గలిగినంతసేపూ బంధించి, మెల్లగా, ఎడమ ముక్కురంధ్రం నుండి విడువడం). ఇలా ఒకసారి ఇక్కడ చేయడం ప్రాణాయామం. బ్రతికుండే కాలాన్ని నిలువచేసుకోవడమని అర్థం.

'ఒక వ్యక్తి' రోజుకి 21,600 సార్లు గాలి పీల్చి విడువవలసివస్తే, ఎన్ని ప్రాణాయామాలు చేస్తే అంత జీవనకాలాన్ని దాచుకున్నట్లే. అంత మరణకాలాన్ని వాయిదా వేసికొన్నట్లే'. అందుకే దీని పేరు ప్రాణ+ఆయామం=ప్రాణాన్ని (జీవనకాలాన్ని)- సంపాదించడం- అని. తాను వచ్చేవరకూ, వానరులని మహేంద్ర పర్వతం వద్దనే ఉండమని చెప్పడమూ, వచ్చాక ఇది అందరి విజయం అని చెప్పడమూ, గురువుయొక్క వినయ లక్షణాన్ని చెప్తుంది. పదిమందిలో 'ఒకడు'గా ఉంటే గొప్పవాడు గాని, పది మందిలో 'ఒక్కడు'గా ఉంటే కాదు.

తన విజయాన్ని సర్వ సమదృష్టితో చూచిన గొప్ప ఆచార్యుడు హనుమ. బయలుదేరగానే, మైనాకుడు విశ్రాంతి తీసికోమన్నాడు. ఆచార్యుడు సాధన ప్రారంభించ

గానే, భగవదనుగ్రహం చేత సంమాన సత్కారాదులు లభిస్తాయి. అంతతో ఆనందపడి సాధనమానేస్తే, మైనాకుని మీద విశ్రమించినట్లే ఔతుంది. అలా చేయరాదని భావం. మైనాకుణ్ణి హనుమ తిరస్కరింపక, స్పృశించి వెళ్లాడు.

అలాగే, సంమాన సత్కార వైభవాలని తిరస్కరింపక – స్వీకరించి, సాధనమాత్రం మఱువకూడదు. కొంతదూరంలో సురస వచ్చింది. ఆమెని శిక్షించగల సామర్థ్యం ఉన్నా, తాను తనని పెద్దచేసికొన్నాడు గాని ఎదుర్కోలేదు. సాధకుడు, తనని ఎదుర్కొన వచ్చే వాళ్లని ఎదిరించడం కంటె,శిక్షించడం, శిక్షింపచేయడం కంటె, తన గరిమని(గొప్పదనాన్ని) ఎక్కువ చేసికొని అవతలివారు తల వంచేలా చేయాలి. ఆ పని అయిపోయాక, మళ్లీ సామాన్యరూపం ధరించడమంటే, దర్పాన్ని తగ్గించుకోవడ మన్న మాట. పెరిగిన దర్పం, ఎదుర్కొనడానికి మాత్రమే ఉపయోగించాలి. ఈ సురస నాగులతల్లి. కశ్యపుని రెండవ భార్య కద్రువు. మొదటి భార్య వినత. ఆమె పుత్రుడు గరుడుడు. కద్రువకి గరుడుడు సవతి పుత్రుడు .

ఆంజనేయుడూ, గరుడుడూ బలంతో సమానమని వాల్మీకి అనేక పర్యాయాలు వర్ణించాడు. (వైనతేయమహం శక్తః పరిగంతుం సహస్రశః (కి/67/14) – ఋతే సుపర్ణరాజానం మారుతం వా మహాజవమ్ – (కి67/24) జగామాకాశ మావిశ్య వేగేన గరుడోపమః – (సుం 1/16) – ఉత్పతిష్యన్ విచిక్షేప పక్షిరాజ ఇవోరగమ్ –(సుం 33)– దదృశే గరుడే నేవ హ్రియమాణో మహోరగః – (సుం 34)– – వ్యోమ్ని తం కపిశార్దూలం సువర్ణ ఇవ మేనిరే –(సుం 75) – గరుడుడంటే నిజంగా ద్వేషం ఉన్న కద్రువు, గరుడునితో సమానుడైన హనుమ వెళ్లేప్పుడు, ద్వేషం ఉన్నట్లు నటించింది దేవ ప్రార్థనపై. హనుమ కూడా, అలనాటి గరుడునిలా, ఈనాడూ ఆమెని తల్లిగానే భావించి, ఎదురుతిరక్కుండా, లొంగకుండా జయించాడు. ఇద్దఱూ ఒకరి కొకరు శరీరాన్ని పెంచుకున్నారు – ఒకరు మ్రింగాలనీ – మఱొకరు మ్రింగబడ రాదనీ.

కోరికలు అధికమైకొద్దీ కర్మలు (పూజ మొదలైనవి) అధికమౌతాయి. కాని, ఆ కర్మలకి లోబడకూడదు. అంటే, కోరికతో కాక నిష్కామంగా చేయాలి. హనుమ బంధింపబడక పోవడమంటే ఆ కోరికలకు లొంగక పోవడమని అర్థం.

మూడవది సింహిక. నీళ్లలో ఉండి, జల చరాలని తిననిది అది. ఈర్ష్య సింహిక. ఈర్ష్య తన తోటివారిని వేధించదు. తనకంటె పైవారిని బాధిస్తుంది. ఆకాశంలో ఎగిరే హనుమని పట్టుకోవడమంటే ఇదే. ఆ ఈర్ష్య ప్రత్యక్షంగా బాధించదు. పరోక్షంగా వ్యక్తమౌతుంది. అందుకే హనుమని పట్టుకోకుండా, అతని నీడని పట్టుకుంది. సురసని చంపక, సింహికని చంపాడు.

శాస్త్రం చెప్పిన కర్మలు (సు-రస) ఆనందాన్ని కల్గించేవి. శాస్త్రం చెప్పని కర్మలు (హింసక - సింహిక) వ్యక్తిని నాశనం చేసేవి. వెంటనే అలాటి క్షుద్రశక్తులు కలిగే కర్మలని విడవాలి. అందుకే సింహికని చంపాడు. రాత్రివేళలో లంకలో ప్రవేశించాలనుకున్నాడు మారుతి. పగలంతా బయటి వ్యవహారాల్లో తన అసలురంగు బయటపడకుండా తిరిగే స్వభావం వ్యక్తిది. ఇంట్లో (రాత్రిపూట) తన సహజరూపంలో కన్పిస్తాడు. రావణుని నిజరూపం, రాత్రిపూట వాని ఇంట్లోనే తెలిసికోవాలి - అని భావన.

పెద్దరూపాన్ని పొందిన హనుమ, చిన్నరూపం ధరించడం, ఒకసారి ఉన్నత స్థానాన్ని పొందినా, లఘుత్వాన్ని పొందగల వినయానికి చిహ్నం. ఈ పనిని చాల తక్కువమంది చేయగలరేమో! లంకని చూచాడు మారుతి. అదే శరీరం అంటే. ఇదే అన్ని భోగాలనీ అనుభవించేందుకు తగిన చోటు.

శరీరం మెత్తదనాన్నీ, కళ్లు సుందర దృశ్యాలనీ, చెవులు మధుర ధ్వనులనీ ........ ఇలా జ్ఞాన - కర్మేంద్రియాలు ఐదూ, తమతమ భోగాన్ని శరీరానికి అందించే చోటు, ఈ శరీరమే.

సర్వ ప్రపంచానికి రాత్రి ఎప్పుడో, అప్పుడు యోగి మేల్కొంటాడు (యా నిశా సర్వ భూతానామ్........) అందుకని రాత్రి కాలంలో హనుమ లంకలో ప్రవేశించాడు. 'నేను' అనే భావన ఉన్నంత కాలం, ఏ వ్యక్తికీ ఆత్మదర్శనం కాదు. 'లంకిణి' అనేది ఎదురై, 'నేను' ఉన్నానంది. దాన్ని జయించి లోపలికి వెళ్లాడు. ఆత్మదర్శనానికి 'అద్వారేణ' - ద్వారంగుండా కాక, వెళ్లాడు. అద్వారేణ=భగవంతుని ఆజ్ఞపై, భగవంతుని పనిపై, ప్రాకారం దూకి వెళ్లాడు.

శరీరానికి ఉండే మహాభోగాలు ప్రాకారం. దూకడమంటే దూకబడే వస్తువుని క్రిందుచేయడం. కాబట్టి భోగాలని తక్కువ చేయడం, అని అర్థం. లోపల ఎన్నో రమణీయ దృశ్యాలనీ, ఎందఱో సుందర స్త్రీలనీ చూచినా, అతని మనస్సు కానందం కలుగలేదు.

దేవాలయానికి ఎన్నో రమణీయ దృశ్యాలు చిత్రించబడ్డా, దేవుని మీదే దృష్టి ఉన్నట్లు 'ఆత్మ'ని దర్శింపగోరే వారికి, ఎన్ని అందాలు అంతకు మించినవి వచ్చినా, పట్టవు. అప్సరసలు రాగానే, తపస్సులో ఓడడమంటే, ఆత్మదర్శనంపై నిష్కల్మషమైన ఆలోచనలేదని భావం. అంతఃపురంలో అనేక స్త్రీలు, రావణునికి లొంగి పడి ఉన్నారు. అంటే మనస్సుకి లోబడిన వాళ్లెందఱు అక్కడ ఉన్నారో తెలుస్తోంది.

ఆత్మ దర్శనానికై మఱల అన్వేషిస్తే, అశోకవనం కన్పించింది. విషయ భోగాలనుండి మరలి, భగవంతుణ్ణే ధ్యానించడం అశోక స్థితి. 10 ఇంద్రియాలలో పుట్టే

దురాలోచనలే, రాక్షసస్త్రీలు. తమకి అనుగుణంగా ప్రవర్తించవలెనని ఆత్మని బాధ పెడుతూండడమే, సీతని హింసించడమంటే. అకార్యమని ఆత్మా, తప్పు లేదు - చేయవచ్చునని మనస్సూ - ఈ రెంటి సంవాదమే సీతా రావణ సంభాషణ.

నువ్వు 'అకామవైతే స్పృశించనని రావణుడన్నాడు. ఆవిన్నవువందు, కామాక్షమ్మరాలు - అనేది సామాన్యార్థం. 'కోరిక' లేకపోతే ఆత్మని - 'మనసు' - ఏమీ చేయలేదు. మారీచమృగాన్ని తెమ్మనిమనసుద్వారా కోరడంవలననే ఆత్మకి బంధనం కల్గింది.

'నిన్ను నా పట్టపురాణిని చేస్తాను' వంటి మాటల్ని, ఎన్నింటిని రావణుడు సీతతో అంటున్నాడో, అన్నీ, మనసు మనని ఎలా మభ్యపెట్టి, ప్రలోభపెట్టి, వంచిస్తోందో చెప్తాయి - 'ఓ సీతా! నాతో ఉండు. ఆనందపడు.. భోగాల్ని అనుభవించు' వంటి రావణుని మాటలద్వారా, మనస్సు నిత్యమూ చేసే దుర్బోధ - త్రాగు - తిరుగు - భోగాల్ని అనుభవించు - దేవుడూ లేడు - దయ్యమూ లేదు' వంటివి తెలుస్తాయి.

'నేను రామునిదాననే' అంది సీతమ్మ. సీతమ్మ-ఆత్మ. 'ఆత్మ' అనేది పరమాత్మ వస్తువు కాబట్టి, ఆత్మ అయిన తనని, పరమాత్మకే చేర్చు-అని, మనసుతో చెప్పిందని భావం. రాముని ఆజ్ఞ లేక శపించడం లేదన్నది.

జ్ఞానమూ, కర్మ అను రెండు రెక్కలతో పురుషుడు అనే పక్షి, పరమగతిని పొందుతాడు. అలాటి పక్షియైన ఆచార్యుడు వేదశాఖల యందుంటాడు. ఎప్పుడూ సంతోషంతో నిండిన మనస్సు కల్గి ఉంటాడు. ఎప్పుడైనా నిరుత్సాహపడే శిష్యునకు, ఉత్సాహం కల్గిస్తాడు. బుజ్జగిస్తూ ధైర్యం చెప్తాడు. అట్టి ఆచార్యుడు హనుమ చెట్టుపై ఉన్నాడని సూచన.

సీత దుఃఖిస్తూ తన పాపమే తన దుఃఖానికి కారణమన్నది. భగవంతునికీ, నానినే నమ్మిన భాగవతునికీ (రామలక్ష్మణులకి) అపచారం చేయడమే, ఆ పాపం. రాముణ్ణి స్త్రీ అనడం, లక్ష్మణుణ్ణి పరస్త్రీ కాముకుడనడం సీత పాపాలు. పాపం చేస్తే, భగవంతునికైనా శిక్షతప్పదని, భగవంతుడే నిరూపించాడు. తన ప్రయత్నంతో తాను భగవంతుని చేరడంకంటె, ఆయనే వచ్చి తీసి కొని పోవడం, మరెంత అనుగ్రహ విశేషాన్ని చెప్తుంది. అందుకే సీత, రాముణ్ణి రమ్మనీ, తనని తీసికొని పొమ్మనీ కబురుచేసింది.

తన సైన్యం మరణిస్తున్నారని వినగానే 'రావణ నేత్రాల' మండి-పడ్డ, రెండు కన్నీటి బొట్లూ, (అగ్నితో నూనె (స్నేహము) కోపానికి - ప్రేమకి సంకేతాలు. మండుతున్న లోకను చూచి హనుమ భయపడలేదు. భగవంతుని పనికై కష్టపడ్డాలు

వచ్చినా, వహించాలని దీని భావం. ఆచార్యుడైనవాడు (హనుమ) తన శరీరమే ప్రధానమని భావించకూడదు. శిష్యుడు మాత్రం, తనకి జ్ఞాన భిక్షచేసే ఆచార్యుని శరీరం, క్షేమంగా ఉండాలని కోరుకోవాలి. అదే, సీతా ప్రార్థనం 'శీతోభవ' అనేది.

న జాయతే మ్రియతే వా కదాచిత్ - న దహ్యతే దహ్యమానే శరీరే పుట్టుట- చచ్చుట లేనిదీ, దహింపబడే శరీరంలో ఉండికూడా, దహింపబడనిదీ, ఆత్మపదార్థం. ఆమె ఇక్కడ సీతగా చెప్పబడింది. కాబట్టే ఈ ఆత్మ-(సీత) పరమాత్మకు చెందిన సొత్తు' - అని ప్రతిక్షణమూ సీతమ్మ పలుకు తూంటుంది. భగవంతుని యందే బుద్ధికల జీవుణ్ణి, గురువులు ఉపదేశించిన మార్గంలో వెళ్ళి పరీక్షించి, ఈ జీవుడు సరియైన వాడే అని గ్రహించి, పరమాత్మతో చేర్చడానికి నిశ్చయించి, వెనుతిరిగి హనుమ వెళ్లడం సుందర కాండం.

## (ii) లంకా దోష విశేషాంశం

సంశయాన్ని కల్గించేది మనస్సు. నిశ్చయంగా తేల్చిచెప్పేది బుద్ధి. మనస్సు మనిషికి సంబంధించినది. ('బుద్ధింతు సారథింవిద్ధి') బుద్ధి, పరమాత్మ, ఇంట్లో గదిగదికీ 'కరెంటు ఫ్యూజు'లుండి, మొత్తానికి 'మెయిన్ స్విచ్' ఉన్నట్లు శరీరంలో 6 'ఫ్యూజు'లూ, ఒక 'మెయిన్‌స్విచ్' ఉన్నాయి. (ఇది అర్థమయ్యేందుకు ఇలా వ్రాయబడుతోంది. మహర్షులు క్షమింతురు గాక!)

కూర్చున్నప్పుడు వెన్నుపూస చివరన ఉండేది 'మూల+ఆధార' చక్రం. రెండు తొడల నడుమ స్వాధిష్ఠాన చక్రం. బొడ్డునందు మణిపూరకం. హృదయం ఉన్నచోట అనాహతం. కంఠం క్రిందుగా ఉన్న గుంటలో విశుద్ధి చక్రం. రెండు కనుబొమలూ కలిసేచోట ఆజ్ఞాచక్రం. బ్రహ్మరంధ్రంలో (మాడు) సహస్రార (1000 రేకులున్న కమలం) చక్రం.

యోగాభ్యాసాన్ని చేసేవాణ్ణి 'సాధకుడు' అంటారు. అతడికి 'బుద్ధి'తో యోగం ఏర్పడితే, అంటే, కచ్చితంగా యోగంలో నిష్ణాతుణ్ణి కావాలనే పట్టుదల కలిగినట్లైతే, నడుమ యోగవిధానాన్ని ఆపక, యోగ-భ్రష్టుడు కాడు. 'యోగబుద్ధి' కలిగినవాడు ఔతాడు. ఆ సిద్ధికలవాడే 'యోగి'! సాధకుడు రాముడు. బుద్ధి ఆంజనేయుడు, 'ఈ సాధకుడు ఆ 'బుద్ధి'తో పరిచయం చేసికొన్నాక 'సిద్ధి'ని పొందకమానడు' అని కదా! యోగరహస్యం. అలాగే, రాముడు హనుమతో కార్యాన్ని సాధించుకొంటాడని భావం.

ప్రకృతి, పురుషుడు అనేవి రెండు. ప్రకృతి సీత. పురుషుడు రాముడు. కలిసి ఉన్నప్పుడు, దశ-ఇంద్రియాలూ (రావణుడు) మోసగించి ప్రకృతిని వెదకడానికి 'బుద్ధి'తో

కలిసి, వేదంలో చెప్పబడిన మార్గంలోనే (చారణా చరితపథం) ప్రయాణించి తిరిగి ఆమెని తెచ్చుకున్నాడు.

'బుద్ధి' ప్రయాణించేముందు, సూర్యునిచేత ప్రచోదనం చేయబడే (హనుమ) మహేంద్రునికీ, (గాయత్రీ మంత్రార్థమిదే), తనంతతామగా జన్మించిన జీవాధారమైన ప్రాణవాయువుకీ, నమస్కరించాడు.

ఉత్తరం నుండి దక్షిణానికి ఎగిరాడు హనుమ. (అంటే (Map) పటానికిఅడుగు 'దక్షిణం' కాబట్టి) శరీరాకారానికీ దక్షిణం వెన్నెముక చివర అవుతుంది. మూల+ఆధార చక్రంలో ఉన్న 'కుండలిని' అనే శక్తిని సహస్రారానికి చేర్చడానికై చేసిన ప్రయాణమే సుందరం. ఇలా ప్రయాణించే బుద్ధిని (మే+నాక, స్వార్థే ప్రజ్ఞాదిత్వాత్‌అణ్) భ్రష్టుణ్ణి చేయడానికి చేసే ప్రలోభం, మైనాకుడు. సౌఖ్యం, తన వంశంలో ఉన్నా విడువడం సాధకుని కర్తవ్యం. ఇందాక సుఖాన్ని విడిచినట్లు, 'బుద్ధి' ఈసారి దుఃఖాన్ని కూడా కాదన్నాడు. సంకెలలు, బంగారానివైతే మాత్రం, సంకెళ్లే కదా!

సాధకుణ్ణి బాధించేది 'హింసిక'. అదే సింహిక. (పక్షాక్షిప, పశ్యకాకశ్యప వంటిది). ఈ విఘ్నం రాబోతోందని, ముందే సుగ్రీవుడు చెప్పాడు - అంటే ఆటంకాలు వస్తాయి. సాధన జాగ్రత్త అని ముందే చేసిన హెచ్చరికగా గమనించాలి.

'లంక' అడ్డొచ్చింది పిమ్మట. పై చెప్పిన విధంగా 'లంకా', 'కాలం' ఔతుంది. 'కాలం' తమోగుణానికి సంకేతం. 'కాలం' అంటే నలుపుకదా! తపస్సు, బుద్ధిని అడ్డగించిందన్నమాట. జ్ఞానం, పతనం కాకపోతే (హనుమ ధైర్యం వీడకపోతే) తమస్సు (లంక-కాలం) వశమౌతుంది. 'సీతనివెతుక్కో' అన్న హేతువిదే.

బుద్ధి అయిన హనుమద్వారా సాధకుడైన పరమాత్మకు చేర్చబడిన సీతయే కుండలిని. దశేంద్రియాలనీ అదుపుచేయ ప్రయత్నించేది మంద+ఉత్+అరి=శత్రువుల ప్రభావానికి (రావణుణ్ణి) శత్రువు. 'మండోదరి' మాత్రం తనకు భగవంతునిగా, దశేంద్రియాలనే కొలుస్తుంది. కుండలిని (సీత) సహస్రారంలో (రామునితో) త్వరలో కలుస్తుందని చెప్పినది త్రిజట.

అన్నీ తెలిసే స్థితి ప్రాజ్ఞం. కళ్లకి కన్పించేది విశ్వం. నిద్రలో మానసికంగా కలిగే స్వప్నావస్థ తైజసం. ఈ మూడూ ఒకదాని కొకటి జతపడిన స్థితి 'త్రిజట'. పరమాత్మకు సంబంధించినదే 'అంగుళ+ఈయకం'. దీన్ని ఈయడం ద్వారా, ప్రకృతిని పురుషునితో కలుపుతానని 'బుద్ధి సాధకునితో (పరోక్షంగానైనా) చెప్పి నట్లయింది. బుద్ధి (హనుమ) ప్రకృతిని (సీత) తీసికెడతానంటే, కాదు-రాముడే

(పురుషుడే) రావాలని చెప్పడం, సహస్రారం నుండి మూలాధారానికి 'శక్తి' రావాలనీ, వచ్చిన ప్రకృతిని పరమాత్మతో లీనం చేయాలనీ చెప్పడం).

సాధకుని అజాగ్రత్తవలన కొన్ని చక్రాలు దాటిన బుద్ధియోగం ప్రకృతిని జారవిడిచి భ్రష్టతని పొందవచ్చు. 'జారిపోతానేమో' అనే సీతా భయమిదే. మూలాధారం నుండి సహస్రారానికీ, అక్కడి నుండి మూలాధారానికి రావడమే సంపూర్ణయోగం అంటే. ఉత్తరాన గంగ (సహస్రారం) ఉంది. దక్షిణాన రామేశ్వరం (మూలాధారం) ఉంది. అక్కడనుండి ఇక్కడికి వచ్చి, తిరిగి అక్కడికి పోవడంతో తీర్థయాత్ర ముగిసినట్లు అనడంలో ఔచిత్యమిదే.

సాధకుడు కుండలినీ శక్తిని ఒక సంపూర్ణభ్రమణం చేయించాలి-అని. కాకాసుర కథ విన్పించాడు హనుమ. క+అకా=సుఖ దుఃఖాలే 'కాకం' అంటే. అందుకే ఇంద్రియాధిపతి అయిన ఇంద్రపుత్రుడిగా కాకిని చెప్పారు.

ప్రకృతిని బాధించడమే సుఖదుఃఖాల లక్ష్యం. బ్రహ్మ+అస్త్రం వేయడమంటే జ్ఞానాన్ని పంపడం, దానితో సుఖదుఃఖాలు ఏం చేయలేక పోయాయి ప్రకృతిని.

శిరోమణిని (చూడామణిని) ఆమె ఈయడమంటే, భగవంతుని గూర్చిన జ్ఞానతపనని తెల్పడమే.

కుండలినీ శక్తికై, ఒక చక్రంనుండి మరోచక్రానికి ప్రయాణించే కాలంలో, వ్యతిరేక శక్తుల్ని ఎదుర్కోవడమే రాక్షస వధ.

ప్రమద+అవనం అంటే అహంకార విలయమన్నమాట. వి+భీ+షణుడు. దారేషణ, పుత్రేషణ, ధనేషణల భయం తొలగినవాడు, 'బుద్ధి'ని ప్రశంసించాడు. 'లంక' తమోనిలయమైన శరీరం. **కుంభక+ఋణుడు =కుంభకర్ణుడు.** కొంతకాలమే యోగంలో ఉండేవాడు. మిగిలిన కొంతకాలం యోగ భ్రష్ట స్థితిలో ఉంటాడు. తమోనిలయమైన లంకలో బుద్ధి ప్రవేశించి, తమోవృత్తుల అహంకారాన్ని అణచి, కుండలినిని సహస్రారానికి చేర్చే సాధనని చేయడానికి తగు ఏర్పాట్లు అయ్యాయని, పురుషునితో చెప్పి, సాధకునికి ఉత్సాహం కల్గించడమే, సుందరకాండలోని భావం. (ఈ స్థాయిలో ఇంతకుమించి అందజేయడం కష్టమని ఇంతే వ్రాయడం జరిగింది).

**కేవలం ఫలాలు ప్రాప్తించగానే పారాయణాన్ని ఆపకుండా, పైపైకి దర్శనమైనా, స్పృశించి మాత్రమే తన పని కొనసాగిస్తూనే వెళ్లిన ఆంజనేయుడ్ని మార్గదర్శకునిగా భావించి, నిరంతరమూ – అంటే జీవిత కాలమూ – పారాయణ చేయడం ఉచితం.**

❀ ❀ ❀

# శ్రీ రామ పట్టాభిషేక సర్గము

## (సంపూర్ణ సుందరకాండ పారాయణ మయ్యాక చదవాల్సినది)

రావణుడు గతించాక, సుగ్రీవుడూ మొదలైన వానరాలూ, విభీషణుడూ అయోధ్యకి బయలుదేరారు. వీరికి ముందుగా పుష్పక విమానం సీతారామ లక్ష్మణులతో నంది గ్రామం వైపుకి కదిలింది. (అయోధ్యకి దగ్గరగా ఉన్న గ్రామం - భరతుడు రామపాదుకలని ఉంచి రాజ్యం చేస్తున్న చోటు).

త్రోవలో అన్ని చోటులనీ సీతారాములు చూస్తూ, అరణ్యంలో తిరిగినప్పుడు ఆయా ప్రదేశాలలో జరిగిన విశేషాలూ, అప్పటి కథలూ తలచుకుంటూ, ఒకరికొకరు చెప్పుకుంటూ ప్రయాణించారు. నంది గ్రామం రాగానే, పుష్పకాన్ని ఆపాడు రాముడు. గుహునికి, తాము ఇక్కడ ఉన్నట్లుగా వర్తమానం పంపాడు.

పాదుకలతో రాజ్యం చేస్తున్న భరతుని వద్దకు ఆంజనేయుణ్ణి పంపుతూ, ఇలా చెప్పాడు. 'ఓ! హనుమ! భరతుడు రాజ్యం చేసేచోటుకి పోయి, భరతునితో మాట్లాడు. అతని ముఖంలో ఏమాత్రపు రాజ్యకాంక్ష కనిపించినా, మాటలలో రాజ్యాభిలాష తొంగిచూచినా, నువ్వు వచ్చేయి. నువ్వు ఎదురువస్తే, మేం వెనుతిరుగుతాం' అన్నాడు.

క్షణంలో హనుమ, భరతుని వద్ద వాలాడు. అతని ఒళ్లంతా మలినంగా ఉంది. తల జడలుకట్టి ఉంది. ఫలాలనే ఆహారంగా స్వీకరిస్తున్నాడు. రామపాదుకలనే ధ్యానిస్తూ, ధర్మమూర్తిలా ఉన్నాడు భరతుడు.

రాముడొస్తున్నాడనే వార్త వింటూనే, ఆనంద పారవశ్యంతో మూర్ఛపోయాడు భరతుడు. తేరుకున్న భరతునికి, చిత్రకూటం నుండి రావణవధ వరకూ జరిగిన కథనంతా హనుమ చెప్పగా, మితిలేని ఆనందం పొంది, మహారాజుగా వచ్చే రామునికి చేయాల్సిన సన్నాహాలని చేయవలసినదిగా ఆజ్ఞాపించాడు.

రామ వృత్తాంతాన్ని ముచ్చటిస్తూ, రామునికి చేసే స్వాగత సన్నాహాలని గమనిస్తూ, మారుతి ఒడలు మరచిపోయాడు. వచ్చే వానరాలకోసమని వృక్షాలకి కాయలు, అప్పటికప్పుడు భరద్వాజుడు కాయించాడు. చల్లనిగాలి శుభావహంగా

వీచసాగింది. పూలతో, పళ్లతో చెట్లు చూడముచ్చటగా ఉన్నాయి. అందటికీ రాముడొస్తున్నాడని అర్థమైంది.

రామాజ్ఞతో నేలమీద పుష్పకం ఆగింది. సాష్టాంగపడిన భరతుణ్ణి పైకి లేపి కౌగిలించుకున్నాడు రాముడు. భరతుడు లక్ష్మణ సుగ్రీవ- జాంబవంతులకు కౌగిలి మర్యాద చేసాడు. శత్రుఘ్నుడు కూడ అన్నని అనుసరించాడు.

మౌనంగా రాముడు తన తల్లికీ సుమిత్రా కైకేయిలకు నమస్కరించాడు. పురప్రజల స్వాగత ధ్వనులతో దిక్కులు దద్దరిల్లాయి. భరతుడు, రామపాదుకలని తెచ్చి కళ్లకద్దుకొని, రాముని పాదాలకు తొడిగాడు. ఆసమయంలో అందటికళ్లూ చెమర్చాయి.

రాముడు గంభీరంగా చూస్తూ కుబేరుని నుండి తేబడిన విమానాన్ని కుబేరునివద్దకు పోవలసిందిగా ఆజ్ఞాపించి, కులగురువైన వశిష్ఠులవారికి పాదాభివందనం చేసి ప్రక్కనే కూర్చున్నాడు.

**పూజితా మామికా మాతా దత్తం రాజ్యమిదమ్మమ ।**
**తద్దదామి పునస్తుభ్యం యథా త్వ మదదా మమ ॥ (యుద్ధ 131/2)**

భరతుడు, రామునికి నమస్కరిస్తూ ఇలా అన్నాడు. "అగ్రజా! మా అమ్మ కైకేయి మాటను గౌరవించి, ఎలా ఈ రాజ్యాన్ని నా కప్పగించావో, నేమా అలాగే తిరిగి యిస్తున్నాను. ఇది నీది. నాది కాదు. స్వామీ! మదించిన ఎద్దుమాత్రమే మోయగల బండి బరువుని, లేగదూడ మోయగలదా? నీటి అలుచే, గండిపడ్డ నదికి ఆనకట్ట కట్టడం, ఎంత తేలికో ఎవరి నడిగినా తెలుస్తుంది! పోలిక ఒకటే అని, గుఱ్ఱాన్నీ- గాడిదనీ, హంసనీ-కాకినీ, ఒక్కటిగా ఏ బుద్ధిమంతుడూ చూడడు. ఇంట్లో మొక్కని నాటాక, అది కొమ్మలతో పెరిగి పెద్దదై, పండ్లు పండక ఎండితే, యజమాని ఎంత దుఃఖిస్తాడో, అలా చిన్నప్పటినుండి నిన్ను ఎఱుగున్న ఈ అయోధ్యా జనం, నువ్వు రాజువికాకపోతే అంత ఖేదపడతారు. పట్టాభిషేకానికి అంతా సిద్ధమై, విఘ్నకారణంగా అడవులకి వెళ్లి అడవినుండి తిరిగి వచ్చావు కాబట్టి నీదే ఈ రాజ్యం.

మంగళ వాయిద్యాలతో, పట్టపుటేనుగు ఘీంకారాలతో, అయోధ్యా జనుల జయజయ ధ్వానాలమధ్య మధ్యాహ్న సూర్యునిలా సింహాసనాన్ని అధిష్ఠించి మాకు కన్నులున్నందుకు చరితార్థులని కలుగచెయ్యి. ఈ రాజ్యం నీది. నీ సొత్తునీకు అప్పగిస్తున్నాను. ఇంతకాలం నేను కాపు కాసాను. కాలచక్రం తిరిగేంతవఱకూ, రాజ్యచక్రం నీదే' అని సాష్టాంగపడ్డాడు భరతుడు జటాధారియై.

రామచంద్రుడు భరతుని అవ్యాజమైన మాటలని విని 'అలాగే' అన్నాడు.

ముగ్గురు తమ్ముళ్ళకీ మంగళ్ళు జటలని తీసేసారు. తలంటుకి కావలసిన ద్రవ్యాలు, కుసుమవస్త్రాలతో అక్కడికి వచ్చేసాయి. రాముని మాటపై, భరతునికి ముందుగా మంగళస్నానమైంది. సుగ్రీవునికీ, లక్ష్మణునికి కూడా స్నానాలు చేయించారు. రాముడు మంగళస్నానానికి యోగ్యమైన వేషంతో, లేపనాలతో, క్షణకాలంలో కన్పించాడు. ఎన్నెన్ని అలంకారాలనో అభినందన పూర్వకంగా, రాముని మెడలో వేస్తున్నారు. అక్కడ సీతమ్మకి అలంకార నిపుణలైన స్త్రీలు, స్నానార్థం లేపనాలతో అలంకరిస్తున్నారు. కొంతసేపటికి, అవి పూర్తయ్యాయి వేడుకలతో.

ఇక, రాజమార్గంలో నిలబడి, అశోక-విజయ-సుమంత్రాది మంత్రులు, వశిష్ఠునితో కలిసి, రాముడు 'అయోధ్య'కు రానున్న సందర్భంగా తగిన ఏర్పాట్లని గూర్చి ఆలోచిస్తున్నారు. అయోధ్యా జనం ఒక్కమాటుగా నందిగ్రామం వైపుకి కదిలారు. దావానలంలామూ, రాముడు వస్తున్నాడనే వార్త వాయువుకంటె వేగంగానూ, అందరికీ ప్రాకింది.

రామరథం నంది గ్రామంలో ఒక్కమాటుగా కదిలింది. శత్రుఘ్నుడు రామునికి ఎడమప్రక్కగా నిలబడి, ఛత్రాన్ని పట్టాడు. లక్ష్మణుడు కుడి ప్రక్కగా నిలబడి, చామరంతో వీస్తున్నాడు. భరతుడు రామునికి ముందు భాగంలో దిగువగా కూర్చుని, పగ్గాలని విడుస్తూ గుఱ్ఱాలని అదిలిస్తున్నాడు. తెల్లని వింజామర పట్టి, విభీషణుడు రామునికి ముందుగా ఉండి సేవిస్తున్నాడు.

ఆకాశంలో దేవసంఘాలూ, ఇతర గణాలూ ఎన్నెన్ని స్తోత్రాలో చేసారు. చెప్పలేనన్ని ఏనుగులమీద అసంఖ్యాకంగా మనుష్యరూపంలో ఉన్న కోతులు, ఆనందోత్సాహాలతో దిక్కులు మ్రోగేలా జయజయధ్వానాల్ని చేస్తున్నారు. రాజైన సుగ్రీవుడు, శత్రుంజయమనే పేరున్న ఏనుగునెక్కి, రెండు వరుసలలో రథం ముందు వెడుతూన్న వానరుల వరుసలమధ్య, నిదానంగా ప్రయాణిస్తున్నాడు.

శంఖాలు, దుందుభులు, తప్పెటలు, బాకాలు, కాహళలు ఇంకా పేరు తెలియని అనేకం చేసే ధ్వనులకీ, వెళ్ళే జనసమూహపు ఆనంద నాదాలకీ, దేవసంఘాల స్తోత్రపాఠాలకీ, రాముని గూర్చి చెప్పుకునే జనుల ప్రశంసా వాక్యాలకీ, భూమి ఆకాశాల నడిమి భాగాలు చాలలేదు. ఒకప్పుడిదే మార్గంపై రామరథం అతిదుఃఖంతో వెళ్ళిందని, బాధతో, పూర్వవిషయాన్ని పెద్దలు స్మరించారు. కాని ఈనాడు ఆనంద బాష్పాలులేని ముఖంలేదు. ప్రశంసించని నోరులేదు. జయజయధ్వానాన్ని చేస్తూ గాలిలో ఆడని చేయిలేదు. రామాలంకారాన్ని చూడాలని తహతహలాడని కన్నులేదు.

నక్షత్రాలతో కూడిన చంద్రునిలా ఉన్నాడు రాముడు. ఎవరెవరు యుద్ధంలో ఎంతెంత చేసారో, ఏమేమి జరిగిందో, యుద్ధంలోని ఒప్పులూ, తప్పులూ, రావణుని దోషాలూ ఇలా చెప్పుకుంటూ నడుస్తున్నారు.

ముందుగా మంగళ వాయిద్యాలూ, తర్వాత ఏనుగులమీద వానరాలూ, ఆ పిమ్మట శత్రుంజయం మీద సుగ్రీవుడూ, ఆ వెనుక రథంమీద సపరివారంగా రామచంద్రుడూ వస్తూంటే, ఇంటింటా ఎత్తిన జండాలు స్వాగతమిస్తున్నాయి. రామభద్రుడంటే యిష్టంకలవి కాబట్టి, గుర్రాలు ఆనందంతో హేషాధ్వనులు చేసాయి.

ఏనుగులు ఘీంకరిస్తూ, తుండాలని ఎత్తి ముందుకు సాగి, గొలుసులుండడంతో, నిలబడి మరోసారి ధ్వని చేసాయి. వృద్ధురాండ్రైన ముత్తైదువులు మేడలమీది నుండి పేలాలని శుభసూచకంగా చల్లారు. తమతమ రహస్యాలని దాచుకున్న మిత్రులంతా, చేతులు చాచి రమ్మంటూ స్వాగతం పల్కారు. అయోధ్యలోని ఏ ఇంటిలోనూ, ఎవ్వరూ ఆ కాలంలో ఉండలేదు. అంతా రాజమార్గంలోనే ఉన్నారు.

రామభద్రుని రథం, తండ్రి భవనం ముందాగింది. రాముడు కౌసల్యా, కైకేయి, సుమిత్రలకు పాదాభివందనం చేసాడు. వెంటనే భరతునితో 'తమ్ముడూ! సుగ్రీవునికి విడిది?' అన్నాడు. క్షణంలో సుగ్రీవుణ్ణి ఎనలేని వైడూర్యాలతో నిండిన భవనంలోకి రాజలాంఛనాలతో ప్రవేశింప చేసాడు భరతుడు.

ప్రవేశించిన క్షణంలోనే, సుగ్రీవుడు వానరాలని నాల్గుదిక్కుల సముద్రం నీటినీ అభిషేకానికి తెమ్మని ఆజ్ఞచేసాడు. సమస్త నదీ జలాలనీ తేవడానికి హనుమ, జాంబవంతుడు, వేగదర్శి, ఋషభులనీ నియమించాడు. తెలవారేలోగా సుషేణుడూ, ఋషభుడూ, గవయుడూ, నలుడూ 4 సముద్రాల జలాలనీ, ఇతర శ్రేష్ఠులు నదీ జలాలనీ తెచ్చేసారు.

తెలతెలవారుతూండగా సీతమ్మనూ రాముణ్ణీ, రత్నాసనాలమీద కూర్చోబెట్టారు.

నీలమేఘశ్యాముని ప్రక్క, తెల్లనైన సీతమ్మ, మేఘంలో మెఱుపుతీగలా అన్పించింది.

రామునిచుట్టూ ప్రదక్షిణం చేస్తూన్నప్పుడు నీల పర్వతానికి ప్రదక్షిణం చేసే హంసలా ఉంది.

రాముడామెపై ఒకింతగా వ్రాలి జలంతో అభిషేకించినప్పుడు, శ్వేతపర్వతం మీద వ్రాలిన మేఘపు తునుకలా కన్పించాడు.

కలిసి నడిచివస్తూంటే, రాత్రీపగలూ కలిసి, ప్రక్కప్రక్కన ఉన్నట్లు తోచింది.

రాముడు ముందూ – సీతమ్మ వెనుకాగా నడుస్తుంటే, నీలమేఘం క్రిందుగా ఉదయిస్తున్న చంద్రునిలా అనిపిస్తారు.

రాముడు వెనుకా – సీతమ్మ ముందూగా వస్తూంటే హంసవెనుక వచ్చే బలాక పక్షిలా అనిపిస్తారు.

వృద్ధుడూ, నియమశీలుడూ అయిన వశిష్ఠుని ఆధర్యవంలో, అష్టవసువులూ ఇంద్రుణ్ణి అభిషేకించినట్లు, రాముణ్ణి మంత్రపూతమైన మంగళజలాలతో అభిషేకించారు. ఋత్విక్కులు, బ్రాహ్మణులు, కన్యలు, మంత్రులు, యోధులు, లోకపాలురు, దేవతలు, స్వర్గనివాసులు, ఇలా క్రమంగా, వారిని జలాలతో అభిషేకించారు.

తెల్లని ఛత్రాన్ని శత్రుఘ్నుడు పడితే, తెల్లచామరాలతో సుగ్రీవుడు ఒక ప్రక్కా, విభీషణుడు మరో ప్రక్కా కస్పించారు. వాయువుద్వారా ఇంద్రుడు, నూఱుపూసల బంగారుమాలని రామునికి బహూకరించాడు. భూమి సస్యశ్యామలం కావడం, వర్షాలు కురిసే సూచనలు కల్గడం, సర్వవిధ దానాలూ అయోధ్యలో ప్రారంభం కావడం . . . వీటన్నిటి ద్వారా 'రాముడు వచ్చాడని' అంతా నిశ్చయించారు, తమ రాముడే కాని, వేఱొకడు కాదనీను.

తనకి ఆశ్రయమిచ్చి, నిర్విఘ్నంగా కార్యనిర్వహణం చేసిన సూర్యపుత్రుడు సుగ్రీవునికి, సూర్యకాంతిమణుల బంగారు హారమిచ్చాడు రాముడు. యువరాజు అంగదునికి, రత్న వజ్రవైడూర్యాల అంగదాలని (బాహువులకి పెట్టుకునే ఆభరణాలు) రెంటినిచ్చాడు.

సీతమ్మ తెల్లని రెండు వస్త్రాలనీ, శుభమైన ఆభరణాలనీ హనుమకిచ్చింది. తన మెడలోని హారాన్ని తీసి ముఖ్యులైన వారికి ఇయ్యాలని సాభిప్రాయంగా వానరులనీ, భర్తనీ చూస్తూంటే–ఆమెని చూచి రాముడు ఇలా అన్నాడు.

'ప్రదేహి 'సుభగే!' హారం యస్య తుష్టాసి భామిని ।
పౌరుషం విక్రమో బుద్ధిః యస్మిన్నేతాని సర్వశః' ॥

'సీతా! నీ మనస్సుకి ఎవరు సంతోషాన్ని కల్గించారో, వారికి ఈ హారాన్నియ్యి', అని. సంశయించక సీతమ్మ ఆంజనేయుని కియ్యగా, ఇద్దఱి కళ్ళూ కృతజ్ఞతతో చెమ్మగిల్లాయి. (దదౌ సా వాయుపుత్రాయ తం హార మసితేక్షణా) (సుభగ శబ్దం మీదిదే 'సౌభాగ్యం' అనేది. 'సౌభాగ్యవతీభవ' అంటే 'భర్త అనురాగము కలదానివి కా!' అని భావం) ఇతర వానరాలని యథార్హంగా సంమానించాడు రాముడు. విభీషణుడు, రాముని నుండి తన రాజ్యాన్ని పొంది, వీడ్కోలు తీసికొన్నాడు. (లబ్ధ్వా 'కులధనం' రాజా లంకాం ప్రాయాద్విభీషణః– వంశపరంపరగా వచ్చే కులధనం, రాజ్యంకదా! అదికూడా, రావణవధని రాముడు చేసినందువలన, రామునిదే ఔతుంది. అందుకని, విభీషణునికిచ్చిన బహుమానం లంకారాజ్యం).

29.01.502
SRI
Acc NO. 21395



రాజైన రాముడు, లక్ష్మణుణ్ణి ఎన్నిమార్లు అర్థించినా, యౌవరాజ్యాన్ని. అంగీకరించకపోతే, భరతుణ్ణి యువరాజు చేసాడు. (తనకి కావాలని కోరడు. వచ్చిన దానిని పరమాత్మ ప్రసాదంగా స్వీకరిస్తాడు భరతుడు). 11వేల సంవత్సరాలు, రాముని రాజ్య పాలన సుఖంగా సాగింది.

## రామరాజ్యం ఎలా ఉంటుంది?

స్త్రీలు ముత్తైదువులుగానే ఉన్నారు. వ్యాధి, చోర జంతుభయం లేదు. పెద్దలు, చిన్నవాళ్లకి ప్రేతకృత్యాలు చేయడం లేదు. ఎక్కడ విన్నా "రామో రామో రామ యితి ప్రజానామభవత్కథా" రాముడు, రాముడు, రాముడనే మాటలే విన్పిస్తున్నాయి. మేఘుడు సకాల వర్షమిచ్చాడు. భూములు పంటల నిచ్చాయి. చెట్లు పుష్పించి ఫలించాయి. ప్రజలలో, హింసాబుద్ధి లేదు. ద్రవ్యాపేక్ష లేక చతుర్వర్ణాల వారూ జీవించారు.

'అబద్దం' ఆడాల్సిన, అవసరం లేదు. అంతా ధర్మ పరాయణ బద్ధులై ఉన్నారు.

## పారాయణ వలన ఫలము

కుటుంబవృద్ధిం ధనధాన్యవృద్ధిం స్త్రియశ్చ ముఖ్యాః సుఖ ముత్త మంచ।
శ్రుత్వా శుభం కావ్య మిదం మహార్థం ప్రాప్నోతి సర్వాం భువి చార్థ సిద్ధిమ్ ॥
ఆయుష్య మారోగ్యకరం యశస్యం సౌభ్రాత్రకం బుద్ధికరం సుఖం చ
శ్రోతవ్య మేత న్నియమేన సద్భిః ఆఖ్యాన మోజస్కర మృద్ధి కామైః
ఏవ మేత త్పురా వృత్త మాఖ్యానం భద్ర మస్తు వః
ప్రవ్యాహరత విస్రబ్ధం బలం విష్ణోః ప్రవర్ధతామ్॥

కుటుంబ వృద్ధి, ధనధాన్యవృద్ధి, చక్కని సంతానం, ఉత్తమ సుఖం, ఆయుష్యం, ఆరోగ్యం, సోదరులని చక్కగా చూచుకోవాలనే అభిలాష, సుఖం— అనేవి శ్రీమద్రామాయణాన్ని శ్రద్ధగా వినడం వలన, చదవడం వలన, చెప్పడం వలనా లభిస్తున్నాయి. ఇది జరిగిన కథ. చదివిన, విన్న, చెప్పిన వారికి శుభమగు గాక! విష్ణుబలము వృద్ధి యగుగాక! విష్ణుదేవుని అనుగ్రహము కలుగుగాక !!!

శ్రీ రామ రామ రామ श्री राम राम राम శ్రీ రామ రామ రామ श्री राम राम राम

ఓం శాన్తిః శ్శాన్తిః శ్శాన్తిః | మంగళం మహత్ శ్రీః శ్రీః శ్రీః శ్రీః శ్రీః | ఓం శాన్తిః శ్శాన్తిః శ్శాన్తిః

శ్రీ రామ రామ రామ श्री राम राम राम శ్రీ రామ రామ రామ श्री राम राम राम

***

## ( దీనితోపాటు రామాయణ గాయత్రీ బీజాక్షర శ్లోకాలు )

24 బీజాక్షరాలూ ఉన్న ఈ క్రింది శ్లోక పాదాలని, రోజుకి ఒకసారైనా చదివితే, గాయత్రీ మంత్ర మననం చేసినట్లే.

| క్రమ సంఖ్య | గాయత్రీ బీజాక్షరం | పాదము | వివరము |
|---|---|---|---|
| 1. | త :- | తపస్స్వాధ్యాయ నిరతం<br>తపస్వీ వాగ్విదాం వరమ్ । | (బాల 1-1) |
| 2. | స :- | సతేన పరమాస్త్రేణ<br>మానవేవ సమాహతః । | (బాల - 30-6) |
| 3. | వి :- | విశ్వామిత్రో మహాతేజాః<br>భూయస్తేపే మహత్తపః । | (బాల - 63-3) |
| 4. | తు :- | చతురశ్వో రథశ్శ్రీమాన్<br>నిస్త్రింశో ధనురుత్తమమ్ । | (అయోధ్య 14-36) |
| 5. | వ :- | వర్తతే చోత్తమాం వృత్తిం<br>లక్ష్మణోఽస్మిన్ సదానఘ ।। | (అయోధ్య 44-5) |
| 6. | రే :- | ద్వారేణ వైజయంతేన<br>ప్రావిశచ్ఛాంత్ర వాహనః । | (అయోధ్య 71-33) |
| 7. | ణి :- | ఉటజే రామమాసీనం<br>జటామండలధారిణమ్ । | (అయోధ్య 99-25) |
| 8. | య :- | తే వయం వనమత్యుగ్రం<br>ప్రవిష్టాః పితృశాసనాత్ । | (అరణ్య - 12-3) |
| 9. | భ :- | మమ భర్తా మహాతేజాః<br>వయసా పంచవిం శకః । | (అరణ్య - 47-10) |
| 10. | గ :- | తతః పరమ సంతుష్టో<br>హనుమాన్ ప్లవగర్షభః । | (కిష్కింద - 4-3) |
| 11. | దే :- | నరేంద్ర సూనుర్నర దేవ పుత్రం<br>రామానుజః పూర్వజమిత్యువాచ । | (కిష్కింధ - 31-1) |
| 12. | వ :- | తతో రావణ నీతాయాః<br>సీతాయా శ్శత్రుకర్శనః । | (సుందర - 1-1) |
| 13. | స్య :- | తతస్తస్య నగ స్యాగ్రే<br>హ్యాకాశస్థస్య దన్తినః । | (సుందర - 27-14) |

14. ధీ :- నావమాన్యో భవద్భిశ్చ
హరిర్ధీర పరాక్రమః । (సుందర - 46-9)

15. మ :- శ్రుత్వా హనుమతో వాక్యం
యథావదభి భాషితమ్ । (యుద్ధ - 1-1)

16. హి :- రక్షోగణపరిక్షిప్తో
రాజా హ్యేష విభీషణః । (యుద్ధ - 28-27)

17. ధి :- ప్రదర్శనం చ బుద్ధిశ్చ
స్మృతిశ్చ ద్విగుణా తయోః । (యుద్ధ - 50-40)

18. యో :- రాక్షసా రాక్షసేంద్రాయ
రాక్షసాయ న్యవేదయన్ । (యుద్ధ - 66-1)

19. యో :- విజ్ఞాయ తు మనస్తస్య
రాఘవస్య మహాత్మనః । (యుద్ధ - 81-1)

20. న :- మరణానాని వైరాణి
నివృత్తం నః ప్రయోజనమ్ । (యుద్ధ - 112-26)

21. ప్ర :- ప్రాప్తరాజ్యస్య రామస్య
రాక్షసానాం వధే కృతే । (ఉత్తర - 1-1)

22. చో :- తతః ప్ర చోదయన్సూతః
తానశ్వాన్ రుధిర ప్రభాన్ । (ఉత్తర - 2-28)

23. ద :- తత్రైనాం విజనేదేశే
విసృజ్య రఘునందన (ఉత్తర - 45-18)

24. యా (త్) బ్రాహ్మణస్య తు ధర్మేణ
త్వయా జీవాపిత స్సుతః (ఉత్తర - 76-27)

**శ్రీమద్రామాయణపు చివరి శ్లోకం :**

తత స్సమాగతాన్ సర్వాన్
స్థాప్య లోకగురు ర్దివి ।
జగామ త్రిదశై స్సార్ధం
సదా హృష్టైర్దివం మహత్ । (ఉత్తర - 110-28)

**శ్రీమద్రామాయణ ఫలశ్రుతి చివరి శ్లోకం :**

ఏవమేతత్పురావృత్త
మాఖ్యానం భద్రమస్తు వః ।
ప్రవ్యాహరత విస్రబ్ధం
బలం విష్ణోః ప్రవర్ధతామ్ । (ఉత్తర 111-26)

## మీరు ఈ గ్రంథాన్ని ఏ దృష్టితో చదువదలిచారు?

**1. ఆధ్యాత్మిక దృష్టిలోనా?**

అయితే

(i) ఎందఱో పారాయణచేసి ఆత్మహత్యలని విరమించుకొన్నారు.

(ii) అనేక విజయాలని (వివాహం - ఉద్యోగం వంటివి) పొందారు.

(iii) మానసిక ప్రశాంతీ, శరీరారోగ్యమూ పొందారు.

**ఇలాంటివి ఎన్నో పొందడానికి చదవండి.**

**2. హేతువాద దృష్టిలోనా?**

అయితే

(i) రాముడు చెప్పని 'లంకానాశనం' పనిని చేసిన ఆంజనేయుడు 'రామబంటు' ఎలా ఔతాడు?

(ii) రామలక్ష్మణులతొడలని గూర్చి సీతమ్మ చెప్పమంటే ఆంజనేయుడు చెప్పడం అనౌచిత్యం కాదా?

(iii) 10 తలలతో 20చేతులతో 'రావణుడు' అనేవాడు అసలు ఉంటాడా? వంటి వెన్నో ... **వీటికి సమాధానాన్ని పొందడానికి చదవండి.**

**3. భాషా విజ్ఞానాభివృద్ధి దృష్టిలోనా?**

అయితే

(i) తృణమంతరతః కృత్వా ... అనే గడ్డిపోచ శ్లోకానికి 15 అర్థాలూ

(ii) బభూవ బుద్ధిస్తు ..... అనే శ్లోకానికి గల 9 అర్థాలూ

(iii) కలలు ఎలా ఉంటాయి? ఎన్ని విధాలు? నమ్మవచ్చా? వంటివి ఎన్నో.... **వీటని తెలిసికోవడానికి చదవండి.**

**4. అంతరార్థ దృష్టిలోనా?**

అయితే

తప్పక చదవండి. కథ తెలియనిది ఎవరికి? **అంతరార్థం తెలియాలి.** విశేషాంశాలలో ఆ అంతరార్థమే వివరింపబడింది.

# ఉత్తర కాండ

శ్రీమద్

వాల్మీకి రామాయణాయనమ్

# ఉత్తర కాండము

సంస్కృతంలోని వాల్మీకి రామాయణానికి సరియైన
(కథ మఱియు అంతరార్థంతో)

: రచన :

రామాయణ ప్రవచన సుధాకర
రామాయణ సుధానిధి '
' భాషాప్రవీణ '

డాక్టర్. మైలవరపు శ్రీనివాసరా
ఎం.ఏ., (తెలుగు) ఎం.ఏ., (సంస్కృతము) పిహెచ్.డి.,

## విషయ సూచిక


1. ముందుమాట : i - iii
2. గ్రంథకర్త గురించి : iv
3. అభివాదనలూ - అభినందనలూ : v
4. గ్రంథకర్త్రు దంపతుల ఫోటో : vi
5. మనలో మన మాట : vii
6. గ్రంథ ముద్రాపయిత్రి ఫోటో : viii
7. గ్రంథంలోనికి వెళ్లబోయేముందు నాలుగు పరిచయ వాక్యాలు......... 1
8. శ్రీమద్రామాయణం ఇప్పటికి ఎంతవఱకూ అయ్యింది?.................... 1
9. జరిగిన కథ తెలిసాక క్లుప్తంగా అంతరార్థం విందాం..........................3
10. వాల్మీకి ఉత్తరకాండని వ్రాయలేదంటారు. నిజమేనా?..........................5
11. 'ఉత్తరకాండ' అనే పేరులోని విశేషం..........................................7

### ఉత్తరకాండ కథా ప్రారంభము

ఎంతపని చేసావు రామా!..........................................................9
శ్రీమద్రామాయణంలో స్త్రీకే ప్రాధాన్యం..........................................13
రామా! రావణుని కంటె ఇంద్రజిత్తుని చంపడం గొప్ప సుమా!.......16
యక్ష - రాక్షసుల ఉత్పత్తి...........................................................19
రావణాదుల పుట్టుక - లో రహస్యం.........................................21&22
రావణాదులకు వరాలు................................................................24
రావణ దుశ్చేష్టితాలు...................................................................29
రావణునికి శాపపరంపర...............................................................30
వేదవతీశాపం............................................................................33
యుద్ధం కంటె లోకక్షేమం ముఖ్యం................................................34
దాశరథి నిన్ను చంపుతాడు జాగ్రత్త!............................................ 36
'ఉత్తరకాండ' అనేది ఇందుకే!...................................................... 36
నారదుని(అ)హితబోధ - లో రహస్యం............................................37
రావణుణ్ణి చంపినా తప్పే! చంపకున్నా తప్పే!!................................40
మృత్యువుతో చేతులు కలుపుకోండి!!...........................................42
పతివ్రతాస్త్రీల శాపం...................................................................45
పూజించవద్దు! తపస్సు చెయ్యి!!...................................................47
నా భర్తని చంపవద్దు!.................................................................49
లో విశేషం..............................................................................50
నలకూబర శాపం - అంతరార్థం....................................................54
రావణునికంటె ఇంద్రజిత్తే గొప్పవాడు..........................................58
ఇంద్రుడే ఓడిపోవడమా? ఎందుకని?............................................61
లో విశేషాలు...........................................................................62
వాడు నాపుత్రుడు. నామీది గౌరవంతో విడిచిపెట్టు!........................64
ఇది లోకసహజమా?....................................................................65
పశువుని పట్టుకొన్నట్లు పట్టి తిప్పావుగా! నీ బలం ఎంతది?.............68
లో విశేషం..............................................................................69

'ఆంజనేయుడే లేకపోతే నేనే లేను.' రాముడు.....71
హనుమంతుణ్ణి గూర్చి విను!.....74
లో విశేషాలు.....77
కృతజ్ఞతలూ - బహుమానాలూ.....81
హనుమంతుని చివరి కోరిక.....86
రేపే పంపిస్తాను! నిశ్చింతగా ఉండు!!.....89
భద్రుడు చెప్పిన నిందలు.....
యథా రాజా తథా ప్రజాః..... 90
లో విశేషం.....92
తల్లీ! అదిగో వాల్మీకి ఆశ్రమం! వెళ్లి వస్తాను.....101
లక్ష్మణా! గర్భవతినని గమనించి చెప్పుసుమా!.....102
లో విశేషం.....104
లక్ష్మణా దుఃఖపడకు! ఈ రహస్యం నాకు తెలుసు!!.....108
లో విశేషాలు.....110
వెంటనే ఫలించిన సుమంత్రుని వైద్యం.....115
ఊసరవెల్లి రాజుకథ మఱువకు!.....116
లక్ష్మణా! జ్ఞానం గొప్పదే అయినా కర్మ ముఖ్యం సుమా!!.....118
లక్ష్మణా! రాజుకి కోపం తగదు!!.....120
అన్న ఉండగా తమ్మునికి పట్టాభిషేకం.....122
కల్మాషపాదుడు.....
కుశీలవ జననం..... 125
శంబుక వధ - పై కథ.....127
లో విశేషం.....129
ఎప్పుడూ దానం చేయలేదు గదా! నీ గతి యింతే!!.....139
అశ్వమేధాన్ని చేస్తే బాగుంటుందేమో?.....143
అశ్వమేధయాగం - కుశీలవ గానం.....147
సీతా ప్రతిజ్ఞనాటి సభ ఎలా ఉంది?.....149
లో విశేషం.....152
శ్రీమద్రామాయణ శేషం.....158
లక్ష్మణునికి మరణశిక్ష!.....159
చివరి ఘడియలు.....162
శ్రీమద్రామాయణ ఫలశ్రుతి.....166
గాయత్రీ బీజాక్షరాలున్న శ్రీమద్రామాయణ శ్లోకాలు.....167

శ్రీశివాయనమః

## ముందుమాట

**(ఈ గ్రంథాన్ని ముద్రింపిస్తున్న కందికుప్ప (బుర్రా) సీతమ్మ గారిని గూర్చి . . .)**

**"తేషాం వాసః త్రివిష్టపే"**
**(. . . అలాటి వారు స్వర్గంలోనే ఉంటారు)**

ప్లవనామ సంవత్సర భాద్రపదంలో (సెప్టెంబరులో) (1904) బరంపురంలో బుర్రా సూర్యనారాయణగారికి సీతమ్మగారు జన్మించారు.

'మాతర మంగనాః'. తల్లివైపు లక్షణాలు పుత్రికకి లభిస్తాయట. ఖల్లికోట ఆస్థానంలో తెలుగుకవులుగా ప్రసిద్ధులైన తల్లివంశపు సంస్కారం నిండిన ఈమె, శివమహిమ్నస్తోత్రానికి భాష్యాన్ని వ్రాసి ప్రచురించిన కందికుప్ప వంశంలోని కందికుప్ప సాంబశివరావుగారికి అర్ధాంగి అయ్యారు.

వర్షమూ చినుకూలాగా, మంచూ చల్లదనమూలాగా,
కాంతీ వేడిమిలాగా, గాలీ పరిమళమూలాగా

'సంపృక్తమైన' వారిదాంపత్యం ఆదర్శప్రాయమై ఉభయ వంశాలనీ ఆనందింపచేసింది.

అయితే 1, 2, 4, వయసుల పిల్లలు ముగ్గురినీ ఆమె క్రమక్రమంగా కోల్పోయారు. కనీసం మూడుపదులవయసు కూడా ఆమెకు రాకుండానే శ్రీముఖనామ సంవత్సరంలో (1933) ఆ పరమాత్మ ఆమె భర్త సాంబశివరావుగారిని తన పరమపదసన్నిధికి తీసికొనిపోయాడు. ఆమెకు ఈ జీవితంలో అప్పటికి మిగిలినది ఆ సాంబశివుని మూడునేత్రాల్లా 6, 4, 2 వయసుల ముగ్గురు పిల్లలే.

'జ్యేష్ఠః పితృసమో మతః' తండ్రి పిమ్మట పెద్దన్నయే తండ్రి వంటివాడట. ఈ కష్టదశలో ఆమెకు కొండంత సహాయంగా నిలబడి, మనసుకి ధైర్యాన్ని చెప్పి, మాటకు మాట తోడుగా నిలబడి ఆ తల్లిచెట్టుకీ, మూడు చిగురుటాకులకీ ఎండ తగిలి వాడిపోకుండా ప్రాణపదంగా పెంచిపెద్దచేసిన పితృతుల్యుడు. ఆమె అన్న సర్వేశ్వరరావుగారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండలోని కందికుప్పవారివీధి ఇంట్లోనే ఎక్కువ కాలం ఆమె ఉన్నారు.

ఒక ప్రక్క ఆ కాలపు సంప్రదాయాలూ, మఱొకప్రక్క అకాలపు వైధవ్యమూ, ఇంకొక ప్రక్క దుర్భర మానసిక వేదనా, ఇక చిన్నవయసు కారణంగా తల్లిగా బాధ్యతని నెరవేర్చడంలోని కష్టమూ - లతో ఉన్న ఆమెకు, ఆ సాంబశివుని ఫాలనేత్రంలా (నుదుటికన్ను) ఉన్న జ్యేష్ఠపుత్రుడు చి. తిరుపతిరావు పార్థివ సంవత్సరం (1945) లో కన్నుమూసాడు.

కష్టంమీద కష్టం కల్గిన ఆమె ఇక దుఃఖసాగరంలో ఒక్కమాఱు పూర్తిగా మునిగి, పైకిలేచి, ఒక్కొక్క అడుగూ ఒడ్డువైపుకి ఎలా వేయగలనా? అని ఆలోచించి తన మనసుని తప్పనిసరిగా ఆధ్యాత్మిక దృష్టితో పరమాత్మవైపుకి మళ్లించారు.

అధ్యాత్మరామాయణ కీర్తనలని శ్రావ్యంగా గానం చేస్తూ, యోగవాసిష్ఠాన్ని పారాయణం చేస్తూ, భారత - భాగవత - రామాయణాలని మననం చేస్తూ, భగవద్గీతని అనుసరిస్తూ . మరణానికి 15 రోజుల ముందు వఱకూ కూడా సంవత్సరానికి 40 రోజుల ఉపవాసాలు చేస్తూ, గృహిణిగా పిల్లలని పెద్దవారిని చేస్తూ, ఆ మిగిలిన ఇద్దరినీ ఉన్నత విద్యా సంస్కార వంతులని చేసి, ఇహలోకపు తన బరువు బాధ్యతలని సక్రమంగా నిర్వర్తించి ఆ పుణ్యశీల తన భర్త సన్నిధికి ప్రభవ కార్తీకంలో (27-11-87) అంటే ఈ గ్రంథావిష్కరణం జరుగుతూన్న ఇదే రోజున, కాకపోతే 7 సంవత్సరాల క్రితం ఉత్తర లోకాలకి వెళ్లిపోయారు.

ఆర్తా విషణ్ణా శ్శిథిలా శ్చ భీతా ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః।
సంకీర్త్య నారాయణ శబ్దమాత్రం విముక్తదుఃఖా స్సుఖినో భవంతి॥

జీవితంలో ఇహలోక కష్టాలని అనుభవిస్తూఉన్నవారు నోరువిప్పి, మనసు తెఱచి 'నారాయణా'! అని అంటే తప్పక తరిస్తారని శ్రీవిష్ణుసహస్రనామంలో వ్యాసమహర్షి అన్నాడు. అయితే సీతమ్మగారు మెండు బాధతో, గుండెనిండుగా ఎన్నెన్నో పర్యాయాలు నారాయణ నామాన్ని మననం చేసారు. అలా చేస్తూనే జీవితంలో తనకు తాను ధైర్యం చెప్పుకుంటూ వచ్చారు.

అంతకాలే చ మా మేవ స్మర న్ముక్త్వా కలేబరమ్।
యః ప్రయాతి స మద్భావం యాతి నా స్త్యత్ర సంశయః॥

మరణకాలంలో ఎవరైతే పరమాత్మ స్మరణాన్ని చేస్తారో, వారు పరమాత్మలో లీనమౌతారని (ఆమె నిత్యం చదివే భగవద్గీతలో) పరమాత్మే స్వయంగా అన్నాడు. సీతమ్మగారు తన మరణదశలో 'నారాయణమూర్తీ! తండ్రీ!' అంటూనే వెళ్లిపోయారు.

*కాబట్టి నిస్సందేహంగా ఆమె స్వర్గంలోనే ఇప్పుడు ఉన్నారు.*

'నారాః ఆపః స్థానం అయనం యస్య సః' అని నారాయణ శబ్దానికి అర్థం. (జ్ఞానాన్నే) నీళ్లనే తన ఇల్లుగా చేసికొని ఎప్పుడూ ఎవరుంటారో, అతడు నారాయణుడని భావం. ప్రతి వ్యక్తికీ మరణానంతరం చన్నీటి స్నానాన్ని మంత్రపూర్వకంగా చేయించేది కూడా, ఆ వ్యక్తి శ్రీమహావిష్ణు సదనానికి వెళ్లాడనీ, వెళ్లాలనీను. అయితే ఆధ్యాత్మిక గ్రంథాల జ్ఞానం ఆమెకు బాగా ఉండడంతో, అవసాన స్థితిలో కూడా సంపూర్ణ స్పృహతో ఉండి, మహావిష్ణు స్థానమైన చన్నీటినే స్నానంగా కావాలని కోరి, స్నానం ముగియగానే (విష్ణునికేతనానికి వెళ్లడం వలన) నారాయణ స్మరణంతోనే ఆమె శరీరాన్ని త్యజించారు.

*కాబట్టి నిస్సందేహంగా ఆమె స్వర్గంలోనే ఇప్పుడు ఉన్నారు.*

నేటికి సరిగా ఆమె శరీరాన్ని విడిచి 7 సంవత్సరాలు. ఈ ముద్రింపిస్తూన్న కాండ శ్రీమద్రామాయణంలో 7 వ కాండ. భక్తులయిన ఎందఱో అయోధ్యా ప్రజలకి కూడ రాముడు స్వర్గాన్నిచ్చిన ఉత్తరకాండ ఇది. అదికూడ సరయూనదీ జలాలలో స్నానమూ తనలో లీనమూ ద్వారా ప్రసాదించాడు రామచంద్రుడు. పైగా తన జీవితంలో ఆమె పోయేనాటికి $11/1987 - 9/1904 = 999$ మాసాలుకాగా, సరిగా సీతమ్మగారు 999 శుద్ధ విదియ చంద్రుళ్లని చూచారు. 'సహస్ర చంద్రదర్శనం'

సమయానికి సహస్ర శీర్షుడూ, సహస్రాక్షుడూ, సహస్రపాదుడూ అయిన శ్రీమహావిష్ణు రూపుడు ఆ రామ'చంద్రుడే' ఆమెని తీసికొనిపోయి తన దర్శనభాగ్యాన్ని ఇచ్చాడు.

*కాబట్టి నిస్సందేహంగా ఆమె స్వర్గంలోనే ఇప్పుడు ఉన్నారు.*

భక్త్యా రామస్య యే చేమాం సంహితా మృషిణా కృతామ్।
లేఖయంతీహ చ నరాః తేషాం వాసః త్రివిష్టపే ॥

రామచంద్రునికి అతి వైభవంగా జరిగిన పట్టాభిషేకాన్ని వర్ణించిన వాల్మీకి, ఈ శ్లోకాన్ని ఆ చిట్టచివర వ్రాసాడు. 'రామచంద్రుని కథని ఎవరు ఇష్టంగా వ్రాయిస్తారో వారికి స్వర్గమే నివాస స్థానంగా ఉంటుంది' అని దీని అర్థం. సీతమ్మగారు నా చేత చేయించినది ఈ పనినే కదా!

*కాబట్టి నిస్సందేహంగా ఆమె స్వర్గంలోనే ఇప్పుడు ఉన్నారు.*

ఈ నాలుగు కారణాలని బట్టీ, శ్రీమహావిష్ణువు సీతమ్మగారిని తన నాలుగుచేతులనీ అందించి స్వర్గానికి తీసికొనిపోయాడనేది నిస్సంశయమని మనసు పలికిన యథార్థాన్ని వ్రాస్తున్నాను.

'పుస్తకం ప్రచురిస్తున్న వారిని గూర్చి ఇలా వ్రాయకపోతే ఎలా? అందుకని వ్రాసి ఉంటారు' అని ఎవరైనా భావిస్తే, పై వ్రాసిన కారణాలన్నీ మహర్షులూ సాక్షాత్తు నారాయణుడూ చెప్పిన గ్రంథాలలోనివేనని మనవి చేస్తున్నాను. ఇదే అసత్యమైన పక్షంలో ఋషుల మాటలూ, నారాయణుని మాటలు అసత్యమైపోవా?

లోకంలో ఎన్నెన్ని స్థలాలో ఉన్నా కొన్నిచోటులే 'దేవాలయాలు' అయ్యాయి. లోకంలో ఎన్నెన్నో రాళ్లు ఉన్నా కొన్ని మాత్రమే మంత్ర - యంత్ర పూతాలై 'విగ్రహాలు' గా పూజల నందుకొంటున్నాయి. అలాగే లోకంలో ఎందరెందరికో సంపద ఉన్నా, కొందరి సంపద మాత్రమే ఇలాటి పుణ్యకార్యాలకి వినియోగింపబడడం, ఆ సొమ్ము నార్జించిన వారి అదృష్ట పుణ్య విశేషమే. "ఈ పని వీరి వలననే కావాలి" అనే ఒక భగవదాజ్ఞకి అనుగుణంగా ఈ గ్రంథాన్ని ముద్రింపిస్తున్న కీర్తిశేషురాలు ఈ సీతమ్మగారు ప్రతిఫలంగా మనఃపూర్వక కృతజ్ఞతలని కూడ స్వీకరించడంలేదు.

*కాబట్టి నిస్సందేహంగా ఆమె స్వర్గంలోనే ఇప్పుడు ఉన్నారని* పల్కుతూ ఆంజనేయుని పాద పద్మాలకు మోకరిల్లుతున్నాను.

**తేషాం వాసః త్రివిష్టపే.**

భావ కార్తీక బహుల నవమి,
ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణము,
క్రొత్తపేట, గుంటూరు (ఆం.ప్ర.) 27-11-1994.

ఇట్లు
*డాక్టర్. మైలవరపు శ్రీనివాసరావు.*
(గ్రంథకర్త)

తన రామచంద్రుని గ్రంథాన్ని ప్రచురింపచేస్తూన్నందుకు ఆంజనేయుడూ, తాను గతించినప్పటికీ తన కోరికని తీరుస్తూనే ఉన్నందుకు సీతమ్మగారూ, శ్రీ కందికుప్ప రమణమూర్తిగారిని అనుగ్రహిస్తూనే ఉంటారు. లాంఛనప్రాయమే అని తెలిసినా అనుగ్రహానికై నేనూ ప్రార్థిస్తున్నాను.

## గ్రంథకర్త గురించి

జన్మస్థలం : పశ్చిమగోదావరి జిల్లా గంగన్నగూడెం.
స్వస్థలం : ఒకప్పుడు చెఱుకుగనుమ అగ్రహారం.
(చిలకంపాడు) ప.గో.జిల్లా.

విద్య :
ఆంధ్రగీర్వాణవిద్యాపీఠం కొవ్వూరులో భాషాప్రవీణ, పి.ఓ.ఎల్., ఆంధ్రవిశ్వవిద్యాలయ ఎం.ఏ., తెలుగు, ఎం.ఏ., సంస్కృతము, అహోబలపండితుని వ్యాఖ్యపై పరిశోధన చేసి పిహెచ్.డి., పట్టం.

ఉద్యోగాలు :
చిననిండ్రకొలను (ప.గో.జిల్లా) సంస్కృత కళాశాలలో 1970 నుండి తెలుగులెక్చరర్‌గానూ, 1976 నుండి తెనాలి సంస్కృత కళాశాలకు ప్రిన్సిపాల్‌గానూ.

i) నాగార్జున మఱియు ఆంధ్రవిశ్వవిద్యాలయం ఒకప్పటి సెనెట్ అకడమిక్ కౌన్సిల్ మెంబరుగానూ.

ii) ప్రస్తుత నాగార్జున విశ్వవిద్యాలయపు ఓరియంటల్ కళాశాలల డీన్ మఱియు ఓరియంటల్ లాంగ్వేజెస్ స్టడీస్ బోర్డు ఛైర్మన్‌గానూ.

రచనలు : i) బాల ప్రౌఢ వ్యాకరణ కరదీపిక
ii) Proficiency in Oriental Learning (English)
శ్రీమద్రామాయణాయనమ్
iii) బాలకాండము iv) సుందరకాండము v) ఉత్తరకాండము
vi) మాంగల్య తంతునానేన (వివాహ మంత్రాలకి వ్యావహారిక తెలుగు భాషలో అర్థంతో పాటు విశేషాంశాలూ)

ముద్రణలో : శ్రీమద్రామాయణాయనమ్
i) అయోధ్యాకాండము ii) ఆరణ్యకాండము
iii) శ్రీమద్భాగవతమూ - అంతరార్థ సౌందర్యమూ
iv) శ్రీ విష్ణు సహస్రనామాలూ - అంతరార్థమూ

ఉదారులైన దాతలకై ఎదురు చూస్తున్నవి :
i) పండుగలూ - అంతరార్థమూ - కర్తవ్యమూ
ii) శ్రీమద్రామాయణాయనమ్
i) బాలకాండ (2 వ ముద్రణ) ii) కిష్కింధ - యుద్ధ కాండలు

ఇతర విశేషాలు క్లుప్తంగా :

i) ఆకాశవాణి విజయవాడకేంద్రం నుండి గత 19 ఏండ్లుగా సంస్కృత పాఠాలు, సూక్తిసుధ, అమరవాణి కార్యక్రమ నిర్వాహకులు.

ii) భద్రాచల శ్రీరామచంద్రుని ఆకాశవాణి వ్యాఖ్యాతలలో ఒకరు.

iii) పుష్పగిరి పీఠాధిపతులచే 'రామాయణ ప్రవచన సుధాకర' బిరుదగ్రహీత. గుంటూరు శ్రీమాన్ కోగంటి సీతారామాచార్యుల వారి ఆధ్యక్ష్యంలో ఆనందతీర్థఅగ్రహార ప్రవచనకాలంలో 'రామాయణ సుధానిధి' బిరుద గ్రహీత.

iv) వాల్మీకి జయంతి - వినాయక చవితి పూజామంత్ర వ్యాఖ్యానం - సరదాలూ - సౌరభాలూ మొదలైన దూరదర్శన్ (హైదరాబాదు) అనేక కార్యక్రమాల రచయిత మరియు నిర్వాహకులు.

v) దాదాపు శ్రీమద్రామాయణంపై రెండువేల ఉపన్యాసాలు చేసారు.

జీవిత వాంఛ :

i) నేడు విచ్చల విడిగా లభిస్తూ ప్రజలచేత చదువబడే నవలల్లా, శ్రీమద్రామాయణ భారత భాగవతాలు అదే ప్రజలచేత చదువబడే రోజులని చూడాలని.

ii) శ్రీమద్రామాయణాన్ని మొత్తాన్ని ఈ వచన ధోరణిలోనే ఈ జన్మకు పూర్తిచేసి ఋణాన్ని తొలగించుకోవాలని.

## అభివాదనలూ - అభినందనలూ

నాలుగు అక్షరాలు ఒంటబట్టే శరీరాన్నిచ్చి నా యోగక్షేమాలే వారి భోగభాగ్యాలుగా జీవించి అకాలఆకస్మికమరణాన్ని పొంది, దివి నుండి కూడ నిత్యం నన్ను ఆశీర్వదిస్తూ అనునిత్యం నాకు అభయాన్ని ప్రసాదించే పూజ్యాలు నా తల్లిదండ్రులు కీ.శే. బ్రహ్మశ్రీ సీతారామమ్మ చంద్రశేఖరరావు దంపతులకు శాశ్వత సాష్టాంగ ప్రణామములు. నాకు విద్యాభిక్ష పెట్టిన గురువులు సర్వబ్రహ్మశ్రీ కర్రి శ్రీరామమూర్తి శాస్త్రి, కలగ వేంకట సుబ్బారాయడు, రావూరి వేంకటేశ్వర్లు, లక్ష్మణ యతీంద్రుల వారికీ, ఆజీవనవిద్యాప్రదాత, నా విద్యాజీవితానికి సార్థకత చేకూర్చిన ప్రొఫెసర్. వేలూరి సుబ్బారావు పెదమామగారికీ, అనునిత్యం నా మనసులో మెదిలే నిష్కపటులు మా మామ వేలూరి బ్రహ్మానందం గారికీ, గుంటూరు ఓంకార క్షేత్ర గాయత్రీమాతకూ, వాత్సల్యంతో చూచే మా అన్నగారు బ్రహ్మశ్రీ మైలవరపు ఆంజనేయశాస్త్రి గారికీ నా సాష్టాంగ ప్రణామాలు.

ప్రతిపర్యాయమూ నేను ఆయా ప్రెస్సుల వారివెంట పడడం ఆనవాయితీగా ఉంటే, ఈ సారి తాము నా వెంటపడి తొందరగా ముద్రించి ఇచ్చిన ప్రభల హైటెక్ కంప్యూటర్స్ ఉద్యోగులు i) చురుకుకి కూడా చురుకుదనాన్ని నేర్పే శ్రీ కె.వి. జితేంద్రగారికీ ii) ఓర్పుకు కూడా విసుగు వచ్చేంత సహనం కలిగిన కురుగంటి పద్మవల్లి గారికీ, శ్రీ చోడవరపు దుర్గాప్రసాద్ గారికీ, ఇలాంటి వారిని ఎన్నుకున్న అధినేత కిశోర్ ప్రభల గారికీ నా సాధువాదాలు.

లోకంలో శ్రీమద్రామాయణ వ్యాప్తికై తమ సంపదలో వాల్మీకికి కొంతని వెచ్చించి ఋషిఋణాన్నీ, ఇటు మాతృఋణాన్నీ తీర్చుకుంటున్న శ్రీయుతులు కందికుప్ప రమణమూర్తిగారికి నా హృత్పూర్వక నమస్కారాలని సమర్పిస్తూ ఆంజనేయుడు సకల శ్రేయస్సు భాగ్యాలతో నిత్యమనశ్శాంతిని వారికి ప్రసాదించవలసినదిగా ప్రార్థిస్తూ ఆంజనేయుని మ్రోల సాష్టాంగ పడుతున్నాను.

భావకార్తీక బహుల నవమి, ఇట్లు,

27-11-94. మైలవరపు శ్రీనివాసరావు

(ఆంగీరస బార్హస్పత్య భారద్వాజ త్రయార్షేయ ప్రవరాన్విత భారద్వాజ సగోత్రుడు, ఆపస్తంబసూత్రుడు, యజుర్వేది, తైత్తిరియశాఖాధ్యాయి) - గ్రంథకర్త.

శ్రీ శివాయ నమః

## మనలో మన మాట

ప్రత్యక్షంగా వారివద్ద చదువుకోనకపోయినా, మహర్షుల అక్షరాలలో క్షరంకాని తనాన్ని ఎల్లప్పుడూ గమనించే ప్రొఫెసర్ శలాక రఘునాథ శర్మగారిని పాదాభివందన పురస్సరంగా అనునిత్యమూ గురువుగా నేను ఆరాధిస్తుంటాను. ప్రస్తావవశంగా "Lt.col. కందికుప్ప రమణమూర్తిగారు సహృదయులూ, పరమయోగ్యులూను. మీ పుస్తకాలని వారి పరిశీలనకి పంపండి" అన్నారు. చదివే వారికి పంపడం కంటె ఆనందం ఏముంది? పంపాను. ఎంతో శ్రద్ధతో శ్రీ మూర్తిగారు చదివి వారి సూచనలనీ, సలహాలనీ...... వివరంగా వ్రాస్తూ ఫలాని వారికి కూడా పంపవలసిందని కొన్ని చిరునామాలని వ్రాసి చెక్కుకూడా పంపారు. ఇలా రెండు మూడు పర్యాయాలు వారిచ్చిన ఆయా చిరునామాలకి పుస్తకాలు పంపుతూ వచ్చాను. ఒకరోజున వారే వ్రాసారు. 'మా తల్లి సీతమ్మగారి పేరిట ఉత్తరకాండాన్ని మీరు వ్రాస్తే నేను ప్రచురించదలచానని.' ఆశ్చర్యం ఆనందం కల్గాయి. వెంటనే వ్రాయ ప్రారంభించాను. 27-11-87 ఆమె పరలోక ప్రయాణతిథి కాబట్టి అనాడు ఆవిష్కరించదలచాననీ వ్రాసాను. సంతోషంగా వారు అంగీకరించారు.

ఇప్పటివఱకూ వారిని నేను చూచి ఉండలేదు. కనీసం ఫోనులో మాటాడి ఎఱుగను. ఒక్కసారైనా ఫోనులో పల్కరింపదలిస్తే ఎందుకో ఎన్నిమాఱులకీ ఆయన లభించలేదు. ఇటు ఉత్తరం అటు వెళ్లి సమాధానం రావాలంటే అతి త్వరగా అయితే 10 రోజులు, మామూలుగా అయితే పక్షం పట్టేది. అలా నడిచిన గ్రంథమే ఇది.

'మీ గురించి రెండు వాక్యాలు వ్రాయదలిచాను. దయతో వ్రాయండి' అని వారికి వ్రాసాను. వారినుండి సమాధానం వచ్చింది. ఇదిగో వారి ఉత్తరం.

"తొగడ నా గురించి వ్రాయవద్దని వ్రాసినా ఒకరు ఒకసారి నన్నుగూర్చి వాకబు చేసి మరీ వ్రాయడం జరిగింది. చాల బాధపడ్డాను. నా కిష్టమైన పద్యం

"కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే?
వారేరీ? సిరి మూటగట్టుకొని పోవం జాలిరే? ఉర్విపై
బేరైనం గలదే? శిబి ప్రముఖులున్ బ్రీతిన్ యశః కాములై
యీరే కోర్కులు వారలన్ మఱచిరే యెక్కాలమున్ భార్గవా?"

నా కిష్టమైన ఉపనిషన్మంత్రం - (కొద్ది తాఱుమాఱు చేయాలనుకోండి!)

"మా గృధః కస్యస్విద్ధనం - కుర్వన్నేవేహ కర్మాణి" (ఒప్పగించిన పనిని చేస్తూనే వెళ్లిపో! ఎవరి నుండీ ప్రతిఫలాన్ని ఆశించకు).

మీరు మఱెవరికీ మాట ఇచ్చి ఉండకపోతే శ్రీమద్రామాయణాం మఱోకాండని నా చిరంజీవి అమరుడు కీ.శే. సాయి పేరిట వ్రాయండి."

ఇదీ వారి ఉత్తరం. ఈ ఉత్తమ సంస్కారం వారి తల్లిదండ్రుల నుండి వచ్చింది. సరైన తీరులో మాతృ - ఋషి ఋణాన్ని తీర్చుకునే వీరిని గూర్చి ఏమని వ్రాయను? ఏమని వ్రాసినా వారికది నచ్చనిదని వ్రాసాను (రు) గదా! ఈ వాక్యాలని బట్టి ఎవరి సద్బుద్ధికి ఎంత అందితే అంత ఆలోచించుకోవలసిందని మాత్రమే వ్రాస్తూ ఆంజనేయునికి సాష్టాంగపడుతున్నాను. పరమేశ్వరానుగ్రహ ప్రాప్తి ర్భూయాత్.

భావ కార్తీక బహుల నవమి,
27-11-1994. గుంటూరు.

ఇట్లు,
డాక్టర్. మైలవరపు శ్రీనివాసరావు.

శ్రీ శివాయనమః

# ఉత్తర కాండము

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే।
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః।।
కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్।
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలమ్।।

ॐ

కథలోనికి వెళ్లబోయే ముందు
నాలుగు పరిచయ వాక్యాలు

## శ్రీమద్ వాల్మీకి రామాయణం ఇప్పటికి ఎంతవఱకూ అయ్యింది?

ఇరవై నాల్గువేల శ్లోకాలతో వాల్మీకి మహర్షి వ్రాయదలచిన శ్రీమద్ రామాయణంలో ఇరవైవేల శ్లోకాల భాగం కథ ఇప్పటికి అయింది. ఇక నాల్గువేల శ్లోకాల గ్రంథ భాగం (20,001 శ్లోకం నుండి 24,000వ శ్లోకం వఱకూ) 'ఉత్తరకాండం' పేరిట మిగిలి ఉంది. అదే మనం చదవబోయేది.

ఈ ఉత్తరకాండని చదవబోయే ముందు ఇప్పటివఱకూ అయిన ఇరవైవేల శ్లోకాల భాగంలోనూ ఏ కాండలున్నాయో ఎంత కథ ఏయే కాండలో అయిందో క్లుప్తంగా తెలిసికోవడంతోపాటు, మీది కథాభాగాన్ని తెలిసికొని సూక్ష్మంగా అంతరార్థాన్ని ఆమీదట తెలిసికోవడం, కనీస ధర్మం కదా!

మొదటికాండం పేరు బాలకాండం. శ్రీమహావిష్ణువు రావణుణ్ణి చంపాలనే ఆలోచనతో దశరథునికి పుత్రునిగా పుట్టాలని అనుకోవడం. దానికి అనుకూలంగా ఋషులంతా అశ్వమేధ - పుత్రకామేష్టి యాగాలను చేయించడం, శ్రీమహావిష్ణువు రావణ - ఇంద్రజిత్ - కుంభకర్ణ - లవణ అనే పేరులు గల నల్గురు రాక్షసులని చంపడం కోసం రామ - లక్ష్మణ - భరత - శత్రుఘ్నులనే పేఱిట నల్గురిగా జన్మించడం, ............ ఇలా ఇలా కథసాగి ఈ నల్గురికీ సీత - ఊర్మిళ - మాండవి - శ్రుతకీర్తి అనేవారితో పెండ్లిండ్లు జరిగి అంతా సుఖంగా అయోధ్యకి తిరిగి రావడం-తో బాలకాండ కథ పూర్తవుతుంది.

మంథర ప్రోత్సహించిన కారణంగా కైకమ్మ వరాలని అడగడంతో ప్రారంభమై రామచంద్రుని పాదుకలకి రాజ్యపట్టాభిషేకం చేయడం-తో రెండవదైన అయోధ్యాకాండ పూర్తవుతుంది.

మహర్షులందఱి ఆశ్రమాలకీ రాముడు, తన సీతా లక్ష్మణులతో కలిసి వెళ్లి వారి ఆశీర్వాదాలనీ తపశ్శక్తినీ పొందడం...... సీతమ్మని కోల్పోవడం, ఆ దుఃఖంతో అరణ్యంలో సంచరిస్తూ కిష్కింధానగర సమీపానికి రావడం-తో మూడవదైన ఆరణ్యకాండ పూర్తవుతుంది.

ఆంజనేయుని పరిచయంతో ప్రారంభమైన కథ...... 'సంపాతి' అనే పేరున్న జటాయు సోదరుని ద్వారా సీతమ్మ జాడ తెలిసి సముద్రపు ఒడ్డుకి వానరసైన్యం చేరడం-తో నాల్గవదైన కిష్కింధాకాండ పూర్తవుతుంది.

జాంబవంతుని ప్రేరణపై వానరుల ఉత్సాహనినాదాల మధ్య ఆంజనేయుడు లంకా నగరానికి సముద్రంపై ఎగరడంతో ప్రారంభమైన కథ...... రామునికి సీతాక్షేమాన్ని చెప్పడం-తో అయిదవదైన సుందరకాండ పూర్తవుతుంది.

ఇంత సహాయం చేసిన ఆంజనేయునికి రాముడు కౌగిలి భాగ్యాన్ని ప్రసాదించడం. సముద్రానికి వారధి నిర్మించడం, విభీషణుణ్ణి తమ పక్షంలో చేర్చుకోవడం, రావణ, కుంభకర్ణ, ఇంద్రజిత్తులని వధించడం, సీతమ్మని అగ్నిప్రవేశం చేయించి పవిత్రురాలిగా దేవమహర్షి వానర గణాలమధ్య నిర్ణయించడం, భరతుని వద్దకు వచ్చి

అయోధ్యకు తీసికొని పోవడం, ఎందరెందఱో ఆనందిస్తూండగా మహర్షుల ఆశీర్వాదాల మధ్య శ్రీరామచంద్రుడు పట్టాభిషిక్తుడై తన పూర్వుల అడుగు జాడలలో పరిపాలనని ధర్మబద్ధంగా చేస్తూండడం వఱకూ ఇప్పటికి అయిన భాగం. ఇంతతో ఆఱవదైన యుద్ధకాండమూ, ఆ చివరలోనే పట్టాభిషేకమూ పూర్తయిందన్నమాట. ఇక మీద రాబోయేదే 7వదైన ఉత్తరకాండ.

**జరిగిన కథ తెలిసాక క్లుప్తంగా అంతరార్థం విందాం.**

శ్రీమద్రామాయణం కథ ఎవరికి తెలియదు? అందఱికీ తెలుసు. ఒకవేళ ఎవరికైనా తెలియకపోయినా సులభంగా చెప్పెయ్యవచ్చు. కాని అంతమాత్రమే తెలిస్తే ప్రయోజనం లేనే లేదు. వాల్మీకి మహర్షి శ్రీమద్రామాయణాన్ని కేవలం కథ చెప్పేందుకే వ్రాయలేదు. నేటి కాలపు పిచ్చి పిచ్చి కథలూ నవలలూ వ్రాసేవారి వ్రాతలలో కథే తప్ప అంతరార్థాన్ని వెదికేందుకు అవకాశమే ఉండదు. కారణం - వారిలో తపశ్శక్తీ, వారు వ్రాసే దానికీ వారు ప్రవర్తించే దానికీ ఏమాత్రపు సంబంధమూ మచ్చుకి కూడా లేకపోవడమే. వాల్మీకి, వ్యాసుడూ మొదలైన మహర్షుల వ్రాతలు చిరకాలంగా జీవిస్తూ ఉండడానికి కారణం, ఆ యిద్దఱూ కూడా తమ గ్రంథాలలో తాము పాత్రధారులు. అంటే గ్రంథం లోపలా బయటా కూడా ఒకే ప్రవర్తన కలవారు. అంతే కాదు. బ్రహ్మ - నారదుల ఆశీర్వచనాన్ని పొంది, రాబోయే కథని కూడా తమ తపశ్శక్తితో గ్రహించుకొన్న తాపసులు. అటువంటి వారు వట్టి కథలు వ్రాస్తారని చాలమంది భావించుకుంటూ ఉండడానిక్కారణం, ఇటువంటి వారంతా కేవలం వట్టి (పోయిన) కథలని చదువుకుంటూ జీవితాన్ని వెళ్లదీస్తూ ఉండడమే.

ఇంతకీ సూక్ష్మంగా అంతరార్థాన్ని చూద్దాం. (వివరంగా అయితే ప్రచురితమైన నా బాలకాండ అయోధ్యాకాండ సుందరకాండ గ్రంథాలలో చదువుకోవచ్చును).

ఎంతోకాలంగా శ్రీమహావిష్ణువుని ఆరాధిస్తూన్న కారణంగా శ్రీమహావిష్ణువు ఇక్ష్వాకు వంశంలో జన్మించి ఆ వంశాన్ని పవిత్రీకరింప దలిచాడు. రావణుణ్ణి వధించడమనే ఆలోచన కలిగి తాను దశరథునికి

నలుగురిగా పుట్టాడు. అంటే ఇది దశరథుని గొప్పకాదు. ఇక్ష్వాకు వంశీయుల పూజ దశరథుని నాటికి ఫలించిందన్నమాట. ఇక రామునికి రావణ వధ ప్రధానం కాబట్టి విశ్వామిత్రునికి శిష్యుడై బలాతిబల

ఏ రావణవధ అనే పనికోసం భూలోకానికి శ్రీరామచంద్రమూర్తిగా మహావిష్ణువు అవతరించాడో, ఆ పని అయిపోయిన పిమ్మట ఇక వైకుంఠానికి సీతమ్మతో కలిసి వెళ్లిపోవడం ఇక తాను చేయవలసిన - మిగిలిపోయిన కృత్యం. ఆ కథే మనకి ఉత్తరకాండలో కన్పిస్తుంది. కథతోపాటు అంతరార్థాన్ని వివరంగా గమనిస్తూ చూద్దాం.

## వాల్మీకి ఉత్తరకాండని వ్రాయలేదంటారు. నిజమేనా?

అని ఈ ప్రశ్న అడిగారంటే, ఉత్తరకాండని వాల్మీకి వ్రాయ లేదని మీతో ఎవరన్నారో వారు - శ్రీమద్రామాయణం మొత్తం మాట దేవుడెఱుగు! మొదటి కాండలోని మొదటి 5 సర్గలు కూడా చదవనివారే అని స్పష్టంగా చెప్పక తప్పదు. కారణం, బాలకాండం 4వ సర్గ 2వ శ్లోకమే (చతుర్వింశత్సహస్రాణి శ్లోకానా ముక్తవా నృషిః తథా సర్గశతాన్ పంచ షట్కాండాని తథోత్తరమ్) 24 వేల శ్లోకాలతో 500 సర్గలుగా విభజింపబడి 7 కాండలతో - చివరి దానిపేరు ఉత్తరకాండ కాగా వాల్మీకి శ్రీమద్రామాయణాన్ని వ్రాసాడని స్పష్టంగా నిరూపిస్తోంది. ఈ శ్లోకం రామాయణంలో 184వ శ్లోకం కాబట్టి పై నిర్ణయం చేసిన ఘనుడు మొదటి 200 శ్లోకాలు వఱకూ కూడా చదవని పండిత(మ్మ)మాన్యుడని చెప్పాలి.

నిజంగా శ్రీమద్రామాయణాన్ని వాల్మీకి మహర్షి, (1) రామాయణం జరక్కముందు - (2) లేదా జరుగుతూన్నప్పుడు - (3) లేదా జరిగిన పిమ్మట - ఈ మూటిలో ఎప్పుడు రాసాడు? అంటే 'ప్రాప్త రాజ్యస్య రామస్య' (4/1) రావణ వధ జరిగాక - రామునికి రాజ్యపట్టాభిషేకం జరిగిన పిమ్మటనే వ్రాసాడని సమాధానం. రామ పరిపాలనలో సకల ప్రాణి సమూహమూ (వట్టి మనుష్యులే కాదు) (రామోరామో రామయితి ప్రజానా మభవన్ కథాః) ఎక్కడ ఎవరు ఏం మాట్లాడినా రాముడు - రాముడు - రాముడు అని ఆయన గూర్చిన చరిత్రనే విన్పిస్తూంటే, ఆ కాలంలో వాల్మీకి ద్వారా రామకథని లోకంలో శాశ్వతం చేయించాలని భావించాడు శ్రీమహావిష్ణువు. (రామాయణ రచనకి ఏయే ఏర్పాట్లని ఎలా చేసాడో ఆ వివరాలు నా బాలకాండ పుట 8లో చూడవచ్చు). అందుకే ప్రతి వేయి శ్లోకాలకీ ఒక్కొక్క గాయత్రీ మంత్ర బీజాక్షరాన్ని ఉంచాడు వాల్మీకి. ఇక వాల్మీకే శ్రీమద్రామాయణంలో ఉత్తరకాండని వ్రాసాడనడానికి ఆధారాలు.

1) ఆఱుకాండలతో పాటు ఉత్తరకాండనీ వ్రాసాడని శ్రీమద్రామాయణం లోనే 4/2 శ్లోకం చెప్తూండడం (షట్కాండాని తథోత్తరమ్).
2) రామాయణరచనలో ప్రతి వెయ్యి శ్లోకాలకీ ఒక్కొక్క బీజాక్షరం చొప్పున ఉండేలా చేసికోవలసినదిగా గాయత్రీ మాతని విష్ణువు ఆదేశించాడు. గాయత్రీ బీజాక్షరాలు 24 కాబట్టి, రామాయణం యుద్ధకాండ వఱకే అయ్యి ఉంటే 20 బీజాక్షరాలే రామాయణంలో వాడబడి, మిగిలిన నాలుగిటికీ స్థానం లేకుండా పోయుండేది. అలా కాక ఉత్తరకాండతో 24 బీజాక్షరాలూ సరిపోతూండడం. (గాయత్రీ బీజాక్షరాలున్న శ్లోకాలు చివర్లో ఉన్నాయి).
3) శ్రీమద్రామాయణకథని లోకానికి ప్రచారం చేసేందుకు వాల్మీకి మహర్షి ఏ కుశీలవులని ఎన్నుకున్నాడో, ఆ యిద్దఱూ ఉత్తర కాండలోనే కన్పిస్తూ ఉండడం, వారిద్దఱినీ పరిచయం చేయకుండా గ్రంథాన్ని ఆపుచేయ వలసిన అవసరం వాల్మీకికి లేకపోవడం - ఆపు చేసిన పక్షంలో రాముని పుత్రులెవరో లోకానికి తెలిసే అవకాశమే లేకపోవడం. ఆపు చేసిన పక్షంలో సీతారాములు వైకుంఠానికి వెళ్లిన విధానం, కుశీలవుల పట్టాభిషేకం..... ఎవరికీ తెలిసేవి కాకపోవడం.
4) వైకుంఠం నుంచి సీతారాముల్ని భూలోకానికి తెచ్చిన పిమ్మట తిరిగి వారిని రావణ వధ అయ్యాక యథాస్థానానికి పంపించి కథని ముగింప వలసిన కనీస ధర్మం - కర్తవ్యం వాల్మీకి మహర్షిపై ఉండడం.
5) శ్రీమద్రామాయణాన్ని రచింపలసినదిగా వాల్మీకిని బ్రహ్మ ఆదేశిస్తూ (రామస్య చరితం సర్వం కురు త్వమ్) మొత్తం రాముని చరితాన్ని వ్రాయవలసిందిగా పల్కడం.
6) ఇప్పటివఱకూ జరగనిది కూడా నీకు తెలియడమే కాక, పాత్రల మనసులలోని అభిప్రాయాలు కూడా అర్థమౌతాయని వాల్మీకితో బ్రహ్మ పలికిన కారణంగా, యుద్ధకాండ వఱకూ జరిగిన అంశాలే వాల్మీకి వ్రాయగలిగాడు. 'జరగనివి కూడా చెప్పగల జ్ఞానం నీకు లభిస్తుంది' అని బ్రహ్మ అన్న వాక్యానికి ఆధారం, (వాల్మీకి ఉత్తరకాండని వ్రాయని పక్షంలో) మఱెక్కడా లభించకపోయే పరిస్థితి ఏర్పడుతూ ఉండడం.

7) శ్రీమద్రామాయణంలో కుండలినీ శక్తి మొదటి నుండి చివరి వఱకూ నిరూపింపబడుతూ కన్పిస్తుంది కాబట్టీ, కుండలినికి అతి ప్రధానమైన చక్రాలు 7 కాబట్టీ, అందులో చిట్టచివరిదైన సహస్రారమనే చక్రం శరీరానికి ఉత్తర భాగంలోనే (తలమాడు భాగం) ఉంటుంది కాబట్టీ అదే పేరుపై ఉత్తరకాండమని వాల్మీకి వ్రాసి ఉంటాడని నిశ్చయించడం.

8) రాముణ్ణి విడిచి ఉండలేని సీతమ్మ, సూర్యుడూ కాంతీలా కలిసిపోయే సీతారాములలో ఒకరైన సీతమ్మ, తన యింట కొంత కాలం ఉండడమే కాక కవలలను కూడ తన ఆశ్రమంలోనే కన్నదని చెప్పుకోగలిగిన మహాదృష్టం వాల్మీకికి కలిగితే, ఆ అదృష్టాన్ని వాల్మీకి వ్రాయదలచి వ్రాయడం ఇక్కడ జరిగింది.ఈ అన్ని రుజువులు వాల్మీకి మహర్షి ఉత్తరకాండని వ్రాసాడనే విషయాన్ని ధ్రువపఱుస్తాయి.

## 'ఉత్తరకాండ అనే పేరులోని విశేషం'

రామచంద్రుని బాల్యవిశేషాలు వివరించినది బాలకాండ కాగా, అయోధ్యా విశేషాలని చెప్పేది అయోధ్యాకాండం అయితే, అరణ్యంలో మహర్షులంతా అరణి మథించి యాగాలు చేసి సాధించిన అద్భుత తపోవిశేషాలని తెల్పేది అరణ్యా (ఆరణ్యా) కాండ కాగా, కిష్కింధానగర ప్రాంతంలో జరిగిన విశేషాలు కిష్కింధాకాండ కాగా, ఎన్నెన్నో సౌందర్యాలున్న (నా సుందరకాండ గ్రంథంలో (24 విశేషాలు) వివరించడం జరిగింది) కారణంగా సుందరకాండ కాగా, యుద్ధ విశేషాలని తెల్పే కాండ యుద్ధకాండ అయింది. అలాగే ఉత్తరకాండ అనే పేరుని కూడా మహర్షి అర్థవంతంగానే పెట్టాడు.

1) శ్రీమద్రామాయణమంతా వాల్మీకి కళ్ల ఎదుటే జరిగింది. ఇక మీదట జరగబోయేది ఏదో, అది 'ఉత్తరకాండ.'

2) రావణవధ అనే ఏ ముఖ్యకార్యం ఉందో దాన్ని చేయడం వఱకూ ఉన్న కథ పూర్వకాండం అయితే, ఆ మీదట జరిగినది కాబట్టి 'ఉత్తరకాండ.'

3) శ్రీమద్రామాయణంలో యుద్ధకాండ వరకూ ఏ అనుమానం కల్గినా రావణునకున్న శాపాలూ - ఇంద్రజిత్తు గొప్పదనం - మొదలైన వాటికి ఉత్తరాలు (సమాధానాలు) దొరికే కాండ ఏదో అది 'ఉత్తరకాండ.'

4) యుద్ధంలో మరణించిన ఎందరెందరో రాక్షసులకి ఉత్తరక్రియలు జరిగే కాండ ఏదో అది 'ఉత్తరకాండ.'

5) భూగోళానికి అతల, వితల, సుతల, తలాతల, మహాతల, రసాతల, పాతాలమనే 7 లోకాలూ "క్రిందుగా" అంటే దక్షిణపు దిక్కున ఉంటే, పైనున్న 7 లోకాలకూ కూడ ఉత్తరపు వైపుకు సీతారామ ప్రయాణం సాగే కాండ ఏదో అది 'ఉత్తరకాండ'.

6) దక్షిణ దిక్కున ఉన్న లంకని జయించి ఉత్తరపు దిక్కున ఉన్న అయోధ్యని చేరి పట్టాభిషిక్తుడైనా ఇంకా వెళ్లవలసి ఉన్న ఏ ఉత్తర దిక్కు ఉందో (వైకుంఠం) ఆ ఉత్తరానికి సీతారాములు వెళ్లే విశేషాన్ని తెల్పే కాండ ఏదో అది 'ఉత్తరకాండ.'

7) గాయత్రీ మంత్ర బీజాక్షరాలు ప్రతి కాండంలోనూ ఉన్నాయి. కాని కాండ మొదటి - శ్లోకంలో మొదటి అక్షరం గాయత్రీ బీజాక్షరంగా అయిన కాండలు రెండే రెండు. (1) బాలకాండ ప్రథమ శ్లోక ప్రథమ బీజాక్షరం (త). (2) ఉత్తరకాండ ప్రథమ శ్లోకం ప్రథమ బీజాక్షరం (ప్ర). మొదటి - చివరి కాండాల్లో మాత్రమే కన్పించే ప్రముఖులు 'విశ్వామిత్రుడు - జనకుడు - కేకయ మహారాజు' అనే ముగ్గురు మహాతపస్వులూను.

8) సీతారామ లక్ష్మణ భరత శత్రుఘ్నాంజనేయులే కాక రామపక్షాన పోరాడిన వానరయోధులందరినీ కూడా జీవింపచేసి వారందరికీ ఉత్తరలోకానికి పోయే అనుగ్రహాన్ని ఇచ్చే కాండ 'ఉత్తరకాండ.'

9) రాముని చేతిలో హతులై, అలాగే తన తమ్ముల చేతిలో కూడా మరణించిన ఎందరో రాక్షసులు ఉత్తరలోకానికి పోయే అర్హతని కలిగించిన కాండ 'ఉత్తరకాండ'.

10) తనని నమ్ముకొని, తనతోడిదే లోకంగా భావించి వెంట వచ్చిన అయోధ్యా జనులందరికీ, ఉత్తరలోకాలని ప్రసాదించిన కాండ 'ఉత్తరకాండ'.

# ఉత్తరకాండ కథా ప్రారంభము

## ఎంతపని చేసావు రామా!

ప్రాప్తరాజ్యస్య రామస్య రాక్షసానాం వధే కృతే।
ఆజగ్ము ర్మునయ స్సర్వే రాఘవం ప్రతినందితుమ్।।

శ్రీరామచంద్రుడు పట్టాభిషిక్తుడయ్యాడు. పరిపాలన ధర్మబద్ధంగా సాగుతోంది. తమకిక ఏ బాధలూ రాక్షసుల వలన లేకపోవడంతో పరమానందపడ్డ మహర్షులంతా ఒక్కమాటుగా ఆ రామచంద్రుణ్ణి చూడవచ్చారు.

తూర్పున ఉండే కౌశికుడు, యవక్రీతుడు, గార్గ్యుడు మొదలైనవారూ, దక్షిణంలో ఉండే నముచి, ఆత్రేయుడు, అగస్త్యుడు, మొదలైనవారూ, పశ్చిమంలో ఉండే కవషుడు, ధౌమ్యుడు మొదలైనవారూ, ఉత్తరంలో నిత్యం ఉండేవారూ - సప్తర్షులు అని ప్రసిద్ధి పొందినవారూ అయిన వశిష్ఠ - కాశ్యప - అత్రి - విశ్వామిత్ర - గౌతమ - జమదగ్ని - భరద్వాజులూ ఒక్కమాటే వచ్చి రాక్షసబాధ తొలగించినందుకై రాముణ్ణి ప్రశంసించడం ప్రారంభించారు. (వసిష్ఠః కాశ్యపోఽథ ధాత్రిః విశ్వామిత్రః స గౌతమః జమదగ్ని ర్భరద్వాజ స్తేకపి సప్తర్షయ స్తథా।। సప్తర్షుల జాబితాని వాల్మీకి చెప్పాడిక్కడ. ఇదే ప్రమాణం). **ఈ శ్లోకం చాలా గట్టిది.**

మహర్షులంతా రాముణ్ణి పొగుడుతూన్నట్లుగా పైకి అన్పిస్తోంది. కాని అది నిజం కాదు. మహర్షులనే రాముడు పొగడాలి. 'గర్భభూతా స్తపోధనాః' మహర్షులంతా శ్రీమహావిష్ణువు రక్షణలో సుఖంగా ఉండవలసిన వాళ్లు. కాబట్టి వారిని రక్షించుకోవడం ఆయన కర్తవ్యాలలో ఒకటి. ఆయన తన కర్తవ్యాన్ని నెరవేటిస్తే దానికి ప్రశంసించాలా? ఏదైనా కర్తవ్యం కాని విశేషమైనదేదో చేస్తే ప్రశంసించాలి. పోనీ! వీరు ప్రశంసిస్తూంటే ఆయన ఎందుకు అంగీకరిస్తున్నాడు మరి? అది నిజానికి ప్రశంస కాకపోవడం బట్టి. ఎలాగో చూద్దాం.

మహావిష్ణువు మానవుని అవతారం ఎత్తాడు. విశ్వామిత్రుడు బల - అతిబల విద్యలతోపాటు సర్వ అస్త్రమంత్రాలనీ కూడ ఉపదేశించాడు. ఆ మంత్రాలన్నీ ఫలితానికి రావాలంటే 14 సంవత్సరాల కాలం - ఆ మంత్రాలకి పురశ్చరణం (మననం) అవసరం. అందుకే 14 సంవత్సరాలూ అరణ్యాలలో గడిపాడు. ఉత్తమ ప్రదేశాలలో చేసిన మంత్రమననం, తొందరగా ఫలితానికి వస్తుంది కాబట్టే, ఎందరెందరో మహర్షులు తపస్సు చేస్తూనే శరీరాలని జీర్ణం చేసికొన్న దండకారణ్యంలోనే చాలకాలం మంత్ర మననాన్ని రాముడు చేసాడు. రాక్షస సంహారం కోసం అగస్త్యమహర్షి తన తపశ్శక్తినంతనీ నిక్షిప్తం చేసిన ఖడ్గాన్నీ ఇతర ఆయుధాలనీ ఇచ్చాడు. అరణ్యంలో సుతీక్ష్ణుడు, శరభంగుడు మొదలైన మహర్షులు తమ తపశ్శక్తులని రామునికే ధారాదత్తం చేసారు. ఇంతకుముందే పతివ్రతా శిరోమణి అయిన అహల్యా, వీరపురుషుడూ - ఆవేశావతారమూర్తీ అయిన పరశురాముడూ కూడ తమ తపశ్శక్తులని ధారపోయగా, సీతమ్మ స్వయంగా నిరాహారిణియై లంకలో ఉండి తపస్సుని ఆర్జించి, రామచంద్రునికి చూడామణిలో నిక్షిప్తం చేసి పంపింది. ఇంత తపశ్శక్తి ఉంటే తప్ప రావణుణ్ణి గెలవడం రామునంతటి వానికి అసాధ్యమయిందంటే వాని తపశ్శక్తి తీవ్రతని తెలిసికోవచ్చు. ఇంతటి రావణ వధకి నిజంగా తోడ్పడినది మహర్షుల తపశ్శక్తి తప్ప రాముని పరాక్రమం కానేకాదు గదా! (ఈ విధమైన విశేషాలన్నింటినీ వివరంగా హేతుబద్ధంగా ముద్రితమైన నా బాల అయోధ్య సుందరకాండల గ్రంథాలని చదివితే తెలిసికోవచ్చు) మరి ఎందుకని మహర్షులు రాముణ్ణి ప్రశంసించాలి?

ప్రజల నుండి పన్నుల రూపంలో తీసికొన్న ద్రవ్యాన్ని ప్రజా సంరక్షణానికే ప్రభుత్వం వెచ్చించడం ఎలా ధర్మమో, అలాగే ఋషుల నుండి తీసికొన్న తపశ్శక్తిని లోకక్షేమం కోసమూ, ఋషులు తపస్సు చేసి లోకాన్ని రక్షించేందుకు వీలుగా వారిని రక్షించడం (రాక్షస బాధ మొదలైనవి లేకుండా) కోసమూ రాజు వెచ్చించాలి. అందుకే తనకిచ్చిన తపశ్శక్తిలో కొంతని పాదుకలలో నిక్షిప్తం చేసి నందిగ్రామంలో ఉంచి అయోధ్య - తత్పరిసర ప్రాంతానికి బాధలేకుండానూ, దూతగా వెళ్లిన కాలంలో కూడా హనుమంతునికి బాధలేకుండా అంగుళీయకంలో నిక్షిప్తం చేసి ఇవ్వడం ద్వారానూ, (ఆ తల్లి కూడా తిరుగు

ప్రయాణంలో ఆంజనేయునికి కష్టం కలుగకుండా చూడామణిలో తన తపశ్శక్తిని ఉంచి పంపించడం ద్వారానూ)..........ఇలా అతిభద్రంగా లోక క్షేమాన్ని గమనించినందుకూ తద్వారా తమ నుండి (ఋషుల నుండి) తపస్సుని గ్రహించుకొనేలా చేసికొన్నందుకూ, రాముణ్ణి వారంతా అభినందించారు. లోకంలో కూడా ఉద్యోగాన్ని తానే ఇచ్చినా, ఎదుటి వ్యక్తి సక్రమంగా పనిచేసి అధికారి మెప్పు పొందితే, ఉద్యోగ దాత కూడా ఆ ఉద్యోగిని అభినందించడా? అదే ఇక్కడ జరుగుతోంది. రావణ వధ నిమిత్తం తమ తపశ్శక్తిని ధారపోసిన పిమ్మట నుండి రాముని పట్టాభిషేకం వఱకూ తాము ఆర్జించిన తపశ్శక్తి ఇంకా తమవద్ద ఉండనే ఉంది. పట్టాభిషిక్తుడైన రామునికి ఆ తపశ్శక్తిని కూడా ధారపోస్తే రాజ్యం ధర్మబద్ధంగా నడుస్తుంది కదా? ఆ పని చేద్దామని ఇందఱూ వచ్చారు. వాక్కుద్వారా ఆశీర్వదిస్తే చాలు తపశ్శక్తి రామునికి చేరి తీరుతుంది. ఇళ్లలో కూడా పిల్లలు పాదాభివందనం చేయడమూ తలిదండ్రులు ఆశీర్వదించడమూ కూడ ఇందుకేగా! ఏ మాత్రపు దైవపూజా చేయనివాని ఆశీర్వచనపు వాక్కు గాలిలో కలిసి పోతుంది తప్ప ఫలితాన్నీయదని వేఱే చెప్పాలా! కాబట్టి మనపిల్లలనైనా మన ఆశీర్వచనం ఫలించేంతటి తపస్సు (దైవపూజ)ని కనీసం మనం చేయవలసి ఉంది.

తూర్పు - దక్షిణ - పశ్చిమ - ఉత్తర దిక్కుల నుండి మహర్షులందఱూ వచ్చారుట. ఎప్పుడూ కదలడానికి వీలులేని అగస్త్యుడు కూడా వచ్చాడుట. కాని చిత్రమేమంటే ఈ వచ్చిన వారిలో వాల్మీకి మహర్షి కన్పడడు. 'అందఱూ వచ్చారు' అనే మాటలో 'వాల్మీకి కూడా వచ్చి ఉంటాడు' అని అర్థం చేసుకోవచ్చు గదా! అని అనవచ్చు. శ్రీమద్రామాయణాన్ని లోకానికి అందిస్తూ రామకృపా సంపూర్ణ పాత్రుడైన వాల్మీకి మహర్షికి రామునివద్ద ఆమాత్రపు ప్రత్యేకత లేదా? ఉండరాదా? వాల్మీకి రాకపోవడంలోనే విశేషం ఉంది. ఇది తెలియాలంటే పై శ్లోకపు అర్థాన్ని పట్టిపట్టి చూడాలి. మహర్షుల లో భావాన్ని చూడాలి.

**ప్రాప్తరాజ్యస్య రామస్య** - రాజ్యం పొందిన రామునికి అని దీని అర్థం. రామచంద్రా! వైకుంఠానికి అధినేతవయిన నువ్వు రావణ వధ కోసం భూలోకానికి వచ్చావు. అయోధ్యలో ఎక్కడ పట్టాభిషేకం నీకు

జరిగిపోయి రావణ వధకి వెళ్లవో అని, రావణ వధకి ముహూర్తాన్ని పెట్టాం. పట్టాభిషేకం ఆగి దండకానికి నువ్వు బయలుదేరావని మేం లోలోపల ఎంతో ఆనందపడి. అప్పటికి ఆ గండం తప్పిందనుకున్నాం. నువ్వూ జాగ్రత్త పడుతూనే భరతునిమాటని వినకుండా చిత్రకూటంలోనే ఉండిపోయావు. అలాగే వాలిని చంపి ఆ కిష్కింధారాజ్యాన్ని ముట్టకుండా సుగ్రీవునికీ, రావణుణ్ణి చంపి లంకా రాజ్యాన్ని విభీషణునికీ ఇచ్చేసావు. ఇంత చేయడానికీ కారణం మళ్లీ నువ్వు వైకుంఠానికి వెళ్లవలసి ఉండటమే కదా! నువ్వు భూలోక రాజ్యానికి రాజువైతే వైకుంఠ ప్రయాణం ఎలా కుదురుతుంది? ఇంతవఱకూ బాగానే ఉంది కాని, లంకని విభీషణునికి ఇచ్చి నువ్వు మళ్లీ అయోధ్యకి రాజువై వైకుంఠానికి వెళ్లే వీలు లేకుండా చేసికొన్నావు గదా! అందుకే మేం కొంతగా చింతిస్తున్నాం.

**రాక్షసానాం వధేకృతే** 'అందఱు రాక్షసులనీ చంపి' అని అర్థం. ఏ ఒక్క రాక్షసుడు మిగిలినా వాణ్ణి వధించాలనే వంకతో మళ్లీ అయోధ్యా సింహాసనం నుండి దూరం కావచ్చు. కాని - **రాక్షసానామ్** - అందఱినీ చంపేసావు గదా! వాళ్లని వధించకుండా 'మందలించినా' మఱేం చేసినా మళ్లీ అయోధ్యని విడిచే అవకాశం లభించేది గదా! అలా చేసేసావేమిటి?

అందుకే మా అందఱికీ ఆశ్చర్యంగా ఉంది. ఇప్పటివఱకూ నీ ఆలోచనలన్నీ మాకు తెలిసాయి గాని ఈవిధంగా చేసి అయోధ్యలో సింహాసనంలో రాజఱికానికి పాల్పడడంలోని ఔచిత్యమూ, వైకుంఠానికి ఎలా వెళ్లదలిచావో ఆ రహస్యమూ మాకు బోధపడడం లేదు. ఆ కారణం చేతనే తెలిసికోదలచి, అభినందించవలసికూడా ఉంది కాబట్టి, ఆ వంకతో వచ్చాం. ఒక్కళ్లం కాదు. అందఱం వచ్చాం.

**ప్రతినందితుమ్** - నిన్ను ప్రతినందించడానికి వచ్చాం. అభినందనానికీ ప్రతినందనానికీ కొద్దిభేదం ఉంది. (వాది - ప్రతివాది, ఉత్తరము - ప్రత్యుత్తరము, ధ్వని - ప్రతిధ్వని ఇలా 'ప్రతి' అనే ఉపసర్గ చేరితే కొద్ది అర్థంలో మార్పుంటుంది సంస్కృతంలో). కాబట్టి ఓ రామా! లంకా యుద్ధంలో విజయాన్ని పొంది అయోధ్యలో చిక్కుకుని ఎంతపని చేసావయ్యా!! అనే ఆలోచనకూడా లోపల ఉంది.

ఇంతకీ మహర్షులంతా కట్టకట్టుకుని రావడానికి్కారణం సీతారాములు తిరిగి ఎలా వైకుంఠానికి వెడతారో, తెలుసుకుందామనే. రాముడు కూడా వారి పొగడ్తలని వింటున్నది కూడా ఈ రహస్యాన్ని రహస్యంగా ఎవరికి వారికి, వారువారు తపస్సు చేసికొనే సమయాల్లోనే అర్థమయ్యేలా చేయాలనే.

వాల్మీకి మహర్షి మాత్రం రాకపోవడానిక్కారణం వాల్మీకికి ఈ రహస్యమేదో ఎంతో ముందుగా తెలియడమే. అందుకే ఆయన రావణ వధతో పాటు సీతా పరిత్యాగం కూడా ప్రధానాంశంగా ఉన్న శ్రీమద్రామాయణ గ్రంథానికి ఈ పేరు పెట్టక ముందు 'సీతాయాశ్చరితం మహత్' అనే పేరుని కూడా పెడితే ఎలా ఉంటుందని ఆలోచించాడు. 'సీతాదేవి యొక్క గొప్పదైన చరిత్ర' అని ఈ పేరుకి అర్థం. ఇక్కడ 'సీత' అంటే స్త్రీకి ప్రతీకగా గ్రహించాలి.

## శ్రీమద్రామాయణంలో స్త్రీకే ప్రాధాన్యం

బంతి ఆటలో ఒకరు బంతిని తన్నితే అది ఆగిపోయే దశలో వేఱొకరు దానిని తన్ని మఱికొంత దూరం పోయేలా ఎలా చేస్తారో అలాగే శ్రీమద్రామాయణ కందుకం (బంతి) ఎక్కడికక్కడ ఆగిపోతూ ఉంటే ఆగిపోబోయే ప్రతి దశలోనూ ఒక్కొక్క స్త్రీ వచ్చి ఆ రామాయణ కథని ఆగిపోకుండా నడిపిస్తుంది.

ఈ విషయాన్ని ఇక్కడ ప్రస్తావిస్తూ ఉండడానికి కారణం సింహాసనంలో చిక్కుకుపోయి రాముడు రాజైన ఈ దశలో రామాయణ కథ ఆగిపోతూ ఉంటే స్త్రీ అయిన సీతమ్మ ఎలా కథని మళ్లీ నడప బోతోందో చెప్పడానికి. శ్రీమద్రామాయణ భారతాలని ఏ మాత్రమూ సరిగా చూడనివారే ప్రాచీన ఇతిహాసాల్లో స్త్రీకి ప్రాధాన్యం లేదని చెప్తారు. చూద్దాం శ్రీమద్రామాయణంలో స్త్రీ ప్రాధాన్యం ఎంత ఉందో!!

రావణ వధని ఎలా చేయాలా? అని శ్రీమహావిష్ణువు ఆలోచిస్తూంటే 'నేను ముందుగా భూలోకానికి వెడతాను' అని పలికి వేదవతీ రూపంలో లంకకి వచ్చిన స్త్రీ సీత.

పుత్రకామేష్టి యాగాన్ని దశరథుడు చేయించవలసి ఉన్నప్పుడు ఋష్యశృంగుడు అవివాహితుడైన కారణంగా అనర్హుడైనప్పుడు, అతనికి భార్యయై కథ నడిపించిన ఇల్లాలు స్త్రీ **శాంతాదేవి.**

పుత్రకామేష్టి అయ్యాక విష్ణువు జన్మించదలిచినది పురుషుడైన దశరథుని సంబంధం లేక స్త్రీ గర్భాలలోనే. నల్గురు పిల్లలు కలిగాక రామాయణ కథ ఆగిపోతూంటే మళ్లీ కథని తన వధతో ముందుకు నడిపినది స్త్రీ **తాటక.**

తాటకావధతో కథ ఆగిపోకుండా చేసిన స్త్రీ **అహల్య.** ఆ మీదట కథని నడిపించిన **ఇల్లాలు జానకి.** అయోధ్యకి రాగానే కథ ఆగిపోకుండా చేసిన స్త్రీ **మంథర.** ఆమె మాటలు విని రాముణ్ణి పంపించి కథ నడిపిన స్త్రీ కైకమ్మ. అరణ్యానికి వెడుతూన్నప్పుడు ధైర్యం చెప్పి పంపించిన **ఇల్లాలు 'అనసూయ'.** అరణ్యంలో 13 ఏళ్లు గడిచిపోగా ఏం చేయాలో తోచక రాముడున్న దశలో రావణునితో విరోధాన్ని కల్పించి రక్షించిన స్త్రీ **'శూర్పణఖ'.** తనని తానే అపహరించుకొనబడేలా చేసికొని కథని కొనసాగ జేసిన పతివ్రతా స్త్రీ **సీతమ్మ.** ఆ మీదట కథని జరిపిన స్త్రీ **'శబరి'.**

వాలికి సుగ్రీవునితో విరోధాన్ని ఏర్పడేందుకు అవకాశమిచ్చి కథ నడిపించినది సుగ్రీవ **భార్య 'రుమ'.** వానరులంతా సీతమ్మని వెదకడానికి వెళ్లగా ఒక గుహలో చిక్కుకొని పోయిన సందర్భంతో కథని నడిపించడానికి గుహనుండి ఇవతలకు వారినందఱినీ తెచ్చి చేర్చిన స్త్రీ **'స్వయంప్రభ.'**

ఆంజనేయుడు లంకకి వెడుతూన్నప్పుడు పైకి పరీక్ష పెడుతూన్నట్లుగా లోపల సహాయపడ్డ స్త్రీ 'సురస'. లంకా రాక్షసులకి తాను మరణించి జ్ఞానోదయం కల్గింపదలచి విఫలురాలైన స్త్రీ **'సింహిక'.** లంకా రహస్యాన్నీ, రావణ మరణాన్నీ ముందుగానే చెప్పిన స్త్రీ **'లంకిణి'.** తన కలని చెప్పి సీతకీ, హనుమకీ, రాక్షస స్త్రీలకీ ఊపిరినిచ్చిన స్త్రీ 'త్రిజట'. లంకలో ఉన్న సీతకు అనుక్షణం ధైర్యాన్ని ఇచ్చిన స్త్రీలు 'సరమ, **అనల'** (విభీషణుని భార్య - పుత్రిక).

**ఇంతదాకా స్త్రీ ప్రాధాన్యం కన్పించింది గదా! ఇక్కడితో ఆగిపోతుందా? ఉత్తరకాండ కథని నడిపించే ఇల్లాలు కూడ సీతమ్మే. స్త్రీయే. తాను వైకుంఠం నుండి ముందుగా వేదవతీ రూపంలో వచ్చింది. మళ్లీ వెళ్లేప్పుడు కూడ తానే వైకుంఠానికి ముందుగా చేరవలసి ఉంది. అందుకే తనకు తాను ఋషిపత్నులని చూడదలచి ఉన్నాననే ఒక కోరికని స్పష్టంగా వెల్లడించబోతోంది ఈ కాండలో. ఇలాంటి కాండని వాల్మీకి వ్రాయలేదంటే ఆశ్చర్యమే కదా!**

ఇంద్రజాలం చేసేవాడు తన సంచిలోని వస్తువులనన్నింటినీ నేలమీద పఱచి ఇంద్రజాలాన్ని చూపి ఆ ప్రదర్శన అయిపోయాక ఎలా పఱచిన వస్తువుల నన్నింటినీ ఒక వరుసలో సంచికలోనికి మళ్లీ పంపించివేస్తాడో, అలాగే శ్రీమద్రామాయణ పాత్రధారులంతా యుద్ధకాండతో ప్రదర్శనం ముగిసింది కాబట్టి ఇక మళ్లీ తమతమ ప్రదేశాలకి వెళ్లవలసి ఉన్నారు గదా!

ఇదేకదా జగన్నాటకం అంటే. ఇది నాటకం కాబట్టి ఆ పాత్రని పంపేటప్పుడు ఒక చిన్న సంఘటనని కల్పించాలి. అలా సీతమ్మ కల్పించిన సంఘటనలు రెండే రెండు శ్రీమద్రామాయణంలో. ఆ రెండే ఆమె కోరికలు. ఒకటి అరణ్యకాండలో అరణ్యంలో ఉన్నప్పుడు తనకి లేడి కావాలని అడగడం. దానితో ఆమె భర్తని ఎడబాసింది. మళ్లీ ఉత్తరకాండలో అయోధ్యలో ఉన్నప్పుడు ఋషిపత్నులని చూడాలని ఉందని కోరడం. (ముందురాబోతోంది). దీనితో ఆమెకి మళ్లీ భర్తతో వియోగమే సంభవిస్తోంది.

అడక్క అడక్క ఆమె తన భర్తని రెండే రెండు వరాలు అడిగింది. ఆ రెండే ఆమెకు భర్తృ వియోగాన్ని కల్గించాయి. ఇది పైకి కన్పించే కథ. అంతరార్థం అది కాదు. రావణుడు తనని అపహరించుకొని లంకకి తీసికొని వెళ్లకపోతే రామునికి రావణుణ్ణి వధించే ఉపాయం, అవకాశమూ లేక అవతార ప్రయోజనమే ఉండిఉండేది కాదు. అలాగే ఉత్తరకాండలో కూడా ఆమె ఋషిపత్నులని చూడదలచానని అడక్కపోతే ఆమెని వైకుంఠానికి పంపేందుకు రామునికి తగిన కారణమూ, అవకాశమూ ఉండి ఉండేదికాదు. ఇంతలోతుగా ఆలోచించినవాడూ, రాముని సంపూర్ణ కృపకు పాత్రుడూ వాల్మీకి మహర్షి కాబట్టే శ్రీమద్రామాయణ కథని వ్రాయనూ గలిగాడు- ఈనాడువచ్చిన మహర్షులందరితోనూ రాకుండా ఉండనూ గలిగాడు.

ఋషిపత్నులని దర్శించాలని సీతమ్మ ముందునాటికి కోరబోతోంది. ఏ వాల్మీకి మహర్షి మాత్రం నేడు రాలేదో, ఆయన ఆశ్రమానికి దగ్గఱలోనే సీతమ్మని దింపిరమ్మని, రాముడు ఆజ్ఞని ఈయబోతున్నాడు కూడ. ఆవాల్మీకి కూడా నేడు వచ్చి ఉంటే రాముడూ వాల్మీకీ కూడబలుక్కున్నారనే అపనింద రావచ్చు. రెండవది వాల్మీకి రాకపోయినా యథార్థమైన తపస్సుచేసే వాల్మీకికి, రాముని హృదయం రామునికి తోచినంత స్పష్టంగా తెలుస్తుందని మనం భావించనూ వచ్చు. ఈ శక్తి వాల్మీకికి తపశ్శక్తి ద్వారా వచ్చి ఉండవచ్చు. బ్రహ్మ అనుజ్ఞ వలన కూడా వచ్చి ఉండవచ్చు. 'ప్రకాశం యది వా రహః అనా గతం చ యత్కించిత్..........' 'పైకి కన్పించేదీ, లోపల రహస్యంగా అనుకున్నదీ, జరిగినదీ, జరుగబోయేదీ కూడ నీకు తెలుస్తుంది!' అని వాల్మీకితో బ్రహ్మ అంటూ వాల్మీకికి ఆ శక్తిని అనుగ్రహించాడు. (బాలకాండ 3వ సర్గ)

మొత్తం మీద తేలినదేమంటే, సీతారాములు రావణవధ అయిపోయిన పిమ్మట తామూ తమ వారూ ఎలా వైకుంఠానికి వెళ్లాలా? అనే ఆలోచనలతో ఉన్నారనీ దానికి తమ వంతు సహాయాన్ని ఎలా చేయాలా? అని మహర్షులు భావిస్తున్నారనీను - వీటితోపాటు శ్రీమద్రామాయణంలో యుద్ధకాండ వఱకూ ఏ అనుమానం ఎక్కడ కల్గినా సమాధానాలని చెప్పగల సర్గగా ఒకటి ఉండాలని వాల్మీకి భావించి ఉత్తరకాండని వ్రాసినట్లును. 'ఊర్ధ్వమూల మధశ్శాఖ మశ్వత్థం ప్రాహురవ్యయమ్'....... అన్నట్లు ముందు జరిగిన వేదవతీ కథ మొదలైనవన్నీ ఉత్తరకాండలో మహర్షి వ్రాసాడు. వ్రేళ్లు భూమిలో ఉండి చెట్టుపైకి కన్పిస్తూ ఉండడం లోకంలో చూస్తాం. కాని ఆధ్యాత్మిక విషయాల విషయంలో మాత్రం మూలం పైకి ఉంటుంది. ఆ చెట్టుకి సంబంధించిన కొమ్మలు - ఆకులు క్రిందికి వ్రేలాడుతూ ఉంటాయిట. ఇక్కడ శ్రీమద్రామాయణపు ఉత్తరకాండమే దీనికి సాక్ష్యం కదా!

**రామా! రావణుని కంటె ఇంద్రజిత్తుని చంపడం గొప్ప సుమా!**

మహర్షులంతా ఆశీర్వదించాక అగస్త్యుడన్నాడు. రామా! రావణుని కంటె ఇంద్రజిత్తుని వధించడమనేది చాలా గొప్ప సుమా!

అని. రామునికి ఆశ్చర్యం వేసి (శక్యం యది మయా శ్రోతుం న ఖల్వాజ్ఞాపయామి వః। యది గుహ్యం న చే ద్వక్తుం శ్రోతు మిచ్ఛామి కథ్యతామ్।। కథం చ బలవాన్ పుత్రో న పితా తస్య రావణః?) మహర్షీ! చెప్పవచ్చుననిపిస్తే, రహస్యం కాకపోతే, దీన్ని ఆజ్ఞగా భావించక ఇంద్రజిత్తు ఆ రావణుని కంటె ఎలా గొప్పవాడో వినాలని ఉంది అన్నాడు (ఇలాంటి గ్రంథాలు చదివితే పెద్దలతో ఎలా మాట్లాడాలో నేర్చుకోగలం).

అగస్త్యుడు చెప్పడం ప్రారంభించాడు.

బ్రహ్మ మానస పుత్రుడూ, బ్రహ్మర్షీ అయిన పులస్త్యుడు, తృణబిందుడనే రాజర్షి ఆశ్రమంలో తపస్సు చేసికొంటూ ఉండేవాడు. ఆ ఆశ్రమం చాల సొంపుగా ఉండడంతో దేవ - నాగ - రాజకన్యకల ఆటపాటలకి స్థానం కాసాగింది. దీనితో పులస్త్యునికి తపోభంగం ఔతూండేది. ఇది సహింపలేక ఒకనాడాయన ఇలా శపించాడు. 'నా కంటి చూపులో ఎవరు పడితే వారికీ, నన్ను చూడవచ్చిన వారికీ, గర్భం వస్తుంది' (యా మే దర్శనమాగచ్ఛేత్ సా గర్భం ధారయిష్యతి) అని. ఈ విషయం తెలియని తృణబిందు రాజర్షి పుత్రిక ఆయనను దర్శించింది.

కొంత సేపటికే తృణబిందుడు తన పుత్రికతో వచ్చి విషయాన్ని విన్నవించి 'ఈమెని భిక్షగా స్వీకరించండి. తపస్సు చేసి చేసి అలసిపోయే మీ శరీరానికి సేవ చేసేందుకు స్వీకరించండి' అని ప్రార్థించాడు. (భిక్షాం ప్రతి గృహాణేమాం మహర్షే! స్వయముద్యతామ్ తపశ్చరణ యుక్తస్య శ్రామ్యమా ణేంద్రియస్య తే శుశ్రూషణపరా నిత్యం భవిష్యతి న సంశయః) స్వీకరించని పక్షంలో ఆ వంశమే అపకీర్తి పాలౌతుందని భావించిన పులస్త్యుడామెను భార్యగా స్వీకరించాడు. ఆమె సేవలకి సంతోషించి 'దేవీ! నా - మీ వంశాలకి వంశకర్త అయిన పుత్రుడు నీకు 'పౌలస్త్యుడు' అనే పేరు గలవాడు పుడతాడు. నిత్యం నేను వేదాధ్యయనాన్ని చేస్తూంటే వినడం చేత వాణ్ణి విశ్రవుడు (విశేషంగా వేదాన్ని విన్నవాడు) అని కూడా అంటారు అన్నాడు. (ఉభయోర్వంశ కర్తారం పౌలస్త్య ఇతి విశ్రుతమ్ - యస్మాత్తు విశ్రుతో వేదః త్వ యైషోఽధ్యయతో మమ- తస్మాత్ సవిశ్రవా నామ భవిష్యతి

న సంశయః) ఈ విశ్రవుడు ఊహ తెలిసిన దగ్గఱనుండీ తపస్సు చేస్తూ భరద్వాజ ముని కూతురు దేవవర్ణిని పెండ్లాడి వైశ్రవణుణ్ణి (కుబేరుడు) కన్నాడు. బ్రహ్మ ఇతణ్ణి ఉత్తర దిక్పాలకునిగా చేసాడు. ఒక దివ్య విమానాన్ని కూడ ఇచ్చాడు.

నిజానికి పులస్త్యుడు శపించినట్లు కాదు. లోకంలో రేతస్సు అధోముఖం అయితే సంతాన కారణం ఔతుంది. యోగులలో అది ఊర్ధ్వముఖంగా ప్రయాణించి కంటికి తేజశ్శక్తినిస్తుంది. ఆ కంటితో ఎవరిని చూస్తే వారికి సంతానప్రాప్తి ఔతుంది. ఇక్కడికి కన్యకలే వస్తున్న కారణంగా ఆయన అలా అన్నాడు. ఆ శాపం వంటిది - తనకు తపస్సు చేసికొనే అవకాశమిచ్చిన రాజర్షి కూతురికే ప్రాప్తమైనా - ఆ రాజర్షి పులస్త్యుణ్ణి నిందించడం గాని, శాపాన్ని ఉపసంహరించమని అడగడం గాని చేయలేదు. కారణం మహర్షుల శాపాలు వరంతో సమానాలు గదా! అని. శరీర సుఖం కంటె వంశకర్త అయిన పుత్రుణ్ణి కనడం ఎంత గొప్పదో అని నిరూపించడం ఈ కథా లక్ష్యం. రాముని తండ్రి దశరథుని విషయమూ ఇంతే కదా! పాయసం వలన రాముని పుట్టుక అయింది. (పుట్టడంలోని విచిత్రాలని గూర్చి నా బాలకాండ పుట 40 చూడగలరు).

గర్భిణిగా ఉండి ఆమె వేదాన్ని వినడం వలన ఉత్తమ పుత్రుణ్ణి కన్నదని అగస్త్యుడు చెప్పడానిక్కారణం రాముని భార్య సీతమ్మ కూడా ముందునాటికి గర్భవతి అయితే నిత్యం వేదాధ్యయనం జరిగే చోట ఉంచి ఉత్తమ సంతానాన్ని పొందవలసిందని రామునికి పరోక్షంగా సూచించడానికే. భవిష్యత్కాలంలో జరగబోయే సంఘటనని ముందుగా ఊహించి, లేదా రామునికి "ఇలా చేస్తే బాగుంటుందని సూచించి చెప్పడానికి తగినవాడు" అగస్త్యుడే. కారణం - ఆయన వాతాపి - ఇల్వలుడూ వంటి రాక్షసులని చంపిన వాడూ - రామునికి తపశ్శక్తిని ఇచ్చినవాడూ - రాక్షస సంహారానికై కత్తి - ఆయుధాలని అందిచ్చినవాడూ - విశేషించి రావణవధ కాలంలో ఏమీ తోచకుండా నిలబడ్డ రామునికి ఆదిత్యహృదయ మంత్రోపదేశాన్ని చేసి కర్తవ్య నిర్వహణలో తోడ్పడి విజయాన్ని అందించినవాడూ కాబట్టి. ఇంతకీ గర్భవతిని సీతమ్మని ఎక్కడికి పంపించాలి? అని రాముడు తనలో

అనుకుంటూన్న దశలో, నిత్యం వేదాధ్యయనం జరిగే చోటుకి (అంటే పరోక్షంగా వాల్మీకి ఆశ్రమానికి) పంపితే బాగుంటుందని అగస్త్యుడు పరోక్షంగా సూచించాడు ఈ పులస్త్యుని కథని చెప్పి. (అగస్త్యుని గొప్పదనం ఎంతదో ముద్రణ దాతకై ఎదురు చూస్తూన్న నా అరణ్యకాండ వ్యాఖ్యలో గమనించవచ్చు)

## యక్ష - రాక్షసుల ఉత్పత్తి

"రాక్షసులు నివాసం ఉండేందుకని విశ్వకర్మ త్రికూట పర్వత శిఖరం మీద 'లంక' అనే పేరున్న పురాన్ని నిర్మించాడు. ఇంద్రుని అమరావతికి దాదాపు సమానంగా ఉండే ఈ లంకలో లేని సౌకర్యం లేదు. కాని విష్ణువుకి భయపడి రాక్షసులు పాతాళానికి వెళ్లిపోయారు. ఆ లంక ప్రస్తుతం ఎవ్వరూ లేకుండా ఉంది కాబట్టి నువ్వు వెళ్లి సుఖంగా ఉండు" అని విశ్రవుడు తన పుత్రుడు కుబేరునికి ఆజ్ఞనిచ్చాడు. కాబట్టి ఎప్పటి నుండో లంక రాక్షసులదే నిజానికి.

అగస్త్యుడు ఇలా చెప్తూనే ఉన్నాడు. 'రామా! బ్రహ్మ మొదటిగా నీళ్లని సృష్టించాడు. వాటిని రక్షిస్తాం. (రక్షామః) అన్నవాళ్లు రాక్షసులయ్యారు. వాటిని భక్షిస్తాం (జ(య)క్షామః) అన్నవాళ్లు యక్షులయ్యారు. రాక్షసులలో అహేతి ప్రహేతి ఇద్దఱు పుట్టారు. రెండోవాడు తపస్సుకై పోగా అహేతి, యముని చెల్లెల్ని 'భయ' అనేదాన్ని పెళ్లాడి విద్యుత్కేశుణ్ణి కన్నాడు. తనలాటి విప్లవ - దుర్మార్గ లక్షణాలున్న భార్య తనకి కావాలనుకున్నాడు. 'సాలకటంకట' అనే తన కూతుర్ని 'సంధ్య' అనే రాక్షసి భార్యగా వీనికిచ్చింది. సాలకటంకట ఇంకా నెలలు నిండక మునుపే తన గర్భంలో నుండి పిల్లవాణ్ణి కని మందర పర్వత సమీపంలో వాణ్ణి విడిచి భర్తతో సుఖించడం కోసం వెళ్లిపోయింది. (సంతానాన్ని కని, వారి ఆలన పాలన చూడక భర్త తోడిదే లోకం అనుకున్నవారంతా రాక్షస జాతి వారన్నమాట) పార్వతీ దేవి విమానంలో వెడుతూ ఈ ఏడుస్తూన్న పిల్లవాణ్ణి గమనించి విషయం తెలిసికొని భర్తకి చెప్పింది. బోళాశంకరుడు వెంటనే ఆ పిల్లవానికి చావులేని వరం, వరంతోపాటు ఒక విమానాన్నీ (పిల్లవానికి ఇప్పుడు లేనివి రెండే రెండు ఒకటి ప్రాణరక్షణ రెండవది

అటవస్తువూ కదా! ఆ రెంటినీ ఇచ్చాడన్న మాట) ఇచ్చాడు. పార్వతి ఇంకా జాలిపడుతూ రాక్షస స్త్రీలందరికీ నెలలు నిండిన వెంటనే వయసు వచ్చిన పుత్రులే పుట్టాలని వరాలిచ్చింది. క్రమక్రమంగా సుకేశుడు వయసుకి మించిన దుష్ట లక్షణాలని పొందాడు. వీనికి గ్రామణి అనే గంధర్వుడు తన పుత్రి దేవవతిని భార్యగా ఇచ్చాడు.

రామచంద్రా! వానికి, మూడు రోగాలు పుట్టినట్లుగా మాల్యవంతుడూ - సుమాలీ - మాలీ పుట్టారు. చికిత్స చేయనప్పుడు వ్యాధి ముదిరినట్లుగా వాళ్లలో చెప్పరాని హింసాదృష్టి - ఆవేశ లక్షణాలూ - అతికామం పుట్టాయి. (నేటి కాలపు చిత్రాలూ నవలలూ ఈ ఇతివృత్తాలతోనే ఉంటూ ఈలక్షణాలనే నేర్పుతున్నాయంటే మనని రాక్షసులుగా తీర్చి దిద్దుతున్నాయనే గదా భావం! ) వాళ్లు బ్రహ్మని గూర్చి తపస్సు చేసి 'అజేయత్వం - పరస్పరానురాగం - ఐకమత్యం' వరాలుగా పొందారు. ముగ్గురూ లంకని రాజధానిగా చేసికొన్నారు.

దేవతల మీదికి యుద్ధాలని ప్రారంభించారు. విష్ణువు మాలిని చంపాడు. ఆ కోపంతో మిగిలిన ఇద్దఱూ విష్ణువు మీదికి వచ్చారు. విష్ణువు చక్రాన్ని విడిచి వారి వెంట పడగా మాల్యవంతుడు 'పరిగెత్తే వారిపై ఆయుధాన్ని విడువడం ధర్మం కాదు' అని వాదం చేసాడు. 'మీ కంటె నన్ను నమ్మిన దేవతల రక్షణం మిన్న' అంటూ విష్ణువు మాల్యవంతుణ్ణి సంహరించాడు. (వీని తండ్రి సుకేశునికి ప్రాణదానం అలనాడు పార్వతి చేయకపోతే అసలు ఈ ముగ్గురు అన్నదమ్ముల జన్మేలేదు. ప్రాణదానం పొందిన సుకేశుడు మాత్రం కృతజ్ఞుడై పడి ఉన్నాడా? శివుడిచ్చిన విమానంతో దేవతల మీదికీ, ప్రాణదానం చేసిన శంకరుని మీదికీ కూడా యుద్ధానికి వెళ్లాడు. దీనినే కృతఘ్నత అంటారు. ఈ లక్షణానికి మార్గదర్శకులు రాక్షసులన్నమాట). భయపడ్డ సుమాలి మాత్రం తన కూతురు 'కైకసి'ని తీసికొని భూలోకానికి వచ్చేసాడు. రామచంద్రా! ఇలా రాక్షసులని చంపిన విష్ణువెవరో వేఱుగాలేరు. 'భవాన్ నారాయణో దేవశ్చతుర్బాహుః సనాతనః - రాక్షసాన్ హంతు ముత్పన్నో హ్యజేయః ప్రభు రవ్యయః' నీవే రాక్షసులని చంపడానికి వచ్చావు. (ఇక్కడ రాముడు దేవుడే! అని స్పష్టంగా ఋషుల సమక్షంలో అగస్త్యుడు చెప్పనే చెప్పాడు. అయినా

ఏమీ తెలియని వానిలా రాబోయే రావణాదుల జన్మ వృత్తాంతాన్ని వినదలచడం కేవలం మనకి తెలియజేయడానికే అని గ్రహించాలి).

## రావణాదుల పుట్టుక

ఏ తండ్రి అయినా తాను దుర్మార్గుడే అయినా సంతానం మాత్రం ఉత్తములు కావాలనే కోరుకుంటాడు. రామచంద్రా! అదే ఆలోచన కల సుమాలి కూడా తన పుత్రిక కైకసిని పిలిచి విశ్రవుణ్ణి (కుబేరుని తండ్రి) ప్రార్థించి సంతానాన్ని పొందవలసినదిగా చెప్పాడు. ఆమె అలాగే విశ్రవసుని వద్దకు వెళ్లి తల దించుకొని సిగ్గుపడుతూ నిలబడి తన అభిప్రాయాన్ని ఆయననే తెలిసికో వలసినదిగా పల్కింది.

దివ్యదృష్టితో విషయాన్ని గ్రహించిన ఆయన "కైకసీ! నీ ఆలోచన మంచిదే అయినా ఈ అడిగిన కాలం, నేను నిన్ను చూచిన కాలం సరైంది కాదు కాబట్టి పరమ క్రూరులూ, దారుణాకారులూ అయిన రాక్షసులు నీకు పుత్రులుగా జన్మిస్తారు" అన్నాడు. ఆమె భయపడి క్షమించమని ప్రార్థించింది. జాలిపడిన మహర్షి "కైకసీ! చిట్టచివరి వాడు మాత్రం ధర్మాత్ముడౌతాడు" అని అభయాన్నిచ్చాడు.

కొంతకాలం కాగానే పది తలలూ, ఇరవై చేతులూ, బలిష్ఠమైన కంఠంతో ఒకడు పుట్టాడు. మహర్షి వాణ్ణి చూచి దశకంఠుడు అని పేరు పెట్టాడు. వాడు పుట్టిన రోజున నెత్తురువానలూ, పంచభూతాలలో ఘోరమైన మార్పులూ, అమంగళకరధ్వనులూ విన్పించాయి. ఆ పిమ్మట కుంభకర్ణుడూ, ఆ వెంట అతి కుటిలాత్మురాలు శూర్పణఖ కూడ కలిగారు. తనకు సంతానం కల్గినందుకు ఆనందపడింది కాని పుట్టినవాళ్లు క్రూర నీచ స్వభావులు కావడంతో లోలోపల దుఃఖించింది కూడ.

ఆ మీదట పరమ ధర్మాత్ముడూ, తేజస్సుతో వెలుగుతూన్నవాడూ అయిన విభీషణుడు పుట్టాడు. వేలెవరూ చెప్పనక్కఱ లేకుండా ఇతడు పుట్టగానే పూలవాన పడింది. జంతువులు ప్రదక్షిణాకారంగా గంతులు వేసాయి. మేఘాలు చక్కగా ధ్వనించాయి. ఆమె మహానంద పడింది.

## లో రహస్యం

పూర్వమే అనుకున్నట్టుగా మహర్షి అయిన విశ్రవస్సు దృష్టి పడడంతోనే కైకసికి పుత్రులు కల్గారు. అంటే అంతటి తపశ్శక్తి సంపన్నుడాయన. కైకసికి వివాహం కాలేదు. విశ్రవస్సు ఈమెను భార్యగా గ్రహించనూ లేదు. కాబట్టి రావణ - కుంభకర్ణ - శూర్పణఖ - విభీషణులు కన్యాపుత్రులే (కానీనులు).

వివాహంలో సుముహూర్తానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. మొదటి సారిగా వధువూ - వరుడూ పరస్పరమూ ఒకరి భ్రూమధ్యాన్ని (కనుబొమల మధ్య ప్రదేశాన్ని) వేరొకరు బంధుజన - మంగళవాద్య ఘోష - యోగ్యకాల - మంత్ర ఘోషల మధ్య చూచుకొనేందుకు ఏర్పాటు చేయడమే సుముహూర్తమంటే. ఆ కాలం దుష్కాలమైతే సంతానం ఆ కాలప్రభావాన్ని బట్టి ఉంటారు. (వివరంగా నా 'మాంగల్య తంతునానేన' పుట 81 చూడగలరు).

కైకసి ఇలాటి దుష్కాలంలో మహర్షిని యాచించడానికి రావడం ఆమెకు పుత్ర శోకం (పుత్రులు చనిపోతే కల్గే దుఃఖం) ముందు కాలంలో కలగవలసి ఉండడమే. వివాహాలకి ముహూర్తాలతో పాటు గర్భ + ఆధానపు ముహూర్తాన్ని కూడ నిర్ణయించడానికి కారణం సత్సంతానం కలగడానికే. దుష్టసంతానం, ప్రారంభంలో తమ కుటుంబానికీ, ఇప్పటి కాలంలో రాజుకి - రాజ్యానికీ, ఆమీదటి కాలంలో దేశానికీ దుఃఖాన్ని కల్గిస్తారు.

కైకసి మహర్షిని యాచించిన కాలం దుష్టమైనదే అయినా ఆయన జాలిపడి ఒక ధర్మాత్ముణ్ణి అనుగ్రహించాడు. ఇదెలా సాధ్యం? దుష్టమైనకాలంలో యాచించినా సుపుత్రుడు ఎలా కలిగాడు? అంటే ఆయన ఆమె మీది కరుణతో తన తపశ్శక్తిని ధారపోసి సుపుత్రుణ్ణి ఆమెకు అనుగ్రహించాడన్నమాట. కాబట్టి ఏదో కొంత దైవశక్తి మన వైపు ప్రసరిస్తే తప్ప (దైవం మెచ్చే కొన్ని పనులని మనం చేసి ఉంటే తప్ప) సత్సంతానం కలిగే అవకాశం లేదన్నమాట.

ఇందులో ఓ రహస్యమూ ఉంది. మహర్షులని ఎందరినో చూపించిన నాడు సుమాలి (కైక. తండ్రి) ఆ మహర్షులంతా వి

దేవతలని ఆరాధిస్తారో, ఆ దేవతలతో యుద్ధాలు చేసిన వాడు సుమాలి. అయినా తన పుత్రికని సత్సంతానం కోసం మహర్షిని యాచించవలసినదిగా పంపాడు. ఎదుటి వారిపై దాడి చేస్తూనే, వారి ద్వారా మంచిని పొందదలచడం రాక్షస లక్షణమని దీని భావం. ఇన్ని దారుణాలు సుమాలి చేస్తున్నాడని గమనించి కూడ కైకసికి సంతానాన్ని విశ్రవసుడు ఎందుకనుగ్రహించాలి? "మహర్షులు - దేవతలు - విష్ణువు...... ఇలా ఇందరిని బాధిస్తున్నావు కదా!" అని అనలేదు.

ఉత్తముల లక్షణం ఉత్తమం గానే ఉంటుంది. ఆమె అడిగింది. తీర్చగలిగిన శక్తి తనకి ఉన్నప్పుడు కోర్కెని తీర్చడమే. అయితే అడిగిన వేళ సరిలేదు. ఫలితం ఆమెదే కదా! - మహర్షులే కాదు దేవతలూ అంతే! తమ మీదికే యుద్ధానికి వచ్చి తమని పారద్రోలుతారని తెలిసినా, దేవతలు రాక్షసులకి వరాలు ఇస్తూనే ఉంటారు. ఆ రాక్షసులకే వరాలని అనుగ్రహించే శక్తి ఉంటే ఇస్తారా! ఈయనే ఈయరు. అందుకే వారికి ఆ శక్తి లేదు. తపశ్శక్తిని తగినంత చూపించినప్పుడు వరం ఈయవలసిన కర్తవ్యం - ధర్మం - దేవతలమీద ఉంది. అందుకే దేవతలు రాక్షసులకైనా ఇచ్చారే తప్ప వ్యతిరేకించలేదు.

సుకేశుని విషయంలో అతడు ప్రార్థించకపోయినా పార్వతీశంకరులు వరాలిచ్చారు. ఇక ఇచ్చిన వరాలని దుర్వినియోగ పఱచుకుని తమ మృత్యువుని తామే కొనితెచ్చుకున్నవాళ్లు రావణకుంభకర్ణులైతే, సద్వినియోగపఱచుకుని చిరస్థాయికీర్తిని సముపార్జించుకున్నవాడు విభీషణుడు. ఈ విషయాన్ని తెలియజేయడానికే ఈ ఇతిహాసాన్ని విన్పిస్తున్నాడు అగస్త్యుడు. ఆ విషయాన్ని వాల్మీకి మహర్షి మనకి అందిస్తున్నాడు.

దీన్నే మనకి అన్వయించుకుంటే ఏ జ్ఞానంలేని ఏ జంతువుగానో పక్షిగానో గాక మానవునిగా మనకు జన్మనిచ్చాడు భగవంతుడు. ఇదీ ఒక వరమే కదా! ఈ జన్మని సద్వినియోగపఱచుకుంటే విభీషణులం. భగవచ్చింతనా,ధార్మికబుద్ధీ లేకుండా దుర్వినియోగ పఱచుకుంటే రావణకుంభకర్ణులం.

## రావణాదులకు వరాలు

కఠోరతపస్సు చేసిన రావణుడు బ్రహ్మతో 'స్వామి! ప్రాణులకి చావుకంటె మించిన భయంలేదు కాబట్టి ఎవరి చేతనూ చావులేని వరమియ్యి'అన్నాడు. (భగవాన్ ప్రాణినాం నిత్యం నాన్యత్ర మరణా ద్భయం నాస్తి మృత్యుసమశ్శత్రుః అమరత్వ మహం వృణే) ఆ వరం ఇయ్య వీలులేనిది. వేరే కోరుకొమ్మని అన్నాడు బ్రహ్మ. వెంటనే రావణుడన్నాడు. 'దేవా! గడ్డిపరకతో సమానులు మనుష్యులు. కాబట్టి నాకు వారొక లెక్క కావేకాదు. ఇక మిగిలిన ఏ ప్రాణివలనా నాకు మృత్యువు లేకుండా వర మియ్యి' అని. ఈ వరాన్ని ఇచ్చి 'రావణా! నువ్వు అడగనివి మరో రెండు వరాలు నేనిస్తా విను. నన్నుద్దేశించి నువ్వు నీ తలలను హోమం చేస్తే తిరిగి మళ్లీ ఆ తలలు నీకు లభిస్తాయి. నువ్వు ఏ రూపం కావాలనుకుంటే ఆ రూపం నీకు సాధ్యం అవుతుంది' అంటూండగానే రావణుడు తన తొమ్మిది తలలనీ ఎదురుగా ఉన్న అగ్నిలో హోమంచేసి తిరిగి పొందనే పొందాడు.

నమస్కరించిన విభీషణుడు 'బ్రహ్మదేవా! ప్రాణకష్టం వచ్చినా నా మనస్సు ధర్మాన్ని తప్పకూడదు. ఎవరూ ఉపదేశించకపోయినా బ్రహ్మాస్త్రం నాకు లభించాలి,' అని కోరాడు. ఎంతో సంతోషపడిన బ్రహ్మ, 'విభీషణా! రాక్షసకులంలో పుట్టినా ధర్మబుద్ధి ఉన్న నీకు నీవడిగిన వానితో పాటు బ్రహ్మత్వాన్నీ అడగని అమరత్వాన్నీ (చావు లేకపోవడం - దైవత్వం) కూడ ఇస్తున్నాను' అని అన్నాడు.

ఇక కుంభకర్ణుడు వరాలని అడుగబోయేటప్పుడు బ్రహ్మ కోరికపై వాని నాలుకమీదకి సరస్వతీదేవి చేరింది. అంతే! "అనేక సంవత్సరాలు నిద్రించే వరం కావాలి" అన్నాడు కుంభకర్ణుడు. ఇచ్చానని చెప్తూ మాయమయ్యాడు బ్రహ్మ.

ఇక్కడ ముగ్గురికి మూడు విధాలుగా వరాలనిచ్చాడు బ్రహ్మ. మరణం, ప్రాణికి సహజధర్మం అయితే దాన్ని కాదంటూ చావులేని వరాన్ని అడిగిన రావణునికి "కుదురదని" సమాధానమిచ్చాడు. రావణుడడిగిన ఈ వరం వలన దేనికి అతడు భయపడుతున్నాడో బ్రహ్మకి అర్థమై, మరో వరం కోరుకొమ్మన్నాడు. రెండవమాటు కూడా చావు లేని వరాన్నే అడుగుతూ మనుష్యులని లెక్కపెట్టనన్నాడు. 'బుద్ధింతు

సారథిం విద్ధి' అని పరమాత్మ మాట. మనకి అడిగించే తెలివితేటలనిచ్చే బుద్ధి కూడా పరమాత్మే. ఆ పరమాత్మ సారథ్యంలోనే ఈ శరీరం అనే రథం వెడుతూ ఉంటుంది కదా! అందుకే మనుష్యునితో చావవలసిన యోగం ఉన్న రావణుడు, కావాలని మనుష్యజాతిని గూర్చి చెప్పి మిగిలిన జాతివారివలన మరణం లేకుండుగాక! అని కోరుకున్నాడు. ఆ మనుష్య జాతిగురించి మాటాడి ఉండకపోతే బ్రహ్మకి రావణుణ్ణి చంపే అవకాశం ఏమిటో బోధపడి ఉండేదేకాదు.

మొత్తంమీద రావణుడు వరం అడిగిన తీరులోనే తనని మనుష్య రూపంలో సంహరించవలసిందని రావణుడు కోరుకున్నట్లుగా బ్రహ్మ నిర్ణయించుకున్నాడు. తనకి ఆలోచించవలసిన అవసరం లేకుండా తన ముగింపుని తానే నిర్ణయించుకుని శాపం లాటి వరాన్ని రావణుడు కోరుకున్నాడని గమనించిన బ్రహ్మకి, మనవడి మీద (తనకి పుత్రుడు పులస్త్యుడు లేదా విశ్రవసుడు. అతని పుత్రుడే కదా! మరి) జాలి కలిగి రావణుడు అడగని వరాలని రెంటిని ఇచ్చాడు. రాక్షస జాతి పరమ దుర్మార్గమైనదని తెలిసి, అడిగిన వరాన్నే ఇయ్యడానికి కుదరదని పల్కిన బ్రహ్మ "అడగని రెంటిని కూడ ఎందుకిచ్చి ఉంటాడు?" అని రావణుడు ఆలోచించాలి నిజానికి. ఎదుటివాణ్ణి, ముఖ్యంగా శత్రువుని ఆలోచించేలా చేయకుండా ఉండాలంటే, తమకి ఇబ్బంది రాని విధంగా, వాడు అడగని మఱోదాన్ని కూడ ఇయ్యడం మంచిదని బ్రహ్మ చెప్తున్నాడన్న మాట. ఆ ఆనందంలో రావణుడింక ఏమీ ఆలోచించలేకనే పోయాడు.

ఇక్కడొక పరమ రహస్యం ఉంది. ఏ రూపం కావసివస్తే ఆ రూపాన్ని ఎత్తగల వరాన్ని రావణునికి బ్రహ్మ ఇచ్చాడు. కాబట్టి అన్ని రూపాలలోనూ రావణుడుండే వీలుందని బ్రహ్మ వరం ద్వారా విష్ణువు గ్రహించాడు. అతి జాగ్రత్తగా ఉండాలని భావించాడు. అందుకనే మానవావతారం ఎత్తిన రాముడు సర్వజాతులతోనూ స్నేహ ధర్మాన్ని పాటించాడు. రావణుడు పక్షిరూపం గాని ఎత్తితే జటాయుసంపాతులూ, నిషాద రూపం ఎత్తితే గుహుడూ, భల్లూక రూపం ఎత్తితే జాంబవంతుడూ, మర్కట రూపం ఎత్తితే చెప్పనక్కఱ లేదు ఎందఱో

కోతులూ, రాక్షస రూపంలోనే ఉంటే విభీషణుడూ,........... ఇలా అందఱూ తన పక్షం వాళ్ళే తనకి వాని రహస్యాన్ని చెప్పేవాళ్ళుగా చేసికొన్నాడు. రావణుడూ తక్కువ వాడేం కాదు గాబట్టే, రామునికి స్నేహం లేని లేడిజాతి రూపంలో మారీచుణ్ణి పంపాడు. సంన్యాస రూపంలో తాను వెళ్లి సీతని అపహరించాడు. రామునికి ఈ విషయం తెలియదా! ఇన్ని రూపాలలోనూ లేనివాడు తనకి అపకారం చేసాడంటే ఆ రూపమూ, ఆ రూపంలోని వ్యక్తీ రావణుడేననీ - లేదా రావణుని ఆలోచన ప్రకారం జరిగి ఉంటుందనీని.

అతను అడగనిదీ - బ్రహ్మ ఇచ్చినదీ అయిన మహోవరం హోమం చేసిన తలలు తిరిగి తనకి జీవంతో రావడం. ఆ బ్రహ్మ ఉండగానే, అందఱూ చూస్తూండగానే రావణుడు హోమం చేయడం - దేవతా పక్షానికి చెందిన బ్రహ్మ నిజంగా వరాలని ఇచ్చాడా? అని పరీక్షించడమూ కావచ్చు. లేదా తానింతటివాణ్ణి సుమా! అని లోకం అంతా చెప్పుకొనేలా ప్రదర్శించడమూ కావచ్చు. బ్రహ్మ ఆనందించడానికి కారణం రావణుని తలలకి హోమం ద్వారా అగ్ని సంస్కారం జరిగింది. అందుచేత మరణ ధర్మం వీనికి పడుతుంది. అదీకాక పదింటిలో తొమ్మిది తలలకి దేవతాబుద్ధి ఉంటుంది కాబట్టి.

రావణుడడిగినా అమరత్వాన్ని ఈయని బ్రహ్మ, విభీషణునికి తానై అమరత్వాన్ని ఇస్తున్నానన్నాడు. కారణం ధర్మబుద్ధి శాశ్వతం కావాలనీ - అధర్మానికి శాశ్వతత్వం ఉండరాదనీను. లోకంలో మంచికి ప్రతీక అయిన విభీషణ విధానమూ ఉంటుంది, దౌర్జన్య దుర్మార్గాలకి ప్రతీక అయిన రావణ విధానమూ (అధర్మం) ఉంటుంది. నిలకడపై విభీషణుని గెలుపుంటుంది. అంటే ధర్మం కొంత ఆలస్యంగా గెలుస్తుంది. విభీషణుడు, ధర్మమూర్తి అయిన రాముణ్ణి ఆశ్రయించినట్లు వ్యక్తి కూడా ధర్మాన్ని ఆశ్రయిస్తే ధర్మం గెలిచి తీరుతుందని లోభావం. 'ధర్మో రక్షతి రక్షితః' అంటే ఇదే.

ఇక విభీషణుడడిగిన వరాలు రెండూ ప్రవర్తనకి సంబంధించినవి. కీడు కలిగిన వేళ, కష్టం వచ్చిన వేళ అధర్మానికి పోవాలనే ఆలోచన దుర్బలులైన మనుష్యులకి సహజంగా కల్గుతూ ఉంటుంది. 'అతడు అధర్మాన్ని చేసి ఎంత సుఖంగా

ఉన్నాడు! ధర్మాన్ని ఆచరించిన నా జీవితం ఏమయింది?' అనే ఆలోచనల చుట్టూ తిరుగుతూ ఉంటాడు. ఈ దౌర్బల్యాన్ని గూర్చిన వరమే విభీషణునిది. ' ఎలాటి స్థితిలో కూడా నా మనసుని ధర్మదృష్టి నుండి మఱలనీయకు' అనేది. ఇలాటి వరాన్నే ప్రతి వ్యక్తీ కోరాలి. తన ఇంటికి రాదలచిన వ్యక్తికి ప్రయాణ మధ్యంలో ఎన్ని ఇబ్బందులు - అడ్డంకులు వచ్చినా ప్రయత్నంతో వాటిని దాటి గమ్యాన్ని చేరుకుంటున్నట్లే కష్టాలు - అవమానాలు ఎదురైనా ధర్మాన్ని తప్పకుండా ఉండే ధైర్యస్థితినీ - మనోనిశ్చలత్వాన్నీ విభీషణవిధానం' అని అనాలన్నమాట. ఇక రెండవది బ్రహ్మాస్త్రం లభించాలనేది. తాను రాక్షస జాతికి చెందినవాడు. బుద్ధి మాత్రం దేవతలది. ఏనాడైనా తన అన్నలతో, ఇతర రాక్షసులతో కష్టం రావచ్చు. అందుకని ఏ బ్రహ్మాస్త్రానికి అధినేత బ్రహ్మయో, ఆయన్నే అడిగాడు 'నీ పేరిట అస్త్రం నాకు ఎవరూ నేర్పకుండానే లభించాలి' అని. ఆయన కూడా ఇస్తానన్నాడు. కారణం ఆ బ్రహ్మాస్త్రం లోకాలని పాడుచేసేదే అయినా విభీషణుల వంటి ధర్మాత్ముల వద్ద ఉంటే ఏ కష్టమూ లోకాలకి రానీడని తెలిసి. నిజానికి అంతే జరిగింది కూడ.

రావణుడుగానీ, వాని అనుచరులు గానీ బ్రహ్మాస్త్రాన్ని తనమీద ప్రయోగించే రోజు రావచ్చు. అప్పుడు ఆత్మరక్షణార్థం బ్రహ్మాస్త్రం ఉండాలని తీసికొన్నాడు విభీషణుడు. ప్రయోగించాలని కానే కాదు. మొత్తంమీద విభీషణుడు అడిగిన రెండు వరాలూ - (ఒకటి ధర్మం తప్పకూడదు - రెండు - లోకోపద్రవాన్ని ఎదుర్కొనే బ్రహ్మాస్త్రం కావాలి అనేవి) - ఈ రెండూ లోక రక్షణం కోసం అడిగినవే తప్ప తనకోసం కాదుగదా! అలాటి లోకరక్షణ దృష్టి ఉన్న ఈ విభీషణుడు దైవతుల్యుడని భావించి అమరత్వాన్ని అడుగకుండా ఇచ్చాడు బ్రహ్మ. అయితే దేవలోకంలో ఉండడం వలన భూలోక ధర్మం నిలపడం కుదరదని భావించి, భూలోకంలో ఉండి అమరత్వాన్ని పాటిస్తూ జీవించేలా అ-మర ధర్మాన్ని (ధర్మ బుద్ధితో శాశ్వతంగా చావు లేకుండా ఉండే తనాన్ని) అనుగ్రహించాడు బ్రహ్మ.

శూర్పణఖ ఏ తపస్సూ చేయనూ లేదు - వరాలని పొందనూ లేదు. వాళ్ల అన్నల వరాలన్నీ తనవే కదా! అనే బుద్ధి ఆమెది.

ఈ వరాలూ - దానాలూ అన్నీ చూస్తున్న కుంభకర్ణునికి ఎలాటి బుద్ధి పుడుతుందోనని భావించిన బ్రహ్మ, అతని నాలుకపై సరస్వతిని ప్రవేశపెట్టాడు. 'స్వప్తుం వర్షా ణ్యనేకాని దేవదేవ మమేప్సితమ్'' అనేక సంవత్సరాలు నిద్రపోవాలనేది నా కోరిక' అన్నాడు కుంభకర్ణుడు. 'నిద్ర' అంటే అర్ధమృత్యువుతో సమానం. 'ఎప్పుడూ సగం చచ్చిపడి ఉండే వరాన్నియ్యి' అని కుంభకర్ణుడడిగాడన్నమాట. రావణుడు అడిగిన వరాలలో 'మనుష్యుని వలన మాత్రమే చావు రావాలనే అర్థం' దాగి ఉండగా, కుంభకర్ణుని వరంలో సగం చావు ఎప్పుడూ అంగీకరిస్తున్నాను, అనే అర్థం దాగి ఉంది. మరణాన్ని అంగీకరించనని వరం అడిగితే ఇంక చెప్పవలసిన దేముంది? పోనీ! ఈ వరాన్ని కోరిన వెంటనే 'శాశ్వతంగా నిద్రలో ఉండిపోవాలి సుమా!' అని కోరినా బాగుండేది. కాని ఈ వరాన్ని ఇచ్చిన బ్రహ్మ, సరస్వతితో సహా మఱి ఏ అవకాశాన్నీ వానికి ఈయకుండా, అంతర్ధానమై పోనేపోయాడు. కాబట్టే పెద్దలంటారు. 'బుద్ధిః కర్మానుసారిణీ' అని. మనం చేయబోయే పనికి అనుగుణంగానే - (భవిష్యత్కాలంలో జరుగబోయే దానికి అనుగుణంగానే) మన బుద్ధి ప్రవర్తిస్తుందని దీని భావం. వరాన్ని యాచించ వలసినది భగవంతుణ్ణి. కోరుకోవలసినది కూడ వాని ఆలోచనకి అనుగుణంగా. ఇక మనకి 'మన తనం' ఏమున్నది? అని ఆత్మ పరిశీలన చేసికొన్ననాడు భగవంతుణ్ణి శరణు వేడక ఏ ఒక్కడూ ఉండడు. ఉండలేడు. ఆ విషయాన్ని వివరించడానికే ఈ ఇన్ని ఇతిహాసాలూ - పురాణాలూను.

సంపూర్ణంగా భగవంతుణ్ణి శరణువేడుతూ ఉండేవాళ్లు మహర్షులు. భగవంతుని నుండి వరాలని పొంది కూడా అది తమ తపస్సు వలననే వచ్చిందనుకొని దేవతల మీదకే దండయాత్రకి పోయేవాళ్లు రాక్షసులు. కొంత ఇటూ, కొంత అటూ ఉంటూ మధ్యేమార్గంగా ఉండేవాళ్లు-మంచి జరిగితే తమ ప్రతాపం అనీ, కష్టం కలిగితే దైవం అనుకూలించలేదనీ అనేవాళ్లు - మనుష్యులు. అందుకే మర్త్యులు (మనం) మధ్యసోపానం మీద ఉన్నాం. ఒక మెట్టు పైకి వెడితే మహర్షులం కాగలం. క్రిందికి దిగితే రాక్షసులం ఔతాం. పైకే వెళ్లాలని సూచించి చెప్పేవే ఈ ఇతిహాస పురాణాలు. ఇక్కడి శ్లోకాలు ఇవిగో!

సుపర్ణనాగయక్షాణాం దైత్య దానవ రక్షసామ్ అవధ్యోహం ప్రజాధ్యక్ష దేవతానాం చ శాశ్వత! న హి చింతా మమాన్యేషు ప్రాణిష్వమర పూజిత! తృణ భూతా హి తే మన్యే ప్రాణినో మానుషాదయః|| శృణు చాపి వరో భూయః ప్రేత స్యేహ శుభోమమ - హుతాని యాని శీర్షాణి పూర్వ మగ్నౌ త్వయానఘ పున స్తాని భవిష్యంతి తథైవ తవ రాక్షస| ఛందస్తవ రూపం చ మనసా యద్యథేప్సితమ్ భవిష్యంతి న సందేహో మద్వరాత్తవ రాక్షస|| పరమాపద్గతస్యాపి ధర్మే మమ మతి ర్భవేత్ అశిక్షితం చ బ్రహ్మాస్త్రం భగవన్ ప్రతిభాతు మే| నా ధర్మే జాయతే బుద్ధి రమరత్వం దదామి తే| వాణి త్వం రాక్షసేంద్రాస్యే భవయా దేవతేప్సితా| ఈ దృశం కిమిదం వాక్యం మమాద్య వదనా చ్చ్యుతమ్!

## రావణ దుశ్చేష్టితాలు

సుమాలి (రావణుని తాత - కైకస్ తండ్రి) కేతుమాలి అనే భార్య యందు అకంపనుడు - కాలకార్ముకుడు - భాసకర్ణుడు - సుపార్శ్వుడు - సంహ్రాది - ప్రఘసుడు - ప్రహస్తుడు - వికటుడు - ధూమ్రాక్షుడు - దండుడు అనే పదిమంది పుత్ర సంతానాన్నీ, పుష్పోత్కట - కైకసి - కుంభీనసి అనే ముగ్గురు పుత్రికా సంతానాన్నీ పొందాడు. 'మాలి' అనే వీని తమ్ముడు 'వసుధ' అనే భార్య యందు అనిలుడు అనలుడు సంపాతి హరుడు అనే నల్గురు పుత్రులని కన్నాడు. వీరే విభీషణుని మంత్రులు.

దుర్మార్గుడు ఒకడుంటే వానికి దురాలోచనలని ఇచ్చేవాడూ వెంట ఉంటాడు. ఇది లోకరీతి. ప్రహస్తుడు లంకానగర వృత్తాంతాన్ని రావణునికి చెప్పి రావణుణ్ణి ఒప్పించి, తానే కుబేరుని వద్దకు పోయి, లంకానగరం మొదటినుండీ సుమాలి మొదలైన రాక్షసులది కాబట్టి యక్షవంశపు వాడవైన నువ్వు దీనిని విడిచి పోవాలని కుబేరునితో చెప్పాడు. కుబేరుడు తన తండ్రి విశ్రవసుణ్ణి అడిగి ఆయన సూచనపై వెంటనే లంక విడిచి కైలాసానికి వెళ్లిపోయాడు. లంకకి తన నివాసాన్ని మార్చాడు రావణుడు. కాలకుడనే వానికి పిల్లలయిన కాలకేయుల వంశంలో పుట్టిన విద్యుజ్జిహ్వునితో తన చెల్లెలు శూర్పణఖ వివాహాన్ని జరిపించాడు. అప్సరసలలో ఒకతె అయిన హేమ, తన భర్త అయిన మయుణ్ణి విడిచిపోగా వారిరువురికీ కల్గిన మండోదరిని తాను అగ్నిసాక్షిగా భార్యగా మయుని కోరికపై స్వీకరించాడు.

ఆనందపడిన మయుడు అల్లుడైన రావణునికి 'శక్తి' అనే అస్త్రాన్నిచ్చాడు. (యుద్ధంలో లక్ష్మణ మూర్ఛకి కారణం ఇదే.) ఇక కుంభకర్ణునికి వైరోచనుని మనుమరాలు వజ్రజ్వాలనీ, గంధర్వుడైన

శైలూషుని పుత్రిక సరమని విభీషణునికీ, ఇచ్చి రావణుడు పెళ్లి జరిపించాడు. మానస సరోవరం వర్ష కాలంలో పెరిగి పోతూ ఉంటే శైలూషుని భార్య ప్రసవించింది. ఆ చిన్నపిల్ల వరదని చూచి భయపడుతూంటే, తల్లి 'సరః (ఓ సరస్సా) మా (పెద్దగా వృద్ధి చెందకు)' అనగానే నీరు తగ్గింది. అప్పటి నుండి ఆమె 'సరమ' అయింది. ఈమె ధర్మపరురాలు. విభీషణుని భార్య. వీరి పుత్రిక (అ) నల కూడ పరమ ధర్మపరురాలైంది. కొంత కాలానికి మండోదరి పుత్రుణ్ణి ప్రసవించింది. వాడు నేలన పడగానే మేఘం ఉఱిమినట్లు ధ్వని కావడంతో వానికి 'మేఘనాథుడు' (మేఘంలా నాదాన్ని చేసినవాడు - కల్గించిన వాడు) అని పేరు పెట్టారు.

ఇక సహజ మదంతో రావణుడు లోకాలన్నింటినీ బాధించడం - పతివ్రతా స్త్రీలని చెఱపట్టడం, మహర్షులని వధించడం చేస్తూంటే, కుబేరుడు "ఇది సరికాదని" రావణునికి తెలియ జెప్పడానికి దూతని పంపాడు. రావణుడు ఆ దూతని చంపడమే కాకుండా కుబేరుని మీదికే యుద్ధానికి వెళ్లి కుబేరుణ్ణి ఓడించి ఆయన పుష్పక విమానాన్ని హరించి లంకకి బయలుదేరాడు. (దూతని చంపడం రావణునికి అలవాటే. ఆంజనేయుణ్ణి కూడా చంపవలసినదని ఆజ్ఞని రావణుడీయగా విభీషణుడు సరికాదనడంతో ఆ శిక్ష అమలు కాలేదు.)

## రావణునికి శాపపరంపర

పుష్పకాన్ని హరించి రావణుడు వెనుదిరిగి పోతూంటే పార్వతీ శంకరులు నృత్యం చేస్తున్న ప్రాంతంలో పుష్పకం కదులలేదు. నందీశ్వరుడు శివపార్వతీ నృత్యాన్ని కారణంగా చెప్పాడు. నందీశ్వరుని మాటలని విని వానిని కోతిముఖం వాడివని పలికి వెటకారంగా నవ్వాడు రావణుడు. (తం దృష్ట్వా వానరముఖ మవజ్ఞాయ స రాక్షసః ప్రహాసం మముచే తత్ర) దానికి కోపించిన నంది 'బుద్ధిహీనుడా! నువ్వు చేసిన ఘోరకృత్యానికి ఇప్పటికే చచ్చావు. (చనిపోవడానికి తగినంత పాపం చేసి చావుని తెచ్చుకున్నావు). నేను చంపడం అనవసరం. అయితే కోతిముఖం వాడివని పరిహసించావు కాబట్టి నా బలమూ, ఆకారమూ కలిగి, గోళ్లూ, కోరలూ ఆయుధాలుగా కల ఎన్నో కోతులు నీ మిత్ర బంధు పుత్ర పరివారాన్ని చంపుతారని గమనించు' అని

శపించాడు. (న హంతవ్యో హతస్త్వం హి పూర్వమేవ స్వకర్మభిః కిం త్విదానీ మ్మయా శక్యం హంతుం త్వాం హే నిశాచర! యస్మా ద్వానర రూపం మా మవజ్ఞాయ దశానన! అశనీపాత సంకాశ ముపహాసం ప్రముక్తవాన్ తస్మాన్మద్రూపసంపన్నా మద్వీర్య సమతేజసః - ఉత్పత్స్యంతి వధార్థం హి కులస్య తవ వానరాః నఖ దంష్ట్రా యుధాః క్రూరాః మనస్సంపాత రంహసః।।)

అహంకరించిన రావణుడు నందివాక్యాన్ని లెక్కచేయక నందీశ్వరుని యజమాని అయిన పరమేశ్వరుని కైలాసాన్నే ఎత్తడం ప్రారంభించాడు. పార్వతి భయపడి పరమేశ్వరుణ్ణి కౌగిలించుకోగా శంకరుడు తన కాలిబొటన వ్రేలుతో కైలాసాన్ని అణిచాడు. దానితో రావణుని చేతివ్రేళ్లు కైలాసానికీ భూమికీ మధ్యపడి నొప్పితో ముల్లోకాలూ - వనాలూ దద్దరిల్లేలా అఱిచాడు. (యస్మాల్లోకత్రయం చైతత్ రావితం భయమాగతమ్ - తస్మాత్త్వం రావణో నామ నామ్నా రాజన్ భవిష్యసి) రావణుని ప్రార్థన విని వచ్చిన శంకరుడు అతని రావాల కారణంగా అతనికి రావణుడనే పేరుపెట్టి 'ఇకపో!' అన్నాడు. రావణుడు మెల్లగా శంకరునితో 'స్వామీ! నాకు బ్రహ్మ దీర్ఘాయుష్యాన్ని ఇచ్చాడు. మనుష్యులని నేను లక్ష్యపెట్టను. ఇప్పటి వఱకూ నా వయస్సు కొంత అయిపోయింది. అయిపోయిన వయస్సు తిరిగి వచ్చేలానూ, నీ పేరిట శస్త్రాన్ని ఇస్తూనూ నన్ననుగ్రహించవలసినది' అని వేడుకున్నాడు. సరేనని శంకరుడు నూఱు సూర్యుల కాంతి గల చంద్రహాసమనే ఖడ్గాన్ని ఇస్తూ, 'నీ ఆయుష్యాన్ని కూడా పెంచాను -అయితే ఈ కత్తిని నిత్యం పూజింపక పోతే ఇది నా వద్దకే వస్తుంది' అన్నాడు. అప్పటి నుండి నిత్య శివపూజ ప్రారంభించాడు రావణుడు.

తాడి ఎక్కేవాని తల దన్నేవాడు ఒకడుంటాడని సామెత. నందిని అవమానించడం ఎందుకు? శాపాన్ని పొందడం ఎందుకు? కేవలం శరీర మత్తత తప్ప వేఱులేదు. దశకంఠుడనేది అసలు పేరైతే కైలాసాన్ని ఎత్తలేక అఱచినవాడు' అనే అర్థంలో 'రావణ' శబ్దం రూఢమయ్యింది. దీనితో 'రావణ' అనే శబ్దం లేదా సంబోధన అతని చేతకానితనాన్నీ, శంకరుని గొప్పదనాన్నీ చాటుతుందన్న మాట. వేరే

మరెవరూ తన అహంకారాన్నీ, చేతకానితనాన్నీ పనిగట్టుకుని ప్రచారం చేయనవసరం లేకుండా, తన అఱుపుల ద్వారా తానే ఎందఱినో పరోక్షంగా ఆహ్వానించి, వారికి కనిపించి ప్రచారం చేసికొన్నాడన్నమాట. చంద్రహాసమనే పేరున్న కత్తిని ఇచ్చి రావణునిచే శివ పూజని ప్రారంభింప చేసాడు శివుడు. రావణుడు శివుని మీద ఇష్టం కంటె ఎక్కడ ఆ మారణాయుధం తనని విడిచిపోతుందోననే భయంతో శివారాధనని ప్రారంభించి క్రమంగా శివ భక్తి ధురంధరు డయ్యాడు. ఇక తఱిగిపోయిన ఆయుష్యాన్ని తిరిగి నింపడానికి కారణం రావణుడు తన తఱిగిపోయిన ఆయుష్య కాలంలో పొందవలసినన్ని శాపాలు పొందనూ లేదు - చేయవలసినన్ని తప్పుల్ని చేయనూ లేదు. ఆ కారణంగానే బ్రహ్మ ఇచ్చిన దీర్ఘాయుష్యాన్ని తాను సరిచేసాడు. ఈ వెనుక ఇంత రహస్యం ఉందని తెలియని రావణుడు తనకు దీర్ఘాయుష్యం తిరిగి లభించిందనే ఆనందంతో తిరిగి దుర్మార్గపు పనులని యథాప్రకారం చేయసాగాడు. తన పాచిక పాఱిందని లోలోపల శంకరుడూ ఆనందపడ్డాడు. ఒక్క రావణుణ్ణి వధించడానికి ఇంత ప్రయత్నం అక్కఱలేదు. రావణుణ్ణి పుత్ర - మిత్ర - సైన్య - బంధుజనంతో సంహరించాలంటే ఇంతా అవసరమే.

ఇక నందీశ్వరుని శాపం మఱింత గొప్పది. ముల్లోకాలనీ జయించిన రావణుణ్ణి చంపవలసిన వాడు మఱింకెంతో గొప్పవాడు కావాలనేది అందఱి అభిప్రాయమూ అవుతుంది. కాని ఏ ఆయుధమూ ధరించే వీలులేని, ఎవరూ యుద్ధ విద్య నేర్ప వీలులేని, గోళ్లూ కోఱలూ మాత్రమే ఆయుధాలుగా ఉండేటటువంటి కోతులతో రావణుని చావు కల్గుతుందని శపించాడు నందీశ్వరుడు. రావణునికి చావే అవమానకర మయిన సంఘటన కాగా, రావణుని దృష్టిలో మనుష్యులు గడ్డిపఱకతో సమానులు కాగా, ఆ మనుష్యులు కూడా తేలిక దృష్టితో చూచే కోతుల సహాయంతో చావు కలిగే శాపాన్నియ్యడం 'అహంకరించడం తప్పు సుమా! అనీ 'సృష్టిలో ఏ ప్రాణీ తక్కువది కాదు సుమా!' అనీ తెలియ జెప్పడానికే.

ఇంతకీ తనచావు కోతుల సహాయం వలన కల్గుతుందని తెలిసింది. చంపేవాడెవరో తెలియలేదు. వానికోసం అన్వేషణ ప్రారంభించాడు రావణుడు.

## వేదవతీ శాపం

ఇలా తిరుగుతూ హిమవత్పర్వతం ప్రాంతానికి వచ్చాడు రావణుడు. ఈ ప్రాంతంలోనే కుశధ్వజుడనే బ్రహ్మర్షి నిత్యం వేదాధ్యయనాన్ని చేస్తూంటే ఆ వేదధ్వని ఒక రూపాన్ని ధరిస్తే ఆమె 'వేద (రూప)వతి' అయింది. ఆ వేదం విష్ణువుకే చెందినది గదా! అందుకని ఆమె, పుట్టిననాడే విష్ణువుకి భార్యగా కావాలని కుశధ్వజుడు నిర్ణయించాడు. దంభుడనే పేరున్న రాజు ఈమెని పెళ్లిచేసికో దలచి ఈమె తండ్రిని అడిగి కాదనిపించుకున్నాడు. ఆ కోపంతో కుశధ్వజుణ్ణి రాత్రికి రాత్రే చంపాడు. ఆ దారుణానికి బాధపడ్డ ఆయన భార్య, ఆ చితిమీద అగ్నిలోకి దూకింది. అప్పటి నుండీ విష్ణువునే ధ్యానిస్తూ పరమ సౌందర్యవతిగా ఉన్న వేదవతిని రావణుడు చూచి తనని భర్తగా స్వీకరించ వలసిందని ప్రార్థించాడు. ఈ కథనంతా ఆమె చెప్పి కాదంది. ఆమె వివాహమాడ దలచిన విష్ణువుని నిందించి, తనని పొగడుకో ప్రారంభించాడు రావణుడు. ఆమె వెళ్లిపోబోతే ఆమె శిరోజాలని గట్టిగా పట్టుకున్నాడు. వాడు పట్టుకొన్నంత వఱకు ఆ శిరోజాలని తన చేతిని కత్తిగా చేసి నఱికి కోపంతో ఇలా అంది. "నా తపస్సు నిన్ను చంపగలదు. కాని శపిస్తే తపస్సు వ్యయమౌతుంది. ఆడుదానిని కాబట్టి చంపరాదు కూడ. అయినా ఇలాంటి దుష్కార్యం చేసిన నిన్ను విడువను. నిన్ను చంపించడానికై నిత్యం యజ్ఞ యాగాదులు ఆచరించే ధార్మికుని యింట పుడతాను" అని పలికి అగ్నిహోత్రంలో ప్రవేశించింది. రామచంద్రా! ఆ వేదవతియే జనకుని యింట నాగటి చాలులో పుట్టి 'సీత' అయింది. ఆమెయే నీ భార్యగా అయింది. నీవే శ్రీమహావిష్ణువువి' అని మఱోమాఱు అగస్త్యుడు చెప్పాడు.

తన చావు కోతుల సహాయంతో - చంపించేందుకు పుట్టేది ఈ వేదవతి - కాగా తనని చంపేది ఎవరో తెలియ లేదు రావణునికి. ఆ విషయం కోసం మళ్లీ అన్వేషణ ప్రారంభించాడు. ఇక్కడ మూడు ముఖ్య విషయాలున్నాయి.

1) ఎవతె జుట్టు పట్టుకొన్నప్పుడు ఆమె శపించిందో ఆమె వేదవతి. తిరిగి జన్మిస్తానని కూడా చెప్పింది. ఈ భావమే లోపల ఉన్న

రావణుడు, కన్పించిన ప్రతి స్త్రీ జుట్టుపట్టి లాగడం ప్రారంభించాడు. సీతమ్మని కూడ అలాగే జుట్టుపట్టి రథంలో పడవైచాడు. (వామేన సీతాం పద్మాక్షీం మూర్ధజేషు కరేణ చ - ఊర్వోస్తు దక్షిణేనైవ పాణిం జగ్రాహ పాణినా।।) ఎడమచేత్తో ఆమె జుట్టుని చేతికి చుట్టుకొని, కుడిచేతిని ఆమె మోకాళ్ల క్రిందుగా పెట్టి రోగి అయిన ఆమెని ఎత్తికొని వెళ్లినట్లు రథంలోనికి చేర్చాడు రావణుడు. (ఈ విషయం నా అరణ్యకాండ వ్యాఖ్యలో మఱింతగా వివరించడం జరిగింది). జుట్టు పట్టినప్పుడు ఎదిరించినా - లేదా ఆమె తన భర్తతో చంపిస్తానని పల్కినా ఆమె సీతయే ఔతుందని రావణుని నిశ్చితాభిప్రాయం.

2) వేదవతి అగ్నిలో ప్రవేశించి సీతగా జన్మించింది. తనకు తానే అగ్నిని రగుల్చుకొన్న ఆ సీతమ్మ యుద్ధం అయిపోయాక అగ్నిప్రవేశం చేయడానికి బెదురుతుందా? ఆ సంఘటనని గూర్చి వేఱు విధంగా ఆలోచించాలా?

3) చంపించడానికే పుడతానని వేదవతి రావణునితో స్పష్టంగా చెప్పింది కదా! చావు లేకుండా ఉండాలంటే అసలు దుర్మార్గ పద్ధతులనీ దేవతల మీదికి దండయాత్రలనీ చేయడం రావణుడు మానేసి ఉంటే, వేదవతి మాట అబద్ధమే అయ్యుండేది. నందీశ్వర శాపం వ్యర్థమయ్యుండేది కదా! రావణుడు ఎందుకలా మౌనంగా ఊరుకోలేక పోయాడు? 'బుద్ధిః కర్మానుసారిణీ' అనుకున్నాం కదా! స్వభావో దురతిక్రమః. స్వభావాన్ని ఎవరూ కాదని ప్రవర్తించలేరు. అలాటి స్వభావాన్ని రావణునికిచ్చాడు పరమాత్మ. అందుకే గీతలో పరమాత్మ మాట 'మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః' అని. 'జాగ్రత్త పడమని ముందుగా చెప్పినా, ఎలా వారు పతనం కావలసి ఉందో, ఆ మార్గంలోనే నా సూచన ప్రకారమే మనుష్యులంతా నడుస్తారు' అని దీని భావం. నిజమేగా మఱి!

## యుద్ధం కంటే లోకక్షేమం ముఖ్యం

వేదవతీ శాపాన్ని పొంది రావణుడు ఉశీర బీజం అనే ప్రదేశానికి పుష్పకం మీద వెళ్లాడు. ఆ సమయానికి మరుత్తనే

పేరున్న రాజు యజ్ఞం చేస్తున్నాడు. యజ్ఞశాలలోనికి కుక్క ప్రవేశించినట్లు (రావణః ప్రావిశద్యజ్ఞం సారమేయ యివాశుచిః) చొరబడి మరుత్తుని యుద్ధానికి రమ్మనీ లేదా ఓడినట్లు ప్రకటించ వలసిందనీ అన్నాడు. (ప్రాహయుద్ధం ప్రయచ్ఛేతి నిర్జితోస్మీతి వా వద)

మరుత్తు యుద్ధానికి సిద్ధమౌతుండగా యాగాన్ని చేయిస్తున్న బృహస్పతికి తమ్ముడు సంవర్తుడు 'రాజా! ఈశ్వరుణ్ణి ఆరాధిస్తూ యజ్ఞాన్ని చేస్తున్నావు. దీనికి విఘ్నం కల్గితే ప్రజానష్టంతో పాటు నీ వంశ నాశనమూ తప్పదు. యుద్ధం కంటె ప్రజాక్షేమం ముఖ్యం' అన్నాడు. మరుత్తు వెనక్కి తగ్గడంతో రావణుడు తాను గెలిచినట్లు ప్రకటించుకొని అక్కడి మహర్షులను చంపి నెత్తురు త్రాగి వెళ్లిపోయాడు. రావణ భయంతో దిక్పాలకులయిన ఇంద్ర - యమ - వరుణ - కుబేరులు క్రమంగా నెమలి - కాకి - హంస - తొండ రూపాల నుండి బయట పడి కొంత కాలం మీ రూపాలను మాకిచ్చి మా ప్రాణం కాపాడారు' అంటూ ఆ నాల్గింటికీ వరాలనిచ్చారు. అప్పటి నుండే నెమళ్లకి సర్పభయం లేదు. ఇంద్రుని శరీరంపై కన్నులున్నట్లు నెమలికీ పింఛం నిండా కన్నులుండడానికీ కారణం ఇదే. వర్షాన్ని కురిపించేది ఇంద్రుడు కాబట్టి నెమళ్లకి వర్షం రాబోతోందంటే సంతోషం కూడా ఇందుకే.

లోకంలో అందటికీ రోగాలని కల్గించి మృత్యువునిచ్చే యముడు కాకులకి రోగమూ మృత్యువూ అనే రెంటినీ, వాటికి దూరంగా చేసాడు. ఈ కారణంగానే కాకి చాలకాలం రోగం లేక జీవిస్తుంది. 'కాకిలా కలకాలం జీవించడం కంటె.........' అనే సామెత కూడా ఉంది గదా! అయితే కాకికి ప్రాణ శత్రువు మనుష్యుడేనట. నరకంలో ఉన్నవారిని తలుచుకొని ఎవరైనా ఏదైనా కాకులకి పెడితే పితృదేవతలు తృప్తి పడతారు సుమా!' అనికూడా చెప్పాడు యముడు.

అప్పటికి నల్లగా ఉండే హంసలన్నింటికీ తెల్లని రంగు వచ్చే వరమిచ్చాడు వరుణుడు. అంతే కాదు. నీళ్లలో ఎంత తిరిగితే అంతగా తెల్లబడే వరాన్ని అనుగ్రహించాడు. తొండల తలలు తళ తళలాడుతూ ఉండే వరాన్ని కుబేరుడిచ్చాడు.

## 'దాశరథి నిన్ను చంపుతాడు జాగ్రత్త!'

ఎదురులేక యుద్ధానికి తలపడుతూ రావణుడు అయోధ్యా నగరానికి కూడ వచ్చాడు. అప్పుడు రాజ్యం చేస్తున్న అనరణ్యునితో యుద్ధానికి తలపడి అనరణ్యుణ్ణి నేలమీద పడేసి రావణుడు నవ్వుతూ ఇక్ష్వాకు వంశ రాజులని పిఱికి పందలుగా నిందించ సాగాడు.

దానితో అనరణ్యునికి కోపం కట్టలు త్రెంచుకుంది. కళ్లు ఎఱ్ఱబడ్డాయి. 'రావణా! మా ఇక్ష్వాకు వంశంలో దశరథుడనే రాజుకి పుట్టబోయే రాముడనే వాడు యుద్ధంలో నిన్ను చంపుతాడు. దానం, హోమం, పుణ్యం నేను చేసి ఉండి ప్రజాపాలనని సక్రమంగా చేసిన వాణ్ణే అయితే ఈ నా వాక్కు ఫలించు గాక!' (యది దత్తం యది హుతం యది మే సుకృతం తపః యది గుప్తాః ప్రజాః సమ్యక్ తదా సత్యం వచోకస్తుమే ఉత్పత్స్యతే కులే హ్యస్మి న్నిక్ష్వాకూణాం మహాత్మనాం రామో దాశరథి ర్నామ యస్తే ప్రాణాన్ హరిష్యతి) అన్నాడు.

రావణుని అనుమానాలు అన్నీ తీరాయి. 'చంపించడానికి పుట్టే స్త్రీ వేదవతి. చంపేవాడు రాముడు. అతడు పుట్టేది ఇక్ష్వాకుకులంలో. దశరథుడు అతని తండ్రి. కోతులు అతడికి సహాయపడతారు.' అని అర్థమయింది.

## ఉత్తరకాండం అనేది ఇందుకే!

దాశరథి తనని చంపుతాడని తెలియడం వలననే రావణుడు ఎంతో శ్రద్ధతో ఇక్ష్వాకుకులాన్ని గుఱించిన సమాచారాన్ని తెలిసికొంటూనే ఉన్నాడు. రావణుడు ఎంత జాగ్రత్త పడుతున్నాడో భగవంతుడూ అంతకు మించి అప్రమత్తంగానే ఉంటూ వచ్చాడు. దశరథునికి ఎవరు పుడతారో అతడే రాముడు. అతడే తనని చంపగలడని రావణుడు ఎదురు చూస్తూంటే, దశరథునికి ఎంత కాలానికీ సంతానమే కలుగలేదు. రావణునికి అన్పించింది "అనరణ్యుని మాట నిజమేనా?" అని.

'ఏమైనా అగుగాక! అనుకుంటూ తన బుద్ధికి తోచిన ఉపాయంతో దండకారణ్యం ప్రారంభంలో తాటకని, దాని పుత్రుడు సుబాహునితోనూ, సుబాహుని స్నేహితుడు మారీచునితోనూ కలిపి ఒక రాక్షస దళాన్ని కావాలని ఏర్పాటు చేసాడు. ఎవరు దశరథుని పుత్రుడో కనుక్కొని వధించమని వారికి ఆజ్ఞ. వారిలో తాటక - సుబాహులని రాముడు వధించగా మారీచుడు మాత్రం మిగిలాడు. రాముడెవడు? ఎలా ఉంటాడు? అని రావణుడడిగితే 'రాముడు ఒకడు కాడు. ఇద్దఱు.' (రామ లక్ష్మణులు). 'ఇద్దఱే కాదు నల్గురు' కూడాను అన్నాడు. దేవరహస్యాలంటే ఇవే. తెలిసినట్లుగా ఉండి ఏమీ తెలియనట్లుగా తెలిసేలా చేయడమే వీని భావమన్నమాట. కాబట్టి (రాముని పుట్టుక, రాముని వివాహంలోని అనేక రహస్య విశేషాలు నా బాలకాండ వ్యాఖ్యలో వివరించబడ్డాయి.) బాలకాండ అర్థం కావాలంటే ఉత్తరకాండలోని ఈ వేదవతీ శాపం....... అనరణ్య శాపం....... అన్నీ తెలిసి ఉండాలి. లేని పక్షంలో అనుమానాలు తలెత్తుతాయి. ఆ అనుమానాలకి సమాధానమే ఉత్తర (సమాధానం) కాండ అని మొదటే అనుకున్నాం కదా!

## నారదుని (అ) హితబోధ!

రావణుని పరాక్రమ వార్తలనన్నింటినీ తెలిసి నారదుడు వచ్చాడు. 'రావణా! ఎందఱినో జయిస్తున్నావని విన్నాను. చాల సంతోషం. నీ దృష్టిలో గడ్డిపఱక కంటె హీనులూ, ఆ దేవతలనే నమ్ముకుని జీవించే వాళ్లూ, అల్పాయుష్యం కలవాళ్లూ, రోగాలతో జీవిస్తూండే వాళ్లూ అయిన మనుష్య జాతిని మాత్రం చంపకు. అయితే ఈ మనుష్య జాతితో పాటు సమస్త జాతినీ చంపే యముణ్ణి నువ్వు జయిస్తే ఇక మృత్యుంజయుడి వైనట్లే. అప్పుడు గాని సర్వ విజేతవీ కాలేవు. ఆలోచించు' అని చెప్పి వెళ్లిపోయాడు.

## లో రహస్యం

లోకంలో మూర్ఖులు కొందఱుంటారు. లేకపోతే ప్రపంచపు నడక సాగదు. వాడు ఎవరిమాటా వినడు. కాని లక్ష్యం ఎవరి మీదైనా కుదిరితే వాడు ఏమి చెప్పినా విని తీరతాడు. ఇదీ మూర్ఖత్వంలోని

భాగమే. రావణుడూ అంతే. నారదుడు రావణుని వద్దకి ఇప్పుడు వచ్చింది హితాన్ని ఉపదేశించడానికి కానే కాదు. పైకి మాత్రం హితాన్ని పలికినట్లుగా ఉంటుంది. ముందు నాటికి శ్రీరాముడుగా అవతరించ బోతున్నాడు శ్రీమహావిష్ణువు. (మనం చదువుతూన్న ఉత్తరకాండ కథ, బాలకాండ జరగడానికి ముందు జరిగినదనే మాటని మఱువకూడదు). అతడు మనుష్య జాతిలోనే పుట్టబోతున్నాడు. ఆ మనుష్య జాతిని కూడా రావణుడు వధించడం మొదలెడితే, రాముని చెంతకు రావడానికే మనుష్య జాతి భయపడిపోతుంది. అదీకాక రావణుడే ప్రత్యక్షంగా మనుష్యులని వధించడం ప్రారంభిస్తే, వాడే నేరుగా అయోధ్యకే వచ్చి రామ - లక్ష్మణ - భరత -శత్రుఘ్నులు పుట్టిన మఱునాడే దండయాత్రకి రావచ్చు. దాని వలన దేవతల ఊహలు తారుమారౌతాయి. అదీకాక రావణుడే రామునితో యుద్ధాన్ని ప్రారంభిస్తే తాటక - సుబాహు - ఖర - దూషణ - త్రిశిరాది రాక్షసులకి రామునితో యుద్ధాన్ని చేసి మరణించే అవకాశం ఏర్పడదు. రావణుని తపశ్శక్తి ఎంతదంటే, శ్రీమహావిష్ణువంతటి వాడు ఎందఱో మహర్షుల తపశ్శక్తిని స్వీకరించి రావణుణ్ణి చంపవలసి వచ్చినంతటిది కదా! ఆ విషయమూ లోకానికి తెలిసేది కాదు. అదీ కాక ముందు కాలంలో రావణుణ్ణి రామచంద్రుడు వధించినట్లయితే, రావణుని పక్షాన ఎవరూ పల్కకుండా ఉండాలంటే, ఇంక రావణుని దుశ్చేష్టలన్నీ - మరణించి స్వర్గ సుఖాలనందుతూన్న పుణ్య జీవులకీ, భూలోకంలో పాపాలని చేసి నరక యాతనలని అనుభవిస్తున్న పాపజీవులకీ కూడా తెలియాలి. అంతేకాదు. నరక యాతనలని చూచైనా ఇలాటి కష్టాలు కలుగుతాయి కాబట్టి 'ప్రవర్తనలో మార్పు తెచ్చుకుందాం' అనే ఆలోచనని రావణునికి కలిగే ఏర్పాటునీ చేసి చూడాలి. అతనిలో మార్పు రాకపోయిన పక్షంలో ఆ తప్పు వానిదే అవుతుంది. దిక్పాలకులలో ఒకరైన యముని నుండి కూడా రావణునికి వ్యతిరేకత ఎదురు రావాలి ...... అని, ఇన్ని ఆలోచనల గుంపుతో నారదుడు రావణునికి ఈ (అ) హితబోధని చేసాడు.

మఱో విశేషమూ ఉంది. రావణుడు ఎంతటి మూర్ఖుడో మనకి తెలుసు. ఒకే ఒక్క కోతి, ఆయుధాలు లేకుండా, రాక్షసులకి మహాబలం ఉండే రాత్రి భాగంలో, తమ లంకకి వచ్చి, తాను జీవించి ఉండగా,

ఎందఱో రాక్షసులని, తన పుత్రుడు అక్షుణ్ణి కూడా చంపినా తమ పక్షపు రాక్షసులు ఎందఱో, ఒక్కొక్కరూ కూడా అనేకాయుధాలని కలిగి ఉండి, మద్య మాంసాలని సేవించే రాత్రివేళలో కూడా, తామంతా ఒకేచోట ఉండే లంకా నగరంలోనే, తాను కూడా నగరంలో ఉండగానే, ఒక్క కోతిని, తన పుత్రుణ్ణి చంపినంతటి దారుణాన్ని చేసినా యుద్ధం వద్దని అనకుండా 'అయినా రామునితో యుద్ధమే చేస్తాను' అనేంతటి మూర్ఖుడు రావణుడు.

మూర్ఖునికి ఆలోచన తట్టదు. తడితే ఇక ఎవరు చెప్పినా ఏం చెప్పినా మార్చుకునే పద్ధతి వాడికి ఉండదు. అందుకే అన్నారు 'చేరి మూర్ఖుని మనసు రంజింప లేము' అని. అయితే రావణునిలో ఒక విశేషం ఉంది. ఒక నిర్ణయానికి కట్టుబడితే మంచో చెడో దానికే **కట్టుబడే లక్షణమున్న మూర్ఖుడు రావణుడు. నిర్ణయానికి కట్టుబడినట్లే ఉండి తప్పించుకొని పోయే కలియుగపు వారిని ఏమనాలో వాల్మీకికీ రావణునికీ కూడా తెలియదు.** 'మానవులని చంపను' అని అన్పించు కోవడానికే రావణుని వద్దకు వచ్చి నారదుడు ఈ హితబోధనంతటినీ చేసాడు. చంపకుండా ఉంటానని అంగీకరించాడు కాబట్టే యమునిపైకి దండయాత్రకి పోయాడు రావణుడు. 'మనుష్యులవల్ల ప్రమాదం లేదని నీవు భావించినా విష్ణువు మనుష్య రూపం ఎత్తి వధించవచ్చు' అని రావణునకు తన మంత్రులు చెప్తే, పూర్వపు అభిప్రాయాన్ని మార్చుకొనే వీలు అతనికి కలుగకుండా ఉండేందుకే నారదుని ఈ (అ) హితబోధ.

లోకంలో ఇద్దఱే మహామూర్ఖులట. ఒకడు దుర్యోధనుడు రెండవవాడు రావణుడూట. ఆంజనేయప్రతాపం (ఇందాక చెప్పుకున్నాం. వివరంగా నా సుందరకాండ వ్యాఖ్యలో చూడగలరు) తెలిసి కూడా యుద్ధాన్ని ప్రకటించిన రావణుడెలా మూర్ఖుడో, అలాగే ఉత్తర గోగ్రహణంలో తన మిత్రుడు కర్ణునితో కూడా తానూ పారిపోయినా, బృహన్నల (లేడి) రూపంలో ఉన్న పాండవులలో ఒకడైన అర్జునుని ధాటికి ఇందఱు కౌరవ నాయకులూ తట్టుకోలేక పోయినా, పాండవు లైదుగురుతోనూ, ఇదే కౌరవ సేవకులతో పోరాడడానికి దుర్యోధనుడు కురుక్షేత్రాన్ని ప్రకటించాలనే ప్రకటించాడు కదా! అందుకని అతడొః మూర్ఖుడు.

శ్రీమద్రామాయణంలోని మూర్ఖుడైన రావణుణ్ణి, నారదుడు మనుష్య వధని మానవలసిందని చెప్పి ముందు కార్యానికి దేవతలకి వీలు కల్గించాడు. ఇక్కడ భారతంలోని మూర్ఖుడైన దుర్యోధనుణ్ణి సంధి చేసికోవలసిందని చెప్పి, "కుదురదు" అనే మాటని వానిచేత అన్పించుకొని కురుక్షేత్రం జరిగేలా చేసాడు కృష్ణుడు. మూర్ఖుడు ఎవరి మాటా వినసే వినడనుకున్నాం కదా! పైగా మాట తిరుగడు కూడా కదా! అందుకే కృష్ణుడు మొదట్లో "పూర్తి రాజ్యాన్ని పాండవులకే ఇయ్యడం న్యాయం. దీనికి కారణం పాండురాజుదే రాజ్యం కాబట్టి. అయినా అర్ధరాజ్యం ఈయవలసింది" అన్నాడు. 'కుదురదు' అని దుర్యోధనుడనగానే ఆనందపడి ఇక వాడు మాట తిరగడనే నమ్మకంతో సంతోషం కలిగి పోనీ "ఐదూళ్లైనా ఇస్తే మంచిది" అన్నాడు. మాట తిరగని దుర్యోధనుడు 'కుదురదు' అని మామూలుగానే అన్నాడు. పోనీ వాళ్లు కోరుకున్న 4 ఊళ్లూ, నీకు ఇష్టమైన ఒక ఊరు ఇస్తే మంచిది" అన్నాడు. 'వాడిసూదిమొన మోపినంత భూమినైనా ఇవ్వను' అని దుర్యోధనుడనడం, నిజంగా మాట తిరగనియథార్థ మూర్ఖుని లక్షణమన్న మాట.

'ద్వా విమౌ పురుషౌ మూర్ఖౌ దుర్యోధన దశాననౌ।
గోగ్రహం వనభంగం చ దృష్ట్వా యుద్ధం పునఃపునః॥

ఇద్దరే మూర్ఖులు. ఉత్తర గోగ్రహణం జరిగినా కురుక్షేత్రాన్ని చేయదలచిన (చేసిన) దుర్యోధనుడూ, అశోకవనధ్వంసం జరిగినా ఆలోచన లేక యుద్ధాన్ని చేయదలచిన (చేసిన) రావణుడూను. ఈ శ్లోకం ఈ మహామూర్ఖుల గురించే పుట్టింది.

ఇలాటి వాటిని తెలిసికోవడం వలన కూడా అలాటి అనాలోచితపు పనులేవైనా చేయదలచి ఉంటే ఆ మహామూర్ఖుల కోవలో ప్రయాణిస్తున్నామని తెలిసి విరమించుకోవాలనే ఆలోచనా కల్గుతుంది శ్రేయస్సూ చేకూరుతుంది.

**'రావణుణ్ణి చంపినా తప్పే! చంపకున్నా తప్పే!!'**

నారదుని మాట ప్రకారం రావణుడు యమలోకానికి వెళ్లాడు. నరక యాతన పడుతున్న ఎందరో పాప జీవులని చూచాడు.

వేడి ఇసుకలో జీవులని దొర్లించడాలూ, మంగలి కత్తుల అంచుపై జీవులని లాగుతూండడాలూ, వందల వేల ప్రేతలు ఆర్తితో పరిగెత్తుతూ ఉండడాలూ చూచాడు. చాల బాధ కలిగి వారిపై కనికరం కల్గింది రావణునికి. ఒక ప్రక్క సంగీత వాద్య ఘోషలతో ఆనందపడుతున్న వారినీ చూచాడు. ద్వేషం కల్గింది. వీరికి దుఃఖమూ వారికి సంతోషమూనా? అనిపించింది రావణునికి. వెంటనే ఆ నరకంలో ఉన్న వారందఱినీ విడిపించి సుఖపడ వలసిందని చెప్పాడు.

యమలోకపు నిబంధనలు పోవడంతో యమభటులు రావణుని మీదికి వెళ్లారు. ఓడిపోయారు. పోరు భీకరమైంది. ఆయుధాలు విఱిగి పోతున్నాయి. సేన తఱిగి పోతోంది. ఇక ప్రయోజనం లేదని సాక్షాత్తు యముడే యుద్ధానికి తలపడ్డాడు. శక్తి తఱిగి పోతోంది. సమయం గడిచిపోతోంది. క్షణక్షణానికీ రావణునికే విజయావకాశాలు కన్పిస్తున్నాయి. తన చేతిలో ఉన్న యమదండాన్ని విసిరి రావణుణ్ణి చంపాలని యముడు నిశ్చయించాడు.

వెంటనే బ్రహ్మ 'యమా! తొందరపడవద్దు. ఈ దండం విసరితే ఎదుటివాడు చావాల్సి వస్తుంది. ఆ శక్తిని నేనే ఈ దండానికి ఇచ్చాను. ఆ రావణునికి ఇప్పుడు మరణ సమయం కాదు. ఇప్పుడు నీ దండం కారణంగా రావణుడు చచ్చినా, నా మాట అబద్ధం అవుతుంది. అలాగని వాడిపై దండాన్ని ప్రయోగించినప్పుడు రావణుడు చావకపోయినా దండానికి నేనిచ్చిన ఆ శక్తి పనిచేయని కారణంగా, నా మాట అసత్యమై తీరుతుంది. ఎటు చూచినా వచ్చే ఈ ప్రమాదం నుండి నన్ను రక్షించి, నా మాట కాపాడి, నన్ను సత్యవాక్కు కలవానిగా చేయవలసిందని' అన్నాడు.

చేసేది లేక యముడు వెళ్లిపోయాడు. సంహరించ వలసిన ఆ మహావిష్ణువే ఆ పనిని చేయవలసి ఉన్నాడు కాబట్టే బ్రహ్మ, యముణ్ణి ఆపివేసాడు. అదీ కాక రావణుడు ఇంకా ఎందఱెందఱినో తనకు విరోధులుగా చేసికొనేలా చేయాలనీ వానికి కష్ట కాలం (లంకముట్టడి) వచ్చినప్పుడు ఏ ఒక్కరూ వానివైపు అండగా నిలబడకుండా అతడు చేసికొనే వఱకూ అతణ్ణి అడ్డుకోకూడదని బ్రహ్మ ఆలోచన.

'పాపీ చిరాయుః సుకృతీ గతాయుః' అంటే ఇదే. పాపకర్మలని చేసినవాడు పాపి. క్రిందటి జన్మలలో చేసిన పాపకర్మలకి అనుగుణంగానే ఈ లోకంలో ఈ జన్మ మనకు కలిగింది. ఆ విషయాన్ని గ్రహించి ఈ జన్మలో పాపాలని చేయకుండా ఉండగలిగితే పైనాటికి జన్మే కలిగే అవకాశం ఉండకపోవచ్చు. కాని చిత్రమైన అంశమేమంటే పాపకర్మలని ఎంత ఎక్కువగా చేసాడో, అంతా అనుభవించడానికి అంత కాలమూ ప్రాణి ఈ లోకంలో జీవించవలసి వస్తుంది. అందుచేత ఎంత ఎక్కువ కాలం వ్యక్తి జీవిస్తే అంతటి ప్రారబ్ధాన్నీ (పూర్వ జన్మలో చేసికొన్నది) అనుభవిస్తూ ఉంటున్నాడని అర్థం. ప్రారబ్ధం తక్కువ అయితే తొందరగా ఋణవిముక్తుడై పైకి వెళ్లే అవకాశం కల్గి ఉంటాడు.

అయితే ఇక్కడొక సందేహమూ కల్గవచ్చు. అతి తాపసాగ్రేసరులు కంచికామకోటి పీఠపరమాచార్యులు నూఱు సంవత్సరాలూ జీవించారు గదా! మఱి చిరాయువుగా జీవించిన వారి మాట ఏమిటి? అని. వారు సంన్యాసదీక్షని స్వీకరించారు. సంన్యాసం పునర్జన్మతో సమానం. ఆదిశంకరుల వారికి ఆయుష్యం తీరుతూన్నప్పుడు, తిరిగి కొంత కాలం జీవించ వలసిన శంకరులవారు సంన్యాస దీక్షకి తల్లి అనుజ్ఞని అడిగినట్లు వారి జీవిత చరిత్ర చెప్తుంది. సంన్యాసం అంటే పునర్జన్మని పొందడమన్న మాట. ఆ కారణంగానే వారు మళ్లీ తాము జీవించినంత కాలం తిరిగి జీవించ గలిగారు. ఇక రెండవది. వారికీ లోకానికీ సంబంధం లేకుండా వారు సంపూర్ణ వైరాగ్య ధర్మంతో జీవించిన పూజ్యులు. అందుకై లోకంతో సంబంధాన్ని పెట్టుకుని, గృహస్థ ధర్మంలో లౌకికంగా జీవించే మనకి సంబంధించిన ఈ వాక్యాలని అలాటి తాపసులకి అన్వయింప చేయడం సాహసం. సరికాదు కూడ!

## మృత్యువుతో చేతులు కలుపుకోండి!!

రావణుడు యముణ్ణి గెలిచి ఆ మీదట నివాత కవచులనే పేరున్న రాక్షసుల మీదికి యుద్ధానికి వెళ్లాడు. చాల కాలం యుద్ధమైంది. కాని ఎవరికీ గెలుపూ - ఓటమీ లభించలేదు. బ్రహ్మ.

ప్రత్యక్షమై నివాతకవచులారా! రావణునికి ఏ వరమిచ్చినావో అదే వరం మీకూ ఈయడం వలన మీ యిద్దఱిలోనూ ఎవరూ మరణించే అవకాశం లేక 'గెలుపూ - ఓటమీ' అనేవి ఉండవు. అందుకని మీరిరువురూ సంధి చేసికోవడం శ్రేయస్కరం' అన్నాడు. ('రావణునికి ఎలా మృత్యువు రాబోతోందో మీకూ అదే విధంగా మృత్యువు రావలసి ఉంది కాబట్టీ, మిమ్ములని పుట్టించిన నాకు మీ ఆయుష్య కాలం తెలుసు కాబట్టీ, ఆ మృత్యువును పొందవలసిన రావణునితో చేతులు కలుపుకోండి' అని పరోక్షంగా బ్రహ్మ చెప్పినట్లే కదా!) దిక్పాలకులలో ఒకరైన వరుణుని మీదికి కూడా యుద్ధానికి వెళ్లిన రావణుడు వరుణుని పుత్రులని ఓడించాడు. ఆ సమయంలో వరుణుడు రాజధానిలో లేడు. (ఆ మాత్రపు రాజనీతి-ధర్మం కూడా పాటింపని వాడు రావణుడని గమనించడానికే ఈవృత్తాంతాన్ని అగస్త్యుడు రామునికి చెప్పాడు).

రావణుడు తన చెల్లెలైన శూర్పణఖని విద్యుజ్జిహ్వుడనే పేరున్న "కాలక" వంశానికి చెందిన (కాలకేయులు) రాక్షసులకి వివాహం చేసాడు. కాలకేయులతో యుద్ధాన్ని చేస్తూ రావణుడు అశ్మనగరంలో తన చెల్లెలి భర్త విద్యుజ్జిహ్వుణ్ణి కూడ వధించాడు.

ఈ విషయం తెలిసిన శూర్పణఖ రావణుణ్ణి బహు విధాల నిందించింది. రావణుడు మాయా యుద్ధాన్ని కూడ చేయడంలో నేర్పరి. తాను కన్పడకుండా చేసిన యుద్ధంలో అనేక ఆయుధాలని ప్రయోగిస్తే, ఆ శస్త్రాలలో ఒకటి తన చెల్లెలిని విధవరాలనిగా చేసింది. జరిగిన దానికి చెప్పలేని పశ్చాత్తాప పడ్డాడు. చెల్లెల్ని ఓదారుస్తూ 'శూర్పణఖా! తెలియక జరిగిన దానిని గూర్చి నీవు నిందించి ప్రయోజనం లేదు. తప్పైందని అంగీకరిస్తూన్న నాకు శిక్షని విధించీ లాభంలేదు. జరిగిన దానికి చింతించినందువలన కాలహరణం తప్ప సాధించగలిగినదీ ఉండదు. కాబట్టి ఒక్కమాట విను. నా ఆజ్ఞనే వేదమంత్రంగా భావించే ఖరుడూ, దూషణుడూ దండకారణ్యంలో ప్రస్తుతం ఉన్నారు. నేను యుద్ధ ప్రియుణ్ణి. అనేక శత్రువులున్న వాడిని. ఏ క్షణానికి ఎవరు నాపై దండెత్తుతారో, లేదా నేనెవరి మీద దండెత్త వలసి ఉంటుందో, ఆ కారణంగా ఏ క్షణంలో రాజధానిలో ఉంటానో ఆ విషయాన్ని నేనే ఎఱుగని వాడిని.

ఈ కారణంగా పదునాలుగు వేల రాక్షస సైన్యం ఎప్పుడూ వెంట ఉండే ఖరుడూ, మహా బలశాలురైన పద్నాలుగుమంది రాక్షసులు నిత్యం తనని సేవిస్తూ ఉండే దూషణుడూ, నిన్ను రక్షిస్తూ ఉండే ఏర్పాటు చేస్తున్నాను. మనశ్శాంతితో జీవించు' అన్నాడు.

'బుద్ధింతు సారథిం విద్ధి' అనేది పరమాత్మ మాట. రాముని చేతిలో ఖరదూషణ త్రిశిరుల వధ కావాల్సి ఉంది. అక్కడ ఉన్న శూర్పణఖ ద్వారా లంకా రహస్యం రామచంద్రునికి తెలియవలసీ ఉంది. 'విభీషణస్తు ధర్మాత్మా న తు రాక్షస చేష్టితః'- రాముడు కన్పించగానే అతని సౌందర్యానికి ముగ్ధురాలైన శూర్పణఖ లంకలోని రావణుని గొప్పదనాన్నీ, ఐశ్వర్యాన్నీ ముందు చెప్పింది. దానికి రాముడు వశుడై ఆమె పొందుని అపేక్షిస్తాడని ఆమె భావం. స్త్రీకి మనసు లగ్నమయితే, ఆమెకు హృదయంలో దా(గే)చేది ఏదీ ఉండదనడానికి శూర్పణఖ సాక్ష్యం. వెంటనే లంకా రహస్యం అతి ప్రధానమైనది (అని ఆమెకు తెలియదు) చెప్పనే చెప్పింది. (ఆరణ్యకాండ) ఏమని? మా లంకలో పరమ ధర్మాత్ముడూ రాక్షస లక్షణాలు ఏమాత్రమూ లేక మా వంశంలో తప్పబుట్టినవాడూ విభీషణుడు ఒకడున్నాడని. అంతే! రాముని ఆనందానికి హద్దు లేకపోయింది. శత్రు నగర రహస్యాలని చెప్పేవారుంటారా? అదీ ఎలా తెలిసికోవాలా? అనీ ఆలోచిస్తున్న రామునికి ఈ వార్త పరమానంద కరమైంది. వీని ద్వారా కార్యాన్ని సాధించుకో గలమని. ఆ కారణం చేతనే ఎందఱో వద్దన్నా విభీషణునికి శరణునిచ్చాడు యుద్ధ ప్రారంభానికి ముందు సముద్ర తీరంలో.

దీనికి మఱో కారణమూ ఉంది. ఆంజనేయుణ్ణి (దూతని) వధించాలని రావణుడాజ్ఞ నిచ్చినప్పుడు (సుందరకాండ) అది సరికాదని ప్రతిఘటించిన వాడు విభీషణుడే. ఆ విషయాన్ని గమనించి రామునికి చెప్పినది ఆంజనేయుడు. విభీషణుని ధార్మికత్వాన్ని శూర్పణఖ చెప్పింది. ఆంజనేయుడు చెప్పాడు. యుద్ధ ప్రారంభంలో విభీషణుడు ఆకాశమార్గంలో శరణుకోసం ప్రార్థిస్తూ రాక్షస రూపంలోనే వస్తూ, రావణుని తమ్ముణ్ణని నిజాన్ని చెప్తూ ప్రార్థించాడు. ఈ విషయాన్ని ప్రత్యక్షంగా తాను గమనించాడు. 'ఇంటి గుట్టు లంకకి

చేటు' అనే సామెత పుట్టింది శూర్పణఖ వలననే. అలాటి శూర్పణఖకి రావణుడంటే ఎంత ఇష్టం ఉన్నా, తన భర్తని చంపినవాడనే కొంత అనిష్టం కూడ లేకపోలేదు. అయితే ఆ అనిష్టత రావణ నాశనాన్ని కోరేంతటిది కాదని గమనించాలి.

ఇంతకీ శూర్పణఖ వృత్తాంతం ద్వారా రావణుని సొంత చెల్లెలు కూడ రావణుని వలన పుంస్త్రీత్వాన్ని (పురుషుడు (భర్త) జీవించి ఉన్న స్త్రీ పుంస్త్రీ - 'పునిస్త్రీ' అనరాదు) కోల్పోయి, ఒక సందర్భంలో రావణ నాశనాన్ని మనసా కోరుకున్నదే అని అర్థమౌతుంది. ఒక వ్యక్తి (దెబ్బతగిలిన వ్యక్తి) వేఱొకని నాశనాన్ని మనఃపూర్వకంగా నిత్యమూ కోరుకోనక్కఱ లేదు. అతి దారుణమైన కష్టానికి ఒకరు కారణమైతే, ఆ కారణభూతుడైన వ్యక్తిని యథార్థమైన బాధతో తలుచుకొంటే అంతకు మించిన 'శాపం' మఱొక్కటి లేదు. ఈ శాపం కూడా రావణునికి తగులనే తగిలింది. ఇన్ని శాపాలు రావణునికి ఉన్నా అంతకాలం లంకకి ఏలుబడిని చేయగలిగాడంటే రావణునికున్న తపశ్శక్తి ఎంతటి అసాధారణమైనదో గమనించ గలగాలి.

కాబట్టి శూర్పణఖ భర్తని రావణుడు చంపడం ద్వారా మృత్యువుతో చేతులని మఱోమాఱు కలుపుకొన్నట్లే అయింది రావణునికి.

## పతివ్రతా స్త్రీల శాపం

వేదవతీ శాపం పొందిన దగ్గఱ నుండి తనని చంపించడానికి పుట్టబోయే ఆమె రూపాన్ని తెలిసికోవాలనే తపన బాగా రావణునిలో పెరిగింది. అందుకని కన్పించిన ప్రతి స్త్రీ కేశపాశాన్నీ పట్టుకొని లంకలోని చెఱలో వేయడం ప్రారంభించాడు. .....(అహృతానా మితస్తతః) ఎవతె వ్యతిరేకిస్తే ఆమెనే "వేదవతీ జన్మకి అనంతర రూపాన్ని పొందిన లక్ష్మీదేవి" అని అర్థం చేసికోవాలని రావణాభిప్రాయం. అయితే ఇలా బంధింప బడిన స్త్రీలు రాక్షస జాతివారు కాదు. యక్ష - కింనర - కింపురుష - గంధర్వ - సిద్ధ - సాధ్య - నాగజాతి వారు. తమని నిష్కారణంగా రావణుడు బంధించిన

కారణంగా ఇందఱూ అనుక్షణం భర్తృ వియోగంతో జీవిస్తూ ఉన్నవాళ్లై అందఱూ కలసి మనఃపూర్వక బాధతో శాపాన్ని ఇచ్చారు. 'మేమంతా పతివ్రతలమే ఐనట్లయితే వీడు పరస్త్రీ కారణంగానే మృత్యువును పొందును గాక!' అని. ఇక్కడి స్త్రీలంతా పతివ్రతలు. వీరంతా రావణ నాశనాన్ని ఇలా శాప రూపంగా కోరారు. సీతమ్మకూడ (సుందరకాండ) రావణ నాశనాన్ని పలుమాఱులు కోరింది.

'యత్ర నార్యస్తు పూజ్యతే రమంతే తత్ర దేవతాః' 'ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు ఆనందపడతారు. లేని పక్షంలో సర్వ కర్మలూ వ్యర్థప్రాయ మౌతాయి' అనే వ్యవహారం ఇక్కడి నుండి పుట్టినదే కావచ్చు. స్త్రీలకే ఇంతటి శక్తిని ప్రాచీనులిస్తే ఇక పతివ్రతా స్త్రీ గుఱించి చెప్పాలా!

పతివ్రతా స్త్రీ శక్తిని ఒక్క మాటలో కాళిదాసు మహాకవి చెప్పాడు మేఘసందేశ మహాకావ్యంలో 'జనకతనయా స్నాన పుణ్యోదకేషు' అన్నచోట. లోకంలో అందఱూ తమ తమ పాపాలని గంగలో మునిగి పోగొట్టుకుంటారుట. అంటే ఆ పాపాలని గంగమ్మ స్వీకరిస్తుందన్నమాట. మఱి గంగకు సంక్రమించిన పాపాలన్నీ ఎలా తొలగుతాయి? అందుకే గంగ కూడా అనుకుంటుందిట. 'అపి మాం పావయేత్ సాధ్వీ స్నాత్వేతీచ్ఛతి జాహ్నవీ' అని. లోకంలో ఎవరైనా ఒక పతివ్రతా స్త్రీ తన యందు స్నానం చేసి తన పాపాలనన్నింటినీ ధ్వంసం చేస్తే బాగుండునని ఎదురు చూస్తూ ఉంటుందట గంగ. అందుకే గోదావరి నీటిని 'జనక తనయ (సీత) స్నానం చేసిన పుణ్యోదకాలు' అన్నాడు కాళిదాస మహాకవి. పతివ్రతా స్త్రీ స్నానం చేస్తే మళ్లీ గంగమ్మ పాపాలు ఆమెకు సంక్రమించవు. సూర్యోదయం కాగానే చీకట్లు ధ్వంసమైనట్లు గంగ పాపాలన్నీ పటాపంచలౌతాయన్న మాట. అలాటి పతివ్రతా తిలకమైన సీతమ్మ కూడా రావణుని చెఱలో ఉండి ఎంత దుఃఖాన్నో అనుభవించిందంటే మానసికంగా శపించినట్లే కదా! ఆమె రావణుణ్ణి నోటితో శపించక పోవడానిక్కారణం రామాజ్ఞ లేకపోవడమని (సుందరకాండ-అసందేశాత్తు రామస్య....) చెప్పనే చెప్పింది కదా! శపించక పోతేనే లంక లంకంతా నాశనమైతే ఇక శపించి ఉంటే చెప్పాల్సిందేముంది? అయినా లంకా నాశనం రాముని పని గదా!

మొత్తం మీద ఒక వ్యక్తి పతనం కావడానికి కారణాలు ఎక్కడో ఉండవు - తన ప్రవర్తనలో ఒకరికి కల్గించిన కష్టం వలననే తన నాశనం ఉంటుందని రావణ చరిత్ర చెప్తోంది. చరిత్ర తెలిసి లేదా తెలిసిన వారి నుండి విని తగిన పరిష్కారాన్ని ఆలోచించుకొని ప్రవర్తించిన వేళ ఈ కష్టాన్ని దాటుకొని ఆత్మ నాశనం కాకుండా చేసికొనే అవకాశం ఉందని గమనించవచ్చునన్నమాట.

## పూజించవద్దు! తపస్సు చెయ్యి!!

తండ్రి బలపరాక్రమాలని వింటూన్న - చూస్తూన్న మేఘనాథునికి (ఇంద్రుణ్ణి జయించాక 'ఇంద్రజిత్తు' అయ్యాడు) కూడా తండ్రికిగల శక్తులని తానూ సంపాదించాలనే బుద్ధి కలిగి రాక్షస గురువు శుక్రాచార్యుణ్ణి ఆశ్రయించాడు. గోమేధం - అగ్నిష్టోమం - రాజసూయం - అశ్వమేధం వంటి వాటినెన్నింటినో సశాస్త్రీయంగా చేయడమే కాక బ్రహ్మచర్యదీక్షలో ఉండి మహేశ్వరయాగాన్ని పూర్తి చేసాడు. పరమ సంతృప్తుడైన ఆ శంకరుడు ప్రత్యక్షమై రెండు వరాలని మేఘనాథుని కిచ్చాడు. ఒకటి తన యిష్టాన్ని బట్టి తిరుగాడే దృఢమైనరథమూ, రెండవది ఎవ్వరికీ కళ్లకి కనిపించకుండా ఆకాశంలో తిరుగుతూ యుద్ధాన్ని చేసే శక్తి నిచ్చే 'తామసి' అనే పేరున్న విద్యయున్నూ. ఇంతే చాలవన్నట్లు ఎప్పుడూ నిండుగా ఉండే అమ్ములపొదీ, ఏ బాణానికీ విఱిగిపోని విల్లూ, దాంట్లో సంధించడానికి ఒక అస్త్రాన్నీకూడా శంకరుడిచ్చాడు.

లంకా నగరానికి పశ్చిమదిశలో ఉండే వనం అయిన 'నికుంభిల'కి రావణుడు వెళ్లి రాక్షసగురువు శుక్రాచార్యుణ్ణి తనపుత్రుని యుద్ధవిద్యా విశేషాలని గూర్చి అడిగాడు. ఆయన యీ అనేక విశేషాలని ఆనందంతో చెప్పాడు. జరుగుతున్న యజ్ఞానికి సంబంధించిన యూపస్తంభాలనీ ఇతర వస్తుద్రవ్యాలనీ చూపాడు కూడ. అన్నిటినీ గమనించి రావణుడన్నాడు. "ఆచార్యా! ఇంద్ర - యమ - వరుణ - కుబేరులు దిక్పాలురు. మనకి వీరంతా శత్రువులు. వీరే అని ఏమిటి? దేవతలంతా శత్రుకోటిలోనివారే. వారిని పూజించి, సాష్టాంగపడి యజ్ఞాలనిచేసి సాధించడంకంటె, తపస్సుచేసి వరాలని పొందడ ఉచితమైనదని నాకు తోస్తోంది. ఎలాగైతేనేమి? ఫలితం వస్తుందిగా!" అని

ఒక కార్యాన్ని సాధించడానికి మంత్రం - యంత్రం - తంత్రం అనే మూడు ప్రయోజనపడతాయి. 'మననాత్ త్రాయత ఇతి మంత్రః' బీజాక్షరాలని కొన్నింటిని ఒకచోట చేర్చి ఆ బీజాక్షరసంపుటిని నిత్యం మననం చేయగా ఆ అక్షరానికి ఒక శక్తి వచ్చి అది మంత్రం అవుతుంది. తద్వారా ఇష్టాన్ని పొందవచ్చును.

కేవలం పనిముట్లని అన్నింటినీ ఒకచోట చేర్చి ఏమాత్రపు మంత్రశక్తీ లేక కార్యాన్ని చక్కబెట్టుకోవడం యంత్రశక్తి. ఇక సరైన ఆలోచన ద్వారా (కార్యసాధన) సఫలమయ్యేలా చేసికోగల్గడం తంత్రశక్తి. ఇక్కడ ఇంద్రజిత్తు యాగాలని చేస్తూ మంత్రశక్తిద్వారా యంత్రాన్ని ఆశ్రయిస్తున్నాడని అన్పించింది రావణునికి. (విఱుగని విల్లూ, ఇష్టాన్నిబట్టి నడిచే రథమూ మొదలైనవి). తంత్రం కంటె యంత్రం, యంత్రం కంటె మంత్రబలమూ గొప్పవైనవికాగా, అలాటి మంత్రబలశక్తి తనకు (రావణునికి) ఉండగా ఆ మంత్రాన్ని ఆశ్రయించి తపస్సు చేసి కార్యాన్ని నెరవేర్చుకోవీలుండగా మంత్రం ద్వారా - మంత్రం కంటె తక్కువదైన యంత్రాన్ని ఆశ్రయించడం తనకు నచ్చలేదు. 'తామసీ విద్యని ఆశ్రయించడం వఱకూ బాగున్నది సుమా!' అనేది రావణుని అభిప్రాయం.

తపశ్శక్తిద్వారా వచ్చినది, ఏది ఉందో అది హక్కువంటిదనీ, ప్రార్థించి సాధించుకొన్నది మధ్యమదశకి చెందినదనీ రావణుని అభిప్రాయం. ఈ సూత్రాన్ని అవలంబించదలచడం వలననే తపస్సుకే ప్రాధాన్యాన్నిచ్చేవాడు రావణుడు. అయితే తపస్సువల్ల ఆర్జించిన శక్తిని అధర్మకార్యాలకి వినియోగించి నష్టపోగొట్టుకొనేవాడు. తపశ్శక్తి పెరుగుతూన్నప్పుడు వ్యక్తికి మఱింతగా రావలసినది 'సాత్త్వికశక్తి'. ఆ 'సాత్త్వికత' లోపించినప్పుడు రాజస - తామస శక్తులు ఉద్భవిస్తాయి. విజృంభిస్తాయి కూడ. అహంకారం ఈ రెంటికీ సాక్ష్యం.

తపస్సు చేసికొంటూన్న మహర్షి వద్దకు ఇంద్రుడు ఏ అప్సరసనో పంపాడని తెలియగానే లోకం అంతా ఇంద్రుణ్ణి నిందిస్తారు కాని అది సరికాదు. సాత్త్వికశక్తి తన తపస్సుతో కూడా ఇతనిలో పెరుగుతోందా? లేదా? అనే పరీక్షని పెట్టవలసినవాడు ఇంద్రుడు. అందుకై కామ - క్రోధ - లోభ - మోహ - మద -

మాత్సర్యాలలో క్రమంగా పరీక్షని పెట్టవలసిన తాను, ముందుగా 'కామ పరీక్ష' చేయదలచి 'అప్సరస'ని పంపుతాడు. అక్కడే ఓడిపోతే అది ఓడిన మహర్షితప్పుగాని ఇంద్రునిది కానేకాదుగదా! ఈ విషయాన్ని గ్రహించగలిగాడు కాబట్టే రామచంద్రుని గురువైన విశ్వామిత్రుడు మేనక విషయంలో ఓడి, విషయాన్ని గ్రహించి, రంభని పంపినప్పుడు ఓడేందుక్కూడా వీలులేకుండా ఆమెని శిలగా శపించాడు. (చూ. బాలకాండ అంతరార్థం). ఇక్కడ రావణునికి ఇవే పరీక్షలు క్రమంగా కాకపోయినా, కొనసాగుతూనే ఉన్నాయి. మదబుద్ధితో ఉన్న రావణుడు యుద్ధవిజయమే గొప్పదనుకుంటున్నాడు గాని తన స్థితి తగ్గుతోందనే విషయాన్ని అర్థం చేసికోలేకనేపోయాడు.

## నా భర్తని చంపవద్దు

లంకలో పుష్పకం ఆగింది. ఎందరెందరో అపహరింపబడ్డ స్త్రీలు ఒకరి వెంట ఒకరు కన్నీళ్లతోనూ, ముందు ఏం జరుగుతుందోననే భయంతోనూ, కులస్త్రీలైన తమకిలాటి కష్టం కల్గిందనే సిగ్గుతోనూ, ముఖాలువంచి, లోపలా, పైపైనా కూడా రావణుణ్ణీ, లంకారాక్షస జనాన్నీ శపిస్తూ దిగారు. రావణునివద్దకు విభీషణుడు వచ్చాడు.

'అన్నా! అందరూ నిన్ను నిందించే పని చేస్తున్నావు. వారివారి భర్తలకి కాకుండా ఇందరినీ ఇక్కడకు తేవడం సజ్జనుడు చేయదగిన పనికాదు. ఇంతకీ అసలు విషయం విను. ఇంద్రజిత్తు యజ్ఞదీక్షలో ఉండగా, నేను నీళ్లలో మునిగి తపస్సు చేసికొంటూ ఉండగా, కుంభకర్ణుడు ఎప్పటిలాగానే నిద్రిస్తూనే ఉండగా నువ్వు వీరిని అపహరించినట్లే - మన చెల్లెలు (మన పిన్ని (పినతల్లి ) కూతురు) 'కుంభీనసి' ని మధుడనే రాక్షసుడు బలవంతంగా ఎత్తుకొనిపోయాడు.

ఒక్క క్షణం ఆగు. నీకు కోపం వస్తుందని మాకుతెలుసు. 'మీరేం చేస్తున్నారని? మమ్మల్ని అడుగుతావనీ మాకు తెలుసు. కుంభీనసి ఒక స్త్రీ. మధుడు పురుషుడు. పైగా మన జాతికి చెందిన రాక్షసుడు. అతడితో యుద్ధాన్ని చేసి అతణ్ణి వధించాలనేది నీ అభిప్రాయం. కుంభీనసిని తిరిగి మనలంకలోనికే తెచ్చి ఉంచాలనేది నీ ఆలోచన. కాని అతడు యుద్ధం జరిగేలోగానే ఆమె కన్యాత్వాన్ని

అపహరించినట్లయితే, అతణ్ణి ఆ పిమ్మట మనం చంపినట్లయితే ఇటు కుంభీనసి వైధవ్యాన్నీ - అటు మఱది మరణాన్నీ - రెంటికీ మించి కుంభీనసి కన్యాత్వపు అపహరణాన్నీ రోజూ తలచుకొని దుఃఖిస్తూ ఉండిపోవాల్సి వస్తుంది.

ఇప్పటికే శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వుణ్ణి అనాలోచితంగా చంపావనే నింద నీమీద శూర్పణఖే వేసిఉంది కూడ. అయినా కన్య తగినవానికిచ్చి ఇంతకాలం వివాహం చేయకపోవడం, అది అందరిచేతా ఆశింపబడేంత వయసు వచ్చేవఱకూ అలా ఉంచివేయడం మనతప్పు కూడానేమో ఆలోచించు. స్వజాతిధర్మం అయిన యుద్ధం మీద ప్రీతి ఉండచ్చునేమోగాని, సంసారపు బాధ్యతలని మించి రాజ్యానికి ప్రాముఖ్యాన్ని ఈయడం కూడా ఒకింత దోషమే. ఇంతజరగడానికి మూలకారణం ఏదై ఉంటుందంటావా? ఇదిగో! ఇందఱు స్త్రీలని ఇలా అపహరిస్తూ వారివారికి కాకుండా తెస్తూన్న ఈ స్త్రీల శాపాలే - మానసికమైన ఆర్తనాదాలే - కారణం అని స్పష్టంగా చెప్పాడు.

ఇంత ఉపదేశాన్ని విన్నా(క) కూడా రావణుని ఆలోచనలో మార్పు (రా)లేదు. కళ్లతో ఆజ్ఞలు వెళ్లిపోయాయి. రథాలు వేగంగా మధురాక్షసుడుండే మధు పట్టణంలో ఆగాయి. పరుగుపరుగున కుంభీనసి వచ్చి రావణుని పాదాలమీదపడి "అన్నా! నామీద ఏమాత్రం కనికరం ఉన్నా నా భర్తని చంపకు. నేను పుంస్త్రీ (భర్త జీవించి ఉన్న స్త్రీ)గా జీవించదలిచాను." అంది. రావణుడు చేసేదిలేక అంగీకరించాడు.

**లో విశేషం**

అగస్త్యమహర్షి కేవలం జరిగిన చరిత్రని మాత్రమే చెప్తున్నాడు. దీన్నే వాల్మీకిమహర్షి మనకు అందిస్తున్నాడు. కారణం 'శ్రీమద్రామాయణంలో భక్తి ఉన్నవానికి, లోభావం ఆ శ్రీరామచంద్రుని కృపచేత స్పష్టంగా తెలుస్తుంది గదా!' అని.

ధర్మం అనేది సర్వత్ర సమానంగా ఉండాలి - ఉంటుంది - గాని తనకొకటి, ఇతరుకి ఒకటిగా ఉండదు. ఎంతతో స్త్రీలని

రావణుడు రాత్రి - పగలు భేదం లేకుండా అపహరించి లంకకి తేవచ్చును గాని, తన చెల్లెల్ని ఇలాగే తీసికొనిపోతే 'తనలా అపహరించుకుపోయాడులే!' అనుకోకుండా దండయాత్రకి బయలుదేరాడు రావణుడు.

**తనమీదికి దండయాత్ర చేస్తాడని తెలిసినా వరాలీయడానికి వెనుకాడనిది (బ్రహ్మ) దేవతాధర్మం. వరాలని ఎవరినుండి స్వీకరించాడో ఆ దేవతాజాతి భార్యనే అపహరించి తేవడం (రావణుడు) రాక్షసధర్మం. అనుక్షణం అధర్మాన్ని రావణునికి విప్పిచెప్తూ భయంలేకుండా వ్యవహరించే విభీషణునిది రాక్షసులమధ్య ఉంటూ పాటించే దేవతాధర్మమే.**

కన్యని అపహరిస్తే ఆమె జీవితం ఎలా ఉంటుందనే ఆలోచనని ముందుచూపుతో చేసేవాడు విభీషణుడైతే, జరిగిన వేదవతీ వృత్తాంతాన్ని మనసులో ఉంచుకొని ఒక్కతెకోసం ఎందఱినో తెస్తూ, ఎందఱి సంసారాలనో కూల్చే దుర్దృష్టికలవాడు రావణుడు. 'ఎవరిసంసారమెలా అయినా, నా విషయం ముందుగా తేలాలి' అనే మూర్ఖత ఉన్నవాడే నిజమైన రావణుడు. రావణ - విభీషణ - కుంభకర్ణులు ఎక్కడో ఉంటారని భావించనక్కఱలేదు. మన యింట కూడా ఉండవచ్చు.

**తనమాట నెగ్గడం కోసం ఎంత అకృత్యమైనా చేసే పెద్దవాడు రావణుడైతే, అది సరికాదని అనుక్షణం చెప్తూ విరోధించేవాడు విభీషణుడైతే, ఇంత జరుగుతున్నా పట్టకుండా మత్తుతో ఉండేవాడు నిజమైన కుంభకర్ణుడు. తమ యింట ఇంకా ఎందఱో ఉన్నా, ఎవ్వరూ కాక తమ ముగ్గురిమీదనే ఇల్లు పూర్తిగా ఎక్కడనడుస్తుందో, అదికూడా ఆదర్శమయమైతే అదే రాక్షసగృహం.**

అయితే అంతటి రాక్షసగృహంలోనూ మూడింట ఒకవంతు ధర్మం ఉంటుంది. అయితే ధర్మాన్ని అధర్మం మించడంతో (1:2) తాత్కాలికంగా అధర్మమే విజయాన్ని పొందుతుంది. చివరికి అధర్మంమాత్రం సమూలంగా పెళ్లగింపబడి విత్తనంకూడా లేకుండా పోతుంది. దీన్ని గమనించైనా జాగ్రత్త పడాలి.

అన్నలుగా తాము ముగ్గురు ఉండికూడా కుంభీనసి వివాహాన్ని చేయ(లే)కపోవడానికి "రావణుని యుద్ధప్రియత్వం, యుద్ధాలలోనే తీరిక లేకపోవడం, కుంభకర్ణుడు ఉండీ లేనివాడయి పోవడం, విభీషణుడు ఉన్నాకూడా - రావణునివలన వచ్చే ఉపద్రవాలకి తగిన మార్గాలని ఎప్పటికప్పుడు వేసికోవడంలో నిమగ్నుడై ఉండవలసి రావడం" - కారణాలు. కన్యా వివాహం ఇంతకాలం ఆలస్యమైతే వచ్చే కష్టాలు ఇలాటివే.

అయినా ఈమెని రాక్షసధర్మం ప్రకారం మధుడు ఎత్తికొనిపోవడంలో ఆశ్చర్యం ఏమీలేదు. అయితే రాక్షసుడైన మధువులో ఉన్న దేవతాధర్మం ఏమంటే 'ఆమెని ఎత్తుకొనిపోయినా, ఆమెకి కన్యాత్వభంగంచేసి, ఎవరికీ కాకుండా చేయడంకాక, వివాహాన్ని చేసికొన్నాడు.

**రాక్షసుడంతటివాడు ఎత్తుకొని పోయినా వివాహాన్ని చేసికొన్నాడంటే, వట్టిగా ఎత్తికొనిపోయేవారు రాక్షసునికంటె నీచులు - అధర్మపరులనిగదా! భావం. రాక్షసుడైన రావణునికి సీతాపహరణ కారణంతో రాముడు మరణదండన విధించాడు. వేఱొకరి భార్యని అపహరించిన రావణుడు కూడ, పరకన్యని అపహరించిన మధువుకి మరణదండనని విధించాలనే నిర్ణయించి యుద్ధానికి వెళ్లాడంటే, పరస్త్రీని అపహరించినవానికి 'మరణదండన' విధించడమే 'సరైన శిక్ష' అని శ్రీమద్రామాయణంలో నాయకుడూ - ప్రతినాయకుడూ కూడా ఏకకంఠంతో చెప్తున్నారన్నమాటే గదా!**

ఈ శిక్ష అమలులోనికి వచ్చిన రోజున గాని యత్ర నార్యస్తు పూజ్యంతే..... స్త్రీలకు గౌరవం, దేవతలకు ఆనందం రానేరాదు. కలగనే కలగదు. (పూర్వపు ఇతిహాసాలు ఇలా స్త్రీ పూజా గౌరవాలని పరిరక్షిస్తూంటే, స్త్రీలని ఎత్తుకొనిపోవడమే ఇతివృత్తంగా ఉన్న కథ - నవలలని - చిత్రాలని స్త్రీలే వ్రాస్తూ - చూపుతూ ఉండడమూ - వాటికి స్త్రీలే నీరాజనాలిచ్చి ఆదరించడమూ పరమదురదృష్టకరమైన అంశం. కలియుగ నాశన సూచకమూను).

తానెందఱో స్త్రీలని అపహరించినా తన చెల్లెల్ని అపహరించిన
గాణ్ణి చంపదలిచాడు రావణుడు. ఇంతకుముందు తనకు

పరిచయంలేని (సుగ్రీవుని) వాని భార్యని ఎవరో (వాలి) అపహరించినా తప్పక ఆ అపహర్తని (అపహరించిన ) చంపుతానని చెప్పి చంపాడు రాముడు. తన భర్తని చంపవద్దని ప్రార్థించింది రావణుని చెల్లెలు కుంభీనసి. 'నా భర్త నిన్ను చంపగలడు సుమా! ఎచ్చరికతో ఉండు' అని హెచ్చరించి సూచించింది రాముని భార్య సీతమ్మ.

దుర్మార్గాలు - అకృత్యాలూ చేయవద్దని రావణునితో విభేదించాడు విభీషణుడు. సన్మార్గ విధానాలని ఆచరిస్తూనే ఉండవలసిందని రాముణ్ణి ప్రోత్సహించారు మహర్షులు. మధురాక్షసుణ్ణి చంపడం తప్పు అన్నాడు - విభీషణుడు. రావణుణ్ణి చంపడం ఒప్పే అన్నారు మహర్షులు. 'తమ భర్తతో తాము జీవించడమే జీవితం అంటే' అని ఒప్పుకున్నవారు 'కుంభీనసి - సీత' ఇద్దఱూను. **దేవతాస్త్రీ - రాక్షసజాతిస్త్రీ కూడా భర్తతో కలిసి జీవించడమే జీవితమని అంగీకరించారు. గమనించాలి!**

ఏదైనా దురదృష్టకర సంఘటనలవలన ఏ స్త్రీ అయినా భర్తనుండి విడివడవలసివస్తే, ఆ దంపతుల చరిత్రని ఇతివృత్తంగా చేయవద్దనీ, ప్రసిద్ధ పవిత్ర చరిత్రలే కథలకి ఇతివృత్తాలుగా ఉండాలనీ అన్నారు ప్రాచీనాలంకారికులు. **వేఱైపోయిన** ఇలాటి భార్యాభర్తల విడాకు చరిత్రలకి వాళ్లు 'కావ్యాలాపాలు' అనే పేరుపెట్టి 'కావ్యాలాపాంశ్చ వర్జయేత్' అలాటి చరిత్రలని గ్రంథస్థం చేయవద్దని శాసించారు. కారణం ఈ చరిత్రలని చదివి ఏ సుఖంగా ఉన్న కొందఱికో కూడా వేఱుకావాలనే ఆలోచన కల్గవచ్చు.

ఒక మహర్షి తపశ్శక్తిని చెఱుపదలచిన ఇంద్రుడు శ్రీమద్రామాయణం ఆరణ్యకాండలో జాగ్రత్తగా దాచవలసినదిగా ఒక 'కత్తి'ని ఆయన దగ్గఱ ఉంచాడు. మొదట్లో భయపడి - కొంతకాలానికి పూలుకోసికోవడానికి ఉపయోగించాడు. ఆ మీదట క్రమక్రమంగా భయంకర ఘాతకుడుగా మహర్షి మాఱిపోయాడు. అటువంటి కావ్యాలాపాలని చదవకపోయినా ఇంట ఉంచడం కూడా ఇంద్రుని కత్తికథలా ఎప్పటికో ఒకప్పటికి ఇంట్లో అందఱిని కాకపోయినా - ఎవరో ఒకరినైనా పాడుచేయవచ్చు. వంశంలో మచ్చ ఒకరివలన వచ్చినా, అది మచ్చగదా! ఆలోచించాలి!.

## నలకూబర శాపం - అంతరార్థం

మధు రాక్షసుణ్ణి (తన భర్తని) చంపవద్దని కుంభీనసి ప్రార్థించడంతో మధువుతో స్నేహం చేసికొన్న రావణుడు తన సైన్యంతో ఒకరాత్రివేళ ఒకచోట విశ్రాంతి తీసికోదలిచాడు. ఆ వెన్నెలరాత్రివేళ, వెండికొండ సమీపంలో, పూలవాసనల మధ్య, సెలయేటి ప్రవాహాల తిన్నెల నడుమ రావణుని మనసు మన్మథవశం అయింది. అదే సమయంలో దేవవేశ్య రంభ తెల్లని వస్త్రాలతో నల్లని మేలిముసుగుని తలపై కప్పికొని వెళ్తూండడం రావణునికి కన్పించింది. వెంటనే ఏ సంకోచమూ లేకుండా చేయి పట్టుకున్నాడు. కొంతసేపు వాదోపవాదాలు జరిగాక ఆమె ఇలా అంది.

'రావణా! నువ్వు ఇంద్ర - ఉపేంద్రులూ, అశ్వనీదేవతలూ కంటె మహిమలోనూ సౌందర్యంలోనూ గొప్పవాడివి కావచ్చు. ఆ జంటల్లో ఉన్న గుణాలు నలకూబర మణిగ్రీవుల జంటలోనూ ఉంది. అయినా నాప్రేమ నా ఇష్టంలో ఉంటుంది కదా! నలకూబరుణ్ణి వరించి వెడుతున్నాను. ఇది మరియాద కాదు. పైగా నీ అన్న ుబేరుడు. అతని పుత్రుడు నలకూబరుడు. అతని భార్యనైన నేను, ుకు కోడలిని ఔతాను. విడువు' అని చేయిలాగుకోబోయింది.

'దేవతలకందరికీ వేశ్య అయిననీకు వావివరసలెక్కడివి? అంటూ ఆమె స్త్రీత్వాన్ని అపహరించి 'పొమ్మన్నాడు' రావణుడు. సిగ్గుతోనూ, తన నలకూబరుడు తనని ఆదరిస్తాడా? అనే దిగులుతోనూ, ఏమీ చెప్పుకోలేని తొట్రుపాటు మనసుతో ఆమె తన ప్రియుణ్ణి చేరి వివరించి చెప్పింది. రంభదోషం ఏమీ లేదని గ్రహించిన నలకూబరుడు ఆచమించి 'రావణా! నిన్ను ఒల్లని స్త్రీని నీవు అనుభవిస్తే నువ్వు ఏడు ముక్కలుగా అయి తిరిగి ·తకవీలులేకుండా అయిపోగలవు' అని శపించాడు. ఈ శాపాన్ని ుసికొన్న రావణుడు తన జీవితం మీద ఆసక్తి - అభిలాష వాడు కాబట్టి పరస్త్రీ పేరుకూడా స్మరించకుండా ఉండిపోయాడు. బ్రహ్మాదిదేవతలంతా సంతోషించి నలకూబరునిపై పుష్పవర్షాన్ని కురిపించారు.

రావణుణ్ణి శపించగలిగిన తపశ్శక్తి ఎవరెవరికి ఉందో ఈ పరిశీలనలో తేలుతోంది. రావణునికి మించిన తపశ్శక్తి గలవారైతేనే వారు శపించగలరు. పైగా ఆ శాపమే అమలుకి వస్తుంది. అలాటి వారందఱితోను ఏదో ఒక అవకాశాన్ని రావణునికి దేవతలు కల్పించడమూ - వారు రావణుని దుశ్చేష్టని గమనించి శపించడమూ జరుగుతూ వస్తోంది. (వేదవతీశాపం - అనరణ్యాశాపం........ అన్నీ ఇలాటివే కదా!) ఇప్పుడు నలకూబరుని వంతు వచ్చింది. ఇతని తండ్రి అయిన కుబేరుడు బ్రహ్మని మెప్పించి ఉత్తర దిక్పాలకపదవితోపాటు పుష్పకాన్ని కూడా పొందగలిగాడు. అంటే అంతటి తపశ్శక్తిమంతుడు. తెల్లని వెన్నెలలో తెల్లని వెండికొండ ప్రక్కనుండి వెళ్లే అభిసారిక రంభ. ఆమె ఎవరికీ తెలియకుండా జ్యోత్స్నాభిసారిక రూపంలో తెల్లని మేలిముసుగును ధరించి వెళ్లకుండా, నల్లని మేలిముసుగుతో వెళ్తోందిట. ఇలా వెళ్తూండడానిక్కారణం తాను రావణుని కంటపడేలా చేసికోవడమే.

ఆమెకి పరమదుర్మార్గుడైన రావణుడు, వెండికొండ సమీపంలో ఉన్నాడని తెలియడం ఆమెకి ఏమాత్రం కష్టం కానేకాదుగదా! ఆ సైన్యంతో విడిసినప్పుడే రాజెవరో ఉన్నాడనీ, వాడు వీడేననీ ఆమెకు తెలియదా? పైగా దేవవేశ్యకు కామరూపమూ - కామగమనమూ (ఏరూపంలో కావలిస్తే ఆరూపం - ఏచోటికి వెళ్లాలంటే అక్కడే వ్రాలే ఏర్పాటూ) ఉంటాయి గదా! ఒక్కమాఱుగా నలకూబరునివద్ద వ్రాలనూగలదుగదా! అలాకాక నల్లనిముసుగుతో, రావణుడున్న ప్రదేశం ప్రక్కనుండి అతని దృష్టిపథంలో పడేలా కూడా వెళ్తూండడానిక్కారణం రావణపతనాన్ని కోరి మాత్రమే.

ఏ మృగమైనా తనంతతానుగా నిద్రించే సింహాన్ని లేపి నోరు తెఱవమని అంటుందా? అనుకున్నట్టుగానే రావణుడు చూచాడు. చేయిపట్టుకున్నాడు. రావణుడన్నట్లు దేవవేశ్య అయిన ఆమెకూ రావణునికీ మామా కోడళ్ల వరసా? ఇదంతా నాటకమే. మామాకోడళ్లే కావలిసివస్తే నలకూబరునికి రంభ అగ్నిసాక్షిక భార్య కావాలి గదా! పైగా ఆమెలో రావణునికి భయపడి ఏం జరుగుతుందో నని, భయపడి పాఱిపోయే ప్రయత్నమూ ఏమీ కన్పించలేదు. అక్కడే ఉండి

ప్రతిప్రశ్నకీ సమాధానాన్ని ఇస్తూనే ఉండిపోయింది. రావణుడు శీలాపహరణాన్ని చేయనే చేసాడు.

ఎక్కడ ఎవరిచేత రంభ మొదలైన అప్సరసలు లేదా దేవవేశ్యలు భంగపడినా అది వారికి ఒక లెక్క కాదు. పైగా ఒక గర్వకారణం కూడా. అంతటి ఋషిపుంగవుణ్ణి ఓడించాననో, ఇంతటి సిద్ధుణ్ణి లొంగదీసికొన్నాననో వారు చెప్పుకొనేవీలుంది. అయితే రంభ ఈ స్థలంలో చాల బాధపడింది. పైగా ఆమెకోసం ఒక ప్రియుడున్నాడనీ చెప్తుంది. ఈ విధమైన ఇతివృత్తం అప్సరసలచరిత్రలో మరెక్కడా కన్పడదు. దీనిక్కారణం ఒకటే.

రావణునికి రంభ శాపం ఇప్పించాలంటే (దేవతలు రంభద్వారా నలకూబరునిచే శాపాన్ని ఇప్పించాలంటే) తనకి ఇష్టం లేనట్లే ప్రవర్తించాలి. అందుకే ఇన్ని వంకరమాటలని మాటాడింది. ఇదంతా రావణుని కామబుద్ధిని పెంచడానికే తప్ప త్రుంచడానికి కానే కాదు. నిజంగా రావణుడే గొప్పవాడైతే రంభని విడిచిపెట్టి ఉండాలి. అప్పుడు వానికి శాపమూ వచ్చేది కాదు - దేవతలపాచికా పారేది కాదు. రంభ అగౌరవాన్ని పొందీ ఉండేది.

ఈ జరిగిన కథద్వారా మరో విషయాన్నీ తెలిసికొనేవీలుంది. నలకూబరునిద్వారా ఈవిధమైన శాపాన్ని రావణునికి ఇప్పించనట్లయితే రావణుడు అపహరించిన ఎందఱుస్త్రీలకో ఎంతో దుర్గతి పట్టిఉండేది. పైగా వీరందఱి పిమ్మటా సీతమ్మ లంకకి చేరబోతోంది. ఎన్నో కట్టుదిట్టాలని చేసాక గాని సీతమ్మ రంగానికి రారాదు. రావణునికి అందఱూ ఇచ్చిన శాపాలే అతనికి విధించిన నియమనిబంధనలన్నమాట.

రసమూ - రసాభాసమూ అని రెండున్నాయి. పరస్పరమూ ప్రీతి కలిగి ఉన్నట్లైతే వారిరువురి మధ్యా ఉండేది శృంగారరసం. అనేక స్త్రీలకి ఒకరియందిష్టం ఉన్నా - పశుపక్ష్యాదుల దాంపత్య సౌఖ్యాన్ని చెప్పినా - అలాగే ఒకేస్త్రీకి అనేకులయందిష్టాన్ని చెప్పినా అక్కడ శృంగారరసం ఉన్నట్లుగా ఆభాసిస్తుంది. (పైకి కన్పిస్తుంది. తాడునే పాముగా ముందు అనుకున్నట్లు). ఈ రసం ఆభాసించడమే

రసాభాసం. ఇక్కడ రావణునిలో శృంగారం ఉన్నా రంభలో ఆ యిష్టం లేక అనిష్టం ఉండడం వలన ఇది రసవంతంకాదు రసాభాసఘట్టమే.

పైగా పట్టుపరుపులపైన, మేలి బంగరు మంచాలలో, సుఖమైన సముద్రపు గాలివీస్తూంటే పంచభూతాలనీ అదుపుచేసి భార్యాసుఖాన్ని పొందాల్సిన రావణుడు కఱకు బండరాతిమీద ఆచ్ఛాదనవస్త్రం కూడా లేకుండా, సైన్యం అంతా వెగటుగా చూస్తూంటే, పంచభూతాల సాక్షిగా తప్పుచేయడం చూస్తే 'ఇది ఒక నిర్బంధకర్మ' గానే అన్పిస్తుందిగాని మనసుతో ఇష్టంగా చేసికొన్నది కానేకాదని తోస్తుంది. మిథునము అంటే జంట. జంటలో ఇద్దఱూ ఒకరికొకరి ఇష్టంతో అనురాగపూర్వకంగా భావ - మనస్ - శరీర సమ్మేళనం 'మైథునం' అవుతుందిగాని ఇలా పశుప్రవృత్తిని ఆపేరుతో పిలవకూడదు.

ఇలాటి సమయాలలో గర్భధారణ జరిగితే కలిగే సంతానం ఆ సమయంలో తల్లికి కల్గిన భావాలకి అనుగుణంగా ఉంటారనేది సత్యం. పాండురాజు పాండురోగంతోనూ, ధృతరాష్ట్రుడు పుట్టుగ్రుడ్డిగానూ పుట్టడానికీ, విదురుడు బుద్ధిమంతుడై ఏ అంగవైకల్యమూ లేక పుట్టడానికీ కారణాన్ని భారతమే చెప్పిందిగదా! మిగిలిన అన్నీ (వెన్నెలరాత్రి - వనమూ - సెలయేటి ఒడ్డూ.....) కుదిరినా మనసు చాలా ముఖ్యం అని గమనించాలి. పగటిపూట గర్భధారణ జరిగితే అపమృత్యుదోషం (అకస్మాత్తు మరణం) కల సంతానం పుడుతుంది. ఘటోత్కచుడు హిడింబా, భీముల సంతానం. భీముణ్ణి రాత్రివేళ పంపనని ధర్మరాజు హిడింబతో చెప్పి ఆ మీదట భీముణ్ణి రోజా పగటిపూట మాత్రమే హిడింబ వద్దకు పోనిచ్చాడు. ఫలితంగా ఘటోత్కచుడు కలిగాడు. అపమృత్యువు పాలయ్యాడు. అయితే లోకంలో ఇలా అపమృత్యుదోషం ఉన్న వాళ్లందఱూ ఇలాటి వారేనా? అనుకోరాదు. అపమృత్యుదోషం ఈ కారణం వలన కూడా రావచ్చు. ఘటోత్కచుని విషయంలో మాత్రం కారణం ఇదే.

ఇంతకీ రావణునికి ఈ సంఘటనలో శయ్యా మొదలైన సుఖాలూ లేకపోయాయి - అతిముఖ్యమైన ఆమె మనసూ తనమీద లేకపోయింది. అన్నిటికీ మించి సంఘటనానంతరం కలగాల్సిన ఆనందం బదులు జీవితాంతమూ పరస్త్రీని గూర్చిన భయం పట్టుకొంది.

వానికి అది భయాన్ని కల్గించేది అయితే, లోకాని కంతకీ నిర్భయాన్నీ, అభయాన్నీ ఇచ్చేది అయింది. అది వానిపాలిట శాపం అయితే, లోకానికి ఒక వరం. ఈ కారణాలనిబట్టి దాదాపు సంవత్సరకాలం లంకలో ఉన్నా సీతమ్మ నిర్దోషురాలని, రామునికి అందఱు మహర్షులూ వింటుండగా అగస్త్యుడు చెప్పాడు. ఇదే విషయాన్ని యుద్ధం అయిపోయాక అగ్నిహోత్రుడు చెప్పాడు. ఈ విషయాన్ని మఱచిపోకూడదు. మీదటికథలో సీతాపరిత్యాగం రాబోతోంది. అక్కడ దీన్ని గూర్చి మఱింత ఆలోచించాలి కాబట్టి అసలు మరువరాదు.

నలకూబరుడు ఇలా శాపాన్ని ఇచ్చినా రావణుడు 'పుంజికస్థల' అనే ఆమెను అనుభవించాడు ఆ తర్వాతి కాలంలో. ఇదెలా సాధ్యం? అంటే నలకూబరుని తపశ్శక్తికంటే మించి తపశ్శక్తి రావణునికి ఉన్నది కాబట్టి ఇతని శాపం రావణునిపై పని చేయలేదు. ఆ విషయాన్ని గ్రహించిన బ్రహ్మ పుంజికస్థలని రావణుడనుభవించాక మఱో శాపమిచ్చాడు. 'ఏ స్త్రీ నైనా ఆమె యిష్టంలేక బలాత్కార ప్రయత్నం చేసినా చనిపోతావు' అని. తపశ్శక్తి తక్కువ కారణంగా పనిచేయని నలకూబర శాపం బ్రహ్మ శాపం ఇచ్చిన పిమ్మట పనిచేయసాగింది. 'ఏ స్త్రీని ఆమె ఇష్టంలేనప్పుడు నువ్వు తాకుతావో అప్పుడు చస్తావు' అని బ్రహ్మ శపించినట్లుగా ఈ శాపాన్ని గూర్చి కొందఱు చెప్పా(ప్తా)రుగాని అదిసరికాదు. వాల్మీకి మహర్షి హృదయం అదికానేకాదు. పరస్త్రీని అనుభవిస్తే మరణశాపాన్ని నలకూబరుడు ఈయగా పరస్త్రీ విషయంలో బలాత్కరించినా మరణం తప్పదని బ్రహ్మ శపించాడు. ఈ కారణంగానే సీతా విషయంలో ఎంతో భయపడుతూ ఉండిపోయాడు రావణుడు.

## రావణుని కంటే ఇంద్రజిత్తే గొప్పవాడు!

దేవతలని జయించడం కంటె దేవతలకి అధ్యక్షుడైన ఇంద్రుణ్ణే జయించాలనే ఆలోచన కల్గిన రావణుడు, నేరుగా అమరావతి మీదికే దండ యాత్రకి వెళ్లాడు. ఆ విషయం తెలిసిన ఇంద్రుడు ఇందఱు దేవతలనీ, సిద్ధుల్నీ, సాధుల్నీ, వసువులనీ, దిక్పాలకులనీ,... ఇలా అందఱినీ కూడిరావలసినదిగా కోరాడు. వచ్చేవాడు రావణుడని తెలిసి విష్ణువుని కూడ రావలసిందని ప్రార్థించాడు.

'ఇంద్రా! బ్రహ్మ వరం కారణంగా ఇప్పుడు నీకు జయం అసాధ్యం. రావణుడు మనుష్యునిచే తప్పక చావవలసిఉన్నాడు. అప్పుడెలాగూ నేనే సంహరించక తప్పదు. అదను చూచి నేనే సంహరిస్తాను. ప్రస్తుతానికి యుద్ధాన్ని ముగించు కొనిరా!' అని పంపించివేసాడు విష్ణువు.

అశ్వినీదేవతలూ, అష్టవసువులూ, ఏకాదశరుద్రులూ, ద్వాదశాదిత్యులూ ఇటునుండి బయలుదేరారు. సుమాలి, జంబుమాలి, ప్రకంపన, అకంపన, నరాంతక, ప్రహస్తాది రాక్షసులు ఎదురు వచ్చారు. క్షణాలలో యుద్ధం ప్రారంభమైంది. శిరస్సులు తెగిపడుతున్నాయి. విల్లు ధ్వనిస్తున్నాయి. ఆయుధాలు ముక్కలౌతున్నాయి. గుఱాలు, నడుములు విఱిగి కూలుతున్నాయి. పోరులో ఎవరి బలం ఎంత పోతోందో లెక్కించుకునే వీలులేనంత వేగంగా తీక్షణంగా బాణాలతో యుద్ధం సాగింది.

ఇంద్రపుత్రుడైన జయంతుడు రావణపుత్రుడైన మేఘనాథునితో తలపడ్డాడు. రావణుడు ఇంద్రుణ్ణి ఎదుర్కొన్నాడు. ఎవరెవరికి దీటైనవారు ఎవరో గమనించి యుద్ధాన్ని నిర్విరామంగా సాగిస్తున్నాడు. ఆగని వర్షధారల్లా బాణాలు సైన్యాన్ని మట్టికరిపిస్తూంటే ముగింపులేని యుద్ధం ఇంద్రజిత్తుకి చీకాకు కల్గించింది. తన చరిత్రలో ఎప్పుడూ ఇంతసేపటి యుద్ధాన్ని ఎఱుగడు ఆ రావణ పుత్రుడు.

వెంటనే తనకున్న మాయావిద్యతో యుద్ధరంగాన్ని తమోమయం (చీకటి) చేసాడు. ఎవరికెవరూ కన్పించకపోయినా యుద్ధం ఆగలేదు. దేవతలలో దేవతలూ, రాక్షసులలో రాక్షసులూ ఎందఱో తమపక్షంవారి చేతిలోనే ప్రాణాలని కోల్పోయారు. యుద్ధం విషమించిందని గమనించిన ఇంద్రుని మామ పులోముడు తన మనుమడైన జయంతుణ్ణి ఆ చీకట్లోనే తీసికొని పోయాడు భద్రంగా - ఎవరికీ తెలియకుండా. దేవతలంతా హాహాకారాలు చేసారు. రాక్షసులు జయజయ నినాదాలు చేసారు. రావణునికి చెప్పలేని ఆనందం కల్గింది.

మడుగుమధ్యలోకి దిగిన ఏనుగులా దేవతల మధ్యలోనికి ప్రవేశించి రావణుడు భయంకర యుద్ధాన్ని ప్రారంభించాడు. తమ ఇంద్రపుత్రుణ్ణి దాచివేసారనే కోపంతో దేవతలు రావణుణ్ణి అన్నివైపులా

మఱింతగా చుట్టిముట్టి దిగ్బంధంచేసి దాదాపు నిరాయుధుణ్ణి చేయబోయారు. రావణుడు ఇక తన పని అయిపోయిందని హతాశుడయ్యాడు. సిగ్గూ, భయం ఒకేసారి కలిగాయి. పుత్రవియోగంతో తల్లడిల్లుతూన్న ఇంద్రుడు రావణుణ్ణి బంధించ బోయాడు. రాక్షసులకి రావణుడు కనిపించక పెట్టిన ఆర్తనాదాలకి మేఘనాథుడు ఇటు మళ్ళాడు.

తండ్రి పరిస్థితి అధ్వాన్నంగా ఉండడాన్ని గమనించాడు. ఈశ్వరుడు తనకిచ్చిన మాయావిద్యతో అందఱికీ కన్పించకుండా యుద్ధరంగంలోనికిపోయి ఒక్క ఇంద్రుడిపైనే యుద్ధాన్ని చేయ ప్రారంభించాడు. బాణం వేయదలిచిన ఇంద్రునిక్కూడా ఈశ్వరశక్తి కారణంగా మేఘనాథుడు కన్పించలేదు. ఇదే సరైన అదనుగా భావించి ఇంద్రుణ్ణి యుద్ధంలో బడలిక పొందేలా చేసి క్షణాల్లో బంధించి, తనతో లంకకి ప్రయాణమయ్యాడు. మేఘనాథుడు కనపడకుండా చేసిన ఈ యుద్ధానికి దేవగణమంతా ఆశ్చర్యపడి నిట్టూరుస్తూ నిలబడిపోయారు.

బ్రహ్మవిష్ణుమహేశ్వరులకి ఇంద్రుడు లంకలో బద్ధుడై యున్నాడనే వార్త క్షణాలలో తెలిసింది. రావణుడు తన రాక్షసులనీ, విశేషించి మేఘనాథుణ్ణీ వేయివిధాలుగా పొగడుతూనే ఉన్నాడు. చేసేది లేక బ్రహ్మతన దేవతలతో కలిసి లంకకి వెళ్ళి ఇంద్రుణ్ణి విడువవలసిందని ప్రార్థించాడు.

(ఇంద్రుణ్ణి జయించిన కారణంగా మేఘనాథుణ్ణి రావణుడు 'ఇంద్రజిత్' అని అన్నాడు. అప్పటినుండీ ఆ బిరుదం అతని పేరుగా అయిపోయింది. అతణ్ణి పిలిచిన ప్రతిక్షణమూ ఇంద్రుణ్ణి అవమానించినట్లే అయింది. రావణుడు దేవ సేనామధ్యంలో చిక్కుకుపోగా మేఘనాథుడు తండ్రిని రక్షించడమేగాక ఇంద్ర - జిత్తుకూడా అయ్యాడు. ఈ కారణంగా 'రావణుణ్ణి వధించడం కంటె ఇంద్రజిత్తుని వధించడం గొప్ప కదా మరి!

బ్రహ్మ ప్రార్థనని విన్నాడు ఇంద్రజిత్తు. ఇంద్రుణ్ణి విడిచినందుకు ప్రతిఫలంగా చావులేని వరాన్ని ఇమ్మన్నాడు

ఇంద్రజిత్తు. 'ప్రాణంతో ఉన్న ప్రతిజీవీ ప్రాణాన్ని కోల్పోవడం జీవధర్మం' అన్నాడు బ్రహ్మ. కొంత వాదోప వాదాలయ్యాక ఇద్దఱూ ఒక అంగీకారానికి వచ్చారు.

'శత్రువధకోసం ఇంద్రజిత్తు అగ్నిని పూజిస్తాడు. ఆ పూజముగియగానే అందులో నుండి రథం గుఱ్ఱాలతో వెలువడుతుంది. దాని మీద యుద్ధం ప్రారంభిస్తే ఇక ఇంద్రజిత్తు ఎన్నటికీ అ - మరుడే- అ- జేయుడే (చావూ - ఓటమీ లేనివాడే). ఏదైనా విఘ్నం వచ్చి రథాన్ని పొందలేకపోతే మరణధర్మం కలవాడే!, ఇదీ నిర్ణయం.

తప్పనిసరి పరిస్థితులలో ఈ నిర్ణయానికి కట్టుబడి, బ్రహ్మ అంగీకరించి వరమీయగా, ఇంద్రుణ్ణి విడిచాడు ఇంద్రజిత్తు. తనకి జరిగిన అవమానానినకి తట్టుకోలేకపోయాడు ఇంద్రుడు.

## ఇంద్రుడే ఓడిపోవడమా? ఎందుకని?

ప్రాచీనమైన ఇతిహాసాలలో - పురాణాలలో అసత్యాలు ఉండనే ఉండవు. తప్పుచేస్తే దేవుడేకాదు - దేవతలకి అధ్యక్షుడైన ఇంద్రుడైనా శిక్షని అనుభవించక తప్పదు. అందుకే ఇంద్రునికి ఈ భంగపాటు. ఇంతకీ ఇంద్రుడు ఈ శిక్షని అనుభవించవలసి రావడానికి కారణం ఉండనే ఉంది' అంటూ బ్రహ్మ అవమాన భారంతో ఉన్న ఇంద్రునికే ఇలా ఓదార్పు కోసం చెప్పాడు.

'ఇంద్రా! ఒకప్పటి నా ఆలోచన ప్రకారం వ్యక్తుల నందఱినీ ఒకేరూపం, ఒకే కాంతీ, ఒకే కంఠస్వరం... ఇలా అంతా సమానంగా ఉండేలా సృష్టించాను. నాకే నచ్చలేదు ఆ సృష్టి. ఎవరిని చూచినా ఒకేలా ఉండడం, ఎవరెవరో తెలియకపోవడం కష్టమన్పించింది. ఆవిషయం అలా ఉంచి అన్ని విభాగాలలోనూ (దేహసౌందర్యం, కంఠస్వరం, శరీరకాంతి, నడక,...వంటివి) ఉత్తమమైన వాటినన్నింటినీ ఒకచోట చేర్చి ఒకరిని సృష్టిచేయాలని భావించాను. ఏవిధంగానూ ఏకోణంలోనూ ఏవిభాగంలోనూ ఏ సందర్భంలోనూ లోపం లేని విధంగా, నిందించే వీలులేకుండా (అ- హల్య - నిందింపవీలులేనిది) 'అ -హల్య' అనే ఆమెని సృష్టిచేసాను.

దేవాధ్యక్షుడివైన నువ్వు ఆమెని నీకుగా ఇమ్మని నన్ను అడిగినా కాదని నీ భయంతోనే, గౌతమమహర్షి వద్ద • ఆమెని చాల సంవత్సరాలపాటు న్యాసంగా (ఒక వస్తువుని భద్రంగా ఉంచవలసినదిగా ఒకరిని ప్రార్థించి వారివద్ద ఉంచడం - తిరిగి గడువు ముగిసాక తీసికొనడం) ఉంచాను. గడువు ముగిసాక ఏమార్పులేని ఆమెని గౌతముని నుండి తిరిగి గ్రహించాను. ఇంత సౌందర్యవతి తనవద్ద న్యాసంగా ఉన్నా, ఏమాత్రపు కోరికా లేని గౌతముణ్ణి మనసా ప్రశంసించి ఈ అహల్యకు భర్త గౌతముడే అని నిశ్చయించి ఆయనకే భార్యగా అహల్యని ఇచ్చివేసాను.

అయినా నీకు ఆ అహల్యామీద మనసుపోక గౌతముడు ఇంటలేని సందర్భంలో ఆమెని మభ్యపెట్టావు. ఆమె మనసా అంగీకరించింది. గౌతముడు ఆశ్రమానికి వస్తూనే నీకు శాపాలనిచ్చాడు - నీ శత్రువు చేతిలో నీవు బద్ధుడి వౌతావనీ - నీకే కాక ఇంద్రపదవిలో ఎవడున్నా వానికి పదభ్రష్టత్వం వస్తూంటుందనీను." ఆ కారణంగా నీకీ కష్టం వచ్చింది. ఈ శాపాన్ని అనుభవించవలసి ఉన్నావు కాబట్టి విష్ణువు రానన్నాడు.

ఈ తప్పులో ఆమె మానసికాంగీకారం కారణంగా (ఆమెకీ భాగస్వామ్యం ఉన్నకారణంగా) ఆమెకీ ఇలా శాపాన్నిచ్చాడు గౌతముడు. "చక్కదనం, నీలో ఉందనే అహంకారం కారణంగా ఈ దోషానికి ఒడిగట్టావు కాబట్టి అహల్యా! చక్కని స్త్రీలు నీవేకాక మఱికొందఱు కూడా లోకంలో పుడతారు." అని. ఇక నీపుత్రుడు జయంతుణ్ణి నీ మామ తీసికొని వెళ్లాడు. ధైర్యంగా ఉండు' అన్నాడు బ్రహ్మ ఇంద్రునితో.

## లో విశేషాలు

('అహల్య పతివ్రతయే' అని నా బాలకాండ వ్యాఖ్యలో చాల స్పష్టంగా ఎన్నో ఆధారాలు అన్నీ వివరించి చూపడం జరిగింది. గమనింపగలరు.) రావణాసురుని వధకోసం రాముడు మహర్షులవద్దా - పతివ్రతా స్త్రీలవద్దా తపఃఫలాన్ని ప్రోగుచేసికొనాలని నిశ్చయించుకొన్నాడు. ఆ రామునికి మొదటగా తన తపఃఫలాలని

అందజేసిన ఇల్లాలు అహల్య. భర్త తనచెంతనే ఉన్నా మానసికంగా ఇంద్రుని విషయంలో చలించినది అహల్య (బ్రహ్మ ఏరికోరి సృష్టిచేసిన స్త్రీ - గౌతమునంతటి జితేంద్రియుని భార్య) కాగా 'రామచంద్రా! నీకు ఏంతో దూరమైన లంకలో ఉండి కూడా - నిరంతరం రావణాసురుడు తనని భర్తగా స్వీకరింపవలసినదిగా పల్కుతూ ఉన్నా 'కుక్కా!' వంటి తిట్లతో కూడా నిందించి ఎడమకాలితోనైనా రావణుణ్ణి స్పృశించనని పల్కినది సీత!' అని వీరిరువురి భేదమూ చెప్పడమూ - సీత నిర్దోషిత్వాన్ని మునుల - ఋషుల సమక్షంలో దృఢపఱచడమూ ఈ కథ చెప్పడంలోని లక్ష్యాలు.

అహల్య నిజంగా మానసికంగా తప్పుచేసినా, చేసానని అంగీకరించినా గౌతమమహర్షి నీపాదస్పర్శ అయిన మఱుక్షణం బూడిద నుండి వచ్చిన ఆమెని భార్యగా పరిగ్రహించి పూర్వపు గౌరవంతోనే చూస్తున్నాడు రామచంద్రా! దూరంగా ఉన్న దంపతులని ఒక్కచో చేర్చేది నీ పాదస్పర్శ సుమా! అని తెలియజెప్పడం దీని'లో రహస్యం.' (అలాంటి నీవు ఇక మీద సీతమ్మను విడువబోతూ దాంపత్యధర్మాన్ని కాదనవలసి వస్తోంది. అందుకు మనసు బాధపడుతోందని పల్కడం కూడ అగస్త్యుని భావమే! దోషంఉన్నా అహల్యని గౌతమునితో కలిపిన నీవు, దోషంలేని సీతని వేఱుచేసికోవడం న్యాయమా? అని కూడ ప్రశ్న. అయితే అవతార పరిసమాప్తి కావాలి గదా! తప్పదని అగస్త్యుడు తనను తానే సమాధానపఱచుకుంటున్నాడు, అనేది లో భావం.)

ధర్షిత శ్చ కృత శ్చాపి భ్రాతా పావకసన్నిధౌ. స (34/ 4) శ్లో.
ధర్షయిత్వా పురీం లంకాం రావణాంతః పురం తదా. స (35/ 5) శ్లో.
ఏవం స రావణః ప్రాప్తః కార్యవీర్యాత్ ప్రధర్షణమ్. స (33/21) శ్లో.

('అజ్ఞానాత్ ధర్షితానాథ త్వ ద్రూపేణ దివౌకసా' అని ఉన్న శ్లోక పాదంలోని 'ధర్షితా' అన్న పదానికి దురర్థాన్ని ఆలోచించి ఇంద్రుడు అహల్యతోశారీరక సంగమంచేసాడని కొందఱంటారు. ధర్షితాఅనే పదానికి వారు ఆలోచించినది సరైన అర్థంకాదనడానికి వేదవతి మాటలు సాక్ష్యం. యస్మాత్తు ధర్షితా చాహం త్వయా పాపాత్మనా వనే. (17సర్గ 31శ్లో ) కాబట్టి మానసికంగా చేసే తప్పుని 'ధర్షణం' అనాలి. అలాంటి తప్పుచేసిన ఆమె 'ధర్షిత' అవుతుంది.)

## "వాడు నా పుత్రుడు. నా మీది గౌరవంతో విడిచిపెట్టు!"

'ఇంద్రుణ్ణి తన పుత్రుడు తన కళ్లముందే బంధించడం, ఇంద్రుణ్ణి విడిచిపెట్టాలని దేవతలు వచ్చి ప్రార్థించడంతో రావణుని అహంకారానికి పట్టపగ్గాలు లేకపోయాయి.' అని అగస్త్యుడు చెప్పగానే రామచంద్రుడు ఆశ్చర్యపడి ! ఏ క్షత్రియులూ అతణ్ణి అదుపు చేయలేక పోయారా? అస్త్ర శక్తి ఏమైంది? అని అడిగాడు.

'రామా! రావణుడు మాహిష్మతీపురానికి వెళ్లి కార్తవీర్యార్జునుణ్ణి గూర్చి అడిగాడు. ఆ రాజు రాజధానిలో లేడని తెలిసి దగ్గఱగా ఉన్న నర్మదానదిఒడ్డున సైన్యంతో విడిది చేసాడు రావణుడు. శివపూజా ధురంధరుడైన రావణుడు నర్మద ఒడ్డున శివలింగాన్ని ఉంచి పుష్పాలూ ఇతర పూజా ద్రవ్యాలతో పూజచేస్తూంటే నదీ ప్రవాహానికి దిగువగా (వాలుగా) కార్తవీర్యార్జునుడు తన అంతఃపుర స్త్రీలతో జలక్రీడలు ప్రారంభించి రావణునిమదాన్ని పరీక్షించాలనే ఊహతో తన వేయిచేతులనీ (అర్జునుడు) ప్రవాహానికి అడ్డంగా పెట్టాడు. దాంతో నీరు ఎగువకి ప్రవహించి రావణుని పూజాద్రవ్యాలనీ, పుష్పాలనీ ముంచివేసింది. కోపించిన రావణుడు కార్తవీర్యార్జునుని మీదికి యుద్ధానికి రానేవచ్చాడు.

హైహయవంశ ప్రభువైన కార్తవీర్యార్జునుడు తన శక్తికొద్దీ గదా యుద్ధాన్నిచేసి రావణుణ్ణి చాల తక్కువ కాలంలోనే బంధించి తన పురానికి తీసికొనిపోయి చెఱసాలలో పెట్టాడు. ఈ విషయం తెలిసిన రావణుని తండ్రి పులస్త్యుడు స్వయంగా అర్జునునివద్దకు వచ్చాడు. ఎంతో భక్తి శ్రద్ధాగౌరవాలతో అర్జునుడు పులస్త్యుణ్ణి పూజించి 'ఆజ్ఞనియ్యండి' అని అర్థించాడు.

రాజా! పంచభూతాలనీ అదుపుచేసే శక్తి ఉన్నవాడు మా రావణుడు. అలాటివాణ్ణి కట్టిపడవైచినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఇక మా పిల్లవానిమీద కోపంమానుకో! (మద్వాక్యాత్ యాచమానోऽద్య ముంచ వత్సం దశాననమ్) నిన్ను ప్రార్థిస్తూన్న నా కోరికను మన్నించి నా పిల్లవాణ్ణి విడిచిపెట్టవూ! 'అని ప్రార్థించాడు. పులస్త్యుడు. దానితో రావణుణ్ణి విడువడమేకాక రావణుడూ, అర్జునుడూ

మంచిస్నేహితులు కూడా అయి, ఒకరికొకరు అగ్నిసాక్షిక సఖ్యాన్ని కూడ చేసికొనే స్థితికి ఎదిగారు. రావణుడు ఈ సంఘటనతో సిగ్గుపడి లంకకి వెళ్లాడు.

## ఇది లోకసహజమా?

గర్వించిన ప్రతివ్యక్తికీ ఏదో సందర్భంలో 'నీకు మించినవాడు లోకంలో ఉన్నాడుసుమా!' అని ఒక సంఘటన ద్వారా భగవంతుడు సూచిస్తూ ఉంటాడు. దాన్ని సరిగా అర్థం చేసికొంటే జీవితానికి అదొక చక్కని మలుపు ఔతుంది. లేనినాడు అది మనుగడకి ఒక ముగింపూ - ఔన్నత్యానికీ అభివృద్ధికీ ఒక విఘుపూ ఔతూంటుంది. సత్ - అసత్ వివేకం అంటే ఇదే. ఎందుకిలా జరిగి ఉంటుంది? ఎందుకిలా జరగాలి? ' అని మనని గూర్చి మనం ఆలోచించుకోవడమే 'వివేకం' అంటే. ఆ ఆలోచనలవల్ల తేలిన నిగ్గునిబట్టి మనం-మంచి చెడులలో ఏమార్గంలో ఉన్నామో గమనించడమే 'సత్ (మంచి) అసత్ (చెడు) వివేకం' అంటే.

దేవతలందఱితోనూ యుద్ధంలో బంధింపబడే స్థితికి వచ్చిన క్షణంలో రావణునకు ఉన్న పశ్చాత్తాపబుద్ధి ('తప్పుచేసాం' అనే ఆలోచన) ఇంద్రుణ్ణి విడిపించవలసిందిగా బ్రహ్మ లంకకి వచ్చి ప్రార్థించినప్పుడు గుర్తుకి రానేలేదు. (జ్వరపడి రోగంతో ఉన్నప్పుడు తానుపూర్వం చేసిన అకృత్యాలెన్నో గుర్తుకు వచ్చి - 'ఇక చేయరాదు' అనుకునే ఆలోచన ఆరోగ్యం వచ్చాక కల్గితే అతడే 'సన్మార్గుడు'). ఇతిహాసాలని వట్టిగా చదివినందువలన ప్రయోజనం శూన్యం. జీవితా(ని)లకి అన్వయించుకొని ఒంట(ఒంటిలో)పట్టించుకొంటే, వ్రాసిన మహర్షులు సంతోషించి 'చరితార్థులమయ్యాం' అని భావిస్తారు. ఆశీర్వచనాలని మనకిస్తారు.

రావణుడు కార్తవీర్యార్జునుని బలాన్ని కూడా లెక్కచేయలేదు. ముందుగా అతణ్ణి గూర్చిన ఒక అంచనాని కూడ వేయలేదు. 'ఇంద్రుణ్ణి బంధించడం' అనేది (తాను చేయ(లే)కపోయినా) కళ్లని కప్పివేసింది. ఇంద్రబంధనం వంటి ఈ విధంగా అవకాశాన్ని ఈయడం, ఒకవిధంగా రావణునికి గర్వభంగం చేసి జ్ఞానాన్ని ప్రసాదించడానికే

అని తెలిసికోవాలి. అర్జునునితో పోరాడడం, అర్జునుడు బంధించి పట్టుకుపోవడం, చెఱలో పెట్టడంతో రావణునికి జ్ఞానోదయం అయింది. అలనాటి దేవయుద్ధంలో బంధింపబడే దశలో చేసిన ఆలోచన కూడ గుర్తుకు వచ్చింది. తనది తప్పేనని రెండోమాఱు నిశ్చయించుకున్నాడు.

అర్జునుని చెఱసాలలో రావణుడు ఉన్నప్పుడు చెఱలో ఉన్నవారి పరిస్థితి ఎలా ఉంటుందో రావణునికి అర్థమైంది. పరిస్థితి హీనంగా ఉన్నప్పుడు ఆ వ్యక్తి ఎంతటి గొప్ప అధికారి అయితే, అంత అవమానకరంగానూ ఉంటుంది. అంటే పదవిని బట్టి అవమానపు స్థాయి ఉంటుందన్నమాట. లంకాధినేత, కోట్ల కోట్లరాక్షసులకి ప్రభువు, దేవతలని వణికింపచేసినవాడు, పంచభూతాలనీ అదుపుచేసినదిట్ట, ఈ క్షణంలో సామాన్య చోరునిలాగా (తాను) చెఱసాలలో ఉన్నాడు. అవమానపడేవానికి ఈ సంఘటన ఎంత నీచాతి నీచమో, ఇతణ్ణి చెఱలో పెట్టగల్గిన అర్జునినికి అంత ప్రతిష్ఠాకరం ఇది. ఎంతెంత గొప్పవాణ్ణి బంధిస్తే అంతంతగొప్పకదా! అంటే రావణుడు చెఱలోపడి అర్జునుని గొప్పదనాన్ని ఒకవిధంగా పెంచాడన్నమాట. ఇంత ఆలోచించాక 'ఇక ఎన్నడూ ఇలాంటిపని చేయరాదు' (గర్వించియుద్ధానికి పోవడం) అనే నిర్ణయానికి వచ్చేసాడు రావణుడు.

ఇంతలో రావణుని తండ్రి పులస్త్యుడు అర్జునుణ్ణి యాచించి విడువవలసిందన్నాడు. 'మద్వాక్యాత్' 'యాచమానః' నా మాటమీది గౌరవంతోనూ- నిన్ను ప్రార్థిస్తున్నాను కాబట్టి విడువు' అన్నాడు. అంతేకాదు. తన పుత్రుడు తప్పుచేసినట్లుగా ఆయన అంగీకరించాడు కూడా. పుత్రుడు తప్పుచేసిన ఈ సందర్భంలో తండ్రి పులస్త్యబ్రహ్మ వచ్చి విడిపించకపోతే రావణునికి బుద్ధి వచ్చిఉండేదే. కాని, మొదటిసారి తనపుత్రుడూ (ఇంద్రుణ్ణి బంధించడం ద్వారా) రెండోసారి తన తండ్రీ తనకి రాబోయే బుద్ధిని రానీయకుండా తోడ్పడ్డారు.

వేదవతీ - అనరణ్యుడూ - నందీశ్వరుడూ... మొదలైన వీరంతా బయటి వారు కదా! తనవాళ్లే తనని చెడగొట్టారు. ఇదికూడా దైవప్రేరణేతప్ప వేఱుకాదు. అందుకే పరమాత్మ 'బుద్ధిం తు సారథిం విద్ధి' బుద్ధిని నీ జీవితపు సన్మార్గప్రయాణానికీ - దుర్మార్గ ప్రయాణానికీ సారథిగా భావించు అన్నాడు గీతలో.

రావణుడు వంశంతో సహా నాశనం కావలసి ఉండడంవలననే అతనికి బుద్ధిరానీయకుండా ఒకసారి పుత్రుడూ వేఱొకసారి తండ్రీ అడ్డుపడ్డారు. నిజానికి రావణునికి అభిమానం ఉన్నా బాగుపడి ఉండేవాడే. అది అతడికి ఎప్పటినుండో లేదుకదా! ఎంత తప్పుచేసినా విడిచిపెట్టించుకోగల పలుకుబడి నాకుందని దుర్మార్గుని భావన. తండ్రి విడిపించవలసినగతి వీనికి పట్టిందిగదా! అని సజ్జనుని ఆలోచన. కాబట్టి పుత్రుడు తప్పుచేసాడని తెలిసికూడా ఏ తండ్రి వానికి పశ్చాత్తాపం రానీయకుండా తమ అధికారాన్ని వినియోగించి రక్షిస్తారో, వారంతా తమపుత్రుల భవిష్యజ్జీవితాన్ని కావాలని పాడుచేస్తున్నట్లే. ఇంతదూరం ఆలోచించక ఆ పుత్రులు కూడా తండ్రి సహాయాన్ని పొందుతూ ఉంటే, తమ జీవితాన్ని తామే నాశనం చేసికొంటున్నట్లే.

తండ్రేకాదు. పశ్చాత్తాపబుద్ధి కల్గి తాను మారేవఱకూ ఎవరూ అతణ్ణి రక్షించనిరోజున అతనికి సన్మార్గబుద్ధి అలవడి దేశానికి క్షేమం కల్గితీరుతుంది. రామాయణంలో కథ ఇలా ఉంటే, భారతంలో దుర్యోధనుణ్ణి పాడుచేసిన ఘనత ధృతరాష్ట్రునిదే!

మఱో విశేషమూ ఉంది. తనకంటె ఎక్కువవాడని బలంద్వారా తెలియగానే అర్జునునితో సఖ్యంకూడ ఏర్పాటు చేసికొన్నాడు రావణుడు. అంటే ఇక ఎప్పుడూకూడా బాగుపడే అవకాశం రానీయకుండా ఈ సఖ్యం తోడ్పడుతుందన్నమాట. ఇలాంటి ప్రవర్తన ఉన్న వారికి సిగ్గు - బిడియమూ - భయమూ - అవమానమూ అనేవి ఉండనే ఉండవు. కాబట్టి దుర్మార్గుని లక్షణం 'ముందు ఎదుటి వాని మీదికి దూకడం - తనకంటే ఎక్కువవాడని తెలిసినప్పుడు కాళ్లమీద పడడం'. 'అందితే జుట్టు - అందకుంటే కాళ్లు' అంటే ఇదే.

ఈకథని అగస్త్యుడు చెప్పడంలోని అసలు రహస్యం ఒకటుంది. రావణుణ్ణి బంధించిన అర్జునుణ్ణి పరశురాముడు వధించాడు. ఆ పరశురాముని గర్వాన్ని రాముడు అణిచి వైష్ణవధనుస్సుని స్వీకరించి తపోలోకాలని కూడా తా[illegible]సేసికొన్నాడు. (చూ. బాలకాండ వ్యాఖ్య). అందుకని రాముడు రావ[illegible]కంటె ఎంతెంత గొప్పవాడో అగస్త్యుడు [illegible]డం ఇందులో కన్పిస్తుం[illegible]

ఉత్తరకాండలోని ఈ ఘట్టాలన్నింటిలోనూ ఒక మహావిశేషం అలా వెడుతూ ఉంటుంది, ఎక్కడైనా ఎవరైనా ఒకరాజు మఱొకరాజుని గెలుపొందితే, గెలిచిన రాజు ఓడినవాని గొప్పదనాలనివిని, 'అంతటి గొప్పరాజుని నేను గెలిచాను కదా!' అని గర్వపడతాడు గాని, ఇలా ప్రతినాయకుని తక్కువదనాలని వినవే వినడు. ఇలా ప్రతినాయకుని తక్కువదనాలని అందఱి సమక్షంలోనూ వినిపిస్తే 'శత్రువు మొదటి నుండీ ఎన్నో పర్యాయాలు అవమానపడ్డవాడే - ఓడినవాడే'అని అందఱూ పెదవి విఱిచే అవకాశం ఉంటుంది గదా! అయినా రాముడు రావణుని తక్కువదనాలని కూడ పెడచెవిన పెట్టక వినడం ఆశ్చర్యకరమైన అంశం - వినే మనందఱికీ అలా ఉండరాదని చేసే ఉపదేశమూ అన్నమాట.

## పశువుని పట్టుకొన్నట్లు పట్టి తిప్పావుగదా! నీ బలం ఎంతది!!

తన తండ్రి విడిపించడంతో సిగ్గు (తగ్గినవాడు కాదు) లేని రావణుడు కిష్కింధాపురం మీదికి యుద్ధానికి వెళ్లాడు. నాలుగు సముద్రాలకీ సంధ్యావందనం పూర్తిచేసికోడానికి నగరాధినేత 'వాలి' వెళ్లాడని అక్కడివారు చెప్పారు. రావణుడు వాలిని దక్షిణసముద్రపు ఒడ్డున గమనించాడు. వెనుకవాటుగా వెళ్లి రావణుడు అటూఇటూ చాచిన వాలి రెండుచేతుల క్రిందా తన చేతులు వచ్చేలా, వాలి వీపుకి తన వక్షః స్థలాన్ని అన్చి చేతులతో చుట్టాడు. రావణునిరాక ఎప్పుడో గమనించి వీణ్ణి కుందేలులా తిప్పాలి' అని నిర్ణయించుకొన్న వాలి, అలాగే నాలుగు సముద్రాలకీ తిప్పుతూనే ఉన్నాడు. చివరికి తూర్పు సముద్రంలో కూడ సంధ్యవార్చాక రావణుణ్ణి విడిచి' కుతస్త్వమితి ప్రోవాచ ప్రహసన్ రావణం ముహుః' 'రావణా! ఎక్కణ్ణించి? ఏకారణం వలన? ఎప్పుడు వచ్చావని' వెటకారంగా మళ్లీమళ్లీ నవ్వువస్తుండగా నవ్వుతూ అడిగాడు.

రావణుడు సిగ్గుభయాలతో 'వానరరాజా! ఏం బలమయ్యా నీది! పశువుని పట్టుకొన్నట్లు నన్ను చంకలో పొదవికొని ఎలా నాల్గుసముద్రాలూ తిప్పావయ్యా? మనస్సుకీ - వాయువుకీ - గరుడునికీ తప్ప ఈబలాన్ని ఎవరివద్దా ఎఱుగను. (యేనాహం పశువద్గృహ్య

భ్రామిత శ్చతురోఽర్ణవాన్ - మనోఽనిల సుపర్ణానాం తవ చాత్ర న సంశయః త్రయాణా మేవ భూతానాం గతి రేష ప్లవంగమ!) నీతో అగ్నిసాక్షిక సఖ్యాన్ని కోరుతున్నాను. నేనే చెప్తున్నావిను. మన ఐకమత్యం ఎంతదంటే భార్య - పుత్ర - నగర - సంపద - రాష్ట్ర - భోగవస్త్రాలూ - ఇంకా ఏవైనా నీకూ నాకూ అనే భేదం లేదు మనిద్దఱిలో అన్నాడు.

అగ్నిసాక్షికసఖ్యాన్ని చేసికొన్నాక ఒకనెల కిష్కింధలో గడిపాడు రావణుడు. రామా! రావణుణ్ణి చతుసముద్రాలూ తిప్పిన వాలిని ఒక్క బాణంలో చంపిన నువ్వెంత బలవంతుడివో! ఎవరికి తెలియదు! అన్నాడు అగస్త్యుడు.

**లో విశేషం**

సంధ్యావందనాన్ని చేస్తూన్న వాలినే కాదు. ఎవరినీ ధ్యానభంగం అయ్యేలా చేయనే కూడదు. రావణుడు అలా చిలిపి తనంగా వాలిని పట్టాలని భావించడానికి కారణం అతని వెనుకనున్న మంత్రులు. 'ఇతడు చాల గొప్పవాడు' అని అనేక విధాలుగా అతణ్ణ అతని ఎదుటే అనుక్షణం ప్రశంసిస్తూ ఉండడమే కారణం తనగొప్పదనాన్ని ఉన్నదానికంటె ఎక్కువగా ఈ ప్రశంసలు చేసాయి. నిజమనుకొని వాలిమీదికి వెనుక వాటుగా వెళ్లాడు. ఉన్న మంత్రులలో ఏ ఒక్కరూ అలా వెనుకగా యోధునిపైకి వెళ్లడం పిఱికిపందల లక్షణమనిగాని, రాజనీతి కాదనిగాని చెప్పలేదు. చెప్పలేరుకూడ. కారణం - వారంతా అతని కృపపైన జీవిస్తున్న ఉద్యోగులు. **పై అధికారిని పొగడడమే ఉద్యోగవృత్తిగా భావిస్తూ జీవిస్తూ ఉండే ఎందఱో దురదృష్టవంతులందఱికీ ప్రతీక ఈ రాక్షసమంత్రులు.**

వీరి మాటలు నిజమనుకొని నడిచే అభాగ్యుడు రావణుడు. వాలి రావణునిరాకను గమనించి 'శశమాలక్ష్య సింహో వా పన్నగం గరుడో యథా - కక్షావలంబినం కృత్వా గమిష్యే త్రీన్ మహార్ణవాన్ "కుందేటిని సింహంలాగా, పాముని గరుత్మంతునిలాగా వీణ్ణి పట్టి చంకలో ఇఱికించుకొని మూడు సముద్రాలూ త్రిప్పి తీరతాను' అనుకున్నాడు. దేశానికీ దేశానికీ మధ్యగాని, దేశాన్ని చుట్టిగాని సముద్రం ఉంటుంది. కాబట్టి మూడు సముద్రాలు త్రిప్పడం అంటే

ఎందఱినో గెలిచిన రావణుని దశచూడ వలసిందిగా ఆ సముద్రాల నానుకొని ఉన్న దేశాలవారికందఱికీ పరోక్షంగాకాక ప్రత్యక్షంగా చెప్పడమే కదా! వాలి నేలబారున వెళ్లేవాడు కాడు. అతడు కపిరాజు. అందుకని ఆకాశమార్గాన పోతూంటే చూడని దేశీయుడులేడు. ఎవడైనా కంటితో చూడకపోయినా చూచినవాని ద్వారా వింటే చాలుగదా! అలా పరువుతీయాలని వాలి రావణుణ్ణి చంకలో ఇఱికించాడు.

అన్ని అవమానాలకంటె తనవారి ముందు అవమానపడడం మఱింత కదా. తమరాజుని వాలి ఎత్తుకు పోతూంటే మంత్రులంతా వెంటబడ్డారు. చూస్తూన్నంతలోనే వాలి సూర్యమండలం దాకా ఎగిరాడు. దాంతో మంత్రులకి రావణశక్తి బాగా అర్థమయింది.

అన్ని సముద్రాలూ త్రిప్పి నేలను దింపి 'కుతస్త్వమ్?' ఎక్కణ్ణించి వచ్చావు? ' అని వెటకారపు ప్రశ్నవేసాడు లంకాధినేతని. వాలి చలనవేగాన్నీ - వాలి శరీరబలాన్నీ - వాలి పట్టిన పట్టు బిగువునీ తన బలంతో పోల్చి చూచుకున్న రావణునికి తనబలం ఎంత అట్టడుగు స్థాయిలో ఉందో తెలిసి వావిడిచి (సిగ్గుమాని) ఉన్నదున్నట్టుగా మాటాడుతూ 'పశువుని పట్టి ఈడ్చినట్లు ఏం తిప్పావు నన్ను? - ఎంత బలం నీది?' అన్నాడు. తనని తాను పశువుగా వాలిముందు సిగ్గుమాలి పోల్చుకున్నాడు రావణుడు.

పూర్వమే అనుకున్న తీరుగా జుట్టుపడితే అంచలేదు కాబట్టీ - అందే నమ్మకం పోయి వ్యవహారం ఎదురుతిరిగింది. కాబట్టీ కాళ్లబేరానికి నచ్చిన రావణుడు అగ్నిసాక్షికసఖ్యాన్ని కోరాడు వాలితో. దెబ్బతిని ఉన్నాడు కాబట్టి చెప్పినది విని పడిఉంటాడనీ - అనేక కోట్ల రాక్షస సైన్యం వాడివద్ద ఉందిగదా అనీ - అగ్నిసాక్షికసఖ్యానికి వాలి అంగీకరించాడు. వారిద్దఱూ వాలిసుగ్రీవుల్లా ఒకనేలకలిసి ఒకేచోట ఉన్నారని వాల్మీకి చెప్పడంవలన, వాలిసుగ్రీవ విరోధం రానికాలంలోని వృత్తాంతం ఇది అని అర్థం చేసికోవాలన్న మాట.

ఇక్కడే ఈ కథని చెప్పడంలోని అసలు రహస్యం ఒకటుంది. రామా! సీతని రావణుడు ఎత్తుకు పోతే నువ్వు వాలితో మైత్రిని చేసికొని ఉంటే, అది చెప్పుకోదగ్గది కానే కాకపోయి ఉండేది. లోకంలో ఎవరైనా తమపనిని సాధించు కోవడానికి బలవంతులనే ఆశ్రయిస్తారు

కాబట్టి. కాని నువ్వు వాలి భయానికి భయపడుతూ ఎక్కడో ఋశ్యమూకం మీద దాగి ఆర్తుడైఉన్న సుగ్రీవుణ్ణి ఆశ్రయించావు. (నిజంగా అది శరణుకోరడం కానేకాదు. కిష్కింధాకాండ అముద్రిత వ్యాఖ్యలో వివరించాను.) బలహీనుడి పక్షాన భగవంతుడుండాలిగాని బలవంతుడి పక్షాన ఉంటే ఆయన భగవంతుడెలా ఔతాడు? ధర్మబలం, ఎటుంటే అటుండాలిగాని శారీరబలం ఉన్నవైపు భగవంతుడుండడం భగవల్లక్షణం కానేరదు.

(అందుకే పురాణం ఇలా అంది "రావణస్య సఖా వాలీ - రావణోపి వ్రజేత్తు మామ్ - రావణస్య వధాభావాత్ - అవతార ఫలం నహి" అని.) వాలినే రాముడివైన నువ్వు ఆశ్రయిస్తే సుగ్రీవునికి భయంతొలగేది కాదు. సుగ్రీవుని భార్యని అపహరించిన వాలిని నువ్వాశ్రయించిన కారణంగా, వాలీ ధర్మాత్ముడే అయ్యుండేవాడు. లోకం అంతా తమ్ముని భార్యని ఎత్తికొని పోవడం దోషం కాదని భావించేవారు. పైగా వాలి రావణుణ్ణి బెదిరించి సీతమ్మని తెచ్చేసి ఉన్నా - లేదా వాలిభయానికి రావణుడే సీతని తెచ్చి ఇచ్చేసి వెళ్లినా రావణుని దుశ్చేష్టలకి శిక్ష వేసే అవకాశమే రామునికి ఉండేది కాదు. శ్రీమహావిష్ణువంతటివాడు భూలోకంలో వాలిని ఆశ్రయించి భార్యని తెచ్చుకోవలసివచ్చిందనే అపకీర్తి దేవతలకి వచ్చేది - అవతార ప్రయోజనం ఉండేదీకాదు. ఇలా ఆలోచించిన కొద్దీ అసహ్యాత్యసహ్యంగా కన్పించేది ఈ వృత్తాంతం.

వాలి స్నేహితుడైన రావణుడుగాని, వాలిగాని తనని సమీపించడం లేదా ఆశ్రయించడం అనేది చేసే వీలులేకుండా రాముడు సుగ్రీవునితోనే అగ్నిసాక్షికసఖ్యాన్ని చేసికొన్నాడు. (ఈ సుగ్రీవమైత్రిలో ఇంకా అనేక విశేషాలు ముద్రణదాతకై ఎదురుచూస్తూన్న కిష్కింధాకాండ వ్యాఖ్యలో వివరించాను).

## "ఆంజనేయుడే లేకపోతే నేనే లేను"- రాముడు

వాలి వృత్తాంతం చెప్పగానే రాముడు వినయంతో అగస్త్యునితో అన్నాడు. 'స్వామీ! రావణుడూ, అతని కంటె వాలీ బలవంతులని చెప్తూ వచ్చారు గదా! ఆంజనేయునితో సమానులెవరూ

లేరని నా నిర్ణయం. శౌర్యం - రాజనీతి - బలం - ధైర్యం - పనిని నేర్పుగా ధర్మబద్ధంగా సాధించుకొని వచ్చే శక్తి- పరాక్రమం- అన్నీ తెలిసిన తనం- ప్రభావం ..... ఇవన్నీ హనుమంతునిలో పాతుకుపోయి స్థిరంగా ఉన్నాయి. ఒక్కదూకులో నూఱుయోజనాల సముద్రాన్ని దాటి వానరులకి ధైర్యం కల్గించడం, రావణాంతః పురంలోకి ప్రవేశించి, వెదికి, సీతనిచూచి, మాటలాడే తీరున మాటాడి, ఎందఱినో - వారితోపాటు అక్షకుమారుణ్ణీ చంపి, ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని విడిపించుకొని, రావణునికి నీతిపాఠాన్ని చెప్పి, లంకని బూడిదచేసి, ఇవన్నీ చాలక యుద్ధంలో చేసిన మహాపరాక్రమ విన్యాసాలు యమ - ఇంద్ర - విష్ణు - కుబేరులకి కూడా సాధ్యం అని నేననుకోను.

ఈరోజున సీతాలక్ష్మణులతోనూ, మిత్రబాంధవులతోనూ నేను సుఖంగా ఉన్నానంటే అది హనుమంతుని చలవేకదా! సుగ్రీవ మిత్రుడైన ఆంజనేయుడే లేకుంటే సీతాహృదయంలోని అభిప్రాయాన్ని నాకు తేగలవారెవరు? ఆంజనేయుడు లేని పక్షంలో నేనేలేను. అయినా, అలాంటి ఆంజనేయుడు తన రాజైన సుగ్రీవుడు కష్టాలలో ఉండగా, వాలిని కూడా ఎదిరించగలిగి ఉండి కూడా, ఎందుకు మౌనంగానే ఉండిపోయాడు? (ఆంజనేయుని గూర్చి రాముడు పలికిన ఈ శ్లోకాలు ఎంతో పట్టైనవి. స్తోత్రంలా చదువుకోదగినవీను. శౌర్యం దాక్ష్యం బలం ధైర్యం ప్రాజ్ఞతా నయ సాధనం విక్రమ శ్చ ప్రభావ శ్చ హనూమతి కృతాలయాః। దృష్ట్వైవ సాగరం వీక్ష్య సీదంతీం కపివాహినీం సమాశ్వస్య మహాబాహుః యోజనానాం శతం ప్లుతః। ధర్షయిత్వా పురీం లంకాం రావణాంతః పురం తదా దృష్ట్వా సంభాషితా చాపి సీతాహ్యాశ్వాసితా తథా। సేనాగ్రగా మంత్రి సుతాః కింకరా రావణాత్మజః ఏతే హనుమతా తత్ర హ్యేకేన వినిపాతితాః భూయో బంధాద్విముక్తేన భీషయిత్వా దశాననం లంకా భస్మీకృతా యేన పావకే నేవ మేదినీ। న కాలస్య న శక్రస్య న విష్ణో ర్విత్తపస్య చ। కర్మాణి తాని శ్రూయంతే యాని యుద్ధే హనూమతః ఏతస్య బాహువీర్యేణ లంకా సీతా చలక్ష్మణః ప్రాప్తా మయా జయ శ్చైవ రాజ్యం మిత్రాణి బాంధవాః। హనూమాన్ యది నో న స్యాద్వానరాధిపతేః సఖా। ప్రవృత్తిమపి కో వేత్తుం జానక్యాః శక్తిమాన్ భవేత్?

"న హి వేదితవాన్ మన్యే హనుమానాత్మనో బలమ్!" ఆంజనేయునికి తన బలం గూర్చి తనకి తెలిసి ఉండదని నేననుకుంటున్నాను' అని రాముడే అగస్త్యునితో అన్నాడు. ఈ అనడం బట్టి సమాధానం ఏదో దాన్ని మహర్షికి రాముడే అందించాడన్నమాట. పైగా అన్నిటికీ సమాధానాలు తెలిసినా లోకానికి ఉపదేశం చేయడంకోసమే నీచేత చెప్పిస్తున్నాను సుమా! అనికూడ ఈ ప్రశ్నించడం బట్టి తెలుస్తోంది.

ఆంజనేయుణ్ణి గూర్చి రామచంద్రునకున్న ఈ అభిప్రాయాన్ని మొత్తాన్ని వివరంగా దర్శించాలంటే సుందరకాండని చదివితీరాల్సిందే. (చూ. సుందరకాండ). ఇంతటి మహాభిప్రాయం ఆంజనేయుణ్ణి గూర్చి ఉండడంబట్టే ఈ ప్రశ్నని ఆంజనేయుడూ - ఇతర వానరాలూ వింటూండగానే అగస్త్యుణ్ణి రాముడడిగాడు. మరో విశేషమూ ఉంది. 'అహం స్మరామి మద్భక్తమ్' అని పరమాత్మ మాట. ఈ కారణంగానే రామునికి (తనకు) తనకంటె తనని నమ్మిన (భాగవతులు) భగవద్ భక్తులు సీతా - రామ - లక్ష్మణ - ఆంజనేయులంటే చెప్పలేని ఇష్టం. అందుకే తనకి దాసునిగా ఉన్న ఆంజనేయునికి కూడా పూజావకాశాన్నిచ్చాడు రాముడు. రామాలయాలలో కంటె ఆంజనేయాలయాలలో పూజాపురస్కారాలు ఎచ్చుగా ఉంటాయి. ఎంత ఎక్కువ సంఖ్యలో భక్తులు తన దాసునివద్దకు వస్తే అంతగా ఆనందిస్తాడు రాముడు. ఈ వచ్చిన ఇందరూ రామభక్తుణ్ణనే గౌరవంతో, రాముని మీద ప్రేమతో వస్తున్నారని తలుస్తాడు మారుతి. ఆ యిరువురి అనుబంధమూ అలాంటిది.

ఇన్నిమాటలెందుకు? సీతమ్మని దర్శించి వచ్చిన ఆంజనేయుడు లంకలో జరిగిన విశేషాలని రామునితో మొత్తం చెప్పాక రాముడు ('మనసాపి యదన్యేన న శక్యం ధరణీతలే') 'ఆంజనేయా! ఈ భూమండలంలో ఇలా మరొకనిచేత ఈపని సాధ్యమయ్యేదే కాదు' అన్నాడు. ఆ అన్నవాడు రాముడు కాబట్టి అక్షరాక్షరంలో సత్యమూ - మర్మమూ ఉన్నాయి. లోకంలోని వాళ్లు అన్న మాటలు కావేకావు గదా! ఒక్క రామునికే కాదు. ఆంజనేయుడంటే సీతమ్మకూ ఎంతో ఇష్టం.

అందుకే సీతమ్మకి రాముడు హారాన్ని ఇచ్చి 'యస్య తుష్టాసి భామిని! పౌరుషం విక్రమో బుద్ధిః యస్మిన్నేతాని సర్వశః' 'పౌరుష పరాక్రమ బుద్ధి బలాలు ఎవని కుండి, అవి సద్వినియోగమై నీకు సంతృప్తిని ఎవరు కలిగించారో వానికి ఈ హారాన్నియ్యి' అనగానే 'దదౌ సా వాయుపుత్రాయ' ఏ మాత్రం అనుమానం లేకుండా ఆమె ఆ హారాన్ని ఆంజనేయునకే ఇచ్చింది. ఎన్నెన్నో విశేషాలున్నాయి. (చూ. సుందరకాండ మఱియు యుద్ధకాండ).

## హనుమంతుణ్ణి గూర్చి విను!

రామచంద్రా! సూర్యకాంతికి బంగారంలా ప్రకాశించే !మేరువు! అనే పర్వతం ఉంది. దానికి రాజు 'కేసరి'. అతని భార్య 'అంజన'. అంజనకు పుట్టడం వలన ఈతడు 'ఆంజనేయుడు' అయ్యాడు. అంజన పిల్లవానికి మధురఫలాలని తేవడం కోసం 'అంజన' వనానికి వెడితే ఆకలికి తాళలేని ఆంజనేయుడు తూర్పున ఉదయిస్తున్న సూర్యుణ్ణి చూచి, తినే ఫలం అనుకుని వేగంగా ఆకాశానికెగిరాడు.

ఆనాడు సూర్యగ్రహణంరోజు కావడంతో రాహువు సూర్యుణ్ణి పట్టుకోవడానికి వచ్చి, వేఱొకనికి (ఆంజనేయుడు) కూడా ఇంద్రుడు సూర్యుణ్ణి పట్టుకునే అవకాశమిచ్చాడని భావించి ఇంద్రుని వద్దకు వెళ్లి విషయం చెప్పాడు.

రాహువూ ఇంద్రుడూ కలిసిరాగా, ఇంద్రుని అండతో రాహువు సూర్యుణ్ణి పట్టుకోబోయాడు. రాహువును చూచి సూర్యుని కంటే మంచి పండు ఇతడే అని భావించి ఆంజనేయుడు రాహువుని వెంబడించాడు. భయపడకుమంటూ ఇంద్రుడు ఐరావతం మీద రాహువుని రక్షించడానికి రాబోతే ఐరావతాన్ని చూచి 'ఇదిఇంకా పెద్ద ఫలం' అనుకొని ఐరావతం మీదికి మారుతి దూకబోయాడు. ఇంద్రునికి కోపంవచ్చి వజ్రాయుధాన్ని ఆంజనేయునిమీదికి విసిరాడు. ఆదెబ్బకి స్పాధీవం తప్పి కొండ శిఖరంమీద పడ్డాడు ఆంజనేయుడు. అతని ఎడమ చెంపకి గాయమయ్యింది.

తన పుత్రుణ్ణి ఇలా గాయపఱచాడనే బాధతో వాయువు ప్రసరించడం మానేసాడు. దానితో సూర్యప్రకాశం విపరీతమైపోయింది.

లోకంలోని ప్రాణులలో ఉన్న వాయువు కూడ సంచరించడం మానివేయడంతో శరీరంలో అందరికీ రక్తప్రసారం ఆగిపోయింది. అందరి పొట్టాలూ ఉబ్బిపోసాగాయి. అగ్ని లేక యజ్ఞాలు విఘ్నాల పాలయ్యాయి.

దేవతలు, సిద్ధులు, సాధ్యాలు, యక్షులు, సకలప్రాణిసమూహం బ్రహ్మవద్దకి కొన ఊపిరులతో చేరి విన్నవించుకోగా ఆయన అందరితోనూ బయలుదేరి వచ్చి, ఆంజనేయుణ్ణి ఒడిలో పెట్టుకుని బాధపడుతూన్న వాయుదేవుణ్ణి ఓదార్చి అంజనేయుని తల నిమిరాడు. వెంటనే స్పృహ వచ్చింది. లోకం నిండా తిరిగి వాయుసంచారం ప్రారంభమైంది.

వాయువు తిరిగి సంచరించినందుకు ఆనందపడుతూ బ్రహ్మ సమక్షంలో ఇంద్రుడు ఇలా అన్నాడు. నా వజ్రాయుధం కారణంగా ఇతని హనువు (చెంప ) గాయపడడం బట్టి హనుమంతుడుగా ప్రసిద్ధిపొందుతాడు. మరుతుని (వాయువు) పుత్రుడు కాబట్టి ఇతణ్ణి మారుతి అనీ పవనుని పత్రుడు కాబట్టి పావని అనీ లోకం వ్యవహరిస్తుంది. ఇతని మీద నా వజ్రాయుధం మరెప్పుడూ పనిచేయదు. మరణమే ఇతని కుండదు. దీర్ఘాయువవుతాడు' అని.

'నా తేజస్సులో నూఅవ భాగాన్ని ఆంజనేయునికిస్తున్నాను. అకారణంగా చక్కగా మాట్లాడే నేర్పు - బుద్ధి కుశలత - స్పష్టమైన కంఠస్వరం- ఆరోగ్యమూ ఇతనికి కల్గడమే కాక, శాస్త్రజ్ఞానంలో ఇతనికి సాటి మరెవరూ ఉండరు. ఇతనికి దీర్ఘాయుస్సాన్ని నేనూ ఇస్తున్నాను. వరుణుని నీళ్లతోగాని, పాశాలతోగాని చావు వీనికి ఉండదు' అన్నాడు సూర్యుడు.

వ్యాధిలేని వరాన్నీ, యమదండం సమీపించలేని వరాన్నీ యముడీయగా, తన గదవలన మరణం ఉండదని కుబేరుడూ, తన ఆయుధాలేమీ ఇతనిపై పనిచేయని వరాలని శివుడూ, బ్రహ్మాస్త్రం వలన మరణంలేని వరాన్ని దీర్ఘాయుష్యంతోపాటు బ్రహ్మ ఇచ్చారు. ఏ అస్త్ర శస్త్రాలూ ఇతణ్ణి బాధించని వరాన్ని విశ్వకర్మ ఇస్తూ దీర్ఘాయుస్సాన్ని ప్రసాదించాడు కూడ.

ఇన్ని వరాలు ఒక్కమాఱుగా లభించిన ఆ పిల్లవానిని చూ బ్రహ్మ కామరూప, కామగమనాలనీ, (కావలసిన రూపం, కావలసి చోటుకి పోవడం) అజేయత్వాన్నీ (ఓడిపోవనితనాన్నీ) ఇచ్చాడు. బ్రహ్మ వెళ్లిపోతూ పోతూ రామునికి రాక్షస సంహారకాలంలో సహా భూతుడౌతాడని కూడ చెప్పాడు. ఈ వరాల బలంతో, మదం ఋషుల ఆశ్రమాలకిపోయి నారబట్టలని చించి, అగ్నిహోత్రాలని ఆర్పి పాత్రలని పగులగొట్టి, గంతులువేస్తూ ఆశ్రమాలని ధ్వంసం చేస్తూంటే మహర్షులంతా' నీ బలాన్ని నువ్వు మఱచిపోతావు! ఎవరైనా నిన్ను పొగిడితే తిరిగి గుర్తువస్తుంది!' అని శాపంలాంటి వరాన్నిచ్చారు.

అప్పటినుండీ హనుమంతుడు సాధువర్తనుడై (నిదానమైన నడవడిక కలవాడై) ఉంటూ వచ్చాడు. ఒకప్పుడు వాలికి సుగ్రీవునితో విరోధం రాగా, వాలి, తన అఱచేతిని పంజాలా తెఱచి సుగ్రీవుణ్ణి వెంబడిస్తూ పరిగెత్తుకు వస్తూంటే, మునులశాపం కారణంగా తనశక్తి తనకి తెలియని ఆంజనేయుడు కూడా అలాగే శక్తిహీనుడిలా పరిగెత్తాడు.

నిజానికి పరాక్రమం - బుద్ధి - పట్టుదల - సౌశీల్యం (సత్ప్రవర్తన) - మధురసంభాషణం ..... వంటి విషయాలలో ఆంజనేయునికి మించిన వారు ఎవరైనా ఉన్నారా? "నిలుకడలేని కారణంగా విద్య చెప్ప వీలుపడదు"- అని చెప్పిన సూర్యుని వెంట విద్య నేర్చుకోగోరిన ఆంజనేయుడు తూర్పు - పడమరలకు తిరుగుతూనే అన్ని శాస్త్రాలూ-ఛందస్సూ-సూత్ర వివరణాలూ ఒకటేమిటి? అన్నింటినీ చదివాడు.

ఇన్ని మాటలెందుకు? ఈ కల్పాంతంలో హనుమంతుడే తిరిగి బ్రహ్మపదవికి వస్తాడు. లోకాలని ముంచే సముద్రుడుగా, లోకాలని దహించివేసే అగ్నిగా, ప్రళయకాలంలో విజృంభించి సర్వనాశనాన్ని చేసే యమునిగా వచ్చేది హనుమంతుడే. (సోఽయం నవవ్యాకరణార్థ వేత్తా బ్రహ్మా భవిష్య త్యపి తే ప్రసాదాత్ - సర్వాసు విద్యాసు తపోవిధానే ప్రస్పర్ధతే యో హి గురుం సురాణామ్) తొమ్మిది వ్యాకరణాలనీ భాష్యంతో సహా చదివినవాడూ, ముందుకాలంలో బ్రహ్మపదవిని అలంకరింప బోతున్నవాడూ, దేవగురువైన బృహస్పతితో చదువులో పోటీపడగలవాడూ అయిన హనుమంతుని బలం- విద్య-

పరాక్రమం- శీలం విన్నావు గదా! ఇక మమ్ములని వెళ్లేందుకు అనుమతించు" అని అగస్త్యాది మహర్షులన్నారు.

రాముడు వారందఱికీ నమస్కరించి 'ఆర్యులారా! నేడునిజంగా నా పితృదేవతలంతా తృప్తిచెందారు. మానాన్నగారు సంతోషపడతారు. కొంతకాలానికి యజ్ఞం ప్రారంభిస్తాను. అప్పుడు మీరిక్కడే ఉండి నన్నునుగ్రహించాలి యజ్ఞం అయ్యేవఱకూ"(తదాగంతవ్య మనిశం భవద్భిరిహ సంగతైః) అని ప్రార్థించి సాగనంపాడు.

**లో విశేషాలు**

హనుమంతుడు, ఆంజనేయుడు అని ఇతని పేర్లు. 'ప్రశస్తౌ హనూ అస్య స్తః ఇతి హనుమాన్, అంజనాయాః అపత్యం పుమాన్ ఆంజనేయః' అని ఈ రెండు పదాలకీ వివరణం (విగ్రహవాక్యాలు). చక్కని దౌడలు కలిగినవాడు ఆంజనేయుడని అర్థం. దౌడ ఉచ్చారణానికీ, తనలో దాగిన పళ్లతో ఆహారాన్ని సరిగా నమిలేలా చేసి జీర్ణక్రియతో ఆరోగ్యపరిరక్షణకీ కారణం అవుతుంది. కాబట్టి హనుమంతుని ఉచ్చారణం అతిస్పష్టంగా వినేందుకు వీలుగానూ, వినాలని అన్పించేదిగానూ ఉంటుందని పేరును బట్టి తెలుస్తోంది. ఇది నిజం కాబట్టే ఆంజనేయుణ్ణి చూచిన ప్రథమ పరిచయంలోనే రాముడు లక్ష్మణునితో ' కస్య నారాధ్యతే చిత్త ముద్యతాసే రరేరపి?' లక్ష్మణా! ఇలా మాట్లాడే ఈ కంఠస్వరం - స్పష్టత - వినయం మొదలైన గుణాలని బట్టి ఎలాంటి శత్రువైనా ఇతనిమీదికి ఎత్తిన కత్తిని కూడా దించి నమస్కరించడూ! ' అన్నాడు. (అలాగే ఆంజనేయుడనే పేరికున్న అర్థం-లోభావం కూడ సుందరకాండ వ్యాఖ్యలో వివరింపబడింది.)

హనుమంతుణ్ణి హనుమంతుని సమక్షంలోనే ఎంతగానో రామచంద్రుడు ఇక్కడ ప్రశంసించాడు. అసలు ఆంజనేయుణ్ణి చూచిన మఱుక్షణంలోనే అతిగంభీరుడైన రాముడు, ఆచితూచి మాట్లాడే రాముడు ఎంతగానో ప్రశంసించాడు. ఎవరికైనా ఎంత వయస్సు వానికైనా తనని గూర్చి పరోక్షంగానో ప్రశంసించినా కొంతలో కొంత గొప్పదనం వచ్చినట్లనిపిస్తుంది. ఆంజనేయుణ్ణి, ఋషుల సమక్షంలో రామునికే ఉపదేశం చేసిన అగస్త్యుడంతటివాడు ప్రశంసించినా, రాముడే

ఎంతగానో అతణ్ణి స్తుతించినా, ఏ మార్పూ లేకుండా నిలబడిన ఆంజనేయుడు ఎంతెంత గొప్పవాడు!!! తాను చేసిన సహాయం కూడా పరమాత్మానుగ్రహం వలననే జరిగిందని చెప్పుకొనే పరమ భాగవతోత్తముడాయన. ఇక విజృంభిస్తే లంకనే గడగడలాడించిన వాడాయన.

ఆత్మస్తుతి కొంచెం గాని, ఏమాత్రమో గాని కాదు! అసలు ఆత్మస్తుతే ఎఱుగని ప్రవర్తన కలవాడు ఆంజనేయుడు. ఈ గుణం అరుదుకే అరుదు.

సముద్రం మీదుగా ఎగురబోయేప్పుడు ఆంజనేయుడు సూర్య-ఇంద్ర - వాయు - బ్రహ్మదేవతలకి నమస్కరించాడు. కారణం తాను సూర్యుణ్ణి మ్రింగబోతే, **ఇంద్రుడు** వజ్రాయుధం వేస్తే, **వాయువు** బిగదీస్తే, *బ్రహ్మ* వరాలనిచ్చాడు. గనుక తాను స్పృహవచ్చి చూచే సరికి ఈ నల్గురూ తన ఎదురుగా కన్పించారు. కాబట్టీను. (వివరంగా ఎంతో వ్రాయబడింది. చూ. సుందరకాండ వ్యాఖ్య).

వాయువు బిగదీయడం వలన ఎంత నష్టం కల్గుతుందో ఆ విషయం వివరంగా వ్రాసింది ఉత్తరకాండ. ప్రపంచమే (బ్రహ్మాండం) కాక శరీరంలో (పిండాండం) కూడ వాయుసంచారం లేని పక్షంలో శరీరం రోగగ్రస్తం కావడమే కాక, ఉండవలసిన ఉష్ణోగ్రత లేని పరిస్థితి ప్రకారం కాళ్లూచేతూలూ చల్లబడవచ్చును.

'ఆకాశాద్వాయుః- వాయోరగ్నిః- అగ్నేరాపః - అబ్భ్యః పృథివీ- పృథివ్యా ఓషధయః- ఓషధీభ్యోఽన్నమ్- అన్నాద్భవంతిభూతాని' అనేది క్రమం. ఆకాశంనుండి ముందు పుట్టిందే వాయువు. వాయువు నుండి రాకపోకల కారణంగా పుట్టింది అగ్ని. వాయువు నుండే అగ్ని- అగ్నినుండి నీరూ,- నీటినుండి భూమి, భూమినుండి ఓషధులు, ఓషధుల నుండి అన్నం, అన్నంనుండి భూతాలయిన మనమూ వస్తున్నా మంటే, కనిపించని వాయువు ఎన్నిటికి మూలమో గ్రహించాలి.

ఈ కథద్వారా గమనించదగిన ముఖ్యాంశం ఒకటుంది. రావణునికీ బలం ఉంది. ఆంజనేయునికీ బలం ఉంది. రావణుడు ఎలా మదంతో దేవలోకాలమీదికి యుద్ధానికి [illegible]డో అలా

ఆంజనేయుడు కూడా ఋష్యాశ్రమాలని ధ్వంసం చేయసాగాడు. రావణుణ్ణి పతనం చేయదలచిన దేవతలు అతనికి ఓడుతూ మదాన్ని పెంచారు. ఆంజనేయుణ్ణి చిరంజీవిగా, యశోవంతునిగా చేయదలచిన ఋషులు ఆంజనేయునికి 'తనశక్తిని తానుమఱచిపోయే వరాన్ని' ఇచ్చారు. అనుక్షణం తన శక్తిని తాను గుర్తుతెచ్చుకొనేవాడు చేసే దుర్మార్గాలు ఇన్ని- అన్నిగా ఉండవనీ అవి పతనానికే త్రోవతీస్తాయనీ, తనశక్తిని తాను మఱచి గౌరవంగా ఉండేవాడు (అహంకారం లేనివాడు) గొప్పవాడు కాగలుగుతాడనీ సారాంశం.

రావణునికీ ఆంజనేయునికీ కూడా బ్రహ్మాది దేవతలు వరాలిచ్చారు. అయితే రావణుడు అడిగిన వరాలకి 'అలా కుదరదు- ఇలా అడుగరాదు' వంటివి చెప్తూ వరాలనీయాల్సిన పరిస్థితి వచ్చింది. అంటే ఆలాంటి వరాలని అడిగాడు రావణుడు. ఆంజనేయుడు వరాలని అసలు అడుగనే లేదు. వాళ్లంతటవాళ్లే సూర్య - ఇంద్ర - బ్రహ్మలు ఒకరివెంట ఒకరు ఒకటిపై మఱొకవరాన్ని ఇవ్వాలని ఇచ్చేసారు. రావణుని విషయంలో అలా ఉండడానికీ, ఆంజనేయునికి ఇలా ఇయ్యడానికీ ప్రవర్తన మాత్రమే కారణం. రావణుని మదం కారణంగా అతని వరాలు అతని పాలిటి శాపాలయ్యాయి. ఆంజనేయుని సౌశీల్యం కారణంగా అతని వరాలు అతనికి గుడి కట్టించాయి.

వాలి చంకలో ఇఱికి మూడుసముద్రాలూ తిరిగి నేలదిగినా నువ్వెవరివి? ' అనగానే' 'రాక్షసేంద్రోఽహమ్' రాక్షసులకి ప్రభువుని అని చెప్పుకొనే సిగ్గులేనితనం -రావణునిది. రామచంద్రునికి జీవితమైన సీతమ్మని సమకూర్చడమనేంతటి అతిముఖ్యకార్యాన్ని చేసినా 'నావల్ల సీతమ్మ నీకు దక్కింది' లాటి స్వోల్లుంఠనం (దెప్పిపొడుపు) గాని, వెక్కిరింతగాని ఆంజనేయుడననే అనడు: అని ఉండలేదు. ఆంజనేయుణ్ణి చూచి నేర్వవలసిన వానిలో అతిముఖ్యమైనది 'సహాయాన్ని చేసి మఱచిపోవడం'. సుగ్రీవునితో రామునికి సఖ్యం ఉన్నా, రామునికి ప్రీతిపాత్రుడు సుగ్రీవుని కంటె దాసుడైన ఆంజనేయుడే. కారణం- 'తనకి చేసిన సహాయాన్ని మఱచేవాడు' సుగ్రీవుడైతే, ఇంతకు ముందు అనుకున్నట్లు 'తాను సహాయంచేసి మఱచిపోయేవాడు' ఆంజనేయుడు.

సుందరకాండలో ఆంజనేయుడు తన పుట్టుకని గూర్చి తాను మూడే మాటల్లో చెప్పుకుని ముగించాడు. అదికూడా సీతమ్మ సమక్షంలో. ఇంతటి మహనీయ చరిత్ర ఉన్నవాడెవడైనా అంత క్లుప్తంగా ముగించగలడా? పోనీ! అక్కడ చెప్పుకొనకపోయినా అగస్త్యుడు తన చరిత్రనే రామునికి చెప్తూన్నప్పుడు మఱోనాలుగు వాక్యాలని తానూ కలిపి చెప్పుకోవచ్చు. అగస్త్యుడు చెప్పేది తన చరిత్రనేకదా! మాఱుపల్కక 'రామచంద్రుని తోడిదే లోకం- ఆయన ముందు నాపరాక్రమమా?' అని భావించే ఉత్తముడాంజనేయుడు.

ఇక ఆంజనేయుని సూర్యశిష్యత్వం చెప్పుకోదగిందే. ఉపాధ్యాయ శబ్దానికి 'ఉప - సమీపమేత్య, అధ్యాయః- అధ్యాపయతి' 'తన వద్దకు శిష్యుణ్ణి రప్పించుకొని చదువు చెప్పేవాడు' అని అర్థం. రోజూ తూర్పు-పడమరల మధ్య ప్రయాణం చేసేవాణ్ణి' అనగానే 'నిజమేకదా!' అనుకోకుండా అలాగే ఆంజనేయుడు సూర్యునితోపాటు ప్రయాణం చేస్తూ విద్యాభ్యాసం చేయడంవల్ల సూర్యసేవాభాగ్యం (ఆరోగ్యప్రదం) బుద్ధిమత్త్వం (మంచి ఆలోచన శక్తి) సర్వభౌగోళిక శేషాలూ.....ఇలా ఎన్నెన్నో లభించాయి- తెలిసాయి కూడ.

మర్కటకిశోర న్యాయం- మార్జాలకిశోరన్యాయం అని రెండు. నపిల్లని తల్లికోతి ఏ మాత్రమూ పట్టుకోదు. పిల్లి మాత్రం తన పిల్లని నోట కరచుకుని తీసికొని వెళుతుంది. మొదటిదైన మర్కటకిశోరం న్యాయంలో పడిపోకుండా పట్టుకొనవలసిన బాధ్యత పిల్లదైతే, రెండవ మార్జాలకిశోర న్యాయంలో బాధ్యత తల్లిది. ఇలాగే శిష్య ఉపాధ్యాయుల సంబంధం మర్కటకిశోర న్యాయంగా ఉండాలి. అంటే శిష్యుడే గురువుని అంటిపెట్టుకుని చదువు చెప్పించుకోగలగాలి.

గురువుమనస్సులోని విద్యారహస్యాలని తనంత తానుగా చేదుకోగలిగే వినయాన్ని చూపించగలగాలి శిష్యుడు. దూడ దగ్గఱకు రాగానే తల్లిఆవుకి పాలు చేపులు వచ్చినట్లు శిష్యుణ్ణి- చూడగానేకాదు- తలచుకోగానే ఈ క్రొత్త విషయం వీనికి చెప్దామనుకొనే ఆనందం- ఆలోచన - గురువుకి కలిగే తీరులో శిష్యుని ప్రవర్తనం ఉండాలి. అప్పుడే 'పుత్రాదిచ్ఛేత్ పరాజయమ్' పుత్రుని వంటి శిష్యుడు తనని

మించాలని భావించగలడు గురువు. 'మా విద్విషావహై' గురువు శిష్యుల మధ్య ద్వేషభావం ఉండనే కూడదు.

ద్రోణాచార్యుడు తన పుత్రుడు అశ్వత్థామకీ- అర్జునునికీ కూడా గురువే అయినా అర్జునుడు మెప్పించినంతగా అశ్వత్థామ ఆనందపఱచ లేకపోయేసరికి ద్రోణుని శిష్యవాత్సల్యం పుత్రునికంటె అర్జునునిపైనే ఎక్కువయింది. ద్రోణుని గురుకటాక్షం వలన అర్జునునికే కీర్తి దక్కింది. అశ్వత్థామకి అవకాశం ఉండి కూడా సరిగా వినియోగించుకో(లే)ని కారణంగానూ, దుష్టసాంగత్య కారణంగానూ, పరమ కరుణామూర్తి అయిన భగవంతుడు కూడా (కృష్ణుడు) శపించవలసిన స్థితి కల్గింది. గురువును ఒప్పించి, మెప్పించి చదువు చెప్పించుకోవాలిగాని గురువును నొప్పించితే చదువురానే రాదు. ఒక్క మాటలో చెబితే శిష్యుడు ఉన్నతికి వస్తున్నాడంటే గురువుకీర్తి రోజురోజుకీ వృద్ధిపొందుతూన్నట్లే కదా!

'గురుపూర్ణిమ' వంటి వానిని పండుగ రోజులుగా చేర్చడంలోని ఔచిత్యం ఇదే. ఇలాంటి వాటిని చెప్పి గురుశిష్య సంబంధాన్ని దృఢపఱచుకోవాలని. ఆరోజుని పట్టి సెలవుగా ప్రకటించుకొని గాలికి తిరిగితే రెండుకాళ్ల ప్రాణికీ నాలుగుకాళ్ల ప్రాణికీ భేదం లేనట్లే ఏ మాత్రపు తీరికాలేని సూర్యుని నుండి చదువుని పొందిన ఆంజనేయుని నుండి నేర్చుకొనవలసినది ఇంత ఉందన్నమాట.

## కృతజ్ఞతలూ - బహుమానాలూ

పట్టాభిషేకపు వేడుక చూసాక, కొంతకాలం ఉన్న పెమ్మటు, క్రమక్రమంగా తమతమ దేశాలకి రాజులు బయలుదేర ప్రారంభించారు. ఎవరెవరికి ఏయే బహుమానాలని ఇచ్చి ఏయే విధంగా పల్కరించాలో తెలిసిన రామచంద్రమూర్తి అందఱినీ అలా ఆదరించి సాగనంపదలిచాడు.

ముందుగా తన మామ జనకులవారే ఉన్నారు. 'ఆర్యా! విదేహ దేశానికీ ఇక్ష్వాకు దే[illegible]నికీ ఉన్న సంబంధ బాంధవ్యాలు చెప్పుకోదగినవి. ప్రజార[illegible] విషయంలో అనుక్షణం నిమగ్నులై ఉండే మిమ్మల్ని చాలాకాలం [illegible]డే ఉంచాం. మీరు ఉన్నందుకు [illegible]ందపడుతున్నాను. మీ[illegible] భరతుడు సాగనంపవస్తాడు'. అంటూ [illegible]గలరత్నాలని బహు[illegible]డు. ఆయన చిఱునవ్వు నవ్వి

'నాయనా! పరాక్రమం ఉండి కూడా నీకున్న వినయం, అనేక కార్యభారాలు ఉన్నా నీవిచ్చిన దర్శనం నాకు ఎంతో ఆనందాన్నిచ్చాయి. ఈ రత్నాలని నా కూతుళ్లకిస్తున్నాను' అని బయలుదేరాడు జనకుడు.

అలనాడు తన కూతురైన సీతకీ, అల్లుడైన రామచంద్రునికీ వనవాసం సంప్రాప్తించి అయోధ్య మొత్తం అతలకుతలమైన రోజూన గానీ, సీతమ్మ వెళ్లిన పిమ్మట పదునాలుగేండ్లపాటు ఏం జరిగిందనికానీ వారిజాడనే అడుగని జనకుడు, పట్టాభిషేకానికి వచ్చి ఇంతకాలం ఎందుకున్నాడు? 'కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః' నిత్యం జపధ్యానాలలో మునిగే కర్మిష్ఠి జనకుడు. ఆ కారణంచేతనే వేదవతీ రూపంలో ఉన్న లక్ష్మీదేవి జనకుని యింట పుత్రికగా పుట్టడానికి నిశ్చయించుకుంది. ఆయనకి తపస్సమాధిలో ఉంటే చాలు భూత భవిష్యద్వర్తమానాలు అలా తెలుస్తాయి. అందుకే ఆయన రాలేదు.

రామచంద్రమూర్తి ఇక వైకుంఠానికి వెళ్లవలసిన కాలం సమీపిస్తోంది కాబట్టీ, ఆయనదర్శనానికి వస్తే ఎందఱో మహర్షులని దర్శించవచ్చును గాబట్టీ ఆయన వచ్చాడు. చుట్టఱికాన్ని గమనిస్తే ఆయన గర్భవాసాన సీతమ్మ పుట్టలేదు కాబట్టీ నిజంగా తాను మామగారౌతాడా? తపశ్శక్తి కావలసిన తనకి రత్నాల బహుమతులతో పని ఏముంది? అందుకే వాటిని తన పుత్రికలకే ఇమ్మని ఇచ్చి వెళ్లిపోయాడు జనకుడు. ఇక లౌకిక విధానంతో ఆలోచిస్తే సీతమ్మ తనవద్ద పెరిగిన తీరు గమనించి ఆమె కార్యాన్ని ఆమె చక్క దిద్దుకోగల ఇల్లాలే, పైగా అయోనిజ అని నిశ్చయించి అయోధ్యలో ఆనాడు అంత క్లిష్టపరిస్థితి కల్గినా ఆయన రాలేదు. అత్తింట ఏదైనా చిక్కుపరిస్థితి వచ్చినా దానికి సరైన తీరులో పరిష్కారాన్ని చేసికోగల సమర్థత ఉండేలా తల్లిదండ్రులు పెంచాలి. అత్తింటికి వెళ్లాక భార్యగా, కోడలిగానూ కూడ 'వీలయినంతవఱకూ' సమస్యల పరిష్కారానికి తలి దండ్రులని రమ్మనే పరిస్థితిని తెచ్చుకోకూడదని రామాయణం చెప్తుంది.

మీదట ఉన్నది కేకయమహారాజు. 'ఆర్యా! లక్ష్మణుడు మీవెంట సాగనంప వస్తాడు. ఇవిగో వెలగల రత్నాలని స్వీకరించండి' అంటూ నమస్కరించి రాముడు బహూకరించాడు. రామునికి

ప్రతినమస్కారాన్ని చేసి 'రామా! నీకు నిరంతరం రత్నాలు అభివృద్ధి యగుగాక!' అని ఆశీర్వదించి కేకయరాజు వెళ్లిపోయాడు.

ఈయన ఎంతెంత గొప్పవాడనే విషయం అయోధ్యాకాండ చెప్తుంది. ఎక్కడ కైకమ్మ వలన ఇబ్బంది కలుగుతుందోనని రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల వివాహానికి పూర్వమే తన పుత్రుణ్ణి మిథిలకి పంపాడు కేకయ. అంతా పెళ్లికి మిథిలకి వెళ్లారని తెలిసీ, తమకు భరతుని పెళ్లికి ఆహ్వానంకూడా లేదని గమనించికూడా, మిథిలకి పెళ్లికి వెళ్లిన కైకమ్మ సోదరుడు యుధాజిత్తుకి ఉన్న మంచితనం తండ్రి కేకయ మంచితనం నుండి కల్గిన సంస్కారవిశేషమే కదా!

భరతుని వలన కాక, భరతుణ్ణి అనుసరించే శత్రుఘ్నుని వలననైనా కష్టం దశరథునికీ, రామునికీ రాగలదని భావించి ఆ యిద్దఱినీ తనపురానికి తీసికొనిపోయిన యుధాజిత్తులో కేకయరాజు గొప్పదనాన్ని గమనించవచ్చు. (ఇంకా విశేషంగా వివరంగా నా అయోధ్యాకాండవ్యాఖ్యలో చూడవచ్చు). జనకుడు భూతభవిష్య ద్వర్తమానాలు తెలిసి అయోధ్యలోని విషయాన్ని పట్టించుకోకుండా ఉంటే, కేకయ-ముందుకాలపు అనర్థాన్ని ముందుగానే మఱింత జటిలం కానీయకుండా చేసాడు. ఈలోగా భరతశత్రుఘ్నులకి మంచి శిక్షణ నిస్తున్నట్లు వాళ్లతో చెప్పకుండానే, రామునియెడ భ్రాతృగౌరవం, భక్తీ ఉండేలా వారిని తీర్చిదిద్దాడు. రామునికి రాజ్యంవస్తే వాని పక్షమే మాట్లాడి రాజ్యాన్ని పొరపాటున కూడా స్వీకరించవద్దు సుమా!' అని నడుచుకొనేలా రాజ్యప్రాప్తి ఉన్న తన మనుమనికి శిక్షణ నిచ్చి పంపిన తాత కేకయ.

ఇలాంటి మహనీయుల చరిత్రని విన్నా, చదివినా, వ్రాసినా లౌకికంగా చూస్తే ప్రవర్తనలో ఎంత చక్కని మార్పు ఉంటుంది! ఆధ్యాత్మికంగా ఆలోచిస్తే ఎంతపుణ్యం లభిస్తుంది! ఆముష్మికంగా భావిస్తే రామునికృపకి ఎంత దగ్గఱితనం సిద్ధిస్తుంది!! రాజ్యాలకోసం కొట్లాడుకున్న చరిత్ర (Social Studies) లని చదివితే భౌగోళిక విశేషాలు తెలియవచ్చు ... గాని ప్రవర్తనలో దురాలోచన కలిగే ప్రమాదం వస్తుంది. ... అణ్వస్త్రాలని తయారుచేసే విధానాలని ... పెడితే లోకంలో ... ప్ప విజ్ఞానశాస్త్రవేత్తగా గౌరవం

లభించవచ్చునేమోగాని ప్రజలలో మారణాయుధ ప్రయోగం చేయాలనే బుద్ధి వస్తుంది. (వచ్చేసింది). ఇలాంటి ఇతిహాసాలని చదివితే వచ్ఛీలవిధానం అలవడుతుంది. ఇది బుద్ధిని వక్రమార్గం పట్టనీయకుండా చేస్తుంది.

ఒక ఔషధం సరిగా తయారుచేయబడని పక్షంలో ఎందఱినో చంపవచ్చు. అలాగే ఒక రచన సరిగా చేయబడని పక్షంలో ఎందఱికో దుర్బుద్ధిని పుట్టించవచ్చు. అందుకే మహర్షులు ఇతిహాసాలని వ్రాయడానికి ముందు, తాము వ్రాసే గ్రంథం సద్బుద్ధిని కలుగజేసేది కావాలనీ, ఎందఱికో దురాలోచనని పుట్టించి ఆ కారణంగా వారు చేయబోయే దారుణకృత్యాల పాపం తమకు చుట్టుకొనేలా చేసేది కారాదనీ భావించి, తపస్సుచేసి ఆ తపశక్తితో గ్రంథాన్ని వ్రాసేవారు. భారత రామాయణ భాగవతాలు ఇలాంటివే. వ్యాసవాల్మీక్యాదులు తపస్సుచేసినా, తెనుగులో నన్నయ యజ్ఞం చేసినా, తిక్కన "సోమయాజి" అయినా, మీదికవులంతా పురాణాలని ఆపోశనంపట్టి నిత్యదైవారాధననిచేసినా తమ తమ ఆలోచన ఈ పైన చెప్పుకొన్నదే తప్ప వేఱుకాదు.

నేటి కాలంలో వందన సమర్పణ అని లాంఛనంగా (మనసులో అనిష్టం గూడు కట్టికొని ఉన్నా-శ్రోతలకికూడా కూచుని చూడాలని లేకున్నా) జరిపించే కార్యక్రమం, జ్ఞాపిక (Momento) ప్రదానం అనేది ఏది ఉందో అది శ్రీమద్రామాయణకాలం నాటిదన్న మాట. అయితే అప్పటి కాలంలో ఔచిత్యాన్ని గమనించి, శ్రద్ధాభక్తులతో త్రికరణశుద్ధిగా సాగేదని ఈ ఉత్తర కాండలో ఈఘట్టం సాక్ష్య మిస్తోందికదా!

తరువాత రామచంద్రునికి కన్పడినవాడు ప్రతర్దనుడు. సీతాపహరణం జరిగిందని తెలిసి పెద్దసేనతో లంకమీదికి దండెత్తాలని నిశ్చయించి భరతుని వద్దకి వచ్చి రాజులని పిలిపించవలసిందిగా చెప్పిన కాశీరాజు ఈయన. ఆయనను రాముడు కౌగిలించుకున్నాడు. రాముని కౌగిలిభాగ్యం ఈ ఘట్టంలో ప్రతర్దనునికే లభించింది. ఆజ్ఞాపిక ఎన్నటికీ మఱువలేనిది కదా!

ఇక ఎందఱెందఱో రాజులు వరుసలలో ఉంటే వారందఱినీ స్నేహపూర్వకంగా పల్కరించాడు. రావణుని మీదికి దండెత్తడానికి ఇందఱినీ రావలసిందిగా భరతుడు వీరిని ఒకప్పుడు పిలిచాడు. అందఱికీ తగిన బహుమానాలని ఇప్పించాడు.

సుగ్రీవ విభీషణులకి వెలకట్టలేని హారాలనిచ్చాడు. సుగ్రీవుణ్ణి పిలిచి 'సుగ్రీవా! ఈ నా ఎడమ వైపునున్న అంగదుణ్ణి నీకు కొడుకుగా భావించు. ఈ కుడివైపున ఉన్న ఆంజనేయుణ్ణి నీకు మంత్రీ-సహాయుడూగా గమనించు.' అంటూ హారాలని తానే వారికి అలంకరించాడు.

అగస్త్యుడు చెప్పిన మాటలని స్మరిస్తూ దేవతలవలన జన్మని పొంది ఆంజనేయునికి సహాయపడిన సుగ్రీవుడు-మైందద్వివిదులు- రంభుడు-నీలుడు-తారుడు-అంగదులని మఱొక్కమాఱు మనసులోనే ఆశీర్వదించాడు. ఇక నల-నీల-పనస-కేసరి-గంధమాదన-కుముద-జాంబవంత-దరీముఖ-దధిముఖ-వలీ ముఖ-సన్నాద-వినత-సుషేణ-(సుగ్రీవుని మామ) ధూమ్ర-దధిముఖ-ప్రజంఘ-గవాక్షాది వానరనాయకులని అందఱినీ, తన తమ్ముళ్లతోనూ, తన దేహంతోనూ సమానం అని పలికి మణులు-రత్నాలు ఎన్నింటినో ఇచ్చాడు. 'మీ సహాయం వలన నాకష్టం తీరింది. ఇలాంటి మిమ్మల్ని స్నేహితులుగా పొందిన సుగ్రీవు డెంతటి అదృష్టవంతుడు!' అన్నాడు. (యుష్మాభి రుద్ధృతశ్చాహం వ్యసనాత్ కాననౌకసః - ధన్యో రాజా స సుగ్రీవః భవద్భిఃసుహృదాం వరైః - సుహృదో మే భవంతశ్చ శరీరం భ్రాతర స్తథా.)

చిన్నవారిని కూడా విడువకుండా పేరుపేరునా పల్కరిస్తూ వినయంతో మాట్లాడడం రాముని సౌశీల్యానికి తార్కాణం. మహాపురుషుల ఎంతెంత ఎత్తు ఎదుగుతూ ఉంటారో దీన జనులకి అంతంత క్రిందికి దిగివచ్చి సహాయపడతారు. మహాపర్వతాల్లా కఠినశరీరం కలవారైనా అయినా మనసు విషయంలో చెప్పలేనంత మృదుత్వంతో ఉంటారనడానికి రామచంద్రుడు ప్రత్యక్ష నిదర్శనం.

విభీషణా! లంకలో చక్కగా పరిపాలించు. బుద్ధిమంతులైన రాజులు చాలకాలం రాజ్యాన్ని ఏలగలరు. నన్నూ సుగ్రీవుణ్ణి మఱచిపోకు సుమా!' అంటూ సాగనంపాడు. (బుద్ధిమంతో హి రాజానో ధ్రువ మశ్నంతి మేదినీం-స్మర్త వ్యః పరయా ప్రీత్యా సుగ్రీవసహిత స్త్వయా)

## హనుమంతుని చివరి కోరిక

రాముణ్ణి విడిచి వెళ్లవలసి వస్తోందని అందరి కళ్లూ చెమ్మగిల్లిపోయాయి. ఏ ఒక్కరి అడుగూ ముందుకు పడడంలేదు. ఏ ఒక్కరి కన్నూ రాముని మీది నుండి చూపుని త్రిప్పడం లేదు. ప్రతి జిహ్వ(నాలుక) ఆయన పేరుని పల్కడం మానడం లేదు. నిండుగా ఉన్న కన్నీళ్లమధ్య రాముని రూపం సరిగా కన్పించడమే లేదు. అందరూ తప్పనిసరిగా బయలుదేరుతూంటే అంజనేయుడు మరింతగా దుఃఖపడుతూ సాష్టాంగ పడి, పైకి తలనెత్తి చూస్తూ 'స్వామీ! లోకంలో రామకథ ఉన్నంత కాలం నాశరీరంలో ప్రాణాలు ఉంటాయనేది నిశ్చయం. అయితే ఈ శరీరంలోని రామభక్తి తొలగి పోకుండా అనుగ్రహించు. నామనస్సు ఎల్లప్పుడూ నీ చుట్టూనే తిరిగేలా వరం ఇయ్యి' అంటూ కంఠం దుఃఖంతో జీరపోగా ఇక మాట్లాడలేక పోయాడు.

రాముడు అంజనేయుణ్ణి పైకెత్తి కౌగిలించుకుని 'మారుతీ! లోకాలు ఎంతకాలం ప్రపంచంలో నిలబడి ఉంటాయో అంతకాలమూ రామకథ ఉంటుంది. నీకోరిక స్పష్టంగా అంగీకరిస్తున్నాను. కపిరాజా! నాఒక్కొక్క ప్రాణాన్నీ నువ్వు నాకు చేసిన ఒక్కొక్క ఉపకారానికిగా ఈయవలసివస్తే నేను ఋణపడి తీరతానని నీకు తెలియదా? అయితే లోకంలో ఏవ్యక్తీ ఋణపడ్డానని అనరాదు. భావింపరాదు. ఎందుకంటావా? ఋణం తీర్చుకోవాలనే ఆలోచనతో, సహాయపడి ఋణాన్ని చెల్లగొట్టుకోవాలనే అభిప్రాయంతో, ఎదుటి వ్యక్తికి (తనకు తెలియకుండానే) ఆపద రావాలని కోరుతాడు గాబట్టి. ఆపద వస్తేనే కదా! తాను ఋణాన్ని చెల్లించుకో గలిగేది! కాబట్టి నీ సహాయాన్ని మొత్తాన్ని నాలో భద్రపఱచుకుంటున్నాను. తిరిగి నీకు ఉపకారం చేయవలసిన దశ రాకుండా ఉండాలని కోరుకుంటున్నాను' అంటూ తానే [illegible] వైడూర్యపతకాన్ని ఆంజనేయుని మెడలో అలంకరించాడు.

అందరూ ఒక్కొక్కరుగా ఆ మందిరం నుండి నిష్క్రమించారు వెనుక వెనుకలకి చూస్తూ. పుష్పకం కూడ కుబేరుని నుండివచ్చి, కుబేరుడు కూడా రామసేవనే చేసికోవలసిందని చెప్పాడు' అని

చెప్పింది. పుష్పకాన్ని పూజించి 'అవసరమైనప్పుడు పిలిచినప్పుడు రావలసిందనీ అప్పటివఱకూ ఆకాశంలో తిరుగాడుతూ ఉండవలసిందనీ' చెప్పాడు రాముడు. (నిర్జీవమైన పుష్పకం మాట్లాడడం రాముడు భగవంతుడే! అని స్పష్టంచేయడమే. ఆయన బదులు చెప్పడంలోకూడా ఈ భావమే ఉంది).

ఆంజనేయుని చివరికోరిక చాల అర్థవంతమైనది. ఒక వ్యక్తితో మఱొకవ్యక్తి కలిసి ఉన్నంతకాలం ఉండే స్నేహం-సౌహార్దం-పరస్పర సంబంధం కొద్ది దూరమయ్యాక క్రమక్రమంగా సన్నగిల్లే అవకాశం ఎక్కడైనా తప్పదు. 'పునర్విశ్లేషభీరుత్వం పరమాభక్తి రుచ్యతే' ఎక్కడ ఎడబాటు వస్తుందో, ఆ నడిమిదూరం ఎక్కడ పెద్దదై పోతుందో అని భయపడడాన్ని పరమభక్తి అన్నారు ప్రాచీనులు.

పుట్టిన బిడ్డ తన తల్లితో ప్రారంభంలో క్షణకాలపు ఎడబాటుని కూడా సహింపలేదు. కొంతకాలమయ్యాక కొద్దిసేపు తల్లిని విడిచి ఉండే ధైర్యం బిడ్డకి వస్తుంది. అక్కడ ఆటబొమ్మలు తల్లినుండి బిడ్డణ్ణి విడదీసాయి. మఱికొంత కాలమయ్యాక కొన్ని గంటలు తల్లిని విడిచి ఉండగలడు. తోడి సావాసగాళ్లు తల్లీబిడ్డలమధ్య దూరం పెంపుదలకి ఇక్కడ కారణం. మఱికొంత కాలానికి కొన్ని రోజులు తల్లిని విడిచి ఉండగల స్థితికి వస్తాడు. అధ్యయనానికి దూరప్రాంతం వెళ్లడం అక్కడి హేతువు. ఇక ఆపై కాలంలో భార్య-పరప్రాంతనివాసం అనేవి బాగా దూరాన్ని పెంచేందుకు తోడ్పడుతాయి. క్షణకాలంపాటు తల్లిని చూడనిదే జీవితమే కోల్పోయినట్లు ఏడ్చిన ఆ బిడ్డ, తల్లి జబ్బుగా ఉందని తెలిసినా రాలేనని బదులు వ్రాసే స్థితికి వస్తాడు. ఇక్కడ కారణం, దూరం పెరగడం-భక్తి తగ్గడం.

అలాగని దగ్గఱగా ఉంటే భక్తి ఎక్కువగా ఉంటుందా అంటే? మనకి సామెత ఉండనే ఉంది. 'గుడి దగ్గఱయితే భక్తి దూరం' అని. అత్తవారిల్లు ఉన్న ఊర్లోనే అయితే అల్లునికుండే గౌరవం, లేదా ప్రక్క వాకిలే అయితే అల్లునికుండే గౌరవం, అదే యింట్లో ఉంటే అల్లునికుండే గౌరవం పరిశీలిస్తే తెలుస్తుంది. నిత్యం దేవుని దగ్గఱ ఉండే అర్చకుని కంటె, భక్తునికి దేవునిపై భక్తి వేయిరెట్లుంటుంది. ఇది నిశ్చయం. కాబట్టి భక్తి భక్తివలననే ఉంటుంది తప్ప దగ్గఱదాపుల వలన కాదన్నమాట.

బుద్ధిబలం కలిగినవాడూ, సూక్ష్మదృష్టి ఉన్నవాడూ కాబట్టి ఆంజనేయుడు భవిష్యత్కాలంలో తమయిరువురికీ ఎడబాటు పెరుగుతుందని గ్రహించి భక్తి తఱగడానికి 'దూరం కూడా' ఒక కారణమని భావించి, ఎప్పుడూ రామవిరహం (రామునితో ఎడబాటు) లేకుండా ఉండే ఉపాయాన్ని ఆలోచించి తానే అడిగాడు రాముణ్ణి. 'రామకథ లోకంలో ఉండే వఱకూ నా ప్రాణాలు నా దేహంలో ఉండే వరాన్నిప్పించు. నా బుద్ధి మనసులు రామమయం కావలసిందిగా అనుగ్రహించు' అని. ఇంద్రియాలు (శరీరం, కళ్లు, చెవులు, నాలుక, ముక్కు-మాట, చేతులు, కాళ్లు ... ఇలా జ్ఞాన కర్మేంద్రియాలు) న్నాయి. భగవంతుణ్ణి ఆరాధిస్తూ ఉన్నా-అంటే కళ్లు దేవుణ్ణి చూస్తున్నా-చెవులు నామాన్ని వింటున్నా-నాలుక నామాన్ని పలుకుతున్నా-... బుద్ధి వేఱేచోట ఉన్నా మనసు లగ్నం కాకపోయినా ఆ పూజ మొత్తం ఎంతో ప్రేమానురాగాలతో పిల్లవానికి ఉత్తరాన్ని వ్రాసి, తప్పు చిరునామాని వ్రాసిన ఉత్తరం వంటిదే అవుతుంది. పూజాసామగ్రివ్యయం తప్ప అక్కడ సాధించ గలిగింది లేదు. అందుకని ఆంజనేయుడు - ఇంద్రియాలపై అధికారాన్ని కలిగి ఉన్న బుద్ధి-మనసులని రామమయం చేయవలసినదిగా - ప్రార్థించాడు. మనకిష్టమైన పనిని చేస్తూ బుద్ధినీ మనసునీ లగ్నం చేసినప్పుడు ఇంద్రియాలు కూడా తప్పనిసరిగా ఏకాగ్రం చేసి తీరుతాయి.

లీలాజగన్నాటకాన్ని ఆడించేవాడు పరమాత్మ కాబట్టి ఏక్షణానికి ఏ ఆలోచన కలిగి తనని ఎలా తీర్చిదిద్దుతాడోనన్నే భయంతో ఆంజనేయుడు నిరంతరం రామకథాలాపనాన్ని చేసే బుద్ధిని ఇమ్మని ప్రార్థించాడు. రాముడు కూడా ఈ ప్రార్థనని విని ఆంజనేయుని ప్రార్థన హృదయంలోని లోపలి పొరలనుండి బయటికి వచ్చినదని ఎఱుగున్నవాడు కాబట్టి, లోకాలుండేంత వఱకూ రామకథా-అంతకాలమూ నీ ప్రాణాలూ ఉంటాయని ఆంజనేయుణ్ణి అనుగ్రహించాడు. కాబట్టే యత్రయత్ర రఘునాథ కీర్తనమ్ ... అనేశ్లోకం వచ్చింది.

ఎక్కడ రామకథ జరుగుతూ ఉన్నా కళ్లనిండుగా నీళ్లతో ఆనందిస్తూ అనుభవిస్తూ తలవంచుకొని రామకథని ఆస్వాదిస్తూ చెప్పేవానికి ఎదురుగా ఆంజనేయుడు ఉంటాడని పెద్దలనేది ఇందుకే. అంతటి రాక్షసనాశకుడూ ఈ రామభక్తికి ఇంతగా కఱిగిపోతాడట.

ఇక్కడ మఱోరహస్యమూ ఉంది. రామునితో అగస్త్యమహర్షి రెండు మూడు పర్యాయాలు 'ఆ విష్ణువువి నీవే!' అంటూ స్పష్టంగా చెప్పాడు. రాముడు మాత్రం ఔనన్నట్లు బదులుపల్కలేదు. కాని, ఆంజనేయునితో మాట్లాడుతూ 'లోకాలన్నీ ఉండేవఱకూ నాకథ ఉంటుంది' అంటూ తానే విష్ణువుననే విషయాన్ని చెప్పేసాడు. శ్రీమద్రామాయణాన్ని వ్రాయవలసిందిగా వాల్మీకిని ఆదేశించడానికి బ్రహ్మవచ్చి బాలకాండలో (శ్రీ మద్రామాయణం ఇంకా వాల్మీకి వ్రాయకుండానే) "పర్వతాలూ, నదులూ లోకంలో నిల్చినంత కాలం రామకథ ఉంటుందని" చెప్పిన ఆ మాట, ఈ రామచంద్రుని ఆనాటి విష్ణు రూపంలో చెప్పిన మాటకి అనువాదమే.

ఒకసారి రామ(నామ)బాణం తగిలితే ఇక ఆహృదయం రామమయమే. మారీచుణ్ణి రాముడు బాణంతో కొట్టాడు. (విశేషాలెన్నింటికో చూ. బాలకాండ వ్యాఖ్య) ఆ మఱుక్షణం నుండి రాక్షసుడైన మారీచునిలో శ్రీమన్నారాయణ భక్తి అంకురించి, పల్లవించి పుష్పించి, రాముని చేతిలో మరణించి రావణుని కంటె ముందుగా వైకుంతానికిపోయే విధంగా ఫలించింది. రాముని నోటితోనే ఆంజనేయుణ్ణి గూర్చి రాముడన్న మాటలు ఎప్పుడూ స్మరించుకోదగినవి. అలాగే ఆంజనేయుని మాటలూను.

అవి ఇవిగో! "స్నేహో మే పరమో రాజన్! త్వయి తిష్ఠతి నిత్యదా। భక్తి శ్చ నియతా వీర భావో నాన్యత్ర గచ్ఛతు।। యావద్రామకథా వీర! చరిష్యతి మహీతలే। తావచ్ఛరీరే వత్స్యంతి ప్రాణా మమ న సంశయః।। లోకా హి యావత్ స్థాస్యంతి తావత్ స్థాస్యతి మే కథా। ఏకైక స్యోపకార్యస్య ప్రాణాన్ దాస్యామి తే కపే। శేష స్యేహోపకారాణాం భవామ ఋణినో వయమ్।। మదంగే జీర్ణతాం యాతు యత్త్వయోపకృతం కపే।నరః ప్రత్యుపకారాణా మాపత్స్వాయాతి పాత్రతామ్।।" అనేవి.

## రేపే పంపిస్తాను! నిశ్చింతగా ఉండు!!

పట్టాభిషిక్తుడైన రాముడు సీతతో సుఖంగా ఉద్యానవనా విహరిస్తూ, ప్రజలని ధర్మబద్ధంగా పాలిస్తూ ఉన్నాడు. ఏ ఉపద్రవా ఎక్కడా లేవనే వార్తలని వింటూ వస్తున్నాడు. గర్భం ధరిం సీతమ్మని రాముడు ఏదైనా కోరుకొమ్మనగానే ఆమె రాముణ్ణి అడిగిం 'రామచంద్రా! గంగానదీ తీరంలో ఉన్న ఋష్యాశ్రమాలలో ఒక్క ర అయినా ఉండాలని కోరుకుంటున్నాను' అని. గర్భిణీ అయిన భా

కోరికని లోనున్న పుత్రుని కోరికగానే భావించాలి కాబట్టి రాముడు ఎంతో ఆనందంతో 'సీతా! రేపటిరోజునే పంపిస్తాను. నిశ్చింతగా ఉండు' అని ప్రతిజ్ఞ చేసాడు.

పూర్వమే అనుకున్నట్లుగా ఇది నాటకంలోని ఒక భాగమే. వైకుంఠానికి వెళ్లేందుకు పన్నిన ఉపాయం. సీతమ్మ శ్రీమద్ రామాయణంలో రెండే కోరికలడిగింది. లేడి తనకు కావాలనే మొదటి కోరిక తనకు తాను అడిగింది కాగా, రాముడు కోరమనిన మీదట కోరిన ఈ వరం రెండవది. ఆ మొదటి కోరికకీ రెండవ కోరికకీ కూడా ఫలితం ఆమెకు రామవియోగమే. తనకు తానుగా అడిగిన కోరికద్వారా లంకకిపోయి తిరిగి ఈ లోకంలో కలిసికోగలిగింది. ఈ రెండవదైన రాముడు అడుగమన్న మీదట అడిగిన కోరికద్వారా, ఇక ఈ లోకంలో ఆమె రామునితో కలిసి ఉండే అవకాశమే లేకుండా చేసికొంది. రావణవధ కోసమే అవతారాన్ని ఎత్తిన సీతారాములు ఆ పని అయ్యాక వైకుంఠానికి వెళ్లేందుకే ఈ ఉపాయాన్ని దైవబుద్ధితో ఆలోచించారు. ఇది నిజం అనడానికి సాక్ష్యం ఈ ముహుర్తంలోనే సీతమ్మపై నిందని భద్రుడు చెప్పడం.. (అ ప్యేకరాత్రం కాకుత్స్థ నివసేయం తపోవనే - విస్రబ్ధా భవ వైదేహి! శ్వో గమిష్య స్యసంశయమ్।।)

## భద్రుడు చెప్పిన నిందలు

రాజకార్యాలతో వ్యగ్రుడై ఉన్న రాజుని సంతోషపఱచేందుకూ, హాస్యాలని వెదజల్లి ఆయనను తేలికపఱచేందుకూ ఆస్థానంలో విజయ-మధుమత్త - కాశ్యప - పింగల - కుట - సురాజ - కాలియ - భద్ర - దంతవక్త్ర - సుమాగధులనే పదిమంది ఉండేవారు. అంతా ఒకేచోట కాక రాముడు ఎక్కడెక్కడ సంచరిస్తాడో అలాటి ముఖ్యమైన పద్రప్రదేశాలలోనూ వీరు ఉంటూ ఆనందాన్ని కల్గిస్తూ ఉండేవారు. వీరు కాక గూఢచారులూ ఉండేవారు. ఏ రోజూలాగానే వార్తలని వినిపించమనగానే రాముని ఒత్తిడిపై భద్రుడు ఇలా చెప్పాడు.

## యథా రాజా తథాప్రజాః

రామచంద్రా! రాజమార్గాలలో, అంగడులలో, నాలుగుమార్గాల కూడళ్లలో, తమతమ యిండ్లలోనూ ఇలా అనుకుంటున్నారు. 'ఎవరూ

చేయలేని సముద్రబంధనం, రాక్షసవధా ఎన్నిచేసినా ఏం లాభం? తనతొడమీద కూర్చుండబెట్టుకొని రావణుడు ఎత్తికొనిపోయిన సీతని, లంకలో అంతకాలం భర్త లేక ఒంటరిగా ఉన్న సీతని, రాక్షసులమధ్య ఉన్న సీతని ఏ మాత్రపు అభిమానమూ, క్రోధమూ (అమర్షం) లేక మనసులో కూడ రోత లేకుండా తెచ్చుకుని రాముడు సుఖిస్తున్నాడే! రాజు ఎలాఉంటే ప్రజలూ అలాగే ఉండాలి. ఉంటారు కూడా కదా! మన భార్యలని ఎవరైనా ఎత్తుకుపోయినా మనమూ తెచ్చుకోవచ్చునా? తెచ్చుకోవాలా? తప్పులేదన్నమాట!" అని చెప్పి కన్నీళ్లతో తలవంచుకు నిలబడి పోయాడు.

రామునిముఖం గంభీరమైంది. భద్రుడు వెడలిపోయాక రాముడు ముగ్గురు తమ్ములకీ వార్తనంపాడు. వారు మాటలోనే అన్న వద్దకు వచ్చారు. కన్నీళ్లు నిండిన, గంభీరతతో ఉండిన రామముఖాన్ని దర్శించలేకపోయారు. రాముడిలా చెప్ప ప్రారంభించాడు. 'సోదరులారా! ఇక్ష్వాకు వంశంలో నేను పుట్టాను. ఈ సీత జనకవంశం నుండి వచ్చింది. లంకకి అపహరింప బడి వెడితే కదా రావణవధ జరిగింది! అపకీర్తి భయంతో అగ్నిపునీతవి కమ్మని ఆదేశిస్తే నాకోసం ఆమె అగ్నిలోనికి ప్రవేశించి పరిశుద్ధురాలని నిరూపించుకొని నన్ను చేరింది.

అగ్ని చెప్పిన ఈవాక్యం ఏమైంది? సూర్య-చంద్ర- వాయుదేవులూ ఋషీశ్వరుల సమక్షంలో సీతాపవిత్రతని గూర్చి చెపితే ఆ మాటలు ఏమయ్యాయి? బ్రహ్మ స్వయంగా సీతని నాచేతిలో లంకలో తెచ్చి ఉంచలేదా? అది అసత్యమా? ఇక నా అంతరాత్మకి నిజంతెలియదా? ఇంతచేసినా ఆమెని గూర్చి అలా మాటాడితే ఇక ఏం చేస్తే జనపవాదం నాకు ఉండదు? అంటూ మధ్యమధ్య ఆగుతూ నిట్టూర్పులు విడుస్తూ దుఃఖంతో, సీతావియోగ భయంతో, కష్టాలు ప్రారంభమయ్యాయనే విచారంతో, మళ్లీ ఇలా అన్నాడు. తమ్ములారా! ఇంత జరిగింది. అయినా సీత పతివ్రతే సుమా! అని ప్రచారం చేయడం మనం చేయవలసినపని కాదు. ఎంతకాలం మనమీద అపవాదు ఉంటుందో అంతకాలం క్షత్రియునికి ఉత్తమ లోకాలు ప్రాప్తించవు. నా ప్రాణాలనైనా విడిచి అపవాదు తొలగించుకోదలిచాను. ఇక సీత మాటని చెప్పాలా? లక్ష్మణా! నీవు గాని నా మిగిలిన తమ్ములుగాని నా ఆజ్ఞకి ఎదురు చెప్పవద్దు. ఇది రాజశాసనం.

గంగానదికి అవతలి ఒడ్డున వాల్మీకి మహర్షి ఆశ్రమ ప్రాంతంలో తమసానదీ తీరంలో ఎవ్వరూలేని చోటున ఆమెని విడిచి శీఘ్రంగా తిరిగిరా!' అని తన మందిరంలోనికి వెళ్లి దీర్ఘంగా దుఃఖించి నిట్టూర్పులు విడుస్తూ ఉండి పోయాడు.

## లో విశేషం

శ్రీ మద్రామాయణం అనేపేరు దీనికే రావడానికి కారణం ఈ కథని రామచంద్రమూర్తి విని 'ఇది నిజమే!' అని ఆమోద ముద్రవేసి ఉండడమే! (ఆ విశేషం మీదికథలో రాబోతోంది). మిగిలినవన్నీ ఊహాపోహలతో సిద్ధపఱచిన రామాయణాలు. అందుకే ఈ వాల్మీకి వ్రాసిన దానికే శ్రీ మద్రామాయణం (శ్రీమత్) అనే పేరు వచ్చింది. లోకంలో సీతాపరిత్యాగానికి కారణం ఎవరో ఒక 'చాకలి' అని చెప్పడం ప్రచారంలో ఉంది. ఆ విషయం వాల్మీకికి తెలియదు పాపం. అయోధ్యా ప్రజలే సీతాపరిత్యాగానికి కారణం.

ఇక్కడ కొంత ఆలోచించాల్సినది ఉంది. లౌకికంగానూ-ఆధ్యాత్మికం గానూ కూడా చూద్దాం. లౌకికంగా చూస్తే రాముడు పట్టాభిషిక్తుడయ్యాక వర్షాలు సకాలంలో కురుస్తున్నాయి. ప్రజలు అందఱూ సొంత బంధువుల్లా కలిసి మెలిసి ఉంటున్నారు.....ఇలా చెప్పలేని మార్పు కొంతకాలంలోనే కన్పించింది. అదీకాక అయోధ్యా జనం అంతా ఆయనకోసం 14సంవత్సరాలపాటు ఎదురుచూచారంటే ఆయనమీది అభిప్రాయం ఎంతటిది? దశరథమరణానంతరం భరతుడు రమ్మనగానే రాముణ్ణి రాజుగా పిలవడానికి అయోధ్యనుండి వెళ్లనివాడు లేడు. ఇంతకథకీ కారణమైన కైకమ్మకూడా వెళ్లింది. వచ్చాక అయినా కైకమ్మని ఎవరూ నిందించలేదు. అంతటి ఇష్టం రామునిమీద 14 ఏండ్ల క్రితం ఉంది. వచ్చేవఱకూ ఎదురుచూస్తూ ఉండడంబట్టి ఇప్పటివఱకూ ఉంది. పట్టాభిషేక కాలంలోనూ ఉంది గదా! ఇంతటి గొప్పదనమూ పట్టాభిషేకం అయిన కొంతకాలంలోనే ఎగిరిపోయిందా? అంతటి తప్పని రాముడేం చేసాడుగనుక? పోనీ! ప్రజలు కఱవు కాటకాల్లో మునిగి ఉండడం వలన ఇలాంటి సీతావిషయికమైన అపోహ కల్గిందా? అనుకొనే వీలూలేదు. కారణం వర్షాలు కురుస్తున్నాయి.

స్త్రీలకు సంతాన నష్టం లేనే లేదు...వంటి శుభలక్షణాలే. శత్రురాజుల సంతానమూ ఇక్కడ లేదు. కాగా అపనిందని ఎవరు వేసి ఉంటారు?

'దురాలోచనలు పుట్టేవ్యక్తులు అయోధ్యలో పుట్టనే పుట్టరు' అనేది 'వాల్మీకి మాట. 'జ్ఞాతిదాసీ యతో జాతా కైకేయ్యాస్తు సహోషితా' 'కైకేయికి చెలికత్తెగా ఉంటూన్న మంథర అయోధ్యలో పుట్టినది కాదు సుమా!' అని స్పష్టంగా రుజువు చేసాడు మహర్షి అయోధ్య కాండలో. ఒక్కతె కూడా దురాలోచన కల్గినది అయోధ్యలో పుట్టను కూడా పుట్టదని బ్రహ్మ అనుగ్రహాన్ని పొంది, రామకృపకు పాత్రుడైన వాల్మీకి అంటూంటే, అయోధ్యాజనం అందరికీ ఇలాంటి దురాలోచన రావడమే కాక, బహిరంగంగా అందునా రాజగూఢచారి అయిన భద్రుడు వస్తాడేమో, వింటాడేమోననే భయం కూడా ఏమాత్రమూ లేక అన్నిచోట్లా ఇలా సీతని గూర్చి అనుకుంటున్నారా! ఆ నిందని రామునికి కట్టబెట్టారా! అసలు ఇది అయోధ్య కాదా మరి!

దీనికంతకీ కారణం ఒకటే. పూర్వం అనుకున్నదే. 'బుద్ధిం తు సారథిం విద్ధి' పరమాత్మయే సారథి. జగత్తు కథని నడిపించడానికీ, వ్యక్తి జీవిత కథని నడిపించడానికీను. సీతారాములు వైకుంఠానికి వెళ్లవలసి ఉంది కాబట్టి చూచాయగా మహర్షుల సమక్షంలో సాక్షాత్తు ఈ రాముడు ఆవిష్ణువే అని అగస్త్యుడు నిరూపించాడు. ఇక మీదట వారు వైకుంఠానికి వెళ్లవలసి ఉందనే అభిప్రాయాన్ని సంఘటన రూపంగా నిరూపించదలచుకున్నాడు శ్రీమహావిష్ణువు. ఆ వైకుంఠప్రయాణం కార్య రూపాన్ని దాల్చడానికి ఏర్పాటుచేసికొన్న పూర్వరంగమే ఈనిందలు.

దీన్ని మఱో తీరున రాముని మాటపై కూడా నిరూపించవచ్చు. రాముడు అరణ్యాలకి అయోధ్యాకాండలో వెళ్లడంటే కారణం, దానికి కైకమ్మ వరాలేనని ఎవరికి తెలియదు? ఆమెని సిద్ధార్థుని దగ్గఱనుండి సుమంత్రుని వఱకూ అంతా బహిరంగంగా ఆడిపోసారు కదా ఆనాడు. అదే విషయాన్ని ఒకనాటి తెలవారుజామున గోదావరికి హేమంతఋతువులో చలికొఱకి వేస్తూన్నవేళ రామునికి ముందు నడుస్తూ లక్ష్మణస్వామి। 'ఖ్యాతో లోకప్రవాదోఽయం భరతే నాన్యథాకృతః - అన్నయ్యా! భరతునికి తల్లి బుద్ధులు రాలేదు సుమా!' అన్నాడు. వెంటనే రాముడు కైకమ్మని నిందించవద్దని పలికాడు.

సాక్షాత్తు భరతుడే తన తల్లిని నిందించి పలికినప్పుడు కూడా 'నాత్మనః కామకారోఽస్తి పురుషోఽయ మనీశ్వరః' ఎవ్వరూ తాము అనుకున్నట్లుగా చేసికోగలవారు లేరు. అంతా భగవదాజ్ఞానుసారం జరుగుతూ ఉంటుంది. దైవనిర్ణయం ప్రకారం 'దశరథ మరణమూ, నేను అరణ్యాలకి పోవడమూ' అనే రెండూ కైకమ్మ ద్వారా జరగాల్సి ఉందని భగవంతుని నిర్ణయమై ఉండిఉంటుంది. లేనిపక్షంలో 'కౌసల్యాతో తిరిక్తంను సోఽను ' శుశ్రూషతే హి మామ్' కౌసల్యామాత ఒడికంటె ఎక్కువగా కైకమ్మ ఒడిలోనే పెరిగి ఆమెకే నాతల్లికంటె ఎక్కువ సేవని చేసిన (ఈమాట కైకమ్మే అంది) నామీద, ఆమెకు ఏకారణం వలన ద్వేషం ఉంటుంది?

ఒక శత్రువుని ఒక ఆయుధంతో మోదినప్పుడు శక్తి మోదినవ్యక్తిదే గాని ఆయుధానిది కాదు. కాకపోతే ఆయుధం నిమిత్తమాత్రం. అలాగే కైకమ్మద్వారా భగవంతుడు తన ఆలోచనని అమలు చేసాడు' అని అన్నాడు. భరద్వాజ మహర్షికూడ 'రామప్రవ్రాజనం హ్యేతత్ సుఖోదర్కం భవిష్యతి' - రాముణ్ణి పంపించి వేయడమనేది మంచికోసమే జరిగింది. ఇది శుభాన్నే కలుగజేస్తుంది - అన్నాడు. ఇంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే అయోధ్య నుండి రాముణ్ణి కైకమ్మ పంపితే, మళ్లీ అయోధ్యనుండి సీతమ్మను అయోధ్యా జనులు పంపించ బోతున్నారు కాబట్టి. రెంటికీ పోలికలని చూస్తే దైవమే కారణమని చెప్పకనే తెలుస్తుంది.

| **అయోధ్యాకాండ కథ** | **ఉత్తరకాండ కథ** |
| --- | --- |
| 1.దశరథుడిచ్చిన వరాల ప్రకారం కైకమ్మ అరణ్యాలకి పంపింది. | 1.సీత అడిగిన వరం ప్రకారం రాముడు వాల్మీకి ఆశ్రమ ప్రాంతానికి పంపాడు. |
| 2.దశరథుడిచ్చిన వరాలు రెండు. | 2.రాముడిచ్చిన వరం ఒకటే. |
| 3.అరణ్యాలకివెళ్లవలసి వచ్చింది రామునికి. | 3.ఆశ్రమాలకివెళ్లవలసి వచ్చింది సీతకి. |

| | |
|---|---|
| 4.అరణ్యాలకి పంపించడానికి ప్రధాన కారణమైన వ్యక్తి రామునికి ఇష్టురాలు కైకమ్మ. | 4.సీతకి వెళ్లడానికి కారణమైన వారు రామునికి ఇష్టులయిన అయోధ్యా ప్రజలు. |
| 5.దింపినవాడు సుమంత్రుడు. | 5.దింపినవాడు సుమంత్రుడు. |
| 6.వెంటవెళ్లినవారు సీతాలక్షణులు. | 6.వెంటవెళ్లినవాడు లక్ష్మణుడు. |
| 7.ఎక్కడికి ఎందుకు వెడుతున్నదీ ముందే తెలుసు. | 7.ఎక్కడికి వెళ్తున్నామో తెలిసినా, ఎందుకో పిమ్మటగాని తెలియలేదు. |
| 8.సీతమ్మ అపహరింపబడింది. | 8.సీత చక్కని కవలలని ప్రసవించింది. |
| 9.తల్లివంటి కైకమ్మ అరణ్యాలకి పంపింది. | 9.పుత్రులవంటి ప్రజలు వనాశ్రమాలకి పంపించారు. |
| 10.సీతమ్మని తిరిగి తెచ్చుకున్నాడు రాముడు. | 10.తిరిగి తెచ్చుకోలేని రాముడు తానూ వైకుంఠానికి వెళ్లిపోయాడు. |
| 11.కైకని నిందించవద్దని రాముడు అన్నాడు. దైవమే కారణమని పలికాడు. | 11.అయోధ్యా జనులని నిందింపవద్దని సీత అంది. దైవమే కారణమని పలికింది. అయోధ్యా జనోనైవాత్ర కారణమ్. |

కాబట్టి వైకుంఠ ప్రయాణమే సీతా పరిత్యాగంలోని ప్రధాన రహస్యం కాగా, దీనిపై తర్జన భర్జనలు చేస్తే దేవరహస్యం బయట పడుతుందనే కారణంతోనే 'ఈవిషయాన్ని పాటించి తీరవలసినదే (న చాస్మిన్ ప్రతివక్తవ్యః) అని నిర్దాక్షిణ్యంగా పల్కాడు రాముడు. దీనికి భృగుమహర్షి శాపం (భార్యావియోగం) కూడా తనకు అంతగా నిలిచింది.

ఇది నిజంకాక అయోధ్యా జనులాడిన అపనిందలే నిజం అయ్యేంటే అగ్ని-వాయు-సూర్య-చంద్ర-బ్రహ్మాదేవతలు కూడా అసత్య మాడినట్లే కదా!

ఇక రాముడు సీతమ్మని అడవులలో విడిచేసాడనీ, ఆమె ఎంతో శోకించిందనీ, భర్తలంతా ఇలాగే భార్యలయెడ కనికరం లేకుండా ఉంటారనీ నేటివారు కొందఱు ఎన్నెన్నో రామునిపై దుమ్మెత్తిపోసారు. వారంతా వాల్మీకి శ్రీమద్రామాయణాన్ని అలా వాసనకూడా చూడని మహాపాపాత్ములే. అనుమానం లేదు. స్పష్టంగా రాముడాజ్ఞాపించిన తీరుని శ్లోకాలలో చూద్దాం. 'ఆరుహ్యా సీతామారోప్య విషయాంతే సముత్సృజ- గంగాయా స్తు పరే పారే వాల్మీకే స్తు మహాత్మనః ఆశ్రమో దివ్యసంకాశః తమసాతీర మాశ్రితః - తత్రైనాం విజనే దేశే విసృజ్య రఘునందన -శీఘ్రం మాగచ్ఛ భద్రం తే కురుష్వ వచనమ్మమ' (46వసర్గ శ్లో. 17 నుండి19) .

ముందు నాటికి వాల్మీకి మహర్షి ఆశ్రమప్రాంతాలలో విడువదలచి ఉన్నాడు కాబట్టే, రాముడూ వాల్మీకీ కూడబలుకుకున్నారనే అభిప్రాయం రాకుండానూ, రక్షించవలసిందని తాను చెప్పడానికి వీలులేకుండానూ రాముడు (శ్రీమహావిష్ణువు) వాల్మీకి మహర్షికి అయోధ్యకు వచ్చే ఆలోచనని కల్గించలేదు. మిగిలిన మహర్షులంతా సీతారామ దివ్యసందర్శనాన్ని చేసికొంటే, వాల్మీకికి సీతాసేవాభాగ్యాన్నీ సీతారామ సంతానాన్ని పెంచే అదృష్టాన్నీ ప్రసాదించాడు శ్రీమహావిష్ణువు. దీనికి కారణం ఆంజనేయునితో సమానంగా నిత్యనిరంతర శ్రీరామ మంత్ర సంస్మరణం చేసిన ధన్యుడు వాల్మీకి మహర్షి కావడమే.

ముందే అనుకున్నట్లుగా (అయోధ్యాకాండలో) ఈయనక్కు రెండు ఆశ్రమాలున్నాయి. ఒకటి చిత్రకూటంలో మఱొకటి తమసా తీరంలోనూ. గంగానదికి ఆవలి ఒడ్డున ఉన్న తమసానదీ ప్రాంతంలోనే ఈయన క్రౌంచ పక్షుల జంటని చూచి అందులో ఒకదాన్ని మహావిష్ణువే బోయవాని రూపంలో వచ్చి కొట్టగా శ్రీమద్రామాయణ రచనానికి పూనుకొన్నాడు. (చూ. బాలకాండ వ్యాఖ్య). ఈ రామాయణ రచనానికి [illegible]సిన తపశ్శక్తిని చిత్రకూటానికి వెళ్లి తపస్సుచేసి సమార్జించాడు. ఆ త[illegible]స్సు చేసే కాలంలో సీతారామలక్ష్మణులు ఆయనను దర్శించారు కూడ.

ఎవరికోసం తపస్సు చేస్తున్నాడో ఆ రామచంద్రుడే వీరిద్దఱికోసమూ సాక్షాత్కరిస్తే ఆ వాల్మీకి 'ఆస్యతా మితి చోవాచ స్వాగతం తు నివేద్య చ' 'స్వాగతాన్ని చెప్పి ఇక్కడే ఉ[illegible]' అన్నాడు.

అందుకే ఆ ప్రాంతంలోనే రాముడు పర్ణశాలని వేసికొన్నాడు (చూ. బాలకాండ వ్యాఖ్య). రామునికథ యథార్థంగా సాగుతూన్న కాలంలో వాల్మీకి తపస్సు చేసికొంటూనే ఉన్నాడు. యుద్ధంలో రావణవధ అయ్యాక ఈ తమసానది ఒడ్డునే క్రౌంచపక్షులలో మగపక్షి నేలకూలగా ఆ దృశ్యంతో కవిత్వం పుట్టగా శ్రీమద్రామాయణాన్ని వ్రాసాడు.

మఱో రహస్యమేమంటే ఆయన శ్రీమద్రామాయణ రచనం అయ్యాక దాన్ని లోకంలో తన భావానికీ, రామచంద్రుని అభిప్రాయానికీ తగినట్టు ప్రచారాన్ని ఎవరు చేయగలరా? అని ఆలోచిస్తూ ఉన్నాడు. ఆ సందర్భంలో శ్రీమహావిష్ణువే ఆ గ్రంథప్రచారానికి తన పుత్రులనే వినియోగించదలచీ, తనకథని అత్యంతమూ ఇష్టపాత్రంగా వినే సీతమ్మకు వినిపించదలచీ సీతమ్మని ఆశ్రమప్రాంతానికి పంపాడు.

గర్భందాల్చిన స్త్రీ ఏదికోరితే అది గర్భంలోని సంతానం కోరినట్లే. దాన్ని తీర్చకపోవడం ఒకవిధమైన అపచారం కూడా. ప్రశాంతమైన వాతావరణం ఆమెకు కల్పిస్తే సంతానం కూడ పరమశాంతులుగా పుట్టే అవకాశం ఉంటుంది. ఒక మంచి పొలాన్ని దున్ని, నీరుపెట్టి, పదునుచేసి చక్కని విత్తనం వేసాక మెల్లగా అంకురం (మొలక) వచ్చిందనుకుందాం. అక్కడినుండీ ఆ మొలక క్షేమంగా ఎదిగే విధంగా, ఏపుగా పెరిగే విధంగా, సత్ఫలాలని అందించే విధంగా మంచిమంచి ఎరువులనే దానికి వేస్తాంగాని దానికి హితం గానివి వేస్తామా?

ఒకవేళ మఱోవిధమైన ఎరువులని వేస్తే వాటివలన మొక్కకి తెగులు పట్టదా? కాపులో భేదం కలుగదా? అలాగే పచ్చిగా ఉన్న స్త్రీ గర్భంలో సంతానం ఉన్నప్పుడు ప్రశాంతమైన విష్ణుకథలనీ, పవిత్రమైన ఇతిహాసాలనీ విన్పిస్తే వాటి ప్రభావం పుట్టబోయే వారిమీద ఉండి తీరుతుంది. హింసాత్మక దృశ్యాలని **(Today Movies)** చూపిస్తే వాటి ప్రభావం ఉండి తీరుతుంది. అభిమన్యుడు గర్భంలో ఉండగా శ్రీకృష్ణుడు పద్మవ్యూహ విశేషాన్ని చెపితే అంతటినీ ఎంతో శ్రద్ధతో గర్భస్థపిండం విని ఉండలేదా? అలాగే రాక్షసుడైన హిరణ్యకశిపుని భార్య లీలావతిగర్భంలో ప్రహ్లాదుడు ఉన్నప్పుడు నారదుడు నారాయణమంత్రాన్ని లీలావతికి చెప్తే, అది ప్రహ్లాదునిపై శాశ్వతకాలం

**పనిచేయలేదా? భారతీయుల చదువు పుట్టిన పిమ్మట నేర్చేది-నేర్పేదీ కాదు. గర్భంలో ఉండగానే నేర్చేదీ-నేర్పేదీను.**

లోకదృష్టిలో సీతమ్మ రామచంద్రునిచేత విడువబడినట్లే. అదికూడా ప్రజల మాటలని బట్టి కదా! ఏ కోణంలోనూ సీతమ్మకి రామచంద్రునిపై లౌకికమైన ద్వేషం కలగకుండా ఉండాలంటే, ఆమెకు అనుక్షణం రామచంద్రుని గొప్పదనాన్ని చెప్పాలి. నిజంగా రామచంద్రునిలో గొప్పదనం లేనప్పుడు సీతమ్మముందు అలా పనిగట్టుకొని లేనిపోనివి చెప్తే అది దోషం ఔతుందిగాని, రామచంద్రుడు పరమపూజ్యుడూ-యోగ్యుడూ ఐనప్పుడు అతని విశేషాలని చెప్తే తప్పెలా ఔతుంది? సహసా విదధీత న క్రియామ్-అవివేకః పరమాపదాం పదమ్మని భారవి మహాకవి మాట. తొందరగా ఒక నిర్ణయానికి వచ్చి ఏపనిని చేసినా ఆ తొందరపాటుపని అనేక ఆపదలని తెచ్చిపెడుతుందిట.

'సహజ కాతరా హి స్త్రియః'. స్త్రీ పురుషులు సమానమనే మాట వినడానికి ఎంతో చక్కగా ఉన్నా మానసికమైన బలం-ధైర్యం తక్కువగా ఉండే వాళ్లు స్త్రీలు కాబట్టి వారిని 'అ-బల'లు అన్నారు. స్త్రీలకి తమసంతానంపై ఉన్న ఇష్టం మఱి లోకంలో ఎవరిమీదా ఉండదు. అందుచేత స్త్రీలు (అ-బలలు) సంతానం విషయంలో మఱింత అ-బలలన్నమాట. తన భర్తే తనని విడిచిపెట్టాడుగదా! ఇక తన జీవితం సంతానంతో కూడ ఎలా గడుపవలసి వస్తుందో అనే భయంతో రామచంద్రుడు ఆమెకు సరియైన ఊహని ఈయగల, ఆలోచనని చెప్పగల వాల్మీకి ఆశ్రమప్రాంతానికి పంపాడు. వాల్మీకి కూడ ఆమెకు ఆమెభర్త విశేషాలనే శ్రీమద్రామాయణం పేరిట విన్పిస్తూ సీతమ్మకీ, పరోక్షంగా లోపలనున్న సంతానానికీ కూడా రామచంద్రునియెడ భక్తిప్రపత్తులనే కల్గించబోతున్నాడు.

సీతమ్మని ఇంతకు ముందు వర్షాన్ని కోరుకొమ్మని అనకుండా ఆమె గర్భాన్ని దాల్చిన పిమ్మటనే వరాన్ని కోరుకోవలసినదిగా రాముడు కోరడానికి కారణం ఆ సంతానం కోసమైనా సీతమ్మ స్త్రీసహజమైన దౌర్బల్యానికీ తొందరపాటుకు లోనై ఏవిధమైన అఘాయిత్యానికీ పాల్పడకుండా ఉండేందుకు. 'ఆమె

లక్ష్మీస్వరూపిణిగదా! ఆమె కూడా మానవసహజమైన అఘాయిత్యాలకు పాల్పడుతుందని మహావిష్ణువంతటివాడు భావించాడా?' అనే ఆలోచనకూడ మనకి కల్గవచ్చు. సీతారాములు మానవజాతిలో జన్మించారు. మనుష్యసహజమైన ఆలోచనలతోనే నటించాలి ఇక్కడ. ఒక వ్యక్తి గొప్ప సంపన్నుడే అయినా ఒక నాటకంలో బీదవాని వేషాన్ని వేస్తుంటే అలా నటించడమే సరిఔతుందిగదా! సీతారాముల పరిస్థితికూడా ఇంతే! ఆ కారణంగానే సీతమ్మ అశోక వనంలో తన జడని శింశుపావృక్షపు కొమ్మకి ఉరివేసికోదలిచింది. రాముడు కూడా సీతా వియోగాన్ని భరించలేక పంపానదిలో ఆత్మహత్యకు పాల్పడుతానని లక్ష్మణునితో అన్నాడు. అయితే ఇద్దఱూ అలాంటి అకృత్యానికి పాల్పడకుండా సీతమ్మ విషయంలో ఆంజనేయుడూ, రాముని విషయంలో లక్ష్మణస్వామీ తోడ్పడ్డారు. ఇక్కడ కూడా సీతకు అలాంటి ఆలోచన రాముని పరోక్షప్రదేశంలో రాకుండా ఉండేందుకూ, ఇక్ష్వాకు కులం వంశోద్ధారకులతో అవిచ్ఛిన్నంగా కొనసాగేందుకూ రాముడు సీతమ్మని వాల్మీకి ఆశ్రమ ప్రాంతంలో విడిచిరావలసిందిగా లక్ష్మణుణ్ణి ఆజ్ఞాపించాడు.

దండకారణ్యానికి సీతారామలక్ష్మణులు వెళ్లేప్పుడూ, ఇప్పుడూ కూడా రథాన్ని నడిపేవాడు సుమంత్రుడే కావడంలోనూ ఔచిత్యం ఉంది. నిజానికి సుమంత్రుడు గుర్రాలని తోలేవాడు కాడు. సుమంత్రశ్చాష్టమోఽభవత్ - సుమంత్రుడు మంత్రులలో ఒకడు. పైగా రాజుగారి ప్రధానమందిరానికీ, అంతఃపురానికీ కూడా వెళ్లడానికి అనుమతిని వేరే పొందనవసరం లేనివాడు. ఎప్పుడూ ప్రధానమందిరంలో ఉండేవాడు కాబట్టి, రాముని ముగ్గుఱు తమ్ములనీ ఇప్పుడు పిలిచినా, అలనాడు అయోధ్యలో దశరథుని ఆజ్ఞకి అనుగుణంగా రామచంద్రుణ్ణి రెండుమాఱులు పిలిచినా అంతా సుమంత్రుడే చేసాడు.

అతనిపేరు సు-మంత్రుడు కూడా. చక్కని రహస్యాలని చెప్పగల వాడన్నమాట. అందుకనే దశరథునికి పిల్లలు లేక ఎంతో దిగులుపడుతున్న వేళ దేవలోకంలోని వారిమాటలని నేరుగా దశరథునికి చెప్పి అశ్వమేధ-పుత్రకామేష్టి యాగాలని చేయవలసిందిగా ప్రోత్సహించింది సుమంత్రుడే. అంటే జరుగబోయేది స్పష్టంగా

తెలిసినవాడన్నమాట. ఇక్కడ కూడా ఆ సుమంత్రుడే వెళ్తూండడానికి కారణం జాగ్రత్తయైన ప్రదేశంలో ఆమెను విడిచి రాబోయే కథకి ఏవిధమైన కష్టమూ కలుగకుండా కథ సుఖంగా ప్రశాంతంగా నడిచేవిధంగా చేయదలచినవాడు కావడమే. (సీతా పరిత్యాగం కూడా తనకి తెలుసునని ముందు చెప్పబోతున్నాడు కూడ. సుమంత్రునికి తెలుసు కాబట్టే రాముడు సుమంత్రుణ్ణి పంపాడు).

ఇక్కడ మఱొక సందేహం కూడ తలెత్తుతుంది. రాముని పెమ్మటివాడు భరతుడు కదా! సీతాపరిత్యాగం చేయవలసిందనే ఆజ్ఞని భరతునకు చెప్పక లక్ష్మణునికే ఎందుకు చెప్పాలి? అని. దీనివలన భరతుడు నొచ్చుకోడా? అనీను. ముందుగా 'నొచ్చుకోవాలి' అనే ఆలోచన భరతునకు లేకపోయినా 'నొచ్చుకోవాలి సుమా!' అనే దురాలోచనని కల్గించే నేటివారి ప్రశ్నయిది. 'నియుజ్యమానోఽపిచ యౌవరాజ్యే తతోఽభ్యషించత్ భరతం మహాత్మా' రాముడు పట్టాభిషేకాన్ని చేసికొంటూ యువరాజు పట్టం ఎవరికి కట్టాలని ఆలోచించి లక్ష్మణుణ్ణి పిలిచాడు. 'సర్వాత్మనా పర్యనునీయమానో యథా న సౌమిత్రి రుపైతి యోగమ్' ఎంత బ్రతిమలాడి ఒప్పింపబోయినా లక్ష్మణుడు అంగీకరింపకపోతే యౌవరాజ్య పట్టాభిషేకాన్ని భరతునికి చేసాడు రాముడు. కాబట్టి అజ్ఞని భరతునకు ఈయకూడదు. అందుకనే లక్ష్మణునికి ఆజ్ఞచేసాడు.

మఱో విశేషమూ ఉంది. నచ్చని ఏ విషయాన్నైనా వ్యతిరేకించి పైకి అనేస్తాడు లక్ష్మణుడు. 'అదితప్పు' అని రాముడనగానే చప్పచల్లారే కోపం లక్ష్మణస్వామిది. ఏం తప్పుచేసావని అయోధ్య విడవాలి? నాన్నని చంపేస్తాను'... అంటూ ఇలా ఉన్నదంతా అనేసిన లక్ష్మణస్వామి రాముడు మాట్లాడగానే మౌనంగా అనుసరించి వెళ్లిపోయాడు. భరతునిలో లక్ష్మణునిలా వాగ్ధోరణి కంటె క్రియాత్మక వ్యవహారం హెచ్చు. అయోధ్యలో ఉన్న అందఱినీ పోగుచేసికొని భయంకర సంఖ్యాసైన్యంతో చివరికి కైకమ్మతో సహా చిత్రకూటం దాకా వెళ్లి ప్రార్థించి, రాముడు రానన్నగానే ప్రాయోపవేశ దీక్షని ప్రారంభించాడు కూడ.

ఇలాంటి వాణ్ణి సీతాపరిత్యాగానికి పంపిస్తే కొంత ఆలోచించవలసిన పరిస్థితి ఎదురు కావచ్చు. లక్ష్మణుడైతే ఏది అతనికి చేయవీలుపడదో దానిని పైకి అనేస్తాడు. సమస్య పరిష్కారమై పోతుంది. అందుకే లక్ష్మణుణ్ణి నియోగించాడు ఈపనికి. ఇవన్నీ ఒక ఎత్తు. సీతమ్మతో భరతునికంటె కొంత ఎక్కువ సాన్నిహిత్యం పరిచయం ఉన్నవాడు లక్ష్మణుడు కాబట్టి తమసాతీర ప్రాంతంలో ఆమెని విడిచినప్పుడు ఆమె పరిస్థితిని ఆమె మనోభావంతో సహా అంచనావేసి లక్ష్మణుడైతే సరైన పరిస్థితిని వివరించగలడు కూడా.

'యథా హి కురుతే రాజా ప్రజా తమనువర్తతే' 'రాజు ఎలాచేస్తే ప్రజలంతా అతణ్ణి అనుసరిస్తారు గదా! మనంకూడా భార్యలని పోగొట్టుకొన్నట్లైతే కొంతకాలమయ్యాక తెచ్చి ఏలుకోవచ్చు నన్నమాట' అని ఆ జనులనుకొన్నట్లుగా భద్రుడు చెప్పాడు. లోకరీతి ఇలాగే ఉంటుంది. రాజులాగా ప్రజలూ ఉండాలి - ఉంటారుగదా!', అన్న అయోధ్యా ప్రజలు రామునిలానే ఉండదలిస్తే అపనింద కారణంగా భార్యని రాముడు విడువదలిచాడు. వీరంతా కూడా నిందవచ్చిన పక్షంలో విడువసిద్ధంగా ఉన్నారా? అంతదాకా ఎందుకు? తనకి స్పష్టమైన అపకారం చేసిన కైకమ్మని రాముడేమీ అనలేదు సరికదా! అనబోయిన భరతలక్ష్మణులని మందలించాడు కూడ. 'యథా రాజా తథా ప్రజాః' అనేది అయోధ్యా ప్రజల మాటే అయితే రాముడు కైకమ్మంతటి అపకారిణినే నిందించని వాడైతే ఈ ప్రజలు కూడా రాముణ్ణి నిందించేవారు కారాదు గదా! 'యథా రాజా తథా ప్రజాః' వంటి నీతులు చెడ్డపనుల వఱకే పరిమిత మౌతూంటాయి - అని సారాంశం.

## తల్లీ ! అదిగో వాల్మీకి ఆశ్రమం! వెళ్లివస్తాను.

ఆశ్రమాలకి పోయి ఋషిభార్యలని దర్శించాలని భావించిన సీత, వారికి సమర్పించదలచిన ఆభరణాలనీ వస్త్రాలనీ సిద్ధంచేసికొని సుమంత్రుని రథంపై బయలుదేరింది, 'లక్ష్మణా! ఎందుకో అపశకునాలెన్నెన్నో ఆకాశంలో, భూమిపైనా కన్పిస్తున్నాయి. ఇది నిజమే అనుకొనేందుకు వీలుగా నా కుడి కన్ను అదరుతోంది. దేహం

వణుకుతోంది. మనసు కీడుని ఆలోచిస్తోంది. ఏ అశుభమూ ఎక్కడా లేదు కదా!' అంటూ ఆమె కారణం తెలియకపోయినా దీనంగా అంది. రథం గంగఒడ్డు చేరగానే లక్ష్మణునికి దుఃఖం ఆగలేదు. అయితే రహస్యం బయటికి రానూలేదు. రామవియోగం ఈరాత్రికి మాత్రమేననీ, మఱునాడే బయలుదేరి అయోధ్యకు వేగంగా వెళదామనీ ఆమె అంటూంటే లక్ష్మణునికి దుఃఖం పైకివినబడేంత ధ్వనితో వచ్చింది. గంగానది దాటగానే లక్ష్మణుడు తలవంచాడు. కన్నీరు కారుస్తూనే ఇలా చెప్పాడు.

'శ్రుత్వా పరిషదో మధ్యే హ్యపవాదం సుదారుణం-పురే జనపదేచైవ త్వత్కృతే జనకాత్మజే-న తాని వచనీయాని మయాదేవి తవాగ్రతః- పౌరాపవాదభీతేన గ్రాహ్యం దేవి న తేఽన్యథా ఆశ్రమాంతేషు చ మయా త్యక్తవ్యా త్వం భవిష్యసి - రాజా దశరథ స్యేష్టః పితు ర్మే మునిపుంగవః సఖా పరమకో విప్రో వాల్మీకి స్సుమహాయశాః- పాదచ్ఛాయా ముపాగమ్య సుఖమస్య మహాత్మనః - ఉపవాసపరైకాగ్రా వస త్వం జనకాత్మజే- పతివ్రతాత్వ మాస్థాయ రామం కృత్వా సదా హృది- శ్రేయ స్తే పరమం దేవి! తథా కృత్వా భవిష్యతి ( 47/11-18)

తల్లీ ! నీ గుఱించిన అపవాదాన్ని కొలువులోనూ, ఊళ్లో పల్లెల్లోనూ రామభద్రుడు విన్నాడు. అవన్నీ అసత్యాలే అని స్పష్టంగా తెలిసిన నేను కూడా చెప్పకూడనివి ఆ అపనిందలు. కాని జనుల అపవాదం వలన భయంతో ఈ ప్రాంతంలోనే విడువ వలసిందని ఆదేశించాడు రాముడు. మాతండ్రి దశరథునికి స్నేహితుడూ, మహా విప్రుడూ, కీర్తిమంతుడూ అయిన వాల్మీకి ఆశ్రమం అదిగో అదే! ఆయన నీడలో క్షేమంగా ఉండు. పాతివ్రత్యంతో జీవిస్తూ, రాముణ్ణే ధ్యానిస్తూ, ఉత్తమ పదవిని (స్వర్గసౌఖ్యం) పొందు తల్లీ! అని బోరుమని దుఃఖించాడు.

## లక్ష్మణా! గర్భవతినని గమనించి చెప్పు సుమా!

'లక్ష్మణా! దుఃఖాన్ని అనుభవిస్తూ ఉండవలసిందని నాకు ఈ దేహాన్ని బ్రహ్మ ఇచ్చి ఉంటాడు. ఇది రామునితప్పూ నీ తప్పూ కానే కాదు. పూర్వజన్మంలో ఏ భార్యభర్తలను విడదీసానో! ఆ పాపం

కారణంగా ఈ నట్టడవి నాకు ఈరోజున ప్రాప్తమైంది. ఇంతకు పూర్వమూ ఉన్నాను గదా! ఋషుల ఆశ్రమాలలో ఉండడం నాకు క్రొత్తేమీ కాదు. అయితే భర్తలేకుండా ఉండడం! అదీ లంకలో అయింది గదా! సౌమిత్రీ! కష్టాలు నాకు తోడునీడగా ఉన్నంతకాలం నాలోని ధైర్యానికి భయంలేదు. కాని ఒక్కటేనయ్యా నన్ను మఱింత బాధపెడుతోంది! అంటూ చెప్పలేక చెప్పలేక సీతమ్మ 'లక్ష్మణా! నిష్కారణంగా ఎవరినీ శిక్షించనివాడు రాముడుగదా! ఈ సీతమ్మని ఇలా శిక్షించాడంటే ఈమె ఏదోషం చేసి ఉంటుంది?' అని ఎవరు ఆలోచించినా, ఋషీశ్వరులే కారణం నన్నడిగినా ఏం చెప్పాలో తోచకుండా ఉన్నాను - అంటూ నేలమీద నిస్సహాయంగా కూచుండిపోయింది.

కన్నీళ్లు ముఖంలో నిండి, కంఠం నుండి మాటలు పెగలకుండాఉన్న సీతమ్మముఖాన్ని చూడలేక, మాటలు వినలేక మంత్రంతో కట్టుబడ్డ పాములా లక్ష్మణుడు మౌనంగా నిట్టూర్పులూ కన్నీళ్లూ కలబోసి విడుస్తూ అలాగే నిలబడిపోతే ఆమె మెలమెల్లగా తెచ్చుకున్న ధైర్యంతో ఒక్కమాఱు తనచుట్టూ ఉన్న భయంకర అటవిని చూస్తూ ఇలాఅంది. 'రామానుజా! ప్రజాపవాద భయంతో శరీరాన్ని విడిచానే అనుకో! నింద నిజమనుకుంటారు. జీవించే ఉన్నాననుకో! అనుక్షణ దుఃఖాన్ని తట్టుకోలేకుండా ఉన్నాను. ఇక తప్పదని మరణించానే అనుకో! భార్యని అడవులకి పంపి సీతని నిర్దయగా చంపాడని రామునిమీద నిందవేస్తారు ప్రజలు. నామీద నిందని తొలగించుకోబోయి రామునిక్కూడా నిందని వేయించినదాన్ని అవుతాను. ఇక నావల్ల రఘువంశానికి అపకీర్తి కల్గుతుంది. ఇంత అయినా ప్రజానింద పోదు - అపకీర్తి పెరుగుతుంది తప్ప.

సౌమిత్రీ! రాజాజ్ఞ కఠినమే అయినా ఆజ్ఞని పాలిస్తున్న నిన్ను అభినందిస్తున్నాను. మా అత్తలకు నమస్కారాలని తెలియచెయ్యి. రామునికి పాదాభివందనాన్ని చేస్తూ క్షేమాన్ని అడిగానని మనవిచెయ్యి. సోదరులని జాగ్రత్తగా చూచుకోమను. లక్ష్మణా! చివరిగా చెప్తున్నాను. నేను గర్భాన్ని ధరించాను. నువ్వు గమనించి మీ అన్నతో చెప్పుసుమా! అని అలా నేలమీద పడిపోయింది సీతమ్మ.

**లో విశేషం**

పూర్వపు ఇతిహాస పురాణాలు ఏవీ సమస్యకి పరిష్కారం 'ఆత్మహత్య' అని చెప్పనే చెప్పవు. 'జీవన్ భద్రాణి పశ్యతి' బ్రతికుండి సుఖాలనీ శుభాలనీ పొందవలసిందని ఉపదేశిస్తాయి. క్రొత్తకాలపు రచనలూ, పిచ్చి సినిమాలూ మాత్రం చిన్నచిన్న సమస్యలకి కూడా పరిష్కారం 'మరణం' అనే ధోరణిలో కథని చిత్రీకరించుతాయి. ఆకథలని వ్రాసినవారూ, చిత్రాలని సినిమాలుగా తీసినవారూ మాత్రం ఎంతటి కష్టం వచ్చినా ఆత్మహత్య కాదు సరికదా! ఒక్కపూట ఉపవాసంకూడా చేయకుండా బ్రతుకుతూ అలా వ్రాస్తూన్నా - చిత్రీకరిస్తూన్నా కూడా ఆరచనలనీ, సినిమాలనీ ఆదర్శంగా తీసికొని అలా ఆచరించే పాఠక ప్రేక్షకులు ఎంత అవివేకులో అర్థం చేసికోగలగాలి.

అలా ఆత్మహత్యని చేసికొన్నవారియెడ సానుభూతిని చూపడం కూడా అనవసరమే. అది ఒక తొందరపాటు చర్య కూడా దురదృష్టవశాత్తూ అలాటి చావులకి కారణమైన వారిపై చర్యతీసికొనే అవకాశం మనకి లేదు. అందుకే ఒక సామెత ఉంది. 'నీకు ఎవరంటే ఇష్టం లేదో వానికి ఇంత విషాన్ని బలవంతానానైనాఇవ్వు. కాని చెఱువులో విషాన్ని కలపకు' అని.

**ఆత్మహత్య చేసికోవడమే** సమస్యకి పరిష్కారమని వ్రాసే **రచయిత(త్రి) (నవల/లేదా సినిమా) తన ఇంట తన పిల్లలకి అలా బోధించుకోవచ్చు.** కాని **ఎందఱో** ఎన్నివిధాల మనస్తత్వాలో **(పిఱికితనం - భయం - ఆవేశం -** గుండెవ్యాధులు మానసికరోగులు) **కలవారంతా చదివే వాటిలో, ఇలాంటి** విధంగా వ్రాయడం **తప్పే. అలాటి వాటికి** విస్తృతప్రచారం కల్గించడం **మఱింత** తప్పు. **వీటివలననే** ఇలా జరుగుతున్నాయని న్యాయస్థానాలలో సాక్ష్యాలు **చెప్పిన** సందర్భాలున్నా కూడా విరివిగా ప్రచురణ - ప్రచారం సాగనీయడం **మఱింత** తప్పు. అలాటి వాటిని ఆదరించడమంటే విషాన్ని కొద్దికొద్దిగా చొప్పున 'పాయసం' అనుకొంటూ త్రాగడమే.

తన భర్తల ఎదుటే వస్త్రాపహరణం జరిగిన దారుణమైన ద్రౌపది కష్టమూ, వనాలలో ఒంటరిగా ఒక కారణం వలన నలుడు

విడువవలసి విడిచిపోగా దిక్కుతోచనంతటి దారుణమైన దమయంతి కష్టమూ, ఎందఱో దేవతలూ ఋషులూ చెప్పినా కూడా ప్రజాపవాద కారణంగా భర్తని వీడిన దారుణమైన ఈ సీతాకష్టమూ కంటె మించిన కష్టాలు లోకంలో ఆత్మహత్యలని చేసికొనే ఎవరికో వచ్చి ఉంటాయంటే నమ్మశక్యమా! అంతటి కష్టం వచ్చినా బ్రదికి సాధించవలసిందని పురాణాలు చెప్తాయి. ఇలాంటి సమస్యలకి ముగింపు పరిష్కారమిదేసుమా! అని 'చచ్చి' తెలియచేస్తాయి నేటి రచనలలోని పాత్రలు. 'మంగలాదీని మంగలమధ్యాని మంగలాంతాని చ' పూర్వపు ఇతిహాసపురాణాలకి ఒక నిర్బంధ నిబంధన ఉంది! 'ప్రారంభంలో - మధ్యలో - ముగింపులో మంగలకర సంఘటన ఉండాలి' అని. కాబట్టి సుఖంగా ఉన్న జీవితాన్ని పిచ్చిరచనలని చదివి పాడుచేసికోవద్దనీ, ఇతిహాసపురాణాలని చదివి సంతోషపఱచుకోవాలనీ దీని భావం.

సీతమ్మ నిజంగా మరణించదలచి ఇంత ఆలోచన చేయడం లేదు. తాను మానవస్త్రీగా నటిస్తోంది కాబట్టి మానవసహజమైన ఆలోచనలని చేసి పరిష్కారాన్ని ఆమె సూచిస్తూ, మనకి ముగింపుని ఉపదేశిస్తోందన్నమాట.

ఆమె బాధపడుతున్నది ఒకందుకే. 'కిన్ను వక్ష్యామి మునిషు కర్మ వాఽసత్కృతం చ కిమ్? కస్మింశ్చిత్ కారణే త్యక్తా రాఘవేణ మహాత్మనా? 'రాముడు ధర్మాత్ముడు కాబట్టి ఈమెని విడిచినందువలన ఈమెది ఏదోషం అయ్యుంటుందని అందఱూ ఆలోచిస్తారనీ - మునులకి ఏ కారణాన్ని చెప్పాలి?' అనిన్నీ! ఆ కారణం మఱేదో కాదు - 'వైకుంఠానికి సీతమ్మని పంపించడానికి సుమా!' అనే దైవరహస్యమే. దాన్ని ఆమె చెప్పలేదుగదా! అందుకని బాధపడుతోంది.

గర్భవతిని తనని అడవిలో విడిచి లక్ష్మణుడు వెడుతూన్నా, ఆజ్ఞచేసిన రాముణ్ణి స్త్రీ సహజమైన దుఃఖంతో, భయంతో, కంగారుతోనైనా తిట్టాలిగదా! (ఆ పనేదో శ్రీమద్రామాయణం సరిగా అర్థంకాని వాళ్లు ఎలాగూ తిడతారని విడిచి ఉండవచ్చు.) ఎందుకు తిట్టలేదు? - అసలెందుకు తిట్టాలి? వైకుంఠంనుండి రావడం తన ఇష్టం మీదే చేసింది. వెళ్లాల్సినపనికూడా తన ఇష్టం మీదనే చేస్తోంది. పైగా రాముడు నట్టడవిలో విడిచెయ్యమని చెప్పనేలేదు.

స్పష్టంగా 'గంగకి ఆవలి ఒడ్డున తమసానది ఒడ్డున వాల్మీకి ఆశ్రమ ప్రాంతంలో' ...అని ఇంత వివరంగా తనని గూర్చి శ్రద్ధతీసికొని లక్ష్మణుణ్ణి పంపించి విడిస్తే దుఃఖాన్ని పొందవలసిన అవసరం ఏమిటి? మానసికమైన అపరాధాన్ని చేసిన అహల్యని గౌతమునితో కలిపి తనని పరిణయమాడిన రాముడు, తనని వివాహమాడాక ఏ భర్త అయినా, తన భార్యని విడిచేయవచ్చునని లోకానికి తన ద్వారా అర్థమయ్యేలా ప్రవర్తిస్తాడా? ఒకప్రక్క "సీత అగ్నిపునీత - నాకూ ఆమె నిర్దోషురాలని తెలుసు" అని అంటూ కూడా విడుస్తాడా? - విడువడు. ఈ మాత్రం రామతత్త్వాన్ని తెలిసినవారు అర్థం చేసికోలేకపోతారా? అనీకూడా సీతమ్మభావం. అందుకే తీరుబడిగా అత్తలకి నమస్కారాలనీ, రామునికి సాష్టాంగప్రణామాలనీ, మఱదులకి ఆశీస్సులనీ, అయోధ్య ప్రజలకి సుస్థిరపాలననీ లక్ష్మణునితో ఆమె చెప్పి, రామునికి చెప్పమంది.

మఱి ఇదే నిజమైతే ఆమె కన్నీళ్లతో అంతగా ఎందుకు విలపిస్తూ చెప్పాలి? ఒకటి - మనుష్యస్త్రీ నటన కాబట్టీ - రెండవది - 'మానసం మనసైవాయ ముపభుంక్తే శుభాశుభమ్ - వాచా వాచాకృతం కర్మ కాయేనైవ చ కాయికమ్' అని ప్రాయశ్చిత్త ప్రకరణం చెప్తోంది కాబట్టీను. మనస్సుతో చేసిన పాపాన్ని మనోబాధతోనూ, వాక్కుతోచేసిన పాపం తనమీద మఱెవరో వేసే నిందారూపమైన బాధతోనూ, శరీరంతో చేసిన పాపాన్ని శరీరవ్యాధి బాధతోనూ అనుభవించి తీరాలట.

సీతమ్మ మానసిక-శారీరకదోషాలని చేయలేదుగాని 'వాచాదోషం' మాత్రం చేసింది. అలనాడు మారీచుణ్ణి చంపడానికి రాముడు వెళ్లినప్పుడు మారీచుడు 'సీతా! లక్ష్మణా!' అని అఱిచాడు. రావణుడు తనని అపహరించేలా చేసికొని తన భర్తకి రావణునితో విరోధాన్ని ఏర్పాటుచేసి, అవతార ప్రయోజనమైన రావణవధ చేయించాలనే భావం కల సీత రావణుణ్ణి చూచింది. అతడు భిక్షుకవేషంలో ఉండి కూడా లక్ష్మణుని చూచి భయంతో రాలేక ఆగిపోతున్నాడు. బోనుదగ్గఱికి వచ్చిన ఎలుకని బెదిరిస్తే పిల్లికి పని చెడిపోతుందిగదా! అందుకని లక్ష్మణుణ్ణి ఆ ప్రాంతంనుండి పంపించివేయాలని భావించిన ఆమె, లక్ష్మణుడు ఏమంటేగాని వెళ్లడో అలాంటి మాటలని అని పంపించివేసింది.

'లక్ష్మణా! నా భర్త రామచంద్రునికి ఏదైనా అపాయంకలిగితే మరణిస్తానుగాని నిన్నుకలనైనా భర్తగా తలవను సుమా! మారీచుని వెనుక వెళ్లిన నా రాముడు 'సీతా! లక్ష్మణా!' అంటూ అఱచి నేలగూలినా నువ్విక్కడే ఉండడానికి కారణం నన్ను పెళ్లాడడం తప్ప ఏమయ్యుంటుంది?'... అంటూ వాచాదోషాన్ని ఆమె కావాలని చేసింది. ఆ వాగ్దోషాన్ని లక్ష్మణుని విషయంలో చేసింది కాబట్టి ఈనాడు తనమొఱని లక్ష్మణునికే వినిపించుకోవలసిన ఎరిస్థితి కల్గింది. లోకంలో చాల సంఘటనలలో ఇది నిజమౌతూంటుంది.

ఎవరు ఎవరిని బాగా బాధపెట్టారో చివరికి ఒకదశలో వారి కాళ్లనే పట్టుకోవలసి వస్తూంటుంది. పాండవులని ఎంతగానో మానసికక్షోభకి గుఱిచేసిన ధృతరాష్ట్రుడు కురుక్షేత్రం పిమ్మట తన పుత్రులందఱూ గతించగా, ఆపాండవుల పంచనే ఉండి రోజూ అన్నాన్ని భీముని దెప్పిపొడుపులతో తింటూ ఉండవలసి వచ్చింది. ఎక్కడో భీమధృతరాష్ట్రులే ఈగతికి పోతారనుకో కూడదు. అత్తాకోడళ్ల దగ్గఱనుండి ఆలుమగలవఱకూ కూడా పరిస్థితి ఇంతే ఔతుంది. గమనించుకోవాలి!

లక్ష్మణుడు వెళ్లిపోబోతున్నప్పుడు తన గర్భాన్ని చూడవలసినదిగా ఆమె చూపింది. (నిరీక్ష మా ద్య గచ్ఛ త్వ మృతుకాలాను వర్తినీమ్) ఇది అనౌచిత్యం కాదా? అన్పిస్తుంది. కానేకాదు. ప్రజలందఱికీ ఇప్పుడే తెలియాలనేది సీతమ్మ అభిప్రాయం. అంటే ఈ గర్భం ఎవరివలననో కలిగిందని ముందునాటికి నిందరాకుండా ఉండాలనే తుచ్ఛమైన ఆలోచనతో ఆమె అలాచూపలేదు.

లక్ష్మణా! అయోధ్య నగరం నుండి అలనాడు లక్ష్మివంటి నేను వెళ్లగానే దశరథ మరణం సాగింది. తఱువాత అరాజకంగా (రాజఱికం దాదాపు లేకుండా ఉన్నా అయోధ్యలో ఉండకుండా రాజుగా నందిగ్రామం నుండి భరతపాలనం) అయోధ్యా పరిపాలన సాగింది. ఇప్పుడూ సీతనైన నేను అయోధ్యా లక్ష్మిగా వైకుంఠానికి ఇటునుండి ఇటేవెడుతున్నాను. ఇక పరిపాలన ఎవరిది? అనుకో నక్కఱలేదు. అయోధ్యాజనాన్ని అనాథలని చేయడంలేదు. చూడు గర్భాన్ని

నిజానికి నీకు చెప్పకూడదు. అయినా చెప్తున్నా. నువ్వు సీతమ్మకీ రామునిక్కూడా చెప్పనంటే చెప్తాను. (ఇదం త్వయి న వక్తవ్యం సౌమిత్రే భరతేఽపి వా - న త్వయా భరతే వాచ్యం శత్రుఘ్నస్యాపి సన్నిధౌ)' అన్నాడు.

ఎవ్వరికీ చెప్పవని లక్ష్మణుడనగానే సుమంత్రుడు చెప్పప్రారంభించాడు. 'లక్ష్మణా! ఒకప్పుడు వర్షకాలం జరుగుతోంది. వర్షకాలం 4 నెలలనీ,సంన్యాసులు 'చాతుర్మాస్య దీక్ష' అనే పేరిట ఎక్కడికీ వెళ్లకుండా ఒకేచోట గడుపుతారు. ఆ కాలంలో అత్రిమహర్షి పుత్రుడైన దుర్వాసుడు మీ కులగురువైన వశిష్ఠుని ఇంట్లో చాతుర్మాస్యదీక్షని ప్రారంభించాడు. దాదాపు ప్రతిదినమూ వశిష్ఠుణ్ణి చూచే అలవాటున్న మీ తండ్రి దశరథుడు వశిష్ఠాశ్రమానికి ఆకాలంలో వచ్చి అగ్నిహోత్రంలా వెలుగుతూన్న దుర్వాసుణ్ణి చూచి నమస్కరించాడు.

ఆమాటా ఈమాటా అయ్యాక దశరథునికి తన భవిష్యజ్జీవితాన్ని గూర్చి తెలిసికోవాలనే ఉత్సాహం కలిగి దుర్వాసుణ్ణి అడిగాడు. ముఖ్యంగా 'సంతానం - వారి పాలన - ఇక్ష్వాకువంశం ఎంతకాలం ఉండేదీ' చెప్పవలసిందని అడిగాడు. దుర్వాసుడు మహాకోపిష్ఠి అయినా శాంతచిత్తంతో ఇలా చెప్పాడు.

లక్ష్మణా! శ్రద్ధగా వింటున్నావు కదా! అంటూ ఇలా చెప్పసాగాడు దుర్వాసుడు చెప్పిన విషయాన్ని సుమంత్రుడు.

'దశరథా! ఒకప్పుడు రాక్షసులు ఎన్నో అకృత్యాలు చేస్తూంటే శ్రీమహావిష్ణువు రాక్షసులని వెదికివెదికి వధించసాగాడు. ఇది గమనించిన రాక్షసులు అకృత్యాలనిచేసి భృగుమహర్షిభార్య సహాయంతో ఆయన ఆశ్రమంలో ఎవరికీ కన్పడకుండా దాక్కుంటూ ఉండేవారు. తన తపశ్శక్తితో ఆమె సముద్రంలో కూడ దాచివేసి రాక్షసనాశనం కాకుండా చేసేది. కొన్నాళ్లు గమనించిన మీదట శ్రీమహావిష్ణువు -'ఇది సరికాదని' భావించి భృగుమహర్షిభార్యని చంపివైచాడు. కళ్ళ ఎదుట భార్య మరణాన్ని చూచి తట్టుకోలేని భృగువు తన భార్య అకృత్యమే చేస్తోందని తెలిసీ కూడా మహావిష్ణువుని శపించాడు. "మనుష్యలోకంలో జన్మ నీకు కలుగుతుంది. నాకు ఎలాగ భార్యావియోగం అయిందో అలాగే నీకు చాలకాలం భార్యావియోగం (మరణం వలన కాదు) అవుతుంది" అని.

'అడవులకి భార్యని పంపివేసిన రాముడు' అని కొందఱూ, పిల్లలని కూడ లెక్కించని రాముడని కొందఱూ...ఇలా ఎవరెవరి అజ్ఞానం ఎంతెంతో దానిదానికి తగ్గట్టు పాపం రాముణ్ణి ఆడిపోసుకున్నారు. దీనికంతకీ కారణం వాల్మీకి రామాయణంలోని ఈ ఘట్టాన్ని వారు చదువకపోవడమే. చదువకపోయినా 'బాగా తెలిసినట్లు' వాదించడమే.

ఎవరికీ చెప్పవద్దని లక్ష్మణునికి మాత్రం రహస్యాన్ని సుమంత్రుడు చెప్పడం ఏ తీరు రాజధర్మం? పైగా రామచంద్రునిక్కూడా చెప్పనంటేనే చెప్తానని పల్కడం అదెంత సముచితం? అని అన్పించవచ్చు. సు-మంత్రుడు అంటే మంచి ఆలోచనా-ఉపాయమూ కలవాడు అనికూడ అర్థం. సీతారాములిద్దఱూ వైకుంఠానికి వెడతారని తనకి తెలుసు. అందులో భాగంగా ముందుగా సీతమ్మ వెడుతుందని కూడా తెలుసు. భరత-లక్ష్మణ-శత్రుఘ్నులు ఉండగానే రాముడు వెళ్లిపోతాడనీ తెలుసు. అలా అన్నీ తెలిసినవాడు లక్ష్మణుని దుఃఖాన్ని గమనిస్తూనే ఉన్నాడు. సీతాపరిత్యాగం అతణ్ణి తీవ్రంగా కలచివేసింది.

ఒకప్పుడు సీతారాములిలాగే చిత్రకూటానికి వెళ్లారని తెలిసిన భరతస్వామి, అయోధ్యా జనం అందఱినీ అక్కడికి తీసికొనివెళ్లి రాముణ్ణి రమ్మని ప్రార్థించాడు. ఇప్పుడు భరతుడుకూడ అయోధ్యలోనే ఉన్నాడు. లక్ష్మణుడు అయోధ్యకి వెళ్లాక భరతునితో కలిసి మళ్లీ ఇలాంటి ఆలోచనచేసి రాముణ్ణి దిగ్బంధం చేసినా, లేదా సీతమ్మ ఎక్కడుందో తెలిసిపోయింది కాబట్టి, మా సీతమ్మని పంపించవలసిందని అయోధ్యాజనం అందఱితోనూ వెళ్లి ప్రార్థించినా, అయోధ్యా జనానికి 'ఇలా నిందవేయడం ఈ కారణాల ప్రకారం తప్పు సుమా!' అని ఒప్పించి వారినే సీతమ్మ పాదాలమీద పడేలా చేసినా, దైవనాటకం జరుగకపోదేమోకాని కొంత 'అడ్డు'-'గడ్డు' పరిస్థితి వస్తుంది. అన్నిటికీమించి రాముడంటే తన సర్వప్రాణాలుగా భావించే లక్ష్మణునికి కూడా 'దైవనాటకం' ముగింపుకి వచ్చిందనీ, తనని కూడా విడిచి రాముడు వెళ్లిపోతాడని వీలయినంత ముందుగా తెలియజేయడం మంచిదనీ సు-మంత్రునికి అన్పించింది. ఇదంతా లక్ష్మణ దుఃఖాన్ని గమనించాక సుమంత్రునికి కల్గిన ఆలోచనం.

అందుకే చెప్పవలసిన రహస్యాన్ని చెప్పదలచి మరీ చెప్పాడు ఈ విషయం. రామునికి కూడా తెలియదని కాదు -"లక్ష్మణస్వామి నేరుగా రాముణ్ణి ఈ విషయం అడిగి రామునికి ఇబ్బందిని కల్గించకూడదని". లక్ష్మణుడు కూడా తాను చూస్తుండగానే - వాల్మీకి మహర్షి పాదుకలు కూడా లేకుండా సీతమ్మవద్దకు తొందరగా రావడం, ముని బాలకులు ఎవరో ఒకామె అక్కడ దుఃఖిస్తూ ఉన్నదని వాల్మీకికి చెప్పగా, ఆయన రాగా వారు వింతగా ఆమెను గమనిస్తూ ఉండడం, ఋషిపత్నులు విచ్చేయడం, సీత యథార్థమైన వృత్తాంతాన్ని వాల్మీకి దివ్యదృష్టితో గమనించడం వంటివెన్నింటితోపాటు ఆమె ఆశ్రమానికి సుఖంగా చేరడం - కూడా జరిగిపోయాయి. లక్ష్మణునికి దిగులెందుకు?

ఇలా తాను చూచిన వృత్తాంతం ద్వారా తాను ఊరటపడేలా లక్ష్మణుణ్ణీ చేయాలనీ, తాను (సుమంత్రుడు) ఈకథని చెప్పి మఱింత శాంతిని లక్ష్మణునికి కల్గించి, ఒకతీరు నిర్వేదాన్ని (సీత ఉండదు. రాముడు వెళ్లిపోతాడు. ఇద్దఱు పిల్లలకీ రాజ్యభారం ఒప్పగిస్తారు. అయోధ్యకూ మనకూ సంబంధం దాదాపు అయిపోయినట్లే) అనుభవింప చేయడానికీ, తద్వారా కథ ముగింపులో ఇఱకాటాలు ఉండకుండా చేసేందుకూ సుమంత్రుడు ఈ విషయాలని కావాలనే చెప్పాడు. కాబట్టి 'రహస్యం' అనేది ఎంతవఱకూ? అంటే ప్రాణాపాయాన్ని కల్గించనంతవఱకూ అని అర్థమన్నమాట.

మరణం తప్పక ప్రాప్తించే రోగికి మరణాన్ని గుఱించి ఎప్పుడు చెప్పాలో చరకమహర్షి చెప్పాడు. రోగికి రోగం రహస్యమే అయినా, దాన్ని బయటకి చెప్పే రోజు ఏదో అది వైద్యునికే తెలుసు. తెలిస్తేనే వైద్యుడు కూడా. ఆ వైద్యుడు ఇక్కడ సుమంత్రుడు. అందుకే ఆనాడు సుమంత్రుణ్ణి రథసారథిగా సీతారాముల్ని విడిచిరమ్మని దశరథుడు పంపాడు. నేడు సీతమ్మని విడిచి రమ్మని రాముడు పంపాడు. సుమంత్రుడూ ఔనని ఈ పనికి అంగీకరించి వెళ్లాడు. కారణం దైవకథ సరిగా నడుస్తున్నదా? లేదా? అని గమనించడానికీ, పాత్రలని సరిగా నటింపజేయడానికీను.

ఇక స్త్రీని వధించరాదని (న స్త్రీ వధ్యా) శాస్త్రం చెప్తుంటే విష్ణువే భృగు(మహర్షి )భార్యని వధించడం ధర్మమా? అని

భావింపనక్కఱలేదు. 'నా తతాయివధే దోషో హంతు ర్భవతి కశ్చన'. అతతాయి అయిన స్త్రీ/పురుషులని వధించినా దోషం ఉండదని, తాటకా వధ చేయడానికి తటపటాయిస్తున్న రాముణ్ణి విశ్వామిత్రుడు ప్రోత్సహించి మరీ చంపించాడు. అక్కడ భృగుభార్యని విష్ణువు చంపాడనే విషయాన్ని కూడ చెప్పి అలాంటివారు స్త్రీత్వధర్మం క్రిందికిరారనీ చంపడం ఒప్పేననీ కూడ విశ్వామిత్రుడన్నాడు. (స్త్రీని చంపవచ్చా? తాటకా వధ ధర్మమే' అనే విషయాలని వివరంగా నా బాలకాండ వ్యాఖ్యలో చూడవచ్చు).

ఇక దీనిద్వారా నేటి లోకమూ గమనించాల్సిన అంశం ఒకటుంది. నేరం చేసిన మఱుక్షణం స్త్రీ అయినా పురుషుడైనా దోషస్థులు (నేరస్థులు అనేమాట సరికాదు) అవుతారు. అలాంటి దశలో ఆదోషస్థుణ్ణి/దోషస్థురాలిని పట్టుకొని తీసికొనిపోయే అర్హత రక్షకభటశాఖకి వస్తుంది. అలాంటప్పుడు స్త్రీ - పురుష భేదాన్ని పాటించవలసిన అవసరంలేదన్నమాట. (స్త్రీ అయిన తాటకని పురుషుడైన రాముడూ - భృగుభార్యని విష్ణువూ చంపడంబట్టి) మహిళా రక్షకభటులే స్త్రీలని తీసికొనిపోవడానికి రావాలనే నియమం సరైనదేనా? అంటే శ్రీమద్రామాయణం మాత్రం 'కాదు సుమా!' అని చెప్తుంది.

భృగు మహర్షి విష్ణువును శపించి, వెంటనే ఎందుకు ప్రాధేయపడ్డాడు? నీళ్లు పల్లానికి ప్రవహిస్తాయిగాని ఎగువకి పోలేవు. అలాగే తపశ్శక్తి తక్కువ ఉన్నవారు తమకంటె అధికులైనవారిని శపిస్తే, అది వారిమీద పనిచేయదు. లోగడ నలకూబరుని శాపం రావణునిమీద పనిచేయని కారణం అదే. అటు మీదట బ్రహ్మ శాపాన్ని ఈయగా, అప్పుడు ఇది కూడా పనిచేసింది. అలాగే ఇక్కడకూడా విష్ణువుమీద భృగుమహర్షిశాపం అమలుకి రాదు. అంతతోనూ పోదు. ఎగువకి బలవంతానా పంపిన నీరు, ఎక్కువవేగంతో పల్లానికి వచ్చేటట్లు విష్ణువు మీద ప్రయోగించిన శాపాన్ని విష్ణువు తిరస్కరిస్తే, అది భృగువునే బాధిస్తుంది.

ఈ ఆలోచన అంతా శపించే సమయంలో భృగువుకి కల్గలేదు. భార్యని చంపాడన్న కోపంలో శపించేసాడు. కోపం తగ్గాక ఆలోచించి

కాబట్టి. కుశీలవులు అనే ఈ కవలలు వేదమాత అయిన సీతమ్మకు వేదవేద్యుడైన మహావిష్ణువు ద్వారా లభించిన స్వర - మంత్రాక్షరాలేనన్నమాట. (లోకంలో వీరికి లవకుశులని వాడుక. కానీ వాల్మీకి కుశీలవులు అనే వ్యవహరించాడు).

'చత్వార ఇవ బాహవః'. శ్రీమహావిష్ణువే రామ-భరత-లక్ష్మణ - శత్రుఘ్నులుగా అవతరించాడు కాబట్టి అందరిలోనూ ప్రధానుడైన రాముని వివాహం - రాజ్యం - వియోగం - సంతానం గురించి చెప్తే మిగిలిన అందరివిషయమూ చెప్పబడినట్లే. అయితే ఈ కథ మనుష్య (మర్త్య) లోకంలో జరుగుతూండడం బట్టి మిగిలిన తమ్ముళ్ల భార్యలూ - వారిపేర్లూ మాత్రం కన్పిస్తాయి. మెడలో పూలమాలవేస్తే శరీరాన్నంతటినీ గౌరవించినట్లే కదా! అలాగే సాష్టాంగ ప్రణామంచేస్తే కూడా పాదాలకి మాత్రమే నమస్కరించినట్లు కాదు గదా! ఇదీ అంతే!

రాముడు విష్ణువే సుమా! అని చెప్పిన సుమంత్రుడు మిగిలిన ముగ్గురు తమ్ములనీ కూడా విష్ణుభాగాలే అని చెప్పలేదు. కారణం సాక్షాత్తు విష్ణువే అయిన రాముడే మనుష్యునిగా తనని తాన భావించుకుంటూ ఉన్నాడు కాబట్టీ, ఆ గాంభీర్యం వీరికి ఉండక పోవచ్చునేమో అనీ, లేదా సుమంత్రుడినైన నాకే విష్ణువు రాముడని తెలిసాక మీరు కూడా విష్ణ్వంశలే (విష్ణువు అంశాలే) అని తెలుసునని వేరే చెప్పాల్సిన పని ఉందా? అనే ఆలోచనతోనూ సుమంత్రుడు చెప్పలేదు.

## వెంటనే ఫలించిన సుమంత్రుని వైద్యం

లక్ష్మణుడు రాముని వద్దకు వెళ్లి సాష్టాంగపడ్డాడు. 'అన్నా! నువ్వు చెప్పినట్లు గంగాతీరంలో వాల్మీకి ఆశ్రమంలో సీతమ్మని విడిచివచ్చాను. (గంగాతీరే యథోద్దిష్టే వాల్మీకే రాశ్రమే శుచౌ - ఆర్య స్యాజ్ఞాం పురస్కృత్య విసృజ్య జనకాత్మజాం - పున రప్యాగతో వీర! పాదమూల ముపాసితుమ్) దుఃఖపడకు! యోగ్యుడైనవాడు పుత్ర-మిత్ర-ధనవిషయాలలో ఇలా బాధపడకూడదు. (సంయోగా విప్రయోగాంతా మరణాంతం చ జీవితమ్ - త్యజైనాం దుర్బలాం బుద్ధిం సంతాపం మా కురుష్వ హ - మా శుచః పురుషవ్యాఘ్ర కాలస్య గతి రీదృశీ.)

లేదు. తద్ద్వారా జ్ఞానం రాదు. ఆమీదట ఉత్తరలోక ప్రాప్తి లభించదు కదా! సరిగా ఇదే జరిగింది నిమి - వశిష్ఠుల కలహంలో. ఇద్దటికీ శరీరాలు లేవు. కర్మభ్రష్టులయ్యే పరిస్థితి కల్గింది. ఒకరు బ్రహ్మద్వారా మఱొకరు దేవ-ఋషుల ద్వారా శరీరాలని సంపాదించుకోగలిగారు. మఱోరహస్యమూ ఉంది. గాలిలో గాలిరూపంలో కలిసి తిరిగే వశిష్ఠుని శరీరం, బ్రహ్మాజ్ఞపై, మిత్రావరుణులకి పుత్రునిగా మఱో రూపాన్ని పొందింది. అంటే పుట్టడానికి ముందు ఎవరి పుత్రులైనా అలా వాయు రూపాల్లోనే ఉంటారన్నమాట. బ్రహ్మనియోగంపై ఎవరెవరికి ఎవరెవరు ఋణగ్రస్తులై పుత్రరూపాన్ని పొందాల్సి ఉందో, ఆయావారికి ఆయావారు అలాఅలా పుట్టి వారివారి పూర్వకర్మానుసారం ఆయా విధమైన ప్రవర్తన కలవారై జీవిస్తారు.

లక్ష్మణునికి రామునిమాట వినడమె ప్రధాన కర్మ. రామునికి రావణవధచేసి వైకుంఠానికి తిరిగి రావడమే ప్రధాన కర్మ. వాల్మీకికి సీతా - కుశీలవుల పెంపకమే ప్రధాన కర్మ. ఇలా బ్రహ్మాజ్ఞపై ఎవరెవరు ఏయే కాలానికి ఏయే పద్ధతిలో జీవించాలో అదంతా బ్రహ్మనిర్ణయంపై జరుగుతూంటుంది. తన తండ్రి పోయినప్పుడు 'ఇలాంటి తండ్రికి కర్మని ఆచరించడం కూడానా? ఎందుకు?' అనుకున్నాడు లక్ష్మణుడు. **'అలా అనుకోవడం తప్పు'** అని ఈ కథ నిరూపిస్తోంది. ఇక **'తాను చెప్పేదంతా వింటూన్న లక్ష్మణునిలో మార్పు మఱింత కొట్టివచ్చినట్లు కన్పిస్తోంది'** అనుకున్నాడు రాముడు.

## లక్ష్మణా! రాజుకి కోపం తగదు!!

యాగవేదికవద్ద వశిష్ఠుడూ, నిమీ శపించుకోడానిక్కారణం క్రోధం కదా! కోపం ఎవ్వరికీ తగదు. ముఖ్యంగా క్షత్రియునికి పరిపాలనచేసే వానికి అసలు తగదు. (లక్ష్మణుడు ఆశ్లేషా నక్షత్రంలో పుట్టినవాడు గదా! మహాకోపి. లక్ష్మణునికి చెప్పాలనే రాముడు చెప్తున్నాడు. నక్షత్రంబట్టి వ్యక్తి ప్రవర్తన తెలియాలంటే చూ. నా బాలకాండవ్యాఖ్య).

లక్ష్మణా! మనవంశంలోనే నృగుడనే రాజుడున్నాడు. ఆయనకొడుకు యయాతి. రాక్షసరాజు వృషపర్వుని కూతురు శర్మిష్ఠా -

పెద్దవాడైన రాముడుండగా చిన్నవాడైన భరతునికి పట్టాభిషేకం జరుగరాదనే విషయం మీదనే కదా అలనాడు అయోధ్యలో చెప్పలేనంత చర్చ జరిగింది! మఱి ఈరోజున ఇలా తమ్మునికి పట్టాభిషేకం న్యాయమేనా? అన్పిస్తుంది. ఇది న్యాయబద్ధమే. రావణవధ అయిన పిమ్మట అయోధ్యా రాజ్యానికి తానురాజు. యువరాజుగా లక్ష్మణుణ్ణి ఎంత బ్రతిమాలినా ఒప్పుకోకపోతే భరతుణ్ణి యువరాజుగా చేసాడు రాముడు. ఆ భరతుడే ముందునాటికి అయోధ్య రాజైతే తనకి పుట్టబోయేవారు యువరాజులౌతారు. లక్ష్మణుడు 'అప్పుడూ రాజ్యంవద్దు. ఇప్పుడూ రాజ్యంవద్దు. మఱెప్పుడూ కూడా రాజ్యం వద్దే వద్దు' అన్నాడు. అంటాడు కూడ. భరతునికి రాజ్యం ఉండనే ఉంది. యువరాజుకూడ. ఇక లేనిది శత్రుఘ్నునికే కదా! అందుకని పట్టాభిషేకాన్ని చేసాడు. దోషమేముంది? అయోధ్యా పట్టాభిషేక చర్చకీ దీనికీ పోలిక లేదు.

శత్రుఘ్నునికి పట్టాభిషేకం కాగానే రాముడు నారాయణాస్త్రాన్ని ఇచ్చాడు. (తాను మహావిష్ణువే అని చెప్పడం). శత్రుఘ్నా! లవణునికి ఒక శూలం ఉంది. దానికి ఒక ఆలయం కట్టించి వాడు పూజిస్తూ ఉంటాడు. ప్రొద్దునే శూలాన్ని ఇంట్లో ఉంచి జంతువులకోసం పోయి వస్తూంటాడు. ఎవరైనా శత్రువులు పిలిస్తే ఊళ్లోకి వెళ్లి శూలంతెచ్చి పోరాడుతాడు. శూలం ఉంటే వాడు అజేయుడే. కాబట్టి శూలం వాడు కలిగి ఉండని విధంగా పొలిమేరలోనే వాణ్ణి యుద్ధానికి పిలిచి కార్యం సాధించుకో! నేనిచ్చిన నారాయణాస్త్రాన్ని మధుకైటభులని చంపడానికి విష్ణువు సృష్టించాడు. అనవసరంగా దీన్ని ప్రయోగించకు. వాడు శూలాన్ని ప్రయోగిస్తే అది రుద్రశక్తి నిండినది కాబట్టి ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రంలాగా గౌరవించాలేతప్ప ఎదురు బాణాన్ని వేసి అవమానించి, దాని శక్తిని పెంచుకోకూడదు సుమా!

ఇంతకీ సేనలతో మహర్షులంతా ముందుగా మధుర దగ్గఱ వనాలకి వెళ్లనీ. పిమ్మట నువ్వువెళ్లు. ఎవరికీ తెలియకూడదు. వాడికి ఏమాత్రం నీ జాడ తెలిసినా ప్రమాదమే. గంగ దగ్గఱ సేన ఆగాక నువ్వు ముందువెళ్లు. ఆ మీదట మహర్షులు సేనలతో వస్తారు. తరువాత చేయవలసినది నీకు తెలుస్తుందిగదా! అన్నాడు. అందఱకూ

నమస్కరించి ఆశీస్సులని పొంది, శత్రుఘ్నుడు గంగ దాటి వాల్మీకి ఆశ్రమానికి వచ్చాడు. శత్రుఘ్నుడు అడుగగా అక్కడి ఒక ప్రదేశంలోని విశేషాన్ని వాల్మీకి ఇలా చెప్పాడు.

## కల్మాషపాదుడు

సుదాసుడనే రాజు మృగాలు దొఱుకక రాక్షసుణ్ణి చంపితిన్నాడు. ప్రతీకారం తీర్చుకోదలచిన మఱొక రాక్షసుడు వశిష్ఠుని వేషంలోవచ్చి ఇతణ్ణే మాంసభోజనాన్ని అడిగాడు. వంటవాని రూపంలో ఉన్న దొంగరాక్షసుడు మనుష్యమాంసాన్ని వడ్డిస్తే, వశిష్ఠరూపంలో దొంగరాక్షసుడు సుదాసుని పుత్రుడు మిత్రసహుణ్ణి (అప్పటికతడు రాజుగా ఉన్నాడు) 'మానవ మాంసభక్షకుడివి కమ్ము!' అని శపించాడు. దానికి కోపించిన సౌదాసుడు (మిత్ర సహుడు) నీటిని తీసి శపించబోగా అతని భార్య మదయంతి వశిష్ఠునిమీదికి శాపం వద్దంది. ఆశాపజలాన్ని నేలమీద విడిస్తే దేశానికి అరిష్టమని భావించి తనపాదాలమీదే పోసికొన్నాడు సౌదాసుడు. ఆ మంత్ర ప్రభావానికి కాళ్లు మాడి నల్లబడితే అంతా అతణ్ణి కల్మాషపాదుడని పిలిచారు. పన్నెండేళ్లు ఈ శాపంతో బాధపడి శాపం తీరాక అతడు యజ్ఞం చేసినచోటుని ఆశ్రమంలో చూపించి వాల్మీకి ఈకథని శత్రుఘ్నునికి చెప్పాడు.

## కుశీలవ జననం

ఏ రాత్రి శత్రుఘ్నుడు వాల్మీకి ఆశ్రమానికి వెళ్లాడో సరిగా ఆ రాత్రే సీతమ్మ కవలలని కన్నది. వృద్ధతాపసులని పిలిచి వాల్మీకి భూతనాశన మంత్రాలని చదివి దర్భకొనలతో ఒకణ్ణి తుడిచి (కుశుడు) వేఱొకనిని దర్భలమొదళ్లతో తుడిచి ఆవిధానానికి అనుగుణంగా కుశీలవులని పేరుపెట్టాడు. ఆ యిద్దఱూ కవలలు (యామేవ రాత్రిం శత్రుఘ్నః పర్ణశాలా ముపావిశత్ - తామేవ రాత్రిం సీతాపి ప్రసూతా దారకద్వయమ్ - య స్తయోః పూర్వజో జాతః స కుశై ర్మంత్ర సత్కృతైః - నిర్మార్జనీయస్తు తదా కుశ ఇత్యస్య నామ తత్ నిర్మార్జనీయో వృద్ధాభి ర్లవ ఇత్యేవ నామతః)

పరమానందంతో శత్రుఘ్నుడు లవణుని మీదికి యుద్ధానికి పోయి జయించాడు. దాని కానందపడిన దేవతలతో తనకి మధురాపురం

రాజధానిగా ఉండే వరాన్ని పొందాడు శత్రుఘ్నుడు. శూరులైన సేనతో లవణుణ్ణి గెల్చిన కారణంగా ఆ దేశం పేరు 'శూరసేనం' అయింది. మధురని బాగా అభివృద్ధి చేసాక 12 ఏండ్లయ్యాక రాముణ్ణి చూడాలనిపించి శత్రుఘ్నుడు అయోధ్యకి బయలుదేరి మళ్లీ వాల్మీకి ఆశ్రమానికి వచ్చాడు.

శ్రీమద్రామాయణంలో 12కి ఒక విశిష్ట స్థానం ఉందనిపిస్తుంది. శ్రీమద్రామాణరచనానికై వాల్మీకి పారాయణం చేసిన రామమంత్ర సంఖ్య 12లక్షలు. రాముడు పుట్టిన 12 ఏండ్లకి విశ్వామిత్రుడు వచ్చాడు. ఆయన వివాహం వఱకూ సాగిన విశ్వామిత్రశిష్యత్వ కాలం 12 నెలలు. పెళ్లయిన పిమ్మట సీతారాములు సుఖంగా అయోధ్యలో ఉన్నది 12 ఏండ్లు. భరతశత్రుఘ్నులు కేకయరాజు ఇంట్లో ఉన్నది 12 ఏళ్లు. అరణ్యానికి బయలుదేరాక శూర్పణఖతో పరిచయం సరిగా 12 ఏళ్లకి. లంకలో సీతమ్మ ఉన్నది 12 నెలలు. శత్రుఘ్నుడు మధురని రాజధానిగా చేసికొని పరిపాలించిన కాలం 12 ఏళ్లు. కుశీలవులు శ్రీమద్రామాయణగానాన్ని మొదటగా విన్పించిన వయస్సు 12వ సంవత్సరం. శ్రీమద్రామాయణ శ్లోకాలసంఖ్య 2 x 12 వేలు. శ్రీమద్రామాయణంలోని ప్రధానపాత్రధారులు నాయకుని వైపున చూస్తే 12 మంది (రామ - లక్ష్మణ - భరత - శత్రుఘ్న - దశరథ - కౌసల్య - సుమిత్ర - కైకమ్మ- మంథర - ఆంజనేయుడు - సీతమ్మ- సుమంత్రుడు) సీతారాములకి పుత్రులు పుట్టిన సర్గ సంఖ్యకూడా 66 (6 + 6 = 12). శ్రీమద్రామాయణాన్ని పారాయణం చేయడానికి చేసే అంగన్యాస కరన్యాసాల సంఖ్య కలిపితే 6+6 = 12.

శత్రుఘ్నుడు ఆశ్రమంలో ఉన్నప్పుడు కుశీలవులిద్దఱూ రామకథని పాడి విన్పించారు. వీణెలమీద పాడడానికి అనువుగా, తాళానికి సరిపోతూ, వ్యాకరణ దోషాలులేక, సరిగా రామకథ ఎలా జరిగిందో అదేప్రకారంగా ఎక్కువ తక్కువలు లేక, ఆ సందర్భంలో రామకథ జరుగుతోందా? అన్నంత ఆనందంతో వారు పాడి విన్పింపగా కన్నీళ్లతో నిట్టూర్పులతో శత్రుఘ్నుడు మొదటిసారిగా వాల్మీకి వ్రాసిన రామకథని విన్నాడు. (తంత్రీలయసమాయుక్తం త్రిస్థాన కరణాన్వితం - సంస్కృతం లక్షణోపేతం సమతాల సమన్వితం - శుశ్రావ రామచరితం తస్మిన్కాలే పురాకృతం - తస్మిన్గీతే యథావృత్తం వర్తమాన మివా శృణోత్।।)

శ్రీమద్రామాయణాన్ని విన్నపిమ్మట శత్రుఘ్నుడు అన్నని చూడకుండా ఉండలేక పోయాడు. అయోధ్యకు వెళ్లి రాముణ్ణి దర్శించి ఎక్కువకాలం ఉండబోతే 'శత్రుఘ్నా! ముందు రాజ్యపాలనం ఆపిమ్మట అన్నదమ్ముల బాంధవ్యం. 7 రాత్రులు మాత్రం ఉండివెళ్లు' అన్నాడు రాముడు. (అవశ్యం కరణీయం చ రాజ్యస్య పరిపాలనం-తస్మా త్త్వం వత్స కాకుత్స్థ సప్తరాత్ర మిహావస।।) వీలయినంత బంధాలని ఛేదించుకుని వైకుంఠ ప్రయాణానికి వీలు కల్పించుకొంటున్నాడని భావం గదా!

## శంబుకవధ - పైకథ

రామరాజ్యం సుఖంగా సాగుతోంది. ఒకనాడు ఒక బ్రాహ్మణుడు తనభార్యతో దీనాతి దీనంగా విలపిస్తూ రాజమందిరానికి వచ్చాడు. చనిపోయిన తన పుత్రుణ్ణి అక్కడే పరుండబెట్టాడు. 'పుత్రకా! నీ మరణం వల్ల నీ తల్లి చావుకి సిద్ధంగా ఉంది. మీ పిమ్మట నేనూ మరణిస్తాను. హింసా, అసత్యం అనేవి రేండే అపమృత్యువుని (అకస్మాత్తుగా మరణం) తెస్తాయి. ఏనాడూ ఆ రెంటిజోలికీ నేను పోలేదు. పూర్వజన్మలో చేసానేమో అంటే, ఈజన్మలో ఏకష్టాన్నీ నేనింతవఱకూ ఎఱుగను గదామఱి! రామ రాజ్యంలో ఈకష్టం వచ్చిందంటే అది రాజదోషమే అయ్యుంటుంది. ఇది నిశ్చయమే. ఇతర దేశాలలో ఇలా హఠాన్మరణాలు - అందునా తండ్రి జీవించి ఉండగా పుత్రుని మరణాలు ఎఱుగను. రాజా! తప్పిదం నీదైన కారణంగా వీణ్ణి బ్రతికించకపోతే మాదంపతులం నీసమక్షంలోనే ప్రాణాలని విడుస్తాం. బ్రహ్మహత్యా దోషాన్ని మూటగట్టుకో! రామచంద్రా! ఏ పాపాన్ని చేసావో ఆలోచించుకో!' అంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తూన్న బ్రాహ్మణ దంపతులనీ మృత పుత్రుణ్ణీ చూచాడు రాముడు. (రామస్య దుష్కృతం కించి న్మహ దస్తి న సంశయః। యథా హి విషయస్థానాం బాలానాం మృత్యు రాగతః। న హ్యస్య విషయస్థానాం బాలానాం మృత్యుతో భయమ్। త్వం రాజన్ ! జీవయస్వైనం బాలం మృత్యు వశం గతం రాజద్వారి మరిష్యామి పత్న్యా సార్థ మనాథవత్ బ్రహ్మహత్యాం తతో రామ సముపేత్య సుఖీభవ!)

రామచంద్రా! ఇక కలియుగంలో శూద్రులు తపస్సు చేస్తారు. ద్వాపరంలోనే శూద్రుడు తపస్సు చేయడం నిషిద్ధమౌతూంటే త్రేతాయుగంలో, అంటే ఇప్పుడు ఎవడో శూద్రుడు తపస్సుచేస్తూ ఉండి ఉంటాడు. లేనిపక్షంలో ఈ చిత్రం ఉండదు. అదే కానినాడు ఈ బ్రాహ్మణ పుత్రమరణమూ ఉండదు. వెళ్లి అధర్మాన్ని శిక్షించి ధర్మరక్షణం చేసికో! అనగానే పుష్పకాన్ని ప్రార్థించాడు రాముడు. పుష్పకంలో 4 దిక్కులూ భ్రమించి దక్షిణదిక్కున శైవలపర్వతానికి చేరువలో తలక్రిందుగా వ్రేలాడుతూ తపస్సు చేస్తున్న ఒకనిని చూచాడు.

రాముడు తన వివరాలు చెప్పుకుని 'ఏ కారణంచేత తపస్సు చేస్తున్నావు? నీ గమ్యం ఏమిటి?' అని అడిగాడు. 'శంబుకుడనే నేను శూద్రుణ్ణి. సశరీర స్వర్గాన్నికోరి ఈతపస్సు చేస్తున్నాను' అన్నాడు. వెంటనే రాముడు వాని తలనఱికాడు. దేవతలు పొగడి పూలవాన కురిపించారు. అక్కడ బ్రాహ్మణ బాలుడు బ్రదికి బంధువులతో చేరాడు. ఇది పైకథ. ఇంత మాత్రమే తెలికొనేవాళ్లు ఎందఱెందఱో. లో విశేషాన్ని గమనించని కారణంగానే అనవసర ద్వేషాలు వస్తున్నాయి. ఎందఱు ఈవిషయమై వాదిస్తున్నారో, ఏకంగా శ్రీమద్రామాయణాన్నే నిరసిస్తున్నారో (ఇక్కడి పై కథ తెలియదనేది నిస్సంశయం - మిగిలిన భాగం తెలియదనేది ఎలాగూ యథార్థమేకదా!) వారంతా దాదాపు అనువాదాలని చదివి వాదించేవారే తప్ప సంస్కృత శ్రీమద్వాల్మీకి రామాయణాన్ని చదివి శ్లోకశ్లోకానా భావాన్ని గ్రహించి యథార్థాన్ని అవగతం చేసికొన్నవారు కానేకారు. లోవిశేషాన్ని గమనిద్దాం.

### లో విశేషం

రాముడు రావణవధకోసం ఈలోకానికి అవతరించాడు. వట్టిగా రావణుణ్ణి వధించి అలా వెళ్లిపోతే అందులో పస లేనేలేదు. సామాన్యుడైన ఒక మంత్రిపుంగవుడు వస్తూంటేనే, ఎన్నెన్నో కార్యక్రమాలని ఒకదానికి మఱొకటి అడ్డురాకుండా ఉండేలా ఏర్పాటుచేసి 'ఈ ప్రయాణంలో ఇన్నింటిని సాధించుకొని వచ్చాం' అని ఆయన భావించే తీరున ఏర్పాటు చేస్తాం. ఇదంతా ఆయన సూచనపైనగాని మనకు తోచిగాని ఎలాగైనా సరే చేస్తాం.

నిస్సంశయం కదా! ఇందులో పరమాత్మచేతిలో వధపొంది స్వర్గానికి అర్హతను పొందుతూ నారాయణస్మరణాన్ని చేయని వారు విరాధ - కబంధ - ఖరదూషణ త్రిశిర- రావణాదులు. తాము వధింపబడకపోయినా మరణకాలంలో నారాయణ స్మరణాన్నిచేసి స్వర్గానికి అర్హతను పొందిన పుణ్యాత్ములు దశరథుడు - జటాయువు మొదలైనవారు. (ఈ గ్రంథాన్ని ముద్రింపిస్తున్న కందికుప్ప (బుర్రా) సీతమ్మగారు కూడ మరణకాలంలో నారాయణ స్మరణని చేసారు. స్వర్గసిద్ధి వారికి లభించడంలో సందేహం లేదు). ఇక నారాయణుని చేతిలో వధని పొందుతూ నారాయణస్మరణని కూడా చేసిన విశేష పుణ్యాత్ములు విరాధుడు మారీచుడు - వాలి - మొదలైనవారు.

స్వర్గానికీ మోక్షానికీ కొద్ది భేదాన్ని కూడ చెప్పవలసి ఉంది శాస్త్రం చెప్పిన ప్రకారం నడుచుకుంటూ స్వధర్మాన్ని ఆశ్రయి మెలిగేవారికి లభించేది స్వర్గం. పరధర్మం (క్షత్రియుడు పరిపా చేయడం స్వధర్మం) ఆచరించి పట్టుదలతో భగవంతుని చేతిలో వధ పొందడం మోక్షానికి మార్గం. ఈ రెండవమార్గాన్ని ఎంచుకున్నవాడు శంబుకుడు. మొదటి మార్గాన ప్రయాణించేవారు మహర్షులూను.

అందుకే శంబుకుణ్ణి చంపిన వెంటనే దేవతలు "సర్వథు జ్ఞా హి శూద్రోఽయం త్వత్కృతే రఘునందన" రామా! నువ్వు ఇతణ్ణి చంపినందువలన వీనికి స్వర్గం లభించదు - (మోక్షమే సిద్ధిస్తుంది) అని అన్నారు. రాముడు శంబుకుణ్ణి ఎందుకు వధించాలి? అని వాదం చేయడం అంటే, 'పరమాత్మ చేతిలో వధనిపొందిన వానికి మోక్షం ఎందుకు రావాలి? భూలోకంలోనే ఎందుకు పడి ఉండ కూడదు?' అని అడగడమే. శ్రీమద్రామాయణంలో రాముని ఎదుట పడి కూడా వధింపబడతానేమో అనే భయంతో ఆడువేషం వేసికొని కూడా పారిపోతూ వెన్నుచూపి మోక్షాన్ని కావాలని (తెలియక) దూరం చేసికొన్నవాడు అకంపనుడు. రాముణ్ణి నిరంతరం ధ్యానిస్తూ మోక్షాన్ని పొందినది ఆంజనేయుడైతే - భక్తితో సేవించి మోక్షాన్ని పొందినవాడు విభీషణుడు. ఇలా ఒక్కొక్కరు ఒక్కొక్క తీరుగా రాముని నుండి మోక్షాన్ని పొందినవారు కాగా శంబుకుణ్ణి గురించిన అపోహకి కారణం శ్రీమద్రామాయణ గ్రంథ మౌలిక లక్ష్యం (Concept) తెలియక పోవడమే..

ఇక్కడ శ్లోకాలని బట్టి కూడా సమన్వయం చేసికొని చూద్దాం. బ్రాహ్మణ బాలకుని మరణానికి కారణం గూర్చి చెప్తూ శంబుకుని పేరు చెప్పకుండా కారణం మాత్రం చెప్పాడు నారదుడు. ఆ శంబుకుణ్ణి వధిస్తే ఈ బ్రాహ్మణ బాలకుడు బ్రతుకుతాడనేది నారదుడు చెప్పిన వాక్యాల సారాంశం. చిత్రమైన అంశ మేమంటే శంబుకవధ ఘట్టంమీద హేతువాదులు కూడ చర్చించారు. 'వీనిని చంపితే వాడు బ్రతకడ మేమిటి? హేతుమద్భావం లేదని వారు కొట్టిపారవేసి ఉంటే నిజమైన హేతువాదులే అనుకొనే వాళ్లం. కాని, వారుకూడ చర్చించడం విడ్డూరమే. ఎవరైతేనేం ? - సమాధానం మనం చెప్పగలిగినప్పుడు, దోషం వారిలో ఉంటే మననేం చేస్తుంది గనుక! వాళ్ల సిద్ధాంతం మీద వారికే అవగాహన లేదనేది ఈ వాదం వలన మనకి తెలిసింది గదా! అస్తు!

యుగాలలో ఆచరించిన తపోవిధానాలని గూర్చి చెప్పాడు నారదుడు. 17, 28,000 ఉన్న కృతయుగంలో బ్రాహ్మణులే తపస్సు చేసేవారనీ, 12,96,000 ఉండే త్రేతాయుగంలో మెల్లగా క్షత్రియులూ తపస్సు ప్రారంభించారనీ, ద్వాపరానికి వైశ్యులూ, కలియుగానికి శూద్రులకి కూడా తపస్సుచేసే స్థితి వస్తుందనీ నారదుడు చెప్పి, త్రేతాయుగంనాటికి క్షత్రియులకి మాత్రమేఉన్న తపోవిధానాన్ని శంబుకుడు ఆచరించడంవల్ల 'దోషం' అని అన్నాడు. అసలు శూద్రులు మాత్రం కృతయుగం లోనే ఎందుకు తపస్సు చేయరాదు? అని వాదిస్తే ఆ వాదం కృతయుగంలోని వారితో చేయవలసి ఉంటుందిగాని కలియుగంలోని మనతో కాదుగదా! ఇక త్రేతలో శంబుకుడు తపస్సు చేస్తే తప్పా? అని వాదిస్తే ఆ విషయం శంబుకుడే ఎందుకు రాముణ్ణి అడగలేదనేదాన్ని ఆలోచించాలి. ఒకప్పుడు బ్రాహ్మణులకే ఉన్న తపస్సుని మెలమెల్లగా యుగయుగాలమార్పులో ఒకరిపిమ్మట మఱొకరూ ప్రారంభించారంటే అందఱూ బ్రాహ్మణత్వానికి పోవాలని ఆలోచిస్తున్నారనే భావించాలి కదా! అందుకే దీన్ని 'అగ్రకులం' అన్నారు. నిష్కారణ ద్వేషమూ ఈ కులం మీదే-అయితే చాలామంది, తాము ఎంచుకున్న లక్ష్యమూ ఈ కులమే.

తపస్సులో మంత్రమననం ఉంటుంది. మంత్రాలలోని వర్ణాలు ఉదాత్తానుదాత్తస్వరితభేదాలకి అనుగుణంగా స్పష్టంగా ఉచ్చరించవలసిన

నియమం మంత్రాలకి ఉంది. లేనిపక్షంలో ఆ మంత్రాలు పట్టునీయవు సరికదా! వ్యతిరేకఫలాన్నిస్తాయనేది మంత్రాన్ని ఉపదేశించిన, మంత్రాలని ఏర్పాటుచేసిన మహర్షులు చెప్పినమాట. ఇక్కడ కూడా ఒక చిత్రమైన వాదం ఉంది. మంత్రాలు పనిచేస్తాయా? అని ఒకరు, మంత్రం పనిచేస్తే చేయవచ్చుగాని తప్పుగాచేస్తే వ్యతిరేకఫలం ఈయడమేమిటని కొందఱు, మంత్రాలకి నియమాలెందుకు? అని మఱికొందఱూ. . .ఇలా అంతా వాదిస్తారు గాని అసలు దీని విషయాన్ని కూలంకషంగా తెలిసికోవాలని ఏ ఒక్కరూరారు.

ఖాళీదొరికినప్పుడు కాలక్షేపానికిచేసే ఈ ఉబుసుపోక వాదాలకి ప్రయోజనం కాలహరణమే. ఇంతకీ ఈ మంత్రమననం ఎవరుచేస్తే బాగుంటుంది? ఫలితాన్ని తొందరగా పొందే అవకాశముంటుంది?' అని ఆలోచించిన దేవతలు స్పష్టమైన ఉచ్చారణమూ, వేదాధ్యయనమూ ఉన్న బ్రాహ్మణులకి అవకాశం ఉంటుందని భావించి వారికి ఈ విధిని అప్పగించారు. అందుకే మాంసభోజనమూ వీరికి నిషిద్ధం అన్నారు. శ్రాద్ధంరోజున మాంసభోజనం అనేది ఒకయుగంలో బ్రాహ్మణులకి ఉండేది. దీనిని 'పలపైతృక విధానం' అంటారు. ఉగాదినాడు వేపపూవుని తిన్నట్లు శాస్త్రంకోసం ఆరోజున అగస్త్యాదిమహర్షులు స్వీకరించినట్లు ఉందిగా: ఆరోజు మాంసప్రాశనమైంది కదా! . . .అని ఇక అదేభోజనంగా ఏర్పాటుచేసికొన్న వారెవరూ కన్పడనే కన్పడరు. ఫలపవనాంబు భోజనశుభ్రవతవృత్తయః - పళ్లూ, గాలీ, నీరూ, ఎండుటాకులూ ఆహారంగా స్వీకరించి వారు తపస్సు చేసారనే మాటని - మాంసభోజనం చేసేవారుగదా! . . .అని వాదించేప్పుడు గుర్తుంచుకోవాలి.

కాబట్టి తపస్సు బ్రాహ్మణవృత్తిగా చేసారు. ఇలా తపస్సు చేసికొంటూంటే జీవనం ఎలాగ? అందుకని వారి తపస్సులో వంతు రాజుకి జమచేసే ఒక నియమం చేసారు. (తప : మక్షయ్యం దదం త్యారణ్యకా హి నః.) ఈ కారణంగా వీరికి కష్టమూ రాకుండా రక్షించాల్సిన బాధ్యత రాజుపై ఉంటుందన్నమాట. వీరికి భిక్షాటనం వృత్తిగా కూడ పెట్టారు. అంతేకాదు. ఎవరికైనా ఏవైనా

గ్రహాలదోషాలుగాని కలిగితే వారినుండి దానాలని స్వీకరించవలసిన బాధ్యత - కర్తవ్యాలని కూడ వీరిపైనే పెట్టారు. 'మేం మాత్రం బ్రాహ్మణులకి ఏం తక్కువ?' అనే వారెవరైనా, లేదా బ్రాహ్మణ ధర్మాన్ని మేమూ పాటిస్తాం - పాటించగలం అనేవారెవరైనా, ఈ దానాలని పట్టడం, భిక్షాటనం మొదలైనవాటి వద్దకి వచ్చేసరికి అదృశ్యమైపోతూంటారు. దానాన్ని పట్టి ఆనందపడడం కాదు చేయవలసినది. ఆదానం పట్టినందుకు ఆ దోషం తొలగేంత గాయత్రీ మంత్రాన్ని పురశ్చరణ చేయాలి.

పోనీ! ఇంత తపస్సు చేస్తున్నాడు గదా! అని ఈ పుణ్యమంతా బ్రాహ్మణునికే చెందుతుందా? అని ఆలోచిస్తే 'గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం - లోకా స్సమస్తా స్సుఖినో భవంతు - కాలే వర్షతు పర్జన్యః - పృథివీ సస్యశాలినీ - అధనా స్సధనా స్సంతు. అపుత్రాః పుత్రిణ స్సంతు పుత్రిణస్సంతు పౌత్రిణః - దేశోఽయం క్షోభరహితః బ్రాహ్మణా స్సంతు నిర్భయాః' ఈలోకం సుఖంగా ఉండుగాక! సకాలంలో వర్షాలు కురిసి, పంటలు పండి, ధనంలేని వారికి ధనంకలిగి, పుత్రులులేనివారికి పుత్రులూ, పుత్రులున్నవారికి మనుమలూ కలిగి దేశంలో అల్లకల్లోలాలు లేక బ్రాహ్మణులు భయంలేనివారై సుఖంగా తపస్సుచేసికొందురుగాక! అని ఈ తపస్సుకి ఫలం చెప్పారు. ఈ మొత్తం తపస్సంతా దేశ - ప్రజా రక్షకోసమే.

అంతటి నిస్స్వార్థపరుడూ - అంతటి ఓపిక కలవాడూ - (ఘాతు ర్న ఘాతకో విప్రః) తన మీదికి ఎవరైనా దౌర్జన్యానికి వచ్చినా ఎదురు తిరగనివాడూ - గోమాతలా సాధులైనవాడూ - ఎవరికైనా గ్రహదోషం కల్గితే వారిదోషాన్ని తానుస్వీకరించే లక్షణం కలవాడూ బ్రాహ్మణుడు. ఇన్ని లక్షణాలున్నవాడు కాబట్టే, అతడికే తపస్సుని వృత్తిగా చేసారు. భీష్ముడు మరణించబోతూ బ్రాహ్మణావమానాన్ని చేయవద్దు - పూజించమని చెప్పాడు. ఇతరుడు దేవాలయ ధ్వజస్తంభం నుండి దైవాన్ని చూస్తే వచ్చే ఫలాన్ని, బ్రాహ్మణుడు గర్భాలయంలోని దైవదర్శనాన్నిచేసి కనీసం ఒక్కమాటైనా వేదమంత్రాన్ని చదివితేగాని రాదన్నారు. ఇదంతా ఎందుకంటే, కష్టం మొత్తం బ్రాహ్మణుని నెత్తిపైనే వేసారు. అదికూడా ఎవరోకాదు. తమకితామే. ఇలా

ధర్మశాస్త్రాన్ని రచించుకునేంతటి అమాయికులూ - నిస్స్వార్థ పరులూను బ్రాహ్మణులు. ప్రస్తుతానికి ఇంతచాలు.

అలాటి బ్రాహ్మణుని పుత్రుని మరణం కదా! అని రాముడు మఱింత కలతపడ్డాడు. తన గురువైన విశ్వామిత్రుడు వశిష్ఠునితో ఎంత పోరాడి పోరాడి బ్రహ్మర్షి కావడానికి ఎంత పట్టుదల పట్టి సాధించాడో ఆ విషయం రామునిముందు కదలాడింది. ఇక శంబుకుని వద్దకు ఏవిధమైన వివరాలూ తెలియకుండానే వెళ్లాడు. యుగంలో మార్పు వచ్చాక ద్వాపరానికి వైశ్యులూ - కలియుగానికి శూద్రులూ తపస్సు చేస్తారని నారదుడన్నాడు. కాబట్టి పూర్వం అనుకున్నట్లుగా అప్పటి నియమాల ప్రకారం, అంటే త్రేతాయుగంలో శంబుకుడు తపస్సు చేయడం ఆనాటి పాలకవిధానాలకి విరుద్ధమైనదే కదా! లోకంలోకూడా, అద్భుత మేధావంతుడే అయినా ఒక పరీక్షకి వెళ్లడానికి తగిన వయో నియమం ఉంటుంది. ఆవయస్సు లేకపోయినా, అతడు పరీక్షలో తప్పక గెలవగలిగినవాడే అయినా కూడా అతనిని పరీక్షకు రానీయకపోవడం నేటినియమాల ప్రకారం ధర్మమే. ఒక వ్యక్తి మఱొకని నుండి అప్పుగా కొంత ద్రవ్యాన్ని స్వీకరించి మూడు సంవత్సరాలకాలం చెల్లించకపోతే అతడు అప్పుని తీర్చనక్కఱలేదనేది నేటి ధర్మశాస్త్రం ప్రకారం సరైందే కదా! మఱి ఇలాంటివన్నీ చూడడానికీ వినడానికీ ఏదోలా అన్పించినా పాలనావిధానంలో చట్టాలైనప్పుడు ఎలా అంగీకరిస్తున్నామో, వాటికి వ్యతిరేకంగా నడిచినప్పుడు ఎలా శిక్షకి అర్హులమౌతున్నామో ఈ శంబుకవధకూడా అలాంటి పాలకవర్గ నిర్ణయానికి వ్యతిరేకంగా చేసిన పనికి తగిన శిక్షయే అనుకోవాలి. **అయితే శంబుకునికి 'శిక్ష' కాకుండా మోక్షాన్ని అనుగ్రహించి రాముడు 'రక్ష' చేసినందుకానందపడ వలసినదిపోయి ఎదురువాదం చేయడం అవగాహనలేని తనమే తప్ప వేఱుకాదు.**

రాముడు శంబుకుణ్ణి చూసిన సందర్భంలో శ్లోకాలని చూడండి. "రాఘవ స్త ముపాగమ్య తప్యంతం తప ఉత్తమమ్- ఉవాచ స తదా వాక్యం ధన్య స్త్వ మసి సువ్రత! కోఽర్థో మనీషిత స్తుభ్యం స్వర్గలాభః పరోఽథ వా? బ్రాహ్మణోవాఽసి భద్రం తే క్షత్రియో వాసి దుర్జయః వైశ్య స్తృతీయవర్ణో వా శూద్రో వా సత్య వాగ్భవ"

ఉత్తమమైన తపస్సుని చేస్తున్న శంబుకుణ్ణి రాముడు చూచాడు. "ఉత్తమ దీక్షాపరుడా! నువ్వు ధన్యుడివి - ఇంతకీ నువ్వు స్వర్గాన్ని కోరుతున్నావా? లేక మోక్షాన్నే యాచిస్తున్నావా? నీకు శుభం జరుగుతుంది. ఇంతకీ నువ్వు బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య - శూద్రులలో ఎవరివో యథార్థంగా చెప్పు" అని రాముడన్నాడని పై శ్లోకాలభావం.

రాముడంతటివాడు శంబుకుణ్ణి చూచి 'ఉత్తమ తపస్సు చేస్తున్నవాడు' అని భావించాడంటే శంబుకునికి అంత కంటె ఏం కావాలి జీవితంలో. సమాధానపత్రాన్ని దిద్దాక ప్రథమశ్రేణి లేదా ద్వితీయశ్రేణి ... అని ఇలా నిర్ణయిస్తారు. కాని సమాధాన పత్రాన్ని చూస్తూనే 'నీకు ఎన్ని అంకాలు (Marks) ఇమ్మంటావు?' అని ఉపాధ్యాయుడు అడిగాడంటే వ్రాసిన అభ్యర్థి ఎంత చక్కగా వ్రాసిఉండి ఉండాలి? మరో విశేషమూ ఉంది. తపస్సు పూర్తి అయ్యాక నీకు స్వర్గం కావాలా? అని రాముడడిగితే, అదో పద్ధతిగా ఉండేదేమో! కానీ తపస్సు ఇంకా చేస్తూన్నప్పుడే రాముడు ఇలా అడుగుతున్నాడంటే శంబుకుడు రాముణ్ణి అంతగా మెప్పించాడని వేరే చెప్పాలా?

త్రేతాయుగంలో శూద్రుడు తపస్సు చేయరాదనే విషయం తెలిసి, నారదుడు చెప్తుగా విని, శంబుకుణ్ణి చూడడానికివచ్చి చూచి 'ఎందుకిలా తపస్సు చేస్తున్నావు! నీకు శిక్ష ఇదిగో!' అంటూ పల్కకుండా, 'నువ్వు ధన్యుడివి!' అంటూ రాముడు పల్కడం ఎంత అదృష్టం! దీనితో శంబుకుడు, గుహుడు - జటాయువు - మొదలైనవారి పంక్తిలోకి వెళ్లిపోయాడు గదా! 'నీ తపశ్శక్తికి స్వర్గంగాని అంతకు మించిన మోక్షంగాని ఈయవచ్చని నిర్ణయించాను. సుఖాలని కోరుకో దలిస్తే స్వర్గాన్ని అడుగు!. పునర్జన్మ వద్దనుకుంటే మోక్షాన్నే కోరుకో!' అని రాముడే శంబుకునికి అవకాశమిచ్చాడు గదా! ఈ అవకాశాన్ని పొందడంలో శంబుకుడు, ఎంతోకాలం రామునిరాకకి ఎదురు చూచిన శబరిని మించిపోతే సంతోషపడవలసిందిపోయి దుఃఖపడడమా?

తనకి అన్యాయం రాముడు చేస్తున్నాడనే ఆలోచన ఏమాత్రమైనా (నేటి మనకి కల్గిన ఆలోచన ప్రకారం) ఆ శంబుకునికే

ఉండి ఉంటే రామునికత్తి తనమీద పడేలోగా 'ఇది అన్యాయం' అని ఒక్కమాట అయినా శంబుకుడు అని ఉండాలిగదా! శంబుకునికి ఆనందంగా ఉంది. దేవతలకి సంతోషమైంది. పుత్రుడు బ్రతికినందుకు బ్రాహ్మణునికి ముదం కల్గింది. 'కందకి లేని దురద కత్తిపీటకి' అన్నట్లు శంబుకునికి ఎందుకు దుఃఖంలేదా? అని మనకి ఈ బాధ పట్టుకుంది.

మరో విషయమూ ఆలోచించాలి. 'శూద్రయోన్యాం ప్రసూతోఽస్మి శంబుకో నామ నామతః - దేవత్వం ప్రార్థయే రామ! స శరీరో మహాయశః' అన్నాడు శంబుకుడు. ( 'రామా! శూద్రుణ్ణి నేను. శంబుకుడు నాపేరు. ఈ దేహంతోనే స్వర్గానికి పోదలిచాను') బాలకాండలో త్రిశంకుడనే రాజుకీ ఇలాంటి ఆలోచనే కల్గింది. వశిష్ఠుణ్ణి అడిగితే ఆపని కుదరదన్నాడు. వశిష్ఠపుత్రులు శపించారు కూడ. వశిష్ఠునిమీది కోపంతో విశ్వామిత్రుడు త్రిశంకుని కోరికని చేపట్టి చివరికి నవ్వులపాలై త్రిశంకుణ్ణి భూమికీ స్వర్గానికీ మధ్యనే ఉంచివేసాడు. కాబట్టి ఒకప్పుడు, క్షత్రియుడు కోరితేనే, రాముని గురువైన - స్వర్గాన్ని సృష్టించ గలిగిన విశ్వామిత్రుడంతటివాడు తీర్చలేకపోతే, విశ్వామిత్రుని శిష్యుడు శంబుకుణ్ణి ఎలా సశరీరంగా స్వర్గానికి పంపించగలడు? అన్నింటికంటే మించి ఇంద్రుడు ఈ విధానానికి వ్యతిరేకి గదా! అసలు సశరీర స్వర్గానికి పోయినవాడు ఎవడూ లేడు గదా! అందుకే రాముడు అతని కోర్కెని గమనించి శరీరాన్ని ఇక్కడే ఉంచివైచి మోక్షసుఖాన్ని కల్గించాడు. దేవతలంతా అదే అన్నారు. 'శంబుకుడు స్వర్గానికి పోక ఇంకా ఉత్తమలోకానికే వెళ్లాడు' అని.

వైశ్యునికి శూద్ర స్త్రీ యందు పుట్టినవానిని 'కరణుడు' అంటారని మనువు చెప్పాడు. దశరథుడు ఒకనాటి అర్ధరాత్రంలో బాణంతో తెలియక వధించినది ఈ కరణజాతికి చెందిన మునిబాలకుణ్ణే. శంబుకునిలానే ఇతడూ తపస్సు చేయదగని కులం, వంశానికి చెందినవాడు కాబట్టి నిజానికి దశరథుడు ఈ బాలకుణ్ణి తెలిసి వధించినా రాజపరిపాలన నియమాల ప్రకారం దోషం కాకపోతోంది. అయినా దశరథుడు చాల విచారించాడు. ఆ మునిబాలకుని తలిదండ్రులు శాపం ఇచ్చారుకూడ. 'ఏవం త్వం పుత్రశోకేన రాజన్ కాలం గమిష్యసి'- (నాలాగే పుత్రశోకంతో

మరణించుదువు గాక!) అని. అప్పటికి పుత్రులు లేని దశరథునికి ఆ శాపం వరంలాటిది అయింది. అంటే ఆ కాలంలో బ్రాహ్మణులే కాక మఱికొందఱూ తపస్సు చేస్తూనే ఉండేవారని అర్థమౌతోంది. నిషాదస్త్రీ శబరికూడా సాక్ష్యమే కదా! అయితే దశరథుడు కేవలం రాజుగానూ, ఈమునిబాలకుణ్ణి శిక్షించాలనీను శిక్షించి చంపలేదు. అయితే రాముని పుట్టుకకి అవకాశమిచ్చిన ఆ మునిబాలకుడు మోక్షాన్ని పొందకుండా ఉంటాడా? రాజు మాత్రమే అయిన దశరరథుని చేతిలో వధింపబడి దశరథునికి సంతానాన్ని కల్గించి, తనకి మోక్షాన్ని తెచ్చుకొన్నవాడు ముని బాలకుడైతే, రాజూ - భగవంతుడూ అయిన రాముని చేతిలో వధింపబడి తనకు మోక్షాన్ని మాత్రం తెచ్చుకున్నవాడు శంబుకుడు. మోక్షాన్ని తెచ్చుకున్న శంబుకుడు, అందుకు ప్రతిఫలంగా రామునికి మాత్రం, తనని వధించాడనే అపకీర్తిని కట్టబెట్టడం చేస్తాడా? కాబట్టి శంబుకవధ న్యాయమే!

చివరగా ఒక్కమాట. భూతభవిష్యద్వర్తమానాలు మూడూ తెలిసినవాడు వాల్మీకి మహర్షి గదా! ఈ శంబుకవృత్తాంతం మీద ఇంత దుమారం చెలరేగుతుందని ఆయనకు తెలియదా? 'అనవసరమైన ఈ వివాదం రేపే ఈ ఘట్టాన్ని శ్రీమద్రామాయణంలో వ్రాయకపోతే సరిగదా!' అని ఆయన ఎందుకనుకోకుండా వ్రాసి ఉంటారు? కారణం ఒకటే - దానిలో ఎవరినీ కించపఱిచే సంఘటనలేక శూద్రునికి కూడా మోక్షం ఇచ్చిన సంఘటన ఉందని సంతోషిస్తారని. ఈ విషయం అవగాహనకాక దుఃఖపడితే మన తెలివితక్కువతనానికి నిజంగా దుఃఖిస్తాడు మహర్షి. కంచికామకోటి పరమాచార్యులవారు ఒకసారి సెలవిచ్చారు. 'రాముడు, క్షత్రియధర్మం ప్రకారం రాజుగా అతని తలని నఱికాడు. శ్రీమహావిష్ణువుగా అతనికి మోక్షాన్నిచ్చాడు. తన భార్యని ఎత్తుకుపోయిన రావణునికి కూడా తనని తాను రక్షించుకొనేందుకు ఎన్నో అవకాశాలనీ - గడువులనీ ఇచ్చిన దయామూర్తి అయిన రాముడు, నిరాయుధుణ్ణి చంపడం రాజధర్మం కాదని తెలిసిన రాముడు, శంబుకుణ్ణి చంపినట్లెందుకౌతుంది? మోక్షానికి పంపించడానికే అలా చేసాడు' రాజైన తాను మఱొకరిచేత చంపించక తానే చంపడంలోని రహస్యమూ ఇదే' అని.

## ఎప్పుడూ దానం చేయలేదు గదా! నీ గతి యింతే!!

శంబుకవధచేసిన పిమ్మట రాముడు, త్రోవలో ఉన్న అగస్త్యుని
ఆశ్రమాన్ని సందర్శించాడు. ఆయన ఎంతో ఆనందపడి తనవద్ద ఉన్న
ఒక దివ్యాభరణాన్ని రామునికీయబోయాడు. క్షత్రియుడు ప్రతిగ్రహణ
యోగ్యుడు (దానం తీసికొనేవాడు) కాదని రాముడు వలదన్నాడు.
అగస్త్యుడు రామునితో 'రామా! క్షత్రియోచితమైన మాటే మాట్లాడావు.
ఒకప్పుడు రాజులేని కాలంలో బ్రహ్మ దిక్పాలురు నలుగురినీ తమతమ
ఒక్కొక్క అంశాన్ని ఈయవలసిందిగా ప్రార్థించి వాటితో రాజుని
సృష్టించాడు. కాబట్టి నీలో ఇంద్ర- యమ- వరుణ-
కుబేరాంశలున్నాయి. ఇంద్రాంశతో నన్ను తరింపజేయడానికి దీన్ని
స్వీకరించు' అనగానే న (ప్రతిగృహ్ణీష్వ భద్రం తే తారణార్థం మమ
ప్రభో! తద్రామః ప్రతిజగ్రాహ మునే రాభరణం వరమ్) రాముడు
స్వీకరించాడు.

రాముడు తీసికొన్నాక అగస్త్యుడు ఆ ఆభరణం తనకు
లభించిన విధాన్ని ఇలా చెప్పాడు. 'ఒకప్పుడు సుదేవుడనే పేరున్న
రాజు విదర్భని పాలిస్తూ ఉండేవాడు. ఆయనకి శ్వేతుడు పుట్టాడు. ఆ
శ్వేతుడు తన తమ్ముడు సురథునికి రాజ్యాన్నిచ్చి బహుకాలం తపస్సు
చేసి బ్రహ్మలోకాన్ని పొందాడు. అయితే బ్రహ్మలోకానికి పోయినా
అతనికి ఆకలి దప్పులబాధ పోలేదు. బ్రహ్మను కారణం అడిగితే 'శ్వేతా!
చక్కగా సంపాదించుకొని, నీ కడుపు నిండేలా తృప్తిగా తిన్నావు తప్ప
'దానం' అనే మాట జోలికి కూడా నువ్వు పోయి ఉండలేదు. నీ
దేహంమీదే నీకు మంచి అభిమానం ఉంది కాబట్టి నీ శరీరాన్నే నీకు
నువ్వు తింటే తప్ప ఆ ఆకలి తొలగదు. (స త్వం సుపుష్ట మాహారైః
స్వశరీర మనుత్తమం। భక్షయిత్వా మృతరసం తేన తృప్తి ర్భవిష్యతి।।)'
అన్నాడు.

అప్పటినుండీ శ్వేతుడు ఒక కొలని దగ్గఱ ఆశ్రమంలోని
ఉంటూ ఆకలివేసిన ప్రతిపర్యాయమూ బాగా వాచిన పీనుగుని (తన
శరీరాన్నే) తాను తింటూ ఉండిపోయాడు. ఏ రోజూ తిని ఆ
మఱునాటికి చూచేసరికి మళ్లీ అంతకు ఎక్కువ శరీరం పెరుగుతు

ఉంటుంది! ఈ బాధపడలేని శ్వేతుడు ఈ దివ్యాభరణాన్ని నాకిచ్చి తన బాధ తొలగించమనగా నేనా ఆభరణాన్ని స్వీకరించాను. నేను తరించడం కోసం నీకిచ్చాను' అన్నాడు అగస్త్యుడు.

రాముడు చేయవలసిన పనులలో ఈ శ్వేతుణ్ణి అనుగ్రహించడం కూడ ఉండడంబట్టే రాముడు ఈ త్రోవన వచ్చాడని భావించాలి. మహర్షులు తమ తపఃఫలాన్ని ధారపోస్తా మనగానే 'అహమేవాహరిష్యామి స్వయం లోకాన్ మహామునే! ' 'ఓ మునీ! ఆలోకాలని నేనే ధనుస్సుతో తెచ్చుకుంటాను గదా!' అని అన్న అప్పటి రాముడు, నేడు దివ్యాభరణాన్ని గ్రహించడం శ్వేతుణ్ణి తరింపజేయడానికే. సందేహం లేదు. దానం చేయకపోవడం బట్టి శ్వేతునికి ఈ పీనుగు (శవం) రూపం లభించడం ఎంత నికృష్టమో గమనించగలగాలి.

దానవిషయంలో ఇక్ష్వాకు రాజులని చెప్పుకోక తప్పదు. ఎవరి కడుపుకి వారూ, ఇక కన్నవారు ఎవరో వారూ, సుఖంగా భుజిస్తారు. కాని దానం చేయవచ్చేసరికి ఎవరికీ ప్రాణం ఒప్పదు. ధనానికి అనుభవించడం, నాశనంకావడం, దొంగలపాలు చేయడం అనే మూడు దశలున్నాయి. సత్పురుషుడు 'పైజన్మలో ఎక్కడ దరిద్రునిగా పుడతానో' అనే భయంతో దానం చేస్తాడుట. మూర్ఖుడు తానెక్కడ దానాలనిచేసి చేసి దరిద్రుడినైపోతానో అని దానం చేయడుట. (మూర్ఖో న హి దదా త్యర్థం నరో దారిద్ర్యశంకయా - ప్రాజ్ఞ స్తు వితర త్యర్థం నరో దారిద్ర్య శంకయా॥) అశ్వమేధయాగాన్ని చేసి అనేక దానాలనీ చేసి దానాలన్నీ అయిపోయాయన్నాక కూడా ఎవరోవచ్చి దశరథుణ్ణి దానం అడిగారుట. (కస్మైచి ద్యాచమానాయ హస్త మాభరణం దదౌ ) 'ఇప్పుడెలాగ?' అని విసుగుకోకుండా చేతినున్న దివ్యాభరణాన్ని తీసి ఇచ్చాడుట దశరథుడు.

విశ్వజిత్తనే పేరున్న యాగాన్ని చేసి మట్టికుండతో రఘుమహారాజు మిగిలినప్పుడు, కౌత్సుడనే ఒక వరతంతు మహర్షిగారి శిష్యుడు 14 కోట్ల నాణాలని రఘువు నుండి దానంగా తీసికొని తన గురుదక్షిణని చెల్లించుకోగలిగాడు. అరణ్యాలకి పోబోతూన్న రాముడెన్ని యెన్ని దానాలని చేసాడో లెక్కలేదు. చాలు చాలంటూ, తీసికోడానికి

వ్యక్తులే ఇక లేకపోయారట! అంతటి దానపరుడు రాముడు. ఎవరి పోషణని వారు చేసికోవడమే, దానికోసం అహర్నిశలూ శ్రమపడుతూండడమే ఈ 'శరీర కర్తవ్యం' అని భావిస్తే, ఆపనిని కుక్క- ఇంకా అంతకంటె హీనజాతులూ ఎన్నో చేస్తూనే ఉన్నాయి. అవన్నీ కూడ తమతమ శరీరాలని గూర్చిన ఆత్మరక్షణలో అతి జాగ్రత్తగానే ఉంటాయి గదా! అయితే వాటికీ మఱి మనుష్యులకీ భేదం ఏముంది? ఉండితీరాలి సుమా!

తాను (అగస్త్యుడు) శ్వేతుని ప్రార్థనపై ఆ ఆభరణాన్ని గ్రహిస్తూ న్నంతలోనే శ్వేతుడు రోజూ తింటూండే పీనుగు పూర్తిగా కన్పించకుండా పోయిందని రామునితో చెప్పాడు అగస్త్యుడు. కాబట్టి దానం చేయడం వలన పూర్వజన్మకి విష్కృతి కూడా కల్గవచ్చన్న మాట. ఈ సందర్భంలోనే అగస్త్యుడు దండకారణ్యం ఏర్పడిన విధంకూడ చెప్పాడు.

మనువుకి పుత్రుడైన ఇక్ష్వాకు మహారాజుకి పుట్టిన నూఱుగురు పిల్లల లోనూ చివరివాడు దండుడు. మిగిలిన వారంతా ధర్మపరులైతే ఇతడొక్కడే నీతిలేక ఉన్నాడు. ఇలాంటి గర్విష్ఠి ఎవరి వలనో దండితుడౌతాడని గమనించి వానికి 'దండుడు' అనే పేరుని తండ్రి పెట్టాడు. దుర్మార్గుడైన దండుడు శుక్రాచార్యుని కూతురు 'అరజ' కన్యాత్వాన్ని భంగం చేసిన కారణంగా శుక్రుడు దండుణ్ణీ అతని దేశాన్నీ శపించాడు. ఫలితంగా దండుడు తనవారితో మాడి మసి అయిపోయాడు. అతని దేశంలో 7 రోజులపాటు దుమ్ము వానగా కురిసి (మట్టివాన) దేశం ఎందుకూ ప్రయోజనం లేకుండా పోయింది. ఆ నాటి నుండే 'దండక' అనే పేరు వాడుకలోకి వచ్చింది. ఎవరూరాని ఆ చోటు తపస్సుకి అనుకూలం కదా! అనే భావనతో మహర్షులు వచ్చి తపస్సులు ప్రారంభిస్తే ఇది 'జనస్థానం' (మహర్షి జన నివాసస్థానం) అయింది. (సమంతా ద్యోజనశతం విషయం చాస్య దుర్మతేః। ధక్ష్యతే పాంసువర్షేణ మహతా పాకశాసనః ।।)

అయోధ్య నుండి బయలుదేరి సీతారామలక్ష్మణులు చేరినది ఇక్కడికే. ఆ దండక పూర్వకథ ఎక్కడ దొరుకుతుంది? అంటే దానికి ఉత్తరం (సమాధానం) ఈ కాండలో ఉంటుంది. ఇక్కడ మహర్షులు

ఎక్కువగా ఉండడంతో ఇక్కడే రాక్షసుల బలగాలని ఎక్కువచేసి ఎందఱో మహర్షులని వధించి 'జనస్థానం' రాక్షసులకి ఆటపట్టు (రాక్షస జనస్థానం) అనే వాడుక వచ్చేలా రావణుడు చేసాడు. ఆ జనస్థానానికే రాముడు వచ్చి ఖరదూషణ త్రిశిరవధని చేసాడు. ఒక దృష్టితో ఆలోచిస్తే ఒక గ్రంథం వెనుక వేయబడిన టిప్పణి ( Glossary) వంటిది శ్రీమద్రామాయణానికి ఉత్తరకాండం.

అగస్త్యునివద్ద సెలవుతీసికొని అయోధ్యకు వచ్చి రాజసూయం చేద్దామనే కోరికని వెలిబుచ్చాడు రాముడు. అవతారం ముగింపుకి రాబోతోంది కాబట్టీ, ముందు నాటికి భరతుని రాజఱికంలో కుశీలవుల యౌవరాజ్యం సాగబోతోంది కాబట్టీ, రాజ్యాన్ని నిష్కంటకం (దుర్మార్గ రాజులు లేకుండా చేయడం చేయాలి కాబట్టి, 'రాజసూయాన్ని చేద్దాం' అన్నాడు. విషయాన్ని గ్రహించిన భరతుడు 'రాజులవధ మాత్రమే ప్రధాన లక్ష్యంగా ఉండే రాజసూయం వలదు' అని సూచించాడు. రామచంద్రుడు సరేనని అంగీకరించాడు. అన్న చెప్పినది వినడమే లక్ష్యంగా ఉన్న భరతుడు 'వద్దని' సూచించడానికీ, రాముడు కూడా భరతునిగూర్చి అన్యథా ఆలోచించక పోవడానికీ కారణం ఒకటే. ముందునాటికి రాజఱికం భరతునిదే. అతడే చూచుకోవాలి రాజ్యపు బాగోగులని.

ఎంతకాలమూ తాను మాత్రమే సూచిస్తూంటే అతని పరిపాలనం ఇక ఎప్పుడు? అతనికతడు నిర్ణయాన్ని తీసికొనే అవకాశాన్నీయాలనీ, తిరిగి అతని రాజఱికపు ముగింపులో అతడు (భరతుడే) కుశీలవులకి కూడా ఈ విధానాన్నినేర్పి వారిద్దఱినీ ప్రయోజకులని చేయాలని కూడా రాముని భావమన్న మాట. 'భరతా! లోకానికి కష్టాన్ని కల్గించే ఏ పనినైనా రాజు చేయరాదు కదా! మంచిమాట అయినట్లైతే బాలుడు చెప్పినదానినైనా (వయసు-అనుభవం చేత చిన్నవాడు) వినాలి కాబట్టి నీ మాట తప్పక ంటున్నాను' అని రాముడు అనిన మాటలని గమనించాలి. ోకపీడాకరం కర్మ న కర్తవ్యం విచక్షణైః। బాలానాం తు శుభం లాక్యం గ్రాహ్యం లక్ష్మణపూర్వజ! తస్మా చ్ఛృణోమి తే వాక్యం సాధు యుక్తం మహామతే!)

ఇక్కడ కూడా అంతే. ఇక రావణుడు బ్రహ్మరాక్షసుడనే వాదం ఒకటుంది. అది సరికాదు. (చూ. నా సుందరకాండ వ్యాఖ్య పుట 169) అవివాహితయైన క్షత్రియస్త్రీ కైకసి యందు బ్రాహ్మణుడైన విశ్రవసునికి జన్మించిన రావణుడు తల్లి జాతి ప్రకారం క్షత్రియుడే అవుతాడని మనువు తీర్మానించాడు. వ్యాసునికి శూద్రస్త్రీయందు పుట్టిన విదురుడు, తల్లిజాతి ప్రకారం శూద్రుడే అయ్యాడుగదా! ఆవిధంగా రావణుడు క్షత్రియుడు కాబట్టి పరిపాలనం అతనికి విధ్యుక్త ధర్మమే. అతణ్ణి వధించడంలో దేవ - పతివ్రత - ఋషి విరోధం అనేది ఏదికారణమో ఆ కారణాలలో దైవ విరోధం ప్రధానంగా కారణం. ఈ వధ అధర్మబద్ధమైతే మహావిష్ణువు ఎలా అంగీకరిస్తాడు? కాబట్టి ధర్మబద్ధమే.

వృత్రుని వధించదలచిన విష్ణువు తన తేజస్సుని ఇంద్రునిలోనికీ, వజ్రాయుధంలోనికీ, భూమిలోనికీ ప్రసరింపచేసాడు. ఆ విష్ణుశక్తితో ఇంద్రుడు వృత్రుణ్ణి వధించాడు. బ్రాహ్మణుణ్ణి వధించిన కారణంగా ఇంద్రునికి బ్రహ్మహత్యాదోషం వెంటపడింది. దాన్ని తొలగించుకొనేందుకై అశ్వమేధ యాగాన్ని చేసాడు ఇంద్రుడు. దేవతలంతా ఒక తీర్మానాన్నిచేసి బ్రహ్మహత్య 4 భాగాలు కావాలని నిర్ణయించేసి ఒక భాగం ఆషాఢ శ్రావణమాసాలలో క్రొత్తగావచ్చే మహానదీ జలాలలో, రెండవ భాగం భూమి (చవుడు నేల) లోనూ, మూడవభాగం ఋతుక్రమం కలిగే ఆ మూడురోజులూ స్త్రీలయందూ, నాల్గవ భాగం అపనిందలను బ్రాహ్మణులపై వేసి వారిని అపకీర్తిపాలుచేసే వారియందూ ఉండవలసినదిగా పల్కారు. గమనించిచూస్తే ఈనాలుగూ వ్యక్తి క్షేమాన్ని కోరి ఏర్పాటు చేసినవే తప్ప వేఱుకాదు.

క్రొత్తగావచ్చే నదీజలాలు అశుభ్రాలై సర్వవ్యాధులకీ ఆలవాలాలు కాబట్టి నిషేధించారు. చవుడునేల సేద్యానికీ, గృహనిర్మాణానికీ, నూతుల త్రవ్వకానికీ, కనీసం మెరక చేయడానికై మట్టి పోతకీ కూడా పనిచేయదు కాబట్టి నిషేధించారు. ఇక స్త్రీల ఋతుకాల విషయం. పశువులు కూడా ఒక కాలనియమం కలిగి సంగమిస్తాయి. కేవలం కామం కోసమే జీవించే వారిలా ఋతుకాలం మూడు నాళ్లూ కూడ సంగమిస్తే వ్యాధులు తప్పక కలిగి తీరుతాయి.

అదేదో ఉత్తమ కాముకుని లక్షణంగా భావించి పిచ్చిపత్రికల సూచనలపై (డబ్బు చేసికోవడం కోసం వ్రాసే వ్రాతలని గమనింపక) నమ్మి సంగమిస్తే, ఆ మొదికాలంలో దంపతులకి వచ్చే వ్యాధులకి బాధ్యుడెవరు? మలవిసర్జనంచేస్తూ అన్నం తింటే ఎంతో, ఈ కాలంలో సంగమించడం కూడా అలాంటిదే. అయితే అందుకే నిషేధించారు. ఇప్పటికీ ఆమూడు రోజులూ గృహిణిని ఇంట్లోని ఏవస్తువునీ తాకనీయక పోవడం మా యిళ్లలో సాగుతూనే ఉండడానికి కారణం సంప్రదాయ పరిపాలనమూ, అశుచి అనే ఆలోచనమూ - గృహిణికి పని పాటలలో కవీసపు విశ్రాంతిని ఆ నాల్గురోజులైనా ఇయ్యాలని భావించడమూను. ఇక తపశ్శక్తితో ఏ బ్రాహ్మణుని వలన ఆశీస్సులని పొందవలసి ఉందో వానిపై నిందలని వేసి వారిని అపకీర్తిపాలు చేయడం ఆత్మహాని అవుతుంది కాబట్టి, దీన్ని నిషేధించారని గమనించాలి.

ఇంద్రుడంతటి వానికి బ్రహ్మహత్యాదోషాన్ని తొలగించిన అశ్వమేధ యాగాన్ని చేయడం సరైనదని లక్ష్మణుడు పల్కాడు. రామచంద్రుడు విని పరమానందపడి ఒకప్పుడు ఇలుడనే రాజు కుమారస్వామి పుట్టిన వనానికి వెళ్లి స్త్రీగా మారిపోయి, చంద్రుని పుత్రుడైన బుధుని వలన పురూరవుణ్ణి కని, బుధుడు చేసిన అశ్వమేధ కారణంగా తిరిగి తన పురుషరూపాన్ని పొందాడని తానొక వృత్తాంతాన్ని చెప్పాడు.

ఇంతకు పూర్వం చెప్పుకున్న వృత్రాసురుని కథా, ఈ అశ్వమేధ కథా కూడ బాలకాండలో జరిగిన వృత్తాంతానికి ఉత్తరాలే (సమాధానాలే). విశ్వామిత్రుడు రామలక్ష్మణులకి మలద - కరూశదేశాల పుట్టుకని గూర్చి చెప్తూ వృత్రాసుర వధని చెప్పాడు. ఆ కథకి ఈ వృత్రకథని చేర్చుకోవాలి. అంతేకాదు. అయోధ్యాకాండలో కూడ రాముడు సీతాలక్ష్మణసమేతుడై అరణ్యానికి వెళ్తున్నప్పుడు కౌసల్యామాత చాలసేపు రోదించి చివరికి దీవించింది. వానిలో ఒక దీవన ఇది.

యన్మంగలం సహస్రాక్షే ఘ్నుతో వజ్రధరస్య యత్।

"వృత్రనాశే సమభవత్ తత్తే భవతు మంగలమ్॥" అనేది. దేవతల తల్లి అయిన అదితి, వృత్రుణ్ణి చంపడానికి వెడుతూన్న ఇంద్రునికి ఏవిధమైన మంగళపూర్వకమైన ఆశీస్సు నిచ్చిందో ఆ ఆశీస్సు నీకు మంగళాన్ని కల్గించుగాక! అని దీని అర్థం. ఇక్కడ కూడా వృత్రాసురవధని గూర్చిన విశేషం కావాలంటే ఉత్తరాన్నిచ్చేది ఇదే కాబట్టి, ప్రస్తుతకాండ 'ఉత్తరకాండ'.

ఇక అశ్వమేధయాగం చేయవలసిందిగా దశరథునికి సుమంత్రుడు రహస్యంగా చెప్పడం, సనత్కుమారుల వారి వార్తలసమాచారం, అశ్వమేధయాగ విశేషాలూ - ఏలాచేయాలి? వంటివి బాలకాండలో కన్పిస్తాయి (చూ. బాలకాండ వ్యాఖ్య). అక్కడ అశ్వమేధ యాగం వలన ఫలితాలని గూడ తెలిసికోవాలంటే ఈ ఉత్తరకాండలోని కథని తెలిసికోవాలన్నమాట. ఈ బాలకాండలో ఏ సందర్భం వచ్చిందో, ఆ సందర్భంలోనే ఈ ఉత్తరకాండలో కన్పించే ఆ సంఘటనకు సంబంధించిన వివరాన్ని కూడ వ్రాసి ఉండవచ్చు గదా! అని మనకి అనుమానం ఇప్పుడు ఏర్పడవచ్చు. కాని వాల్మీకి మహర్షికి ఈ ఆలోచన వచ్చి ఉండదా? ఈ ఆలోచన రాకనే ఆయన వ్రాసి ఉండలేదా?

అలా వ్రాయకపోవడానికి కారణం ఒకటే. అయోధ్యలో రాముడు వెళ్లే సందర్భంలో ఆమె దీవించినప్పుడు ఆ వృత్రాసురుని కథని వాల్మీకి చెప్తూ కూర్చుంటే కథాగతికి భంగం కలుగుతుంది. ఔచిత్యం దెబ్బతింటుంది. పైగా ఈ వృత్రాసురకథ మనకి తెలియదని వాల్మీకి చెప్పవలసి వస్తోందిగాని, అక్కడి వారందఱూ ఈ కథని తెలియక ఉన్నారా? లక్ష్మణుడు రామునికీ, భరతుడు రామచంద్రునికీ ఈ కథలని ఉత్తరకాండలో చెప్తూ ఉండడం వారిలో వారికి తెలియని కథలని ఒకరికొకరు చెప్పుకుంటూ కాలక్షేపం చేయడానికా? సీతమ్మ ఎలాగూ అరణ్యాలలో ఉంది కాబట్టి ఈ తీరికలో ఇలా కాలక్షేపం చేస్తే బాగుంటుందని, వారు చెప్పుకొంటున్న కథలు కానేకావు. శ్రీమద్రామాయణంలో. ఏ అనుమానమూ ఎవరికీ తలెత్తరాదనీ - లోకలోకాలా ప్రచారమై ప్రజలంతా తరించాలనిన్నీ వారి భావం. అందుకే పురాణేతిహాసాలని చదివేటప్పుడు 'స్పష్టమగ్రే భవిష్యతి' -

(అనుమానం వస్తే అది మూడి గ్రంథంలోకి వెళ్లి చదివితే తొలగిపోతుందనేది ఇందుకే)అని అంటారు.

## అశ్వమేధ యాగం - కుశీలవ గానం

వేదోక్తంగా నైమిశారణ్యంలో అశ్వమేధ యాగం ప్రారంభమైంది. (యాగవిధానానికి చూ.నా బాలకాండ వ్యాఖ్య పుట 30). అందరి ముఖాలలోనూ ఆనందం తరంగిత మౌతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే- "న శక్రస్య ధనేశస్య యమస్య వరుణస్య వా - ఈదృశో దృష్టపూర్వో న ఏవ మూచు స్తపోధనాః- ఈదృశో రాజసింహస్య యజ్ఞః సర్వగుణాన్వితః "- ఇంద్రుడు - కుబేరుడు - యముడు - వరుణుడు చేసిన యాగాలని చూచాం గాని ఈ యాగంతో ఏవీ సాటిరావని మహర్షులంతా ఏకకంఠంగా పలికారు. ఆ యాగానికి వచ్చిన మహర్షులంతా ఉండే ప్రదేశానికి సమీపంలో పర్ణశాలలో వాల్మీకి మహర్షి ఉన్నాడు.

ఆయన తన కుశీలవులని పిలిచి 'నాయనలారా! మన శ్రీమద్రామాయణాన్ని బ్రాహ్మణులుండే చోటుల్లో, మునులకి వినిపించేలా, రాజ ప్రాసాదాలవద్దా, యజ్ఞవాటికల్లో, నాలుగు మార్గాల కూడళ్లలో శ్రావ్యంగా విన్పించండి. చిన్న పసివాళ్లయిన మీ కంఠాలు ఒఱుసుకు పోకుండా తియ్యని చెట్ల పండ్లని తిని మరీ పాడండి. ధనం మీద ఆశ ఏమాత్రమూ లేక రోజుకి ఇరవైసర్గల వంతున పాడండి. మీ తండ్రి ఎవరని రామచంద్రుడు అడిగితే వాల్మీకి శిష్యులమని జంకులేక చెప్పండి. రేపటినుండే పాడండి!' అంటూ ఆశీర్వదించి పంపాడు. (కృత్స్నం రామాయణం కావ్యం గాయేథాం పరయా ముదా। ఇమాని చ ఫలా న్యత్ర స్వాదూని వివిధాని చ।। జాతాని పర్వతాగ్రేషు చాస్వాద్యాస్వాద్య గాయతామ్। దివసే వింశతి స్సర్గా గేయా మధురయా గిరా।। లోభ శ్చాపి న కర్తవ్యః స్వల్పోఽపి ధనకాంక్షయా। యది పృచ్ఛేత, కాకుత్స్థో యువాం కస్యేతి దారకా। ఆవాం వాల్మీకి శిష్యౌ స్వో బ్రూత మేవం నరాధిపమ్।।)

కుశీలవులు పరమానందంతో యజ్ఞవాటికకి వెళ్లారు. ఒకే విధమైన ముఖాలు. తలపై నారతో కట్టిన జడలు. విశాలమైన

నుదురులు. శ్రీకారాల వంటి చెవులు. పాండిత్యం వెదజల్లుతూన్న ఆ ముఖాలలోని తేజస్సు నేరుగా రామచంద్రుణ్ణి సానందంగా స్పృశిస్తోంది. కంఠాలలో అక్షమాలలు. చేతిలో చిడతలు. మెడలలో వీణెలు. ఒకచేయి మీటుతూ ఉంటే, వేఱొకచేయి చిడతతో సంగీతానికి అనువుగా ధ్వనిస్తూంటే మొదటసారిగా రామకథ, పరమ పవిత్రమైన నైమిశంలో, రామభక్తుల సమక్షంలో, రామపుత్రులైన కుశీలవుల కంఠాల నుండి ఒక్కమాఱుగా వెలివడి శరీరాలని గగుర్పొడిచేలా శ్రావ్యధ్వనితో విన్పించాయి. రాముడు శరీరాన్ని మఱచి విన్నాడు.

ఆ ఆనందాన్ని తానొక్కడే పొందరాదని నిశ్చయించుకున్నాడు. పురాణపండితులనీ, వ్యాకరణ శాస్త్రజ్ఞులనీ, కావ్యచ్ఛందో విశేషాలని బాగా ఎఱిగినవారినీ, అష్టాదశ భాషాపండితులనీ, వేదాంత మర్మజ్ఞులనీ.... ఇలా అందఱినీ పిలిచి వారి సమక్షంలో విన్పించాడు. (న చ తృప్తింయ యు స్సర్వే శ్రోతారో గాన సంపదా। జటిలౌ యది న స్యాతాం న వల్కలధరౌ యది విశేషం నాధిగచ్ఛామో గాయతో రాఘవస్య చ ) 'జటావల్కలాలు విడిచినట్లయితే ఇక్కడి ఒకే ఒక్క రాముడు, అక్కడ కుశలవులలో ఇద్దఱుగా ఉన్నట్లు అనుకోవచ్చు' అని సభాసదులంతా అనుకున్నారు. 'అద్దంలో ఉన్నట్లు ఈ ముగ్గురూ (రామ కుశలవులు) ఒకరిని పోలి మఱొకరున్నారు. (ఉభౌ రామస్య సదృశౌ బింబా ద్బింబ మివోత్థితౌ।। ) అని కూడ పైకి అన్నారు సభ్యులు.

మొదటి రోజున మొదటి 20 సర్గల శ్రీమద్రామాయణాన్ని విని 18000 బంగారు నాణెములచొప్పున ఈయవలసిందని తమ్ముళ్లకి ఆజ్ఞనీయగానే (వన్యేన ఫలమూలేన నిరతౌ వనవాసినౌ - సువర్ణేన హిరణ్యేన కిం కరిష్యావహే వనే?) అడవిలో ఉండే మేం ఈ ధనంతో ఏం చేస్తాం? వద్దు - అని వారన్నారు.

శ్రీమద్రామాయణ కావ్యాన్ని గూర్చిన వివరాలని రాముడడిగితే వారు చెప్పారు. 'దీని కర్త వాల్మీకి. ఇది 24వేల శ్లోకాల గ్రంథం. ఇందులో ఇలోపాఖ్యానం (ఇలుని కథ) వఱకూ నూఱు ఉపాఖ్యానాలు. 500 సర్గాలు. ఆఱుకాండలూ ఆ మీద ఒక కాండా కలిపి 7 కాండల గంథాన్ని మా గురువైన భార్గవులు (వాల్మీకి ఈ పేరులోని విశేషంకోసం నా బాలకాండ వ్యాఖ్య పుట 3 ) వ్రాసారు. దీనిలో నీ నడవడి

www.mohanpublications.com

# మోహన్ పబ్లికేషన్స్‌లో లభించు
# పుస్తకముల పట్టిక
## (Book List)

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆయుర్వేద, మంత్రశాస్త్రాది
అనేక విషయాలు తెలుసుకోండి...

ఫేస్‌బుక్ **మోహన్ పబ్లికేషన్స్** పేజ్ లైక్ చేయండి.

Like us to follow :
**MOHAN PUBLICATIONS**
Rajamahendravaram



0883 - 246 2565
903 246 2565

MOHAN PUBLICATIONS

# మోహన్ పబ్లికేషన్స్

అజంతా హోటల్ ఎదుట, కోటగుమ్మం, రాజమహేంద్రవరం - 533101.

WWW.MOHANPUBLICATIONS.COM

## మావద్ద లభించు గ్రంథములు

### 1. వ్రతకథలు - పూజలు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ వినాయక వ్రతం | వెల రూ.10-00 |
| 2. | శ్రీ విఘ్నేశ్వరపూజా-పుణ్యాహవాచనం | 30-00 |
| 3. | శ్రీ విఘ్నేశ్వరపూజ (కాణిపాకక్షేత్రమాహాత్మ్యంతో) | 10-00 |
| 4. | సంకష్టహరచతుర్థి శ్రీమహాగణపతి వ్రతం | 30-00 |
| 5. | వరలక్ష్మీ వ్రతం | 10-00 |
| 6. | కేదారేశ్వర వ్రతం | 10-00 |
| 7. | త్రినాథ వ్రతం(కలర్) | 10-00 |
| 8. | త్రినాథవ్రతం(సాదా) | 5-00 |
| 9. | క్షీరాబ్ధి వ్రతం | 12-00 |
| 10. | మంగళ గౌరీవ్రతం | 10-00 |
| 11. | వైభవలక్ష్మీ వ్రతం ఫోటో యంత్రంతో | 25-00 |
| 12. | శ్రీలక్ష్మీ కుబేర వ్రతం (ఫోటో యంత్రంతో) | 25-00 |
| 13. | కనకమహాలక్ష్మీ వ్రతం (కామేశ్వరీపాటతో) | 25-00 |
| 14. | సంతోషీమాతా వ్రతం | 25-00 |
| 15. | ఏడు శనివారాల వ్రతం | 25-00 |
| 16. | సత్యనారాయణవ్రతం | 25-00 |
| 17. | శ్రీ సువర్చలాహనుమద్దీక్ష | 30-00 |
| 18. | శివదీక్ష | 10-00 |
| 19. | కాత్యాయనీ వ్రతం | 20-00 |
| 20. | సౌభాగ్య గౌరీవ్రతం | 20-00 |
| 21. | తిరుప్పావై (ధనుర్మాసవ్రతం) | 36-00 |
| 22. | స్త్రీల వ్రతకథలు | 36-00 |
| 23. | స్త్రీలవ్రతకథలుస్థూలాక్షరి (నేదునూరిగంగాధరరావుగారి) | 54-00 |
| 24. | పెళ్ళి పాటలు - స్త్రీలపాటలు (కామేశ్వరిపాటతో) | 36-00 |
| 25. | సర్వదేవతా పూజావిధానం | 25-00 |
| 26. | ఆరువ్రతాలు | 30-00 |
| 27. | రాహుకాలంలోదుర్గాదేవీపూజా | 10-00 |

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

| | | |
|---|---|---|
| 28. | తులసి నిత్యపూజ, తులసీఉపయోగాలు | 10-00 |
| 29. | శ్రీ చక్ర రహస్య విజ్ఞానమ్ | 36-00 |
| 30. | శ్రీచక్ర పూజావిధానం(పెద్దది) | 36-00 |
| 31. | లక్ష్మి - గౌరీ నిత్యపూజ | 10-00 |
| 32. | శ్రీ సరస్వతీ నిత్యపూజ | 10-00 |
| 33. | శ్రీ దుర్గానిత్యపూజ | 10-00 |
| 34. | కాలభైరవ నిత్యపూజ | 10-00 |
| 35. | శివపూజ | 10-00 |
| 36. | వీరభద్ర పూజ | 10-00 |
| 37. | ఆంజనేయ నిత్యపూజ | 10-00 |
| 38. | నాగేంద్ర స్వామి పూజ | 10-00 |
| 39. | సుబ్రహ్మణ్య నిత్యపూజ | 10-00 |
| 40. | రామదేవుని కథ | 10-00 |
| 41. | శివదేవుని కథ | 10-00 |
| 42. | లక్ష్మీనరసింహపూజ | 10-00 |
| 43. | వేంకటేశ్వరపూజ | 10-00 |
| 44. | బ్రహ్మంగారి నిత్యపూజ | 10-00 |
| 45. | సూర్య నిత్యపూజ | 10-00 |
| 46. | నవగ్రహ నిత్యపూజ | 10-00 |
| 47. | రుక్మిణీ కల్యాణం | 25-00 |
| 48. | ఉమామహేశ్వర వ్రతం | 36-00 |
| 49. | శ్రీ కామేశ్వరీ వ్రతం | 36-00 |
| 50. | 16 సోమవారముల వ్రతము | 25-00 |
| 51. | పార్వతీకల్యాణం | 25-00 |
| 52. | సహస్రకమలవర్తి వ్రతము | 25-00 |
| 53. | పంచముఖ ఆంజనేయ పూజావిధానము | 36-00 |
| 54. | అష్టనాగపూజ | 36-00 |
| 55. | పూజలు ఎందుకుచేయాలి ? | 36-00 |
| 56. | ఏ దేవునికి ఏపుష్పాలతో పూజించాలి? | 36-00 |
| 57. | ఏ దేవునికి ఏప్రసాదం నైవేద్యం పెట్టాలి? | 36-00 |
| 58. | ఏదేవునికి ఏవిధముగాదీపారాధనచెయ్యాలి? | 36-00 |
| 59. | ఏదేవునికి ఎన్ని ప్రదక్షిణలుచేయాలి ? | 36-00 |
| 60. | హనుమద్ వ్రతం | 36-00 |
| 61. | పంచాయతన పూజ | 63-00 |
| 62. | 28 వ్రతములు | 120-00 |

| | | |
|---|---|---|
| 63. | కలశపూజలు (9ఒకేసారి) | 150-00 |
| 64. | కలశపూజలు (విడివిడిగా) (ప్రింటులో) | .... |
| 65. | హ్రీంకార మహాయజ్ఞం (ప్రింటులో) | .... |
| 66. | గోమాత | 40-00 |

## 2. స్తోత్రాలు-సుప్రభాతములు సహస్రనామములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ లలితా విష్ణు సహస్రనామస్తోత్రాలు పురాణపండ రాధాకృష్ణమూర్తిగారి సంకలనం | 45-00 |
| 2. | లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (హిందీ) ,, | 50-00 |
| 3. | లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (ఇంగ్లీషు) ,, | 50-00 |
| 4. | స్థూలాక్షరిలలితావిష్ణుసహస్రనామస్తోత్రములు(పత్రికసైజ్) | 99-00 |
| 5. | లలితావిష్ణు (కేస్ బైండ్) 1/8 డెమ్మి | 63-00 |
| 6. | స్థూలాక్షరీ లలితావిష్ణు (క్రౌన్‌సైజు)కేస్‌బైండ్ | 108-00 |
| 7. | సర్వదేవతా స్తోత్రమంజరి | 120-00 |
| 8. | సకలదేవతా అష్టోత్తరశతనామావళిః (63) | 24-00 |
| 9. | విష్ణుసహస్రనామస్తోత్రమ్ (క్రౌన్) | 25-00 |
| 10. | లలితా సహస్రనామ స్తోత్రమ్ (క్రౌన్) | 36-00 |
| 11. | లలితా సహస్రనామములు | 24-00 |
| 12. | లక్ష్మీ సహస్రనామములు | 24-00 |
| 13. | దుర్గా సహస్రనామములు | 24-00 |
| 14. | ఆంజనేయ సహస్రనామములు | 24-00 |
| 15. | శివ సహస్రనామములు | 24-00 |
| 16. | విష్ణు సహస్రనామములు | 24-00 |
| 17. | గణపతి సహస్రనామములు | 24-00 |
| 18. | సుబ్రహ్మణ్య సహస్రనామములు | 24-00 |
| 19. | గాయత్రి సహస్రనామములు | 24-00 |
| 20. | లలితావిష్ణు సహస్రనామస్తోత్రాలు | 24-00 |
| 21. | శ్రీరామా సహస్రనామములు | 24-00 |
| 22. | సరస్వతి సహస్రనామములు | 24-00 |
| 23. | సూర్యసహస్రనామములు & ఆదిత్యహృదయం | 24-00 |
| 24. | శ్రీవేంకటేశ్వరసహస్రనామములు | 24-00 |
| 25. | మణిద్వీపవర్ణన (పెద్దది) | 24-00 |
| 26. | సంధ్యావందనం | 24-00 |
| 27. | మంత్రపుష్పమ్ | .... |
| 28. | త్రిభాషా హనుమాన్‌చాలీసా | 15-00 |
| 29. | హనుమాన్ చాలీసా | 10-00 |

| | | |
|---|---|---|
| 30. | మణిద్వీపవర్ణన (పాకెట్) | 10-00 |
| 31. | ఆరు చాలీసాలు | 10-00 |
| 32. | శివారాధన (శివస్తోత్రాలు) | 10-00 |
| 33. | వేంకటేశ్వర సుప్రభాతం (పాకెట్) | 10-00 |
| 34. | ఆరుదండకాలు | 5-00 |
| 35. | వేంకటేశ్వర గోవిందనామములు | 5-00 |
| 36. | అష్టలక్ష్మీ స్తోత్రమ్ కనకధారాస్తోత్రమ్ | 10-00 |
| 37. | దేవీఖడ్గమాలాస్తోత్రమ్ (మహిషాసురమర్దనీస్తోత్రంతో) | 10-00 |
| 38. | సుందరకాండ (పాకెట్) | 10-00 |
| 39. | భగవద్గీత మూలం | 27-00 |
| 40. | రామరక్షాస్తోత్రమ్ | 15-00 |
| 41. | స్తోత్ర రత్నావళి | 36-00 |
| 42. | పురాణపండ లలితా-విష్ణు సహస్రనామస్తోత్రమ్(మినీ) | 10-00 |
| 43. | పురాణపండ లలితాసహస్రనామస్తోత్రమ్(మినీ) | 10-00 |
| 44. | పురాణపండ విష్ణు సహస్రనామస్తోత్రమ్ | 10-00 |
| 45. | పురాణపండ ఆదిత్య హృదయం | 10-00 |
| 46. | మంత్రపుష్పం (మినీ) | 10-00 |
| 47. | శివానందలహరి-సౌందర్యలహరి | 36-00 |
| 48. | కుజదోషం | 10-00 |
| 49. | కాలసర్ప దోషం | 10-00 |
| 50. | మీ అప్పులు తీరాలా? | 10-00 |
| 51. | దృష్టిదోషాలు నివారణ | 10-00 |
| 52. | పంచసూక్తములు | 10-00 |
| 53. | సంధ్యావందనం | 10-00 |
| 54. | రుద్రనమకమ్-చమకమ్ | 10-00 |
| 55. | గాయత్రీమంత్రాలు | 10-00 |
| 56. | హయగ్రీవ స్తోత్రమాల | 10-00 |
| 57. | దక్షిణామూర్తి స్తోత్రమాల | 10-00 |
| 58. | ద్వాదశ జ్యోతిర్లింగాలు - పంచారామాలతో | 10-00 |
| 59. | శ్రీసూక్తం పురుష సూక్తం | 10-00 |
| 60. | నవగ్రహస్తోత్రమాల | 36-00 |
| 61. | మహాన్యాసమ్ | 36-00 |
| 62. | సుందరకాండ గానామృతం | 36-00 |
| 63. | గోమాతపూజావిధానము | 10-00 |
| 64. | ఆనందసిద్ధి - 1 శ్రీదేవీ స్తోత్రమాల | 108-00 |

| | | |
|---|---|---|
| 65. | ఆనందసిద్ధి - 2 ఏ సమస్యకు ఏ స్తోత్రమ్ పారాయణచేయాలి | 108-00 |
| 66. | ఆనందసిద్ధి-3 మానసదేవీ స్తోత్రమాల | 108-00 |
| 67. | శ్రీ కాలభైరవ రక్షా కవచమ్ | 63-00 |
| 68. | అర్చన | 40-00 |
| 69. | నిత్యదేవతార్చన | 40-00 |
| 70. | సర్వదేవతా స్తోత్ర నిధి | 99-00 |
| 71. | శ్రీచక్ర నవవరణార్చన | 63-00 |
| 72. | చండీ సప్తశతి పారాయణ క్రమం | 99-00 |
| 73. | శ్రీదేవి స్తోత్ర రత్నావళి 32 దేవి స్తోత్రాలకు తాత్పర్యంతో | 99-00 |
| 74. | వనదుర్గా మంత్రానుష్ఠాన క్రమమ్ | 63-00 |
| 75. | శ్రీ కాలభైరవ వ్రతము | 63-00 |

## 3. శ్రీ సాయి దత్త గ్రంథములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ సాయిబాబా సచ్చరిత్ర | 120-00 |
| 2. | సంపూర్ణ శ్రీ గురు చరిత్ర | 120-00 |
| 3. | శ్రీ సాయిఆరాధన-షిర్డివైభవం | 120-00 |
| 4. | శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర (క్రౌన్) | 63-00 |
| 5. | శ్రీ గురుచరిత్ర (క్రౌన్) | 63-00 |
| 6. | నవనాధ చరిత్ర | 99-00 |
| 7. | శ్రీసాయిచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం | 63-00 |
| 8. | శ్రీగురుచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం | 63-00 |
| 9. | సత్యదత్తవ్రతం దత్తాత్రేయపూజాకల్పం,సహస్రంతో | 30-00 |
| 10. | అనఘాదేవీ వ్రతం | 30-00 |
| 11. | భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు | 30-00 |
| 12. | శ్రీ సాయిపూజాకల్పం (సహస్రంతో) | 25-00 |
| 13. | శ్రీ సాయిభజనమాల | 20-00 |
| 14. | శ్రీ సాయి భజన్స్ | 20-00 |
| 15. | శ్రీ సాయిభక్తి గీతాలు | 20-00 |
| 16. | శిరిడిహారతులు (భావంతో) | 20-00 |
| 17. | "శ్రీసాయి"కోటి | 27-00 |
| 18. | "శ్రీసాయిరామ్"కోటి | 20-00 |
| 19. | శ్రీ సాయినాథ స్తోత్రమంజరి | 10-00 |
| 20. | శ్రీ సాయివేయినామాలు | 8-00 |
| 21. | శ్రీ సాయి హారతులు (పాకెట్) | 15-00 |
| 22. | శ్రీ సాయి స్తవనమంజరి | 10-00 |
| 23. | హిందీ శ్రీ సాయి హారతులు | 15-00 |

| | |
|---|---|
| 24. శని సింగణాపూర్ క్షేత్రమాహాత్మ్యం | 63-00 |
| 25. ఇంగ్లీషు శ్రీ సాయిహారతులు | 15-00 |
| 26. షిరిడి దర్శనం-శ్రీసాయి వైభవం | 99-00 |
| 27. సాయిసత్యవ్రతం | 30-00 |
| 28. సాయి అనుగ్రహమ్ | 120-00 |
| 29. నవగురువారాల వ్రతకల్పము | 15-00 |
| 30. శ్రీదత్తలీలామృతము | 99-00 |
| 31. హృదయంలో సాయి | 15-00 |
| 32. శ్రీషిరిడీసాయి లీలామృతం(శ్రీసచ్ఛరిత్ర) | 120-00 |
| 33. గజాననమహరాజ్ చరిత్ర | 99-00 |

## 4. జ్యోతిషాలు

| | |
|---|---|
| 1. 'కాలచక్రం' గంటలపంచాంగం (గార్గేయ) | 72-00 |
| 2. గ్రహభూమి పంచాంగము (గార్గేయ) | 108.00 |
| 3. ఆనందసిద్ధి పంచాంగం (వై.వి.శాస్త్రి) | 63.00 |
| 4. ములుగు వారి రాశిఫలితాలు (12రాశులువారికి) | 50.00 |
| 5. ములుగు వారి రాశిఫలితాలు విడివిడిగాఒక్కొక్కటి | 12.00 |
| 6. కాలచక్రంజ్యోతిషక్యాలండర్ | 25.00 |
| 7. గ్రహబలం క్యాలండర్ (శ్రీనివాసగార్గేయ-భక్తిటివి) | 25.00 |
| 8. శుభమస్తు (పిడపర్తి) క్యాలండర్ | 25.00 |
| 9. సాదా క్యాలండర్ | 5.00 |
| 10. పాకెట్ క్యాలండర్ | 15.00 |
| 11. తాజకనీలకంఠీయమ్ | 100-00 |
| 12. కేరళ జ్యోతిష రహస్యాలు | 180-00 |
| 13. జ్యోతిష బ్రహ్మ రహస్యాలు | 180-00 |
| 14. మానసాగరి జాతకపద్ధతి | 180-00 |
| 15. వరాహమిహిర జాతకపద్ధతి | 180-00 |
| 16. వధూవర వివాహమైత్రిద్వాదశకూటములు | 99-00 |
| 17. సింపుల్ రెమిడీస్ | 180-00 |
| 18. శంభు హోరప్రకాశిక | 250-00 |
| 19. పూర్వ పరాశరి | 100-00 |
| 20. పరాశర జ్యోతిషవిజ్ఞాన సర్వస్వం | 200-00 |
| 21. ప్రశ్న సింధు | 99-00 |
| 22. నక్షత్ర విశేష ఫలితాలు | 63-00 |
| 23. సూర్యసిద్ధాంతపంచాంగగణితంచేయడంఎలా? | 180-00 |
| 24. దృక్సిద్ధాంతపంచాంగగణితం చేయడంఎలా? | 180-00 |

| | | |
|---|---|---|
| 25. | ఆయుర్దాయ నిర్ణయం | 63-00 |
| 26. | జాతక గణిత ప్రవేశిక | 63-00 |
| 27. | జ్యోతిషమర్మబోధిని | 63-00 |
| 28. | జ్యోతిష ప్రశ్నోత్తరమాల | 63-00 |
| 29. | ముహూర్తం నిర్ణయించడంఎలా? | 63-00 |
| 30. | జాతక మకరందం | 63-00 |
| 31. | జ్యోతిష సరస్వతి | 63-00 |
| 32. | మీజననకాల విశేషాలు | 63-00 |
| 33. | ముహూర్త విజ్ఞాన భాస్కరం | 63-00 |
| 34. | జ్యోతిష స్వయంబోధిని | 63-00 |
| 35. | శుభముహూర్త శిరోమణి | 63-00 |
| 36. | నక్షత్ర ఫలమంజరి | 36-00 |
| 37. | పంచాంగం చూసే విధానం | 36-00 |
| 38. | సర్వార్థ జ్యోతిషం | 36-00 |
| 39. | ప్రాథమిక జ్యోతిషం | 36-00 |
| 40. | నవరత్నములు శుభయోగములు | 36-00 |
| 41. | శుభశకునాలు | 30-00 |
| 42. | హస్తరేఖాఫలితాలు | 36-00 |
| 43. | సంఖ్యల్లో భవిష్యత్ | 36-00 |
| 44. | ముహూర్త దీపిక | 99-00 |
| 45. | పుట్టుమచ్చలు ఫలితాలు | 30-00 |
| 46. | కలలు ఫలితాలు | 30-00 |
| 47. | జాతక చక్రం వేయడం ఎలా? | 36-00 |
| 48. | మానసాగరి (ప్రాచీనజ్యోతిషగ్రంథం) -పుచ్చాశ్రీనివాసరావు | 250-00 |
| 49. | జ్యోతిషశాస్త్ర చిట్కాలు | 120-00 |
| 50. | గుప్తా శతాబ్ది పంచాంగం (1940-2050) | 999-00 |
| 51. | ప్రశ్నచండేశ్వరమ్ | 63-00 |
| 52. | ద్వాదశభావ ఫలచంద్రిక | 250-00 |
| 53. | జ్యోతిష శతయోగరత్నావళి (నూరుయోగాలఫలితాలు) | 120-00 |
| 54. | అంగసాముద్రికం | 36-00 |
| 55. | హస్త సాముద్రికం | 63-00 |
| 56. | లాల్ కితాబ్ | 99-00 |
| 57. | శకునశాస్త్రం | 63-00 |
| 58. | ఆధునికప్రశ్నశాస్త్రం | 120-00 |
| 59. | పరాశరజ్యోతిష ప్రశ్నజ్యోతిషం | 180-00 |

| | | |
|---|---|---|
| 60. | అష్టకవర్గు (కొండపల్లి) | 63-00 |
| 61. | బృహత్‌జాతకం (ప్రాచీనప్రతికిపునర్ముద్రణ) | 250-00 |
| 62. | లగ్నరత్నాకరం | 63-00 |
| 63. | షట్పంచాశిక | 120-00 |
| 64. | 40 రోజుల్లో జ్యోతిషంనేర్చుకొనండి | 270-00 |
| 65. | 40 రోజుల్లో సాముద్రికంనేర్చుకొనండి | 180-00 |
| 66. | 40 రోజుల్లో సంఖ్యాశాస్త్రం | 180-00 |
| 67. | 40 రోజుల్లో నక్షత్ర (నాడీ) ఫలితములు | 270-00 |
| 68. | 40 రోజుల్లో వైద్యజ్యోతిషం నేర్చుకోండి | 250-00 |
| 69. | మీ పుట్టినతేదీ అద్భుతరహస్యాలు (సాయిగణపతిరెడ్డి) | 270-00 |
| 70. | కె.పి.జ్యోతిషం (పరిచయం) | 63-00 |
| 71. | ముహూర్తచింతామణి | 99-00 |
| 72. | సూర్యచంద్ర గ్రహణములు | 63-00 |
| 73. | ప్రసిద్ధవ్యక్తుల జాతకాలు (వేరేకొండప్ప) | 180-00 |
| 74. | అదృష్టరెమెడీస్ | 144-00 |
| 75. | గ్రహసంచార ఫలనిర్ణయదీపిక | 63-00 |
| 76. | జ్యోతిష రెమిడీస్ | 300-00 |
| 77. | జాతకమార్తాండం పాతప్రతికి యథాతథం (కొండపల్లి) | 250-00 |
| 78. | జ్యోతిషవిద్యాప్రకాశిక పాతప్రతికి యథాతథం (కొండపల్లి) | 250-00 |
| 79. | నాడీజ్యోతిషం | 63-00 |
| 80. | నక్షత్రపారిజాతం (గోరసవీరభద్రాచార్య) | 63-00 |
| 81. | లగ్నపారిజాతం (గోరసవీరభద్రాచార్య) | 63-00 |
| 82. | గౌతమసంహిత | 63-00 |
| 83. | హోరరత్నమాల | 63-00 |
| 84. | జాతకఫల మణిమంజరి | 200-00 |
| 85. | పుష్కర పంచాంగం (2013-14నుండి 2024-25) | 560-00 |
| 86. | దశాభుక్తిఫల నిర్ణయం | 250-00 |
| 87. | వింత జోష్యములు | 63-00 |
| 88. | షోడశవర్గులు | 200-00 |
| 89. | రవిగ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 90. | చంద్ర గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 91. | కుజ గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 92. | బుధ గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 93. | గురు గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 94. | శుక్ర గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |

| | | |
|---|---|---|
| 95. | శని గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 96. | రాహు & కేతు గ్రహముల సమస్త ప్రభావములు | 99-00 |
| 97. | ఆధునిక గ్రహములు-ఉపగ్రహములు సమస్త ప్రభావములు | 99-00 |
| 98. | ముహూర్తమార్తాండం | 63-00 |
| 99. | లఘుజాతకం | 63-00 |
| 100. | జాతకాలంకారము | 63-00 |
| 101. | మేషలగ్న ఫలితములు | 99-00 |
| 102. | వృషభ లగ్న ఫలితములు | 99-00 |
| 103. | మిధున లగ్న ఫలితములు | 99-00 |
| 104. | కర్కాటక లగ్న ఫలితములు | 99-00 |
| 105. | సింహలగ్న ఫలితములు | 99-00 |
| 106. | కన్యలగ్న ఫలితములు | 99-00 |
| 107. | తుల లగ్న ఫలితములు | 99-00 |
| 108. | వృశ్చిక లగ్న ఫలితములు | 99-00 |
| 109. | ధనుస్సు లగ్న ఫలితములు | 99-00 |
| 110. | మకర లగ్న ఫలితములు | 99-00 |
| 111. | కుంభ లగ్న ఫలితములు | 99-00 |
| 112. | మీన లగ్న ఫలితములు | 99-00 |
| 113. | నారద సంహిత | 200-00 |
| 114. | పంచాంగపీఠికలేఖకాగణితం | 250-00 |
| 115. | తారాబలం - చంద్రబలం (వేరే కొండప్ప) | 99-00 |
| 116. | సులభలగ్న సాధన (చిత్రాలగురుమూర్తిగుప్తా) | 200-00 |
| 117. | రాహు కేతువుల యోగము | 99-00 |
| 118. | ఛాయాగ్రహములు | 99-00 |
| 119. | జ్యోతిషవిజ్ఞాన దీపిక | 63-00 |

## బి.వి.రామన్ గారి గ్రంథములు

| | | |
|---|---|---|
| 120. | జ్యోతిష విద్యారంభం | 50-00 |
| 121 | గ్రహభావ బలములు | 50-00 |
| 122. | కాలచక్రదశ | 50-00 |
| 123. | అనుభవ ప్రశ్నాజ్యోతిషం | 50-00 |
| 124. | జ్యోతిషశాస్త్రంలో వాతావరణ భూకంపాలు | 50-00 |
| 125. | పురోగామి జాతకం | 50-00 |
| 126. | భావార్థరత్నాకరం | 75-00 |
| 127. | భారతీయజ్యోతిష సర్వస్వం | 75-00 |
| 128. | అష్టకవర్గ పద్ధతిః | 75-00 |

| | |
|---|---|
| 129. జ్యోతిషశాస్త్రంలో సందేహాలు,సమాధానాలు | 75-00 |
| 130. ప్రశ్నతంత్ర | 75-00 |
| 131. ముహూర్తం | 75-00 |
| 132. విశిష్ట జాతకములు | 125-00 |
| 133. భారతీయఫలితజ్యోతిషం | 125-00 |
| 134. 300 ముఖ్యమైన యోగములు | 125-00 |
| 135. జాతకంపరిశీలించడంఎలా ? | 300-00 |

## రాష్ట్రపతి అవార్డుగ్రహీత, మహామహోపాధ్యాయ, వాచస్పతి
## శ్రీ మధురకృష్ణమూర్తిగారి గ్రంథములు

| | |
|---|---|
| 136. బృహత్పరాశరహోరాశాస్త్రము-1 | 200-00 |
| 137. బృహత్పరాశరహోరాశాస్త్రము-2 | 200-00 |
| 138. బృహత్పరాశరహోరాశాస్త్రము-3 | 200-00 |
| 139. బృహత్పరాశరహోరాశాస్త్రము-4 | 200-00 |
| 140. భావార్థరత్నాకరము | 100-00 |
| 141. ముహూర్త చింతామణి | 100-00 |
| 142. ముహుర్త చింతామణి-పార్టు2 | 200-00 |
| 143. స్వప్న శాస్త్రము | 36-00 |
| 144. శతయోగమంజరి | 50-00 |
| 145. వ్రతనిర్ణయకల్పవల్లి | 250-00 |
| 146. దైవజ్ఞవల్లభం | 75-00 |
| 147. వసంతరాజశకునమ్ (బృహత్శకునశాస్త్రం) | 250-00 |
| 148. వాస్తుశాస్త్రవివేకము-1 | 100-00 |
| 149. వాస్తుశాస్త్రవివేకము-2 | 200-00 |
| 150. వాస్తుశాస్త్రవివేకము-3 | 100-00 |
| 151. వాస్తుశాస్త్రవివేకము-4 | 200-00 |
| 152. అనుభవసులభవాస్తు - 1 | 50-00 |
| 153. అనుభవసులభవాస్తు - 2 | 100-00 |
| 154. పంచాంగ వివేకము | 99-00 |
| 155. వశిష్ఠ సంహిత | 360-00 |
| 156. పంచపక్షి శాస్త్రం (కేస్బైండ్) | 200-00 |

## 5. వాస్తులు

| | |
|---|---|
| 1. 40 రోజుల్లో "వాస్తువిద్య" నేర్చుకొనండి | 180-00 |
| 2. వాస్తుశాస్త్ర రహస్యములు | 200-00 |
| 3. వాస్తునుబట్టి మీ ఇల్లు | 63-00 |
| 4. మీరూ మీ వాస్తు | 63-00 |

| | | |
|---|---|---|
| 5. | గృహవాస్తు చిట్కాలు | 63-00 |
| 6. | వాస్తు పూజ | 63-00 |
| 7. | వాస్తు సూత్రములు | 63-00 |
| 8. | వాస్తుశాస్త్ర రహస్యాలు | 63-00 |
| 9. | గృహవాస్తు వర్గులు | 99-00 |
| 10. | విశ్వకర్మవాస్తు శాస్త్రరీత్యా మీ ఇంటి ప్లానులు | 63-00 |
| 11. | విశ్వకర్మ వాస్తుశాస్త్రరీత్యా మీఇండ్లఆయములు | 99-00 |
| 12. | విశ్వకర్మ వాస్తు శాస్త్రం(చిత్రాలగురుమూర్తిగుప్తా) | 180-00 |
| 13. | ఆధునిక గృహవాస్తు | 99-00 |
| 14. | శుభవాస్తు | 270-00 |
| 15. | వాస్తుయంత్ర రత్నావళి | 120-00 |
| 16. | వాస్తుశాస్త్రం | 120-00 |
| 17. | హౌస్ ప్లాన్స్ | 63-00 |
| 18. | గృహనిర్మాణ వాస్తు | 63-00 |
| 19. | వాస్తు రెమెడీస్ | 63-00 |
| 20. | గృహవాస్తు దర్పణం | 63-00 |
| 21. | జ్యోతిష-గృహవాస్తుచంద్రిక | 200-00 |
| 22. | వాస్తురత్నాకరం (కొండపల్లి) | 63-00 |
| 23. | వాస్తుశిరోమణి ,, | 120-00 |
| 24. | వాస్తుసంగ్రహమ్ ,, | 63-00 |
| 25. | పంచవాస్తు పారిజాతం ,, | 120-00 |
| 26. | వాస్తుడిండిమమ్ ,, | 63-00 |
| 27. | వాస్తుదుందిభి ,, | 120-00 |
| 28. | విశ్వకర్మవాస్తుప్రకాశిక (కేస్‌బైండ్) | 250-00 |
| 29. | కృష్ణవాస్తుశాస్త్రము | 63-00 |
| 30. | జలవాస్తు,శల్యవాస్తు (దంతూరిపండరీనాథ్) | 99-00 |
| 31. | మయవాస్తు (గోరసవీరభద్రాచార్య) | 120-00 |
| 32. | వాస్తు జ్యోతి | 63-00 |
| 33. | మన ఇల్లు-మనవాస్తు | 99-00 |
| 34. | వాస్తవ వాస్తుపూజావిధానము | 108-00 |
| 35. | వాస్తు దర్పణం | 120-00 |

## 6. మంత్రశాస్త్రాలు

| | | |
|---|---|---|
| 1. | మంత్రసాధన | 63-00 |
| 2. | తంత్రజాలం | 63-00 |
| 3. | మంత్రశక్తి | 63-00 |

| | | |
|---|---|---|
| 4. | దత్తాత్రేయ తంత్రవిద్య | 63-00 |
| 5. | దత్తాత్రేయ మూలికాతంత్రమ్ | 63-00 |
| 6. | తాంత్రిక పంచాంగం | 63-00 |
| 7. | యక్షిణీ తంత్రం | 63-00 |
| 8. | మంత్రానుష్ఠాన చంద్రిక | 63-00 |
| 9. | సర్వదేవతా మంత్రకవచములు | 63-00 |
| 10. | మంత్రాక్షరాలరహస్యం (బీజాక్షరనిఘంటువు) | 63-00 |
| 11. | సర్వదేవతా మంత్రరత్నావళి | 63-00 |
| 12. | సదాచార దీపిక | 63-00 |
| 13. | యోగినీ-వామకేశ్వరతంత్రం | 63-00 |
| 14. | ప్రపంచసారతంత్రం | 63-00 |
| 15. | బదనిక తంత్రమ్ | 63-00 |
| 16. | ఉచ్ఛిష్ట గణపతి తంత్రమ్ | 63-00 |
| 17. | గుప్త సాధన తంత్రం | 63-00 |
| 18. | గంధర్వ తంత్రమ్ | 63-00 |
| 19. | సౌందర్యలహరి (మంత్రయంత్రరత్నావళి) | 63-00 |
| 20. | యంత్ర మంత్ర తంత్ర | 63-00 |
| 21. | పాశుపత తంత్రం | 99-00 |
| 22. | పంచదశ మహాఖడ్గ తంత్రం | 99-00 |
| 23. | రుద్రాష్టాధ్యాయః | 99-00 |
| 24. | మంత్రసిద్ధి | 120-00 |
| 25. | పరశురామతంత్రమ్ | 108-00 |
| 26. | శ్రీలలితావిలోమ పంచదశీ | 108-00 |
| 27. | శ్రీ గురు తంత్రం | 108-00 |
| 28. | గాయత్రీ తంత్రమ్ | 108-00 |
| 29. | మహాశక్తి మంత్ర తంత్ర రహస్యాలు | 150-00 |
| 30. | శ్రీ దుర్గ తంత్రమ్ | 200-00 |
| 31. | మహామృత్యుంజయఅమృతపాశుపతమ్ | 200-00 |
| 32. | సర్ప (నాగ)తంత్రం | 250-00 |
| 33. | హవన తంత్రం | 250-00 |
| 34. | షోడశనిత్యతంత్రం | 250-00 |
| 35. | శాక్తేయతంత్రం | 250-00 |
| 36. | రుద్రయామళతంత్రం | 250-00 |
| 37. | లక్ష్మీప్రత్యంగిరా తంత్రమ్ | 250-00 |
| 38. | హిరణ్యశూలినీ తంత్రమ్ | 250-00 |

| | | |
|---|---|---|
| 39. | మాయాప్రత్యంగిరా తంత్రమ్ | 250-00 |
| 40. | శ్రీ విశ్వరూప ప్రత్యంగిరా తంత్రమ్ | 250-00 |
| 41. | స్వర్ణాకర్షణభైరవతంత్రం | 250-00 |
| 42. | కాశీవిశాలాక్షి తంత్రం | 250-00 |
| 43. | శాంతితంత్రమ్ | 250-00 |
| 44. | యంత్రసిద్ధి | 360-00 |
| 45. | శ్రీ లక్ష్మీతంత్రమ్ | 360-00 |
| 46. | మంత్రమహోదధి (స్త్రీదేవతాఃకల్పమ్) | 360-00 |
| 47. | మంత్రమహోదధి (పురుషదేవతాఃకల్పమ్) | 360-00 |
| 48. | మంత్రశాస్త్రం (గ్రంథము) | 360-00 |
| 49. | ప్రత్యంగిరాకృత్యాతంత్రం | 360-00 |
| 50. | కామధేనువు తంత్రం | 360-00 |
| 51. | శూలినీదుర్గాతంత్రం | 360-00 |
| 52. | శ్రీవిద్య రహస్యం | 290-00 |
| 53. | కులార్ణవ తంత్రమ్ | 150-00 |
| 54. | ఆచార్య సిద్ధ నాగార్జునతంత్రం (ఒరిజనల్) | 390-00 |
| 55. | సిద్ధమూలిక రహస్యం (మంత్ర,యంత్రసహితం) | 63-00 |

## 7. గ్రంథాలు - ఆరాధనలు

| | | |
|---|---|---|
| 1. | భగవద్గీత శ్లోక తాత్పర్య సహితం | 54-00 |
| 2. | భగవద్గీత (వచనం) | 99-00 |
| 3. | భగవద్గీత శ్లోకతాత్పర్యం-కేసుబైండింగ్ | 72-00 |
| 2. | గణేశ ఆరాధన 1 | 99-00 |
| 3. | గణేశోపాసన 2 | 99-00 |
| 4. | నవగ్రహవైభవం | 99-00 |
| 5. | నవగ్రహ రెమెడీస్ | 99-00 |
| 6. | నవగ్రహ వేదం | 99-00 |
| 7. | శనిగ్రహారాధన | 99-00 |
| 8. | ఆదిత్యారాధన | 99-00 |
| 9. | సుబ్రహ్మణ్యారాధన | 99-00 |
| 10. | శ్రీ శివ ఆరాధన | 99-00 |
| 11. | లక్ష్మీ ఆరాధన | 99-00 |
| 12. | హనుమదారాధన | 99-00 |
| 13. | లలితారాధన | 99-00 |
| 14. | శ్రీ చక్రారాధన | 99-00 |
| 15. | గాయత్రీ ఆరాధన | 99-00 |

| | | |
|---|---|---|
| 16. | వీరభద్రారాధన | 99-00 |
| 17. | కుజగ్రహారాధన | 99-00 |
| 18. | భైరవారాధన | 99-00 |
| 19. | దైవారాధన | 99-00 |
| 20. | గీతారాధన (భగవద్గీత శ్లోకతాత్పర్యసహిత) | 99-00 |
| 21. | శ్రీవేంకటేశ్వరాధన | 99-00 |
| 22. | హయగ్రీవారాధన | 99-00 |
| 23. | లక్ష్మీనరసింహారాధన | 99-00 |
| 24. | శ్రీ బాలాత్రిపురసుందరీ స్తోత్ర కదంబం | 99-00 |
| 25. | దేవీ లీలామృతం | 99-00 |
| 26. | పురాణపండ సుందరకాండ వచనం | 99-00 |
| 27. | పురాణపండ రామాయణం | 99-00 |
| 28. | పురాణపండ భారతం | 99-00 |
| 29. | పురాణపండ భాగవతం | 99-00 |
| 30. | (సూరి) వాల్మీకి రామాయణం | 99-00 |
| 31. | కాలసర్ప యోగం | 99-00 |
| 32. | నిత్య జీవితములో రుద్రాక్షలు | 99-00 |
| 33. | నిత్య జీవితములో నవరత్నాలు | 99-00 |
| 34. | వేదసూక్తములు | 99-00 |
| 35. | వేమన పద్యసారామృతం | 99-00 |
| 36. | పండగలు పర్వదినాలు | 99-00 |
| 37. | సూక్తిరత్నాలు | 99-00 |
| 38. | హనుమచ్చరిత్ర | 99-00 |
| 39. | నవగ్రహ దర్శనమ్ | 99-00 |
| 40. | నిత్యజీవితంలో నవగ్రహాలు | 99-00 |
| 41. | సాలగ్రామములు | 99-00 |
| 42. | గురుశుక్ర ప్రభావము చంద్రకళానాడీ | 99-00 |
| 43. | శనిగ్రహరెమిడీస్ | 99-00 |
| 44. | జాతకసుధాసారము-జాతకమోక్షప్రదాయిని | 99-00 |
| 45. | వివాహజ్యోతిషమంజరి-మ్యారేజ్‌మ్యాచింగ్‌గైడ్ (సాయిగణపతిరెడ్డి) | 99-00 |
| 46. | మీపుట్టినతేదీనిబట్టి మీజీవితరహస్యాలు (న్యూమరాలజీ లైఫ్‌గైడ్) ,, | 99-00 |
| 47. | మీఅదృష్టానికి (పేరు) నేమ్‌కరక్షన్ ,, | 99-00 |
| 48. | న్యూమరాలజీ రెమిడీస్ | 99-00 |
| 49. | మూకపంచశతీ | 99-00 |
| 50. | శ్రీరామకర్ణామృతం | 99-00 |

| | | |
|---|---|---|
| 51. | రహస్యకుక్కుటశాస్త్రం | 300-00 |
| 52. | ఉపాసన విధానం | 99-00 |
| 53. | పంచమవేదం మహాభారతం | 99-00 |
| 54. | దేవుళ్ళు డాట్ కామ్ | 99-00 |
| 55. | గణపతిభాష్యం | 99-00 |
| 56. | యజుర్వేద ఉపనయనవివాహప్రయోగమంజరి | 99-00 |
| 57. | నవయోగులు | 99-00 |
| 58. | ఆంధ్రప్రదేశ్‌లోనిదర్శించవలసిన ప్రముఖదర్గాలు | 99-00 |
| 59. | సకలదేవతాఅష్టోత్తరాలు(పెద్దది)-(180అష్టోత్తరశతనామావళులతో) | 99-00 |
| 60. | సకలదేవతా అష్టోత్తరశతనామావళులు (కేస్‌బైండింగ్) | 216-00 |
| 61. | సకలదేవతా సహస్రనామములు | 99-00 |
| 62. | ఆధ్యాత్మిక సూక్తి నిధి | 99-00 |
| 63. | బ్రాహ్మణులు గోత్రాలు,ప్రవరలు | 99-00 |
| 64. | సర్వదేవతాస్వరూపుడు శ్రీ వేంకటేశ్వరుడు | 99-00 |
| 65. | శ్రీ లక్ష్మీసన్నిధి | 99-00 |
| 66. | శ్రీలక్ష్మీగణపతి హోమకల్పం | 99-00 |
| 67. | మార్షల్‌ఆర్ట్స్ (కరాటే,కుంగ్‌ఫూనేర్చుకోండి) | 99-00 |
| 68. | మ్యాజిక్‌గైడ్ | 99-00 |
| 69. | చదరంగం | 99-00 |
| 70. | పంచముఖ హనుమత్ వైభవం | 63-00 |
| 71. | గరుడపురాణం | 40-00 |
| 72. | మాఘపురాణం | 36-00 |
| 73. | శివపురాణం | 36-00 |
| 74. | వైశాఖపురాణం | 36-00 |
| 75. | కార్తీక పురాణం | 36-00 |
| 76. | కార్తీక పురాణం (చిన్నది) | 25-00 |
| 77. | సర్వకార్యసిద్ధికి రామాయణపారాయణ | 63-00 |
| 78. | పెద్దబాలశిక్ష | 50-00 |
| 79. | గాయత్రీ మహిమ | 36-00 |
| 80. | వృక్షదేవతలు | 63-00 |
| 81. | యాజుష స్మార్త సంస్కార చంద్రిక | 200-00 |
| 82. | సనాతనవైదిక బ్రాహ్మణస్మార్తాగమకల్పమ్ | 150-00 |
| 83. | చతుర్వేదములు | 120-00 |
| 84. | నవగ్రహారాధన | 120-00 |
| 85. | తాళపత్ర సమాహార గోపురం | 120-00 |
| 86. | మనుధర్మ శాస్త్రం (వచనంలో...) (కేస్‌బైండు) | 250-00 |

| | | | |
|---|---|---|---|
| 87. | మానవధర్మములు | | 120-00 |
| 88. | వేదమంత్ర సంహిత | | 120-00 |
| 89. | సహస్రలింగార్చన | | 120-00 |
| 90. | శ్రీ శివగీత | | 120-00 |
| 91. | ద్వాదశఉపనిషత్తులు | | 120-00 |
| 92. | పురాణపండవారి సౌందర్యలహరి | (కేస్‌బైండ్) | 250-00 |
| | (శ్లోకతాత్పర్యసహిత విపులవ్యాఖ్యతో) | సాదా | 120-00 |
| 93. | బృహత్ శివ స్తోత్ర రత్నాకరము | | 200-00 |
| 94. | బృహత్ దేవీ స్తోత్రరత్నాకరము | | 200-00 |
| 95. | బృహత్ విష్ణు స్తోత్రరత్నాకరము | | 200-00 |
| 96. | కేదారనాథ్ బదరీనాథ్ యాత్రాగైడు | | 63-00 |
| 97. | దక్షిణావృత శంఖములు | | 63-00 |
| 98. | 108 దివ్యదేశాల విష్ణుక్షేత్రదర్శని | | 36-00 |
| 99. | ధర్మసింధువు(కేస్‌బైండింగ్) | | 270-00 |
| 100. | భారతీయ శైవక్షేత్రయాత్రాదర్శిని | | 99-00 |
| 101. | చిలుకూరి బాలాజీచరిత్ర | | 36-00 |
| 102. | భగవత్‌స్తుతి | | 63-00 |
| 103. | సూర్యోపాసన | | 36-00 |
| 104. | కాశీఖండం | | 250-00 |
| 105. | దేవీభాగవతం | | 360-00 |
| 106. | శ్రీ ఆంజనేయం | | 216-00 |
| 107. | ధర్మసందేహాలు | | 216-00 |
| 108. | ఆధ్యాత్మిక దైవిక వస్తువులు | | 250-00 |
| 109. | రామాయణం | | 600-00 |
| 110. | పోతన భాగవతం | | 900-00 |
| 111. | శివమంత్రములు | | 63-00 |

## 8. వైద్య గ్రంథాలు

| | | |
|---|---|---|
| 1. | ఆహారం ఆరోగ్యం | 36-00 |
| 2. | మూలికావైద్య చిట్కాలు | 36-00 |
| 3. | ఆయుర్వేద వైద్య చిట్కాలు | 30-00 |
| 4. | గృహవైద్య రహస్యాలు | 36-00 |
| 5. | గృహవైద్యసారం | 36-00 |
| 6. | హోమియోవైద్యం (ద్వాదశలవణచికిత్స) | 63-00 |
| 7. | ప్రకృతివైద్యం | 36-00 |
| 8. | ఆహారం-వైద్యం | 99-00 |

| | | |
|---|---|---|
| 9. | సంపూర్ణ ఆయుర్వేద-చిట్కా వైద్యం | 99-00 |
| 10. | ఆయుర్వేదమ్ | 36-00 |
| 11. | ఆయుర్వేద మూలికావైద్యదీపిక | 99-00 |
| 12. | దుంపకూరలు, ఆకుకూరలు, కాయగూరలు (వాడకం - ఉపయోగాలు) | 99-00 |
| 13. | ఏకమూలికావైద్యం | 99-00 |
| 14. | అష్టాంగ హృదయం (4భాగాలు) | 1200-00 |
| 15. | రహస్యసిద్ధయోగవైద్యసారమ్ | 99-00 |
| 16. | ప్రాథమిక హోమియోవైద్యం | 99-00 |
| 17. | ఒబెసిటి | 99-00 |
| 18. | హెల్త్‌గైడ్ | 99-00 |
| 19. | ఆయుర్వేదం-జీవనవేదం | 99-00 |
| 20. | ఫుడ్‌థెరపి | 63-00 |
| 21. | న్యాచురల్‌థెరపి | 99-00 |
| 22. | సంపూర్ణఆరోగ్యానికి 20ని॥ | 63-00 |
| 23. | కీళ్ళనొప్పులు మీ సమస్యలైతే... | 99-00 |
| 24. | యోగామంత్ర | 63-00 |
| 25. | యోగా మండే టు సండే | 63-00 |
| 26. | హెర్బల్ మెడిసిన్-హెల్త్‌టుడే | 99-00 |
| 27. | హెల్త్‌ఫైల్ | 108-00 |
| 28. | వస్తుగుణపాఠం | 250-00 |
| 29. | రసాయన వాజీకరణ తంత్రం | 150-00 |
| 30. | వస్తుగుణ మకరందం | 400-00 |
| 31. | నాటువైద్యం -(కేస్‌బైండ్) | 360-00 |
| 32. | నాటువైద్యం (చిన్నది) | 99-00 |
| 33. | ప్రాణాయామము-యోగ | 63-00 |

## 9. అయ్యప్ప - భవానీ రకాలు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ అయ్యప్ప లీలామృతం | 30-00 |
| 2. | శ్రీ అయ్యప్ప భజనపాటలు | 63-00 |
| 3. | శ్రీ అయ్యప్ప పూజాకల్పం | 20-00 |
| 4. | శ్రీ అయ్యప్ప భక్తి గీతాలు | 20-00 |
| 5. | హారతిగైకొనుమా | 40-00 |
| 6. | శ్రీ అయ్యప్ప దీక్ష F | 10-00 |
| 7. | శ్రీ అయ్యప్ప భజనమాల F | 10-00 |
| 8. | శ్రీ అయ్యప్ప నిత్యపూజ P | 10-00 |

| | | |
|---|---|---|
| 9. | శ్రీ అయ్యప్ప నిత్యనియమావళి P | 10-00 |
| 10. | భవానీదీక్ష (శ్రీ భవానీ లీలామృతం) | 36-00 |
| 11. | దేవీలీలామృతం | 99-00 |
| 12. | శ్రీ దేవీ పూజాకల్పం | 20-00 |
| 13. | దేవీ భక్తిగీతాలు | 20-00 |
| 14. | భవానీదీక్ష P | 10-00 |
| 15. | దేవీ భక్తిమాల F | 10-00 |
| 16. | శ్రీ అయ్యప్ప భజనావళి | 120-00 |
| 17. | అయ్యప్పపూజావిధి (జేసుదాసుసాంగ్స్‌తో) | 24-00 |

## 10. భజనలు - కీర్తనలు

| | | |
|---|---|---|
| 1. | అన్నమయ్య కీర్తనలు | 20-00 |
| 2. | శ్రీరామదాసు కీర్తనలు | 20-00 |
| 3. | సర్వదేవతా మంగళహారతులు | 20-00 |
| 4. | వసుంధర మంగళ హారతులు | 25-00 |
| 5. | సౌభాగ్య దేవతా మంగళహారతులు | 36-00 |
| 6. | సర్వదేవతా భజనలు | 36-00 |
| 7. | చిట్టి పొట్టి పాటలు | 10-00 |
| 8. | జాతీయ గీతాలు | 10-00 |
| 9. | దేశభక్తి గీతాలు | 36-00 |
| 10. | పండుగలు-పుణ్యక్షేత్రాలు భక్తిగీతాలు | 36-00 |
| 11. | గొబ్బిళ్ళపాటలు,లాలిపాటలు,కోలాటపాటలు | 36-00 |
| 12. | అన్నమయ్య సంకీర్తనలు | 99-00 |
| 13. | పెళ్ళిపాటలు-స్త్రీలపాటలు | 36-00 |
| 14. | భక్తానంద భజనకీర్తనలు(ఓల్డ్‌సినీస్టైల్) | 36-00 |
| 15. | సర్వదేవతాభక్తిమణిమాల | 36-00 |
| 16. | బతుకమ్మ ఉయ్యాల పాటలు | 36-00 |
| 17. | అన్నమయ్య సంకీర్తనానిధి(1000కీర్తనలు) | 270-00 |

## 11. హిట్స్ సాంగ్స్

| | | |
|---|---|---|
| 1. | ఘంటసాల భక్తిగీతాలు-భగవద్గీత | 36-00 |
| 2. | ఎస్.పి.బాలు భక్తిగీతాలు | 36-00 |
| 3. | ఘంటసాల సుమధురగీతాలు | 99-00 |
| 4. | పి. సుశీల సుమధురగీతాలు | 99-00 |

| | | |
|---|---|---|
| 5. | ఎస్.పి. బాలు సుమధురగీతాలు | 99-00 |
| 6. | ఎస్.జానకి సుమధురగీతాలు | 99-00 |
| 7. | వేటూరి సుందరరామమూర్తిహిట్స్ | 99-00 |
| 8. | సర్వదేవతా సినీభక్తిగీతాలు | 99-00 |

## 12. స్త్రీలకు ఉపయుక్త పుస్తకములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీకాంతామణి వంటలు (వెజ్) | 63-00 |
| 2. | శ్రీకాంతామణి వంటలు (నాన్‌వెజ్) | 63-00 |
| 3. | శాకాహార వంటలు | 30-00 |
| 4. | మాంసాహారవంటలు | 30-00 |
| 5. | చిట్టిచిట్కాలు | 30-00 |
| 6. | అందానికి చిట్కాలు | 30-00 |
| 7. | పిల్లల పేర్లు (పెద్దది) | 30-00 |
| 8. | పిల్లల పేర్లు (చిన్నది) | 10-00 |
| 9. | లేటెస్ట్ ఎంబ్రాయిడరీ శారీబోర్డర్స్ | 36-00 |
| 10. | లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్ | 36-00 |
| 11. | చిన్నారులకు చిరుతిళ్ళు | 30-00 |
| 12. | పసందైన ఫాస్ట్‌ఫుడ్ వంటలు | 30-00 |
| 13. | పలావ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, వెరైటీరైస్‌లు | 30-00 |
| 14. | వేపుళ్ళు-ఇగుర్లు | 30-00 |
| 15. | బ్రేక్‌ఫాస్ట్ వంటలు | 30-00 |
| 16. | పండుగలలో చేసుకొనే పిండివంటలు | 30-00 |
| 17. | మైక్రోవోవెన్ వంటలు | 99-00 |
| 18. | సర్వదేవతాభక్తిమాల | 36-00 |
| 19. | పిల్లలపేర్లు (బాబు) | 36-00 |
| 20. | పిల్లలపేర్లు (పాప) | 36-00 |
| 21. | మోడ్రన్ మెహంది (గోరింటాకు డిజైన్స్) | 36-00 |
| 22. | మోడ్రన్ పిల్లలపేర్లు | 99-00 |
| 23. | నోరూరించే నాన్‌వెజ్‌వంటలు | 99-00 |
| 24. | మోడ్రన్ టైలరింగ్ (లేడీస్ & జంట్స్) | 99-00 |

## వివిధ రకాలు

| | |
|---|---|
| ఎందరోమహానుభావులు | 270-00 |
| యోగాసనాలు | 36-00 |
| సూర్యనమస్కారములు | 36-00 |
| పొడుపు కథలు (చిన్నవి) | 10-00 |

| | |
|---|---|
| హిందీ-తెలుగు-స్వబోధిని | 20-00 |
| ఇంగ్లీషు-తెలుగు-స్వబోధిని | 20-00 |
| జనరల్ నాలెడ్జ్ | 20-00 |
| నూరు ఎక్కాలు | 10-00 |
| 1-100 టేబుల్ బుక్ | 10-00 |
| 1-100 టేబుల్‌బుక్ (క్రౌన్‌సైజు) | 4-50 |
| శ్రీరామకోటి | 27-00 |
| శ్రీశివకోటి | 27-00 |
| మేజిక్ | 30-00 |
| అంకెలతో గారడీ | 30-00 |
| హృదయస్పందన (కవితలు) | 30-00 |
| వాత్స్యయన కామసూత్రాలు | 36-00 |
| ఎ.పి.టూరిస్ట్ గైడు | 36-00 |
| ఇంద్రజాల రహస్యాలు | 30-00 |
| మహేంద్రజాల రహస్యాలు | 30-00 |
| శరీరభాష (బాడీ లాంగ్వేజ్) | 99-00 |
| క్రియాయోగం | 36-00 |
| ఆనందంగా జీవిద్దాం | 99-00 |
| హరిశ్చంద్ర నాటకం | 50-00 |
| వాత్సాయనకామసూత్రాలు | 99-00 |
| పంచసాయకం | 99-00 |
| రతిరహస్యాలు | 99-00 |
| అనంగరంగం (కంభంపాటి స్వయంప్రకాష్) | 99-00 |
| శృంగారకేళి (కంభంపాటి స్వయంప్రకాష్) | 99-00 |
| గాయత్రీవిజ్ఞాన్ | 99-00 |
| చింతామణి (నాటకం) | 50-00 |
| బాలనాగమ్మ | 50-00 |
| కాళహస్తి స్త్రీల వ్రతకథలు | 36-00 |
| కాళహస్తి రామాంజనేయ యుద్ధం(బదిరెడ్డి) | 50-00 |
| కాళహస్తి గోవింద నామాల భగవద్గీత | 36-00 |
| కాళహస్తి గృహవాస్తు చింతామణి | 99-00 |
| కాళహస్తి గృహవాస్తు మర్మాలు (బైండు) | 63-00 |
| రామరాయవాస్తుశాస్త్రం(ముద్రగడరామారావు) | 90-00 |
| ఎం.ఎస్.ఆర్.హనుమాన్‌చాలీసా | 10-00 |
| ఎం.ఎస్.ఆర్.సుందరకాండ | 80-00 |
| బ్రహ్మంగారిజీవితచరిత్ర (జవంగుల) | 125-00 |
| శ్రీ ఆదిశంకరాచార్య దివ్యచరితామృతం | 40-00 |

| | | |
|---|---|---|
| కాశీరామేశ్వర మజిలీ కథలు | | 63-00 |
| శ్రీలలితాసహస్రనామము(భాస్కరభాష్యం) | | 600-00 |
| ప్రకృతిసిద్ధాంతములు-వేదవిజ్ఞానము-ఫలితజాతక సూత్రములు | | 595-00 |
| ముదుండి విశ్వనాథరాజుగారి గ్రంథములు | | |
| విశ్వకర్మ ప్రకాశము | | 80-00 |
| ప్రాచీనవాస్తుశాస్త్రాలు-ఆధునికవాస్తుపరిశీలన | ,, | 250-00 |
| నారద సంహిత | ,, | 150-00 |
| వాస్తురాజవల్లభము-మూలానువాదము | ,, | 60-00 |
| మయమతము - వచనము | ,, | 80-00 |
| బృహత్సంహిత - వచనము | ,, | 160-00 |
| వాస్తువిజ్ఞానజ్యోతి | | ...... |
| పురోహిత దర్శని (గోరసవీరభద్రాచార్య) | | .... |
| విశ్వకర్మవాస్తువిద్యారహస్యములు | ,, | .... |
| వాస్తు విజ్ఞాన చంద్రిక | ,, | .... |
| మహాదశా పారిజాతం | ,, | .... |
| వాస్తు నారాయణీయం | ,, | 120-00 |
| యోగావళీఖండం | ,, | 120-00 |
| ముహూర్తసింధువు | | 150-00 |
| సర్వార్థచంద్రిక (4భాగాలు) | | 1208-00 |
| మీరే న్యూమరాలజిస్ట్ (దావూద్) | | 370-00 |
| నిర్ణయసింధు (2భాగాలు) | | 590-00 |
| సాయి... | ,, | 45-00 |
| శ్రీ దుర్గానందలహరి | ,, | 200-00 |
| ఆరతిసాయిబాబా | ,, | 11-00 |
| ప్రతిష్ఠకల్పః(సాగి నరసింహమూర్తి) | | 500-00 |
| తాజుద్దీన్‌బాబా సచ్చరిత్ర | | 100-00 |

**సుమారు 100 సం॥రాలునాటి ప్రాచీన ప్రతులు తిరిగి ఈ క్రింది గ్రంథములు ప్రచురించబడినవి.**

| | |
|---|---|
| శ్రీరామ మంత్రానుష్ఠానము | 300-00 |
| శ్రీరామనవరాత్రోత్సవకల్పః | 300-00 |
| సీతారామ కధా సుధ అయోధ్యకాండ | 200-00 |
| సీతారామ కధా సుధ బాలకాండ | 150-00 |
| అరణ్యకాండ | 100-00 |
| శ్రాద్ధము ఎందుకు పెట్టాలి ? షోడశ సంస్కారములు | 200-00 |
| స్మార్త కాపర్ది కారికలు | 200-00 |
| నపుంసక సంజీవనము, వైద్య శిరోమణి | 200-00 |
| విషవైద్య చింతామణి | 200-00 |

| | |
|---|---|
| హేమాద్రి సూరిణా ప్రాయశ్చిత్తాధ్యాయః | 300-00 |
| సర్వమూలికా గుణరత్నాకరం | 300-00 |
| ఆపస్థంబీయ ధర్మసూత్రాలు | 300-00 |
| సర్వశాంతి దర్పణం - అపర ప్రయోగ దర్పణం | 200-00 |
| గణకరంజని | 200-00 |
| సంతాన దీపిక | 200-00 |
| తిథినిర్ణయ కాణ్డః | 250-00 |
| ముహూర్త దర్పణం | 200-00 |
| జ్యోతిష శాస్త్ర రత్నము (శ్రీపతిజాతక పద్ధతి) | 250-00 |
| లఘుతాచకము | 200-00 |
| శ్రీ వైఖనస పైతృమేధిక ప్రయోగః | 300-00 |
| స్మృతి రత్నాకరము (ధర్మశాస్త్రం) | 400-00 |
| జాతకామృతతసారం | 300-00 |
| జాతక బోధిని | 300-00 |
| సంగీత విద్యాదర్పణం | 300-00 |
| సంగీత సర్వార్థసారసంగ్రహం | 300-00 |
| ముహూర్త మార్తాండం(టీకతాత్పర్యం) | 450-00 |
| జాతకరహస్యం | 200-00 |
| రాజమార్తాండం | 200-00 |
| ఆయుర్దాయదీపిక | 200-00 |
| వైద్యామృతం | 200-00 |
| అనుపానమంజరీ | 200-00 |
| నవగ్రహశాంతి విధానం-ఉదకశాంతి విధిః | 200-00 |
| చికిత్సరత్నము | 200-00 |
| స్వరచింతామణి | 200-00 |
| ద్వాదశలోహ భస్మవిధానం | 200-00 |
| దైవజ్ఞయశో విభూషణం | 200-00 |
| అనుపాన రత్నకరము | 200-00 |
| కాలామృతము | 250-00 |
| దైవజ్ఞకర్ణామృతము | 300-00 |
| రసేంద్ర చింతామణి | 300-00 |
| రసరత్న సముచ్ఛయం | 300-00 |
| వస్తుగుణరత్నాకరము | 300-00 |
| హోరానుభవదర్పణము | 360-00 |
| విశ్వకర్మ ప్రకాశిక వాస్తుశాస్త్రము | 250-00 |
| స్త్రీజన కల్పవల్లి | 450-00 |
| సంగీత సర్వార్థ సంగ్రహం | 300-00 |
| సంగీత సుధాసంగ్రహము | 250-00 |
| అర్క ప్రకాశము | 200-00 |
| సంగీత మార్తాండము | 200-00 |
| సంగీత ప్రథమబోధిని | 200-00 |

| | |
|---|---|
| వైద్యకల్పతరువు | 200-00 |
| రసప్రదీపిక | 250-00 |
| గణకానందము | 250-00 |
| శ్రీ లలితాసహస్రనామావళిః-వివరణాత్మక భావంతో | 200-00 |
| నవచండీ వేదోక్త శ్రీ దేవీ పూజాకల్పం | 200-00 |
| శ్రీ గాయత్రీ అనుష్ఠాన తత్త్వప్రకాశిక | 360-00 |
| సంగీతమార్తాండము | 250-00 |
| సారావళి | 360-00 |
| భేషజకల్పము | 200-00 |
| గురుశిష్య ఆయుర్వేద వైద్యచింతామణి | 360-00 |
| జాతకమణి | 200-00 |
| సర్వశకున ప్రకాశిక | 200-00 |
| యాజుష ప్రయోగ చంద్రిక | 250-00 |
| శిక్షావల్లీ-ఆనందవల్లీ-భృగువల్లీ | 300-00 |
| వసంతరాజ శకునము | 250-00 |
| తొట్టి వైద్యం | 450-00 |
| జ్యోతిష సిద్ధాంత సంగ్రహము (పంచాంగ గణితం) | 300-00 |
| సహస్ర యోగప్రకాశిక | 300-00 |
| శ్రీవిద్యారహస్యం | 290-00 |
| మహర్షుల చరిత్ర 1,3 300+300 | |
| వేంకట సోమయాజీయం అను ధర్మశాస్త్రకాండము | 250-00 |
| శ్రీఆంజనేయం | 216-00 |
| రాశితుల్యవత్సర ఫలితం | 200-00 |
| నాడి జ్యోతిష విశ్లేషణ | 400-00 |
| రహస్యకుక్కుటశస్త్రం | 300-00 |
| స్త్రీ ధర్మరత్న బాండాగారము | 200-00 |
| శైవోత్సవరత్నాకరం | 300-00 |
| యాజుషప్రయోగ చిన్తామణి | 300-00 |
| సుస్వర ఋగ్వేద ప్రయోగదర్శిని | 300-00 |
| ఆయుర్వేద వైద్య సంగ్రహం | 300-00 |
| వశిష్ఠ సంహిత | 360-00 |
| హోమియోపతి గృహవైద్యం | 200-00 |
| వ్రతచూడామణి | 300-00 |
| వైశ్యధర్మప్రకాశిక | 300-00 |
| ఆలయ నిత్యార్చన పద్ధతి | 200-00 |
| స్మృతిముక్తాఫలం | 300-00 |
| ఆపస్థంబయల్లాజీయమ్ | 300-00 |
| జ్యోతిషశాస్త్రసంగ్రహము | 200-00 |
| కర్మవిపాకాఖ్యయం | 360-00 |
| ముహుర్త రత్నావళి | 250-00 |
| సుదివిలోచనం | 300-00 |
| ఉత్తర కాలామృతం | 200-00 |
| సర్వవిషయ సర్వస్వసంగ్రహం | 200-00 |

అరుదైన పాత పంచాంగములు, వ్రతకథలు,
పురాణములు,ఆరాధన గ్రంథములు,
సుప్రభాతములు,మహాత్మ్యములు, సహస్రనామములు,
పూజావిధానములు, స్తోత్రాలు, ప్రామాణిక గ్రంథములు,
కథలు, జ్యోతిష, వాస్తు, వైద్య, మంత్రశాస్త్రాది ఆధ్యాత్మిక
గ్రంథములకు

మోహన్ పబ్లికేషన్స్
ఆధ్యాత్మిక గ్రంథనిలయం
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,
రాజమహేంద్రవరం.

www.mohanpublications.com

From : ☎ : 0883-246 25 65

MOHAN PUBLICATIONS
Fort Gate, Opp : Ajanta Hotel
Rajahmundry-533 101 (a.p.)

mohan
PUBLICATIONS
ఆధ్యాత్మిక గ్రంథనిలయం

ఉచిత Pdf బుక్స్ కై : - www.granthanidhi.blogspot.in

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆయుర్వేద,
మంత్రశాస్త్రాది అనేక విషయాలు
తెలుసుకోండి... ఫేస్‌బుక్
MOHAN PUBLICATIONS
పేజ్ లైక్ చేయండి.

grantha nidhi
THE TREASURE OF PAGES
FIRSTEVER TELUGU FREE E-BOOKS
DOWNLOADING WEB PORTAL
www.granthanidhi.com

Kinige.com
మా ఇ-బుక్స్ కినిగె ద్వారా కొనుగోలు
చేసుకొన వచ్చును.

dailyhunt
మా ఇ-బుక్స్ డైలీహంట్ ద్వారా
అత్యధిక డిస్కౌంట్ ఆఫర్‌లో లభించును.